

క్రీడాభిరామ జుక్కాల పురంధ్రి

ANDHRA UNIVERSITY SERIES No. 68

ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర

పర్ రఘుపతి వెంకటరత్నం
పరిశోధన పదకాంక్షితము

డాక్టర్ యస్వీ జోగారావు
ఎమ్. ఏ., పిహెచ్. డి.

ఆంధ్ర విశ్వకళా పరిషత్ప్రకాశితము

1961

సర్వస్వామ్య సంకలితము]

[వెల: రూ. గం

ఈ గ్రంథము

రెండు భాగముల సంపుటి

ప్రథమ భాగము

యక్షగానము

ఉత్పత్తి విచారము : పరిణామ చరిత్ర

(పుటలు 1 – 371)

ద్వితీయ భాగము

యక్షగాన

కవులు : కావ్యములు

(పుటలు 1 – 502)

C

ప్రథమ ముద్రణ
1000 ప్రతులు
మే, 1961

శరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము
ఆంధ్రప్రదేశ్

కృతిభర్త



శ్రీ కే. డాక్టర్ శ్రీ వాసిరెడ్డి శ్రీకృష్ణగారు

కృతి సమర్పణము

శ్రీకృష్ణార్పితమైన దీ కృతియు మా శ్రీనాథ క్రీడాభిరా
మా కల్యాణ కథాధ్వనీన కవితామ్నాయాంగనాకేకర
న్యాకూత ప్రియమై భళా బహుకళా భామాకలాపమ్మునై
నా కష్టార్జిత మూర్జితం బయిన దీనాడీ నిధానప్రథన్.

చూచిన చూపులో రాచపాడి పసందు
లార్వ తేజస్వితన సనఘళింప
పలికిన పల్కులో ప్రాడ్వివాక ప్రతి
భార్జవ ప్రాగల్భ్య మచ్చుపడగ
నవ్వినన వ్వులో నవవసంత లతాంత
వత్సాంత సౌరభాఢ్యములు దోప
తలచిన తలపులో నిలుచు సరస్వతి
చతురాస్య దివ్యదీధితులు ప్రబల

ఆంధ్ర విశ్వవిద్యాలయోద్యాన శత వ
సంత వాసరాయిత దశశర దపార
వైభవ దశా బుభు ఫభువై వెలుంగు
నెవ్వడా వాసిరెడ్డి శ్రీకృష్ణవిభుకు

కృతివిభుకు మదభ్యుదయా
కృతివిధుడు మహామహుకు సుకృతి సూనృత సు
వ్రతు డలరుగాత! నేనును
కృతజ్ఞతాంజలి నిడి కృతకృత్యుడ నైతిన్.

కృతికర్త

Foreword by the Chairman of the Adjudication Board.

డాక్టర్ పి. వి. రాజమన్నారు
కేంద్ర సంగీత నాటక పరిషదధ్యక్షులు
మదరాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి.

బహుభాంధ్రోక్తిమయ ప్రపంచమున యక్షగానమునకు ప్రశంస నీయమైన స్థానము గలదు. ఒకప్పుడు ఈ కళారూపమునకు గౌరవము కొంత లోపించినను ఇటీవల దాని విలువను పండితులు, రసికులు గ్రహించినారు నిస్సందేహముగ.

డాక్టర్ నేలటూరి వెంకట రమణయ్యగారు, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు మొదలైన విద్వాంసులు యక్షగాన చరిత్ర - ఉత్పత్తి - లక్షణములు - అంగములను గురించి కృషిచేసినారనుటయే ఇందుకు తార్కాణము.

యక్షగానము సంగీతము - సాహిత్యము అను ఇద్దరు తల్లుల ముద్దులబిడ్డ. ప్రదర్శనమున నృత్యాలంకృత. యక్షగానములలో భావాశయమైన ప్రౌఢ సాహిత్య రీతులు గలవు. మనోరంజకమైన ఛందో భేదము లున్నవి. రాగతాళయుతములైన గీతము లున్నవి. లయాన్వితమైన గద్యము గలదు.

"యావదాంధ్ర వాఙ్మయమునను బహుముఖ వైవిధ్యమును నైశిష్ట్యమును గలిగి విశాల సాహిత్యశాఖగా విలసిల్లిన ప్రక్రియ యక్షగాన మొక్కటియే" అని నిరూపించుటకు శ్రీ జోగారావుగారు ఈ యక్షకృష్ణ గ్రంథమును రచించినారు. ఇందుకు వీరు చేసిన కృషి,

జరిపిన పరిశోధన, ప్రకటించిన ఉత్సాహము, సంపాదించిన పాండిత్యము, ఉపయోగించిన విమర్శకౌశలము అసమానము శ్లాఘనీయము.

ఈ గ్రంథరాజమును ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారి "పి హెచ్.డి" పట్ట పరీక్ష సందర్భమున చదువ గలిగితిని. నా ఉద్యోగ జీవితములో అప్పుడప్పుడు సరియైన తీర్పు చెప్పుట కష్టసాధ్యముగ కనిపించెడిది. కాని ఈ గ్రంథవిషయమున తీర్పు చెప్పుట అతి సులభమైనది.

యక్షగాన వాఙ్మయమునుగూర్చి ఇంత సమగ్రమైన పరిశోధన - ఇంత సక్రమమైన సమన్వయము - ఇంత విపులమైన విచారణ మరి యే గ్రంథమునను కానరాదు.

ఉత్పత్తి - చరిత్ర - పరిణామము - లక్షణములు - అంగములు - ఇవియవి అనేల అన్ని అంశములును వర్ణింపబడి యున్నవి.

ప్రత్యేకముగా కొనియాడ దగినవి ఈ గ్రంథము నందలి అనుబంధములు. కేవలము ఆంధ్రదేశమునందే గాక ఇతర దేశములలో యక్షగాన పరిణామ పరిశీలనము - లభ్యాలభ్య యక్షగానముల సూచిక - ఉపజీవ్య విమర్శక వ్యాస పరిచయము మొదలైనవి అనుబంధములలో చేర్చినారు.

ఇట్టి అమూల్యకృతిని ఆంధ్రమాతకు సమర్పించి ధన్యులైనారు డాక్టర్ యస్వీ జోగారావు గారు.

10 - 4 - 1961

Introduction by the Director of Studies:

ఆచార్య విద్వాన్ శ్రీ గంటి జోగిసోమయాజి

ఆంధ్ర శాఖాధ్యక్షులు

ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ఆంధ్రుల భాగ్యవశమున అభివృద్ధినందిన వైజ్ఞానిక వ్యవసాయ క్షేత్రము. ఈ మహాక్షేత్రమున ఆంధ్రభాషా వాఙ్మయశాఖ ఒకతోట. ఆతోటలో నాటిన బీజము లనేకము లభివృద్ధినొంది వృక్షములై గ్రంథరూపమైన స్వాదుఫలములను విద్యార్థి బోధనోపయోగమైన సాంద్రచ్ఛాయలను కల్పించుచున్నవి. అట్టి రసాలములలో ప్రకృతవ్యాసకర్త యొకడు. ఈ తోటను ఇతర భాగములతోపాటు పెంచిన క్షేత్రప్రభువుల కోవలో ముమ్మారు లెక్కింపదగినవారు శ్రీ వాసిరెడ్డి శ్రీకృష్ణగారు. ఈ వ్యాసకర్త స్వశక్తివలన ఉత్పాదించిన విచారణ విషయ రూపములైన సుమములను స్వసిద్ధాంత ఫలములను శ్రీ వాసిరెడ్డి వారికి కృతిగా సమర్పించుట మిక్కిలి యుచితము.

ప్రకృత వ్యాసకర్త తెలుగుభాషను కేవల జీవనోపాధిగా మాత్రమేకాక స్వాభావికమైన ఆదరోత్సాహములచే పఠించి అందు ఉత్తమ గ్రంథరచనము సేయుట సంతోషపూర్వకమైన ధర్మముగా పరిగణించుట చేతనే యిది బయల్వెడలినది. ఆంధ్రవాఙ్మయ విషయమున పరిశోధకులు తమ స్వాభావిక ప్రతిభచే వెలయింప వలసిన ప్రదేశము లనేకము గలవు. అట్టివానిలో యక్షగాన శాఖ యొకటి. పైగా వ్యాకరణాద్యనేక శాస్త్రనిష్ణాతులయి గొప్పపండితులైన వారికీ యక్షగాన సరణి యం దాదరము నధికముగా లేదు. ఇట్టి సందర్భములో ఈతఁడు తన పిహెచ్. డి. పరీక్షకు పరిశోధన విషయముగా ఈ వాఙ్మయశాఖ నెన్నుకొనుట నా ప్రోద్బలములవలన జరిగినది. ఇందీతడు కృతకృత్యుడైనాడు. ఈగ్రంథము యక్షగాన విషయమున అన్నిభాగములను ఊచముట్టుగా పరిశోధించి, విమర్శించి యున్నది. ఆంధ్ర వాఙ్మయము నందలి అనేక శాఖలలోని స్వరూప స్వభావములను దనలో సంగ్రహపఱచి సమన్వయ పఱచుకొన్నది యక్షగానము అను నీతని సిద్ధాంతము యక్షగానముయొక్క ఉత్తమత్వము నుద్ఘాటించుచున్నది. ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో 1957-58 సం॥లలో సమర్పింపబడిన పిహెచ్. డి. థీసిస్సులలో ప్రథమబహుమతినంది సువర్ణపదకమును రచయితకు చేకూర్చిన యీవ్యాసము ప్రాశస్త్యము స్పష్టమగుచున్నది. ఇందలి పరిశ్రమనుగూర్చి పరీక్షాధికారులు వెలకట్టి మేల్తరముగా వాకొనియున్నారు గావున మాతోటలోనిపండ్లను మేము వర్ణించుకొనరాదని ఆవిషయమును విడిచివేయుచున్నాము.

తెలుగునుగూర్చి యిట్టి గ్రంథమును చిరంజీవి జోగారావు వ్రాయుట, దానిని విశ్వకళా పరిషత్తువారు ప్రచురించుట, విశ్వకళా పరిషత్తు అభివృద్ధియే తమ జీవితాదర్శముగా పని చేయుచున్న శ్రీకృష్ణగారికిది అంకితముచేయుట అను వీని సంపుటికంటె ఉచితతర రచన యుండదనుటలో అతిశయోక్తి లేదు.

6-9-1960

గ్రంథకర్త



డాక్టర్ యస్వీ జోగారావు

ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర

ప్ర రో చ న

యక్షగానము బృహదాంధ్ర సారస్వత శాఖలలో నొకటి. మన వాఙ్మయ వ్యక్తిత్వమును నిరూపించు నట్టి ప్రక్రియ అది. దాని నామో త్పత్తియే చిత్రమైనది. మఱియుఁ జిత్రమైనది దాని పరిణామ చరిత్ర. విపుల కాలావధిలో నొక విశిష్ట వాఙ్మయ ప్రక్రియ యెన్ని వాలక ములు వేయఁగలదో అన్ని వాలకములును వేసినది యక్షగానము. ఒక్క యాంధ్ర దేశముననే కాక ఇటు తెలంగాణములో, అటు తమిళ నాడు నడిబొడ్డగు తంజావూరు ప్రాంతమున, కన్నడ దేశపు టూడికట్టగు మైసూరు ప్రాంతమునను జారిత్రకాది కారణములచే తెలుఁగు భాష వ్యవహరింపఁబడిన పలుతావుల నాయా భాషలలోనే కాక తెలుఁగునను వెలసినవి యక్షగానము లనేకము.

తెనుఁగున యక్షగానము లిపు డైదువందలకుఁ బైఁగా లభించు చున్నవి. అందముద్రితములు, తాళపత్ర కాళరాత్రి గడువక అసూర్యం పశ్యలై కీటకవిటాధముల దంతక్షతముల కగ్గమై పడియున్న వాని పాలే యధికము. అవియు నొక్కచో లేవు. దూరదూర ప్రదేశములందు నెలకొనియున్న వివిధ గ్రంథాలయములలో విప్రకీర్ణముగ నున్నవి తంజావూరు సరస్వతీ మహలు, ఆంధ్ర విశ్వకళా పరిషద్గ్రంథాలయము (ఇందు తం. స. మ. తెలుఁగు గ్రంథముల ప్రతికలు గలవు), మద రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము, కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తు, అడయారు దివ్యజ్ఞాన సమాజ గ్రంథాలయము, తిరుపతి వేంకటేశ్వర ప్రాచ్యభాషా పరిశోధనాలయము, రాజమండ్రి ఆంధ్రేతి హాస పరిశోధకమండలి గ్రంథాలయములం దముద్రిత యక్షగానములు గలవు. ముద్రితములం దిటీవలి వనఁగా 19 వ శతాబ్ది ఉత్తరార్ధము,

20 వ శతాబ్ది పూర్వార్ధము నందును వెలసినవే యెక్కువ. అవియైన వట్టి గుజలీప్రతులు, దేశమంతయు దేవినఁగాని యొక్కచో లభించునవి కావు. ఆయూర నాయూర బాట ప్రక్కల నాపూటకు తికాణాలేని దుకాణములలో నపు డపుడు కొన్ని కంటఁబడుచుండును. కొన్ని మదరాసు 'రిజిష్ట్రారు ఆఫ్ బుక్సు' వారి కార్యాలయము నందును, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయము, బాలభక్తపుస్తక భాండాగారము మొదలగు గ్రంథాలయములందును భద్రపఱుపఁబడి యున్నవి. ముద్రితాముద్రితములు గొన్ని శ్రీయుతులు డా. నేలటూరి వెంకట రమణయ్యగారు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, నేదునూరి గంగాధరంగారు, డా. శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు, పందిరి మల్లి కార్జున రావుగారు మొదలగువారిచే సేకరింపఁబడినవి. నేను నెల్లూటో ముద్రిత యక్షగానములు రమారమి రెండువందలు సంపాదింపఁగల్గితిని. గ్రంథాలయములకుఁ జేరని అముద్రిత గ్రంథములను గొన్నిటిని సేకరించి ప్రతులు తయారు చేయించుకొంటిని. కడమవి - పైఁ బేర్కొనఁబడిన గ్రంథాలయములకుఁబోయి తత్తదధికారుల యనుగ్రహమునఁ జదువు కొనఁగల్గితిని. పేర్కొనఁబడిన పెద్దలు తమ కడఁగల గ్రంథములను దయతోఁ జదువ నొసంగిరి. వారెల్లరకుఁ గృతజ్ఞుఁడను. ఇట్లు విషయ సేకరణ బహుళ వ్యయము, దీర్ఘకాల ప్రయాసములతోఁ గూడిన దైనను నా కా కష్టము గన్పడకుండఁ దగిన గడువు, పరిశోధక వేతనము ననుగ్రహించిన ఆంధ్ర విశ్వకళా పరిషదధికారులకును, భారత కేంద్ర ప్రభుత్వము వారికిని మిక్కిలి కృతజ్ఞుఁడను.

నన్నీ యమూల్య విషయముపైఁ బరిశోధన మొనర్పఁ బ్రోత్సహించి, తమ బహుముఖ వైదుష్యముతో నాకీ యుద్యమమున బాసట యై నిల్చి ననున్నిక వాఙ్మయ పరిశోధకుఁగాఁ దీర్చిదిద్దిన మత్పరిశోధన పర్యవేక్షకులు, మద్గురుదేవులు, ఆంధ్ర విశ్వకళా పరిషదాంధ్ర

భాషాశాఖాధ్యక్షులునైన 'భాషాచరిత్రచతురానన' ఆచార్య విద్వాన్ శ్రీ గంటి జోగిసోమయాజిగారికి నా కృతజ్ఞతా పురస్సర ప్రాంజలి.

ఈ యక్షగాన వాఙ్మయము గూర్చి యింతవఱకు సక్రమమైన సమగ్రమైన పరిశోధన జరిగియుండలేదు. నిన్న మొన్నటి దనుక యక్షగానము నెడ మన పండితుల కంత యాదర భావముండెడిది కాదు. ఇంత దనుక మన కవిచరిత్రకారులును యక్షగాన కవుల నుపేక్షించుచు వచ్చిరి. ప్రాచీన యక్షగానము లెన్నియో అముద్రితములుగ వివిధ గ్రంథాలయము లందు విప్రకీర్ణముగ నుండుటయు నందులకుఁ గారణమై యుండును. కాని యిటీవలనే శ్రీయుతులు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు, కళాప్రపూర్ణ జయంతి రామయ్యపంతులు గారు అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు, వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, డా. గిడుగు వెంకటసీతాపతిగారు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, చింతా దీక్షితులుగారు, ఆచార్య కోరాడ రామకృష్ణయ్య గారు, ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారు, డా. నేలటూరి వెంకట రమణయ్యగారు, ఆచార్య గంటి జోగిసోమయాజిగారు, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు, డా. కె. వి. ఆర్. నరసింహముగారు, ఆచార్య రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, ఆచార్య విస్సా అప్పారావు గారు, సురవరం ప్రతాపరెడ్డిగారు, డా. శ్రీపాద గోపాలకృష్ణ మూర్తి గారు, కొమ్మనమంచి జోగయ్యశర్మగారు, ముట్నూరి సంగమేశంగారు మొదలగు పెద్ద పెద్ద సుప్రసిద్ధ పండితులు యక్షగానము విలువ గుర్తించి లోకమున కెలుగెత్తి చాటినారు. అందు కొందఱు పెద్దలు (వేటూరి, జయంతి, మల్లంపల్లి, నేలటూరి, గంటివారు) యక్షగానములను బరిష్కరించి చక్కని వీఠికలతోఁ బ్రకటింపఁ బూనినారు. ఆయా పెద్దల సలహాలును వ్రాతలే నాయీ పరిశోధన

కుబ్బోధకములు నుపజీవ్యములు నైనవి. వా రెల్లరకు నా కృతజ్ఞతా ప్రణిపత్తి.

యక్షగాన వాఙ్మయ సర్వస్వము తయారుచేయవలె ననుఫూని కతోఁ బనిచేసి తగిన సామగ్రిని పదిలపఱిచికొంటిని. ఒక్కొక్క యక్షగానమునకు వివిధ గ్రంథాలయములందుఁగల ప్రత్యంతరములను గూడఁ బరిశీలించి యుంటిని. పత్రికా ముఖమున యక్షగానముల గుఱించి యనేక వ్యాసములను ప్రకటించితిని. య. గా. లలోని సంగీతము, భాష, హాస్యము, లోకరీతి, కవితారీతులు మొ॥ విషయముల గుఱించి ప్రత్యేకము గ్రంథములు వ్రాయవచ్చును. కాని ప్రకృత మిది యొక ప్రత్యేకప్రయోజనమునకుఁ బరిమితమైన గ్రంథమగుట చేతను, నిప్పటికే గ్రహించిన విషయము స్వభావమునుబట్టి గ్రంథము పెరిగిపోయినందునను నన్నివిషయములు నిందుఁ జేర్చుట కవకాశము లేకపోయినది; అయితే ముఖ్యవిషయ మెద్దియు విడువఁబడలేదు.

1952 లో పరిశోధన ప్రారంభించి ఈగ్రంథమును 1956 లో ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారికి పిహెచ్. డి. పట్టపరీక్షార్థము 'థేసిస్' గా సమర్పించితిని. 1957 లో పట్టభద్రుడ నైతిని. అది 1957-58 సం॥ మా విశ్వకళా పరిషత్తు పిహెచ్. డి. థేసిస్సులలో ఉత్తమమైనదిగా నిర్ణయింపబడి సర్ రఘుపతి వెంకటరత్నం రిసెర్చి మెడల్ బహుమానమును పొందినది. అంతకుముందే డిగ్రీవచ్చినంతనే అది విశ్వకళా పరిషదధికారులచే ప్రచురణకై ఆమోదింపబడినది.* యూనివర్సిటీ గ్రాంట్సు కమిషన్ వారు కొంత ధనమును విరాళముగా నొసంగిరి.

* ఈ సందర్భమున చెప్పదగిన దొక మాట గలదు. ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారు తంజావూరు సరస్వతీమహాలు యక్షగాన సంచయములో గొన్నిటినేరి యిప్పటి కైదు సంపుటములుగా ప్రకటించి యుంచుట ముదావహమైన విషయము. పరిష్కర్త ఆచార్య శ్రీ సోమయాజి.

అది ఆ యుభయుల దయవలననే ఇంతలో నిట్లు రూపుగైకొన్నది. ఉదారులైన మా విశ్వకళా పరిషదధికారులకును, యు. జి. సి. వారికిని సర్వదా కృతజ్ఞుడను.

నా థేసిస్సు యొక్క పరీక్షకప్రవరలో ముగ్గురికి ముగ్గురును సమస్కంధులైన సాహిత్య సత్యవ్రతులు. బహువిషయనిష్ణాతులు ఉత్తమాధికారులు. ముగ్గురును నా పరిశోధన విషయము యక్షగానము నెడ విశేషాదరముగల వారగుట విశేషము. అందున గౌ. ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్రీ పి. వి. రాజమన్నారుగారు నాథేసిస్సునకు గూడ ప్రధాన న్యాయమూర్తి యగుట నాఅదృష్టము. ప్రౌఢసాహిత్య ప్రాడ్వివాక ప్రవరు లాయన. వారి తీర్పులు నిపుణములు, నిష్పాక్షికములు. చరిత్రచతురాస్యులు డా. నేలటూరి వెంకటరమణయ్యగారు యక్షగాన పరిశోధనకొక క్రమసమిద్ధ పద్ధతి ప్రతీకమగు మార్గమును జూపిన మహానుభావుడు* గురుకల్పులు, పుంభావసరస్వతులు శ్రీ అనంతకృష్ణశర్మగారు గీతిసాహితీ సమాహిత మహిత స్వాంతులు. యక్షగాన మా ఉభయకళాభ్యుదయ విలసితము. ఆ మహనీయులు మువ్వురికిని నా సాధువాదములు.

ప్రముఖ విద్యావేత్తలు, విజ్ఞానమూర్తులు, నిత్యము పరిశోధనాభినివిష్టహృదయులు, ఆంధ్రభాషాభినులు, మదభివృద్ధి మార్గదర్శకులు, పరిషదభ్యుదయమే పరమధ్యేయముగా అచిరకాలమున అపూర్వము, అపారమునైన అభ్యున్నతి సాధించిన మహోదయులు ఆంధ్రవిశ్వకళాపరిషదుపాధ్యక్షులు నైన ఆచార్యశిరోమణి డాక్టర్

* వారు, మరికొందరు పండితులును అనాంధ్రపాఠకుల నిమిత్తము ఈ థేసిస్ ప్రథమభాగము నాంగ్లములోని కనువదించిన భాగమనుండునని సలహా ఇచ్చినారు. కృతజ్ఞుడను. అటులనే చేయుదును.

కుబోధకములు నుపజీవ్యములు నైనవి. వా రెల్లరకు నా కృతజ్ఞతా ప్రణిపత్తి.

యక్షగాన వాఙ్మయ సర్వస్వము తయారుచేయవలె ననుఁ బూని కతోఁ బనిచేసి తగిన సామగ్రిని పదిలపఱిచికొంటిని. ఒక్కొక్క యక్షగానమునకు వివిధ గ్రంథాలయములందుఁగల ప్రత్యంతరములను గూడఁ బరిశీలించి యుంటిని. పత్రికా ముఖమున యక్షగానముల గుఱించి యనేక వ్యాసములను ప్రకటించితిని. య. గా. లలోని సంగీతము, భాష, హాస్యము, లోకరీతి, కవితారీతులు మొ॥ విషయముల గుఱించి ప్రత్యేకము గ్రంథములు వ్రాయవచ్చును. కాని ప్రకృత మిది యొక ప్రత్యేకప్రయోజనమునకుఁ బరిమితమైన గ్రంథమగుట చేతను, నిప్పటికే గ్రహించిన విషయము స్వభావమునుబట్టి గ్రంథము పెరిగిపోయినందునను నన్నివిషయములు నిందుఁ జేర్చుట కవకాశము లేకపోయినది; అయితే ముఖ్యవిషయ మెద్దియు విడువఁబడలేదు.

1952 లో పరిశోధన ప్రారంభించి ఈగ్రంథమును 1956 లో ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారికి పిహెచ్. డి. పట్టపరీక్షార్థము 'థేసిస్' గా సమర్పించితిని. 1957 లో పట్టభద్రుడ నైతిని. అది 1957-58 సం॥ మా విశ్వకళా పరిషత్తు పిహెచ్. డి. థేసిస్సులలో ఉత్తమమైనదిగా నిర్ణయింపబడి సర్ రఘుపతి వెంకటరత్నం రిసెర్చి మెడల్ బహుమానమును పొందినది. అంతకుముందే డిగ్రీవచ్చినంతనే అది విశ్వకళా పరిషదధికారులచే ప్రచురణకై ఆమోదింపబడినది.* యూనివర్సిటీ గ్రాంట్సు కమిషన్ వారు కొంత ధనమును విరాళముగా నొసంగిరి.

* ఈ సందర్భమున చెప్పఁదగిన దొక మాట గలదు. ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారు తంజావూరు సరస్వతీమహాలు యక్షగాన సంచయములో గొన్నిటినేరి యిప్పటి కైదు సంపుటములుగా ప్రకటించి యుండుట ముదావహమైన విషయము. పరిష్కర్త ఆచార్య శ్రీ సోమయాజి.

శ్రీ వాసిరెడ్డి శ్రీకృష్ణ, B.A. (Oxon.), Ph.D., (Vienna) గారు కృతిపతు లగుట నా సుకృత విశేషము. ఆ సుకృతి కీకృతి కృతజ్ఞతా పురస్కారపురస్సరముగా అంకిత మొనర్చితిని.

దయతో దీనికి తొలిపలుకు వ్రాసియిచ్చిన శ్రీరాజమన్నారు గారికి, పరిచయ పుణ్యాహవాచనముచేసిన శ్రీసోమయాజిగారికి, అభిప్రాయములు దయచేసిన శ్రీ అనంతకృష్ణశర్మగారికి, శ్రీ వెంకట రమణయ్యగారికి, శ్రీ సోమశేఖరశర్మగారికి, శ్రీ నరసింహముగారికి

ఏతాదృగ్గ్రంథ నిర్మాణమునకు వలయునట్లు నాలో సాహిత్యాభిరుచియు, లాక్షణికదృష్టియు పెంపొందుటకు నా విద్యార్థిదశ వివిధావస్థలందు దోహదము చేసిన నా గురు పరంపర సర్వశ్రీ శిష్టాకలియుగము, శిష్టా సాంబశివరావు, కొడుకుల నరసింహము, వడ్లమాని సుబ్రహ్మణ్య ఘనపాఠి, కర్రి కామేశము, రాంభట్ల లక్ష్మీనారాయణశాస్త్రి, అంగర సోమశేఖరరావు, ధవళ నారాయణరావు, ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులు, కాకర్ల వెంకట రామనరసింహము, దువ్వూరి వెంకటరమణశాస్త్రి, గంటి జోగిసోమయాజి మహోదయులకు

నాలోని రూపక కళాపిపాస కూపిరిపోసి దాని కుపాసనా రూపమిచ్చిన సుగృహీత నామధేయులు, సుప్రసిద్ధాంధ్రరంగస్థల నాటక ప్రయోక్త, సంగీతనాటక కళాదర్శప్రియంభావుకులు నగు శ్రీకూర్మావేణుగోపాలస్వామిగారికి

మదభివృద్ధి మార్గదర్శకులు మహాభాగులు డా. కె. రంగధామరావు, డా. సి. మహాదేవన్ ఆచార్యవర్యులకు

ఆంధ్రసాహిత్య పరిషత్తునందును, ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందును పరిశోధనకాలమున నాకు శీఘ్రగ్రంథ

ప్రదానాదికమున తోడ్పడిన పండిత మిత్రులు శ్రీవద్దిపర్తి చలపతిరావు శ్రీమల్లంపల్లి శరభయ్యగారలకు

పరిశోధన గ్రంథములను ప్రచురించుటలోగల ప్రయాసమును గణింపక ఈ గ్రంథము నింత సుందరముగా ముద్రించిన సరస్వతీ పవర్ ప్రెస్ అధినేతలు సౌజన్యమూర్తి శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావుగారికి, వారి పరివారమునకును

నానమస్సుమనస్సులు

నాకడ వాఙ్మయ పరిశోధనవ్యాసంగము చేయుచున్న కోవిద కోరకములు రావూరి ప్రసన్న సత్యనారాయణ, బి. ఏ. (ఆనర్సు), పి. వి. రమణ, బి. ఏ. (ఆనర్సు) నాకీ గ్రంథ ముద్రణావసరమున సాయపడియున్నా రని తెలుపుటకు సంతసించుచున్నాను. వారికి నా మంగళాశాసనములు.

గ్రంథరచనా ప్రణాళిక

ఇది రెండు భాగములు. రెండు భాగములు నీ సంపుటమునందే కలవు. (ప్ర. భా., పుటలు 1—371) ; ద్వి. భా. పుటలు 1—302) ప్రథమ భాగమున యక్షగానోత్పత్తి విచారము, తత్పరిణామ చరిత్రమును విషయములు. యక్షగానోత్పత్తివిషయమున సర్వ పూర్వవాదములును సమీక్షింపఁబడినవి. ఈనాఁ డుపలభ్యమానమగు నాధార సామగ్రిని సందర్భోచితముగా సమన్వయించుటకుఁ బ్రయత్నము చేసితిని. పరిణామచరిత్ర ప్రకరణమున నుపలబ్ధమైన గ్రంథజాలములోఁ గాలము నూహించుట కనుగలమైన వాని పాటీజీ దానిని బట్టి కాలక్రమమున

వివిధ ప్రదేశములలో యక్షగాన రచనా ప్రక్రియలో, ప్రయోగ ప్రక్రియలో నెట్టియెట్టి మార్పులు వచ్చినవో ప్రత్యేకముగా సోదాహరణముగా నిరూపించుటకుఁ బ్రయత్నించితిని. ఈప్రకరణమునఁ యక్షగానపుఁ దరగతులు, లక్షణము, వైశిష్ట్యము, అనుబంధముగా య. గా. ఛందస్సులు, వివిధగేయ రచనలు, య. గా. శబ్దజాలము, సామెతలు మొదలగు ననేక విషయములఁ గూర్చిన సమీక్షయు, లక్ష్యములును గలవు. ద్వితీయ భాగమున ఆంధ్రదేశము, దక్షిణ దేశము, * తెలంగాణము లందు వెలసిన యక్షగానములను ప్రత్యేకముగాఁ ప్రాదేశికముగా విభాగించి (యక్షగాన పరిణామ మొక్కొక్కచో నొక్కొక్క తీరున సాగినది. కనుక నీ విభాగ మవసరము)† కవుల పేర సాధ్యమైనంతవఱకు కాలక్రమాను సారముగా వింగడించితిని. (యక్షగాన పరిణామ క్రమమెఱుఁగుట కీ వింగడింపు మిక్కిలి యావశ్యకము). ఇందు యక్షగాన కవులచరిత్ర కావ్యసమీక్షయు సంగ్రహముగాఁ గలవు. ఈప్రకరణ రచనలో, గ్రంథాంతర ముల నుండి విషయము గ్రహింపఁబడిన పట్టులనెల్ల నాకర సూచనలు గలవు. ఆకరసూచనలేని పట్ల గల విషయము వక్ష్యమాణ గ్రంథస్థ మైనదే. యక్షగాన కవుల కాలనిర్ణయ మొకటి షష్ఠాష్టకమైనది. నా కుపలబ్ధములగు నాధారములనెల్ల యథాశక్తి నుపయోగించితిని. కొన్ని యక్షగానముల కాలనిర్ణయ విషయమునఁ బ్రతివిలేఖన కాలము వినా గత్యంతరము లేకపోయినది. సంవత్సర మాసపక్ష తిథి వారములెల్లఁ

* మైసూరు మనకుఁ బఱ్ఱిమమున నున్నను బ్రకరణ సౌలభ్యము కొఱ కచటి య. గా. లను దక్షిణాంధ్ర య. గా. ప్రకరణమునఁ జేర్చి యుంటిని. అది కాక మైసూరు య. గా. లపై తంజావూరి య. గా. ల ప్రభావము గలదు.

† ఈవిభాగమున నేవైనఁ బొరపొచ్చెము లుండవచ్చును. క్షంతవ్యుడను.

బేరొక్కనఁబడిన ప్రతివిలేఖన కాలములను మాత్రము 'ఇండియన్ ఎఫి మెరసు'తో సంప్రతించి మన సృష్టివత్సర చక్రనేమిక్రమమును దృష్టిలోఁ బెట్టుకొని యావృత్తులను బరిశీలింపఁగా నన్నియుఁ గుదిరిన క్రీస్తుశకపు తేదీ లేవో పేరొక్కనఁబడినవి. (ఇందు సర్వత్ర క్రీస్తు శకమే పాటింప బడినది. శకాంతర ముద్దిష్టమైనచోట మాత్రము తత్సూచనయుండును). ఇట్లు కుదిరిన తేదీలవలనఁ గృతి రచనా కాలముయొక్క యుత్తరపు టవధి మాత్రమే తెలియనగును. అట్టిచోఁ గాలము రూఢిగాఁ దేలిన యక్షగానముల రచనా ప్రక్రియ దృష్టిలోనుంచుకొనఁబడి తేలని వాని కాలము గూర్చి వీలగు సూచన జేయఁబడినది. ఏవిధముగను గాలము, నొక్కొకచోఁ గర్తృత్వము నూహింప సలవి కాని యక్షగానములు అకారాది క్రమమున మాత్రము సమీక్షింపఁ బడినవి. కావ్యసమీక్ష అతిసంగ్రహముగా, రచనాప్రక్రియ మాత్రమే ముఖ్యోద్దేశముగాఁ జేయబడినది. గ్రంథవిస్తరభీతి నుదాహరణము లుజ్జగింపఁబడినవి. (కర్తృత్వకాలాదిక నిర్ణయముల కుపకరించినచోఁ దక్క). ఒకదాని రచనను బ్రశంసించుచు నొక యుదాహరణమిచ్చి నేనొక దానికి మానుట యొప్పదు. ప్రతి కృతికి నుదాహరణ మిచ్చుట యవసరమే కాని యట్లు చేసిన నిప్పటికే పెరిగిపోయిన గ్రంథ మిమ్మడిల్లును.

ఈ ద్వితీయ భాగాంతమున నేను బ్రకటించిన యక్షగాన విషయ సంబంధి వ్యాసములు, అలబ్ధ యక్షగానములు, ఈగ్రంథమున వాడఁ బడిన సంకేతములు, ఉపజీవ్య గ్రంథములు, వ్యాసములు, అకారాది క్రమ య. గా. కవినామ గ్రంథనామ సూచికలు మొదలగు విషయ ములను గూర్చిన పట్టిక లనుబంధములుగా నీయఁబడినవి.

ఈ గ్రంథమునఁ బ్రసక్తి గల్గిన యచ్చుగాన కవులయు, కృతు
లయు సంఖ్యా వివరము :—

ఆంధ్రప్రాంత కవులు :	174+
దక్షిణదేశ కవులు :	36
తెలంగాణ కవులు :	47
	260
వశిష్టము వారు	65
అనుబంధముల వారు	140
	465
లబ్ధగ్రంథములు :	542
అలభ్యములు :	260
	802

అందు :—

పారిజాతములు :	19
భామకలాపములు :	28
గొల్లకలాపములు :	14
కొరవంజులు :	21

యక్షగానమున కంతో యింతో సంబంధించిన విషయము గల గ్రంథములను, వ్యాసములను అనేకము పరిశీలించితిని. వానినుండి విషయము గ్రహింపఁ బడిన చోటుల నాకరము లధోజ్ఞాపికలలోనో ప్రక్క-నే కుండలింపులలోనో ఉటంకింపబడినవి. ఆ ఉపజీవ్య గ్రంథ వ్యాసక ర్త లందఱికి వందనములు.

లబ్ధమైన సామగ్రి నుండి క్రొ త్తగాఁ గొన్నికొన్ని యూహలు, నుపపాదనములును జేసియుంటిని. అవి ఖరాఖండీ నిర్ణయములు గావు. భావి పరిశోధకులకు మార్గదర్శకములు కాఁగలవను నాశకు భాజనము లని మాత్రము మనవి.

ఈ గ్రంథ రచనలో సౌలభ్యము కొఱకు అయితే, అంచే మొదలగు కొలఁది యలాక్షణిక ప్రయోగములును, అసలు తయారు భాణీ మొదలగు నన్యదేశ్య పదప్రయోగములను, అటనట విస్పష్టత కొఱకు విసంధులను జేసి యుంటిని.

దొసగులు పొసఁగిన హసింతురుగాక పురోభాగులు
మన్నింతురుగాక మహాభాగులు!

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు
తెలుగుశాఖ - వాల్తేరు
2-10-1960

యస్వీ జోగారావు

ఆంధ్ర
యక్షగాన వాఙ్మయ చరిత్ర

ప్రథమభాగము

యక్షగానము

ఉత్పత్తి విచారము – పరిణామ చరిత్ర

రచన

డాక్టర్ యస్వీ జోగారావు

విషయసూచిక

ఉత్పత్తి విచారము

1. ప్రస్తావన 1–2

2. యక్షులు - గానము 3–16

ప్రాచీన వాఙ్మయమున యక్షుల ప్రసక్తి
గానకళకును వారికిని గల సంబంధము
యక్షరాత్రి - కన్నడ యక్షాందోళనము,
ఎక్కలగాణలు, ఎక్కడిగలు, సింహళ యక్షోత్సవములు
మార్వారు గంధర్వులు, నేపాళ గంధర్వగానము

3. జక్కులజాతి సంబంధము 17–19

4. జక్కిణి 19–26

నాట్యప్రభేదము – గీతప్రబంధము - రూపకప్రక్రియ
జక్కులపురంధ్రి - కామేశ్వరికథ - అక్కలపాట
అక్కల కొలుపు - జక్కుల కులాచారము

5. పూర్వవాద సమన్వయము 27–58

(1) జక్కుల సంబంధము వాదము 27-31
(2) కొరవంజె వాదము 31–47
(3) బొమ్మలాట – యక్షగానము 47–58

6. ఇతరవాదములు – అభిప్రాయములు 58–88

(1) మార్గ - దేశివాదము 58–74
(2) హరికథ - యక్షగానము 74–82
(3) కథకళి - యక్షగానము 82–86
(4) ఇతర విషయములు 86-88

7. యక్షగానము ప్రాచీనత – ప్రాథమికావస్థ 88–95

ప్రత్యేక గాన శైలి
స్తోత్రపాఠము - కథాఖ్యానము
రూపారోపము

* * *

పరిణామచరిత్ర

1. ప్రస్తావన 96-103

2. యక్షగానరచన – ప్రారంభదశ 103-109

జక్కుల కథ - సౌభరి చరితము
లక్షణసార సంగ్రహ లక్షణము
సుగ్రీవ విజయము - రంగభోగము

3. ఆంధ్రప్రాంత యక్షగానము 110-146

కాలక్రమమున య. గా. రచనా ప్రక్రియా పరిణామము
పదచాళిక 16 శ. ఆం. దే. నాటక కళా వికాసము
య. గా. రచనా సామగ్రి - లక్షణ గ్రంథము లందలి ప్రసక్తి
కూచిపూడి కలాపము - శ్రవ్యదృశ్యప్రయోజనములు
వివిధ ప్రక్రియానుబంధములు : కొరవంజి 130. బొమ్మ
లాట 131, ఏకాంత సేవ 131, హరికథ 132, జంగముకథ
132, ప్రబంధము 134, నాటకము 136.

4. దక్షిణాంధ్ర యక్షగానము 147–169

తంజావూరు నాయక రాజుల నాడు 148
విజయరాఘవుని కైసేత – ఉలాప్రబంధపు పోకడ
రూపక కళోల్బణము - చాటుకావ్యపరిగణన

తంజావూరు మహారాష్ట్రుల నాడు 155
శహాజి ఆస్థానము - రచనా పరంపర
వస్తుశిల్పవైవిధ్యము - నాటకప్రబంధనామభేదము
తుళజరాజ ప్రభృతులు - మార్గనాటక ప్రభావము

కర్ణాట ద్రవిడప్రాంత యక్షగానములు 164
పర్యాలోకనము 167

5. తెలంగాణము యక్షగానము 170–176

పరిణామ వేగము - పరిణాహము
చెర్విరాల బాగయగారి ప్రత్యేకత

6. యక్షగాన ప్రయోగము 177—196

వివిధ ప్రాంతములలో తత్ప్రదర్శన ప్రక్రియ :
(1) ఆంధ్రదేశము 178, (2) దక్షిణదేశము - రాజాస్థానము 187
(3) మెలట్టూరు భాగవతమేళనాటకములు 190, (4) తెలంగాణము 195

7. యక్షగాన సాంప్రదాయిక పాత్రలు 197—208

మాధవి, సుంకరి కొండడు, కటికము.
సింగి - సింగడు, మంత్రసాని, ఇతరములు

8. సింహావలోకనము 209—224

(1) యక్షగానము తరగతులు 209 - 213
శ్రవ్యములు దృశ్యములు, ఉభయప్రయోజనాత్మకములు
వివిధప్రక్రియాను బద్ధములు
పౌరాణికములు - క్షేత్రమాహాత్మ్యములు
చారిత్రకములు - మహాపురుషుల చరిత్రలు
తాత్కాలికేతి వృత్తములు - సాంఘికేతి వృత్తములు
జానపదగాథలు - కల్యాణ కథలు
తత్త్వవిషయికములు - ఇతరములు
(2) యక్షగాన లక్షణము 214 - 215
(3) యక్షగానము వైశిష్ట్యము 216 - 224
సర్వోపభోగ్య సమాహార కళాస్వరూపము
వివిధప్రక్రియాను బంధము - బహువిధ పదకవిత
ప్రభేద సమీకరణ - వస్తువైవిధ్యము
రస విషయిక వైశిష్ట్యము - ఛందోవైవిధ్యము
భాషావైవిధ్యము - లోకవృత్త ప్రదర్శనము
దేశి నాటకకళా ప్రాతినిధ్యము
తెలుగువారి స్వతంత్రప్రక్రియ - అన్యుల కనుకార్యము
విశాల వాఙ్మయశాఖ.

అనుబంధము

1. యక్షగాన ప్రధాన రచనాంగములు - ఛందస్సు 225–283

రేకు – రగడ, రగడభేదములు, రకరకముల రేకులు
తాళప్రధానములు - నడ, వెండి, పాళి, బౌళిరేకులు
బౌళ రచ్చలు మొ॥ విశేష భేదములు 224 - 35
అర్ధచంద్రికలు 235 - తాళములు : సూళాది సప్తకము,
లఘుశేఖరము, రచ్చ. చిత్ర మొ॥ విశేషములు 237-42
దరువు : కొరందరువులు, జక్కిణి, గుజరాతి వగవింతకోపు,
కోలాట దరువులు, కోలాట నర్తము, వృత్తదరువు, టప్పా 242-48
ద్విపద : వివిధ నిఘంటువు లందు, లక్షణగ్రంథము లందు
తత్స్వరూపము - తద్భేదములు : మంజరి, సువాల ద్విపద,
గౌరీకళ్యాణము, లక్ష్మీకళ్యాణము, ద్విపదార్ధము 249-61
పద్యవిశేషములు : కపోతక వృత్తము, శారదపద్యము
కల్యాణవృత్తము, తురంగ ప్రయాతము 262 - 64.
అర్ధ పద్యములు కందసీస గీతార్ధాదులు 264 - 66
గర్భబంధ కవితావైచిత్రి : చక్రుర్విధకందము, కందగీత గర్భిత
చంపకమాల : పరభ్రమకము; రథశైల బంధములు 266-69
వచనము లేకగద్య: మూర్ణిక, కైవారము, విన్నపము
ముచ్చట, కొరవంజి గద్దె, ప్రాసవచనము 270 -74
పదము : తుమ్మెద, వెన్నెల, చందమామ, నివాళి, సమ,
చౌ, జాళ, సారంగ, షట్పది, పాళి, గొబ్బి, ఏలపదములు 275-83

2. తంజావూరు పదవాఙ్మయము 284–299

విజయరాఘవాస్థానము - వివిధకవుల శృంగార పదములు
(పంతువగ, పదచాళిక) 287, గొల్లపదాలు 292, చెంచు పదాలు
(కాటమరాజు, కంబమురాయ, పోలేరమ్మ కూనలమ్మ
దరమరాజు పదాలు) 295, సాంగత్యపదము 297.

3. శహాజీ దరువులు 300-306

సలాము ప్రబంధ, పదాభినయము సవ్యాపసవ్య సమపద
లీలా. క్రమస ప్తస్వర వర్ణార్ధలీలా దరువులు, మోహరం.
గణపతి కవుత్తం, నెలకట్ట, సొల్లుకట్టు. త్రికాల
స్వరం, వర్ణత్రికాల సొల్లు, జతి, స్వరజతి, స్వర
సొల్లుజతి, వర్ణసొల్లు జతి, పంచ భూతము.

4. వివిధగేయ రచనలు 307 -351

అధ్యాత్మలు, అనువులు, అప్పగింతపాట, అలకపాట,
అల్లో నేరేళ్లు, అష్టకము - చౌపద్యష్టకము, అష్టపది,
ఇంగ్లీషు మెట్టు, ఊంజల్, ఓడం, కీర్తన,
కోతియాట పదం. గజల్, గొబ్బిళ్లు, చెడ్డాట పాట,
జాతిస్వరమట్టు, జావళి, జోల, డిండిమము, డోరా.
తంగం, తందన పదము, తరంగము, తలంటుపాట,
తలుపు దగ్గరిపాట, తిలాన తరగతి, తేవారము,
త్రిభంగులు, త్రిస్తబకము, దండె యాడింపు పాట.
దిండి ధవళము, నలుగుపాట నోటు, బంతులాట పాట,
మంగళము - తోడియం. మేలుకొలుపు రాసప్రబంధము.
లఘువులు - సమలఘువులు - సర్వలఘువులు, లాలిపాట,
లావణి. వర్ణము, విరాళిపదం, శబ్దజతి, శోభనము
సంగీతమకరందము, సువ్వి - సువ్వాల, హెచ్చరిక.
సంవాద పదములు: సవతికయ్యము (సత్య - రుక్మిణి),
సుంకరి కొంతకు - గొల్లభామ, సింగి - సింగడు,

5. యక్షగాన శబ్దజాలము 355-367

విశేషశబ్దములు 355. వైరిపదములు 358,
అన్యదేశ్యములు 359, జాతీయములు 361,
ధాన్యనామములు 363, భక్ష్యవిశేషములు 363.
ఉడుపులు 364, ఆభరణములు 364,
క్రీడలు నృత్యములు వాద్యములు 365,
ఆయుధములు జంతువుల పేర్లు 366
రాజకీయోద్యోగులు 366.

6. యక్షగానములలోని సామెతలు 368-371

(త. ద్వితీయ భాగము విషయసూచిక)

యక్షగానము

ఉత్పత్తివిచారము

ప్రస్తావన

నిచ్చలు పచ్చి బొలెంతరాలగు ప్రకృతి సవిత్రికి స్తనంధయుఁడైన ప్రాక్తన మానవుఁ డా మాతృ హృదయ మాధుర్యము చూఱఁగొని కొట్టిన కేరింతయే మానవ జాతి గానకళాభ్యాసన కుసుమసుకల్పమైనది. తన కంఠము నుండి వెడలిన మధుర స్వరము లేమో తన కర్ణపుటములనే పడి మఱులఁ దనలోనే ప్రవేశించి మాఱులుఁ గిచ్చినట్లు దన నాడీశంత్రులలోఁగలిగించిన కదలికయే యతని కర చరణముల నుండి బహిర్గమించి నృత్య కళా సరస్వతి కేటికో క్ష్వెత్తినది. ఆటపాటల నపుడే ప్రవీణుఁడై నిరంతర వర్ధమానుఁ డగుచుండిన మానవుని యనుకరణ ప్రవణ శీలము, నందులో నంతర్భూతమై యున్న సృజన కళా కౌతూహలము బొమ్మలాటకు నాటక కళకును బురుడు వోసినవి. అతని సంతానమే ప్రపంచమున వివిధ ప్రదేశములలో శాఖోపశాఖలై విభిన్న కళాభిరుచులతో విరాజిల్లుచు వచ్చినది. ఒక్కొక్క జాతి యొక్క భాషా సాహిత్య స్థితికి వచ్చిన తరువాత నందుఁ గొంతకాలమున కా యా జాతి యొక్క నిసర్గ గీతాభినయ కళాభిమాన ప్రత్యేకతలకును గాఢాచిత్రమైన కావ్యజాలము వెలయఁ గలదు. జావా దేశము నందలి వాయంగ్ వోంగులు, జపానీయుల 'నో' రూపకములు, బర్మాదేశపు 'యూగన్', 'హౌసా', సింహళ దేశీయుల 'కోలమ్ నాటిమా', టిబెట్ ప్రభృతి దేశముల మిస్టరీలు, మన దేశమందలి యాత్రలు (బెంగాలు), కథకళి (మలయాళము), గంధర్వగానము, (నేపాలు) గంధర్వనృత్యము (మార్వారు),

యక్షగానము (ఆంధ్ర కర్ణాట తమిళ ప్రాంతములు) మొదలగున వట్లు వెలసినవే. ఒకొక్కక దాని యుత్పత్తి కొకొక్కక కారణముండ వచ్చును. కాని యన్నిటఁ దత్త్వతఃఁ ఏదో సమీచీనమైన సమానత గోచరించును. అది మానవ స్వభావ నిసర్గ మధురము లగు నభిరుచు లకును దత్తజ్జాతీయాశయములకును సంప్రదాయములకునుగల భావ బాంధవ్యము. కొన్ని కొన్నిట వస్తువులో, రచనా ప్రక్రియలో, ప్రదర్శన సంప్రదాయములలోఁగూడఁగొంత కొంత సామ్యము గోచ రించిన గోచరింప వచ్చును. భిన్న దేశము లందు భిన్న కాలోత్ప న్నము లైన కళా స్వరూపములందు సామ్యమున్న దనఁగా నది మానవ స్వభావము లోనే యున్న సమానతా ప్రతిపత్తియే గాని వేఱు కాదు. ఆ సమానతా ప్రతిపత్తినిబట్టి యా యా భిన్న దేశ కళా ప్రక్రియల కన్నిటికిని బరస్పరానుకరణసంబంధము నూహిం చుట సమంజసము గాదు. ఏనాఁడో కొన్నిటి కట్టి సంబంధ మేర్పడి యుండినను నీనాఁడు నిజము నిక్కచ్చిగా నిరూపించుట కష్ట సాధ్యము.

ఆంధ్రతా ముద్రను భద్ర పఱచిన మన దేశి సాహిత్య ప్రక్రియలకెల్లఁ దల మానికము యక్ష గానము. అది ప్రాదుర్భవమున నేదో సాధారణ మత బీజక వినోద కాలక్షేపమై యుండిన దేమో కాని రానురానొక ప్రత్యేక సాహిత్య శాఖగా వర్ధిల్లుచు వచ్చినది. అట్లని యది వట్టి సాహిత్య ప్రక్రియ మాత్రము కాదు. సంగీ తాభినయ కళలకునుఁదానకమై దేశి సంస్కృతి కోశమై పరిఢవిల్లినది. యక్షగాన గ్రంథము లాంధ్రమునఁబరశ్శతముగ వెలసినవి. కథకళి కళా ప్రతిష్టలు గల మలయాళరాష్ట్రము వినా యావద్దక్షిణ భారత దేశ వ్యాప్తమైన కళాస్వరూపము యక్షగాన మని చెప్పనొప్పును.

యక్షులు - గానము

ఆంధ్ర జాతీయ రూపక ప్రక్రియగా రూపొందిన యక్షగాన మున కా పేరెట్లు వచ్చినదో విచార్యము. యక్షగాన మనఁగా యక్షులయొక్క పాట యని సామాన్యార్థము. మఱి యాంధ్రులకు యక్షులకు నేమి సంబంధమో దురూహము. ఈ నాఁడు మన కుప లబ్ధములగు యక్షగానములలోఁ బ్రాచీన కృతులందుఁ గూడ యక్ష గాథలు గాని, యక్ష పాత్రలు గాని, యక్ష స్తోత్రములు గాని, మఱి యెవ్విధమైన యక్ష సంబంధములు గాని కానరావు. కాని ప్రత్యక్ష ముగా యక్షులతోఁ గాకున్నను యక్షశబ్దవాచ్యులగు నెవరితో నైన నేనాఁడో ప్రగాఢమైన సంబంధమేదో యుండి యుండకున్నచో నాపేరు పుట్టుట కవకాశమే యేర్పడి యుండదు. అది యే నాఁటి యక్ష గానమో యీ నాఁడు దాని యుత్పత్తి విచారణ కూహాగానమే శరణ్య మగుచున్నది. యక్షులగుఱించి ప్రాచీన హైందవ బౌద్ధ జైన సారస్వతములలో విషయము సమృద్ధిగాఁ గలదు.[1] యక్ష శబ్దము మొట్ట మొదటగా నొక విచిత్ర వస్తువను నర్థమున జైమినీయ బ్రాహ్మణమునఁ (III. 203—272) గన్పట్టుచున్నది. గృహ్య సూత్ర ములకు ముందు యక్షుల కొక విశిష్టమైన జాతీయతా ప్రతిపత్తి గాన రాదు. గృహ్య సూత్రములలో భూతాదులతో పాటు యక్షావాహ నము గూడ గాననగును. మానవ గృహ్యసూత్రమునందు (II-4) వారురోగ గ్రహావేశ శక్తులుగాఁ బేర్కొనఁబడిరి. శాంఖా యన గృహ్య సూత్రము నందు యక్షాధిపులలో నొక్కఁడగు మాణి భద్రుఁడు పేర్కొనఁ బడెను. బౌద్ధ సారస్వతమున "యక్షులు"

1. Vide., (a) 'The Yakshas' - Parts 1 & 2 By Dr. A. Coomaraswamy. (b) 'Yaksha worship in Early Jaina Literature'- By Dr. U.(P. Shah. J. O. I., M. S., University, Baroda, Vol. III-No.1)

(యక్షులు) నీతి ప్రవక్తలుగను, రక్షక శక్తులుగను బేరొక్కానఁబడిరి. (చూ. ఛేత్తాఛేది గాథ XIV). బౌద్ధశిల్పములను బరిశీలించి చూచినచో వానిలో యక్ష యక్షిణీద్వారపాలక ప్రతిమలు గాన నగును. వారికి నాగ గంధర్వ కిన్నరాదులతోడను సంబంధము గాన నగును. డాక్టరు ఆనంద కుమారస్వామిగారు నేకరించిన యాధారముల ప్రకారము వారు కామరూపులును, దయాళువులును, రక్షణచణులైన రణ శూరులు నసియుఁ దెలియు చున్నది. మోనియర్ విలియమ్సు తన సంస్కృతాంగ్ల నిఘంటువులో ఋగ్వేద వాజసనేయ సంహితానుల యాధారమును బట్టి యక్షుఁ డనఁగా నప్రాకృత జీవియనియు, భూతప్రేత పిశాచాదిగణములోఁ జేరు వాఁ డనియు నర్థము లిచ్చెను. మజీయు నితరాధారములను బట్టి కుబేరాను యాయులును బుల స్త్యపులహ కర్దమాది బ్రహ్మ పుత్రులును సదసచ్ఛక్తి సంపన్నులు నని యనేకార్థములను జూపి యుండెను. వాల్మీకి రామాయణమున (3. 11-94) యక్షత్వ మనునది యమరత్వముతో పాటొక దివ్య వరప్రసాదము వంటిదని చెప్పఁ బడినది. మహాభారతమున (6, 41. 4) రాజస గుణప్రధానులగు మానవులు యక్ష రాక్షసులను గొల్తురని చెప్పఁబడి యున్నది. అందలి యక్ష ప్రశ్నల ఘట్టమును బరామర్శించినచో యక్షులు ధర్మపరాయణులు లేక జిజ్ఞాసువులని తెలియు చున్నది. ఈ యితిహాసములలో వారు శైల జల వనదేవతలుగాఁ బేరొక్కానఁబడిరి. ఈ బ్రాహ్మణ బౌద్ధ జైన సారస్వతము లందు మూఁడింటను వారు మహిమోపేతులైన దేవయోనులుగను, మాయా స్వతంత్రులైన రాక్షస కల్పులైన రాజస శక్తులుగను గూడఁ బేరొక్కానఁ బడిరి. ఏస్థి రకములుగాఁ బేరొక్కానఁ బడి యున్నను యక్షులకు దేవ యోనులలో గంధర్వ కిన్నరుల కున్నట్లుగా గాన కళా ప్రావీణ్య ప్రతిష్ఠ లా ప్రాచీన సారస్వతము లందుఁ బ్రస క్తములు కాలేదు. కొంత

ప్రాచీనములైన సంస్కృతకావ్యములందుఁగొన్నిట నీ విషయమున కొక్కించుక యూహ్యారము గలదు. భట్టి కావ్యమున నొక సందర్భమున "యక్షా శ్చాపి పణాయంతి తద్విభూతిం గృహే గృహే" యను నొక వాక్యము గలదు. దీనిని బట్టి యక్షులు స్తోత్ర పాఠకులై యుండినట్లు తోఁచుచున్నది. కాళిదాసుని మేఘ సందేశమున

"యస్యాం యక్షాఃసితమణి మయాన్యేత్య హర్మ్యస్థలాని
జ్యోతిశ్ఛాయా కుసుమ రచితా న్యుత్తమ స్త్రీసహాయాఃl
ఆసేవన్తే మధు రతి ఫలం కల్పవృక్ష ప్రసూతం
త్వద్గంభీర ధ్వనిషు శనకై ఃపుష్క రేష్వాహతేషు"

(II - 5)

అను శ్లోకమున యక్షుల నృత్యగీతి ప్రీతి సూచితమైనది. అందే –

"ఉత్సఙ్గే వా మలిన వసనే సౌమ్య నిక్షిప్య వీణాం
మద్గోత్రాఙ్కం విరచిత పదం గేయ ముద్గాతు కామా
తన్త్రీ మార్ద్రం నయన సలిలై ఃసారయిత్వా కథంచి
దూఢైయో భూయఃస్వయ మపి కృతాం మూర్ఛనా

(II– 25) విస్మర న్తీ"

అను శ్లోకమున యక్షిణి సంగీతసాధన యొకింత సూచింపఁబడినది. కాని యిట్టి సూచనలు యక్ష గాన ప్రతిష్ఠను నిరూపింప సమర్థములు గావు.

యక్షు లనువారు దేవయోనులే కాక మానవుల వలె భౌమ జీవులునై యుండెడి వారని తెలియుచున్నది. శ్రీ వి. ఆర్. ఆర్. దీక్షితారు తమ "రామాయణమున దక్షిణ హిందూదేశ" మను

వ్యాసమున[2] రాక్షసులకు ముందు సింహళదేశమున యక్షులు రాజ్యము చేయు చుండి రనియు, బలిచక్రవర్తిసేనాని యగు సుమాలి యక్షుల నోడించి రాక్షసరాజ్యము నచట స్థాపించెననియు నొకగాథ గలదని చెప్పుచు యక్షజాతి రాక్షసజాతియొక్క పాయ యనియు రాక్షసరాజ్య మంతరించుటతో యక్షులచట మఱల రాజ్యస్థాపన గావించినా రనియు, మహావంశ మను గ్రంథము ప్రకారము క్రీ. పూ. 5 వ శతాబ్ది వఱకు నచట యక్షుల రాచఱికము సాగుచుండెననియు వ్రాసి యున్నారు. యక్షులు అక్సస్ (Oxus) నదీ ప్రాంతమువారో లేక యఫీ (Yuchi) అను మంగోలుజాతివారో లేక జక్సార్టస్ (Jaxartes) ప్రాంతేమువారో యై యుందు రనియు గొన్ని యభిప్రాయములు గలవు.[3] ఆయా ప్రాంతముల వారందఱును యక్షులే యైనను వారితో మన సంబంధమున కుండఁగలయవకాశములు గాని, వారి జాతీయ గానకళాభిమానములు గాని యీనాఁడు యూహకందనివి.

వాత్స్యాయనుని (క్రీ. పూ. 3-4 శ.) కామ సూత్ర గ్రంథమున (I-4-౮) "యక్ష రాత్రి" యనున దొక క్రీడా విశేషముగఁబరిగణింపఁబడినది. దానితో నీ యక్షగానమున కేమైన సంబంధ ముండకుండునా యని కొందఱు పండితు లనుమానపడిరి. అది యొక ద్యూతక్రీడ యని యశోధరుని జయమంగళ వ్యాఖ్యా నమునఁ బేర్కొనఁబడినది. ఆ పక్షమున యక్షగానమునకు దానితో సంబంధ ముండుట కవకాశము లేదు. కాని "జక్ఖర త్తీ" యను దాని ప్రాకృత రూపమును గ్రహించి దీపావళి యను నర్థము చెప్పినాడు

2. A. I. O. C. Baroda Vol. (1933) Page 248.
3. చూ. కీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పుట 195.

హేమ చంద్రుడు (క్రీ. శ. 1088 - 1172. చూ. అతని దేశినామమాల III - 43). నేపాళ దేశమున దీపావళి పండుగ కొక ప్రత్యేకత గలదనియు నది నిధినిక్షేపముల కధిదేవత యగు లక్ష్మీదేవి యొక్క యారాధనము ప్రధానముగా జరుగు ననియు, నాసందర్భమున నచట జూదాల తిరునాళ్ళు వైభవోపేతముగా జరుగుననియుఁ దెలియుచున్నది.[4] ఆ పక్షమున నది నిధి రక్షకులును, లక్ష్మీపూజకులు నగు యక్షులరాత్రి యగుటయే గాక, "అక్షరాత్రి" యు నగుచున్నది. యశోధర హేమచంద్రులిచ్చిన యర్థములు రెంటను సమర్థనీయములే యైనను నవి యక్షగానోత్పత్తిని సమర్థింపలేవు. కాని కన్నడదేశమున, ముఖ్యముగా దక్షిణ కనరా మండల మునఁగల ప్రతి యక్షగానమేళమువారును దమ ప్రథమప్రదర్శనమును దీపావళి నాఁడు తమ యిష్టదైవతముల యాలయములందుఁ బ్రదర్శించు సంప్రదాయము గలదనియు, మందర్తి, మర్ణకక్టై, కటిల్, ధర్మస్థల మొదలగునవి యట్టి యక్షగాన మేళములుగల దేవాయతనము లనియు శ్రీ ఎమ్. గోవింద రావు గారు కర్ణాటక యక్షగానమును గూర్చిన తమ యాంగ్ల వ్యాసమున నని యున్నారు.[5] ఈ సంప్రదాయమును గూర్చి ముళియ తిమ్మప్పయ్య యను నాయన (ఆధునికుఁడు), పార్తి సుబ్బన్న యను నొక ప్రసిద్ధ కన్నడ యక్షగాన కవియొక్క కావ్యములను గూర్చిన విమర్శగ్రంథము నందు దీపావళి యనఁగా యక్షరాత్రి యనియు, నా దినమునసే యక్షరాజైన కుబేరుఁడు బలిచక్రవర్తి నుండి తన సంపదను దిరిగి పొందెననియు, యక్షులా రాత్రి యంతయు నుల్లాసముగా నాటపాటలతోఁగడపి రనియు నొక గాథ

4. Vide., page 167 of 'The Land of the Gurkhas' By L. B. Northey.

5. A. O. R. University of Madras Vol.X. part II, 1952-53.

నుటంకించి, యీ కన్నడదేశ యక్షగాన ప్రదర్శన సంప్రదాయము తత్సాన్నిధ్యక చిహ్నమే యని వక్కాణించి యుండెను. దాని ప్రాచీనత నూహించుట కాధారము గానరాదు గాని యీ సంప్రదాయము గాదనరానిది. గానకళాభిమానము విషయమున యక్షుల ప్రత్యేకతను నిరూపించు ప్రాచీనాధారములు గన్పట్టవు గాని యీ సంప్రదాయ నిర్వచనమున కా గాధ కుదిరియున్నది. నేటికిని గుజరాతు, మహారాష్ట్ర, నేపాలు మొదలగురాష్ట్రములందు దీపావళి పండుగ నిధి, నిధికధిదేవత యగు లక్ష్మిని నుద్దేశించి జరుపఁబడుచుండుట యందుల కుపబలకముగా నున్నది. అట్టిచో యక్షరాత్రికిని యక్షగానమునకును సన్నిహిత సంబంధమున్నదనవలెను. కాని యక్షరాత్రి ప్రస్తుతి మొదటఁగన్పట్టుట వాత్స్యాయన కామసూత్రము నందు. వాత్స్యాయనుఁడు క్రీ. పూ. 3 లేక 4 వ శతాబ్ది నాఁటి వాఁడు. అంత ప్రాచీనకాలమునఁ గన్నడదేశమునఁ గాని మఱి యెచ్చటను గాని యక్షగానముండిన జాడగానరాదు. సంస్కృత కావ్య వాఙ్మయమునఁగాని సంగీతశాస్త్రగ్రంథము లందుఁ గాని తత్ప్రస్తుతి కానరాదు. సంగీతసుధ యను గ్రంథము[6] విషయ మిందుల కపవాదము. అందు - తంజావూరి రఘునాథనాయకుని (క్రీ. శ. 1600 – 1630) రచన యగు శ్రీ రుక్మిణీకృష్ణవివాహ యక్షగానము పేర్కొనఁబడినది; "యక్షోక్తగీత మపి గానశైలిమ్" అని యక్షగానము నిర్వచింపఁ బడినది; "యక్షాశ్చనాగాఅపి కిన్న రాశ్చ గాంధర్వ ముఖ్యాఅపి గాన లోలాః" అని గంధర్వాదులతో పాటు యక్షులును గానలోలు రని వక్కాణింపఁబడినది; ఆంజనేయ విరచితమని చెప్పఁబడు నొక ప్రాచీన సంగీతగ్రంథము నందు

6. Published in the Journal of The Music Academy, Madras., Vol I - 1930.

యక్షుల గానశైలి ప్రశంస గలదని యందు సూచింపఁబడినది. కాని యాంజనేయ విరచిత గ్రంథ మిపు డుపలబ్ధము గాదు. ఈసంగీతసుధ యంత ప్రాచీన గ్రంథము గాదు. అదియునుగాక యిది పై నుదా హరింపఁబడిన కన్నడదేశ యక్షగాన ప్రదర్శన సంప్రదాయమును గాని యక్షరాత్రి సంబంధమునుగాని సమర్థింప లేదు.

కర్ణాంటాంధ్రములు యక్షగానములకు ఫలభూములు. యక్ష గానములు గానప్రధానములయ్యు నాట్యప్రయోజనోద్దిష్టములు నైనవి. ఆ యా వాఙ్మయములందు యక్షుల గానాభినయ కళాను బంధముగూర్చి తగినంత ప్రస క్తి గలదు.

కర్ణాటవాఙ్మయమునఁ దత్ప్రస క్తి గుఱించి శ్రీ ముట్నూరు సంగమేశంగారు లిట్లు వ్రాయుచున్నారు.* "కన్నడకవి అభినవ పంపఁడు (12 వ శతాబ్ది) వ్రాసిన మల్లినాథపురాణంలో (2.12. ప 47) 'యక్షాందోళన' మనే నాట్యం ప్రస్తావించ బడింది. కన్నడ యక్షగాన నాట్యప్రదర్శనలలో "యక్షిణీ" వేషం ఈ అందోళికా నాట్యాన్ని నేటికి ప్రదర్శిస్తూన్నందున, గానంలో వలెనే నాట్యంలో కూడ యక్షులది ప్రత్యేక సంప్రదాయమే అని ఊహించవచ్చు.... యక్ష శబ్దానికి తెలుగు కన్నడ భాషలు రెండింటి లోనూ తద్భవంగా చెప్పబడిన "జక్క" శబ్దం నేటికీ ఒకానొక జాతి జనులకు నియతాభిధానంగా వినిపిస్తూంది ..... తెలుగు సాహిత్యంలో జక్కుల పురంధ్రుల పాటలు ప్రస్తావించబడినట్లుగానే కన్నడసాహిత్యంలో "ఎక్కలగాణ" ల నాట్యగానాలు పలుతావుల ప్రస్తావించ

* చూ. "కన్నడ యక్షగానాలు" అను వారి వ్యాసము భారతి – ఫిబ్రవరి, 1956 (ఈ విషయము గూర్చి శ్రీ హంసణగి రామచంద్రభట్టుగారు రచించిన "యక్ష నాటకగళు" అను కన్నడగ్రంథము పుట 50–51 కూడఁ జూడఁ దగును)

బడ్డాయి. అగ్గళుడు (12 వ శతాబ్ది) వ్రాసిన చంద్రప్రభాపురాణం (ఆ. 7, ప 96) లో వన విహారంచేస్తూన్న నాయకుని, మేళతాళాలతో నిమిత్తంలేకుండా దేశీయగీతాన్నొకదానిని ఒక "ఎక్కుల గాణ" యింపుగా పాడుతూవుంటే విన్నాడని వర్ణించబడింది. అభినవపంపని మల్లినాథపురాణంలో (ఆ. 6, పద్యం 98) కమలామోదియైన తుమ్మెదఝంకారం కమలాలయయైన లక్ష్మిని కీర్తిస్తూ పాడే "ఎక్కుల" గానంతో పోల్చి వర్ణించబడింది. రత్నాకరవర్ణి (16 వ శతాబ్ది) వ్రాసిన భరతేశవైభవంలో (చూ. ఆస్థాన సంధి. పద్యం 58) వెనుకపాటకులతోనూ, మేళతాళాలతోనూ 'ఎక్కుడిగలు' నాట్య మాడినట్లు వర్ణించబడింది. ఆయీ వ్రాతలవల్ల యీ ఎక్కులగాణలు తెలుగు జక్కులపాటకుల వలెనే జానపదగాయకులనీ, లక్ష్మీప్రశస్తినివర్ణించడమే వీరికికూడ కులాచారమనీ, నృత్యం కూడ వీరెరుగుదురనీ, అందులో హంగుదారుల ఆటోపం కూడ వీరి కవసరమే అనీ బోధపడుతూంది."

కన్నడనుడి యను నొక గ్రంథము నందు యక్షుల గీతాభినయకళాభినివేశము గూర్చి యొకగాథ గలదు. ఇంద్రసభలో నాట్య సంగీతవిద్యలందు మంతుకెక్కిన గంధర్వులకడ యక్షులొకప్పుడు భృత్యమాత్రులై యుండిరనియు, నది సహింపక వారు శుక్రాచార్యు నాశ్రయించి యావిద్యలభ్యసించి కృతార్థులైరనియు నాగాథ తెలియఁజేయుచున్నది.+ కాని కన్నడనుడి ప్రాచీనగ్రంథము గాదు. ఆగాథకుఁ బ్రాచీనాధారము గన్పట్టుటలేదు.

ఆంధ్ర వాఙ్మయమున మొట్టమొదట యక్షాదినేపథ్యముల తోడి యాట పాటల ప్రసక్తి పాల్కురికి సోమనాథుని (క్రీ. శ.

+ చూ. శ్రీ ఎమ్. గోవిందరావు గారి వ్యాసము (Ibid)

1280-1340)* పండితారాధ్య చరిత్రలో బర్వత ప్రకరణమునఁ గన్పట్టును. అది శ్రీశైల యాత్ర శివరాత్రి జాగరణ సందర్భము. ఆవేళ నచటఁ జేరిన యాత్రికుల వినోదకాలక్షేపములనేకము వర్ణింపఁ బడిన చోట —

"ఆదట గంధర్వ యక్ష విద్యాధ
రాదులై పాడెడు నాడెడు వారు (రి?)
విధమునఁ బ్రచ్ఛన్న వేషముల్ దాల్చి
యధికోత్సవము దులుకాడ నట్లాడు"

వారును ప్రశంసింపఁ బడిరి.

తదుపరి క్రీ. శ. 1430 ప్రాంతమున రచింపఁబడిన శ్రీనాథుని భీమేశ్వరపురాణమున (ఆశ్వా. 3, పద్య 65) దక్షారామ ప్రశంస సందర్భమున —

"కీర్తంతు రెద్దానికీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరణి"

అని యున్నది. యక్షగాన మను సమస్తపద మొక విశిష్టార్థమునఁ గనఁబడుటకిదే మొదలు.

"కీర్త యంతిస్మ మాహాత్మ్యం గంధార్వాస్త్రిదివౌకసః
గాంధర్వ విద్యానిపుణా గాంధర్వేణ గరీయసా"

అని సంస్కృత భీమేశ్వరపురాణము (అధ్యా 10 - శ్లో. 19). అమూలక మగు యక్షగాన శబ్ద మాంధ్ర భీమేశ్వరపురాణమున నటుం

* ఈ కవి కాలము గూర్చి యనేక మతములు గలవు. కాని ప్రామాణికులైన సుప్రసిద్ధ పరిశోధకులు డాక్టరు శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారితని కాలము క్రీ. శ. 1280—1340 అని తమ 'పాల్కు-రికి సోమనాథుఁడెప్పటి వాఁడు?' అను గ్రంథమున (వావిళ్ళవారి ప్రచురణ, 1955) నిర్ణయించి యున్నారు.

కింపఁబడినదనఁగా శ్రీనాథునికాలమున యక్షగానమున కొక ప్రత్యేకతయుఁ బ్రచారము నేర్పడి యుండును. అసలు గానకళాప్రావీణ్యమునకు గంధర్వులది పెట్టినది పేరుగదా. వారి పేరనే గాంధర్వవేదము వెలసినది. అట్టి గంధర్వులు "యక్షగాన సరణిఁ" బాడిరనఁగా నది శ్రీనాథుని కాలము నాఁడొక ప్రత్యేక గాన శైలిగాఁ బరిగణింపఁబఁచుండెఁడి దని తోఁచును. క్రీడాభిరామమున (క్రీ. శ. 15 వ శతాబ్ది) నొక వ్యాజమున మాణిభద్రకులోద్వహులైన యక్షకన్యల నృత్యప్రశంస గలదు (పద్య 137-138). పదునాఱవ శతాబ్ది ప్రబంధములలో - మనుచరిత్రమునఁ (II-19) బ్రవరుఁడుహిమవత్పర్వత ప్రాంతమున "గంధర్వ యక్షగాన ఘూర్ణితమగు నొక్కకోనఁ గనియె" నని యున్నది. పారిజాతాపహరణమున "యక్షగ్రామ వాస్తవ్యులు" "నిర్జరీ జనతా నృత్త సహాయలాలసు" లనియు, యక్షులు "మేళముగూడి పాడుచుండుదురు దిక్పాల సభల" ననియు నున్నది. (II-92-93). రామాభ్యుదయమున (III-42) "...గరుడ గంధర్వ కిన్నర కింపురుష యక్షగానంబు లనూనంబులై బెరయ..." అని యున్నది. చిత్రభారతమునఁ జతుర్థునిని యలకాపురీ సందర్శన సందర్భమునఁ (IV-80) గిన్నరులు పాట పాడుచుండఁగా "తాళసంఘ ప్రభేదంబుల గతులచే యక్షకామినులు నాట్యంబు లాడ" దొడఁగి రనియు, నందే కృష్ణుఁ డర్జునునిపై దాడివెడలిన సందర్భమున (VII-21) "మంగళమస్తు రమ్యనాథ యని యక్ష వనితలు కర్ణపర్వముగఁబాడ" దొడఁగి రనియుఁగలదు. కర్ణాటాంధ్ర వాఙ్మయము లందు యక్షుల గానాభినయ కళానుబంధముల కిక్కొన్ని యో ప్రమాణముల గలవు. కాని యవి క్రీ. శ. 12 వ శతాబ్ది కంకెఁ బ్రాచీనములు గావు. అంతకంకెఁ బ్రాచీనములు ప్రబలములైన ప్రమాణములు గానరావు. కావునఁ గర్ణాటాంధ్రము లందు

యక్షగానమను పేర నొక ప్రత్యేక గాన శైలికిఁ బ్రచార మేర్పడిన తరువాతనే తన్ని మిత్తముగాఁ దత్తత్సాహిత్యములందు భంగ్యంతరము గను, నొపచారికముగను యక్షుల గీతాభినయ కళానుబంధముల కా ప్రసక్తి గల్గినదని తలంపవలసి యున్నది. అదియుఁగాక దేవ యోనులైన యక్షుల వలన నాంధ్ర కర్ణాటము లందు యక్షగాన మేర్పడిన దనుట కంటె నెవరో భౌమజీవులైన యక్షుల వలన నేర్పడి యుండు ననుట సమంజసముగాఁ దోఁచును. యక్షజాతి ప్రతిష్ఠ హిందూ బౌద్ధ జైన మతగ్రంథములు మూఁడింటను నిటు సింహళము నుండి యటు నేపాళము వఱకును వ్యాపించినట్లు తెలియుచున్నది. కర్ణాటాంధ్ర దేశములకు నేపాళముకంటె సింహళము సన్నిహితమైనది. ప్రాచీన కాలమున సింహళమున యక్షుల రాచఱికము గొన్ని నాళ్ళు కొనసాగిన విషయము పూర్వోక్తము. అచట నేఁటికిని యక్షారాధన ప్రధానముగా "వడ్డా" యను జాతి వారి యుత్సవ నృత్యములు జరుగుచుండు నని తెలియుచున్నది.[7] ఆ యుత్సవములు మత బీజకము లఁట. ఆ యక్షులెవరో నృత్యప్రియుల వలె నున్నారు. ఆటతోడిదే పాట. మత ప్రచారమునకు గీతాభినయ కళాత్మక ప్రక్రియలు గొప్ప సాధనములు. పూర్వ మెపుడో సింహళమునుండి యా యక్షులో యక్షారాధకులో మతప్రచారము నిమిత్తమో మఱెందులకో కర్ణాటాంధ్ర దేశములు బ్రవేశించిరేమో! యనున దొక విచికిత్స. కర్ణాట దేశము నందలి యొక్కలగాణలు లేక యొక్కడిగలు, నాంధ్ర దేశమందలి జక్కులవారును వీరి సంతతి వారే

7. Vide., Dr. Manmohan Ghosh's paper on the Sinhalese dances and the Indian Natya Published in the Indo Asian Culture, Vol. I–No. 2; Oct, 1952.

(పాల్కురికి సోమనాథుని అనుభవసారమున 'వడ్డాచారములు' గర్హింపఁబడినవి. (97వ పద్యము) మఱి యవి యేమిటో యెఱుఁగరాదు).

యగుదురేమో ! ఎక్క-జక్క శబ్దములు యక్ష శబ్ద భవము లగుటను భాషాశాస్త్రము సమర్థింపఁ గలదు.[8] తొల్లి కర్ణాటాంధ్రములందు యక్షగానము వీనివల్లనే ప్రవర్తిల్లినదేమో !

పూర్వకాలమున వివిధ దేశములందు వెలసిన నాట్య సంగీత ప్రక్రియ లనేకము మత ప్రచారము కొఱ కేర్పడియుండుట లేదా మత బీజకము లై యుండుట ప్రసిద్ధ విషయము. కాత్యాయనుని శ్రౌత సూత్రములలోఁ (21-3-11) పితృమేధకర్మకాండమున నొక విధమగు గీతాభినయ ప్రక్రియ యాచరణీయ మని సూచింపఁ బడినది. సింహళ దేశీయుల యుత్సవ నృత్యములలోఁ పితృదేవతా పూజాసంప్రదాయము పాటింపఁబడుచున్నది.[9] గ్రీసు దేశపు నాటకో త్పత్తికి మతసంబంధ ప్రతిపత్తియే మూలికత త్త్వము. ఆనాటి గ్రీసు "ట్రాజెడీ" (విషాదాంత రూపకము) మొదట నొక మృతయోధుని సమాధికడ జరుపఁబడు నపరకర్మ కలాపముగా నవతరించినది.[10] అశోక చక్రవర్తి విగ్రహ ప్రదర్శనాదికము ద్వారమున బౌద్ధ మత ప్రచారము చేయించిన ట్లాతని నాగార్జునవ శిలాశాసనము వలనఁ దెలియుచున్నది.[11] వంగదేశపు "యాత్రలు" మత విషయికము లైన యుత్సవములలో నూఁగేగింపుల సందర్భములలోఁ ప్రయోగింపఁ

8. ఈ విషయమును సుప్రసిద్ధభాషాశాస్త్రవేత్తలును, భాషా చరిత్ర చతురానన బిరుదాంచితులును, ఆంధ్రభాషావికాస గ్రంథకర్తలు నగు ఆచార్య శ్రీ గంటి జోగిసోమయాజిగా రామోదించినారు.

9. Vide., Dr. Manmohan Ghosh's Paper, Ibid.

10. The Dramas and Dramatic Dances of Non-European Races By William Ridgeway.

11. ఈ విషయము నెత్తి చూపినవారు డాక్టరు శ్రీ వేలటూరి వెంకటరమణయ్య గారు. చూ. వారి వ్యాసము - ఆంధ్రపత్రిక ఖర సంవత్సరాదిసంచిక.

బడునఁటట[12] మార్వారు ప్రాంతమున వైశ్యజాతికిఁ జెందిన గంధర్వులను నొక తెగవారదియొక వృత్తిగాఁ బ్రదర్శించు అంజనసుందరి, మేనాసుందరి యను నృత్య రూపకములం దా యితివృత్తములు ప్రసిద్ధ మైన గాథ లనియు, నా ప్రదర్శనములను జైను లెక్కువగా నాదరింతు రనియు, నా గంధర్వుల కది యొక వృత్తి మైనను నది మతబీజక మైనదనియుఁ దెలియుచున్నది.[13] ఇట గంధర్వ శబ్దోప యోగము గమనింపఁదగినది. ఈ గంధర్వులకును దేవయోనులైన గంధర్వులకును సంబంధములేదు. గానకళాప్రావీణ్య విషయమునఁ బురాణ ప్రసిద్ధులైన దేవయోని గంధర్వుల పేరే వైశ్యజాతి ప్రదర్శకులు తమ గానకళా వైదగ్ధ్యమునకు సూచకముగాఁ బెట్టుకొని యుందురు. లేక జనవ్యవహారమున వీరికా ప్రసిద్ధి గల్గి యుండును. ఇంతకన్నను జిత్రమైనది నేపాళ దేశపు గంధర్వగానము. ఇది వంగ దేశపు యాత్రవలె నేపాళదేశము యొక్క దేశిసరణికిఁ జెందిన నర్తన (నాటక) మని వేరొక్కనఁ బడినది.[14] ఇది మతబీజక మైనదో కాదో తెలియదు. కాని దీనికిని మన యక్షగానమునకును బేళ్ళలో నేదో యొక వింతసామ్యము గోచరించును. ఇఁక యక్షగానమున కేమైన మత సంబంధమున్న దేమో చూడవలసియున్నది. సింహళ దేశపు యక్షులచేఁగాని యక్షారాధకులచేఁగాని ప్రవర్తిత మై యుండు నెడల నది యంతయో యింతయో మత సంబంధియని చెప్పనొప్పును. లేదా మీఁదఁ జెప్పఁబడిన కర్ణాట దేశపు బ్రదర్శన సంప్రదా

---

12. Vide. The Indian Theatre-by Dr. R. K. Yajnik, Part I Chap. 3-A., Eastern India- Yatras.

13. Vide., Sangeet Nataka Akademi Bulletin No. 2-Oct, 1954 - For a note on the Dances of the Gandharvas.

14. Vide, U. R. S. Dabral's Introduction to Bhamaha's Prakrit-prakash, Benares Edition, 1920.

యమును గమనించినను నది మతబీజకమై యుండునని తోఁచును. కాక, పాల్కురికి సోమనాథుఁడు చెప్పినట్లు శివరాత్ర్యుత్సవ సందర్భమున శ్రీశైలాది క్షేత్రము లందుఁ బ్రవర్తిత మగుచుండిన యక్షవేషధారుల యాట పాటలతో . యక్షగానమునకు సంబంధ ముండియుండు నెడల నదియు మతసంబంధ స్ఫోరక మగుచున్నది. జక్కుల జాతి సంబంధము గూడ యక్షగానముయొక్క మతబీజకత్వమును స్థాపింపఁ గలదు. అది యెట్లు స్థాపింపఁ బడఁగలదో, యసలు యక్షగానమునకును జక్కులకుఁ గల సంబంధ మేమిటో విచారింపవలసి యున్నది.

జక్కులజాతిసంబంధము

యక్షగానముతో సంబంధము గలిగిన వారుగా నూహింపఁ దగిన యొక్కడిగలు లేక యొక్కలగాణలు నేఁడు కన్నడ దేశమున నొక్కడను గానరారు. కాని జక్కుల వా రాంధ్ర దేశమున గుంటూరు, గోదావరి మొదలగు మండలములలోఁ దెనాలి, పెద్దాపురము మొదలగు ప్రాంతములలోఁగాన వచ్చుచున్నారు. నేఁడు వీరు కళావంతుల తెగకుఁ జెందినవారై యున్నారు. వీరిగుఱించి ఇ. థర్స్టన్ (E. Thurston) వ్రాసిన 'Castes and Tribes of South India' అను గ్రంథము ద్వితీయభాగము 438 వ పుటలో నిట్లున్నది:

"**Jakkula**–Described as an inferior caste of prostitutes, mostly of the Balija caste; and as wizards and a **dancing** and **theatrical** caste. At Tenali in the Kistna district, it was customary for each family to give up one girl for prostitution". etc. etc.,

దీనినిబట్టి జక్కులవారికి నాట్యకళతో సంబంధ ముండినట్లు విశదమగుచున్నది. కళావంతులసిపించుకొను వారియొడ నట్టి సంబంధము సహజము; వారికొలము బిరుదుసార్థకము. మూర్వారు గంధర్వుల సామ్యమున నీ జక్కులవారు తొల్లి మతప్రచార నిమిత్తమునకో లేక యది యొక ప్రధానవృత్తిగా నవలంబించియో యక్షగాన ప్రవర్తకులైన వారెల్లఁ గాలక్రమమునఁ గలిసి యేర్పడిన జాతియనియు, వారివృత్తికి సంబంధించిన యక్ష (జక్క) శబ్దము తరువాతివారికి జాతివాచకముగాఁ బరిణమించియుండుననియు నూహింపవచ్చును. వివిధజాతుల చరిత్రలు తఱచి చూచిన నిట్టి పరిణామ మసహజముగాదు. అందులకు మూర్వారు గంధర్వుల విషయమునే దృష్టాంతముగా గ్రహింపనగును. మన 'ఎఱుకల' జాతియు నట్లేర్పడినదే గదా.

ఆంధ్రదేశమున జక్కులవారిప్రశస్తి చిరకాలానుగతముగా వినవచ్చుచున్నది. ఈ నాఁడు రాయలసీమలోనున్న జక్కసానికుంట్ల (కర్నూలు జిల్లా, పత్తికొండతాలూకా), జక్కులచెఱువు (గుత్తి తాలూకా), జక్కులచెఱువు (పెనుగొండ తా..), జక్కసముద్రము (హిందూపురం తా..), జక్కులాడికి (బళ్ళారిజిల్లా) మొదలగు గ్రామముల నామములు ప్రాచీనకాలమున నా యూ ప్రాంతములందలి జక్కులజాతి ప్రాచుర్యమును సూచించును. అందఁ గొన్నిగ్రామము లొకప్పుడు వారి కినాములుగా నీయఁబడినట్లు స్థానికమైన ప్రతీతి గలదు. క్రీ. శ. తే. 9-7-1481 న జక్కుల కన్నాయి యను నామె తిరుమలదేవస్థానమున వేయించిన శాసన మొకటి కలదు.[15] అది క్రీ. శ. 15 వ శతాబ్ది నాఁటి జక్కులవారి ప్రాభవమును సూచించును.

ఇఁక నానాఁడు గానాభినయ కళాప్రదర్శనలందు వారికిఁగల పేరుప్రతిష్ఠ లెట్టివో యరయవలసియున్నది. పదునైదవ శతాబ్ద్యా రంభమున వెలసిన క్రీడాభిరామమున (135 వ పద్యము) "జక్కుల పురంధ్రి" గానకళా కౌశలము విశేషముగఁ బ్రశంసింపఁబడినది. అందే యా వెంటనే (పద్య. 136-138) భంగ్యంతరమున 'అక్కలు' లేక "యక్షకన్యల" అనఁగా జక్కుల పడుచుల నృత్య ప్రదర్శనము గూడఁ బ్రసక్తమైనది. జక్కుల రేకులను పదములు[16] జక్కిణి యను నృత్యవిశేషము వీరిపేరనే ప్రసిద్ధములై యుండును. క్రీ. శ. 1500 ప్రాంతమునఁ బ్రోలుగంటి చెన్న శౌరి యనునాతఁడు సౌభరిచరిత మను "జక్కులకథ" చెప్పినట్లు తెలియుచున్నది. అది జక్కులవారు

15. తిరుపతి దేవస్థాన శాసనములు. ద్వితీయ సంపుటము - నం. 77.

16. చూ. తాళ్ళపాక చినతిరుమలయ్య (క్రీ. శ. 1480 - 1540) సంకీర్తన లక్షణము - 50 వ పద్యము.

17. హరిభట్టు నారసింహ పురాణము, ఆవతారిక - పద్య. 33.

చేయు గానయూప కథాఖ్యాన ఘక్కిక మూఁదలగా రచింపఁబడి యుండును. పురాణాదులలోఁ గానరాని యక్షుల గానకళాప్రశంస మనభీమఖండమునను బదునాఱవశతాబ్ది ప్రబంధములందును గన్పట్టు చున్నదనఁగా (ఈవిషయము పూర్వోక్తము) నది యీజక్కులవారి పాటలు వ్యాప్తికి వచ్చినతరువాత వానికే భంగ్యంతర సూచనయని గ్రహింపవచ్చును. చిత్రభారతమున "యక్షకామినుల నాట్యము", "యక్షవనితలపాట" యుఁ బ్రత్యేకముగ బేర్కొనఁబడిన వనగా నవియు నీజక్కులపురంధ్రుల యాటపాటలకే భంగ్యంతరసూచనలగు నేమో! 17 వశతాబ్దినాటి పురుషోత్తమదీక్షితుని తంజాపురాన్న దాన మహానాటకమున[18] జక్కుల రంగసాని యను నామె సత్రములోఁ బదకేళిక పట్టినట్లుగలదు. ఈవిషయములెల్ల జక్కులజాతికి గీతాభినయ కళలతోఁగల సంబంధము నూహించుటకుఁ దోడ్పడుచున్నవి.

జ క్కి ణి

ఇఁకజక్కిణి శబ్దవిచారము. జక్కులవారిగుఱించి మీఁదఁ బేర్కొనఁబడిన విషయములో స్త్రీ ప్రసక్తి ప్రాముఖ్యము గమనింపఁదగినది. జాతిస్త్రీవివక్షయందు యక్షశబ్దము యక్షిణియగును. యక్షిణీ శబ్దవికృతియే జక్కిణి. అనఁగా నిట జక్కులపురంధ్రియని యౌపచారికముగా గ్రహింపనగును. జక్కిణుల నాట్యపద్ధతికి నాపేరేకల్గుట విశేషము. "ఝక్కిణీ" లాస్యము మతంగమహామున్యుపజ్ఞమై ప్రాదుర్భవించినదని యతని బృహద్దేశివలనఁ దెలియును.[19]

18. తం. స. మ. — కే. సం. 5-9.

19. బి టి. సి. సెం. 11536 (ఈవిషయమును తమసంస్కృత వాఙ్మయ చరిత్ర)లో నుటంకించిన శ్రీ ఎమ్. కృష్ణమాచార్యులవారి యభిప్రాయము ననుసరించి మతంగుని కాలము క్రీ. శ. 4 వశతాబ్దిగా దోఁచును.)

ఒకప్పుడాంధ్రదేశమున నిదిమిక్కిలి ప్రచారముననుండి నట్లూహింప వీలగుచున్నది. పదునాఱు పదునేడవ శతాబ్దుల తెలుఁగు ప్రబంధములందు బలుతావుల నొకగొప్పనాట్య ప్రభేదముగా జక్కిణి ప్రశంస గన్పట్టుచున్నది.[20] రామాభ్యుదయమున "జక్కిణి - వేషముల" ('మేళముల' అని పాఠాంతరము) ప్రస్తుతిగలదు. తంజావు రాంధ్రనాయక రాజాస్థానమున జక్కిణినాట్యగోష్ఠి తఱచు జరుగుచుండినట్లు విజయరాఘవనాయకుని (క్రీ. శ. 1631 - 73) రఘునాథనాయకాభ్యుదయ ప్రహ్లాదచరిత్ర యక్షగానములవలనను, దదాస్థాన కవియగు చెంగల్వ కాళకవి రాజగోపాలవిలాస ప్రబంధమువలనను నెఱుఁగనగును. జక్కుల రంగసాని పదకేళిక ప్రస్తుతిగల తంజావురాన్న దాన నాటకముగూడ నతని యాస్థానమున వెలసినదే. ఆనాఁడు విజయరాఘవునాస్థానము యక్షగానమునకుఁ బట్టుకొమ్మ. జక్కిణికి నాట్యప్రభేద మాత్రముగనేకాక నాట్యోపయోగి గీతప్రబంధ విశేషముగను ప్రసిద్ధి యుండినట్లు తెలియనగును. వెన్నెలకంటి సూరన (క్రీ. శ. 1500 - 1550) విష్ణుపురాణమున (7 - 277) గీతము దరువులతోపాటు జక్కిణి యొకవర్ణవిశేషముగాఁ బేర్కొనఁబడినది. రెండు యక్షగానప్రాయరచనలు - తంజావూరు మహారాష్ట్రప్రభువగు శహాజీ (క్రీ. శ. 1684 - 1712) త్యాగవినోద చిత్రప్రబంధము, మధుర విజయరంగ చొక్కనాథనాయకుని (క్రీ. శ. 1706 - 32) యాస్థానాశ్రితుఁడైన తిరుమలకవి చిత్రకూట మాహాత్మ్యమునను వానియందు జక్కిణిదరువు లుదాహరింపఁబడినవి. కూచిపూడి భాగవతుల సాంప్రదాయిక నాట్యావలంబనములలో జక్కిణిదరువొకటి

20. చూ. సూ. రా. సిద్ధాంతము. ఇందుఁ బేర్కొనబడలేదు కాని చంద్రభానుచరిత్రము, ఉత్తరరామాయణము, పాంచాలీపరిణయము మొదలగు ప్రబంధములందును జక్కిణిప్రశంసగలదు.

యని తెలియుచున్నది.[21] వారి యక్షగాన ప్రదర్శనవిషయము ప్రసిద్ధము. ఇక నొక విశేషము - భామావేషకథ యను నొక యక్షగాన ప్రాయమైన కృతి గ్రంథకర్తచే దద్రచనా ప్రక్రియాపరముగ జక్కిణి యని ద్వివారము పేర్కొనబడినది.[22] గ్రంథప్రారంభమున బ్రథమ పత్త్రమున దనకృతివిషయము నిట్లు ప్రస్తావించినాడు గ్రంథకర్త:- "జోకగ గీతవాద్యముల సొంపుగ నింపుగ వంచ జక్కిని ప్రాకటమైన నాట్యరసభావముల న్వినిపింతు వేడుకన్",

"సరసులు గాణలు సత్కవుల్ బుధులు
భరతజ్ఞులును మెచ్చ ప్రౌఢిమి నిచ్చ
నరసి లక్షణ లక్ష్మియంబుల రూఢి
కరుదంద గీత వాద్యాదుల జోక
సరవి తోడుత వంచ జక్కిణి నాట్య
మిరవంద వినుపింతు నెంతయ వేడ్క"

ప్రసిద్ధమైన పారిజాతకథ యిందలి యితివృత్తము. అనేక యక్షగానము లందు గన్పట్టు యెఱుకఫుట్ట మిందునుగలదు. రచన యక్షగాన సామాన్యముగా దరువులు, ద్విపదలు, వచనము, పద్యములు గలిగి యున్నది. గ్రంథము యక్షగానమనుటలో సందేహింపఁ బనిలేదు. జక్కిణి యని వ్యవహరింపఁబడుట తగియున్నదనిపించును. పై విషయములను బట్టి చూచినచో నాట్యప్రభేధముగను, నాట్యోపయోగియైన గీతప్రబంధ విశేషముగను బేరొందిన జక్కిణికిని, గీతాభినయోభయ ప్రయోజనాత్మకమైన యక్షగానమునకును నేదో చుట్టఱికముం

21. ఆచార్య శ్రీ విస్సా అప్పారావుగారి 'కూచిపూడి నాట్యసంప్రదాయం' అను వ్యాసము. సంస్కృతి - ఏప్రిలు, 55.

22. పొ. లి. పు. భాం, డి. నం. 1919.

డక పోదని యనిపించును. ఈ జక్కిణియు యక్షగానమును మన జక్కుల పురంధ్రుల యాటపాటలేయై యుండిన నుండవచ్చును.

వివిధజాతుల యుత్పత్తుల గుఱించి యైతిహ్యము లనేకము చిత్రచిత్రములుగా విశ్రుతము లగుచు నుండును. అట్లే యీ జక్కుల వారసలు యక్షస్వరూపులే యైనట్లొక గాథగలదు. క్రీడాభిరామమున "కామవల్లీ మహాలక్ష్మీ శ్రీకైటభారి, వలపు నాడుచువచ్చె జక్కుల పురంధ్రి" యనియున్నది. దానికిఁ గామెపల్లివారి వీధిభాగవతము లోని లక్ష్మీనారాయణుల ప్రణయఘట్టమును బాడుచు వచ్చినది జక్కులపురంధ్రి యని కొంద ఉపవ్యాఖ్యానము గావించిరి. ఆ కామవల్లియే కామేశ్వరిపాట యను స్త్రీల పాట[23] లోని కామేశ్వరియని యీ కామేశ్వరి కథను కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు క్రీడాభిరామపీఠికలో[24] వివరించియున్నారు.[25] ఈ కథలో మహాలక్ష్మీ శాపవశమునఁ బార్వతికి సద్యోగర్భమున సప్తకన్యకలుగా నుద్భవించినదని యున్నది. అందొకతె పేరు "జక్కులమ్మ" యటఁ. కామవల్లి కిడగొట్టుది. ఒకనాడు —

"ఆ పార్వతీశ్వరుం డతి సంభ్రమమున
నిరవొప్ప యక్షుల నిద్దఱఁబిలిచి
మురువొప్ప జక్కులముద్రలు చేసి
ఉరుమలు మద్దెల లుపకరణములు

23. ఏలూరు మంజునాథ ముద్రాక్షరశాల ప్రచురణ:— "స్త్రీల పాటలు"

24. మదరాసు శృంగారి గ్రంథమాల ప్రచురణ:— పుట 97—102.

25. సా. లి. పు. భాం. డి. నం. 338—ఆదిలక్ష్మీవిలాసమను పద్యప్రబంధము, డి. 1045— కామేశ్వరీ చరిత్రమను ద్విపద క్రీ. శ. 1600 ప్రాంతమున వేటూరి భావనామాత్య కృతము)— ఈ రెండింటి యందును కామవల్లి కథయే యితివృత్తము.

కరమొప్పఁ దగినవి గావించి యిచ్చి
ముత్యాల రంగముల్ మున్నూరు చేసి
అత్యంత ముదముతో నడిగిన వేళ
చిందముల్ బోనముల్ శృంగారములును
అందముల్ పరికెలు నానందములును
ఆ రీతి సంతసమందగా జేసి
సారెకు ముద్రల జక్కుల బిలిచి
రమణ మీ వంశ పారంపర్య మెల్ల
కమలాక్షిఁ గొలువుండు కామవల్లెమను
కామవల్లిని గొల్చు ఘనులెల్ల మున్నె
ప్రేమతో మిము జాల ప్రియము చేసెదరు ''

అని యొక కట్టడిజేసినాఁడఁట. ఆ సప్తకన్యకలనే " అక్కలు " లేక " అక్కదేవత " లందురు. యక్షులు శివాజ్ఞచే వంశపారంపర్యము గామవల్లిని గొలువవలసినవారైరఁట. వారే జక్కులఁట! శివుఁడు వారికి వాద్యప్రదానముగావించె ననుట గమనింపఁ దగియున్నది. (క్రీడాభిరామమున జక్కుల పురంధ్రిపాటసందర్భమున నీ వాద్యములు గొన్నిటికిఁ బ్రస క్తిగల్గినది)కామేశ్వరి యిలువేలుపైనవారెల్లముఁదు వీరికే ప్రియముచేయుదురఁట. అది గాధయైనను నందు వారివిశ్వాసము ప్రతీయమానమగుచున్నది. శివాదేశ విషయము విశ్వసనీయము గాక పోయిననువారి కులాచారమునకు గ్రంథస్థనిదర్శనము గలదు. క్రీడాభి రామమునఁ గామవల్లివలపు వాడుచు వచ్చిన జక్కులపురంధ్రి ప్రశంస వెంట "అక్కల" కొలుపు వర్ణింపఁబడినది. ఒక గృహస్థు సంతానార్థియై

వారి నారాధించినట్లును,[6] నా సందర్భమున అక్కలేకుగురును లేచి యాడిరనియు, నా యక్కలే "యక్షకన్య" లనియుఁ (అనఁగా నిట జక్కులపడుచు లనియు) జెప్పఁబడినది. (యక్షశబ్దమునకు—"జక్క", "ఎక్క" అను రూపాంతరములేగాక "అక్క" యను రూపవికృతియు నంగీకార్యమే యనియు, నది భాషాశాస్త్రసమ్మతమే యనియు ఆచార్య శ్రీ గంటి జోగిసోమయాజిగారనుచున్నారు.)

రాయలసీమలో రాయచోటి తాలూకాలో చిన్నమండెం గ్రామసమీపమున అక్కదేవతలకొండ యని యున్నదనియు, నక్కడ వారిగుర్తులుగా నొకయేసు జూళ్ళున్నవనియు, నేటేట జనులు ముఖ్యముగ సంతానకాంక్షులైనవా రా దేవతలను గొలువఁబోవుదురనియుఁ గొండపై సంతర్పణము జేయుదురనియుఁ దెలియుచున్నది.[37] దీనినిబట్టి రాయలసీమలో నీకామేశ్వర్యారాధన వ్రతసంప్రదాయమెంత ప్రాచుర్యము నందినదో తెలియఁగలదు. అక్కలపాట యను నొక స్త్రీల

26. పూర్వ మాంధ్రదేశమున సంతానకాంక్షులైన గృహస్థులు కొందఱు సుద్దులగొల్లలను గూడ నాశ్రయించుచుండినట్లు హంసవింశతి (ఆశ్వా. 2. పద్య 85–89) వలన నెఱుఁగనగును. అనఁగా జక్కులపాటలు, గొల్లసుద్దులు మొదలగునవి జానపద వినోదోద్దిష్టములు మాత్రమే కాక మతబీజకము లనియుఁదెలియనగును. ప్రోలుగంటి చెన్నశౌరి చెప్పినాఁడన్న "జక్కులకథ" సౌభరిచరితము గూడ సంతాన ఫలప్రదవిశ్వాస ప్రతిపాదకమగుట విశేషము. సౌభరిచరితము విష్ణుపురాణము భాగవతములందుఁ గలదు. అందొక మాంధాతృరాజు సంతానసౌభాగ్యమును జూచిన సౌభరిమహర్షికి సంతానవ్యామోహము గల్గుటయు నంశలకుగా నతఁడు మాంధాతృరాజపుత్రికలను వివాహమాడి వారి యందధిక సంతానము గాంచుటయుఁ జెప్పఁబడినది. ప్రాయశః జక్కులవారు నాఁడీకథను సంతానవ్రతులైనవారియిండ్లఁ జెప్పుచుండెడివారేమో!

27. చూ. కడపజిల్లా గెజిటీరు, పుట 225.

పాట[28] వలనఁ గృష్ణాగోదావరీ మండలములలో
మునకుఁ గల "పరపతి" తేట తెల్లము కాఁగలదు. అం
ఏలూరు, రాజమహేంద్రవరము, కొవ్వూరు పురము లాదిలక్ష్మీ కా
శ్వరి వెలసిన పుణ్యస్థలములుగాఁ బేరొక్కనఁబడినవి. అందు జక్కులమ్మ
ప్రశంసయుఁ దఱుచు గన్పట్టును. "నేటికిఁ గూడ సర్వాంధ్రదేశము
నను బ్రాహ్మణాది వర్ణములవారికీ కామేశ్వరి (అక్కలు) యిలువేల్పు
గాఁగల యిండ్లలో వివాహాది శుభకార్యములు జరిగినతోడనే యక్కల
కొల్పును జరుగును. ఆనాఁ డేడుగురు ముత్తైదువల కర్చనము జరు
గును...ఉద్రేకజనక మైన గాన ఘణితిని కామేశ్వరిపాట వీర వాద్యము
లతో నా నాఁడు పాడుదురు" అని కీ. శే. వేటూరివారు వెలవిచ్చి
నారు.[29] అక్కల కొలుపుతోపాటి దేగదా జక్కులపాట. అందులకుఁ
గ్రీడాభిరామమే ప్రమాణము. క్రీడాభిరామ కవిది "వినుకొండ"
(గుంటూరుమండలము). అతఁడుటంకించిన జక్కులపాట-అక్కలయాట
సన్నివేశమునకుఁ గథారంగ మొరుగల్లు (తెలంగాణము – క్రీడాభి
రామమునకు మూలమైన ప్రేమాభిరామమునకుఁ గర్త రావిపాటి
తిప్పరాంతకుఁడా ప్రాంతమువాఁడే. అతనికాలము క్రీ. శ. 1290-1330
ప్రాంతము). పై విషయములనుబట్టి యక్కలకొలుపు వ్రతసంప్రదాయ
మెట్లు చాలకాలమునుండి యాంధ్రప్రదేశమున వివిధప్రాంత పరివ్యాప్త
మైనట్లు తెలియుచున్నదో యట్లే దానితో పాటే జక్కులపాటలకు
నంతవ్యాప్తియు నుండఁబోలు నని యూహింపనగును. కీర్తిశేషులు
ఏ. పి. కాంబేలు, సి. పి. బ్రౌనుదొరగారలు తమ యాంధ్రాంగ్ల
నిఘంటువులందు జక్కులవారిసఁ గామేశ్వరీ దేవతారాధకులుగనే

28. మంజువాణీము. శా. ప్రచురణ. ఏలూరు. తృతీయముద్రణ, 1921 'స్త్రీల పాటలు'– ద్వితీయభాగము–పుట 40-43

29. క్రీడాభిరామపీఠిక–పుట 96

పేరొక్కని యుండిరి. అనఁగా వారికాలమునను (క్రీ. శ. 19 వ శతాబ్ది పూర్వార్ధము) గూడ జక్కులు కామేశ్వరినిఁ గొల్చుచునే యుండిరనుట నిశ్చయము. దేశమందుఁ బలుతావుల నావ్రతసంప్రదాయము వ్యాప్తి గాంచుట జూడ జక్కులు "దేశద్రిమ్మరి" జాతివారుగాఁ గూడఁ గన్పట్టుచున్నారు. "దేశద్రిమ్మరి" జాతులలోఁ దఱుచువృత్తులు మాఱుచుండుట సహజము. అందుచేతనే కానోపు నీనాఁడు వారికిని యక్షగానమునకును సంబంధము గానవచ్చుటలేదు. వారికిఁదమజాతీయ గానకళాభిమానము కంటె ముఖ్యమైనది కొలుపుదేవతయైన కామేశ్వరి కొలుపు. అదిమాత్రము వారువిడిచినట్లు గానరాదు. కాలక్రమమున వారు కామేశ్వరిచే నమ్ముకొని "దేశద్రిమ్మరు" లై యూరూర సంతానకాంక్షుల యిండ్లఁబేరంటములు సేయుచు స్వీయజాతీయ గాన కళాభిమానములను వీడియుందురుగాక, కాని యాంధ్రమున యక్ష గానప్రాదుర్భావమునకు వీరియాటపాటలతోడి సంబంధమే యాంత రంగిక కారణమై యుండును.

యక్షగానమున కీ జక్కులవారి సంబంధము కారణముగా వారి కామేశ్వరికథ శివ కేశవోభయ మాహాత్మ్య ప్రతిపాదకమును నొక విశిష్ట వ్రత సంప్రదాయమునకుఁ జెందినదియు నగుట చేతను, పాలుఁబోకి సోమన మాటలనుబట్టి యక్షగానము మొదట శ్రీశైలాది క్షేత్రములలో శివరాత్ర్యుత్సవాది సందర్భములలోఁ బ్రదర్శితమగు చుండెడిదని యూహింప నయితి యగుచుండుటచేతను నది హైందవ మతబీజకమనఁ జెల్లును. కన్నడదేశపు యక్షగాన ప్రదర్శన సంప్ర దాయమున దత్సంబంధి కాఁ దగు యక్షరాత్రి గాథ వైఖరి జూచి నను నందు హైందవపురాణ విశ్వాసప్రతిపత్తి ప్రతీయమాన మగు చున్నది.

పూర్వవాదసమన్వయము

ఆంధ్రమున యక్షగానోత్పత్తి గురించి విపశ్చిద్వరేణ్యులు కొందరివఱకుఁ గొంత విచారణ సల్పియుండిరి భిన్నమతము లుత్పన్నములైనవి కాని యందెవ్వరును జక్కులవారి సంబంధమును బూర్తిగా విసర్జించినవారుకారు. ఆమతప్రతిపాదనలలో ముఖ్యములైనవి మూఁడు. ఈ త్తద్వాద ప్రతిపాదకులలో ముఖ్యులు మువ్వురు. కీ. శే. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు, కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, డాక్టరు శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు.

1. జక్కుల సంబంధము వాదము

యక్షగానోత్పత్తినిగూర్చిన విచారణలో ఆదినారాయణశాస్త్రిగారి వాదము ప్రాథమికము. ప్రాతఃస్మరణీయము. యక్షగానమునకును జక్కులకును గల యనుబంధమును నిరూపించుటకుఁ బ్రయత్నించినవారిలో వారే మొదటివారు.[30] ఆంధ్రదేశమున విద్యావివేక ఘనులగు ప్రాచీన జాతుల వారిలో జక్కులు, బవినీడులు మున్నగువారు నిక్కిలి ప్రాచీనులనియు, నాంధ్రమునఁ బ్రాచీనకళాకౌశలమును వెలువరింపఁజాలిన స్మరణచిహ్నములేమైన వాఙ్మయరూపమున నున్నవని మనము తలంతుమేని యయ్యవి జక్కుల పాటలును, జక్కుల యాటలును, జక్కుల చిత్రకళాకౌశలములునుమాత్ర మేయగును గాని వేఱు కావనియు, జక్కులు తొలుత జాతీయ వీరనారీమణుల చరిత్రలనే గానము చేసెడివారనియు, నీనాఁటి పల్నాటి జక్కులకడ నందులకు సాక్ష్యము గలదనియు సెలవిచ్చినారు శాస్త్రి

30. చూ. "యక్షగానములు లేక జక్కుల పాటలు" అను వారివ్యాసము-ఆంధ్రపత్రిక సుదర్శని (1931) సంవత్సరాది సంచిక, పుటలు 121—126.

గారు. ఇది కొంతవట్టు యథార్థము కావచ్చును. కాని జక్కు శబ్ద విచారము గూర్చి వారు చేసిన ప్రతిపాదన సమర్థనీయముగా దోచకున్నది. " యక్షులు అను పదమునకు మన పండితులు జక్కులు అనునది తద్భవ రూపమని వ్యవహరించు నాచారమున్నది. కాని జక్కులు అను మాట కేవలమును దేశ్యమని నా భావము. మనవారు దేశ్యశబ్దముల కనేకమునకు ఆర్యత్వా ప్రాకట్యమునకుం గాఁబోలు – సంస్కృత రూపములను గల్పించి వ్యుత్పత్తియముచేసి, సంస్కృత భావత్వమును అనుగ్రహించియున్నారు. ఈ వాడుక మన పండితులకుం గ్రొత్తకాదు. తెలుఁగు అను పదమునకు త్రిలింగాది రూపములు గల్పించుటలు మున్నగువానిఁ బరీక్షించినచో నైని చెప్పిన మనవారి వాడుకలోఁ గల యాథార్థ్యము తేలగలదు " అని వక్కాణించి యున్నారు శాస్త్రిగారు. మన పండితులు దేశ్యశబ్దములు గొన్నిం టికిఁ సంస్కృత రూపములను గల్పించిన మాట నాస్తవమే కాని తద్భవ దేశ్యశబ్ద విచారమున సర్వదా యీ సూత్రము వర్తింపదు. అందును శాస్త్రిగారు చూపిన తెలుగు – త్రిలింగ శబ్దముల సామ్య మవిచార రమణీయము. అది యట్లుండ సామ్య మనున దొక విషయమును సమర్థించుటలో సమాధాన ప్రతిపత్తిసాధనమున కొక యుపాధికాఁగలదు. కాని యదియే యుపపత్తి కాఁజాలదు. ఇం తేకను జక్కులపాటయే పండితుల గీర్వాణవశమున యక్షగానమైన దనికదా శాస్త్రిగారి వాదసారాంశము. అట్లైనచో జక్కులజాతియే ప్రాథమికమైన దనవలయును. మఱి యీ జక్కులజాతి యెట్లేర్పడిన దనున దొక యక్షప్రశ్నవలె మిగులును. యక్షులే జక్కులైనా రను టకు వారిజాతియైతిహ్య ముండనే యున్నది. (పూర్వోక్తము). కాని జాతియుత్పత్తిని గూర్చిన చారిత్రకమైన విచారణలో నైతిహ్యములు సరియైన యుపపత్తులు కాఁజాలవు. గ్రంథశాసనాది ప్రమాణముల

వలన జక్క-యక్ష శబ్దములలో యక్షశబ్ద ప్రాచీనత్వము, భాషాశాస్త్ర ప్రమాణములచే జక్క-యక్ష శబ్దముల జన్యజనకసంబంధము నంగీకరించుట సమంజసమగును. అంతమాత్రమున జక్కులు దేవయోనులైన యక్షుల సంతతివారని చెప్పుటకాదు. భౌమజీవులైన యక్షులు పలుతావుల నుండినట్లు మాఁదఁ జెప్పఁబడినది. ఇట నొకవిశేషము నుటంకింపవలసి యున్నది: ప్రాచీనకాలమునఁ గర్ణాటదేశమునజైనము, నాంధ్రమున బౌద్ధము విశేషప్రచారమున నుండినట్లు చరిత్రవలన విశదమగుచున్నదికదా. జైనులందును, బౌద్ధులందును యక్షులను వారుండినట్లూ యూ వాఙ్మయములనుండి తెలియుచున్నది గదా. కన్నడదేశపు కొక్కడిగలు, మన జక్కులును వారి సంతతివారైనను నైయుండవచ్చును. ఆయూ దేశములందు జైన బౌద్ధముల ప్రాబల్యము క్షీణించిన తరువాత వారు హైందవమతావలంబులై యుందురు. లేదా జక్కులవారి విశ్వాసమును బట్టి దేవయోనులైన యక్షుల స్వరూపస్వభావాదులు పురాణాదులవలన విన్నంత కన్నంత వారి నాకర్షించి యుంచును; వారు యక్షజాతిసంప్రదాయ విధేయులై యుందురు. లేక సింహళదేశపు వడ్డాజాతివారివలె యక్షారాధకులై యుందురు. లేక పాల్కురికి సోమనాథుఁడు చెప్పినట్లు శ్రీశైలాదిక్షేత్రములలో యాత్రికుల శివరాత్రి జాగరణాది సందర్భములందు గంధర్వయక్షాది నేపథ్యములతో గాన కాలక్షేపములు చేయుచుండి, వివిధదేవయోనులలో యక్షులు విశేషము విచిత్రమైన వారును, గామరూపులు నని ప్రసిద్ధి కాఁబట్టి దాని కనుగుణముగ వారు వేయుచుండఁబోలు నని యూహింపఁదగిన యూ యక్షవేషములు యాత్రికజనుల నెక్కువ యాకర్షింపఁగా బహు జనామోదమునకై తఱుచు యక్షవేషములనే వేయుచు గాన కాలక్షేపములను జేయుచు నదే ప్రధానవృత్తిగాఁ బరిణ

మింప నట్టివారందఱు నొక జాతిగా బరిగణింపఁబడి, వారివృత్తికి సంబంధించిన యక్షశబ్దమే వారికి జాతివాచకమై జనవ్యవహారమున రూఢమై నలుగుఱువడి కాలక్రమమున జక్కుశబ్దముగామాఱియుండును.

జక్కులజాతి యైతిహ్యమున శివుఁడు యక్షులను బిలిచి జక్కుల ముద్రలువైచి సంగీతోపకరణము లిచ్చి యొక నియోగముజేసినట్లు గలదు కదా. శివుఁడు సర్వలోకేశ్వరుఁడనుమాట యటుండ నతఁడు కుబేరసఖుఁడు, కుబేరుఁడు యక్షరాజుగావున నట్లయినను యక్షులు పని గల్గునప్పుడు శివాజ్ఞకు లోఁబడవలసినవారే యగుదురు. శ్రీశైలాదిశివక్షేత్రములందుఁ బ్రవర్తిల్లు వినోదకాలక్షేపములలో యక్షనేపథ్యములకుఁ బ్రసక్తిగలదనఁగా యక్షులకును శైవమునకు నేదో సంబంధముండినట్లు పొడగట్టును. పై విషయమును బేర్కొనిన పాల్కురికి సోమనాథుడు నాతని వాఙ్మయమును వర్ణిల్లిన కాలము కన్నడ విషయమునుండి యాంధ్రమునకు వీరశైవము విజృంభించుచుండినకాలము. అప్పుడా మతప్రచారార్థమో లేక శివసందర్శనాభిలాషులగుటనో ప్రసిద్ధములగు శ్రీశైలాది శివక్షేత్రములకుఁ గన్నడదేశపు జెక్కుల గాణాలు వచ్చుచునుండిరేమో! వారిలోఁ గొందఱు తెలుఁగుదేశమున స్థిరపడి నలువంకల వ్యాపించి, తెలుఁగువారిచే జక్కులవారని వ్యవహరింపఁబడుచు నుండిరేమొ! ఇది యంతయు నీ నాఁడాధారము లుపలభ్యమగునంతలో నూహ కుపాధి యున్నంతలో నొక నికటమైన సమన్వయమున కనుగలము కాని వివిధ విచికిత్సల స్వరూప ప్రదర్శనము మాత్రమే కాని యన్వర్థసిద్ధాంత మెంతమాత్రమును గాదు. ఏదెట్లయినను బ్రాహ్మర్భవకాలమున యక్షగానమునకు యక్షశబ్ద వాచ్యులెవరితోడనో యేదో ప్రగాఢమైన సంబంధముండియే యుండు ననుటయు, జక్కుల గానకళానుబంధమును గాదన రానివి. ఆ యక్షశబ్ద

వాచ్యాలు జక్కులే యై యుందురనుట యిప్పటిమట్టునకు సమంజసము గనే కనిపించుచున్న ది.

ఒకానొకప్పుడు సమూహాంతరముగా జక్కులపాట యనునది జనసామాన్య వ్యవహారమునను,యక్షగానమనునది పండిత వ్యవహారము నను నుండి యుండి కాలక్రమమునఁ బండితవ్యవహారమే రూఢమై యుండును. ఆదినారాయణశాస్త్రిగారి వాద మా విధముగా సగము సమర్థనీయమగుచున్న ది.

2. కొరవంజె వాదము

ఇఁక రెండవ వాదము ద్రవిడదేశపు దృశ్యప్రబంధ విశేషమగు కొఅవంజి లేక కురవంజినుండి యక్షగాన ముత్పత్తియైనదనుట. ఈ వాదమునకు మొదట బాదు కల్పించినవారు కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. వా రిందుగుఱించి తమ సుగ్రీవవిజయ[31] పీఠికలోనిట్లు సెలవిచ్చియున్నారు.

" తెలుఁగునకు సాటి భాషలగు ద్రవిడ కర్ణాట భాషల పద్ధతు లనుబట్టియుఁ దెలుఁగులో నిప్పుడుపలభ్యమానము లగుచున్న కొన్ని ప్రాచీన దృశ్యరచనముల తీరులనుబట్టియు, ద్రావిడ భాషాసామాన్య ముగాఁ దొలుత వెలసిన నాటక రచనల స్వరూపము కొంత గుర్తింప వచ్చును.

" తొలుత ద్రావిడ భాషలలో వెలసిన దృశ్య రచనములు కురవంజు లనఁబడునవి. ఆంధ్ర కర్ణాట ద్రవిడ దేశముల యరణ్యము లలో వసించు నాటవికులు, చెంచులు, కురవలు (కోన, కోయ) అనువారు. అందు కురవజాతివారి యంజె=అడుగు (నృత్య విశేషము) కురవంజె యనఁబడెను. చిందు, గంతు, గొండ్లి, అంజె, అంగ - ఇత్యా

31. కపిలేశ్వరపురం జమీందారుగారిప్రచురణ, 1939.

దులు నృత్యవిశేషములు. ఆంధ్రదేశమున బహుకాలమున నుండి శివక్షేత్రములగు శ్రీశైలము, ఇంద్రకీలనగము (బెజవాడ కొండ) మొదలగు పర్వతములమీఁదను నృసింహక్షేత్రములగు వేదాద్రులు (పెకుకలున్నవి. మంగళాద్రి, సింహాద్రి, గరుడాద్రి, మాల్యాద్రి, వెంకటాద్రి) మొదలగు పర్వతములమీఁదను వర్షోత్సవములు (యాత్రలు, జాత్రలు, జాతరలు) జరుగునప్పు డక్కడికి నాగరక ప్రజలు చేరుచుండు నారు. వారి వినోదమునకై యక్కడి యాటవికులు, రాత్రులందు నృత్యవిశేషములనెఱపి ధనార్జనము చేయుచుండువారు. అక్కడక్కడి కొరవ జాతులవారు చేయు నృత్యములు కొరవంజు లనఁబడెను. కొరవంజెయన్న పేరు తొలుత వారి నృత్యమునకును, పిదప నృత్య విశిష్టమైన వారి చిన్ని చిన్ని గేయరచనలకును, నాపై కురవజాతి వారికినిగూడఁ బేరైనది. కురవ జాతివారు తొలుత చేయు నృత్య విశేషము కాలక్రమమున నాయాపర్వతప్రదేశముల స్థల మాహాత్మ్య కథలతోను, శివ విష్ణులీలా కథలతోను మిళితములయి గేయ విశిష్ట నాట్యరూపములను బడసెను. అప్పుడు మాయాకిరాతార్జునీయము. నృసింహస్వామి చెంచీతను బెండ్లాడు స్థలమాహాత్మ్యకథలు (చెంచెత కథ) కురవంజులుగా వెలసెను. ఇట్లు వెలసిన యాదృశ్యరచనములు తొలుత నత్యల్పముగా గేయభాగములును విశేషముగా నృత్యమును గలవై యుండెను. అవి సింగి, సింగడు - అని యిద్దఱు పాత్రములు గలవై సంస్కృత వీథినాటకముల బోలియున్నవి....ఎంతోకాల మిట్లు కొండపట్టులందు సాగుచుఁ బెంపొందిన గేయనృత్య సందర్భములు నగరములకుఁగూడఁ గ్రమముగా వ్యాపించినవి. చెంచులు, కురవలు ... ఆటవికవస్తువులను నగరములకుఁ గొనివచ్చి అమ్ముచు నప్పుడప్పుడు తమగేయ నృత్య విశేషములను నగరములందును, పల్లెలందును బ్రయోగించుటచే నవి నాగరికదేశములందును వ్యాపించినవి.

" ఇట్లు నగరములందు నభిరుచి గొల్పిన యా గేయవిశిష్టనృత్య దృశ్యములు, జక్కులవారు (యక్షులు, కళావంతులు) తర్వాత నగరములందును ప్రయోగింపఁజొచ్చిరి. వీరి ప్రయోగములందు దృశ్యమయిన నృత్యాభినయనములతో పాటుగా నధికముగా గేయ వచన రూపమైన శ్రవ్యరచనముగూడఁ జేరెను. కురవంజులకంటె యక్షగానములు పర్యాప్తముగా శ్రవ్యములగు కవి రచనములు గలవి. వీరి రచనములతో బహువిధములగు పురాణకథలెల్లఁ జేరినవి. కురవంజులలోని సింగి, సింగఁడు పాత్రలు మాత్ర రామ నల హరిశ్చంద్ర సీతా దమయంతీ చంద్రమత్యాది పాత్రలు వచ్చినవి. కాని వీనిలో నాటవిక రచనా సంస్కార సూచకముగా " ఎఱుకలసాని " పాత్రము వెలసినది. కురవంజులలోని దేశి రచనలకంటె నత్యధికముగా వీనిలో దేశిచ్ఛందో బద్ధములగు గేయరచనలు ప్రబలినవి. రాజసభలలో, దేవోత్సవములలో, ఊరి జాత్రలలో యక్ష గంధర్వాది వేషములు ధరించి వేశ్యలు ప్రదర్శించునవి గావునను, నృత్యధర్మములకంటె గేయధర్మము లధికముగాఁగలవి కావునను నివి యక్షగానములనఁబడెను. కళావంతులలో నొక తెగకు నేఁడు జక్కులవారను పేరు గలదు. యక్షాది వేషముల ధరించి నృత్య గాన ప్రదర్శనములను గావించుటచేతనే వారికాపేరు వచ్చియుండును.....యక్షగానము లిట్లువెలసినను ప్రాచీనములయిన కురవంజి రచనములును యక్షగాన రచనా విధాన సంకలితమ్ములై ఈకాలమునఁగూడఁ గొన్ని సాగుచునే వచ్చినవి ... భిన్న పాత్ర వేష ధారణము లేక సింగి, సింగఁడు పాత్రలతో వెలసిన వీధి నాటకములనఁబడు కురవంజులు యక్షగాన రూపమునఁ బెంపొందినపుడు వేష భేదములగల పాత్రభేదములును బెంపొందెను. "

పై వాదము పిండితార్థము కురవంజినుండి యక్షగానము పెను పొందినదనుట. అసలు ప్రభాకరశాస్త్రిగారి వాదమున కుపాధి గల్పిం

చిన సంప్రదాయము కొరవంజిపేరిటఁ గొన్ని యక్షగాన ప్రాయరచనలు తెలుగు కన్నడాంధ్రభాషా సామాన్యముగాఁ గన్పట్టుటయే. అది యథార్థమే కాని యీ వాదమున కొక పూర్వపక్షముగలదు. మొదటివిషయము యక్షగానము పేరితోఁ జక్కఁగొఱవంజిపేరిటి దృశ్యరచనలు 17 శ. కిముందనాఁటివి యే వాఙ్మయమునందును గన్పట్టుట లేదు. కాని కొఱవంజి పేరంతకముండే చాలకాలమునుండి వినవచ్చుచున్న మాట వాస్తవము. అయితే ప్రభాకరశాస్త్రిగారి వాదమెంతవఱకు గ్రాహ్యమన్నిహితమో పరిశీలించుటకు ముందు కొఱవంజి చరిత్రమును, కొఱవంజియక్షగానములసంబంధములును బరామర్శించుటక ర్తవ్యము.

కొఱవంజి శబ్దమున కర్థమును తమిళ కన్నడాంధ్ర నిఘంటువులిట్లు చెప్పుచున్నవి.

1. Kura – Vañci – Woman of the Kurava tribe; fortune teller. A Kind of dramatic poem.

   Vañci (వంజి) = Woman.

   (Madras University Tamil Lexicon)*

2. కొఱవంజి – (కొఱవతి – కొఱవిది) A female of the Koravas, who commonly is a fortune teller. (కుఱవంజి, కుఱత్తి). (F. Kittel's Kannada–English Dictionary)

3. a (కొరవంజి) A gypsy. A gypsy dance; (C. P. Brown's Telugu–English Dictionary)

---

* Ibid. Kuravan. n [T. Korava, K. Korava, M. Kuravan] Inhabitant of the hilly tract, of the desert tract; Kurava, a caste of fowlers, snake catchers, basket makers and fortune tellers. Kuravi. n. [K. Koravanji] a woman of Kurava caste.

Kuri. v. tr. To foretell, predict, forebode; n. Omen, presage.

b (లేక) కుఱవంజి — కొరవజాతిస్త్రీ, ఎఱుకుది (సూర్యరాయాంధ్ర నిఘంటువు)

c — " కొరవంజి అనుపాత్ర ప్రవేశము గల యక్షగాన రచనకు కొరవంజి అనివేరు " (ఆంధ్ర వాఙ్మయసూచిక)

ఉపరి నిఘంటు ప్రతిపాదితార్థములను బట్టి కొఱవంజి శబ్దమునకుఁ గాలక్రమమున నెన్ని యర్థములు గలిగినను గొఱవజాతిస్త్రీ యను నర్థము సమంజస మైనదిగను ప్రాచీనమైనదిగను గన్పట్టును. ఈ శబ్దస్వరూప మేభాషయందును ప్రభాకరశాస్త్రిగారు పేర్కొని నట్లు కొరవ + అంజె యనిగాని, లేక అంజ, అంజయ అనిగాని పేర్కొనఁబడలేదు. అన్నిట 'కొఱ - వంజి' యనియే పేర్కొనఁ బడినది. " వంజి " యనునది తమిళభాషయం దొక స్త్రీ వాచక శబ్దమనుట స్పష్టము.

కొఱవ జాతి గుఱించి వారు దక్షిణ హిందూదేశ ద్వీపకల్పమంతటను వ్యాపించియున్న యొక " దేశద్రిమ్మరి " తెగవారనియు, వారు భిన్న భాషా ప్రదేశములలోనుండుటచేఁ భిన్న భిన్న నామములతో ననఁగా నత్యంత దక్షిణమునఁ గొరవలనియు, నాంధ్రదేశమున నెఱుకలనియు వ్యవహరింపఁబడుచున్నా రనియు, భిన్న భాషలనగాఁ దమిళాంధ్ర కర్ణాటములను గలగాపులగముగా వాడుదురనియు, కొరవలు నెఱుకలు నొక్క-కోవలోనివారు కనుకనే యిరువురకు నెఱుక చెప్పుట వృత్తియై యున్నదనియు, నిరువురును గొల్లాపురమ్మును గొల్తురనియుఁ దెలుగుఁదేశపు నెఱుకలవిషయమున వృత్తివాచక మైన శబ్దమే వారికి జాతి వాచకముగాఁ బరిణమించినదనియు థర్స్టన్

గారి దక్షిణ హిందూదేశపు కులములు తెగలను గూర్చిన యాంగ్ల గ్రంథమునఁ గలదు.

కాని పై గ్రంథమునఁ గొఱవ జాతి ప్రాచీనతనుగుఱించి గాని వారి యాటపాటల గుఱించిగాని చెప్పఁబడలేదు. ప్రాచీన తమిళ మహా కావ్యములలో నొకటియగు శిలప్పదికారమున[32] 'కురవై కూత్తు'* అనఁగా కురవై అను నృత్యవిశేష మొకటి తఱచు పేర్కొనఁబడినది. అది ప్రాయికముగాఁ గురవలలేక కొరవల జాతీయ నృత్యవిశేషమై యుండునని పలువురు పండితుల తలంపు. అది బహుశాభంగులుగా నుండునని శిలప్పదికారము వలననే తెలియుచున్నది. కాని రెండు రకములు మాత్రమే శి. గా. న. పేర్కొనఁబడినవి. ఒకటి విష్ణు (కృష్ణ) ప్రశంసాత్మకముగా గొల్లభామలు చేయునది, రెండవది మురుగన్ (సుబ్రహ్మణ్యస్వామి లేక కుమారస్వామి) ప్రశంసాత్మకముగా కొండజాతి కన్యలు (కొరవంజులు) చేయునది. రెండింటికిని బ్రక్రియలో నించుక భేద మున్నను నవి రాసక్రీడప్రక్రియకుఁ గొంత సన్నిహితముగా నుండును. తన్నిర్వాహకుల కవి పశుజాడ్య దుర్నిమిత్తాది భయాపహాములను విశ్వాసము గలదు. ఈ రెంటికిని వరుసగా అచ్చియర్ కురవై, కుఱవ కుఁరవై అనిపేళ్లు. కడమ కురవైకూత్తు రకములలో కారుఁరవై యనునది శీతకాలానుకూలమైన గీతనృత్యములుగలది; పిఱకొకుఁరవై, ముఱకొకుఁరవై యనునవి రణ జయసూచకముగా రథసన్నిధిని జరుగు

32. దీని రచనా కాలము గుఱించి భిన్నాభిప్రాయములుగలవు. క్రీ. శ. 2 వ శతాబ్దియని శ్రీ వి. ఆర్. ఆర్. దీక్షితారుగారి యభిప్రాయము. (చూ. వారి శి. గా. అనువాదము – అనుబంధము నం. 2).

* Kuravai. n. Dance in a circle prevalent among the women of Sylvan or hill tracts; Chorus of shrill Sound made by women by wagging the tongue, uttered on festive occaoasions (M. U. Tamil Lexicon).

నృత్యములు. ఇవిగాక కొఱ్ఱువై (దేవత?) గౌరవార్థము జరుపఁబడు కూత్తొకటి గలదఁట.[33] పై విషయములలో "కురవై" పేరును బట్టియు నా కూత్తురకములలో నొకటి (కురవక్కురవై) కొండజాతి స్త్రీలచే సుబ్రహ్మణ్యస్వామి ప్రశంసాత్మకముగాఁ బ్రవర్తింపఁబడునది కాఁబట్టియు (కొరవలు సుబ్రహ్మణ్యారాధకులని థర్ట్సన్ గ్రంథమునఁ గలదు. ఆయన భార్యయగు వల్లి తమ యింటి యాడుపడుచని వారి విశ్వాసము)* నది కొఱవంజులకు సంబంధించినదే కావచ్చునని తలంపనగును. అక్కైనఁ గొఱవజాతి యతిప్రాచీనమైన దనియు వారికి గొప్ప నృత్యకళాభిమాన ప్రతిష్ఠలు గలవనియుఁ జెప్పనగును. కురవలు ప్రాక్చారిత్రక కాలమునకుఁ జెందిన యొక కొండజాతి దేశద్రిమ్మరి తెగ వారని శ్రీ వి. ఆర్. ఆర్. దీక్షితారుగారి యభిప్రాయము.† కాని కడమ కురవై కూత్తు రకములకును వారికిని సంబంధముండి నట్లూహింప నశక్యము. అట్టి సంబంధ ముండినట్లూహింప నవకాశము గల యా కురవక్కురవై యైనను వారిజాతీయ వృత్తిసంప్రదాయముల కంత సన్నిహితముగా లేదు. అందుచే నింతకంటె బలవత్తరమగు నాధారము నన్వేషింప వలయును. మదరాస విశ్వవిద్యాలయ తమిళ నిఘంటువు కురవై యనఁగా నటవీ గిరి ప్రదేశ జాతిస్త్రీలలోఁ బ్రాచుర్యము వహించిన యొక మండలనృత్యమని మాత్రము పేర్కొన్నది. ఇది యపర్యాప్త నిర్వచనము. వెన్బామాలై అనుతమిళ గ్రంథమున

33. పై విషయముల గుఱించి వివరములకు శ్రీ వి. ఆర్. రామచంద్ర దీక్షితారు గారి శిలప్పది కారాంగ్లానువాదము, పీఠిక, ఆధోజ్ఞాపికలు – పుటలు 49, 50, 59, 229, 231, 238, 275, 277, 280, 281, 288, 297, 302, 305 చూడఁదగును.

* Ibid, పుటలు 281, 280.

† పుట 288. ఆధోజ్ఞాపిక నం. 5.

(111 - 7) "కొఱ్ఱవంజి" యనుపేరు గన్పట్టుచున్నది. కాని యది యొక జయగీతము మాత్రము. (చూ. Tamil Lex.) ("అపరాజిత భూరి భుజా కృపాణధారాజల శాంతశాత్రవ పరాగు" డగు నొక రాజేంద్రుని ప్రశంస యందలి విషయమగును) కురవంజి యను నది తమిళ దేశపు దొంబదియాఱు ప్రబంధములలో నొకటిగాఁ బేర్కొనఁబడినది.[34] కుఱత్తిప్పాట్టు [35(a)] :- పన్నిరుప్పాట్టియల్, ఇళక్కణ చిందనై మొదలగు తమిళ లక్షణగ్రంథములందు కుఱత్తిప్పాట్టు (కుఱవతపాట) పేర్కొనఁబడినది. అది మొదట కుఱత్తి చెప్పు కురి(ఎఱుక)విషయముగా గల కురమ్ అను పద్యరూపమున నుండెడిదట. తదుపరి యీకురమ్ కలంబక మను ప్రబంధమున నొక యంకముగాఁ బరిగణింపఁ బడినదట. వీనిపరిణామమే కురవంజి దృశ్య రచనమునకు దారితీసినదట. ఇట్టి దృశ్య రచనములు క్రీ. శ. 17 వ శతాబ్దికిముందు గానరావని తమిళ వాఙ్మయ పరిశోధకుల తలంపు.[35 (b)]. మలయాళమున "కొరత్తి యాట్టమ్" అను పేర నీదృశ్య రచనము ప్రయోగింపఁ బడుచున్నది.[36]

---

34. చూ. ఆం. ల. పు. భాం. తమిళ గ్రంథముల త్రైవార్షిక నివేదిక. రెండవభాగము, ఆర్. నం. 178 – మద్రాసునందర్ కురవంజి గూర్చినవక్కణ.

35 (a). KurattipPāttu - a Poem in which a Kurava woman is represented as describing to a maiden her fortune in a love affair. (M. U. Tamil Lexicon).

35 (b) చూ. శ్రీ ఎన్. పార్థసారథిగారి "కురవంజి నాటకము" అను తమిళ వ్యాసము – ఆముద సురభియను మదరాసు తమిళ మాసపత్రిక 1954 సం. డిశెంబరు సంచికలో ప్రకటితము.

36. Vide., 'The Music of the Nrtya Natakas of South India' - Thesis Submitted by Srimati K. Gomati for the M. Litt of the Madras University. (A Ms. copy of it is kept in that University Library)

కన్నడమునఁ గొరవంజి వేరనే కొన్ని రచనములిట్టివి వెలసినవి.[37] ప్రాకృత భాషలోను, మహారాష్ట్రభాషలోఁగూడ నొక్కొక్క కొరవంజి వెలసియుండుట విశేషము.[38] ఇంవెద్దియు నంత ప్రాచీనమైనదికాదు. అన్నియుఁ బదునేఁడవ శతాబ్ది కిటీవలివే. ఇఁకఁ దెనుఁగునఁ గొరవంజికి గల ప్రసక్తి యెట్టిదో పరిశీలింపవలసి యున్నది. ఆంధ్ర వాఙ్మయమున మొట్టమొదటగా నెఱుకతపాత్ర ప్రవేశమునకు, నామె యెఱుక చెప్పు ఘట్టమునకును నొక భంగ్యంతర ప్రసక్తి బమ్మెర పోతనామాత్యుని కృతియని చెప్పఁబడు వీరభద్రవిజయము నందుఁ గన్పట్టును. కాని కొరవంజి శబ్దము ప్రప్రథమముగాఁ గన్పట్టుట అయ్యలరాజు రామభద్రకవి (16 వ శతాబ్ది) రామాభ్యుదయము నందు :-

అణునిభ మధ్య లాక్రీయలు నాపరి భాషలు నొప్పఁజిందు జ
క్కిణి కొరవంజి మేళములఁ గేళికసల్పిరి దేవతా నటీ
మణులకు బొమ్మవెట్టుక్రియ మర్దళతాళ నినాదపద్ధతిన్
రణదురు రత్ననూపుర ఝణం ఝణముల్ మెఱయంబదాహతిన్.

(ఆశ్వా 2 - పద్య 131)

(" మేళముల " అనుటకు " వేషముల " అనుపాఠాంతరము గలదు). జక్కిణితోపాటు కొరవంజియు నొకనాట్య ప్రభేదముగఁ బేర్కొనఁబడుట విశేషము. తంజావూరి విజయ రాఘవ నాయకుని

37. eg. 'Parvati Koravanji' By Venkayya G. O. M. L. Kannada Mss. D. No. 1203.

38. (Ofcourse by accident) a. Prakrit Koravanji G. O. M. L. Kannda Mss. D. No. 1128, Kanthirava Narasaraju Melana Natakagalu-- No. 4.

b. Marathi-- 'Devendra Kuravanji' by Serfoji II; Saraswati Mahal publication., Tanjore, 1950.

(క్రీ. శ. 1631 - 1673) రఘునాథనాయకాభ్యుదయము[39] ప్రహ్లాద చరిత్ర[40] లందును జక్కిణితోపాటు కొరవంజి నాట్య ప్రభేదముగనే పేర్కొనఁబడినది. ఆంధ్ర యక్షగానములలోఁ గొరవంజి వాలక మీ విజయరాఘవుని కాలమునుండియే కన్పట్టును. తదంకితములుగా వెలసిన యక్షగాన నాటకములలో+ (1) మన్నారుదాసవిలాసము. (2) విజయరాఘవచంద్రికావిహారము. (3) విజయరాఘవకల్యాణము నను వానిలో నెఱుకఫుట్టము గలదు. అందు వి. రా. చం. వి., వి. రా. క. లం వెఱుకత కొరవంజిగాఁ బేర్కొనఁబడినది. ఆ రెండింట గొరవంజి వేషభాషలు వర్ణితములైన దరువులపేరు "కొరవంజిదరువు" లని యుండుట గమనింపఁ దగినది. అప్పటిమట్టునకుఁ గానరాదుకాని యీ మలితరము నుండియే కొరవంజిశబ్దమే తాదృక్కాఁవ్య వాచిగాఁ బ్రయుక్తమగుట గన్పట్టును. అనఁగా జక్కిణిశబ్దమువలెఁ గొరవంజి శబ్దముగూడ మొదట నొకజాతి స్త్రీవాచకమై, ఆ జాతి స్త్రీ యాటపాట లాదికారణములుగా నొక నాట్య ప్రభేదమునకు నొక గీతప్రబంధ మునకును బిమ్మట నొకవిధమగు దృశ్య రచనమునకును బేరగుట గమనింపఁ దగినది. ఆ పరిణామ క్రమము సహజమైనదిగనేతోఁచును.

క్రీ. శ. 1684 - 1712 సం. ల నడుమఁ దంజావూరినేలిన మహా రాష్ట్ర ప్రభువగు శహాజీ యాస్థాన కవియైన దర్భా గిరిరాజకవి రచించిన రాజమోహన కొరవంజియు,[41] క్రీ. శ. 1704 - 1713 సం. నడుమ

---

39. తం. స. మ. ప్రచురణ. సం. 34. 1951. పుట 21.

40. తం. స. మ. కే. సం. 541. అవతారిక.

+ (1) ఆం. సా. ప. ప్రచురణ, 1927. (2), (3)- తం. స. మ., కే. సం. 603, 602.

41. తం. స. మ, కే. సం, 509 - 511, 570 - ఇందు కొరవంజి, ఎఱుకత, సింగి యను పదములు సమానార్థకముగాఁ బ్రయోగింపఁబడినవి,

మైసూరియొడయఁ డగు కంఠీరవ నరసరాజు రచించిన కొరవంజి కథ్లెయుఁ[42] దెలుఁగు కొరవంజులలో మొట్టమొదటి తరమునకుఁ జెందినట్టివి. అవి కొరవంజి పాత్రకుఁ బ్రాధాన్యము గలవి. ముందు నాటి విజయరాఘవ చంద్రికా విహారాదు లందుఁ గొరవంజి పాత్రకుఁ బ్రస క్తి యున్నను నవి కొరవంజులని వ్యవహరింపఁ బడకపోవుటకుఁ గారణము అప్పటికిఁ గొరవంజికి దృశ్యకావ్య ప్రసిద్ధి లేకపోవుట కావచ్చును. లేక యా గ్రంథములందా పాత్రయుఁ గడమపాత్రలతో పాటొకటియై తగిన ప్రాధాన్యము దక్కియుండుటఁ గావచ్చును. అందుచేతనే కాఁబోలు గిరిరాజ కంఠీరవ రాజుల కృతులకుఁ బిదప నెఱుకత పాత్రతో నేతాదృగ్రచనము + లనేకము వెలసియున్నను గొన్ని మాత్రమే కొరవంజులని వ్యవహరింపఁబడినవి.

ఇఁక బ్రకృతము – అట్లు వెలసిన కొరవంజులకును యక్షగానము లకును గల సంబంధము పరిశీలించుట కర్తవ్యము. ఆరెండు ప్రక్రియలును దక్షిణ భారతదేశ ప్రముఖభాషలగు తమిళ కర్ణాటాంధ్రములందు మూఁడింటను వెలసియుంట విశేషము. కొరవంజులపేరఁ దమిళ కర్ణా టాంధ్ర ప్రాకృత మహారాష్ట్రములందు వ్యవహరింపఁ బడుచున్న దృశ్య రచనములన్నియుఁ గొరవంజి పాత్రవిశిష్టములు. అన్నిటను రచనాప్రక్రియ యచ్చుమచ్చు మన యక్షగాన రచనా ప్రక్రియా

42. ప్రా. లి. పు భాం. కన్నడ గ్రంథములు – డి. నం. 1128. ఇందీతఁడు తమిళ కన్నడ ప్రాకృతములందు రచించిన కొరవంజులను గలవు.

+ ఆర్వాచీన ప్రబంధములఁదును గొన్నిట గొరవంజి పాత్రకుఁ బ్రస క్తి కన్పట్టును. ఉదా :– (1) శుకసప్తతి (I, 95 – 100) ; (2) దశావతార చరిత్రము, VII. 285 – 290 ఇందు జక్కిణిపెంట కొరవంజి నృత్యవిశేషముగనుగూడ సూచింపఁ బడినది.) (3) వేంకటాచలమహాత్మ్యము (V. 6 – 32. ఇందెఱుక ఘట్టము సుదీర్ఘముగను సుందరముగను వర్ణితము).

సంవాదిగా నున్నది. కొన్ని కొరవంజులు యక్షగానము లనియే పేర్కొనఁబడినవి. ఉదా : పార్వతి కొరవంజి యను కన్నడ కొరవంజి గ్రంథారంభమున గ్రంథకర్త "కొరవంజి కక్లై యక్షగానక్క కథా ప్రారంభవ దెంతనె" యని వక్కాణించినాఁడు. సన్నిధిరాజు జగ్గకవి యను తెనుఁగుకవి తను రచించిన "ఎఱుకల కురవంజి" యను గ్రంథమును + "కురవంజి యక్షగానమహాప్రబంధంబు" అని యవతారికలోను గ్రంథాంతగద్యయందును బేర్కొనియున్నాఁడు. అనఁగాఁ గొరవంజియు యక్షగానమును రచనా ప్రక్రియలో నభిన్నము లనియును, గొరవంజి పాత్ర ప్రధానములైన యక్షగాన రచనలకే కొరవంజి మరియొక పేరుమాత్రమనియు గ్రహింపనగును. ప్రదర్శన ప్రక్రియలోఁగూడ యక్షగానము, కొరవంజి - రెండును నృత్య కళాత్మకము లగుట వాని సంబంధమును జక్కఁని కొరవంజి నృత్యములు పూర్వప్రబంధములందు జంటగా పేర్కొనఁబడి యుండిన విషయముగూడ సమర్థింపఁ గల దేమో ! కాని కొరవంజినుండియే యక్షగాన ముత్పన్నమైన దనుటకుఁ బ్రబల ప్రతిబంధకములు కొన్నిగలవు. మొట్టమొదటి సంగతి కొరవంజి శబ్దము యక్షగాన నామోత్పత్తిని సమర్థింపలేదు. పోనీ కొరవంజులే ప్రాచీనములు, వానిని జక్కులవారు ప్రయోగింప మొదలిడిన నాటి నుండియే వానికి యక్షగానమను వ్యవహారము గల్గియుండు నన్న చో నందులకు సమాధానము కొరవంజిపేరిట యక్షగాన ప్రాయమైన దృశ్య రచనము క్రీ. శ. 17 వ శతాబ్దికి ముందు వెలసిన జాడ గానరాదు. పదునేఁడవ శతాబ్దికి ముందు వెలసిన యక్షగానములు మాత్రము నేఁడుపలబ్దము లగుచున్నవి. కొరవంజులన్నిట కొరవంజి పాత్ర కాన వచ్చుచున్నట్లు యక్షగానము లన్నిట నాపాత్ర గానరాదు. ప్రాచీన యక్షగానములందా పాత్రకుఁ బ్రాముఖ్యముండి యదికాల

+ పా. లి. పు. భాం., డి. సం. 1852.

క్రమమున దిగజారి యుండవచ్చునన్నచో బదునేడవ శతాబ్దికి ముందు నాఁటి యక్షగానము లుపలబ్ధమగుచున్నవి కదా, యందొక్కదాని యందును నాపాత్రప్రసక్తి కానరాకుండుటేల యను ప్రశ్న వచ్చును. అదికాక 17 శ. నుండియే యక్షగానములందా పాత్రకుఁ బ్రాముఖ్యమతి శంచించినట్లు తోఁచును. అందుచేతను నీనాఁ డుపలబ్ధములగుచున్న కొరవంజి దృశ్యరచనలకంటెఁ బ్రాచీనములైన యక్షగానములు గన్పట్టుచుండుటచేతను యక్షగానమునుండి కొరవంజి పుట్టినదనుట యెంత సమంజస మగునో, కొరవంజినుండి యక్షగానము ప్రాదుర్భవించిన దనుటయు నంత సమంజసమే యగును. అనగా నారెంటికిని బరస్పరజన్యజనక భావసంబంధము లేదనుటయేకాని సంబంధమసలే లేదనుట పొసగదు గదా. అది యెట్టిదో పైని వివరింపఁబడినది. మఱి యీ సంబంధ మేర్పడుటకుఁ గారణ మేమై యుండునను ప్రశ్న వెన్నంటివచ్చును. క్రీ. శ. 16 - 17 శతాబ్దుల నడుమనొక నూఱేండ్ల పైచిలు కాంధ్రనాయక రాజులు దక్షిణదేశమును బరిపాలించుట తటస్థించినది. అందు దమిళనాఁటు నడిబొడ్డగు తంజావూరున విజయరాఘవ నాయకుని కాలమున నాంధ్ర యక్షగాన వాఙ్మయ మభ్యుచ్ఛ్రీయ మందినది. చమత్కార జనకత యొక ముఖ్య ప్రయోజనమై యానాఁడు యక్షగాన మొకచాటు కావ్యముగాఁ బరిగణింపఁబడినది. ఆ కవులకుఁ దాత్కాలిక విషయములు నందు వైవిధ్యమునుపాదేయము లైనవి. సమకాలిక జాతీయజీవన ప్రతిబింబన మా యక్షగానముల కొక జీవలక్షణముగాఁ దోచును. విజయ రాఘవా స్థానమున వెలసిన యక్షగానములలో నాఁటి వివిధ రాజాస్థానోద్యోగులు, పండితులు, కవులు, పురోహితులు, ముత్తైదువలు, గొల్లలు, చెంచులు జక్కులసాని మొదలగువారి పాత్రలు వేషభాషా విశేషములు జాతివార్తాచమత్కార చారువులుగాఁ జిత్రింపఁబడినవి. అట్టిచో

నట్టి యక్షగానములందు కొరవంజియు నొకపాత్ర యగుటలో వింత లేదు. కొరవంజు లెంత గిరికానన వాసినులైనను దఱుచు పురములు జొచ్చి ప్రియకాంక్షులైన పురంధ్రుల కెఱుక చెప్పుట వారిముఖ్యవృత్తి. వారి యాటవిక మైన వాలకము పలుయాసలబాస, "కురి" చెప్పునపుడొక కూనరాగముతో నెఱుక దేవుళ్ళ నేకరువు పెట్టునొడుపు మొదలగు విషయములు జాతివార్తా చమత్కార ప్రియులైన నాఁటి యక్షగాన కవుల నాకర్షించి యుండును. లేక కొరవంజి యప్పటికే తొంబదియాఱు తమిళ ప్రబంధములలో నొకటిగా, బరిగణింపఁ బడుచుండినచో నా తంజావూరి తెలుఁగు కవులు తమ యక్షగాన రచనలలో దానిపోకడను గ్రహించిరేమో! తమిళదేశమున నాంధ్ర రాజుల కాలమున నట్టిది సంభావ్యముగదా + అంతియకాక భరత విద్యా ప్రియంభావుకులగు నాయకరాజులు బహువిధ దేశీయ నృత్య గీత ప్రబంధ విశేషములయెడ నత్యంతాదరము జూపినట్లు వారి వాఙ్మయము సాక్ష్యమిచ్చుచున్నది. ++ అందు జక్కిణి, కొరవంజు లకుఁ గూడ వారి యాదరము లభించినది. మన వాఙ్మయమున నా రెండును దఱుచొకదానివెంట నొకటి జంటగాఁ బేర్కొనఁబడుటఁ జూడ నారెండింటికి నేదో సాదృశ్య ముండినట్లు తోఁచును. కాని యాంధ్ర ద్రవిడ దేశములం దవి సమానాంతరముగాఁ బరస్పరాను

+ విజయరాఘవ రచిత రఘునాథాభ్యుదయమునందు దొంబడి యాఱు తమిళ ప్రబంధములలో నొకటియగు "ఉలా" ప్రబంధపు పోకడగలదు. చూ. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి పీఠిక,

++ చూ. విజయరాఘవుని ప్రహ్లాదచరిత్ర, చెంగల్వ కాళకవి రాజ గోపాల విలాసముల యవతారికలు. (రా. గో. వి. నఁగూడ జక్కిణితోపాటు కొరము, కొరవంజి దృశ్యరచనకు మూలమైనది, నాట్యబంధముగాఁ బేర్కొనఁ బడినది. 1 - 23)

బంధ నిరపేక్షముగనే వర్థిల్లుచు వచ్చియుండును గాని వానికతి ప్రాచీనమైన సంబంధ ముండిన చొప్పు గానరాదు. ఏమైన సంబంధ మేర్పడి యుండిన నది నాయకరాజుల కొలువులోనే యేర్పడి యుండె నేమో! ఒకవేళ గొరవంజి యక్షగాన ప్రాయమైన దృశ్యాత్మక సాహిత్య ప్రక్రియగా వెలయుటకు నాయకరాజుల కృషియే మూల కారణ మగునేమో! అసలు యక్షగానము తమిళుల కాంధ్రులు పెట్టిన భిక్షగనే తోచును. + ఇదినిజమైనను గాకపోయినను వేటూరి వారి వాదము నిలువఁజాలదను విషయము మీఁద నిరూపింపఁబడినది. అసలు వారి కురవంజివాదము. యక్షగానము మాట యటుండ సంస్కృత నాటకోత్పత్తి విషయము దాఁక నరసాగినది. "దేశిరచన లలో నుండి సింగి, సింగఁడు, కోణంగి, దరువు అనునవి నటీనటులుగను విదూషకుండుగను ధ్రువగను సంస్కృత నాటకములఁ జేరనేమో యని కూడ యోజింపఁదగినట్లున్నది." అని యనియున్నారాయన. * అట్లే "కురవంజులలోని సింగి, సింగఁడు పాత్రలు మారి రామ నల హరిశ్చంద్ర సీతా దమయంతీ చంద్ర మత్యాదిపాత్రలు వచ్చినవి." అని యక్షగాన విషయమున ననియున్నారు. కాని యట్లు సింగి, సింగఁడు పాత్రములకు మాఱుగా రామ నలాదిపురాణ ప్రసిద్ధములగు

+ తంజావూరు నాంధ్రనాయక రాజుల పాలించిన కాలమున నిట్టిది సంభావ్యముగదా, నాయకరాజులకు ముందునాఁట యక్షగానములు తమిళమున లేవు. తెనుఁగు య. గా. లనే కొన్నిటిని తమిళకవులు "తర్జుమా" చేసికొని యుండుట విశేషము. ఉదా :- రాజగోపాలన్ అను కవి రచించిన "సుక్కిరీవ విజయం" అను తమిళ యక్షగానము. (ప్రా. లి. పు. భాం. డి. నం. 509 – 511) మన కుందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయమున కనువాద ప్రాయమైనది. (తమిళయక్ష గానములంటైన నన్నిటను గొరవంజి చాత్రలేదు. అందులకు నీ సుక్కిరీవ విజయమే తారాక్ష్యము)

* సుగ్రీవ విజయ పీఠిక పుటలు 6 – 7.

పాత్రములు యక్షగానములందుఁ బ్రవేశించెననుట "సబబు" కాదు. పురాణపాత్రలకును సింగి సింగఁడు పాత్రలకును నేకత్ర ప్రస క్తిగల యక్షగానము లనేఁ గలవు.[43] ఎటుజూచినను వేటూరివారి వాదము నిలుచునట్లు లేదు. కాని వారి వాదసందర్భమున యక్ష గానము గుఱించి చెప్పిన యితర విషయము లనేక మమూల్యము లైనవి. అవశ్యము గ్రాహ్యములును. వారును యక్షగానమునకు జక్కుల వారితోఁ గల సంబంధము గుర్తించియుంటఁ గమనింపఁదగినది.

వేటూరి వారి కొరవఁజి - యక్షగాన సంబంధ వాదమును ప్రతిపాదించిన దినములలోనే మఱికొంత మంది పండితులు నట్టి యభిప్రాయములనే వెలిబుచ్చిరి. శ్రీ చింతా దీక్షితులుగారు "కొన్ని యక్షగానాలలో కొరవంజి పాత్ర వుంటుంది. అట్టి యక్షగానాలకు కొరవంజులని పేరు ..... తెలుగు యక్షగానాలు ప్రశస్తమైన వాఙ్మయ శాఖ అనిన్నీ, ద్రావిడ వాఙ్మయంతో సంబంధం కలవి అనిన్నీ వెల్లడి అవుతోంది." అని ప్రాసియున్నారు.[44] నిన్న మొన్నటి దనుక జాలమంది పెద్ద లీ వాదమునే యామోదించుచు వచ్చిరి. ఆచార్య శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనముగారు "రూపకావిర్భావములో మొదటిదశ కురవంజులు వెడలుట ..... కురవంజులు అటవికుల మూలమున పట్టణములకు ప్రాకి నగరకవులు కురవంజుల వంటి రచనలు చేయసాగిరి. వీనిని ప్రదర్శించువారు జక్కులు గనుక నివి యక్షగానములను పేరుదాల్చెను." అని వేటూరివారి వాదము

43. తరిగొండ వెంగమాంబ శివవిలాసము, కొరిమెల్ల కురవంజి (ప్రా. లి. పు. భాం. ఆర్ సెం. 978)

44. చూ. వారి "కొరవంజి" అను వ్యాసము - ఆంధ్రపత్రిక ప్రమాది సంవత్సరాది సంచిక

నామోదించిరి. వీరును యక్షగాన నామోత్పత్తి విషయమున జక్కుల జాతిసంబంధము నవశ్యము నంగీకరించిన వారే.[45]

మొట్టమొదటగా నీకొరవంజి - యక్షగాన జన్యజనక సంబంధ వాదము పాదు నగల్చి "కొరవంజినుండి యక్షగాన ముత్పత్తి యాయెనని చెప్పుట సరికా" దని నిరూపించి,[46] యక్షగానోత్పత్త్యభ్యుదయములఁ గూర్చిన పరిశోధనలో విశేషకృషి సల్పి పూర్వ పరిశోధకులకంటె నెక్కుడు విశేషములుదెల్పి భావిపరిశోధకులకు మార్గదర్శకులైనవారు డాక్టరు శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు. యక్షగానోత్పత్తి విషయమై వారి యభిప్రాయము లెట్టివో తెలిసి కొనుట యవశ్యకర్తవ్యము.

-: (3) బొమ్మలాట - యక్షగానము+ :-

బొమ్మలాటల పరిణామమే యక్షగానమని శ్రీ వెంకట రమణయ్యగారి యభిప్రాయము. "యక్షగానములు మతప్రచారము కొఱకు ప్రభవించినవిగాని వేడుక కొఱకుఁగాదు. మతబోధ కొఱకు మన ప్రాచీను లవలంబించిన మార్గములలోఁ బురాణేతిహాసాదులలోని గాథలను జన సామాన్యమునకుఁ గన్నుల గట్టునట్లు ప్రదర్శించి చూపుట యొకటి. బౌద్ధమత ప్రచారమునకు అశోక చక్రవర్తి యీ మార్గమును ననుసరించి నట్లాతని శాసనములవలనఁ దెలియుచున్నది. నుత ప్రచారమునకు మిక్కిలి యనుకూలమైన సమయములు యాత్రలు, వీనిని మనము జాత్రలనియు దిరునాళ్ళనియు జెప్పుదుము. ఆసమ

45. చూ. వారి "ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము" - పుటలు 208-210.

46. చూ. వారి "యక్షగానము. తంజావూరు" అను వ్యాసము - ఆంధ్ర పత్రిక ఖర సంవత్సరాది సంచిక. (1951 - 52).

+ ఈవిషయమై యిదివఱకొక వ్యాసము ప్రకటించి యుంటిని. చూ. భారతి ఆగస్టు, 1955.

యములందు కూడ వేలకొలది జనులను వినోదపెట్టుచు దన్మూలమున ధర్మబోధన సేయుట కొఱకే ప్రదర్శనము లేర్పడినవి. ఇట్టి ప్రదర్శనము లాద్యమున కొయ్యబొమ్మల మూలమునను దోలుబొమ్మల మూలమునను సాగెడివి. సూత్రధారుడు - అనగా బొమ్మలకుగట్టిన దారములను ధరించువాడు - కథను గేయముగ బాడుచు దదనుగుణముగ దారములను లాగి బొమ్మల నాడించువాడు. ఇట్టి బొమ్మలాటలు శివరాత్రి మహోత్సవ సమయమున శ్రీశైలమునందు ప్రదర్శించు వారని పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రమున గలదు.

భారతాది కథల చీర మఱుగుల
నారంగ బొమ్మల నాడించువారు
కడు సద్భుతంబుగ గంబ సూత్రంబు
లడరంగ బొమ్మల నాడించువారు

ఇందొకటి తోలుబొమ్మలాట. మఱియొకటి కొయ్యబొమ్మలాట. ఈ బొమ్మలాటల పరిణామమే మన యక్షగానము. కాలక్రమమున బొమ్మలకు బదులు మనుజులే ప్రదర్శించిన నెక్కుడు ప్రయోజన కరమగునను నభిప్రాయము గల్గినది. కథలయందలి పాత్రల కర్హమైన వేషములను ధరించి నర్తకులు ప్రదర్శింప గడంగిరి. తోలుదొల్ల బొమ్మలాట సంప్రదాయము ననుసరించి మూకనాట్యముగ ప్రారంభమైనది. సూత్రధారుడును నతని తోడివారును గేయరూపమైన కథను బాడుచుండగా నుచితవేషధారులైన నర్తకులు తదనుగుణముగ నభినయము సేయుచు నాట్యము సల్పెడివారు. కేరళదేశమున నేటికిని వాడుక యందుండు కథకళి దీనికిఁ దార్కాణ. నర్తకులు మూక నాట్యముతోఁ జిరకాలము తృప్తినంది యుండలేదు. కొయ్య, తోలు బొమ్మలవలె సూత్రధారుని పాట కనుగుణముగ నాడుట వారికి

నచ్చలేదు. రెండుకార్యములను దామే నిర్వహించిన స్వారస్య మితోధి కముగ నుండునని యెంచి తామే పాడుచు తదనుగుణముగ నభినయము సేయుచు నటింపఁ గడగిరి. అంతట మూకనాట్యము యక్షగానముగ బరిణామ మందినది." [47]

వెంకట రమణయగారి వాదమును బరిశీలించుటకు ముందు సంగ్రహముగా బొమ్మలాట చరిత్రమును, దానికి యక్షగానముతోఁ గల సంబంధమును బరామర్శించుట లెస్స.

అతిప్రాచీన కాలమునుండియు మనదేశమునందు బొమ్మలాట యొక ప్రసిద్ధజానపద వినోద కాలక్షేపముగా నొక నిసర్గమనోజ్ఞ కళా స్వరూపముగాఁ బరిఢనిల్లుచు వచ్చినది. అసలు వెంకటరమణయ్య గారు సూచించిన పరిణామక్రమ ప్రకార మదేరూపకోప స్థితికి దారి తీసిన దనవచ్చు. + బొమ్మలాటకు బ్రహ్మవంటివాఁడు సూత్రధారి. సూత్రధారి శబ్దము తరువాత తరువాత నౌపచారికముగా రూపక ప్రస్తావనల కెక్కినను బొమ్మలాటకుఁ గుదిరినంతగా రూపకమునకుఁ గుదురదు. సూత్రముపట్టుకొనినఁగాని బొమ్మల యాటయేలేదు. అందుచేతనే యీ మాట పుట్టియుండును. బొమ్మలాటకుఁ గానుపు లయినవని యూహింపఁదగిన రూపకములందును గొన్నిటనున్న సూత్రధారుని వాలక మాస్మృతిచిహ్నమని చెప్పవచ్చును. అశోకుని శాసనములలో విగ్రహ ప్రదర్శన సూచన యున్నదనగా, భరతనాట్య శాస్త్రములో సూత్ర ధారప్రస క్తి యున్నదనఁగా గ్రీస్తుపూర్వము రెండు మూడు శతాబ్దుల

47. చూ. వెంకటరమణయ్య గారి "మధుర తంజావూరు నాయక రాజుల నాటి ఆంధ్రవాఙ్మయచరిత్ర" అనుగ్రంథము – అయిదవ ప్రకరణము.

+ శ్రీ ఎ. బి. కీతుపండితుని వాదమునకు చూ. ఆతని 'Sanskrit Drama' అనుగ్రంథము, పుట 52–57. ఈ విషయమింకను విచార్యము.

నాఁటికే బొమ్మలాట ప్రదర్శనములు మన దేశమున వ్యాప్తి నందినవని యూహింపనగును. సంస్కృత మహాభారతమునఁగల (XIICCXCV-5) రూపోప జీవన మను విషయమును గుఱించి నీలకంఠ పండితుఁ డిట్లు వ్యాఖ్యానించినాఁడు :— "రూపోపజీవనం జాల మండపికేతి దాక్షిణాత్యేషు ప్రసిద్ధమ్, యత్రసూత్కృవస్త్రం వ్యవధాయ చర్మమయై రాకారైః రాజా మాత్యాదీనాం చర్యాం ప్రదర్శతే" అని.[48] అనఁగా రూపోప జీవన మనునది జాలమండపిక యనుపేర దక్షిణదేశమునఁ బ్రసిద్ధమైనది. అందు పలుచని బట్టపైఁ జర్మ పుత్రికల ద్వారమున రాజామాత్యాదులు చర్యలు ప్రదర్శింపబడును — అని యర్థము. ఇచట రూపోపజీవన మను మాట గమనింపఁదగిది. రూపోరోపము వలన నేర్పడు రూపక కళావిర్భూతికిఁ గారణభూతమై యుండు నన్ఁ దగిన బొమ్మలాట కాపేరెంతయుఁ దగియున్నది. దీనినిబట్టి బొమ్మలాట ప్రాచీనత యింకను వెనుకకుఁ బోవును. క్రీ. శ. 10 శతాబ్దినాఁటి కివి దేశాంతరములకుఁ గూడ వ్యాపించినవి. జావాలో వీనిని వాయంగ్ క్లిటిక్ (కొయ్యబొమ్మలాట). వాయంగ్ పూర్వ (తోలుబొమ్మలాట) అనియు నందురు. అందు మన రామాయణ మహాభారతగాథలే ప్రదర్శింపఁబడుచుఁ బ్రజాదరము బొందుచుండుట విశేషము.[49] ఆగాథలు "లాకన్లు" అను రచనావిశేషము ద్వారమున నాఖ్యాతము

48. ఈవిషయ మిచట డా. ఎమ్. కృష్ణమాచారి 'History of Classical Sanskrit Literature' అను గ్రంథము (Item No. 170) నుండి గ్రహింపఁబడినది.

49. చూ. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి "వాయంగ్ ఆటలు — జావా ద్వీపవాసుల వినోదములు" అను వ్యాసము – ఆంధ్రపత్రిక ప్రమాది సంవత్సరాది సంచిక.

లగుచుండును.[50] దక్షిణాసైనా దేశమున ఫుకీన్ రాష్ట్రమునఁ దోలు బొమ్మలాటల చరిత్రను సంగ్ వంశ రాజుల కాలము (క్రీ. శ. 960—1279) నుండియుఁ గనుగొనవచ్చును. బౌద్ధగాథలు, జానపద గాథలు నితివృత్తములుగా నత్యంత మనోహరమైన సంగీతము కథా వాహికముగాఁ గల నాటక రచనలా బొమ్మలాటల కుపయుక్తము లగుచుండెనని తెలియుచున్నది.[51] క్రమక్రమముగా బొమ్మలాట ప్రపంచవ్యాప్తమైన ప్రతిష్ఠ గడించినది. ఆంధ్రదేశము నందును బొమ్మలాటలు చాలకాలమునుండి ప్రచారము నందుండిన ట్లూహింప నగును. చాలకాలమునుండి మన వాఙ్మయమున బొమ్మలాటలప్రస క్తి తఱుచుగనే కన్పించును. పాల్కురికి సోమనాథుఁడు భారతాది కథలు మన బొమ్మలాట ప్రదర్శన వస్తువులని వ్రాయ్చినాఁడు.

ప్రతి బొమ్మలాట ప్రదర్శనమునకును నేదో యొక కథావలం బన ముండును. అయితే ఆ కథాఖ్యానమున కుపయుక్తమైన రచనా పద్ధతి యెట్టిది యనునది పుణు పరిశీలనార్హమైన విషయము. బొమ్మల నాడించుచుఁ దెరవెనుకనుండి పద్యములలో, పదములలో దరువులలో నాయాపాత్రల ప్రవేశ ప్రసంగాదులతోఁ గథ నడుపుచు నడుమ సంధి వచనములతో నప్రదృశ్య కథాను సంధానము చేయవలయును. అందులకు సాహిత్యము నాశ్రయింపవలెను. బొమ్మలాటలలోఁ గేవల గద్య రక్తిగట్టదు. అందుచేతనే యే దేశములోనైనను బొమ్మలాట ప్రదర్శనకు వెనుక గేయభాగాధికమై యుపయుక్తమైన రచనయే ప్రయోగింపఁబడుట పరిపాటి. పాశ్చాత్యదేశములలో సాధారణ

50. "The Mahabharata and the Wayarng in Java" By Dr.B. R. Chatterjee – 'India and Java' (Greater India Society Bulletin No. 5. Part I, PP. 48–50.)

51. Vide., PP. 15 of 'Folk Arts of New China' – The Foreign Languages Press Publication, Peking, 1954.

ముగా "ఓపెరా" లను గేయనాటికల నుపయోగింతురు. వాని యుపయోగమును గూర్చి యొక గ్రంథము[52] లో నిట్లు వివరింపఁ బడినది.

"Musical plays and operas if specially arranged, can be given by puppets. One advantage of opera on the puppet stage is that the conventional gestures of the Singers are well within the capacity of the puppet but besides there is the possible influence any production might have towards increasing interest in the opera".

అనఁగా గేయనాటికల నొక ప్రత్యేకదృష్టితో రచించినచో వానిని బొమ్మలతోఁ బ్రదర్శింపవచ్చును. అట్లు ప్రదర్శించుటలోఁ గేవల గేయనాటక ప్రదర్శకులు సాంప్రదాయికముగాఁ జూపవలసిన యభినయాంశముల నాబొమ్మలే యాడుకొనఁ గలవు. జావాది ద్వీప వాసుల లాకన్లు మొదలైన విట్టివే. సంస్కృతమునఁ గూడఁ జర్మ పుత్రికా ప్రదర్శనముల కుద్దిష్టములైనవి ఛాయానాటకము లనుపేర నొకతరగతి నాటకములు గలవు.[53] ఆపే రాంగ్లమునందలి "షేడోప్లే" (Shadow play) అను దానికి సమానార్థకముగాఁ గుదిరియున్నది. తోలుబొమ్మల నాటలోఁ దెరకు వెనుకను, దివ్వెకు ముందు నుంచెదరు. ప్రేక్షకులకుఁ గనఁబడునని వాని ఛాయలు మాత్రమే. అందులకే ఆపేరు. కొయ్యబొమ్మలాటలో తెర మఱుగుండదు. కాని వానికిఁగూడ ఛాయానాటక గ్రంథములు పనికిరాకపోవు.

బొమ్మలాటకుఁ బాశ్చాత్యదేశములలో "ఓపెరా" లు. జావాది ద్వీపములలో లాకన్లు మొ॥, మన దేశములో సంస్కృతమున

52. The puppet Book Editered by L. V. Wall; Faber and Faber publication., PP 187-188.

53. డా. ఎమ్. కృష్ణమాచార్యులు వారి సంస్కృతవాఙ్మయచరిత్ర గ్రంథము నందుఁ గొన్ని ఛాయానాటకము లుదాహరింపఁబడినవి. చూ. నం. 770-72, 775.

ఛాయానాటకములు మొదలైన వానినలెఁ గన్నడాంధ్రములు యక్షగానములకుఁ గాణాచు లగుటచే నాయారాష్ట్రములందు యక్షగానములు నుపయోగపడుచున్నవి.

మైసూరు రాష్ట్రమున "చక్కలద గొంబె", "సూత్రద గొంబె" అను పేళ్ల వ్యవహరింపఁబడుచున్న తోలు – కొయ్యబొమ్మలాటలకు వెనుకపాటగా యక్షగానములే ఉపయోగింపఁబడుచున్నవి.[54]

ఆంధ్రదేశమున నీనాఁ డక్కడక్కడ మిగిలియున్న బొమ్మలాట వారి ప్రదర్శనములు చూచినచో వార లాయాప్రాంతపు యక్షగాన కవుల రచనలను వినియోగించుకొనుచున్నట్లు తెలియును. అసలు కొందఱు యక్షగానకవులే బొమ్మలాటలను దృష్టిలో పెట్టుకొని రచించినట్లును తెలియనగును.

క్రీ. శ. 1850 ప్రాంతమున గంజాముజిల్లా గుజ్జువాడ నివాసి మరింగంటి భట్టరురామానుజాచార్యులు రచించిన శ్రీరామనాటకము 'బొమ్మలాట రామాయణము' (ప్రా. లి. పు. భాం., ఆర్. నం. 966) గాఁ బ్రసిద్ధిపొందినది. ఇందలి లక్ష్మణమూర్ఛ కథాభాగము బొమ్మలాటలలో నెక్కువ ప్రచారము గాంచినది. ఇది 1908లో ఎద్దన పూడి సంజీవయ్య అండు సన్ వారిచే మదరాసు మురహరి ముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడి ప్రకటింపఁబడినది. తద్గ్రంథసంపాదకులగు యర్లంకి వేంకటేశ్వర్లు నాయుడుగా "రిది చర్మపు విగ్రహములతో నాట్యము చేయుచుండ డ్రామాకు అనుకూలంబగునట్లు పరిష్క-

54. Vide (a) 'Bhagavata Plays in Mysore' by Sri L. Narasimhachar – Chap. x, item II The Eighth All India Oriental Conference Volume, Mysore, 1935. (b) 'Yakshagana and other Plays Of Mysore' by Sri S. Srinivasachar – March of India, Vol. IV – No. 6.

రించి" నట్లు దాని యుపోద్ఘాతమున నున్నది. క్రీ. శ. 1855–1915 ప్రాంతమున గుంటూరుజిల్లా నర్సారావుపేట తాలూకా విప్రులపల్లె అగ్రహారము వాస్తవ్యులు చతుర్వేదుల వెంకట నరసింహయ్యగారు తమ ద్రౌపదీవస్త్రాపహరణము, సీమంతినీ పరిణయము, రాధాకృష్ణ సంవాదము మొదలగు యక్షగానములను బొమ్మలాటవారిచే నాడించెడివారఁట. 19 వ శతాబ్ది చివర వీణె సుబ్బరాజు, గాజుల పెండ్లూరి శేషగిరిరాజు అనువారు రచించిన సంతవేలూరు కుశలవుల నాటకము "ఆరు రాత్రిళ్లు నాటకమునకును బొమ్మలాటకును ఉపయోగముగా రచింపబడి" నట్లు గ్రంథ ముఖపత్రముపైఁ గలదు. (ఒక ప్రచురణ:- వెట్లు హార్డ్ అండుకో, మదరాసు, 1931). క్రీ. శ. 1893 లో పర్లా కిమిడి కడనున్న పాతపట్నము వాస్తవ్యుఁడు కోట వెంకటప్పయ్య శాస్త్రి యను నాయన బాణాసుర నాటకమను యక్షగానమును రచించి (ఇది 1894 లో మదరాసు ఇండియన్ లా ప్రెస్సులో ముద్రితమైనది) దానికిఁ బీఠిక తానే వ్రాయుచు నందు "ఈగేయ ప్రబంధము చర్మవిగ్రహములచే నాడించుటకు, వేషముల ధరించి నాటక మాడుటకును అనుకూలముగ నుండునటుల రచింపుఁడని నా మిత్రులొక కొందరు ప్రోత్సాహపరచినందున నేనందుల కియ్యకొంటి" నని వ్రాసెను. ఇందు లొట్టికిత్తడు, రత్నాలు, పోలిగాడు నను పాత్రలు, నా పాత్రల హాస్యప్రసంగములు నచ్చు మచ్చు బొమ్మలాటలలోని జుట్టుపోలిగాడు, బంగారక్క, గంధోళిగాళ్ల పాత్రలు, ప్రసంగములవలెనే యున్నవి. అసలు వారల సంబంధము, సందర్భము నట్టివే. కొన్ని బొమ్మలాటలలో కేతిగాడొక సాంప్రదాయిక హాస్యపాత్ర. కేతినాయని వాలకము చాల యక్షగానములలోఁ గూడఁ (ముఖ్యముగా తంజావూరు కృతులలోఁ గన్పట్టును. కొన్ని యచ్చయిన యక్షగానములలో నందలి పాత్రల

బొమ్మలుగూడ నచ్చుకాఁబడి యున్నవి. పరిశీలించినచో జాలమట్టు నకు బొమ్మలాట వాలకములే గుర్తునకు వచ్చును. బొమ్మలాటవారు తమ ప్రదర్శనములలోఁ దఱచు అమరశ్లోకముల నేకరువు పెట్టుదురు. అమరశ్లోకము లుదాహరింపఁబడిన యక్షగానము లనేకము గలవు.

ఉదా :— జిల్లెళ్ళమూడి వెంకటరామదాసామాత్యుని జాంబవతీ కల్యాణము (ఆం. సా. ప. ప్రతి నం. 3066) మొ॥ అట్టివి కొన్ని బొమ్మలాటలకు నుద్దిష్టములైనవే యని చెప్పవచ్చును.

ఇవి కాక బొమ్మలాటవారివే కొన్నిరచనలు గలవు. మదరాసు పాచ్యలిఖిత పుస్తకభాండాగారమున బొమ్మలాట హాస్యనాటక మను నొక తాళపత్ర గ్రంథము గలదు. (ప్రతి నం. ఆర్. 1394). గ్రంథములోఁ బలుతడవ లిది దక్షిణ సింహాసనాధీశ్వరుఁడు విజయ సేతు రఘునాథభూపాలుని నాటకశాలకు సంబంధించినదిగాఁ బేరొక్కనఁ బడినది. ఇదియొక బొమ్మలాట ప్రదర్శనకుఁ ప్రస్తావన ప్రాయమైన రచన — అసలు బొమ్మలాట వారాడఁదలఁచు కొన్నది శ్రీకృష్ణవిలాసమఁట. కాని కేతిగాని పెళ్లి యీ ప్రస్తావన యందలి ప్రధాన విషయము. ఇందు ప్రదర్శన సూచనలు, హంగు వివరములును గలవు. ఆ ప్రదర్శన ప్రక్రియ కొంత వఱ కానాఁటి దక్షిణ దేశీయ యక్షగాన ప్రదర్శనప్రక్రియా సంవాదిగా నున్నట్లు గ్రహింప వచ్చును. ఆ రచనా ధోరణియు నట్లేయున్నది. ఇది బొమ్మలాటవారి రచనగనే తోఁచును. బొమ్మలాట సంబయ్య యనుకవి (ఇతనికాలము క్రీ. శ. 1750 ప్రాంతమని కర్ణాటకవి చరితలోఁ గలదు. ఇతని తండ్రి సిద్ధయ బొమ్మలాట శాసనుడు. మోహనకవి బిరుదాంకితుఁడునని యితని గ్రంథములలోఁ గలదు) తెనుఁగున కిరాతార్జునీయము (ప్రా. లి. పు. భాం., డి. నం. 1849 – 1851). కన్నడమున కరియ

బంటన విజయము (డి. నం. 1169), సారంగధర చరిత్రము (డి. నం. 1212, 1220) అను యక్షగానములను రచించి యుండెను.

ఆంధ్రకవి తరంగిణిలో (సంపుటము 9-పుట 246) బొమ్మలాట వారిని గుఱించి శ్రీ చాగంటి శేషయ్యగారొక శాసనవిషయము నుటంకించిరి—"కడప మండలమందలి కమలాపురము తాలూకా చిడిపిరాల గ్రామమున చంద్రమయ్య యను నతఁడును (ఇతనిని బొమ్మలాట రయితు అని యందురు.) బొమ్మలాట యమృతకవి యను నతండును తెరనాటకము లాడుటకై పెదచిట్టయ్య యనునతని కిచ్చినట్లొక శాసన మున్నది." అని. దీనినిబట్టి యానాఁటి బొమ్మలాటవారి "స్తోమత" యు వారికిఁ దెరనాటకములందుఁ గల యభినివేశమును దేట తెల్లము లగుచున్నవి. తెరనాటకము లనఁగా యక్షగాన ప్రాయములైన ప్రదర్శనములై యుండునని యూహింపనగును. ఆబొమ్మలాట వారిలో మోహనకవి, అమృతకవి అను బిరుద నామములు, సంబయ్యవంటి యక్షగాన కర్తలు నుండుటజూడ వారు తమ బొమ్మలాటల కుపయుక్తములగునట్టి యక్షగాన ప్రాయములైన రచనలు చేసికొనుటకే కవిత్వము నవలంబించి నట్లు తోచును.

పై విషయములను బట్టి బొమ్మలాటకు యక్షగానమునకును నెంతటి సంబంధము గలదో తెలియనగును. సంబంధమే గాదు సాదృశ్యమును గలదు. సంబంధసాదృశ్యములలో నొకటియున్నచోట రెండవది యుండుటయు సహజముగదా. చాల యక్షగానములలో సూత్రధారుని ప్రసక్తి గలదు. సంస్కృతరూపకములలో స్థాపనతో సరివాని వాలకము. తెరమఱుగైనను బొమ్మలాటలోఁ జిట్టచివరి వఱకును వాని యవసర ముండును. కొన్ని యక్షగానములందును (ముఖ్యముగా తంజావూరు కృతులందు) నట్టే కథనడుమఁగూడ సూత్ర

ధారప్రసంగములుండుట యొక విశేషము. ప్రదర్శనల కుద్దిష్టములైన యక్షగానములందును సంధి వచనములున్న విషయమును గమనింపఁ దగినది. దృశ్యప్రబంధమున సంధివచనము లనవసరము. పాత్రల ముఖ వైఖరీ చేష్టాదికమంతయు నందుఁ బ్రత్యక్షముగాఁ జూపవచ్చును. బొమ్మలాటలో నాయవకాశములేదు. కాని సన్నివేశ సందర్భములను గథాక్రమ పరిణతిని నిరూపించుటకు వాని సూచననైన చేయుట యవ సరము. అందులకు సంధివచనముల నాశ్రయింపవలెను. అవి యక్ష గానములందును నిలిచియుండుట యొక విశేషము. భిన్న స్థలములందు, భిన్న కాలములందుఁ బ్రవృత్తములైన వివిధ కథాసంఘటనములు సంస్కృతరూపకములలో నంక విభాగాదులవలన నిరూపింపఁబడును. బొమ్మలాటల కథాప్రవృత్తిలో నంకవిభాగాదులు లేవు. అట్లే యక్ష గానమునను(అర్వాచీనయక్షగానములుకొన్నియందులకపవాదములు). ఇట్లు బొమ్మలాట - యక్షగానముల యొక్క నైసర్గిక స్వరూపమును బరిశీలించిన-చో నా రెండింటికిని గాఢమైనయనుబంధము గలదనిపించును. అయితే అది యనుబంధము మాత్రమే; జన్య జనక భావసంబంధము గాదు. ఆ యనుబంధమెంత ప్రాచీనమైనదో తెలియదు. బొమ్మలాట కున్నంత ప్రాచీనత యక్షగానమునెడ నూహింపనలవిగాదు. ఆదినుండి వివిధప్రదేశములందుఁ బ్రవర్తిల్లుచు వచ్చిన బొమ్మలాటలకెల్ల యక్ష గానములే యుపయోగపడుచు రాలేదు. యక్షగాన సదృశములైన రూపకప్రక్రియ లనేకము వివిధదేశములందుఁ గన్పట్టుచున్నవి. అవి యన్నియు బొమ్మలాట పరిణామఫలితములే యన వలనుపడదుగదా, బొమ్మలాట ప్రాక్తన మానవుని రూపక కళాసంకల్పమునకుఁ బ్రస్తావన వంటిదైనఁ గావచ్చునే గాని యక్షగానాది సర్వరూపక ప్రభేద ప్రాదు ర్భావమునకును సద్యఃకారణము గాఁజాలదు. అందుచే శ్రీ వెంకట రమణయ్యగారనినట్లు బొమ్మలాట పరిణామమే యక్షగాన మనఁ జెల్లదు

గాని బొమ్మలాటలతోడి యనుబంధమును యక్షగానముయొక్క పరిణామచరిత్రలో, దానిబహుముఖప్రయోగానుకూలరీతులలో నొక ముఖ్యమైన యంతస్తుగా గ్రహింపనగును.

యక్షగానము—బొమ్మలాట జన్యజనక సంబంధవాదము యక్షగాన శబ్దోత్పత్తిని సమర్థింపలేదు. అయితే వెంకటరమణయ్యగారి విషయమై చూపుపెట్టనివారుకారు. వారు తమ వ్యాసమున "ఆంధ్రదేశమున బౌద్ధయుగమున యక్షజాతివారు కొందఱు వసించుచుండిరనియు యక్షగానమునకు వీరితో నెద్దియో సంబంధ ముండి యుండ ననియు దోచుచున్న" దనిరి. ఇది యొక యూహ. వారు జక్కు-ఈ జాతి సంబంధము ప్రబలమైన సాక్ష్యము లేక యంగీకరింపఁదగిన విషయము గాదనియు ననియున్నారు. యక్షగానమునకు జక్కులతో సంబంధముండి యుండుననుకొనుటయు నొక యూహయే. కాని మొదటియూహకంటె రెండవదానిలోనున్న సామంజస్యము, సంభావ్యతయు మీఁదఁ బరిశీలింపఁబడినవి.

ఇతర వాదములు - అభిప్రాయములు

యక్షగానోత్పత్తి గుఱించి ప్రధానవాదములను బరిశీలించుటయైనది. ఇంకను బరిగణింపఁదగిన వాదములు నభిప్రాయములును మఱికొన్ని మిగిలియున్నవి.

1. మార్గ – దేశివాదము

మిగిలియున్న వాదములో నిది యొకటి ప్రబలమైనది. యక్షగానము దేశిసరణికిఁ జెందిన నాటకమని శ్రీయుతులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, కోరాడ రామకృష్ణయ్యగారు, పింగళి లక్ష్మీకాంతముగారు, చింతా దీక్షితులుగారు,

ఎండమూరి వెంకటరమణగారు మొదలగు పలుపురు పండితుల దృఢ విశ్వాసము. డా. ఆర్. కె. యాజ్ఞిక్, డా. వి. రాఘవన్, డా. నేలటూరి వెంకటరమణయ్యగారు మొదలగు పండితులు కొంద రది సంస్కృత రూపకములనుండి యుత్పన్నమైనదని అనఁగా మార్గ ప్రక్రియ గలదని యభిప్రాయపడినారు. *

యక్షగానము గానప్రధానమైనది. ప్రదర్శనమున నృత్తనృత్యాత్మకమైనది. రూపకోపయుక్తమైన రచనగాఁ బరిణమించిన దగుట సాహిత్యప్రక్రియయునై యున్నది. ఒక్కొక యంతస్తునందది మార్గ దేశి పద్ధతులలో నే యంతరువున కెంతవఱకుఁ జెందునో చూడవలెను.

ఈమార్గదేశి విభాగము మొట్టమొదట సంగీతవిషయమునఁ బాటింపఁబడినట్లు తెలియుచున్నది. సంగీతత్త్వము ప్రప్రథమముగా "అనాహత" మనియు, "ఆహత" మనియు అనఁగా ప్రకృతి జన్యము, మనుష్యోపజ్ఞము నని ద్విధా విభజింపఁ బడినిది. అందాహతము పునఃద్వివిధము:- వైదికము (సామగానము మొ...)—ఇదియే మార్గసంగీతము. అవైదికము, వివిధ దేశోత్పన్నమైనది— ఇదియే దేశి. కర్ణాటక హిందూస్తానీత్యాది సంగీతము లిట్టివే.

"దేశేదేశే ప్రవృత్తోఽసౌ ధ్వనిర్దేశీతి సంజ్ఞితః,
అబలాబాలగోపాలైః క్షితిపాలై ర్ని జేచ్ఛయా
గీయతే సానురాగేణ స్వదేశే దేశి రుచ్యతే."

అని మతంగుని బృహద్దేశి. ఆ పక్షమున యక్షగానము నందలి గాన మంతయు దేశియే.

* ఈ విషయమై ఆయా పండితుల యభిప్రాయములు ప్రకటింపఁబడిన వ్యాసము లీగ్రంథము చివర నొక పట్టికలోఁ జేర్చఁబడినవి.

కాలక్రమమున నీమార్గదేశి విభేదము వాద్య సంగీత నృత్త నృత్య ప్రక్రియలందును బొటింపఁ బడినట్లు జాయపనాయకుని నృత్త రత్నావళి, శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరము, రఘునాథ నాయకుని సంగీత సుధ మొదలగు గ్రంథముల నుండి యెఱుఁగనగును. జాయప నాయకుఁడు జక్కిణి నొకదేశి నృత్తముగాఁ బేర్కొని నాఁడు[55] జక్కిణికి యక్ష గానమునకు నేదో సంబంధ ముండి యుండునని మీఁద నూహింపఁ బడినది. "జక్కిణి కత్రి యనునవి నాట్యముతోఁ గూడిన రూపకముల వంటివి. వీని పరిణామమే యక్షగానము" అని శ్రీమల్లంపల్లి సోమశేఖర శర్మగారు వ్రాసి యున్నారు.[56] ఒక వేళ జక్కిణి—యక్షగానముల సంబంధము బదరీ బాదరాయణ సంబంధము వంటిదే యని యను కొన్నను జక్కుల పురంధ్రి యాట పాటల సంబంధము కారణముగా యక్షగానమును ప్రాథమికావస్థలో దేశి యన వచ్చును.

ఇఁక గవితా పరముగ నీమార్గదేశి భేదమును ప్రతిపాదించిన మనకవులలో నన్నెచోడుఁడు మొట్టమొదటి వాఁడుగాఁ గన్పట్టు చున్నాఁడు. ఆతఁడు మార్గకవిత దేశములో ముందుగా వెలసి ప్రచారములో నుండఁగాఁ జాళుక్యప్రభువు లాంధ్రదేశమున దేశిని బుట్టించి తెనుఁగు నుద్ధరించిరని యున్నాఁడు.[57] ఆతఁడక్కడ బహుశా చాళుక్య రాజు రాజరాజ నరేంద్రాస్థానములో వెలసిన మన నన్నయ గారి యాంధ్ర మహా భారతమునే యుద్దేశించి యుండును. అనఁగా నతని

55. చూ. 1923 సం. ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచిక-పుట 328. ఇందు నృత్త రత్నావళి నుండి యుదాహరణములు కొన్ని గలవు.

56. చూ. వారి వ్యాసము "మధ్య యుగాంధ్ర దేశము—సంగీత నాట్య కళాభివృద్ధి."— ఆంధ్ర పత్రిక చిత్రభాను (1942—43) సంవత్సరాది సంచిక.

57. చూ. అతని కుమారసంభవము, 1—23.

యుద్దేశములో దేవ భాషలోఁ బుట్టిన దంతయు మార్గి, దేశభాషలలోఁ బుట్టిన దంతయు దేశి యని తోఁచును. ఆప్రకారము సంస్కృత వాఙ్మయ కోశమున లేని యక్షరాన ప్రక్రియ దేశి యగు నని నిస్సం కోచముగా వక్కాణింప వచ్చును. కాని రానురానా యభిప్రాయము మారినది. మన మీ నాఁడు కవి త్రయ భారతమును, మన ప్రబంధ ములను దేశి సాహిత్యము గాఁబరిగణించుటలేదు. అది యంతయు మార్గ సాహిత్యమనియే మన యుద్దేశము. కొందఱు పండితులు మార్గదేశి విచక్షణ కొక మార్గము సూచించిరి–ఇతి వృత్తము, భాష, ఛందస్సు మొదలైన విషయములలో సంస్కృత సాహిత్య ప్రభావ పరామృష్టమైన దంతయు మార్గి, తద్భిన్నమైన దంతయు దేశియని.[58]

ఇతి వృత్తవిషయము జూచు కొన్నచో నీనాఁడు మనము దేశి వాఙ్మయకోశమను కొనుచున్న దానిలో ముక్కాలు ముప్వీసమున నితి వృత్తములు సంస్కృత పురాణములు, రామాయణ భారత భాగ వతముల నుండి గ్రహింపబడినవే. పౌరాణిక మనఁగనే యది మార్గ వాఙ్మయ కోశములో గతార్థమగును. అసలు పౌరాణిక గాథలే క్రమక్రమముగా మన చంపూ ప్రబంధములలో, ద్విపద కావ్యము లలో, యక్షగానములలో, పదములలో, జంగము కథలలో, హరికథ లలో నింక ననేక ప్రక్రియలలో నితివృత్తములగుచు వచ్చినవి. ఇతి వృత్తములనుబట్టి యీప్రక్రియలన్నియును మార్గసాహిత్యమునకుఁ జెందుననుట కుదురదు. ఆయాప్రక్రియల ద్వారమున నాకథ లేతరగతి పాఠకులకు లేక శ్రోతల కుద్దేశింపఁబడినవో వారి యభిరుచులకు బోధ శాలితకు ననుగుణముగా వాని నందిచ్చు తీరులో నున్నది మార్గదేశి

---

58. చూ. ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారి రంగనాథరామాయణ పీఠిక.

ప్రక్రియలలో బాహిరముగా గన్పట్టు పరస్పర విలక్షణత. ఉదాహరణకు :- ఒక యితివృత్తముగల ప్రబంధమును యక్షగానమును తీసికొని చూచినచో, అందులో నాయిక యేఱ్పు సందర్భమునుకొందము, అక్కడ ప్రబంధకవి యానాయిక యేస్వరములో నేరాగములో నేస్థాయిలో నేడ్చినదో, "ఓహోహూహో, ఎంతచక్కగా నేడ్వగలదు!" అన్నట్లు చెప్పును. అదే యక్షగానకవి యైనచో శ్రోతలు "అయ్యో పాపం ఎంతలా ఏడ్చింది!" అనుకొన్నట్లు చెప్పును. అట్లే కడమ సందర్భములును.

ఇక భాష విషయము జూచినచో—మార్గసాహిత్య మెక్కువగా బండితుల కుద్దేశింపఁబడినది. కాఁబట్టి యందలి భాష సంస్కృతశబ్ద ప్రచురమై లక్షణశుద్ధిగలిగి యాపదసంయోజనాపద్ధతియు నన్వయక్రమము మొదలగునవి గీర్వాణప్రభావమును సూచించుచుండును. ప్రబంధాదులలో గద్య పద్యములు జటిలపదజంఝూటముతో ననుప్రాసల యట్టహాసములతో సమాసముల సంరంభముతో నడుచును. ఆశ్లేలీ ప్రాగల్భ్య మంబరచుంబి శిరస్సరర్ష్టురీవేగము గలిగి యుండును. ఆప్రక్రియల గొప్పదన మెక్కువగా రచనాప్రౌఢినే యాశ్రయించి యుండును. యక్షగానాదులలో (పండితోపజ్ఞములు కొన్నింటఁ దక్క) నెక్కువగా దేశీశబ్దజాలము—అనఁగాఁ బ్రజల వాడుకభాష నుడికారము, జాతీయతయు నెక్కువగా నుండును. అవి యెక్కువగా జనబాహుళ్యమున కుద్దేశింపఁబడినవి కాఁబట్టి వానిలోని భాష యంత సలక్షణమైనది కాకపోయినను నందఱికిని బోధపడునట్లు జీవకళ యుట్టిపడుచు, గులకఱాలపై నలపోక దొరలిపోవు సెల యేటి తరగలవలె సరళమైన శైలి గలిగి యుండును. మఱి యొక ముఖ్యవిషయము — మార్గసాహిత్య మెక్కువగాఁ బఠనపాఠనములకు

మాత్రమే పనికివచ్చునట్టిది. దేశివాఙ్మయ మెక్కువగా గేయధర్మ విశిష్టమైనది. అందులకే చతుర్విధకవితారీతులలో నొకటైన మధుర కవిత క్రిందఁ జూల దేశిరచనలను బరిగణించినారు మన లాక్షణికులు. దేశి రచనలలో నా గేయధర్మసాధనలోఁ దఱుచు లఘ్వలఘువుల లజ్జ గుజ్జులు చాల సంభవించును. ఆ లజ్జగుజ్జులలో నొక్కక్కపుడు శబ్దాల స్వరూపాలే మాఱిపోవుచుండును. అందుచేత పండితులు రచించిన యక్షగానాది కృతులలోఁగూడ వారు సహజముగాఁ గాలుజాఱిన సందర్భము లనేకము గలవు. ఇట్టిది దేశిరచనల విలక్షణత.

ఇక ఛందోవిషయము — యక్షగాన రచనాసామగ్రిలోని ప్రధానాంశముల వరుస :—

1. తాళప్రధానమైన 'శేకు' లేక 'దరువు'—దాని మూల ప్రకృతి రగడ.

2. ద్విపద.

3. ఏలలు, అర్ధచంద్రికలు, ధవళ శోభనములు మొ॥ గీత ప్రబంధములు.

4. వచనము.

5. పద్యములు - జాత్యుప జాతులు, వృత్తములు.

6. శ్లోకములు, చూర్ణికలు, దండకములు, అష్టకములు, మొ॥ వీని లక్షణము గూర్చి ముందు "యక్షగాన ప్రధానరచనాంగములు" అను ప్రకరణమునఁ గొంత విపులమైన విచారణ గలదు. ప్రకృత మొక్కొక్క దాని మార్గ లేక దేశి తత్త్వమును గూర్చి తగుమాత్రము పరిశీలనము గావింపఁ బడును.

ఇందు దరు వనునది బహు యక్షగాన సామాన్యమైనది.

అతి ప్రధానమైనది. దరువు సంస్కృత ధ్రువాశబ్దభవమని పండితుల తలంపు.[59] ప్రయోజన విషయమునను రెంటికిని గొంత సామ్యము గలదు. ధ్రువాగానము సంస్కృత నాటకము లందుఁ బ్రయోగింపఁబడు చుండుట పరిపాటి. దీని లక్షణ ప్రయోజనములఁ గూర్చిన వివరణము భరతుని నాట్యశాస్త్రమునఁ (32 వ అధ్యాయము) గలదు. అంత మాత్రమున నీ విషయమునుబట్టి యక్షగానము మార్గియనుట గుదు రదు. మన కుపలబ్ధములై నంతలోఁ బ్రాచీనము లని రూఢిగాఁ దెలియవచ్చిన రుద్రకవి సుగ్రీవ విజయాది యక్షగానములలో దరు వను మాట కన్పట్టదు. అందు వానికి బదులు ఏక, జంపె, త్రిపుటాది తాళ ప్రధానములైన గేయ రచనలే కన్పట్టుచున్నవి. అవే యర్వా చీన యక్షగానములలో దరువులని వ్యవహృతములైనవి. ఆతాళము లును నాట్య శాస్త్రములోఁ బేరొక్కొనఁ బడినవే. కాని సంస్కృతమునఁ జెప్పఁబడినంత మాత్రమున మన నాట్య సంగీత శాస్త్ర గ్రంథము లందలి సర్వవిషయములను సంస్కృతమును దేవభాష యనుకొను నట్లొక్కడో దేవలోకమునుండి యవతరించిన వని తలంపరాదు. కొన్ని సంస్కృతవాఙ్మయమున సహజముగా నుద్భుద్ధమైనవి. కొన్ని యాయా దేశభాషా వాఙ్మయములలో సహజముగా నుత్పన్న మైనవియును. సంస్కృతము నందలి యా ధ్రువా ప్రయోజనము నియతము. యక్షగానము లందలి దరువులకట్టి నియతియున్నట్లు గానరాదు. అదికాక యాధ్రువారీతులకు గాని యా తాళములకు గాని నాట్యశాస్త్రమున నొక నిష్కృష్టమైన ఛందఃప్రక్రియ చెప్పఁబడ లేదు. ఆంధ్రలాక్షణికులీ "తాళదరువు" లకు రగడయను ఛందమును

---

59. చూ. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి వ్యాసము ఆం.ప. చిత్రభాను సం. సం. 1942 –43.

ప్రాతిపదికగా గ్రహించి యే తాళమున కెట్టి రగడ ప్రభేదము సరిపోవుచున్నదో నిరూపించి యున్నారు.[60]

ఈ రగడ లక్షణము సంస్కృత లక్షణ గ్రంథము లందెందును గానరాదు. ఇది క్రీ. శ. 10 వ శతాబ్ది నాఁటికే కన్నడమున మిక్కిలి ప్రచారము గాంచినట్లు తోఁచును. ఆనాఁటి కన్నడకవి నాగవర్మ తన ఛందోంబుధి యందు (III. 254) గణనియమ విపర్యాసమున్నను మాత్రల సమానతయుఁ దాళ బద్ధతయు 'రఘుటా బంధ' లక్షణము లని నేరొక్కాని యుండెను. ఆ రఘుటా బంధమే మన రగడ యైనది. ఆ లక్షణము సరిపోవుచున్నది. ఆంధ్ర వాఙ్మయమునను దీనికి మిక్కిలి ప్రచార మేర్పడినది. మన శాసనములకుఁ బ్రబంధములకు నెక్కినది. దేశి రచనల నత్యంతము నాదరించిన శివ కవులచే నాదరింపఁ బడినది. అనేక నూత్నములైన దేశిరచనల కుపాధియైనది. సంస్కృత వృత్తములను గలిగి యున్నను గళికోత్కళికల రూపమున రగడను బ్రధానోపాధిగాఁ గలిగి యుండుటచేతనే కాఁబోలు "ఉదాహరణ" కావ్యము గూడ దేశి రచనగాఁ బరిగణింపఁ బడుచున్నది.[61] రగడ

60. చూ. లక్షణసారసంగ్రహము (II. 141)
అప్పకవీయము (IV. 303) రంగరాట్ఛందము.

61. రగడోదాహరణముల చరిత్రమునకు — చూ. శ్రీ కోరాడ రామకృష్ణయ్య గారి "దేశి" శ్రీ నిడుదవోలు వెంకటరావు గారి "ఉదాహరణ వాఙ్మయ చరిత్ర"
శ్రీ వెంకటరావు గారు రగడ ప్రతిపత్తిసామ్యమున "యక్షగానములకు ఉదాహరమే మూలమని చెప్పనొప్పు" నని వక్కాణించిరి. ఆ రెండింటికిని రగడయే మూలకమైన యుపాధి యగును. గాని రగడ ప్రాచుర్యము గల రచన లన్నిటికి నుదాహరణమే మూలమనుట సమంజసము కాఁజాలదు. జంగము కథల కుదాహరణములే మూలము లనఁగలమా? య. గా. లు ద్విపద ప్రచురములు సైనవి కావున ద్విపద కావ్యములు తన్మూలము లనఁ గలమా! అట సాదృశ్యమే గాని యుత్పత్తి సంబంధ మున్న దనరాదు.

ప్రాధాన్యము గల మఱియొక రచనాప్రక్రియ జంగము కథ. అదియు దేశి రచనగనే పరిగణింపఁబడుచున్నది.[62] కావున రగడను స్వచ్ఛమైన దేశి చ్ఛందముగనే గ్రహించుట లెస్స. అట్టిచో యక్షగానమునందలి దరువునకు శబ్దోత్పత్తియందును, రంగప్రయోజనము నందును సంస్కృతధ్రువతో సంబంధ ముండియుండునుగాక కాని దాని ఛందఃప్రక్రియయందు మాత్రమది స్వచ్ఛందమైన దేశిత్వమునే గలిగియున్నదని చెప్పనొప్పును.

దరువు తరువాత యక్షగానమునఁ బ్రధానమైనది ద్విపద. ప్రాయికముగా ద్విపదలేని యక్షగానమే లేదనవచ్చును. అది యక్ష గానములలో నెన్ని యవతారము లెత్తినదో చెప్ప నలవి గాదు. ద్విపద దేశి చ్ఛందమనియే యనేకాంధ్ర విద్వాంసుల విశ్వాసము.[63] కాని సంస్కృత ప్రాకృతము లందది చాల కాలము నుండి ప్రచారమున నున్నది. ద్విపద, ద్విపది, ద్విపదిక, ద్విపథగ, ద్విపదీ ఖండము, దోహా (ప్రాకృతము) యను వివిధనామములతో ఋగ్వేదమనియు, గీత ప్రబంధమనియు, మాత్రావృత్తమనియు నిట్లు బహు భంగులుగా శత పథ బ్రాహ్మణము, భరతనాట్య శాస్త్రము, బృహద్దేశి, జనాశ్రయి, మానసోల్లాసము, సంగీత చూడామణి, సంగీత రత్నాకరము, భావ ప్రకాశము, సంగీతసుధాకరము, విక్రమోర్వశీయము, కాదంబరి (పూర్వభాగము) రత్నావళి మొదలగు గ్రంథము లందుఁ బేర్కొన బడినది. కొన్నిట లక్షణము గూడ నిర్వచింపబడినది. జనాశ్రయ చ్ఛందస్సు, రత్నావళీ నాటకము మొదలగు గ్రంథములందు వరుసగా

62 చూ. డా. శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి "దేశిసారస్వతవిభూతి" యను వ్యాసము — కిన్నెర, 1955 సంక్రాంతి సంచిక.

63. చూ. కోరాడవారి దేశి, పింగళివారి రంగనాథరామాయణ పీఠిక.

ద్విపదీ, ద్విపదీ ఖండములకు లక్ష్యములును గలవు. ఆలక్ష్యలక్షణము లతోసరిపోల్చి చూడఁగా మనద్విపదకుఁ బూర్తిగా సరిపోయిన దొక్కటిలేదు. అసలా సంస్కృతగ్రంథము లందుఁ బేర్కొనఁబడిన లక్షణము లకే యన్నిటికి నొక యేకవాక్యత కుదురలేదు. కాఁగా నిఁక ద్విపద యనఁగా రెండేసి పాదములకేకైక లక్షణ ప్రక్రియ గల ఛంద స్సను సామాన్యార్థమునే గ్రహింప నగును. గాని నామసామ్య మాత్రమునఁ దెనుఁగు ద్విపదకును సంస్కృత ప్రాకృతచ్ఛందములైన ద్విపదాదులకును జన్యజనక సంబంధము నూహింప రాదు. పండితులీనాఁడు పాల్కురికి సోమనాథుని వంటి విద్వత్కవి రచించిన బసవపురాణము, పండితారాధ్య చరిత్రములను రంగనాథరామాయణ ప్రభృతి ద్విపద కావ్యము లను దేశి రచనలుగాఁ బరిగణించు చున్నారనఁగా ద్విపద దేశిచ్ఛంద మను నుద్దేశముతోనే కదా.

యక్ష గానము లందుఁ దఱుచు ప్రయుక్తము లగుచు వచ్చిన యేలాది గీత ప్రబంధ విశేషములు కొన్ని రగడ ద్విపద వికారములే. అం దనేక మచ్చమగు దేశి రచన లనియే పెద్దల తలంపు. (చూ. కోరాడవారి దేశి). అందుల కేలాదులు కొన్ని మతంగుని బృహద్దేశి యందు పేర్కొనఁబడుటయు నొక తార్కాణ. మఱికొన్ని బృహద్దేశీతరము లగు సంస్కృత సంగీతశాస్త్ర గ్రంథము లందుఁ బేర్కొనఁ బడియున్నను సంస్కృతకావ్యవాఙ్మయమున వాని ప్రయోగము గానరాదు. ఆ శాస్త్రకారులకు తమ తమ రాష్ట్రములందు సమకాలమునఁ బ్రచారమున నున్న సంగీతనాట్య ప్రబంధములను గ్రహించుట పరిపాటి. అట్టివో వాని నెల్ల సంస్కృత గ్రంథఘటితము లైనంత మాత్రమున మన మీనాఁడు మార్గ ప్రక్రియలుగా గ్రహించుట సమంజసము గాదు.

యక్షగానములలోఁబద్యములు జాత్యుపజాతులే కాక సంస్కృత వృత్తములు, శ్లోకములు, చూర్ణికలు మొదలగునవి కొన్ని ప్రయుక్తము లైనవి. ఇవి యక్షగానము పైమార్గ ప్రక్రియాప్రభావమునే సూచించును గాని సహజమైన దాని దేశికళ నాచ్ఛాదింప లేవు. వచనము విషయమున నది యొక భాష గుత్తకొన్నది కాదనియు, యక్షగానములలోఁ బ్రయుక్తము లగు సంధి వచనములును సంభాషణ వచనములును దెనుఁగుదనమును బట్టియిచ్చునవి యనియును వానిని వామనాది సంస్కృతాలంకారికులు పేర్కొనిన వృత్తగంధి చూర్ణోత్కలికాది గద్యభేదములుగా బరిగణింప వలసిన యవసరము లేదనియుఁ జెప్పవచ్చును.

మార్గచ్ఛందస్సు లనఁగా నక్షరచ్ఛందస్సు లెక్కవగా నిసర్గగణ ఘటితములు. దేశి చ్ఛందస్సు లెక్కవగా మాత్రాగణ ఘటితములు. దేశి రచనలలో గీతి ధర్మ్మప్రకృష్టము లైన సందర్భములలో ననఁగా గేయములను సాగదీసి పాడునప్పుడు దీర్ఘప్లుత కాక్వాదిసందర్భములలో మాత్రలకాలము పొడిగింపఁబడును. అట్టివంటిచోటులందు లఘువనఁగా నొకమాత్ర, గురువనఁగా రెండుమాత్రలు, ప్లుతమనఁగా మూఁడు నన్న సామాన్యసూత్రములను బట్టుకొని వ్రాతలో గురుప్లుతము లొకవిధముగనే సూచింపఁబడును గదా యని యా సూత్రమును బట్టి యీమాత్రల నిర్ణయము చేయఁబూనుటతగదు. అట్టి దేశిరచనలకుఁగూడ లాక్షణికులు సంస్కృత సంప్రదాయాను సారముగా లక్షణ ప్రక్రియ నేర్పరించుటకుఁ బూనుకొన్నారు. అవి తమ నిసర్గగణములకు లొంగక పోఁగా నప్పు డింద్రగణములు, చంద్రగణము లనుచుఁ జాలియుఁ జాలని కొలబద్దలు పట్టుకొన్నారు. దానికిఁ దగిన సమాధానము చెప్పినారు యక్షగానకవులు. ద్విపదాదులలోనే కాకుండ సంస్కృతచ్ఛందస్సులవిషయమునఁగూడ దమ ధోరణి కనుగుణమైన

తూగును నడకనుమాత్రమే చూచుకొనుచు వానికిఁగూడ మాత్రల ప్రయోగముచేసి వైచినారు. ఒక్క ఉదాహరణ :— కోటపురి ధర్మాంగదచరిత్ర అను యక్షగానములోనిది "తంత్రముజేసి పాములకు తరుణులజేసుట ధర్మమందురా" అని యొక యుత్పలమాల పాదము. క్రీగీతగల దుత్పల మాల లక్షణము ప్రకారము భగణ ముండవలసిన స్థానముగదా. కాని యిక్కడ నలముపడినది. ఇట్టివి కోకొల్లలు. ఇఁక ద్విపదలసంగతి చెప్పనక్కఱలేదు. కాని— "వినవమ్మ నా మనవి విశదంబుగాను" అన్నది పల్లాయపురి ఉషాపరిణయ మను య. గా. లోని యొక ద్విపద పాదము. ద్విపదకు మూఁడింద్ర గణములు నొక సూర్యగణము ననికదా లక్షణము. కాని పైపాదము లోని మొదటిగణ మింద్రగణమే కాని రెండవది కాదు. కాని రెండును బంచమాత్రాకములైనవే. తూగు సరిపోయినది. యక్షగాన కవికిఁ గావలసిన పదే. ఇదే దేశిరచనల విలక్షణత. ఆయాయి యుపపత్తు లనుబట్టి యిట్టిదేశి చ్ఛందస్సుల కనేకమున కాకరమైన యక్షగానము దేశి సాహిత్య ప్రక్రియ యనుటలో విప్రతిపత్తి యుండరాదు.

ఇఁక రూపకప్రక్రియ దృష్ట్యా యక్షగానమెంతవఱకు దేశియో పరిశీలింపవలసియున్నది. కొందఱు పండితులు యక్షగానమునకు వీధి నాటకమని పర్యాయ వ్యవహారమున్నదికదా, వీధి దశరూపక ప్రభేదముగదాయని యక్షగానముయొక్క దేశిత్వమును శంకింపఁ జూతురు. కాని భరతుని నాట్యశాస్త్రమున వీధి యను సంస్కృత రూపకలక్షణ మిట్లుచెప్పఁబడినది:—

"వీధీ స్యాదేకాంకా తద్వైకహార్యా ద్విహార్యావా
అథమో త్తమ మధ్యా భిర్యుక్తా స్యాత్ప్రకృతి ర్ఋిసృభిః"
— బరోడా ప్రతి అధ్యా. 18 – శ్లో. 212 – 213.

తద్వ్యాఖ్యాత యగు అభినవగుప్తుఁ డేకహార్య మనఁగా నాకాశ భాషితమనియు, ద్విహార్యమనఁగా నుక్తి ప్రత్యుక్తి వైచిత్రియనియు వివరించినాఁడు. అనఁగా వీధి యేకాంకము, నాకాశభాషితముగాని యుక్తిప్రత్యుక్తి వైచిత్రిగాని గలిగినదియు, నుత్తమ మధ్యమాధమ నాయకమైనదియునని భరత మతము. (ఈ సందర్భమున నభినవన గుప్తుఁడు వివరించిన కోహలమతము నిట్టిదే) దశరూపకమున (3-62) వీధి కైశికీ వృత్తి, భాణమువలె సంధ్యంగములు నుద్ఘాత్యకాది వీథ్యంగములును గలిగి, శృంగార రసము సూచ్యమై రసాంతరము స్పృశింపఁబడి ప్రస్తావనయుక్తమై యేకపాత్ర ప్రయోజితమగునది యని చెప్పఁబడినది. వీథులలోని మార్గపంక్తులవలెఁ దీర్పబడిన వీథ్యంగములుగలదియని నిర్వచించినాఁడు తద్వ్యాఖ్యాత ధనికుఁడు. కావ్యాను శాసనమున నేకహార్యద్విహార్యము లనునవి పాత్రసంఖ్యగా బరిగణింపఁబడినవి. నాట్య దర్పణమున వీథియందు సర్వవిధనాయకులును రసములు నుండవచ్చుననియు ముఖనిర్వహణ సంధులుండుననియు గలదు. భావ ప్రకాశమున వీథ్యంగములతోపాటు లాస్యాంగములు నిందు గ్రాహ్యము లనియున్నది. ప్రతాపరుద్రీయమున భాణమువలె సంధ్యంగములుండి, కైశికీవృత్తి, శృంగారపరిపూర్ణత, ఉద్ఘాత్యకాది వీథ్యంగములు గలిగియుండుట వీథీలక్షణముగాఁ జెప్పబడినది*. రత్నాపణకర్త పాత్రలొక్కటిగాని రెండుగానియుండి లాస్యాంగములు గలిగి సామాన్య లేక పరకీయమై కులపాలిక కానటువంటి నాయికను గలిగియుండునని చెప్పెను. రసార్ణవ సుధాకరమునను నాయికవిషయ

* ఈ లక్షణమే తెనుఁగున చిత్రకవి పెద్దన లక్షణసారసంగ్రహమున ననూదితమైనది (III. 90). ప్రతాపరుద్రీయమున మొట్టమొదటగా వీథి కల్పితేతివృత్తము, ధీరోద్ధతనాయకము, శృంగార రససూచనామాత్రసారము ననియుఁ జెప్పబడినది. బహుధా ప్రసిద్ధేతివృత్తము, నాయకరస వైవిధ్యమును గల యక్షగానమున కీ లక్షణ మసలు పట్టదు.

మిళ్లే చెప్పఁబడినది. దర్పణకారుఁడు నాట్యశాస్త్ర లక్షణమును గ్రహించుచు శృంగారరసప్రాధాన్యమును, నఖిలార్థ ప్రకృతుల ముఖ నిర్వహణసంధుల పాటింపునుగూర్చి చెప్పెను.

ఇట్లు వివిధ నాట్యశాస్త్ర గ్రంథములందుఁ జేకొన్కఁబడిన వీథి లక్షణమునందలి ముఖ్యాంశములు : ఏకాంకము, సంధి సంధ్యంగములు, ప్రస్తావన, ఒకటి రెండు పాత్రలకు మాత్రమే ప్రమేయము, ఆకాశ భాషితాదులు, కులీన కాని నాయిక, శృంగారప్రాధాన్యము. ఇవి యక్షగానమున కెట్లు సరిపోవునో చూతము. ప్రాయికముగా యక్షగానములం దంకవిభాగ ముండదు. (ప్రాయికముగా ననుటచేఁ గొద్ది యర్వాచీన యక్షగానములందు గలదు గాని యది యక్షగాన పరిణామ చరిత్రలో నొక యంతరువు ననఁగా మధ్య వచ్చిన మార్గ నాటక ప్రభావమును మాత్రమ సూచించును. ప్రాచీన యక్షగానములం దంకవిభాగము గానరాదు.) అట్లని యవి యేకాంకిక లని తలఁపరాదు. అంక మాసన్ననాయకముగాని ప్రత్యక్ష నేతృచరితముగానియ్యె, బిందు వ్యాప్తిపురస్సరము, నేకైక దివస వృత్తము, బహుపాత్ర ప్రవేశార్హ ముగావలెనని మన యాలంకారికుల మతము. అట్టి నిష్కర్షగల లక్షణము మన యక్షగానమునకుఁ బట్టదు. యక్షగానేతి వృత్త ములలో నిబిడకథానిబంధనమే కానరాదు. ఒక దివసమునఁగా దొక జీవితకాలమున జరుగుకథ యంతయు రంగాంతర సూచన లేకుండ నొక్కచోటనే జరిగినట్లుండును. అర్థప్రకృతులకును గార్యావస్థలకును దగిన సమన్వయము గన్పింపదు. సంధి సంధ్యంగాదులు నందుఁ జక్కగాఁ బొదుకొని యుండవు. సంస్కృతనాటకము లందు వలె సూత్రధారుఁడు నటీ పారిపార్శ్వక విదూషకులతో జరుపు ప్రస్తుతోప లక్షణీయమైన దృశ్యప్రబంధ వస్తు తత్కర్తృ ప్రశంసాదికము ప్రాచీన

యక్షగానములం దెందును గానరాదు. ఒకటి రెండు పాత్రలకు మాత్రమే ప్రమేయము నాకాశ భాషితములును గలట్టి యక్షగాన మొక్కటియు లేదు. అన్నియుఁ బాత్రబాహుళ్యము గలవి. ఆకాశ భాషితములు లేవు కాని సంధి వచనములు గలవు. ఉక్తి ప్రత్యుక్తి వైచిత్ర్యముగల యక్షగానము లనేక మున్నవి కాని యది రూపక సామాన్య ధర్మము. నాయిక విషయమున యక్షగానమున నెట్టి నియమమును లేదు. అట్లే రసవిషయమునను. శృంగార(ప్రధానములైన యక్షగానము లనేకము గలవు; కానివియుఁ గొన్ని గలవు. ఏవిధముగఁ జూచినను యక్షగానమునకు వీధీలక్షణము పట్టకున్నది. అసలు యక్షగానములకు వీధినాటకములను పేరున్నదన్న నక్కడ వీధి యనఁగా దశరూపక ప్రభేదమని కాదర్థము. 'వీధులలో నాడుటచే వీనికి వీధినాటకము లని పేరువచ్చెను.'[64] ఇందులకు సమానార్థకములుగాఁ గన్నడ తమిళ దేశము లందుఁగూడ "బయలాట", "తెరుకూత్తు" అను పేరులు గల జానపదరూపకములున్నవి.[65] అదియుఁ గాక యీ వీధి శబ్దమును దశరూపక ప్రభేదముగనే పండితు లెవరైనఁ బరిగణించినచో నాప్రక్క-నాటకశబ్ద ముండుట యసమంజసమే యగును. కాలక్రమమున నాటక శబ్ద మర్థ విపరిణతి నొంది రూపక సామాన్య వాచియైనది. కాని యస శలదియు వీధివలెనే దశవిధరూపకములలో నొకటిమాత్రమ. అట వీధి లక్షణము వేఱు, నాటక లక్షణము వేఱు. అట్టి భిన్నలక్షణ ములుగల యీరెండింటిని బండితు లేనాఁడు నొక్కచోఁ ముడిపెట్టరు. అది సామాన్యులే నాటక శబ్దము రూపక సామాన్యవాచియైన తరు వాత వీధిలోనాడు రూపకమను నర్థమున వ్యవహరించుట కారంభించి

64. చూ. కీ. శే. జయంతి రామయ్య పంతులుగారి "ఆధునికాంధ్రవాఙ్మయ వికాసపై ఖరి" అధ్యా. 2 — "యక్షగానాటకములు"

65. Vide., Dr. V. Raghavan's paper on 'Yakshagana' — Triveni, Vol. 7 — No. 2.

యుండురు *. ఇంతకు నీవ్యవహారము యక్షగానమున కిటీవలఁ గలిగినది. ప్రాచీనకాలమున గలిగిన ట్లూహారములు గన్పట్టవు. అయినను వీధిశబ్ద భ్రాంతినివారణార్థ మింతదూరము వ్రాయ వలసివచ్చినది. కాని యసలు దశరూపకములలో దేని పోలికయు యక్షగానమునెడఁ గానరాదు. కాలక్రమమునఁ బ్రహసనప్రాయము లైన యక్షగాన రచన లొండురెండు పుట్టకపోలేదు.♦ యక్షగాన చరిత్రలో వాని నపవాదములుగా గ్రహింపనగును.

యక్షగానమున కుపరూపకములతోఁ బోలికగలదని రాఘవన్‌గా రభిప్రాయపడినారు. యక్షగానము గేయ నృత్య విశిష్టమై నది. ఉపరూపకములకును గేయరూపకములనియు (చూ. కావ్యాను శాసనము) నృత్య ప్రకారములనియుఁ (చూ. భావప్రకాశము) బేళ్ళు గలవు. అనఁగా నారెంటికి నేదో సాధర్మ్యము గలదని తోఁచును. నాట్యదర్పణ భావప్రకాశాదులందు నిర్వచింపఁ బడిన కావ్య నర్తన కావ్యుప రూపకముల లక్షణములు (ద్విపద యుపయోగము, పదార్థాభినయము మొదలగునని) కొన్ని యక్షగానమునకుఁబట్టును. కాని ప్రత్యేకమే యొక యుపరూపక లక్షణమును బూర్తిగా సతివ్యా

*అయితే యిందుల కపవాదము గలదు. 1. మన క్రీడాభిరామము ప్రేమాభిరామ మను సంస్కృత నాటకమునకుఁ జెనుఁగుసేత యనియు, నది వీధియను దశరూపక ప్రభేదమనియుఁ దత్ప్రత్యవతరణికలోఁగలదు. గ్రంథాంత గద్యలో నది యే కాశ్వాస పరిమితమగు వీధినాటకమని పేర్కొనఁబడినది. అప్పటికే నాటక శబ్దమునకు రూపక సాహచ్యవాచక వ్యవహారము వచ్చియుండును. ఇది నాఁడు ప్రసర్జితమైనట్లును గ్రంథమునఁగలదు. ఇది గద్య పద్య సమన్వితమైనది మాత్రమ. ప్రకృతియలో దీనికిని యక్షగానమునకును నెట్టిపోలికయుఁగానరాదు. 2. 'వీధియ న్నాటకంబు' – లక్షణసారసంగ్రహము III 90. (దశరూపకలక్షణము)

♦ ఉదా :– తంజాపురాన్నదాన మహానాటకము.

ష్టియు నవ్యాష్టియులేకుండ యక్షగానమునకుఁ బట్టదు. అనఁగా నారెం టికిఁగొంత సాధర్మ్యమే తప్ప సంబంధములేదని చెప్పవలెను.

మార్గరూపకము లొకలక్షణ నిష్కర్షకు లొంగునట్టివి. అట్టి నిష్కర్ష కనుగలము కానివి యక్షగానాది దేశిరూపకములు. వానికి సాదృశ్యముకంటె భేదమే యధికము. అట్టి ప్రాచీన మార్గరూపకము లకును మధ్య యుగ జనసామాన్యాను రంజకరూపకములకును సంబం ధమునూహించుట దుస్సాధ్యమని పండితుల తలంపు.[66] సంబంధమనఁగా నిట జన్యజనక సంబంధమని భావము. అయితే కాలక్రమమున యక్ష గానముపై మార్గరూపక ప్రభావము పడకపోలేదు. మార్గరూపక ప్రభావమేకాదు. బహుధా మార్గసాహిత్య సంప్రదాయ విధేయ మైన మన ప్రబంధము ప్రభావముగూడ బాగుగనే పడినది. (అది ముందు నిరూపింపఁబడును) అనఁగా యక్షగాన ముత్పత్తిలోఁ దేశియుఁ బరిణామమున మార్గియు నైన దనవచ్చును. అసలు చరిత్రను దఱచి చూచినచో సంగీతనాట్యకళా విషయములందును సాహిత్యమునం దును నీమార్గదేశి విభేదము సమానాంతరముగనే వచ్చుచున్నదనిపిం చును. "ఆరెంటికి నొక్కక యెడ కొంచెముగా అన్యోన్య గుణసంక్ర మణముండిన నుండును గాని జన్యజనక సంబంధము బొత్తుగాలే" దని యభియుక్తుల యభిప్రాయము.[67]

2. హరికథ - యక్షగానము

యక్ష గాన మన్నను హరి కథ యన్నను నొక్కటే యనికొం దఱు పండితు లభిప్రాయ పడుట గలదు. ఇప్పటికిఁ దెలియ వచ్చినంత

66. Vide., R. W. Frazer's Literary History of India, P. 270.

67. చూ. ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీ కాంతము గారి గౌతమ వ్యాసములు— "మన నాటకముల పూర్వ గాథ"

మట్టునకు శ్రీ బాగేపల్లి అనంతరామాచార్యులను వారా యభిప్రాయ మును మొదట వ్యక్తమొనర్చిన వారుగాఁ గన్పట్టుచున్నారు. ఆయన రాయలసీమ అనంతపురమండలము హిందూపుర వాస్తవ్యులఁట. 19వ శతాబ్ది యుత్తరార్ధమున నుండిన వారఁట. ఆప్రాంతము నందు హరి కథోపన్యాసకులుగాఁ బ్రసిద్ధివడసిన వారఁట. వారు హరికథల నుపన్యసించుట కాక స్వయముగాఁ బలు రచనలు గావించిరి. అందు గొన్ని:- 1. చంద్రహాస చరిత్రము. 2. కుచేలో పాఖ్యానము, 3. మూఁడున్నర వజ్రము, 4. అనసూయాచరిత్రము, 5. సావిత్రీ చరిత్రము, 6. సుభద్రా పరిణయము. 7. శశిరేఖా పరిణయము.[68] ఈ యేఁడింటను జివరి నాల్గును యక్షగానములుగాఁ బేరొక్కనఁ బడినవి. కాని వానిలో నట్లు బేరొక్కనఁ బడని వానిలోఁ గూడ రచనా ప్రక్రియ యొక్కఫక్కిగనే నడచినది. అన్నిటను తొహారాలు, హిందూస్తానీ మట్లును గలవు. ఇవియన్నియు నాఖ్యాన శైలీ ప్రకృష్టములు. ఈ తొహారాల యునికి మొదలగు లక్షణము లన్నియు నాంధ్రమున హరికథలను పేరఁ బ్రచారమున కెక్కిన రచనలలోనే యెక్కువగాఁ గన్పట్టును. అనంతరామాచార్యుల వారు తమ కృతుల నెక్కటిగా నాఖ్యానించు చుండెడి వారఁట. హరికథా ప్రయోగ లక్షణ మదేకదా. అనంత రామాచార్యుల వారి కృతులను హరికథ లనుటలో విప్రతిపత్తి యుండనక్కఱ లేదు. కాని వారే వానిని యక్షగానము లనియు వ్యవహరించి యున్నారు కదా. వారే కాదు వారికించుమించు సమకాలికులు (1864-

68. ఇవియన్నియు నముద్రితములు. వీని ప్రాతప్రతులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ గారి కడ నున్నవి. వారే గ్రంథకర్తను గూర్చిన విషయమును నా యెఱుకకుఁ దెచ్చిరి. దయతోగ్రంథము లెల్లఁ జదువ నొసంగిరి. వారి కెంతయుఁ గృతజ్ఞుఁడను. ఇందలి శశిరేఖాపరిణయ రచనా కాలమును వ్యయ వైశాఖ శు. దశమి గురువారముగాఁ గవి పేరొక్కనెను. అది క్రీ.శ. 13-5-1886 తేదీకి సరిపోవు చున్నది.

1945)నాంధ్ర దేశ హరికథోపన్యాసక చక్రవర్తులుగాఁ బ్రసిద్ధులు నైన శ్రీ మదజ్జాడాది భట్ట నారాయణ దాసు గారు తమ ప్రహ్లాద చరిత్ర + మను హరికథ యవతారికలో హరికథ యన్నను యక్షగాన మన్ననునొక కేయను నభిప్రాయముతో నొకపద్యము రచించిరి. అది:-

సీ. ఘన శంఖమో యనఁ గంఠంబు పూరించి
మేలుగా శ్రుతిలోన మేళవించి
నియమము తప్పక నయఘనంబులఁ బెక్కు-
రాగభేదంబుల రక్తి సల్పి
బంతు లెగిర్చిన పగిదిఁ గాలజ్ఞతన్
జాతి మూర్ఛన లొప్ప స్వరముఁ బాడి
చక్కని నృత్యమున్ సర్వ రసాను కూ
లంబుగ నభినయనంబుఁ జేసి

గీ. స్వకృత మృదు యక్షగాన ప్రబంధ సరణి
వివిధ దేశంబులం బిన్న పెద్దలు గల
బలు సభల హరి భక్తి నుపన్యసింప
లేని సంగీత కవితాభిమాన మేల.

ఈ పద్యమునే హరికథ యను శీర్షికక్రింద ఆంధ్రపత్రిక విరోధి కృత్సం వత్సరాది సంచికలోఁ గూడ (పుట 77) దాసు గారు ప్రకటించి యున్నారు. వారు తమ " అంబరీష చరిత్రము "* హరికథ యుపో ద్ఘాతములో - " ఈ యంబరీషోపాఖ్యానము దొట్టి మఱికొన్ని యక్ష గానములను వ్రాసి యుంటిని — నేఁ దెలిసిన మట్టు యక్షగానముల

+ మినర్వా ము. శా. ముద్రణ - విజయనగరము, 1899.

* సరస్వతి బుక్ డిపో ప్రచురణ, బెజవాడ, 1929.

కుదాహరణముగ నిందుతోఁ బది వివరించినాఁడను'' అని తన రచించిన హరికథల నన్నిటిని యక్షగానము లనియే వ్యవహరించి నారు. పార్వతీ పరిణయ మను నొక హరికథను† రచించిన శ్రీ పసుమర్తి కృష్ణమూర్తి గారు తదాశ్వాసాంత గద్యలోఁ దమ కృతిని యక్ష గాన ప్రబంధమనియే పేర్కొనిరి. ఆయన దాసు గారి శిష్యులే. తమ కృతిని గురువుగారికే యంకితమిచ్చిరి. ఊలపల్లి గంగరాజ కవి రామజనన హరికథ ††కు ముఖ బంధ మను ప్రశంసలో శ్రీ కాశీభట్ల సుబ్బయశాస్త్రిగారు దానిని యక్ష గాన ప్రబంధ మనిరి. హరి కథ యని గ్రంథ కర్త పేర్కొనెను. భమిడిమట్ల రామమూర్తి గారి సతీ సకుఁబాయి హరికథ ‡ పీఠికలో శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రిగా రిది యక్ష గాన మనుచు నా ప్రక్కనే (కుండలీ కరణములలో) హరికథ యని పేర్కొనిరి.

గ్రంథకర్త హరికథయనియే వక్కాణించెను. శ్రీభక్తవిజయ మను నింకొక హరికథ + కూడ యక్షగాన ప్రబంధముగనే పేర్కొనఁ బడినది. తద్గ్రంథకర్తలు ''శ్రీమత్సంపూర్ణ రామాయణ మహాభారత భాగవత శివపురాణాద్యనేక యక్షగాన ప్రబంధకర్తలును హరికథోప న్యాసకులునగు శ్రీ అయ్యగారి వీరభద్రరావుగారు.'' ''యక్షగానాల శాఖకేచెందిన హరికథ'' లని శ్రీ కొత్తభావయ్యచౌదరిగా రొకచో* ననిరి.

† ప్రచురణ వివరములు దెలియవు. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయమున వీని ప్రతులు గలవు.

†† శ్రీ పతీ ప్రెస్ : కాకినాడ. 1936.

‡ సరస్వతీ పవర్ ప్రెస్, ముద్రణ – రాజమండ్రి, 1943.

+ రాజమండ్రి గౌతమీగ్రంథాలయమునఁ నొక ప్రతిగలదు.

* చూ. ''యక్షగాన నాటకములు'' అను వారివ్యాసము – ఆంధ్రమహిళ – ఆగష్టు, 1956. పుట 14.

ఇట్లు పలువురుపండితులు, సామాన్యులుగాదు ధీమాన్యులు నైనవారు, స్వయముగా హరికథా గ్రంథరచన గావించినవారును నభిప్రాయపడి రనఁగా నది కాదనలేము. వానిలో నేదో సాదృశ్యములేదన లేము. కాని రెండును బూర్తిగా వాని యుత్పత్తిపరిణామములనుబట్టి యభిన్నము లనలేము. జక్కులకథలు, జంగంకథలు, హరికథలు, బుట్టకథలు — ఇవియన్నియు గానరూపమునఁ గథాఖ్యానమే ప్రధానాశయముగాఁ బ్రారంభింపఁబడినవి. కావునఁ దత్ప్రచనా ప్రక్రియలలోఁ గొంత సాదృశ్యము గోచరించినను వానివాని ప్రయోగఘట్టికలు వేఱు. ప్రయోజనములు వేఱు. వాని పుట్టువు పొలఁకువలే వేఱు వేఱు.

హరికథ వేదకాలమునకే బీజరూపమున నున్నట్లును, నైతిహాసికయుగమునఁ గుశలవుల రామాయణగానము మొదలగు సందర్భములందు దాని స్వరూపము విస్తరించినట్లును గొందఱితలంపు.[69] కాని యేదోకథ చెప్పుట, అది విష్ణుకథయగుట యనునట్లు గాక మనమీనాఁడనుకొనుచున్న విశిష్టలక్షణములు గలదిగా హరికథ రూపొంది ప్రచారముగాంచుట మధ్య యుగమున మహారాష్ట్రమున. 17 వ శతాబ్ది పూర్వార్ధమున నుండిన ప్రసిద్ధ మహారాష్ట్ర భాగవతుఁడగు తుకారామ్ హరికథాకాలక్షేపములు చేయుచుండినట్లు తెలియుచున్నది.[70] హరికథ యనఁగా నది మహారాష్ట్రులది యని ప్రతీతి. అది మహారాష్ట్రమున "అభంగ్" అనియు, తనిఖదేశమునఁ గాలక్షేపమనియు, నాంధ్రమున హరికథయనియు (హరికథాకాలక్షేప + మనియు) వ్యవ

69. Vide., "Kalakshepam" By Sir M. S. Ramaswmi Aiyar,.

70. చూ. "తుకారామ్ మాచీగాథా"— (నిర్ణయసాగర ముద్రణ, బొంబాయి, 1927) అభంగములు 4045 – 4049.

+ కాలక్షేపమనఁగా Pastime అని యర్థము.

హరింపఁ బడుచున్నది. దక్షిణదేశమునకు హరికథాకాలక్షేపము దిగి వచ్చుట 17 వ శతాబ్దిలో నటు కర్ణాటకము నిటు తంజాపురాంధ్ర నాయక రాజ్యమును మహారాష్ట్రుల కైవసమైన తరువాతనే యని తోఁచును. తంజావూరినేలిన మహారాష్ట్రప్రభువు లంతకు ముందాంధ్ర నాయక రాజులు మిగుల నాదరించిన యక్షగానప్రక్రియ తమ హరికథా సంవాదిగా నుంకుటచేతను, నంతకంటె మఱియొక మెట్టెక్కువగా రూపకప్రయోజనము గల్గియుండుటచేతను గాఁబోలు తామును దానిని నాయక రాజులకంటె నెక్కుడుగ నాదరించిరి. స్వయముగా నెన్నో యక్షగాన నాటకములను వెలయించిరి.+ కాని యాంధ్ర మున వారైె తమహరికథలను వెలయించిన జాడగానరాదు. కాని మహారాష్ట్రులకుఁ బుట్టినింటను బొరుగువారైెన మధుర సౌరాష్ట్ర సభ వారు పిదప కాలమునఁ దెనుఁగునఁ గొన్ని హరికథలను వెలయింపఁ జేసిరి.[71] తత్రాపి మనవారును కాలక్షేపార్థము రూపప్రదర్శనావకాశము లేనియెడ నేకపాత్రాభినయమునకైె నఁ బనికివచ్చుననియో, అన్యగీత ప్రబంధచ్ఛందస్సుల[71] కాకృష్టులగుటచేతనో నాఁటినుండి హరికథా రచనకు దొరకొనియుందురు. అసలు యక్షగానము హరికథగాఁ జెప్పఁబడు సంప్రదాయమొకటి కన్నడదేశమునఁగలదఁట. అయితే అది ప్రాచీనమైన సంప్రదాయముగాదు. ఈవిషయమై

+ చూ. ఇందలి ద్వితీయభాగము — ద్వితీయప్రకరణము.

71. ప్రా. లి. పు. భాం., ఆర్ నం. 1607, 1608. వీనిలో డోరాబ్యాక్, సోపంగి, లావణి, కేకావళి, ఖడ్గా, ఛంద్ మొ. సౌరాష్ట్ర మహారాష్ట్ర గీతప్రభేదములుగలవు. ఆంధ్రదేశపు హరికథలందు డోరాలు, తోహరాలును దఱుచు లావణి 19 వ శతాబ్ది కర్ణాటాంధ్ర యక్షగానములందును ప్రయుక్తమైనది.

(ఈమధుర సౌరాష్ట్ర)సభ హరికథలు, వానిలోని ఛందస్సులనుగూర్చి ప్రత్యేక మొకవ్యాసము 2-5-55 తిలీఖ్లలోఁ ప్రకటించి యుంటిని).

శ్రీ ముటూ్నారి సంగమేశముగా రేమనుచున్నా రో చూడుఁడు. "అసలు వేషరచనకూడా మానుకొని మద్దెల, జేగంట, హార్మోనియం శ్రుతి అనేవి సహాయంగా తీసుకొని ఒకాయన యక్షగానరచన గానంచేస్తూ ఉంటే, మరోనలుగురు వేర్వేరుపాత్రలను పంచి పుచ్చుకొని, కులాసాగా నాటకీయపద్ధతిలో సంభాషణలు నెరపడం అనే మర్యాదకూడ దక్షిణ కన్నడ ప్రాంతంలో పాతిక ముప్పైయేళ్ళనుండి బయల్దేరింది. దీనిని "తాళమద్దెల" అని పిలుస్తారు. ఇందులో ఆటగాని, అభినయంగాని, వేషంగాని ఏమీలేవు. ఒకరుచెప్పే హరికథ నలుగురు పంచుకో చెపు తూన్నట్లుంటుంది"[72] ఈసంప్రదాయము యక్షగానముపై హరికథల ప్రభావమునుమాత్ర మే సూచించును. ఏదెట్లయినను మనకు యక్షగానరచన ప్రాచీనము. హరికథారచన యాధునికము. నేటి హరిదాసులు హరికథలను యక్షగాన ప్రబంధములని పేర్కొనినట్లు, ప్రాచీన యక్షగాన కర్తలెవ్వరును యక్షగానమును నది వైష్ణవేతి వృత్తమగుచో నౌపచారికముగ హరికథ యనుటతప్ప (ఆ యనుటయుఁ గ్వాచిత్కము) ప్రక్రియ పరముగా హరికథ యని వ్యవహరింపలేదు. లాక్షణికులుగూడ నస్తు చ్ఛందోవైవిధ్యము విశేషముగఁ బ్రదర్శించి యుండుటచే యక్షగానమున కొక నిష్కృష్టలక్షణము నేర్పరింపలేక పోయిరి. ప్రక్రియగా నా వదలుతనమే మొదటఁ తాళప్రధానములైన రేకులతో ద్విపదలతోఁ గొలది గద్యపద్యములతోఁ బ్రాదుర్భవించిన యక్షగాన రచనమును వివిధ దేశిపద కవితా ప్రభేదములను, గర్ణాటక సంగీతమునకుఁ బ్రచారము గలిగిన దినములలో నాయా రాగ ప్రభేదములను, దక్షిణ దేశమున కౌత్తరాహులతో సంపర్కముకలిగిన రోజులలో నాహిందూస్తానీ రాగములను మట్లను నిముడ్చు

72. చూ. సంగమేశంగారి "బయలాట" అనువ్యాసము — ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4-1-1956, పుట 64.

కొను నట్లు చేసి, రానురాను యక్షగాన మనఁగా ఛందో వైవిధ్య విశిష్ట గేయ ప్రబంధ సామాన్య వాచియా యని యనిపించు నంతగాఁ బరిణ మింపఁ జేసి నేటికి హరికథలకుఁ గూడఁ బర్యాయ వాచకముగా నిలిపినది.* అసలు హరికథ ప్రయోగ విషయమున యక్షగాన ప్రారంభదశను సూచించు నన వచ్చును. రచనా ప్రక్రియలో నీనాఁటి ధోరణిని బట్టి రెండింటను నెట్టి ఛందస్సుల నైనఁ బాటలనైన నెట్టి కథలనైన నెలకొల్పవచ్చు ననవచ్చును. ఈనాఁడు యక్ష గానము లెట్లు యక్షులచే (జక్కు-లచే) గానము చేయఁ బడుట లేదో యట్లే హరికథ లన్నియు విష్ణు కథలు గావు. శివకథలు చివరికి శివాజీ గాంధీజీ కథలును హరికథల పేర "చలామణి" యగు చున్న వి. అనఁగా నీకఁ బ్రక్రియ కేగాని యా పేరునకుఁ బ్రాముఖ్యము పోయినదన్న మాట. కడమ ఛందస్సులమాట యెటులున్నను గథాఖ్యానమునకు యక్షగాన ములలో ద్విపద, హరికథలలో డోరాలు, తోహరాలు సంప్రదాయ సిద్ధముగా వాడఁబడుచున్నవి. నారాయణదాస ప్రభృతుల రచన లలో డోరా తోహరాలకు బదులు మంజరియను రచనా విశేషము గన్పట్టును. అది మన మంజరీ ద్విపద కాదు. డోరా వంటిదే. హరికథలలో మన ద్విపదలు, కందార్ధాదులును జేరినవి. 19 వ శతాబ్ది యుత్తరార్ధము, తదుపరి యక్షగానములలో మాత్రము గొన్నిట డోరా తోహరాలును, మరికొన్నిట లావణి మొదలగు నన్యదేశ్య

---

* ఈ సందర్భమున గోదావరిమండల వాస్తవ్యులు, ప్రసిద్ధ హరికథోపన్యాస కులు, రచయితలునైన శ్రీ నల్లమిల్లి బసివిరెడ్డిగారి యభిప్రాయ మొకటి గమనింప దగియున్నది. చూ. ద్వి. భా. పుట. 246. (అది యాయన స్వయముగ నాతో సెలవిచ్చినమాట. వీ రిటీవల తేదీ 8–12–59 న కీర్తిశేషులైరి.)

చ్ఛందస్సులును (సాధారణముగా హరికథలలో నుండునవి) చేరినవి.*

పై విషయములనుబట్టి హరికథ– యక్షగానములకుఁ గల సాదృశ్యము, సంబంధము నెట్టివో గ్రహింపనగును. హరికథ నుండి యక్షగాన ముత్పత్తియైనదని యెవ్వరైననన్నచో నది ముధావాద మగును. అదియుఁగాక యీవాదము యక్షగాన నామోత్పత్తిని సమర్థింపదుగదా. ఇక యక్షగానమే హరికథగాఁ బరిణమించిన దను వారును గొందఱు గలరు.[73] కాని యిదియు సవిచారమూలక మగు నభిప్రాయమే. రెండిటి యుత్పత్తి వేర్వేఱనియు, రెండును గొంత సదృశ ప్రక్రియలగుటచే వానికిఁజారిత్రక కారణములవలన సాన్నిహిత్య మేర్పడఁగాఁ గొంతకుఁగొంత సంబంధమును నేర్పడెనని తలంపవలసియున్నది. *

3. కథకళి – యక్షగానము

దక్షిణ భారతమునఁ బ్రధానములైన యాంధ్రకర్ణాట తమిళ మళయాళ రాష్ట్రములు నాల్గింటిలో మొదటి మూఁడింటను యక్షగాన మొక దేశి రూపక ప్రక్రియగా విలసిల్లినది. కాని మళయాళమున

---

* చూ. ఇందలి ద్వితీయ భాగము, మొదటి ప్రకరణము – ఆంధ్ర దేశ య. గా. కవులు వరగంటి శేషగిరి వెంకటరమణదాసులు, గోపాల రామదాస కవి, తిమ్మరాజు లక్ష్మణరావుల, అనంత రామాచార్య నారాయణదాస ప్రభృతుల కృతుల విషయము.

73. (1) కవిత్వవేది ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము – (వావిళ్ళ ప్రతి – 1951) పుట 145. య. గా. లే తోలుబొమ్మలాటలుగా మాఱిన పనియు కవిత్వవేది యభిప్రాయము. చూ. పుట 246.

(2) Vide, Chap. 5 of 'Telugu Literature' By Prof. P. T. Raju. (P. E. N. Series No. 15.)

* య. గా. హరికథగూర్చి వేఱు యొక వ్యాసము ప్రకటించియుంటిని, చూ. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక.

దానికి ప్రశక్తి కలుగకుండుటకుఁ గారణము తత్సదృశమైన కథకళి యను గేయాత్మక నృత్యకళా విశిష్టమగు నొక రూపకప్రక్రియ కచటఁ బ్రచారమేర్పడుటయే. కథకళి మళయాళ రాష్ట్రపు గర్వకారణ మగు నొక జాతీయ రూపక ప్రక్రియగా వాసికెక్కినది. దానికిని యక్షగానమునకును గొంతపోలిక గలదు. అది కారణముగా నుత్పత్తిలో నీరెండును నేకబీజకములై యుండునను నభిప్రాయము కొందఱు పండితులకుఁ గల్గినది.

యక్షగాన వాఙ్మయ పరిశోధకులలో దొలితరము వారిలో నొకరగు ఆచార్య శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారీ విషయమై యిట్లు సెలవిచ్చియున్నారు :— 74.

"This Veedhinataka in Telugu may be said to be only a counter part of the Malabar Kathakali, but with this difference, that while in the Telugu Veedhinataka the actors speak and take to singing the songs whose meaning they also seek to interpret by means of gestures – i.e., by Abhinaya; the Kathakali actors enact the whole story by means of mute abhinaya leaving speeches and songs entirely to the troupe behind them, who supply the musical and other accompaniments necessary for the successful enactment of the drama. The dress, the make up, the method of performance, and all other paraphernalia required for the enactment seems to point towards the identity of their origin, though there may be some minor differences due to later independent developments.'

74. Vide P. 19 of 'Telugu Literature outside the Telugu Country' By K. R. K. (Madras University Telugu Series No. 9 (1941) Chap: Yakshagana and Desi.'

మీఁది వక్క-ణలో శ్రీరామకృష్ణయ్యగారు కథకళి యక్షగానముల భేదసాదృశ్యములను జక్కఁగా విశదపఱచినారు. అయితే సాదృశ్యము వాని యుత్పత్తి సామ్యము వంక ములుసూపుచుండఁ బోలు ననియు, భేదము పరస్పర నిరపేక్ష మగు వాని కాలాంతర పరిణామము కారణముగాఁ గలిగియుండ వచ్చుననియు ననియున్నాఁడు. ఇది యొక యభిప్రాయముమాత్రము. ప్రబలవాదముగాదు. అయినను నిది ముందు ముందొక వాదముగాఁ బరిణమింపకుండుటకు దీని నిటఁ బరిశీలించుట కర్తవ్యము.

మన యక్షగానమునకును గథకళికిని గల సాదృశ్యము భరత ఖండమున వివిధ రాష్ట్రములందు వెలసిన యా తరగతి దేశిరూపకము లన్నిటికి నించుమించుగా సరిపోవు నట్టిదే కాని విశేషముగాదు. కథకళిప్రత్యేకత మూకాభినయము. యక్షగాన ప్రాయములగు కన్నడదేశపు బయలాటలపై[75], మెల్ట్టూరు భాగవతమేళ నాటక ములపైఁ[76] గథకళిప్రత్యేకతయొక్క ప్రభావము కొద్దిగానైనఁ గలదు (అందులకుఁ బ్రాదేశికముగా వానికున్న సన్నిహితత్వమే కారణము కావచ్చును. అదియు నిటీవలి పరిణామమే కావచ్చును.) కాని మన యక్షగానముపై దానిప్రభావ మే దశలోను (పాల్కురికి యక్షగానేపథ్యముల యాటపాటల ప్రస్తావనలోఁ గాని, క్రీడాభిరామ-జక్కుల పురంధ్రి గానాభినయ ప్రసంగమునఁ గాని) గానరాదు. ఇంతకును గథకళి యేమంత ప్రాచీనమైనదికాదు. మలయాళ పండితులే యా మాట నంగీకరించుచున్నారు.

---

75. చూ. శ్రీ ము. సంగమేశంగారి 'బయలాట' వ్యాసము - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 4-1-56. పుట, 22-24.

76. చూ. ఈ విషయమై నా వ్యాసము - భారతి, సెప్టెంబరు, 1955.

కథకళి గురించి :— శ్రీ కె. ఆర్. పిషరోటీ గారేమను చున్నారో చూడుఁడు :—

'We shall not be far from the truth if we place this in the latter half of the 17th Century... It is quite probable that this new variety must have been devised somewhere in the Sixth decade of the 17th Century.'[77]

మరికొందరు

'The Raja of Kottarakkara (1575–1650 A. D.) was the first composer and originator of the Kathakali'[78] అని యనుచున్నారు. వీరి యభిప్రాయము గణించినను గథకళి చరిత్ర క్రీ. శ. 16వ శతాబ్ది దాఁటిమీఁదికిఁబోదు. కథకళి పుట్టుటకు ముందే యాంధ్రమున యక్షగాన రచనకూడ ఆరంభమై సాగుచుండినది.

అనఁగా యక్షగానమునకును గథకళికి నుత్పత్తిసామ్య మూహించుట సమంజసముగాదుకదా. అదియుఁగాక కథకళి యక్షగాన నామోత్పత్తిని సమర్థింపలేదుకదా ; అయితే శ్రీ రామకృష్ణయ్యగారు యక్షగాన నామోత్పత్తి విషయమై చూపు పెట్టనివారుకారు. వారు తమ వ్యాసమున పండితారాధ్య చరిత్రమునందలి యక్ష వేషములతోడి యాటపాటల ప్రస్తుక్తి, క్రీడాభిరామమునందలి జక్కుల పురంధ్రి పాట ప్రస్తుక్తి యెత్తిచూపుచు వానిప్రాథమికానుబంధస్వరూపము నావిష్కరించుచు నా జక్కుల పురంధ్రి పాటయే జక్కులపాట యనియు నది

77, Vide 'South Indian Theatre' By K. R. Pisharoti – Chap. IX of 'The Theatre of the Hindus' published by Susil Gupta Ltd., Calcutta—12. 1955.

78. Vide (a) 'The Music of the Nrtyanatakas of South India' – Thesis submitted by Srimathi K. Gomathi for the M. Litt of the Madras University. (b) 'The Language of Kathakkali' By Sri Premakumar Thamma, pp. 15.

యక్షగానమను సంస్కృత శబ్దమునకుఁ దెనిగింపు కావచ్చుననియు వ్రాక్రుచ్చినారు.

4. ఇ త ర వి ష య ము లు

యక్షగానమునకన్యదేశీయ రూపక ప్రక్రియలలోఁ గొన్ని టితోఁ గొంత కొంత సాదృశ్యము గలదు. ఉదాహరణమునకు :— మనయక్షగాన ప్రదర్శనములలోని హంగుదారుల వంతపాటకుల మేళ మించు మించు ప్రాచీన గ్రీకునాటకములలోని "కోరస్" బృంద గానముచేయు గాయకబృందమువంటిది. యక్షగానము గుఱించి వ్రాయుచు నొక రీ విషయము నిట్లు సూచించినారు గూడ * :—

"Its technique may roughly be compared to the Greek drama in its simplicity of expression and the importance of the element of chorus in it."

కాని యీ సాదృశ్యవిషయమునకుఁ గలిసివచ్చునుగదా యని వెనుకటి (అలెగ్జాండరు చంద్రగుప్తమౌర్యులనాఁటి) గ్రీకు భారతీయ సంబంధబాంధవ్యముల చారిత్రక విషయమునుగూడ బారుచేసి యెవరైన యక్షగాన మీ యవనరూపక కళనుండియే యావిర్భవించిన దనినచో ఆ యనుట ఫలితములేని ద్రావిడప్రాణాయామముపట్టుటయే యగును.

యక్షగానమువలె గానప్రాధాన్యము, హంగు, పౌరాణికేతి వృత్తముల ప్రతిపత్తి, ప్రదర్శన నిరాడంబరత, జనసామాన్యానురంజకత్వము మొదలగు లక్షణములు గల వంగదేశపు యాత్ర [79] లకును,

* Vide "Yakshagana and other plays of Mysore" an article by Sri S. Srinivasachar, Published in The March of India Vol. IV – No. 6.

79. Vide, Chap. IV, item IV of "History of Bengali Language and Literature" by Sri Dinesh Chandra Sen.

యక్షగానములకును (పండితరాధ్య చరిత్రలోని శ్రీశైల క్షేత్రము నందలి శివరాత్రి వినోదములు పేర్కొనబడిన సందర్భమునుబట్టి) యాత్రాస్థలములే జనుఃస్థానములై యుండునని యూహింపఁ గల్గినచో నది యొక సాదృశ్యమే యగును గాని యుత్పత్తి దశలోఁ గాని పరిణామమునఁగాని వానికి సంబంధముగల దనుటకు సత్యసన్నిహితమైన యుపపత్తి మాత్రము గాఁ జాలదు.

ఇట్లే యక్షగానముతో నితివృత్తమునందో, రచనా ప్రణాళిక యందో, ప్రదర్శన సంప్రదాయమునందో యంతంత మాత్రము సాదృశ్యము గల యన్యదేశీయ రూపక ప్రక్రియ లనేకము గలవు. దానికిఁ గారణమించు మించవి యన్నియు నొక్క పాదునుండి మొలిచిన వగుటయే కావచ్చును. ఒక్క పాదనఁగాఁ గృతక ప్రవృత్తికిఁ బ్రసక్తి లేని నిసర్గమధుర నిరాడంబర స్నిగ్ధజన ముగ్ధభావ ప్రకృతుల కాట పట్టయిన జనపదము. — ఒక్కొక్కచో యక్షగానమునకును దాని పరిణామ దశలలో నన్యప్రక్రియలతో నాపాటి యీపాటి సంబంధము నేర్పడినదన్నచో నదియొక వింతగాదు. సదృశ ప్రక్రియలకుఁ బ్రాదేశిక మైన సన్నిహితత్వ మేర్పడినచో సంబంధము నేర్పడుట సహజముగదా.

యక్షగానోత్పత్తి విషయమై పైనుదాహరింపఁబడినవాదములు సంబంధ సంవాదులు కొన్ని, సాదృశ్య సంవాదులు కొన్ని. కాని జక్కుల జాతిసంబంధ వాదమువలెఁ గడమవాదములు చక్కగాఁ బొదు కొనియుండలేదు. యక్షగాన నామోత్పత్తి నవి సమర్థింపలేవు.

ఇఁక యక్షగాన శబ్దార్థమును గూర్చి శ్రీ యమ్. గోవిందరావు గారు తమ వ్యాసమున [80] లడ్విగ్, గెల్డ్‌నర్ అను పాశ్చాత్య

80. Vide, Madras University Annals of Oriental Research Vol. X - Part II for his paper on the Yakshagana in Karnataka.

పండితు లిరువురు యక్షశబ్దమునకు "ఉత్సవము" (Festivity) అను నర్థము చెప్పినారనియు, నదికాని యంగీకార్యమగుచో యక్షగాన మనఁగా నొకయుత్సవ సమయమునఁజేయబడు సంగీతగోష్ఠియని చెప్ప వచ్చుననియు ననియున్నారు. యక్ష శబ్దమసలు ప్రత్యవసానార్థకమైన "జక్ష్" అను ధాతువువలన నేర్పడినట్లు తోఁచును. యక్షులు పుట్టఁగనే బ్రహ్మదేవునిఁ దినుటకు యత్నించిరనియు, నతఁడు "మామా జక్షత" యని వారినిఁ బ్రార్థించెననియు, వాఁకే నాఁటినుండి యక్ష శబ్ద వ్యవహృతులైరనియు భాగవతము తృతీయ స్కంధమునఁ (20 అధ్యా. - 21 శ్లో.) గలదు. యక్షశబ్దార్థమేదైనను నది యక్ష జాత్యుత్పత్తిని సమర్థించునుగాని యక్షగానోత్పత్తిని సమర్థింపదు. దానికి యక్షశబ్దార్థముతోఁగాక గానప్రియులైన యక్షశబ్దవాచ్యుల తోనే యేదో సంబంధముండి యుండుననుట లెస్స. ఈనాఁడాధారము లుపలబ్ధములైన యంతలో నా యక్షశబ్దవాచ్యులు మన జక్కులును, గన్నడదేశపు మొక్కల గాణలునైయుందురని యూహించుటయు లెస్సయగును.

యక్ష గానము

ప్రాచీనత – ప్రాథమికావస్థ

యక్షరాత్రి, బౌద్ధయక్షులు, జక్కిణి మొదలగు విషయముల తోడి సంబంధము నేదైన స్థిరపఱుపఁ గల్గినచో యక్షగాన చరిత్ర మతి చిరంతనమైనదని చెప్పవచ్చును. కాని యట్టిసంబంధమును స్థాపించు టకుఁదగిన యాధార సామగ్రిసౌలభ్యము కానరాని యీనాఁడది కడు కష్టసాధ్యము. ఆధారము లుపలబ్ధమానము లగుచున్నంతలో యక్ష గాన చరిత్ర మంతప్రాచీనమైనది కాదనియేచెప్పవలెను. కాని కన్నడ పండితులు కొందఱు తమ వాఙ్మయమున యక్షగానము కొంత ప్రాచీనమైనదనియే తలంచుచున్నారు:–

"Kannada Scholars are of the opinion that as early as the 9th Century A.D., this kind of composition could be traced. They suggest that "Chattana" "Nalpagarana" etc., mentioned in Kavirajamarga of Nripatunga (814-817 A.D.) are nothing but Yakshagana Works." [81] కాని కవి రాజమార్గమునఁ బేర్కొనఁబడిన చత్తాణాదులకు లక్ష్యగ్రంథము లిపుడు కన్నడ వాఙ్మయమున లభించుటలేదు. "But unfortunately no composition of this kind has come down to us to verify their statements" అని యనియున్నారు గోవిందరావుగారు. అయితే కవిరాజమార్గమున వాని లక్షణ ముక్తమైనది. అది పరిశీలనార్హము.

"కందము మమళిన వృత్తము
మొందొందడె గొందు జాతి జాణెనె యె బెడం
గొంది వరీళ మరె పేఱు
ల్సుందర రూపిం బెదెండె గబ్బ మదక్కుం"

కవిరాజమార్గము. 1-34.

"కందళ్పుల వాగిరె
సుందర వృత్తం గళక్కరం చవు పది మ
త్తంగ్గీతకె తివదిగ
ళందంబుత్తె సెయె పేట్రా డదు చత్తాణం"

— కవిరాజ మార్గము. 1 - 35.

అనఁగా నొకకందము, పిదప నొకవృత్తము చొప్పున రచించుచు నొక్కొక్కయెడ జాతుల ననుసంధించినచో నది 'బెదండె' కబ్బ మగును. పలు కంద పద్యములతో నందమైన వృత్తములను, అక్కర, చవుపది, గీతిక, తివది (త్రిపది) మొదలగు వాని నందముగా ననుసంధించి

81. Ibid., Mr. M. Govindarao's Paper, P. P. 3-4.

సంధించినచో నది చత్తాణ చంద మగును. పై రెండింటను గంద పద్యము ప్రాధాన్యము, వృత్తముల ప్రతిపత్తి, అక్కరాది జాతుల యక్కఱ విశదమగును. కాని నేఁ డుపలబ్ధము లగు కన్నడ యక్ష గానములను[82] పరిశీలించినచోఁ గందములు నందందు వృత్తములును గలవు కాని అక్కరాది జాతులన్నియును లేవు. అక్కర లసలు లేవు. కడమవానిప్రయోగ మతివిరళము. వానిలోఁ గవిరాజమార్గమునఁ జెప్పఁబడని రగడ వికారములగు తాళప్రభానములగు శేకులకును, ద్విపదలకే ప్రాధాన్యము. మఱియు వానిలో వచనములు, పదములు, అర్ధచంద్రికలు, షట్పదులు, ధవళశోభనములు మొదలగు రచనా విశేషములు గలవు. ఇవియుఁ గవిరాజ మార్గబెదండె చత్తాణకావ్య లక్షణములందుఁ జేరొక్కనఁ బడలేదు. పై బేరొక్కనఁబడిన కన్నడ యక్షగాన లక్షణములే తెలుఁగు యక్షగానములందును గన్పట్టును. చూడఁగా నా బెదండె చత్తాణము లేవో సామాన్యములైన నిర్వచన పద్యకావ్యములై యుండుననిపోఁచును గాని యక్షగానము లనిపింపవు.

ఇఁక గవిరాజ మార్గమునఁ బేరొక్కనఁ బడినఁ నాళ్ పగ రణాల విషయము : నాళ్ - నాడు అనఁగా దేశము, పగరణ - ప్రకరణ ముఅనఁగా రూపకము. (అసలు ప్రకరణము ప్రసిద్ధ సంస్కృత దశ రూపక ప్రభేదము. మాలతీ మాధవ మృచ్ఛ కటికాదు లట్టివి. కాని యీ లక్షణ మిటఁ బ్రస క్తము కాలేదు. ప్రకరణశబ్ద మిట రూపక సామాన్యవాచిగాఁ బ్రయు క్తమైనట్లు తోఁచును.) అనఁగా దేశీయ మగు నొక రూపక విశేష మని యర్థము. ఇందుఁ గ్లిష్ట కల్పనాదులు దోషము లనియు, గ్రామ్యాశ్లీల భాషణములు హాస్యరస భాజనములు

82. చూ. — ప్రా. లి. పు. భాం., డి. నంబ్లు.: 413, 1168, 1169, 1175, 1178, 1181, 1183, 1185, 1186, 1200, 1204, 1210, 1212, 1220.

కాఁగలవు కాన నవి దోషము లనిపించుకొన వనియుఁ గవి రాజ మార్గమునఁ గలదు. (చూ. ఆ. 1 - ప. 66 - 68) ఈ లక్షణము యక్షగానములకేగాదు సామాన్య జనామోదకము లగు దేశి రూపక ముల కన్నిటికినిఁ దగి యున్నది. అవి యక్షగానములే యని నిష్కర్షతోఁ జెప్పవలనుపడదు. ఇట్లే నృపతుంగునకు సుమారొక శతాబ్ది (పై చిలుకు) యర్వాచీనుఁడగు నాగవర్మ రచించిన కన్నడ కావ్యావలోకనములోఁ బేరొక్కనఁ బడిన "పాడుగబ్బ" లు, "బాజనగబ్బ" లు ననునవి గేయ కావ్యములు, గేయాభినయానుకూల దృశ్య ప్రబంధము లనియుఁ దెలియు చున్నది.[83] కాని యివియు యక్షగానము లని నిష్కర్షతోఁ జెప్పవలనుపడదు. అయితే యివి యన్నియుఁ గన్నడదేశమున సంగీత నాట్యకళల కానాఁడుగల "పరపతి" నిఁ దెలియఁ జేయఁగలట్టివైనఁ గావచ్చును.

అసలు కన్నడమున యక్షగాన రచన మిగుల నర్వాచీన మైనది. ఆ విషయమును బలువురు కన్నడ పండితులే యంగీకరించి యున్నారు.[84] ప్రత్యేకముగ కన్నడ యక్షగాన వాఙ్మయముగుఱించి పరిశోధన చేయబూనిన శ్రీ ఎమ్. గోవిందరావుగారు దాని గురించి వ్రాయుచు "In a study of a good number of yakshagana works, I was not able to come accross a work earlier than the end of the 17th century" అని వక్కాణించియున్నారు. + తమిళమున యక్ష

83. చూ. కన్నడ కావ్యావలోకనము. సూత్ర. 245-249.

84. Vide., (1) A History of Kanarese Literature by Mr. E. P. Rice, p. 100. (2) History of Kannada literature by Sri R. Narasimhacharya, p-25. (3) "Turning points of Kannada literature", paper by Sri M. Mariappa Bhat - Ref: Madras University Annals of Oriental Research Vol. V - Part 2.
+ " " Vol. X - Part 2.

గాన రచన మఱియు నర్వాచీనమైనది. తెనుఁగునఁనే ప్రాచీనతమ మైనది. ఈ సందర్భమున డాక్టరు శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారి వాక్యములు స్మరింపఁదగినవి:— "తెలుగు యక్షగానములు ప్రాచీన తమములు. తమిళ కన్నడ యక్షగానము లాదేశములందాంధ్రుల వ్యాపన మతిశయించిన పిమ్మటనే రచింపఁబడెను"[85] అయితే తెనుఁగు యక్షగాన రచన మెంతో ప్రాచీనముగాదు. క్రీ. శ. 16వ శతాబ్దికి ముందునాఁటి యక్షగానరచన తెనుఁగునఁ గానరాదు. క్రీ. శ. 15వ శతాబ్దికి ముందు యక్షగానరచన జరిగినట్లే తెలియవచ్చుటలేదు. కాని యక్షగాన మొకసాహిత్య ప్రక్రియగా నవతరించుటకుఁ బూర్వరంగ ముగాఁ గొంతచరిత్ర యుండకపోదు. 15వ శతాబ్ది పూర్వార్ధమున వెల సిన మనక్రీడాభిరామమున జక్కుల పురంధ్రుల పాటలును యక్షకన్యల యాటలును ప్రసక్తములైనవికదా. అసలు యక్షగానశబ్దమే యదియొక ప్రత్యేకమైన గానశైలియను నర్థమున నానాఁటి భీమ ఖండమునఁ బ్రయుక్తమైనదికదా[86]. పండితారాధ్య చరిత్రయందలి యక్షాది

---

85. చూ. వారి మధుర తంజావూరు నాయకరాజుల నాటి ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, పుట 88.

86 ఆచార్య శ్రీ విస్సా అప్పారావుగారి "ఆంధ్రుల నాట్యకళ — కూచిపూడి కళావైభవము" అను వ్యాసమున (1954 సం. విజయవాడ శ్రీ కనకదుర్గా కళా సమితి తృతీయ వార్షికోత్సవ సంచికలోఁ బ్రచురితము) "కులోత్తుంగ చోళదేవుని శాసనములో నట్టువమేళములవారు యక్షగానముల నాడిరని యున్నది" అని వక్కాణించియున్నారు. చోళరాజులలో క్రీ. శ. 11-13 శతాబ్దుల నడుమ కులోత్తుంగ చోళదేవ నామధేయులు పలువురున్నారు. (చూ. న్యాయలు – దక్షిణ హిందూదేశ శాసనములు) కాని యందెవరి శాసనమునను యక్షగాన శబ్దము కాన వచ్చుటలేదు. చోళరాజుల శాసనములలో రెండిట (154 ఆఫ్ 1895, 120 ఆఫ్ 1925) 'అరియకూత్తు' ప్రసక్తిగలదు. దానినే శ్రీ అప్పారావుగారు యక్ష గానమనుకొనిరేమో; ఇప్పటికి నే నెఱిఁగినంతలో యక్షగానశబ్దము గానవచ్చు గ్రంథములలో శ్రీనాథుని భీమఖండమే మొట్ట మొదటిగాఁ గనుపట్టుచున్నది.

నేపథ్యముల తోడి యాటపాటల ప్రసక్తిని బరిగణించినచో యక్ష గానము చరిత్ర మింకొక శతాబ్ది వెనుకకుఁబోవును. కన్నడవాఙ్మయ మునందలి "అగ్గళుని చంద్రప్రభా పురాణము", అభినవ పంపని మల్లినాథ పురాణములందలి "ఎక్కలగాణ"ల ప్రసక్తి నెత్తు కొన్నచో యక్షగానచరిత్ర క్రీ. శ. 12వ శతాబ్దిదాఁక నెగఁబ్రాకఁ గలదు. అంతకు మించినదంతయు నుపాధి సమగ్రముగాని యూహా గానమే.

ఇఁక యక్షగానముయొక్క ప్రాథమిక స్థితి యెట్టిదో యించుక పరిశీలింతము. క్రీ. శ. 12 వ శతాబ్ది నాఁటి కన్నడ చంద్ర ప్రభా పురాణములో "వనవిహారం చేస్తూన్న నాయకుఁడు మేళ తాళాలతో నిమిత్తంలేకుండా దేశీయ గీతాన్నొకదానిని ఒక "ఎక్కల గాణ" యింపుగా పాఁడుతూ వుంటే విన్నాడని వర్ణించ బడింది"87 దీనిని బట్టి మేళతాళములతో నిమిత్తములేని యెక్కల గాణల జాతీయ గీతాలాపము యక్ష గానోత్పత్తికిఁ బ్రాతి పదిక యైనదని తోఁచుచున్నది. ఆశతాబ్దిలోనే వెలసిన మల్లినాథపురాణములో "కమలామోదియైన తుమ్మెద ఝుంకారం కమలాలయయైన లక్ష్మిని కీర్తిస్తూ పాడే "ఎక్కల" గానంతో పోల్చి వర్ణించబడింది"88 అనఁగా నా యెక్కలగానము లేక యక్షగానము దేవతా స్తుత్యాత్మకమైనదని తెలియుచున్నది. శ్రీనాథుని భీమఖండమునందలి దక్షారామ ప్రశంస సందర్భమునఁగల "కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు, గాంధర్వమున యక్షగాన సరణి" అను వాక్యమును జూచినను నాఁడు యక్షగానము దైవస్తుత్యాత్మకమైన యొకప్రత్యేక గానశైలిగాఁ బరిఢవిల్లుచుండినదని స్ఫురింపఁజేయుచున్నది. మల్లినాథపురాణములోనే "యక్షాందోళన" మను నృత్యముగూడఁ బ్రసక్తమైనది. ఈయాం

87, 88. చూ. శ్రీ సంగమేశంగారి వ్యాసము – భారతి, ఫిబ్రవరి, 1956.

దోళికా (ఆందోళన మన్నను ఆందోళికయన్నను నర్థమొక్కటే. చూ. - సూ. రా. ని.) నృత్యముగూర్చి శ్రీ ముట్నూరి సంగమేశం గారిట్లు వ్రాయుచున్నారు:-[89] "కన్నడ యక్షగానాల్లో నటి వేషాన్ని యక్షిణీ వేషమనీ, శ్రీవేషమనీ, మోహినీవేషమనీ పరి పరివిధాల పిలుస్తారు. ఈమె మొదటిసారి రంగస్థలానికి వచ్చినప్పుడు నడుమువరకు అట్టతో కట్టిన ఒకతొట్టెవంటి చౌకంలో నిల్చి నృత్త గతులు ప్రదర్శిస్తుంది. ఈ నృత్తాన్ని ఆందోళికా నృత్యమనీ, మంచె చప్పరనృత్యమనీ పిలుస్తారు." యక్షగానములలో యక్షిణీవేషము[90]తో నొక రాందోళికా నృత్యము నెఱపుట జూడ యక్ష గానమునకును యక్షాందోళనమునకు నేదో సంబంధ ముండియుండు ననిపించును. అనఁగా క్రీ. శ. 12 వ శతాబ్దినాఁటికే యక్షగానమునకు నృత్యకళా సాహచర్యమును గల్గినదన్న మాట. ఎక్కులగానము నీ యక్షాందోళనము ననునవి రెండును, ఆటతోడిదే పాట పాటతోడిదే యాట అనునట్లెవరో యక్షగాన వేషధారుల జాతీయ వృత్తివిద్యయొక్క కవలరూపులై యుండును. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో యక్షాది నేపథ్యములతోపాటు వేరొక్కనఁబడిన పాటయు, నాటయు, క్రీడాభిరామమునఁ బేరొక్కనఁబడిన జక్కుల పురంధ్రి యక్ష కన్యల యాటయు నీవిషయమును సమర్థింపఁగలవు. పండితారాధ్య చరిత్ర వక్కణలో యక్ష నేపథ్యసూచనయు, క్రీడాభిరామ జక్కుల పురంధ్రి పాటలోఁబాటతో పా టుపకరణములు నామె గానముతోఁ గథాఖ్యానముచేసిన వైనము వేరొక్కనబడుటయు, యక్షకన్యల నృత్య ములో మతాశేష స్ఫురణమును విశేషములు.

---

89. చూ. శ్రీ సంగమేశంగారి వ్యాసము – భారతి, ఫిబ్రవరి, 1965.

90. ఈ యక్షిణి వేషము నృత్యమే జక్కిణియైయుండునా ?

యక్షగానముయొక్క ప్రాథమిక స్వరూపమా వేరే చాటు చున్నట్లు గానమైయుండుననుట నిర్వివాదము. అయితే పురాణచరిత్ర ప్రసిద్ధులైన యక్షజాతీయు లెవ్వరికిని గానకళా ప్రతిష్ఠ లున్నట్లు తగిన యాధారములు గానరానందున నెన్నఁడో యక్ష వేషధారణ మొక వృత్తిగా నవలంబించినవారని యూహింపఁ దగిన యొక్కొల గాణల, జక్కుల పురంధ్రుల గానకళాభిమానమే యక్షగానోత్పత్తికి బీజాంకురప్రాయము లైనవనియు, నా గానము స్తుత్యాత్మకముగాఁ గథాఖ్యానోపయోగిగా నృత్యానుకూలముగా నుండెడి యొకప్రత్యేక శైలికిఁ జెందియుండుట యక్షగానముయొక్క ప్రాథమికావస్థయై యుండుననియుఁ జెప్పవచ్చును.

యక్షగానము

పరిణామ చరిత్ర

[ఈ ప్రకరణ మాంధ్ర యక్షగాన వాఙ్మయ మాధారముగా యక్షగాన పరిణామ చరిత్ర పరిశీలన కుద్దిష్టమైనది. ఈ గ్రంథము ద్వితీయ భాగమున యక్షగాన కవుల చరిత్రము కావ్య సమీక్షయుఁ బ్రాదేశిక విభాగానుసారముగను గాలక్రమానుసారముగను రచింపఁబడి యుండుటనుబట్టియు, గ్రంథ విస్తర భీతిచేతను నిపు డీప్రకరణమున యక్షగాన పరిణామ చరిత్ర సంగ్రహముగా సమీక్షింపఁబడుచున్నది. దాని వివిధదశల ప్రక్రియా పరిణతికిఁ బ్రతినిధులైన కొలది గ్రంథముల విశేషములుమాత్రమే యిందుఁ బ్రస క్తమగును. ఇందును స్పష్టతకొఱకు సౌలభ్యము నిమిత్తము ప్రాదేశిక విభాగ కాలక్రమానురోధమైన సమీక్షాపద్ధతియే పాటింపఁబడినది. ఈ ప్రకరణమునఁ బేర్కొనఁబడిన యక్షగాన కవి కావ్యముల కాలముల నిర్ణయములు, ప్రతి వివరములు మొ॥ విషయములను ద్వితీయ భాగ మును జూచునది. పరిశీలన సౌలభ్యముకొఱకు అకారాది క్రమ కవి నామ సూచిక తుది ననుబద్ధమైనది.]

ప్రస్తావన

యక్షగాన పరిణామ చరిత్ర మతిచిత్రమైనది. రచనలోఁ బ్రబంధ నలోఁ దరతరమునకును బరిణామమందుచు వచ్చినది. మొదట యాత్రాస్థలములు, కామేశ్వరీ వ్రత సంప్రదాయ పరాయణులైన కామందుల లోగిళ్లును, తదుపరి పల్లెపట్టుల రచ్చసావడి, పాడిగలి గిన రాచదేవిడీలును యక్షగానము ప్రదర్శనల కధిష్ఠానములైనవి. అది వివిధప్రదేశములకు విస్తరించుటవలన నాయాప్రాంతములందలి వివిధ శ్రవ్యదృశ్యాత్మకములైన సాహిత్య ప్రక్రియలతో ననుబంధము బెనుపొందించుకొన్నది. వివిధ గీతిచ్ఛందస్సులను దనలో నిముడ్చు కొన్నది. యక్షగాన రచన గ్రాహకకరణములు, బొమ్మలాట రైతులు మొదలగు జానపదకవుల గంటముల నుండి నగరములందు రాజస్థాన ముల నాశ్రయించిన పండిత కవుల పైడిగంటములకును బ్రాకినది

కవి రాజుల గంటములే కాదు రాజకవుల గంటములును యక్షగాన సరస్వతి కాశ్రయములైనవి. పలుకులముల పలుతరగతుల కవులకుఁ దద్రచనావకాశములు గలిగినట్లే జక్కులు, నెటుకులు, నేనాదులు, గొల్లలు, బ్రాహ్మణులు మొదలగు పలు తెగలవారికిఁ దత్ప్రదర్శనావ కాశములు గలిగినవి. మొదట గానరూప కథాఖ్యానముగ గ్రామ సీమలఁ బామరగాత్ర మాత్రోపజీవిగా నుండిన యక్షగానము నాఁడు నాఁటికి వాడవాడల నాడఁబడుచుండిన వీధి నాటకపు వాటమెఱిఁగి రాచనగరి మొగసాలల కెగఁబ్రాకి రంగభోగము నవధరించుటతో మార్గరూపక ప్రభావము నభిసరించి నాటకనామకరణము చేయించు కొన్నది. కోటలోని రాజుగారికిని బేటలోని ప్రజలకును సమాన ముగా నాదరపాత్రమైనది. తెలుఁగు భాషకుఁ బలుకుబడిగల పలు తావుల వెలసినది యక్షగానము. పలుతరగతుల ప్రజాజీవితోదంత విశేషములను బ్రతిబింబించుకొన్నది. పలువిధముల కథల కాశ్రయ మైనది. పాఠ్య గేయ నాట్యాత్మకములైన పెక్కు ప్రయోజనముల కిక్కువయైనిలిచినిది. అదియొక సార్వజనీనమైన బహుముఖ ప్రయో జన సనాథమైన సాహిత్య ప్రక్రియగాఁ బరిణమించినది. ఈ పరిణామ మంతయు నేఁడెనిమిది శతాబ్దుల చరిత్రగలది.

యక్షగానముయొక్క ప్రాచీనత యెంతయో, ప్రాథమిక స్థితి యెట్టిదో మీఁదఁ బరిశీలింపఁ బడినది. క్రీ. శ. 12వ శతాబ్దికి ముందుకాలము యక్షగాన చరిత్రలో నజ్ఞాత యుగము. అది యక్ష వేషధారణము వృత్తిగా నవలంబించియుండుటచే నేర్పడియుండదగు నని యూహింపఁదగిన ఎక్కలగాణల, జక్కులజాతుల ప్రాదుర్భవ స్థితిగర్భితమైన కాలమైయుండునని యూహింపవచ్చును. అనఁగా వారిమూలమున వాసికెక్కియుండునని యూహింపఁదగిన యక్షగా

నము ప్రారంభ దశలోనే రూపారోపము గలదని చెప్పవలసివచ్చును. కాని యీ రూపారోప మా జాతుల యుత్పత్తికేగాని యక్షగాన రూపక కళా పరిణతికి సద్యఃకారణమై యుండునని చెప్పలేము. ఆ యక్షరూపారోపము తోడి యాటపాటల ప్రసక్తి పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలోఁ గలదనఁగా + నా సంప్రదాయము పదునాల్గవ శతాబ్ది దనుక వచ్చుచున్నట్లే చెప్పవచ్చును. కాని యందితివృత్తము మొదలగు విషయముల ప్రసక్తి కానరానందున నాఁటికది రూపక కళా సమగ్ర స్వరూపమును నిరూపించుకొన్నట్లు కాదు. సాహిత్య ప్రక్రియగానైన రూపొందినట్లుగానరాదు. అట్లే యైయుండినచో వీరశైవ మత ప్రవర్తకుఁడైన ద్విపద రగడోదాహరణాద్యనేక దేశి సాహిత్య ప్రక్రియల నతిప్రీతి నాదరించిన సోమన రగడద్విపదలకే ప్రాధాన్యము గల యక్షగానమునుగూడ నొక్కటైన రచించి దానినొక ప్రచార సాధనముగా వినియోగించుకొని యుండఁడా? అసలు 15-16 శతాబ్దులకుముందు నాఁటి యక్షగాన మొక సాహిత్య ప్రక్రియగాఁ గాని రూపక ప్రక్రియగాఁగాని రూపొందినట్లాధారములు గానరావు. అయితే యంతకుముందు మన యాంధ్రులకు మార్గ నాటకములవంటి నాటకములు (క్రీడాభిరామం వినా) లేకపోవచ్చునుగాక కాని యక్షగానము వలె దేశిసరణికిఁజెందిన నాటకములు కొన్ని లేకపోలేదు. మనవలెనే పూర్వకాలమునఁ దమిళులు కన్నడిగలు మొదలగు మఱికొందఱికి మార్గనాటకములవంటి నాటకములు లేనట్లు తెలియవచ్చుట యబ్రము. కాని యాటవిక జాతులకే యాటపాటల యందాస్థయున్నట్లు తెలియుచుండ నాగరక జాతులకు నాటక కళాభిరుచియన్నది సహజముగదా. ఆ నాఁటి మన దేశినాటకములే వీధి నాటకములనుపేరఁ బ్రసిద్ధికెక్కినవి. అట వీధిలో నాడఁబడు నాటకము

+ "అదట గంధర్వ యక్ష విద్యాధరాదులై పాడెడు నాడెడువారు"

లని యర్థము. (వీధి యనఁగా నిట దశరూపక ప్రభేదముగాదు. నాటక శబ్ద మిట రూపక సామాన్య వాచి) ఇది కన్నడిగల "బయలాట", తమిళుల "తెరుకూత్తు" అను వానికి సమానార్థక మైనది. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలోనే[1] నాటకములు, బహురూపకములు, వెడ్డంగము, తోలుబొమ్మలాటలు మొదలగు రూపకప్రక్రియలనేకము వేరొక్కనఁబడినవి. జవనికలు, పాత్రల యాహార్యకము, ప్రదర్శన ప్రరోచన, అభినయభంగులు, సంగీతపుహంగు మొదలగు నాటకపుతంతు వివరింపఁబడినది. త్రిపురవిజయము, కామదహనము, అర్ధనారీశ్వరము, అంధక గంధగజాసురవధము, దక్షాధ్వరధ్వంసము, క్షీరసాగరమథనము, సిరియాళ చరిత్ర[2] మొదలగు నాఁటి నాటకేతి వృత్తములును బేరొక్కనఁబడినవి. ఇందలి కథలు కొన్ని పిదపకాలమున యక్షగానవస్తువులునై నవి. ఇవికాక క్రీడాభిరామమునఁ[3] బేరొక్కనఁబడిన మాచల్దేవి చరిత నాటకము, విజయనగర ప్రభువు వీరనరసింహరాయల (క్రీ. శ. 1506-1509) కొలువులోఁ గూచిపూడి బ్రాహ్మణ భాగవతులు ప్రదర్శించినట్లు తెలియవచ్చిన[4] సంబెట గురవరాజు నాటకము, క్రీ. శ. 1514 నాఁటి కర్నూలు జిల్లా చెఱువు బెళగల్లు శిలాశాసనమున[5] నందుఁబేరొక్కనఁబడిన తాయికొండ నాటకము మొదలగునవి

---

1. చూ. పర్వత ప్రకరణము., పుటలు 432-462.
2. బసవపురాణము. అ. 4.
3. 181 వ పద్యము.
4. Local Records., Vol. 56, p p 66 onwards.
5. A. R. E. 558 of 1915.

ఈ రెండిటి విషయము నెత్తిచూపిన వారు డాక్టరు శ్రీ వేలటూరి వెంటక రమణయ్య గారు. చూ. వారి 'యక్షగానము - తంజావూరు' అను వ్యాసము ఆంధ్రపత్రిక ఖర సంవత్సరాది సంచిక.

యక్షగానములుగా నీ నాఁడు కొందఱు పరిశోధకులచే భావింపఁబడు చున్నవి కాని యట్లుభావించుటకుఁ దగిన యాధారమేమియు లేదు. అవి వీధి-తెరనాటకములు[6] కోవకుఁజెందినవి మాత్రమేయైయుండును.

పూర్వము బహుధా సంస్కృత సాహిత్య ప్రవణులైన మన కవులు సంస్కృతనాటకములవంటి నాటకములను దెనుగుఁన సృజింపరైరి సరికదా, ఆనాటకములనే నాటకములుగా నాంధ్రీకరింపలేదు. కొన్ని టిని బద్యప్రబంధములుగా మాత్రమే పరివర్తించిరి.[7] (క్రీడాభిరామ మొక్కటి యిందుల కపవాదము) ఆనాఁడు రాజాస్థానములందు సంస్కృత నాటకములు ప్రదర్శింపఁ బడుచుండెడి వనియు, జనస్థానము లలో వీధినాటకములు, బహురూపములు మొదలగు తెరనాటకము లును ప్రచారమందుండెననియు నూహింపవలసియున్నది. కాలక్రమ మున వాని ప్రభావము యక్షగానముపైఁగూడ బడి యది యాకృష్టు లైన శిష్టకవులు కొందఱు తద్రచన జేపట్టగనే రూపకకళ కొంత సంతరించుకొని యొక విశిష్టప్రక్రియగా రూపొంది రాజప్రజామోదము లను సమపాళముగాఁ బూఁబంగొని వీధినాటకమనియుఁ బేరొందె దేశ సరణికిఁ జెందిన నాటకములకెల్లఁ బ్రతినిధిగా నిలిచినది. మనకు నాటక కృతులులేని లోటు తీర్చినది. దీనిప్రాభవము మూలముగనే మొన్న

---

6. తెనాటకముల ప్రసక్తి పండితారాధ్యచరిత్ర పర్వత ప్రకరణమునఁ గలదు. అవి జంగాలచేఁ బ్రదర్శింపఁ బడుచుండినట్లు బై. వెంకట నాథుని పంచ తంత్రమునను (4 – 240), అ. నారాయణ కవి హంసవింశతి (3 – 29) యందును గలదు. నాఁడు జంగాలు జక్కుల వలె గానాత్మకకథాఖ్యానములను జేసెడినాఁడు. జంగం కథలు వారి పేరనే ప్రసిద్ధములైనవికదా.

7. ఒకఉదా. నందిమల్లన్న, ఘంటసింగయల ప్రబోధ చంద్రోదయాంధ్రీకరణము.

మొన్నటి దనుకఁ గూడ మనకవులకు మార్గనాటకములవంటి నాట కములు రచింపవలసిన యావశ్యకత కన్పింపకపోయి యుండవచ్చును.

పాల్కురికి సోమనాథుని నాఁటికే యక్ష నేపథ్యములతోడి పాటగా నాటగా వెలిసియుండునని యూహింపఁ దగిన యక్షగానమున కాంధ్రమున నాప్రదర్శకులొక విశిష్టజాతిగా నేర్పడినపిదపఁ గొంత కాలమునకు యక్ష నేపథ్యములతోడి సంబంధము సడలి గానము నకే ప్రాధాన్యము వెచ్చి యుండును. పదునైదవ శతాబ్దిలో భీమ ఖండోదాహరణమును[8] బట్టి యది స్తోత్ర పాఠోప యోగి యైన యొక ప్రత్యేక గాన శైలి యనియు, క్రీడాభిరామోదాహరణ మును[9] బట్టి యది జక్కుల పురంధ్రిచే నెక్కటిగా శ్రుతి లయాత్మక వాద్యోప కరణ సహితముగా, రాగ తాళ మాన స్థాయి గమక

8. "కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరణి" (భీ. ఖ. 3 — 65.)

9. కోణాగ్ర సంహత్న ఘుమ ఘుమ ధ్వాన తారి
కంతస్వరంబుతో గారవింప
మసిబొట్టు బోనాన నసలు కొల్పిన కన్ను
కొడుపుచే దాటించు నెడప డడప
శ్రుతికి నుత్కర్షంబుఁ జూపంగ వలయు చోఁ
దెవి త్రాడు బిగియించు జీవ గట్టి
గిల్కు గిల్కున క్రోయు కింకిణీ గుచ్ఛంబు
తాళమానంబుతో మేళవింప
రాగమున నుండి లంఘించు రాగమునకు
నురుమ యూపద్వయంబు సై నొ త్తిగిల్లి
కామవల్లీ మహాలక్ష్మి కైటభారి
వలపు వాడుచు వచ్చె జక్కుల పురంధ్రి"

క్రీ. రా. 135.

నిహితముగా గథాఖ్యాన పురస్సరముగా ప్రయోగింపఁ బడు చుండెడిదనియుఁ దెలియుచున్నది గదా. క్రీడాభిరామమున నా జక్కుల పురంధ్రి పాటతోపాటే అక్కల ('యక్ష కన్యల') యాటయు నర్మితమై యుండుట (క్రీ. రా. 136 - 137) నా గానము నృత్యానుకూలమైనదనియుఁ దెలియ నగును. ఇంకను నానాఁటి దాని ప్రత్యేకత యెట్టిదనఁగా - క్రీ. శ. 1408 - 1503 సం. ల నడుమ నుండిన, సంకీర్తనాచార్యుఁడని ప్రఖ్యాతిగాంచిన తాళ్ళపాక అన్నమాచార్యుని పౌత్రుఁడైన చిన తిరుమలా చార్యుఁడు (1537 ప్రాంతము) సంకీర్తన లక్షణ మను సంస్కృత గ్రంథమును స్వప్రితామహకృతమును స్వజనక వ్యాఖ్యాతమును (ఇది యలభ్యము) దెనుఁగు జేయుచు[10] దరువులు, జక్కుల రేఁకు లేలలు, చందమామ పదములు మొదలగు వానిని మొదటఁ బేర్కొనుచుఁ బిదపఁ గొన్నిటి లక్షణములు నిర్వచించి యక్షగాన పదములఁ గూర్చి యిట్లు వ్రాసెఁ జెప్పెను:—

"యక్షగాన పదంబులునవ్విధమున
సముచితానేకవిధ తాళ సంగతులను
నవరసాలం క్రియా సవర్ణంబు లగుచు
నలరు నని హరి కీర్తనా చార్యుఁ డనియె"

సం. ల. 66 వ పద్యము.

అతఁడు దరువులు నేలలు మొదలగు పదములకు లక్షణమును చెప్పి యుండెను. కాని వానితోఁ పాటు మొదట జక్కుల రేకుల వేరెత్తుకొనియుఁ (చూ. 50 వ పద్యము) బ్రత్యేకముగా నా పేర లక్షణము చెప్పియుండ లేదు.

10. చూ. తాళ్ళ వాకము కవి కుటుంబ కృతి సముచ్చయము - సం. 1 తిరుపతి దేవస్థానము ప్రమురణ, 1935. వైకల్పుల కాలములు, కృతి రచనఁ గూర్చినవివరములు నీ సంపుటమునుండి తెలియ నగును.

అందు చేతను యక్షగాన పదముల నేలాదులతో పాటు మొదటఁ బేర్కొనక పోయినను నేలాలక్షణము వెంట వాని లక్షణ మును జెప్పి యుండుటను జూడ జక్కుల రేకు లన్నను యక్ష గాన పదము లన్నను నొక్కటే యని యూహింప వచ్చును. "యక్షగాన పదంబులు" అని బహు వచనము వాడఁ బడుటచే యక్షగానమనఁ గా నేదో యొక్క గీతిచ్ఛందో ఘటిత మైన దని కాక పలు విధము లైన పదములతోఁ గూడిన దని తెలియ నగును. అవి తాళ బహుళ ములును, నవరసాలంకృతములు నైన వని స్పష్టముగాఁ జెప్పఁబడినది. పైవిషయములనుబట్టి 15 వ శతాబ్దిలో యక్ష గానము కథావలంబ నము, సముచితా నేక విధ తాళ సంగతములు, నవరసాలం క్రియా సవర్ణములు నగు పదములును గలిగి కావ్య రచనోపయుక్త స్వరూప మును కల్గి యున్న దని చెప్పనగును.

యక్షగాన రచన – ప్రారంభదశ

[illegible] రచనా ప్రక్రియనుబట్టి సాహిత్య మంతయు ముత్తెఱఁగులు– పద్యము, గద్యము, పదము లేక గేయము. ఆమూడింటి ప్రత్యేక ప్రయోగమువలనఁగాని సంకలనప్రయోగమువలనఁగాని బహువిధ సాహిత్యప్రక్రియలను సాధింపవచ్చును. తెలుఁగులోఁ బదునాఱవ శతాబ్ది చివరి దాఁక వెలసిన శిష్టవాఙ్మయ మెక్కువగాఁ బద్యగద్యా భయాత్మకమైన చంపూధోరణిలో సాగిన పురాణ ములు, ప్రబంధములు, పద్యకేవలముగా నడచిన శతకములే. కాని, యప్పటికే చాలకాలముగా నే పల్లె యెల్లలలోనో పలుకుచునున్న గేయసరస్వతి శిష్టకవులచే నుపేక్షింపఁ బడినది. అయినను నిష్ట పడిన శిష్టకవులే కొందఱు పదపద్యములకు నడిమివాటముగా నడచు

నట్టి ప్రక్రియ నొకదానిని స్వీకరించిరి. అదే ద్విపద. అప్పటి యటుమార్గ పద్ధతికిఁ జెందిన కళికోత్కళికల రూపమున నవతరించిన పదకవితా ప్రభేదమగు రగడయుఁ గలిసి వచ్చిన "ఉదాహరణము" ను గూడ స్వీకరించిరి. ఆప్రక్రియ లన్నింటికి నేకవాక్యత సంఘటింపఁ గలట్టిది యక్షగానము. ఆరహస్యము గ్రహించియే కాఁబోలు కాలక్రమమున వైవిధ్యప్రవణులైన మనకవులు కొందఱు తద్రచన చేపట్టిరి.

మన కిప్పటికిఁ దెలిసి నంతలోఁ దెనుఁగున వెలసిన మొట్ట మొదటి యక్షగాన రచన క్రీ. శ. 15 వ శతాబ్ది యుత్తరార్ధమున నుండిన ప్రోలుగంటి చెన్నశౌరి సౌభరి చరితమే. అది యైన నతఁడు రచించినట్లు తెలిసినదే [10] కాని గ్రంథము లభింపలేదు. అది జక్కుల కథ యని పేరొక్కనఁ బడినది. అది తాళ్ళపాక చిన తిరుమలార్యుఁడు చెప్పిన యక్ష గాన లక్షణ మట్లు "నవరసాలంకృతముగ" నున్న దని పేరొక్కనఁ బడుట గమనింపఁ దగినది. కవి దానిని జక్కుల కొఱకు వ్రాసెనో, జక్కుల వారి గాన రూప కథాఖ్యాన ఘక్కిక మూఁ దలగా రచించి యుండుటచేత నా పేరు పెట్టియుండెనో, లేక యా నాఁడు యక్ష గాన సామాన్యముగా జక్కుల కథయను పర్యాయ వ్యవహార మున్నదో తెలియదు. సౌభరి చరితము భాగవత విష్ణు పురాణము లందుఁ గలదు. కాని దానికి యక్ష

---

10. హరి భట్టు నారసింహ పురాణావతారికలోఁ దత్కృతి యగు ప్రోలు గంటి రంగ మంత్రి వంశ ప్రశంసలో నతనికి వరుసకుఁ బినతండ్రి యగు నీ చెన్న మంత్రి ప్రశంసయు వచ్చినది. అందీతని కృతులు చేర్కొనఁ బడిన యొక సీస మున (పద్య. 33)

"సౌభరి చరితంబు జక్కుల కథ చెప్పె
లాలిత నవరసాలంకృతముగ"

అని యున్నది.

పాత్రలతో గాని జక్కుల కుల దేవత యగు కామేశ్వరితో గాని సంబంధము లేదు.[11] మన కీ నాఁడుపలబ్ధములగు యక్షగానము లన్నియు నట్టివ. చెన్నశౌరి కృతి యక్షగానమని యూహించుటయే సమంజస మగును. పదునైదవ శతాబ్దినాఁటి యక్షగాన రచన తీరెట్టిదో చూత మన్న నా కృతి యాకృతి మాసి పోయినది. క్రీ. శ. 1500 సం. ప్రాంతము నాఁటి యక్షగాన మని యూహింపఁ దగిన మఱియొక గ్రంథము పేరు వినఁబడుచున్నది. క్రీ. శ. 1500 ప్రాంతము వాఁడగు వెల్లంకి తాతంభట్టు తన కవి చింతామణి[12] యను లక్షణ గ్రంథమున భాషాలక్షణాధికారమున "లక్ష్మీకళ్యాణములోని రేకు" లను పేర "నీరజోదరురాణి నీలవేణికిని" అను నుదాహరణమిచ్చెను. రేకులను రచనా విశేషము యక్షగానములందు మాత్రమే కన్పట్టును. యక్షగానపదములకు జక్కుల రేకులను పేరున్నట్లు సంకీర్తన లక్షణము నుండి గ్రహింప నగును గదా. అయితే తాతంభట్టు నుదాహరణము ద్విపద పాదము కాని యది జంపె గతి గలది. ఆ ప్రక్కనున్న రేకను మాట కాదనరానిది. ఇది చిత్ర కవి పెద్దన యక్షగానము లందుండు నని చెప్పిన "జంపెరేకు" లక్షణమునకు సన్నిహితముగా నున్నది. (చూ. ప్రక్కపుట) పై లక్ష్మీకల్యాణము యక్షగానమై యుండునని తలంప నగును. కాని యీగ్రంథము గూడ లభింపలేదు. ఇది యత్కృతమను విషయముగూడఁ దెలిసినదికాదు. దీనినిబట్టి నాఁటి

11. ఒక దూరాన్వీతమైన యూహ :— జక్కులు కామేశ్వరీ వ్రతసంప్రదాయ పరాయణులును, సంతాన కాంక్షులు నైన వారి యిండ్లఁ జేరంటములు సేయఁ బోవుదురని క్రీడాభిరామమున సూచింపఁ బడినది. సౌభరి చరితము సంతాన కాంక్ష విషయమున కొకప్రత్యేక ప్రత్తి పత్తిగలదని భాగవత విష్ణుపురాణములందుఁ గలదు. మఱి జక్కులు సంతాన కాంక్షల యిండ్లలోఁ జెప్పుకథలలో నిదియు నొకటగునేమో;

12. తం. స. మ, కే. నం, 779–780.

యక్షగానములందు రేకనునది యొక రచనాంగమని యూహింప నగును. దాని స్వరూపమెట్టిదో యెఱుఁగుట కాంధ్రమున యక్షగాన లక్షణముగూర్చి చెప్పుటకుఁ గొంత ప్రయత్నము చేసినవారిలో మొదటివాఁడగు చిత్రకవి పెద్దన (16 వ శతాబ్ది పూర్వార్ధము) రచించిన లక్షణ సార సంగ్రహమును బలుకరింపవలెను. అతఁడు నవ విధ రగడల లక్షణమును జెప్పి వెనువెంట యక్షగానముగూర్చి యిట్లెత్తుకొనినాఁడు :-

"వృషభగతి త్రిపుడరే కంఘ్రియుగ మగుఁ
దుద నేడు లఘువులు తొలఁగఁ జేయ,
జంపె రేకునకు లక్షణము ద్విరద గతి
యగుఁ గొన నొక లఘువందు మాన,
రచ్చ రేకగును దురగ వల్గనము గతి,
మఱి యేక తాళియా మధురగతిని,
అట తాళమున మాత్ర లంఘ్రి కిర్వది నాల్గు
నాల్గిట విరతి పద్నాలు గింట
నిలుచు నర్ధంపు నర్ధ చంద్రికలు దీన
యక్షగానాది కృతులలో నార్యులిడిన *
రగడ భేదంబు లివి యాను రమ్యచర్య
యవిత నిజదాస సముదాయ! యాంజనేయ"

—ల. సా. సం. II - 141.

ఇందుఁ బేర్కొన బడిన త్రిపుటాదులు సంగీతప్రపంచమున సూళాది తాళములుగాఁ బ్రసిద్ధములు మఱి "త్రిపుట రేకు", "జంపె

*చిత్రకవి పెద్దన నాటికే యక్షగానము ఆర్యరచనగాఁ బరిగణింపఁబడిన ధన్యమాట.

రేకు" అనఁగా నవి తత్తత్తాళ ప్రధానములగు గీతము లందే కైక లక్షణ సమన్వయముగల పాదములు లేక చరణములు లేక దళములను విభాగములవంటివై యుండును. అందలి యర్థము లర్థచంద్రికలు. "యక్షగానాదికృతులలో నార్యులిడిన రగడభేదంబులివి" రగడభేద ములుకాని రచనావిశేషము లింకనెన్నిగలవో యీ నాఁటి యక్షగాన ములందది యెఱుఁగరాదు.

క్రీ. శ. 1450–1550 సంవత్సరముల నడుమ యక్షగాన లక్ష్య లక్షణములిట్లు లాక్షణిక పరిగణనమున కెక్కిన వనఁగా నాప్రాంత మున యక్షగాన రచన కొంత సాగిన దనియే చెప్పవచ్చును.

మనకిపు డుపలబ్ధమైన యంతలోఁ గవి కాలము తేలినంతలో క్రీ. శ. 16 వ శతాబ్ది యుత్తరార్ధమున నుండిన కందుకూరి రుద్రకవి సుగ్రీవవిజయమను యక్షగానమే ప్రాచీనతమ మైనదిగాఁ బండితులెల్ల రిచేఁ బరిగణింపఁ బడుచున్నది. కాని చక్రపురి రాఘవాచార్యుఁడను నాతని కృతిగా నూహింపఁ దగిన విప్రనారాయణ చరిత్రమను యక్ష గానము రుద్రకవి కృతి కొక్కించుక పూర్వమైనదిగాఁ దోచును. ఇది 16 వ శ. నడుమ రచింపఁబడి యుండును.[13] రచనా ప్రణాళి కలో రెండింటను జక్కని సామ్యము గలదు.[14] రెండింటను త్రిపుట, జంపె మొదలగు తాళప్రధానములైన గేయ రచన లకును ద్విపదకును బ్రాధాన్యము; ఎడనెడ సంధి వచన ములని పేరొక్కనఁ బడలేదు కాని, సంధి ప్రయోజనాత్మకము లగు చిన్న చిన్న వచనములు, ఏలలు, అర్ధ చంద్రికలు మొ॥, అతి

13. దీని కర్తృత్వ కర్తృకాల విచారణ మీగ్రంథము ద్వితీయభాగమునఁ జేసియుంటిని. చూ. ఆం. దే. య. గా. పుట 2–9

14. Ibid.,

విరళముగాఁ బద్యములును ప్రయుక్తము లైనవి.[15] ఈ ఛందస్సు లన్నియు నిది వఱకు లక్షణ గ్రంథముల కెక్కినవే. రెండును యక్ష గానములని గ్రంథ కర్తల చేఁ బేర్కొనఁ బడినవి. సుగ్రీవ విజయ రచన గూర్చి ప్రస్తావించుచు "రచనా విధానమును బట్టి చూడ నది యారంభ రచన గాదని చెప్ప వలసి యున్నది. పరిపూర్ణత నందక పోయినను సంప్రదాయము చక్కఁగ నేర్పడినది" అని డా. శ్రీ నేలటూరు వెంకట రమణయ్య గారు సెలవిచ్చినారు.[16]

ఆ యక్ష గానములూ కవులచేఁ బ్రదర్శనోద్దిష్టము లైన వని చెప్పుట కాధారములు లేవు. కాని క్రీ. శ. 16 వ శతాబ్ది కన్నడ కవి యగు రత్నాకర వర్ణి రచించిన 'భరతేశ వైభవ' మను గ్రంథ ములో వెనుకపాటకుల తోడను, మేళతాళములతోడను "ఎక్కఁడి గలు" నాట్యమాడినట్లు వర్ణింపఁ బడినది.[17] యక్ష గానము లట్లు ప్రదర్శింపఁ బడుట యీనాఁటి పెద్దలును గొంద ఱెఱిఁగిన విషయమే. ఆ యెక్కఁడి గల నాట్యము ప్రాయికముగా యక్ష గానమే కాఁ దగును. సుగ్రీవ విజయమును జూచిన చో నది ప్రదర్శన సౌలభ్యము గల రచన యని యే తోఁచును. పాత్రల సంభాషణములు నచనమున లేవన్న మాట గాని యం దాఖ్యాన శైలి కంటె సంవాద శైలికే ప్రాధాన్యము. సంభాషణ లెక్కువగా జంపె త్రిపుటాములలో సాగినవి. నడుమ నక్కఁ డక్కఁడ నున్న చిన్నచిన్న వచనములలోఁ గథాను సంధాన మే సూత్రధారుని వంటి ప్రదర్శన ప్రవర్తకుని వలననో

15. కాలము తేలని యక్ష గానముల ప్రాచీనత నూహించుటకు వీని రచనా ప్రక్రియా వివేచన తోడ్పడఁగలదు.

16. చూ. వారి "యక్ష గానము—తంజావూరు" అను వ్యాసము. ఆం. ప. ఖర సం. సం. పుట 27.

17. భి. వై., అష్టాన సంధి. 58 వ పద్యము.

కావింపఁ బడు నని యూహింప నగును. దీని శ్రవ్య దృశ్యోభయ ప్రయోజనముల గుఱించి కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రి గారిట్లు సెలవిచ్చి యున్నారు. " ఈ రుద్ర కవి సుగ్రీవ విజయమును స్త్రీ వృద్ధ పామరాదులు పలువురు పాడు చుందురఁట; ఆయా పాత్రముల పాటలు తద్వేష ధారులు వచ్చి పాడునట్లును తక్కిన సంధి వచనాదులు ఒక్క రిద్దరు సూత్ర ధార ప్రాయులు పఠించు నట్లును ఈ సుగ్రీవ విజయము వీధి యాటగా నాడఁ బడు చుండెడిది "[18]. శ్రీ వెంకట రమణయ్య గారును " పదునాఱవ శతాబ్దమున రాయ సామ్రాజ్య ప్రజలకు నాటక ప్రదర్శనము లందభి రుచి హెచ్చెనని యప్పటి వాఙ్మయము వలనఁ దెలియ వచ్చు చున్నది. సుప్రసిద్ధులైన కవులు యక్ష గాన రచనకుఁ గడఁగిరి. కందుకూరు రుద్రకవి సుగ్రీవ విజయ మను చక్కని యక్ష గాన ప్రబంధమును రచించి యీ యూర నెల కొని యుండు జనార్దన దేవుని కంకితమిచ్చెను. ఆదేవుని వసంతో త్సవ సమయమునం దీ నాటకము ప్రథమమునఁ బ్రదర్శింపఁ బడి యుండెననుటకు సందియమే లేదు." అని వక్కాణించి నారు[19]. అనఁగా బదునాఱవ శతాబ్ది నాటికి యక్ష గాన మాంధ్ర దేశమునఁ బండిత కన్యుపజ్ఞమైన రచనగాఁ బరిఢ విల్లుటయ కాక రంగమున కెక్కి యుండు ననియుఁ గొంత నిబ్బరముగాఁ బలుక వచ్చును.

(క్రీ. శ. 17వ శతాబ్ది ప్రారంభమున మన యక్షగానము దక్షిణ దేశమునకు ప్రస్థానము గావించినది. తదుపరి తెలంగాణమును యక్షగాన రంగమైనది. ఆ దక్షిణాంధ్ర తెలంగాణ యక్షగాన చరిత్రములు తరువాతి ప్రకరణములందు సమీక్షింపఁబడును. ఇపుడాంధ్రదేశ + యక్షగాన చరిత్రసమీక్షయే కొనసాగింపఁబడును.)

---

18. చూ. సుగ్రీవ విజయ పీఠిక, పుట 17.

19. చూ. వారి వ్యాసము. ఆం. ప. ఖర సం.సం. పుట 21.

+ ఇట ఆంధ్రదేశమనఁగా రాయలసీమ + చాళుక్యసీమ, కళింగము (లేక ఉత్తర సర్కారులు) అని యుద్దిష్టము.

ఆంధ్రప్రాంత యక్షగానములు

కందుకూరి రుద్రకవికిం బిదప సుమారొక శతాబ్దిదనుక నాంధ్ర దేశమున యక్షగాన రచన మించు మించతని సుగ్రీవవిజయక్షుణ్ణ మార్గముననే సాగుచువచ్చినది. అందంచుఁ గొన్ని విశేషములుఁ బొడసూపక పోలేదు.

మనకుఁ గాలము తేలని యక్షగానము లనేకముగలవు. అట్టి వానిలో సుగ్రీవ విజయ రచనా ప్రక్రియా సంవాదులుగా నున్న వానినిఁ గొంత ప్రాచీనము లని యొంచవచ్చును. దినవహి యహోబల కవి విరచిత మైన గరుడాచల విలాసమను యక్షగాన మొకటి యట్టిది. కీ. శే. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు ఈ కాలమున మనకు లభించుచున్న యక్షగానములలోనెల్ల మిక్కిలిప్రాచీనములైనవి గరుడాచలము, నీలాచలము ననునవియే ... ... గరుడాచల నీలాచల నాటకములకంకెఁ బ్రాచీనములైన యక్షగానములు తదితరములు లిఖిత గానరా"వనుచున్నారు.[20] కాని యంపు నీలాచల విలాసమునుది యాశ్వాస విభాగాది విశేషములు గలది; అర్వాచీన రచనగాఁ దోఁచును. గరుడాచల విలాస మట్లు గాక సుగ్రీవ విజయరచనా ప్రక్రియా సంవాదిగా నున్నది. అది నారాయణశాస్త్రిగారు రుద్రకవి సుగ్రీవ విజయము నెఱిఁగియుండి యన్నమాటయే యది. కాని సుగ్రీవ విజయమే నేఁడుపలబ్ధములగు యక్షగానములలోఁ బ్రాచీనతమమైనదని పలువురు పండితుల యభిప్రాయము.[21] అది యథార్థము కావచ్చును కాకపోవచ్చును. కాని

20. చూ. వారి వ్యాసము. ఆం. ప. 12 వ సం. సం. (1921).

21. చూ. శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనముగారి ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము పుట 211. శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారి దేశి పుట 79. శ్రీ వేలటూరి వెంకట రమణయ్యగారి వ్యాసము. ఆం. ప. ఖరి. సం. సం. పుట 27.

రుద్రకవి కాలము రూఢిగాఁ దేలినది. ఈ గరుడాచల య. గా. కర్త యంతకంటెను బ్రాచీనుఁ డనుటకు రూఢిగల యాధారమేమి యును గానరాదు. కాని యీ గరుడాచల యక్షగానమున కాంధ్ర దేశమున నెన్నో తరములఁ బడి వచ్చుచున్నట్లు తోఁచు ప్రదర్శన ప్రశస్తిఁ జూడ నది యెంతో ప్రాచీనమైనదిగనే యనిపించును. 16 వ శతాబ్ది యుత్తరార్ధమునందు బయల్వెడలినవని యూహింప నవకాశముగల క్రొంజ వెంకటాద్రి వాసంతికా పరిణయము, బొలపాపాంబ అక్క-మహాదేవి చరిత్ర అను యక్షగానము లీ గరుడాచల విలాస సుగ్రీవ విజయ రచనలను బోలియున్నవి. అందు వాసంతికా పరిణయమునందును గరుడాచల క్షేత్ర గాథయే యితివృత్తమగుట విశేషము. బొల పాపాంబ కృతిలో బసవేశ్వరుని సమకాలికుఁడైన మహాశివ భక్తురాలగు అక్క-మహాదేవి చరిత్రము వర్ణితమైనది. పదునాఱవ శతాబ్దినాఁటికే యక్షగాన రచనము కవయిత్రులనుగూడ నాకర్షించి యుండుట విశేషము. ఈనాఁటి కూహింపఁగల యంతలోఁ బొలపాబయే ప్రప్రథ మాంధ్ర యక్షగాన కవయిత్రిగాఁ గన్పించుచున్నది.

ఆపదునాఱవ శతాబ్ది యంత్యభాగమున వెలసిన యక్షగానముల కెల్లఁ దలమానికము ఉత్తర రామాయణ కావ్యరచనా విశ్రుతుఁడును ప్రళయ కావేరి (పులికాట్) పట్టణమున రాజకీయోద్యోగియు నైన[22] కంకంటి పాపరాజు ప్రధాని రచించిన విష్ణుమాయా విలాసము.

22. ఇతఁడు క్రీ. శ. 1790 ప్రాంతమువాఁడని కీ. శ. కందుకూరి వీరేశలింగము పంతులుగారి తీర్మానము. (చూ. వారి ఆంధ్రకవుల చరిత్ర) అందులకుఁ బ్రమాణముగానరాదు. ఈకవి క్రీ. శ. 1575—1632 సం. ల నడుమనుండినవాఁడని సప్రమాణముగ నిరూపించి యుంటిని. (చూ. ఇందలి ద్వితీయభాగము, ఆం. దే. య. గా. కవులు పుట 12-17) నా నిరూపణము డా శ్రీ నేలటూరి వెంకటరమణయ్య గారిచే నామోదింపఁబడినది. (చూ. వి. మా. వి. య. గా. వావిళ్ళ ప్రతి వారికిపీఠిక, పుట 30—35.

ఇందును సుగ్రీవ విజయ రచనాప్రక్రియ సూత్రపాయముగనున్న దనియే చెప్పవచ్చును గాని యంతకంటె నదనముగా ఆది, మధ్య, రచ్చ, లఘుశేఖరతాళ ప్రధానములగు గేయములు, కొన్ని రాగ ప్రాధాన్యముగల పదములు, సంస్కృతమునకొక చూర్ణికయు, రెండు శ్లోకములు, లయగ్రాహి, అష్టకము, నడలు, త్రిస్తబకము మొదలగు రచనా విశేషములుగలవు. ఇది ప్రదర్శనోపయోగియైన దనియే చెప్పవచ్చును. పాపరాజు సమకాలికుడగు తేకుమళ్ళ రంగశాయి జానకీ పరిణయమను యక్షగానమును రచించియున్నట్లు తెలియుచున్నది మాత్రమ. క్రీ. శ. 1600 సం. ప్రాంతమున నెల్లూరు సమీపమున నుండిన దత్తాత్రేయ మఠమునకుఁ జెందిన పరమానందతీర్థయతి యను నతఁడు ముక్తికాంతా పరిణయమను నొక యక్షగాన ప్రాయమైన కృతిని రచించి దానిని "పదచాళిక" యని పేర్కొనియుండెను. పద చాళిక లేక పదకేళిక యనఁగా నొక పదమును బాడుచుఁ బదోద్దిష్ట మైన భావము నభినయ రూపమున నావిష్కరించుట. శబ్దరత్నాకర మునఁ బదచాళికకు "పెక్కణ" మను నృత్యవిశేషమని యర్థము చెప్పఁబడినది. పెక్కణము ప్రేంఖణ లేక ప్రేక్షణక శబ్దభవము. అది నృత్య విశేష మాత్రముగాక యుపరూపకములలో నొకటిగా సాహిత్యదర్పణ భావప్రకాశాదులందు నిర్వచింపఁబడినది. కాని దేని లక్షణమును ముక్తికాంతా పరిణయమునకుఁ బూర్తిగాఁ బట్టకున్నది. దీనిని గవి పాడుటకు మాత్రమే యుద్దేశించియున్నాఁడు. కాని పద చాళియని పేర్కొనియుండుట వలన నేకపాత్రాభినయమునకైనఁబనికి వచ్చునని తోచును + ఇందు నాలుగైదుచోటులనొక పాటిపొడవైన ద్విపదలు గలవు కాని గ్రంథమంతయునొక దరువు నొకవచనము

+ "అభినయంబుల కోపు లక్షణ తీరుపుల్ తెలియఁగాఁ బదచాళి విధమొకర్తు" వినిపించె నని పాపరాజు ఉత్తర రామాయణమునఁ గలదు, ఇందు జక్కిణి, ఖోర ఖంజాల ప్రసక్తియుఁ గలదు. చూ. VI 139.

చొప్పున నడచునని స్థూలముగాఁ జెప్పవచ్చును. ఇది యక్షగానప్రాయమైన రచనా పద్ధతియే. సచ్చిదానంద పురాధీశ్వరుఁడు తనపుత్రియగు మోక్ష కన్యకు స్వయం వరము జాటింపఁగా వివిధ మతాధిపతులు విచ్చేయుటయు, నొక్కరినొక్కొక్కరు నెపమున నొప్పరికించి మోక్ష కాంత సద్గురుఁడే దైవమని నమ్మిన వేదాంతమతస్థుఁడగు వివేక జీవేశ్వరుని వరియించుటయు నిందలి విషయము. ఇందలి విషయము కొంత వట్టు సాంకేతికముగా సాగినను బెండ్లి వేడుకలు మొదలగు సాధారణ విషయములును సరసముగా సరళ శైలిలో వర్ణితములైనవి. చూడఁగాఁ బరమానంద యతి మత ప్రచారము కొఱకానాఁడు ప్రచారము నందుండిన యక్ష గానమును వినియోగించుకొని నట్లు తోఁచును.

పైని వేరొక్కనఁ బడిన కవులలో చెన్న శౌరి, అహోబలకవి, వెంకటాద్రి కవులది రాయలసీమ. రుద్ర కవి, పాప రాజు, రంగశాయి, పరమానంద యతియు నెల్లూరు మండలము వారు. వారి కాల మునాఁటి కాంధ్ర దేశమున జన రంజక రూపక ప్రక్రియ లనేకము ప్రచారము నందుండిన వని తెలియచున్నది గదా. పాల్కురికి సోమనాథుఁడట్టి ప్రక్రియల ననేకమును బేరొక్కని నాఁడు. అందు బహు రూపములు, వీధి నాటకముల పలుకుబడి చాల కాలము వఱకు సాగుచుండినట్లానాఁటి వాఙ్మయము నుండి యెఱుఁగ వచ్చును. రెడ్డి రాజులు, విజయనగర రాయ సమ్రాట్టుల కాలమున నాంధ్ర దేశమున భరత గాంధర్వ విద్యలకు విశేష వ్యాప్తి కలిగినది.[23] వెనుకటి మన జన రంజక నాటకములలో సిరియాల చరితము, మాచల దేవి చరితము,

23. చూ. శ్రీ మల్లంపల్లి సోమ శేఖరశర్మ గారి "మధ్య యుగాంధ్ర దేశము-సంగీత నాట్య కళాభి వృద్ధి" అను వ్యాసము-ఆం. ప. చిత్రభాను సం సం., వారి History of Reddi Kingdoms, Part II, Chap. VII.

సంబెట గురవరాజు నాటకము, తాయికొండ నాటకము మొదలగు కొన్ని పేరులు వినఁబడుచున్నవి. ఆ నాటక ప్రదర్శకులలో దోర సముద్రపునటులు, తెరనాటకపు జంగాలు, కూచిపూడి బ్రాహ్మణభాగవతుల మేళమువారు మొదలగువారు ముఖ్యులు. ఆయా ప్రదర్శకులాడు నాయా నాటకములు జూచుటతో నొక క్రొత్త చైతన్య స్పర్శ కలిగి, మార్గసాహిత్య సంప్రదాయ ప్రవణులయ్యు పూర్వరూపకములజోలికి మాత్రము పోక మడిగట్టుకొని కూర్చుండిన మన శిష్టకవులలోఁ గొందఱి మనముల నా జనరంజక రూపక రచనా సంకల్పము పొడసూపి యుండవచ్చును. వారికి రూపక రచన విషయమునఁ గ్రీడాభిరామమునందువలెఁ బ్రాఁబడిన కేవల చంపూ పద్ధతి నచ్చకపోయి యుండవచ్చును. దేశీయ గేయరచనలపై మోజు ప్రబలియుండును. ప్రత్యేక గాన శైలికిఁ బేర్వడసిన జక్కులవారు క్రీ. శ. 14-15 శతాబ్దులనాఁటికే ప్రేమాభిరామ కథారంగమగు ఓరుగల్లునుండి క్రీడాభిరామకవి నివాసమగు వినుకొండవఱకు వ్యాపించి యుండినట్లు క్రీడాభిరామమునుండి యూహింపవచ్చును. తదుపరి వారు రాయలసీమ, నెల్లూరు మండలాది ప్రాంతములకును వ్యాపించియుందురు. వారి గానశైలియే మనకవుల నాకర్షించియుండును. ఇఁకఁ గథలకు మనకుఁ గొదవలేదు. రామాయణ భారత భాగవతాది కథా భాండాగారములుండనే యున్నవి. ఎవరికిఁ దోచిన కథ నాకవులు గ్రహించి రచన కుపక్రమించి యుందురు. ఇదియంతయు నొక చక్కని యూహాగానము. కాని మన యక్షగాన రచనోత్పత్తి విచికిత్సా విషయమై యొక సమన్వయమును బ్రతిపాదింపఁగల యదిగాఁ దోఁచును.

అయితే పదునాఱవ శతాబ్దియందు వెలసిన యక్షగానములన్నియును యథాతథముగాఁ బ్రదర్శనార్హములని చెప్పవలను

పడదు. అందెద్దియు నా కవులచేఁ బ్రదర్శనోద్దిష్టమైనట్లు స్పష్టముగాఁ జెప్పఁబడలేదు. అవి నాఁడు ప్రదర్శితము లయ్యె ననుట కాధారము లంతకంటెను గానరావు. కాని మీఁదఁ బేర్కొనఁబడిన వానిలో సంవాదశ్లోకాలీ ప్రాచుర్యము గలిగినవి యెక్కువ. ఆ సంవాదశ్లోకాలి గీత ప్రచురమైనది. పాత్రల నడుమ సంభాషణలు "అనవుడు సుగ్రీవునితో రామచంద్రుం డేమనుచున్నాఁడు" — ఇత్యాది సంభాషణ పీఠికలు లేకుండఁ దిన్నగా సాగవు. అయినను నా సంవాదశ్లోకాలీ ప్రచురము లైన యక్షగానము లైన నాఁడు ప్రదర్శింపఁ బడి యుండునని యూహింపవచ్చును. కాని యానాఁటి యక్షగాన ప్రదర్శనపుఁ దీరెట్టిదో తెలియవచ్చుటలేదు. 16 వ శతాబ్ది పూర్వార్ధమునందుండిన తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని వైరాగ్య వచన మాలికా గీతాలలో నొకదాన [24] సాంగ భాషాంగ క్రియాంగాభిరమ్యమగు "బహురూప" ప్రదర్శన ప్రక్రియ స్వరూపము గొంత విశదమైనది. 16 వ శతాబ్ది యుత్తరార్ధమున నుండిన పింగళి సూరనార్యుని ప్రభావతీ ప్రద్యుమ్నమున భద్ర నట ప్రదర్శన వ్యాజమున గంగావతార మను

24. చూ. తాళ్ళపాకము కవి కుటుంబ కృతి సముచ్చయము. సం. 1. తిరుపతి దేవస్థాన ప్రచురణ, (1935) పుట 108-109. వై. వ. మా. గీ. నం. 30. ఈ బహురూపమొకటి ప్రాచీన కాలమున నాంధ్రదేశమున విశేష ప్రచారమునందుండిన యొక విశిష్టదేశీరూపక ప్రక్రియ. మన వాఙ్మయమున దీని ప్రశంస తఱచు కన్పట్టును. ఇది పెదతిరుమలయ్య చెప్పినట్లు చతుర్విధాభినయాత్మకమైనదగుటయే కాదు; ఇందు తెరవాడికమును గలదు (శృం. నైషధము. IV. 2); సూత్రధార ప్రసక్తియుఁ గలదు (పోతన భాగవతము X. ఉ. 305) దీనిగురించి మఱికొన్ని వివరములకు-చూ. 'బహురూపము' అను నా వ్యాసము (ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక సం. 44-సం. 4).

నొక మార్గరూపకము ప్రదర్శన ప్రక్రియ వర్ణితమైనది.[25] వానిని బట్టి యీనాఁడాంధ్రులు నేర్చిన నాట్యకళకుఁ జతుర్విధాభినయ, గీత వాద్య ప్రతిపత్తి చక్కఁగా నేర్పడియుండినట్లు విశదమగును. అది కొంత యీనాఁటి మన వీధినాటక యక్షగాన ప్రదర్శనము లందును నవలంబింప బడి యుండునని యూహింపనగును. 16వ శతాబ్ది ప్రథమ పాదమున విద్యానగర వీరనరసింహ రాయల సముఖమునఁ గూచి పూడి భాగవతుల మేళము వేషములు వేసి కేళికపట్టినట్లును, నది వీధినాటక ప్రాయమైనదనియును దెలియనై నదిగదామీఁద. కాని దాని ప్రదర్శన ప్రక్రియ మాత్రము తేటపడలేదు. క్రీ. శ. 1530-1580 సం.ల నడుమ నుండిన రామరాజ భూషణుని వసుచరిత్రమున నాఁడాంధ్రదేశమునఁ బ్రచారమునందుండిన తెర నాటకపు రీతులు కొన్ని భంగ్యంతరమున ననుసంధింపఁబడి యున్నవి :-

"ఇటి సంధింపఁగ వేళయంచు వసురాజేంద్రుండు నీరంధ్రనీ
రదవారప్రతి సీర వెల్వడిన తారా భర్త లీలన్ లతా
చ్ఛద సంఛాదికఁ బాసి నిల్చె నెదుటన్ సారంగ రాగభ్రమ
న్మద భృంగీయతి వందిమాగధకథామాధుర్యముం దెల్పఁగన్"

—వ. చ. ఆశ్వా 3-పద్య 45.

ఇది యక్షగానములందు రాజనాయకపాత్ర తెరవెడలివచ్చు సందర్భమునండలి :—

---

25. ప్ర. ప్ర. ఆశ్వా. 4. పద్య. 97-102. ఇందు ఏలా ప్రబంధ ప్రస క్తియుఁ గలదు. మార్గరూపకము లందిది యపూర్వము. నూరన తన చూచిన యక్ష గాన ప్రదర్శనములలో దాని మాధుర్యమును గుర్తించిన వాఁడగుట నట్లుటంకించి యుండె నేమో !

" రాజు వెడలె రవి తేజము లడరఁగ
కుడి యెడమల డాల్ కత్తులు మెఱయఁగ "

అను ప్రావేశిక ధ్రువార్థ సంవాదిగా నున్నది.+

" హరి దంభోరుహాలోచనల్ గగన రంగా భోగ రంగ త్తమో
భర నేపథ్యము నొయ్య నొయ్య సడలింపన్ రాత్రి శైలూషికిన్
వరుసన్ వాక్తిక పట్టమున్, నిటలమున్, వక్త్రంబునుందోఁచెనా
హరిణాంకా కృతి వొల్చె రేకయి, సగంబై, బింబమై తూర్పునన్"
– వ. చ. ఆశ్వా 4 – పద్య 17.

ఇది చంద్రోదయ క్రమ క్రమోన్మేష వర్ణన సందర్భము. గగన మను రంగ స్థలమున రాత్రి యను నర్తకి నాట్యము ప్రవర్తింపఁ జేయ నున్నది. దిక్కాంతలు మెల మెల్ల జీకు వాలు తెరలను సడలించు చుండిరి. వరుసగా నర్తకి యొక్క ముఖోపరి భాగమున నున్న ముత్యాల పట్టయు, నొసలు తదుపరి మొగ మంతయుఁ గాన వచ్చి నవి – అను నట్లుగాఁ జంద్రుడు మొదట రేఖా మాత్రముగాఁ బిదప సగము నా పైఁ బూర్ణబింబాకృతిని గనుపట్టె నని యర్థము. ఇది నాఁటి తెర నాటకములలో నాయికాపాత్ర (భామ వేషము) తెర వెడలు తీరునకు సూచన కావచ్చును. ఆ తెర తొలగించుతీరు ప్రక్క వాటుగాఁ గాక మీఁద నుండి క్రింది కగుట గమనింపఁ దగినది. (అట్లైననే కదా శైలూషి వాక్తిక పట్టము, నిటలము, వక్త్రము నొకదాని తరువాత నొకటి తోఁచును). ఇది మన మెఱిఁగిన యక్ష

+ ప్రావేశిక ధ్రువను సారంగ రాగములోఁ బాడు సంప్రదాయమును గలదఁట. కొన్ని యం. గా. లలోఁ బాత్ర ప్రవేశపు దరువులకు సారంగరాగ ముదా హరింప బడినది. 'సంగీత కళారహస్యనిధి' యగు రామరాజ భూషణుఁ డట సారంగ రాగ శబ్దమును సాళ్వి స్వాయముగనే ప్రయోగించి యుండును.

గాన ప్రదర్శన సంప్రదాయమే. కూచిపూడి వారప్పే చేయుదురని పెద్దలెఱుఁగుదురు. (కథకళిలోను దెరను దొలఁగించు సంప్రదాయమిదియే). వసు చరిత్రలో నింకను నచ్చటచ్చట నేలాది గీత ప్రబంధ ప్రసక్తియు, వాద్య ప్రసక్తియు వచ్చినది. ఆ యీ సందర్భములను బట్టి నాఁటి యక్ష గాన ప్రదర్శన ఫక్కి కొంత కొంత యూహ కందఁ గలదు.

నాఁడు ప్రదర్శనోపయుక్తములుగాని యక్షగాన రచనలును గొన్ని బయల్వెడలకపోలేదు. (నాఁడే కాదు యక్షగాన రూపక ప్రయోజనము బొగుఁగా రూపొందిన పిదప కాలమునఁగూడ నొక వంక శ్రవ్యప్రయోజన మాత్రములైన య. గా. లును బయల్వెడలుచుండినవి) అనఁగా ప్రౌఢమికమైన యక్షగాన(శ్రవ్య ధర్మమునకుఁ గూడ నొక చెంపఁ బలుకుబడి చెల్లుచునే యుండినదన్న మాట.

ఆనాఁటి యక్షగానములలో నాఖ్యాన సంవాదశైలీ భేదమునుబట్టి శ్రవ్యదృశ్యప్రయోజనభేదమే కాని రచనా ప్రక్రియలో నంతభేదము లేదు. యక్షగాన రచనాస్వరూపవిరించనులగు మన ప్రాచీన యక్షగాన కవులకుఁ బ్రౌఁబడిన చంపూపద్ధతినచ్చియుండదను కొంటిమి. అనఁగా కేవలచంపూపద్ధతియని యభిప్రాయము. అనేక యక్షగానములందు గద్యపద్యములు గలవు. కాని గద్యపద్యోభయాత్మకమగు చంపూకావ్యములలో ద్విపదాదు లుండవు. ద్విపద కావ్యములలో గద్యపద్యముల కసలు ప్రసక్తియుండదు. అట్టి గద్యపద్యములు, ద్విపదయు నేకత్ర యొక్క యక్షగానము సందేకనిపించును. అవికాక యసలుండనేయున్నవి దాని మూలప్రకృతులగు "రేకులు" (అనఁగాఁ దాళప్రధానములు, రగడ వికారములునైన గేయరచనలు) తదర్ధచంద్రికలు, తక్కిన ఏలాది గీతప్రబంధచయము.

స్థూలముగాఁ జూచినచో రేకులు, ద్విపద, గద్యపద్యములు, కతిపయ గీత ప్రబంధములును యక్షగాన సామాన్యములైన ప్రధానరచనాం గములని చెప్పవచ్చును. పదునాఱవ శతాబ్దికృతులం దన్నిట (పర మానందయ్య పదచాళి యిందుల కొక్కింత యపవాదము) నీరచనాం గములు గలవు. కాని కాలక్రమమునఁ గవుల యభిరుచి స్వభావ విశేషములనుబట్టి య. గా. రచనా ప్రక్రియమాఱుచునువచ్చినది. రేకులు పిదప కాలమున దరువులనియు, బదములనియు వ్యవహరింపఁ బడినవి. దాని రగడ ప్రకృతియుఁ దాళప్రాధాన్యమునుబట్టి రాగ ప్రాధాన్యము మెచ్చినది. (కంకఁటిపాపరాజు విష్ణుమాయా విలాస మునఁ గొన్నిపదములకు రాగము లుదాహరింపఁబడినవి. సుగ్రీవ విజయమునను గొన్ని ప్రతులలో మాత్రము కొన్ని చోట్ల రాగవ్యపదేశము గన్పట్టును. క్రీడాభిరామమున జక్కులపురంధ్రి రాగముననుండి రాగమునకు లంఘించెనని చెప్పఁబడుట చూడ జక్కుల రేకులకుఁ జాల కాలమునుండి రాగములతోడి సంబంధముండినట్లు తోఁచును. కాని ప్రాచీన యక్షగాన రచనలలోని రేకులందెల్లఁ తాళమునకే ప్రాధా న్యము. వానిగతి లయప్రకృష్టమైనది.) తొలుత సంధి వచనముల రూపమున నుండిన యక్షగానగద్య పాత్రల సంభాషణములకును, వర్ణనలకును వినియుక్తమైనది. సంస్కృతగద్య ప్రభేదమగు చూర్ణిక కును య. గా. లందుఁ బ్రవక్తికల్గినది. పద్యములతోపాటు సం. శ్లోకములును య. గా. లందుఁ జేరినవి.

ఇఁక గీత ప్రబంధములవిషయము — లక్షణ దీపిక [26] యను నొక ప్రాచీనలక్షణ గ్రంథము నందు చతుర్విధ కవితా రీతుల పరిగణన ప్రకరణమున :—

---

26. ప్రా. లి. పు. భాం., డి. నం. 1329.

"యక్షగానంబునన్ వెలయు పదంబులు దరువులు
నేలలు, ధవళంబులు, మంగళ హారతులు, శోభనంబులు
నుయ్యాల జోలలు జక్కుల రేకు పదంబులు చందమామ
సుద్దులు అష్టకంబులు ఏకపద ద్విపద త్రిపద చతుష్పద
షట్పదాష్టపదులు నివియాదిగా గల్గు నన్నియు లయ
ప్రమాణంబుల నొప్పి మృదు మధుర వచన రచనల ప్రసి
ద్ధంబైన యవి మధుర కవిత్వంబులు"

అని యున్నది. ఈ నాడు మనకుపలబ్ధములై కాలము తేలిన 16 శ. య. గా. లలోఁ దఱుచు గన్పట్టు మధురకవితా రీతులు (రేకులు, ద్విపదలు గాక) - అర్ధ చంద్రికలు, ఏలలు, ధవళ శోభన ములు. సకృత్తుగా-జోలలు, సువ్వాలలు, ఆరతి పాటలు, అష్టక ములు, త్రిభంగులు, త్రిస్థబకలు, నడలు మొదలగునవియుఁ గన్ప ట్టును. ఇందుఁ గొన్నిటి పేళ్లు మాత్ర మా నాఁటికి వెలసిన యక్ష గానేతర కావ్య జాలము నందును, గొన్నిటి లక్షణము సంకీర్తన లక్ష ణము, లక్షణ సార సంగ్రహాది లక్షణ గ్రంథము లందును బ్రస క్తము లైనవి. అనఁగా నానాఁడు మన దేశము నందీ గీత ప్రబంధముల కెంత ప్రచార మేర్పడి యుండెనో, మధుర కవితా ముగ్ధ హృదయు లగు నాఁటి యక్షగాన కవులు వీని యెడల నెంత మోజు పడిరో, వీని వలన యక్షగాన స్వరూప మెంత వి స్తృతి చెందినదో విశదము కాఁగ లదు. ఆర్వాచీన యుగము లందు దాని స్వరూప మింకను బహు ముఖములుగా వి స్తృత మైనది. అది యెట్టిదో పరిశీలింతము.

16 శ. నాటికే యక్షగానము పండితకవుల గంటములకును, లాక్షణికుల పరిగణమునకును, బ్రదర్శనములకు నెక్కినది కదా, క్రీ. శ. 1600 ప్రాంతముల నది యట్టు తంజావూరికి వ్యాపించినది.

ఇటు - ఆంధ్రప్రాంతమునను యక్షగాన రచనయు: ప్రబంధనయు జక్కగనే సాగుచుండినవని యూహింప నగును. కాని పదునేఁడవ శతాబ్దివని యూదిపలుకఁ దగిన య. గా. కృతులెక్కువ లభించుట లేదు. కాలము తేలని గ్రంథజాలము చాల యున్నదనఁగా నందేవి యూ శతాబ్దిలోఁ తేల్చి చెప్పుట కష్టము. 17 శ. య. గా. లించుమించు 16 శ. వానివలెనే యుండియుండు ననుకొనుట తక్కఁ నేఁడంతకంటె గత్యంతరము కన్పింపదు.

17 వ శతాబ్ది మధ్యమున నుండిన సుప్రసిద్ధాంధ్ర లాక్షణికుఁ డైన కానూకురి అప్పకవి యక్షగాన లక్షణమును జెప్పియుండుట యొక విశేషము. కాని యతఁడు చెప్పినాఁడన్నదే విశేషము గాని చెప్పిన దానిలో విశేషములేదు. అది ముందునాఁటి చిత్రకవి పెద్దన పెట్టిన యెరవడిని బడివచ్చినదే.[27] పెద్దనకు సరిగా నొకశతాబ్ది తరువాతివాఁడప్పకవి. కాని యతఁడట్లు పెద్దనచెప్పిన లక్షణమునే పునశ్చరణ

---

27. "తుద నేడు లఘువులు తొలఁగించి చదివినఁ
ద్రిపుటకు వృషభ గతి పద యుగము
లలిఁ గడపల నొక్క లఘువు మానిన జంపె
మను ద్విరద గతి సమ పద యుగము.
గురుతగు రచ్చకేకుఁ దురగ వల్గ నా
హ్వయ, మేకతాళి యా మధుర గతికి, (యతి?)
నంఘ్రి కిర్వది నాలు గట తాళమున మాత్ర
లోలి విశ్రాంతి పద్మాలు గింటఁ,
దెలియు నర్ధంబు నర్ధ చంద్రికలు వీన
యక్షగాన పబంధంబు లతుక వచ్చు
రగడ భేదంబు లివి యంచు) రసఁ గ వీందు)
లవిత నిజ సేవక స్తోమ యబ్ధిధామ."

— అప్పకవీయము 4 - 303.

చేసినాఁడనఁగా నాశతాబ్ది శతాబ్ది యంత కాలమునను యక్షగాన రచనలలో "రేకుల" ప్రాధాన్యము సాగుచునే యుండిన దనుట స్పష్టము. అప్పకవి "అంబికావాచ" మను నొకయక్షగానము గూడ రచించెనఁట (చూ. అ. క. పీఠిక - 85 వ పద్యము). కాని యాలాక్షణిక కవి లక్ష్యలక్షణ సమన్వయముచేసి చూతమన్న నదినేఁ డలబ్ధము. కాని యీ సందర్భమువలన నప్పకవివంటి లాక్షణికుని దృష్టి నంత యాకర్షించిన దనఁగా యక్షగాన మానాఁడెంత యున్నత స్థితిలో నుండినదియు నూహింపనగును.

17 వ శతాబ్ది యందుండిన మఱి యిఱువురు లాక్షణికులు యక్షగానమును బేర్కొనిరి. వారు గణపవరపు వేంకటకవి, పొత్తపి వెంకట రమణ కవి యనువారు.[28] అందు గ. వేం. కవి లక్షణ శిరోమణి ప్రథమోల్లాసమున యక్షగాన లక్షణ మిట్లు చెప్పఁబడినది :-

"..... యక్షగానంబునకును
పద్య గద్యంబులు బహువిధ తాళముల్
రేకులు గూర్ప వర్తిల్లు"

అనఁగా వేంకటకవి పూర్వ లాక్షణికులకంటె, యక్షగానమున రేకులే గాక పద్య గద్యములు నుండునని యొకమాట మాత్ర మెక్కువ చెప్పినట్లయినది. పొ. వేం. ర. కవి లక్షణ శిరోమణిలో యక్షగానము లక్షణము స్పష్టపడలేదు. యక్షగాన పదములు "సంగీత తాళ నిర్ణయమ్ము" గలవని మాత్రము తెలియనగును.

---

28. వీరు 17 వ శ. వారనుటకు చూ. ఆం. సా. ప. పు. భాం., 3 భాగ — పుట 9. ఇరువురి లక్షణ గ్రంథములును లక్షణ శిరోమణి నామకములే. అందు గ. వేం. కవి ల. శి. ప్రతి — ఆం. సా. ప. నం. 31 (ఎ)

పొ. వేం. రం. కవి ల. శి. ప్రతి — ఆం. సా. ప., నం. 1297, ప్రా. లి. పు. భాం., ఆర్, నం. 1257.

(ఆర్. 1257-పుట 117)., ఆం. సా. ప. సం. 1297 ప్రతిలో గ్రంథావతారికలో నొకపద్యము గలదు :-

"శతకము యక్షగానములు చాటువులున్ రచియింపలేకకా
మిత...మేరలే...మిక్కిలి మ్రొక్కుకయింటనింటనే
శతకము యక్షగానములు చాటువు లోపిన మోపులాదిగా
కృతులవిమూలదాఁపఁగమరిన్ గృతులే యెవరిచ్చమెచ్చెదర్"

ఇందు గ్రంథకర్త తాను శతక యక్షగానాది లఘుకృతులకును లక్షణమేర్పఱిచు సంకల్పము గలవాఁడై లక్ష్యములు సేకరించుటకై యింటింటికిఁబోయి మిక్కిలి మ్రొక్కులతో నాయా గృహస్థుల నర్థించినట్లును వారు మోపులకొలఁది యట్టి గ్రంథము లింట మూల్గుచున్నను నీయక దాపఱికము చేయుచుండుటను సూచించినట్లు తోఁచును.

పైవిషయములనుబట్టి పదునేడవ శతాబ్ది యందు య. గా. రచన బాగుగా సాగుచుండినట్లును, యక్షగాన మనిన లాక్షణికులకు నాస్థ కలిగినట్లును నెంచనగును. ఆ శతాబ్దియం దే యుత్తరార్ధమున నాంధ్రదేశమున యక్షగానమున కొక గొప్ప ప్రక్రియానుబంధ మేర్పడినది. అది కూచిపూడివారి కలాపము. కూచిపూడి భాగవతు[29]

29. వారు భగవన్నృత్తులై యుండుటను, భగవత్సంబంధులు, లేక శ్రీమద్భాగవత పురాణ గృహీతేతివృత్తులైన కథలను ప్రదర్శించుచుండుటను వారికి భాగవతులను వ్యవహారమేర్పడియుండును. కాని వారు పీరనుసింహ రాయుల యొద్ద ప్రదర్శించిన సంబెటగురవ రాజు నాటకము భగవత్సంబంధి కాదు కదా. అట్లే మొదట భగవత్సంబంధు లగు వీధి నాటకములకు, యక్షగానములకును సార్థక వాచకములైన వీధి భాగవతములు, ఆట భాగవతములు, భాగవతులు ననునవి తదుపరి సామాన్య వాచకములుగాఁ బరిణమించినవి. ప్రదర్శనుల విషయము నంతియ. కాని కలాపమును జేపట్టుటతో కూచిపూడి భాగవతులు సార్థకనాములైరి.

లప్పటికి సుమారు నూటడెబ్బదేండ్లకుఁ బూర్వమే ప్రసిద్ధులనియు, వారు మేళములుగా నేర్పడి దేశసంచారములు సేయుచు వీధి నాటకములను ప్రబర్శించు చుండినట్లును దెలియుచున్నది. (ఈ విషయము పూర్వోక్తము). ఆ కూచిపూడి భాగవతుల కులపతులలో సుప్రసిద్ధుఁడు సిద్ధేంద్ర యోగి. ఇతఁడే భామకలాప సృష్టి ప్రతిష్ఠా మహితుఁడు. తన నాయకత్వమున గోల్కొండనవాబు (క్రీ.శ. 1672-1685) తానాషా యెదుట నొక భాగవత ప్రదర్శనమిచ్చి యతనిని మెప్పించి యతనిచేఁ దమ మేళమువారికిఁ గూచిపూడి యగ్రహారము దాన శాసనము వేయించినవాఁడు. [30]

ఈతని భామకలాపముయొక్క ప్రదర్శనప్రక్రియ విశిష్టమైన దైనను రచనాప్రక్రియ యక్షగాన ప్రాయమైనదే. య. గా. రచనా ముఖ్యాంగములగు దరువులు, ద్విపదలు, గద్యపద్యములే యిందలి ముఖ్యాంగములును. ఆనాఁడు ప్రచారమున నుండిన యక్షగానములే యతని భామకలాప రచన కుద్బోధకములై యుండును. కానిప్రదర్శన ప్రక్రియలోనది సామాన్య యక్షగానాదులవలెఁగాక భరత విద్యావిధి నిబద్ధమైనది. నృత్యప్రధానమైనది. నృత్యకళానుకూలముగా రసైకరమ్యముగాఁ బ్రబర్శించుటకుఁ దగినట్లు సంగ్రహమైన పాత్రసామగ్రి గలది. ఆత్మాశ్రేయఫలక్రమైనది.

భామ కలాపమునందలి యితివృత్తము ప్రసిద్ధమగు పారిజాత కథ. సత్యా రుక్మిణుల సవతి కయ్యము ఘట్టమొకటి యిందలి కండ

---

30. ఇతనిగుఱించి, కలాపమును గుఱించి విపరములకు చూ. (1) ఈ గ్రంథము ద్వితీయ భాగము — ఆం. దే. య. గా. కవి చరిత్ర ప్రకరణము — పుట 30 – 35.

(2) "The KALAPAM" a Paper By the Present Writer, Published in TRIVENI, Silver Jubilee Number, 1955.

పట్టు. ఇందలి "మాధవి" యను సఖిపాత్ర యొకటి యీ కులపతి యపూర్వసృష్టి. అర్వాచీన యక్షగానములపై భామకలాపము ప్రభావము బాగుగాఁ బడినది. సిద్ధేంద్రుని తరువాత దానికి మానస పుత్రికలుగా భామకలాప కృతులనేకము వెలయుట కాక యీ "బాణీ" లోఁ బారిజాత కథేతి వృత్తములుగు యక్షగానములును గోకొల్లలుగా వెలసినవి. వానియందును "మాధవి" పాత్ర యిరవుకొన్నది; సవతి కయ్యము ఘట్టము ప్రాచుర్యము వహించినది. భా. క. నందువలెఁ బాత్రల తెర ప్రసంగములు, స్వీయోదంత నివేదనము మొదలగు విశేషములును గొన్ని యక్షగానములందుఁ బ్రవేశించినది. సవతుల సందర్భ సాదృశ్యము సాకుగా య. గా. లందు శివపారిజాతములును, శివకేశవ పారిజాతములును దత్సదృశములును వెలసినవి. భామకలాపము ప్రాదుర్భవముతో, భరత విద్యాధురంధరులగు కూచిపూడి భాగవతులు తెలుగునేల నాల్గు చెఱఁగులఁ దిరుగుటతో నాంధ్రదేశ యక్షగాన ప్రదర్శనములందు నూత్నశక మారంభమైనదని తలంప నగును. అంతవఱకుఁ దఱచు తక్కువజాతి ప్రదర్శకుల తెతక్కలతో నలసగతిఁ బయనించు చుండిన యక్షగానము భామకలాపము భరతము పట్టినది. (అనఁగా నందలి భరత పద్ధతిననుసరించి పురోగమించిన దని చెప్పనగును.) ఆంధ్రదేశమున గ్రొత్తగాఁ గొన్ని య. గా. మేళములు మొలకెత్తి కూచిపూడికత్తు నెవరి యోపినకొలఁది వారనుకరించి యుందురు.

సిద్ధేంద్ర యోగి భామకలాపమే కాక గొల్ల కలాపము గూడ రచించె నందురు. గొల్ల కలాపము రెండు రకములుగా నున్నది. ఒక రకమున గొల్ల భామ వేదాంతోపన్యాసము చేయుట, వేఱొక దానిలో గొల్ల భామ సముద్ర మథన కథా కథనము, సుంకర కొండఁ డామెతో

చేయి ముట్టు సరసమునకు దిగుట యను నవి ప్రధాన విషయములు. మొదటి తరగతికిఁ జెందినది సిద్ధేంద్రుని రచన కావచ్చును. కాని రెండవ తరగతికే వ్యాప్తి హెచ్చు. ఈ గొల్ల కలాపము రచనయు య. గా. ప్రక్రియకు భిన్నము కాదు.

18 వ శతాబ్ది నాఁటి యక్ష గాన చరిత్రలో నీ క్రింది విశేషములు గమనింపఁ దగును :-

(కడమ వివరములకు ద్వితీయ భాగమును జూచునది)

రాజ ప్రోత్సాహమునఁ గొన్ని య. గా. కృతులు వెలసినవి. ఉదా :- వఝుల నరసింహ కవి దుష్యంత చరిత్రము, అకలంక శ్రీ కృష్ణమూర్యుని కృష్ణవిలాసము, నారాయణ కవి సుందర కాండము, నరకూరు నారాయణ కవి పారిజాత నాటకము.

యక్ష గానము నాట్య పద్ధతికి గేయ పద్ధతికిఁ గూడ నుపయోగపడు చుండెఁడిది. ఉదా :- దళవాయి తిమ్మప్ప ప్రసన్న వేంకటేశ్వర విలాసమునఁ జాల చరువుల కడ ముందుగా నొక రాగము నొక తాళమును బేర్కొనఁ బడి పిదప "నాట్యపద్ధతికి" అని మఱి యొక రాగ తాళముల జంట పేర్కొనఁ బడినది. గోగులపాటి కూర్మనాథకవి మృత్యుంజయ విలాసము "నాటక గేయ ప్రబంధ" మని పేర్కొనఁ బడినది. (అట్లు పేర్కొనఁబడినవి 19 శ. లోఁ గొన్ని గలవు. వానిపై మృ. వి. ప్రభావమును జూపట్టును)

కొన్ని య.గా. ల పరముగా నాటకశబ్దము వినవచ్చుచున్నది. ఉదా :- వఝుల నరసింహ కవి దుష్యంత చరిత్రము నొకప్రతి విలేఖకుఁడు శకుంతలా నాటక మని పేర్కొనెను. కూర్మ నాథ కవియు, నగుకూరు నారాయణ కవియు స్వయముగా నా శబ్దమును వాడి

యుండిరి. నరుకూరు కవికృతి "ఆటభాగవత" మనియుఁ బేర్కొ-నఁ బడినది. దీనిపై భామకలాపము ప్రభావము బాగుగాఁ గలదు. అర్వాచీన పారి జాత య. గా. లపై దీని ప్రభావమును బడినది.

కొన్నిటఁ బాత్రలను సూత్రధారుఁడు పృచ్ఛించుట గలదు. ఉదా :- నరసింహ కవి దుష్యంత చరిత్రము, నక్క-లపాటి సంజీవ కవి ఎఱుకల కథ. దుష్యంత చరిత్రలోఁ దెర ప్రస క్తియుఁ గలదు. ఇందును నరుకూరు కవి కృతి యందును పాత్రలు స్వీ యోదంతమును సభ వారికి నివేదించుట, హాస్య గాని వాలకమును గలవు. కొన్నిట ప్రబంధ ప్రభావము బాగుగాఁ బడినది. ఉదా :- కూర్మ నాథ నరు కూరు నారాయణ కవుల కృతులు మొ॥. తమిళ దేశపు "ఉలా" ప్రబంధపుఁ బోకడయు, తంజావూరు య. గా. నాటక ఫక్కి-యు దళ వాయి తిమ్మప్ప కృతియందుఁ గన్పట్టును. (చూ. ద్వి. భా. - పుటలు 41-43 ; 257). మృత్యుంజయ విలాసమున నాశ్వాస విభాగ మొక విశేషము.

ఈ శతాబ్ది నడుమనే యొక రాయలసీమ బొమ్మలాటవారి కుటుంబమునకుఁ జెందిన య. గా. రచన మొకటి బయల్వెడలినది. అది బొమ్మలాట సాంబయ్య కిరాతార్జునీయము (ద్వి. భా. పుట 46-49). రచన రుద్రకవి సుగ్రీవ విజయము ఫక్కి-నున్నది.

ఈ శతాబ్ది చిట్టచివర వెలసియుండునని యూహింపఁదగిన పురిజాల లక్ష్మీనారాయణకవి "పారిజాత యక్షగాన ప్రబంధము"న నొక ముఖ్యవిశేషము గలదు. అది ప్రబంధముద్ర, భామ కలాపము "బాణి"యును గలది. ఆమాట యటుండ, నిం దాట భాగవతము లందుఁ బురుష నటులు స్త్రీ వేషములను ధరించుటగూర్చి సత్య భామకు సఖిపాత్రకు నడుమ నొకచర్చ జరిగినది. అది యనుచితమని

సఖి వాదము, హరి జగన్మోహిన్యవతారాది వృత్తాంతము లుదాహరించి సత్యభామ దానినిఁ బ్రత్యాఖ్యానము సేయును. ఈ సందర్భమున గవి యుద్దేశము పురుషులు స్త్రీ పాత్రధారణము చేయవచ్చునని యే. కాని తగినసందర్భము లేకున్నను సతఁడా విషయము నెత్తుకొని యక్షోల సమర్థింపవలసివచ్చినది యని ప్రశ్న. అనఁగా స్త్రీ పాత్రలను స్త్రీలే నిర్వహించుట యుక్తమను వాదము క్రొత్తగాఁ గవి సమకాలికులలో బయలుదేఱినదో, లేక యక్కడక్కడ వీధిభాగవతములలో, దొలుత స్త్రీ పాత్రలు స్త్రీలే నిర్వహించుచుండ నీ కవి నాఁటికిఁ బురుషులు నందులకుఁ బూనుకొనుచుండఁగా నచ్చటచ్చట నాక్షేపణ బయలుదేరినదో! ముందునాఁటి య. గా. లలో స్త్రీ పాత్రలు స్త్రీలే నిర్వహించుచుండిరనుటకు దగిన యాధారములు లేవు. కాని క్రీ. శ. 1514 నాఁటి చెఱువు బెళగల్లు శాసనమునందు "తాయికొండ నాటకము"న నట్టువ తిమ్మయ్య కొమారై "పాత్రి"గ నటించినట్లు వేరొక్కనఁబడినది. ఈయొక్కవిషయమునుబట్టి నిర్ణయములు చేయఁదగదు. కొందఱు భాగోతుల బుచ్చిగాఁడును, పెండెల నాగియు, గంగియుఁ బేరొక్కనఁబడిన చాటుపద్యమొకటి శ్రీనాథకృతమనియు, పెండెల నాగియు గంగియు భాగోతుల బుచ్చిగాని మేళములోనివారై యుందురనియు నూహింతురు. కాని మొదటిసంగతి యీ పద్యము 18 వ శతాబ్దినుండిన తురగా రామకవిది గాని శ్రీనాథునిది కాదు. రెండవసంగతి భాగోతుల బుచ్చిగానికి పెండెల నాగితోఁగాని గంగితోఁగాని యెట్టిసంబంధము నాపద్యమున సూచింపఁబడలేదు. మూఁడవది బుచ్చిగాఁడే యేదో యొక్కటే కొదువగా ని యాడువేషము నకుమాత్రము జక్కఁగా గుదిరియుండువాఁడనియు నందు సూచింపఁబడినది.[31] 18 వ శతాబ్దివాఁడే యగు కూచిమంచి జగ్గకవి చంద్ర

31. చూ. వేటూరి వారి క్రీడాభి రామ పీఠిక, పుట 68 – 69.

రేఖా విలాపమునందుఁ బలుతడవలు "భాగవతుల" (నటుల) ప్రశంస వచ్చినది. అందొకచో (1-85) నున్న, "ఆడు భాగవతుని జాడ గడ్డము మూతి, నున్నగా గొరిగించుకొన్నవాఁడు" అను మాటను బట్టి నాఁడు పురుషులు స్త్రీ వేషములు వేయుచుండెడివారని తెలియుచున్నది. కాని 19 వ శతాబ్ది యందు వీధినాటకములందు స్త్రీలును బాల్గొనినట్లు కొన్ని యాధారములు గలవు. (ముందు చెప్పఁబడును). అట్లు స్త్రీలు పాల్గొనుట లక్ష్మీనారాయణ కవి కాల మున నప్పుడే యింకను మొదలైయుండును. ల. నా. కవి కది యిష్టముకాకపోవుటచేత నట్టి చర్చకుఁ దన కృతిలోఁ బసక్తి గల్పించి యుండును.

18 శ. య. గా. లలో రచనలోఁ బ్రాచీన రీతులతోపాటు కొన్నికొన్నిటఁ గ్రొంగ్రొత్త విశేషములును గొన్ని చేరినవి. ఉదా:- దరువులలో సంకీర్తన లక్షణము (నిముషకవి రామయ్య జలక్రీడా విలాసము ఇది ప్రదర్శనోద్దిష్టమై యుండదు), హిందుస్తానీ రాగతాళ ప్రాచుర్యము, శారదపద్యము (అకలంక); రగడ, దండకము, చూర్ణిక, శ్లోకములు, గౌరీకల్యాణము (గోగులపాటి); రాగ యుక్తములగు ద్విపదలు, కన్నడభాషలో దరువులు (తిమ్మప్ప); కందార్ధములు, గీతార్ధములు (నరుకూరు).

18 శ. య. గా. చరిత్రలో నించు మించాంధ్రదేశమునఁ గల ముఖ్యమండలముల కన్నిటికిని దగిన ప్రాతినిధ్యము గలదు. పూర్వ శతాబ్దులకంటె బరిణతి యధికముగాఁ గనుపట్టినది.

19 వ శతాబ్ది ఆంధ్రదేశయక్షగాన చరిత్రలోఁ జిత్ర చిత్ర నైక నైకవిధ పరిణామములకాలవాలమైన కాలము. వివిధప్రాంతము లందు యక్షగానములు కోకొల్లలుగా వెలసినవి. అందధికభాగము

నాటకనామము నవధరించినవి. ప్రదర్శకుల మేళము లనేకము వెల సినవి. రంగస్థలమున యక్షగాన మొకవింతహంగారంగుతో రాణించినది.

ఆనాఁటి దాని పరిణామ చరిత్రలోఁ బ్రధానములైన యంత స్తులు బహువిధప్రక్రియానుబంధములు. ఆంధ్రదేశమున యక్షగానము నకు నాటకనామము 18 శ. నుండి కన్పట్టును. అది వీథి నాటకముల తోడి యనుబంధమువలన వచ్చియుండును. ఆ యనుబంధ మెపుడో గాఢముగా నేర్పడి పోయినది. ఇఁక నీ 19 శ. నఁ గ్రొత్తగా నేర్పడిన యనుబంధములు కొరవంజి, బొమ్మలాట, ఏకాంతసేవ, హరికథ, జంగం కథ, మార్గనాటకము, ఆధునిక నాటకము మొ॥ వానితోడివి.

కొరవంజి - యక్షగానము

కొరవంజి యక్షగాన సంబంధము చరిత్ర పూర్వోక్తము (చూ. పుట 31–47). కొరవంజి రచనా ప్రక్రియా ప్రాణభూతమగు ఎఱుక పుట్ట మాంధ్రదేశ య. గా. లలో మొట్టమొదటగా 18 శ. లోఁ గన్పట్టినది. (చూ. నక్కలపాటి సంజీవకవి ఎఱుకలకథ, కూర్మ నాథకవి మృత్యుంజయ విలాసము). కాని యీయాంధ్రసీమయందు కొరవంజి వేరితో య. గా. రచన వెలయుటన్నది 19శ. పూ. భా. నందే మొదలైనది. ఉదా 1. సన్నిధిరాజు జగన్నాథకవి ఎఱుకల కురవంజి, 2. జందాళ నంజప్ప జ్ఞాన-కురవంజి రెండును య. గా. లనియుఁ బేర్కొనఁబడినవి. రెండును వేదాంత విషయ ప్రధానము లగుట గమనింపఁ దగినది. కురవంజులుగాఁ బేర్కొనబడకపోయినను నాఁడనేక-తెనుఁగు దేశ య. గా. లందెఱుకత పాత్రకుఁ బ్రసక్తికలదు. (చూ. తరిగొండ వెంగమాంబ శివనాటకాదులు, శివలెంక మల్లనా రాధ్యుని వీరభద్రవిజయము మొ॥.)

బొమ్మలాట - యక్షగానము

బొమ్మలాటకు యక్షగానమునకునుగల సంబంధము, చరిత్రము గూడఁ బూర్వోక్తము. (చూ. పుట 47 - 58). మనుష్యులచే నాడఁబడుటకే కాక బొమ్మలాట ప్రయోగమునకును గవులచే నుద్దిష్టము లైనట్లు స్పష్టపడిన య. గా. రచనలీ శతాబ్ది నడుమ నుండియే కాన వచ్చుచున్నవి. ఉదా :— 1. మరింగంటి భట్టరు రామానుజాచార్యుల శ్రీరామ నాటకము. 2. చతుర్వేదుల వెంకట నరసింహయ్యగారి ద్రౌపదీవస్త్రాపహరణాదులు. 3. కోట వెంకటప్పయ్య శాస్త్రి బాణాసురనాటకము మొ..

ఏకాంత సేవ - యక్షగానము +

ఏంకాంత సేవా ప్రబంధము లను పేర నొక "తరహా" యక్ష గాన ప్రాయ రచన లీ శతాబ్దమునఁ గన్పించును. అందు కొన్ని య. గా. లనియుఁ బేర్కొనఁ బడినవి. ఏకాంత సేవయనఁగా నిత్యార్చన సాగు దేవాయతనము లలో ముఖ్యముగా భోగ నిలయము లగు వైష్ణవాలయములో రాత్రి గుడి తలుపులు మూయుటకు ముం దర్చ కులు యథా విధి నుప చరించి అమ్మవారి, స్వామివారి యుత్సవ విగ్రహములను బానుపుపైఁ బవళింపు చేసి, గుడిచేటులు లాలి పాటలు పాడి ద్వారపాలన నిమిత్త మష్ట దిక్పాలకులకు 'బహు పరాకులు' చెప్పి వెడలి పోఁగా నిఁక నమ్మవారు స్వామివారికిఁ జేయు నదిగా నూహింపఁ దగిన పర్యంక సపర్య. మధుర భక్తి ముదితాత్ములగు కవివతంసులు కొందఱా సన్ని వేశమును గ్రహించి దానికిఁ బూర్వ రంగముగా నింత కథాంగము (భామ కలాపము "బాణి" లో) కల్పించి నాయకుని వివిధోపచారములకు వివిధ గీత ప్రభేదములను

+ ఈ విషయమై వివరములకు చూ. నా వ్యాసము - కృష్ణాపత్రిక 30-4-55.

ప్రయోగించి ఏకాంత సేవామకుటముతో ననేక గేయ ప్రబంధములను వెలయించిరి. అవి యక్ష గానముల వలె సంగీత సాహిత్యముల కాల వాలములు; ఎట్టి రచనా విశేషము నైన నిట్టే యిముడ్చుకొనఁ గల ట్టివి. ఈ జాతి కృతి రచన యంత ప్రాచీన మైనదిగాఁ దోఁపదు. 19 శ. ప్రాంతము ననే యక్షగాన మొర వడిగా బయ ల్వెడలినట్లు తోఁచును. అందు కొన్ని యక్షగానము లని యా కవుల చేతనే వ్యవ హృతము లైనవి. నాటక నామకరణము చేయించు కొన్నవియుఁ గొన్ని లేకపోలేదు. ఉదా:- 1. మామిళ్లపల్లి వేంకటాచల కవి ఏకాంతసేవా నాటకము. (కవి చేతనే య. గా. అనియుఁ బేరొక్కఁ బడినది.) 2. అక్కెనప్రగడ హరి దాసు "శ్రీరామ నిత్యోత్సవ యక్షగానము." 3. కుందుర్తి ఆది నారాయణ శర్మ "ఏకాంతసేవా కథానామకంబగుయక్ష గానము"

హరికథ - యక్షగానము

హరికథకు యక్షగానమునకుఁగల యనుబంధమునూర్చి ముందే చెప్పఁబడినది. (చూ. పుట 74 - 82). ఆంధ్రదేశమున హరికథలు వెలయుటయు, నందుఁ గొన్ని య. గా. లని వ్యవహరింపఁ బడుటయు నీ 19 శ. ఉత్తరార్ధము నుండియే కాననగును. ఉదా:- 1. బాగేపల్లి అనంత రామాచార్యుల శశిరేఖా పరిణయాదులు, 2. ఆదిభట్ల నారాయణదాసు ప్రహ్లాదచరిత్రాదులు, 3. కోకా వెంకటరామాను జులు నాయుఁడు గజేంద్రాళ్వారు చరిత్ర మొ॥.

జంగము కథ - యక్షగానము

19 శ. ఉ. భా. న యక్షగానములకు, జంగము కథలకు నొక విధమైన చిన్న సంబంధమేర్పడినది. అసలు య. గా.లకు జంగం కథ

లకు నొకసామ్యమును గలదు. జంగముకథలు గానహూపకథాఖ్యాన మున కుద్దిష్టములు. యక్షగానములు కాలక్రమమున రంగప్రదర్శ నల కెక్కినవి కాని వాని ప్రాథమికస్థితి గానప్రధాన కథాఖ్యాన పద్ధతియే గదా. జంగము లొకప్పుడు తెరనాటకము లాడుటలోఁ బ్రసిద్ధులేకాని జంగముకథ లనఁబడునవి హరికథ, బుఱ్ఱకథలవలె గాన రూప కథాఖ్యానకములు మాత్రమ.[32] ఇందును య. గా. లందువలె దరువులు గద్యపద్యములు నుండును గాని ద్విపద, ఏలపదాది దేశి రచన లుండవు. ఇందు ప్రధానముగ విహితముగఁ బ్రచురముగ నుండునది రగడ; కథాఖ్యాన తంత్రోపాయమగు ప్రధాన రచనాంగ మదే. ప్రాచీన య. గా. లందలి రేకులు రగడ వికారములే గాని య. గా. లందు రగడ యథాతథముగాఁ బ్రయోగింపఁబడిన సందర్భము లతి సకృత్తు. జంగము కథలు 19 శ. కి ముందు వెలసిన జాడ గాన రాదు. వానిప్రాదుర్భవమునకు జక్కులకథలే (య. గా. లే) కారణము లైనవేమో! 19 శ. తురీయపాదమున జంగము కథా రచయితలుగాఁ బేర్వడసిన గాయకవాడు పెద్దన, ధేనువకొండ వెంకయ్య వరుసగా నలచరిత్ర, విరాట పర్వములను జంగము కథలుగను, యక్షగానములు

---

32. చూ. పుసులూరి వేంకటసుబ్బరాయకవి ద్రౌపదీ వస్త్రాపహరణము. (గౌరీ ముద్రాక్షరశాల, నూజీవీడు, 1915. ప్రచురణకర్త) పుసులూరి రామమ్మ. కవి భార్య)

"దరువులు, రగడలు, వచన గద్య పద్యముల సహితముగను ధర శివజంగము వారికి నిరతము ధర్మ జీవనముగ చేయగ బూనితి, జంగము లీ కథ చేకొని వర్ణించి శ్రీయుతముగ బల్ కంచు గుమ్మెటల్ చితారయు బూని సరస మైన సంగీత సత్కళా సంగతు లొప్పగను స్థిరముగ తాళ ప్రస్తారంబుల జేసి చెప్పునటుల" అని కవి వక్కాణ.

గను రచించి యుండుట విశేషము. జంగము కథలే యక్షగానములుగా గొందరిచేఁ బ్రచారమింపఁ బడుట యింకొక విశేషము. [33]

ప్రబంధము - యక్షగానము

ఆంధ్రప్రబంధ ప్రక్రియ 16 వ శ. పూర్వార్ధమునకే సమగ్రిమ నందినది. ఆ శతాబ్ది ముఖాంగణముననే రంగవల్లికలు దీర్చినది మన యక్షగానము. ఒకవంక యక్షగానము పలుకుబడి సాగుచుండిన యా దినములలో వెలసిన ప్రబంధములు కొన్ని (నసుచరిత్రాదులు) నాటకకీతుల వైపు వాటములు ప్రదర్శించినవి. కొన్ని యక్షగానము లలో నప్పటికిఁ బ్రబంధ ముద్ర పడలేదు. రుద్రకవి ప్రభృతులు తమ కృతులను యక్షగాన ప్రబంధములనియుఁ బేర్కొనియున్నను నట ప్రబంధ శబ్దమును గావ్య సామాన్యవాచిగా మాత్రమే గ్రహింప నగును. విష్ణుమాయావిలాసాదులు య. గా. ప్రబంధములని పేర్కొనఁ బడకపోయినను నచట నచటఁ బద్రచనలోఁ బ్రబంధ ధోరణి కొద్దిగా నైనను బొడసూపకపోలేదు. 17 శ. ఉ. భా. న వెలసిన భామ కలాపముపై ముందునాఁటి ముక్కుతిమ్మనగారి పారిజాతాపహరణ ప్రబంధ ప్రభావ మగుపించినది. పిదప కాలమున భామకలాపము

33. చూ. (1) తుళ్లూరి మాధవరాయకవి సారంగధరకథ (ప్రా. లి. పు. భాం., ఆర్. నం 691. శేటలూరు కర్తలచే యక్షగాన మని పేర్కొనఁ బడినది. (ప్రా. లి. పు. భాం., త్రైవార్షిక గ్రంథ వివరణిక, – పుట 1729). (2) పుసులూరి సుబ్బరాయకవి "యక్షప్రశ్నలు" – మదరాసు సుబ్రహ్మణ్యవిలాస ము. శా., 1915. ప్రచురణకర్తలచే యక్షగానమని వ్యవహృతము. (3) 1900 ప్రాంతమున ధనకుధరం రామానుజాచార్యుల వారిచే రచింపఁబడిన బిల్హణీయము వారి చేతనే య. గా. గాఁ బేర్కొనఁబడి యుండుట మఱియు విశేషము. అట్లు కవిచే య. గా. గా వ్యవహృతమైనది గాన దీని చరిత్ర మిందు చేర్చుట యైనది. (చూ. ద్వి. భా., పుట 210-11).

"భాణీ"తో వెలసిన పారిజాత యక్షగానములపై దాని ప్రభావ మింకను నధికము. 18 శ.న య. గా. లపైఁ బ్రబంధము ప్రభావ మధికతరముగనే కన్పట్టును. 18 శ. చివర సూరన ప్రభావతీ ప్రద్యు మ్నము గోపాలుని సింగయచే య. గా. గాఁ బరివర్తింపఁబడినది. ఆనాఁటి మృత్యుంజయ విలాసమునందు రచనాప్రౌఢిలోఁ గథా ప్రణా ళికలో నాశ్వాస విభాగములో వర్ణనా ప్రాచుర్యములో శబ్దార్థాలం కార స్వారస్యములలో, శృంగార ప్రాధాన్యములోఁ బ్రబంధ ముద్ర ప్రస్ఫుటముగాఁ గానవచ్చును. 19 శ.న నట్టి య. గా. రచన లధిక ముగా వెలసినవి. ఉదా :- శివలెంక మల్లనారాధ్యుని వీరభద్ర విజ యము, వారణాసి అచ్యుతరామకవి దరువూరి అప్పలాచార్యులు నను జంట కవుల లక్ష్మీనారాయణ విలాసము మొ॥. ఈరెండును మృత్యుం జయ విలాసమునకు మానస పుత్రికలు - ప్రాచీన రచనారీతి (తాళ ప్రధానములైన దరువులు) గలిగి, ఆశ్వాసవిభాగము గలిగి, ఆఖ్యాన శైలీ ప్రచురమై కేవలము శ్రవ్యధోరణి నున్న య.గా.లును 19 శ.న వెలసినవి. ఉదా :- కాట్రంబాక కేశవాచార్యుల రామానుజ విజ యము, పతివ్రతా మాహాత్మ్యము. 19 శ. తురీయపాదమున వెలసిన రఘునాయకం రామానుజ సూరి కన్యకా విజయ య.గా. 8 అశ్వాస ములు గలది శ్రవ్యధోరణి నున్నది. య. గా. రచనలోఁ బ్రబర్శనలో నాటకపు వాట మధికమగుచుండిన 19 శ. ననే యిట్టి రచనలు వెల యుట జూడ యక్షగానము ప్రాథమిక తత్త్వమును నొకవంకఁ గొంత సంరక్షింపఁబడుచునే యుండినదని చెప్పవచ్చును. ఇట్లు య. గా. లు శ్రవ్య ప్రబంధధోరణి నుండుట మాత్రమేకాక పూర్వ ప్రబంధములు య.గా.లుగాఁ బరివర్తితములైన సందర్భములు గలవు. 19 శ.న ఉదా :- 1. వసు చరిత్ర - కొదమగుండ్ల శేషాచార్యుల వసురాజ విలాసము. 2. భాస్కరాచార్యుని కన్యకా పురాణము -

రామానుజ సూరి కన్యకావిజయము. 3. కందుసూరు రుద్రకవి నిరంకుశోపాఖ్యానము - పురాణం పిచ్చయ్యగారి కపటవేశ్యానాటకము. 4. కళాపూర్ణోదయము - కందాళ్ళ రామాచార్యుని బెళుదూరు క. పూ. నాటకము. (3,4-20 శ.) ప్రారంభదశకుఁ జెందినవి.

నాటకము - యక్షగానము

యక్షగానమునకుఁ బర్యాయముగా నాటకశబ్దము 19 శ. నెక్కువగా వినవచ్చినది. నాటకగేయప్రబంధమనియు, నాటకమనియు వ్యవహరింపఁబడుచు వచ్చినదియక్షగానము. అట నాటకశబ్దము రూపక సామాన్యవాచియేయైనను, అది య. గా. నకు వీధినాటకము సాహచర్యమున సంక్రమించి యుండునని యూహింపఁదగియున్నను యక్షగానముపై మార్గనాటకప్రభావము, తత్రాపి ఆధునిక నాటకప్రభావమును గూడఁ జూడఁ గలము. య. గా. న సూత్రధార ప్రస క్తి సుమారొక శతాబ్దికి ముందే వచ్చుల నరసింహకవి దుష్యంత చరిత్రాదులందున్నను నది మార్గనాటక ప్రభావ మనలేము. ఏలయన య. గా. లలో సూత్రధారుఁడు ప్రదర్శన మధ్యమున గూడఁ బాత్రలను బలుకరించుటయుఁ (అది దుష్యంత చరిత్ర య. గా. న విశదమైనది) గథాను సంధానము సేయుటయుఁ గాననగును. మార్గరూపకములలోఁ బ్రస్తావనతో సరి సూత్రధారుని వాలకము. మఱి కనుపింపఁడు నడుమ. య. గా. లలోవలె నతఁడు పాత్రలను బలుకరింపఁడు సరికదా పరిచయమైనఁ జేయఁడు. 19 శ. న సూత్రధారప్రస క్తిగల య. గా. లనేకము వెలసినవి. ఉదా:- 1. శీర్నాడు వెంకటరాయకవి లేపాక్షి శివ నాటకము (19 శ. పూ. భా.) 2. మరింగంటి భట్టరు రామానుజాచార్యుని శ్రీరామనాటకము (19 శ. నడుమ) 3. బోడిచర్ల సుబ్బకవి ఖిల్జీమరి రామాయణము, 4. దూపాటి శేషాచార్యుల శాకుంతల

నాటకము, 5. కేసిరాజు వెంకటసుబ్బరాయకవి రామదాసు నాటకము, 6. త్వరకవి రామకృష్ణయ్యగారి వీరభద్రవిజయము. (3-6-19 శ., ఉ. భా.) 7. కాకరపర్తి నృసింహకవి సంగీత సారంగధర నాటకము (20. శ.) మొ...ఇందు 1 లో సూత్రధారుఁ డొఱుకల సానిని బల్కరించును. 2 లో సూత్రధారి గ్రంథ ప్రస్తావన నడుపును. 3 లో సూత్రధారి మంత్రసానిని బలుకరించినాఁడు. 4 లో సూత్రధార ప్రవర్తిత మైన ప్రస్తావన గలదు. అందీ నాటక ప్రయోగమును గూర్చిన తౌర్యత్రిక రూపారోపవిషయ ప్రసక్తియున్నది. 5 లో గ్రంథాంతమున ననుబంధముగా గ్రంథకర్తచే రచింపఁబడిన నాందీ ప్రస్తావనలుగలవు. 6. లో గ్రంథారంభమున సూత్రధారుఁడు కథోద్ఘాతము నుపన్యసించుట మాత్రము కాననగును. 7 లో నాందియు, సూత్రధార విదూషకులచే ఁ బ్రవర్తితమైన ప్రస్తావనయుఁ గలవు. ఇట్లీ నాందీప్రస్తావనలకుఁ బ్రసక్తిగల య.గా. లను జూచినచో య.గా. పై మార్గదూపక ప్రభావము పడినదని చెప్పకతప్పదు.

ఇఁక నాధునిక రంగస్థల నాటకము [34] తో యక్షగానము నకుఁ గల యనుబంధము విచారణీయము. కొందఱు విమర్శకులు "నేటి నాటకములకు మాతృక లైనవే నాటి యక్షగానములు" అని యను చున్నారు. [35] కాని యిది ముధావాదము. యథార్థముగఁ గొన్ని యక్షగానములే యాధునిక రంగస్థల ప్రభావ పరామృష్టము

34. Well developed and regular Modern Stage - drama.

35. (a) గొల్లపాటి వెంకటసుబ్బయ్యగారి "జనజానపద వాఙ్మయ సమీక్ష" అను వ్యాసము. ఆంధ్రపత్రిక-ఆంధ్ర రాష్ట్రావ తరణ పత్రికా సంచిక, తేదీ. 1-10-53, పుట 7.

(b) 'Yakshagana is the precursor of the Modern Drama in Telugu' - Telugu Literature (P. E. N. Series by P. T. Raju.)

లైన వని చెప్ప వలసియున్నది. ఈ రంగ స్థల నాటకరచన యన్నది యాంధ్రమున మిక్కిలి యాధునికము. 19 శ. ఉత్తరార్ధమున ధార్వాడ నాటకాల కంపెనీ వారు తెలుఁగు మాగాణముపై "డేరా" వేయుటతో నిటు కీ. శే. కందుకూరి వీరేశ లింగముపంతులు గారు నటు రాయల సీమలో కీ. శే. ఆంధ్రనాటకపితామహుఁడు ధర్మవరం కృష్ణమాచార్యులు గారు మొదలైన పండితులు కలములు సవరించుటతో నవతరించిన దాంధ్ర రంగస్థల నాటకము. సంస్కృత, పాశ్చాత్య నాటకముల కనువాదములును, ఆ ఉభయ ప్రక్రియా సమన్వితములగు స్వతంత్ర నాటకములును వెలసినవి మొదట. ఆ కాల మున రచింపఁబడిన యక్షగానములపై వాని ప్రభావ మెట్టిదో పరిశీలింతము. పూర్వోక్తమైన కేసిరాజు వెంకటసుబ్బారాయ కవిగారి రామదాసు నాటక మిందులకుఁ బ్రబలోదాహరణము. (వివరములకు చూ. - ద్వి. భా., ఆ పుట. 177 - 179). ఇం దిది మొదట 1888సం. న "యక్షగానముగా" రచింపఁ బడినట్లును బిదప 1899 లో కవి యే "ఇప్పటి నాటకముల వలె" అనఁగా ధార్వాడ కంపెనీ నాటక ప్రదర్శనములను జూచి మన కవు లానాఁడు రచించు చుండిన నాటకముల వలె రచింపఁ బూనినట్లును కవిగారి పుత్రు లగు శ్రీ కేసిరాజు సత్యనారాయణ గారు 1927లో (రాజమండ్రి రాజన్ ప్రెస్సులో) ముద్రితమైన యీ నాటకము పీఠికలో వ్రాసియున్నారు. మఱియు వారు "ఈ గ్రంథమూలమగు చిత్తుప్రతి యందు అంకరంగ విభజనముగాని పాత్రల ప్రవేశ నిష్క్రమణ సూచ నలు గాని లే" వని యన్నారు. నేటి ముద్రిత ప్రతినిఁజూడ నిందు నాటకారంభమున కట్టియం (చోపుదారు) వచ్చి తానిపా రాకను సూంచిచుట, పాత్రలు తెరలోనుండియే ద్విపదలో స్వీయచరిత్ర చెప్పు కొనుట, వెంటనే పాత్రప్రవేశ సూచకమగు నొకదరువు, కటికవాఁడు

పాత్రను బలుకరించుట, ఎఱుకతపాత్ర యునికి మొ॥ విషయములు చూడ నది యంతయు నచ్చముగా యక్షగానపు " భాణీ " యనిపించును. కాని వాక్యోవాక్య పద్ధతిని వచనమునఁ బాత్రల సంభాషణలు అంక విభాగము అంకములు మఱల ననేక రంగములుగ విభక్తములగుట మొ॥ విషయములుండుట జూడ నిది యాధునిక నాటక ప్రభావమని తెలియ నగును. 20 శ. ప్రథమపాదమున కాకరపర్తి నృసింహకవి విరచితమైన సంగీతసారంగధర " నాటకము యక్షగాన శృంగాటకమ్ము " అని కవిచే బేరొక్కొనఁ బడినది. ఇందును అంకరంగ విభాగము, సంధివచనములు లేకుండ ముఖాముఖిగా సరళశైలిలో వచన ప్రచురముగాఁ బాత్రల సంభాషణలు, స్వగతములు, నేపథ్య ప్రసంగములు, పాత్రలు సూటిగాఁ బ్రవేశించు పద్ధతి మొ॥ ఆధునిక నాటక ప్రభావమును సూచించు విషయములు గలవు. కవి యక్కడక్కడఁ బ్రసిద్ధరాగ తాళములలో దరువులను ప్రవేశపెట్టుటచేఁ గాఁబోలు పర్యాయమున దానిని యక్షగానమనియు వ్యవహరించినాఁడు. ఆ " యక్షగాన శృంగాటక " మనుమాట సార్థకము. ఇందును రామదాసు నాటక మందును నాందీప్రస్తావనలు మార్గప్రక్రియకుఁ జెందినవే యైనను, అంకములనేకరంగములుగా విభాగింపఁ బడుటన్నది మాత్రము పాశ్చాత్య నాటక సంప్రదాయము. ఆధునిక నాటకములందు రెండు ప్రక్రియలును సమన్వయింపఁబడినవి. వాని ప్రభావము య. గా. లందును గనఁ బడుట విశేషము. ఈ వివరణమును బట్టి " నేటి నాటకములకు మాతృకలైనవే నాటి యక్షగానము " లనుట పొసగదనుట తెల్లము. యక్షగాన మాధునిక నాటకమునకుఁ బ్రాథమికస్వరూపమే యైయుండు నెడల నట్టి నాటకములకు విశేష ప్రచారముగల యీ దినములలో య. గా. రచన యంతరించి యుండవలసినది. కాని యీ 20 శ. యందును సన్నగిల్లి పోయినను సాగుచునే వచ్చినది య. గా. రచన.

ఇంత వ్రాసియు 19 శ. నాటి యక్షగాన పరిణామమును బూర్తిగాఁ జెప్పినట్లుకాదు. ఆనాఁటి దాని పరిణతి బహుముఖ మైనది. ఐనను నందందుఁగల విశేషములుకొన్ని స్థాలీపులాకముగా స్పృశింపఁ బడును.

ఈ 19 శ. న :- భామకలాపము "భాణీ" ని రచింపఁబడిన య. గా. లు శ్రీనివాసకవి పారిజాతము, శేషము రంగాచార్యుల రతి మన్మథ విలాసము, శివకేశవ పారిజాతము మొదలగునవి. ఇందు శి. కే. పారిజాతము ప్రయోజన ద్వైవిధ్యము నేకత్ర సాధించినది. (చూ. ద్వి. భా. పు. 92-94).

పాడుటకు నాడుటకుఁ గూడ నుద్దిష్టములైన య. గా.లు శ్రీనివాసకవి పారిజాతము (ఇది నాటకమని పేర్కొనఁ బడినది), భారతి రామరాజు గొల్లకథ మొ॥. అందు రెండవదాని డి. నం. 1873 ప్రతి ముఖపత్రమున "ఆట భాగవతమందు గొల్లకథ – ఆట తాళం సారంగ రాగం వల్లనే యీ గొల్లకలాపం యావత్తు వినకరి చేస్తున్నారు. కొందరు ప్రత్యేకరాగములు పాడుతా"రని యున్నది. నిశ్చింత ఎంబారయ్యగారి ప్రహ్లాద విజయ య. గా. "బాలికల కత్యంతోపయుక్తమగునట్లు" రచింపఁబడినదఁట. అనఁగా నిది పాడుటకు మాత్రమె యుద్దిష్టమైనదిగాఁ దోఁచును. ఇట్టివే శ్రీరాజా మృత్యుంజయ నిశ్శంక బహద్దరుగారి "దశావతార లఘునాటక రూపక యక్షగానము", పులహరి ఫిరోజికవి "సాత్రాజితీ నాటకం బను యక్షగానంబు"ను. ఇవి నాటకములని పేర్కొనఁబడియు శ్రవ్య ధోరణి నుండుట గమనింపఁదగినది. ఆశ్వాస విభాగముగల్గియు, గేయ ప్రబంధమని పేర్కొనఁబడియు "తగిన వేషంబులన్ ధరియించి సభల సొగసుగాఁ దెలుప" నుద్దిష్టమైనది పోడూరి వేంకటరాజు

సుకుమారీ పరిణయము. ఇందలి యాశ్వాస విభాగ మంక సంకాశమైనది.

విపుల కథాత్మకములై ప్రదర్శనోద్దిష్టములైన య. గా.లు కొన్నికొన్ని రాత్రుల ప్రదర్శనమునకుఁగాను విభాగింపఁబడినవి. ఉదా :- శీర్ణాడు వెంకటరాయకవి లేపాక్షి రామాయణము - "మూఁడు రాత్రుల కథ" 2. కొండూరి సీతారామ కవి సావిత్రీ నాటకము - మూఁడు రాత్రుల కథ. 3. మోక్షగుండము సుబ్బకవి సీతాకల్యాణము - రెండు రాత్రుల కథ. 4. యమ్మనూరి వెంకట సుబ్బకవి విరాటపర్వము, ద్రౌపదీ కల్యాణము - రెండురాత్రుల కథలు. 5. పేణె సుబ్బరాజు, గాజుల వెంకూరి శేషగిరిరాజుల (1900 ప్రాంతము) సంత వేలూరు కుశలవనాటకము "ఆరు రాత్రిళ్ళ నాటకమునకు బొమ్మలాటకును ఉపయోగముగా" రచింపఁబడినది.

పాత్రల "తెర ద్విపదలు" (అనఁగాఁ బాత్రలు ప్రవేశించుటకు ముందు ప్రదర్శకముఖ్యునిచేఁ బృచ్ఛింపఁ బడి తెరలో నుండియే స్వోయోదంతము సభవారి కెఱుకపడఁ జెప్పు ద్విపదలు) "తెర బయలు దేశే దరువులు" (ప్రవేశికధ్రువలు) ను జాల యక్షగానము లందుఁ గన్పట్టును. ఉదా :- శేషము రంగాచార్యుల రతిమన్మథ విలాసము, పోడూరి వెంకటరాజు సుకుమారీ పరిణయము, వేదాల తిరునారాయణాచార్యుల శకుంతలా, ప్రహ్లాదనాటకములు, మొ॥ వానిలోని పాత్రప్రవేశపు దరువులు సర్వసాధారణముగ హంగుదారులవలనఁ బఠింపఁబడును. కొన్నిటఁ బాత్రముఖముగను ప్రవర్తిత మగుట కాన నగును. ఉదా :- గుండు అద్వైతబ్రహ్మశాస్త్రి సత్య భామా పరిణయము. ఈ "తెర" ద్విపదల దరువుల పద్ధతి ప్రాచీన

య. గా. లందుఁ గన్పట్టదు. భామ కలాపము బయల్వెడలిన నాఁ
నుండి కన్పట్టును 19 శ. నఁ బ్రాచుర్యము వహించినది.

సంధివచనములవలె సంధిద్విపదలు, సంధిదరువులునుగల య.గా
లును గలవు. ఉదా:- కుచేటి సుబ్బరాయకవి గౌరీ శంకర విలాసము
అద్వైత బ్రహ్మశాస్త్రి స. భా. పరిణయము మొదలగు 19 శ.
ఉ. భా., య. గా. లలో వచన ఘటితములైన సంభాషణలు ప్రాచు
ర్యమువహించినవి. ఉదా:- కొదమగుండ్ల శేషాచార్యుల పురూర
శ్చక్రవర్తి విలాసము. కే. ప. జియ్యరయ్య నలనాటకము, కొండయ్య
మైరావణచరిత్ర, కెళ్ళ కుప్పయ నలచరిత్ర మొ॥. కాని వీనిలోనూ
వంక సంధివచనములును గలవు. సంధి వచన విరహితముగాఁ బాత్రే
సంవాద వచనములు మాత్రమే కలిగినవియుఁ గొన్ని గలవు - సంగీ
సారంగధర మొ॥.

కొన్ని య. గా. లందు కట్టికముపాత్ర (తంజావూరు యక్ష
గానములలోఁ దఱచు గనుపట్టు చోపుదారుపాత్ర) కన్పట్టును. ఉదా:-
వేదాల తిరునారాయణాచార్యుల య. గా.లు మొ॥ కొన్నిట వాఁడ
హిందీలోఁ బ్రసంగించుట కాననగును. ఉదా:- జియ్యరయ్య నల నాట
కము మొ॥ నాఁజే కొన్నిట హాస్యప్రసంగములును నెఱపును కాని
కొన్నిట వేఱే విదూషక ప్రాయుడైన హాస్యగాని పాత్రయుఁగన్పట్టును.
ఉదా:- బుక్కపట్టణం శఠగోపసూరి, కొన్నిట గ్రంథారంభమున
గణపతి సరస్వతుల స్తుతుల వెంట నాపాత్రలును రంగముపైఁ బ్రవేశించి
నటులను దీవించుటయు, హాస్యగానితోఁ బ్రసంగించుటయుఁ గాన
నగును. ఉదా:- బోడిచర్ల సుబ్బకవి రామాయణము, నగళ్ళపాటి
సుబ్బదాస యామినీ పూర్ణచంద్రోదయము మొ॥. (ఈసంప్రదాయము
కొన్ని తంజావూరు య. గా. లందును గాననగును.)

నూఱ్ఱేఁతి వృత్తములు గల యక్షగానాలును కొన్ని వెలసినవి. ఉదా :— 1. శేషము రంగా చార్యుని భావనారాయణ విలాసము (పొన్నూరు క్షేత్రమాహాత్మ్య గాథ) 2. కే. వెం. సుబ్బారాయ కవి రామ దాసు చరిత్రము 3. కపిమూల వీపూరి ఆచారి పోతులూరి వీర బ్రహ్మమునా టకము.

19 శ. య. గా. రచనలోఁ జిరప్రసిద్ధ దేశీయ మధురకవితా రీతుల ప్రాచుర్యము క్రమముగాఁ దగ్గుచు వచ్చినది. అర్ధపద్యములు (మొదట సగము పద్యము, పిదప సగము దరువు పోకడయుఁ గలవి) మాత్రము పలు రకములు (కంద గీత సీస ద్విపద వృత్తార్ధములు) ప్రాచుర్యము వహించినవి. దరువులలో హిందూస్తానీ భాణీరాగ తాళముల కధిక ప్రాచుర్యము గల్గినది. దరువుల చివర కవి తత్కృ తీశ్వర నామాంకిత ముద్రలకును ప్రాచుర్యము గల్గినది.

19 శ., పూ. భా. న కంటె ఉ. భా. న య. గా. లెక్కువగా వెలసినవి. పూ. భా. య. గా. లలో నంతో యింతో పండితో పజ్ఞము లెక్కువ. ఉ. భా. న పండితులును సామాన్యులు నైన వారి కృతు లెక్కువ. అందుచే వానిలో లక్షణచ్యుతి బహుళముగాఁ జూపట్టును. కొన్నిటఁ గేవల వ్యావహారిక భాషయే ప్రయుక్త మైనది. ఉ. భా. య. గా. లలోఁ బరిణామ పరిణాహ మధికము. నాటకీయ తయు నాంధ్ర జాతీయ జీవనప్రతి బింబనము నధికము.

19 శ. నాఁటి య. గా. లలో య. గా. సామాన్య ప్రక్రియ కపవాద ప్రాయ మైన ప్రక్రియ గలవి. + మృత్యుంజయ నిశ్శంక బహద్దరు, రఘు నాయకం రామానుజ సూరి, ధనకుధరం రామానుజా

+ Irregular or exceptional types.

చార్యులు, కాకరపర్తి నృసింహకవి మొదలగు వారి కృతులు. (వీళ్ళు పూర్వోక్తములు.)

19. శ., పండితులైన య. గా. కవులు కొందఱు శివలెంక మల్లనారాధ్యులు, తరిగొండ వెంగమాంబ, చెళ్లపిళ్ల నరసకవి, మరింగంటి భట్టరు రామానుజ సూరి, వేలూరి వెంకట కవి, పోడూరి వెంకటరాజు, నాదెళ్ల పురుషోత్తము, మృత్యుంజయ నిశ్శంక బహద్దరు, త్వరకవి రామ కృష్ణయ్య, పురాణం పిచ్చయ మొదలగు వారు.

19. శ. బహు యక్ష గాన గ్రంథ కర్తలైన వారు కొందఱు:- తరిగొండ వెంగమాంబ, శీర్నాడు వెంకట రాయ కవి (లేపాక్షి నాటకాలు), యమ్మసూరి వెంకట సుబ్బకవి (వేములపల్లె నాటకాలు), యాదవదాసు, ఎల్లనూరి నరసింహ కవి, త్వరకవి రామ కృష్ణయ, పురాణం పిచ్చయ మొదలగు వారు.

19 - 20 శ. య. గా. మేళములు కొన్ని :- లేపాక్షి, వేముల పల్లె తాడిపత్రి మేళములు (రాయల సీమ), పడకండ్ల స్వామి రాయ కవి, త్వరకవి రామ కృష్ణయగారి మేళములు (నెల్లూరు మండలము), ఘట్టు దేశపు వారి మేళము, భాగవతుల రంగయ్య గారి మేళము మొ॥. ఇందు పడ కండ్ల వారి మేళమున స్త్రీలును బాల్గొని నట్లు స్వామి రాయ కవి లక్షణా పరిణయ య. గా. నుండి తెలియు చున్నది. (చూ. ద్వి భా., పుట 180 - 81)

ఈ 20 వ శతాబ్ది యందును రంగస్థల నాటకములు, సినిమాల విజృంభణమునఁ బ్రజాభి రుచులు మారి యక్ష గాన ప్రదర్శన ప్రతిష్ఠ లఘుగంటినవి కాని గ్రంథ రచన సన్నగిలినను సాగుచునే వచ్చినది. 1947 లో మాడ అప్పలస్వామి అను నతఁడు రామదాసు

నాటకమను " యక్షగానము " ను రచించి యుండెను. (చూ. ద్వి. భా. పుట 243; పుటలు 244 - 46 కూడ జూడుడు). 1950 ప్రాంతమునఁ బల్నాటిలోఁ గొందఱు య. గా. కవు లుండినట్లు తెలియు చున్నది. (చూ. ద్వి. భా. పుట 247). అయితే యెక్కటో యిప్పటి మట్టునకు య. గా. రచన కొంత సాగినది కాని యిఁకపై సాగఁగల సూచనలు కన్పించుట లేదు.

20 శ. య. గా. ల గురించి యిది వఱకే ప్రసక్తాను ప్రసక్త ముగఁ గొంత వచ్చినది. 20 శ. య. గా. రచన చాల వఱకు 19 శ. య. గా. పద్ధతినే పోలి యున్నది. 20 శ. య. గా. లందును ప్రాత పద్ధతి య. గా. లు గలవు. ఉదా :- ముడుంబై అలమేల్మంగ తాయారమ్మ సుల్తానీ కల్యాణము, భామ కలాపము, గొల్ల కలాపములును గలవు. (చూ. ద్వి. భా. పుట 216 - 17, 236). బొమ్మలాటకుఁ గూడఁ బనికివచ్చు నట్టి య. గా. గలదు. ఉదా :- సంతవేలూరు కుశలవ నాటకము. (చూ.ద్వి. భా. పుట 239). " మూడు రాత్రుల కథ" గా విభక్త మైన య. గా. గలదు. ఉదా :- కొండమదిబంగారయ్య వృత్రాసుర మహా రాజు నాటకము (ద్వి. భా. పు 228). యక్షగానము లని పేరొక్కఁ బడిన హరి కథలును గలవు. ఉదా :- నందివాడ జగన్నాథకవి, పసుమర్తి కృష్ణమూర్తి, నల్లమిల్లి బసివిరెడ్డి మొదలగు వారి కృతులు. (చూ. ద్వి. భా. పుటలు 135,209,244). ఆధునిక నాటక ప్రభావము స్పష్టపడిన య.గా.లును గలవ. ఉదా :- మండూరి సుబ్బరాయకవి సత్యభామా కల్యాణము - " యక్షగాన కంపెని డ్రామా " (చూ. ద్వి. భా., పుట 223), బల్లే రానురాజు శ్రీకృష్ణ లీలలు (చూ. ద్వి భా., పుట 242). నూత్నేతివృత్తములు గల య. గా. లును వెలసినవి. ఉదా :- గైనేడి వెంకటస్వామి ఏసు నాథ కథామృతము, గోనుగుంట వీరబ్రహ్మము శివరామనాటకము,

శ్రీరాజా వేంకటాద్రప్పారావు బహద్దర్ (ఉయ్యూరు జమీందారులు) వారి కాకతి రుద్రాంబకథ. య.గా. ప్రక్రియ కపవాదప్రాయమైనదొకటి కలదు. 1871-1951 సం.ల నడుమ నుండిన పురాణం పిచ్చయగా రనేక య. గా. ప్రాయ రచనలు చేసియుండిరి. ఆయన తన కృతులను య.గా. లనియు, నాటకములనియు, య. గా. నాటకములనియు వ్యవహరించెను. అందు నాటకమని పేర్కొనఁబడినను "అర్జున చరిత్ర" మనునది యొక అపవాదప్రాయరచన. అది ఆఖ్యానశైలీ ప్రచురమైనది. అందు హరికథలందువలె డోరాలు, జంగం కథ లందువలె రగడలును గలవు. "ఈ గ్రంథము జంగములు, దాసరులు మొదలగువారు గుమ్మెటలు వాయించుచు వేషములతో నాడుచు గ్రామములలోఁ గథను జెప్పి సంపాదనచేసి జీవించుట కనువుగా నుండునట్లు వ్రాయబడిన"దఁట. (చూ. ద్వి. భా. పుట 215).

ఇట్లాంధ్రదేశమున నది పుట్టినప్పటినుండి యిప్పటివఱకుఁగల యక్షగాన చరిత్రను సమీక్షించినచో నది యెత్తని యవతారము లేదనిపించును. ఇతరమైన యే సంగీత ప్రక్రియ విషయమునఁగాని యే సాహిత్య ప్రక్రియ విషయమునఁ గాని యింతటి పరిణతి యసాధారణము. అందులకు య.గా. ప్రక్రియయొక్క విశాలత్వము, బహుముఖ ప్రయోజనావకాశములే కారణములు. ఐనను యక్షగాన మొక దృశ్య ప్రక్రియగాఁ బరిణతమై ప్రచారమున నున్నినాఁడును దాని ప్రాక్తనమైన శ్రవ్యధర్మముగూడ నిరుగుపొరుగుగాఁ బొడసూపుచు వచ్చియుండుట విశేషము.

ఆంధ్రదేశమునుండియే యక్షగాన మటు తంజాపురాది దక్షిణ ప్రాంతములకును నిటు తెలంగాణమునకును విస్తరించినది. ఆయా ప్రాంతములందు దాని పరిణతి కొంత విలక్షణముగా సాగినది. అందు చేత నా విషయము లిందుఁ బ్రత్యేక ప్రకరణములైనవి.

దక్షిణాంధ్రయక్షగానము

ఒకనాఁడు విజయనగరధ్వజముక్రింద విఱ్ఱవీఁగిన ఆంధ్రసామ్రాజ్యరమ తమిళనాడు నడిబొడ్డునకుఁ దరలిపోవలసి వచ్చినది. క్రీ. శ. 1550 ప్రాంతమున తంజాపుర మధురా మండలములలో రాయసమ్రాట్టుల సామంతులగు నాయకరాజుల యౌజమాన్యమున ఆంధ్రప్రభుత నెలకొన్నది. క్రీ. శ. 1565 లో జరిగిన "రక్షసతంగిడి" యుద్ధానంతర దుష్కలితము కారణముగా, రాయసంస్థానము నాశ్రయించుకొనియుండిన కవులు, పండితులు, కళాకారులును దక్షిణ దేశమునకు వలసలుదీసి, ఆంధ్రనాయక రాజాస్థానముల నాశ్రయింపఁ జొచ్చిరి. నిలుకడ కలిగిన కొలఁదికాలమున కక్కడను క్రమక్రమముగా నాంధ్ర సాహిత్య విహంగము రెక్కలల్లార్చినది. యక్షగాన కళాలక్ష్మి గజ్జె కట్టినది. సమ్రాట్టులనాటి వైభవము సామంతుల నాశ్రయించి ననుసరింపఁజేసినదే కాని తగ్గలేదు.

ఆంధ్రవాఙ్మయ చరిత్రమున దక్షిణాంధ్రయుగము కాల పరిమితిని బట్టి సుదీర్ఘము, కవితాపరిణతిని బట్టి కడు విలక్షణము నైనది. వాఙ్మయ ప్రక్రియా వైవిధ్యము, కళావంతుల కవితాకేళి, రసిక శేఖరులైన రాజకవుల పరంపర, శృంగార రసాధిదేవతా రంగస్థలములు, లలితకళా ఫలభూములునగు వారి యాస్థానములు నా యుగ విశిష్టతలు. అట్టి దాక్షిణాత్యాంధ్ర సాహిత్యవాహినీ తీరమునందుఁ దీర్థభూతము లైన ఘట్టములు తంజాపూరు, మధుర, మైసూరు, పుదుకోట మొదలగు సంస్థానములు. అందు తంజాపూరి దొక

+ దక్షిణాంధ్ర యక్షగానమునుగూర్చి సక్రమ పరిశోధన ప్రారంభించిన గౌరవము డా. శ్రీ వేలటూరి వెంకటరమణయ్యగారిది. చూ. వారి "య. గా. తంజావూరు" అను వ్యాసము — ఆం. ప. ఖరి సం. సంచిక.

ప్రత్యేకత. ఆయుగ విశిష్టత లన్నియు దాని నాశ్రయించినవి. ఆయా సంస్థానములన్నిట యక్షగానము వెలసిన జాడ కన్పట్టుచున్నను "తన్మహనీయస్థితి మూలమై" నిలిచినది తంజావూరు.

తంజావూరు నాయక రాజులు—యక్షగానము

తంజావూరఁ బ్రవేశము కల్గినంతనే యక్షగానమునకు రాచ ప్రాపు కల్గినది. తద్రచనకు రాజహస్తావలంబనమే లభించినది. తంజావూరు నాయకరాజుల కోవకు నాయకమణియు వాఙ్మయవిషయమున దక్షిణాంధ్ర యుగమున కుదయార్కుఁడునైన రఘునాథ రాయలు (రాజ్యకాలము క్రీ. శ. 1600—1631) విజయ విలాసాది మహాప్రబంధములకుఁ గృతిభర్త యగుటయ కాక స్వయముగాఁ బ్రౌఢకృతు లనేకమురచించిన వాఁడు. అతనికృతులలో శ్రీరుక్మిణీకృష్ణవివాహము లొకటి రెండు యక్షగానములు నుండినట్లు తెలియవచ్చుట విశేషము. కాని నేఁ డవి లభించుటలేదు. రఘునాథుఁడు సంగీత నాట్యవిద్యా విశారదుఁడనియు నతని కొలువున నాటకశాలలు గలవనియు, నందుఁ దఱచు గీతాభినయ ప్రయోగము లగు చుండుననియు నతని యాస్థాన కవయిత్రి రామభద్రాంబ రచించిన రఘునాథాభ్యుదయము+వలనఁ దెలియుచున్నది. (చూ. సర్గలు 11-12). ఆతఁడు "ప్రాంచితయక్షగాన సత్పదాద్య పద్య ద్విపద ప్రపంచన" మును "పరీక్షించు" చుండు వాఁడనియు నందు గలదు. (11 వ సర్గ—27 శ్లో). అనఁగా 16శ. ప్రథమ పాదమునకే య. గా. నకు రాజాదరము బాగుగాఁ గలిగినట్లే.

తదుపరి రఘునాథుని పుత్రుఁడైన విజయరాఘవ నాయకుని రాజ్యకాలము (1633—1673) యక్షగాన చరిత్రలోనొక స్వర్ణయుగమే

+ సంస్కృత గ్రంథము. మదరాసు విశ్వవిద్యాలయముచేఁ బ్రచురితము.

యైనది. అతఁడతిమాత్ర గీతిసాహితీప్రీతి గలవాఁడు. నాట్యవిద్యా విదగ్ధుఁడు. తన యభిరుచులకెల్లఁ దగినది యక్షగాన ప్రక్రియ యొక్కటే యని గుర్తించినాఁడు. తద్రచన కాస్థాన కవులను (ఒకకవయిత్రినిగూడ) మిగులఁ బ్రోత్సహించినాఁడు. తాను స్వయముగా ననేక యక్షగానము లను రచించినాఁడు. వానినిఁ దన కొలువు నట్టువ మేళముల వారిచే దఱచు ప్రయోగింపఁజేసి వినోదించెడివాఁడు. య. గా. రచనలోఁ బ్రయోగములోఁ గ్రొంగ్రొత్తనూర్పు లవధరించి య. గా. చరిత్రలో నొక నవశక చతురాననుఁడై నిలిచినాఁడు. అతని య. గా. కృతు లలో నేఁడు మనకు లభించునవి యైదు మాత్రమ. 1. కాళీయమర్దనము 2. రఘునాథాభ్యుదయము, 3. విప్రనారాయణ చరిత్రము 4. పూతనాహరణము, 5. ప్రహ్లాదచరిత్రము ననునవి. ఇందు 1, 4, 5 ప్రసిద్ధ ప్రబంధాణికేతి వృత్తములు. 3 వది ప్రసిద్ధుఁడగు తొండరడిప్పొడి యాళ్వారు చరిత్రము. అయితే ప్రాచీనమగు దానిని సమకాలికముగాఁ జిత్రించుట విశేషము. రెండవది విజయరాఘవుని తండ్రియగు రఘునా థుని చరిత్ర మేయగుట విశేషము. ఇందు రఘునాథుని సభావైభవము, దినచర్య, చిత్రరేఖ యను కాంతతో నతని శృంగార కలాపమును విష యములు.

ప్రహ్లాద చరిత్రమునఁ దప్పఁ బ్రతి గ్రంథారంభమునను "భోజ కన్యా ముఖాం భోజ రాజ మరాళ" ఇత్యాది యగు నిష్ట దేవతా స్తుతి పరమగు సీసమొకటి గలదు. తదుపరి రఘునాథ నాయకాభ్యుదయ ద్విపద కావ్య ప్రారంభమునందలి "శ్రీ రాజగోపాల చిరకీర్తిజాల", "కలశాంబు నిధి కన్య కల్యాణ ధన్య" అను ద్విపదలు పూతనా హరణమునఁ దక్కఁ గడమ యన్నిటనున్నవి. సామాన్యముగాఁ బ్రతి

కృతియందు నిష్టదేవతా స్తుతికిఁ బిదప నొక వచనమున విజయ రాఘవ సంబుద్ధులు కొన్ని, యీ వెనుకనే "స్వామినారు హావణిం చిన (గ్రంథనామము) నటన పటిమ గనుపించ వినుపించేము విన నవ ధరించుండ"యని రూపక ప్రయోచన కనిపించును. ఇది ప్రదర్శకులచేఁ బఠింపఁబడుట కుద్దేశింపఁబడినట్లు తోఁచును. ఇదియే "కైవార"మని రఘునాథాభ్యుదయ విప్రనారాయణ చరిత్రములందుఁ బేర్కొనఁ బడినది. ఇది మార్గరూపకములందుఁ గల నాందీ ప్రస్తావనలకొక్కింత యెనవచ్చు ననవచ్చును. తొలినాఁటి తెలుఁగు య. గా. లగు సుగ్రీవ విజయ విష్ణురూపాయణ విలాసాదులం దిష్టదేవతా స్తుతి వెంట నర్ధచంద్రికలలోనో యొక జంపె లోనో షష్ట్యంతములు నావెంట "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నాయెనర్పంబూనిన..... యక్షగానంబునకుం గథాక్రమం బెట్టిదనిన"అని యుండును. షష్ట్యంత సంప్రదాయము తొలుత కన్నడిగలది. మన వాఙ్మయమునఁ దొలు దొల్తగా నిది నన్నెచోడుని కుమార సంభవమునఁ గన్పట్టును. (నన్నయగారి భారతమున లేదు) పిదప నాంధ్ర కవు లందరు ముఖ్య ముగాఁ (బౌబంధికు లా సంప్రదాయమును గ్రహించిరి. య. గా. కవి యగు విజయరాఘవుని కది నచ్చుక దాని స్థానమున రూపకోచిత మైన కైవారమును (బవేశపెట్టినాఁడు. విజయరాఘవుని ప్రతికృత్యంత ముగ నవిప్రశంసాత్మకమగు నొక వచనము, మూఁడింట నొక శుభాశంసనమును గలవు. అదే "భరత వాక్యము" గాఁ బూతనా హరణమునఁ బేర్కొనఁబడినది. ఆ కైవారము, భరత వాక్యము ననువానినిఁ గొంత మార్గ సంప్రదాయానుసారము కవి యుద్దేశ పురస్సర ముగనే (వాసియుండును. కొన్నిటి (ప్రతులలో నా మాటలు లోపించి యుండవచ్చును. కా. మ., పూ. హా., (ప్ర. చ. - మూఁడును నాటక చాటు కావ్యములని కంతోక్తిగాఁ జెప్పఁబడినవి. రఘునాథాభ్యు

దయము ప్రబంధమనియుఁ బేర్కొ-నఁబడినది. అంశులకుఁ దగినట్లు నాయిక విరహవేదన, చెలిక త్తెల శిశిరోపచారములు, రతిరాజ పూజ, చంద్రాద్యుపాలంభములు, చిలుక రాయబారము మొదలగు ప్రబంధ ప్రక్రియ చొప్పింపఁబడినది. అంతియకాక నాయకుఁడు సపరివారముగా స్వారి వెడలఁగాఁ బౌరకాంతలతనిఁ జూచుటయు నందొకత్తె మోహ పరవశ యగుటయుఁ దదుపరి నాయకునిత్తో నామె రాయబారము, సమాగమము మొనలగు విషయములతో నిది ఉలా ప్రబంధపు బోకడ కలిగియున్నది.[37] తొంబది మూఁడు విధములగు తమిళ ప్రబంధములలో "ఉలా" యొకటి.[38] తంజాపుర ప్రభువగు విజయ! రాఘవుఁడా తమిళ ప్రబంధ ప్రక్రియను గ్రహించుటలో వింతలేదు.

రచనాప్రక్రియను బట్టి యతని కృతులను సమీక్షించినచో నొక క్రమపరిణతి కన్పించును. అతని కృతు లంతకంతకు గేయధర్మ మును దగ్గించుకొని రూపకకళ నెక్కు-వ సంతరించు కొన్నవి. కొన్నిటఁ గథాను సంధాయకములగు సంధి వచనములు, కవి వచనములను వేర సంధి ప్రయోజనోద్దిష్టములే యైన పద్యములును గలవు కాని కొన్నిట వీని యక్క-ఱ లేకుండగనే పాత్రలు ముఖాముఖి సంభాషిం చుట గలదు. ఆసంభాషణలు వచన ప్రచురముగాఁ బాత్రోచిత భాషలో సాగియుండుట గమనింపఁ దగినది. (వి. నా. చ., పూ. హ., ప్ర. చ.). విజయ రాఘవుఁడు కావించిన ప్రయోగములలో నిది యొకటి దొడ్డది. య. గా. ప్రయోగ యోగ్యతను ద్విగుణీకృత మొనర్చినట్టిది. అతఁడు కొన్నిటగ్రంథ మధ్యమున రంగప్రయోగ సూచనలును జేసియుండుట మఱియొక గొప్పవిశేషము.

37. ఇది మొదట గుర్తించినవాఁడు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు. చూ. వారి రఘునాథాభ్యుదయ పీఠిక.

38. "ఉలా" లక్షణము వైద్యనాథదేశికుని "ఇళక్క-ణవిళక్క- ప్పాట్టియల్" అను తమిళ లక్షణ గ్రంథమునఁ గలదు. సూత్ర. – 97 – 102.

లికములు నగు విషయము లితి వృత్తము లగుట య. గా. చరిత్రలో మిక్కిలి యపూర్వము. అందు సమకాలిక జాతీయ జీవిత విశేషము లకు విశేష ప్రసక్తి గల్గుట మిక్కిలి యపురూపము. ప్రదర్శన వేళ విసుగు జనింప కుండ వానికి జనరంజకత్వము సాధించుటకో యన హాస్య చతురాస్యులగు నాకవు లాంధ్ర వాఙ్మయమున నెందును నిదివఱకు లేనంత హాస్యము నీ య. గా. లలోఁ బ్రవేశపెట్టిరి. వాని రచ నలోఁ దాళ ప్రధానదేశీయ మధురకవితా రచనలకుఁ బ్రాచుర్యము తగ్గినది. ఆ నాఁడు దక్షిణదేశమంతట నతివేల ప్రచారము గాంచు చుండిన కర్ణాటక సంగీత పద్ధతి మూఁదలగా దరువులును, పదములును వెలసినవి. ఆ కవుల శృంగార పదరచనకు క్షేత్రయ పదములే యొజ్జబంతులైనవి. వారు శృంగార పదములనే కాక గొల్లపదాలు, చెంచుపదాలు, కొరవంజి దరువులు, సాంగత్య పదము, లక్ష్మీ కల్యాణము మొదలగు రచనా విశేషములను గూడఁ దమ య. గా. లందుఁ జొప్పించిరి. విజయరాఘవాస్థానమున యక్ష గానము ప్రవర్తితమైన భంగి యెట్టిదో తదాస్థానియగు చెంగల్వ కాళకవి తన రాజగోపాల విలాసావతారికలో నిట్లు వ్రాయ్రుచ్చి యున్నాఁడు :

" యక్షగానంబు రావణహస్త ముడుకు
దండె మీటులు చెంగులు తాళములును
జోల సువ్వాల ధవళంబు లేల లమర
కొందఅతివలు వినిపించి రందముగను "

—రా. గో. వి. 1-24.

అనఁగా నది కతిపయ గాయనీజన ప్రవర్తితమగు సంగీత గోష్ఠి భంగి నుండెడిదని తెలియనగును. కాని విజయరాఘవాదుల కృతులను జూచినచో నవి సర్వోపభోగ్యమైన దేశి సరణికిఁ జెందిన

రము + నను వానిలో విజయ రాఘవ నాయకుని వివాహ శృంగార విహారాదికములే యితి వృత్తము లగుట విశేషము. ఈ మూఁడింట నెఱుకలసాని వాలకము, గద్దె ఘట్టములు నుండుటయు విశేషములే. అవే యించుక పిదప కాలమున తంజావూరిలోనే కొరవంజి పేర వెల సిన య. గా. ప్రాయ రచన కవతారికా ప్రాయము లైనట్టివి. మ. దా. వి. నాటకమున తమిళ కన్నడ ప్రాకృత భాషా ప్రసంగములు విశేషములు. పురుషోత్తమ దీక్షితుఁడను మఱియొక ఆస్థాన కవి రచించిన తంజాపురాన్న దాన నాటకము సాంఘికేతి వృత్త మగుట విశేషములలో విశేషము. నాఁటి నాయక రాజుల సత్రమున కతిథియై వచ్చిన వెఱ్ఱిబాగుల బాపఁ డొకఁడు నట్టువకత్తెలతో వెట్టి శృంగార ప్రసంగములు నెఱపుట యిందలి యితివృత్తము. ఇంతటి వచన ప్రచుర మైన య. గా. రచన మఱిలేదు. పాత్రోచిత భాషలో సూటి యగు సంభాషణలతోఁ జక్కని నాటకపు వాటముతో సాగిన రచన మిది. విజయరాఘవుని పుత్రుఁడగు మన్నారు దేవుఁడు గూడ హేమాబ్జ నాయికా (లక్ష్మీదేవి) స్వయంవర మను నొక చక్కని నాటకము రచించినాఁడు. ఇది పై నాటకముల ఘక్కి నడచిన దే. దీనితో విజయ రాఘవ పాత్రకుఁ బ్రసక్తి గల య గా. లు నాలుగు. అవి యతని యెదుటఁ బ్రదర్శితము లగు చుండినట్లు తెల్లము. మఱి యాతని పాత్ర నెవ్వ రేవిధముగ నభినయించెడి వారో! అది యెట్లతనికిఁ బ్రియము గొల్పినదో! ఇట్లు చారిత్రకములు, తాత్కా-

+ ఇందలి నాయిక నాయని వారి 'బైటి నాటక శాల పడుచు'. రాచ నగరి లోఁగిటను నాటకశాలలుగలవు. కాని బైటి నాటకశాల పడుచులతోఁగూడ నతఁడు మఱుగ బాంధవ్యములు నిర్వహించి యీ విషయమును బాహాటముగా నిట్టి చాటు కృతులలోఁ జాటించుకొనినాఁడనిన నాయని వారి నాటక కళాభి రుచి యెటెంతటిదో మఱి! ఇది 'నాటకచాటుకావ్య' మని కవిచేఁ బేర్కొనఁబడినది.

లికములు నగు విషయము లితి వృత్తము లగుట య. గా. చరిత్రలో మిక్కిలి యపూర్వము. అందు సమకాలిక జాతీయ జీవిత విశేషము లకు విశేష ప్రసక్తి గల్గుట మిక్కిలి యపురూపము. ప్రదర్శన వేళ విసుగు జనింప కుండ వానికి జనరంజకత్వము సాధించుటకో యన హాస్య చతురాస్యులగు నాకవు లాంధ్ర వాఙ్మయమున నెందును నిదివఱకు లేనంత హాస్యము నీ య. గా. లలోఁ ప్రవేశపెట్టిరి. వాని రచ నలోఁ దాళ ప్రధానదేశీయ మధురకవితా రచనలకుఁ ప్రౌచుర్యము తగ్గినది. ఆ నాఁడు దక్షిణదేశమంతట నతివేల ప్రచారము గాంచు చుండిన కర్ణాటక సంగీత పద్ధతి మూఁదలగా దరువులును, పదములును వెలసినవి. ఆ కవుల శృంగార పదరచనకు శ్లేత్రయ పదములే యొజ్జబంతులైనవి. వారు శృంగార పదములనే కాక గొల్లపదాలు, చెంచుపదాలు, కొరవంజి దరువులు, సాంగత్య పదము, లక్ష్మీ కల్యాణము మొదలగు రచనా విశేషములను గూడఁ దమ య. గా. లందుఁ జొప్పించిరి. విజయరాఘవాస్థానమున యక్ష గానము ప్రవర్తితమైన భంగి యెట్టిదో తదాస్థానియగు చెంగల్వ కాళకవి తన రాజగోపాల విలాసావతారికలో నిట్లు వ్రాక్రుచ్చి యున్నాఁడు :

" యక్షగానంబు రావణహస్త ముడుకు
దండె మీటులు చెంగులు తాళములును
జోల సువ్వాల ధవళంబు లేల లమర
కొందఱతివలు వినిపించి రందముగను "

—రా. గో. వి. 1-24.

అనఁగా నది కతిపయ గాయనీజన ప్రవర్తితమగు సంగీత గోష్ఠి భంగి నుండెడిదని తెలియనగును. కాని విజయరాఘవాదుల కృతులను జూచినచో నవి సర్వోపభోగ్యమైన దేశి సరణికిఁ జెందిన

రూపక ప్రక్రియాడంబరము గల్గియున్నవని విశేదమగును. అన్నియు నాటకములని పేర్కొనఁబడినవి. కొన్ని మహానాటకములనియుఁ బేర్కొనఁబడినవి. (వి. రా. క., తం. పు. దా.) అది వట్టి మాట వరుస. చాటుకావ్యములుగాఁ బరిగణింపఁబడినవి.+ కాని యందొక్కటియు మచ్చునకైన, మాటవరుసకైన యక్షగానమని పేర్కొనఁబడలేదు. వానిఘోరణి జూడ నానాఁడు యక్షగానము, వీధినాటకము నేకమైపోయినట్లు తోఁచును. వాని కలయిక విజయరాఘవుని చేతి మీఁదుగనే జరిగినదా యనియుఁ దోఁపకపోదు. నాఁటినుండి దక్షిణ దేశమున య. గా. కంటె నాటక శబ్దమునకే ప్రచార మధికమైనది.

17 శ. నడుమ నాయక రాజాశ్రయమునఁ గాక, దక్షిణద్వారక (మన్నారుగుడి – తంజావూరు మండలము) శ్రీ క్షేత్రస్వామి కంకితముగా నొక య. గా. ప్రాయరచన వెలసినది. అది చల్ల సూరయకవి వివేక విజయమునునది. ఇది కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయమున కొక మానసపుత్రిక. సూరయ తనకృతిని 'నాటకముగ, కూటనాటకాకలన' రచించితి నని యున్నాఁడు.

తంజావూరు మహారాష్ట్రులు - యక్షగానము

క్రీ. శ. 1673 ప్రాంతమున తంజావూరిలో ఆంధ్ర నాయక రాజ్య మస్తమించినది. తదుపరి మహారాష్ట్ర ప్రభుత నెలకొన్నది.

+ ఈ పరిగణన సమంజస మైనదిగనే తోఁచును. శతకోదాహరణములను, గద్య, రగడ, ద్విపద, సుందరికుండలకములుగూడ చాటు పద్యములుగ పరిగణించినారు మన లాక్షణికులు. (అనంతుని ఛందము III. 62, కావ్యాలంకార చూడామణి. IV. 40, లక్షణసారసంగ్రహము II. 128-140, అప్పకవీయము I. 30) యక్షగానమునందు శశికాముల మంయవలె పద్యములు, ఉదాహరణమునందలి కళికోత్కళికలవలె రగడ వికృతులను రేయు, గద్యము, ద్విపద, మంజరి, దండకము మొదలగువాని కన్నిటికిని పాస్తి గలదు గదా!

ఆ మహారాష్ట్ర ప్రభువులును ప్రియంపడి నాయకరాజులవలెనే మన భాషా వాఙ్మయముల నాదరించుట చరిత్రలో నొక యపూర్వసన్ని వేశము.[39] వారు యక్షగానము నెడనే యెక్కువ మక్కువ గల వార గుట యింకొక విశేషము. వారు య. గా. కవుల నాదరించుటయ కాదు స్వయముగ ననేక య. గా. ప్రాయరచనలు ప్రచరించిరి. అట్టి వారిలో ప్రాతఃస్మరణీయుఁడు శహాజీ. రసికతలో, లలిత కళాలాల సలో, యక్షగాన లోలతలో నొక్కమాటలోఁ జెప్పవలెననినఁ దనివి తీరని విజయరాఘవుఁడు మఱలఁ దనువెత్తెనా యని యనిపించు నట్టి వాఁడు. అతని రాజ్యకాలము (1684-1712) నూడ య. గా. చరిత్రలో నొకముఖ్యమైన యధ్యాయము.

శహాజీనేరఁ దదంకితములుగాఁ గాక తదుపజ్ఞములుగా నిఱువది య. గా. ప్రాయ రచనలు కన్పట్టుచున్నవి. అందఁ బదునాఱు నాటకములుగను, నాలుగు ప్రబంధములుగను గ్రంథకర్తచే బేర్కొనఁ బడినవి. నాటకము లన్నియు "ఉదారవేష భాషాభూషితము" లని పేర్కొనఁ బడినవి. అవి సంవాదశ్లేలిక వచన ప్రచురములుగను, ప్రబంధములు [40] నృత్యానుకూల గీతిబంధప్రకృష్టములుగను నున్నవి. అవి యన్నియు నాఁడు ప్రదర్శింపఁబడినట్లే వానిలోఁగల సూత్రధార వచనములును, గొన్ని ప్రయోగసూచనలును విశదమొనర్చుచున్నవి.

ఆ గ్రంథములు సాధారణముగా జయేత్యాది యగు నొక "తోడియం" దనువృత్తోఁ బ్రారంభ మగును. స్తుత్యాదికము పిదప

---

39. (వివరములకు) చూ. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి "తంజావూరి మహారాష్ట్ర) భూపతులు — ఆంధ్ర సాహిత్యము" అను వ్యాసము — భారతి., డిసెంబరు, 1953 జనవరి '54.

40. ప్రత్యేకముగా నీ ప్రబంధములఁ గూర్చిన సోదాహరణమైన వివరణము చూ. "శహాజీ ప్రబంధములు" అను నా వ్యాసము — భారతి. జూలై, 1956.

నొక సూత్రధార వచనమున గ్రంథనామ, కర్తృనామ నిర్దేశము నాపై నొక ద్విపదలోఁ గథాసంగ్రహము చెప్పఁబడుటయుఁ గలవు. కథా సంగ్రహ ద్విపద ప్రబంధములందు మాత్రము గానరాదు. ముందే వినాయకస్తుతి యున్నను గథాసంగ్రహద్విపదకుఁ బిదప నతని యాగమన ప్రసక్తియుండును. అనఁగాఁ బ్రదర్శనవేళ నొకబాలుఁ డెవఁడో వినాయక నేపథ్యముతో రంగమునఁ బ్రవేశపెట్టఁబడి ప్రదర్శన ప్రవర్తకులైన భాగవతులపూజ నందుకొని పోవుచుండు టాచారమై యుండును. ఆపిమ్మట "ఆస్థానసంతోషి" యగు కటికవాని వాలకము ప్రవేశ ప్రసంగము లుండును. అంతటఁ గథారంభము. గ్రంథాంతమున సాధారణముగా నొక ద్విపదలోఁగాని గద్యలోఁ గాని కృతి సమర్పణ ముండును. ఇది యీతని కృతుల సామాన్య స్వరూపము. శహాజీ కృతులందు వస్తువై విధ్య మునల్పము. ఒండు రెండు తక్క + నన్నియుఁ బౌరాణికేతి వృత్తములు. కాని సమకాలిక విషయ స్పర్శతో నాతఁడు తీర్చిన తీర్పు క్రొంజవి గలది. చతుర శృంగార హాస్యప్రసంగము లందు కొల్లలు. కాని వానిలో ననౌచిత్య మధికము. అన్నియుఁ బ్రదర్శనోద్దిష్టములును దత్సౌలభ్యము గల వియు నైనను యథాతథముగఁ బ్రదర్శనయోగ్యములు గావు. అందుల కందలి యనౌచిత్యమే కారణము. అదియుఁగాక "నవ్యనాటక" మని పేర్కొనఁ బడిన యతని "జలక్రీడల" లో మొలబోడి యాడు వారి ప్రసంగములున్న ఘట్టము నాతఁడెట్లు ప్రదర్శింప నెంచెనో దురూహము.

+ ఆతని "సతీదాన శూరము" న నొక శ్రోత్రియ బ్రాహ్మణుఁడొక మాదిగ మగనాలిపై మరులు కొని ప్రలాపించుట ప్రధాన విషయము. తక్కినవి సీత, ద్రౌపది మొ. వారి కళ్యాణ కథలు, తాదృశ ప్రసిద్ధ కథలును—

యక్షగాన చరిత్రలో శహాజీ కృతులఁగూర్చి యెన్నఁదగిన విశేషములు:- అవతారికలోని కథా సంగ్రహ ద్విపద, వినాయక పాత్రప్రవేశము, "ఆస్థాన సంతోషి" యగు కటికమువాని నొక సాంప్రదాయిక హాస్యపాత్రగా రూపొందించుట, గ్రంథమున నడుగడుగు నను బాత్రప్రవేశ సూచకములును గథానుసంధాయకములుసగు సూత్రధార ప్రసంగములు, నెడ నెడఁ బ్రవర్తకులైన భాగవతులు పాత్రలను బలుకరించుట మొదలగునవి. అతని ప్రబంధ రచనయు నొకగొప్ప విశేషమే. అందు త్యాగ వినోదచిత్ర ప్రబంధనాటక మను నది యాఱంకములుగా విభాగింపఁబడినది. తంజావూరు (య. గా.) నాటకములలో అంకవిభాగము గనుపట్టుట కిదే మొదలు. ఇది యచ్చముగా మార్కండేయ రూపకానుకరణము. ఇంకను నందందుఁ గల యవతారికల తీరుగూడ నూర్గనాటక నాందీ ప్రస్తావన సందర్భములను వలఁపించును కాని యీ యనుకరణము విజయరాఘవుని కాలమునకే వచ్చినది. తంజావూరు (య. గా.) నాటకములలో సూత్రధార ప్రసక్తికిని శహాజీ కృతులే మొదటివి. కాని వీనిలో మార్కండేయ నాటక పద్ధతికి విరుద్ధముగా సూత్రధారుఁడు గ్రంథమధ్యమునఁ బ్రవేశింపుచు కాననగును. శహాజీ కృతులలో వచన ప్రచురముగా నాఁటి తంజావూరాంధ్రభాషా వ్యవహార ధోరణిలో: బాత్రల సంభాషణలు చకచక సాగి నాటకీయత వెల్లివిరిసినవి. (త్యాగ వినోదచిత్ర ప్రబంధమునఁ గేవల సంస్కృతము, మరాటీ భాషయుఁ బ్రచురముగా వాడబడుట విశేషము). నాయకరాజుల నాటి య. గా. నాటకములే మహారాష్ట్రులకు మార్గదర్శకములైనను వారు క్రొంగ్రొత్త మార్పులను గూడఁ దెచ్చిపెట్టిరి. అందులకు శహాజీ కృతులే మొదటి నిదర్శనములు.

శహాజీ ఆస్థానమును వాసుదేవ కవి, నివర్తి శేషాచలపతి, బాలకవి సుబ్బన, దర్బా గిరిరాజు మొదలగు ఆంధ్రకవు లలంకరించి యుండిరి. ఈ కవులందఱును శహాజీ ప్రోత్సాహమున య. గా. ప్రాయ రచనలు గావించినవారే. వారి కృతులలో విజయ రాఘవా స్థానకవి కృతులవలె నాశ్రయదాత యగు రాజుగారి శృంగార విహారాదిక కథా ప్రధానముతో నవే యొక్కువ. అందందు విజయ రాఘవాదులు ప్రవేశపెట్టిన "ఊగా" ప్రబంధ పద్ధతియుఁ బాటింపఁ బడినది. రచనా ప్రక్రియలో నానికిని శహాజీ కృతులకును జక్కని సామ్యము గలదు. రెండు మూఁడిటఁ గల విశేషములు మాత్ర మిట నుంటకింపఁబడును. శహరాజాస్థానమున వెలసిన య. గా. ప్రాయ రచన లన్నింటిలో గిరిరాజ కవి కృతమైన శాహేంద్ర చరిత్ర మొక్కటి మాత్రము యక్షగాన మని కవిచేఁ బేర్కొనఁబడినది. తంజావూరిలో ముందటితరములనుండియే యేతాదృగ్రచనలకు యక్ష గానమను వ్యవహారము పోయి చాటుకావ్యములు నాటకములు నను వ్యవహారము స్థిరపడియుండ గిరిరాజు పుఱల పూర్వ వ్యవహారమును స్మరించి యుండుట గమనింపఁదగినది. అందులకుఁ దగినట్లుగా గిరి రాజు పూర్వ యక్షగానములవలెనే తన యీ కృతిని తాళ ప్రధా నము లగు దరువుల నిండుదనముతో నిర్మించియుండుట విశేషము. (ఇందు 'ఉలా' ప్రబంధపు ఛాయ్తుగడయు నున్నది). ఇతని కృతులలో విశిష్టమైన దింకొకటి రాజమోహనకొరవంజి. ఇది యక్షగానప్రాయ మైన రచనయే. కొరవంజి* యనఁగా నెఱుకత-తత్పాత్రవిశిష్టమైనదీ రచన. కొరవంజి పాత్రకుఁ బ్రసక్తిగల యక్షగాన ప్రాయ రచనలువిజయ రాఘవుని తరముననే బయల్వెడలినవి కాని యీ పాత్రకుఁ బ్రాము

* కొరవంజి చరిత్ర పూర్వోక్తము. చూ. యక్షగానోత్పత్తి విచార పరికరణము — పుటలు 31 — 47.

ఖ్యముగలిగి ప్రత్యేకముగా నా పేరిఁతో వ్యవహరింపఁబడిన వానిలో నీ రాజమోహన కొరవంజియే మొదటిదిగాఁ దోఁచును. కొరవంజు లలోఁ బ్రౌయికముగా విప్రలబ్ధ యైన నాయిక కామె ప్రియసమాగమము గూర్చి కొరవంజి సోదె చెప్పుట ప్రధాన విషయముగా నుండును. అందు కొరవంజి వేషభాషలు, కులాచారములు, కొరవంజి తిరిగిన దేశములు, కొలిచిన దేవతలు మొదలగు విషయములు వర్ణితములగును. గిరిరాజు కొరవంజి యీ లక్షణము లన్నియుఁ గలిగి యున్నది. + బొలకవి సుబ్బన పంచ కన్యా పరిణయమున "ప్రసంగి" (ప్రదర్శన వేళ సూచి వచనములు, వర్ణనాత్మక ద్విపదలు పఠించు వాఁడు) కేతి నాయని (కటికము) తోఁ దాను "దశావతారా లాడే భాగవతుఁడ" ననును. కన్నడమున యక్షగానమునకు "దశావతారద-ఆట" అనియుఁ బేరు.[41] అది మొదట విష్ణువు యొక్క దశావతార కథ లితివృత్తముగాఁ గల య. గా. లకుఁ బేరై (ప్రాచుర్యము వలన) క్రమ క్రమముగా య. గా. సామాన్యవాచియు నైనట్లు తోఁచును. (అనఁగా కన్నడమున నప్పటికిఁ గొన్ని య. గా. లు వెలసినజాడ తోఁచును. శహాజీ ఆస్థానముననే తమిళమునఁగూడ గొన్ని య.గా. లు వెలసినవి.[42] శహాజీ యనుజుఁడగు శరభోజి రాజ్యకాలమున (1712 - 28) నతఁడు నాయకుఁడుగా గిరిరాజు రచించిన లీలావతీ కల్యాణ మొక్కటే కానవచ్చుచున్నది. తదుపరి తంజాపుర ప్రభువైన

+ ఆ కాలమునను బిదప కాలమునను తమిళ కన్నడాది వివిధ భాషలలో నిట్టి కొరవంజు లనేకము వెలసినవి. అందందుఁ గొన్ని వేదాంత విషయికములు, దేవతలు కొరవంజులైనవి, యక్షగానములని పేర్కొనఁ బడినవియుఁ గలవు.

41. "Yakshagana In Karnataka"-Madras University A. O. R. VOI. X - Part II.

42. "Maratha Rajas of Tanjore" By K. R. Subrahmanyan., P. 29 - 30.

తుళజరాజు (1728-36) స్వయముగ శివకామ సుందరీ పరిణయము, రాజరంజన విద్యా విలాసము నను రెండు య. గా. నాటకములను రచించెను. రెండిట నాంది, సూత్రధార పారిపార్శ్వకులచే ప్రవర్తిత మైన ప్రస్తావన, వసంతర్తు కీర్తనమునుగలవు. సూచ్యార్థసూచనగాఁ బాత్రలను ప్రవేశపెట్టుటయుఁ గలదు. ఇది యంతయు నచ్చముగా మార్గ రూపక ప్రక్రియానుకరణము. శహాజీ కృతులందువలె నడు మను సూత్రధార వచనములు, భాగవతులు పాత్రలను బలఁకరించు టయుఁ గలదు. కాని అంక విభాగాది విశేషములు లేవు. ఇతని రాజ రంజన విద్యా విలాసము సాంకేతిక వివేచన గల తాత్త్విక విషయ మితివృత్తముగాఁ గలది. (చల్ల సూరయ వివేకవిజయమును వలె దీనినిగూడ ప్రబోధచంద్రోదయమున కొక మానసపుత్రికగా గ్రహింపవచ్చును). 1736-37 సం. లలో తంజావూరు నేలిన రెండవ ఏకోజీ రచించిన విశ్వేశ్వర పరిణయమున నాంది, పారిపార్శ్వకుఁడు లేని ప్రస్తావనయుఁ దఱుచు సూత్రధార వచనములును గలవు. రెండవ తుళజరాజు (1765-87) చే సన్మానితుఁడైన ఆలూరి కుప్పనార్యుడు పార్థసారథి విజయ మను పేర భాగవత దశమస్కంధము నంతటిని "యక్షగాన ప్రబంధ" రూపమున రచించెను. మన యక్షగానము లం దింతటి బృహద్గ్రంథము మఱి లేదు. ఇది ఆఖ్యాన వర్ణనాత్మక శైలీ ప్రచురముగా రచింపఁ బడినది. ఇది కేవల శ్రవ్యకావ్యమే. దీనినిబట్టి య. గా. రూపక ప్రతిష్ఠ స్థిరపడిన కాలమునందును ప్రబర్మనోద్దిష్టములుగాని య. గా. లును బయల్వెడలిన వని చెప్పవలెను. కుప్పనార్యుడీ కృతి రచనా కాలమునాఁటికి తంజాపురాస్థానమును ప్రవేశింపలేదేమో యనిపించును. 1787-98సం. నడుమనుండిన అమరసింహ భూపతి కంకితముగా మాతృభూతకవి రచించిన పారిజాతాపహరణ నాటక మైదంకములుగా విభాగింపఁబడి

నది. అందంతమాత్రమే మార్గనాటకానుకరణము. తక్కినదంతయు యక్షగానపు "బాణీ" యే. ఇందు తమిళ కన్నడ మహారాష్ట్రభాషా ప్రసంగము లుండుట విశేషము. తంజావూరి మహారాష్ట్ర ప్రభువులలోఁ జిట్టచివరి వాఁడగు శివాజీ (1833—55) కొలువున వెంకటకృష్ణాజెట్టి యను కవి శివపారిజాతమను నొక య. గా. రచన చేసియుండెను. శివాజీయే స్వయముగా అన్నపూర్ణా పరిణయమను నొక య. గా. నాటకమును రచించినాఁడు. దక్షిణాంధ్ర యక్షగాన రచనాప్రక్రియ పరిణామచరిత్రలో నిది తుది యంతస్తును సూచించును. ఇందు నాంది, సూత్రధార పారిపార్శ్వక ప్రవర్తితమైన ప్రస్తావన, వసంత ప్రస క్తి, అంక విభాగము (ద్విధా), చివర భరతవాక్యప్రాయమైన రంగనాథ కవీశ్వరుని (శివాజీ ఆస్థానకవి కాఁబోలు) యాశీర్వాదమును గలవు. ఈవిషయములు ముందునాఁటి తంజావూరు నాటకములలోకంటె నిందెక్కువగా మార్గనాటక ప్రభావమును బ్రస్ఫుట మొనర్చుచున్నవి. కాని తక్కిన తంజావూరి నాటకముల వలెనే యిందును సూత్రధార ప్రసంగములు గ్రంథ మధ్యమునఁ గన్పట్టును. ఇది మాత్రము మార్గ నాటకసంప్రదాయముకాదు. అందును నీగ్రంథమంతయు సూత్రధారుని ప్రలాపము వలెనున్నది కాని నాట్యకళాకలాప మిందంతగాలేదు. అయినను నిది ప్రదర్శనోద్దిష్టమైనదే. ఏలన "రంగభూమియందు నటింపఁ జేస్తున్నాము" అని దీని యెత్తుగడ. ఇందును గ్రంథాదిని విఘ్నేశ్వర పాత్ర 'ప్రత్యేకంబుగా' ప్రవేశపెట్టఁబడినది. గ్రంథాంతమున నీ 'నాటకం వేపాల నావనీసు' (పట్టిక) యున్నది. "నగరిలో ఉండే భాగవత మేళం సబనీసు (నాయకుఁడు!) దగ్గర" ఈగ్రంథమూలప్రతి యుండినది. ఆ "నావనీసు" లో నిందువచ్చు పాత్రలు, ఆనాఁడది ప్రదర్శింపఁ బడినప్పు డాయాపాత్రలు ధరించిన వారి పేళ్ళును గలవు. ఈ గ్రంథప్రతి "జ్ఞయ" సం. నను, నావనీసు మన్మథ - ఆవణినెలయందును దయా

రైనవి. అవి శివాజీ రాజ్యకాలమున 1834-35 సం. అగుచున్నవి. అనఁగా నిది 1835 లోఁ బదర్శింపఁబడియుండె ననుట నిశ్చయము. అంతేకాక యామహారాష్ట్రప్రభువు లాంధ్రయక్షగాన కవులనేకాక భాగవత మేళములనుగూడఁ బోషించుచుండిరనియు, నాఁడు తంజావూరు రాజప్రజానురంజక నాటక ప్రదర్శనములతో నిత్యకల్యాణము పచ్చతోరణమునై విరాజిల్లు చుండెడిదనియుఁ దెలియనగును.

ఆ మహారాష్ట్ర ప్రభువుల కాలమున తంజావూరు మండలమున రాజాశ్రయము నపేక్షింపని పండిత కవులును కొందఱు యక్షగాన ప్రాయ రచనలు గొన్ని చేసియుండిరి. ఉదా :- (1) క్రీ. శ. 1700 ప్రాంతమున మెలట్టూరులో నుండిన శ్రీ నారాయణ తీర్థులు రచించిన పారిజాతాపహరణము. శహాజీప్రభృతుల కృతులందువలె నిందు కటికవాని పాత్రకుఁ బసక్తి గలదు. ఇది ప్రదర్శింపఁ బడినట్లును వినికిడి. సుప్రసిద్ధమైన శ్రీకృష్ణలీలా తరంగిణివంటి గేయ ప్రబంధమును సంస్కృతమున రచించిన తీర్థపాదునివంటి శిష్టుఁడిట్టి యక్షగాన ప్రాయరచన చేసియుండుట విశేషమే. అసలు " దేశ్యమైన యక్షగానాలను కొంత అనుకరించి నారాయణతీర్థులు కృష్ణలీలా తరంగిణి నిర్మించి " నాఁడని శ్రీ ఉమాకాంత విద్యాశేఖరు లనియున్నారు.[43] (2) మెరట్టూరు వెంకట రామశాస్త్రి (1800 ప్రాంతము) ప్రహ్లాదచరిత్ర, ఉషాపరిణయము మొ..... వీనిని మెలట్టూరు భాగవత మేళనాటకము లందురు. ఇటీవల పండితులచే నృత్యనాటకము లనియు వ్యవహృతము లగుచున్నవి. గ్రంథరచనా ప్రకియ శహాజీ ప్రభృతుల కృతిప్రక్రియనే చాలవఱకుఁ బోలియున్నది. కాని ప్రదర్శన ప్రక్రియలో కూచిపూడి భాగవతుల ప్రదర్శనముల వలె

43. చూ. వారి పల్నాటి వీరచరిత్ర ద్వితీయ భూమిక — పుట 38.

నృత్యప్రధానములై విశిష్ట శిష్టసంప్రదాయ పటిష్ఠములై యుండును. మలయాళదేశపు కథకళిఫక్కియు నిందుఁ గొంతగలదు. (ఈవిషయము స్థలాంతరమునఁ బ్రస క్తము). ఇందుఁ గొన్నియానాఁడును తంజావూరు చుట్టుపట్ల మెలట్టూరు, శూలమంగళము, ఊత్తుక్కాడు మొదలగు నగ్రహారములలో దేవాలయ ప్రాంగణములలో బ్రాహ్మణ భాగవతులచే సంప్రదాయ బద్ధముగా నేఁటఁ బ్రదర్శింపఁ బడుచున్నవి. (3) క్రీ. శ. 1759 - 1847 నడుమ తిరువయ్యూర నుండిన ప్రసిద్ధ వాగ్గేయకారుఁ డగు త్యాగరాజస్వామి నౌకాచరిత్రము ప్రహ్లాద భక్తి విజయము, సీతారామ విజయమునను య. గా. ప్రాయ రచనలు చేసి యుండెను. ఇందు మొదటిది ప్రదర్శన సౌలభ్యము లేనిది. రెండవది నాటకమని పేర్కొనఁబడి, యైదంకములుగా విభాగింపఁబడి మహా రాష్ట్రుల తెలుఁగు నాటకము లందలి మార్గఫక్కిఁగలిగి ప్రదర్శనోద్దిష్టమై నట్లు గన్పట్టుచున్నను దాని కథావిష్కరణము తీరు విలక్షణమై ప్రదర్శనలో రక్తికట్టునదిగాలేదు. మూఁడవది మాత్రము ప్రదర్శన కెక్కినట్లు వినుకలి.

ఇతర ప్రాంతముల యక్షగానములు

17 శ., ఉ. భా. నుండి కన్నడ విషయమునను గొన్ని తెలుఁగు యక్షగానములు వెలయుట విశేషము. 1658 - 78 నడుమ మైసూరు మండలమున శివసముద్ర ప్రాంతమున కేలిక యైన పెదకెంప రాయఁడు (రెండవ హిరియ కెంప గౌడ) గంగా గౌరీ విలాసమను య. గా. ను రచించెను. 1672 - 1704 నడుమ మైసూరి యొడయుఁడగు చిక దేవ రాయని కంకితముగా, నతఁడే కథానాయకుఁడుగా చికదేవ రాయవిలాస మను యక్షగానము వెలసినది. అది "ఉలా"

ప్రబంధ ప్రక్రియ గలిగి విజయరాఘవాకింతములైన తంజావూరి య. గా. ఫక్కి-నిఁ దలఁపించు చున్నది. చికదేవరాయల తన యుఁడును, తదుపరి మైసూరి పరిపాలకుఁడు నగు కంఠీరవ నరసరాజు (1704 - 13) రసికతలోఁ గళాకుశలతలో శహాజీ విజయ రాఘవుల కోవకుఁ జెందునట్టి వాఁడు. తెలుఁగు కన్నడ తమిళ ప్రాకృత భాషలలో "కొరవంజి" దృశ్య కావ్య రచ నము గావించిన తొలితరము కవులలో నొకఁడుగా నెంచఁ దగినవాఁడు. తెనుఁగున నొక కొరవంజి కాక మఱి యేఁడు య. గా. ప్రాయరచనలు గావించియున్నాఁడు. అందాఱు 'విలాస' శబ్దాంత ములు. అందు వసంతోత్సవ విలాసము, విభక్తికాంతావిలాసము నను వానిలో నటీ సూత్రధారుల పూర్వరంగ ప్రస్తావనలు, అష్ట దిక్పాలక విలాసమనుదానఁ బాత్రల ప్రవేశ సూచనలు, యవని కాంతర నిర్గమన ప్రసక్తియుఁ గలవు. అన్నియుఁ బ్రబర్మనోద్దిష్టములే యనిపించును. కాని యన్నియు "పదచాళిక"+ ల వంటివి. స్త్రీ ప్రాయములు, కైశికీ వృత్తి వేశలములు. అన్నిటను రాజ ప్రశం సలు, నాట్య సంగీత శృంగార ప్రసంగములే ప్రధాన విషయములు గాని యెందును నొక విస్తృతమైన కథ గాని, విశిష్టమైన సన్ని వేశముగాని లేవు. అవి నాఁడు కంఠీరవరాయ సముఖమున నగరి నట్టువ కత్తెలచేఁ బ్రయోగింపఁ బడినట్లు తోఁచును. ఆ యూహా కుపాధి గలదు. నగరి బిరుదుపాత్రల ప్రసక్తిగలదు. కొన్ని యేక పాత్ర ప్రయోజన భాజనములుగాఁ గన్పట్టును. (ఉదా :- నాట్య

+ "ఆభినయంబుల కోపు లరుదైన తీరుపుల్
వెలయఁగా "పదచాళి" విధ మొకర్తు ..."
— కంకంటి పాపరాజు ఉత్తర రామాయణము — VI. 139.

విద్యా విలాసము). ఇవి రచనలో య. గా. ప్రాయములైనవే కాని ప్రదర్శనలోఁ బదచాళికా ప్రాయము లనుటయే లెస్స.

మధురలో 1706-1732 నడుమ విజయరంగ చొక్కనాథ నాయకుని "సభార్ష్యముగా" "నర్తనయోగ్యము" గా వెలసిన దొక్క యక్షగానము. అది తిరుమలకవి తిల్లగోవింద రాజ నాటకము లేక చిత్రకూటమహాత్మ్య మనునది. ఇది చిదంబర స్థల పురాణగాథ యితివృత్తముగాఁ గలది. ఇది నాల్గుదినముల "సంవిధా నము" గా వింగడింపఁబడినది. చతుర్దిన ప్రదర్శనోద్దిష్టమా యని పించును గాని గ్రంథ పరిమాణ మల్పము. ప్రదర్శన కొక్క రాత్రి చాలు. ఆవిభాగము కథాకాలమునకే కాని ప్రదర్శన కాలమునకు సంబంధించినదైనట్లు తోఁపదు. ఆ సంవిధానవిభాగము నంక సంకాశ మైనదిగా గ్రహించుట లెస్స. ఇందు వచనమునఁ బాత్రల సంభాషణ లును, ఇది "స్వామివాక్యం" ఇత్యాదిగాఁ దత్సూచనలును గలవు. సంధివచనములు ప్రసంగము లనుపేర వ్యవహరింపఁ బడినవి. కథా సంవిధాన చతుర్థావిభాగము., క్లృప్తవృత్తము, వైశికీ వృత్తి, స్త్రీ ప్రాయత్వము గలిగి యుండుటను దీన నాటికాలక్షణము (సంస్కృతము చూ. సాహిత్యదర్పణము) గొంత పట్టిన దనవచ్చును. అది "వగ కోపులవైపు లమర...ఇంచు బోణులు నటియించు" నట్టిదని కవియవ తారికలోఁ గైవారమునఁ జెప్పియున్నాడు.

1712 సం. ప్రాంతమున సేలమండలమున అన్నదానము వెంకటాంబ యను కవయిత్రి రామాయణ బాలకాండమును యక్ష గానముగా రచించినది. అది స్త్రీలు పాడుకొనుటకు మాత్రమే యుద్దే శింపఁ బడినట్టిది. 1767-70 ప్రాంతమున మైసూరు మండల మందలి శృంగేరి మఠమునకుఁ జెందిన య. గా. కృతి యొక్కటి కానవచ్చు

చున్నది. అది పిన్న బయలాచార్యుని గుడుగూచి చరిత్ర. 1769-89సం. నడుమ పుదుకోట కోటిరాయ రఘునాథ తాండమాన్ ఆస్థానమున నొక యక్షగానము వెలసినది. అది నుదురుపాటి వెంకన పార్వతీ కల్యాణము. ఇది ప్రదర్శనకెక్కినదని తెలియవచ్చుచున్నది. ఈపై మూఁడిటను రచన ఆంధ్రదేశ య. గా. ప్రక్రియకు సన్నిహితముగా నున్నది. 19 శతాబ్ది నడుమఁగూడ దక్షిణదేశమునఁ దెనుఁగు య. గా. రచన సాగుచు వచ్చినది. ఉదా:- 1. ఎల్లయకవి (సేలము. 1845 ప్రాంతము) చంద్రతారా విలాసము - ఆనాఁటి ఆంధ్రదేశ య. గా. ఫక్కినున్నది రచన 2. మూరుపెద్ది చెంగల్వరాయశాస్త్రి (చెంగల్పట్టు 1866 ప్రాంతము) సుందరేశ్వర విలాసము—ఆనాఁటి ఆంధ్రదేశ య. గా. ధోరణియే యొక్కువ. 3. చల్ల నారాయణకవి (చెంగల్పట్టు—19శ. పూ. భా. కావచ్చు) పారిజాతము—భామకలాపము, ప్రబంధఫక్కికలు గలది. 4. నెడాదూరు వెంకటాచార్యుఁడు (తిరుచునాపల్లి—19శ., ఉ. భా. కావచ్చు) సమగ్ర రామనాటకము — పురాణ గోష్ఠికిఁ దగి యున్నది. (వివరములకు ద్వి. భా. చూడఁదగును).

ప ర్యా లో క న ము

స్థూలముగాఁ జూచినచో యక్షగాన పరిణామ చరిత్రలో దక్షిణాంధ్ర యుగమునఁ బొడకట్టు విశేషములు :-

యక్షగానము వీధినాటకముతో నేకమై, నాటక నామకరణము చేయించుకొని, మార్గనాటక ప్రభావము నభిసరించి క్రమపరిణతమై, సూటిగా వచన ప్రచురముగానున్న పాత్రల సంభాషణలతో, రంగ పయోగ సూచనలతో నాటకీయత వెల్లివిరిసి యొక సమగ్ర రూపక ప్రక్రియగాఁ బరిఢవిల్లినది. (ఈయుగమునఁ గేవల శ్రవ్యధోరణిలో

సాగిన వొండు రెండు లేకపోలేదు. అవి అపవాదములు) రాజకవి లేఖనీ ముఖోదీరీతమున్నై రాజసభారంగ పురస్కారము గాంచినది. తాత్కాలికములగు రాజసంబంధేతి వృత్తములకు నాశ్రయ మైనది. అయ్యు సమకాలిక జాతీయజీవన ప్రతిబింబన మనేకధా సవదరించినది, సాహిత్యము లోకవృత్తప్రదర్శకమను నాభాణకమునకు సాక్షిభూత ముగా నిల్చినది. శృంగారహాస్యరసములను వెల్లిగొల్పినది. "ఆస్థాన సంతోషి" (Court-foll) అని క్రొత్తగా నొకహాస్య పాత్రను సాంప్ర దాయికముగా రూపొందించినది. క్రొత్తగా తమిళ "ఉలా" ప్రబంధపుఁ బోకడను, "కొరవంజి" దృశ్య రచనను మన వాఙ్మయము నకుఁ బరిచయము చేసినది. అందందు తమిళ కన్నడ ప్రాకృత మహారాష్ట్రాది పరభాషాపరిచయమును ప్రాసంగికముగాఁ ప్రబర్శించి నది. సంస్కృత కేవలములగు శ్లోకములు చూర్ణికలతోఁ గూడ రాణించినది. భాషాప్రయోగమునఁ బాత్రోచితముగా దక్షిణదేశపుఁ దెనుఁగువాడుక నుడికారపు దీరు ప్రకటించినది. ప్రసిద్ధకర్ణాటక రాగ తాళములలో దరువులు, పదములు, ద్విపదలు, జాత్యుపజాతి వృత్త ములు, సంధివచనములు, సంభాషణ వచనములును ప్రాయికముగా నానాఁటి యక్షగానము లన్నిటికిని సమానమే. అందు ప్రాచీనాంధ్ర యక్షగానము లందు మిగులఁ ప్రాముఖ్యము వహించిన శేకులకు నూటికిఁ దొంబదిపాళ్ళును, తదితరదేశీయ మధురకవితారీతులకు నూఁటి కేఁబదిపాళ్ళును వాడుకతగ్గినది. 1800 ప్రాంతమునుండి అర్ధపద్యము లకుఁ (కందార్ధములు, సీస, గీత ద్విపద, వృత్తార్ధములకు) క్రమ క్రమ ముగాఁ ప్రాచుర్యము హెచ్చినది. అందందు మంజరి, (మంజరి ద్విపద కాదు), వెండిశేకు, వెన్నెల పదము, మయూరగతి రగడ, ప్రాసవచ నము మొదలగు రచనా విశేషములును బొడసూపక పోలేదు.

దక్షిణాంధ్రయుగమున యక్షగాన మతివేగ మధికపరిణతి నంది విస్మయావహమైన వి స్తృతిఁబొంది సర్వోపభోగ్యమైన నాట్యసంగీత సాహిత్య సమాహార కళాస్వరూపముగా విరాజిల్లినది. కాని యట దాని మార్పులన్నిటఁ గ్రమోన్మిషితమైవచ్చిన ప్రధానమైన మార్పు మార్గనాటక ప్రభావముగదా. అందుచే యక్షగాన ముత్పత్తిలో దేశియైనను బరిణామమున మార్గియైనదని చెప్పవలసి యున్నది. *

---

* ఇఁకఁ జివరగా నొకమాట. ఈ దక్షిణాంధ్రవాఙ్మయమునకుఁ జెందిన రంగాజమ్మ మన్నారుదాస విలాస నాటకము ముఖపత్రముపై 'ప్రాకృతనాటకము – యక్షగానము' అని యున్నది. అందు ప్రాకృతభాషాప్రసంగములున్నవి (తమిళ కన్నడ ప్రసంగములతోపాటు) కాని గ్రంథము ప్రధానముగా తెలుఁగుది. పోనీ ప్రాకృతభాషానాటకపు బాణీలోఁగాని నడచినదా యనుకొందమన్నఁ బ్రత్యేకముగాఁ బ్రాకృతమున నాటకములున్న జాడ గానరాదు. ఆ గ్రంథము పీఠికలో కీ. శే. జయంతి రామయ్యపంతులుగా రిట్లు వ్రాసుచ్చియున్నారు:

'సర్వోజీ సరస్వతీ మహాలులో 'ప్రాకృత తెలుఁగు లిపి నాటకాలు' అను శీర్షికక్రింద 247 గ్రంథము లుదాహరింపఁబడినవి. (అన్నియు నిపుడుపలభ్యములగుట లేదు) వీనిలోఁ బెక్కులు తెలుఁగునాటకములే. ... రఘునాథాభ్యుదయము, విజయరాఘవచంద్రికా విహారము, విజయరాఘవ కళ్యాణము మొ॥ ... సంస్కృత నాటకములఁబోలిన పద్యగద్యాత్మికాంధ్రనాటకము లిటీవల వెలసినవి కాని పూర్వము తెలుఁగు నాటకము లన్నియు యక్షగానరూపములుగానే యున్నవి. ఈదేశమందుఁ బూర్వకాలమునఁ బ్రదర్శింపఁబడుచుండిన పారిజాతాపహరణ నాటకము, ప్రహ్లాదనాటకము మొదలైన వీథినాటకములిట్టివే. తంజావూరి నాటకములు గూడ నీ రీతివే.'

తెలంగాణము

యక్షగానము

క్రీ. శ. 18 వ శతాబ్ది ఉత్తరభాగమునుండి తెలంగాణమునందు యక్షగానరచన సాగుచుండినట్లు తెలియుచున్నది. 1780 ప్రాంతమున వెలసిన శేషాచలకవి ధర్మపురి రామాయణము, రాపాక శ్రీరామకవి అధ్యాత్మరామాయణమును ఇప్పటికిఁ దెలిసినంతలో తెలంగాణమున మొదటి య. గా. లు. అందు ధర్మపురి రామాయణ మాంధ్రదేశమునను విశేష ప్రసిద్ధిగాంచినది. ఇందు షట్కాండ లును గలవు. రచన యెక్కువగా శ్రవ్యధోరణిని సాగినది. కాని యిది ప్రదర్శనల కెక్కినట్లు వినికిడి. అయితే యథాతథముగా ప్రదర్శింపఁ బడినట్లు గానరాదు. ఆంధ్రదేశరామాయణ వీధినాటక ప్రదర్శనములం దిందలి దరువులు తఱుచు గ్రహింపఁబడుట కద్దు. 1800 సం. ప్రాంతమున వెలసిన వీరశైవ యక్షగానము లొక రెండు లభించుచున్నవి. అవి కానూరి వీరభద్రకవి బసవమహిమామృత విలాసము, చెల్వూరు సన్యాసికవి బసవకల్యాణము ననునవి. రెండును గొంత ప్రదర్శనోచితములుగనే తోఁచును.

19 శ. పూర్వభాగమునఁ గొలది యక్షగానములు వెలసినట్లు తెలియుచున్నది. కాని గ్రంథములు లభించుటలేదు. ఉ. భా. న య. గా. కవులకుఁ గొంత ప్రోత్సాహము లభించినది. అప్పటి య. గా. లు బాగుగాఁ ప్రదర్శన కెక్కినట్లును తెలియుచున్నది. ఆత్మకూరు సంస్థా నాధీశుఁడు ముక్కర సీతారామ భూపాలుని (1851–1905) కాశి తుఁడై రామదాసకవి తారాశశాంకము, భీమసేన విలాసము ననుయ. గా. లను రచించినాఁడు. రెండిట "సభాక్షేవారము" సూత్ర

ధారుఁడు పాత్రలను బలుకరించుటయుఁ గలవు. ఆకాలమున వెలసిన తిరునగరు పాపకవి కృతియందును నవికలవు. జడచర్ల దేశపాండ్యా పట్వారీల ప్రోత్సాహమున గోపర్థసం వెంకట నరసింహాచార్యులను నాయన అజామిళోపాఖ్యానము నాంధ్రదేశ య. గా. ఫక్కిరచించెను. అయన యొక గొల్లకలాపమును గూడరచించియుండెను. తెలిసి నంతలో తెలంగాణమున వెలసిన గొల్లకలాప మది యొక్కటియే. అల్లే మచ్చునకొక్క కురవంజియు వెలసినది. అది రూష్టానుపేట రత్నమ్మగారి శివకురవంజి. ఆనాఁటి య. గా. లలోఁ బాత్రలు తెర లోపల జదువు దరువులు, తెరవెడలు దరువులు (ప్రవేశిక ధ్రువలు) పాత్రలను హాస్యగాఁడో దొవారికుఁడో పృచ్ఛించుట పాత్రలు స్వవిషయమును జెప్పుట, సంధివచనములు, వచనములోఁ బాత్రల సంభాషణలు, రంగప్రయోగ సూచనలు మొదలగు విషయ ములు తఱచు చూపట్టును. ఉదా:– 1. తాడిపర్తి లక్ష్మణదాసుని ప్రహ్లాద నాటకము, 2. శేషభట్టరు కృష్ణమాచార్యుని రంభా నల కూబర విలాసము, 3. గడ్డం రామదాసుని విప్రనారాయణ చరిత్రము ప్రభావతీ విలాసము, కాళీయమర్దనము, 4. గవురహరాజులక్ష్మీపతి రాయుని నలచక్రవర్తి చరిత్రము మొదలగునవి. కొన్ని య. గా. లలో రంభోర్వశుల నృత్యప్రసంగముతో గ్రంథారంభమగుట యొక విశేషము. ఉదా:– 1. పండరి విఠల రాయకవి గజగౌరీవ్రతము శ్రీరామ విజయము, 2. గ. లక్ష్మీపతి రాయుని నలచక్రవర్తి చరి త్రము, 3. లక్ష్మణకవి (మన్నెవారి కొండాపురము ప్రభువుల కొలు వులో రాయభట్టు) మాంధాతచరిత్ర మొ॥ కొన్నిట "ఆస్థాన సంతోషి" పాత్ర గన్పట్టును. ఉదా :– గవండ్ల రాజలింగకవి హరి శ్చంద్ర చరిత్రము మొ॥ కొన్నిటఁ బాత్రల సంభాషణ వచనములు "ముచ్చట" లను పేర వ్యవహరింపఁబడినవి. ఉదా:– శే. కృష్ణనూ

చార్యుని రంభా నలకూబర విలాసము, తిరునగరి వెంటదాసు కపిల దేవహూతి చరిత్రము. ఇట్లు 19 శ. ఉత్తర భాగమున తెలంగాణ మున యక్షగానము ప్రదర్శనోద్దిష్టమై తదనుగుణ రచనాసుష్ఠువై ఆధునిక యుగోన్ముఖముగా నతి త్వరితగతిని బురోగమించినది.

20 వ శతాబ్దిలో తెలంగాణమున యక్షగానముల సంఖ్య శతాధికమైనది. ఒక్క తెలంగాణములోనే యీ నాఁటికిని యక్ష గానము సజీవమై నిలిచియున్నది. రచనతోపాటు ప్రదర్శనములును జోరుగా సాగినవి; సాగుచున్నవి. ఈ శతాబ్దమున తెలంగాణము యక్షగానము పలుపోకలు పోయినది. వింతవింత మార్పులు సంత రించుకొన్నది.

ఈశతాబ్ది : తెలంగాణ యక్షగాన కవులలో శ్రీ చెర్విరాల భాగయ్య గారిని (జీవత్కవి) జెప్పి మఱి యొకరిని చెప్పవలెను. ఈయన 34 (అక్షరముల ముప్పదినాల్గు) య. గా. లను రచించెను. ఆంధ్రమున నిన్ని య. గా. లను రచించినకవి మఱియొకడింతకుఁ బుట్ట లేదు. వారి యక్షగానములు లెక్కకెక్కువ యగుటయే కాక వస్తు తత్త్వములో రచనా ప్రక్రియలో నతిమాత్రవై విధ్యమును బ్రదర్శించి నవి. బహు ఫక్కికమగు నేటి తెలంగాణ యక్షగాన వాఙ్మయ మంతటికినిఁ దగినప్రాతినిధ్యము వహింపఁగలదు వీరికృతి సముచ్చ యము. ఏఁ య. గా. కృతిసముచ్చయమును సమీక్షించుట నేటి తెలంగాణా యక్షగాన తత్త్వమును సమీక్షించుటయే యగును.

భాగయ్యగారు తమకృతుల నించుమించన్నిటిని యక్షగానము లని వ్యవహరించినారు. కొన్నిట (ఉదా :- బభ్రువాహన చరిత్ర) భాగవతము, యక్షగానము, నాటకము అను పదములను బర్యాయ

వాచకములుగా ననఁగా సమానార్థకములుగా వాడినారు. అన్నియు నాటకీయతా ప్రకృష్టములు, కవిచేఁ బ్రదర్శనోద్దిష్టములు నైనవి. ఇందుఁ గొన్నిట గ్రంథారంభమున "గణపతి సరస్వతుల వేషము రాకడ", రంభోర్వశులరాకయుఁ గలవు. బహుకృతి సామాన్యముగాఁ బుచ్చుకుని వాలకము (ఒక్కొక్కదాని యందు ద్వారకుఁడు, సేవకుఁడు, ప్రధాని, సూత్రధారుఁడు.— అని వివిధములుగా వ్యవహర్తుఁడు) గన్పట్టును. పాత్రలు స్వీయోదంతములు చెప్పుటయుఁ గృతికర్త భర్త (ఒక్కొక్కచో గ్రంథ ప్రచురణ కర్త) ప్రశంసాత్మకముగాఁ బ్రవర్తితమైన ప్రస్తావనయుఁ గలవు. ఆప్రస్తావన తఱుచు ప్రధాని, హాస్యగాఁడునను నిరువుర నడుమ హిందీభాషలో జరుగును. ఒకప్పుడు ద్రౌపది మొదలగు నాటకపాత్రల చేతనే ప్రవర్తితమగుట విశేషము. అతని "కృష్ణ గారడి" నాటకమున మార్గనాటకములందు వలె నాంది, నాంద్యంత మున నటీసూత్రధారులచే సలక్షణమైన ప్రస్తావనయుఁ గలవు.

భాగయగారి కృతులలో వస్తువైవిధ్య మొకటి గమనింపఁదగినది. ప్రసిద్ధపౌరాణికేతివృత్తములేగాక అల్లిరాణి కథ, నాగార్జునచరిత్రము (వీనిమూలములు వరుసగా - విచిత్రభారతము, మహాలింగపురాణము) మొదలగు అప్రసిద్ధ గాథలును గలవు. కృష్ణగారడి, మాయా సుభద్ర మొదలగు గ్రంథములందు పౌరాణికగాథలే కవిస్వకపోల కల్పనలతోఁ జిత్రములైన మార్పులందినవి. ఇవికాక ఆరె మరాటీలు, కాంభోజరాజు కథ, బొలనాగమ్మ కథ మొదలుగ పదరూపమునఁ బ్రచారమునన్న జానపద గాథలును గ్రహింపఁ బడినవి. ఆంధ్ర జాతీయవీరగాథలలో నొకటియు, గాథకా దచ్చపుఁ జరిత్రమైనట్టియు బొబ్బిలియుద్ధము వృత్తాంతము నితివృత్తముగాఁ గ్రహింపఁబడుట

విశేషము. (పెద బొబ్బిలిరాజుకథ యనుపేర నొక పదము ప్రచారములో నున్నది. దానినిబట్టి రచింపఁబడినదిది. క్రీ. శ. 1757 లో జరిగినది చరిత్ర ప్రసిద్ధమగు బొబ్బిలియుద్ధము). భాగయగారి కాంతామతి, భద్రసేన విలాసము మొదలగునవి కాశీమజిలీ, పండ్రెండు రాజులకథల "బాణీ" ని నడచిన కట్టుకథలు. అందుకొన్ని కవి స్వకపోల కల్పితములే కావచ్చును. ఈకథలు వివిధరసముల కాకరములు. అక్షేయండు పాత్రవైవిధ్యమును దఱచు. రాజమహిషీ మంత్రి పాత్రలెక్కువ. ఎఱుకలసాని, దొమ్మరిసాని, చాకలి, జాలరి, కోమటి, దొంగ మొదలగు వివిధ కులవృత్తులకు సంబంధించిన పాత్రలును గలవు. రాజపాత్రాదుల చిత్రణమునఁ దగిన సహజత్వము నుదాత్తతయుఁ గొఱవడినను నీచపాత్రలే నిసర్గ మనోజ్ఞముగాఁజిత్రింపఁబడినవి. ఆయాపాత్రల సంభాషణలలోని తెలంగాణా తెలుఁగు వ్యవహారము నుడికారము గమనింపఁ దగినది.

ఈ కృతులన్నిట సామాన్యముగాఁ గనిపించు రచనా విశేషములు :- తాళప్రధానములైన దరువులు, ద్విపదలు, పద్యములు, వచనములు, కొన్నిట కందార్థములు, ఏలలు, తోహరాలు మొ॥. దరువులలోఁ బాత్రలు తెరవెడలు దరువులు గలవు. సంధివచనములే కాక సూటిగాఁ బాత్రల సంవాదాత్మకములైన వచనములును సమృద్ధిగా నున్నవి. కొన్ని గ్రంథాంతములందు కవిగద్య గలదు. రచన సామాన్యులైన సామాజికుల కుద్దేశింపఁబడి సాగినది కావునమిక్కిలిసరళముగా నున్నది. ఇటీవలి తెలంగాణా యక్షగానముల రచనాధోరణి యంతయు నిట్టిదే. అల్పసంస్కారులైన కవులచేతిలో బడి య. గా. రచనాప్రౌఢి యంతకంతకు దిగజాఱిపోయినది. కాని యది సామాన్య జనానురంజకప్రదర్శనోద్దిష్టమై యుండుటఁ గొంత క్షంతవ్యము.

ఇఁక నిటీవలి తెలంగాణా య.గా. లలో నేదోయొకవిశేషము గలవి కొన్నిమాత్రమిటఁ బేర్కొఁనఁబడుచున్నవి. మహమ్మదు అబ్దుల్లాయను నొక మహమ్మదీయకవి (చె. భాగయ్యగారి శిష్యుఁడు) హనుమద్రామ సంగ్రామమను నొక య. గా. ను రచించి యుండుటొక విశేషము. ఈతరమున అంబేద రాజవీరప్పయను నతఁడొక బహు యక్షగాన కర్త. అతని మల్లనచరిత్ర మొక జానపదగాథ యితివృత్త ముగాఁ గలది. పట్లోరి వీరప్పయను నొక యాధునికకవి మన్మథసంహా రము, క్రోధాపురిరైతువిజయము ననురెండుగ్రంథములను రచించుచు నందు మొదటిదానిని యక్షగాన మనియు, వీధిభాగవత మనియుఁ బేర్కొనెను. రెండవ దానిని వీధినాటకమని పేర్కొనెను. రెండవ దానిలో గ్రంథనామమే సూచించుచున్నట్లితివృత్త మత్యంతాధునిక మైనది. క్రోధాపురిరైతగు కోటారెడ్డికుటుంబము నొకజమీందారు, నొక షావుకారును దుదముట్టింప యత్నించి తుదకు వారే గతించి రైతుకే విజయములభించిన కథ యది. ఇది యొక విధముగా నాధునిక సామ్యవాద ప్రభావ ఫలితమనవచ్చును. ఇది వీధినాటక మని పేర్కొనఁబడినను, నిందు నటీసూత్రధారుల ప్రస్తావనయు, అంక రంగ విభాగము నుండుటయు విశేషము. ఇది సంస్కృత, పాశ్చాత్య నాటక సరణి. ఇతని రెండుగ్రంథములందును పాత్రలు ప్రవేశించు నపుడు స్వవిషయమును జెప్పుకొనుటయు, సంధివచనములు, ముద్ర లతో దరువులు, కందార్థములు మొదలగునవి కలవు. ఇది యక్ష గాన సరళి. ఇట్లేయక్షగాన ప్రక్రియ రవంతకలిగి ప్రాచ్య పాశ్చాత్య ప్రాచీనాధునాతన రంగస్థల వీధినాటకప్రక్రియ లను నుభయకూలముల నొరసి వఱదలై పాఱు త్రివేణివలె నొక విచిత్రరూపక ప్రక్రియ నేఁడు నాటకనామమున తెలంగాణా జనపదములలో " చలామణీ " యగు చున్నది. ఉదా :- 1. కథలాపురం గంగాధరకవి చిరుతొండ

నాటకము, శివకుమార నాటకము, 2. రాజక్క-పేట మౌనధారి నాటకము, 3. వేముగంటి శ్రీనివాసకవి సత్యహరిశ్చంద్ర, 4. గాజుల స్వామిదాసు స్వరోచ్యుపాఖ్యానము. 5. ఈరబత్తిని నరసింహులు మదన విజయము, 6. బూర్గుపల్లి సోదరకవుల రచనలు (చూ. ఇందలి తెలంగాణా యక్షగానములు – నం. 32 – 33). ఈ కలగాపులగపు బ్రక్రియలో యక్షగానపు బాలునెన్నుట కష్టము, ఎన్న వలసినపనియు లేదనిపించును. అయితే యిదియంతయు యక్షగానము తెలంగాణ మునఁ బ్రవేశించిన యనతికాలములోనె నెంత పరిణతి సందినదియు సూచింపఁ గలదు. యక్షగానమువంటి ప్రక్రియ పరిణతి కంతకంఁటె బరమావధి మఱి యుండఁబోదు.

తెలంగాణాయక్షగానము లందెక్కువపాలు ప్రదర్శనోపయోగి. వానినిఁ బ్రదర్శించుట కూరూరఁ గొన్ని మేళములును వెలసినట్లు తెలియుచున్నది. ఇటీవలివానిలోఁ బ్రసిద్ధమైనది 'చిరుతల' నాట్య మండలి యొకటి.

యక్షగాన ప్రయోగము

యక్షగాన రచనాప్రక్రియ పరిణామచరిత్రనుగూర్చిన ముందటి ప్రకరణమునఁ బ్రసక్తాను ప్రసక్తముగ యక్షగాన ప్రయోగమును గూర్చియుఁ గొన్ని విశేషములు తెలుపఁబడినవి. ప్రయోగ సూచనలు, ప్రయోగానుకూల ప్రక్రియయుఁగల కొన్ని య. గా.ల యుదంత ముదాహరింపఁ బడినది. ఈవిషయమై ద్వితీయభాగమున నేయే గ్రంథములంచేయే విశేషములుగలవో తగుసూచన చేయఁబడినది. యక్షగానము మన దేశినాటకకోశమంతటికిని బ్రాతినిధ్యము వహించిన విశిష్ట ప్రక్రియ కావున దాని ప్రయోగఫక్కికనుగూర్చి ప్రత్యేకముగ నీప్రకరణమునకుఁ బ్రసక్తి గల్గినది.

యక్షగాన ప్రయోగము యొక్క ప్రాథమిక స్వరూపము గాన రూపకథాఖ్యానమను విషయము పూర్వోక్తము. ఆపద్ధతి యొక వంక నప్పటప్పట సాగుచునేవచ్చినదని యూహింపనవకాశముగలదు. ఇందుల కుపబలకముగా తంజావూరు విజయరాఘువనాయకాస్థాన కవియైన చెంగల్వకాళకవి తన రాజగోపాలవిలాసమున యక్షగానము నంగనా ప్రవర్తితమగు సంగీతగోష్ఠిగా సూచించినవైనము, కన్నడ దేశమున నీనాఁడు యక్షగానము "తాళమద్దల" యను పేరితో హరికథవలె నాఖ్యానింపఁ బఱుటయుఁ గల దను విషయము, మన హరిదాసులును దమ హరికథలను యక్షగానములని పేర్కొనిన విషయమును బూర్వోక్తములే. అదియొక పదకేళికగాఁ బ్రదర్శింపఁ బడుచుండినదనుట కాధారములును (పరమానందయతి, కంఠీరవ రాజుల రచనలు) బొమ్మలాటకు వెనుకపాటగా నుపయోగింపఁ బడుచుండిన (ఇందులకు 19 శతాబ్ది యక్షగానముల గుఱించియే తగిన యాధారము

గలదు) దను విషయమును బూర్వోక్తమే. అది యెప్పటినుండి యెట్లొకరూపక ప్రక్రియగాఁ బరిణమించినది? వివిధదశలలో వివిధ ప్రదేశములలో దానిప్రయోగము తీరెట్టిది యనువిషయము నింత పూర్వోక్తమయైనను బ్రత్యేకముగ నేతత్ప్రకరణోచితముగ విపులీకృతమై యిటఁ బునశ్చరణ మొనర్పఁబడుచున్నది.

ఆంధ్రదేశము

క్రీ. శ. 16 వ శతాబ్దినుండి యాంధ్రదేశమున యక్షగాన రచన మెక్కువగా సాగుచుండినది. అప్పటికే దొరసముద్రపు నటులు, కూచిపూడి భాగవతులు, జంగాలు మొదలగువారు వివిధములగు వీధినాటకములు, తెరనాటకములు నూహూరఁ బ్రదర్శించుటలోఁ బ్రసిద్ధులై యుండిరి. అట్లు దేశినాటకకళకు విశేషప్రచారముగల్గిన యా దినములలో వెలసిన యక్షగానములందును నాటకోచితమైన రచన సాగినది. అందుల కానాఁటి సుగ్రీవ విజయమాదులే తారాణములు. సుగ్రీవవిజయమానాఁడు ప్రదర్శితమై యుండుననియే డా. శ్రీ నేలటూరు వెంకట రమణయ్యగారు మొదలగు పండితుల తలంపు. "ఆయా పాత్రముల పాటల తత్తద్వేషధారులువచ్చి పాడునట్లును తక్కిన సంధివచనాదులు ఒక్కరిద్దఱు సూత్రధారప్రాయులు పఠించునట్లును నీసుగ్రీవ విజయము వీధియాటగా నాడబడుచుండెఁడి" దని క్రీ. శే. వేటూరివారి వక్కాణ.

17 వ శతాబ్ది ఉ. భా. న ఆంధ్ర దేశమున యక్షగానమునకు కూచిపూడివారి కలాపముతో సంపర్కము కల్గినది. ఆకలాప మాత్మాశ్రయ ఫక్కికము, నృత్యప్రధానమునగు నొక యుపరూపక ప్రాయమైన దృశ్యప్రక్రియ*. నాఁటినుండి యట్టిప్రక్రియతో యక్ష

* Lyrical and operatic type of play.

గానములు నానేకములవెలసినవి. పారిజాతములనుపేర వెలసిన వందు లకుఁ బరమోదాహరణములు.

18 వ శతాబ్దియందాంధ్రదేశ యక్షగానములు కొన్నిటిపై మార్గనాటక ప్రభావము గొంతపొడసూపినది. అది 19 వ శ., ఉ. భా. నఁ జిక్కఁబడినది. అది యట్లు చిక్కఁబడునున్న కాలమునసే దానిపై నాధునిక రంగస్థల నాటక ప్రభావముగూడఁ బడి యక్షగాన మందు నాటకీయత యినుమడించినది.

ఆంధ్రదేశమున యక్షగాన రంగ విషయమునఁ గగిసయభివృద్ధి కన్పట్టదు. అప్పటికప్పు డేయూరిమొగనో యే కోవెలమొగిలివాకిటనో, యే సంపన్నగృహస్థు నింటిముంగిటనో తాటా తూటముగా నిర్మింపఁబడిన కమ్మలపందిరిక్రిందఁ గళ్ళాపుజల్లిన కటికనేలయే దాని రంగస్థలము. కేవల మారుబయటఁగాక పందిరిక్రిందఁ బదర్శింప బడుటయే దాని యభివృద్ధి. దాని చుట్టును జూపున కందుమేర నంతయుఁ బ్రేక్షకాగారమే. అటు నిటు చెరియొకరిచేత బట్టుకొనఁ బడు నొక తెల్లని గుడ్డయే తెర. తెర కటు నిటు దివిటీలు పట్టబడును. తెరవెనుక హంగుదారులు భట్టి, మద్దెల, తాళపుఁజిప్పలవారును, వంతపాటకులు నుందురు. తెర ముందొకఁ డతఁడే సూత్రధారుడై ప్రదర్శనారంభమునందు ప్రార్థనాదికము పచరించుట, కథాసంద ర్భము వివరించుట, పాత్రప్రవేశము సూచించుట, పాత్రలను బృచ్ఛించుట, పాత్రలకు వంతపాటకులకు పాటల మొదటి ముక్క లందించుట, పాత్రల యభినయమున కనుకూలముగఁ దాళము వేయుట, నడుమ సంధివచనములను, వస్తుగత వర్ణనాత్మక ద్విపదలను జదువుట మొదలగు పనులొనర్చును. ఒక్కొకప్పుడు, హాస్యగాడని యొకఁడు వేఱు యుండి హాస్యప్రసంగములు నెఱపుటతోపాటు సూత్రధారునికి

సహాయకుఁడుగా నుండును. వంతపాటకులు పాత్రలతోపాటుపాడుదురు. భామకలాపము "బాణీ" కి ప్రచారముగల్గిననాటినుండి యక్షగాన సాధారణముగాఁ బాత్రలు తెరలోనుండియే తమ యుదంతము దామే (ప్రదర్శక ప్రముఖుని పృచ్ఛలపై) చెప్పుకొని (ఈపద్ధతి సామాన్య జనుల బోధశాలిత కనుగుణముగాఁ గల్పితమై యుండును.) గుగ్గిలము ప్రోక్షణతో భగ్గుమను దివిటీల వెలుఁగు చూపఱ కనులు మిఱుమిట్లు గొల్పఁగా, సూత్రధారునివెంట - వంతపాటకు లందుకొను ద్రుతగతి ప్రావేశికధ్రువతో, హంగుదారుల తాళ మృదంగాదుల హడావుడితో, తమ కాలిగజ్జెల గలగలలతో బయల్వెడలి యాయా మేళము సంప్రదాయమునట్టి సభానమస్కారసూచకముగా సాభినయముగా నమ్రశిరస్కతయో, కరముకుళనమో, పుష్పాంజలి సమర్పణమో కావించి కథా ప్రవర్తనలోఁ బాల్గొనుట పరిపాటి. కూచిపూడివారి భామవేష మొకంతకుఁగాని తెరబయల్పడదు. ఆసందర్భమున జడవర్ణన యొకటి మిగుల నిశిష్టమైనది. అది యొక ప్రబంధమే. — "వేణీ ప్రబంధము". భామ వేషగాఁడట్లు తెరపై జడనై చుట భరతమునందుఁ జనకు సాటివారు లేరని పండెము చఱచుటయఁట! యక్షగానములలోఁ దెర ప్రక్కవాటుగాఁ గాక పైనుండి క్రిందువాటముగాఁ దొలఁగింపఁబడును. తెర తొలఁగునంత హంగుదారులును రంగముపైఁ బాత్రల పార్శ్వముల నుందురు. సాధారణముగా యక్షగాన ప్రదర్శనలలోఁ పాత్రనిష్క్రమణము మాత్రము ప్రత్యేకముగా సూచింపఁబడదు. తన ప్రయోజన భాగ (Portion) మైపోవునంత నా పాత్ర వెనుకకు జరిగి వంత పాటకుల నడుమ నిలబడును. అట్టిచో నా పాత్రలు వంతలో బాల్గొనుటయుఁగద్దు. ప్రదర్శన సుమారు జాము రాత్రికిఁ బ్రారంభమై తెల్లవారలు సాగును. తెల్లవారుసరికెట్లో ప్రదర్శనము తెమల్చుకొని మంగళముపాడి మేళమువారా వాలక

ములతోనే యూరి పెద్దల యింటింటి కేగి వారిలోగిళ్ళ మఱుల నేదో పదాభినయము పట్టి యధోచిత సత్కారములంది పోవుదురు. ఆంధ్ర దేశయక్షగాన ప్రదర్శన కీవి సామాన్య లక్షణములు. ఒక్కొక్కచో నాయాప్రదేశములందలి ప్రదర్శకుల కౌశలమును బట్టియు నవకాశము లను బట్టియు, నభిరుచి భేదమును బట్టియుఁ గొన్ని కొన్ని విశేష ములు, విపర్యాసములు నుండవచ్చును.

ఇక్కడ నాంధ్రదేశ య. గా. ప్రదర్శనములందలి స్త్రీపాత్ర నిర్వహణమునుగూర్చి యొకమాట చెప్పవలసి యున్నది. 16 శ. మొదట తప్పిదారి యొక్క తాయికొండనాటకమున మాత్రము స్త్రీపాత్ర నొక స్త్రీయే నిర్వహించినట్లు తెలియుచున్నది. కాని, 18 శ. చివరి దనుక స్త్రీపాత్రలను బురుషులే నిర్వహించుచుండినట్లు తెలియనగును. ఆ తాయికొండనాటక మైనను యక్షగానమని యూహింప నవకాశము గానరాదు. అది యొక వీథినాటకమై యుండును. పోని, నాఁటి వీథి నాటకములందయిన నన్నిట స్త్రీలు సాల్గొనుచుండిరా యనఁగా నట్లు గాదు. ఆనాఁడే కూచిపూడి భాగవతులు వీర నరసింహ రాయల యెదుటఁ బ్రదర్శించిన నాటకములలో పురుషుఁడే స్త్రీ పాత్ర ధరించి నట్లు స్పష్టముగాఁ గలదు. వా రుగరితల కభినయవిద్య గఱపుదురు కాని గణికల నైనను దమ నాటకములలోఁ బాల్గొనసీయరు - అది కూచిపూడి భాగవతుల ముఖ్య సమయములలో నొకటి. వారి "భామవేషగాఁడు" అను మాట యొకటి తెనుఁగు దేశమునఁ దఱచు వినిపించు చుండును. భామవేష మనఁగా భామాశిరోమణి యైన సత్యభామవేషము. ఆవేష మే పురుషులచే నిర్వహింపఁ బడి నప్పుడు కడమ స్త్రీవేషములమాట తడవం బనిలేదు. యక్షగానోప స్థితికి జక్కుల పురంధ్రుల యాటపాటలే కారణములైనను యక్ష

గానము కూచిపూడి భాగవతులు మొదలగు వీథినాటక ప్రదర్శకుల దృష్టి నాకర్షించి యొకరూపక ప్రక్రియగాఁ బరిణమించి నంతట దానికి జక్కులజాతి తోడనే సంబంధము పోయినట్లు తోఁచును. కూచిపూడివారి యాలంబము గల్గినంతట వారి యాచారముద్ర దానిపై హత్తుకొని యదియే తదితర ప్రదర్శకులకు నాదర్శప్రాయ మగుచు వచ్చినది కొంతకాలము. 18 శ. నడుమ కూచిమంచి జగ్గకవి చంద్రశేఖ విలాపమున "ఆడుభాగవతుని జాడ గడ్డము మూఁతి నున్నగా గొరిగించుకొన్న వాఁడు" అని యన్నమాటను బట్టియు, నా కాలమునసే తురగా రామకవి యొకచాటువులో భాగోతుల బుచ్చి గానిని స్త్రీపాత్రధారిగాఁ బేరొక్కనుటనుబట్టియు నప్పటికిఁ బురుషులే స్త్రీపాత్ర ధారణము సేయుచుండినట్లు తెలియనగును. కాని 18 - 19 శతాబ్దుల సంధికాలమున వెలసినట్లూహింపఁదగిన పురిజాల లక్ష్మీ నారాయణకవి పారిజాత య. గా. న సఖపాత్ర భాగవతములందుఁ బురుషులు స్త్రీవేష ధారణము సేయుటుచితము గాదని వాదించుటయు సత్యభామ ప్రత్యాఖ్యానము చేయుటయుఁ జూడ నాకవి కాలమున నక్కడక్కడ స్త్రీలును య. గా. ప్రదర్శనములందుఁ బాల్గొనుటకుఁ బూనుచుండిరనియో లేక స్త్రీ పాత్రలు స్త్రీలే నిర్వహించు టుచిత మను వాదము బయలుదేరియుండు ననియో యూహింపనగును. 19 శ. నుండి యటనట స్త్రీలును బ్రదర్శనములలోఁ బాల్గొను చుండిరనుటకుఁ దగిన యాధారములు గన్పట్టుచున్నవి. విశాఖపట్టణము జిల్లా వృత్తాంత సంగ్రహము (పుట 130) లో "జనరంజక నాటకములు స్త్రీలు పురుషులు వేషములు వేసుకుని వినికి చేసెడివారు" అని యున్నది. 19 శ. ఉ. భా. న నెల్లూరు మండలము ఆత్మకూరు తాలూకా పడకండ్ల గ్రామకరణమగు పడకండ్ల స్వామిరాయకవి నటు మేళములను రప్పించి నెలల తరబడి వారికి వాసగ్రాసములు గల్పించి, గణియములు

వక్త్రములు ప్రదర్శన శిక్షణయనిచ్చి తన రచించిన లక్షణా పరిణయాది యక్షగానములను ప్రదర్శింపఁ జేసెడి వాఁడనియు నామేళములో 'గోనుదిన్నె బుగ్గసాని' యను నామె కవి యాజ్ఞపై నాయికవేషము గట్టినట్లును బుగ్గసాని (లక్షణ) మాటగా నాలక్షణా పరిణయ గ్రంథమునందే యున్నది. ఇట్టి సందర్భములనుబట్టి రానురాను యక్షగాన ప్రదర్శనములందుఁ గొన్నికొన్ని చోటుల వారికినిఁ బాల్గొనుట కవకాశము గల్గినదని చెప్పనగును.

ఇఁక నీ యక్షగాన ప్రదర్శన ప్రక్రియ యందలి మూలికమైన తత్త్వమునొక్క లక్షణము లెట్టివనఁగా :—

1. ఇందు రూపారోపము (పాత్రానుకూల వేషధారణము) గలదు. కావున నిది రూపకసమాఖ్యకుఁ దగియున్నది. ("రూపారోపాద్రూపకమ్").

2. ఇందు రసాశ్రయమైన యితివృత్తము, చతుర్విధాభినయ (ఆంగిక వాచికాహార్య సాత్త్విక విశిష్టమైన యవస్థానుకృతియు గలవు కావున నిది నాట్యోపేతమైనది — ("అవస్థానుకృతి ర్నాట్యమ్", "చతుర్ధాభినయోపేతం నాట్యముక్తం మనీషిభిః" "నాట్యం రసాశ్రయమ్")

3. ఈ యక్షగాన నాట్యము నృత్తనృత్యానుప్రాణిత మైనదని యెఱిఁగిన పెద్దలెల్లరు చెప్పుదురు.[44] ('నృత్తం తాళ లయాశ్రయమ్, భావాశ్రయం నృత్యమ్")*

44. ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతము గారి "గౌతమ వ్యాసములు" నుండి — 'మన నాటకముల పూర్వ గాథ' అను వ్యాసము.

* మీఁది కుండలీకరణములలోని అభినయకములు దశరూపకము, సంగీత దర్పణములనుండి గ్రహింపబడినవి.

ఇట్లు నృత్త నృత్య నాట్యాత్మకమైన యక్షగానమ్మునకు నిటీవలి కాలమున మార్గరూపకము, ఆధునిక రంగస్థల నాటకముల ప్రభావము పడినను దాని ప్రాక్తనమైన ప్రదర్శన ఫక్కి-కయొక్క- వ్యక్తిత్వము, నంత కంటెఁ బ్రాక్తనమైన దాని జీవలక్షణమగు గానకళా ప్రాముఖ్యమును సంరక్షింపఁ బడుచునే నచ్చినవి. నాటక నామ వ్యవహృతమైనను నీ యిరువదవ శతాబ్ది యందును యక్షగాన శబ్దము విస్మృతము గాలేదు. మార్గాధునిక నాటకములుయక్ష గానము నలె నృత్త నృత్య గాన ప్రధానములు గావు. నృత్తనృత్య ప్రాధాన్య సాదృశ్యము కారణముగా మన పండితులు కొందఱు యక్షగానము పాశ్చాత్య దేశము లందలి "ఓపెరా" వంటిదని యభిప్రాయ పడియున్నారు.[45] కాని ఓపెరాలు గానకేవలములై నవి. యక్షగానములు గాన ప్రధానములే కాని, గాన కేవలములు గావు. అందు నేయ ప్రయోజనమున కే కాక సాధారణ పఠనోద్దిష్టములైన గద్య పద్యములు నుండును. అది కాక యక్షగానములందుఁ బ్రయుక్తమగు నృత్తనృత్యముల తీరు వేఱు. అది కూచిపూడి భాగవతుల వంటి శిష్టుల చేతిలో నిబిడతర శాస్త్ర ప్రక్రియానికపాయితమైనది, విశిష్ట సంప్రదాయ చోదిత మైనదియును.

అసలు యక్షగాన నాట్యము భరతశాస్త్ర సంప్రదాయానుసారము నృత్తనృత్యాను ప్రాణిత మగుటకు, యక్షగానము వీథినాటకము నేకమగుటకును గూచిపూడి భాగవతులే కారకులై యుండు నేమోయని కూడ ననిపించును. యక్షగానము రూపకప్రకియగా

45. చూ. కీ. శే. జయంతి రామయ్యపంతులు గారి ఆధుని కాంధ్ర - వాఙ్మయ వికాస వైఖరి — ద్వితీయాధ్యాయము; కీ. శే. పానుగంటి వారి సాక్షి సం. 1 — అధ్యా. 18; Prof. P. Sambamoorthy's introduction to Nowka Charitra (Tyagaraja's Composition).

రూపొందిన నాఁటి కాంధ్రదేశమున కూచిపూడి భాగవతులు భరత విద్యాధురంధరులుగా విశేష ప్రసిద్ధి గాంచినారు. దేశాటనము సేయుచు నాటకప్రదర్శనము లిచ్చుట వారివృత్తి. వారు రాజ సన్మానములు గూడఁ గాంచినవారు (ఈవిషయము పూర్వోక్తము). ఏ సుముహూర్తముననో యక్షగానము వారి దృష్టి నాకర్షించి యుండును. తోడనే వారు తమ వీథినాటక ప్రదర్శనానుభవమును, భరత విద్యా విదగ్ధతను బట్టి దాని నొక విశిష్ట రూపకప్రక్రియగాఁ దీర్చి దిద్దుటకుఁ గృషిచేసి యుందురు. ఈయూహ కుపాధి సిద్ధేంద్రయోగి భామ కలాపము సృష్టి. అది కాక యక్షగానములు ప్రదర్శించుట యందును వారు ప్రసిద్ధులు. వారు ప్రదర్శించువానిలోఁ బ్రసిద్ధములైనవి ప్రహ్లాద, ఉషాపరిణయము, శశిరేఖా పరిణయము, రామనాటకము, హరిశ్చంద్ర, నలచరిత్రములు మొదలగునవి. అందు కొన్ని నాటకము లని వ్యవహరింపఁబడినను నవి యక్షగాన ప్రాయములైనవే. సాధారణముగా వారి ప్రదర్శనము లన్నియు నందుఁ బ్రత్యేకముగా వారి భామకలాపమును భరత విద్యానవద్య ప్రమాణ పటిష్ఠములైనవను సంగతి యాంధ్రలోకమంతయు నెఱింగినదే. వారి భామకలాప మేకాగ్రముగా నెనిమిది రాత్రుల ప్రదర్శన కుద్దిష్టమైన దఁట. కూచిపూ వారి ప్రదర్శనము లన్నిట దీనికెక్కువ ప్రచారము. దీని "భాణి" ని బట్టి యాంధ్రదేశమున వివిధప్రదేశములలో నెన్నో భామ కలాపములు వెలసినవి. ఆ "భాణి"తో యక్షగానములు ననేకము వెలసినవి. అయితే ఆదిని యక్షగాన రచనా ప్రక్రియయే భామకలాపమునకు మూఁదల. ఆనఁగా సిద్ధేంద్రునికి (17 శ. మధ్య కాలము) ముందే కూచిపూడివారు యక్షగాన ప్రదర్శనకుఁ బూనుకొని యుందురను నూహకుఁ గొంత యవకాశము గలదు. (అప్పటికే యక్షగాన రచన బాగుగా సాగుచుండినది కదా. 16 శ. ఆరంభమునకే వారు నాట్య కళా ప్రచారకులుగాఁ బ్రసిద్ధులుగదా) రంగ విషయమునను, హంగు

విషయమునను గూచిపూడివారిప్రత్యేకత యంత లేకపోయినను బహు విధాభరణములు, కిరీటములు, గణియములు, కరాళములు (Masks నృసింహాది పాత్రలకు) గల వారి "సరంజాము" దొడ్డది. వారి ప్రదర్శన ప్రక్రియ సరేసరి. ఆంధ్రదేశ వివిధప్రాంత యక్ష గాన ప్రదర్శకులకు వారి ప్రదర్శనపద్ధతులే యాదర్శప్రాయము లైనను ఏనాదులు, గొల్లలు మొదలగు తక్కువతరగతి ప్రదర్శకులు బయలుదేఱుటవలనఁ గూచిపూడికత్తు నందలి లగువుబిగువులు వారి యెడ నంతకానరావు. కూచిపూడిభాగవతులు మేళములుగా నూరూర బర్యటించుచుండుటవలన నాయా యూళ్ళలోను గొన్ని మేళములు మొలిచినవి. వెనుకటి కూచిపూడిమేళములలోఁ బ్రసిద్ధములైనవి: సిద్ధేంద్రయోగి మేళము, భాగవతుల దశరథరామయ్యగారి మేళము. 18 శ. న భాగోతులబుచ్చిగాని మేళము, 19 శ. న రాయలసీమలో లేపాక్షి, వేములపల్లి, తాడిపత్రి మేళములు, 19 - 20 శ. ల సంధి కాలమున నెల్లూరుమండలమున పడకండ్ల స్వామిరాయకవి, త్వరకవి రామకృష్ణయగారల మేళములు, విశాఖమండలమున నరసింగపల్లి కళ్ళేపల్లి కందాళ చిందబరకవి మేళములు, పల్నాటిసీమ మేళములు మున్నగునవి కొన్ని ప్రసిద్ధికెక్కినవి. కాని యొకనాఁ డాంధ్రుల నాట్యకళా ప్రతిష్ఠల కధిష్ఠానమైన కూచిపూడిలోనే యీ నాఁడు భాగవతులకు గతులులేకుండఁ బోయినవనఁగా నిఁక గడమయెడల యక్షగాన ప్రదర్శన మేస్థితిలో నున్నదో తడవంబనిలేదు.

ఈ ప్రకరణ రచన కాధారములు:— 1. కొన్ని యీ ప్రకరణమున నథో జ్ఞాపికలలోను, గొన్ని ముందటి ప్రకరణములలోను, చేర్కొనఁబడినవి. 2. వివిధ యక్షగాన గ్రంథములందలి సూచనలు (పూర్వ ప్రకరణోక్తము) 3. నా యక్షగాన ప్రయోగ దర్శనానుభవము. 4. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి ఏకవీరయందలి భామకలాప ప్రస్తుతి, వేయి పడగలు — ప్రహ్లాద నాటక ప్రదర్శన వర్ణనోదంతము 5. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారి మాలపల్లి — ప్రహ్లాద నాటక ప్రదర్శన వర్ణనోదంతము. 6. శ్రీ దివాకర్ల రామమూర్తిగారి "కూచిపూడి భాగవతులు" అను వ్యాసము — (వ్యాసమాల యను సంపుటములోనిది.)

దక్షిణదేశము

17 వ శతాబ్ది ప్రథమ పాదముననే తంజావూరిలో యక్షగాన మునకు రాజాశ్రయము లభించి రంగభోగము విస్తరిల్లినది. రఘునాథ విజయ రాఘవనాయకుల కాలమున నగరి పెత్తనముక్రింద నాటక శాలలు వెలసినజాడ దోచుచున్నది. ఆరాజులు స్వయముగ యక్ష గాన రచన గావించిరి. విజయరాఘవాస్థానమున దానికింకను ప్రోత్సాహముగల్గి యథి పీథినాటకము వైఖరితో రంగమున కెక్కినది. విజయరాఘవుని పూతనాహరణము, ప్రహ్లాద చరిత్ర మొదలగు కృతులలో రంగప్రయోగసూచన లనేకము గలవు. (అవి ముందటి ప్రకరణమున నుదాహృతములు). ప్రహ్లాద చరిత్రమున "నాటక శాల" "విదూషక" ప్రశంసలు గలవు. ఇది (ఫలానా) "పాత్ర వాక్య" మని కలదు. చివర నించలి పాత్రవివరములును గలవు. వీనినిబట్టి నాడు యక్షగానము రంగమున కెక్కెననుట విస్పష్టము. కాని యా రంగరచన తీరెట్టిదియో తేటపడలేదు. భరత విద్యా ధురంధరులైన నాయకరాజుల నగరి నాటకశాల లందైన రంగ రచన భరతశాస్త్రోక్తముగ జరిగియుండునని యూహింపనగును. తదుపరి మహారాష్ట్రప్రభువులకాలమున తంజావూరిలో యక్ష గానముపై మార్గనాటక ప్రభావముగూడ బాగుగా బడియుండుటచే (ఈ విషయము పూర్వోక్తము) నాడును యక్షగాన రంగము రాజాస్థానమునందైన శాస్త్రోక్తముగనే తీర్చబడి యుండుననుకోన వచ్చును. కాని యా మహారాష్ట్రుల నాటక గ్రంథములలో సూత్ర ధారుడు, భాగవతులను బాత్రలను బలుకరించినట్లుండుట చూడ నా ప్రదర్శనతీరు కొంతవఱ కాంధ్ర యక్ష గానములను బోలిన దనియుఁ జెప్పనగును. అందు గణపతి సరస్వతుల స్తుతులతోపాటు

పాత్ర ప్రవేశములును జెప్పఁబడి యుండుట మహారాష్ట్ర దేశపు "లలిత" నాటకఫక్కి. + చివరి మహారాష్ట్ర ప్రభువగు శివాజీ కొలువున భాగవతమేళము లుండినట్లు స్పష్టముగాఁ దెలిసినది. (పూర్వోక్తము) ఆయా యాధారములవలన నాఁడు నాయక మహారాష్ట్ర రాజాస్థానము లందు నాటకశాలలు, భాగవతమేళములు విలసిల్లినట్లును, భరతవిద్యా ప్రియంభావుకులగు నాప్రభువుల పోత్సాహమున యక్షగాన రంగరచన, ప్రదర్శనభంగి గొంతయైన భరతశాస్త్రవిధాసంవాదిగాఁ దీర్పఁబడి యుండునని యు నూహింపనగును.

17 – 18 శతాబ్దులలో తంజావూరిలోను, మధుర మైసూరు రాజాస్థానములందును యక్షగానప్రదర్శనలలో స్త్రీలును బాల్గొనుచుండి నట్లాధారములు గన్పట్టుచున్నవి. తంజావూరి రఘునాథుఁడు "రంగ స్థలంబు రామాలంకృతంబుఁ జేసి" నాఁడు. (చూ. విజయవిలాసము అవతారిక). విజయరాఘవాస్థానమున యక్షగానమును గొందఱతివలు వినిపించుచుండఁజేసి వారని చెంగల్వ కాళకవి చెప్పినాఁడు. (చూ. రాజగోపాలవిలాసము – అవతారిక) వినిపించుట యనగా సంగీత గోష్ఠి యనియే కాక ప్రదర్శించుటయనియు నూహించుట కవకాశముఁగలదు. విజయరాఘవాదుల యక్షగాననాటక ప్రరోచన సర్వసాధారణముగ "పరాకుస్వామివారు హావణించిన...నాటకంబు నటనపటిమ గనుపించ వినిపించేము విన నవధరించుండ" అని యుండును. అందుచే కాళకవి వక్కణలో నటనపటిమ గతార్థమైనదనియే భావింపనగును.

+ "లలిత" మహారాష్ట్ర దేశపు జనరంజక రూపక ప్రక్రియలలో నొకటి. అందు దశావతార కథలకుఁ బ్రస్తక్తి గలదఁట. దానిపై తంజావూరి నాటక ప్రభావము పడినదఁట. (కన్నడమున యం. గా. నకు 'దశావతారచ – ఆట' అనియు వ్యవహారము గలదనువిషయము పూర్వోక్తము.) Vide. Marathi Encyclopadia. 1925., Vol. 16 – N. 46.

అదియుఁగాక విజయరాఘవనాయకమైన విజయరాఘవచంద్రికా విహార మున నాయనివారి "బైటినాటకశాల పడుచు" నాయికయైనదనఁగా నీక నొక నట్టువకత్తె యా వాలకమువేసి నాటకమునఁ బాల్గొనుట కభ్యంతరముండునా నాయనివారి కొలువులో! మైసూరి కంఠీరవ నరసరాజు కొలువునను దదుపజ్ఞములగు యక్షగానప్రాయ రచనలు పదకేళికలవలె నట్టువరాండ్రచేఁ బ్రవర్తింపఁబడియుండుటను నూహకుఁ గల సామంజస్య మిదివఱకే పరిశీలింపఁబడినది. మధుర విజయరంగ చొక్కనాథ "సభాపర్వముగా" వెలసిన తిరుమల కవి తిల్లగోవిందరాజ నాటకమును "ఉదుటు వగకోపులనై పు లమర.....ఇంచు బోణులు నటించు" వారని యందే నిలదు. ఆయా యూహారములను బట్టి నాఁడు నక్షిణదేశ రాజాస్థానములందు యక్షగాన ప్రదర్శనలలో స్త్రీలును బాల్గొనుచుండిరని చెప్పవచ్చును. ఇది 17 – 18 శతాబ్దుల ముచ్చట. కాని 19 శ. పూ. భా. న తంజావూరు శివాజీ నగరి భాగవతమేళము "నబనీసు" దగ్గరనుండిన శివాజీ అన్న పూర్ణాపరిణయ నాటకము "వేపాలనాపసీసు" ను (తం. స. మ. నం. 622) గాని తం. స. మ. కే. సం. 799 "నాటకపాత్రలు" అను పట్టికలను గాని పరిశీలించినచో నొక్క యపవాదమైన లేకుండ నన్ని స్త్రీ పాత్రల యెడుటను బురుషనామములే కన్పట్టును. అనఁగా నానాఁడు పురుషులే స్త్రీ పాత్రలను ధరించు చుండిరనుట స్పష్టము. దీనికిఁ గారణము 18 శ. చివర తంజావూరికి మిక్కిలి సమీపమునన్న మెలట్టూరున వెలసిన భాగవతమేళ నాటకముల సంప్రదాయము కావచ్చును. అవి నాఁటి తంజావూరు రాజాస్థాన నాటకములవలె య. గా. ప్రాయము లైనవే యయ్యు నొక గొప్ప విశిష్టసంప్రదాయ పటిష్ఠమైన ప్రక్రియ గలట్టివి. (ఇటఁ బ్రత్యేకముగా నాని యుదంతము గొంత వివరింప వలసి యున్నది.)

మెలట్టూరు

భాగవత మేళ నాటకములు

మెలట్టూరు భాగవతులకుఁ గులపతియైన వెంకట రామశాస్త్రి గుఱించియు, నతని కృతులఁ గుఱించియు స్థలాంతరమునఁ జెప్పనైనది.+ ఆ కృతుల రచనాప్రక్రియ నాఁటి యక్షగాన సామాన్యమైనదని నిరూపింపఁ బడినది. ఇఁక ప్రదర్శన ప్రక్రియ - సంప్రదాయముల గుఱించి :-

ఈ నృత్య ప్రధానములగుటచే నృత్య నాటకములనియు, భాగవతులైన నటులబృందముచేఁ ప్రదర్శితము లగును గావున భా. మే. నా. లనియు వ్యవహరింపఁ బడుచున్నవి. కూచిపూడివారివలెనే భాగవతు లందఱును బ్రాహ్మణులే. ఈ నాటకములు మెలట్టూరు పురాధిష్ఠాన దైవతమగు వరదరాజ పెరుమాళ్ళు దేవాయతన బహిఃప్రాంగణమున నొకపెద్ద పందిరిలో - వైశాఖమున వసంతోత్సవ కాలమున నృసింహ జయంతినాఁడు ప్రహ్లాద నాటకముతోఁ బ్రారంభింపఁబడి (కూచిపూడివారికినిఁ ప్రహ్లాద నాటకమన్న మంచిపట్టు) వరుసగా నైదాఱు రాత్రులు నడుమ నొకనాఁటి విరామముతో సాగును.

మెలట్టూరువారి వేషధారణలో వర్ణ వైశిష్ట్యము (Colour-Values) పాటింపఁ బడును. రాజవేషములు తంజావూరి రాజుల కనుకరణగా నుండును. రాక్షస వినాయక నృసింహ బ్రహ్మాది వేషములకుఁ గరాళము లుపయోగింతురు. (కూచిపూడివారును గరాళము

+ ద్వి. భా., పుట 335—39. చూ. ఈ మెలట్టూరు భా. మే. నా. ల గుఱించి నా వ్యాసము భారతి. సెప్టెంబరు, 1955.

లుపయోగింతురు.) వారి ముఖ్యమైన జంత్రపుహంగు మృదంగము తి త్తి, ముఖవీణ, సూత్రధారునిచేతి తాళముచిప్పలు.

నాటకము రాత్రి సుమారు పది గంటల కారంభింతురు. "నట్టువాంగం" (హంగు) జరుపు భాగవతు లిద్దరు, ముగ్గురుపాట గాండ్రు, జంత్రగ్రాండ్రు, గ్రాంథికుఁడు లేక ప్రసంగి (అనఁగా సంధివచనా దులు చదివెడు వాఁడు) – వీరు హంగుదారులు. సర్వసిద్ధమై జంత్ర గాండ్రు సరే యనఁగానే భాగవతులు పుండరీక ధ్యానశ్లోకములు పఠింతురు. ఆవెంటనే తై తైమను కొనుచు కోణంగి రంగమునకు వచ్చును. గ్రంథములోఁ జెప్పఁబడకపోయినను వానిరాక యొక యాచారము. సూత్రధారిచేఁ బ్రుచ్ఛితుఁడై వసంతోత్సవకార్య క్రమము జరిపించుటకై సభవారి నెచ్చరింప వచ్చితిననును. వాల కము (హనుమంతునివలె) హాస్యగానివలె నున్నను సతఁడొక మహా భక్తునిక్రింద లెక్క. అటు పిమ్మట భాగవతులు "శ్రీడై మంగ శము" (తాళ్ళపాక చిన్నన్న కీర్తన పంచకము. ఇది తంజావూరు మహారాష్ట్రులనాఁటి య. గా. లందును గొన్నిటి ప్రతుల మొదటఁ గన్పట్టును.) అందు కొందరు ప్రతి కీర్తనకును ముందు జతి తరువాత శబ్దము, కౌస్తుభము (మాతు ప్రధానమైన శబ్దజతి వంటిది) పఠింప బడును. ఇక్కడ కిది యంతయు "మేళం కట్టుడల్" అనఁగాఁ బూర్వ రంగ నిర్వహణ.

తదుపరి గ్రాంథికుఁడువచ్చి "ఆదిద్విపద" అనఁగా గథాసంగ్రహ కవి విషయక ద్విపద (శహాజి ప్రభృతుల కృతులలో దీని యునికి తఱచు) నొక రాగమాలికలోఁ బఠించి, యొక వచనమున వినాయక పాత్ర ప్రవేశ సూచనచేసి యొక జతి చెప్పును. భాగవతులు ప్రావే శికీ ధ్రువను బఠింతురు. తదనుగుణముగా నృత్యము చేయుచు గణపతి వేషము వేసికొని యొక బాలుఁడు వచ్చును. రంగముపైఁ గొంతసేపు

కూర్చుండి "పండారకుకుక్కళులు" (పూజారులు) రాగా వారిచే పూజలందుకొని నృత్యము సేయుచు నిష్క్రమించును. (ఈ వినాయక పాత్ర ప్రవేశఘక్కి శహాజీ ప్రభృతుల కృతిసామాన్యమైన విషయమే). అంతటఁ బ్రసంగి జతియుక్తముగా నొకవచనము పఠించి కటికము వాని ప్రవేశము సూచించును. వాఁడు భాగవతుల దరువున కనుగుణముగ నృత్యను సేయుచుఁ బ్రవేశించును. (సభవారికి రాజుగారిరాక నెచ్చరింపవచ్చువాఁడితఁడు. మార్కండేయ చరిత్రలో మాత్రము రాజ పాత్రకుఁ బ్రస క్తిలేదని కాబోలు వీని వాలకము కనిపింపదు. అందులో కురవంజి పాత్ర విశేషము) కటికము భాగవతులచేఁ బృచ్ఛితుఁడై తనవచ్చిన పనితెలిపి వెడలిపోవును. (శహాజీ ప్రభృతుల కృతులలో వీఁడొక సాంప్రదాయికపాత్ర.) తరువాత కథాపాత్రలు యథాసంప్రదాయ క్రమముగా సూచన వర్ణనలైన వెంటనే ధ్రువానుగుణ నృత్యముతోఁ బ్రవేశించి నాటకప్రపర్తనలోఁ బాల్గొనును. నాయికాపాత్ర ప్రవేశ విషయమున మాత్ర మొక విశేషముండును. ప్రావేశిక ధ్రువతోఁ బ్రవేశించిన నాయికాపాత్రధారి తన నర్తన కళా ప్రావీణ్యము ప్రదర్శింపవలెముందు. (కూచిపూడి ప్రదర్శనములందు నంతే.) అందులకొక "అల్లారిప్పు" (శుద్ధ నృత్తము అలరింపు?), "మెయ్" (తారస్థాయి షడ్జస్వరము, ఆది తాళములో తాళ జతి ప్రధానమైన సంగీత ప్రక్రియ), తిల్లాన, శోకవర్ణము అభినయించి తీర్మానముచేయవలెను. నాటకమున సామాన్యముగాఁ బ్రతిపాత్రకును భరతపద్ధతి (అభినయము) కరతాలామలకముగావలె. అందును కూచిపూడి భామవేషగానికివలె నిండు నాయికాపాత్రధారి కెంతో యభ్యాసముండవలెను. ఈనాటకములో స్త్రీ పాత్రలు పురుషులచేతనే నిర్వహింపబడును. ఇది నియమము. (కూచిపూడివారు గూడ "తూ చా" తప్పకుండ నీ నియమము బాటింతురు.)

ప్రసంగి గ్రంథములోని సంధి వచనములనే కాదు వర్ణనాత్మకములైన ద్విపదలనుగూడఁ జదువును. సంవాదాత్మకములైన ద్విపదలు, పద్యములు మాత్రమే పాత్రధారులచేఁ బఠింపఁబడును. ఇవి నృత్య ప్రధానములైన నాటకములు గావునఁ బాత్రధారి ప్రతి దరువునకును నృత్యము పచరింప వలెను. అట్టిచో నా దరువులు కూడ వారే పఠించుట కష్టమైన పని. అందుచే నాటకమునందలి పాటలన్నియును బాత్రలవికూడ సూత్రధారుఁడే యెత్తుకొని హంగుదారులకు ముందుముక్కలందిచ్చి తాను జవరఁ దీర్మానము నేయును. వారి వంతల కనుగుణముగ నభినయము మాత్రమే పాత్రధారులు చేయవలసినది. ఈపట్టునమాత్ర మిది కథకళి ఘక్కి. (కథకళి కేవల మాంగికాభినయ ప్రధానమైనది. అందు వాచికము పూర్తిగాఁ బరిహరింపఁ బడును. తమిళ దేశమునకు సన్నిహితమైన మలయాళ దేశమున కథకళి కళా సారస్వత ప్రతిష్ఠ పరాకాష్ఠసందుటకుఁ గారణ భూతుఁడైన త్రయిమ్మణ తంపి మెలట్టూరు వెంకటరామ శాస్త్రి సమకాలికుఁడే.) ప్రసంగి పాత్రలనెప్పుడును బల్కరింపఁడు. సూత్ర ధారుఁడే ప్రతిపాత్రను బ్రవేశింపఁగనే తదుదంతముగూర్చి పృచ్ఛించును. అప్పుడప్పు డతఁడు కథను వాఖ్యానించుటయుఁ గూడ నుండును.

ఈ నాటకములందు వధాదు లప్రదృశ్యములన్న భరత సంప్రదాయములు పాటింపఁ బడును. హిరణ్యకశిపుఁడు నరసింహునితో (నృసింహ పాత్రధారి యాదినమంతయు నుపవసించును. ఇదియుఁ గూచిపూడివారి యాచారమే) వాదించి యతఁడు తన్ను పట్టవచ్చు సరికిఁ దెరలోనికిఁ బారిపోవును. అక్కడితో నా నాటక మైపోయినట్లే. నాటకము పూర్తియగుసరికి భళ్ళునఁ దెల్లవారును. భాగవతులు భూపాలరాగముతో నొక కీర్తన యెత్తుకొని గర్భాలయములోని

స్వామికిఁ బ్రదక్షిణ దీపారాధనము లొనర్చి పురవీథులలోనికి మేళ ముగాఁ బోయి యింటింటికడ యథోచితముగా సత్కరింపఁ బడుదురు.

పై లక్షణములను బరిశీలించినచో మెలట్టూరు భా. మే. నా. లలోఁ బ్రదర్శన సంప్రదాయమునఁ గూచిపూడివారి పోలికయుఁ బ్రదర్శన ప్రవర్తనలో (రచనా ప్రక్రియలోఁ గూడ) శహాజీ నాటక ముల పోలికయు నెక్కువగా నున్నట్లు తోఁచును. కూచిపూడి భాగవతులు దేశదిమ్మరులు కాని మెలట్టూరు భాగవతు లూరువిడిచి తమ నాటకములను ప్రదర్శింపరు. కాని వెంకటరామశాస్త్రి నాటక ములను మెలట్టూరు చుట్టుపట్లనున్న శూలమంగళము, ఊత్తుక్కాడు, శాలియ మంగళము, నల్లూరు, తేవప్పెరుమాళ్ నల్లూరు మొదలగు గ్రామములలోని బ్రాహ్మణ మేళములవారు గూడఁ బ్రదర్శించుటకుఁ బూను కొనిరి. అందు శూలమంగళమువారు తమ ప్రదర్శనలలో కొఱవన్, కొఱత్తి (ఎఱుకఁడు, ఎఱుకత), కరకం (గ్రామదేవత ఘటము ధరించువాఁడు), కుడుహుడుప్పండి (శకునపక్షి), కప్పల్, గంజిన్ (తురకవేషపు హాస్యగాండ్రు) మొదలగు పాత్రలను గొన్ని టిని జనరంజనార్థము సాంప్రదాయికముగా రూపొందించిరి. ఊత్తు క్కాడులో వెం. రా. శాస్త్రి నాటకములకు ముందు రాధాకృష్ణ విలాసము, పార్వతీ పరిణయము, భామకలాపము, గొల్లకలాపము అనునవి యాడుచుండెడివారఁట. నల్లూరు భాగవతుల నాట్యవిద్యకుఁ బ్రమాణ గ్రంథములు అభినయ దర్పణము, భావప్రకాశనము, రస మంజరి అని తెలియవచ్చినది. ఈ నాఁడేఁటి భా. మే. నా. ప్రదర్శనములు సాగుచున్న దొక్క మెలట్టూరులో మాత్రమే.

ఆయా విశేషములనుబట్టి చూచిన దేశదిమ్మరులగు కూచిపూడి భాగవతు లెపుడైనఁ దమ తెలుఁగు ప్రభువులగు నాయక రాజుల

కాలమునన్నైన తంజాపురాది ప్రాంతముల సంచారము గావించిరా యనిపించును ; తెలుఁగు యక్షగానము దక్షిణదేశమునఁ బ్రవేశించి యెట్టివాలకము లెత్తినదో తేటపడును.

ఈ ప్రకరణ రచన కాధారములు :—

1. కూలమంగళము భాగవతోత్తములు శ్రీ యమ్. స్వామినాథ భాగవతార్, బి. ఏ (మదరాసు), శ్రీ ఆర్. కల్యాణ రామయ్యర్, బి. ఏ., (మదరాసు)గారలు దయచేసిన విలువగల విపులమైన భోగట్టా, గ్రంథములు.

2. An article on the Subject by Dr. V. Raghavan–Journal of the Indian Society of Oriental Art– Coomara Swamy Commemoration Volume.

3. "The Music of the Nrtya Natakas Of South India" By Srimati K. Gomati (Thesis Submitted For M. Litt. of the Madras University)

తెలంగాణము

తెలియవచ్చినంతలో తెలంగాణమున యక్షగానమునకు 18 శ. ఉత్తరార్ధమునసే ప్రవేశము గల్గియున్నను దాని కచటఁ బ్రదర్శన ప్రచారము గల్గుట 19 శ. ఉత్తరార్ధము నుండియే. 19 శ., ఉ. భా. నను నీశతాబ్ది యందును నచట యక్షగానములు కుప్పలు తిప్పలుగా వెలసినవి. ఇంచుమించవియన్నియుఁ బ్రదర్శనోద్దిష్టములే యని యందలి పాత్ర ప్రవేశిక ధ్రువలు, తెరద్విపదలు, "వెడలె నరసింహ దేవుఁడు - పెడబొబ్బలిడుచు" అను దరువు "అంగున వుండేవారు (హంగుదారులు) చదువ వలసినది" (తాడిపర్తి లక్ష్మణదాసు ప్రహ్లాద నాటకము లోనిది) - ఇత్యాది రంగప్రయోగ సూచనలును నిరూపించు చున్నవి. 19 శ., ఉ. భా. నాఁటివి మార్గాధునిక రంగస్థల నాటకఫక్కి- నెక్కువగా సాగినవి. ఈ నాఁటికిని యక్షగాన రచన, ప్రదర్శన తెలంగాణమున సజీవముగానిల్చియున్నది.

అయితే అది పీఠి మార్గాళునిక నాటకముల కలగాపులగపు ఫక్కిగా నున్నది. పూర్వము తెలంగాణములో వెలసిన మేళములగుఱించి యంతగాఁ దెలియవచ్చుటలేదు. డాక్టరు నేలటూరి వెంకట రమణయ్యగారొక మేళము గుఱించి యిట్లు తెలిపియున్నారు.[64]

"గోల్కొండ తానీషా మంత్రులైన యక్కన మాదనల* కొలువున నొక భాగవతమేళముండెనని మధుర మంగా పుంశ్చలీ విలాసమునఁ జెప్పఁబడియున్నది. కూచిపూడి భాగవత మేళమును బోలిన యక్కన మాదనలమేళము దేశాటనముజేయుచు నచట నచట నాటకప్రదర్శనముల గావించెడిదనియు నానెగొంది రాచ సగరిలో నాటకము నాడినపుడు మేళగాండ్రలో జూపరి (రూపరి?) యైన స్త్రీ వేషధారి యువకునిగాంచి యా రాజు సోదరి వలచి వానితో సాంగత్యము నెఱపెననియు నందొక యైతిహ్యము గలదు." (గోల్కొండ తానీషా కొలువునఁ గూచిపూడి సిద్ధేంద్ర యోగి మేళము సన్మానింపఁబడినసంగతి గడచిన ప్రకరణమునఁ దెలుపఁ బడినది. అట్టిమేళమున కొకదాని కక్కన మాదనల ప్రాపు గలిగిన దేమో!) అది యక్షగాన మేళమే యైయుండునెడల తెలంగాణమున యక్షగానమునకుఁ జాలకాలముక్రిందటనే ప్రవేశముగల్గి యుండెనని చెప్పనగును. తెలంగాణములో నిటీవల వెలసిన మేళములలో చిరుతల నాట్యమండలి యొకటి కొంతవేర్వడసినది. ఏదోయొక విధముగ నటు మెలట్టూరునందువలె నిటు తెలంగాణమునను దెనుఁగు యక్షగాన మూపిరి నిలుపోపి యుండుటయే విశేషము.

---

46. చూ. వారి వ్యాసము — ఆం. ప. ఖర సం. సం.

* పీఠి 17 వ శ. ఉత్తరార్ధమున నుండినవారు.

యక్షగాన సాంప్రదాయిక పాత్రలు

రూపక ప్రవర్తనకుఁ బ్రాణస్థానము పాత్ర.
పాత్రయనఁగా రసపాకమున కాధారముగదా!

ఇఁక బహుయక్షగాన సామాన్యముగా రూపొందిన సాంప్రదాయిక పాత్రలను గూర్చి కొంచెము చెప్పవలసి యున్నది. ప్రాయికముగాఁ బ్రతిదేశ జానపద రూపకము లందును నెవ్వియో కొన్ని సాంప్రదాయిక పాత్రలుండును. ఇతివృత్త మేదియైనను నా పాత్రలన్ని కథల తోడను బొత్తుకుదురు నట్లుండును. ఆ సాంప్రదాయిక పాత్రల తత్త్వముఁ బరిశీలించినచో, నందుఁ జాలవఱకు హాస్యరస ప్రసక్తి కొఱకు నుద్దేశింపఁ బడినట్లుండును. రుచులలో నుప్పెట్టిదియో రసము లందు హాస్యమట్టిది. అది సర్వజన మనఃపర్వమైనది. విద్వత్పారిషదుల కుద్దేశింపఁబడిన సంస్కృత నాటకములలోనే విదూషకునిపాత్ర గతానుగతికముగఁ గన్పించును. అట్టిదిఱి నారంభించినవి మొదలు తెల్లవారువఱకును జాగరము జేయించు మన జానపద ప్రదర్శనము లందు మధ్యకాలములోఁ బ్రేక్షకులు కుశలప్రసంగముఁ జేసికొనుటకుఁ గొంత విశ్రాంతికాల మవసరము. అందులకే యీపాత్రలు సృష్టింపఁ బడినవి. ఆపాత్రల వినోదప్రసాద మభినవ నాగరికులకు వెగటుగఁ దోఁపవచ్చును. కాని మనయక్షగానముల విషయమెత్తుకొనినచో నయ్యవి యీనాఁడు మనకెంత మోటుగఁ గన్పించినను నొకనాఁడు కోటలోని రాజులకును బేటలోని ప్రజలకును సమానమైన కాలక్షేపముగఁబరిఢవిల్లినవి. గ్రంథరచనఁ గావించిన వారియందు గ్రామకరణములే కాక పండితే గ్రామణులును రాజకవులును గూడనుండిరి. మఱియొక మాట. ఆ ప్రదర్శనముల ప్రేక్షక సమూహమం దెక్కువ

పాలు ప్రజాసామాన్యము. వారికిఁ గావలసినది విజ్ఞానమే యైనను వారధికముగ నాకాంక్షించునది వినోదమే. తరములు గడచినను వారి వినోద కాంక్షయందును, గడమ యభిరుచుల యందును, అసలు వారి జీవిత ప్రవృత్తులందే వైజ్ఞానికమైన పరిణామ మొకపట్టున రాదు. నాగరికులవలె వారు 'గతి రసికులు' గారు ('జానపదులకంటె నాగరులు వివేకులు' గదా!). కాఁబట్టియే తరములు గడచినను వారి యభిరుచులం దేదియో సమీచీనమైన సమానత్వము గోచరించును. వారి యూహాపోహములును నాశయములు నాదర్శములును సమయబద్ధములు. అందువలననే వారభిలషించు ప్రదర్శనములలోఁ గొన్ని పాత్రలలో గూడ సాంప్రదాయికత్వము పాదుకొన్నది. ఆ పాత్రలు ప్రజాదరమును జూరఁగొని ప్రచారమునకు వచ్చినవి. అప్పటి రూపకకర్త లది గ్రహించి, సంప్రదాయవిధేయులై తా మేకథ నారంభించినను నాపాత్రల కెటులనో ప్రసక్తిఁగల్పించుచు వచ్చిరి. తోలు బొమ్మల యాటలో బంగారక్క, జుట్టు పోలిగాఁడు, గంధోళిగాఁడు, చోడిగాఁడు, అల్లాటప్పయ్య మొదలగు వారు మొదట నిట్లు బయలు దేరినవారే. అటులనే యక్షగానము లందును దద్రూపాంతరములైన కలాపములు, కొరవంజులు మొదలగువాని యందును గొన్ని పాత్రలు హాస్యరస ప్రసిద్ధములై సాంప్రదాయికముగ రూపొందినవి. ఆపాత్రల హాస్యప్రవృత్తియందు సామాన్య జీవిత స్పర్శ యుండును. తత్పాత్రోచితమగు నాటి వ్యావహారికపు నుడికారము వాటము గూడఁ దెలియును. ఒక్కొక్క పాత్రను మెతుకు పట్టి చూతము :

1. మాధవి :- ఈతని పాత్ర కూచిపూడి కులపతుల యపూర్వ సృష్టి. ఈతఁడు పాత్ర యనిచోఁ బాత్రకాఁడు. కాఁడనిచోఁ బ్రతి

భామాకలాపమందును విధిగా ప్రత్యక్షమగును. గొల్లకలాపములలోఁ గ్వాచిత్కముగఁగన్పించును. కాని సత్యా కృష్ణ సంబంధులగు పారిజాతాది కథాసందర్భము లితివృత్తముగాఁగల చాల యక్షగానములలోఁ గూడఁ దఱుచుగనే కన్పించును. మాధవి సూత్రధారునివలెఁ గథాను సంధానము సేయును. విదూషకునివలె హాస్య ప్రసంగములు వినిపించును. పాత్రలను ప్రేక్షకులకుఁ బరిచయము చేయును. స్వయముగాఁ బలుకరించును. ఈతఁడచ్చుమచ్చు సింహళదేశపు నృత్య రూపకము "కోలం నాటిమా" లోని "తోరాతరు కథాకారయ"[47] వంటి వాఁడు. బర్మాదేశపు వీథినాటకము "నిభట్‌కిన్" లోని "లూ-బయట్"[48] వంటి వాఁడు. యథార్థమున కితఁడు కథాగత పాత్ర కాఁడు. అట్లని కేవలము వెనుకనుండి హంగుచేయు నక్కాబత్తుఁడును గాఁడు. కథకుఁ గలిసివచ్చు పాత్ర. నాయికా నాయకు లిద్దఱికిని శృంగార సహాయకుఁడుగ వ్యవహరించును. వారిద్దఱికి మధ్య దౌత్యము గూడ నడపును. వారిని వెటకారముసేయుటకు "లైసెన్సు" ను గూడ సంపాదించిన వాఁడు. చెంగల్వరాయ పారిజాతాది యక్షగాన కృతులలో వారి ప్రసంగాలకు "పేరడీ" లు గూడఁ జేసినాఁడు. మాధవి వేషము వేయువాఁడు మగవాఁడే. ఆప్రదర్శక ముఖ్యుఁడెవఁడో వేయును. ఆవేషమున కొక నిర్దిష్టమైన యూహార్యక మేమియు లేదు. పైమీఁదఁ గండువా యుండినఁ జాలును. మామూలు పంచెకట్టు తోడఁ బ్రదర్శనలోనికి దిగిపోవచ్చును. నాయకునిఁ బలుకరించినపుడు మగధీరుని వలెనే కండువాను సవరించును. నాయికను బల్కరించు

47. Vide., Dr. Manmohan Ghosh's Paper On the Sinhalese Dances, Published in 'The Indo Asian Culture, Vol. I – NO. 2.

48. Vide., 'Burmese Drama' By Dr. Maung Htin Aung.

సరికి ఆ కండువానే పమిటగ సవరించి సిగ్గుపడుచున్నట్లు బుగ్గమీఁద వ్రేలును, నడుముప్రక్కఁ గేలును బెట్టుకొని నడకయందును మాటలోఁ గూడ 'ఆడారి' వాటము దెచ్చిపెట్టుకొనును. ఒయ్యార మొలుకఁ బోయును. అతఁడక్కలలో అక్క, భావలలో భావ. మాధవికే మాధవుఁడని కూడఁ బర్యాయ వ్యవహారమున్నది. మాధవ మాధవీ నామధేయములు కృష్ణునికి నాతని సతులకును మాత్రమే వర్తించును. కాని యీ భామాకలాపపు 'సీసరు బుడ్డికిఁ' గూడ నాపేళ్ళనే పెట్టిరనిన నేదియో విశేషముండవలెను. అప్పుడప్పుడుఁ గలాపములో నాయికా నాయకులకుఁ బరస్పరముగాని, మఱెవరితో నైనఁగాని మాటలాడుట కవకాశము గాని యౌచిత్యముగాని లేని సందర్భము లుండును. కాని, పాత్రలు తమ మనస్స్వరూపమును ప్రేక్షకుల యెదుటఁ బెట్టవలెను. అందులకు "స్వగతము" నాశ్రయింపవలెను. అసలే కలాప మాత్మాశ్రయఫక్కిక మయిన రూపకము. అందునను నీ స్వగతము లుండినచోఁ ప్రేక్షకులకు విసువు పొచ్చవచ్చును. అదియుఁ గాక కొందఱు స్వగతము లసహజమైన వంచురు గదా. బహుశః ఆ స్వగతములఁ బరిహరించుటకే మాధవి పాత్ర ప్రకల్పితమైనదని యూహింప వచ్చును. ఎందువలన నన్నచో నొక మాధవుఁ డింకొక మాధవుని తోడను నొక మాధవి యింకొక మాధవితోడను మాటాడుట యనునది చాల విచిత్రముగనే కన్పించును. కాని, యట్లు మాటాడి రనినఁ బాత్రలు తమలోఁ దాము మాటాడి కొనినటులనే లెక్కయగును. కలాప ధర్మమునకుఁ గలిసివచ్చును. దాని యాత్మాశ్రయపు ఫక్కికి లోపముండదు. విసుగుఁ బుట్టింపక నాటకము చక్కగ నడచి పోవును. అందులకే కలాపములో మాధవి కథాగతమైన పాత్ర కాక పోయినను గథకుఁ గలిసివచ్చు పాత్ర యనుట.

2. సుంకరికొండడు :— గొల్లకలాపములలోఁ జూడవలెను వీని వాలకము. అన్నింటిలో వాని పేరు కొండడే. వీఁడు గుజరాతీ 'భావై'లో "రంగాళో"[49] వంటి వాఁడు. లాలా కన్నయ యను నాయన రచించిన "సుంకరి కొండని వేషము కథ" యను యక్షగాన నాటకములో వాని వాలక మిట్లు వర్ణింపఁ బడినది.

గడితపు చల్వ చల్లడము పైనబిగించి
తగ రాణ మెఱయఁగా దట్టి జుట్టి
పిక్కటి బిరుదుగా బిగియు చుంగురు గుంటి
చొక్కాయ పిక్కల నటఁ దొడగి
జరికుసుంబారంగు శాలు పాగామీఁద
రవగల్కు కల్కి తురాయిఁ జెక్కి
గుభ గుభాళించు సౌరభము గుల్కెడి మేన
కమ్మి దుప్పటివేటుగా నమర్చి
కత్తి ఝుళిపించి వర కరాగ్రమున నుంచి
వాడి కొనగోళ్ల మీసంబు దీడి దీడి
దుండగీడొచ్చు సుంకరి కొండ డదుగో
వచ్చెఁగాఁబోలు వినవమ్మ వారిజాక్షి.

వాని రాక పోకలు చెడ విసుగుగా నుండును. ఏలపాట బాడు కొనుచు హేలగ నచ్చును. నచ్చి చల్లనమ్మ్మ గొల్లభామను సుంకము గాని తత్పరిహారయముగఁ జుంబనము గాని యిమ్మనును.

ఆమె తప్పించుకొనుటకుఁ బ్రయత్నించును. ఇక నిర్దక్షిణికిని వాగ్వివాదము. ఆ వాదము చాలసరదాగా నుండును. కానిమోటుగ నుండును. గొల్లభామ తన గయ్యాళియత్తగారినిఁ బిలచెదను జూచు

49. Vide., Sir R. K. Yajnik's the Theatre of the People.

కొమ్మని బెదరించును. అబ్బోవాఁడసాధ్యుఁడు—"గుత్త లోఁగడను మీ యత్తమా" కనును. చివరకుఁ జేయిముట్టు సరసమునకుఁ గూడ దిగును. కొన్ని గొల్లకలాపములలో నా యత్తగారు రంగము మీఁదికి వచ్చి సుంకరిని గద్దించి కోడలు పిల్లను దీసికొని పోవును. ఇన్ని డాబులు కొట్టిన సుంకరియు నామె రాగాఁనే ఉడాయించును. కొన్నిటి యందత్త రాకుండఁగనే సుంకరియే గొల్లభామను సరసముగనో బలాత్కారముగనో లాగుకొని పోవును. గొల్లభామలు గూడ నత్తచాటున వెచ్చించుకొనుటకు సుంకపు డబ్బులు కలిసి వచ్చునని యో, నిజముగ గుతూహలము పుట్టియో సుంకరి సరసమునకు నామోదించుటయుఁ గలదు. దీనినిఁ బట్టి నాఁటి సుంకరి గొల్లభామల యల్లరి చిల్లర ప్రవర్తన విశదమగును. గొల్ల కలాపమున కంతరార్థము మఱియొకటి గలదు. సుంకరి కృష్ణునిపాత్రకొక సంకేతము. గొల్లభామ గొల్లభామయే. అందువలన గొల్లకలాపము గోపికా కృష్ణుల ప్రణయతత్త్వప్రతిపాదకమగుచున్నది. ఈయూహ కుపబలకముగా శ్రీనివాసదాసు రచించిన రంగపురి పారిజాతమను నొక యముద్రిత యక్షగానమందును లాలా కన్నయ గ్రంథమందును శ్రీకృష్ణుఁడే సుంకరివేషము ధరించినట్లు స్పష్టముగఁ గలదు.

౩. కటికము :— కటిక, కట్టియము, కటికీడు, కోలకేతఁడు, కేతినాయుఁడు, ఆస్థాన సంతోషి, సంతోషుఁడు, బాగుదారు, చోపుదారు, బరాబరి యని వీనికిఁ జాలఁబేళ్ళున్నవి. యక్షగానములందు రాజప్రసక్తివచ్చు కథలెక్కువ. కటికము రాజోద్యోగి. రాజకథాప్రసక్తిగల యక్షగానములందెల్ల వీని యవతారము విధిగానుండును. రాజనినఁ గేవలము రాజే కానక్కఱలేదు. ఇంద్రుఁడును, శివుఁడును మొదలైన వారుగూడఁ గావచ్చును. రాజపాత్రకుఁ బ్రసక్తిలేని యక్షగానములలోఁ గూడ నక్కడక్కడ వీనియవతారము కన్పించును.

వాని వేళ్ళను బట్టి వాని పనులు విశదమగును. వాడు రాజుగారి వాకిలి కావలివాడు – వేత్రహస్తుడు. రాజుగారిరాకను సభవారికిఁ దెలియఁ జేయును. రాజుగారిముందు నడచుచుఁ ద్రోవకడ్డును దొలగించును. రాజుగారువచ్చి గద్దె నెక్కఁగనే కైవారములు, హెచ్చరికలును బరాకులును బల్కును. వీని వేళ్ళన్నిటిలో నెక్కువ యాకర్షించునది "ఆస్థాన సంతోషి" ('కోర్టుఫూల్') యనునది. కేవలము సంతోషుడను వేరును "బఫూన్" అను మాటకు సమానార్థకముగ గ్రహింపవచ్చును. దక్షిణాంధ్ర యక్షగానములలో వీనిపాత్ర బాగుగ రూపుగట్టినది. తరువాతఁ దరువాత నుత్తరాంధ్ర కృతులలోఁ గూడ వీని యునికి తఱుచుగనే కన్పించును. అసలు వాడు తంజావూరు నాయకరాజుల, మహారాష్ట్ర భూపతుల కొలువులలోఁ జాలఁ ప్రాముఖ్యము వహించిన "రాచ వైనాతీ". వానిదొక వెట్టిగొల్లని వాలకము. ఆరాజులు హాస్య చతురాస్యులు. వానికి మిక్కిలి చనవునిచ్చిరి. వాడు తన సహజవికృతాకార చేష్టాభాషణాదుల వలనఁ గొంత నత్తియో చెవుడో నటించి కొంత హాస్యమును ప్రబర్శించెడివాడు. ఆ తంజావూరి రాజకవులుఁ దదాస్థానాశ్రితులైన తక్కినకవులును దమ యక్షగాన కృతులలోఁ గటికముపాత్రను ముచ్చటగీరఁ జిత్రించు కొనినారు. శరభోజీ యక్షగానములలో వీనిపాత్ర యింకను విశిష్టముగాఁ జిత్రింపబడ్డది. అంత శివ సంబంధులగు కృతులలోఁ గుండోదర, కుంభోదర, చండికేశ్వరాది ప్రమథ శ్రేష్ఠులను మామూలు కటికోండ్రవలెనే వ్యవహరించిరి. కటికమునకు వికటాంగుఁడనుపేరుగూడఁ బెట్టినాఁడు శరభోజీ. వానివాలకము:-

దరువు. పక్కెట నామమూను బెట్టి, బారికోల కేలపట్టి
దట్టిపైని దుప్పటి గట్టిగాఁ గట్టి
జుట్టునిండా పూలుసుట్టి మిట్టాపండ్ల నెగఁబెట్టి
యట్టా హాసముతో వికటాంగుఁడు వచ్చెన్.

చాల గ్రంథములందుఁ గటికము రాకతోఁ గథారంభ మగును. వాఁడు భాగవతులతో హాస్య ప్రసంగము లాడుటయుఁ గొన్ని గ్రంథములలోఁ గలదు. గ్రంథములో వాని హాస్యమున కెక్కువ యవకాశమిచ్చు పట్టు రాజదర్శనార్థుల రాక. వచ్చినవారినెల్ల నెక సక్కెము చేయుట వానిపని.

4. సింగి, సింగఁడు :- చెంచులు, నెఱుకలు, కొరవలు వను గొండజాతులకుఁ జెందిన దంపతులు వీరు. తాము చెంచు హోబని, అనఁగా గరుడాద్రి నారసింహుని వారసులమని వారి విశ్వాసము. అందులకనియే యీపేర్లు. సింగనివృత్తి వేఁట, సింగికి సోదె + వృత్తి. సింగఁడడవి కోనలఁ దిరిగి వేళ్ళు వెల్లంకుల సంపాదనము గూడఁ జేయును. సింగి దేశదిమ్మరియై సోదెతోఁ బాటుగ నా వేళ్ళను వెల్లంకు లను నమ్మును. వారి వేషభాషలందును గులాచారము లందును సగ మాటవికత్వమును సగము దేశదిమ్మరితనమును గన్పించును. చెంగల్వరాయ పారిజాత మను యక్షగానములోని యెఱుకల కథ వలన సింగి పచ్చలు గూడఁ బొడువఁగలదనియు, శకునములు సాముద్రి కము గూడఁ జెప్పఁగలదనియుఁ దెలియుచున్నది. సన్నిధిరాజు జగ్గ కవి జ్ఞాన - యెఱుకల కురవంజి మొదలయిన గ్రంథములలోఁ గూచిపూడి గొల్లకలాపములో గొల్లభామవలె వేదాంతోపన్యాస ములు గూడఁ జేయును. సింగనికిఁ జోడిగాఁడనియుఁ బేరు. ఆ పదము ప్రియుఁడను నర్థమునఁ గోవెల రామశాసు ప్రణయ కలహాకలాపము, కూర్మనాథకవి మృత్యుంజయ విలాసము మున్నగు యక్షగానములలో వాడఁబడినది. వాని సక్రమస్వరూపము "కోడెగాఁడ" యి యుండు

+ దీనికే ఎఱుక, గద్దె (గద్య – రాగవరుసలో సాగదీసిన వచనమే), కురి (ఆరవము – తెలుగు గురి!) అనియు నామాంతరములు.

నని యూహ. సింగికి ఎఱుక, కొరవజాతుల స్త్రీయను నర్థములో నెఱుకత, కొరవంజియనియుఁ గూడఁ బేళ్ళున్నవి. మొదటగా ఆమూఁడును సమానార్థములుగ గిరిరాజ కవిరాజ మోహన కొరవంజి యంచు వాడఁబడినవి. చాల యక్షగానములలో సింగి, సింగని ప్రసంగము వచ్చును. కాని సింగిపాత్రకున్న ప్రసిద్ధి సింగనికి లేదు. ఆమె పాత్రకుఁ బ్రాధాన్యముగల కొన్ని గ్రంథముల కామె పేరే పెట్టఁబడినది. అవియే కొరవంజులు.

యక్షగానములకుఁ గొరవంజులకు పేరులోనేకాని ప్రక్రియలో భేదములేదు. (ఈవిషయమంతయుఁ బూర్వోక్తము). కొరవంజులలో నెఱుకత పాత్ర తప్పక యుండును. యక్షగానములలో యాదృచ్ఛికము. అంతియే. కొరవంజులలో నేమి యక్షగానములలోనేమి సర్వ సాధారణముగ నెఱుకతపాత్ర ప్రవేశించు సందర్భము కథా నాయిక తాను వలచినవానినిఁ గూర్చిన తలపోఁతలో నుండును. ఆతనిపొందు కుదురునా కుదురదా యని యనుమానపడుచుండును. అప్పుడువచ్చు నెఱుకత; వచ్చి తమ కులాచారము లుగ్గడించి, తన దేశాటన విశేషములు వివరించి, యెఱుక దేవతల పేరు లేకరువుపెట్టి సోదె మొఱలిడును. ఆద్దైవముల పరంపరలో నెవరిపేరు తప్పినను దప్పవచ్చుఁగాని కొల్లాపురి లక్ష్మిపేరు తప్పదు. ఆమె వారి కుల దేవత. "కొల్లాపురమ్మను గొలుతుము మేము, ఎల్లవారికి నది యిలువేలుపమ్మ" యని యెఱుకత యనును. ఆమె సోదె యంతమగు సరికి సింగఁడామెను వెదకికొనుచు వచ్చును. వాఁడామెసోదె చెప్పి సంపాదించిన సొమ్ములు నవియుఁ జూచి మఱియెక్కడెవఁడో యిచ్చి యుండునని యనుమాన పడును. ఆమె సమాధానముఁ జెప్పికొన వలసి వచ్చును. అక్కడ వారి సంవాదము. ఆ ఘట్టమంతయు హాస్య రసోత్తరముగ నడచును. కొన్ని కొన్ని గ్రంథములలో లక్ష్మి

నారాయణాది దేవతలుగూడ సింగి, సింగని నేపథ్యమును స్వీకరించి నట్లు దెలియుచున్నది. ఉదాహరణమునకుఁ దరిగొండ వెంకమాంబ - శివ విలాస యక్షగానము మొదలయినవి.

5. మంత్రసాని :- శ్రీ కృష్ణ, ప్రహ్లాద, మార్కండేయ, ధర్మాంగదాది బాలపాత్రల జననాదికమునకుఁ బ్రాధాన్యము గల గాథలను గ్రహించిన యక్షగాన గ్రంథకర్తలు కొంతమంత్రసాని పాత్రను బాగుగఁ జిత్రించినారు. ఒక్కయుదాహరణ: - పాలుట్ల లక్ష్మణకవి ధర్మాంగద నాటకములో దాసీ జనము రాణిగారికిఁ బ్రసవసమయమైనదని మంత్రసానిని రమ్మనుమను. దాని కెక్కడలేని బెట్టుసరియు నప్పుడే వచ్చిపడును. దాని సమయమప్పుడే గదా! "అమా వాస్య నాఁడు అట్లు పెడితిరే! పున్నమనాఁడు బూరెలు పెడితిరే!" అని యిచ్చెత్తిపోవుమట కారంభించును.

6. ఇతరములు:- ఇంక నంతంతమాత్రము తళుకుగ వచ్చు నప్రధాన హాస్య పాత్రలు కొన్నియున్నవి. పురోహితులు, ముత్తైదువలు మొదలగువారు. వారిప్రసంగములు రంగాజమ్మ మన్నారుదాసవిలాసాదులలోఁగమ్మగ వర్ణింపఁబడినవి. కొన్ని యక్షగానములలో హాస్యగాఁడని ప్రత్యేకముగ నొకపాత్ర కల్పించును. వాఁడు మూధవి, కటికెముల వలె వ్యవహరించును. తంజావూరి యక్షగానములలో విఘ్నేశ్వరుని స్తుతిమాత్రమే కాక విఘ్నేశ్వరుఁ డొకపాత్రగ, నాతని రాకగూడ సంప్రదాయ నిబద్ధముగ ముచ్చటింప బడినది. ఉత్తరాంధ్ర యక్షగాన కృతులలోఁ గొన్నిటియందు గంధర్వస్త్రీల రాకయని గ్రంథారంభము ననే కథకు సందర్భశుద్ధి లేకపోయినను రంభోర్వశ్యాదుల రాకలును వారి గానాభినయముల ప్రసక్తియుఁ జెప్పఁబడుటకలదు. సత్యభామా రుక్మిణులు, గంగాగౌరులు, జెంచులక్ష్మి – ఆదిలక్ష్ములును, మోహినీ సంధ్యావళులు మొదలగు నాయికల జంటలువచ్చు యక్షగానములలో

సవతికయ్య మొకటి గతాను గతికముగ వచ్చుచున్న జనరంజకమగు విషయమైనది. భావుకలాపములలో దాని కొక ప్రత్యేకత గలదు.

తంజావూరు సరస్వతీ మహలు నందముద్రిత గ్రంథసంచయములో 'నాటకపాత్రలు' అను నొక గ్రంథమున్నది. అందు నాఁడు ప్రదర్శనమున కెక్కిన రామాపండితాదుల నాటకము లిరువది మూడింటిలో వచ్చు వివిధపాత్రల, తత్పాత్రధారుల పేళ్ళు మాత్రము పట్టికలుగ నుదాహరింపబడినవి. అందు భిన్న భిన్నేతివృత్తములుగల గ్రంథములలో సామాన్యముగఁ గన్పించు పాత్రలు కొన్నియున్నవి. అవి విఘ్నేశ్వరుఁడు, ప్రమథ గణములు, మణియము, కురుక్కుళ్ళు, పరిచారకుఁడు, బిక్కాజినాయుఁడు, మహాబ్రాహ్మలు, సుయిణి, బురద వేషము, కైకాదినీవేషము, జోసి మొదలయినవి. పై పాత్రలలోఁ గొన్నింటి స్వరూప మీనాఁడు మనయూహా కందదు. మనకు దొరకిన యానాఁటి యక్షగానములలోనైనఁ గన్పించునాయనిన మచ్చున కైనను గన్పింపవు. అందు మొదటి నాలుగైదు పాత్రలు నాటక పూర్వరంగ ప్రవర్తన కుపయోగపడునవి. అందు మణియము, కురుక్కుళ్ళు నరనపదములు. మణియ మనిన మఠ దేవాయతనాద్యధికారి; కురుక్కుళనినఁ బూజారి లేక పురోహితుఁడు నని యర్థము. వారిద్దఱు నాయిరువది మూఁడు నాటకములలోఁ గన్పింతురు. బిక్కాజి నాయకుఁడు తొమ్మిది నాటకములలోఁ గన్పించును. బిక్కాజి శబ్దమున కర్థము తేలలేదు గాని కటికమునంటి పాత్ర యయియుండునేమో యని తోఁచును.[50]

---

50. బికనీరు రాజ్యస్థాపకుని పేరు "బి కా జి" యనియు, నతని జీవిత గాథ రాజస్థాన నృత్యరూపకమగు "భా వై" యితి వృత్తములలో నొకటి యనియుఁ దెలియుచున్నది. — Vide, Sangeet Natak Akadami Bulletin (Of the Govt. Of India) No. 2. Oct, 1954.

యక్షగానములు ప్రధానముగఁ బ్రజా సామాన్యపు వినోద మున కుద్దిష్టమైనవి. అందుచే వానిలోని సాంప్రదాయిక పాత్రలు గూడ హాస్య రసాశ్రయములుగ నుండును. ఒక్కొక్కప్పుడా పాత్రలు చేయు పరిహాస మెట్టి పాత్రల పాత్రతాపాత్రతలను గూడ లెక్కిం పదు. అది శోచనీయమైన విషయమే. అంతమాత్రముచే మనమా కావ్యరాశి నంతను నిరసింపఁ గూడదు. అందునను సాహిత్య జిజ్ఞా సువులు దెలిసికొనఁ దగిన విశేషము లా సాంప్రదాయిక పాత్రల ద్వారమునసే వెలువడునవి యనేక మున్నవి.

ఇట్లు వివిధ ప్రదేశములలో వెలసిన యక్షగానము లందిన్ని పాత్రలు సాంప్రదాయికముగా రూపొందిన పదఁగా యక్షగాన ప్రయోగమునకెంత ప్రచార ముండెడిదో, అదియెంత జనరంజక మై యుండెడిదో చెప్పఁ జెల్లము కాఁగలదు.

సింహావలోకనము

యక్షగాన పరిణామ చరిత్ర ప్రకరణమున కుపోద్ఘాతముగా యక్షగానోత్పత్తి పరిణామ స్వరూపమునుగూర్చి సింహావ లోకనము నేయుట యైనది. ఇపుడీ ప్రకరణమున యక్షగానములందలి తరగతులు, యక్షగాన లక్షణ వైశిష్ట్యములను గూర్చిన సింహావలోకనము చేయఁబడు చున్నది.

యక్షగానము తరగతులు

యక్షగానములను వాని ప్రయోజన ప్రాధాన్యమును బట్టి త్రిధా విభజింపవచ్చును. :-

1. శ్రవ్యములు. 2. దృశ్యములు. 3. ఉభయప్రయోజనాత్మకములు.

శ్రవ్యములుమఱల ద్వివిధము :-

1. ప్రబంధములవలెఁ గేవల పఠనమునకు మాత్రము పనికి వచ్చునట్టివి. ఉదా :- లక్ష్మీనారాయణ విలాసము, కన్యకా విజయము, అన్నదానము వెంకటాంబ యక్షగాన రామాయణము, నిశ్చింత ఎంబారయ్య ప్రహ్లాద విజయము మొదలగునవి.

2. హరికథలవలె జంగం కథలవలె, లేక పురాణ గోష్ఠికిఁ దగినట్లు కథాఖ్యానమునకుఁ బనికివచ్చు నట్టివి. ఉదా :- బాగేపల్లి అనంతరామాచార్యులు, ధనకుధరం రామానుజాచార్యులు, నెడా దూరు వెంకటాచార్యులు మొ... వారి కృతులు.

దృశ్యములను గూడ 1. వీధి నాటకము, 2. బొమ్మలాట, 3. మార్గ నాటకము, 4. ఆధునిక నాటకముల ఫక్కి-కలనుబట్టి చతుర్థా విభాగింప నగును. వరుసగా నొక్కొక్కదానికి ఉదా :- 1. తంజావూరు విజయ రాఘవాస్థాన కవుల కృతులు మొ॥. 2. కోట

వెంకటప్పయ బాణాసుర నాటకము మొ॥. 3. తుక్కోజీ, శివాజీ ప్రభృతుల కృతులు. కూచిపూడివారి కలాపము, మెలట్టూరు భాగవతమేళ నాటకములు నృత్య ప్రధానములగుట వాని యందుప రూపక ధర్మమును గర్భితమై యున్నదనవచ్చును. తంజాపురాన్న దాన నాటకాదులు కొద్ది దశరూపక ప్రభేదమగు ప్రహసన తత్త్వమును గొంత కలిగియున్నవి. 4. కేశిరాజు వెంకట సుబ్బయ గారి రామదాసు నాటకము మొ॥. ఇవికాక వీధి, మార్గ, ఆధునిక రంగస్థల నాటకముల పోకడలు మూఁడునుగల కలగలుపు ప్రక్రియ గలవియుఁ గొన్నిగలవు. ఉదా :- పట్లోరి వీరప్ప క్రోధాపురిరైతు విజయము.

ఇఁక ఉభయ ప్రయోజనాత్మకముల కనఁగాఁ బాడుటకు నాడుటకు నుద్దేశింపఁ బడిన వానికి, ఉదా :- శ్రీనివాస కవి పారిజాతము, భారతి రామరాజు గొల్లకలాపము, గోగులపాటి మృత్యుంజయ విలాసము మొదలగునవి.

ఇఁక యక్షగానమును వివిధ ప్రక్రియాంతరములతో దానికిఁ గల యాంతరంగికానుబంధముల యంతరువులనుబట్టి కొన్ని తరగతులుగా విభజింప వచ్చును.

1. వీధినాటకము, 2. బొమ్మలాట, 3. మార్గనాటకము, 4. ఆధునిక రంగస్థల నాటకము....

ఈనాల్గిటితోఁగల యనుబంధమునుబట్టి యేర్పడు తరగతులు మీఁద సోదాహరణముగాఁ జూపఁ బడినవి. మిగిలినవి :-

5. కలాపముతో - ఉదా :- పారిజాతములు, పురిజాల లక్ష్మీనారాయణకవి పారిజాతము, శేషము రంగాచార్యుల శివకేశవ పారిజాతము మొ॥.

6. ప్రబంధముతో – ఉదా :- మృత్యుంజయ విలాసము మొ॥.

7. ఉలాప్రబంధముతో – ఉదా :- రఘునాథాభ్యుదయము మొ॥.

8. కొరవంజితో – ఉదా :- రాజమోహన కొరవంజి మొ॥.

9. ఏకాంతసేవతో – ఉదా :- మా. వెంకటా చలమయ్య ఏకాంతసేవ మొ॥.

10. పల్లకి సేవా ప్రబంధముతో – ఉదా :- శహాజీ శంకర విష్ణు పల్లకిసేవా ప్రబంధములు.

11. హరికథతో – ఉదా :- బాగేపల్లి అనంత రామాచార్యులు, ఆదిభట్ల నారాయణ దాసాదుల కృతులు మొ॥.

12. జంగం కథతో – ఉదా :- ధనకుధరం రామానుజాచార్యుల బిల్హణీయము.

ఇంక నితివృత్త వైవిధ్యమునుబట్టి యేర్పఱింపఁ దగిన తరగతులు కొన్నిగలవు.

1. (అ) పౌరాణికములు :- రామాయణ భారత భాగవతాదుల నుండి గృహీతములైన కథలు గలవి. ఉదా :- (రామాయణ) సుగ్రీవవిజయము; (భారత) దుష్యంత చరిత్రము, సౌభరి చరితము (భాగవతము – విష్ణుపురాణము) మొ॥.

(ఆ) స్థలపురాణములు లేక క్షేత్రమాహాత్మ్యములు :- ఉదా :- చిత్రకూట (చిదంబర) మాహాత్మ్యము, గరుడాచల నీలాచల విలాసములు, భావనారాయణ (పొన్నూరు) విలాసము మొ॥.

2. (అ) చారిత్రకములు :- ఉదా :- కాకతి రుద్రాంబకథ. (ఉయ్యూరు శ్రీరాజా వేంకటాద్రప్పారావు బహద్దరువారిది). రఘునాథాభ్యుదయము (తంజావూరు విజయరాఘవనాయకకృతము) పెదబొబ్బిలి చరిత్ర (చెర్వీరాల భాగయ కృతము) మొ॥.

(వెనుకటి పూచల్లేవి నాటక మిట్టిదే).

(ఆ) మహాపురుషుల చరిత్రలు :— ఉదా :— విప్రనారాయణ (తొండరడిప్పొడి) తిరుమంగై యాళ్వారుల చరిత్రలు, అక్కమహాదేవి, అండాళు చరిత్రలు, బసవేశ్వర భద్రాచలరామదాస పుండరీక పోతులూరి వీరబ్రహ్మస్వామి శివరామయోగి కొల్లాపురి మల్లనల చరిత్రలు, ఏసునాథ కథామృతము మొ॥.

౩. తాత్కాలికేతి వృత్తములు :— ఉదా :—విజయరాఘవ కల్యాణ చంద్రికా విహారములు, మన్నారు దాసవిలాసము, శాహరాజ కల్యాణ విలాసాదులు — ఇవి యన్నియు తంజాపూరికిఁ జెందినవి. ఇవి మన నాఁటికి చారిత్రకము లనిపింపనచ్చును, గాని యీ కృతుల రచనా కాలమునాఁటి కా యితివృత్తములా కవులకు సమకాలికములే.

(నెనుకటి రాజ కళింగగంగు నాటకము, వీర నరసింహ రాయల కడ కూచిపూడి భాగవతులు ప్రదర్శించిన సంబెట గురనరాజు నాటకము తాత్కాలికేతి వృత్తాలే.)

4. సాంఘికేతి వృత్తములు:— ఉదా:— తంజాపురాన్న దాన నాటకము (నాఁడు తంజావూరి సత్రములో "తడియా" వేయుచుండెడి సోమరిపోతు తిండిపోతు బాపనయ్యలు కొందఱు సత్రముకడ తెత్తెక్కలాడి డబ్బులు దండుకొన వచ్చిన నట్టువరాండ్రతో విరస ప్రసంగము లాడుట యిందలి ప్రధానేతి వృత్తము, అట్టివారినిఁ బరిహాసించుటయే దీని పరమార్థము గావునఁ బరమార్థమున దీనిని సాంఘికేతివృత్త మనవచ్చును.) క్రోధాపురి రైతువిజయము మొదలగునవి నిస్సందేహముగా సాంఘికేతివృత్తములు.

౫. జానపదగాథలు :— జన పదములఁ బదరూపమునఁ బ్రచార మున నున్న కథ లితివృత్తములైన యక్షగానములును గలవు. ఇట్టివి

తెలంగాణము వానిలో నెక్కువ. ఉదా :- చెర్వురాల భాగయగారి ఆరెమరాటీలచరిత్ర, బొలనాగమ్మచరిత్ర, కాంభోజరాజు చరిత్ర మొ॥.

6. కల్యాణకథలు :- కన్నడ యక్షగానములందు " కళగవు " ల (కలహము?) (యుద్ధములు - యుద్ధ కథలు) వలె మన య. గా. లందు కల్యాణ కథలెక్కువ. ఉదా :- శహాజీ, ద్రౌపదీ, శాంతా, సీతా కల్యాణాదులు.

7. తత్త్వ విషయికములు :- ఉదా : ముక్తికాంతా పరిణయము, వివేక విజయము, రాజరంజన విద్యా విలాసము మొ॥ సర్వ సాధారణముగ నిట్టివానిలోఁ బ్రబోధ చంద్రోదయమునందువలె నొక సాంకేతిక వివేచన యుండును. ఇట్టివి ప్రదర్శనము లందెట్లు రక్తికట్టునోమఱి!

8. ఇతరములు :- ఇంకను విలాసము - చరిత్ర - విజయము - అను పేళ్ళతో వ్యవహరింపఁబడు రకములు కొన్నిగలవు. తెలంగాణా య. గా. లలోఁ జిత్ర విచిత్రములైన యితివృత్తములు గలవికొన్ని యున్నవి. ఉదా :- కనకతార, కాంతామతి, భద్రసేన విలాసము, అల్లీరాణి చరిత్రము, కృష్ణగారడి, మాయాసుభద్ర, మాధవ చరితము మొ॥ (చూ. చెర్వురాల భాగయ కృతులు). ఇందుఁ గొన్నిటికథలు " కాశీ మజిలీకథ "కిఁ జెందునట్టివి. కొన్ని పురాణ గాథా పరివర్తనములు, కొన్ని కవిస్వకపోలకల్పితములు. రస ప్రాధాన్యము, రచనాంగ ప్రాధాన్యము మొదలగు విషయములను బట్టియుఁ గొన్ని రకముల వింగడింపు చేయవచ్చును. (మన య. గా. లందు శృంగార హాస్యములకుఁ బ్రాముఖ్య మధికము). కాని యక్ష గాన ప్రక్రియా తత్త్వము యొక్క వైవిధ్యమును జూపుటకుఁ బై వింగడింపు చాలును.

యక్షగాన లక్షణము

ఉపరి నిరూపితమైన రీతిగా నితివృత్త విషయమున, రచనా ప్రక్రియలో, ప్రయోజనములో బహుముఖమైన నైవిధ్యమును బ్రదర్శించిన యక్షగానము లక్షణమునకు నేర్పరించుట మిక్కిలి కష్టము. చిత్రకవి పెద్దన, కాకునూరి అప్పకవి మొదలగు లాక్షణికులు చెప్పిన లక్షణ మపర్యాప్తమైనది. కాని యచటఁ బ్రత్యేకముగ, సమగ్రముగ యక్షగాన లక్షణము చెప్పుట వారి పూనికగాదు. రగడ లక్షణమును, రగడ ప్రభేద పరిగణనమును వారి లక్ష్యములు. నాఁటి యక్షగానము లలోఁ బ్రచారము నందుండిన జంపెరేకులు మొదలగు తాళ ప్రధాన రచనలు రగడ వికృతులని వారు గుర్తించిరి. అం దేరేకు, లేక తాళ మే రగడ తరగతికిఁ జెందునో యీ విషయమును గూడ నౌపచారికముగఁ బేర్కొనుటయే వారి యాశయమై యుండు ననిపించును. అంతియేకాని అప్పకవియంతటి లాక్షణికుఁడు, యక్షగాన లక్ష్యకర్తయునైనవాఁడు, సుగ్రీవ విజయాద్యనేక సుష్ఠు ప్రక్రియాత్మక యక్షగానములు వెలసిన వెనుకఁ బుట్టినవాఁడు, తన ముందునాఁటి యాంధ్ర వాఙ్మయము నవలోడన చేసినవాఁడు, యక్షగానమందు రేకన్న దే యేకైక రచనాప్రక్రియ యని యెంచి యుండుటచేతనే యనికాని లేక చేతఁగాక పూర్వుఁడగు చిత్రకవి పెద్దన చెప్పిన లక్షణము నట్లు పునశ్చరణ చేసినాఁడనిగాని యనరాదు. (వారు చెప్పిన యీ యక్షగానపు రేకుల లక్షణము పూర్వోక్తము). ఈ విషయమునే మఱియొక విధముగఁ జెప్పవచ్చును. ఆ నాఁటికే చంపూ దాహరణ ద్విపదాద్యనేక కావ్య రచనాంగములు గలిగి పాఠ్య గేయ నాట్యాదిక వివిధ ప్రయోజన సనాథమైన విపులప్రక్రియగా బహుముఖ పరిణతి కున్ముఖముగా సాగిపోవుచున్న యక్షగానమున కొక నిష్కర్షతో లక్షణము చెప్పుట యసమంజసమని వారు తలఁచి

యుండిన నుండవచ్చును. లేదా, ఆ యిరువురి కాలమునను యక్ష గానమునఁ బ్రధాన రచనాంగము రేకై యుండుటవలన (కడమ యంగములగు ద్విపదాదుల లక్షణము నెట్లును వేఱె చెప్పనే చెప్పిరి) దానినిగూర్చి మాత్రమట్లు ప్రత్యేకముగాఁ జెప్పియుందురు.

అంత రచనా ప్రయోజన వైవిధ్యముగల యక్షగానమున కొక నిష్కర్షతో లక్షణ నిర్వచనము సేయఁ బూనుటన్నది యేనాఁ డైనను గష్టసాధ్యమైన పనియే. ఎట్లు చెప్పినను నది యపర్యాప్తమే కావచ్చును. కాని యక్షగాన మొకస్థితికివచ్చి క్రమ క్రమముగా, త్వరితగతి నంతరించుచున్న యీ నాఁడు దాని లక్షణ ప్రక్రియను నిర్వచింప వలసి వచ్చినచో వెనుకటి దాని బహుముఖమైన పరిణామ చరిత్రను, విపుల లక్ష్యకోశకేశలమైన సామాన్య స్వరూపమును దృష్టిలో నుంచుకొని మఱి నిర్వచింప వలెను.

సాహిత్య ప్రక్రియా పరముగా, స్థూలముగా యక్షగానము నీనాడిట్లు నిర్వచింప వచ్చును.

యక్షగానము నందితి వృత్తమెట్టిదైనఁ గావచ్చును. రచనా ప్రక్రియ శ్రవ్యముగాని, దృశ్యముగాని కావచ్చును. ఏప్రక్రియ యందైన గీతి ధర్మము విహితము. అందు రాగతాళములలో నొకదానికిఁ గాని రెండింటికిఁ గాని తగు ప్రాధాన్యముగల రచనా విశేషములు (రేకు, దరువు, పదము, కీర్తన మొ.) ద్విపద (మంజరియును), పద్యములు (జాత్యుపజాతి వృత్తములు, అర్ధపద్యములు, సం. శ్లోకములును), వచనము (సంధిప్రయోజనాత్మకముగాని సంవాదాత్మకముగాని, వర్ణనాత్మకమైనను గాఁదగును. చూర్ణికలు, విన్నపములు మొ॥) గద్యప్రభేదములు) నుండదగును. ఏలాది గీత ప్రబంధ విశేషముల ప్రయోగమైచ్ఛికము.

యక్షగానము వైశిష్ట్యము

మన సాహిత్య ప్రక్రియ లన్నిట యక్షగాన మంతటి విశిష్టత గల ప్రక్రియ మఱిలేదు. దాని యోగ్యతల నీక్రింది విధముగఁ బరిగణింపవచ్చును.

1. అది సర్వోపభోగ్యమైన సమాహార కళాస్వరూపము:

అనఁగా మన పూర్వ మార్గవాఙ్మయ మంతయుఁ బండితోపజ్ఞమైనది. దేశివాఙ్మయమెక్కువగాఁ బామరోపజ్ఞమైనది. ఆ మార్గ దేశి పండిత పామర వాఙ్మయప్రక్రియలకుఁ దత్త్వములకును సామరస్యము సాధించినది యక్షగానము. ఆ పండితు లెక్కువగా బ్రాహ్మణులు, నాగరికులు, రాజాస్థానాశ్రితులు; దేశికవు లెక్కువమంది యబ్రాహ్మణులు, జానపదులు, రాజాశ్రయము నపేక్షింపనివారు. యక్షగాన మన్నికులముల యన్నితరగతుల కవులకుఁ బ్రబర్శకులకు నాశ్రయమిచ్చి కోటలోని రాజుగారికిని బేటలోని ప్రజలకును సమానముగా నాదరపాత్రమైనది. మన పండితవాఙ్మయము నూటికిఁ తొంబది తొమ్మిదిపాళ్ళు పాఠ్యప్రయోజనాత్మకమైనది మాత్రమే. యక్షగానము పాఠ్య గేయ నాట్యాదిక బహుప్రయోజనముల కేక వాక్యత సంఘటించి మన తెనుఁగుజాతియొక్క చిరంతనమైన గానకళాభిరుచికి నాట్య కళాభి మానమునకును నిదానముగా నిల్చినది.

2. వివిధ ప్రక్రియాను బంధము:

ఈవిషయ ముపరి విపులముగా నిరూపితమైనది. ప్రబంధము, కలాపము, ఉలాప్రబంధము, కొరవంజి, వీధినాటకము, మార్గనాటకము బొమ్మలాట, జంగముకథ, హరికథ, ఆధునిక రంగస్థల నాటకము మొదలగు వివిధ ప్రయోజనాత్మకములై బయల్వెడలిన ప్రక్రియ

లతో యక్షగానమునకుఁగల సంబంధము సమగ్రముగా మన వాఙ్మయ పరిణామ చరిత్రను సవిూక్షించుట కుపకరించును. ఇట్లన్నిటితో సంబంధముగల సాహిత్య ప్రక్రియలు మిక్కిలి యరుదు.

శి. బహువిధపద కవితా ప్రభేద సమీకరణ :—

యక్షగానము సాధించిన ప్రజనములలో నతిప్రధానములైనవాని లో నిది యొకటి. పాల్కురికి సోమనాథుఁడు మనప్రాచీన దేశీయపదవాఙ్మయరీతులను గొన్నిటిని పేర్కొనియున్నాఁడు - తుమ్మెద పదములు, ప్రభాతపదములు, వెన్నెల పదములు, వాలేశు పదములు, నివాళి పదములు మొ॥. అందులో జాలపదములు నేఁడు నామమాత్రావశిష్టములైనవి. అతని తరువాతఁ గొన్ని వెలసినవి. అవికూడ లక్షణమునకంత లొంగుబాటుకాని గుణము కలిగియుండుటవలన, మార్గసాహిత్య ప్రవణులు ప్రక్రియాసౌలభ్యపరాయణుల్నైన మన లాక్షణికుల యుపేక్షవలనను నీపాటికి నశింపవలసినదే కాని యెట్టి రచనా విశేషమునైనఁ దనలో నిముడ్చుకొనఁగల యక్షగానము ధర్మమా యని కొన్నికొన్ని సంరక్షింపఁబడుచు వచ్చినవి. అట్టివానిలో ముఖ్యములు :— ఏలలు, ధవళ శోభనములు, జోలలు, సువ్వాలలు, అల్లోనేరేళ్ళు, అనువులు, త్రిభంగులు, త్రిస్తబకలు, వెన్నెలపదము మొ॥. + ఆంధ్రజాతీయసంగీత వాఙ్మయ చరిత్ర రచనకుఁ గొలమానము యక్షగానము.

4. వస్తు వైవిధ్యము :— యక్షగానేతి వృత్తములలోఁ బౌరాణిక ములు స్థలపురాణగాథలు, చారిత్రకములు, తాత్కాలికములు, సాంఘికములు, జానపదగాథలు, కల్యాణకథలు, తత్త్వవిషయక

+ తంజావూరి య. గా. పదముల లతి విశిష్టమైనవి. వానిఁ గురించి చూ. అనుబంధము (2) (నా "తంజావూరు పద వాఙ్మయము" అను వ్యాసము — సంస్కృతి., జులై, ఆగష్టు, 1956.)

ములు మొదలగు పలు తరగతులకుఁ జెందిన వెన్నియోగలవు. ఇంతటి వస్తువైవిధ్యమును బ్రదర్శించినది మన పూర్వవాఙ్మయ ప్రక్రియలలో మఱి కానరాదు.

ఏ. రస విషయిక వైశిష్ట్యము :-

మన పూర్వ ప్రబంధము లెక్కువగా శృంగార ప్రధానములు. యక్షగానములో శృంగార ప్రధానము లనేకము గలవు. దక్షిణాంధ్ర యక్షగానములు చాల మట్టున కట్టివే. ఆంధ్రదేశ య. గా. లందును విష్ణుమాయా విలాసము, విప్రనారాయణ చరిత్రము, మృత్యుంజయ విలాసాదు లెన్నియో యట్టివి కలవు. యక్షగానములందు వీర కరుణాది రసములకును విశేష ప్రసక్తిగలదు. అందులకు సుగ్రీవ విజయాదులే తార్కాణము. వస్తువైవిధ్యము విశేషముగాఁగల యక్షగానము నైక రసాశ్రయమగుటలో వింతలేదు. అయితే హాస్యరస విషయమున యక్షగానమున కొక ప్రత్యేకత గలదు. హాస్యము సర్వ జన మనఃపర్వమైనది. మన ప్రబంధములలో, అసలు యక్షగానము వినా పూర్వవాఙ్మయ మంతట నా రస ప్రసక్తి యతి విరళము. యక్షగానము తత్ప్రయోజనములలో జనరంజకత్వ మొకటి ప్రధానమైన దగుటచే సింగి, సింగఁడు, కటికము, సుంకరి కొండఁడు మొదలైన తన సాంప్రదాయిక పాత్రల ద్వారమున హాస్యమును బహుభంగులుగాఁ బ్రదర్శించుచు వచ్చినది. ప్రాయికముగా యక్షగానము లందంతో యింతో హాస్యరస స్పర్శ లేనిది యుండదన వచ్చును. హాస్య ప్రధానములైన య. గా. లలో తంజావూరి వానిదొక ప్రత్యేకత.

ఓ. చంధో వైవిధ్యము :-

యక్షగానము లందనేక దేశి గీత ప్రభేదములతోపాటు గద్య పద్యములు, ద్విపద, రగడ వికృతులగు రేకులు మొదలగు బహు

విధచ్ఛందస్సులకును దగిన ప్రశక్తి యుండుటచే నందు మన పూర్వ వాఙ్మయ ప్రక్రియలగు చంపూ ప్రబంధ ద్విపదోదాహరణ శతకాదుల యొక్క ఛందఃఫక్కికలన్నియు నిమిడిపోయిన వనవచ్చును. తదుపరి ఆధునిక యుగోన్ముఖముగా వికసించుచున్న యక్షగాన ప్రక్రియలో హరికథలు మొదలగువాని యందలి తోహరాలు, డోరాలు, మంజరి, లావణి మొదలగు ఛందస్సులును నూత్నముగా వచ్చి చేరినవి. ఏనాఁటికైన నాంధ్ర చ్ఛందస్సంహితా సర్వస్వము తయారగు నవకాశమే తటస్థించినచో దాని కపుష్పమైన సామగ్రిని జాల సరఫరా చేయఁగలదు యక్షగానము.

7. భాషా వైవిధ్యము :-

తెనుఁగున యక్షగానములు సాగర తీరాంధ్ర మండలములు (బరిస్సా సరిహద్దులలోఁగూడ ఉదా :- రాయఘడ భాషకలాపము), రాయలసీమ, తెలంగాణము, దక్షిణదేశమున తంజావూరు, మధుర, మైసూరు, పుదుకోట్ట, తిరుచునాపల్లి, సేలము, చెంగల్పట్టు మదరాసు, మొదలగు వివిధ ప్రదేశములలో నెక్కడెక్కడ తెలుఁగు భాష వ్యవహరింపఁ బడినదో యక్కడెల్ల వెలసినవి. ఇది యొక భాషా వాఙ్మయ చరిత్రలో మిగుల నపూర్వమైన విషయము. అట్లు వివిధ ప్రాంతములలో వివిధ కాలములలో వివిధ కులముల వారిచే వ్యవహరింపఁబడిన భాషాఫక్కికల కాకరము లగుటచే నాయా యక్షగానములందు మన కోశముల కెక్కని పదజాలము, ప్రయోగ విశేషములు, జాతీయములు మున్నగు విశేషము లెన్నెన్నియో కలవు. అందుచే భాషావిషయికమైన పరిశోధనలోఁ గూడ యక్షగానము

తన నైశిష్ట్యమును నిరూపించు కొనఁగలదు.+ ఈ బహుళాంధ్రోక్తి మయ ప్రపంచమున మన వాఙ్మయ ప్రక్రియ లన్నిట యక్షగానముఁదే ప్రధాన స్థానము.

8. లోకవృత్త ప్రదర్శనము :-

ఈ విషయమును దలస్పర్శముగాఁ బరామర్శించి సోదాహరణముగా నావిష్కరింపవలె నన్నచో నది యొక ప్రత్యేక గ్రంథమునకుఁ సామగ్రి యగును. (అది యాంధ్రుల సమగ్ర సాంఘిక చరిత్ర రచనకుఁ దోహదము కాఁగలదు) అందుచే నత్యంత ముఖ్య విషయములు మాత్ర మిట స్థాలీ పులాకముగా స్పృశింపఁ బడును.

ప్రజా సాహిత్య మనఁ బడు దాని కంతటికిని బ్రతినిధి వంటిది యక్షగానము. సాహిత్యమును బ్రజా సన్నిహితము చేసి ప్రజా హృదయమును సాహిత్యములోఁ బ్రతిబింబింపఁ జేసిన ప్రక్రియ యది. రాజా స్థానములలో విద్వత్కవులు వెలయించిన వాఙ్మయములోఁ బాండిత్య ప్రకర్షకును గవితా చమత్కృతికిని గల ప్రాధాన్యము లోకవృత్త చిత్రణకు లేక పోయినది. అక్కడక్కడఁ గొన్ని ప్రబంధములలో లోకము పొకడ కొంత కనఁబడినను నది యసమగ్రముగా నొక్కొక్కపుడు కృతకముగను గూడ నుండును. య. గా. ల కెక్కువగా గ్రామసీమలే పురిటింట్లును, రంగభూములునైనవి. యక్ష గాన కవులును బ్రదర్శకులు నెక్కువ మంది రాజసన్మానము లపేక్షింపని సామాన్యులే; అశేష ప్రజానీకము యొక్క విశేషామోద వినోదములే వారి పరమ లక్ష్యములు. ఎన్నియో యక్షగానములలో నితి వృత్తములు పౌరాణికములే యైనను గొన్ని యక్షగానములు పండితోప

+ విలక్షణము లగు తంజావూరి య. గా. ప్రయోగ విశేషములఁగూర్చి కొంత విషయము ఆంధ్రపత్రిక సారస్వతాను బంధము ద్వారా ప్రకటించియుంటిని. కాలక్రమమున నవకాశము చొప్పునఁ గడమవిశేషములను వెలువరింపఁ గలను.

జ్ఞములే యైనను గొన్ని రాజాస్థాన రంగభోగములే పొందినను వాని భాషలో, భావములలో, నా గేయచ్ఛందస్సుల తీరు తీయములలో నా యీ పాత్రల చిత్రణలో, సన్నివేశముల సంఘటనములో బ్రజాహృదయము, లోకము పోకడయుఁ బ్రతి ఫలించును. ఆ ప్రతిబింబనము నిరాడంబరముగ నిసర్గమధురముగా నుండును. యక్షగానములు దృశ్య ప్రయోజనాత్మకములు గూడ నగుట చేత నందలి లోక చిత్రణ సన్నివేశములు వాస్తవికతకు సన్నిహితముగా నుండును. కొన్ని యక్షగానములలో సన్నివేశములు మాత్రమే కాదు కథావస్తువులే పూర్తిగా లోక సిద్ధము లైన సందర్భములును గలవు.

మన యక్షగానములలో లోకవృత్తము నధికముగాఁ బ్రదర్శించినవి తంజావూరి యక్షగానములు. వానిలోఁ దాత్కాలిక విషయములు నితివృత్తము లైనవి. (ఉదా:- విజయ రాఘవాస్థానకృతులు. పారాణికేతి వృత్తములకుఁ గూడఁ దాత్కాలికవిషయ స్పర్శ తఱచు కన్పించును. (ఉదా :- శాహరాజాస్థానకృతులు). అవి రాజాస్థానాశ్రితులైన విద్వత్కవుల చేతనే రచింపఁబడినను, స్వయముగా రాజకవుల చేతనే రచింపఁబడినను వానిలోఁ గోణెవాకిలి కడనున్న కోలకేతని మొదలు కోటలోపలి రాజు గారివఱకుఁ గల పలు తరగతుల రాజోద్యోగుల వేషభాషలు, ఆయా రాజుల యాచార వ్యవహారములు, ఆహారవిహారములు, నగరిము స్తీదు, కొలువు సింగారము, ఆస్థాన విద్వాంసుల యద్వా తద్వాలు, ఏషాగాథలు, వివాహాది సందర్భములోఁ బురోహితుల సంభావనల తగవులు, ముత్తైదువల ముచ్చటలు మొదలైన విషయములు గలవు. ఆంధ్ర దేశ తెలంగాణముల యక్షగానము లందును నిటీవలి వానిలో లోక వాసన లెక్కువగా స్ఫురించినవి. ఆ యీ యక్షగానములలో సవతుల కయ్యములు, సుంకరుల యాగడములు, మంత్రసాని దెప్పిళ్ళు -

ఇవి కాక గొల్లలు, ఎఱుకలు, జెట్లు, పంబవారు, పెరికీలు మొదలగు జాతుల చరిత్ర, వారి వాలకములు, మాటల తీరు, వృత్తులు, ఆశయములు విశ్వాసములు మొదలగు విషయము లెన్నియో వారి వారి కట్టు బొట్టులతోఁ గూడఁ దేటపడఁ గలవు. ఇంత విపులముగా లోకవృత్త ప్రదర్శన ప్రయోజనమును యక్షగానము సాధింపఁ గలిగినట్లు మన పూర్వసాహిత్య శాఖలో మఱి యెద్దియు సాధింపలేక పోయినది. లోకవృత్త ప్రదర్శన ప్రయోజనాత్మికతనే యుత్తమ సాహిత్య జీవ లక్షణముగాఁ బరిగణించు చున్నా రీనాఁడు దేశ దేశాల సాహిత్యసత్కవ్రతులైన పెద్ద పెద్ద పండితులు. రచనా ప్రౌఢిని బట్టి యక్షగానము లన్నిటి నుత్తమ సారస్వత శ్రేణిగా జమ కట్ట సమకట్టుట సాహసము కాని లోకవృత్త ప్రదర్శనాది ప్రయోజనముల దృష్టి నైనచో యక్షగాన వాఙ్మయము యొక్క విశిష్టత కాదనరానిది.

9. దేశినాటక కళా ప్రాతినిధ్యము :—

స్థూలముగాఁ జూచినచో దేశి వాఙ్మయ మంతయు మధుర కవితాశాఖకుఁ జెందిన గీత ప్రబంధముల ప్రాచుర్యము గలది కావున నట్టి గీత ప్రబంధముల కెన్నిటికో యక్షగాన మాకరమగుటచేత యక్షగానమును దేశి వాఙ్మయ కోశమంతటికిని బ్రతినిధి యనఁ జెల్లును. కాని యక్షగాన మనఁగా నీనాఁడు గానప్రక్రియగాఁ గాక రూపక ప్రక్రియగాఁ బరిగణింపఁ బడుచున్నది. అయితే యక్షగానమునకు ముందే దేశమున వీధి నాటకములు ప్రచారము నందుండినను, అది యీ వీధినాటకములతోనే నేకమై నాటకప్రక్రియగా రూపొంది, నాటక శబ్ద వాచ్యమునై, మధ్యలో మార్గనాటక ప్రభావము సోకినను దన వ్యక్తిత్వమును గోల్పోక, కలాపము, కొరవంజి మొదలగునవి దేశీయ దృశ్య రచనలుగా రూపొందుటకై తన ప్రక్రియాస్తిత్వమును దానము

చేసి బొమ్మలాటలకును వాటమైన వంతపాటగాఁ బరిఢవిల్లియుండుటఁ జేసి, దానిని దేశికరణికిఁ జెందిన నాట్యకళా ప్రపంచమునకుఁ గూడ దగిన ప్రతినిధి యనుటలో విప్రతిపత్తియుండరాదు.

10. విశిష్టతలలో విశిష్టత :-

ఆంధ్ర కర్ణాటక తమిళ తుళు*భాష లన్నిటను యక్షగానములు వెలసినవి. యక్షగానము గాత్ర మాత్రోపజీవి యగు నొక ప్రత్యేక గాన శైలిగా నెన్నడో కన్నడదేశమునందే ప్రాదుర్భవించి యుండిన నుండవచ్చును, గాని యక్షగాన రచనకు మన యాంధ్రమున నున్నంత ప్రాచీనతాస్థితి కడమయెడలఁ గానరాదు. ఆంధ్రులు 17 వ శతాబ్దిలోఁ దమిళ కన్నడ సీమలకు విస్తరించి యుండిన కాలమునసే, తంజావురాంధ్ర నాయక రాజుల యాస్థానములో యక్షగానరచన జగసాగి రంగభోగము పొందుచుండిన కాలమునసే క్రమక్రమముగా కన్నడాది భాషాకవులును గొంద రాకృష్టులై యక్షగాన రచన కుపక్రమించి యుందురు. మన వాఙ్మయ ప్రక్రియలన్నియు నొక్క- యక్షగానము వినా తదితర భాషా (సంస్కృతాంగ్లాదులు) వాఙ్మయములనుండియే గ్రహింపబడినట్లు చెప్పుకొనవలసియున్నది. (ఉదాహరణ ప్రక్రియ గూడ నిందుల కపవాదమగునేమో !) అందుచే యక్షగానము ప్రక్రియగాఁ బురాణేతిహాస శతక ప్రబంధాదులవలెఁ గాక మన వాఙ్మయములో స్వతంత్రమైన మన తెనుఁగుదన ముట్టిపడు, మనవాఙ్మయ వ్యక్తిత్వమును బట్టి యిచ్చునట్టి ప్రక్రియయనియు, నీయొక్క- సాహిత్య ప్రక్రియ విషయమునైన తెనుఁగువారు మఱియొకరి కనుకార్యులు కాఁగలిగిన ప్రతిష్ఠఁ డక్కఁ గొందురనియుఁ జెప్పఁదగియున్నది. ఇంత

* తుళు భాషా యక్షగానమున కుదాహరణ మిదివఱకుఁ బేర్కొనఁ లేదు. అందు వెలసినవి కొద్ది. "పంచవటి" మొదలగు య. గా. పేరు కొద్ది వినిపించుచున్నవి.

యేల! తెనుఁగు యక్షగానము తమిళనాడు నడిబొడ్డగు తంజావూరిలో మహారాష్ట్రప్రభువుల లేఖనులపైఁ గూడ నాట్యముచేసిన దనగా దాని ఘనత యెట్టిదో యిట్టే యూహింపవచ్చును.

ఉపసంహృతి

యక్షగాన మనునది ప్రౌఢ వాఙ్మయ శాఖ కాదనియు, నది యేదో యొక పామర వాఙ్మయ ప్రక్రియ యనియు నొక యపోహ కొందఱు పండితులలో నుండుటకద్దు. పండిత కవులెందఱో యక్షగాన రచన చేపట్టిరను విషయము, యక్షగానము పండిత పామర వాఙ్మయ ములకు సామరస్యము ఘటించినదను విషయమును బూర్వోక్తములు. అసలు ప్రౌఢియన్నది రచన నాశ్రయించి యుండును గాని ప్రక్రియను బట్టికాదు. యక్షగానములందు పండితోపజ్ఞములందు ప్రౌఢి సమృద్ధిగా గలదు. ప్రౌఢవాఙ్మయ మనఁబడు ప్రబంధములందు పేలవము లైనవి లేకపోలేదు. పండితోపజ్ఞములైన యక్షగానములందును నవి జన సామాన్యాను రంజనమున ముద్దేశింపఁ బడినవి కాఁబట్టి ప్రబంధము లందలి శబ్దాశ్రయమైన ప్రౌఢి యంతగాఁ గానరాక పోవచ్చును గాని వానిలో భావాశ్రయమైన ప్రౌఢికి లోటులేదు.

అదియుఁగాక వందలకు వందలుగా వెలసిన మన యక్షగాన ముల కర్తలందఱును విదగ్ధులైన విద్వత్కవులు కారు గాని యక్షగాన రచనమన్న సంగీత నాట్యాది బహుళ కళా పరిజ్ఞానము లేనిదే కేవలము సాహిత్య పౌరోహిత్యము మాత్రమే చేసికొను కవిమాత్రు లకే కాదు – ఉద్దండ పండితులగు మహాకవులకును గలము జరుగని పని.

యావదాంధ్ర వాఙ్మయమునను బహుముఖ వైవిధ్యమును, వైశిష్ట్యమును గలిగి విశాల సాహిత్యశాఖగావిలసిల్లిన ప్రక్రియ యక్షగాన మొక్కటియే.

అనుబంధము

1

యక్షగాన ప్రధాన రచనాంగములు

ఛందస్సు

యక్షగాన ప్రధాన రచనాంగములు రేకులు, దరువులు, ద్విపద పద్యము, గద్యము, పదము తత్తత్ప్రభేదములు దేశిసరణికిఁ జెందిన బహువిధపద కవితాగీత ప్రబంధరీతులు. ఆయా రచనాంగ ప్రభేదముల ఛందస్సంగీత ప్రక్రియలూర్చి లక్ష్యలక్షణ సమన్వయ పురస్సరముగా సవివరమైన విచారణ మొనర్చుట యనఁగా నదియొక ప్రత్యేక పరిశోధనకు విషయము; ప్రత్యేక మొక బృహద్గ్రంథమునకు సామగ్రి. ఇపుడిచట నందు ముఖ్యములైన వానివిషయము (గ్రంథవిస్తరభీతి నతి సంగ్రహముగా) సమీక్షింపఁబడును.

1. రేకు – రగడ

'ఆయాయి రగడ భేదములు రేకులు పెక్కులమరు'–లక్షణసార సంగ్రహము (III. 102)

ఆదినుండి యనేకాంధ్ర యక్షగానములం దతి ప్రచురముగాఁ గనుపట్టుచున్న జంపె త్రిపుటాది తాళ లయాశ్రయములగు రచనములను మన లాక్షణికులు రేకు లనియు నవి వివిధ రగడ వికృతు+

+ ఇవి వైతాళీయ జాతులనియు, (అనఁగా దేశీయగీత ప్రబంధములనియర్థము) రగడయొక చాటుప్రబంధ మనియు మన లాక్షణికమతము. (చూ. కావ్యాలంకార చూడామణి (IV.40); లక్షణసార సంగ్రహము II.128-140, అప్పకవీయము I. 30, IV. 290. అప్పకవి మతమున రగడయే కాదు గద్య, ద్విపద, మంజరి, దండకము మొ॥ంగూడ చాటు ప్రబంధములే.

లనియు గుర్తించిరి. (చూ. చిత్రకవి పెద్దన లక్షణసార సంగ్రహము 2-141. అప్పకవీయము 4-303. వారు చెప్పిన లక్షణము పూర్వోక్తము) ఇవియే ప్రాచీన కాలమునఁ బ్రసిద్ధములై యుండిన జక్కుల రేకులై యుండవచ్చును. (జక్కుల రేకులు తాళ్ళపాకవారి సంకీర్తన లక్షణమునను, లక్షణదీపిక యందును బేర్కొనఁబడినవి. యక్షగానోత్పత్తికి జక్కుల జాతికిని సంబంధము నూహించుట సమంజసముగాఁ దోఁచుచున్నందున గాన కళాప్రావీణ్య విఖ్యాతులగు నా జక్కుల పురంధ్రుల పాటలనఁదగు నాజక్కుల రేకులే [1] ప్రాచీన యక్షగానము రూపు రేకలు తీర్చి దిద్దిన గానరీతులై యుండునని యూహింపనగును.) ఈ రేకుల మూలప్రకృతి యగు రగడ ప్రాచీన కన్నడ లాక్షణికుఁడగు నాగవర్మ (క్రీ. శ. 12వ శతాబ్ది) వేర్కొనిన "రఘుటా బంధ" మే కావచ్చును.

"గణ నియమ విపర్యాసదొ
ళెనె వడె దొళ్పిసదు మాత్ర సమనాగి, గుణా
గ్రణియ మత దింద తాళద
గణనె గొడం బట్టురదువ రఘుటా బంధం"

ఛందోంబుధి 3 — 222

అనఁగా గణ నియమ విపర్యాసమున్నను సమసంఖ్యగల మాత్రలతోఁ దాళబద్ధమై యుండున దని యర్థము. ఇది మన రగడ లక్షణమునకు సరిపోవును. [2] కన్నడ వాఙ్మయమున రగడ చాల కాలమునుండి ప్రచారమున నుండినదని తెలియుచున్నది. తెలుఁగున

1. రేకు లనఁగా పాటలు లేక పదములని గ్రహింపనగును. మన లాక్షణికుల వక్కాణను బట్టి పాట లందలి పాదము, చరణము, కళము ఆనునట్లొక పంక్తి వాచకముగా నెంచ వచ్చును.

2. సంగీత రత్నాకరమునఁ గాహడీ, యను పేర నొక ప్రబంధ ముదాహరింపఁబడినది. (4—295) కాని యది బహుపాదములు గల వీర రసాత్మకమైన సంగ్రామ రచిత స్తుతి యని మాత్రము వేర్కొనఁ బడినది. దీని లక్షణ మపర్యాప్తము.

నిది 11వశతాబ్దినుండి కొంతవాడుకలోనుండినట్లు రాజరాజు కోరుమిల్లి శాసనము వలన గుర్తింపనగును. పాలకురికి సోమనాథాది కవులు ప్రత్యేకముగను, ఉదాహరణముల నముమను, శ్రీనాథాదులు చంపువుల నడుమను రచించుచు వచ్చిరి.[3] రగడ మనలాక్షణిక పరిగణనమున కెక్కుటకు క్రీ.శ. 1400 ప్రాంతమున నుండిన విన్నకోట పెద్దన కావ్య లంకార చూడామణియే (4-40) మొదలు. కాని యందలి లక్షణ మపర్యాప్తము. నవవిధములైన రగడ ప్రభేదములను ప్రథమముగా బరిగణించి లక్ష్యపూర్వకముగా లక్షణనిర్వచనము చేసినవాడు క్రీ.శ. 15 వ శతాబ్ది పూర్వార్ధమున నుండిన అనంతామాత్యుడు. (చూ. ఛందో దర్పణము పే. 56–61) అనగా నప్పు డప్పుడే యాంధ్ర దేశమున జక్కుల కేకులు ప్రచారము పొందుచుం బండితుల చెవులకు నెక్కుచు జొచ్చినవని చెప్పనగును. (ఆంధ్రవాఙ్మయమునం ప్రప్రథముగా యక్షగాన ప్రశంస వచ్చిన భీమఖండము, జక్కుల పురంధ్రి పాటకుం ప్రసక్తి గల్గిన క్రీడాభిరామము నాకాలము నాటివే.)

అనంతాదులు చెప్పిన నవవిధ రగడల గతి లక్షణము లెట్టి వనగా :-

1. హాయ ప్రచారమను దానికి - 4 సూర్య గణములు.
2. తురగ వల్గనమునకు - 8 సూ. గ. లు (హా. ప్ర. కు రెట్టింపు)
3. విజయ మంగళమునకు - 16 సూ. గ. లు. (తు. వ.-నకు రెట్టింపు)
4. ద్విరదగతి - నగ, నలల, భల, సల, త, ర గణములలో నేవో నాలుగు.

3. విపులమైన రగడ చరిత్రకు శ్రీ కోండ రామకృష్ణయ్యగారి దేశి, శ్రీ ని. వేంకటరావుగారి ఉదాహరణ వాఙ్మయ చరిత్ర చూడదగును.

5. జయభద్ర - ద్విరద గతికి రెట్టింపు.

6. మధురగతి - గగ, భ, స, నల, గణములలో నేవో నాలుగు.

7. హరిగతి - మధురగతికి రెట్టింపు.

8. హరిణగతి - గగ, భ, స, నల గణములలో నేవో రెండు సూర్య గణ పూర్వకములుగా నుండును.

9. వృషభగతి - హరిణ గతికి రెట్టింపు.

అనంతున కర్వాచీనులైన లాక్షణికులు రగడలఁ గూర్చి చెప్పిన వారెల్ల నీ తొమ్మిది విధములనుగూర్చి మాత్రమే చెప్పిరి. అనంతుని లక్షణమునే పునశ్చరణ చేసినారు. కాని తంజావూరి మహారాష్ట్ర ప్రభువగు శహాజీ విష్ణుపల్లకి నేవాప్రబంధమున "మయూర గతిరగడ" యను నొక క్రొత్తపేరు వినవచ్చినది.

అందలి ఉదాహరణము:-

"మారమణి వల్లవ కుమారమణి మోదం
బూరఁ గరుణింపను మయూరగతితో నే
తేర మది నిన్ననిటు దీర్ఘమగు దండెన్
భారముగ రాజిలెడు పల్లకియు వచ్చెన్"

కడపల నొక్క-మాత్ర (లఘువు) తక్కువైనది కాని కడమ యంతయు ద్విరద గతియే. అసలీ రగడలన్నిటఁ బ్రధానములైనవి నాలుగే గతులు - పైనుదాహరింపఁబడిన వానిలో 1, 2, 3 ఒక్క-గతి తరగతికే చెందినవి. అట్లే 4-5 ఒక్కటే తరగతి. 6-7 ఒక తరగతి. 8-9 ఒక తరగతి. ఇట్లే చిత్రకవి పెద్దనాదులు యక్షగానపు రేకులందు నాల్గువిధములైన రగడగతులనే చెప్పి యున్నను నవవిధములు నను గతార్థము లగుచున్నవి.

ఇఁకఁ బ్రకృతము వారుచెప్పిన లక్షణమునకు లక్ష్యసమన్వయ ప్రయత్నము :-

1. త్రిపుట రేకు :- వృషభగతి 2 పాదములు - 7 లఘువులు

ఉదా :- రుద్రయ సుగ్రీవ విజయము నుండి.

"లలితగాత్రుడు శుభచరిత్రుడు దళిత శత్రుడు సుజనమిత్రుడు
నలిన నేత్రుడు కందుకూరి జనార్దనుండు"

వృషభగతి పాదమున నేడేసి లఘువుల దళములు నాల్గుండును. రెండు పాదములందెనిమిది. అందేడు లఘువులను దొలఁగింపఁగా నట్టి దళము లేడగును. మీఁది యుదాహరణమునఁ జివరనొక్క లఘువు తక్కువైనది కాని (అది పాటలో సద్దుకొని పోవును) లక్షణము సరిపోయినది. అందున్న సప్తలఘుక దళము లేడే. "తకిటకిటతక - తకిటకిటతక"- ఇట్టివి మఱి రెండావృత్తులు, చివర 'తక్క-తకిట' - ఇది త్రిపుట యొడుపు. (వృషభగతి కనుగలములైన రచనాంతరములు గలవు. అవి స్థలాంతరమునఁ బ్రసక్తములు).

2. జంపె రేకు :- ద్విరదగతి 2 పాదములు - 1 లఘువు (చివర)

ఉదా :- ఓబయ గరుడాచలము నుండి.

"సురరాజ సన్నుతికి సురుచిరాధర మతికి
కరుణా రసోన్నతికి గరుడాద్రి పతికిన్"

లక్షణము సరిపోయినది. ఇందు పంచమాక్షరాక దళములేడు కలవు. ఎనిమిదవ దాన నొక్క లఘువు తక్కువ. 'కిటతకిట - కిటతకిట... తకిటా' అని జంపె యొడుపు.

3. రచ్చ రేకు :- తురగవల్గనము గతి.

ఉదా :- అక్కఁయ కృష్ణవిలాసమునుండి.

" పికిలి పువ్వు లెడల నెడల బెనచినట్టి పూలదండ
లొక యియార మమర నొప్ప కొప్పుజుట్టి "

ఈ యుదాహరణమునఁ దురగవల్గనము గతి గలదు. కాని యీ అక్కఁయ కృత్యంతరమే యగు భీమసేనవిజయమునందు గల రచ్చరేకులలో వృషభగతి విశేషము. ఉదా :-

" నమ్మతింపక రేపు మాపని జాగుసేసే తావుగాదిది
కొమ్మ దయనిటు చూపునిను నే నమ్మినాడన్ "

కంకంటి పాపరాజు విష్ణుమాయా విలాసమునందలి రచ్చరేకులు నిట్లే వృషభ గతిలోనే నడచినవి. (చూ. వావిళ్ళ ప్రచురణ. పుట 17. 36) అందు తురగ వల్గనగతి కనుగలములైన రచనాంతరములును గలవు. (అవి స్థలాంతరమునఁ బ్రస్తుతములు)

4. ఏకతాళి :- మధురగతి.

ఉదా :- సుగ్రీవ విజయము నుండి.

" ముక్కులు చెక్కులు మూపులు వీపుల్
ప్రక్కలు పిక్కలు బరులును దరులున్ "

లక్షణము సరిపోయినది. ఒక్కొక దళము చతుర్మాత్రాకము. "తరికిట - తరికిట" యను నొకపుగలది. (ఏకతాళ శుద్ధసూడ జాతి గీతప్రబంధముగ సంగీతదర్పణమునఁ జెప్పఁ బడినది. చూ. 4-శ్లో 417)

5. అటతాళము :- పాదమునకు 24 మాత్రలు.

ఉదా :- సుగ్రీవ విజయమునుండి

" చంపజాలక విడిచిపెట్టిన సరకు గొనక, వీడొక
తెంపుగల మగవాని పలెనే తిరిగి వచ్చెన్ "

లక్షణము మొదటి పాదమునకు మాత్రమే సరిపోవు చున్నది. ఒక్కొక్కచో మొదటిపాదమున మాత్రాధిక్యమును జూపట్టుచున్నది. అందులకును సు. వి. మే తారాక్షణ.

ఉదా:-" నిన్న నీచే భంగ పడి చెడి నేడు వచ్చునే పోరికిన్, దిరిగియు
పన్న తనమున నొక్క బలియుని ప్రాపులేక "

ముఖ్యములైన రగడ గతి ప్రభేదము లెల్లను ద్రిపుటాదుల యెడ గతార్థములైనవి. అందుచే అట తాళమునకు మాత్రా సంఖ్య మాత్రము సూచింపఁ బడినది పెద్దన చేతను, అప్పకవి చేతను. కాని దీనికిని యొక గతి కలదు. కస్తూరి రంగ కవి హరిగతి కట తాళమును బేర్కొనెను. (చూ. ఆనంద రంగ రాట్ఛందము) కాని యట తాళమున నడుమఁ దేలి పోయినను నెత్తుగడ నుండి చివరంటనున్న గతి హరిణ గతి లేక వృషభ గతి కాని హరి గతి మాత్రము గాదు. ఒక్కొక్కచో అట తాళమునకుఁ దురగ వల్గన గతియుఁ జూపట్టెడు. వెంకటాద్రి సుభద్రా వివాహమున " అటతాళం - తెగమానం " (?) :-

" నెలత మోముసాటిరాక నీళ్ళలోన కమలములును
నిలువలేక సిగ్గుచేత తలలు వంచె నందురూ "

అట తాళమును గూడ రేకు లనుట కద్దు. గోపాలుని సింగయ ప్రభావతీ ప్రద్యుమ్నమున " అటతాళరేకులు " ఉదాహరింపఁ బడినవి. అందు లక్షణమున విశేషము లేదు.

మన లాక్షణికు లుదాహరించిన యీ మైదు రకములును గాక రేకు లింక ననేక విధములైనవి యక్షగానములలోఁ బ్రయుక్తములై

నవి. అయితే, యించు మించు ప్రతి రేకు నేదోయొక రగడ గతికి సన్ని హితముగా నుండును. కొన్నిట గతి భేదము పేర్కొనఁబడక రగడ లుదాహరింపఁ బడినట్లే కొన్నిటఁ దరగతి పేరఁ గాక యుత్త రేకులే యుదాహరింపఁ బడినవి. అవియుఁ బ్రాయికముగా నవవిధ గతులలో నేదోయొక దానికిఁ జెందును. అట్టివి కాక ప్రత్యేకముగా నొకపేరఁ బేర్కొనఁ బడినవియు లాక్షణికులు పేర్కొననివియు నగు వానిలో ముఖ్యములు గొన్ని :—

1. ఆదితాళ రేకులు :- ఉదా :- సింగయ ప్రభావతీ ప్రద్యు మ్నమునుండి -

" బిగికౌగిట నతి బిగియగ నొత్తిన
నొగిలిన బిగి చన్నులు వగమీరన్, "

ఇది యచ్చముగా మధురగతి.

2. మటిమె రేకులు :- ఉదా :- చిన కపోతయ్య వీరచోడవ్వ చరిత్రనుండి.

" కట్టపొడల దువ్వటమ్ము పెట్టుకొనగ చిలువసొమ్ము
పుట్టు తిరిపె మడుగు నమ్ము తిట్టవలదు వెనుక మమ్ము "

ఇందలి గతి తురగవల్గనము. (పెద్దన, అప్పకవి తురగవల్గనము రచ్చ రేకు గతిగాఁ జెప్పిరి). ఇట్టిదే "మత్తె" యనుపేరఁ గొన్ని యక్షగానములందుఁ గన్పట్టు చున్నది.

ఉదా :— విష్ణుమాయా విలాసమునుండి

" జాఱుకొప్పు చూచి యొకఁడు జంకెనలకు భ్రమసియొకడు
ఓరచూపు జూచి యొకడు తారతీరు జూచి యొకడు"

"మత్తె" మత్త లేక మత్య శబ్దభవమై యుండును. మత్య సూళాది సప్త తాళములలో నొకటి.

3. నడరేకులు :- ఉదా :- ప్రభావతీ ప్రద్యుమ్నము నుండి

"సరులో తావుల గురులో స్త్రీలను
మరులు కొలుపు మచ్చరులో జాణ"

ఇందు మధుర గతి స్పష్టపడినది. ఉత్త "నడలు" అనువేర నొక రచనా విశేషము గలదు. ఉదా:-

(అ) " అనిలజ చని యాతని దోడ్కొని ర
మ్మని నను ఇనుజుడు విని యిట్లనియెన్ "

— బలభద్రదాసి కపోతవాక్యము.

(అ) " హరునిన్ సురనది ధరునిన్ విష సం
హరునిన్ భీమ శంకరుని గొలుతున్. "

— వీర చోడవ్వ చరిత్ర.

(ఇ) " గట్టు రహి గను పట్టు దీని చను
కట్టు గనఁ దమి పుట్టు ఁబో. "

— విష్ణు మాయా విలాసము.

ఇందు (అ)లో నెక్కువగా, (ఆ) లోఁ గొంతవఱకు మధుర గతి స్పష్టపడినది. (ఇ) లో మాత్రము ద్వారద గతి కన్పట్టుచున్నది. "మధ్యమనడలు" అను నింకొక రచనా విశేషము గలదు. అందును ద్వారద గతి కన్పట్టుచున్నది.

ఉదా :- కపోతవాక్యము నుండి

"సూర్యుఁడే సుగ్రీవు సురలెల్లఁ గపులైరి
ఆ రాఘవుఁడు విష్ణుఁ డఖరేశ వినవె. "

4. వెండిరేకు :- ఉదా :- గిరిరాజు లీలావతీ కల్యాణము నుండి!

పాయక మ్రొక్కెదనమ్మా – పూల – పాన్పున వసియించవమ్మా
పోయివచ్చిన సుద్దికొమ్మా – మాకు – పొందుగ తెలుపుమో యమ్మా.

ఇందొక తూగు గలదు కాని రగడ గతి నేర్పఱించుట కష్టము.

5. కుఱుచరేకు : ఉదా :– కపోతవాక్యము నుండి?

"మందారములు మంచి చందనంబుల మీద
సందడిగ బారు గురవింద తీగెలుమా"

ఇందు ద్విరద గతి స్పష్టపడినది.

6. పాళిరేకులు : ఉదా :–నిమ్మనాథుని గురునంబి చరిత్రనుండి–

"తాళములు మద్దెలలు ధక్కి-యుఁ
దాంబురల్ వా యింపఁగా" ॥ ౧ ॥
తాళమాన మొకింత దప్పక
వాలుగంటి నటింపఁగా" ॥ ౨ ॥

గతి స్ఫురణను బట్టి యీ పాళిరేకులందు మూఁడు హరిణ గతి దళములు, మిఁద నొక ద్విరద గతి దళమును బొద లక్షణమని చెప్ప నగును. కాని గ్రంథాంతరము లందీ పాళిరేకులు విలక్షణముగాఁ గన్పట్టు చున్నవి.

ఉదా :– వీర చోడవ్వ చరిత్రనుండి–

"అప్పురో నీ విపుడంపిన పులగము
ఒప్పుకొనియె భావ కోలా లా.
కురిసె పువ్వుల వానలూ, యింపుగ
మెరసె దేవ దుందుభులూ."

7. (అ) బొళిరేకులు :- (ఆ) బొళరచ్చలు :-

ఉదా :– వీర చోడవ్వ చరిత్రనుండి.

(అ) "భావా మెరిగి భీమ భావాకు పులగము
వేవేగ నిమ్ము వివాదమేటికె"

(ఆ) తేజాముతో కన్నపు తేజినెక్కి జనులు
పూజా శాయాగ దిరుగు జే జే కు జే జే.

పాటలో మాత్రాకాలము పొడిగింపు వలనఁ దూగేర్పడు వీనికి లక్షణ నిర్దేశము చేయుట కష్టము.

8. ముఖారిరేకులు :- ముఖారి యొక ప్రసిద్ధరాగ ప్రభేదము. రేకులు తాళ ప్రధానము లైనవి. ఇట్లొకరాగము పేరితోఁ గలిసి రేకులు బుక్కమ సాంబయ్య బల్లాణ రాజు చరిత్రము నందొకచో మాత్రము కన్పట్టుచున్నవి.

ఉదా :-

" వస్తూ వాహనా భరణములు వన్నెగ బాణడి దుప్పట్లు
విస్తారా భరణితినొసగరా । బల్లాణరాయ
హస్తి భూషాణు కర్పితము గాను ॥ "

ఇది "ఏల" వలెఁ గన్పట్టుచున్నది.

....

" అర్ధరేకులు " లేక " అర్ధచంద్రికలు "

చిత్రకవి పెద్దన, అప్పకవి త్రిపుట, జంపె మొదలగు రేకులందు సగము పరిమితి గలవి అర్ధచంద్రిక [4] లని సూచించిరి. ఇట 'చంద్రిక' యనఁగా రేకు — అనఁగా చంద్రరేఖ (రేకు 'రేఖా' శబ్దభవము కావచ్చును.) అని యర్థము చెప్పవలెను. ఉదాహరణ కావ్యము లందు రగడ భేదము లగు కళికోత్కళిక లెట్టివో యక్షగానము లందీ రేకులు నర్ధచంద్రికలు నట్టివి. అనేక యక్షగానము లం దర్ధచంద్రికలను పేరే కన్పట్టును. కాని

4. ఇది తాళ్లపాకవారి సంకీర్తన లక్షణము 53 వ పద్యమునఁ జేర్కొనఁ బడిన అర్ధచంద్ర పదము గాదు. దాని లక్షణము దీనికి నప్పదు.

కొన్నిట ఏ "అర్ధశేకులు" అను పేరును గన్పట్టుచున్నది. మన యక్షగానము లందు శేకు లెంత ప్రాచీనములో అర్ధచంద్రికలు నంత ప్రాచీనములే. చక్రపురి రాఘవాచార్యుని విప్రనారాయణ చరిత్రము, రుద్రకవి సుగ్రీవ విజయము పాపరాజు విష్ణుమాయా విలాసము మొదలగు ననేక యక్షగానము లందర్ధ చంద్రికలు గలవు. (వి. నా. చ., సు. వి. లం దర్ధచంద్రికలలోనే షష్ట్యంతములు చెప్పఁ బడినవి). ప్రాయికముగా, శేకు లెన్నిగతుల నుండునో అర్ధచం ద్రికలు నన్ని గతుల నుండును. సుగ్రీవ విజయమున ఏకతాళి జంపె, త్రిపుటలలో అ. చం. లు గలవు. (చూ. కపిలేశ్వర పురము ప్రచు రణ. పుటలు 2, 14, 17). ఒక్కొకచో నర్ధచంద్రికలకు రాగములు గూడఁ జేర్కొనఁ బడినవి.

ఉదా :-పోలుగంటి వెంకట కృష్ణయ్య శారద కొరవంజి నుండి:-

"పన్నీట జలకంబు బాగుగా నాడెన్
సరిగంచు చీర చుంగులు దీర్చి కట్టెఁ" మొ.

5. లక్ష్మణా కల్యాణము (ఆం. ప. మం. ప్రతి).

ఒక గమనిక :— నాగవర్మ ఛందోంబుధి యందు (III. 254–56) రఘుటా బంధ ప్రభేదములుగా ఁ జెప్పిన మందానిల లలితోత్సాహ లక్షణము లచ్చమచ్చు వరు సగా మన మధుర, ద్విరద, తురగవల్గన గతుల రగడలకు సరిపోవుచున్నవి. అందే (V. 310) చెప్పబడిన ఛందోవతంస లక్షణము మధుర గతియే. ఇఁక ఛందోం బుధి యందు రగడ ప్రభేదములుగాఁ జెప్పఁబడక పోయినను దద్విస్తారము లనఁదగు షట్పదీప్రభేదములు గతి సన్నిహితత్వమును బట్టి శరషట్పది పరివర్తినీ షట్పదులు మన మధురగతికిని, కుసుమషట్పది వార్ధికషట్పదులు ద్విరదగతికిని, భోగషట్పది హాయ ప్రచార గతికిని, భామినీషట్పది హరిణ గతికిని దీటుగా నున్నవి. ఆయా రచనా ప్రక్రియల ప్రచార ప్రాచీనతకు సూచకముగా నీ విషయ మిట నుటంకింపఁబడినది.

తాళములు

కన్నడ లాక్షణికుఁడగు కవి జిహ్వాబంధకారుఁడు ఏక త్రిపుటాదులను దాళములుగా "రఘుటా" భేదములుగాఁ బరిగణించి నాఁడు. మన కస్తూరి రంగ కవియుఁ దన యానందరంగ రాట్ఛంద మున నవవిధ రగడలకుఁ దాళములను బరిగణించుచు జంపె త్రిపు టాదులను దాళములుగాఁ బేరొక్కనినాఁడు. అతని పరిగణన :-

(1) హరిగతి :- ఆటతాళము (కాని హరిగతి మధురగతికి రెట్టింపు. మధురగతి కేకతాళము చిత్రకవి పెద్దనాదులు చెప్పిరి. అది కుదిరినది. హరిగతికి నేకతాళమే కుదురును).

(2) హయ ప్రచార తురగ వల్గన విజయ మంగళములు - రూపకతాళము. (రచ్చ రేకునకుఁ దురగవల్గన గతిఁ జెప్పిరి పూర్వ లాక్షణికులు)

(3) మధుర గతి - ఏకతాళము.

(4) ద్విరదగతి, విజయ భద్ర - జంపెతాళము.

(5) హరిణగతి, వృషభగతి - త్రిపుట తాళము.

(3, 4, 5 ల విషయము పూర్వలాక్షణికోక్తికి సరిపడి యున్నది.)

ఈ జంపె త్రిపుటాదులు మన యక్షగానములందుఁ గొన్నిట జంపె త్రిపుటలని మాత్రము, కొన్నిట జంపె రేకులు, త్రిపుట రేకులు ననియుఁ గొన్నిట జంపెతాళము, త్రిపుటతాళము ననియుఁ బేరొక్కనఁ బడినవి. అనఁగా రేకులనఁగా దాళ ప్రధానములును రగడ వికృతులునైన గేయరచన లను సిద్ధాంత మేర్పడు చున్నది.

అసలీ జంపె, త్రిపుట, అట, ఏక, రూపక తాళములును, ధ్రువ మత్య తాళములును గలిసి సూళాది సప్త తాళములుగా సంగీత ప్రపంచమునఁ బ్రసిద్ధములు.

" ధ్రువో మత్తోరూపకశ్చ ఝంపతాళ తృతీయకౌ
అడ్డతాళ శ్చైక తాళీసూడ తాళా భవస్త్యమీ "

— చతుర దామోదరుని సంగీత దర్పణము.

వాని లక్షణములు సంగీత దర్పణాది సంగీత శాస్త్ర గ్రంథములందలి తాళాధ్యాయమునుండి యెఱుఁగ నగును

(ఝంప = జంపె; తృతీయః = త్రిపుట; అడ్డః = అట లేక ఆట)

మన యక్షగానములందు వీని ప్రాచుర్య క్రమమిట్లుండును :-

జంపె, త్రిపుట, అట, ఏక, రూపక, మత్య, ధ్రువ.

ఇందు మొదటి నాల్గింటికి నుదాహరణములు మీఁదఁ జూపఁ బడినవి. కడమ వాని కుదాహరణములు :-

1. ధ్రు వ తా ళ ము.

" కోలుకో లెన్నయని కుందరదన లారా
చాల నాడుదము రారే శాహేంద్రు ముందఱ "

2. మ త్య తా ళ ము.

" నరస నద్గుణుఁడూ శాహ భూ వరుఁడూ
అరయ మెచ్చనతడూ ఆడుద మిపుడూ"

3. రూ ప క తా ళ ము.

" కోలు కోలె యనుచు నాడి కొమ్మలార నేను శహభూ
పాలు చేత బిరుదు లందెద బాగు మీఱఁగ "

— గిరిరాజ కవి వాద జయము నుండి.

జంపెవిషయమున నొక రెండు విశేషములు గలవు.

1. కు ఱు చ జం పె :— మొదటి పాదము రెండు జంపె దళములు, మూఁడ నాఱు మాత్రలు; రెండవ పాదమున రెండు జంపె దళములు, మూఁడ రెండు మూఁడు మాత్రలులును గలిగి రెండేసి పాదములకుఁ బ్రాసవిహితమై యుండు నది.

ఉదా :- గరుడాచలము నుండి

" ఎవరి పడుచవె నీవు కొమ్మ, నాతో
వివరింపవే ముద్దుగుమ్మ "

2. ఎ ఱు క ల జ ం పె :- అక్కజము! దీనిగతి జంపె లక్షణ మగు ద్విరద గతికాదు. రచ్చ రేకున వలెఁ దురగ వల్గన గతి గన్పట్టు చున్న ది. రెండేసి పాదములకుఁ బ్రాసవిహితము

ఉదా :- గురునంబి చరిత్రనుండి

" యత్న మెట్టినారుచూడు పాపకర్ములెల్ల రాజ
రత్నమా పరామరించు రమణ మా మొరాలకించు "

ఈ సప్త తాళములు గాక యితరము లనేకము య. గా. లందు వాఁడ బడినవి. అం దాది తాళము ముఖ్యమైనది. అదియుదాహృత పూర్వము. మిగిలిన వానిలో విశిష్టము లొకమూఁడు మాత్ర మిట నుదాహరింపఁ బడును.

1. ల ఘు శే ఖ ర ము :— ఇది నారదుని సంగీత మకరందము నందును (నృత్యాధ్యాయము, తాళ లక్షణ ప్రకరణము — శ్లో. 61)

పార్శ్వ దేవుని సంగీతసమయ సారము నందును (7-57) తాళప్రభేదముగాఁ బేర్కొనఁ బడినది. అందు "ఏ కే న స వి రా మే ణ లఘునా లఘు శేఖరః" అని దీని లక్షణము. ఇది పాపరాజు విష్ణు మాయా విలాసము, (4 సారులు) అక్కయ కృష్ణవిలాసము మొ... కొలఁది య. గా. లందుఁ బ్రయుక్త మైనది.

ఉదా:- వి. మా. వి. నుండి

"నన్ను ధిక్కరించినాడు నారదుండు నాతి రీతి
నున్న నిన్ను గన్న బ్రమసి నన్ను నిన్ను మఱతు నసుచు"

ఇందలి తురగ వల్గన గతి గమనింపఁ దగినది. (కృ. వి. డిటో)

2. రచ్చ తాళము :- "రచ్చతాలే లఘుః ప్రోక్తో దవిరామః ప్రకీర్తితః" అని సంగీత దర్పణము. కాని మన లక్ష్యములు కొంత విలక్షణముగా నున్నవి :-

"కొలిచి రంబుజ సంభవాదులు, తెలివి మీఱిన బ్రహ్మవాదులు
బలహరాది సుధారసాదులు, భక్తి యుక్తులు వెలయ సాదులు"
విష్ణుమాయా విలాసము.

"మువ్వలు గదలఁపుండ, ముచ్చువలె వచ్చి దండ
పవ్వళించియే ముండ, పాలు త్రాగు పొట్టనిండా"
— అక్కయ కృష్ణవిలాసము.

మొదటి దానిలో వృషభగతి స్పష్టపడినది. రెండవ దానఁగూడ నొక గతి కలదు గాని మొదటి దానికంటె విలక్షణముగానున్నది.

3. చిత్ర తాళము :- సంగీత దర్పణమున దీని లక్షణము :-

"అణుద్రుతో భవేద్యత్ర చిత్ర తాళః ప్రకీర్తితః
ద్రుతేత్వేకతాలీ స్యాత్ కథితా భరతాదిభిః"

ఈ చిత్రతాళమున కొక్క– లక్ష్యము గన్పట్టు చున్నది.

"చిత్రవన్నెల పట్టు కోక లతి
చిత్రముగా గట్టె నొప్పుగాను
దండి వెలయు ధళ ధళ మని డాకాల
పెండెము బెట్టెను బిరుదుల పొగడన్"

— విశ్వేశ్వరుని ధర్మపురి మహాత్మ్యము.

ఇందుఁ గొఱవడిన గతిసమత గానకాలమున నణు ద్రుతివలనఁ జూడవచ్చును.

గమనిక :- శహాజీ త్యాగ వినోద చిత్ర ప్రబంధమునఁ బ్రబర్మితమైన తాళ వైవిధ్య వైచిత్రి యింతింత గాదు. అందు బసవ శంకరము, హనుమత్కుంభము మొదలగు దేశితాళ విశేషములును గలవు. సంగీతజ్ఞులకా గ్రంథము ప్రత్యేకము పరిశీలనార్హము.

---

2 దరువు

సీ. మా.

..... యక్షగానంబునకును
పద్య గద్యంబులు బహువిధ తాళముల్
రేకులు గూర్పవర్తిల్లు ; నాట
కమున కట్టుల పద్య గద్యముల్ దరువులు
విరచింప వింతగా పరిథవిల్లు ''

ఇది 17 శతాబ్ది నడుమ నుండిన గణపవరపు వేంకటకవి లక్షణ శిరోమణి (ఆం. సా. ప., నం. 31 ఎ) ప్రథమోల్లాస మందలి వక్కణ. దీనినిబట్టి యక్షగానములు వేఱనియు నాటకములు వేఱనియు రెంటను పద్యగద్యములు సమానములైనను య. గా. లందు రేకులును. నాట కములందు దరువులును విశేషము లనియు ననఁగాఁ రేకులును దరువు లును వేఱనియు నేర్పడుచున్నది. అట నాటకము లనగాఁ బూర్వము మనకుఁ దెనుఁగున మార్గ నాటకముల వంటి నాటకములులేవు కావున వేంకట కవి యుద్దేశించినవి వీథి నాటకములు గావచ్చును. వీథి నాట కము యక్షగానముల పుట్టువు పొలఁకువలు వేఱు వేఱు కాని కాల క్రమమున యక్షగాన మొక రూపక ప్రక్రియగాఁ బరిణత మగుసరికి రెండు నేకమైపోయి యుండవచ్చునను నూహ కవకాశము గలదని మీఁదఁ జెప్పబడినది. నాటకములని వేరొక్కనఁబడిన వానిలో యక్ష గానలక్షణములు, యక్షగానములని వ్యవహరింపఁబడిన వానిలో వీథి నాటక లక్షణములును — ఇట్లు అన్యోన్య గుణ సంక్రమణము గల గ్రంథ జాలమెంతయో గలదు. (అట్టి య. గా. నాటక గ్రంథజాలమంతయు నీ గ్రంథము ద్వితీయభాగమున సమీక్షింపఁ బడినది) అట్లే "దరు వులు" గల యక్షగానము లనేకము గలవు. రేకులగు జంపె, త్రిపుటా దులు గలిగి నాటకము లని వ్యవహరింపఁ బడిన గ్రంథము లెన్నియో

కలవు. ఆ జంపె త్రిపుటాదు లనేక యం. గా. నాటకములందు దరువు లనియే పేర్కొనఁబడినవి. (చూ. ద్వి. భా.) కొన్నిట వట్టి "దరు వులు" గా మాత్రమే పేర్కొనఁ బడిన వానియందును జంపె త్రిపు టాది తాళ గతులను స్పష్టముగా గుర్తింపవచ్చును. తరువాతఁ దరు వాత దరువులు రాగ తాళోభయ ప్రధానములుగను రూపొందినవి. అసలు శేషనునది ఛందో నిర్దేశముగల లాక్షణిక నామము. దరువు సంస్కృత నాటకములందలి ధ్రువ వలె ప్రయోజన వ్యవహారనామము. అందుచే దరువు రచనలో నేకైకనఁ గావచ్చును లేక తత్ప్రయోగ సందర్భములకుఁ బనికివచ్చు నెట్టి గేయ రచనయైనఁ గావచ్చును.

దరువు ధ్రువా శబ్దభవమని పండితుల తలంపు. సంస్కృత నాటకములందు ధ్రువాగానమునకుఁ బ్రస క్తి కలదు. భరతుని నాట్య శాస్త్రమున ద్వాత్రింశాధ్యాయమున ధ్రువా విధానముగూర్చి ప్రత్యే కముగాఁ జెప్పఁ బడినది. అందు ధ్రువాగానము ప్రవేశాక్షేప నిష్క్రా మ ప్రాసాదికాంతరములని పంచవిధములుగాఁ జెప్పఁబడినది. సంగీత సమయసారమున ధ్రువ ఏకాదశ విధములుగాఁ జెప్పబడినది. కాని నాట్య దర్పణ, భావ ప్రకాశ, వసంతరాజీయాద్యనేక గ్రంథము లందు భరత మతమే పునశ్చరణ చేయఁ బడినది. నాట్యదర్పణమున ధ్రువా లక్షణమునకు లక్ష్యోపసర్జనమైన చక్కని వివరణయు, సమన్వ యమును గలవు. ఆ యా లక్ష్యలక్షణములను జూచినచో బరిణత ప్రక్రియలగు మార్గరూపకములందు ధ్రువా ప్రయోజనమున కొక సాంకేతిక ప్రతిప్రత్తి యున్నట్లు తోఁచును. మన యక్షగానపు దరు వులయెడ నట్టి సాంకేతిక ప్రతిప త్తి యంత కానరాదు. భరతాదులు చెప్పిన ప్రావేశిక్యాది పంచవిధ ధ్రువలలోఁ ప్రావేశిక ధ్రువకు మాత్రమే మన యక్షగానములందు విశేష ప్రస క్తిగలదు. భామ

కలాపాదులందు నర్వాచీన య. గా. లందును బాత్రలు తెర బయ
ల్వాడలు సందర్భము లందున్న దరువు లీ కోవకుఁ జెందును. కాని
యట పాత్రప్రవేశ సందర్భములందు గల దరువులను ప్రావేశిక
ధ్రువ లనుకొనుట తప్ప నందాసాంకేతిక ప్రతిపత్తి చక్కఁగాఁ బొదు
కొనియుండలేదు.

ఉదా :-

"ప్రవిశతః పాత్రస్య రసభావ ప్రకృత్యవస్థాదికం ప్రవేశ
శబ్దేనోచ్యతే, తదనుసారేణ శ్లేష-సమాసోక్త్యా దలంకృతం యద్రూ
పకం గీయతే సాప్రవేశః ప్రయోజన మస్యా ఇతీ కణీ ప్రావేశికీ"

— నాట్యదర్పణము.

ఇందుల కుదాహరణ అనర్ఘరాఘవమున స్వాశ్రమ రక్షణా
ర్థము రామాకర్షణార్థ మరుదెంచిన విశ్వామిత్రుని ఆదితోర్యదయ
వర్ణనావ్యాజ ప్రవేశ సందర్భము. ఇంత "పకడ్‌బంద్" గా నుండదు
మన దరువు లక్షణము. వసంత రాజీయ* లక్షణము మాత్రము కొంత
సరిపడునట్లున్నది.

ఉదా :-

"సూచనే పాత్ర భేదానం తత్త్వ భావార్థ సూచనీ
యా గీతిః సాధ్రువా తుల్య సంవిధాన విశేషణే,
ప్రవేశ సూచకా దౌతు ధ్రువా ప్రావేశికీ మతా."

ఇట్టి సామాన్య లక్షణము మన య. గా. లందలి పాత్ర ప్రవే
శపు దరువులకు సరిపోవును.

* ఇది యిపు డుపలబ్ధము గాదు. నాచెండ్ల గోపమంత్రి ప్రబోధ చంద్రోదయ
నాఖ్యానమున నీ వ. రా. నందలి ధ్రువా లక్షణ మాహరింపఁ బడినది.

14–15 శతాబ్దుల నుండి మన వాఙ్మయమున ధ్రువా ప్రశంస వినబడు చున్నది. భీమఖండమున ప్రావేశిక ధ్రువాగాన ప్రసక్తి గలదు. సింహాసన ద్వాత్రింశికలో ధ్రువా ప్రబంధము పేర్కొనఁ బడినది. తాళ్ళపాక వారి సంకీర్తన లక్షణమున "దరువు పేర్కొనఁ బడినది. 16శ. చివరినుండి య. గా. లలో "దరువు" కన్పట్టును. పోను పోను, య. గా. లలో "దరువు" నకే పలుకు బడి హెచ్చినది. సూర్ణ రూపకములందు వలెఁ బంచప్రకార సాంకేతిక ప్రతిపత్తి లేక పోవచ్చును గాని మన యక్షగానము లందు దరు వనేక ప్రయోజన ముల కుపయుక్త మైనది - పాత్రవర్ణన, ప్రవేశము, స్వీయోదంత కథనము, పాత్రాంతరములతో సంవాదము, ప్రకృతి వర్ణన, సన్ని వేశ వర్ణన, కథానుసంధానము మొ... ఇవి బహుయక్షగాన సామాన్యములైనవి. విశేషములు గొన్ని మచ్చుకొక్క లుదాహరింపఁ బడును.

1. కొ ర వ ం జి ద రు వు లు :— ఈ పేర విజయ రాఘవ చం ద్రికా విహార విజయ రాఘవ కళ్యాణాదు లందు కొరవంజి వేషభాషలు వర్ణితములైన దరువులు గలవు.

ఉదా :- మాళవి - తివడి (త్రిపుట)

" జింకపొక్కిటి యసట దీఱిన ।
చిన్ని తిలకము మించగా
సంకుకడెములు నూరు వజ్రపు ।
సంది దండలు మెఱయఁగా వచ్చెనెఱుకత వచ్చె॥ "
ఆరజముగా నెరిక పోసిన
పొరిదిచీర చెఱంగులు
పొదమల రాడగా ॥వచ్చె॥

గుబ్బచన్నుల మీద జేర్చిన
గోవకెంపుల పేరులు
గబ్బిగా గురిగింజ పూసల
కంట నరులై మించగా ॥వచ్చె॥

2. జక్కిణి దరువు :—జక్కిణి యొక నృత్య విశేషముగా బృహద్దేశీత్యాది గ్రంథములందుఁ జెప్పఁబడినది. తదుపయుక్తమైన గీత ప్రబంధ విశేషమే యీ జక్కిణి దరువు.

ఉదా : తిరుమలకవి చిత్రకూట మాహాత్మ్యమునుండి :-

ధన్యాసి - ఆది

సకల నటన విభేద చమత్కార ప్రకార
ప్రకటన కరణి సమరథు
నటనుతు మేటి భోజాణరే
నటన సురధాణరే
సుద్ధసమ్మాణ కాణ రే॥

3. గుజరాతి వగవింత కోపు దరువు :—ఇదియుఁ జిత్రకూట మాహాత్మ్యము నందలిదే. ఇదియు నభినయోపయోగి యైనదే. రెండింటి యందును భాషాంతర ప్రయోగము గమనింపఁ దగినది.

ఉదా :— అసావేరి - ఝంపె

ద్వారకాధిపు నటన పరవిణుతు మిరే
తుమెచచారు పదపదుమ భంజనవరు సామిరే ధీరురే
భక్తమందారురే మేరునగ ధీరురే॥

4. కోలాట దరువు :- ఆడు పిల్లలచే దండలాసక క్రీడావసరము లందు పాడఁబడుట కుద్దిష్టమ్ములైనవి. అడుగునకుఁ దగిన నుడుగు కోలు కోలను నార్చటము, కైశికీ వృత్తియుఁ దీని ప్రత్యేకతలు. గిరిరాజు కవి వాదజయ మందలి కోలాట దరువు లుదాహృత పూర్వములు.

5. కోలాటవర్ణము :- ఇదియు నొక విశేషమైన దరువే. కోలాటకు దీనికిని సంబంధములేదు. కోలాటదరువునకును దీనికినిపోలిక తక్కువ. దానిగతి వేఱు, దీనిగతివేఱు. ఇందు 'కోలు కోలు' అను నార్భటములేదు. మఱి దీని కావేరెట్లు వచ్చినదో !

ఉదా : ఆలూరి కుప్పనార్యుని పార్థసారథి విజయము నుండి :-

రాగం - భైరవి

తొడరి గోవులకు దూడలను విడువకనూ
విడివడిన లేగలను బడిబడి కట్టకనూ॥
కాచిన యట్టి పాలకడవలు డించకనూ
కాచక నిడినపాలు కాచుటకు తోచకనూ॥
వెలయు శ్రీగోపాలుని వేణుగాన మాలించి
వెలువడిరి గోపికలు వింత వింత వైపుమించి॥

6. వృత్తదరువు :- ఎత్తుగడ వృత్తమై సగములో దరువు ధోరణికిఁ దిగిన నది వృత్తదరువు. (ఇదే వృత్తార్ధమనియుఁ గొన్నిట వ్యవహరింపఁబడినది. 18 శ. కి ముందిట్టివి కన్పట్టుటలేదు.)

ఉదా : ఎల్లయ చంద్రతారా విలాసమునుండి :-

తోడి రాగము

వృ. " సుందరమైన రూపమును జూచి మనంబున నాస చేతుగా
నందమునొంది తార హరిణాంకుని ప్రక్కను నిల్చియేమిరా

ద. దంధాన సేయగ నేను మారుని 'బారి
తొందర కోర్వగలేను
డెందము కుందగ చిందర డెందుచు
కందువ లరయుచు సందునఁ బొందగు....దం."

7. టప్పా దరువు :- భీమసింగి కవిరాజు రాజారాణీ విలాసము నందును, వెంకటకృష్ణాజెట్టి శివపారిజాతము నందును గలవు. (రా. రా. వి. న టుమ్రిలును గలవు. టప్పాలు టుమ్రిలును మరాటీ గీత విశేషములు) వీని రచనయందు విశేషము కానరాదు.

ఉదా :— శి. పా. నుండి :-

"ఇందుధరు నిందు దేవే చంద్రవదనా
ఇందుముఖి శ్రీపార్వతీ సుందరుని....ఇందు"

గమనిక : దరువులలో శహాజీ రచించిన దరువులకొక ప్రత్యేకత గలదు. అందుచే నవి ప్రత్యేకము ప్రసక్తములు. చూ. అనుబంధము(శి).

3 ద్వి ప ద.

రేకులు, దరువుల తరువాత యక్షగానమునఁ బ్రధానమైనది ద్విపద. ప్రాయికముగా ద్విపదలేని యక్షగానమే లేదన వచ్చును. అది యక్షగానములో నెన్ని యవతారము లెత్తినదో చెప్పనలవి కాదు. ద్విపద దేశిచ్ఛంద మనియే యనేకాంధ్ర విద్వాంసుల విశ్వాసము. కాని సంస్కృత ప్రాకృతము లందది చాల కాలము నుండి ప్రచారమున నుండినట్లు తెలియు చున్నది. వైదిక వాఙ్మయ ములో ద్విపదా గాయత్రీ, ద్విపదా జగతీ, ద్విపదా శత బృహతీ, ద్విపదాత్రిష్టుప్, ద్విపదా విరాట్ అను ఛందస్సులు గానవచ్చుచున్నవి. ద్విపద, ద్విపది, ద్విపదిక, ద్విపఛగ ద్విపదీ ఖండము. దోహా (ప్రాకృతము) మొదలగు వివిధ నామములతో నొక ఱుగ్వేదమనియు, గీత ప్రబంధమనియు, మాత్రా వృత్తమనియు నిట్లు బహు భంగులుగా వివిధ గ్రంథము లందు దాని ప్రశక్తి కాన నగుచున్నది. ఆ ప్రసక్తి యెట్టిదో అది మన ద్విపదకు సరిపడునో లేదో చూతము:-

1. వా చ స్ప త్య ని ఘ ం టు వు:—

ద్విపదికా - ద్విపదీ ; స్వార్థే 'క' హ్రస్వః గీతి భేదే. "శుద్ధా ద్విపదికా గీతిర్జంభ లేత్యభి ధీయ తే" భరతః. ద్విపదికయా దిశోవలోక్య నిః శృస్య సాస్రమ్" – విక్ర మోర్వశీయమ్.

ద్వి ప దీ:— ఱుగ్భిన్నే. (1) ద్విపద యుక్త గీతి భేదే. (2) మాత్రా వృత్తా భేదేచ. "ఆదౌ షట్కలమేతత్ తదను పంచ చతుష్కలమ్, గుర్వంతం ద్విపదీభవ తీహ వింశత్యష్టకలం దలమ్"

"గాయత్ర్యస్యైక పదీ ద్విపదీ చతుష్పద్య పదసి నహి పద్యసే"
– శతపథ బ్రాహ్మణము 14,8, 1510.

2. శ బ్ద స్తో మ మ హా ని ధి :—

ద్వి ప దా :— స్త్రీ. ద్వౌ పాదావ స్యాః — పాదస్యాన్తలోపః టాప్ — భ త్వాత్పదా దేశః. ఋగ్వి శేషే ఛందో భేదే జీప్—ద్విపదీ.

3. శ బ్దా ర్థ చి ం తా మ ణి :—

ద్వి ప దా — స్త్రీ. ఋగ్వి శేషే. ద్వౌ పాదావస్యాః సంఖ్యాస పూర్వస్యేతి పాదస్యాన్తలోపః — టాబ్భవీతి టాప్ — పాదః పత్.

ద్వి ప దీ — స్త్రీ. మాత్రా వృత్తాంతరే. " ఆదా మట్కా మే త త్ ..... "

4. భ ర త నా ట్య శా స్త్ర ము :—

విక్ర మోర్వశీయమున ద్విపదిక పేర్కొనఁబడినది కాని యందు లక్ష్యము లేదు. తదాఖ్యాత భరత ప్రోక్త ముగా ద్విపదిక లక్షణము నిట్లుటంకించెను. :—

" క్షుద్రాక్షుణ్ణాచ మాత్రాచ సంపూర్ణేతి చతుర్విధా
ద్విపదీ కరణాఖ్యేన తాలేన పరిగీయతే
పాదేభ్యః పంచ భాగోన్తే జౌ స్తృతీ షష్ఠ ద్వితీయ కౌ
చతుర్భి రీదృశై ర్పాదైః క్షుద్రా ద్విపది కోచ్యతే.
అర్ధాంతేన్యే స్వరా నాహుః ఖండాస్యా చ్ఛుద్ధ యార్థయా
షష్ఠేనైకేన గురుణా మాత్రా ద్విపది కా మతా,
జ్ఞేయా క్షుద్రైవ సంపూర్ణా గురుణాంతేధి కేనతు. "

ఇది భరతమునఁ గన్పట్టుట లేదు. ఇదే యథాతథముగ సంగీత రత్నాకరమునఁ గలదు. (అధ్యా. 4 శ్లో. 214-217) కాని ద్విపదిక జం భ లా నామక మగు నొక గీతి భేదముగా భరతుఁడు చెప్పినట్లు వాచస్పత్యమునఁ గలదు కదా. విక్ర మోర్వశీయమునఁ

జతుర్థాంకమున ద్విపదికకు లక్ష్యము లేమకాని జంభలిక యను నొక గీతమునకు లక్ష్యము గలదు.

ఉదా :– (పాక్కృతము) :–

" సహ అరి – దుఖ్ఖాలిద్ధ అం
సరవర – అమ్మి సిణిద్ధ అం
అరవిల – వాహ – జల్లోల్ల అం
తమ్మ ఇ హంసీ - జు అలిం"

దీనిపై రంగనాథుని వ్యాఖ్యానము :–

" జంభలికా గీతి విశేషః తథా చాహ భరతః ఉద్దర్శిహోది సకృద్వైర్యక ఖండోద్విశక లోధవా. యత్రధ్రువో ద్విర్వాభోగో (?) ధ్రువేము క్తిః స జంభకః. – ఇతి, " ఏతస్యైవనామ జంభలికేతి మతంగ మతమ్. ధ్రువే ముక్తి రహితా పూర్వోక్తలక్షణ లక్షితా నేతి శ్రీమద్భట్టసోమేశ్వర చరణాః "

(ఈ జంభలికయే ద్విపదిక రూపాంతరమగు జంభలయగునా ?)

5. మతంగుని బృహద్దేశి :–

" యాస్మాత్ కరణ తాలేన ద్విపదీ వృత్త సంగతా
సా భవేత్ ద్విపదీ నామ ప్రోక్తా వస్తు విచక్షణైః
ఆద్యం పాద ద్వయం యత్రస్యా దను ప్రాస వర్జితం
అనుప్రాస స్తృతీయేపి చతుర్థేవాథ గీయతే."

6. జనాశ్రయి :– అధ్యా. 5. సూత్ర. 54 - 58

సూ, " గణాస్త్రయో భంగ ద్విపదీ" - 54

వృత్తి. త్రయోగణాః ప్రతిపాదం భవన్తి చేత్
భంగ ద్విపదీ నామ భవతి, గణాధికార వర్త

మానే పునర్గణ గ్రహణం చతుర్లఘూనాంచ
సర్వేషాం గణానా మభేదేన గ్రహణార్థమ్.
ఇతరధాహి చతుర్లఘూనా మేవ గ్రహణం స్యాత్.

సూ. " చత్వారం పంచషట్ సప్తవా " – 55.

వృత్తి. తస్యా ఏవ భంగ ద్విపద్యా న కేవలం త్రయ
ఏవ గణా భవన్తి చత్వారో వా పంచవా
షడ్వా సప్తవా భవన్తి.

సూ. " భాంతేవా " – 56.

వృత్తి. తస్యా భంగ ద్విపద్యా ప్రతి పాదం గురురన్తేభవతి వా న వా.

సూ. " త్రింశద్ధా పరమా " – 57.

వృత్తి. త్రింశల్లఘవో యస్యా భంగ ద్విపద్యాః
సా భవతి త్రింశద్ధా పరమాధికా భంగ ద్విపదీ.

తతః సర్వాభ్యో భంగద్విపదీభ్యో యా పరమా సా
త్రింశద్ధా భవతి తదధికా నా స్తి"

సూ. " ద్విపదీ గీతికా పరా " – 58.

వృత్తి. సైవ భంగ ద్విపదీ ద్విపదీత్యు చ్యతే గీతికా
పరా భవతి చేత్.

ఉదాహరణమ్ :– (ఒక్కొక్క పాదము మాత్రము)

" క్షీణమంబు వా పీము సరిత్తుచ సామ్రుతం
రక్ష్యమాణం బహు ధన మిహ భాగ్య విపర్యయే " ?
" కరుణాకర నిష్కరుణేన వాయునా
రిపు వారణ దాన గంధినా. "

7. రత్నావళి :– ఇందు ప్రథమాంకమున ద్విపదీ ఖండమునకు. ప్రాకృతమున నొక లక్ష్యము గలదు. అందుండి ఉదా :–

" కుసుమా ఉహ పి అదూ అఓ
ము ఉలా ఇర బహు చూ అ ఓ
సిధిలి అ మాణగ్గ హణఓ
వా అ ఇ దా హిణ పవణఓ. "

(భావప్రకాశమున 'కావ్య' మను నుపరూపకము 'సభగ్న' తాళ ద్విపదీ ఖండ మాత్రా పరిష్కృత" మ్మనియు, "కల్పవల్లి" యను నుపరూపకము "ద్విపదీ ఖండ గేయాఢ్య" యనియుఁ గలదు. బాణ భట్టు కాదంబరి పూర్వభాగమునఁ 'ద్విపది' యొక పాఠ్యవిశేషముగాఁ బేర్కొ-నఁబడినది).

8. మా న సో ల్లా స ము :-

"త్రయోగణా గుళ్ఛాంతే ప్రథమేధ తృతీయకే
ద్వితీయేచ తురీయేచ ద్వౌ గణా ద్వౌగురూ తథా
జగణో నాత్ర కర్తవ్యో భాగాంతే యమకం భవేత్
ఇతి ద్విపదగం నామా తస్యోదాహృతి రుచ్యతే.
గాతవ్యః స్వరసంయుక్త స్తాలేన పరివర్జితః
ప్రబంధో ద్విపదాభిఖ్యో గీతి విద్యా విశారదైః
షట్కలో గణ అద్యస్య తతః పంచ చతుష్కలా
అంతే గురు ర్ద్వితీయే జ: షష్ఠేచ ద్విపదీ తు సా
పాదద్వయాంతే కర్తవ్యః స్వరన్యాసో యథోచితః
ఏనకేనాపి తాలేన గాతవ్యా ద్విపదీ బుధైః "

9. స ం గీ త చూ డా మ ణి :-

" సంస్కృతే యే ద్విపదగాః ప్రాకృతే దోహ కాళ్ఛతే
అభీష్టమాత్ర తాళ: స్యా దాభోగో అన్య పదైః కృతః
స్వరైర్న్యాసో విధాతవ్య తాళమాన ద్వయేన వా. "

10. స ం గీ త ర త్నా క ర ము : విక్రమోర్వశీయ వ్యాఖ్యాత భరతముని ప్రోక్తమైనదిగాఁ బేర్కొ-నిన ద్విపదీ లక్షణము యథాతథ

ముగా నిందున్నదే. అదికాక "ద్విపథ ప్రబంధ" మనున దొకటి మాత్రాభేదమునుబట్టి బహుభంగులైనదిగా, నిదే ప్రాకృతమున 'దోహా' యనియుఁ బేర్కొనబడినది. (ఈ 'దోహా' కు నాలుగు పాదములు; 1, 3, పాదములకు పదుమూఁడును, 2, 4 పాదములకు పదునొకండును మాత్రలుండును. చూ. కోల్ బ్రూక్. పుట 413).

సం. ర. వ్యాఖ్యాన (కళానిధి) కర్తయగు కల్లినాథుడు "ద్విపథం దోధక మితి పర్యాయశబ్దా, తేన దోధకలక్షణమేవ ద్విపద లక్షణం వేదితవ్యమ్. దోధక లక్షణంతు భౌ భగౌ గితి" యని వక్కాణించినాఁడు.

11. సంగీత సుధాకరము:

"కరణాఖ్యేన తాలేన గాతవ్యో గమకాంతరే
ఆభోగోన్య పదైః కార్యో న్యాస స్తాలా ద్విమానతః
ద్విపదీచ భవవే దేవమ్".

12. కన్నడ ఛందోబుధి:- ఇందు ద్విపద దువయి, దువవిగ, దువది మొ॥ పేరులతోఁ బేర్కొనఁబడినది. (IV. 293-95). అందుఁ దత్పాదమునకు 28 లేక 26 మాత్రలుండునని చెప్పఁబడినది.

13. కవిజనాశ్రయము:-

"ఇంద్ర గణములు మూఁడినగణం బొకటి
చంద్రాస్య ద్విపదకుఁ జనుఁ జెప్ప రేచ"

ఈలక్షణమే ఆంధ్రలాక్షణికు లందఱిచేతను బునశ్చరణచేయఁబడినది. మనద్విపదకు యతిప్రాస నియతి గలదు. మంజరీ ద్విపదకు గణని యతి యింతే కాని ప్రాస నియతి మాత్రములేదు. (విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణిలో ద్విపద "ద్విపది" యని

పేర్కొనబడుట విశేషము) మన ద్విపద మాత్రాచ్ఛందో గీతప్రబంధ వైఖరులు గలిగియున్నది. (ఇంద్ర చంద్ర సూర్యగణాదులు నిసర్గగణములుగావు. మాత్రాచ్ఛందస్సులను గొలుచుటకుఁ బ్రక్రియా సౌలభ్య పరాయణులైన లాక్షణికులు పట్టుకొనిన కృతకములైన కొలబద్దలు. "ద్విపద ప్రబంధమున" పల్నాటి వీరకథ పాడఁబడెడిదని క్రీడాభిరామమున 15వ పద్యమునఁ గలదు. ద్విపదకు ద్విగుణమగు తరువోజ దంపుళ్ళపాటయని కావ్యాలంకార చూడామణియందు 8-50. చెప్పఁబడినది. యక్షగానములందుఁ బ్రయుక్తములైన లక్ష్మీకల్యాణాది గీతములు ద్విపద వికారములు) కాని మిగాద వివిధ సంస్కృత గ్రంథములనుండి యన్ని లక్షణములెందుల కెత్తిచూపబడిన వనఁగా నందే దియు యథాతథముగ మన ద్విపద లక్షణమున కెన కాదని చూపుటకే. "ఆదౌషష్ఠ-ల...ఇత్యాదిలక్షణమున ముఖ్యముగా గమనింప దగినది 'గుర్వంతం ద్విపదీ భవతి" అను నది. మన ద్విపద లఘ్వంతము. ద్విపదికగా ననుమానింపఁ దగిన జంఝలికా గీతి లక్షణమును బరిశీలించిన నది పాద పాదమునకుఁ బదుమూఁడేసి మాత్రలు గలదని(రత్నావళి లక్ష్యవిషయము నిట్టిదే) తెల్లమగును. మన ద్విపద పాదము పరిమితి యధమ పక్షము పదునైదు మాత్రలు. బృహద్దేశీత్యాదులందు ద్విపద కరణ తాలముతోఁ బొడఁ బడునని కలదు. ('తాలే కరణ ఇత్యాఖ్యే జ్ఞేయం బిందు చతుష్టయమ్" అని నారదుని సంగీత మకరంద లక్షణము). ఇట్లు మన ద్విపను కరణతాళముతోఁ బొడు సంప్రదాయ ప్రసక్తి మన యాంధ్రమునం దెచ్చటను గానరాదు. ఇఁక జనాశ్రయి లక్ష్యములనుజూచినచో నందు పాద పాదమునకు ముప్పది పై చిలుకుగా నున్నవి మాత్రలు; మన ద్విపద పాద మాత్రావధి పదు నెనిమిది. మానసోల్లాసాదు లందలి 1-3 పాదము లందు మూఁడు గణనొకములు గురువు, 2—4 పాదములందు రెండు గణ

ములు రెండు గురువులు అను ద్విపదగ లక్షణము 1–2 పాదముల కొక్కటే లక్షణము గలిగి లఘ్వంతమగు మున ద్విపదకు నప్పదు. సంగీత రత్నాకరమున పాదమున కొక భగణము (6 మాత్రలు గలది), 5 భగణములు, అంత మందు గురువు నడుమ 2 వ, 6 వ గణములు జగణములునైయిట్టి పాదములు నాల్గుండిన నదిశుద్ధ ద్విపదిక యనియు, నిందలి మొదటి రెండు పాదములు నియత లక్షణములై పిదప రెండు ననియత లక్షణములుగ నున్నచో నది ఖండ ద్విపద యనియు, ప్రతి పాదమునను షష్ఠగణ స్థానమున నొక్క గురువును మాత్రమే ప్రయోగించినచో నది మాత్రా ద్విపదిక యనియు, శుద్ధ ద్విపదికయొక్క ప్రతి పాదాంతము నందు నొక్కొక్క గురువును జేర్చినచో నది సంపూర్ణ ద్విపద యగు ననియుఁ జెప్పఁబడినది. ఇట్లొక్కొక్క పాదమున నిన్ని గణములకు నంమ జగణమునకును బ్రక్తి, అంత మందు గురువునకుఁ బ్రక్తి మన ద్విపదయెడలఁ గానరావు. సంగీత రత్నాకరము నందలి ద్విపధకమే దోధక మనియు దానికి 3 భగణ ములు 2 గురువులు లక్షణ మనియు కల్లినాథుఁడు చెప్పినాఁడు. ఈ దోధకమునే త్రిష్టుప్ఛందో వృత్తముగాఁ బరిగణించి యున్నారు మన లాక్షణికులు. అపర్యాప్తమైనను దోధక లక్షణము మన ద్విప దకు సన్నిహితముగానున్నది. అందలి చివరి గురువును లఘువు చేసి నచో నది ద్విపద పాద మగును. అయితే దోధకమున భగణప్రయో గము విహితము. ద్విపదయం దైచ్ఛికము. రెండేసి పాదములకు లక్షణ సామ్యము గల దెల్ల ద్విపదయను సామాన్యార్థమున నివి యన్నియు ద్విపదలే కాని మన ద్విపద లక్షణము తదితరముల కంటె విలక్షణమైనదనియే, అది దేశిచ్ఛంద మనియే చెప్పనగును. ద్విప దను జాతిచ్ఛందముగాఁ బరిగణించినారు మన లాక్షణికులు. ఇటీవలఁ గొందఱు పండితులు మన ద్విపద దేశిచ్ఛందస్సు కాదని యభిప్రాయ

పడి ద్విపద నొక ప్రధాన రచనాంగముగాఁ గల యక్షగానము దేశి త్వమును శంకించిరి. కావున దానిగుఱించి యింతదూరము వ్రాయ వలసి వచ్చినది.

మన యక్షగానము లందు ద్విపదకు విశేష ప్రసక్తి గలదు. బహు యక్షగానము లందు గ్రంథాంతమున కవిగద్యకు బదులు ద్విపదయే యుక్తమైనది. అందు కృతి సమర్పణము కవి విషయము నుండును. కొన్నిట గ్రంథారంభమునఁ గథా సంగ్రహాది విషయ కథనము కొఱకు నుపయుక్తమైనది. ద్విపద గ్రంథము నడుమఁ బలు తావులఁ గథా కథనము, వర్ణన, పాత్ర ప్రవేశము (సంధి ద్విపద - పాత్రప్రశంస, తెర ద్విపద - పాత్రస్వీయోదంతోద్ఘాటనము), పాత్రల సంభాషణ మొదలగు వనేక సందర్భము లందుఁ బ్రయుక్తమైనది. అది కాక ద్విపద రూపాంతరము లెన్నియో యక్షగానము లందుఁ బ్రయుక్తము లై నవి. అందు :-

1. మంజరి :- ఇందు ప్రాసనియతి లేక పోవుట మాత్రమే దీనికి ద్విపదతోఁగల భేదము. ఇదికాక మంజరిపేరనే యింకొక రచనా విశేషము య. గా. లం దతివిరళముగాఁ బ్రయుక్తమైనది.

ఉదా :- గిరిరాజు లీలావతీ కల్యాణమునుండి

" ఈ రీతిగ ధరణీశుఁడు వెరలిన
సారి వార్త తమ చారులచే విని
వెఱచియు వెఱువని వితమున విమతులు
గురిగల తమ తమ కులగతు లెమ్మచు "

ఇందలి యేకతాళి నడక గమనింపఁ దగినది. ఇది కాక మఱియొక విధమైన మంజరి 19 శ. ఉ. భా. నుండి బయల్వెడలిన య. గా.లలో (య. గా. లని వ్యవహరింపఁబడిన హరికథలలో) ప్రయుక్తమైనది.

ఉదా :- శ్రీ మదజ్జాడాది భట్టనారాయణదాసుగారి ప్రహ్లాద చరిత్రమునుండి -

ధన్యాసి రాగము

" అని చండా మార్కులను గురువులకు – నప్పగించె నబ్బాలున్
కనక కశిపుండు సుమూర్తంబున – గంజాక్ష భక్తి లోలున్ "

ఇందు పాదమునకు 16 + 12 మాత్రలు. యతి స్థానము 17 వ మాత్రా స్థానము. ప్రాస, అంత్యప్రాసలు విహితములు. ఒక్కొక్కచోఁ ప్రాస యతియుఁ గన్పట్టును.

2. సువ్వాల ద్విపద :- సువ్వి సువ్వాల యనునవి దంపుళ్ళ పాటలుగాఁ ప్రసిద్ధములు. అనేకయక్షగానములందుఁ ప్రయుక్తములు. సువ్వాల లక్షణసార సంగ్రమున (3-102) పేర్కొనబడినది. అప్పకవీ యమున సువాలకొక లక్ష్యముగలదు (4-403) కాని "సువ్వాల ద్విపద" యనుపేరు చిత్రముగా నున్నది. ఆపేరిట నొకరచనా విశేషము యక్షగానములందుఁ జూపట్టుచున్నది.

ఉదా : - కుండినపుర కురవంజినుండి

" గూని వీపు గొగ్గి పండ్లు కొంగ మెడయు గొప్పనడుము
దోనె కడుపు దొప్ప చెవులు దోమ కన్నులు "

ఇందలి తురగవల్గన గతి గమనింపఁ దగినది. (గుజ్జుము చిన కపోతయ్య రచించిన దారుకావన క్రీడ సువాల- ప్రా. లి. పు. భా., నం. 1887 అచ్చుముగా నిట్టిదే) * సువాల ద్విపద యనుటలో గమనింపఁదగిన విషయ మొకటి యున్నది. ద్విపదకు ద్విగుణ మగు తరువోజ

*"సువాలధాతువు" అను పేర ప్రా. లి. పు. భాం డి. నం. 1855 కురవంజిలో నున్న రచనయు నిట్టిదే.

దంపుళ్ల పాటగాఁ గావ్యాలంకార చూడామణిలో (8-50) చెప్పఁ బడినది.

"తలకొని తగఁ బ్రాలు దంపెడి చోటఁ
దరుణులచే సొంపు దనరుఁ దర్వోజ"

(య. గా. లందు సు. ద్వి. కే గాని తరువోజకుఁ బ్రస క్తి లేదు) అప్ప కవీయము నందలి సువాల

"అక్షర హరి విక చాంబు రుహాక్షా
యక్షప సఖనుత యదుకులదక్షా. సువ్వి సువ్వాలే"

అని మొదటి సువాల ద్విపదవలెఁ గాక "మామూలు" మనద్విపదయే గుర్వంతమైన నెట్లుండునో యట్లే యున్నది. అయితే మ రగతి మాత్ర మే పాటింపఁబడినది. అది రోకటి పోటు యొడుపులో నొక వేగమును సూచించు నట్టిది. "సువ్వి సువ్వాలే" యను నది చివర నొక యూఁత పదము, ఱుల్లని వంటిది.

3. గౌరీ కల్యా ణ ము :- ఇది ఆడువారి పెండ్లి వేడుక పాటగాఁ బ్రాచీనకాలము నుండియుఁ దెనుఁగు నాట మిగులఁ బ్రసిద్ధమైనది. (జక్క-న విక్రమార్క- చరిత 4 - 130, 179, అనంతుని భోజరాజీయము 4 - 87, కాకమాని మూ ర్తి పాంచాలీ పరిణయము 4-22, మల్ల న రాజశేఖర చరిత్రము లందు దీని ప్రస క్తిగలదు) కొన్ని యక్ష గానము లందుఁ బ్రయు క్తమైనది. ఇది ద్విపద వికారముగా భాసిల్లును.

ఉదా :- మాతృభూతన పారిజా తాపహరణము నుండి

"శ్రీ రుక్మిణీ లోల చిర సుగుణజాల
కారుణ్య మయశీల కల్యాణ చేల – "
(గౌరీ కల్యాణమే వైభోగమే),

(అప్పకవీయమున "పెండ్లిపాట" యను పేరఁ బొదాంతమున "గౌరీకల్యాణ వైభవమే" అన్న యూఁత పలుకుతో నొక లక్ష్యమున్నది. అది యచ్చముగాఁ బూర్వోక్తమైన సువాలపాదమే. ఊత మాట మాత్రము మారినది.)

4. లక్ష్మీ కల్యాణము :— ఇదియు గౌరీకల్యాణము వంటి యొక పెండ్లివేడుక పాట. (వెంకటనాథుని పంచతంత్రమున, 4—360, పేరొక్కనఁ బడినది.) కతిపయ యక్షగానము లందుఁ బయుక్తమైనది. ఇదియు నచ్చముగా ద్విపద మచ్చే.

ఉదా :- హేమాబ్జ నాయికా స్వయంవరము నుండి

"శృంగార మమరంగ చెలువ మన్నారు
చెంగమ్మ పెండ్లికి చెలులార రారె
నిత్య కల్యాణంబు పచ్చ తోరణము
హెచ్చైన కడలి రాజింట నే ప్రొద్దు"

ఇందూఁత పదము లేదు. మృత్యుంజయ విలాసమున గౌరీ లక్ష్మీ కల్యాణముల యూఁత పదములు రెంటను గ్రహింపఁ బడినది.

ఉదా :-

"శ్రీ మహా లక్ష్మిని శ్రీ విష్ణుఁ బోలి
తామర తంపరై తగిరి దంపతులు ॥
గౌరీ కల్యాణమే వైభవ్యమే
లక్ష్మీ కల్యాణమే సౌభాగ్యమే."

తాతం భట్టు చింతామణి యను లక్షణ గ్రంథమున (తం. స. మ. కే. నం. 779) "లక్ష్మీ కళ్యాణము నందలి రేకులు" అని "నీర జోదరు రాణి నీలవేణికిని" అని ద్విపద పాదము లుదాహరింపఁ బడి

నది. ఆ లక్ష్మీ కల్యాణమొక యక్షగాన గ్రంథము కావచ్చును. కాని యందలి రేకు లనునని ద్విపదపాదముల వలె నుండుట యిట గమనింప దగినది. 'ఆయీయి రగడ భేదము రేకులు పెక్కులమరు" నని యన్నాఁడు గదా లక్షణ సార సంగ్రహ కర్త (3—102). అనఁగా నొక్క యెడ ద్విపదకు రగడకుఁ గూడ బాంధవ మేర్పడిన దన్నమాట.

5. ద్విపదార్ధము:— ఈ పేరిటి రచనలో మొదటి సగము ద్విపద, పిదప సగము దరువునై యుండును. కందార్ధములు, గీతార్ధములు మొదలగు నిట్టి రచనా విశేషములు 18—19 శతాబ్దులనుండి వ్యాప్తిలోనికి వచ్చినవి. యక్షగానముల కెక్కినని.

ఉదా :- నందిపాటి మిత్రవిందా పరిణయము నుండి.

"భామరో నీమాట బహుచిత్ర మమ్మ
కోమలా కారుఁడౌ కృష్ణుండు నీకు
మామ పుత్రుండను మాట యే కాని
ఆ మహా మహుని నీవు
చూడలేదెట్టు లతివా మోహించినావూ
తామరా సాక్షి నీకూ తగునే యీ వట్టిభ్రమలు. ...., "

గమనిక :— ఇవికాక యింకను ద్విపద వికారము లైన దేశి రచనా రీతు లెన్నియో గలవు - నివాళిపదము, జాళపదము మొదలైనవి.

4. ప ద్య ము

మన చంపూ కావ్యాదులలో నుపయుక్తము లైన వివిధ జాత్యుపజాతి వృత్తము లించు మించన్నియు (అక్కరలు, తరువోజా దులు, కొన్ని తక్కు) యక్ష గానము లందుఁ బ్రయుక్తములైన వని చెప్పవచ్చును. అందనేకము ప్రసిద్ధములు, మనచందో లక్షణ గ్రంథము లందుక్తము లైనవి. వాని లక్షణము లిటఁ బునశ్చరణ చేయవలసిన పనిలేదు. కతి పయ విశేషములు మాత్రము తెలుపఁ బడును.

లయగ్రాహి మొ... వాని యందు జంపెగతి, మత్తకోకిలాదు లందు త్రిపుట గతి, ఉత్సాహాదు లందు రచ్చ రేకు నడక, మాలినీ త్యాదులందు ఏకతాళి యొడుపును గుర్తింపఁ దగినవి. ఇవి పద్యము లుగాఁ బరిగణింపఁ బడుచున్నవి. కాని ప్రాయికముగా వీనిని రగడ వికృత లనఁ దగును.

ఇఁకఁ బద్యవిశేషములొక మూఁడు :-

1. క పో త క వృ త్త ము :- కూరపాటి అమరలింగామాత్యుని పార్వతీ కల్యాణమున నొక లక్ష్యము గలదు.

" హిమగిరి కన్య మహేశ్వరు గూర్చన్
సుమ విశిఖంబుల సొంపుగ నేయన్ " మొ....

ఇది జగతీ చ్ఛందము నందలి తోవక లేక తామరస వృత్తముగా మన లాక్షణికులచే నుదాహరింపఁబడినది. (చూ. అనంతుని ఛందము2-46)

2. శా ర ద ప ద్య ము :- ఈ పేరిటఁ గతి పయ యక్షగానము లందొక రచనా విశేషము గన్పట్టు చున్నది. ఇది పేరికే పద్యము

కాని దరువు ధోరణి నున్నది. ఒక్కొక్కచో దీనికి రాగ తాళ ములు గూడ నుదాహరింప బడుట విశేషము.

ఉదా :- అకలంక శ్రీకృష్ణమార్యుని కృష్ణవిలాసము నుండి :-

ఆదితాళము — కన్నడ రాగము.

" అనుచు వసుదేవు మోము గనుఁ గొనుచు
నను కరుణ జూడవే యనుచు
యిఁక నేవగింప వలదనుచు
నీ దాసుఁడ ననుఁ గను మనుచు
కను గొలఁకుల కడఁ గారెడు నశ్రులు
తన కొన గోటను తరి తరి జిమ్మెన్ ".

దీని కొక విధముగా లక్షణ నిర్వచనము చేయవచ్చును. మూఁడు నాలుగు మాత్రల పరిమితిగల యొక (క్రియా) పదముతో నారంభించి యంతే పరిమితిగల యట్టి (క్రియా) పదముల నంత్యప్రాసోపయుక్తము లగు వానినిఁ గొన్నిటిని గ్రహించి పదేసి మాత్రల పాదములపై నొక్కొక్క దానిని నిలిపి యట్టి పాదములు కొన్నియైన వెనుక సమాపక క్రియాంత మగు మధుర గతి రగడ పాదము లొక రెండు ఘటింపవలయును.

౩. కల్యాణవృత్తము :- శ, న, స, గణములు గలది. పురి జాల లక్ష్మీనారాయణ పారిజాతము నందుఁ బ్రయుక్తమైనది.

ఉదా :-

శ్రీ వారిజ భవ భవస । ద్దేవేంద్ర వినుత పదరా
జీవ త్రిజగదవనదీ । క్షా వేంకట రమణ హరీ.

4. తురంగప్రయాతము :- ఈ పేరితోడి పద్య మొకటి కొన్ని తడవలు కొదమగుండ్ల శేషాచార్యుల ఫుర్రూరవ శ్చక్రవర్తి విలాస నాటకమునఁ బ్రయుక్తమైనది.

ఉదా :-

కామశత సహస్రసుప్ర – కాశమాన విగ్రహా !
సామజాధి పావన ప్ర – చార లసదనుగ్రహా !

పాదపాదమునకు నేడు సూర్యగణములు మీఁద నొక గురువు. పంచమ గణాద్యక్షరము యతిస్థానము, ప్రాసనియమమును గలది - ఇది కేవలము ప్రసిద్ధ జాతి చ్ఛందఃప్రభేదమైన 'ఉత్సాహ' యేగాని మఱియొండుగాదు. అయితే యిందలి తురగవల్గన గతి జూచి శేషాచార్యులు కోరి మోజుపడి యీ పేరు పెట్టుకొని యుందురు.

అర్ధపద్యములు

కందార్ధములు, సీసార్ధములు, గీతార్ధములు, వృత్తార్ధములు, ద్విపదార్ధములు - అనుపేరఁ గొన్ని రచనా విశేషములు 18-19 శతాబ్దులనుండి యక్షగానములం దెడనెడఁ గన్పట్టుచున్నవి. 19 శ.,ఉ.భా. నుండి వీని ప్రాచుర్య మధికమైనది. ఇవి యన్నియుఁ దొలి సగము పద్యము మలి సగము దరువుగను గన్పట్టుచున్నవి. వీనికి రాగ తాళములు వేర్కొనఁ బడుటయుఁ గలదు. వీనికి కందాలంకారము సీసాలంకారము ననుపేళ్లును గొన్నిట (ఉ॥ లక్ష్మీనారాయణ విలాసము) గన్పట్టును. వీని కిటీవల అర్ధపద్యములను వ్యవహారము గల్గినది. ఇందు వృత్తార్ధ ద్విపదార్ధము లుదాహృతపూర్వములు. కడమవాని కొక్కొక్క యుదాహరణము :-

1. క ం దా ర్ధ ము :- ఉదా :-లక్ష్మీ నారాయణ విలాసమునుండి:

జయంత సేన - ఆట

సురలు ధరా సురులు ధరా
ధరులు ధరావరులు నాత్మ తరుణీ యుతులై
సురనదిని మునిఁగి పంక్తుల
నిర వందగ నంత కాంత
లింపల రార
కెంపు చెక్కడపుఁ దో - రంపు పళ్ళెముల వ
డ్డింప సాగిరి మే లంపు నేర్పు మాట ॥లింపల రార॥

ఈ "జయంతసేన" ప్రసిద్ధమైన తంజాపుర రఘునాథ రాయ పరి కల్పితమైన మేళాయే యగునా?)

2. సి సా ర్ధ ము :- ఉదా:- తరిగొండ వెంగమాంబ శివ విలా సమునుండి :

" వినవే మందాకిని వేమాఱు నాతోను
ఎనసిన మాట లింకేల నీకు
వనజాక్షి నీ వింత వగలు జేసినఁగాని
మనసు నీపైలేదు మత్స్యకంఠి

గొన కాని భ్రమ రాంబ కోపము జేసిని
నను నీవు పిల్వ రాకువే । మందాకిని
నను నీవు పిల్వ రాకువే । నాతోడ నీవు
చనవు మాటాడ రాకువె "

3. గీ తా ర్ధ ము :- ఉదా :-శ్రీరాజా మృత్యుంజయ నిశ్శంక బహా ద్దరువారి దశావతార య. గా. నుండి :-

" కాంచనాక్షుఁ డివుడు కడు పరాక్రమమున
పుడమి నెల్లఁ జాప బోల్కి జుట్టి

పోవు నవెడి వార్తఁ బొల్పగ విని మేము
వాని నిపుడు చూపి వసుధ నేలఁ గను –

వచ్చితి మిపుడు వాసి మీరగను
మోహన మైన వరహావ తారమును
సాహస మొప్పగ సంతోషమున దాల్చి ॥వసుధ॥

(ఇది యిందు గీతాలంకార మని పేర్కొనఁబడినది. కురుమద్దాలి వేంకటాచలకవి భాగవత దశమస్కంధ మను గేయ కావ్యమున కందార్ధాదులు కందార్ధ గీతార్ధ ద్విపదార్ధ చంద్రికలని పేర్కొనఁబడినవి).

యక్షగానము లందలి పద్య రచనలో సర్వ సాధారణముగ గర్భబంధాది చిత్రకవిత్వపు గసరత్తు లుండవు. కాని యత్యంత విరళముగనైన నసలు లేక పోలేదు. తిరువెంగళామాత్యుని నీలాచల విలాసమున చతుర్విధ కందము, గర్భిత చంపకమాల, చతుర్విధకందగర్భిత మణిగణ నికరము, మత్తేభ కందగర్భిత నీసమును గలవు. పురాణము పిచ్చయగారి మైరావణ నాటకమున కంద గీతగర్భిత చంపకమాల, పుష్పగుచ్ఛ బంధము, పద భ్రమకమును గలవు. అనేక యక్షగానము లందు సంస్కృతశ్లోకములును గలవు.

యక్షగానము లందలి గర్భబంధకవితా వైచిత్రి కుదాహరణముగాఁ గొద్ది సందర్భము లేరి చూపింతును :

1. చతుర్విధకందము :- నీలాచలవిలాసము లోనిది–

నందాత్మజాత, సుజనా
నందా, ఖగరాజగమన, నతదేవగణా
కుందాభరదన, వరద, ము
కుందా, అగణిత చరిత్ర, గురుతర సుగుణా !

కందము యొక్క చాతుర్విధ్యములో నిది యొక తెఱఁగు. కడమ మూఁడు భంగులను లాక్షణిక సంప్రదాయము ప్రకారము* ప్రస్తరించి చూపుదును :

గర్భద్వితీయ కందము :

ఖగరాజ గమన నతదే
వగణా కుందాభరదన వరద ముకుందా
అగణిత చరిత్ర గురుతర
సుగుణా నందాత్మజాత సుజనా నందా !

గర్భతృతీయ కందము :

కుందాభరదన వరద ము
కుందా అగణిత చరిత్ర గురుతర సుగుణా
నందాత్మజాత సుజనా
నందా ఖగరాజ గమన నతదేవ గణా !

గర్భచతుర్థ కందము :

అగణిత చరిత్ర గురుతర
సుగుణా నందాత్మజాత సుజనానందా
ఖగరాజగమన నతదే
వగణా కుందాభరదన వరద ముకుందా !

2. కందగీత గర్భిత చంపకమాల : పురాణం పిచ్చయ్యగారి మైరావణ నాటకము నుండి

సురముని సేవితా వరద సోమనిభానన పంకజాక్ష మం
దరధర శ్రీకరా వికటదానవ లుంఠన విక్రమార్క శ్రీ
హరికనకాంబరా ఫణిశయాన నరార్చిత పాద, పద్మ నా
భ రణ జయావహా సుజన పాలన శౌరి యశోవిశాలకా !

* ' రెండవ చరణంబునకున్ । రెండవ గణమాదిగాఁగ నిర్మించినచో ' దండిఁ జతుర్విధ కందము ' — అప్పకవీయము IV. 412.

గర్భ కందము :

ముని సేవితా వరద సో
మనిభానన పంకజాక్ష మందర ధర శ్రీ
కనకాంబరా ఫణిశయా
న నరార్చిత పాద పద్మనాభ రణజయా !

గర్భగీతము :

వరద సోమ నిభానన పంకజాక్ష
వికట దానవ లుంఠన విక్రమార్క
ఫణిశయాన నరార్చిత పాదపద్మ
సుజన పాలన శౌరి యశోవిశాల !

3. పదభ్రమకము : పై మైరావణ నాటకమునుండియే —

మారా నుతతను రామా
ధీరా సారథికలోక థిరసారాధీ
వీరా రతతర రావీ
ధారా పారద సుఖీ సుదర పారాదా !

ఇందలి విశేషమే పాదమునకా పాదమున అనులోమ విలోమ గతుల రెంటను వర్ణక్రమ మొక్కటే యగుట.

4. రథబంధము :— అప్పకవీయమునఁ బదునొకండు బంధములు సోదాహరణముగాఁ బేర్కొనఁ బడినవి. కాని యందు దీని ప్రసక్తిగానరాదు. ఇదియొక విశేషబంధము. ఇందుల కొక యుదాహరణము కొండూరి సీతారామకవి రచించిన (పట్టినగర) సావిత్రీ నాటకమునఁ గలదు. అది —

మ. పురభేదీ మది నీపదంబు లనిశంబున్ నమ్మియున్నాఁడఁ గిం
కరుపోల్కిం దగ నేలు సత్కరుణచేఁ గాదన్న మత్పాలనం
బు రస న్నెమ్మిగఁ జేయువార లెవరో పుణ్యా భవాబ్ధిన్ భా
స్కరనేత్రా గిరిజా కళత్ర ప్రమధేశాద్రీశ్వరా శంకరా !

5. శైలబంధము :— ఇదియు అప్పకవీయమునఁ బేర్కొ–నఁ బడని బంధ విశేషమే. దీనికిని బూర్వోక్త సావిత్రీనాటకము నందే యొక ఉదాహరణము గలదు. అది —

చ. సతత విలాస తత్వగుణసార సురాసుర మిత్ర జిన్నృశం
స తత కృపాకటాక్ష శుకసన్ముని లక్ష్య స్మరారి భోగి హా
ర తపనచంద్ర భాస్క–శ వరాంబక దేవ నదీధరార్ధిర
క్ష తరుణ నిత్యబుద్ధ సురసన్నుత గోపతివాహ శంకరా!

ఈ బంధములు రెండును ప్రసిద్ధములు గావు. వీని నెట్లు ప్రస్తరించవలయునో నాకుఁ దెలియదు. అభిజ్ఞుల పరిశీలనార్థ ముదాహరించితిని. నా యెఱిగి నంతలో రథబంధమునకు మాత్ర 'మొక లక్ష్యాంతరము గణపవరపు వేంకటకవి ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయ విలాసమునఁ గలదు. శైలబంధము పేరే నా కశ్రుత పూర్వము.)

5. వచనము లేక గద్య

యక్షగానములందు వచనము సంధిప్రయోజనాత్మకముగను, పాత్రల సంభాషణములందును, వర్ణన సందర్భములందును గూడఁ బ్రయుక్తమైనది. కొన్ని య. గా. గ్రంథాంతములందు కవి గద్యలు గలవు. తంజావూరు యక్షగానము లందుఁ గొన్నిట గ్రంథాంతగద్య కవి విషయికము, కృతిపతి శుభాశంసన పురస్సరమునై "భరతవాక్య" మనుపేర నున్నది.

యక్షగానములందుఁ బ్రయుక్తములైన గద్య ప్రభేదము లలో విశిష్టములైన వాని నీక్రిందివిధముగఁ బరిగణింప నగును.

1. చూర్ణిక :- చూర్ణమను దానినొక గద్య ప్రభేదముగా వామనాది సంస్కృతాలంకారికులు పరిగణించిరి. "అనావిద్ధ లలిత పదం చూర్ణ" మ్మని యతని కావ్యాలంకార సూత్ర వృత్తి. సంగీత రత్నాకర మందు గద్య మొక ప్రబంధముగాఁ బరిగణింపబడినది. అందు "గద్యం నిగద్యతే ఛంధో హీనం పదకదంబక" మ్మనియు,

"చూర్ణం శాంతే రసే పీతం గాతవ్యం బ్రహ్మదైవతమ్
వైదర్భీ రీతి సంపన్నం సాత్త్వతీం వృత్తి మాశ్రితమ్"

అని చెప్పఁ బడినది. (IV.–185 – 186). ఈ చూర్ణ శబ్దము యొక్క రూపాంతరమే చూర్ణిక. అనేక యక్షగానము లందు చూర్ణికకుఁ బ్రస క్తి గలదు కాని యించు మించన్నిట నది సంస్కృత కేవలముగ నున్నది.

ఉదా :— రంగాజమ్మ మన్నారు దాస విలాసనాటకము నుండి :

" అయంకిల సకల మహీపాల మకుటోప లాలిత చరణ కమల
యుగళో వీప్పేవ విశ్వంభరస్య ....
విజయ సారథి భాగధేయో విజయ రాఘవ నామధేయో
రాజాఽయ మధివసతి రాజధానీమ్. "

ఇది స్తోత్ర ప్రాయముగ నున్నది. సంస్కృత విభక్త్యంతముగఁ గూడ నున్నది. ఇంకను విశేషము విజయ రాఘవుఁడు తన విప్రనారాయణ చరిత్రమునఁ జూర్ణికలోఁ బాత్రల ముఖాముఖి సంభాషణమును ప్రవేశ పెట్టినాఁడు.

ఉదా :-

విప్ర :— హే తరుణి కిమే తదత్రాగమనం ? కిమా వాసస్థానం ?
కిం భవదీయం నామధేయం ? .... తావకీనం కథయ
వృత్తాంత మఖిలమ్.

దేవదేవిః :- ఆకర్ణయ మౌని జనవరేణ్య..... "

(ఇక్కే మన్నారు దాస విలాసనాటకాదులందు వివాహ సంకల్పాదిక సందర్భములందును సంస్కృతవచనములు ప్రయుక్తములైనవి. తంజావూరు య. గా. నాటకములలోఁ దమిళ కర్ణాట మహారాష్ట్ర భాషలందును పాత్ర ప్రసంగ వచనములుగలవు)

2. కైవారము :- తంజావూరు విజయరాఘవాస్థాన యక్ష గానములలోఁ దఱుచుగా నిది నాందీప్రాయమైన గ్రంథప్రారంభపద్యమైనంతనే రూపక ప్రయోచన సూచనగాఁ బయుక్తమగును. ఇది ప్రాయికముగా సంస్కృత సమాసప్రచురము, సంబుద్ధ్యంతమునై, రెండేసి సంబుద్ధుల కంత్యప్రాసము గలిగిన యొక స్తోత్రపాఠ ప్రాయమైనరచన.

ఉదా :- విజయ రాఘవ కల్యాణము నుండి :-

"పరాకు స్వామి, శ్రీరాజ గోపాల సేవా ధురీణ,
సీమంతినీ మోహన పంచ బాణ, ... విజయ రాఘవ
మహీపాల, విజయ లక్ష్మీ విశాల, పరాకు, దత్తావధానుం
డవై చిత్తగింపుము."

సంగీత రత్నాకరమున గద్యప్రబంధము వెంట "వైవాడ" మొక ప్రబంధముగాఁ బేర్కొనఁబడినది. (4-200) అందిది ధ్రువోద్గాహములు గలదిగాఁ జెప్పఁబడినది. శ్రీనాథుఁడు భీమఖండమున గంధర్వులు "వైవార పదానుసార కమనీయముగా ప్రావేశికధ్రువాగానావళులం బరిధవించి" రని చెప్పియున్నాఁడు. అసలిది రాజుల నుద్దేశించి వందమాగధులు పఠించు రాజవంశ బిరుద ప్రశంసాత్మకమైన గద్యవిశేషముగాఁ బ్రసిద్ధము.

౩. విన్నపము :- ఇదియొక గద్య ప్రభేదముగాఁ బ్రసిద్ధులైన తాళ్ళపాక కవుల కాలము నుండియుఁ బరిగణింపఁబడుచు వచ్చుచున్నది. (చూ. తా. పెద తిరుమలయ్య వైరాగ్య వచన మాలికా గీతములు) ఆద్యంతము లందు సంబుద్ధులతో నడుమ నొక భక్తుఁడు భగవంతుని గూర్చికాని భృత్యుఁడు స్వామి గుఱించికాని చేయు విన్నపము విషయముగా నొక విధమైన యెడపుతో, తూగుతో నడచు నట్టిది. విజయ రాఘవుని యక్షగానములలో దీని కెక్కువ ప్రస్తుతి కలదు.

ఉదా :- అతని కాళీయ మర్దనము నుండి :-

"రుక్మిణీ ప్రాణ వల్లభా" ద్రౌపద్యభిమాన రక్షక,
.... నీదయ మా యందుంచి మమ్ము రక్షింపవే
సహజ గుణ సంపన్న సంపంగి మన్న"

4. ముచ్చట :– ఇదియు నొక విధమగు తూగు గల గద్య శేషము. 19–20 శతాబ్దుల నాఁటి యనేక యక్షగానము లందుఁ బ్రయుక్తమైనది. ఇది ప్రాయికముగాఁ బాత్రముఖమునఁ బ్రవర్తితమై "దేవా మహానుభావా" ఇత్యాదిగా సంబుద్ధ్యంతమై అంత్య ప్రాస విశిష్టమై యుండును. గుడిపాటి రామదాసకవి కాళిందీవిలాసాదు లందలి ముచ్చటలు శబ్దాలంకార ప్రచురములు.

5. కొరవంజి గద్దె :– ఎఱుకతే చెప్పు సోదెనే గద్దెయనియు నందురు. అనఁగా నది సోదె చెప్పునపుడొక కూనరాగపు టూడుపు తోఁ జదువు గద్యయే.

ఉదా :– మన్నారు దాస విలాస నాటకము నుండి :

" యెరుఖాడు గెరు ఖాడు గెరు ఖాడుగె దుండి,
నీవు తలంశిన తలంపు నీవు తలంశిన తలంపు
నిజముగా సెప్పేనే నిజముగా సెప్పేనే
....
అమ్మాయమ్మ అమ్మా యమ్మ శెయిసూపు శెయిసూపు
శెయిసూపవే దుండి, దనము గల శెయ్యే,
దానము గల శెయ్యే, బంగారు శెయ్యే, బాగైముల
శెయ్యే దుండి .... కండ్లంటే తోడు, కడుపంటె
కొడుకు, కంటంటే మగండు వొండె రెండే వొండు."

6. ప్రాసవచనము :– నెడాదూరు వేంకటాచార్యకవి రచించిన సమగ్ర రామనాటకము సగము గ్రంథమీ ప్రాసవచనముల తోనే నడచినది. ఈ వచనమునందు పాదనియతియుఁ బ్రాసనియతియుఁ గన్పట్టుచున్నవి. చరణములు గణబద్ధములుగావు. కాని మాత్రల పరిమితి సుమారులో సరిపోవుచుండును. మాత్రలు ఒక్కొక్క చరణమున 30 నుండి 40 వఱకు నుండవచ్చును. ఒక్కొక్కచరణము రమా

రమి నడిమికి రెండు దళములుగా విరుగును. అట యతి పాటింపఁ బడును. అంత్యప్రాస నియమములేదు. పౌరాణిక పాఠధోరణికి సన్ని హితముగా నున్నది దీని వరుస.

ఉదా:—

శ్రీవాసున్ శ్రీకరుని నిర్జరాది – సేవ్యుని సదానందుఁడైన వాని
శ్రీవారిజాసనుని గన్నవాని – శ్రితజన యశస్కరుని వాసుదేవున్
శ్రీవాసవానుజుని మునులకెల్లఁ – జింతిత మనోరథము లొసఁగువాని
శ్రీవారిజేక్షణుని వెంకటాద్రి – శిఖరుని గొల్చెదను క్షేమమంద॥

(ఇఁక భామ కలాపము మొదలగు వానియందు ముచ్చటల వలెనే పాత్రముఖతఃప్రవర్తితములైన వచనములు కొన్ని 'కందువ' లను పేరఁ గానవచ్చుచున్నవి. అయితే ఆపేరు విషయ పురస్కృతమైనదే కాని యొక విశిష్టప్రక్రియ గాదు. ముచ్చట, విన్నపము మొదలగు నామములును విషయ పురస్కృతములే యైనను అందలి రచనలోనొక యొడుపు, నొక తూఁగును గలవు.)

6. ప ద ము

భరతుని నాట్యశాస్త్రమున పద లక్షణమిట్లు నిర్వచింపఁబడినది. (32.25-27) :—

" గాంధర్వం యన్మ యా ప్రోక్తం స్వర తాళ పదాత్మకమ్
పదం తస్య భవేద్వస్తు స్వరతాళాను భావకమ్
యత్కించి దక్షర కృతం తత్సర్వం పద సంజ్ఞితమ్
నిబద్ధం చానిబద్ధంచ తత్పదం ద్వివిధం స్మృతమ్
అతాళంచ సతాళంచ ద్వి ప్రకారంచ తద్భవేత్
సతాళంచ ధ్రువార్థేషు నిబద్ధం తచ్చ వై స్మృతమ్. "

మన యక్షగాన పదము లిందుఁ బేర్కొనఁబడిన లక్షణముల కించు మించులో లక్ష్య భూతములు కాఁగలవు. పాల్కురికి సోమనాథుఁడు పండితారాధ్య చరిత్రమున సమకాలిక పదవిశేషములను గొన్నిటిని బరిగణించినాఁడు. అవి తుమ్మెద పదములు, ప్రభాతపదములు (మేలు కొలుపు పాటలు కావచ్చును.), శంకర పదములు, వెన్నెల పదములు మొదలగునవి ఇందుకొన్ని యిపు డుత్సన్నప్రాయము లైనవి. కొన్నిటి స్వరూపమును మాత్రము యక్షగానము సంర క్షించుచు వచ్చినది. సోమనాథుఁడు పేర్కొనని పదములును గొన్ని మన యక్షగానములందుఁ గలవు. అందు ముఖ్యములు గొన్నియిట నుదాహరింపఁ బడును.

1. తు మ్మె ద ప ద ము :—ఇందులకుఁ ప్రాచీనలక్ష్యములు యక్ష గానములలోనేకాక వ్యస్తముగను నిపు డుపలబ్ధములగుచున్నవి.(చూ. తిరుపతి వేంకటేశ్వర ప్రాచ్యగ్రంథ ప్రచురణ నం. 11-తాళ్ల పాకము

కృతులు 4 వ సంపుటము. అన్నమాచార్యుల శృంగార సంకీర్తన 9 వది, 32 వది. ఏగంటి వచనాలలోను తు. ప., లు గలవు.)

యక్షగానముల నుండి యొక యుదాహరణము :—

" చెట్టు పెట్టి పాయె తుమ్మెదా
చెట్టు పూలు కాయ కాచె తుమ్మెదా
కాచె వారు లేరు తుమ్మెదా
నన్ను కాకు కాయకల నెల్ల తుమ్మెదా ...
ఇంటి లోని పోరు తుమ్మెదా
నను యిలు వెళ్ళ నీరు తుమ్మెదా ; "

— రుక్మాంగదము (ప్రా.లి. పు. భా. ఆర్. నం. 20

తుమ్మెద పదములలోఁ ప్రాయికముగాఁ ప్రియవ్యపదేశము, శృంగార రస స్ఫూర్తియు నుండును. (కవితాజగత్తున భృంగాపదేశ విషయమ ప్రసిద్ధముగదా. చూ. భాగవతము దశమస్కంధము — భ్రమర గీతల

2. వెన్నెలపదము :- ఉదా :— నివర్తి శేషాచలపతి శాఖ రాజ విలాసము నుండి :

" బాల మేలు మే లీ వేళ
బాళి చాల మేలు రూలె వెన్నెలారో
కొప్పున నున్న పూవులు
గుప్పనను రాలె నేమె వెన్నెలారో
కప్పురపు సురటితో
నిప్పులు రాలినట్లయ్యెనే వెన్నెలారో "

ఇది ప్రాయికముగా నాయిక విరహావస్థను సూచించునది.

3. చందమామపదము :— తాళ్ళపాకము వారి "సంకీర్తన లక్షణము" న దీని లక్షణ మిట్లు గలదు (పద్య 64) :—

" దుస్తర విప్రలంభమున దూతిక తోడ మొఱంగి చంద్రవి
న్యస్త భర స్వభావమున నాయకుఁ డేనియుఁ గాంతయేనియున్
విస్తర పాద పాదముల వేడుకఁ జందురుఁ బేరుకొన్నచో
బ్రస్తుతి కెక్కెఁ దత్పదము భాసురమై ద్విచతుష్పదా కృతిన్ "

ఇందులకుఁ దగిన లక్ష్యము – లక్షణా కల్యాణమునుండి (ఆం. ప. మం. ప్రతి – నంబరు, కవి పేరునులేవు) : –

చందమామ పదం — ఏకతాళం

వందనాము సేతు నీకు చందమామా మాతో
మందె మేలముతో రాకు చందమామా
ఇందుముఖుల నేచకూ చందమామా వట్టి
నిందలకు లోనుగాకు చందమామా ! మొ॥

4. నివాళి పదము:– ఇది ద్విపద వికారమైన రచనయే.

ఉదా :– (1.) గురు సిద్ధలింగము శ్రీగిరి కురవంజి నుండి :—

" నివ్వాళి శశిధరా నిర్మల గాత్ర
నివ్వాళి శుభనేత్ర నీకు నివ్వాళి "

(2.) వె. పెద్దామాత్యుని భద్రకాళీ కల్యాణము నుండి :—

" జలజ సౌరభ గాత్ర సరస కైలాస
నిలయ శ్రీ వీరేశ నీకు నివ్వాళి "

5. సమపదము :– ఉదా :– తిరుమలకవి చిత్రకూట మాహాత్మ్యము నుండి :—

సైంధవి రాగము

" చెన్నలరు పూవు దోటల నను వొందు
చిత్రకూట మహాటవి యందు

తిన్నదమున గౌరి తా నవతరించి
నెలకొన్నది గరిమ గన్నది ''

కడమ పాదములునిట్లే సమతగలిగి యంత్యప్రాసవిశిష్టములై యున్నవి.

6. చౌ ప ద ము :— (చతుష్పద * చతుః - పద - చవుపద= చౌపదము).

ఉదా :- బలభద్రదాసి కపోత వాక్యమునుండి :—

'' అడవిలో రఘురాము సతి నీ వపహరించి తెచ్చితి
ఒడలితో నిన్నుండ నియ్యడు ఒప్పగించవె దేవిని. ''

ఇందలి త్రిపుట గతి గమనింపఁ దగును. (ఇది ఛందో దర్పణము అప్పకవీయము మొదలగు మన లక్షణ గ్రంథము లందలి చౌపద, వితాళ చౌపద, కర్ణాట చతుష్పదల లక్షణములకు సరిపడలేదు. సంగీతరత్నాకరమున చతుష్పదీ ప్రబంధ లక్షణము గలదు - IV.270-271).

7. జా ళ ప ద ము :- ఉదా:— కపోత వాక్యము నుండి :—

" గజరాజవరద ఓ భుజగేంద్ర శయన
గజముఖాశ్రిత శేష త్రిజగ వందితుడ ''

ఇది అప్పకవీయము నందలి కర్ణాట చతుష్పద లక్షణమునకు('పంచ లఘు గణంబులు మూఁడు రవియు .....ప్రాసంబు దాఁక రెంటి పయి నగు విశ్రమమున ''.....అ. క. 4-286) సరిపోయినది. ఇందు ప్రాస యతి విశేషము. ఇందును ద్విపద సామ్యము గమనింప దగును.

8. సారంగపదము:-లింగమూర్తికవి శివపారిజాతమునుండి:-

" గంగాధరా సత్కృపాపాంగా జితకంధిత
రంగా (?) ఉత్తరేశ్వర లింగా
అంగజ భస్మాపాంగ – హస్తధృత సారంగ
దాక్షాయణి కామాంగ భూలతాంగ (?)
సంగర విజిత మతంగ భాసురోత్తుంగ
చర్మకలితాంగ శిపశివ గంగాధర ॥

('సారంగ' వేరనొక సంగీత రాగవిశేషమునుగలదు)

9. షట్పది:- ఇది కర్ణాట వాఙ్మయమున మిక్కిలి ప్రచారము నందినది. మనయక్షగానము లందతి విరళము దీని ప్రయోగము. * కన్నడ దేశమునకు సన్నిహితముగా నున్న హిందూపురమం దుండిన బాగేపల్లి అనంత రామా చార్యులవారి కృతులందు మాత్రమెక్కువగా నుపయుక్తమైనది.

ఉదా:- వారి సావిత్రీ చరిత్రము నుండి:-

" అశ్వపతి యని తొల్లి మద్రమహీశ్వరుఁడు తనరారు నిస్తుల
శాశ్వతైశ్వర్యాదులను హరిదశ్వ తేజుండు (1)
నశ్వరము గానీక వంశ మవశ్యముగ సంతతిన్ బడయన్
నిశ్చయము గావించె దృఢముగ విశ్వ విదితుండు " (2)

---

*కన్నడ యక్షగానములందు దీనికి ప్రాచుర్య మెక్కువ; ద్విపదకుఁ దక్కువ. మునకుఁ గేవల ద్విపద కావ్యము లున్నట్టే వారికిఁ షట్పదీకేవలములగు కావ్యములు గలవు.

ఇది మన తెనుఁగు షట్పది లక్షణమునకు సరిపడలేదు.* ఇందు స్పష్ట మాత్రాకములైన దళము లేదు విరుగుచున్నవి. మిాఁద నొక లఘువు. రెండేసి దళముల పైఁ బ్రాసయతి గుర్తింపఁగును. ఇది కన్నడ భామినిషట్పది, హరిణగతి రగడ, త్రిపుట తాళముల గతులకు సన్నిహితముగా నున్నది. (సంగీత రత్నాకరమున షట్పదీ ప్రబంధ లక్షణము గలదు. IV.272-273).

10. పాళిపదం:— ఉదా:- ఎంబారయ్య కురవంజి నుండి:-

" మనసున మనవాళ్ళు మౌనమున దలచవె
ఎనయ గురుడు నీ కిపుడు వచ్చెనె "

ఇందు మొదటి పాదమున 9 మాత్రల దళములు రెండు. రెండవ పాదమున 8 మాత్రల దళములు రెండు.

11. గొబ్బిపదము:- గొబ్బి గోపి శబ్ద భవ మనియు గొబ్బి నృత్యము గోపికల రాసక్రీడ వంటి దనియుఁ గొందఱు పండితుల తలంపు. అది ఉత్తర హిందూదేశమున రాజస్థానాది ప్రదేశములలోఁ బ్రచారమున నున్న గర్భనృత్యము వంటిదనియు గర్భశబ్దభవమే గొబ్బి యనియుఁ గొందఱి తలంపు. ఆ రెండిట నే వైనను నది స్త్రీ ప్రాయ మైన మండలాకార నృత్యమే. తదనుకూలమైన గీత ప్రబంధ విశేషమే గొబ్బి పదము. ఈ గొబ్బి పదములు క్రీ. శ. 15 శ. నాఁటికే ఆంధ్ర దేశమునఁ బ్రచారమున నుండిన వనుటకు తాళ్ళపాక అన్నమా

---

* చూ. కావ్యాలంకార చూడామణి VIII 58.
ఛందోదర్పణము III. 46; లక్షణసారసంగ్రహము II. 124;
అప్పకవీయము IV. 289. (ప్రాసతో మూఁడేసి విఱుపులుగల పాదములు రెండు. పాదమునకు 6 ఇంద్రగణములు, 1 చంద్రగణము)

చార్యులు రచించిన గొబ్బి పదమే తారాకాణ. (చూ. తిరుపతి దేవ స్థాన ప్రచురణ - తాళ్లపాక వారి కృతులు నం. 3 - పుట 327) యక్షగానము లందును దీనికి దగు ప్రసక్తి గలదు.

(ఇది గొబ్బిపాట యనియు వ్యవహృతమైనది)

ఉదా :- కుప్పనార్యుని పార్థసారథి విజయము నుండి :-

శ్రీగోపాల' శ్రీ రంజిల్లగ నిన్ను
కోరి కొల్చు వారము శ్రీ గోపాలా,
శ్రీ గోపాలా, యీ రీతి చలము జేసిన
నింక నోర్వ నేరము శ్రీ గోపాలా'

అన్నిట నీ పద మిదే తీరునలేదు.

12, ఏల పదము :- యక్షగానము లందిది విశేషము ప్రసక్తము. మంచి పరపతిగల పదము. ఇది యాలపదమనియు నేలపాట యనియుఁ బేర్కొనఁబడినది.* బృహద్దేశి, సంగీత సమయ సారము, సంగీత రత్నాకరము, సంగీతదర్పణము మొదలగు వానిలో నిది శుద్ధ సూడజాతికిఁ జెందిన అష్టవిధ ప్రబంధములందు నొకటి యనియు, నది చతుర్విధ మనియుఁ జెప్పబడినది. కేదారభట్టు వృత్తరత్నాకరమునఁ దృతీయాధ్యాయమున సమవృత్తప్రకరణమున అతి శక్వరీచ్ఛందమున ఏల యొకవృత్తముగాఁ బరిగణింపఁబడినది. అందు "సజనానయూ శర దశక విరతిశేలా" యని దీని లక్షణము. ఆ యేల సంగతమోకాని గీత ప్రబంధమైన ఏలయే ప్రసిద్ధమైనది. కన్నడ లాక్షణికుఁడగు నాగ

* ఏల హేలా శబ్ద భవమని కొందఱు పండితుల తలంపు. ఇది హేలగానెట్లు వలసిన నట్లు రాగతాళములు సాగదీయుచుఁ బాడుకొనులకనువై నది. గొల్లకలాపము లందలి సుంకరి కొండని ఏల లిట్టివే. అవి గొల్ల గోవాళ్ళ హేలా రసికత్వమునకు గుర్తులు.

వర్మ "ఏళె" ను కర్ణాట జాతిగాఁ బరిగణించినాఁడు. ఆంధ్రవాఙ్మయమునను ఏలా ప్రశంస చాలకాలము నుండియుఁ దఱుచుగనే వినఁబడుచున్నది. పాల్కురికి సోమనాథుఁడు బసవపురాణము నేలలుపెట్టిపాడుదురని చెప్పినాఁడు. కావ్యాలంకార చూడామణి, వేంకటనాథుని పంచతంత్రము, మల్లన రాజశేఖర చరిత్రము, పాంచాలీ పరిణయము, వసుచరిత్రము, ప్రభావతీ ప్రద్యుమ్నము మొదలగు ననేక ప్రాచీనాంధ్ర గ్రంథములందేలా ప్రశంసగలదు. తాళ్ళపాకవారి సంకీర్తన లక్షణమున ఏలా లక్షణ నిర్వచన ప్రయత్నము కొంతజరిగినది.

"నాయకాహ్వాన పూర్వమై నయము గలిగి
మ్లేచ్ఛ పరిభాషఁ దగి రాగ మిళిత మైన
యేల పాట పదంబు నా నిలఁ జెలంగు
మహిత నాయక సంబుద్ధి మధ్యమగుచు"

(65 వ పద్యము)

ప్రభావతీ ప్రద్యుమ్నమున "నానా తాళములు యథోక్త స్థాయిఁ బరగు నేలాది ప్రబంధ చయము" అని చెప్పఁ బడినది. మతియు నందది మార్గరూపకమునఁ బ్రయోగింపఁబడినట్లు చెప్పఁబడుట విశేషము. (చూ. ప). ప్ర. ఆ 4. 97 - 102). సంస్కృత సంగీత లక్షణ గ్రంథము లందు ఏలా లక్షణ మత్యంత విపులముగాఁ జెప్పఁ బడియుండుటచే గ్రంథవిస్తర భీతి నది యిట నుటంకింపఁ బడుటలేదు. *అపర్యాప్తమైనను తాళ్ళపాకవారి లక్షణము మన య. గా. ఏలకు సరిపోవును. (య. గా. ఏలలు - అధిక భాగము నాయక సంబుద్ధి మధ్యములే కాని యొక్కొకచో సంబుద్ధిరహితములును లేక

*. ఆకర సూచనలు :- (1) సంగీత సమయసారము 4. 130-135; (2) సం. రత్నాకరము 4.33-132. (3) సం. దర్పణము - ప్రబంధాధ్యాయము శ్లో. 379 - 393.

పోలేదు. బసవ పురాణము నేలలు పెట్టి పాడుదురని సోమనచెప్పినాఁ డనఁగా నట ఏలలనఁగా ఏ శివపరములైన సంబుద్ధులో యైయుండు నని తోఁచును).

ఉదా :- రుద్రకవి సుగ్రీవ విజయము నుండి :-

" భాను వంశా మూన బుట్టి
దానవాకా మీని గొట్టి
పూని మఖము నిర్వహింపావా ఓరామచంద్ర
మౌని వరులు నన్ను తింపాగా "

ఏల పాటలోనిది యంతయు నొక్క- సమగ్రమైన దళము. కడమ దళములు నిశ్లే యుండును. ఇందు త్రిపుట తాళగతి గోచరించు చున్నది.

2. పాపరాజు విష్ణుమాయావిలాసము నుండి :-

"మల్లె విరుల జోడు తొడిగి
నల్లా చెఱకు విల్లుబట్టి
మొల్ల తూపు లాల్లా సిల్లాగ ఓ పంచ బాణ
చెల్లా ఘనుల నెల్లా నే చేవూ "

ఇందు సంగీతపు సాగదీత లేనిచో హాయ ప్రచార రగడ గతి గల దన వచ్చును. కాని యసలు సామాన్య గీత ప్రబంధముల మాత్రా కాలము నిశ్చయించుటయే కష్టము, అందును హేలగా నాయా సంద ర్భములకుఁ దగిన యొడుపుతోఁ బాడఁ బడు ఏలల మాత్రాకా లము నిశ్చయించుట చాల కష్టము. ఒక్కొక్కచో ఏలలకుఁ దాళ ములును బేరొక్కనఁ బడినవి. అందు అటతాళమునకుఁ బ్రాచుర్యము. (చూ. గుడిపాటి రామదాసకవి కాళిందీ విలాసము).

అనుబంధము

2

తంజావూరు పద వాఙ్మయము

విజయరాఘవాస్థానము

ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో దక్షిణాంధ్రయుగము, తచ్చరిత్రలో తంజాపురాంధ్రనాయకరాజ పరిపాలనకాలము మహోజ్వల ఘట్టములు గదా! ఆ నాయకరాజులలో గీతి సాహితీప్రియుఁడు, జాతివార్తా చమత్కార చతురుఁడు, రసికశేఖరుడైన రాజకవియు నగు రఘునాథుని పుత్రుడు విజయ రాఘవుని రాజ్యకాలము (క్రీ. శ. 1633 - 1673) రసిక భోజ్యమగు సాహిత్య సంతర్పణములకు కల్యాణవేళ. అతని ఆస్థానము పదకవితకు పట్టుగొమ్మ. యక్షగానమున కాటపట్టు. అది ఆంధ్రపద కవితా తీర్థంకరుడగు క్షేత్రయార్యుని గాత్రమునుండి గంధర్వలోక మవతరించిన చోటు. క్షేత్రయార్యునవతారముతో మన పద వాఙ్మయచరిత్రలో నవ్యయుగోదయ మైనది. ఆనాడు పదమన్న గ్రామసీమల పామర గాత్ర మాత్రోప జీవియగు ఏదోవట్టిగాలి పోక పాటకాదు. పండితోపజ్ఞమై, రసభావ నిర్భరమై ఆలంకారిక మర్యాదా సనాథమైన కవిత్వస్థాయి స్వాయత్తమై, రాచవారి కొలువుకూటముల ఆటవెలదుల అభినయోపయోగియై పరిఢవిల్లినది. క్షేత్రయ అనేక రాజాస్థానములందు సన్మానము లందుచు విజయరాఘవు నాస్థానము నకును విచ్చేసినాడు. ఆ ప్రభు నామాంకిత ముద్రలతో రసగుంఫితము

లగు మధుర పదము లనేక మతనికి కాన్క వెట్టినాడు.[1] రాజునకు తగిన నజరాణా! క్షేత్రయ్యాని పదకవితామార్గము రసికజన మనోరథ ఘంటాపథ మైనదని గ్రహించినాడు విజయరాఘవుడు. వెంటనే అట్టి పదకవితా రచన కాస్థాన కవులను ప్రోత్సహించినాడు. తానును గంటమెత్తి పదకవితావిద్యలో నొక మహోన్నత పట్ట భద్రుడై నిలిచినాఁడు.

ఆనాటి యక్షగానములు రకరకముల పదముల కాకరము లైనవి. విజయరాఘవాస్థానములో యక్షగానములును పదములవలె పాడబడుచుండెడివని అతని ఆస్థానకవి చెంగల్వ కాళయ తన రాజ గోపాల విలాసప్రబంధమున[2] సూచించినాడు. (I—24). విజయ రాఘవున కించుకముందునాటి పరమానందతీర్థ యతి తనముక్తి కాంతా పరిణయమును[3] యక్షగాన ప్రాయరచనను "పదచాళిక" (పదకేళిక) యని పేర్కొని యుండుట చూడ యక్షగాన ప్రయోగమునకు పదాభి నయ సాదృశ్యమును గలదని తోచును. విజయరాఘవాదుల అభినయ ప్రయోజనాశయాత్మకమైన పద కవితాభిమానమే కొంతవట్టు తంజా వూరున యక్షగాన ప్రతిష్ఠకాలంబన మైనది. యక్షగానములు పద ములు నానాడు నగరి నాటకశాల నట్టువ మేళములచే రాజసభా రంగమున అభినయ ప్రదర్శనల కెక్కి రాణించినవి. నాడు విజయ రాఘవు నెమట పదకేళిక పట్టని నట్టువపాప తంజావూర నరుము.

---

1. చూ. 'క్షేత్రయ్యపదములు' అనుగ్రంథము, ఆంధ్ర గానకళాపరిషత్తు ప్రచురణ — రాజమండ్రి, 1950 విజయరాఘవముద్రాంకితములింను పండ్రెండు పదము లుదాహరింప బడినవి.

2. తంజావూరు సరస్వతీమహాల ప్రచురణ, 1951

3 ,, ,, ,, కేటలాగు నం. 557—58.

అతని యాస్థానమున పదకేళికలకు రూపవతి[4] యను నామెది పెట్టినపేరు. మరియు పలువిధములగు పదాభినయ పద్ధతులలో నొక్కొక పద్ధతి యందు ప్రత్యేక నైపుణికి ప్రసిద్ధి వహించిన నట్టువరాండ్రాయాస్థాన మున నెందరో గలరు.[5] బహువిధ పదాభినయ ప్రతిష్ఠల నా కొలువు కూటమున కోటికి పడగెత్తినది విజయనగర సమ్రాడ్వీర వేంకటరాయ దత్త బిరుద విరాజిత 'విజయరాఘవ విలాస'[6] భవన రాజ విభ్రాజిత కీర్తిపతాక చంద్రరేఖ. నాడట గజ్జెకట్టినదో లేదో కాని గంటము పట్టి 'శృంగార రసతరంగిత పదకవిత్వ మహనీయ మతిస్ఫూర్తియై' 'విజయరాఘవ మహీపాల విరచిత కనకాభిషేక' యై విరాజిల్లినది రంగా జమ్మకి. విజయరాఘవు డుత్త పదకర్తయు, పదాభినయ వినోదియు మాత్రమే కాఁడా పదకవితా తదభినయ కళాప్రవీణలగు శృంగార వతులతో గాంధర్వ విధుల మధుర బాంధవ్యములు నిర్వహించినవాడు. అతని రసికత్వము అభినివేశము నట్టివి. ఆతనికి రాణివాసము వారి మీదకంటె ఈ నాగవాసము వారి మీదనే అనురాగము హెచ్చు. అట్లే అతనికి పద్యగద్యములపై కంటె పదకవితలు, యక్షగానముల పైనే వల్లమాలిన మోజు. విజయరాఘవ విలాసమున వెలసిన వాఙ్మయమున ముక్కాలు ముప్వీసము మధుర కవితాశాఖకు చెందినదే. నా డా విజయరాఘవ విలాసమున 'శారదాధ్వజ' మెగిరినది. 'సాహిత్య రాయ పెండారము' ఘల్లుమన్నది.'

---

4. 5 6. 7. — ఆయా విషయముల ప్రశంస రాజగోపాలవిలాసము, విజయ రాఘవుని ద్విపద కావ్యము రఘునాథ నాయకాభ్యుదయము (తం॥స॥మ॥ ప్రచురణందు 1951) ల రెంటను గలదు.

8. రంగాజమ్మ మన్నారు దాస విలాసనాటకము – ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికాతిము, కాకినాడ, 1926

9. ఈరెండింటి ప్రశంసయు రాజగోపాల విలాసమునను, రంగాజమ్మ మన్నారు దాస విలాస ప్రబంధము (తం. స. మ. కే నం. 213–14) నందును గలదు.

విజయరాఘవుడు గోపికాగీతలు, భ్రమరగీతలు, రగడ, చౌప దములు, సాంగత్య పదములు ఏలలు విడిపదములు, దరువులు, సంకీర్త నములు అధ్యాత్మలు మొదలగు కేవల గేయప్రబంధములును-వాల్మీచి, గుజ్జరి, విల్వేడు, దండలాస్యము, కందుకక్రీడ, అల్లిక, కొరవంజి, శుభ లీల, గుజరాతి దేశిచౌపదము, జక్కిణి, దురుపదము, మదన పదదూ త్యము, జోగి పదచాళి, శారదాసాహ్రాజ్యము, చిందు, సవతి మచ్చ రము, నాట్యకదంబము మొదలగు నాట్యబంధముల కనుకూలములగు గీత ప్రభేద విశేషములును రచించి యుండినట్లతని ప్రహ్లాద చరిత్ర[10] యక్షగాన గ్రంథావతారికవలన దెలియుచున్నది. కాని అవి యెవ్వియు అతని యాస్థాన కవులు రచించిన పదములును విడిగా గాన వచ్చుటలేదు. నేటికి వారి పదకవితాభిమానమునకు నిదానముగా నిలిచినవి వారి యక్షగాన రచనలే.

ఈ యక్షగానములలో ప్రహ్లాదచరిత్ర పట్టికలోనున్న పదప్రభే దములన్నియు లేవు. ఇందు ముఖ్యముగానున్నవి శృంగారపదములు, గొల్లపదాలు, చెంచుపదాలు, కొరవంజి దరువులు, సాంగత్యపదము, ఏలపదము మొ. లక్ష్మీకల్యాణము, ధవళశోభనములు, సువ్వాలలు మొ. ఆడంగుల వేడుకపాటలు. ముఖ్యములైన కతిపయ పదముల మచ్చులిట నుదాహరింపబడును.

1. శృంగారపదములు

విజయరాఘవుని నాటి వీనికే ప్రాధాన్యము. ఆయక్షగానము లలో వీనికే ప్రాచుర్యము. ముఖ్యముగా నీపదములు రెండుతరగతులు: ౧. పంతువగ పదములు – ప్రాయికముగా విప్రలబ్ధ యగు నాయిక

10. తం. సా. మ. కే. సం. 541.

నాయకుని స్మరించుచు చెలిక త్తెతో తన విరహపుసాద వెళ్ళ బోసికొనుట (భానుకలాపమునందు మాళవితో సత్యవలె) యిందలి విషయమై యుండును. ప్రాయికముగా నిట్టి పదములు పంతువరాళి కాంభోజి మొదలగు రాగములలో నుండును. ఈ పంతువగ పదాలకు తగిన వంత వాద్యము నాగస్వరమని విజయరాఘవకల్యాణమున సూచింప బడినది. ఇట్టి పంతువగపదము లా యక్షగానము లన్నిట సమృద్ధిగ నున్నవి. 3. పదకేళికలు కుపయుక్తము లగునవి – నాయకు నెదుట నతని నుద్దేశించి అతనిప్రీతి నావాహన సేయుచు అభినయింప దగినవి. ఈపదకేళికల ప్రసక్తి పహ్లాదచరిత్ర, రఘునాథాభ్యుదయము, విప్రనారాయణ చరిత్ర, విజయరాఘవ కల్యాణము, హేమాబ్జనాయికా స్వయంవరము లందుగలదు. ఈపదకేళికకు తొలిపలుకుగా హేమాబ్జ నాయికా స్వయంవరమున నొక కుసుమాంజలి శ్లోకము, విజయరాఘవకల్యాణమున నొక సల్లాము దరువును ఉదహరింపబడినవి.

విజయరాఘవుని నాఁటి యీ పంతువగ పదములకు, పదకేళికలకు అసలా శృంగార పదసామ్రాజ్యమునకు క్షేత్రయ్యపదములే యొజ్జబంతు లనవచ్చును. కాని యివి యన్నియు రాజపరములు. క్షేత్రయ పదములలో రాజపరములు కొన్నియున్నను అధికభాగము మధుర భక్తి ప్రచురములు. విజయరాఘవాదుల పదములలో ఆ మధురభక్తి ప్రతిపత్తి దిగజారిపోయి అందలి 'జావళి' శృంగార ప్రతిపత్తిమాత్రమే మిగిలినది.

క్షేత్రయ పదము:

విజయ రాఘవాదుల పద కవితారచనకు క్షేత్రయ పదములే యొజ్జబంతు లనుటకు, పోలికలమాట యటుండ, విజయరాఘవుని

'పట్టంపుకవి' (Poet Laureate) యైన కామరసు వెంకటపతి సోమయాజి తన విజయరాఘవ చంద్రికావిహారమున, విజయరాఘవునిపై క్షేత్రయ చెప్పిన పదమొకటి[11] గ్రహించి యుంఘటయే ప్రబల తార్కాణము. అది :-

ఎఱుకల కాంబోది – ఆది

" సుదిన మాయెనే యీ ప్రొద్దు సుదిన మాయనే । యీ
మదనావతారుని సేవ మనకు గల్గెగా ॥
ప్రొద్దుట నిల్వా టద్దము పొడగన్న ఫలము । యితని
ముద్దుమోము నూడఁగలె ముద్దుల గుమ్మా ॥
ఈ ప్రొద్దు పూర్ణకుంభము లెదురైన ఫలము । యీ
భూపాలకుంజరుని నే బొడగంటినమ్మ ॥
ద్విజరాజుల సేవించిన దివ్యశకునము చేత
విజయరాఘవ శౌరిని వీధిలోగంటి ॥ "

కామరసు పదము :

వెంకటపతి సోమయాజియు స్వతఃసిద్ధముగా చేవగల పదరచన చేయగలవాడు.

ఉదా : సందర్భము – విజయరాఘవుడు చంద్రికావిహారియై రాగా అతని జూచి మరులుగొన్న యొక అత్తింటి కోడలు చెలిక త్తెతో నన్నది –

కాంబోది – రూపకము

" వేడుకైనను జూడగూడదు వింతవారిని నా
తోడికోడలు నన్ను తొంగి చూడనియ్యదు

---

11. ఆంధ్రగాన కళాపరిషత్ప్రకాశితమైన 'క్షేత్రయ్యపదములు' అను గ్రంథమున విజయరాఘవ ముద్రక్రింద 11 వ పదముగా నిది ప్రకటితమై యున్నది. దాని రాగతాళము లంపు కాంభోజి త్రిపుటలుగా నుద్ధాహరింపబడియున్నవి.

పాడితప్పి మగడు మిగుల పగచాటును యీ
మేడమీదికి వచ్చెనంచె మెదలనియ్యడు ॥౧॥

వంచన జేసి యితని జూడవచ్చే నంటేను
పొంచియుండు మఱది యిరుగు పొరుగు పంచల
పంచశరుని మించిన యీ పట్టభద్రుని
నించుక సేపు చూడగూడ దేమిసేతును ॥౨॥

అత్తచేతపోరు మిగుల నధికమాయెను
కత్తిమీద సాము నాకు కదలరాదుగా
బత్తితో విజయరాఘవ పార్థివేంద్రుని నేడు
క్రొత్తగా జూచిన చూపు కోటి సేయదా ॥౩॥

విజయరాఘవ పదము:

ఆంధ్ర పదకవులలో క్షేత్రయ్యను చెప్పి మరియొకరిని చెప్ప వలెను. కాని పదకవితా రచనలో అతనితో పోటీచేయగల'తాహత్త గలవాడు విజయరాఘవుడు. అతని రఘునాథాభ్యుదయ విపన్నారా యణ చరిత్రములలో ననేక శృంగార పదములు గలవు. ఆ గ్రంథ ములు ముద్రితములు. అముద్రితమగు తంజాపురాన్న దాన నాటకమ నందు తత్కర్త పురుషోత్తమ దీక్షితుడు తమ 'ఏలినవారు (విజయ రాఘవుడు) ఆనతిచ్చిన పదాలలో ఒక పదం' గ్రహించి యుండుటచే అది మాత్ర మిచట నుదాహరింప బడుచున్నది.

" అయిదు వరాలిచ్చితి అది యేమిరా యని యడిగితే
అయిదువరాలవు గావా యని అతివ చతురులు బలికేను ॥౧॥

మాట నేర్పులవాడు గదా మన్నారు దేవుడు
బోటిరో యేమని పొగడుదు నేను ॥౨॥

సరిపెన లిచ్చితివి యెంతసరసుడ వంటేను
సరిపెన లియ్యనా యని సకియ కందువ లాడెనే ॥౩॥

ఏలరా నన్నింత యేతురా యంటేను
ఏలరా నన్ననేది యింతి నీ నైజ మనెనె ॥౪॥

రంగాజమ్మ పదము :

విమల గాంధర్వ విద్యా వెన్నతో బెట్టిన దీమెకు. ఆమె మన్నారు దాస విలాస నాటకము నుండి యొక పదము :

కాంభోజి – ఆట

" చెలువుగా నేడు నాకలలోన వచ్చిన
చెలువు డేడే చెలియ చెలువు డేడే ॥౧॥

ముద్దుపెట్టగ వాడు వద్దుపొమ్మంటినో
సుద్దుల దేలించి పొక్కింప నైతినో ॥౨॥

మొలకచన్నుల మీద నెలవంక లుంచితే
వలదు పొమ్మంటినో లేక వాడు సేసితినో ॥౩॥

నీవి యంటగ తాళు నిలువరా యంటినో
యావగ దలచగ నౌను గాదంటినో ॥౪॥

పురుషోత్తమ దీక్షితుని పదము :

పై నుదాహరించిన పదములన్నియు నించు మించు పంతువగ పదముల వంటివే. ఈక్రిందిది పదకేళిక (తంజాపురాన్న దాన నాటకమునుండి) –

ఘంటారవము – ఆది

పంతమేల రారా వింతదానఁ గారా
రంతు సేయ మేరా విజయరాఘవ మ్రొక్కేరా॥

దక్కితి దయ మీరనే, పొక్కితి విడెమీర నీ
పక్క- బాయ లేరా నన్ను బాళిని చేకోరా॥

నిన్నె మదిని కోరియున్నారా ఓరోరి
కన్నుల విత్తుని బారి ఘన మాయె యీసారి॥
ఏరా నన్నుచాల ఏలరా యీవేళ, రతుల నేలరా యీవేళ
రారావు సేయ మేరా విజయరాఘవ భూపాల॥

2. గొల్ల పదాలు

గొల్లజాతికి సాహిత్యవిద్యకు చుక్కెదురని యొక నానుడి గలదు గాని సంగీతవిద్యయెడ వారతి సుముఖులు. పిల్లనగ్రోవి గొల్ల జాతి గానకళా ప్రతిష్ఠ కొక ప్రాచీన చిహ్నము. సుద్దు గొల్లలు పద విద్యకు పద్దులు. కృష్ణలీలలు, కాటమరాజు కథానులాపములు వారి గుత్తపాటలు.[12] గొల్లకలాపములలోని సుంకరి కొండని ఏల పదాలు గొల్లగోవాళ్ళ హేలారసికత్వమునకు గుర్తులు.

ఆనాటి నాయకరాజుల నగరి మొగసాల కావలివారు గొల్లలు. వారి వాలకములు ప్రసంగములు చిత్రమైనవి. వాని కాకృష్టులై హాస్య చతురాస్యులగు నా యాస్థానకవులు కొందరు చాటుకావ్యములుగా పరిగణించి భావణించిన తమ యక్షగాన నాటకములందా గొల్లల వేషభాషలను జొప్పించిరి. రంగాజమ్మ కృతియందు గొల్లల హాస్య ప్రసంగములు గలవు గాని గొల్లపదము లొక్క- విజయరాఘవుని పూతనాహరణము నందే కన్పట్టుచున్నవి. సందర్భము: నందగోపు నాదేశమునై గొల్లలు పూతనకళేబరము నీడ్చిపుచ్చుటకు వత్తురు. అప్పుడు వారి పదాల సందడి:—

౧. భూపాల — రూపకము

"ఓటి కిన్నెర మీటు కొంట గొల్లలారో — ఆ
యేటి సాయెనై నేటిమాపు గొల్లలారో॥

12. చూ. హంసవింశతి II 87-89.

తందనాలు పాడుకొంట మనము రాగా – ఆ
మందలో నొక్క పద్దురేగె గొల్లలారో॥
నందయ్య పిలిచెనట గొల్లలారో – మన
మందరము బోదము రారో గొల్లలారో॥
బూసి సూసి కేకవేసి గొల్లలారో – వాడు
గోసి విడగ దూసె గదర గొల్లలారో॥

2. సౌరాష్ట్ర – రూపము*

రెండు రెండు యిప్పగింజలే తుమ్మగిలో
రెండువేల మా యావుల మందలే తుమ్మగిలో

* * *

కుడుములు పిండికూర వెన్నెలాహే
కూకుండి తినగదే వెన్నెలాహే
నల్లేరు దురదంట వెన్నెలాహే
నమల వెరచునె మాగంగ వెన్నెలాహే

3. మొక్కుబడి పదాలు

'సాక బెట్టి నీకు మ్రొక్కేమేకవీర – మమ్ము
సాకి సంతరించవమ్మ ఏకవీర ॥పల్లవి॥

* * *

ఏట్లో పాఱెడి ఎఱ్ఱని గంగ
పాలలో నుండేటి పచ్చని గంగ
ఎట్లో మా యెఱ్ఱన్న యెచ్చరించంగ
పాఱెడి గంగ వచ్చి పవ్వళించంగ
చల్లని తల్లి మీకు జాతరలు సేసేమమ్మా
నల్లావుల పాలు పొంగళ్ళు పెట్టేమమ్మా
గొల్లల కెల్లను కొలము దేవరవై
యెల్లమ్మ యెల్లమ్మ యేలుకోవమ్మ॥

* * *

* ఇవి 'ఊళ' బెట్టి పాడిన పాటలట

అ (ఎ) క్కలమ్మకు నేడు మొక్కు చెల్లింతాము
వక్కలాకులు వేగ వండరా (?) వోరి॥

* * *

మట్టిమాని కింద నున్న మాతంగి రావె
ఎట్టమ్మ చెరువు చేయించేనుగాని॥

చింతమాని కిందనున్న సివసత్తిరావె
సంతబైటనున్న ఓ సాంబవీ రావె॥

బత్తితో తిరువళిక యెత్తేను నీకు
బుత్తిముత్తు లియ్యవమ్మ పోలేరమ్మ॥

సత్తెము గల్గిన తల్లి సమకూర్చుమేలు
పత్తిచేని బైటనున్న ముత్తేలమ్మ నీవు॥

పళ్ళెండు నేతదీపము పెట్టేను నీకు
సిళ్ళాడె నమ్మ ఓకొల్లూరి గంగ॥

౮. 'రామాయణ బొవుతాలు సదుచ్చుకొన్న' ప్రబుద్ధు డొకడు పాడిన పదం.

"నల్లని దేవర నామము సాతిన
బళ్ళారాయుడు బసవయ్య కొడుకు ॥౧॥

నారదమయ సుప్పనాతిని పెండ్లాడి
బారతకత సెప్పె బైరదేవరకు ॥౨॥

రంబకు పుట్టెను రాభణుం డనగాను
కుంభకర్ణుని పెద్దకొడుకు గాదటరా ॥౩॥

అతికాయు డంగదుం డల ధర్మరాజుతో
అతివకై పోరాడి రది వింతగాదా ॥౪॥

మనకు వరాలిచ్చే మైలారు దేవర
అనుమంతు దేవర కల్లుండు గాడా ॥౫॥

౫. సివమాడు గొల్లని పదం

" ఓంకారము । ఓకాటమరాజా
కరకరబొద్దు పొడిచి కారెండలుగాసి
బిరాన్న బీరెండ బిరుదు గొట్టంగ వన్నెలాహే ॥
తూర్పున మీ యావులు తుంగలు మేసి
పడమట మా యావులు పచ్చికలుమేసి వన్నెలాహే ॥

3. చెంచు పదాలు

కోనేటి దీక్షితచంద్రుని, విజయరాఘవకళ్యాణమున విజయరాఘవుని మృగయా విహారమై, చెంచులు కఱుకుల్లు వండి కారేలుని కారగింపుచేసి విందు వినోదములు జరుపుకొన్న సందర్భమునందలివి :—

౧. కాటమరాజు పదం. కాంబోది—ఆట.

కుంబములో పుట్టినట్టి । కుంభకర్ణుని కొడకవై
కుంబమ్మాల్లా దింటివిగదరా । ఓ కాటమరాజ !
కూరనార వెతకవుగా ॥

అంబారి కసాగసాన । అంబుధి దాటువేళ
పంబలు వాయింపుచును । ఓ కాటమరాజ !
కంబళి నాచుకొంటివిగా ॥

సుప్పనాతి ముక్కుపోయి । నొప్పిచేత మూలుగంగా
ఇప్పపూల దండవేసి । ఓ కాటమరాజ !
అప్పుడే కూడితివి గదరా ॥

౨. కంబమురాయ పదం : మంగళకైశిక—ఆది.

' సరిగె పాఱ కేలబూని । వెలుగుమీది తొండవలెను
ఎలుగురాజుమీద నెక్కి । ఓ కంబమురాయ ।
జలదారి దాటితివారా ॥

మంచము నెత్తిబెట్టుక । కంచము వాయించుకొంట
మంచుకొండమీద నెక్కి । ఓ కంబమురాయ ।
చెంచెలి కూర తెచ్చితివిగా ॥

3. పోలేరమ్మ పదం : ఘంటారవ—ఆది.

" బూరుగమాను గని । బూచియని వెరచుకొని
బొబ్బరింతువుగదమ్మ పోలేరమ్మ ॥

వాలుచన్ను లల్లాడంగా । నాలుక వెళ్ళబెట్టుక
ఊళ బెట్టుదువు గదమ్మ పోలేరమ్మ ॥

౪. కూనలమ్మ పదం ; పున్నాగ—ఆది.

' కుండనిండ కొండగోగు కూరవండి
కూకుండి తిందువమ్మ కూనలమ్మ ॥

కోతికూన చంకబెట్టి కోటయెక్కి
కొక్కరింతువు గదమ్మ కూనలమ్మ ॥

కూటికుండ దెఱచివేసి గునిసి యాడుచు
కుక్కల దోలుదువమ్మ కూనలమ్మ ॥

౫. దరమరాజు పదాలు ; (అ) కాంబోది—ఆట.

' ఉడుముల బట్టితెచ్చి । నడుములకు త్రాడుగుచ్చి
కొడవలి చేతికిచ్చి । ఓ దరమరాజ !
అడవులలో నాడితివిగా ॥

బొద్దికూర సద్దిగొంచు మద్దెల నెత్తిబెట్టుక
మద్దిమాని మీదనెక్కి । ఓ దరమరాజ !
ఎద్దులను మేపుదువుగా ॥

(ఆ) ఘంటారవం—ఆది.

' ఉప్పులేని నలిదిగంజి ఓ ధర్మరాజా
ఊదుక తాగుదువయ్య ,,
ఉట్టిమీది కెగరబోయి ,,
కాలు వూనమాయెగద ,,

వొట్టిమాని మీదనున్న ఓ ధర్మరాజా
పూగి పూగి యాడుమయ్య ,,
పుల్లంకి పిట్టవలె ,,
పులికి పులికి యాడుమయ్య ,,
పూసరవెల్లివలె ,,
తల పూచి పూచి ,,

మీరాటి పదములలో కాటమరాజు పదము, కంబమురాయ పదము, దరమరాజు పదము (అ)— ఈమూడును ఏలపదములని గుర్తింప నగును. (ఏల విషయము పూర్వోక్తము).

4. సాంగత్య పదము

విజయరాఘవుడు సాంగత్యపదములు రచించినట్లు తెలియు చున్నది గాని నేడు మన్నారు దేవుని హేమాబ్జనాయికా స్వయంవరమున మాత్రమే యొక్కటి కన్పట్టుచున్నది. ఇందలి చరణములు ప్రశ్నోత్తర పరంపరగా సాగినవి. (ఇదియొక కన్నడ సనచ్ఛందస్సు. కన్నడమున సాధారణముగ రూపకతాళమునఁ బాడఁబడును)

ఎఱుకలకాంభోజి - అట.

చెలువైన శ్రీవత్స చిహ్నంబు ఉరముపై
గలిగి రాణించు యీ మనుజుఁడెవ్వఁడె చెలియ ?

పాల మీను రూపముంబూని యీ నలువకు
తొలుబల్కు లొసగిన దొర యీతడమ్మా ! ॥మొ॥

ఇవికాక విజయరాఘవాదుల యక్షగానములం దింకను ధవళ శోభనములు, సువ్వాలలు మొదలగు పాటలు తరచుగా గలవు గాని అవి ఆంధ్ర దేశ యక్షగానములందును ప్రచుర ప్రచారము గాంచినవే. వాని విషయమున తంజావూరి కవుల ప్రత్యేకత యేమియులేదు. విపుల ముగా చర్చించుట కిట నవకాశములేదు. కాని పైనుదాహరించిన పద

ములలోనే ఆ కవుల ప్రత్యేకత తేటపడగలదు. అట్టి పదము లాంధ్ర దేశయక్షగానములం దరుదు. ఆ కవులు శృంగార రస పిపాసువులును క్షేత్రయ మార్గానుయాయులు సయ్యు క్షేత్రయవలె శృంగార పద రచనామాత్ర సంతుష్టులుగాక పదరచనయొక్క బహుముఖ ప్రయోజకత్వమును బాగుగా గుర్తించినారు. ఆ గొల్లపదములు, చెంచుపదములు, కొరవంజి దరువులు నెంతో అపురూపమైనవి. రాజ కవియు నట్టి రచనలకు కోరి సమంజసమగు నొక సందర్భము గల్పించుకొని పూనియుండుట ప్రశంసనీయము, తంజావూరివాఙ్మయము తాత్కాలిక సామాన్య ప్రజాజీవనమునకు నద్దము పట్టిన దనుట కితర సందర్భములనేకముతో పాటివియు తారాకాణలు. ఇంకను పురవర్ణనాది సందర్భములకును పదము నుపయోగించిరి. రాను రాను పదము దరువునకును, గీత ప్రబంధ సామాన్యమునకును బర్యాయ వాచకమైనది.

క్షేత్రయ శృంగారపద కవితోద్యమము విజయ రాఘవాదులతో నాగిపోలేదు. నాయక రాజుల తరువాత తంజావూరు పరిపాలకులగు మహారాష్ట్రుల కాలమునను కొనసాగినది. క్రీ. శ. 1684 - 1712 సంll ల నడుమ తంజావూరు నేలిన శహాజీ, అతని ఆస్థానకవియగు దర్బార్ గిరిరాజు ఆరితేరిన పదకవులు. వారి సమకాలికుడు, మధుర విజయరంగ చొక్కనాథుని మంత్రిపుంగవుడును, శశాంకవిజయ కృతి భర్తయు నగు వంగల సీనయామాత్యుడు ప్రసిద్ధపదకర్త. ఆంధ్రమున రసవత్పద యక్షగాన కర్తయగు మైసూరి కంఠీరవరాజునువారి సమకాలికుడే. వారి తరువాత శరభోజి, తుక్కోజి. చిట్టచివరి శివాజీ (క్రీ. శ. 1833 - 1855) వఱకు తంజావూరిలో తెలుగున పదకవితా రచన ధారాళముగా సాగినది. శివాజీ ఆస్థానమునందలి ఆంధ్ర పద

కవులలో ప్రసిద్ధుడు నరహప్పయ్య.[13] ఆ 'నరహప్పయ్యతోగూడి వడిదాగిముల పాడి నన్నెలలరుచుండు' వాడట శివాజీ.[14] ఆ గిరిరాజా మల పదముల సంపుటములు కొన్ని తంజావూరు సరస్వతీ మహాలులో గలవు. ఆ మహారాష్ట్ర ప్రభువుల కాలమున నచట కొన్ని నీతిపద ములును వెలసియుండుట విశేషము. అసలు పదకవితారచనలో క్షేత్రయ విజయరాఘవ తదాస్థానకవులకు మార్గదర్శకుడైనట్లే వారు శహాజీ గిరిరాజాదులకు మార్గదర్శకులైరి. కాని నేడు తంజావూరిలో వారివి కొలది యక్షగానములే గాని పదసంపుటములు కానరాకుం టట శోచనీయము.

13. చూ. శివాజీ అన్నప్రార్థనాపరిణయము తం. స. మ. కే. నం. 499
14. చూ. శివాజీ కీర్తనలు. తం. స. మ. కే. నం. 811.

అనుబంధము

3

శహాజీ దరువులు

తంజావూరు మహారాష్ట్ర ప్రభువు శహాజీ యక్షగాన ప్రబంధము లందలి దరువులు మిక్కిలి అపురూపమైనవి. అందతని సంగీతసాహిత్య నాట్య విద్యా వైదుష్య వైభవము విశదమగును. యక్షగాన రచనా పరిణామ ప్రక్రియాప్రాగల్భ్యము తేటపడును. ఆ దరువుల విశేషములు కొన్ని మచ్చునకు మాత్ర మిందుదాహరింపబడుచున్నవి. ఇందనేకము మన యక్షగానములం దితరత్ర కానరావు.

1. సలాము దరువు: పంచరత్న ప్రబంధమునుండి –

భైరవి – ఆట

కర్పూర ధవళాంగ । కందర్ప దర్పభంగ
సర్పభూషణ । ధృతగంగ । సదయ త్యాగరాజ ఉత్తుంగ ।
నిసగారి గమాప । ధధపమ
గరి గమ పమ । పధ నిధ ధప
పధనిసరి సనిరి సన ధప
సానిధధ పమ ధాపా మగారి సరిస ।
సల్లాము సల్లాముర్రే ॥
తకధిమికిట ఝంతరి తక్కిట కిటతక మొ॥

2 ప్రబంధదరువు: పంచరత్న ప్రబంధమునుండి

బిలహరి – ఆది

ఇందు కళాధర । సుందర వదన పు
రందర వందిత చరణారె ।
కుందరదన యర । వింద నయన కర
నందిత శాహేంద్ర నందరూప త్యాగేశ ।

యెలిలాం యెల్లాంత । దేవాది దేవ
యెలిలాం యెల్లాంత ॥

తాం తరతర । యెల్లిల్లాం । తద్ధిమి తద్ధితర ధరికిట తర
ధింగుణాంకు తర । తళాంగు తరధిమి తక్కిణాం ।
తరకిణాం । కిటతరి । తరధళాంగు ।
ధణకు తరధిత్తా । యెలిలాం యెల్లాంత ॥

ఈ విధమైన యెలను సాహిత్యములో అనగ త్యాగవినోద చిత్ర ప్రబంధమునందు ఒక్కటే నగుపుగా నుదాహరింపబడినది.

3. పదాభినయము దరువు: పంచరత్న ప్రబంధము నుండి —

సావేరి – ఆది

దేవదేవేశ నన్ను బ్రోవు । గావు మహేశ ।
గాముని బారిఁగొన్న స్వామివి నీవా । దారు
కావన జనులను గాచిన నీవా ॥

4. సవ్యాపసవ్యసమపద లీలా దరువు: త్యాగ వినోద చిత్ర ప్రబంధము నుండి —

దేశాక్షి – ఆది

నగన టిటిటి (?) తగున । మగువకు లోను వగుమ
కనరు తీరు తీరునర । నెనరు బోను బోరుననె
మెలత మీర మీ తలమె । కలయ మానుమా యలర
చేడియ రాడు రాయడిచే । పోడిమిగాని గామిడిపో
వాడే శాహేశా దేవా । రా దేవ రాపదేరా ॥

ఇందనులోమ విలోమ గతుల యందును శబ్దక్రమ మొక్కటే యగుట గమనింపఁ దగును.

5. క్రమ సప్తస్వర వర్ణార్థ లీలా దరువు :— త్యా. వి. చి. ప్ర. నుండి —

ఆట తాళము

సరిగామా పధ — నీ వింక పైడిక (?)
తరుణు లెవ్వరు — దాని సరిగారీ
ఆలినీల వేణులు — అబ్జనిభాస్యలు
కలకంఠులు — దాని సరిగారీ
జలజ దళాక్షులు — సరస బింబోష్ఠులు
మెలత లెవ్వరు — దాని సరిగారీ ॥

ఇది యొక్కటే దరువు తోడి, కల్యాణి, ఖాబి, శంకరాభరణము రాగములు నాల్గింటను ప్రవర్తింపఁ జేయఁ దగినదిగాఁ బేర్కొనఁ బడినది.

6. మోహర ం : పంచరత్న ప్రబంధము నుండి —

తత్తక్కారం । ఝుకఝుక । తత్తతత్త తాం దత్తత్తా
తోధికితాం తందందాం । తాంగత్తోకిట తకధరికిట
తందంధి తాంధ్ధితక్కి । తోంధోం గత్తోం
ధిక్కితక్క । తోంతక తకధికి తందతాం ॥

తిరుమానం :—తందక । తకతక । తందక తకతక
తందక । తకతక । ధళాంగుతోం ॥
ధింధికి । ధికిధికి । ధింధికి ధికిధికి
ధింధికి ధికిధికి । ధీంగణతోం ॥

....

తకధళాంగు తకధళాంగు । తధింగిణతోం ।।

7. గణపతి కవుత్తం : పం. ర. ప్రబంధము నుండి —

ధీత్తత్తై । ధీత్తత్తై । తత్తాదిద్ధితోనంతా ।
ధక్కిట ధిక్కిట్టతక్కి । ధిరుగుడుతాం తోంగ
ధీందత్త ధీందత్త । ధీంధధీం దత్తక్క

తధిమి ధిమిత తక్క । ధిరుగుడుతాం తోంగ
తాతాధిత్తా ధిక్కిట । తకధిక్కిత్తాందత్త
ధక్కిట కిటతక । ధిక్కిట కిటతక
తోంగుడ కిటతక । నంగిడ కిడతక
కరిముఖ హరసుర । వరకమలజ నుత
వరపాశాంకుశ యుత । చరణం తేశరణం
తక్కిట ధిమికిట తోం । తకతోం
తధిక్కిట తక ధిమి కిట్టతోం ॥సతతం॥

8. నెలకట్టు : పం. ర. ప్రబంధము నుండి –

తెయి తెయిం దత్త । తాహత్త తెయి తెయిం
దత్తతత్త । తెయి తెయిం దత్త తాహత్త
తెయి తెయిం । దత్తతత్త తద్ధిందత్తా ధిందత్తా
ధిందత్తా । తతతధి । తతతధి । తకధిం దత్తా
ధిందత్తా । ధిందత్తా । తతతధి తతతధి
తధింగిణతోం ॥

9. సొల్లుకట్టు : పం. ర. ప్రబంధము నుండి –

తాంధి తద్ధిమి తకర్కుం గణక ర్కుగ
తత్తోంగుడు । తకతోంగుడు ధిఖికిడు
తాంధి తాంధితక ధణం త్తకిణ ర్కుక
తతోంగ తకధోంగ । తోంతోంగ
తకతక ర్కుకణకర్కు ॥

10. త్రికాలస్వరం : పం. ర. ప్రబంధము నుండి –

సారిగ గారిస । రీగప పామ్మగ । గపధస సానినీధ ।
రీసరీస ధాపమగ । పధసా నిధ పధని ।
పధధప మగరిగ । సరిగ పామాంగ
పధనిధ ధాపమా గరిరిస । యెలిలాం యెలాంలే
తాహంగ తక ర్కుణుతాం । కిటతరి తక ర్కుణుతాం ॥

11. వ ర్ణ త్రి కా ల సొ ల్లు : పం. ర. ప్రబంధము నుండి —

ధిమి ధిమి కిట । తక ఝణుత తకిట
కిటతరి కిటత ధిమిత తక ఝణు
ఝణుత ధణ తకతక । కిణ తకధిమి
తక ధికి తక । తోంగు తక దధింగిణతోం ॥
యెలిలాం యెల్లాం ॥

12. జ తి : పం. ర. ప్రబంధమునుండి –

తాంధిధి తాం తాం । దిద్ధి తాం దాం
దిద్ధి తాం దాం తక
తోం తోం తోం గతోం తోంగు ॥

13. స్వ ర జ తి : త్యా. వి. చి. ప్రబంధము నుండి —

గగరీ స్సరి నిరి సాన్నిధ । ధ .... నిరీస్ససాస
పమా మాగా । మాగ గరిస । గమప పామ
ధప మగరిస । పామామ్మాగా మాగ గారిస
ధధనిధాధ । పమ పమామ । గరిమ గరిస
పామామ్మాగా .... గరిస ॥
నాయక భువన విధాయక అచ్యుత
సాయక భువన విధాయక త్యాగేశ ॥

14. స్వ ర సొ ల్లు జ తి : త్యా. వి. చి. ప్రబంధము నుండి —

తద్ధిన్నాం కిడతక । తాంధిత్తక్కిడ తక
ఝెంతారిత్త గణంగితాం ధిత్త ....
తద్ధళాంగు తక ధరికుడు
తకతోంగుడు తక । తధిగిణధోం ॥

15. వ ణ సొ ల్లు జ తి : పం. ర. ప్రబంధము నుండి –

తాంతక తకధినానాం
తద్ధిన్నాం త్తక ధిత్త
ధినానాం ధిత్తానాం ధిరుగుడు తక
ధీంధిమిత తక ధళాంగుతోం ॥

16. పంచఘూతము : త్యా వి. చి. ప్రబంధము నుండి –

సావదవ్వాహో అ । సావధనరాహహో
జనాహో । కాళదుష్టదానిదాక । కర పసరూన ।
జపతో కాళహర చింతా సాద
కమనీయధర్మ ఆచర ॥

మీఁదఁ బేరొక్కనఁబడినవానిలో 'జతి' యను పదము సంస్కృత సంగీత శాస్త్రకర్తలు ప్రయోగించిన 'యతి' శబ్ద వికృతి యను కొందును. 'యతి' యన్నది సంగీత శాస్త్రకర్తలచే వాద్యాధ్యాయమున నొక వాద్య ప్రబంధముగాఁ బేరొక్కనఁ బడినది. సంగీత రత్నాకరమున (VI. 152-153) నది – కూటవర్ణవిరచితము (కూటవర్ణము లనఁగా పటహాది వాద్య సాధారణ వర్ణములు అని చతుర కల్లినాథుని కళానిధి వాఖ్య), అత్యంత కోమలము ('బంధకాఠిన్య వర్జితము' అని వాఖ్య), ఏకరూపాక్షరము (అనఁగా 'ఉపక్రాంత వర్ణానుసారేణైవ సమాపితః' అని వ్యాఖ్య), తాళచ్ఛందోభివ్యంజనోజ్జ్వలము, బహు విరామ సంయుతము నైన వాద్యఖండముగాఁ బేరొక్కనఁ బడినది.

మీఁది 'గణపతి కవుత్తం' అనునది సంగీతశాస్త్రము లందొక వాద్య ప్రబంధముగాఁ బేరొక్కనఁ బడిన 'కవితమ్' అనుదానికి దగ్గరి చుట్ట మను కొందును. సంగీత రత్నాకరమున (VI. 172) తల్లక్షణ మిట్లున్నది :–

" ఇత్యుద్గాహ ధ్రువౌ కృత్వా స్వోద్గా హాంత్యదలేఽథవా ।
స్వోద్గాహే యత్రముక్తి స్తత్కవితం కవయో విదుః "

'పంచఘూత' మనున దొక తాళ విశేషమో లేక తాళ ప్రబంధ విశేషమో యనుకొందును. తల్లక్షణము :

' గద్వయం లత్రయం జ్ఞేయం నిశ్శబ్దం లత్రయం తతః
పంచ భూతస్య విజ్ఞేయః ప్రసిద్ధ స్తాల వేదినామ్"

' జీవద్వయం భవేద్యత్ర నగణశ్చ విరామవాన్
ఇతివా పంచభూతః స్యాల్లఘు త్రితయ సంయుతః ' *

— సంగీత దర్పణము.

ఇక మోహరం, నెలకట్ట మొదలైనవి ప్రసిద్ధ సంస్కృ సంగీత శాస్త్రగ్రంథము లం దుదాహరింపఁబడలేదు కాని యవిఁ వాద్యప్రబంధములు, తాళ ప్రబంధములు అను వాని కోవకుఁ జెం నట్టివిగాఁ దోఁచును.

సంగీత శాస్త్రైక దృష్టితోఁ బరిశీలించినచో శాహరా సాహిత్యమందు, అసలు యక్షగాన వాఙ్మయ మంతట నపురూపవ లైన విశేషము లనేకము గోచరించును. యక్షగాన మొక సంగీ ప్రక్రియా నిక్షేపము. అందలి విశేషము లన్నిటిని వివరించి లాక్షణి ముగ వ్యాఖ్యానించుటకు నాకు శక్తి చాలదు. అది ప్రత్యేక మొ పరిశోధన వ్యాసంగమునకు విషయము. అభిజ్ఞుల పరిశీలనార్థ మీయఁ బంధములఁ గొన్నిటి నూరక ఉదాహరించితి నంతే. అక్కడక్కఁ నా యోపిన కొలఁది కొంత కొంత వివరించుటకుఁ బ్రయత్నమ చేసితిని. దొసఁగులు పొసఁగిన - హసింతురు గాక పురోభాగులు మన్నింతురు గాక మహాభాగులు.

---

* వాసుదేవకవి పార్వతీపరిణయమున ' పంచభూతమత్య ' ఉదాహరింప బడినది. అది మత్యతాళప్రభేద్యమగునా ?

అనుబంధము

4

వివిధ గేయ రచనలు

ఈ అనుబంధములు పరిధిలోనికి రాని పలురకముల యక్షగాన పదములు పాటలు నీ యనుబంధమున బ్రసక్తము లగుచున్నవి. అందు కొన్ని సంగీతోచిత ప్రక్రియానిబద్ధత గలవి. మఱికొన్ని పద్యము నోకడ యసఁగా ఛందోనిబద్ధత గలవి. కొన్ని కేవలము సందర్భము, అందుఁ బ్రసక్తమైన విషయమును బురస్కరించుకొని పెట్టఁబడిన పీఠికలు గలవి. అందుఁ జాలభాగము దేశిరచనలు. అందు రగడ వికారములు గొన్ని. ద్విపద వికారములు గొన్ని. ఇట్టి దేశి సంగీతగీతులును అతి ప్రాచీన కాలమునుండియుఁ బ్రసిద్ధినహించి యున్నవి. భృహద్దేశి, సంగీతరత్నాకరాది ప్రాచీన సంస్కృత సంగీతశాస్త్రగ్రంథములందును ప్రబంధాధ్యాయ పరిగణన కెక్కినవి కొన్ని. యక్షగాన ప్రయోగమునుబట్టియేకాక పాల్కురికి సోమనాథుఁడే కరపత్రమున పెట్టిన పట్టికను బట్టియు, లక్షణదీపిక, సంకీర్తన లక్షణము, అప్పకవీయము మొదలగు లక్షణగ్రంథములందును మన కావ్యములందును గల ప్రసక్తిని బట్టియు, తాళ్ళపాకవారి పదవాఙ్మయము, త్యాగరాజు ఉత్సవసంప్రదాయ కీర్తనలు, జానపద వాఙ్మయము మొ॥ వానియందలి లక్ష్యకోశమును బట్టియు నిందలి కొన్ని గీత ప్రబంధములకుఁ బ్రాచీన కాలమునుండియుఁ దెనుఁగున గల ప్రచారము తేట తెల్లము కాఁగలదు. కాలక్రమమునఁ గొన్ని క్రొత్తలు పొడసూపకపోలేదు. అర్వాచీన యుగములఁ బరిణామ

పథములఁ బ్రయాణించు యక్షగానము వానిం గొన్నిటిని గ్రహించుచునేవచ్చినది.

ప్రకృత మీ యనుబంధమునఁ బ్రసక్తములైన గీత ప్రబంధములన్నిటికిని సిద్ధముగా లక్షణ మేర్పరింపఁబడియుండలేదు. సహజముగా గీత ధర్మము గలవి కావున పాడఁబడు సమయమున రాగము సాగదీతవలన వీనియందలి గురులఘువ్యవస్థ మాఱవచ్చును. బహు లక్ష్య పరిశీలనముజేసి వీలైన సూచనలు మాత్రము నా చేత్నైనంత చేసెదను. ఇవి నిష్కృష్ట లక్షణములని భావింపరాదు. సూచనలు మాత్రమ. అభిజ్ఞుల పరిశీలనార్థము మన యక్షగానములందే సాటి సంగీత సంబంధి సామగ్రి యున్నదో యెత్తిచూపుటకే యీ ప్రయత్నము. అప్పకవి లాలి, గౌరీకల్యాణము, ధవళము, సువ్వాల, అర్ధచంద్రికలకు లక్ష్యములు మాత్రము చూపించెను. లక్షణము నిరూపింపలేదు. అతఁడు నొక యక్షగాన రచన చేసినఁవాఁడు. లక్ష్యకర్త, లాక్షణికుఁడునైయుండియు నట్లు కతిపయ గేయప్రబంధముల కూరక లక్ష్యములు మాత్రము చూపించె ననఁగా వానికి లక్షణ మేర్పరించుటలోఁగల సాధకబాధకము లతని కధిగతార్థములన్నమాట.

వరుసగా నొక్కొక్క గీతి రీతిని స్థాలీపులాక పరిశీలనముచేసి చూతము :—

1. అధ్యాత్మలు :- విజయరాఘవుని పరిష్లోద చరిత్ర అవతారికలో నతని రచనలు పేరొక్కనబడిన యొక సీసమాలికలో ఏలలు, విడిపదాలు, సంకీర్తనలు మొదలగు వానితో పాటిదియు నొక గేయ విశేషముగ నటంకింపఁబడినది. ఆతనిదగు లక్ష్య మొక్కటియు లభ్యముగాలేదు. యక్షగానములందు దీని ప్రయోగము క్వాచిత్కము. తెలంగాణము ప్రాంతమునకుఁ జెందిన మట్టెవాడ భీమేశుని కంకితమైన

శివరాత్రిమాహాత్మ్య మను యక్షగానమున నిది పలుతావులఁ బ్రయుక్తమైనది.

ఉదా:- ౧. ప్రవిమల ప్రమథుల - పాలిటి పెన్నిధి శివునిరాత్రి, సకల
దివిజ చకోరత - తికిని సుధానిధి శివుని రాత్రి ।పల్లవి।
కాయిక దోషాంధ-కార పంక్తికిరవి శివునిరాత్రి, ని
ర్మాయిక జనవన - రాజిమందారము శివునిరాత్రి ॥

. ఈరీతి తర్కించి - యేగె మిథిలాపుర
ద్వార బాహ్యోపవన - ధాత్రికిని యందున్॥

మొదటిదానిలో చతుర్మాత్రాక గణప్రాచుర్యముతో నేక తాళగతి స్ఫురించును. రెండవది పంచమాత్రగణాక మగు జంపె శేకు. ఇట్లు దీని గమన మన్ని తావుల నొక్కతీరుగ లేదు. రెండేసిపాదము లకుఁ బ్రాస నియతి గలదు. సజాతీయ వర్ణావృత్తితోఁ బ్రతిపాద మును రెండు దళములుగా విరుగును. దీనికి పల్లవి చరణ విభాగమున్న జాడ దోఁచును. సర్వసాధారణముగ శేకులో, దరువులో లేని యక్షగాన ముండదు. ఈ శి. రా. మా. న వానిపేరు కానరాదు. వాని స్థానము నాక్రమించుకొన్న వీ యధ్యాత్మలే. దీనిని శేకునకు దరువు నకు నుద్దియగు పదరచనా విశేష మనవచ్చును.

2. అనువులు :- కొద్ది యక్షగానములం దతి విరళముగాఁ గను పట్టును. ఒకొక్కదానియం దొకొక్కతీరుగా నున్నది దీని గతి.

ఉదా :- ౧. రూఢిమీర మహాగణంబులు గూడిచూడ, నాట్యము
లాడువాడు బుధోత్తములు గొని యాడువాడూ ॥
— వీరచోడవ్వచరిత్ర

౨. పతిలేని ధాత్రి యుడుపతిలేని రాత్రియును
మతిలేని మంత్రియును శ్రుతిలేని తరిత్రి॥
— బలభద్రదాస్రికపోతవాక్యము

౩ పుణ్యజనులందరు దను జూడంగ ముదము బొంది
అరుణ కిరణు డుదయమయ్యెడు నటకుమున్నె ॥

— భీమసేన విజయము

ఉదా :— ౧ లో త్రిపుట గతి, ౨ లో జంపెగతియుఁ గలవు. మూఁడవదాన గతి స్పష్టపడ లేదు. (ఇది కొన్నిట 'హానువు' లనియుఁ బేర్కొనఁబడినది).

౩. అప్పగింత పాట :— ఇదియొక ప్రత్యేక రచనా ప్రక్రియ గలదికాదు. కళ్యాణ కథలందు తలిదండ్రులు విద్యాలవారికిఁ దమ కన్యనప్పగించు సందర్భమును బురస్కరించుకొని పుట్టినది మాత్రమ.

ఉదా :— బాలామణి మిగుల గోల
బుద్ధులేవేళ నేర్పుడీ భామ చాల
ఈడు బాలికలగూడు, బొమ్మల
జోడు పట్టి తానాడు

— జానకీపరిణయము

4. అలకపాట :— ఇదియు అప్పగింత పాటవలె సందర్భ పురస్కృతమైనదే కాని యొక ప్రత్యేక ప్రక్రియ గలదికాదు.

ఉదా :— "ధర్మస్వరూపమై ధరణి పోషించు
ధర్మరక్షక నీకు తగదు లేవయ్యా ॥

మొన్న సంగయ్యనిఁ జెన్నుగాబట్టి
వన్నెలింగముగట్టి వరుడ రావయ్యా ॥

— బసవమహిమామృతవిలాసము

ఇందు జంపెగతి స్పష్టముగనున్నది. రెండేసి పాదములకు ప్రాస నియమము, పాదపాదమున పదిమాత్రల్నపై యతియుఁ జూపట్టు చున్నవి. కాని అలకపాటలన్నియు నియతముగ నిట్లే యుండవు.

5. <u>అల్లొనేరేళ్లు</u>:- ఈమాటకు రాజజంబూఫలము, నమస్కారము, బాలక్రీడాభేదము, ఒకానొక పాట అని వివిధార్థములు గలవు. (చూ. సూర్యరాయాంధ్ర నిఘంటువు.) ఇదియొక గీత ప్రబంధ విశేషమనుట యుక్తి యుక్తము. చాల యక్షగానములం దిది ప్రయుక్తమైనది. 'అల్లొనేరేడల్లొ' అను మాట యీపాట కొక పల్లవి వంటిది. ప్రతి చరణాంతమునను బునరావృత్తమగుచుండును. అనేక యక్షగానములందు దీని చరణము లచ్చము జంపెరేకులే. (చూ. పాలయముంకెర గోడిసుల్ల భూపాలుని జానకీ పరిణయము, చౌదరి రామదాసు రుక్మిణీ పరిణయము, మామిళ్ళపల్లి వెంకటాచలయ్య ఏకాంతసేవ మొదలగునవి.

ఉదా :- ఒక చరణము

శ్రీరామ విభవంబు చెలువంద గాంచీ
ధారుణికి పుత్రియై తగ నుద్భవించి
కూరిమితో జనకునకు కూతురనుపించీ
కోరికతో దశరథుని కోడలనుపించీ । అల్లొనేరేడల్లొ॥
జానకీ పరిణయము సౌభాగ్యమాయె॥

— జానకీ పరిణయము

ఈ పాటకొక సంప్రదాయ సందర్భమును గలదు. ఇదియొక పెండ్లిపాట. 16 శ. ప్రబంధము లందును పెండ్లిపాటగా దీని ప్రసక్తి కనుపట్టును. (చూ. కకుత్థ్సవిజయము 4.3 ; పాంచాలీ పరిణయము 4.10) కల్యాణ కథాత్మకములగు యక్షగానములందు ముత్తైదువల సువ్విపాటకుఁ బిదప నిది కన్పట్టును. పై జానకీ పరిణయ రుక్మిణీ పరిణయము లిందులకును దార్కాణలే. అనఁగా సుంకులు దంచుట సువ్విపాటకును, సుంకులు చెరుగుట అల్లొనేరేళ్ళకును సందర్భము

లన్నమాట. గణపవరపు వేంకట కవి యీ విషయమును స్పష్టముగాఁ జెప్పినాడు :—

పల్లవ పాణులు కొందఱు
పళ్ళెరములఁ బూని రవల బంగరు గాజుల్
ఘల్లురన సుంకు జెరిగిరి
యల్లోనేరేడటంచు నయ్యిందిరకున్

—ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము 571.

అయితే మామిళ్ళపల్లి వెంకటాచలమయ్య తన ఏకాంతసేవ యక్షగానమున దీనిని 'కొట్టణం పసుపు విసిరే పాట' గాఁ బేర్కొని యుదాహరించినాఁడు.

శ్రీకేశవం సదాశ్రితకల్పభూజం
నారాయణం సదానారదస్తుత్యం ॥అల్లానేరేడల్లా।
శ్రీలక్ష్మిపరిణయము చెలువందమాయె॥

ఇదియు జానకీపరిణయము దానివలెనే జంపెగతి గలది. మాత్రల పరిమితియు నంతే (5×3+3 లేక 4). అందు 'సుంకులు చెరిగే పాట' వేఱే యుదాహరింపఁబడినది. కొన్ని యక్షగానములందు అల్లానేరేళ్ళకు రాగనామము లుదాహరింపఁబడినవి. పణిహారం ఎంబారయ్య కురవంజిలో ధానికి నాదనామక్రియ పేర్కొనఁబడినది.

6. (అ) అష్టకము :- ఇది కొలఁది యక్షగానములందుఁ దఱుచు నాయిక విరహవేదనాదిక సందర్భములందుఁ బ్రయుక్తము. నాలుగు పాదములు నాల్గురెళ్ళనిమిది దళములును గలది. ఆ దళములను బట్టియే ఆ పేరు. ప్రతిపాదము నచ్చముగా నొకత్రిపుట రేకు. అనఁగా ఏడేసి మాత్రలదళములు మూఁడింటిపై నొక యెదుమాత్రలు గలది. సరిగా మత్తకోకిల మాత్రసంఖ్యలో సరిపోవునది. దానివలెనే వృషభ

గతి గలది. నాలుగు పాదములకును ఆద్యప్రాసయు, నంత్యప్రాస యును జూపట్టును. ప్రతిపాదమున పదునాల్గుమాత్రల పై అనఁగా ద్వితీయదశమము ప్రథమాక్షరము యతిస్థానము.

ఉదా :– కదియ వచ్చిన మేనికాకను
గ్రమ్మిపూఁబొద వాడఁగా
కొదమ తుమ్మెద లూర్పుసెగలని
గూడ కూడని పాడఁగా
పదరు మదనుని తూపులాయము
పట్ల పలుమరు గాడఁగా
ముదిత ముందఱి కరిగె శంభుఁడు
మొనసి ముచ్చట లాడఁగా ॥

– విష్ణుమాయా విలాసము

ప్రసన్న వేంకటేశ్వర విలాసాదు లందును అష్టక మచ్చముగా నిదే మచ్చునఁ గలదు.

(ఆ) చౌ ప ద్య ష్ట క ము : ఈ పేరుతో ఉపాధ్యాయుల మృత్యుంజయకవి వామనచరిత్రమున నొక రచన గలదు. అది అష్ట కములో సగము పరిమితి గలది. అనగా నష్టకములోని నాలుగు దశ ములు దీనికొక ప్రమాణాంశయగును. అందులకే చతుష్పది – చవు పది – చౌపది + అష్టకమైనదిది. అష్టకములోని రెండవదశమున కంటె దీని రెండవ దశమున రెండుమాత్ర లెక్కువ. అంత్యప్రాస నియతముగఁ గానరాదు. అంతే భేదము.

ఉదా :– వరకుతూహల సత్వరుండును
వర్ణ్యవిమల యశస్కరుండును
పరమదృఢతర సుమనస్కుఁడురుతర
భద్రనియతుఁడు నంధుఁడూ ॥

7. అ ష ప ది :— అనఁగా నెనిమిది పదములు గలది అని యర్థము. అష్టకము నిదియు సమానార్థకములే. కాని లక్షణ గ్రంథములందు వేఱువేఱఁ బేరొక్కనఁ బడినవి. (చూ. లక్షణ దీపిక డి. 1329) జయదేవుని గీత గోవిందముతో దీనికిఁ బ్రతిష్ఠ వచ్చినది * యక్షగానము లందటనటఁ బ్రయుక్తమైనది. చూర్ణికవలెఁ దఱుచు సంస్కృత ఘటితముగానే కన్పట్టుచున్నది.

ఉదా : త్వామనిశం ప్రేమయుతం భృశ
మామనుతే హృదిబాలా
తామురరీకురు కామవశాభిహతా
మిహ శాహనృపాలా ॥
లలిత ఫలకతల చిత్రిత మపితవ
కృత విలాస కలాపం
కలయతి దిశి దిశిహంత యథాత్మని
లలిత మనోహర రూపం॥ త్వామనిశమ్॥

అష్టకము నందు వలెనే ప్రాస పాటింపబడినదికాని యతి మాత్రము తెలుఁగునందువలె సజాతీయ వర్ణావృత్తికాక సంస్కృత సంప్రదాయానుసారము విచ్ఛేద సంజ్ఞగాఁ బాటింపఁబడినది. పై అష్టకమునందు వలెఁగాక యిందు మధురగతి కన్పట్టుచున్నది. అష్టపదులందు మధుర గతికే ప్రాముఖ్యముగాని యది యొక నియమముగాదు. మొదట ఏ గతిభేదము గ్రహింపఁబడిన నదియే సాంతము పాటింపఁబడవలె ననుటయే దీని నియమము.

---

* ' ఘనత మీరంగ జయదేవ కవివరేణ్యుఁ, డందమైనట్టి గీతగోవింద మందు నంచితాష్టపదులు వల్కొనట్లు పదము, పరగు నెనిమిది పదములు పల్లవియును' అనియు "ధరనెనిమిది పాదంబులఁ, బరగిన పదమదియు శరభపాద పదం' బనియు దీనినొక పదవిశేషముగాఁ బరిగణించినాఁడు తాళ్ళపాక చినతిరుమలయ్య (చూ. సంకీర్తన లక్షణము 46—48)

"యష్టగాన్షష్ట పదాష్ట పదులు నాలుగు విధమ్ములు నొక్కొక్కటి పెక్కువిధమ్ములై' యష్టకమ్ముల పదంబులు నష్టపదులును వివిధరీతుల నానా ముఖంబుల విహరించు" నని యనియున్నాఁడు పొత్తపి వెంకటరమణ కవి. (లక్షణశిరోమణి - తృతీయాశ్వాసము ఆర్. 1257 పుట117)

8. ఇంగ్లీషు మెట్టు :- కేశవ పట్టణం జియ్యరయ్య నలనాటక మున నిదియొక దరువుగాఁ బేరొక్కనఁబడినది.

ఉదా : అభిషేకించిరి మోదముగన్
అవనీధవునకు నతివేడ్కన్
శుభలగ్నంబున మునులు వశిష్ఠులు
సూరులు మిత్రులు నిష్టులునూ॥

ఇందు విశేషములేదు. ఇట్టివి తెలుఁగు మెట్టులే గలవుబోలెడు. మధుర గతిలో సాగు చౌపద్యష్టకము వంటిదిది. మూఁడవపాదమున మాత్ర మొక రెండు మాత్ర లెక్కువైనవి.

9. ఊంజల్ :- ఇదియొక ఊయలపాట ఊంజల్ తమిళ శబ్దము. ఉయ్యాల అని యర్థము. 'లాలి' యన్నదియు ఉయ్యాల పాటయే, జోల ఉయ్యాలపాటగఁగూడ నున్నదిగాని వానిగతియే వేఱు, దీని గతి వేఱు. చిన్నపిల్లలను నిద్రబుచ్చుటయు దేవాయతన కల్యాణోత్సవములును వాని సందర్భములు. ఇది పార్థసారథి విజయము, ఆండాళ్లు చరిత్రములందు కల్యాణ సందర్భమున వధూవరులను సఖులు ఉయ్యాలలూచిన సందర్భమునఁ బ్రయుక్తము. ఆండాళ్ చరిత్రమున ఊంజల్ పాట వెంటఁగలదొక లాలి పాట. ఇట్లు వివాహవేళ వధూవరుల నుయ్యాలలూచు నాచారము తమిళ మళయాలాది రాష్ట్రము

లలో నీనాఁటికి నున్నదని వింటము. పై రెండు యక్షగానము చెన్నపురమున రచింపఁ బడినవి.

ఉదా :– ఆండాళ్ చరిత్రమునుండి

శ్రీవిల్లిపుత్తూరు పుంజల్‌తొట్టి
చతుర్వేదంగళుం శంగల్‌వూట్టి
ఆరుశాస్త్రంగళుం తూణ్గల్‌నాట్టి
ఆండాళు (రంగ) మన్నారు ఆడిరూంజల్॥

ఇందొక్కొక్క దళమునకు మాత్రలు 5+5+7; పా. సా. 5+5+6. ఇందుగమనింపదగినవి జంపెగతి, పంచమాత్రాక గణార్యము. జంపె గతికి సన్నిహితమైనది తాళ్ళపాక అన్నమయ్యల వారి కీర్తనలలో నొక ఉయ్యాలపాట గలదు. (సంXI 216) అందలి పాదము లచ్చపు జంపెశేకులు. త్యాగరాజస ఉత్సవ సంప్రదాయకీర్తనలలో (ఆది అండ్‌కో ప్రచురణ 408వ నున్న ఉయ్యాలపాటకు ఝంపతాళమే వేరొక్కనఁ బడినది.

10. ఓడం :– 'శ్రీరామపుత్రి' యను మారుపేరిట నొక యిత్రి వ్రాసిన సీమంతినీ చరిత్రము అను య. గా. న మాత్ర మె లక్ష్యము దొరికినది. ఈపేరతి విచిత్రముగ నున్నది. ఇతరత్ర క కేవల మశ్రుత పూర్వము.

ఉదా : చూడ చూడా వేడుకాయే – సీమంతీ
నేడు పెండ్లి కూతురాయే
మూడు భువనాల్ కీర్తినిండే – దుఃఖంబూ
వీడి తనదూ విభునిగూడే
బంగారు తట్టతో మంగళారతులు
శృంగారముగనిచ్చి యంగనలు అవురు ॥

ఇందు మొదట నాలుగు పాదములందును త్రిపుటగతియు, చివరి రెండుపాదములందును జంపెగతియుఁగలవు. 1-3పాదములందు మాత్రాక్రమము 7+7+6 ;2-4 పాదములందు 7+7 ; 5-6 పాదములందు 5^3+3. నాలుగేసి పాదములు ప్రాసైకఘటితములు.

11. కీర్తన :- కొన్నియక్షగానములందు రేకులో, పదములో, దరువులో ఉండవలసిన-చోట కీర్తనలపేరిట గేయరచనలు గన్పట్టు చున్నవి. రేకులు రగడ వికృతులు. ఒకవిధమైన ఛందోనిబద్ధత గలవి. పదములందును ఒకపాటి ఛందోనిబద్ధతగలవి కొన్నియున్నను అట్లు లేనివే యెక్కువ. ఛందోనిబద్ధత లేక రాగతాళ ధారాళము లగు పదములు, దరువులు కీర్తనలు నొకపాదునుండి ప్రాకినతీగలే. యక్షగానపదములు, దరువుల గుఱించి 1వ యనుబంధమునఁ గొంత చెప్పుటయైనది. పోలిక లిరుగుపొరుగుగాఁగల యీమూఁటి యనుబంధము గుఱించి యిట మఱికొంత వివరింతును.

పరగున్ వృత్తము జాతియంతయుఁ జతుష్పాద ద్విపాదాకృతిన్
వరసంకీర్తనముల్ తదాకృతులనే వర్తించుమానంబుతో
దరువుల్ జక్కువలేకులేలలును నిర్దంబైన గొబ్బిళ్ళు భా
సురవాక్యంబులు జందమామ పదముల్ శోభిల్లు నందంబులై॥

(సం. ల. 50)

పై పద్యమునఁ జెప్పఁబడినట్లు స్థూలముగాఁ జూచినచో నివి యన్నియుఁ ప్రాక్తనమైన యొకపద సంప్రదాయము నుండి బయల్వెడ లినవియే కాలక్రమమునఁ బరిణామముబొంది వై విధ్యము నవధరించినవి.

అని చెప్పనగును. వీని యన్నింటికిని మూలము 'దేశెళ'—వివిధాభర
ణములందలి యేకైకమూలపదార్థమగు బంగారమువంటిదది. *

అర్జున భరతమ్మునను ఇక్కడ చెప్పఁబడినదఁట —

'కర్ణాటలాట గౌడాంధ్ర ద్రవిళానాంతు భాషితం
ఎళసప్త విధాజ్ఞేయా, ప్రోక్తామత్యాది తాళతః'

'ఎళలనంగా పదములనిన్ని, మూఁడు చరణములకు ఖండికా
త్రయం అనే పేరుగలదనిన్ని పల్లవి, ఉపపల్లవి అనిన్ని, ఇవి మాత్ర
సమకనిబద్ధములైన హగణాదులతోఁ గూర్చవలెననిన్ని, సూళాదుల
కనుగుణ్యముగ నుండవలెననిన్ని, మఱియు నివి 'సంగీతతాళ నిర్ణయ
మ్ముల గీతనష్టి నితపుష్ట మాత్రాధిక్యమాత్ర లోపమ్ములఁబొందు
చుండు' ననియు ఫొ త్తపి లక్షణ శిరోమణియందుఁ జెప్పఁబడినది.

'యక్షగాన పదంబులు' చాలవఱకు 'సముచితానేకవిధ తాళ
సంగతుల నలరునవియు (సంకీర్తన లక్షణము), 'లయ ప్రమాణంబుల
నొప్పు' నట్టివియు (లక్షణదీపిక) నైనను సందుఁగొన్ని యొకపాటి
ఛందోనిబద్ధతగలవి. ఇటువంటివి వృత్తపదములనియు, 'యతులుం
ప్రాసములుం బదంబులును మాత్రానీకముల్ తాళసంగతులుం' గల్గిన
పదములు నిబంధనామపదంబు లనియు వ్యవహరింపఁబడినవి (చూ.
సంకీర్తన లక్షణము— 30-34). కేకులు తాళనిబద్ధతతోపాటు ఛందో
నిబద్ధతయుఁగలవి కావునఁ గొంత యీకోవకుఁ జెందునని చెప్పనగును.
విష్ణుమాయా విలాసాది యక్షగానములందున్న నీలాంబరి, ఘంటారవ,

* "కర్ణాట ద్రవిళాంధ్రలాట విల సద్గౌడాది భాషాస్థితిం గర్ణాపూర్ణ సుధా
సమానరుచులం గల్గించు దేశెలదా, స్వర్ణంబాభరణత్వమొందు కరణిన్ సంగీత
శాస్త్రంబులన్, వర్ణింపందగు మానుజాతియతయై వర్తించుఁబ్రత్యేకమై? (సం.ల.28.)

ఆహిరి, రేవగుప్తి ఇత్యాదిగా రాగనిర్దేశముగల పదములు ఏల పదము, తుమ్మెదపదము, వెన్నెలపదము. చందమామ పదము మొదలగు దేశిపద రచనలును నిర్దిష్టచ్ఛందఃప్రక్రియకు లొంగునట్టివి కావు. ఇట్టివే దరువులును. దరువు గుఱించి ప్రత్యేకమొక యభిప్రాయము వ్యక్తమైనది సంకీర్తన లక్షణమున:

'మహిమ మీఱంగ ద్రుతమధ్య మానములును
జిత్రవర్ణంబుఁ దాళంబుఁ జెన్ను మీఱి
మునుపఁబాడిన పదవాక్యముల బొసంగి
ధరణి ద్విచతుష్పదాకృతి దరువు చెలఁగు (63)

మఱియు దరువు ఒక ముక్తక రచన వంటి దనియు, పదము కులకము వంటిదనియు అర్ధచంద్రకపదాదులతోపాటు దరువుగూడ 'పాదయుగళ ముగ బహు జన సంప్రయుక్తంబరగు' ననియు నందుఁజెప్పఁబడినది. (51). కీర్తనములు లేక సంకీర్తనములు నీకోవకుఁజెందునవియే. అందు భగవన్నామ గుణాదికము కీర్తింపఁబడుటచే యౌగికముగ వానికిఁ బేరుకల్గిన దనవచ్చును. సంకీర్తనలక్షణకర్త 'సంకీర్తన నామక పదసంప్రదాయంబెట్టిదనిన' అని పదలక్షణప్రసక్తికి ఆకరములను సంగీత-రత్నాకర, చంద్రికా, చూడామణి, సుధాకరము లను గ్రంథములను బేరొక్కని' తానె యన్నిటికిని మూలమైన భరతమందుఁ బంచదశాధ్యాయమంగ విమల వృత్తచూర్ణనిబంధక వివిధనామ భవ్యలక్షణములకు నాస్పదము పదము" అని వక్కాణించెను. దీనిని బట్టి సంకీర్తన మనఁగా పద నామకప్రబంధ మనియు నాసంప్రదాయ మతిప్రాచీన మనియు విశదమగును. తెనుఁగుగడ్డలో మనకి నిక్షేపము తాళ్ళపాక వారి లోఁగిట దొరకినది. తాళ్ళపాక అన్నమాచార్యుఁడు (1509.) పదకవితా పితామహుఁడు, సంకీర్తనాచార్యుఁడు, 'లక్షణములు పద కవితారక్షణములు' నైన బహువిధ సంకీర్తనములకుఁ గర్త. అతఁడు

పదసారస్వత లక్ష్యప్రపంచ విరించనుడేకాదు లక్షణప్రవక్తయును. కాని యతఁడు సంస్కృతమునఁ జెప్పిన ఆ లక్షణగ్రంథము నేఁడు లభింపదు. దానికాయన పుత్రుఁడు పెదతిరుమలయ్యంగారు వ్రాసిన వ్యాఖ్యాన మును నేఁడు లభింపదు. ఈయన పుత్రుఁడు చినతిరుమలయ్య 'తద్వాక్యానుసారంబునన్' వ్రాసిన సంకీర్తన లక్షణము, ఆ అన్న మాచార్యాదుల సంకీర్తనములును నేఁడుపలబ్ధములు. లక్షణ శిరోమణి యందుఁజెప్పఁబడినట్లు ఉపపల్లవి (అను పల్లవి) లేదన్నమాట గాని తాళ్ళపాకవారి సంకీర్తనములు సరిగా పల్లవి, ఖండికాత్రయమును గలి గిన రచనలే. క్షేత్రయ పదములలో అనుపల్లవియొకటి అధికము. త్యాగరాజు కృతులలోఁగూడ నీ సంప్రదాయము బాగుగనే పాటింపఁ బడినది గాని కొన్నిట చరణాధిక్యమును జూపట్టుచున్నది. త్యాగయ్య కర్వాచీనములైన యక్షగానములందే కొన్నిటఁ (పాతూరి తిరుపతి సుందరకాండము, మామిళ్ళపల్లి—ఏకాంతసేవ, మైనంపాటి బాల గోపాలవిలాసము, గజేంద్రాళ్వారుచరిత్రము మొ॥) గన్పట్టుచున్నవి కీర్తనలు. యక్షగానములందలి కీర్తనలన్నియు భగవత్పరములు గావు. దరువులవలెనే బహు విషయాత్మకములు. లక్ష్యమునకు చూడు—క్రింద 37, 39వ అంశములు.

12. కోతియాటపదము:- చౌదరి రామదాసు రుక్మిణీ విలాస యక్షగానమున సింగడు కోతి నాడించు సందర్భమున నొక పదముగలదు. తిమ్మరాయుని తైతక్కలకుఁ దగినట్లు లయాత్మక ముగా నుండుటయే దీని లక్షణము.

ఉదా: ఆట తాళము

ధిమ్మెత్తరా తిమ్మ ధిమ్మెత్తరా
ధిమ్మెత్త ధిందిమ్మి ధిమ్మెత్తరా
ధిమ్మెత్తరా సీతమ్మగారికి ఉంగరము

యిచ్చిననాటి యిమ్మేదిరా తిమ్మ దిమ్మెత్తరా
తగ బాల్యమున పూర్వవగము మీదికి నీ
వెగసినట్టి మంచి లఘువేదిరా తిమ్మ॥

13. గ జ ల్ :- గజల్, డోరా, తొహరా మొదలగునవి కొన్ని పార్శీమట్లు 19వ. శ. ఉత్తరార్ధమునఁ దెనుఁగు దేశమున ధార్వాడ నాటక సమాజము వారి నాటకములకుఁ బ్రచారమేర్పడిన కాలమున మన హరికథలందును, యక్షగానము లందును జేరినవి.

ఉదా : బాగేపల్లివారి కుచేలోపాఖ్యానము నుండి

ఎన్ని దినంబులు జీవించిన నరు
డీల్లుట సత్యంబు
ఎన్నోవిధముల ధనమార్జించుట
లేలా నిత్యంబు॥

ఈ గజల్ తఱుచు ఆది తాళ విశిష్టముగఁ గన్పట్టుచున్నది. ఇందు పాదమునకు నాలుగు మాత్రల దళము లైదు, మిగఁత ఆఱుమాత్రల దొకటి. నాలుగు దళములపై యతి. రెండేసి పాదములకుఁ బ్రాస విహితము.

14, గొబ్బిళ్లు :- ఇది 1వ అనుబంధమున నుదాహరింపఁ బడిన గొబ్బిపదము కంటెను విలక్షణమైనది. ఇందుఁతపదము విశేషము. గతియందును విలక్షణతగలదు. గొబ్బిళ్ళఁగా ఒక ఆడుపిల్లల పండుగ (సంక్రాంతి) వేడుక, క్రీడావిశేషము, పాట, సమస్కారభేదము. (చూ. సూ. రా. నిఘంటువు). పండుగలు వేడుకలకును, వేడుకలు క్రీడలకును, ఆటలు పాటలకును దారితీయుట పరిపాటి. అట్టిదే యిది. ఇది తాళ్ళపాకవారి సంకీర్తన లక్షణమున నిబంధపదముగాఁ బరిగణింపఁబడినది. అర్ధచంద్రక పదము, ఏలపదము, చందమామపదము మొదలగు

వానితోపాటు 'పాద యుగళముగ బహుజన సంప్రయుక్తిఁబరఁ చెప్పఁబడినది (సం. ల. 50-51).

ఉదా : 1. గణపతిరెడ్డి గోపాల విలాసమునుండి

గొబ్బియాళా కొమ్మలార
రారెమరుని గుమ్మలార
ఇంతులార రారెమరుని
బంతులార రారె గొబ్బియాళా॥

2. చూడమ్మ రుక్మిణీ కల్యాణము నుండి

ఆనందభైరవి — ఆది

అందముగా కృష్ణుని సుందర పదముల
ముందున నిలిపి వందన మొనరించి
చిందుచు గొబ్బియాడరే॥పల్లవి॥
చెలులందరు గూడి గొబ్బియాడరే॥ఉప॥

15. చెండ్లాట పాట:-ఇదియొక పెండ్లి వేడుక పాట. ములవలు వధూవరులచే పూలచెండ్లాడించు ముచ్చటకు సంబంధించిన్ది రచన కొక నియతి యుండదు. కాని కొన్ని యఁగా. లందులుపయోగింపఁబడుట విశేషము.

ఉదా : వేలాకొలఁది స్త్రీలూగూడి
బాలా రుక్మిణి నెదుటా నునిచి
నీలవేణులు పాటాబాడగా - శ్రీకృష్ణమూర్తి
పూలచెండ్ల నాడేవేడుక॥

తిమ్మరాజు లక్ష్మణరావు రుక్మిణీ కల్యాణము

18. జా తి స్వ ర మ ట్టు :- గజేంద్రాళ్వారుని చరిత్రమున నొక్కటి గలదు. అందిని మంగళగీతముగాఁ గన్పట్టుచున్నది.

రూపక తాళము

రామచంద్ర మంగళం - రాఘవేంద్ర మంగళం
కామజనక కౌస్తుభధర - కంజనేత్ర మంగళం ॥౦॥
అగణితముగ నీదుఖగతు - రగమునకును మంగళం
నిగమ్మగోచరా నీకు - నిత్యశుభ మంగళం ॥౨॥

17. జా వ ళి :- ఇదియొక రకమైన శృంగారపదము. నాయిక విరహము, నాయకాహ్వానము సర్వసాధారణముగ నిందలి విషయములు. లోగడ రాచవారి కొలువు కూటములందు, కామందుల లోగిళ్ల వివాహ సందర్భములందు మేజువాణీల (భోగమేళముల) లోను నట్టువపాపలచే నభినయపూర్వకముగఁ బ్రయోగింపఁ బడుచుండెడిది. ఆంధ్రనాయకరాజ మహారాష్ట్ర ప్రభువుల ఆస్థానములందుఁ బ్రవర్తిల్లుచుండిన పదకేళిక పంతువగ పదాలట్టివే. మైసూరి కంఠీరవరాజు పదములు నట్టివే. జావళులందుఁ గొన్ని భగవత్పరములును గలవు. (గరిమెళ్ల వేంకటేశ్వర దశావతార జావళీలు మొ॥) క్షేత్రయపదములందుఁ గొన్ని యీకోవ కొజ్జబంతులనఁ దగినవి కలవు. అయితే వానియందును విప్రలంభశృంగారము, ప్రియావాహనము, అభినయోపయోగిత్వము నను వాని ప్రధానధర్మములు పాటింపబడుచునే వచ్చినవి. ఇవి విడిగా విశేషప్రచారము గాంచినవి. యక్షగానములందును గొన్ని ప్రవేశించినవి. తెలుఁగువారి వాడుకలో 'జావళి' యన్న పేరుమాత్ర మిటీవలిదిగాఁ దోఁచును (తత్ప్రయోగ స్థాన సూచకముగ చవికె, కొలువు కూటము, అను నర్థముగల చావడి యను మాట దీనికి మూలమగునేమో విచారింప వలసియున్నది.)

చందన మహారాజు చరిత్ర మను దాన జావళీలు చాలగలవు.

ఉదా: జంఝూటి – రూపకము

ఉదా: సమయ మిదిగొ సరసమునకు రారా
రారా, అతిథీరా, ఘనమౌరా, సుఖమీరా ॥స॥

18. జో ల :- ఇది తెనుఁగు దేశమునఁ జిరప్రసిద్ధమైన పాట. ఇది ఊయెల పాటయును గనుక సంస్కృత 'డోలా' శబ్ద భవమని యొక అభిప్రాయము. (హిందీ తర్భవము, ఝూలా). జో అను ఊఁత మాటకు బహువచన రూపమని మఱియొక అభిప్రాయము. 'లాలి' వలె నిది కేవల మూయెల పాటయే కానక్కఱలేదు. ఎక్కడపరున్న పిల్లల నైనను నిద్రపుచ్చు నపుడు పాడఁబడున దగుటయే దీని లక్షణము. జోకొట్టుటకు నిదురపోయని వీపు తట్టుట యని యర్థము. (హిందీలో 'సో' అనఁగా నిదురపో అని యర్థము). ఈ జోలపాటలు ప్రాచీన కాలమునుండియుఁ దఱచుగనే య. గా. లందును ప్రయోగింపఁబడుచు వచ్చినవి.

గణపతిరెడ్డి గోపాల విలాసమునుండి :-

జోల బాడెదమిపుడు సుందరాంగులమూ
జోలలకు నిదురపో పొంపుచూచెదము ॥జోజో॥
శ్రీమహాలక్ష్మ్మతో చెలఁగి తిరిగేవూ
మామందలో నాదగా మరిగి తిరిగేవూ ॥జోజో॥

జోలపాట సర్వసాధారణముగ జంపెగతితో నడచు నట్టిది. దానికి తగినట్లే పైపాటలో పాదమున నైదు మాత్రల గణములు మూఁడు, మిగిలిన మూఁడులేక నాలుగు మాత్రల దళ మొకటియు నున్నవి.

19 డి ం డి మ ము –డిండిమ మనఁగా 'రాయడి గిడి గిడి' యను నొకవాద్య విశేషము. ఆ వాద్యసంబంధమునఁ బ్రవర్తిత మగు వాద్య ప్రబంధముగాఁబోలీపదము – వేంకటపతి కాళీయమర్దన మను య.గా.న. నిది ద్వివారము ప్రయుక్తము. దీనమధురగతి చూపట్టెడు.

ఉదా :- సందర్భము - కృష్ణుని తాండవము

గజ్జెలు మువ్వలు ఘల్లున మ్రోయఁగ
చిందులు తొక్కెను చిన్నికృష్ణుఁడు
తాధిత్తా ధిత్తత్తా ధిత్తా
ధిత్త ధిత్తా ధిత్తతధిమిత్తకిట॥

రంగాజమ్మ మన్నారు దాస విలాసనాటకమున (పుట 29) నిది భిన్నరీతిగా నుదాహరింపఁ బడినది :

'కాంచివల్గ ద్వలగ్నకం । ప్రాంచదుచ్చస్తన ద్వయం
కాచిదంబుజ లోచనా రఘు । నాథనందన నాథతేత్వామ్'

ఇందు పూర్వార్ధమునఁ బాదమునకు 13 మాత్రలు, ఉత్తరార్ధమున 14. ఒక విషమ వృత్తమువలె నున్నది.

20. డో రా :- ఇదియొక పార్శ్వనుట్టు 19–20శ. హరికథలందుఁ దఱుచుగను, య. గా. లందు విరళముగను కథాఖ్యాన సందర్భము లందుఁ గన్పట్టుచున్నది. (కథాఖ్యానమునకు యక్షగానములందు ద్విపద , జంగంకథలలో రగడఁ హరికథలలో నీ డోరాలు నుపయుక్తము లగుట పరిపాటి. ద్రుతగతి దీని స్వభావము.

ఉదా :- గజేంద్రుళ్వారుని చరిత్ర నుండి

ఆయిందిరయును నతి విస్మితయై
యరుగు చుండె వెనుక
తోయజాక్షి తన మనమున నేమియుఁ
దోఁచకుండె గనుక ॥

ఇందు మధురగతి తోఁచుచున్నది. (మాత్రలు 8^2+3^3). యతి ప్రా గన్పట్టుచున్నవి.

పురాణం పిచ్చయగారి కపటవేశ్యానాటకమున 'డోరా మట్టు' అను నొక విశేషనామము గన్పట్టుచున్నది. ఆ మట్లన్నిఁ నాది తాళమున నున్నవి. వానిలోను మధురగతియే తోఁచుచున (8^2+4+5)

ఉదా : వినవేతల్లి యీ రమ్యాంగుని విషయము తెల్పెదను
వనజ భవాన్వయ వార్ధిసుధాకరు ధనఘుం డీఘనుఁడు ॥

గోపాలరామదాసకవి సీతాస్వయంవరమున 'డోహారా దరువు' మఱియొక వింతపేరు వినిపించినది. ఇందును మధురగతి గోచరించున్నది. (8^3+4)

ఉదా : నాద నామక్రియ - ఆది

జగతిలోన మిథిలాపురము ననఁ
జనక నృపాలుండనఁగా
పొగసుమీఱు రాజ్యంచేలుచునూ
సుఖముండును వినఁగా ॥

21 తంగం :- (తంగప్పాట్టు): ఇదియొక తమిళ గీత ప్రవి శేషము. భగవత్స్తుతి పరమగుట దీని సంప్రదాయము. 1900 ప్రాపు యం. గా. లందుఁగొన్నిటఁ గన్పట్టును.

ఉదా :- కుచేటి సుబ్బరాయకవి గౌరీశంకర విలాసము నుండి

ఫాలనులోచన - పాప విమోచన
పాలించి నన్నేలరా - మురుకేళి
లాలించి తేలించరా ॥

అన్నిట నించుమించుగా దీనిచరణము లిట్లే గలవు. చరణమునఁగల మూఁడుదశములందును మాత్రలు 4^4, 5+7+5, 5+7 గా నున్నవి. కొన్నిటఁ బ్రాస పాటింపబడినది. కొన్నిట లేదు.

22. తందనపదము:- 'తందనాన' అని కాని 'తందాన తాన' అని కాని యూఁతపదము ప్రతిపాదాంతమున ఆవృత్తమగు పదవిశేషము. ఇది సంగీతములో గానాంగ విశేషమైన తానశబ్ద సంబంధియై యుండును. 'తందానతాన' అను మాటకు 'a Sound used in beating time in music' అని యర్థము నిర్వచించిన దొక కన్నడ నిఘంటువు. ఈ తందన పదములు ప్రాచీనకాలమునను దెలుఁగు నాట ప్రచారమున నుండినట్లు వేంకటనాథుని పంచతంత్రము, కళా పూర్ణోదయము, భోజసుతాపరిణయము, దశావతారచరిత్ర మొద లగు మన కావ్యములందలి తత్ప్రసక్తిని బట్టి యూహింపనగును.

శహాజీ జలక్రీడలు అను యక్షగానమున మాత్రము దీని కొక్క లక్ష్యము గన్పట్టుచున్నది:-

'గంతా దోచుకు పోయెనె తందనానా కృష్ణు
డెంతా మోసము చేసేనె తందనానా ॥౦॥
వక్కా లాకుల తిత్తిపోయె తందనానా ॥మొలను
డెక్కిన పొగచుట్ట పోయె తందనానా॥౨॥

23. తరంగము:- శ్రీ నారాయణ తీర్థులవారి శ్రీకృష్ణ లీలాతరంగిణి ప్రాదుర్భావముతో సంస్కృతఘటితమైన సం కీర్తనల

కిదియొక పేరైనది. తీర్థపాదుఁడు తెనుఁగున రచించిన పారిజాతాప హరణ యక్షగానమున అతని శ్రీ. లీ. తరంగిణి లోనివే యొక మూఁడు తరంగములు ప్రయుక్తములైనవి. తదుపరి 1919 ప్రాంతమున శేషాంబ నందిపాటి మిత్రవిందాపరిణయ మను మఱియొక దాన మాత్ర మితరం గములు గన్పట్టుచున్నవి. ఇందలి తరంగములు తాళగతులవలె నుండుట విశేషము.

ఉదా : ఝణు ఝణుతాం ఝణు జిలరుహ నేత్రా
దధగిణతాం ఝణు దానవ జైత్రా
ధిన్నకిట్టక తాం ఝణు త్రిభువన స్తోత్రా
తెయి తెయితాం ఝణు దేవకి పుత్రా
సురాధిపులచే దురాన గూలిన
సురాసురు లెల్లను ధరాతలంబున
నరాధిపతులై సరంగబుట్టిన

ఇందు మధురగతి (ఏకతాళిగతి) గమనింపఁ దగినది.

24. తలంటు పాట :- ఇదియొక పెండ్లివేడుక పాట. వధూ వరులకు మంగళస్నానములు చేయించునపుడు పాడఁబడునది. కళ్యాణ కథలు గల చాల య. గా. లందు గలదు. ఇది కొన్నిట 'తలంటు శోభనపుఁ బాట' యనియుఁ జేర్కొనఁబడినది.

ఉదా :- మామిళ్ళపల్లి వెంకటాచలమయ్యా ఏకాంతసేవ నుండి-

శ్రీసీతారామునకూ । శ్రితజన మందారునకూ
కౌశికముఖపాలునకూ । కనకాంబర ధారునకూ
శోభనమే । శోభనమే।

చాల య. గా. లందిట్లే దీని పాదమున కాజేసి మాత్రల దళములు నాలుగు, నడుమ విరామము, రెండేసి పాదములకుఁ ప్రాసయుఁజూపట్టు చున్నవి.

25. తలుపుదగ్గరిపాటः- ప్రణయకలహాము వశమున నెడ పడిన నాయికా నాయకుల పునస్సమాగమ సందర్భ పురస్కారముగా నాయికా నాయక సంవాద పురస్సరముగాఁ బుట్టిన దీపాట. కతిపయ య. గా. లందుఁబ్రయుక్తము.

ఉదాः- సౌరాష్ట్ర - ఆది

అలిమేల్మంగామణినే వచ్చితి
నలరుచు వాకలిదీయవె
చెలువుడ నీవగలెల్లను దెలిసెను
నిలువక నటుపోవోయీ
నక్రముజంపి గజేంద్రుని గాచిన
చక్రధరుడనే భామా
చక్రధరుడవైతే ఘటముల ని
ర్వక్రత జేయగ పోవోయి

ఇట్లే యీపాట సాధారణముగ పాదమునకుఁ జతుర్మాత్రాకదళము లేడుగలిగి, నాలుగు దళములపై యతియు, రెండేసి పాదములకుఁ ప్రాసము మధురగతియుఁ గలిగియుండును.

26. తిలానతరగతిः- ఇది యొకదాక్షిణాత్య గీత ప్రబంధ విశేషము (బుచ్చర్ కన్నడాంగ్ల నిఘంటువున 'a variety of song' అని పేర్కొనఁబడినది). నృత్యానుకూలమైన ప్రయోగముగలది. ఇట్టి దొక్కటి బాగేపల్లివారి కుచేలోపాఖ్యానమునఁ గాన వచ్చినది.

ఉదాः- ఆదితాళము

మరచితో విప్రాగ్ర గణ్య ॥పల్లవి॥
ధరణిసురా విరాగివర ॥అను॥
సమిధలకై గురుసతి మము ననుపగ
విమలమతిన్ విపులగతిన్ జనుట ॥చర॥ మరచితో

27. తే వా ర ము :–ఇదియొక దైవస్తవ పరమైన దాక్షిణాత్య పద్యప్రబంధవిశేషము. మాత్రాచ్ఛందోఘటితము. (ఇందలి 'తేవ' సం॥ దేవశబ్దమునకు తమిళ తద్భవ మనుకొందును). 19-20 శ. సంధి కాలపు య. గా. లందెక్కువగాఁబ్రయుక్తమైనది.

ఉదా: గుండు అద్వైతబ్రహ్మశాస్త్రి సత్యభామా పరిణయము నుండి:

సరస యోగీశ్వరేశా । సన్నుతామర రమేశా
వరకృపాదృష్టిజూపీ । వంతయంతయును బాపీ
అరసి నా దరికి డాసీ । యనుజు గానంగజేసీ
నరహరీ చిత్స్వభావా । నన్నుగానంగ రావా ॥

నాల్గుపాదములు–పంక్తిండు మాత్రల దళములు పాదమునకు రెండు, రెండవ దళము ప్రథమాక్షరము యతిస్థానము. రెండు దళములకు నంత్యప్రాస, నాల్గుపాదములకును సామాన్యప్రాసయు విహితములు. ఈ యతిప్రాస నియమము లన్నిట సమానమేకాని కొన్ని య. గా. తేవారములం దొకటి రెండుమాత్రల లాఘవము చూపట్టుచున్నది. (చూ. వేదాల తిరునారాయణాచార్యుల శకుంతలానాటకము) కొన్నిట తేవారము లచ్చముగా మాలినీ వృత్తములే (చూ. సత్యనారాయణ కథాసుధాలహరి).

28. తొహరా :– ఇది పైనుదాహరింపఁబడిన 'డోరా' కే మఱి యొక వేశేమో యని తోఁచుచున్నది. ఇంచుమించులో ఆ లక్షణమే సరిపడును. గతి యచ్చముగా ఆ గతియే. 19 – 20 శ. య.గా. లందు గన్పట్టును.

ఉదా:– సత్యనారాయణ కథా సుధాలహరి నుండి –

ఎక్కడి యతివేమెఱుఁగవు సరసము
నేమిటి కడిగెదు నీవు
ముక్కు– మూసికొని మునివై యుండక
ముచ్చటలకుఁ బొయ్యేవు.

29. త్రి భ ం గు లు :- 16 వ శతాబ్ది చివరినుండి యక్షగాన ములలో వీని ప్రాచుర్యము గన్పట్టు చున్నది. త్రిభంగి కవి జనా శ్రయము, కావ్యాలంకార చూడామణి, ఛందోదర్పణము, లక్షణ సార సంగ్రహము, అప్పకవీయము మొ॥ లక్షణ గ్రంథములందు 'ఉష్ణుర మాలావృత్తము' లందొకటిగాఁ బరిగణింపఁ బడినది. అందు తల్లక్షణము - ప్రతి పాదమున న-న-న-న-న-న-స-స-భ-మ-స-గ అను గణములు అనగా 34 అక్షరములు (42 మాత్రలు); పూర్వార్ధ మున రెండుచోట్ల (10, 18వ అక్షరములు) ప్రాసయతి; ఉత్తరార్ధమున మూఁడు చోట్ల (25, 29, 34 అక్షరస్థానములు) అంత్యప్రాస. త్రిభంగి యొక గీతప్రబంధముగా - బృహద్దేశి (ప్రబంధాధ్యాయము శ్లో. 417) సంగీత రత్నాకరము (IV.272-73) సంగీత దర్పణము (IV.463 - 64) లందును; ఒక తాళవిశేషముగా — సంగీతమకరందము (నృత్యా ధ్యాయ తాళప్రకరణము - శ్లో. 44), సంగీతదర్పణము (తాళాధ్యా యము) లందును; ఒక తాళప్రబంధముగా - సంగీతమకరందము (నృత్యాధ్యాయ తృతీయపాదము - శ్లో. 6) నందును బేరొక్కఁబడినది. కాని యీ లక్షణము లెవ్వియు య. గా. త్రిభంగులకుఁ బూర్తిగాఁ బట్టవు. వీని భంగి వేఱుగా నున్నది.

ఉదా: 1. జానకీపరిణయము నుండి

మీరకా చెంత జేరకా సీతఁ గోరకా
వెళ్ళిరో లాలా ॥౧॥
ఎగ్గునా నునుసిగ్గు నా మది తగ్గునా
దాటిరో లాలా ॥౨॥

2. బల్లాణ రాజచరిత్రనుండి

మేడలూ పసిడి గోడలూ రంగు వాడలూ
పుణ్యచేడెలూ ॥౧॥
మేటులూ భటకిరీటులూ వీణెపాటలూ
రచ్చ చోటులూ ॥౨॥

చాల యక్షగానములందు త్రిభంగు లిచ్చోయున్నవి. పాదా గ్రహింపఁబడిన యొక మూఁడక్షరముల మాటకు రెండు మూ మాత్రల యెడముతో మఱి రెండు మూఁడు ద్విప్రాసావృత్తులు గలి చుట వీని లక్షముగాఁదోఁచును. మన లక్షణగ్రంథములందలి త్రిభ మాత్రాక్షర గణ నియమము దీనికిఁ బట్టదు. అయితే దానివఁ యీ త్రిభంగులును పాదసంఖ్యానియమము లేనివి, మంజుల తా వాలములు, అధికవర్ణ విశాలములు, అంత్యప్రాస త్రిభంగికము నైనవి. లయగాహి, లయవిభాతి, లయహారీ త్యాదులతోపా పరిగణింపఁబడిన ఆ త్రిభంగివలెనే యివియు లయ విశిష్టమూ ఈ త్రిభంగులందు జంపె తాళగతి ప్రచురముగాఁ గన్పట్టుచున్న (గణపతిరెడ్డి గోపాలవిలాసమున త్రిపుట తాళగతి గల త్రిభం లున్నవి). సం. మకరందమునఁ జెప్పినట్లు వీని నొకవిధమైన త ప్రబంధము లనవచ్చును. కొన్ని య. గా. లందు వీనికి రాగత నిర్దేశమును గలదు. (చూ. వాసంతికా పరిణయము - రేవగుప్తి జంపె).

30. త్రిస్తబకము: త్రిభంగుల వంటి రచనావిశేషమే యి య. గా. లందు విరళప్రచారము గలది.

ఉదా : విష్ణుమాయా విలాసము నుండి

వింటిని యేల లొంటిని బాలఁ
గంటినివేళ నోలాల ॥౧॥
వెన్నెల తోడ పొన్నుల నీడ
సన్నల గూడ నోలాల ॥౨॥

దీనఁ బ్రతిపాదము ఆద్యంత ప్రాసములు మూఁడుదళముల స్తబకము. (చివరనున్న 'ఓలాల' యన్న దొకయూఁతపదము). ఇట్టి మూఁడు స్తబకముల సమాహారమే త్రిస్తబకము.

భీమసేన విజయ మందలి త్రిస్తబకము దీనికంటె విలక్షణముగా నున్నది :—

సిరిమెరసిన రూపు । విరి దొరసిన చూపు
కెంపు మీరిన మోవి । పెంపు మీరినదేవిఁ
బ్రేమతోఁ గొలుతుఁ ॥

దీన ఆద్యంత ప్రాసనియమము పాటింపఁబడినది కాని పై వానికంటె విలక్షణమైన గతి గలది. పాదమునకు రెండే స్తబకము లగుపించు చున్నవి. కాక 'సిరి-మెరసిన-రూపు' — ఇట్లే దళమున కా దళమునే గ్రహించినచో నందలి పదములు మూఁడును బిమ్మటి దళములోఁ గల పదములు మూఁటితోఁ బ్రాసాధర్మ్యము వహించియున్నవి కనుక అట్టి మూఁడు పదముల దళమునే యిందు త్రిస్తబక మనవలెను.

బృహద్దేశి త్రిభంగి లక్షణము దీనికిఁగొంచె మన్వయించెడు నట్లు తోఁచును—

" పదైః స్వరైస్తథాపాదై ర్వృత్తత్రయ పదేన చ
తాలత్రయ విమిశ్రేణ త్రిభంగి రభి ధీయతే "

31. దండెయా డింపు పాట: ఇది యొక వాద్య ప్రబంధము వంటిది. తాళ మృందంగవాద్య పురస్సరముగాఁ బూర్వము వివాహాది సందర్భములందుఁ బ్రవర్తిల్లుచుండినట్టిది.

ఉదా: కానూరి వీరభద్రకవి బసవ మహిమామృత విలాసము నుండి

• బసవేశా భవనాశా అసదృశా అఖిలేశా
తరితికిటతోన్ త .... రా
ధికిట ధికిటతోన్ త్రిపుర విదారా॥

32. దిండి: వింతవేరు గల యీ రచనావిశేషము పసుమర్తి కృష్ణమూర్తిగారి పార్వతీపరిణయమున మాత్రము నాల్గు తడవలు ప్రయుక్తమైనది.

ఉదా: అని తల యూఁచిన యా బ్రహ్మచారిఁ
విని గిరిసుత తన సకియచెంతఁ జేరెన్
కనుసన్నచే నాపెను దలఁపఁ గోరెన్
తన మనసు నపహరించినట్టి చోరున్

ఇది మాత్రాఛందోఘటితమైన యొకవృత్తమువలె నున్నది. పాదమునకు 18 మాత్రలు (ప్రథమపాదమున నొకటి తక్కువైన దిందు). నాల్గుపాదములకు నాద్యంత్య ప్రాసములు విహితమైనట్లున్నది.

33. ధవళము: ఇదియొక మంగళగీతము. ప్రాచీనకాలము నుండియు బహుయక్షగానములందుఁ బ్రయుక్తమగుచు వచ్చినది. 16 శ. నుండి మన ప్రబంధము లందును దీని ప్రసక్తి గన్పట్టును చాల యక్షగానము లందిది —

(1) గ్రంథాంతమున ముత్తైదువలు హారతులు పట్టు సందర్భమునఁ గన్పట్టును. (చూ. అగస్త్యరాజు రామన సీతాకళ్యాణము).

దీని నొక హారతిపాట యనవచ్చును. 'అత్తరి నయిదువ లారతు లెత్తుచు ధవళములు పాడ' అని బిల్హణీయము 3.210. కొన్నిట దీని తరువాత మంగళ హారతి పాటలు వేఱ యున్నవి. (చూ. విష్ణు మాయావిలాసము). (2) తఱుచు శోభనగీత పురస్సరముగాఁ గన్పట్టును. (ధవళశోభనముల నెడబాయని జంట కొక సామెతగాఁ బేర్కొనవచ్చును). (3) సర్వసాధారణముగ స్తోత్రపాఠ ప్రచురము జయశబ్దాది సంబుద్ధిగుచ్ఛము నైయుండును. దీని నొక కైవార గీత మనవచ్చును. (చూ — వి. మా. వి.) అయితే కిరాతార్జునీయము, శారద కురవంజి కట్టణములందు ధవళము జయశబ్దాది కాదు. రెండవ దాన నది కథాకథనమునకును నుపయుక్తమగుట విశేషము) (4) మధురగతి ప్రకృష్ట మైనది. సాధారణముగాఁ బాదమునకు నాలుగు మాత్రల దళములు మూఁడేసి యుండును. రెండేసి పాదముల కంత్యప్రాస కన్పట్టుచున్నది. అప్పకవీయమున ధవళమున కొక లక్ష్యము గలదు (IV. 402) అం దిది జయశబ్దాదిగా లేదు. చతుర్మాత్రాకదళములు పాదమున కాఱుచొప్పునఁగలవు కాని మధురగతి స్ఫుటముగా నున్నది.

గౌరీకల్యాణమునకు శంకరాభరణమునఁ బాడఁబడు సంప్రదాయ మున్నట్లు ధవళమునకు భైరవి, పాడి రాగములందుఁ బాడఁబడు సంప్రదాయమున్నది:

'జోడుగఁ గూడి ప్రోడగమి చొక్కిపడన్ ధవళంబు భైరవిఁ
బాడిని పాడి రిద్దఱు జపా కుసు మాధర లా ధరాధి నా
థోడు కళత్ర నేతయుగళోత్పలముల్ వికసిల్ల వల్లకీ
గౌడవరాళి వైరి కలకంఠ గళోద్య దనర్గ ళధ్వనిఁ'

—కాకమాని మూర్తి పాంచాలీ పరిణయము (4.10).

పాంచాలీ పరిణయమున గౌరీకల్యాణమునకంటె ధవళము విశిష్ట మైనదనియు సూచింపఁబడినది —

'గౌరికల్యాణమున కేమి కంటుఁగన్న
తల్లి ధవళంబు పాడరాదా లతాంగి' (4.22)

సంగీత రత్నాకరమున ధవళమొక గీతప్రబంధ విశేషముగాఁ బరిగణింపఁబడినది. (IV. 298-302): —

'త్రివిధో ధవలః కీర్తిర్విజయో విక్రమ స్తథా
చతుర్భిశ్చరణైః షడ్భిరష్టభిశ్చ క్రమాదసౌ॥

* * *

ఆశీర్భిర్ధవలో గేయో ధవళాది పదాన్వితః
యదృచ్ఛయా వాధవలో గేయో లోకప్రసిద్ధితః' ॥

అనఁగా ధవళము కీర్తి, విజయము, విక్రమము లని త్రివిధము. అవి వరుసగా 4, 6, 8 పాదములుగలవి. వీనియందు మాత్రా నియమము వివిధముగానున్నది. ఈ పాద నియతి మన య. గా. ధవళములకుఁబట్టదు. అందెనిమిది కంటె నెక్కుడు పాదములనియు నున్నవి. సం. ర. ధవళము ధవళాది పదాన్వితమైన ఆశీర్వాద గేయము. మన ధవళమొక శ్రేవార గేయము. మంగళగీతము. అయితే యిది 'యదృచ్ఛయా' – అనఁగా 'ఉక్తగణ నియమరాహిత్యము' తో (కళానిధివ్యాఖ్య), 'లోక ప్రసిద్ధితః' – అనఁగా 'వర్తమాన లక్ష్యానుసారము' పాడఁబడు నని యందే చెప్పఁబడినదిగదా.

మన యక్షగానములందుఁ దఱచుగా దాని స్వరూప మిట్లుండును:

' జయ జయ దురిత విదూరా
జయజయ చిత్తవిచోరా
జయజయ దరమృదుహాసా
జయజయ దనుజ నిరాశా '

— ఓబయ్య గరుడాచలము.

(ధవళశబ్దమునకు కర్పూరవిశేషమనియు నర్థము. కర్పూరము తెల్లనిది. ఆరాత్రికముఖ్యద్రవ్యము. అందులకే హారతిపాటకును ఆ పేరు వచ్చియుండును).

34. నలుగుపాట : ఇదియొక పెండ్లి వేడుక పాట. దీని రచనకొక నియతి యుండదు. చెండ్లాటకు ఏలలు, తలంటునకు శోభనములు నుపయోగింపఁబడినట్లే దీనికి ధవళములు నుపయోగింపఁబడుట కద్దు. (చూ. నందిపాటి మిత్రవిందా పరిణయము). ఇట్టి పాటలు సాధారణముగా ఆపనిపాటల కనుగలమైన గతిస్ఫురణ గలిగియుండును. దీన ఆదితాళానుకూల గతి తఱుచు కన్పట్టును.

ఉదా : అన్నపూర్ణాపరిణయమునుండి —

'నలుగీడ పిలిచేరె నవమోహనాంగి
చెలువ యన్నపూర్ణ చేరిరావమ్మ'

(త్యాగయ్యగారి ఉ. సం. కీర్తనలలోనున్న మూఁడు నలుగుపాటలకును ఆదితాళమే యుదాహరింపఁబడినది).

35. నోటు : ఇది యొక పార్శీమట్టో, హిందుస్తానీ రాగవిశేషమో అయియుండును. దీని నడక చక్కగాసాగునది. ఒక్క బాగే పల్లి అనంతరామాచార్యులవారి కృతులందే తఱుచు గన్పట్టును.

ఉదా: వారి సుభద్రాపరిణయము నుండి—

'జయశేష శైలవాస భక్తసంఘ రక్షక
భయకారి బహుళదుష్టదనుజ సంఘ శిక్షక'

పాదపాదమునకు మాత్రలు 5+6+6+4.

రెండేసి పాదములకుఁ బ్రాస నియతము.

36. బంతులాట పాట: ఆండ్రాళ్ళు చరిత్రమున —

'చెండ్లాడిరి శ్రీ కోదెయు రంగడు కూడుకొని
కండ్లాసైగలు సేయుచును
మరి కలికియు కులుకుచు బలుకుచునూ
బాజీ బంతులు జారగ పయ్యెద
వీడగ, నడు మసియాడగనూ'

అను చెండ్లాట పాట వెనువెంట వేఱుగా

'బంతులాడేరు చూడరే వింత చామంతి
బంతు లాడేరు చూడరే॥
బంతు లాడేరు మీరి ఆరవిరి పాస్పుజేరి
కంతు జనకులంత కోదెనాయకిఁ గూడి॥

అను బంతులాట పాట గలదు. ఇట చెండ్లాట యన్నను బంతులాట యన్నను నొకటే కాని రెండిట గతి భేదము మాత్రము గన్పట్టు చున్నది.

37. మంగళము:- మంగళము, హారతి, ఆరతి, ఆరాత్రికము, నివాళి, ధవళము మొదలగు బహువిధ నామములతో, బహు గతులతో నీరాజన ప్రయోజన పురస్సరమైన యీ గీతము బహుయక్ష గానములందుఁ బ్రయుక్తమైనది. సామాన్యముగా షష్ట్యంతముగను, పాదాద్యంతముల మంగళశబ్ద పురస్సరముగను నుండును. సంగీత

రత్నాకరమునను గీతప్రబంధములో నిది పేర్కొనఁబడినది (IV.303). ఇది సాధారణముగ గ్రంథాంతములందుఁ గన్పట్టును. కొన్ని దక్షిణాంధ్ర యక్షగానములలో ముఖ్యముగా శహాజీ ప్రభృతుల కృతులలోఁ గొన్నిట గ్రంథాదియందును 'తోడియలేక తొల్లిడె మంగళం' అనుపేరఁ గొన్ని చక్కని కీర్తనలు కానవచ్చుచున్నవి. అవి తాళ్ళపాకమువారి కీర్తనలే. (కొన్ని యక్షగానములందు నడుమను తాళ్ళపాకవారి కీర్తనల ప్రసక్తి వచ్చినది). వానికినాఁటికిని దక్షిణ దేశమున మంచి ప్రచారము గలదు. దక్షిణ దేశమున హరికథా కాలక్షేపములు, భాగవతమేళ నాటకములు, భజన కూటములు వానితోడనే ప్రారంభమగు సంప్రదాయ మేనాఁటినుండియో నేఁటికిని సాగివచ్చుచున్నది. తోడియ/తొల్లిడె మంగళం - అనఁగా తొలి మంగళమని యర్థమైయుండును. (గ్రంథాంతమున వేఱే మఱియొక మంగళ ముండునుగదా). అది యైదు కీర్తనల సంపుటి. వాని పల్లవి లేకులు :—

(1) నాట – జంపె : జయ జానకీ రమణ
జయ విభీషణ శరణ

(2) ఆరభి–మిశ్రచాపు: శరణు శరణు సురేంద్ర సన్నుత
శరణు శ్రీసతి వల్లభ

(3) మధ్యమావతి – ఆది : నారాయణ తే నమో నమో
నారద సన్నుత నమో నమో
మురహర నగధర ముకుంద మాధవ
గరుడ గమన పంకజనాభా

(4) సావేరి – రూపకం : దేవేశ గణారాధిత దివ్యాంబుజ పాదా
శ్రీ వేంకటగిరి నాయక శ్రీశా హెచ్చరికా

(5) పంతువరాళి–ఆది : మాధవ భవతు తే మంగళం
మధుమురహర తే మంగళం

(ఇవి తాళ్ళపాక చిన్నన్నగారి రచనలైనట్లు నాకు శూలమంగళం భాగవతులు సెలవిచ్చినారు. ఇందుఁగొన్ని తిరుపతి దేవస్థానమువారు ప్రచురించిన తాళ్ళపాక సంకీర్తన సంపుటములందుఁ గొన్నిటఁగన్పట్టుచున్నవి).

38. మేలుకొలుపు: ఇదియొక వైతాళిక గీతము. చిరప్రసిద్ధమైనది. య. గా. లందుఁ దఱచుగనే కన్పట్టును. తఱచు దేశాక్షి, మలహరి, దేవగాంధారి, భైరవి, బౌళి, సౌరాష్ట్ర మొ॥ ఉదయరాగములలో నుండును. భూపాలరాగము తోడి దాని యను బంధము కడు ప్రసిద్ధము.

ఉదా: ఆండాళ్ళు చరిత్ర నుండి –

జాము ప్రొద్దున లేచి భామలను మేల్కొలుపుకొనుచు
నీలవర్ణుని ద్వారమునను నిలిచి లేపిరిగా
కృష్ణ మేలుకోరె॥

39. రాసప్రబంధము:- 'రాసము...నాట్యకథా ప్రబంధనోల్లాసము, బంధచిత్రిత విలాసము... మండలీకృత విభాసిత తాళలయానుసంధవిన్యాసము' అని శ్రీ గోపాలకృష్ణ విలాసమున రామాయణము వేంకటనరసింహకవి వక్కాణ. భాగవత దశమ స్కంధమున "శంఖపద్మవజ్రకందుక చతుర్ముఖ చక్రవాళ చతుర్భద్ర సౌభద్రనాగనంద్యావర్తకుండలీకరణ కురళీబంధ ప్రముఖంబులు" రాసక్రీడాబంధములుగాఁ బేర్కొనఁబడినవి. (ఇందు చక్రవాళ చతుర్భద్రములు కావ్యభేదములుగను మన లాక్షణికులచేఁ బరిగణింపఁ బడినవి. చూ. కావ్యాలంకార చూడామణి (IV.34-39) అట్టి రాసబంధముల నృత్యప్రక్రియ కనుకూలములగు గీత ప్రబంధములే రాసప్రబంధములు ఒక విధమైన రాసక ప్రబంధ లక్షణము సంగీత రత్నాకరమునఁ గలదు. (IV.352-355)

'అంగనా మంగనా మంతరే మాధవో
మాధవం మాధవం చాంతరేణాంగనా
ఇత్థమా కల్పితే మండలే మధ్యగ
స్సంజగౌ వేణునా దేవకీనందనః'

అని రాసమండల స్వరూపము ప్రసిద్ధము. దీనిగూర్చి కానుకొలను వెంకట దాసు అనుకవి తన "శ్రీకృష్ణనాటక యక్షగాన మహాప్రబంధ రాస క్రీడా విలాసము"నం దిట్లు వ్రాక్రుచ్చెను:-

'ఎందరో సుందరు లందరి కందరు
నందతనయులై పొందుగ నిలిచియు
నందివేణువుల మధురాధరముల
యందుఁ జేర్చి యిం పొందఁ బాడ

కమలకర్ణికా కారంబునఁ జిత్రముగ మండలత్రయ మధ్యగుఁడై" హరి నాట్యము సల్పెననుచు నొకచక్కని రాసప్రబంధము రచించెను. అది:—

జంఝూటి — ఆది

ఆనంద మానందము హరి రాసవిలాస
మానంద మానందము ॥పల్లవి॥
నానా గానాభినయ నాట్యమండల
తానమాన స్వరతాళాంచితము
బ్రహ్మానంద॥ అనుపల్లవి॥
సప్తస్వర ప్రస్తార విస్తారము
సప్తతాళగతిసార ముదారము॥౧॥
సమధికైక పాద సమపాదముఖ్య నా
ట్య మహోదంచిత మత్యద్భుతము ॥౨॥
ఆననాక్షిహస్తా [illegible]
మానము నిరుపమాన తానమానము ॥౩॥
సకల భూనభశ్చర ప్రసక్తము
ప్రకట సూర్యేందు నుపర్వమండల యుక్తము ॥౪॥
కానుకొలను వేంకటదాస మానస
స్థానభానమాన నవిశేషము ॥౫॥

40. లఘువులు :- లఘుప్రచురమై పాదమునకు నాలుగేసి మాత్రల దళములు నాలుగు గలిగి, తొమ్మిదవ మాత్రాస్థానము యతి స్థానమై, రెండేసి పాదములకు ప్రాసనియతి గలిగి, మధుర గతితో ఏక తాళి రేకులవలె నడచు రచనావిశేషము. ఇట్టివి కూరపాటి అమరలింగామాత్యుని పార్వతీకల్యాణమునఁ జాలగలవు. అందు వానికి పూరి, బేగడ, ఎరుకలకాంబోది, సౌరాష్ట్ర, కాంబోది నీలాంబరి మొ॥ రాగములును పేర్కొనఁబడినవి.

ఉదా : పశుపతి యనియెడు పశ్చిమ గిరిపై
కుశరుహ శర రవి క్రుంకెను నేడూ॥

ఇట్టి రచనావిశేషమే యించుక మార్పుతో విశ్వేశ్వరుని ధర్మపురి మాహాత్మ్యమున 'సమలఘువు' లని పేర్కొనఁబడినది. పై పార్వతీ కళ్యాణమునందే సమపాదములు మాత్రమ గుర్వంతమై కడమ యెడల సర్వత్ర లఘుప్రకృష్టమైన రచనావిశేషము సర్వలఘువు లని పేర్కొనఁబడినది.

ఉదా : కలికిని జిగి బిగి పలుకుల మధువులు
జిలికెడు చిలుకల కొలికిని దలఁతుఁ॥

41. లాలిపాట :— ఇది యొక ఊయెల పాట. సర్వసాధారణముగ ఊంజల్, జోల పాటలవలె జంపెగతి గలదగుట గమనింపఁదగినది. (మాత్రలు5^3+3 లేక 4) అప్పకవీయోదాహరణముమాత్రము ఏక తాళిగతి గలది. ఇందావృత్తమగు 'లాలి' యను ఊఁతపదము 'లాలన' శబ్దసంబంధి యగునేమొ! ఈపాట ప్రతిజాతియందును బిడ్డపుట్టుక, భాషపుట్టుక, అసలు పాట పుట్టుక యెంతప్రాచీనములో అంతప్రాచీనము. బహుయక్షగానములందుఁ బ్రయుక్తమైనది.

ఉదా :- అగస్త్యరాజు రామన సీతాకల్యాణము నుండి –

లాలి బంగరుబొమ్మ లాలి మా యమ్మా
లాలి ముద్దుల గుమ్మ లాలి సీతమ్మా॥

42. లావణి : ఇది కన్నడ మహారాష్ట్రాది భాషాసంబంధియగు నొక పదచ్ఛందము. హిందీ హిందుస్తానీ భాషల సంపర్కమున నిది కన్నడమునఁ బరిణామము బొందినదని డాక్టరు డి. ఎన్. కర్కిగారి కన్నడ ఛందో వికాసమునఁ గలదు (పుట 252). 19శ. నుండి కొలఁది తెలుగు యక్షగానము లందును ప్రవేశించినది. దీని స్వరూప మిద మిత్థమని నిర్ణయించుట మిగుల దుర్ఘటముగా నున్నది ఒక్కొకచో నొక్కొక తీరుగా నున్నది దీనిగతి. అభిజ్ఞుల పరిశీలనార్థము కొన్ని మచ్చుల నేరి చూపింతును :-

(1) 'జయజయ చారు వికాసిత సదమల వదనా
వదనాంబుజాత సురాహిత హరణధురీణా!
ధురీణాఘ ప్రపీడిత జనపాలన కంకణధారా

– తిమ్మరాజు లక్ష్మణరావు రుక్మిణీ కల్యాణము.

ఇం దిది యొక చూర్ణికవలెఁ గన్పట్టుచున్నది. వందిమాగధులు శ్రీకృష్ణుని స్తుతించుట సందర్భము.

(2) కాంభోజి – ఆది

కొంకణ దేశాధీశుని విలు చే
కొమ్మని జనకుం డనఁగా
కొంకక కడుపున సంకట మనుచును
బొంకి యతఁడు పొమ్మనెనే॥

– గోపాల రామదాసకవి సీతాస్వయంవరము

ఇందిది పాదమున కేడు చతుర్మాత్రాకగణములు కలిగి మధుర గతిరగడ మరి ముప్పాతిక దూరము గుర్వంతముగా నరసాగినట్లున్న ది. పంచమ గణాద్యక్షరము యతిస్థానము. ప్రాసయతియు గ్రాహ్యము.

(3) ఆదితాళము

పరిపంథి రాజుల నెల్లన్
పరిమార్చి నంతట వెళ్ళెన్ ॥పల్లవి॥
భండన పండిత భటసమూహములు
చండవేగ బహుకాండ నివహములు

— బాగేపల్లి వారి చంద్రహాస చరిత్ర

ఇందు లావణి రాగవిశేషముగఁ బేర్కొనఁబడినది.

ఈలక్ష్యములు మూఁడిట నొకగతి స్ఫురణగలదు గాని వీనికొక సామాన్యసూత్రము నేర్పరించుట దుస్సాధము. నే నెఱిఁగినంతలో ఇత రత్ర దీని ప్రసక్తివచ్చిన సందర్భములు : (1) మదరాసు ప్రా. లి. పు. భాం. నందు మధుర సౌరాష్ట్రసభవారికిఁ జెందిన కుచేల, రుక్మాంగద, తామ్రధ్వజ చరిత్రములు, ద్రౌపదీ వస్త్రాపహరణము అను హరికథా కల్పములగు రచనల ప్రతులు గలవు (ఆర్. నం. 1602 & 1608). అవి యన్నియుఁ దెలుగుఁ కృతులు. కాని వానియందు డోరా, బ్యాక్, సోపంగి, ఖడ్గా, ఛంద్, కేకావళి మున్నగు విజాతీయ రచనావిశేషములతోపాటు లావణీయును గలదు.

ఉదా : స్యందనవారణ తురగ పంక్తిభి
స్తులితార్ణవ ఘోషం
చందనాంబు పరిషేచన విగళిత
సకల ఘర్మదోషం॥

దీన నొక నియతి కన్పట్టుచున్నది. పాదమునకు మాత్రలు 8^2+6+4. రెండేసి పాదములకుఁ బ్రాస, అంత్యప్రాసయు విహితము. యతి నియతి లేదు. చక్కని గతి చాలు దీర్ఘినట్లున్నది. (2) 'కన్నడ ఛందోవికాస' (పుట 245-46) యందుదాహరింపఁబడిన శ్రీరంగ పట్టణద లావణి పాదము 9^3+5, వీరభద్రన లావణి పాదము 8 హ గణములు+4 లేక 6 మాత్రలును గలిగియున్నవి.

43. వర్ణము : వర్ణమను నొక గీత ప్రబంధము వర్ణతాళ త్రైవిధ్యముతో కర్ణాటభాషచే బిరుదోపనిబద్ధమగునది కలదని సంగీతరత్నాకరమునఁ (IV. 182) జెప్పఁబడినది.

రంగాజమ్మ రచించిన మన్నారుదాస విలాస నాటకమున (పుట 29) దాని స్వరూపమిట్లున్నది :–

ललित स्वभाव! कलित प्रभाव!
रिपुभंग कृतिचंग ! रणरंग भीम !
दिन प्रदान प्रदान प्रधाविप्रहर्षणोज्ज्वला !
विजय राघव धरापुरंदरा !

ఇం దిది సంస్కృతభాషయే, కర్ణాటముగాదు కాని వర్ణతాళ తాళ త్రైవిధ్యము గలదియు, బిరుదోపనిబద్ధమునై యున్నది.

44. విరాళిపదము :- ఒక్కబలభద్రదాసి కృతము- కపోత వాక్యమను యక్షగానము ప్రా.లి.పు.భాం. డి. నం. 1844 ప్రతియం దీపేర నీ క్రింది రచన కన్పట్టుచున్నది :

సంతోషము శ్రీహరి దలఁపఁగ
బంతము లాడుచుఁ బచరించి
కంతుజనకుఁడగు కర్పర నిలయుని
వింతగఁ బాడుఁడి యేలల॥

ఇంచుమించిట్టి రచనా విశేష మే యీ కపోత వాక్యమునం దే తం.స.మ. కే. సం. 474/75 ప్రతియందు 'వర్ణము' అనుపేర నిట్లుదాహరింపఁ బడినది :

కుచ్చిన ముత్యము కుందెన లోపల
నచ్చుగ కుంకము లమరించి
పచ్చలు తాపిన పసిడిరోకండ్లను
మెచ్చుగ దంచెదరో లాల ॥

ఇది వట్టి యేకతాళి రేకు. ఇందెక్కడో క్రమ మించుక తప్పినను సాధారణముగా విషమ పాదములందు 4×4, సమపాదములందు 4+4+5 మాత్రలు నుండును. నాల్గుపాదములకు నొకటే ప్రాస.

45. శబ్దజతి : ఇది యొక తాళప్రబంధము వంటిది. లయ ప్రక్రియాప్రకృష్టమైనది. య. గా. లందటనటఁ గన్పట్టును.

ఉదా : భారతుల శ్రీరంగ కవి శ్రీకృష్ణలీలల నుండి –

తధణ ధణకిత్తక తధణ ధణతా
కుధరధర హరి మధుమదాపహ
ప్రధనశూరా నిధువన ప్రియ
మధురవేణు నినాద మోహన
బుధజనావన తధణ ధణతా
తీరుగా పులిగోరు పతకము
మీరి యురమున జేరి యాడగ
సారెకును నాభీరకాంతల
జీరి క్రీడల గేరుచున్
తధణధణతా తక్కిణాంతక
చొక్కమగు చేర్చుక్క మొగమునఁ
జుక్కరీతి వెలుంగఁజెవిపై
జెక్కు- చీకటి మ్రొక్కఁ గల్వల
చక్కి పెంపెస లాడఁగా॥

ఇందు త్రిపుట తాళగతి గలదు. జతియన్నది 'యతి' శబ్ద వికృతి కావచ్చును. యతి తాళదశప్రాణములలో నొకటి; సంగీత రత్నాకరమున నొక వాద్య ప్రబంధముగాఁ బేర్కొనఁబడినది. జతి యనఁగా నొక గీత భేదమనియు, నాట్య-గాన యోగ్య శబ్దసంతతి యనియు సూ. రా. నిఘంటువు. శ్రుతి లయలు గాన ప్రధానాంగములు. శ్రుతి విశిష్టమైనది స్వరజతి, లయ విశిష్టమైనది శబ్దజతియుఁగావచ్చును.

స్వరజతి శివ అనుబంధమున నుదాహృతము.

46. శోభనము: దాని పేరే చెప్పుచున్నట్లిది యొక శోభన గీతము. తఱుచు వివాహ సందర్భములందు మంగళహారతులవేళను, మంగళస్నానాదికసమయములను దీనికి వినియోగము. చిరప్రసిద్ధము, బహుయత్నగానములందుఁ బ్రయుక్తమునైనది. తఱుచు ధవళము తోడి జంటపాటవలెఁ గన్పట్టును. ఇది యాడువారి వేడుక పాట. కాని విష్ణుమాయావిలాసమున 'తాళధ్వనితో వేమఱు నటియింపుచు వీణాముని నారదుఁడు శోభనము వినిపించెన్' అని యున్నది. ఇది సాధారణముగా షష్ట్యంతము. చివర 'శోభనమే' అనున ధ్రువపదముగా వచ్చుచుండును. దీని రచనా ప్రక్రియ కొక నియతి లేదు. గతి వైవిధ్యము బహుళము.

ఉదా:- వెంగమాంబ శివవిలాసము నుండి

గిరికార్ముకముగ నొనరించి
ఉరగము నారిగ బిగియించి
ఒనరఁగ శ్రీహరి యనుబాణము దొడిగి
పురములు గెలిచిన పుణ్యులకు
శోభనమే ॥శోభనమే॥

47. సంగీత మకరందము :- ఏకోజీ విఘ్నేశ్వర కల్యాణ మొక్క-దానఁ గన్పట్టు చున్నది :-

వీడెవ్వడే యో యమ్మా
జోడు గూడ రమ్మనె నమ్మా ॥౦॥
సరసముగ మాటాడీనమ్మా
సరపడు వీడెవ్వడో యమ్మా ॥౨॥
చన్నులంట వచ్చీనమ్మా
చక్కెరమోవి యిమ్మనె నమ్మా ॥౩॥

చరణమునకు 27-30 మాత్రలు గన్పట్టుచున్నవి. మాత్రల యంతర మెట్లున్నను నొక గతిస్ఫురణము గలదు.

48. సువ్వి - సువ్వాల : ఇదియొక దంపుళ్ళపాట. చిరప్రసిద్ధమైనది. బహుయక్షగానములందు వివాహ సందర్భములందుఁ బ్రయుక్తమైనది. దీనికి సువ్వలాలి, సువ్వాల, సుంకులపాట, కొట్నముల (కొట్టడము-కొట్టణము-కొట్నము) పాట యనియు నామాంతరములు గలవు. ఇది సువ్వాల ద్విపద, సువ్వాలధాతువు అను పేర్లతోఁ గూడఁ గొన్ని యక్షగానములందుఁ గన్పట్టుచున్నది. (వీని విషయము 1వ అనుబంధ మునఁ గొంత ప్రసక్తమైనది). సువ్వి - 'a chorus used by women at marriages when pounding rice' అని కన్నడ నిఘంటువు లందును బేర్కొనఁబడినది. సువ్వి యన్నది ధ్వన్యనుకరణ శబ్దము, నూఁతపద మును గావచ్చును. రోకటి పోటున కెన్ని యొడుపులుండునో యీ పాట కన్నిగతు లుండును. అందు తురగవల్గన గతికి ప్రాచుర్య మధికము.

కొన్ని యక్షగానములందు 'సుంకులు దంచేపాట' సువ్వీగను, 'సుంకులు చెరిగేపాట' సువ్వాలగను గన్పట్టుచున్నది. (సుంకులు చెరిగేపాట అల్లూనేరేడుగను బరిగణింపఁ బడినది. చూ. మిూఁద).

ఉదా :- 1 అ 'సుంకులు దంచే పాట':

సువ్వీగోపాల బాల ! సువ్వీసద్భక్తి పాల
సువ్వీభాసుర కపోల ! సువ్వలాలీ॥

ఆ 'సువ్వాలపాట': శంకరాభరణ-ఏక :

వారిజ సన్నిభలోచనా । భక్త
వత్సల పాపవిమోచనా
కారుణ్య సాగర ఖగరాజ వాహన
మారజనక సుకుమార శరీరా ।।సువ్వాలే॥

– నందిపాటి మిత్రవింద

2. 'సుంకులు చెరిగేపాట':

శ్రీరఘువీరు పెండ్లట – మన
సీతను ఇస్తామన్నారట
గారవంబుతోడ గరితలెల్లఁగూడి
కోరికతో పెండ్లికొడుకును శాయరె ॥సువ్వాలె॥
సీతాను యిటు బీలుపించరె – పెండ్లి
కూతురికి శృంగారించరె
చాతురీ మెరయగ సతిపతు లిద్దరిని
ప్రీతితో నొకచోట ప్రియభక్తి నుంచారె ।సువ్వాలె॥

– మామిళ్లపల్లి ఏకాంత సేవ

(తాళ్లపాక అన్నమయ్యగారి సువ్వీపాటల గతులు – చూ. సం. III. పుట 282-287-వీనికంటె మిగుల విలక్షణముగా నున్నవి. వానికి కేదారగౌళ, భూపాల రాగములును బేర్కొనఁ బడినవి.)

49. హె చ్చ రి క : ఇదియొక సాఖశాయనిక గీతము. ఇంద పాదాంతమున హెచ్చరిక యన్న దొక యూత పదముగా వచ్చును కొలఁది యక్షగానములందు ముఖ్యముగా ఏకాంత సేవ - పల్లకి సేవ ప్రబంధము లందును ప్రయుక్తము.

ఉదా : నుదురుపాటి వెంకనార్యుని పార్వతీ కల్యాణమునుండి -

సావేరి - రూపకము

శ్రీ మాధవ నుతవైభవ శివ చిన్మయరూపా
చామీకర ధరణీధర చాపా హెచ్చరికా ॥౦॥

సరసీరుహ సంభవముఖ సురపూజితపాదా
పురదానవ వరదావాంభోదా హెచ్చరికా ॥౨॥

హిమభూవర తనయాముఖ హేమాంబుజ భృంగా
రమణీయ తరామ్నాయతురంగా హెచ్చరికా ॥౩॥

తాళ్ళపాకవారి 'త్రోడియం' గీతసముచ్చయమున నొక హెచ్చరికయు సారంగపాణి పదములం (పుట 97, దొక హెచ్చరికయుఁ గలవు. ఆ రెఁడును, ఈ వెంకనార్యునిదియును మూఁడును సావేరిరాగ రూపక తాళములందే యుండుట విశేషము. మూఁడింటను చక్కని గతిస్ఫురణ గలదు. మూఁడిటను దళమునకు మాత్రలు 6^3+4. రెండేసి దళములకుఁ ప్రాస విహితము. ప్రతిదళమున 12 మాత్రలకుఁ బైని యతి. ప్రాసయతియు గ్రాహ్యము.

సారంగపాణిదే మఱియొక హెచ్చరికయు (పుట 96), త్యాగయ్య ఉత్సవసంప్రదాయ కీర్తన లందలి దొక హెచ్చరికయు జంపెతాళమున నున్నవి. వానిలో దళమునకు 5^3+3 చొప్పునఁగలవు మాత్రలు.

ఏకాంతసేవా ప్రబంధములందు హెచ్చరికలు వచన ఘటిత ములుగను గూడ నున్నవి. (చూ. ప్రా. లి. ఫు. భాం. డి. నం. 1842 &1898). అవి చక్కగా నొక సన్నని రాగవరుసతో దేవదాసీ జనముచే పఠింపబడుట సంప్రదాయము.

* * *

సంవాద పదములు

ఇవి పరప్రక్రియను బట్టి ప్రత్యేకత గలవి కావు. సందర్భ మునుబట్టి బహు ప్రత్యేకత గలవి. బహుయక్షగాన సామాన్యముగా ముఖ్యముగా యక్షగాన ప్రత్యేకశాఖలగు భామ కలాపము, గొల్ల కలాపము, కొఱవంజి అనువానియందు జనరంజక సాంప్రదాయిక పాత్రలచేఁ బ్రవర్తితములగుచు తరముల తరబడి ఆంధ్రజన సామా న్యము నాబాలగోపాలము నుల్లాసవారాశి నోలలాడించుచుఁ బ్రచుర ప్రచారము పొందినట్టివి. వీనియందొక విధమైన మోటుదనము, మోటుదనముతో పాటొక హాస్యపువాటము, ఒకవిధమైన వెటకా రము, వెటకారముతో పాటొక చమత్కారమును గలవు. అవి యా నాటి జనులకు వినోదపువిందులు గూర్చినట్టివి.

1. సవతికయ్యము :— తొలుదొల్త పారిజాతకథేతివృత్తము లగు యక్షగానములందును, భామకలాపములందును, తత్రాపి తత్స దృశముగా సత్యారుక్మిణులవలె గంగా పార్వతులు మొదలగు సవతి జంటలు గల అనేక యక్షగానము లందును వారి సవతి మచ్చరము సందర్భముగా నొక సంవాదపదము (అది నిజముగా వివాద పదమే) గన్పట్టును.

సత్య : మంచిది కానీవె రుక్మిణీ
రుక్మిణి : వేటి వంచాలేవె సత్యభామినీ

...

సత్య : చిన్నదాన నని చూచితివో
ఎన్నడు నా చెయ్యెరుగవులే
నిన్ను గుద్దితే నీకై వలచిన
వాని గుండెలే యదరవలెన్

ముద్దరాలనని చూచితివో
పద్దుగ నాచెయ్యెరుగవులే
హద్దుగ గుద్దితె వానికి నీకును
చద్దికి వేడికి చాలవలెన్.

రుక్మిణి : సాదురాలనని చూచితివో
నకియరొ నాచెయ్యెరుగవులే
చరుపు చరిచితే వానికి నీకూ
పరుపు పానుపై యుండవలెన్.

అధమురాల నని చూచితివో
అదపులు ఎన్నడు నెరుగవులే
అదపులు చేసితె నీవును వాడును
అద్దుమీరక యుండవలెన్.

కళాపూర్ణోదయములో (3-195,96) నీ సవతి కయ్యపుఁ బట్టు రంభా మాయారంభల వివాద వ్యాజమున రమణీయముగాఁ జిత్రింపఁబడినది. ఈ విషయముగూర్చి కో. శే. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు తమ సుగ్రీవ విజయపీఠికలో నిట్లు వ్రాకుచ్చి యున్నారు : "ఈ భాగవత కథలలో పారిజాత హరణకథ హృద్యతర మగుటచే దానికిఁ బ్రచార మెక్కువయ్యెను. అది హృద్యతరమగుట కందలి సవతుల కయ్యపుఁబట్టు ప్రధానకారణము. దీనినిఁబట్టి యక్షగాన సామాన్యమునకుఁ బారిజాతము లనియుఁ బేరయ్యెను. ఏ యక్షగానముఁ బ్రబంధించినను అందు సవతుల కయ్యపు బట్టునకుఁ బ్రస క్తి గల్పించుటయో లేక పారిజాతమునందలి తత్కథాఖండమునే స్వతంత్రముగాఁ బ్రబంధిం

చుటయో పిదప నేర్పడెను. (భామకలాపము స్థితి యిట్టి పరిణామ ఫలితమే కావచ్చును). ఈ సవతుల కయ్యపు కథపట్టు హృద్యతర మగుటచే బ్రబంధకవులను గూడ నిది వలపించెను". ఈ కథపట్టును బ్రదర్శించునపుడు పాత్రధారులపట్లఁ బాటతోపాటు గొంత ఆంగికాభి నయ మావశ్యకమగును. కావుననే విజయరాఘవుడు తన ప్రహ్లాదచరి త్రమున 'సవతిమచ్చరము' నొక నాట్యప్రభేదముగఁ బరిగణించెను.

2. సుంకరి కొండయ్య – గొల్లభామ : గొల్లకలాపమున తఱుచు వీరి సంవాదము గాన నగును. అది కొన్నిట సరసము, కొన్నిట విరసము గను నుండును. అందు సరసపు సందర్భమునే గ్రహింతము.

కొండయ : అర్ధరాత్రి వేళా నేను । రుద్రవీణె దీసుకోని
ప్రొద్దుబోక నిన్నేపాడాగా । ఓహో గొల్లదానా!
భళ్లు భళ్లున తెల్లవారెనే!।

గొల్లభామ : కీలుకట్లా తేరుమీదా । కిన్నెరాలు మీటేజాణ
కన్నులెత్తి నన్ను జూడరా । ఓనా హాయలుకాడ!
కిన్నెరాకు కాయ లంపేనూ॥

కొండయ : కన్నె రాతిరి వస్తా వనుచు । పట్టిమంచం బరుచుకు కూకుంటె
రాతిరి నీవు రాకపోతివె । ఓగొల్లభామా!
రాతిరే శివరాతి రాయెనూ॥

గొల్లభామ : కన్నెరావీ చెట్టుకిందా । సన్నసూదులు దంచాగా
సన్నజేసి సున్నమడిగేవు । ఓవన్నెకాడా!
సన్న లెరుగా । చిన్నదానార॥

కొండయ : ద్దు మాముదాలూ గోనె । యెద్దుమీదవేసుకోని
కానరాని గట్ల లోనికి । ఓగొల్లదాన!
కాపురము శాయబోదామా॥

గొల్లభామ : కట్లకట్లా కడవగొంచూ। మెట్లబావికి నీళ్లకు బోతే
మెట్టుజారీ నూతబడితినిరా । ఓవో వన్నెకాడా!
రెట్ట బట్టి లేవదియ్యారా॥

గుబ్బలుండే తీరుజూచి । గుటకాలే మింగేవురా
గుండెగలా జాణవైతే । ఓవో వన్నెకాడా !
గుబ్బ పట్టీ దెబ్బ తియ్యారా ॥

సన్నాలా సైగాలు చేసి । సన్నాపు నవ్వులు నవ్వి
క్రొన్నెలా మోము దీర్చుకా । ఓ నా హాయలుకాడా !
నన్ను సుంకము గొనగ వస్తీవా॥

ఇం దీ సంవాద పంతయు ఏలలలో సాగుట గమనింపఁదగినది.

3. సింగి – సింగడు : ఎఱుకత పాత్రకుఁ బ్రత్యేకత గల యక్ష గానములలో కొఱవంజులలో సింగి యెఱుక జెప్పి జాలము నేయగా సింగ డాలము నేయుచు నామె నన్వేషింప వచ్చును. ఆమె సంపాదించిన సొమ్ములు చూచి యామె ననుమానించును. ఇక నిద్దరికి వివాద సంవాదములు :

సింగి : అడా యిన్నెడ యింగేవాడా సింగా
గుడిసా విడిచీ యేలా వస్తివిరా వెట్టిసింగా !
సింగడు : గుడిసాలోకి ఎలుక వచ్చె కలికి సింగి నేను
జడిసి నీతో చెప్పవస్తి జాణసింగి !

* * *

సింగడు : కొంగ గువ్వ చెవుడుకాకి జంగుపిల్లి పూరెడు రంగుమీర దెచ్చి
పెడితె దొంగనసుకులా
సింగి ! దొంగనసుకులా ?
సింగి : ఇగురబోండ్ల కెఱుక దొడ్డనగరులందు జెప్పితెస్తె
తగరు వలెను మెక్కినీవు పొగరు కొంటివా
సింగా ! పొగరు కొంటివా ॥

అనుబంధము
5
యక్షగాన శబ్దజాలము

యక్షగానముల భాషాస్వభావమును గూర్చిన ప్రసక్తిమీఁద వచ్చినది. యక్షగానములం దిప్పటివఱకు మన నిఘంటువుల కెక్కని అపురూపమైన శబ్దజాల మెంతో నిక్షిప్తమైయున్నది. అందు నిఘంటువుల కెక్కినను మన ప్రబంధ వాఙ్మయమున తగిన ప్రచార మేర్పడనిది కొంతయు, నిఘంటుమాత్ర శరణ్యమైనది కొంతయును, యక్షగాన ప్రయోగమున అర్థాంతరమును సూచించునది కొంతయును గలదు. పలువిధముల విశిష్టమైన యక్షగాన పదజాలము గొంత వర్గీకృతమై యీ దిగువ నుదాహరింపఁబడుచున్నది :—

1. విశేష శబ్దములు

ఈ శీర్షిక క్రిందివి మాత్రము చాలవఱకు శబ్దరత్నాకరము, సూ. రా. నిఘంటువు, శబ్దార్థచంద్రికలందు లేనివే. కొద్దిపాటియున్నను అర్థభేదమున్నది.

ఆయిత్తారాలు. అదివారాలు (మన్నారు దాస విలాసము)

ఉభయతోపట్టు. ఉభయతోముఖమైన (ఈనుచున్న) గోవును దానము (ఇది మంచిదానమఁట) పట్టు (మ.దా.వి.)

ఉరణి. (కన్నడ-ఉరటణి) సత్కారము (లేపాక్షి శివనాటకము)

ఉరాటం. ఉరిత్రాడు (సరస్వతీ కల్యాణము)

కడలాలిదోషము. వైధవ్య దోషము (వీరభద్రకవి సీమంతినీచరిత్రము)

కాలనీళ్ళు. దిష్టితీసిన పసుపునీళ్ళు మొ॥ (వెంకటాంబరామాయణము)

కీచంటిబిడ్డ. తల్లి [illegible] కెడపడి చిక్కి–పోయిన బిడ్డ (గంగాపార్వతీ సంవాదము)

కూకుండు. (గ్రామ్యము) కూర్చుండు (చెంగల్వరాయని ఎఱుకల కథ)

కూత్తు. (తమిళ–కూత్తు) నాట్యము (తంజా పురాన్న దాననాటకము)

కేరి. ఉనికిపట్టు (విజయ రాఘవ చంద్రికావిహారము)

గంత. (బొంత–శ. ర.) పక్క–లాకులతిత్తి (శభాజీ జలక్రీడలు)

గవినేరు. గవర్నరు (పురిజాల పారిజాతము)

గాచారము. గ్రహచారము (శచీ పురందరము)

గాణబయకారు. వాగ్దేయ కారుడు (మ. దా. వి.)

గుడుగుడుపవాడు. శకున పక్షి గాడు. (వెం. కృ. జెట్టి శివపారిజాతము)

ఘడియారం. రూపాం. గడియారము (మ. దా. వి.)

జన్నె వారము. ఆదివారము. (పోట్ల దుర్తి గొల్లకలాపము)

డీడిక్కి–సలాడు. డీకొట్టుట (ఆకలంక కృష్ణమార్యుని కృష్ణవిలాసము)

తారా. దీపావళి సంభారవిశేషము. (చిత్రాంగదవిలాసము)

తిరువళిక. దేవునికిఁ బెట్టిన దీపము (విజయరాఘవుని పూతనాహరణము

దిట్టత. గట్టితనము (వెంకటదాస ధర్మాంగద)

దినశుద్ధి. పంచాంగమునుబట్టి సదసద్దిన నిర్ణయము (తంజాపుర–)

దివాళి. దీపావళి (మ.దా.వి.)

దుగ్ధ. కాతుకతీర్థ (త్యాగయ ప్రహ్లాద)

దొరాదొరలు. పెద్ద పెద్ద ప్రభువుల (లీలావతీకల్యాణము)

నటముటుకాండ్లు. నటులు (శచీపు రందరము.

నుడుగు. పాట. (హేమాబ్జనాయికా–

నొష్ట. నొసట (నృసింహరాజుఉపా–

పంగుని. (త) ఫాల్గుణము (మ.దా.వి.

పంతువగ. విరహ వేదన (రతికల్యా ణము)

పదిలత. భద్రత (వెంకటదాస ధర్మాంగద)

పాలించు. ఇచ్చు (హేమాబ్జ)

పుట్టముంగి. పుట్టువునుండి మూగ యైనవాడు (ఆకలంక–)

పేరడి. అప్రతిష్ఠ (మ.దా.వి.)

పోలుకాడు. పొల్లుగాడు. (సాంబయ్య కిరాతార్జునీయము)

ప్రసంగము. స్తోత్రము (భక్తవత్సల విలాసము)

ప్రసంగి. య. గా. ప్రదర్శకులలో నొకడు. పాత్రలఁ బలుకరించు వాఁడు (పంచకన్యాపరిణయము)

బసవశంకరము. 1. గొల్లవారిబిరుదు, ఆభరణవిశేషము (ఆత్తేయపురి గొల కలాపము). 2. ఒక దేశితాళ విశేషము (త్యాగవినోద ప్రబంధము)

భాండీరి. ప్రాకృతభాషావిశేషము

'కాంభోజీ మాగధీగాండీ
మాహారాష్ట్రీ కళింగజా
వైదర్భీ మిశ్రితాభాషా
భాండీరీతి ప్రకీర్తితా.'

(విజయరాఘవ కల్యాణము)

యా(ం)పరాలు. పాటు (శివకామ సుందరీపరిణయము)

లఘువు. దూకు (చౌదరి రామదాసు రుక్మిణీ–)

లజ్జమాని. అడుగరి (మిట్ట మరి రామాయణం)

వంశము. వంటకము (పద్మినీపరిణయము వైదికపరిభాష)

వచ్చము. రూపాం. ఒచ్చెము (యతిఘటితముగ–నృసింహరాజు ఉషా–)

శానా. రూపాం. చాల (కర్ణాచరిత్ర)

వాపితనము. (వాఁపు + ఇరి) అబ (రామలింగదాసు శ్రీనివాసవిలాసము)

వాయదకాండ్లు. వాద్యగాండ్రు (పురిజాల పారిజాతము)

విందాళము. ఒడి (వి. రా. ప్రహ్లాద)

వైపు. భాగు (అన్నపూర్ణాపరిణయం)

వైయాసి. త. వైశాఖము (అన్నపూర్ణా)

శేఖరించు. జరిపించు (మ.దా.వి.)

సంకచక్కిలాలు. శంఖచక్రాలు (వి. రా. పూతనాహరణము–గొల్లలభాష)

సనకటించు. వినికిడిచేయు (వి. రా. కల్యాణము – గ్రామ్యము)

సరుసుకొను. సరుదుకొను, పంచుకొను (హేమాబ్జ)

సిల్లాడు. ఉత్సవమాడు (వి. రా. పూతన–)

సీసకలేఖిని. పెనసలు (లక్ష్మీనారాయణ విలాసము)

సుడియడు. బాలుడు (వి.రా. ప్రహ్లాద)

సుడి సుద్దములు. అంగసాముద్రికమున సుడులకు సంబంధించిన సూత్రోక్తములు (చెంగల్వరాయని ఎఱుకల కథ)

సుడుపడు. కుట్టడు (మ.దా.వి.)

సొల్లు త. వచించు (శ్రీగిరి కురవంజి)

సోలుదాదులు. రూపాం. సోలరు. సిపాయిలు (పురిజాల పారిజాతము)

హవణించు. రచించు (రఘునాథ నాయకాభ్యుదయము)

...

2. వైరిపదములు

అతిపగ. (వెంగమాంబ శివవిలాసము)

అతిముద్దు. (సత్యభామ కథ)

అత్యంతపంతము. (శివవిలాసము)

అనేకజడలు. (పంజువాణిభామకలాపము)

ఇష్టవేలుపు. (లక్ష్మణా కల్యాణము)

ఉన్నతచప్పరంబులు. (శివవిలాసము)

కుసుమబంతి. (శివవిలాసము)

గర్భచిన్నెలు. (బాలెంతకథ)

దాసవెట్టి. దాసునియందలి అనురక్తి. (త్యాగయ ప్రహ్లాద)

దినరోజులు. అనుదినము? (వి రా. చరి. వి.)

దినసరులు. దినచర్యను గూర్చినవ్రాతలు. (కిరాతార్జునీయము)

ధీరమల్లారు. ధీరశ్రేష్ఠుడు. (మ.దా.వి.)

నానాచూపులవాడు. (శివనిలాసము)

నానాహైరాణి. బెడద (సిరిపెగడ సుబ్బరాయని సారంగధర)

నిత్యకొలువు. (పతిదిన సాధారణమైన సభ (శచీపురందరము)

పుడమిజ. సీత (తుమ్మపూడి రామాయణం)

పుడమీశ్వరుడు. (వీరభద్రకవి సీమంగొ తిసీ చరిత్ర)

పుణ్యాచేడెలు. పుణ్యస్త్రీలు (సాంబయ్య బల్లాణరాజ చరిత్ర)

ప్రౌఢచేడియ. (వి.రా.చం వి.)

బసవ దాసోహములు. బసవని భక్తులు. (బసవ మహిమామృత విలాసము)

బహుతప్పులు. (రంగపురిపారిజాతం)

బహుమేలు. (త్యాగయ ప్రహ్లాద)

బాలతొడవు. (లక్ష్మణాకల్యాణము)

బహ్మకాయ. గొప్పవాడు, నిపుణుడు (శహాజీ గంగాపార్వతి సంవాదము)

మహా మహావారు. గొప్పగొప్పవారు (భక్తాంఘ్రిరేణు విలాసము)

మాణిక్యపేరులు. మణిహారములు (వాయలూరి పారిజాతం)

మూర్ఖపగ. (మంగలూరి ప్రహ్లాద)

యావన్మంది. అందఱును (మహాభారత విలాసము)

రసపిచ్చి. (వల్లయపురి ఉషాపరిణయము

రామకోణంగి. శకునపక్షిగాడు (సరస్వతీకల్యాణము)

రావణారంకు. పెద్దఅంకు (లక్ష్మణ ప్రాణరక్షణము)

లోకతరబడి. లోకాచార ము(ముగ్ధ సంగయ్య కథ)

వాగిట్ట. పదవాక్య ప్రమాణజ్ఞుడు (మైనం పాటి బాలగోపాలవిలాసము)

వీర మద్దెల. గొప్పమల (ప్రభావతీ ప్రద్యుమ్నము)

వీరముద్దియ. అభరణ విశేషము (నక్క–ల పాటి సంజీవకవి ఎఱుకలకథ)

శైలపట్టి. పార్వతి (శివవిలాసము)

సత్రమరులు. సత్రమునందు మరులు (తంజాపురాన్న దాననాటకము)

హంవీరతాయెలుతు. రక్షాబంధ విశేషము-జోడులు, వస్తాదులు ధరించునట్టిది (హేమాబ్జ)

3. అన్యదేశ్యములు

కచ్చేరి. కొలువు (లక్ష్మణ మార్గ)

కబర్దార్. జాగ్రత్త అను హెచ్చరిక (చెంగల్వరాయని గొల్లకథ)

కమ్మా. కళ (సుకుమారీ పరిణయం)

కవరు. భూమిడిపాటి అప్పకవి భామ కలాపము)

కాగజము. కాగితము (మాతృభూతన పారిజాతం)

కితాబు. హక్కు, బిరుదు (కో. తిరు వెంగడదాసు తిరుమంగయాళ్వారు చరిత్ర)

కురిచీ. కుర్చీ. (లక్ష్మీ నారాయణవిలాసము)

కూనీ. ఖూనీ. హత్య (అకలంక-కృష్ణ విలాసము)

ఖడేరావు. 'అగు' అన్నట్టి హెచ్చరిక (సుకుమారీ)

ఖర్చు. (ల. నా. వి.)

ఖామూమ్. నిశ్శబ్ద మనునట్టి హెచ్చరిక (రామదాసు నాటకము)

గలీబు. (మంజువాణి వారి భా. క.)

గులోబు. గ్లోబు. (,, ,,)

గ్లోబు. (అన్నపూర్ణా)

చెలాయించు. (సుకుమారీ)

జమాయించు. (,,)

జరువురు. (జరూర్) తొందఱ (ల. నా. వి.)

జూటుతనము. (ఝూటా) మోసము (వి రా. ప్రూతన)

జొకాయించు. (సుకుమారి)

ఝూరీ. (రాజరంజన విద్యావిలాసము)

డేరా. గుడారము (సుకుమ్మారి)

తమాము. పూర్తుగా (తి. వెం. దా. తిరుపంగ)

తమాసా. (అకలంక – కృ. వి.)

తహశీలు. (అక్కెళ్ల అప్పయ్య గొల్ల కలాపము)

తివాసీ. (మంజువాణి. భా. క.)

తోడా. బిరుదు పెండెము (అన్నపూర్ణా)

దస్కతు. సంతకము (ల. నా. వి.)

దాఖలు. (భ అ - భా. క.)

దావా. (ల. నా. వి.)

దిలాసా. (అకలంక-కృ. వి.)

దివాణం. రాచనగరు (శచీపురందరము)

దేరీజ. డేరా (తం. స.మ. 473)

ధగిడీ. 'ముండ' వంటి తిట్టు (పోటదుర్తి గొల్లకలాపము)

నావనీసు. పట్టిక (అన్నపూర్ణా)

నిద్దా. మేలైన (మా. భూ. పారిజాతం)

పంకా. (మం. వా. భా. క)

పాందాన్. తాంబూల కరండము (ల. నా. వి)

ఫిరంగి. (అంబా వివాహము కొఅవంజి)

పూరా. పూరిగా (,, ,,)

ఫోజు. పటాలము (,, ,,)

బంకు. సందుకావలి (రా.రం.వి.వి.)

బంగు. చోష్యవిశేషము-మత్తుపదార్థము (శాంతాకల్యాణము)

బందుబస్తు. బలిమి (మృత్యుంజయ)

బడాయి. (అకలంక-)

బనాయించు. (సుకుమారి)

బేజారు. భయము, గాభరా (భ. అ. - భా.క.)

భరాయించు. భరించు(అంబావివాహ)

భేటి. సముఖము, దర్శనము, సమావేశము (శాహమహారాజకల్యాణము)

మద్దత్తు. (ల.నా.వి.)

మస్తి. 'సరే' వంటి అవ్యయము (రామపట్టాభిషేకము)

మిలిటరీ. (అంబా)

ముస్తాదు. అలంకరించుకొనుట, సిద్ధమగుట (ల. నా. వి)

ముస్తిపుచేయు. సిద్ధముచేయు (శ పురందరము)

ముస్తీదు. ముస్తాబు, సన్నాహం (హేమాబ్జ)

మొఖమల్. (మం.వా.—భా.క.)

రకము. (సింగన పారిజాతము)

రాదారి. (భ. అ.—భా.క.)

రైలు. (భ.అ.—భా.క)

లవండరు. (మం.వా.—భా.క.)

లష్కరు. దండు (సుంకరి కొండవేషముకథ)

లాంతరు. (ల.నా.వి.)

లెటరు. (భ.అ.—భా.క.)

వస్తాదు. (సుకుమారి)

శమ్మ్య. సెమ్మె, దీపపు పమిద. (మ.వ భా.క.)

శాయి. సిరా (మా. భూ. పారిజాత

శిఖాచేయు. ముదరివేయు (వి. చ వి. వి.)

శిభంది. రూపాం. సిబ్బంది. బలగం (లక్ష్మీపతిరాయడు నలచక్రవర్తి చరి

షోకు. (రామదాసు నాటకము)

సముదాయించు. బుజ్జగించు (శ్రీరంగ కవి శ్రీకృష్ణ జలక్రీడలు)

సలాము. (సుకుమారి)

సీలు. (భ.అ.-భా.క.)

సీసా. (మం.వా.—భా.క.)

సుమారు. (భ.అ.—భా.క.)

స్సై లెను. (రామదాసు నాటకము)

సొనాయించు. అమర్చు (సుకుమారీ).

హాజీలు సేయు. హాజరు పెట్టు, అయత్త పఱచు (గంగా పార్వతీ సంవాదం)

హురుముత్తుగా. పెద్దగా, గొప్పగా (వి. రా. ప్రహ్లాద)

హేజీబు. మనవి (లీలావతీ కల్యాణం)

...

4. జాతీయములు

అజగజాంతరము. (వి.రా.చం.వి.)

అమ్మలక్కలు. (వి.రా.చం.వి.)

ఇలయీనినట్లు. (కిరాతార్జునీయము)

ఇల్లు బంగారాయెను. (అకలంక - కృ. వి.)

ఉలపసలపలు. కానుకలు (కిరాత విలాసం)

ఏనుగుపాడి. ఉదారవితరణము (లీలావతీ కల్యాణము)

ఏపాగాథలు. సరిపడని మాటలు, అనవసర ప్రసంగములు, వ్యర్థప్రలాపములు (మ. దా. వి.)

ఒకరిపల్లు పదుంద్రుడు. (వి. రా. - విప్ర నారాయణ చరిత్ర)

ఒత్తూ ధావళ్ళవంటి. స్థూలమైన (కృష్ణవేషకథ)

ఓహారి సాహిరి. (అకలంక - కృష్ణ విలాసము)

కంచంత కాపురము. పెద్దసంసారము (రాజరంజన విద్యావిలాసము)

కన్నడ సేయు. చులకన చేయు, కించపరచు (పార్థసారథి విజయము)

కాయ జవాబు. కలిసిరానివార్త (ఓబయ గరుడాచల విలాసము). ఒకపని సవ్యముగా జరిగినట్లూ లేనట్లూ అనుటకు పండా? కాయా? అని ఆడుగుట వ్యవహార పరిపాటి.

కూసరకాసర చేయు. ఉపేక్ష సేయు, అసడ్డచేయు (భక్తాంఘ్రిరేణు విలాసము)

కొడుకులకోట. బహుపుత్ర సంపన్న భాగ్యశాలిని (మృత్యుంజయ)

గాలివార్త. (రా. రం. వి. వి.)

గుత్తకొను. సొంతము చేసికొను (జాంబవతీ విలాసము)

చందమామ గుక్కళ్ళు. అందరాని ఫలము (వి. రా. చం. వి.)

చారా చారెడు. విశాలమైన కన్నులు మొ॥ (కృష్ణవేషకథ)

చుట్టాల సురభి. బంధుహితుఁడు (మృత్యుంజయు)

చెంపశుద్ధి. చపేట ప్రదానము (హేమాబ్జ)

తరకట బురకట. అబద్ధము (చెం.రా. ఎఱుకలకథ)

తాపచుట్టతీకము. ఇచ్చి పుచ్చుకొను సంబంధము (ఆత్రేయపురి గొ. క.)

త్రవ్వితల కెత్తు. ఉద్ధరించు (భక్తాంఘ్రి శేణు విలాసము)

నంగనాచి. (నక్క-నాంచారు) నేరము చేసియు నేరనిదానివలె నటించునది. (గంగాపార్వతీ సంవాదము)

పలుకు బంగారము. (అకలంక-కృ.వి)

పిలువని పేరంటము. (భవానీశంకర విలాసము)

పుర్రచెయ్యి. ఎడమచేయి - అపసవ్యమైనది (బసవ మహిమా)

పోతుపేరంటాలి పొలుపు. మగవాని ఆడువాలకము (భీమసేనవిజయం)

పొద్దు గూకులు. ప్రొద్దుగ్రుంకువఱకు (త్యాగయ ప్రహ్లాద)

బంగారు కొండ. అమూల్య వస్తువు. ప్రియతముడు (అకలంక-కృ.వి.)

బభ్రాజిమానం. అసమర్థుడు (ధర్మపురి మాహాత్మ్యము)

బారాబారెడు. పొడవైన (కురులు మొ॥ కృ. వే కథ.)

బ్రహ్మకాయ. శ్రేష్ఠుడు, నిపుణుడు (గంగా పార్వతీ సంవాదము)

బ్రహ్మిష్ఠుడు బ్రహ్మ కొడుకు. శ్రేష్ఠుఁడు (మ. దా. వి.)

మదన శుంఠ. శృంగార పరిజ్ఞాన విహీనుఁడు (భక్తాంఘ్రి-)

మహా మహావారు. (గొప్పగొప్ప వారు (భక్తాంఘ్రి)

మొగము వాచు. బ్రాతి పడుట (అకలంక-కృ. వి.)

యద్వాతద్వాలు. పెడసరపు మాటలు, పొందుపొసఁగని మాటలు, లజ్జగుజ్జులు (వి.రా.ప్రహ్లాద, హేమాజ్జ)

రావణసన్యాసి. కపట సన్యాసి (వి. రా. విప్రనారాయణ చరిత్ర)

రావణారంకు. పెద్ద లేక ప్రసిద్ధమైన అంకుతనము. (లక్ష్మణ ప్రాణరక్షణము)

లంకించుకొను. దొరికపు బుచ్చుకొను లోఁగొను (హేమాబ్జ)

వజ్రశుంఠ. గండ మూర్ఖుడు (వి. రా. ప్రహ్లాద, హేమాబ్జ)

వలపు వక్కణకమ్మ. ప్రణయలేఖ (వి. రా. చం. వి.)

వలరాచసివము. మాన్మథోన్మాదము (మ. దా. వి.)

వార్తలాడు. చమత్కారముగా సంభాషించు (వి. రా. వి ప్ర. నా. చ.)
కైవారము సేయు (చిత్రకూట)
సంత మెఱుగు. బజారు పోకు, ఆడంబరము (బాలక్రీడావిహారం)
సరిమానము. ఏమాత్రపు హెచ్చు తగ్గులు లేక సమానముగా నుండుట (త్యాగయ ప్రహ్లాద)

...

5. ధాన్యము ల పేర్లు

ఇప్పసరులు, కర్పూర భోగాలు, కుసుమసరాలు, గంగాజలాలు, గౌరీశకుంకుమలు, చామపువ్వులు, చిరుత సంబాపువ్వులు, నల్లగాగిరెక్కలు, నాగ సరులు, పాలబుడమలు, బంగారు తీగెలు, బలువు గుత్తులు, మదన సరులు, ముకుందభోగాలు, ముత్యసరులు, మేటివంకెలు, రత్నసరులు, రాజనాలు (ఇప్పపువ్వు, జీలకఱ్ఱ, మంచిపునుగు, మేలికొండ, సన్నజలుగు మొ॥ ఇందలి రకములు) రామబాణములు, రామభోగులు, రాయసరులు, సీతాభోగాలు.

...

6. భక్ష్యవిశేషములు

అంబలి, అట్లు, అతిరసాలు, అప్పడాలు, అప్పములు, ఆనబాలు, ఆవడ, ఇడ్డెన, ఉక్కిర, ఉల్లెడపోళీలు, ఊరగాయలు, రుడూబిండ్లు, కక్కరాలు, కజ్జకాయలు, కజ్జాయము, కఱుకుట్లు, గరిజకాయలు, గసగసాలకజ్జికాయలు, గారెలు, గురుగులు, చంద్రకాంతలు, చక్కిలాలు, చక్కెరగుండ్లు, చల్లగారెలు, చిట్టిబూరెలు, చిత్రాన్నము, జిలేబీ, తిమ్మనము, తిరువిసములు, ధధ్యోదనము, దోసెలు, నీరుగ, పరమాన్నము, పాయసము, పులగము, పులిహోగిర (పులిహోర), పూరీలు, పూర్ణకుడుములు, పూర్ణాచిపోళి, పేణీలు, పొంగలి, భరుగులు, (వరుగులు?), మండెగలు (పూతరేకులు?), లడ్డు, వగవగలు, వడలు, వెన్నప్పములు, సంకటి, సిగరణాలు, సిగిరెలు, సుకియలు, సేవాలపాయసము, సొంటి మజ్జిగ, సొజ్జెబూరెలు.

...

7. ఉడుపులు

అంగీ, అరచట్ట, కబాయి, కాసె, కుత్తినీ, కుళ్లాయి, కోక, గొంగడి, చల్లడము, చీర, (గంగ సాగరపుచీర, గోరంచు, చెంగావి, పగడపట్టు, పట్టుమళ్లు, బుటేదారు, బురుసా, మాయపట్టు, మొ॥ కొన్ని చీరల రకాలు) చోగ, తడుపు, తాప్తా, దట్టి, దుప్పటి, ధోవతి, పచ్చడము, పాగ, పావడ, పైఠణీ, రవిక.

...

8. ఆభరణములు

అందెలు, ఉంగరములు, ఉజ్జ ములు, ఉత్తరజందెము, ఉత్తరిగె, ఒంట్లు, ఒడ్డాణము (రూపాం. ఒడ్డి యాణము, ఒడ్యాణము, ఒడ్డేణము, వడ్డాణము), కంకణములు, కంట సరి, కంఠె, కంఠమాలిక, కడి యాలు, (ఇంద్రాణి కడియాలు, దండకడియాలు, మేరువు కడి యాలు మొ॥), కమ్మలు (పంజుల కమ్మలు) కింకిణులు, కుండల ములు, కుతికంటు, కొప్పు బిళ్ళ, గజ్జలు, గాజులు (ఉదిరి గాజులు), గొడసరాలు, చంద్రవంక, చంద్ర హారము, చిటికెనబొద్దులు, చిలుక తాళి, చుక్కలపేరు (తార హారము), చెంపకళ్ళీలు, చెంప సరాలు, చెరుపు, చీకట్లు చేయము, చేసరులు, చౌకట్లు (గండచౌకట్లు), జంపులు, జడబిళ్ళ, జుబికీలు (జుమకాలు, జుమికెలు), జోమాల దండ, తాయెతులు (పత్తికాయ తాయెతులు, హంవీర తాయెతులు), తాళిబిళ్ళ, తురాయి, దర్భముళ్ళు (అంగు ళీయకవిశేషము), నత్తు, నాగ సరము, నేవళము, పదకము, పల్లేరుపువ్వులు, పాపిడిబిందెలు, పంపిణీలు, పిల్లాండ్లు (రూపాం. పిల్లేళ్ళు, పిల్లాణియల్. త.), పెండెము (గండపెండెము, బిరుదు పెండెము), పోగులు, పోచీలు, బటువులు, బణ్ణసరము (వర్ణసరము,) బవిరెలు, బాజుబందులు, బావిళ్లు (బావిలీలు), బాసికము, బావు పురులు, బుగడలు (బొగడలు), బులాకీ, బేసరి, బొబ్బిలికాయలు,

భుజకీర్తులు, ముంగఱ (ముక్క-ఱ), ముసుగు(ముసుఁవు)ముంగామురము ములు(ముంగాముసారి), మెట్టెలు (గిలుకు మెట్టెలు), మొగపుల తీగె, మొగలిరేకు, మొలనూలు, రాకడి (రాగిడి,) రాకడికుచ్చులు, రావిరేక, రేబణిబిళ్ళ, వంకీలు, వీరముద్దియలు, సంది దండలు, సందిబొందులు, సరిగె, సరిపెణ (పులిగోరు సరిపెణ), సరిపేషు, సవరపుకుప్పె,సురమాయి జల్లులు, సూర్యచంద్రులు.

9. క్రీడలు

అచ్చనగండ్లు, అమ్మానె, అల్లో నేరల్లు, ఇట్టిక (ఒప్పలకుప్ప వంటిది - నుదురుపాటి వెంకన పార్వతీ కల్యాణము), కోలాట గుజగుజ రేకులు, గెంజిపాడి, గొబ్బి, చెండ్లాట, దండెయాట, దాగుడు మూతలు, పందాట (బంతియాట), పగడసాల, పొల్లంజి, బొమ్మల పెండ్లి, వామన గుంటలు (ఓమన గుంటలు), సయ్యాట, సాగటాలాట.

10. నృత్యములు

అల్లిక, కందుకక్రీడ, కొరము-కొరవంజి, గుజరాతి - గుజ్జరి, చిందు, చౌపదము, జక్కిణి - ప్రబంధ జక్కిణి, జగ్గు, జోగి-జోగిణి-జోగిణీపంతు, దండలాసకము (కోలాటము), దురుపద కేళిక, దేశి, నాట్యకదంబము, పదచాళి (పదకేళిక), పేరణి (పేరడి),మదన బలదూత్యము, మైసిరి, వాల్విచి, విల్వోడు, శారదా సామ్రాజ్యము, శుభలీల, సవతిమచ్చరము.

11. వాద్యములు

అమృతకుండలి, అమ్మిజంబులు ఆరబ్బి, ఉడుకు, కర్ణాలు, కాహళ, కిన్నెర, చక్రవాద్యము, చితారు, జోల్లు, డవిణ, ఢక్క, తంబుర, తప్పెట, తాళము, తాషామార్పా, తిత్తి, తుడుము, దండె, ధర్మదార,

నరగ, నౌబత్తు, పంబ, పటహము, పణవము, పిడిగండ్లు, బూరగాళ్ళె, భేరి, మల్లారు, మృదంగము, మురజము, రవిచంద్ర వాద్యములు, రావణహస్తము, రుద్రవీణె, వీణ, వీరఘాలు, వీరదాళ్లు, వీరమద్దెల, శంఖము, సుర్ణాలు, స్వరమండలము, హుడుక్క (ఉడుకు), హెగ్గాళ్ళె.

...

12. ఆయుధములు

అమ్ములు, అరిగెలు, ఈటె, ఉంటవిల్లు, కత్తి (పట్టాకత్తి, బాణాకత్తి, విచ్చుకత్తి, సానకత్తి), కటారి, కేడెము, కైజారు, చిల్లకోల, చివగడ, తుపాకి, దుమ్ములు దోదుమ్ములు, నేజ, లకోరి, విల్లు (తడవిల్లు, సెలవిల్లు మొ॥) సింగాణి.

...

13. జంతువుల పేర్లు

వేటకుక్కలు: కాక్రేడు, చొచ్చిన వచ్చు, పందేల పసిడి, పచ్చిమిడియము, మిత్తిగామిడి ముచ్చులగొంగ, మొకమాయ, వేటమాణిక్యము, సింగాడి, సురగాలి.

ఆవులు: కంచి పెరుందేవి, కావేరి, గోదావరి, చందమామ, నాంచారు, బంగరుకొండ, భాగీరథి, మాతంగి.

గుఱ్ఱములు: మూలభైరవుడు, రాయరంపము, వాయువేగుడు.

...

14. రాజకీయోద్యోగులు

అన్నగారు (కొజ్జా. రాణివాసపు కావలి), అమరనాయకులు, అవసరమువారు (సమయనివేదకులు), ఆస్థానసంతోషి (విదూషకుడు), కటికము, (కట్టియం, కటికవాడు, కేతినాయడు, కోలకేతడు, చోపుదారు, బాగుదారు), కణకం (గణికుడు), కరణము, కావలుకారు, కైజీతమువారు, కొత్వాలు, చపురాసి, జమాదారు, జవాను, తలవరులు, దఫేదారు, (డఫేదారు), దివాను, దుబాసి (ద్విభాషి), దేశపాండ్యా, దేశముఖు, నవాబు (నబాబు),

పండారు (భాండారి), పటవారి, పటేలు, పాదుశాహి (పాదుశా, పాదుషా, పాచ్చావు) పాలెగాడు, పేషాకారు, బంట్రోతు, బరాబరి, బొక్కసము వారు, మణియగాడు, (దేవాయతనాద్యధికారి), మహల్దారు (భవనరక్షకుడు), రాయసమువారు (వ్రాయసము వారు - లేఖకులు), రాణువ వారు, వజీరు, సబనీసు (గణకుడు), సవారు (రౌతు), సిపాయి, సుబేదారు, హాసము వారు (రాజ సన్నిధినుండే సిబ్బంది) హెగ్గడి.

...

అనుబంధము

6

యక్షగానములలోని సామెతలు

సామెత లనగా తరతరముల నొక జాతి జనసామాన్యము జిహ్వాంచలముల నాడు నిరాడంబర భావసిర్భర కవితాజీవిత కలమంత్ర ములు. అల్పాక్షరముల ననల్పార్థరచన, భావవైశద్యము, సందర్భ ఘటితిస్ఫూర్తి, అందమైన పదాల పొందిక వీనిసొత్తు. ఏజాతి భాషలో చక్కని సామెతల సంపత్తి యెక్కువగా నుండునో ఆజాతి సాహితీ సౌమనస్యమున కది యొక కొండగుర్తు. తెనుఁగు భాషలో సామెతలు కోకొల్లలు. ఈసంపత్తి విషయమున నన్యభాషల ననేకము నతి శయించునట్టి దాంధ్రభాష. మన జాతీయ సాహిత్యప్రక్రియయైన యక్షగానము మనకెన్నో సామెతల నామెత లిచ్చినది. మన పండిత మాత్రుల గీర్వాణ ప్రచండ వాఙ్మయమున సామెత లనేకము కృతక రూపము బొందినవి. వాని నిసర్గ మనోహర స్వరూపమును చక్కగా సంరక్షించినది యక్షగానము. వానియందలి కవితాత్మను, అలంకార చమత్కార చారుతను గూర్చి యెంతయినను వ్రాయవచ్చును గాని ప్రకృత మవకాశము చాలమి కతిపయ యక్షగానములందలి సామె తలు కొన్ని మచ్చునకు మాత్ర మిట నుదాహరింపఁ బడుచున్నవి :

అంగడిమూద కన్నులు అత్తనెత్తి చేతులు

(గంగాపార్వతీ సంవాదము)

అంతనాడు లేదు ఇంతనాడు లేదు సంతనాడు దిగింది ముంతంత గూద.

(లక్ష్మణకవి ధర్మాంగద)

అచ్చుబొడిచి నిన్నాబో తనవలె

(ఆకలంక - కృష్ణవిలాసము)

ఉసురు గలిగితె ఉప్పమ్ముక బతుకవచ్చు.

(హేమాబ్జనాయికా స్వయంవరము)

కలలందు నరుకులాడినఁ గలవే గాయములు మేలుకాంచిన వెనుకన్.

(భవానీశంకర విలాసము)

కలిబోసిన వెనుక ఉట్లవంక జూడనేల.

(గంగా పార్వతీ సంవాదము)

కానుగ వాసాలు గదోయి కతాలు సాహేబంటే పుచ్చిన దాకా వుండవా బురాను సాహే బన్నట్లు.

(కపిలదేవహూతి సంవాదము)

చావుకేడిచి చాటుకు బోతే మృత్యుదేవత ముందర గూర్చున్నట్లు.

(క. దే. సంవాదము)

తన్నుదా దెలిసిన తత్వ మేల

(ప్రహ్లాదభక్తివిజయం)

తుపాకి కడుపున ఫిరంగి పుట్టినట్లు

(శేషాచార్యులశకుంతల)

తీరు తీరు గుడ్డలు గట్టుక తిరుణాలకు బోతే ఊరికొక గుడ్డ ఊసి పోయినట్లు.

(క. దే. సంవాదము)

దాసరి తప్పు దండముతో సరి.

(భవానీ శంకర విలాసము)

నక్కనారాయణుం డెక్కడనో తోకనారాయణుం డక్కడనే.

(భక్తాంఘ్రి రేణువిలాసము)

నిజము నిదానముమీద తెలియును.

(భవానీశంకరవిలాసము)

నిన్న గుప్పయు నే డాళ్ళు.

(లక్ష్మణా కల్యాణము)

పట్లు పట్లమీద భావ పిలిస్తే మరిచి మామపక్క– పండినట్లు.

(క. దే. సంవాదము)

పసుకాట యిచ్చేది పసలేదు చొచ్చేది మూరె డన్నట్లు.

(శచీపురందరము)

పాటిమీది దేవరకు కూటిమీదనే కోరిక.

(శేషాచార్యుల శకుంతల)

పొంకాల పోతిరెడ్డికి ముప్పై ఎమూడుదొడ్లు మూడెడ్లన్నట్లు.

(క. దే. సంవాదము)

పొడువులకు రోకలి మింగితే పొన్ను ముడ్డి నిరికినట్లు.

(క. దే. సంవాదము)

ప్రసాదానికి బలిష్టం పనికి నీ అదృష్ట మన్నట్లు.

(క. దే. సంవాదము)

మంచమెక్కిన మీద మర్యాద లేల.

(కిరాతార్జునీయము)

మింగ మెతుకు లేదు గాని మీసాలకు సంపెంగనూనె.

(క. దే. సంవాదము)

మూల పెరుమాళ్ళు ముప్పైత్తుకుంటే ఉత్సవపెరుమాళ్ళు దధ్యోదన మడిగినట్లు.

(క. దే. సంవాదము)

యత్ర జంగం తత్రభిక్షమన్నట్లు.

(భక్తాంఘ్రి రేణువిలాసము)

రాట్నం వచ్చె బండి తియ్యరా అన్నట్లు.

(సర్వాంగ సుందరీవిలాసము)

లంజా ముంజా ముదిరి తే కొఱగాదు.

(భక్తాంఘ్రి)

వంకాయలు ముచ్చిలించిన వానిబుద్ధి మొంకాయలకైనవచ్చు.

(అకలంక - కృష్ణవిలాసము)

సద్దన్నపు మూది వెన్న చందురు డవునే.

(ప్రహ్లాదభక్తివిజయము)

సన్నికలు కడగరా సయిదల్లి అంటే కడిగినట్టే నాకినా ఖుదా తోడన్నట్లు.

(క. దే. సంవాదము)

సాటి యూరాలు సరిగె బెట్టుకుంటే తోటి యూరాలు ఊరిబెట్టు కున్నట్లు.

(క. దే. సంవాదము)

సిగ్గు బోవువేళ చీర లబ్బినరీతి.

(ప్రహ్లాద భక్తవిజయము)

ఆంధ్ర
యక్షగానవాఙ్మయ చరిత్ర

ద్వితీయభాగము

యక్షగాన
కవులు – కావ్యములు

రచన
డాక్టర్ యస్వీ జోగారావు

ద్వి తీ య భా గ ము

య క్ష గా న క వు లు – కా వ్య ము లు

వి ష య సూ చి క

1. ఆంధ్రప్రాంత యక్షగాన కవులు - కావ్యములు. 1 – 248
(కాలక్రమాను సారము)

అ ను బ ం ధ ము

2. దక్షిణదేశ యక్షగాన కవులు - కావ్యములు. 249 – 356
(కాలక్రమాను సారము)

అ ను బ ం ధ ము

3. తెలంగాణ యక్షగాన కవులు - కావ్యములు. 357 – 412
(కాలక్రమాను సారము)

అ ను బ ం ధ ము

4. పరిశిష్టము – 1. కాలము తేలని య. గా. కవులు. 413 – 440
(అకారాది క్రమానుసారము)

పరిశిష్టము – 2. క ర్తృత్వము తేలని యక్షగానములు 440 – 456
(అకారాది క్రమానుసారము)

అ ను బ ం ధ ము

వి వి ధా ను బ ం ధ ము లు

౧. అలభ్య యక్ష గానములు
౨. యక్ష గానాభానములు
౩. అకారాది క్రమ కవి నామ సూచి
౪. అకారాది క్రమ గ్రంథ నామ సూచి
౫. సంకేతములు
౬. ఉపజీవ్య గ్రంధములు – వ్యాసములు
౭. స్వీయ (యస్వీయ) వ్యాసములు
(యక్షగాన విషయకములు)

1. ప్రోలుగంటి చెన్నశౌరి

సౌభరిచరితము :

ఇతఁడే యిప్పటికి మనకుఁదెలిసినంతలోఁ బ్రథమాంధ్ర యక్షగాన కర్త. హరిభట్టు రచించిన యుత్తర నారసింహ పురాణము (ఆం. సా. ప. చేఁ బ్రచురితము) కృత్యాది యందుఁ గృతిపతి యగు ప్రోలుగంటి రంగనమంత్రి వంశవర్ణననుండి యీతనిచరిత్ర మెఱుఁగ నైనది. ఈతఁ డాశ్వేల నిమోగి. ఆశ్వలాయన సూత్రుఁడు. వాసిష్ఠ గోత్రుఁడు. ప్రౌఢరాయలయొద్ద దండనాయకుఁడైన తిప్పన యీతని ప్రపితామహుఁడు. దేవమాంబా నాగశౌరు లీతని తలిదండ్రులు. ప్రోలుగంటిపుర మితని కాపురము. కాలము క్రీ. శ. 15వ శతాబ్ది యుత్తరార్ధము.* ఆనారసింహ పురాణావతారికలోని 3వ పద్యమున (సీసము) నీతఁ డష్టభాషా కవియనియు, ద్విపదనారసింహ పురాణము, బాల భారతాంధ్ర వచనకావ్యము, సౌభరి చరితంబు జక్కులకథయు నీతని కృతులనియు, నితఁడు సరసింగరాయలనుండి యగ్రహారాదికము గ్రహించినాఁ డనియు, నితని భార్య పేరు కొండమ యనియుఁ గలదు. ఇతని గ్రంథము లెవ్వియు నేఁడు గానరావు. ఆతని సౌభరి చరితము "జక్కుల కథ" యనఁగా నదే యక్షగానము (ఆ. సౌభరి యొక మహర్షి. అతని చరిత్రము భాగవత విష్ణు పురాణములందుఁ గలదు) ఆ గ్రంథ మలబ్ధము. ఆనాఁటి యక్షగానము స్వరూప స్వభావాదులు తెలిసి కొనుట కవకాశము లేకుండఁబోయినది.

* చూ. ఆంధ్రకవి తరంగిణి 6వ సంపుటము, పుట 73, 74.

2. చక్రపురి రాఘవాచార్యుడు

విప్రనారాయణ చరిత్ర:

ఇప్పటిదనుక నుపలబ్ధమైనంతలో మన యక్షగానములలో గందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయమే ప్రాచీనతమమైనదిగాఁ బరిగణింపఁబడుచు వచ్చుచున్నది. కాని దాని కొక్కించుక పూర్వమే రచింపఁబడి యుండునను నూహ కెడమిచ్చు గ్రంథ మొకటి లభించినది. అదే మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున డి. నం. 1939 యగు విప్రనారాయణ చరిత్ర. ఈ గ్రంథము తాటియాకుది. ప్రాఁతది. శైథిల్య గ్రంథపాతములు గలది. గ్రంథారంభమున నొకటవ, మూఁడవ నూకులు పోయినవి. చివర నొకటి రెండాకులు పోయి యుండును. గ్రంథకర్త పేరిందు గానరాదు. కాని యీ గ్రంథమునకుఁ గర్త చక్రపురి రాఘవాచార్యుఁడని యీక్రింది యుపపత్తులవలన గ్రహింపఁ బగును.

1. చక్రపురి రాఘవాచార్యుని రచనలని రూఢిగాఁ దెలియ వచ్చిన "నలచరిత్ర" (సి. పి. బ్రౌనుఁదే, వావిళ్ళ వారిచే వెట్టువార్డు వారిచేఁ బ్రకటితమైనది), "విష్ణుభక్త చరిత్రము" (ప్రా. లి. పు. భాం. డి. నం. 1182) అను రెండు ద్విపదకావ్యములురెండును ఘటికాచల నారసింహస్వామి కంకితములని చెప్పఁబడినవి. ఇదియు ఘటికాద్రి నారసింహునకే కృతియైనట్లు స్పష్టముగాఁ గలదు. ఆ దేవరపేర షష్ట్యంతములును రచింపఁబడిన విందు. ఇదియు ద్విపద ప్రచురమైన కృతి.

2. నలచరిత్ర విష్ణుభక్త చరిత్రములం దీ గ్రంథ ప్రశంస లేదు. కాని వానిలోఁ గవి తన పితామహుని గురువుగా వాధూల గోత్ర

పవిత్రుఁడగు కందాళదొడ్డ యాచార్యుని గూర్చి చేసిన ప్రశంస యీ విప్రనారాయణ చరిత్రము నందును, గ్రంథాద్యంతములందు రెండుచోట్లను గలదు.

3. నల విప్రనారాయణ చరిత్రలు రెండింటను గ్రంథాంతమున దొడ్డ యాచార్యుల ప్రశంసగల ద్విపద పంక్తు లొక్కతీరుగా నున్నవి.

(వి. నా. చరిత్రమునఁ గొనకొఁ అవడినది)

"అనుచు నాధూల గోత్రాబ్ధి చంద్రుండు
చిరకీర్తిమంతుఁ డాశ్రిత హితోదయుఁడు
కరుణాపయోనిధి కందాళ దొడ్డ
యాచార్యులకు శిష్యుఁడైనట్టి వైష్ణ
నాచార తత్పరుఁ డతిదయా పరుఁడు"

— నలచరిత్ర.

"అలరవాధూల గోత్రాబ్ధి చంద్రుండు
చిరకీర్తివెలసి యాశ్రిత హితోదయుఁడు
కరుణాపయోనిధి కందాళ దొడ్డ
యాచార్యులకు శిష్యుఁడైనట్టి వైష్ణ
నాచార తత్ప ...."

— విప్రనారాయణ చరిత్ర.

4. మఱియొక విషయము:— గ్రంథస్థ నిదర్శనము - బల వత్తరమైనది. ఏకకర్తృకములగు కృతులయందే కోశమునలో కొంత రచనాసామ్య ముండుట సహజము. పై రెండు గ్రంథములనుండి యట్టి సామ్యమునుబట్టి యిచ్చు కొన్ని పంక్తులేర్చి చూపబడును.

నలచరిత్ర - పూర్వభాగము సందర్భము దమయంతీ స్వయం వరప్రుఁగై నేత :—

"తీరుగా మృగనాభి తిలకంబు దీర్చి
కోరి జవ్వాదితోఁ గూర్చిన మంచి
హారి చందనము మేన నందంద బూసి
కరమున వజ్రాల కడియముల్ బెట్టి
నీలంపు ముంగర నీటుగాఁబెట్టి
లాలితంబుగను బిళ్లలనూ లమర్చి"

విప్రనారాయణ చరిత్ర - సందర్భము దేవదేవి సింగారము (చూ. ప్రా. లి. ప్ర. భాం. ప్రతి అయిదవయాకు మొదటిప్రక్క) :—

"తీరుగా మృగనాభి తిలకంబు దీర్చి
కోరి జవ్వాదితోఁ గూర్చిన మంచి
అగలు గంధము మేన నలఁది సొంపొంద
మొగపులతీగె యిమ్ములఁ ధరియించి
నీలంపు ముంగర నీటుగఁబెట్టి
లాలితంబుగను బిళ్లల నూ లమర్చి
కరముల వజ్రాల కడియముల్ బెట్టి"

పై సందర్భములందుఁ బోలిక స్పష్టము. కాఁగా నలచరిత్ర కర్తయగు చక్రపురి రాఘవాచార్యుఁడే యీ విప్రనారాయణ చరిత్ర కును గర్తయని గ్రహింపనగును.

నలచరిత్ర విష్ణుభక్త చరిత్రములనుండి చక్రపురి రాఘవా చార్యుఁడు కందాళ దొడ్డ యాచార్యుని శిష్యుఁడైన చక్రపురి దొడ్డ యాచార్యుని పౌత్రుడనియు, నితనికి రంగన యను పెదతండ్రి గలఁ

డనియుఁ దెలియవచ్చినది. రాఘవాచార్యుఁడు విష్ణుభక్త చరిత్రావతారికలోఁ గందాళ దొడ్డయాచార్యునిఁ దన 'కులగురుం' డని ప్రశంసించి యుండెను. తన విప్రనారాయణ చరిత్ర గ్రంథారంభమునఁ గందాళ దొడ్డంగాచార్య నిట్లు సన్నుతించినాఁడు :—

"ఎనసి డెబ్బదినాల్గు సింహా - సనుల నందఱి వన్నెగాంచిన
యభినుతుండగు దొడ్డయార్యుల వినుతి సేతున్.
హెచ్చియుండిన పరమతంబుల నెల్ల ద్రుంచి ప్రఖ్యాతివడసిన
సచ్చరిత్రుఁడు దొడ్డయార్యుల సన్నుతింతున్"

దీనినిబట్టియు నతని కృతులు మూఁడింటను నీ దొడ్డయాచార్యుని ప్రశంస యుండుటను బట్టియు రాఘవాచార్యుని తాతయే కాక రాఘవాచార్యుఁడును గందాళ దొడ్డయాచార్యుని సమకాలికుఁడును, శిష్యుఁడునై యుండెనని యూహింపఁదగియున్నది. (తాత బ్రదికి యుండఁగా గ్రంథరచన చేసిన మనుమలు లేకపోలేదు. అదిగాక తాత గారి గురువు తాతకంటె వయసునఁబెద్ద కానక్కఱలేదు.

ఈ దొడ్డయాచార్యుని ప్రశంసయే కవికాల నిర్ణయమునకుఁ దోడ్పడుచున్నది. కవి తన కృతి త్రితయమును ఘటికాచల నరసింహ స్వామి కంకితముచేసియుండుట, మూఁడిటదొడ్డయాచార్యుని స్తుతించి యుండుటయుఁజూడ నీ దొడ్డయగారు ఘటికాచల మతాచార్యుఁడై యుండునని తోఁచుచున్నది. ఘటికాచల మఠాచార్యులలో దొడ్డయాచార్య నామధేయు లిద్దఱు ముగ్గు రుండిరట్లు కొన్ని శాసనాధారముల వలనఁ దెలియుచున్నది. రాఘవాచార్యుని విష్ణుభక్త చరిత్రావతారికలో నీదొడ్డయాచార్యుఁ డప్పళాచార్య సుతుఁడని పేర్కొనఁబడి యున్నది. ఆ యిరువురి పితాపుత్రసంబంధమును నిరూపించు నాధారములు లభించుటలేదు. కాని యిరువురిపేళ్లు నొక్కచోఁ గలిసి కట్టుగాఁ

గన్పట్టు శాసనమొక్కటి కలదు. అది తిరుపతి తిరుమల దేవస్థా
శాసన సంపుటములలో నైదవదానిలో 115 వ పుటలో నుదహరిం
బడినది. దాని నం. 47 ఎ. శాసన కాలము క్రీ. శ. 3-7-1545. ఆ
తాళ్ళపాక తిరుమలయ్యంగారి వనభోజనోత్సవవితరణకు సంబంధించిన
ఇందు స్వామిప్రసాద గృహీతులుగా ననేక వైష్ణవాచార్యులతోపా
కందాడై అప్పలాచార్యులు, దొడ్డయ్యంగారులును బేర్కొనఁబడి
ఆ పుటలోనే శాసనాంగ్లానువాదమున నాదొడ్డయ్యంగారిని గూ
"Doddayacharya, the famous religious teacher res
ding at Sholingar" అని యొక వక్కణ కుండలీకరింపఁ
యున్నది. షోలింగరనఁగాఁ జోళసింహపురము. అదే ఉత్తరార్కా
మండలమునను న్న నృసింహక్షేత్రమగు ఘటికాచలమునకు మరియొ
పేరు మాత్రము * ఈ దొడ్డయాచార్యులే చక్రపురి రాఘవాచార్య
కుల గురువు కాఁదగును. అనఁగా రాఘవాచార్యుఁడు క్రీ. శ. 154
ప్రాంతమువాఁడు కావచ్చుననుట (తెనాలి రామకృష్ణుని పాండురం
మాహాత్మ్యమునఁ గృతిపతియగు విరూరి వేదాద్రిమంత్రి గురువుగ
నొక కందాళ అప్పలాచార్యులు పేర్కొనఁబడినాఁడు. అతఁ
ఘటికాచల సంబంధమున కాధారమును, కవ్యుపజ్ఞమగు కృత్యాదియ
లభింపలేదు కాని యొక వేళ రామకృష్ణకవి ఘటికాచల మాహాత్మ్య
రచన కతని ప్రోత్సాహమే కారణమేమో! అతఁ డీదొడ్డయాచార్యుల
తండ్రియగునేమో! వైజయంతీ విలాసక ర్తయగు సారంగు తమ్మయ
యొకఁడు తనగురువు కందాళ యప్పగారని చెప్పినాఁడు. మరి యతఁడే
దొడ్డయాచార్యుని తండ్రి యగునో! ఆం. క. త. లెక్కప్రకారము
వైజయంతీవిలాసరచనాకాలము క్రీ. శ. 1510 ప్రాంతము. విప్రనారా

* Vide 'Topographical list of Inscriptions of Madras Presidency' By Sri V. Rangachari., Vol. II, Page 108-Foot note

యణచరిత్ర మితివృత్తముగాఁగలది యీప్రబంధము. కందాళప్పగురుని యాదేశప్రకార మది ప్రబంధముగా రచింపఁబడియుండ, దొడ్డయాచార్యు నాదేశ ప్రకారమే రాఘవాచార్యుఁ డాకథ నీ యక్షగానరూపమున వెలయించి యుండెనేమో! ఇవి యన్నియు నిర్ణయములుకావు. ఇప్పటి కూహలును బరిపగి విధముల విచికిత్సా కృతులును మాత్రము.

కందుకూరు రుద్రకవి "క్రీ. శ. 1568 ప్రాంతముల వాఁడేని కొంత తర్వాత వాఁడేని కాఁగలఁడు" అని కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారియభిప్రాయము. ఆయభిప్రాయముతో నాంధ్రకవి తరంగిణి కారులును నేకీభవించి యున్నారు. (చూ. సం. 10 పుట 160) అందుచే క్రీ. శ. 1545 ప్రాంతమువాఁడు కావచ్చునని యూహింపఁదగిన చక్రపురి రాఘవాచార్యుఁడు రుద్రకవి కొక్కించుక పూర్వుఁడై యుండిన నుండవచ్చును

రచనాప్రక్రియను బట్టియు రాఘవాచార్యుని విప్రనారాయణ చరిత్రయంత ప్రాచీనమైనదిగను గన్పట్టును. రుద్రకవి సుగ్రీవ విజయముతోఁ దగిన రచనాసామ్యము నిందు స్ఫుటముగాఁ జూపట్టును. ఉపలబ్ధ ప్రతిలో నీ గ్రంథము శ్రీ కారాదిగాలేదు కావున నొకయాకు పోయి యుండునని యూహింపఁదగి యున్నందునను సుగ్రీవవిజయము నందువలె నిందు ప్రారంభమునఁబద్యము గానరాదు. కాని యసలుండి యుండవచ్చును. తమపరి సుగ్రీవ విజయమున నొక త్రిపుటలోఁ గందుకూరి జనార్దనస్తుతి. ఇందును త్రిపుటలో దొడ్డయాచార్యుల స్తుతి ఆ వెనుకనే సు. వి. న "అని మరియు నద్దేవతా సార్వభౌమునకు షష్ట్యంతంబులు సెప్పెనట యెటువలెను" అని యున్నది. వి. నా. చ. నను 'అని మరిన్నీ ఘటికాద్రి నారసింహునకు షష్ట్యంతాలు చెప్పెనట యెటువలెను' అని యున్నది. రెండింటను షష్ట్యంతము లర్థచంద్రిక

లను నొక్క- గేయచ్ఛందస్సులోనే యున్నవి. అవి రెంటను బాద పాదమున వరుసగా దశావతార ప్రశంసాత్మకములుగనే యున్నవి.

ఉదా :-

" చదువులు దెచ్చిన జలచర పతికిన్
కుధరము మోచిన కూర్మంబునకున్ " మొ...

—సుగ్రీవ విజయము

" నలినజు చదువులు నిలిపిన హరికిన్
మూ పున కుధరము మోసిన హరికిన్ " మొ ..

—విప్రనారాయణ చరిత్రము.

వెంటనే " అంకితంబుగా నాయొనర్పంబూసిన సుగ్రీవ విజయం బను యక్షగానంబునకుం గథా క్రమంబెట్టిదనిన" అని సు. వి. ఎత్తు గడ. అట్లే " అంకితంబుగా నా యొనర్పంబూసిన విప్రనారాయణ చరిత్రంబను యక్షగానంబునకుఁ గథా క్రమంబెట్టిదనిన' అని వి.నా.చ. ఎత్తుగడ.

" అని సమస్తా సురారాతి కదంబ; వినమిత నిజభుజా విక్రము వేర " ఇత్యాదిగా సు.వి. గ్రంథాంత ద్విపద. " అని సర్వజీవదయాపరు వేర" అని ద్విపదలోనే వి. నా. చ. గ్రంథాంతమును. రచనలో రెండింట ద్విపదకును, జంపె, త్రిపుట మొదలగు తాళప్రథానము లగు రేకులకే ప్రాచుర్యము గలదు. ఎడనెడ, సంధివచనము లని వేర్కొన బడలేదు, కాని సంధి ప్రయోజనాత్మకములగు చిన్న చిన్న వచనములు, ఏలలు నర్థ చంద్రికలు ననుదేశీయ మధురకవితాచ్ఛందో విశేషములు నతి విరళముగాఁ బద్యములును రెండింటను బ్రయుక్తములై నవి. (కర్తృ) కాలము తెలియని యక్షగానముల ప్రాచీనత నూహించుటకీ రచనా

ప్రక్రియా వివేచన తోడ్పడఁగలదు) రచనా ప్రణాళికయే కాదు కావ్యాంతర స్పాయువులను స్పృశించి తత్స్వరూప స్వభావములను నిరూపించు శైలి మొదలగు విషయములుగూడ నీవిప్రనారాయణ చరిత్ర ప్రాచీనతను నిరూపింపఁగలవు.

దక్షిణ దేశమున వైష్ణవ మతప్రవర్తకులగు పన్నిద్దరాళ్వారు లలో నొకఁడగు విప్రనారాయణుని చరిత్ర మిందు వర్ణితము. అతనికథ రసిక ప్రశంసల నందినట్టిది. ప్రసిద్ధమైనది. అది యితివృత్తముగా ననేక రసవత్ప్రబంధములును యక్షగానములును తెనుఁగున వెలసినవి. ఈయక్షగానమున గ్రంథకర్త ప్రసిద్ధమగు నాకథలోఁ బ్రత్యేకముగాఁ గావించిన మార్పులులేవు. రాఘవాచార్యుల రచన సలక్షణముగా నున్నది. కాని యంత ప్రౌఢముగా లేదు.

---

3. కందుకూరు రుద్రకవి

సుగ్రీవ విజయము*

ఇతఁడు పెదలింగనార్య తనూజుఁడు. గురువరాచార్య శిష్యుఁడు. ఇతని నివాసము నెల్లూరుమండలమునందలి కందుకూరు. ఇతని యుదంతముగూర్చి మతభేదములు కొన్నిగలవు. కాని యితని కాలవిషయ

* ముద్రితము. ప్రచురణలు, (1) వేలూరి కుప్పుస్వామి మొదలారివారి ఆమెరికన్ డైమండుప్రెస్, మదరాసు, 1930 (2) కపిలేశ్వరపురం జమీందారుగారిచే కాకినాడ ముద్రణాలయమున 1939 లో వేటూరివారి పీఠికతోఁ బ్రకటితము.

మున సహేతుకమైన పరిష్కారము కుదిరినది. ఇతఁడు 'క్రీ. శ. 18
ప్రాంతములవాఁడేని, కొంతతర్వాతివాఁడేని కాఁగలఁడు' అని కీ.
వేటూరి ప్రభాకరశాస్త్రిగారి యభిప్రాయము. (చూ. సుగ్రీవ విజ
పీఠిక) ఆ యభిప్రాయముతో నేకీభవించినారు శ్రీ చాగ
శేషయ్యగారు. కొంతతర్వాతి వాఁడనఁగా నెంతోకాదు — "మొత్త
మీఁదఁ నితిఁడు బదునాఱవశతాబ్దియం దున్న వాఁడని స్పష్టప
చున్నది." (చూ. ఆం. క. త. సం. 10 — పుటలు 155 — 160)

ఇందలి కథ ప్రసిద్ధము. అపూర్వ కల్పనాంశము లిందులేకపో
నను నున్నంతలోఁ బ్రతిసన్ని వేశమునందును బాత్రస్వభావోన్మీలన వ
మాత్ర మనోజ్ఞముగా నిర్వహింపఁబడినది.

శ్రీరాముని సీతావిరహాక్లేశము, రామునితో నేల కొరగిన వా
వాదము, తారావిలాపఘట్టము, అంగదు నప్పగింత మొ. సందర్భవ
లిందులకు నిదర్శనములు. పాత్రల సంభాషణలు చక చక సాగినఁ
పలుకు నుడిగార ముట్టింపఁజూచున్నవి రచన కడు చక్కనిది. రసపౌష్ఠ
గ్యము సమృద్ధిగ గలదు. ఇది కవి సూచించినట్లు కరుణభాసురమైన దై
తాత్కాలికమైన శ్రీరాముని సీతా వియోగ దుఃఖముతోననఁగ
గరుణ విప్రలంభముతోఁ గథారంభము. శాశ్వతమైన భర్తృవియో
వేదనలోఁ బారస్థాయినందుకొన్న తారరోదనము గ్రంథాంత్యభాగము
ముఖ్యసన్ని వేశము. అనఁగా నిందు కరుణమంగిరసము. అంగముగ
వీరరసము సుప్రసక్తము (వాలి సుగ్రీవుల యుద్ధఘట్టమున). మనయక్ష
గాన వాఙ్మయప్రపంచమున నిదియొక ప్రశస్త కృతి:— (ఈ రుద్ర
కవి కృతియే తమిళమునను యక్షగానముగనే యనూదితమగుట గమ
నింపఁదగినది. చూ. ద్రా. లి. పు. భాం. తమిళగ్రంథములు నం. 509 —
511) దీని రచనా ప్రణాళిక యపుడే చక్రపురి రాఘవార్యుని విప్ర

నారాయణచరిత్రగూర్చి వ్రాయునప్పుడు తడవఁబడినది. ఇందలి రచనా విశేషములు :— త్రిపుట, జంపె, కుఱుచ జంపె, అటతాళము, ఏకతాళము మొ. తాళప్రధానములైన దరువులు * ధవళశోభనములు, ఏలలు అర్ధచంద్రికలు, (భిన్న గతులలో) మొ. దేశీగీతిచ్ఛందస్సులు, రెండువందలపైచిలుకు ద్విపదపంక్తులు, ఒక వృత్తము, రెండుసీసములు, ఒక కందము, మూఁడు గీతపద్యములు, సంధివచన ప్రాయములైన యల్పవచనములు. ఇది యక్షగాన మనియు య. గా. ప్రబంధ మనియుఁ బేరొక్కనఁ బడినది.

ఇది శ్రవ్యదృశ్యోభయ ప్రయోజనాత్మకమైనదని తోఁచును. ఇందలి పాత్రల సంభాషణలు వచనమున లేకపోవుటయు, నక్కడక్కడ నొక్క దరువులోనే లేక యొక్క ద్విపదలోనే పాత్రల సంభాషణముతోపాటు కథాకథనము నుండుట జూడ నిది గానరూప కథాఖ్యానమున కుద్దేశింపఁ బడినదా యనిపించును. కాని, పరిశీలించి చూచినచో నిది ప్రదర్శన సౌలభ్యమును గల రచనయని తోఁపక మానదు. పాత్రల సంభాషణములు వచనమున లేవన్నమాట కాని గ్రంథమున నాఖ్యాన శైలికంటె సంవాద శైలియే ప్రచురమైనది. సంభాషణ లెక్కువగా దరువులలో సాగినవి. నడుమ నక్కడక్కడ నున్న చిన్నచిన్న వచనములలోఁ గథాను సంధానమేసూత్రధారునివంటి ప్రదర్శన నిర్వాహకుని వలననో కావింపఁబడును.

ఈసందర్భమున వేటూరి వారి మాట యొకటి స్మరింపఁదగియున్నది. " ఈరుద్ర కవి సుగ్రీవ విజయమునగూడ స్త్రీ వృద్ధ పామరాదులు పలువురు పాడుచుందురు. ఆ యా పాత్రముల పాటలు తత్తద్వేషధారులువచ్చి పాడునట్లును తక్కిన సంధివచనాదులు ఒక్కరిద్దరు

* కొన్ని సు. వి. ప్రతులలో మాత్రము కొద్ది రాగసూచనలు గలవు.

సూత్రధారప్రాయులు పఠించునట్లును ఈసుగ్రీవ విజయము వీధి యాటగా నాడబడు చుండెడిది. (చూ. వారి సుగ్రీవ విజయపీఠిక) డాక్టరు శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారును నీ సుగ్రీవ విజయము తత్కృతిభర్తయగు కందుకూరి జనార్దనస్వామివారి వసంతోత్సవసమ యమునందు ప్రథమమునఁ బ్రదర్శింపఁబడి యుండుననుటకు సందియము లేదని సెలవిచ్చి యున్నారు. *

---

4. కంకంటి పాపరాజు

విష్ణుమాయావిలాసము:-♦

ఉత్తర రామాయణ రసోత్తర కావ్య రచనా విశ్రుతుఁడగు కంకంటి పాపారాజ ప్రధాని యొకచక్కని యక్షగానమునుగూడ రచించియుండుట రసికుల యదృష్టము. అదే విష్ణుమాయావిలాసము శృంగార రసాసవ పూర్ణ సువర్ణ చషకము.

అతఁడు నెల్లూరు మండలము నందలి క్రుళయ కావేరి (నేటిపులి కాట్) పట్టణమున నొకప్రభుత్వోద్యోగి. ఆశ్వేల నియోగి. ఆపస్తంబ సూత్రుఁడు. శ్రీవత్సగోత్రుఁడు, వల్లభామాత్యప్రపౌత్రుఁడు, అప్పయ

* చూ. వారి 'యక్షగానము – తంజావూరు' అనువ్యాసము. ఆంధ్రపత్రిక ఖర సంవత్సరాది సంచిక.

♦ ఇది యిటీవల తం. స. మ. కే. నం 495 ప్రతిని బట్టి డాక్టరు శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారిచేఁ బరిష్కరింపఁబడి, వారి పీఠికతో వావిళ్ళవారిచేఁ బ్రకటిత మైనది. — మదరాసు 1956.

నరసమాత్యుఁడు బుత్రుఁడు, సమీర కుమార విజయ ప్రబంధకర్తయగు పుష్పగిరి తిమ్మనార్యుని మిత్రుఁడు. మదన గోపాలస్వామి భక్తుఁడు. ఆ స్వామి కే తన కృతిద్వితయము నంకిత మిచ్చినాఁడు. ఈవిషయములెల్ల నతని కృతుల నుండియే యెఱుకపడుచున్నవి. అవియటుండ ముందు ముఖ్యముగాఁ జూడఁదగిన దతని కాలవిషయము :

ఈవిషయమున నిప్పటి దనుక మనకు కీ. శే. వీరేశలింగముగారి మాటయే ప్రమాణము. "ఈతఁడు క్రీ. శ. 1790 ప్రాంతమున నుండు నట్లు చెప్పుచున్నారు. కవి యిప్పటికి నూఱుసంవత్సరముల క్రిందట నుండినవాఁడు" అని వారి కవుల చరిత్ర. ఆమాటయే నేఁటి దనుక పరంపరగా వాఙ్మయ పరిశోధకులచేతను విశ్వసింపఁబడుచు వచ్చు చున్న ది. అందులకుఁదగిన యాధారములేదు. కవికాల నిర్ణయమున కిటీవల ప్రబలమగు నాధార మొక్కటి కన్పట్టినది. మదరాసు ప్రభుత్వ ప్రా. లి. పు. భాం. న కంకంటి పాపరాజు నుత్తర రామాయణప్రతులనే కము గలవు. అందు డి. నం. 9 తాళ పత్రప్రతి యతిశిథిలమై, కడుప్రాచీన ముగఁ, గన్పట్టును. దాని చివర "ప్రజోత్పత్తి నామసంవత్సరపుష్య బహుళ ఏకాదశిలు, మందవారం వరకు మునగాల తిరువెంగళయ్య వ్రాసిన ఉత్తర రామాయణము సంపూర్ణము" అని కలదు. ఇది స్వామి కన్నుపిళ్లైగారి "ఇండియన్ ఎఫిమెరిస్" ప్రకారము క్రీ.శ. 7-1-1632 తేదికి మాత్రము సరిపోయినది. శక సంవత్సర సంఖ్య చెప్పఁ బడనప్పు డా క్రీస్తుశకపు తేదీ నిర్ణయించుటకు సంవత్సర మాసపక్ష తిథులతోపాటు విధిగా వారముగూడ చెప్పఁబడినప్పుడే యది పొసఁగును. మన సంవత్సరచక్రము మఱలమఱల నావృత్తమగుచునే యుండును. ఆమాసము లాపక్షము లాతిథులే యథాపూర్వము సంభవించును. వానితోపాటు వార నిర్దేశమైనచో నవి యన్నియుఁ గుదిరిన తేదీ

మఱుల మఱుల సంభవించుట కాదాచిత్కము. కాని కేవల మసంభవ మని తలఁపరాదు. ఒక్కొక్కపుడు మూఁడు నాలుగావృత్తులకే యట్టిది సంభవింపవచ్చును. కాని ప్రస్తుత సందర్భమున క్రీ. శ. 1652 తరువాత మఱుల నట్టిది తటస్థింపలేదు. అందుచే మన మా తేదీని ప్రమాణముగా గ్రహింపవచ్చును. అయితే యది ప్రతి విలేఖన కాలము మాత్రము. గ్రంథకర్త యంతకుఁ బూర్వుఁడు గావలెను. ఎంతపూర్వుఁ డది ప్రకృత ముదయించు ప్రశ్న. తత్సమాధానమున కొక ద్రావిడ ప్రాణాయామమును బట్టవలెను.

పాపరాజు పుష్పగిరి తిమ్మకవిని దన యాప్తసఖునిగా స్వీయ కృతులు రెండింటను స్మరించియున్నాఁడు. ఆ పుష్పగిరి తిమ్మకవి తేకు మళ్ళ రంగశాయికవి కతని ద్విపద భాగవతరచనలోఁ దోడ్పడినట్లుఁదు జెప్పఁబడినాఁడు అనఁగా పాపరాజు, పుష్పగిరి తిమ్మన, రంగ శాయి కవులు ముగ్గురును సమకాలికు లగుట సునిశ్చితము. ముగ్గు రును నెల్లూరుమండలమువారు. రంగశాయి తన ద్విపద భాగవతమున ద్విపద భారత కవిత్రయములోఁ బ్రథముఁడగు "బట్టేపాటి తిరుమల భట్టుగారి ప్రోక్తులు గలుగ స్మరించి" నాఁడు. బట్టేపాటి తిరుమల భట్టు, తిమ్మకవి యన్నను నతఁడే (తిరుమల శబ్దభవమే తిమ్మ), తన ద్విపదభారత విరాటపర్వమును జంగాల ముమ్మయకుఁ గృతి యిచ్చెను.[2] జంగాల ముమ్మయ యల్లూఁడైన పాలచూరి కృష్ణభూపాలుఁడు తెనాలి రామభద్రకవి విరచితమైన యిందుమతీ పరిణయమునకుఁ గృతి భర్త. ఈ రామభద్రకవి తెనాలిరామకృష్ణకవికిఁ దమ్మునిమనుఁమఁడు.

1. అముద్రితము. చూ. ప్రా. లి. భాం. ప్రతి ఆర్. సం. 765.
2. ఆంధ్ర విశ్వకళా పరిషత్ప్రకాశితము.
3. ఇం. ప. అముద్రితము. తం. స. మ. కే. సం. 138.

"రామభద్రకవి క్రీ. శ. 1575 ప్రాంతమున నీ యిందుమతీపరిణయమును రచించియుండునని తోఁచుచున్న" దని శ్రీచాగంటివారు.[1] కా.గా రామభద్రకవి కృతిభర్తకు పిల్లనిచ్చిన మామగారగు జంగాల మున్మయయు నతనికిఁ గృతియిచ్చిన బట్టేపాటి తిమ్మయయు క్రీ. శ. 1575 ప్రాంతమున నుండియుందురనుట యనుచితము గాదు. తీగెతీసిన డొంకయంతయుఁగదలినది. నలుగురై దుగురుకవుల కాలములు తెలియవచ్చినవి. ఇంతకును దేలిన దేమనగా, నటు బట్టేపాటి తిమ్మయ కాలమునకును నిటు ప్రా. లి. పు. భాం. డి నం. 9. ఉత్తర రామాయణ పతి విలేఖిన కాలమునకును ననఁగా క్రీ. శ. 1575—1632 సం. లకు నడుమ కంకంటి పాపరాజు, పుష్పగిరి తిమ్మకవి, తేకుమళ్ళ రంగయశాయి కవులుండి యుందురనుట పిండితార్థము. * ఆనడుమ నెపుడో పాపరాజు విష్ణుమాయా విలాసరచన జరిగియుండును. అది బహుశా కొంచె మిటు నటుగా క్రీ. శ. 1600 ప్రాంతము కావచ్చును.

పాపరాజు తన వి. మా. వి. యక్షగాన రచనగురించి తదుపరి రచనయగు నుత్తర రామాయణ గ్రంథావతారి కాశ్వాసాంతగద్యలందు సగర్వముగాఁ బ్రకటించుకొనినాడు.

---

1. అం. క. త. సం 10 — పుట 53.

* నా యీ కవికాల నిర్ణయమును డాక్టరు శ్రీ వేలటూరి వెంకటరమణయ్యగారామోదించి యున్నారు. చూ. వారి వి. మా. వి. పీఠిక.

కొందఱప్పకవి పాపరాజాదులను బేరొక్కనలేదను కారణమున వారి పూర్వకాలి కత్వమును శంకింపఁజూతురు. అప్పకవి పేరొక్కనని తత్పూర్వకవుల సంఖ్య రెండువందలకుఁ బైఁబడిగలదు. అందుచే నాపూర్వకవుల కాలనిర్ణయవిషయమున నున్నంతలో నదియొక యాధారమగును గాని లేనివిషయముల నదియొక సాకుగారాదు.

ఇందలి యితి వృత్తము క్షీరసాగర మథన కథ కవ్వాలి జగన్మో హిని వృత్తాంతము.[1] కథ కడు ప్రసిద్ధము. రసవంతము నైనది. ఆ యొక్క చిన్న సన్నివేశమును గ్రహించి దానిని రసప్రకృష్టముగాఁ బ్రపంచించి కంకంటికవి తీర్చినతీర్పులో నెల్లూరినెఱజాణ నేర్పంతయుఁ గన్పట్టినది. ఉత్తరరామాయణమున నున్నంత ప్రబంధశైలీ ప్రాగల్భ్యము లేకున్నను నిందు మధుర పదప్రచురమైన రసోచిత రచనగలదు. పలుతెఱఁగుల తెలుఁగు నుడికార మొట్టిపడుచున్నది. చతురాతి చతుర మైన భావప్రౌఢి గలదు.

ఇందు రకరకముల పదములు, దరువులు రాగ తాళ ధారాళములై నవి కలవు. ఏకతాళ, జంపె, కుఱుచ జంపె, త్రిపుట, రచ్చ తాళం, ఆది, అటమట్టెం లఘు శేఖరము మొ. తాళ ప్రధానములైన దరువులే యెక్కువ. ఏలలు, అర్ధచంద్రికలు, ధవళ శోభనములు, నడలు త్రిస్థబకము మొ. అనేక దేశి మధుర కవితారచనలు గలవు. అవియుఁ జాల మట్టునకుఁ దాళప్రధానము లైనవే. నీలాంబరి, ఘంటారవ, ఆహిరి, రేగుప్తి మొ. రాగముల పేళ్ళతోఁ గొన్ని పదములు గన్పట్టును గాని గతిలో నవియుఁ దాళ ప్రధానములుగనే నడచినవి. రాగ ప్రాధాన్యముగల పాటలును గలవు. అవి వసంత తిలకము, నాధరామ క్రియ, మధ్యమావతి, పంతువరాళి, మొ. రాగములలోఁ గలవు. వానికిఁ దాళము లుదాహరింపఁబడలేదు. అవి పదములని పేర్కొనఁబడ లేదు. ఇందింకను బలుపద్యములు, ద్విపదలు, లయగ్రాహి, అష్టకము, సం. చూర్ణిక, శ్లోకములును గలవు. వచనము పరిమితముగా సంధివచన

1. ఆంధ్రమున విష్ణుమాయా విలాసాఖ్య నానకృతు లింకను గలవు. వాని పరస్పర సంబంధములనుగూర్చిన విచారణ శ్రీ వెంకట రమణయ్యగారి వి. మా. వి. పీఠికలో జూడఁదగును.

ప్రాముఖ్యముగా నున్నది. కాని చరిత్రలలోఁ బాత్రల నడుమఁ గమ్మని సంభాషణలు గ్రుమ్మరించినాఁడు కవి. సన్నివేశమునకుఁ దగిన పద ప్రభేదము నెన్నుకొనుటలో గడుసరి పోకడలు పోయినాఁడు. 'చెవులకుఁ జవులుగ జెప్పెద మోహిని, యవతారము తెఱఁగని' శుకుఁడు పరీక్షిత్తుతో నన్నాఁడని యున్నది యెత్తుగడలో. అది పాపరాజు రచన యెడను సార్థకము. రుద్రకవి రచనా ముద్ర దీనిపై లేకపోలేదు. ఇదియు నతని సుగ్రీవ విజయమువలె శ్రవ్యదృశ్యోభయ ప్రయోజనాత్మకమైనదే. ఇది యక్షగాన మని పేర్కొనఁబడినది. "భూమిని దిలకించి బుధు లెల్ల పొగడ" నిది విభాసిల్లునని కవి యాశయము.

---

5. తేకుమళ్ళ రంగశాయి

జ్ఞానకీపరిణయము:

ఇతఁడొక నెల్లూరు మండలకవి. ఇతని కృతులని సునిశ్చితముగాఁ దెలిసినవి రెండు లభించినవి. అందొకటి వాణీ విలాస వనమాలిక[1] మరి యొకటి ద్విపద భాగవతము[2] మొదటిది "బహు ప్రబంధకర్త" యైన మహాంకాళి వెంకటపతి తోడ్పాటు వలనను, రెండవది పుష్పగిరి తిమ్మకవి తోడ్పాటు తోడను రచింపఁబడినవని యందుఁ గలదు. పుష్పగిరి తిమ్మకవి కంకంటి పాపరాజునకువలె నితనికి సహాశ్రోత యఁట. అనఁగా సీనలుగురు కవులును సమకాలికు లగుచున్నారు. పాపరాజు

1. ప్రా. లి. పు. భాం. వారిచేఁ బ్రచురితము
2. ప్రా. లి. పు. భాం., ఆర్. నం. 765.

కాలముతోపాటి రంగశాయి కవి కాలముకూడ క్రీ. శ. 1575–1632 ప్రాంతమునిమీఁదనిర్ణయింపఁబడియున్నది. రంగశాయి శ్రీవత్ససగోత్రుడనియుఁ, దిమ్మాంబికా కప్పరామాత్యుల పుత్రుఁడనియు, రామభద్రాస్యుని శిష్యుఁడనియు నతని గ్రంథముల వలనఁ దెలిసినది. అందితని కృత్యంతరములును బేరొక్కనఁబడినవి. అవి తిరువళ్ళూరు వీరరాఘవ శతకము, కృష్ణదండకము, జానకీ పరిణయ యక్షగానము. తాను 'జానకీ పరిణయ యక్షగానమును' రచించి యుండినట్లు పై రెండు గ్రంథములందును జెప్పినాఁడితఁడు. కాని యీ శతక దండకములు గాని యీయక్షగానము గాని నేఁడు లభించుట లేదు. ఇప్పటి దనుక రంగశాయి చరిత్ర మన కవిచరిత్ర గ్రంథములకెక్కలేదు. ఇతఁడు నొక యక్షగాన కర్తయని తెలియవచ్చుటచే నిటఁ బ్రస క్తమైనది.

---

6. బాలపాపాంబ

అక్కమహాదేవిచరిత: *

ఈమెయే ప్రప్రథమాంధ్ర యక్షగాన కవయిత్రిగా నూహింపఁబడుచున్నది. ఈమె తన తండ్రి "వీరవసంత వసుమతీశుఁ" డని చెప్పినది. వీరవసంతరాయఁడను వానికి సంబంధించిన శాసనములు కొన్ని గలవు.

1. తాళమంగలము శాసనము :— కాలము క్రీ. శ. 1567. (19 of 1900, M. E. R. 1900, P. 31, Sewell I. P. 200) —ఇందు వీర వసంతరాయఁడు సింహళమును జయించినట్లు గలదు.

---

*ప్రా. లి. పు. భాం. డి. నం. 1834, 1835.

2. మఱియొక తార మంగలము శాసనము —కాలము క్రీ. శ. 1568 (సేలంజిల్లా, ఓమలూరుతాలూకా :— S. No. 122 of Vol. I of the Topographical list of Inscriptions of the Madras Presidency).

వీర వసంతరాయుఁడు ఇళవసముద్రమను గ్రామమును తార మంగలములోని కైలాసనాథ — ఇళ మీశ్వర దేవాయ తనముల కిచ్చి నట్లున్న ది.

3. మైలం పట్టిశాసనము :— కాలము క్రీ. శ. 1587 (కోయం బత్తూరు జిల్లా, పోలాకితాలూకా, S. No. 379 of Vol. I, Ibid) ఇదివీరవసంతరాయని ప్రధానియొక్క శాసనము.

పైమూఁడు నొక్కనికి సంబంధించినవే కావచ్చును. అతఁడు విజయనగర రాజుల క్రిందఁగాని మధుర నాయకుల క్రిందగాని యొక సేనానియో పాళెగాఁడో యై యుండునని తోఁచుచున్న ది. పై శాసన ములలో రెండవదానిని బట్టి యతఁడు శివభక్తిపరుఁడని తెల్లము. పాపాంబ శివభక్తురాలని యామె గ్రంథమే చెప్పక చెప్పుచున్న ది. కాని యింకను నితరాధారము లరసి యీ వీరవసంతుఁడే పాపాంబ తండ్రియని స్థాపింపఁగలిగిననాఁడే యామె పదునాఱవశతాబ్ది యుత్తరార్ధమునకుఁజెందినదని నిర్ణయింపవలెను. సుగ్రీవ విజయ సంవాదిగా నున్న యీమె గ్రంథరచనాప్రక్రియ యొకటి తత్ప్రాచీనతను సూచింపఁ గలదు. ఇప్పటివఱ్ఱున కీగ్రంథరచనా కాలము క్రీ. శ. 16 వ శతాబ్ది యుత్తరార్ధముగా నూహింపఁబడుచున్న ది.

ఈ పాపాంబ కృతి అక్కమహాదేవి చరిత్రకే అక్కమహాదేవి బోధోల్లాసమనియుఁ బేరు. అక్కమహాదేవి వీరశైవమత ప్రవర్తకు లగు బసవేశ్వరునకు, నల్లమ ప్రభువునకును సమకాలికయైన మహాభక్తు రాలు. ఆమె కథ ప్రభులింగ లీలలలోఁ గొంత గలదు. పాపాంబ

కృతిలో నామె కథ యేమనగా :— పార్వతీదేవి యొకపరి శివునితోఁ బంతము పట్టి యల్లమ ప్రభునిఁ దన మాయకు దాసునిఁజేయఁ బ్రయత్నించి యది కుదురక శివు ననుమతమునఁ దన సాత్త్విక తేజమున భూలోకమున అక్కమహాదేవి నవతరింపఁ జేసినది. ఆమె ఉమతడి పురాధీశుఁడైన వివులుని పుత్రియైనది. ఒక యూనవెట్టి జైన నృపాలు నొకనిఁ జేపట్టినది. కాని యతఁ డామె కభీష్టమగు లింగధారణము జేయ నిరాకరించెను. అంతట నామె యోగావేశమెత్తి తల విరియఁబోసి కొని నగ్నముగా నగరు వెడలి చర చర పుర వీధులు గడచి యడవులఁ బడి కొండలు కోనలు నడచి కళ్యాణపురి చేరి యట ననుభవ మంట పాభ్యంతరమునఁ గొలువు దీరియున్న అల్లమ ప్రభువుని దర్శించి, యతని కఠిన పరీక్ష కాగి యతని వలన యోగ రహస్యము దెలిసి శివుని గూర్చి తపము సేయ శ్రీగిరి కరిగెను. పార్వతి తన పంతము విడిచెను.

పాపాంబ "సంగీత సాహిత్య సరసలక్షణాల రంగు మీఱిన యట్టి రమణి" యఁట. ఈ కృతిలో జంపె, అట, ఏక, త్రిపుట, రచ్చ కేకులు మొ. తాళప్రధానములైన దరువులు, ద్విపదలు, వచనములు, కందాది పద్యములు, అర్ధచంద్రికలు, జోలలు, శోభనములు, మంగళ హారతులును గలవు. రచన :— చక్కనిది. కవయిత్రికి వర్ణన లన్నఁగడు ప్రీతి. కైలాసము, ఉమతడి కల్యాణపుర వర్ణనలు, అక్కమ శైశవము, సూర్యాస్తమయ చంద్రోదయము మొ॥ సందర్భములు చక్కగా వర్ణింపఁబడినది. కథా కథనమును జక్కగా నిర్వహింపఁబడినది. పార్వతీ పరమేశ్వరుల పందెపు సంవాదములు, అక్కదేవి మహాప్రస్థానము మొ. సందర్భము లందు యథాశక్తిఁ దన విదగ్ధతను బ్రదర్శించినది. పాపాంబ దీనిని యక్షగానమని పేర్కొన్నది. తననాఁటి కనేక యక్షగానములు వెలసినట్లు సూచించినది.

---

7. క్రొంజవెంకటాద్రి

వాసంతికాపరిణయము: *

ఈ కవి నివాసము "శ్రీమించు కర్ణాట సింహాసనంబునఁ బరగి యహోబల ప్రాంతమునను జెలఁగి —, తొరగంటి నరస రాజేంద్ర దత్తమగుచు వెలయు — గుళదూర్తి యగ్రహార" మని యీవాసంతికా పరిణయమునఁ గలదు. ఇది కర్నూలుజిల్లా కోయిలకుంట్ల తాలుకాలో నున్నది. ఈ యగ్రహార ప్రదాత తొరగంటి నరసరాజనఁగా బట్టు మూర్తి నరస భూపాలీయ కృతిపతియుఁ దొరగంటి దుర్గాధ్యక్షుఁడు నళియరామ రాయాచులకు మేనల్లుఁడును, తిరుమల రాయల కల్లుఁడు నగు పోచిరాజు నరసరాజు. నరస భూపాలీయావతారికలో రామ రాయ తిరుమలరాయల ప్రశంస గూడఁ బ్రత్యేకముగాఁ గలదు. దానిని బట్టి నరస భూపాలీయ గ్రంథ ప్రాదుర్భవము నాటికిఁ దిరుమల రాయ లింకను బట్టాభిషిక్తుఁడు గాలేదనియుఁ గర్ణాట సామ్రాజ్యము చెక్కు చెదరక రామరాజు నేల్బడి లోనే యుండిన దనియు స్పష్టమగు చున్నది. క్రీ. శ. 1565 సం. లో రక్కస తంగిడి యుద్ధమున రామ రాజు నిహతుఁ డగుటయుఁ గర్ణాటరాజ్య క్షీణ దశారంభ మగు టయుఁ బిదప తిరుమలరాయలు గద్దె నెక్కుటయు జరిగినవి. అనఁగా నరస భూపాలీయమునఁ దొరగంటి దుర్గాధ్యక్షుఁడుగాఁ బ్రశంసితుఁ డైన నరసరాజు రామరాజు కాలమునసే యనఁగా క్రీ. శ. 1560 ప్రాంతమునసే యీ పదవియందుండెననుట స్పష్టము. ఒక దుర్గాధ్యక్ష మాత్రునిచే గత్తమైన యొక యూరి కతని పేరుపెట్టఁబడి యుండినచో నది యీపేర నెంతకాలమైనను వ్యవహృతము గావచ్చు కాని దాతృ

* తం. స. మ. కే. నం. 494.

నామము గ్రామనామము వేఱైన యపుడా దాతృ నామము సాధారణముగ నాదాతతో పాటో యాదాతకు సంబంధించిన యధికార మంతరించుటతో పాటో విస్మృతమగు నవకాశము గలదు. ఇట్లు కాక వెంకటాద్రి కవి తన గ్రంథమునఁ బ్రత్యేకముగాఁ దమ గుళ్ళ దూర్తి గూర్చి తొరగంటి నరసరాజ దాతృత్వ ప్రశంసను జేసి యుండుటఁ జూడ నానాఁటికి నరసరాజధికారమున నుండెనేమో యను శంక వొడముచున్నది. అదికాక కవికర్ణాట సింహాసనపు టుచ్చస్థితిని గూడ సూచించి యున్నాఁడు. గ్రంథరచనయుఁ బ్రాచీనతను సూచించు చున్నది. ఈ గ్రంథమును గూర్చి డాక్టరు శ్రీ నేలటూరి వెంకట రమణయ్య గారు 'ఇది యహోబల క్షేత్రమునకు సంబంధించిన కథయై యుండునేమొ. క్రీ. శ. 16 శతాబ్దపు టుత్తరార్ధమున నహోబల మఠాధి పతి యగు శఠగోప జీయరను విద్వద్వతంసుఁడు వాసంతికా పరిణయమను సంస్కృత నాటకమును రచించెను. ఆ కథనే యహోబల ప్రాంతము వాఁడైన వెంకటాద్రి యక్ష గానము గావించెనేమొ' యని ప్రాసియున్నారు. * ఇది వా రూహించినట్లచ్చముగా నహోబలక్షేత్ర గాథయే. ఆ నరసింహస్వామియే యిందలి నాయకుఁడు. చెంచెతయగు వాసంతిక నాయిక. ఆ యహోబల మఠాధిపతి ప్రాసిన వాసంతికా పరిణయ నాటకేతి వృత్తము నిదేకావచ్చునను నేలటూరి వారి యీ యూహయు నిక్కమై యుండును. ఆ యీ కారణములచే వెంకటాద్రి కృతి రచనము క్రీ.శ. 16 వ శతాబ్ది యుత్తరార్ధమున జరిగి

* చూ. వారివ్యాసము ఆంధ్ర పత్రిక ఖర సంవత్సరాది సంచికపుట 23.

ఆ శఠగోప జీయరు 16 వ శతాబ్ది యుత్తరార్ధమునందుండెననియు, నతఁడు వాసంతికా పరిణయమను సంస్కృత నాటకము ప్రాసెననియు యస్. కృష్ణస్వామిఅయ్యంగారి "Sources of the Vijayanagar History" 233 వ పుటలోఁ గలదు.

యుండు ననవచ్చును. (ఇది యిప్పటి కూహామాత్రము, నిర్ణయాధికారము భావి పరిశోధకులది)

ఈ వెంకటాద్రికవి "క్రొండవంశాయతుండు". ఈ వంశకర్త తిరుమలార్యుఁడఁట. లింగాంబికయుఁ గొండుభట్లు నీతని తలిదండ్రులు. సింగిరిభట్లు, కొండుభట్లు నను వారలతని పితామహ ప్రపితామహులు. కవి "సకల లక్షణ లక్ష్య మర్మ విశారదుఁడు", "సాహిత్య విద్యా ప్రచండుఁడు", "సరస గానకళా ప్రవీణుఁడు" నఁట.

అహోబల నరసింహస్వామి వాసంతిక (వసంతస్య పుత్రీ) యను చెంచెతను బెండ్లియాడిన కథ యిందు వర్ణితము. ప్రసిద్ధమైన గరుడాచల నాటకము లేక చెంచు నాటకమను దానిలో నిదే యితి వృత్తము. ఇందలి రచన సరసముగా సాగినది. ఇందు ధవళ శోభనములు. సువ్వాల, ఏలలు, త్రిభంగులు, అష్టకము మొ. మధుర కవితారచనలు, జంపె, త్రిపుట మొ. తాళ ప్రధానము లైన దరువులు, దీర్ఘద్విపదలు, వచనములు, నెడనెడ కందములును గలవు. ద్విపద వచనములందుఁ గథాకథనము, దరువు లందుఁ బాత్ర ప్రవేశ సంభాషణములు నెక్కువగా సుద్దిష్టములు. ఇది యక్షగానమని పేర్కొనఁబడినది.

---

8. పరమానందతీర్థయతి

ముక్తికాంతాపరిణయము: *

పరమానంద యతికృతముగాఁ దోమ్మిది (అద్వైత) తత్వ ప్రతిపాదకములైన గ్రంథములు గన్పట్టుచున్నవి.[1] అందు వచన ద్విపద కావ్యములు, పద్య శతకములు, నొక యక్ష గానప్రాయ రచనయుఁ గలవు. పరమానంద యతి తన గ్రంథములందు దత్తాత్రేయ యోగి నొకనిఁదన గురువుగా సంభావించెను. నెల్లూరు సమీపమున నొక దత్తాత్రేయ మఠముండెడిదని యొక నెల్లూరు మండల శిలా శాసనము వలనఁ దెలియుచున్నదనియు, నాదత్తాత్రేయ యోగి మహా విద్వాంసుఁడనియు, నతని మఠము నాశ్రయించి (మత విషయిక) గ్రంథ కర్తలనేకులు బయల్వెడలిరనియు, చంద్రభాను చరిత్ర కర్తయు, క్రీ. శ. 1586–1613 వఱకు కర్ణాట రాజ్యము నేలిన వెంకట పతి రాయల యాస్థాన కవియు నగు తరిగొప్పుల మల్లనకవి తాను దత్తాత్రేయ యోగి శిష్యుఁడైనట్లు చెప్పుకొనియుండుటచే దత్తాత్రేయయోగియు నాతని శిష్య ప్రశిష్యులును 16 వ శతాబ్ది యుత్తరార్ధము నందుండిరని నిశ్చయించుటకు సంశయింప నవసర ముండదనియు శ్రీ చాగంటి శేషయ్యగారనుచున్నారు.[2] పరమానంద యతి కాలము క్రీ. శ. 1600 ప్రాంతమని యూహింప నగును.

---

* తం. స. మ. కే. నం. 557 — 558.

1 చూ. ఆం. క. త. — సం. 10 పుట 178.

2 ఆంధ్ర కవి తరంగిణి — సం. 10. పు. 182, 183.

(శిష్యుల వలన విశేష యశస్సు నార్జించిన పరమానందయ్య యనుయోగి యితఁడగునో!)

ఇతని యక్షగానప్రాయరచన ముక్తికాంతాపరిణయము ఇందును "... మర్త్య దత్తాత్రేయ మహానికి జేజే" యని గురుని స్మరించి యున్నాఁడు. ఇతఁడు దీనిని యక్ష గానమనక "కర మొప్ప వరము క్తి కాంతా వివాహ, మరు దారఁబదచాళి కమరఁజెప్పెదను" అని యుండెను. పదచాళిక లేక పదకేళిక యనఁగా నొకపదమును బాడుచుఁ బదోద్దిష్టమైన రసము నభినయ రూపమున నావిష్కరించుట (పదకేళిక లాంధ్ర దేశమునఁ జాలకాలమునుండి సాగుచుండినను దంజా వూరు నాయక రాజాస్థానమున ముఖ్యముగా రఘునాథనాయకుని కాలమునుండి వాని ప్రతిష్ఠ వెల్లి విరిసినది. పదచాళి శబ్దమునకుఁ బ్రచార మచ్చటినుండియే హెచ్చుగా సాగినట్లు తోఁచును.)

పదచాళి యనఁబడిన యీ గ్రంథమునందు నాలుగైదు చోట్ల నొక పాటి పొడవైన ద్విపదలు గలవు. కాని గ్రంథ మంతయు నొక దరువు నొక వచనము చొప్పున నడచునని స్థూల ముగాఁజెప్పవచ్చును. దరువులకు రాగ తాళముల పేళ్ళుదాహరింపఁ బడలేదు. ఇది యక్షగాన ప్రాయమైన రచనా ఫక్కికయే యగుటచే దీని కిటఁ బ్రస క్తి కల్గినది. గ్రంథవిషయము :— సచ్చిదానంద పురా ధీశ్వరుఁడు తన పుత్రిక యగు మోక్ష కన్యకు స్వయంవరము చాటిం చును. వివిధ మతాధిపతు లను దేశాధీశులు విచ్చేయుదురు. ఒక్కొ క్కరి నొక్కొక్క నెపమున నొప్పరికించి మోక్ష కాంత సద్గురుఁడే దైవమని విశ్వసించు వేదాంతమతస్థుఁడగు 'వివేక జీవేశ్వరుని' వరిం చుట యిందలి ప్రధాన విషయము.

ఇందలి విషయము కొంత వట్టు సాంకేతికముగా సాగినను బెండ్లి వేడుకలు మొదలగు సాధారణ విషయములును సరసముగా వర్ణింపఁ

బడినవి. శైలి సరళమైనది. అటనడ దొసఁగు లున్నను మొత్తము పై రచన చక్కనిదనియే చెప్పవచ్చును.

---

9. రామబ్రహ్మయోగి

ఎఱుక :– *

ఇది 'రామ బ్రహ్మయోగి విరచిత సుజ్ఞాన పెఱుక యను యక్షగానం' బని యున్నది. గద్యలో 'ఎఱుక' యను వేదాంత గ్రంథమని యెత్తుగడ. ఈ గ్రంథకర్త గురువు పేరు కూడ రామ బ్రహ్మమే. గ్రంథమునఁ బలుతావుల నతని ప్రశంస గలదు. అతనికే యంకిత మిది. తాళ ప్రధానములైన దరువులు కలిగి యిందలి రచన ప్రాచీన యక్ష గాన ఫక్కికి సన్నిహితముగా నున్నది. ఇప్పటికిఁదెలియ వచ్చి నంతలో రామ బ్రహ్మ గురుఁడొకఁడు గలఁడు. అతఁడాంధ్ర భగ వద్గీతలను గ్రంథము రచించిన కంభముపాటి నారపామాత్యునకును గురువు. నారప "క్రీ. శ. 16 శ. ఉత్తరార్ధమునను న్న వాఁడని నిర్ణ యింప వచ్చునని" యాంధ్ర కవి తరంగిణిలోఁ గలదు. (సం. 10 – పుట 198) అందుచే నిప్పటి మట్టునకీ రామబ్రహ్మ యోగి కూడ నాకాలము వాఁడని యూహింపఁబడుచున్నాఁడు. (ఈ రామ బ్రహ్మ యోగి, నారప – ఇరువురు నద్వైతవాదులే)

---

* 'ఆత్మ యెఱుక' అను పేర నిది ద్వివారము ముద్రితమైనది.

1. శ్రీరాజరాజేశ్వరీ నికేతన ము. శా. మదరాసు, 1902.

2. శశిరేఖా ము. శా. మదరాసు, 1912. (ఇందు కర్తపేరు లేదు, గంథాంత గద్య లొఁబడినది)

'ప్రతిలేని నిర్గుణుని బతిగాను మతిగోరిన' బుద్ధికాంతకడ కెఱుక యను నెఱుకత వచ్చి కొంత వేదాంత గోష్ఠి నెఱపుట యిందలి ముఖ్య విషయము. విషయక్లిష్టత నుజ్జగించి యుదాత్తతను బాటించి రచనయు నట్ల నడపినాఁడు కవి. జంపె, కుఱుచ జంపె, ఆది, ఏక, అట, త్రిపుటలలోనే దరువులు, ద్విపదలు, పద్యములు, ఏల, చూర్ణికయను నవి యిందలి రచనా విశేషములు. ద్విపదలలోఁ బ్రాస యతి పాటింపఁ బడినది. దరువులలో శబ్దముల ననవసరముగా సాగదీయుటలు లేవు.

---

10. ఎలకూచి బాలసరస్వతి

రంగకౌముది :–

ఇతఁడు సుప్రసిద్ధుఁడు. క్రీ. శ. 1600 ప్రాంతము నందుండిన వాఁడు * ఇతఁడు "కౌముదీ నాటక కావ్య కవిని" అని తన ఆంధ్ర శబ్దచింతామణి వ్యాఖ్యానమునఁ దెలిపినాఁడు. ఆ గ్రంథమలభ్యము. ఇతని కాలము నాఁటికి మనకు మార్గనాటకములవంటి నాటకములు లేవు కనుకను, యక్షగానము రాను రాను నాటక శబ్దవ్యవహృతమై యుండుట చేతను నా కౌముదీ నాటకము యక్షగానమే యై యుండునని కొంద ఱూహించిరి. ఆతఁడు తన రాఘవ యాదవ పాండవీయమున "కవి సమ్మోహితరంగ కౌముదీ నామనాటక విధాన ప్రతిష్ఠా ఘనుండ" నని యున్నాఁడు. కొంద ఱందలి 'నాటక విధాన' శబ్ద సంపుటిపైఁ జూపు నిగిడ్చి యది నాటక లక్షణమును దెలుపు నొక శాస్త్ర గ్రంథమై

* అతని గుఱించి విశేషములకు ఆం. క. తే. 11 వ సంపుటము జూచునది.

యుండుననిరి. మనకు లక్ష్యకోశమే లేదఁక లక్షణ గ్రంథము నెందులకు రచించి యుండు నతఁడని కొంద ఱందురు. ఆ రెండును వే ర్వే ఱు గ్రంథ ములై యుండును, కౌముది నాటకము, రంగకౌముది నాటకశాలా లక్షణ గ్రంథమునై యుండునని మఱికొందరి మతము. కౌముది, రంగ కౌముది – అనునవి మన యక్షగానముల యెడ వింత పేళ్ళు. మన యక్షగాన వాఙ్మయ ప్రపంచమున నట్టిపేరు మఱి కానము. ఇంతకు నా కౌముదీ నాటక మసలు సంస్కృత నాటకమే యై యుండునేమో!

11. పెఱుఁతురుబల్లి విశ్వనాథకవి

శ్రీరామవిజయము :–

ఈ కవి క్రీ. శ. 1555 – 1607 సం. ల నడుమ పెద్దాపుర సంస్థానాధిపతియగు వత్సవాయి తిమ్మజగపతి కంకితముగా శేష ధర్మములను గ్రంథమును రచించి యుండెను. అందు కృతికర్తనుద్దే శించి కృతిభర్త మాటలుగా =

" సృజియించినాఁడవు శ్రీరామ విజయంబు
యక్ష గానంబు చిన్నపుడె రూఢి "

యని యున్నది. దీనినిబట్టి యీ యక్షగాన రచన క్రీ. శ. 1600 సం. నకుఁబూర్వమే జరిగి యుండునని నిశ్చయింపవచ్చును. ఆగ్రంథ మిపుడుప లబ్ధముగాదు. (ఈ విశ్వనాథ కవి వృత్తాంతము 'పెద్దాపుర సంస్థాన చరిత్రము. 33–34 పుటలలోఁ గలదు)

12. కాకునూరి అప్పకవి

అంబికావాదము :–

సుప్రసిద్ధుఁడైన యాంధ్ర లాక్షణికుఁ డితఁడు. తన యప్ప కవీయమున యక్షగాన లక్షణమును దడవుటయే కాక యొక లక్ష్యమును గూడ రచించి యుండెను. "అంబికా వాద నామక యక్షగాన కృతియుఁ జేసితి" నని యప్ప కవీయావతారికలోఁ జెప్పి యున్నాడు. కాని యట్టి లక్షణవేత్త యొక్క యాలక్ష్య మెట్లుండునో చూచు నదృష్ట మదృష్టమే యైనది. అప్ప కవీయ రచనారంభ వత్సరమందు 'శాలివాహన శకమున గజ్ఞశైల శరసుధా కిరణుల సంఖ్య' గాఁబో ర్కొనఁబడిసది. అనఁగా శా. శ. 1578 = క్రీ .శ. 1656. అంబికా వాద రచన మంతకు ముందే జరిగినది.

---

13. దేవవరపు శోభనాద్రి

బాలక్రీడా విహారము :– *

ఇతఁడు హారితసగోత్రుఁడు. దేవవరాన్వయుఁడు. కొడూరు వాస్తవ్యుఁడు. కొడూరు సంతాన గోపాలునకుఁ దన యీ కృతి నంకిత మిచ్చినాఁడు. ఈతని కాలనిర్ణయమున కొక్కటే మార్గము కన్పట్టుచున్నది. ఈబాలక్రీడా విహారప్రతి విలేఖనకాలము "ప్రమా

* ఆం. సా. ప. సం. 2699.

దీచనామ సంవత్సర భాద్రపదశుద్ధ శనివారం" అని యున్నది. ఇది క్రీ. శ. 6–9–1673 తేదీతో సరిపోయినది. దీనినిబట్టి గ్రంథమంతకుఁ బూర్వము పుట్టినదనిమాత్రమే చెప్పనగును. రచనాప్రక్రియను బట్టి చూడ నిది ప్రతివిలేఖనకాలమున కొక్కింతపూర్వము రచింపఁబడి యుండునని తోఁచును.

శ్రీకృష్ణు జననాదిగా యమళార్జున భంజనము వఱకుఁగల కథ యిందు వర్ణితము. మంత్రసానివాలక మొకటి యిందలి విశేషము. ఇందుఁ బ్రసిద్ధ రాగతాళములలో నున్నవి దరువులు. ద్విపద లెక్కువ. వచనములు, సీస గీత కందములును గలవు. రచన యొకమాదిరి. గ్రంథము యక్షగానమని పేర్కొనఁబడినది.

---

14. సిద్ధేంద్రయోగి

భామాకలాపము:–

సిద్ధేంద్రయోగి కూచిపూడి భాగవతుల కులపతులలో సుప్రసిద్ధుఁడు. భామకలాపసృష్టి ప్రతిష్ఠామహితుఁడు. ఇతఁడొక భాగవత మేళమును వెంటబెట్టుకొనిపోయి తానాషా యను హైదరాబాదు – గోల్కొండనవాబు నెదుట నొక నృత్యరూపకమును ప్రదర్శించి యతనిని మెప్పించి యతనిచేఁ దనపేరను దన యనుచరులపేరను శాసనపూర్వక ముగా కుచేలపురమును (కూచిపూడికి బూర్వపుఁబేరు) దానముగాఁ బొందియుండినట్లు నేఁడు కూచిపూడిపెద్దలలోఁ బ్రసిద్ధులగు శ్రీవేదాంతం

లక్ష్మీనారాయణగారి వలనఁ (వీ రిటీవలఁ గీర్తిశేషులైరి) దెలిసినదని శ్రీమతి కె. గోమతిగా రనుచున్నారు.[1] ఆచార్య శ్రీ విస్సా అప్పారావు గారును నీవిషయమునే వేఱొకచోటఁ దెల్పియున్నారు.[2] ఆతానాపాయసలువేరు అబుల్‌హసన్ అనియు నతఁడు గోల్కొండకుతుబ్‌షాహీల వంశమువాఁడనియు క్రీ. శ. 1672 – 1685 సం. ల నడుమ హైదరాబాదు రాజ్యమును బరిపాలించె ననియుఁ దెలియవచ్చినది.[3] కాఁగా సిద్ధేంద్రయోగికాలము నాప్రాంతమే యని నిశ్చయింపనగును.

భామకలాపముయొక్క ప్రదర్శన ప్రక్రియ విశిష్టమైన దైనను రచనా ప్రక్రియ యక్షగాన ప్రాయమైనదే. ఇంకను యక్షగాన రచనా ముఖ్యాంగములగు దరువులు, ద్విపదలు, గద్య పద్యములు నున్నవి. సిద్ధేంద్రునికి ముందే యాంధ్రదేశమున యక్షగానము లనేకము వెలసిన జాడ కన్పించుచున్నది. అతనికి ముందే కూచిపూడి భాగవతులు వీథినాటకము లాడుటలోఁ బ్రసిద్ధులై యుండిరని తెలియుచున్నది.* ఆవీథి నాటకములు నాయక్షగానములే యతని భామకలాప రచన కుద్బోధకములై యుండును. కానిప్రదర్శన ప్రక్రియలో నిది సామాన్య యక్షగానాదులవఁలె గాక భరత విద్యావిధి నిబద్ధమైనది. నృత్య ప్రధానమైనది. నృత్యకళానుకూలముగా రసైక రమ్యముగాఁ బ్రదర్శించుటకుఁ దగినట్లు సంగ్రహమైన పాత్రసామగ్రి నేర్పరించుకొనుట మొదలగు విషయములలో సిద్ధేంద్రునకుఁ బద్మావతీ చరణచారణ

1. Vide., Her thesis on the Music of the Nrtya natakas of South India, Submitted for M. Litt., of the Madras University.

2 చూ. శ్రీ అప్పారావుగారి 'కూచిపూడి నాట్యసంప్రదాయం' అను వ్యాసము – సంస్కృతి, ఏప్రిలు, 1955.

3. Vide., Robert Sewell's The Historical Inscriptions of Southern India., P. 349.

* చూ. క్రీ. శ. 1502 నాటి మాచుపల్లె శైఫీయతు.

చక్రవర్తియగు జయదేవుని గీతగోవిందము మాఁదల యైనట్లు తోఁచును. రెండింటను నాయికా నాయక సఖీ పాత్రములు మూఁడే ముఖ్యములైనవి. భామ కలాపము నందు సఖీపాత్రదొక ప్రత్యేకత. అది సిద్ధేంద్రుని యపూర్వసృష్టి. "మాధవి" యను నాపాత్ర పేరొకటి గమనింపఁదగినది. ఆపాత్రను బ్రదర్శక ముఖ్యుఁడొక పురుషుఁడే నిర్వహించును. వేషధారణమున విశేషముండదు, పై మీఁదఁ గండువా తప్ప, అదేసమయానుకూలముగాఁ బఱిటయు నగును. అనఁగా నతఁడక్కలలో అక్క, భావలలో భావ; అతఁడు ప్రదర్శకులకు, నాయికా నాయకులకుఁ బ్రేక్షకులకుఁగూడ నొక ప్రతినిధివోలె వ్యవహరించును.

కలాపమనఁగా నది వైకృత శబ్దమైనచో కలఁత, కలహము నను నర్థములు నిఘంటువులలోను (చూ. సూర్యరాయాంధ్రనిఘంటువు) సొదవెళ్ళఁబోసికొనుట యను నర్థము వ్యవహారములోను గానవచ్చును. ఆమూఁడర్థములు నీకృతి ప్రతిపాదితార్థమున కన్వయింపఁగలవు. ఇందలి నాయిక భామ యనఁగా సత్యభామ; ఆమె కసలు సత్య యని మాత్రమే పేరు. భామా శబ్దము స్త్రీ సామాన్యవాచి. ఆమెకు భామ యనియు రూఢ్యర్థమునఁ బర్యాయ వ్యవహారము కలిగెనదనఁగా నామెలో నాభామాత్వము పూర్తిగా మూర్తీభవించిన దన్నమాట. నటులలో భామ వేషగాని దొకప్రత్యేకత యనఁగా నిఁక నట్టి నాటక నాయికలలో భామ ప్రాముఖ్య మెట్టిదో యిట్టే యూహింపనగును. ఆంధ్రవాఙ్మయమునఁ దొలుదొల్త బ్రబంధ నాయికగా నాసత్యభామ పాత్రను సర్వాంగ సుందరముగాఁ దీర్చి దిద్దినవారు తిమ్మనగారు. సిద్ధేంద్రుఁడాయన ప్రబంధ పారిజాతము తావి దనివితీర మూర్కొనియే యుండును. కాని నవ్యశిల్ప నైపుణితో నామెను నాటక నాయికగాఁ దీర్చినాఁడు. తిమ్మనగారి తీర్పులో నామె ఖండిత, స్వాధీన

పతిక; సిద్ధేంద్రుని చిత్రణలో నామె విప్రలబ్ధ. భామ కలాపమున పారిజాతకథ సత్యాస్వప్న కథనమున నిమిడి పోయినది. గ్రంథమంతయు నామెవలవంత కల, కలఁత నిదుర, చెలికత్తెతో సాద వెళ్ళబోసికొనుటయు, నాయకునితో నామె రాయబారములు, సంవాదములుఁ జివర రుక్మిణితో సవతి కయ్యము ననునవి యిందలి ప్రధాన విషయములు. గ్రంథనామము సార్థక్ము. ఈభామ కలాపము శృంగార రస వేశల సుధా కలశము. అలంకార శాస్త్ర సారనికషోపలము. రచన ప్రౌఢభావ బంధురము, భావోచిత పదబంధ సుందరము. ప్రదర్శన భరత విద్యాప్రమాణ రమణీయము.

భామ కలాపము ప్రభావ మర్వాచీన యక్షగానములపై బాగుగాఁబడినది. సవతి కయ్యము ఘట్టమొకటి యిందలి కండపట్టు. దానికి పారిజాత కథ ప్రధానాలంబనము. సిద్ధేంద్రుని తరువాతను దానికి మూనసఫుత్రికలుగా భామకలాపములు, నా"బాణీ" లో నడచిన పారిజాతకథేతివృత్తములగు యక్షగానములును గోకొల్లలుగా వెలసినవి. సవతుల సందర్భసాదృశ్యము సాకుగా శివపారిజాతములును దత్సదృశములును వెలసినవి. భామకలాపము ప్రాదుర్భవముతో నాంధ్రదేశ యక్షగాన ప్రదర్శనములందు నూత్నచైతన్యమును గొంత పొడసూపెనని తలంపవచ్చును. అంతవఱకుఁ దఱచు తక్కువ తరగతి ప్రదర్శకుల తెతక్కలతో నలసగతిఁ బయనించుచుండిన యక్షగానము భామకలాపము ప్రదర్శనల భరతపద్ధతి ననుసరించి పురోగమించినదని చెప్పవచ్చును.

కాని యొకటే విచారము. ఈనాఁడు సిద్ధేంద్రయోగి భామకలాపము దాని మూలిక స్వరూపముతోఁ బ్రత్యేకముగా నొకగ్రంథ రూపమున లభించుటలేదు. (మన యముద్రిత గ్రంథ భాండాగారము

లందెందును గానరాదు. కూచిపూడిలోఁగాని యొకి ప్రతియైన దొరకునేమో మఱి,) అది వివిధార్థాచిన భామకలాప గ్రంథములతోఁ గలగాపులగముగాఁ గలసిపోయినది. వానిలో నామాత్రముగాఁ గాన వచ్చు దరువులు, పద్యములు గొన్నియున్నవి. అవి సిద్ధేంద్రోపజ్ఞములే యని తలఁపవలసియున్నది. కొన్నిట సిద్ధేంద్ర యోగి స్మరింపఁబడి యున్నాడు.* కాని యవియెల్ల నతని గ్రంథము ప్రతులను తిలఁచుట పొరపాటు. ఆ స్మరణ గౌరవార్థము గావచ్చును. అందతిని గ్రంథ భాగములు కొన్ని గ్రహింపఁబడి యుండవచ్చును.

గొల్లకలాపము:

సిద్ధేంద్ర యోగి గొల్లకలాపమును రచించెనని కొందఱును రచింపలేదని కొందఱు ననుచున్నారు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు తమ యేకవీర (22 వ అధ్యాయము) లో 'సిద్ధేంద్ర యోగి గ్రంథము రెండు భాగములు. మొదటిది గొల్లకలాపము, రెండవది భామకలాపము' నని యున్నారు. శ్రీ విస్సా అప్పారావుగారు "గొల్లకలాపము – ఇది 19 వ శతాబ్ది రెండవ అర్ధ భాగములో కూచిపూడి నాట్య భాండారానికి చేరిన మరొక మణి" అని యున్నారు. (చూ. వారి వ్యాసము – సంస్కృతి., ఏప్రిలు. 1955).

---

* ఉదా.— 1. వ్రా. ల. పు. భాం. ఆర సం. 13-8-2 (పారిజాత హరణ మను పేర నున్నది. ఇది కేటలాగులోఁ జేరలేదు)

2. భా. క. మంజువాణీ ము. శా. ప్రచురణ, ఏలూరు, 1906 (ఇది యొక సంకీర్ణ గ్రంథము).

3. భా. క. శ్రీ వెంకటేశ్వర ము. శా. కాకినాడ, 1913. ప్రచురణకర్త మంగు వెంకటరంగనాధరావు (ఇదియు వివిధ కవుల రచనావిన్యాసములుగలదైనను నొక యానుపూర్విగలది. మూలగ్రంథభాగములిం చెక్కు–వగలవని తోఁచుచున్నది)

క్కాని క్రీ. శ. 1714 – 1760 ప్రాంతమున నుండిన నక్క-లపాటి సంజీవ కవి రచించిన గొల్లకలాప గ్రంథ మొకటి లభించినది. (అతని విష యము ముందు తెలుపఁబడును). గొల్లకలాపమున రెండు రకములు గలవు. ఒకదాని యందు గొల్లభామ పిండోత్ప త్తి విషయము నుండి యెత్తుకొని సుదీర్ఘముగా నొక వేదాంతోపన్యాసము చేయును. రెండవదానియందు సముద్ర మథనగాథ, సుంకరికొండని సరసమును బ్రస క్తములు. మొదటిది సిద్ధేంద్రుని రచన కావచ్చును. అతఁడు యోగి. తదుచిత మైన దా రచన. అది వేదాంత విషయక మగుట సామాన్యులకుఁ జవి గొల్పకపోవుటచేఁ గ్రమమున రెండవ రకపువి వెలసియుండును. వాని ప్రతులే నేఁడెక్కు-వగా లభించుచున్నవి. మొదటిరకము గ్రంథము ప్రతి కూచిపూడిలో లభించునేమొ !

ఈ కలాపములు రెండు సీనాఁడును నుండి యుడిగి ప్రదర్శింపఁ బడుచున్నవి.

సిద్ధేంద్రకృతిప్రశంస:

" గొల్లకలాపము షట్శాస్త్రములకు నిలుకడ. భామకలాపము వడగట్టిన యలంకార భరత శాస్త్రములు ".

– విశ్వనాథవారి ఏకవీర.

15. వర్ధుల నరసింహకవి

శకుంతలా నాటకము: *

ఇది "దుష్యంత చరిత్రము – యక్షగానం" బని కవిచేఁ బేర్కొనఁబడినది. కవి వర్ధుల నరసింహుఁడు. కృతిభర్త పెనుశెల (పెంచల?) నరసింహస్వామి. కృతిప్రోత్సాహకుఁడు "శ్రీమన్మహా మండలేశ్వర నంద్యాల నారాయణరాజు దేవమహారాజులుంగారు". ఇతని యగ్రజుఁడును, దండ్రియు రాఘవ నామధేయులనియు, నితని పితామహుఁడు నారాయణ రాజశేఖరుఁడనియు, వీరి దాత్రేయ గోత్రమనియు నవతారికలో గలదు. కాని వీరార్వీటి బుక్క-భూపతి దుహిత్రృవంశ విస్తారకులై 16 శ. ఉత్తరార్ధమున విజయనగర సామంతులై మంతు కెక్కి-ననాఁటి నంద్యాలరాజులుగారు. అప్పటి రాజుల వంశవృక్షము నందు వీరికోవ గానరాదు. కాని వారికోవకుఁ జెందినవారే యర్వాచీనులై యుందురు వీరు. వీరికాల మిదమిత్థముగాఁ దెలియదు. ఈ గ్రంథమునందు భరతపట్టాభిషేక ముహూర్తము "బహుధాన్య సంవత్సర కార్తీకశుక్లదశమి గురువాసరము" గాఁ బేర్కొనఁబడినది. అదికాని గ్రంథరచనా కాలమునకొక భంగ్యంతర సూచన యగునేని క్రీ. శ. 3–11–1693 తేదీకి సరిపోవుచున్నది. ప్రతివిలేఖకుఁడు కృతి పోత్సాహకుఁడగు నారాయణరాజే యగుట విశేషము. ఈప్రతి లేఖన కాలము విళంబి భాద్రపదబహుళ దశమి. వారము పేర్కొనఁ బడలేదు. (ఆ విళంబి క్రీ. శ. 1718 కావచ్చును).

ఇందలికథ ప్రసిద్ధము. రచన ప్రౌఢముగనే యున్నది. కాని యపప్రయోగములు ననౌచిత్యమును లేకపోలేదు. ఇందు దరువులు

* ఆం. సా. ప. నం. 695.

ప్రసిద్ధరాగతాళములలోఁ గలవు. కందార్ధములు, సంధి వచనములు, ద్విపదలు, పద్యములును గలవు. సూత్రధార ప్రవేశోక్తిఁ బాత్రలు తెర వెడలివచ్చి స్వీయోదంతమును సభవారికి నివేదించుట మొ. విశేషములు గలవు. కథారంభమున హాస్యగానిపాత్ర ప్రవేశమున్నది.

16. రెగళిగె నిమ్మనాథుఁడు

ఇతని తండ్రి పర్వతలింగము. గురుఁడు శంకర పిడుపర్తి. చుండి కలికేశుఁడు, రాచవీటి వీరభద్రుఁడు నితని శిష్యదైవతములు. ఇతఁడు గురునంబి చరిత్ర, నిజలింగ చిక్కయ్య కథ యను రెండు యక్షగానములను రచించెను. ఇతని కాల నిర్ణయమునకుఁ బ్రతివిలేఖన కాలమే శరణ్యమైనది. ఈ గ్రంథములకు ప్రా. లి. పు. భాం. నం. బ్రతులు చాలగలవు. ఆ యన్నిట లేఖకులిచ్చిన కాలపు వివరములను లెక్కించి చూడఁగా ఆర్. నం. 811 నిజలింగ చిక్కయ్య కథ ప్రతి ప్రాచీనతమ మైనదని తేలినది. విరోధి నిజవైశాఖ శుద్ధదశమి శనివారము దాని లేఖనకాలముగాఁ జెప్పఁబడినది. అది క్రీ. శ. 7-5-1709 తేదీకి సరిపోవుచున్నది. అనఁగా గ్రంథరచనాకాల మంతకుముందే జరిగియుండును. ఆ గ్రంథముల రచనా ప్రక్రియఁజూడ నది యింకను ప్రాచీనమైనదిగనే తోఁచును.

గురునంబి చరిత్ర: ♦

గురునంబికే ఉదయ లేక ఒడయ లేక వడియనంబి యనియు సుందరమూర్తినాయనారనియుఁ బేరు. ఇతఁడొక ద్రవిడ శివభక్తుఁడు.

♦ ప్రా. లి. పు. భాం. డి. నం. 1870, 1871, 1872, 1970.

ఇతని యుదంతము * బసవపురాణమునఁ గొంత గలదు. అజ్జరపు పేరయలింగము ఒడయనంబి విలాస ప్రబంధమున నెక్కు-వగాఁ గలదు. అంతకంటె విపులముగా నిందు వర్ణింపఁబడినది. పార్వతీపరమేశ్వరులు తమ ముకుర ప్రతిబింబములకుఁ బ్రాణప్రతిష్ఠచేయగా సుందరీసుందరులవతరింతురు. వారు శాపవశమున భూలోకమున శానమరాయుఁడేలు తిరునావళూరిలోఁ బుట్టుదురు. సుందరి పరమనాచియను నట్టువక త్తె యగును. సుందరుఁడు నంబియై వాల్మీకేశ్వరునిచేఁ బెంపఁబడి పెద్దవాఁడగును. అతఁడు పరమనాచినిఁ జూచి మోహించును. వాల్మీకేశ్వరుఁడే కుంటెనకాఁడగును. నంబి మంగుళూరిలో ననంగ సంగను బెండ్లాడును. చనిపోయిన తన పేరింటి బ్రాహ్మణబాలకు నొకని బ్రతికించును.

పరమనాచి చంట లింగమూర్తిని బలికించును. తదుప. శివుఁడు ప్రత్యక్షమై నంబి, అనంగ సంగ, పరమ నాచి, శానమ రాజులకుఁ గైలాస కైవల్య ప్రాప్తుల ననుగ్రహించును. సంగ్రహముగా నిదీ యిండలి కథ.

కథా ప్రధానమైన దీ యక్షగానము. రచన యొక మోస్తరు. యింమ తాళప్రధానము లైన దరువులు, నెడనెడ గద్య పద్యములు. ద్విపదలు, ఏలలు, ధవళము మొ. గలవు. ఎఱుకల జంపె, పాళిరేకు లనునవి విశేషములు. పరమ నాచి నెఱపిన నృత్యవిశేషములు :- జగ్గు, మైసిరి, జక్కిణి, పేరణి, సూళాదులు, అగ్గరికములు, దేశాది పద్ధతులు. ఈ గ్రంథము రాచవీటి వీరభద్రుని కంకితము. యక్షగాన మని పేర్కొనఁబడినది.

---

* పండితారాధ్య చరిత్ర మహిమ ప్రకరణమునఁ గలదు.

నిజలింగచిక్కయ్యకథ :— * (లేక చరిత)

బసవ నింట దొంగతనము సేయఁబోయి చిక్కయ లింగదీక్ష గైకొనుట — చిక్కయను జూచి తలారి రామయ భార్య నీలకుంతల మోహించుట — నిరాకరించిన చిక్కయ కామె కుతంత్రము వలన శిరశ్ఛేద మగుట. చిక్కయ శిరస్సు నిక్కముచెప్పఁగా నాకాశవాణి సాక్ష్యము వల్కుట — తలారి భార్యను జంప నుద్యుక్తుఁడు కాఁగా శివుఁడు ప్రత్యక్షమై యెల్లరకుఁ గైలాస మనుగ్రహించుట — అనున దిందలి కథ. ఈ కథ యితివృత్తముగాఁ గొన్ని ప్రబంధములు జంగము కథలును వెలసినవి.

తాళ ప్రధానములైన దరువులు ప్రచురముగా గల యట్టిగాన మిది. ద్విపదలు, సంధి ప్రయోజన మాత్ర పరములైన వచనములు, కొలఁది పద్యములు, అర్ధచంద్రికలు, ఏలలు, జోలలు, ధవళములును గలవు. రచన హృదయంగమ మైనది. సలక్షణమైన భాషలో సరళముగా, సజాతీయముగా, పొల్లుమాటలు పడకుండ భావములు సూటిగాఁ జెప్పఁగలఁడు కవి. ఇదియు య. గా. అని పేర్కొనఁ బడినది.

---

* ముద్రితము 1. హరిహరము. శా. 26-4-1881.

2. ఆ మెరికన్ డైమండు ప్రెస్, మదరాసు, 1—8—1939.

17. నూల్వీటి హరియప్ప

ఉలూచీపరిణయము :

ఇతఁడు నందవరీకుఁడు. ఆశ్వలాయన సూత్రుఁడు. శ్రీవత్సస గోత్రుఁడు. ఇతని తలి దండ్రులు జానకమ్మ, నాగరాజు. ఇతని చరిత్రము అవుడూరి కిచ్చయ మాధవాభ్యుదయము (ప్రా. లి. పు. భాం. డి. సం. 1431), నుండి యెఱుఁగనై నది. అందే యవతారికలో నిత్యఁడులూచీపరిణయ యక్షగానమును, కృష్ణశతకమును రచించినట్లు చెప్పఁబడి నది. కాని యీ యక్షగాన మిపుడెచ్చటను లభించుటలేదు. మాధవాభ్యుదయ కృతి ప్రోత్సాహకుఁడగు నూల్వీటి నాగయామాత్యుఁ డితని మనుమఁడని యందుఁగలదు. మాధవాభ్యుదయకర్త తమకాలము నాఁటికి "నూఱు నూట యేబఁది సంవత్సరముల క్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్న" దని వీరేశలింగముగారు తమ కవులచరిత్రలో నవుడూరి కిచ్చయ చరిత్రమున వ్రాసినారు. అది యథార్థమగునేని యీ హరియప్ప క్రీ. శ. 1700 ప్రాంతమున నుండియుండునని యూహింప నగును.

---

18. వెలిచేరు వేంకట రామ ప్రధాని

బాణాసుర యుద్ధనాటకము :

ఇతఁడు వెలిచేరు జగ్గయ్య కొమరుఁడు. తాను విజయలక్ష్మీ నరసింహ విలాసము, వియన్నదీ పరిణయము, పంచ వింశతి శతకములు,

బాణాసుర యుద్ధాది నాటకములును రచించినట్లు తనకృష్ణార్జున సంవాద మను ప్రబంధమునఁ (ప్రా. లి. పు. భాం. ఆర్. నం. 230) జెప్పినాఁడు. ఆ నాటకములు ప్రాయికముగా యక్షగానములు కాఁదగును. కాని యొక్కటియు లభింపలేదు.

మీఁది కృ. సం. ప్రతి చివర విలేఖకుని వ్రాత యిట్లున్నది. "విశ్వావసు నామ సంవత్సరమైత్ర శు. ౧౧ శనివారం సర్కిఁ-ప్రతినున్న క్రమాన వక్కలంక వీరన్న కుమారుఁడు సీతన్న శ్రీరామార్పణంగా వ్రాస్తిని" (ఈలేఖకుఁడు వక్కలంక వీరభద్రకవి పుత్రుఁడగునా?) ఈ ప్రతిలేఖన కాలము కీ. శ. 13-3-1725 తేదీకి సరిపోయినది. గ్రంథ రచనా కాల మంతకుఁ గొంత పూర్వమగును.

19. దళవాయి తిమ్మప్ప

ప్రసన్న వేంకటేశ్వరవిలాసము: *

గ్రంథకర్త తాను రాయదుర్గపరిపాలకుఁడును, కర్ణాటరాయ దళవాయియు నగు కోనేటి నృపతికి విట్లుంబికయందుఁ గలిగిన వేంకట ధరాధిపునకు లచ్చుమాంబయందుఁ గలిగిన పుత్రుఁడ ననియు, నేటూరి పురమునఁ గోటికన్యాదాన కుశలతనలరిన తిరుమల తాతయాచార్య నకుఁ బౌత్రుఁడును వేంకటవరద దేశికునకుఁ బుత్రుఁడునైన వీరరాఘవా చార్యునకు శిష్యుఁడ ననియు నవతారికలో వాక్రుచ్చెను. రాయ

* ప్రా. లి. పు. భాం. ఆర్. నం. 888, ఆర్. 1040.

దుర్గము బళ్ళారిజిల్లాలోనిది. బళ్ళారిజిల్లా గెజటీరులో* కోనేటినృపతి విజయనగర రాజులనుండి దళవాయి బిరుదు సంపాదించినట్లును, బీజాపురము సుల్తానునకుఁ గప్పము చెల్లించుచు రాయదుర్గము నేలినట్లును, నతనికి వెంకటపతి నాయకుఁడను కొడుకుండినట్లును, వెంకటపతికి లక్ష్మమ్మయను భార్యవలనఁ బెదతిమ్మప్ప యను కొడుకుండినట్లును, పెదతిమ్మప్ప క్రీ. శ. 1732లోఁ జనిపోయినట్లును గలదు. ఇతఁడే ప్రకృతగ్రంథకర్తయగు దళవాయితిమ్మప్ప. ఆకోవలో నితనికిఁ దరువాత నొక తిమ్మప్పగలఁడు. (పెదతిమ్మప తమ్ముఁడగు వెంకటపతి కొడుకు) కావున నితనికి పెదతిమ్మపయనుపేరు వచ్చియుండును.

గ్రంథవిషయము:— రాయదుర్గక్షేత్రస్వామి ప్రసన్నవెంకటేశ్వరుఁడు. ఆస్వామి పురవీధులఁ "దిరువీధి" వేంచేయఁగాఁ గళావతి యను వేశ్యకన్య యతనిఁజూచి మరులుకొనును. చెలికత్తెయగు మంజువాణి యామె తల్లియగు చకోరాక్షి కీ విషయము తెలుపఁగా నామె కూఁతును మందలించును. తరువాత మంజువాణిచే స్వామికిఁ గళావతి రాయబారము. అది విఫలము కాఁగా కళావతి స్వయముగా స్వామిసముఖమునకుఁ బోయి తన నాట్యకళానైపుణ్యముచే నాతనిఁ బ్రసన్నుని జేసికొనును. ఈకథ యెత్తుగడలో నున్న యులాప్రబంధపుఁ బోకడ గమనింపఁదగినది. అది దక్షిణదేశ యక్షగానము లందెక్కువగాఁ గన్పట్టును. (విశేషములకా ప్రకరణమునఁ జూచునది.) ఇందలి రచన నాతిప్రౌఢము, నాతిపేలవము. ఇందు దరువులు, ద్విపదలు, పద్యములు, వచనములు, నొక యష్టకము నొక చూర్ణికయుఁ గలవు. దరువులు ప్రసిద్ధరాగతాళములలోఁ గలవు.

* 1904 సం. ప్రచురణ — పుట 298

1906 సం. ప్రచురణ పుట 309.

చాలదరువులకడ నొకరాగము తాళము ముందుదాహరింపఁబడి "నాట్యపద్ధతికి" అని మఱియొక రాగతాళముల జంట పేర్కొనఁ బడుచు వచ్చినది. ఇది చూడ గ్రంథము శ్రవ్య దృశ్య ప్రయోజనములు రెండింటికి నుద్దిష్టమైన దనుట స్పష్టము. ద్విపదలకును రాగములు పేర్కొనఁబడుట యింకొక విశేషము. ఇందు కన్నడ భాషలో నొక మూఁడు దరువులు గలవు. కవి యీకృతిని యక్ష గానమని పేర్కొనినాఁడు.

---

20. నక్కలపాటి సంజీవకవి

ఇతనివి గొల్లభామ వేషముకథ, ఎఱుకలకథ అను రెండుయక్ష గానప్రాయ రచనలు గాన వచ్చుచున్నవి. రెండింటను తూఁపూరు చెన్న కేశవముద్ర గానవచ్చుచున్నది. కాఁగా నితఁడు తూఁపూరు వాస్తియై యుండునని యూహింప నగును. తూఁపూరు కడప మండలము సిద్ధవటము సీమలోనిది. ఇతఁడు సిద్ధవటము ప్రభువు లగు మల్లె యనంతరాజు, వేంకటరామరాజులఁ గూర్చి చెప్పిన చాటు పద్యములు రెండు చాటుపద్య రత్నాకరములోఁ గలవు. (శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి సంపాదితము – పుట 31–32). అనంతరాజు (మల్లె కావలె చెఱుకు తోటను నక్కలు పాడుచేయు చుండఁగా నాతని ప్రార్థనపై సంజీవరాయ కవి తనకవితా శక్తిచే నక్కల వాకట్టినట్లును, నందుపై ననంతరాజు నక్కలపాటివారని యతని కింటిపేరు దయ చేసినట్లును నందుఁగలదు. మల్లెవేంకట్రామ క్ష్మాజానిపై నితఁడు

చెప్పిన చాటువులో వేమల చినబసవరాయ వేంకట నృపతి యొకడు పేర్కొనఁ బడినాఁడు. ఈతని కాలము గుఱించి తెలిసినదిగాదు. కాని ప్రసిద్ధుఁడగు సిద్ధవటము మల్లె రాచకుటుంబములో మల్లె అనంత రాజ వేంకటరామ నామధేయుల జంట వరుసలు క్రీ. శ. 1600-1690 సం. ల నడుమ నొకటియు, క్రీ. శ. 1714 – 1760 సం. ల నడుమ నొకటియుఁ గలవు. * సంజీవ కవి గొల్లభామ వేషము కథ యనఁగా గొల్లకలాపము. అది క్రీ. శ. 1680 ప్రాంతములనుండిన సిద్ధేంద్ర యోగి (అతని చరిత్ర ముందు గతపుటలలోఁ గలదు) గొల్లకలాపము నకుఁ గొంత ప్రచారము కలిగిన పిమ్మటనే రచింపఁబడి యుండును. అసలా కలాప ప్రక్రియ యన్న దతని సృష్టి. కావున సంజీవ కవిని బైనుదాహరింపఁబడిన మల్ల రాజులలో రెండవకోవ వారి కాలమునకుఁ జెందిన వానిగనే పరిగణించుట లెస్స.

గొల్లభామ వేషము కథ[1]:

గొల్లభామ నిత్య కృత్యములు నిర్వర్తించి సింగారించుకొని వాడలోఁ జల్ల మొదలగునవి యమ్మ వచ్చినది. ఆమె తమ కులములోని తెగలు, కులాచార విధి నిషేధములు మొ. ఏకరువు పెట్టును. జగమెల్ల గొల్లయని సిద్ధాంతము చేయును. ఆమె పేరు మందయాన. చాల గొల్లకలాపములం దాపేరే కన్పించును. సంజీవ కవి గ్రంథము మూడ భాగుగా మనుకరింపఁబడినది. యథాతథముగ నిందలి పంక్తులే కొన్ని గ్రహింపఁబడినవి. ఇంచు మధ్య నొక్కచో మాధవి ప్రసక్తి

* Vide, Sewell's Historical Inscriptions of Southern India, P. 366.

1. ఆం. సా. ప. సం. 3225, 3708, 2778 లలో నిందలి పంక్తులు మాత్రము కొన్ని గలవు. (శ్రీ నేదునూరి గంగాధరం గారి కడ నొక ప్రతి కలదు)

వచ్చినది. కాని కొసంట గొల్లభామ గొంతే వినిపించును. అనఁగా నిది కలాపమనుటకుఁ దగియున్నది. అందు దరువులు, ద్విపదలు, పద్యములు, వచనములు గలవు. రచన చక్కనిది.

ఎఱుకల కథ: [2]

పుత్రవాంఛతో నున్న యశోదకడకు విష్ణు నియోగమున యోగమాయ యెఱుకతయై వచ్చుట యిందలి విషయము. "సూత్ర ధారి చదివే పద్యము" లను పేరఁ బ్రశ్నలు నందుల కాపె సమాధానములునుగా గ్రంథము సాగును. రచన యొకమో స్తరు. ఇందెఱుకల కాంభోదిలో రెండు దరువులు, పంతువరాళి, సౌరాష్ట్రలలో నొక్కొక్కటియు, నట తాళమున నొకటి, రెండు దీర్ఘద్విపదలు, కొలఁది పద్యములు, రెండు చోట్ల నల్పవచనములును గలవు.

21. తక్కెళ్లపాటి లింగన

విద్యుత్ప్రభావిలాసము:

గ్రంథ మలభ్యము. ఇతఁడు "విద్యుత్ప్రభావిలాసమ్ము వేడ్క ఘటియించితిని యక్కుగానరీతి" నని తన యుత్తర హరిశ్చంద్ర కథ (ప్రా. లి. పు. భాం. డి. నం. 425) లోఁ దెలిపియుండెను. ఇతని

2. ఆంధ్రేతిహాస పరిశోధక మండలి (రాజమండ్రి) లో నొక యసంఖ్యాక ప్రతిగలదు.

ఆం. సా. ప. సం. 2362 ప్రతిలోఁ గొన్ని యాకులు మాత్రముగలవు.

చరిత్ర ఆం. క. చ. తృతీయభాగమునఁగలదు. అం 'దితఁ డించు మించుగా నూఱు నూటయేఁబది సంవత్సరముల క్రిందట నుండినట్లూహింపఁదగియున్న' దని యున్నది. అది నిజమగుచో నితఁడు 18 శ. మధ్యనుండెనని తలంపవలసియున్నది.

---

22. బొమ్మలాట సాంబయ్య

కిరాతార్జునీయము: *

ఇదియొక బొమ్మలాటవారి కుటుంబమునకుఁ జెందిన యక్షగానము. దీని ప్రా. లి. పు. భాండాగార ప్రతి చివర నిట్లున్నది.

"గాటమా మోహన కవియైన బొమ్మ
లాట సిద్ధయ్యకు నాత్మ సంభవుఁడు
యల్లమ్మ సత్పుత్రుఁ డెల్లవిద్యలకు
బల్లిదుఁడు సిద్ధయ్య బలుని తమ్ముండు
బ్రతిలేని యట్టి సాంబయ్య రచించె"

---

* 1. ప్రా. లి. పు. భాం. డి. నం. 1849—51, ఆర్. నం. 1143.

2. తం. స. మ. కే. నం. 476 _ 477.

3. ఆడయూరు ది. స. గ్రం. జి. నం. 74854.
ఆర నం. 32 (ఇ) 11, 32 (ఎఫ్) 7

(కొలఁది భేదములతో నీ మూఁడు నొక్క గ్రంథము యొక్క ప్రతులుగానే కన్పట్టుచున్నవి).

తం. స. మ. ప్రతి చివర నిట్లున్నది :—

"అంకితంబుగ బొమ్మలాటశాసనుఁడు
పొంకమౌ ఘన కావ్య భూషణుఁడైన
సంబయ్య తమ్ముఁడు సరసుఁడౌనట్టి
శంబరధరుఁడు.....రచియించె"

అడయారు ది. స. గ్రం. 32 (ఇ) 11 ప్రతి చివర నిట్లున్నది :—

"ఘనమైన మోహనా ఘను నినదాంకు (?)
సంగీత సాహిత్య సరస కోవిదుఁడు
వినుతికెక్కిన సిద్ధవిభుని నందనుఁడు
పరువడి యల్ల మాంబా తనూభవుఁడు
శంబయ్య తమ్ముఁడు సరసుఁడైనట్టి
శంభు వీరుండు శ్రీ శంభుని కృపను
తనర కీరాతార్జునీయ మొసరంగ
వచియించె....."

అడయారు 32 (ఎఫ్) 7 ప్రతిలో "అంకితంబుగ బొమ్మలాట శాసనుఁడు" అన్న ముక్క యధికము.

ప్రా. లి. పు. భాం. కన్నడ గ్రంథావళి డి. నం. 1169 కరియ బంటన కథ యక్కుగాన ప్రతి చివర గ్రంథకర్తనుగూర్చి యిట్లున్నది :-

"..... బొంబయాటదరాయ
శంకర వరవుల్ల చరణ సేవకను
ఘనవాదమోహన కవి బిరుదాంక
జననుత సంగీత సాహిత్య నిపుణ

సిద్ధయ్య డణుగ ప్రసిద్ధ నాయకను
సద్ధర్మ గుణయుత సంబయ్య ననుజ
అంబుజ వదన యల్లమ్మ నాత్మజను
శంబరారికు భక్త సంబయ్య....."

మీఁది యుదాహరణముల వలన మోహన కవి బిరుదాంకుఁడును బొమ్మలాట శాసనుఁడు నైన సిద్ధయ్య కెల్ల మయంచు సాంబయ్య లేక సంబయ్య, శంబయ్య సంబయ్య, శంబరధరుఁడు, శంభువీరుఁడు నను వారు పుత్రులనియు వారెల్లరకు నీకిరాతార్జునీయ రచనతో సంబంధము గలదనియుఁ దెలియుచున్నది. ఎల్లమ సిద్ధయల పుత్రుఁడును సంబయ్య యనుఁజుఁడును నైన బొమ్మలాట సంబయ్య లేక సాంబయ్య రచించినవి గా కీకిరాతార్జునీయ య. గా. ను రచించి యుండుననియు, నందతనికి సోదరులును గొంత కొంత తోడ్పడియుండిరనియు, దలంపవలసి యున్నది. ఈ బొమ్మలాట సాంబయ్య క్రీ. శ. 1750 ప్రాంతమువాఁడుగా "కర్ణాటక కవి చరిత" తృతీయభాగమునఁ బేర్కొనఁబడియున్నాఁడు.

ఇరదలి కథ ప్రసిద్ధమైనది. అల్ప దోషములున్నను రచన కడుచక్కనిది. సంభాషణ లెక్కువ. తెనుఁగుదన మొట్టిపడుచున్నది. తాళప్రధానములైన దరువులు, పేకులు, అర్ధచంద్రికలు, ధవళములు, ద్విపదలు, కొలఁది పద్యములు, చిన్న సంధివచనములు గలవు. గ్రంథము యక్షగానమని పేర్కొనఁబడినది. లేపాక్షి వీరభద్రస్తుతి

1. ప్రా. లి. పు. భాం. కన్నడ గ్రంథావళి డి. నం. 1169
2. .. .. డి. నం. 1212 – 1320.

యిందుగలదు. (లేపాక్షి అనంతపురం జిల్లాహిందూపురం తాలూకా లోనిది.) ఇదికాని నాఁడీ బొమ్మలాట కుటుంబమువారిచే బొమ్మలాట ప్రదర్శనముల కెక్కినదేమో!

23. నిముషకవి రామయ్య

జలక్రీడా విలాసము:*

గ్రంథకర్త సామంతకుర్రు (గోదావరి జి. అమలాపురము తా.) గ్రామకరణము. నిముషకవి లింగరాజుగారి పుత్రుడు. రామేశమని యితని నామాంతరము. ఇతని కృత్యంతరములు రామలింగేశ్వర శతకము, విష్ణుసంవేద్య రామేశ్వర పూజా విధానము. "ఈగ్రంథము సుమారు నూటయేఁబది సంవత్సరముల క్రిందటఁ జేయఁబడినది." (గ్రంథ ప్రకాశనకాలమునకు). అనఁగా గ్రంథకర్త క్రీ. శ. 1758 ప్రాంతము వాఁడగు చున్నాఁడు. ఈ విషయము లీగ్రంథప్రకాశకులును, గ్రంథకర్త "మాం తండ్రిగారికి మాతామహులు' లని చెప్పుకొనిన వారునగు మాచిరాజు నారాయణమూర్తిగారి పీఠికవలనఁ దెలిసినవి. గ్రంథాంత గద్యనుండి యీ నిముష కవివారు హారితస గోత్రులని తెలిసినది.

శ్రీకృష్ణుని గోపికా వస్త్రాపహరణ మిందలికథ. భాష సలక్షణమైనది. శైలి సామాన్యమైనది. ఇందు దరువులు, ద్విపదలు,

*ముద్రితము;— శర్వాణీ ము. శా. అమలాపురము మొదటిమార్పు 1908.

పద్యములును గలవు. దరువులకు రాగతాళములే కాక పల్లవి, అనుపల్లవి, చరణములు ననఁగా సంకీర్తన లక్షణ ప్రక్రియ నిరూపింపఁబడినది. ఆనంద భైరవిలో నొక యేలయు, త్రిశ్రలఘు తాళమును విశేషములు. ఇది యక్షగానమనియు, శృంగారప్రబంధమనియుఁ బేరొక్కనఁబడినది.

---

24. విరిపాటి నృసింహరాజు

ఉపోద్ఘాతము:*

ఏతద్గ్రంథ కర్తృత్వ విషయము సందిగ్ధము. ఒకప్రతిలో విరిపాటి నరసింహ ధరణి కాంతుఁడనియు నింకొక ప్రతిలో వావిరిపాటి నృసింహధరణి కాంతుఁడనియు నున్నది. అవక తవకగానున్న గ్రంథాంత గద్యలో లక్షణామాత్య విశ్వనాథ కవి నామము లొక రెండు కన్పట్టుచున్నవి. ఇందెవరు గ్రంథకర్త లగుదురో నిశ్చయింపవలను గాకున్నది. గ్రంథరచనా కాలమున కొకమేర నిర్ణయించుటకు మాత్ర మొక యాధారము గన్పట్టినది. అది డి. నం. 1838 ప్రతి విలేఖన కాలము. అది సర్వధారి మాఘశుద్ధ చవితి శుక్రవారము. ఇది క్రీ. శ. 10-2-1769 తేదీకి సరిపోవుచున్నది. గ్రంథరచన యంతకు ముందు జరిగియుండునని మాత్రము చెప్పనగును.

---

* ప్రా. లి. ప్ర. భాం. డి. నం. 1838, ఆర్, 1141

కథ ప్రసిద్ధము. మార్పులులేవు. రచన పరళ గ్రాంథిక ధోరణిలో సాగినది. పేలవము, బహుసోమజుష్టము. ఇందు ద్విపద పాలెక్కువ. తాళ ప్రధానములుగాఁ గొన్నిదరువులు, గద్యపద్యములు, రెండర్ధ చంద్రికలును గలవు. మ. గా. అని పేర్కొనఁబడినది.

---

25. గోగులపాటి కూర్మనాథకవి

మృత్యుంజయవిలాసము:*

ఇతఁడు గోగులపాటి సూరయ పౌత్రుఁడు. గౌరమాంబా బుచ్చనామాత్యుల పుత్రుఁడు. వెంకన్న కామన్న లనువారి కగ్రజుఁడు. సింహాచల శ్రీరామ తీర్థాదిక్షేత్రముల నాచార్యకత్వము నిర్వహించుచుండిన తిరుమల పెద్దింటి సంపత్కుమార వేంకటాచార్య దేశికుని శిష్యుఁడు. (చూ. మృ. వి. గ్రంథాంత ద్విపద, గద్య). ఇతఁడు విశాఖపట్టణమండలము విజయనగరసంస్థాన దేవస్థానోద్యోగి. గజపతి నగర సమీపమునన్నున్న దేవులపల్లి గ్రామనివాసి. సింహాద్రి నారసింహశతకము, చోరసంవాదము లేక లక్ష్మీనారాయణ విలాసము ననునవి యితని కృత్యంతరములు * 'ఈయన యిప్పటికి 150 సం.ల క్రిందట నుండెడివాఁడు, విజయనగర సంస్థానీకులయిన మొదటియానంద రాజుగారీయనకు పోషకులు' అని విశాఖపట్టణంజిల్లా వృత్తాంత

---

* ఇది పలుతడవలు ముద్రితమైనది. అందు రెండు ప్రచురణములు

1. శ్రీరంగవిలాస ము. శా. మదరాసు. 1907

2. ఆంధ్ర విజ్ఞాన సమితి. విజయనగరము, 1941.

సంగ్రహము (పుట 132 – 133) లోఁ గలదు. ఆ గ్రంథ ప్రకటన కాలము క్రీ. శ. 1888 అనఁగా కూర్మనాథకవి కాలము 1738 ప్రాంత మని తేలుచున్నది. అతఁడు మొదటి ఆనందరాజు పోషణలో నుండె ననఁగా (మృ. వి. మంగళమున 'విజయనగరదక్షులగు గజపతిరాజులు స్మరింపఁబడిరి) నా రాజు రాజ్యకాల మగు 1757 – 59 (అ) ప్రాంతమునఁ గూడ నుండెను. అతనితరువాత 1759 లో రాజ్యమునకువచ్చి 1794లో జరిగిన పద్మనాభయుద్ధములో (ఆ) నిహతుఁడైన రెండవ విజయరామ రాజు "శ్రీమత్తిరుమల పెద్దింటి సంపత్కుమార వేంకటాచార్య దేశి కోపదిష్ట నారాయణాష్టాక్షరీ మంత్రపారాయణుఁ" డని చట్లాతిలక్ష్మీ నరసు రచించిన పద్మనాభ యుద్ధమను గ్రంథమున (ఇ) గలదు. ఆయాచార్యుఁడే కూర్మనాథ కవికిని గురువని యతని మృ. వి. న స్పష్టముగాఁ గలదుగదా. అందుచేఁ గూర్మనాథుఁడా విజయరామరాజు కాలమున గొంతవఱకుండి యుండెనని తలంపవలసియున్నది. అనఁగా నతఁడు 18 వ శతాబ్ది నడుమ విశేషకాలము జీవించి యుండును. క్రీ. శ. 1800 నాఁటికే యీతని మృత్యుంజయ విలాసమునకు మండలాంతరములందును విశేషప్రచారము గల్గినట్లు తెలియుచుండుటచే నది 1750 ప్రాంతమున రచింపఁబడియుండునని యూహింపఁ దగియున్నది.

శివ పార్వతుల కల్యాణకథ యిందలి యితి వృత్తము. మృత్యుంజయ విలాస మని పేరు పెట్టుటలోఁ బ్రత్యేకతయేమియుఁ

---

* ఈ వివరములు శ్రీ అడిదము రామారావుగారి విస్మృత కళింగాంధ్రకవుల చరిత్రమునుండి యెఱుఁగనైనది.

(అ) (ఆ) చూ. విశాఖజిల్లా గెజిటీరు – పుట 339.

(ఇ) పెద్దాపురము శ్రీ వత్సవాయి రాయజగపతివర్మగారిచేఁ బ్రకటితము.

ముద్రణ :– లక్ష్మీ ప్రింటింగువర్క్స్, రాజమండ్రి, 1934.

గానరాదు. ఈకథలో నాయకుని మృత్యుంజయ నామము సార్థకముగాదు. ఇందలి కథా ప్రణాళిక కాళిదాసీయమున కంత విలక్షణముగా లేదు. కాని శివుని యెఱుకత వేషము, కటికమువంటి భృంగిరిటి హాస్య పాత్ర, గంగా గౌరుల సవతి మచ్చరము యక్షగాన మని పేరు పెట్టినందుల కిందుఁ జేరిన విశేషములు.

రచనా గౌరవమును బట్టి మన యక్షగానములలో నిది యొక మేలు బంతి. కాని యది పద గుంభనలలో, వర్ణనలలో, సంవిధాన సంయోజనలోఁ బ్రబంధప్రాగల్భ్యము నంతటిని బుణికి పుచ్చు కొన్నట్టిది. ఇందుఁ బ్రబంధములందువలె నాశ్వాస విభాగము (మూఁడు), ప్రత్యాశ్వాసాంతమునను స్తుతిపద్య కవి గద్యలు నుండుట గమనింపఁదగినది. ఈ యాశ్వాస విభాగము, నీరచనా షట్కృయు యక్షగాన ప్రక్రియకు సహజమైనవికావు. కాని రూపక కళయు, గేయ ధర్మమును గూడ నిందుఁ దగినంత గలదు. గ్రంథకర్త యెత్తుగడలో దీనిని యక్షగానమని పేర్కొని యున్నను జివరికి వచ్చుసరికిఁ దన రచనాధోరణి నొకపరి సింహావలోకనము చేసికొని నట్లున్నాఁడు., మఱుల యక్షగాన మనుటకు మనసొప్పక ' నాకుఁదోఁచిన యట్ల నవ్య కావ్యంబు రచియించితి ' నని యొక క్రొత్తపేరు పెట్టినాఁడు - " నాటక గేయ ప్రబంధ " మని. అందుల కెంతయుఁదగి యున్నది. అర్వాచీన యక్షగాన కవు లాపేరినే, యీ ప్రక్రియనే యాదరించిన వారును గొందఱు గలరు. వారి కృతులపై దీని ప్రభావము బాగుగాఁబడినది. (అది ముందు సూచింపఁబడును) ఇందుఁబ్రసిద్ధరాగ తాళములలో దరువులు, ద్విపదలు, వానితో సమాన ప్రతిపత్తిగల పద్య గద్యములు, సం. శ్లోకములు, చూర్ణికలు, దండకములు, రగడ, కొట్నముల పాట, గౌరీ కల్యాణము, శోభనము, గలవు. ఇది ప్రదర్శన కెక్కినదని

సన్న విసనచ్చినది కాని యున్నదున్నట్లుగా నిది ప్రదర్శన సౌలభ్యముగల రచన కాదు.

---

26. ఉత్తరరంగకవి

భక్తాంఘ్రిరేణు చరిత్రము :*

కవి గుఱించి వివరములు తెలియవు. ఈగ్రంథము రచనాకాలమున కొక మేర నిర్ణయించుటకు మాత్రము డి. నం. 930. ప్రతి విలేఖన కాలము శరణ్యమైనది. అది ఖర మాఘ శుద్ధ పంచమి – ఆదిత్యవారము. ఇది క్రీ. శ. 9–2–1772 తేదీకి సరిపోవు చున్నది. గ్రంథరచన మంతకు ముందు జరిగి యుండవలెనని మాత్రము చెప్పనగును.

ఇది ప్రసిద్ధుఁడగు విప్రనారాయణుని చరిత్రము. అతఁడఱవమున తొండరడిప్పొడియాళ్వారని వ్యవహృతుఁడు. "తొండరడిప్పొడి" కి సమానార్థకమే భక్తాంఘ్రిరేణు వనఁగా.

ఇది నాటకమని పేర్కొనఁబడినది. ఇందు గ్రంథారంభమునఁ జోళరాజు "నాస్థాన సంతోషి" యగు 'కోలకేతని' రాక చెప్పఁబడినది. (ఇది కాని దక్షిణదేశమునఁ బుట్టిన గ్రంథమా యని చిన్న యనుమానము తగులుచున్నది.)

* 1. ఆం. సా. ప. 2974. (భ. కే. విలాసమని యున్నది.)
2. ప్రా. లి. పు. భాం. డి నం. 1912, 1930.

చవిగొల్పు రచన మిది. సలక్షణమైనదయ్యుఁ జక్కని వాడుక నుడిగారపుసొంపులు గులుకుచున్నది. విటకంటకి, విప్రనారాయణుని శిష్యుఁడగు వికటదాసరి ప్రసంగములందు హాస్యస్వారస్యములు గలవు. వాలకముల వర్ణనలు, ప్రసంగములు జాతివార్తా చమత్కారచారువులుగా నున్నవి. ఇందు ప్రసిద్ధరాగతాళములలో దరువులు, ద్విపదలు, గొలఁది పద్యములును గలవు. వచనములోఁగూడఁ బ్రాతల ప్రసంగములుగలవు.

---

27. అకలంకశ్రీకృష్ణవర్యుఁడు

కృష్ణవిలాసము:*

గ్రంథకర్త నృసింహగురునిపౌత్రుఁడు. లక్ష్మమా నృసింహగురుల పుత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. సింగరాచార్య శ్రీరఘునాథభట్టరార్యుల శిష్యుఁడు. కవి నివాసము వినుకొండసీమ. ఆసీమలోని కొమ్మాలపాటి (నరసారావుపేట తా). కోదండరాముఁడతని కిష్టదైవతము. అతఁడే యేతత్కృతిపతి. కొమ్మాలపాటి పురాధిపతియు

---

* ఆం. సా. ప. నం. 3047 — జలక్రీడా విలాస మను "లేబిలు" తో నున్నది. ఇందు నడుమ నొక పత్రమున "రుక్మిణీ కల్యాణము — యక్షగానము" అని యున్నది. కృష్ణజననాద్రుక్మిణీ కల్యాణపర్యంతమిందలి విషయము. కాని యిం దెచ్చటను జలక్రీడాప్రసక్తి కానరాదు. దీనికిఁ గవిపెట్టిన పేరేమో తెలియదు. అది తెలియుదాఁక దీనిని కృష్ణవిలాసమని వ్యవహరించుట లెస్సయనుకొందును.

మన్నెహంవీర పాపన్న భూపతి [1] కని బుచ్చిమాంబికకును బుత్రుఁడు నైన గుమ్మడ పురమణరా జేతమ్మకృతి ప్రోత్సాహకుఁడు. (ఈ విషయము లీగ్రంథము నుండియే యెఱుఁగ నైనది) కృష్ణమూర్యుఁడు ప్రౌఢకవి. ఉద్దండపండితుఁడు. ధనుర్విద్యావిలాసము, శకుంతలా పరిణయము, కొమ్మాలపాటి దండకము ననునవి యితని కృశ్యంతరములు. ఇతని ధనుర్విద్యావిలాసకృతి పేరకుఁడగు కృష్ణానేని తిరుపతిక్ష్మాపతి క్రీ. శ. 1775 దాఁకనున్న వాఁడని శ్రీవేటూరివారు తత్పీఠికలో నిర్ణయించి యుండిరి[2] మఱి యీకృష్ణమూర్యు డాప్రాంతమున నున్నట్లేకదా.

ఈగ్రంథమునందు దేవకిపై గంసుఁడు కత్తినొఱ దూయుటతోఁ గథారంభము. చక్కని యెత్తుగడ. కథ రుక్మిణీ కల్యాణము వఱకు నున్నది. (ఈయసమగ్రప్రతిలోఁ గల్యాణకాండ లోపించినది).

ఇందలి రచన కడు ప్రౌఢమైనది. అర్థచమత్కార శబ్దాలంకార చారువైనది. మనోజ్ఞజాతీయతా ప్రకృష్టమైనది. ఇందు వివిధ ప్రసిద్ధ కర్ణాటక హిందూస్తాని రాగతాళములలో దరువులు, ద్విపదలు పద్యములు, ఒకచూర్ణిక, జోలపాటయుఁ జాలయేలలును గలవు. విరళ ప్రచారముగల జంగల రాగము, జుల్వా తాళము నిందుఁబ్రయుక్తములు. "శారద పద్య" మను వేర నదిపద్యముకాదు రాగతాళము లుదాహరింపఁబడి దరువువలె నడుచు నొక రచనావిశేషమిందు ద్వివారము ప్రయుక్తమైనది.

---

1. చెన్నూరి శోభనాద్రికవి శృంగార సుధా సముద్ర పూర్ణచంద్రోదయ ప్రబంధము. (ప్రా. లి. పు. భాం. డి. నం. 848) కృతిపతి యితఁడే. ఆం. క. చ. న శోభనాద్రికవి కాలము నిర్ణయింపఁబడలేదు.

2 ధ. వి. — ప్రా. లి. పు. భాం. ప్రచురణ. 1950.

28. (జూలకంటి) నారాయణకవి

కొమ్మాలపాటి రామాయణము :*

(సుందర కాండము)

ఈనారాయణకవి యింటిపేరు తెలియదు. ఇతఁడు జూలకల్లు వాసి. జూలకంటి గోపాలుఁ డీతని కిష్టదైవతము. త్రివర్ణవైష్ణవుఁడు (వైశ్య వైష్ణవుఁడు ?) తండ్రి గుర్వన. ఇతఁడీకృతిని "శ్రీమద్గుమ్మడపు రమణభూమీశలలామసతత పూజితుఁ" డగు కొమ్మాలపాటి సీతారామస్వామి కంకితమిచ్చెను. ఈగుమ్మడపు రమణరాజే తత్కృతి ప్రేరకుఁడు కావచ్చును. ఇతఁడే అకలంక శ్రీకృష్ణమార్యుని శ్రీకృష్ణ విలాస కృతి పోత్సాహకుఁడును. అతఁడు క్రీ.శ. 1775 ప్రాంతమువాఁడుగా శ్రీ వేటూరి వారి ధనుర్విద్యావిలాస పీఠికలోఁ గలదు. (ఇది పూర్వోక్త విషయమే) అనఁగా నారాయణకవియు నాకాలము వాఁడే యగును.

ఇందలికథ ప్రసిద్ధము. రచన చక్కనిది. ప్రసిద్ధరాగ తాళము లందు దరువులు, ద్విపదలు, పద్యములు, సంధివచనముల వంటి వచన ములును గలవు. నాటకీయత గలదు. గ్రంథము యక్షగానమని వేఁకొనఁబడినది.

---

* ప్రా. లి. పు. భాం. ఆర్. నం. 671.

29. దినవహి ఓబయమంత్రి

గరుడాచలవిలాసము: *

ఇతనితండ్రిపేరుకూడ నోబయ్యయే. తల్లి చెన్నమాంబ. ఇతఁడు నందవరము [1] కరణము. ఇంతే యితనిగూర్చి గ్రంథమునుండి యెఱుఁగ నైనది. ఈ కవి కాలము నిర్ణయించుటకుఁ దగిన యాధారములు లభించుటలేదు. కాని రచనా ప్రక్రియనుబట్టి చూచినచో యక్షగాన పరిణామచరిత్రలో నిది మిక్కిలి ప్రాచీనస్థితిని సూచించుచున్నది. అచ్చు మచ్చిది సుగ్రీవ విజయ రచనాప్రణాళికను బోలినదే. వెనుకటిదినము లలో సుగ్రీవవిజయముకంకెను నిది ప్రచుర ప్రచారమును వహించి యుండెను. యక్షగాన వాఙ్మయ పరిశోధకులలో నగ్రగణ్యులగు కీ. శే. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు "ఈ కాలమున మనకు లభించుచున్న యక్షగానములలో నెల్ల మిక్కిలి ప్రాచీనము లైనవి గరుడాచలము నీలాచలము ననునవియే ... గరుడాచల నీలా

---

* ఇది 1872 లోనే ముద్రితమైనదని ఆం. వా. సూ. లోఁ గలదు. 1925 లోఁ ప్రకటితమైన వావిళ్ళవారి ప్రతియొకటి నే డుపలబ్ధమగుచున్నది. కాని యముద్రితాంధ్ర గ్రంథ భాండాగారము లన్నిట దీనిలిఖిత ప్రతులు గలవు. (ప్రా. లి.పు. భాం. డి. నం. 1864 — 1868, తం. స. మ. కే నం. 479 — 480, ఆం. సా. ప. నం 245, 3680) వానికిని వావిళ్ళవారి ప్రతికిని కవి విషయముగల గ్రంథాంత ద్విపదలోఁ గొంతభేదము గలదు. ఆ విషయమున లిఖితప్రతులే గ్రాహ్యములు.

1. ఈకృతి గరుడాచలము లేక యహోబలమునకు సంబంధించినదగుట, ఆహోబలము కర్నూలు మండలముననున్న దుగుట నీనందరవరము కర్నూలుమండలములోనున్న నందవరమే యనుకొంటిని. కాని ప్రస్తుత మా నందవరము కరణముగారగు శ్రీ అబ్బాయి వెంకటసుబ్బయ్యగారానందవరము కరణాల వంశావళిని సంప్రతించి యచట శా. శ. 1058 లగాయతు నేటివఱకు దినవహివారు లేరని తెల్పినారు.

చల నాటకములకంటె ప్రాచీనములైన యక్షగానములు తదితరము లిప్పుడు గానరావు" అని వక్కాణించియున్నారు.[2]

వారది రుద్రకవి సుగ్రీవ విజయము నెఱిఁగియుండి యన్న మాటయే అయితే అది గరుడాచల రచనా ఘక్కికను బోల్చిచూచి వారుచేసిన యూహామాత్రమే. ఇప్పటి కీ గరుడాచల రచనాకాలమున కొకమేర నిర్ణయించుటకుమాత్రమే యనువుపడుచున్నది. అది డి. నం. 1867 ప్రతివిలేఖన కాలము – సౌమ్యనామ సంవత్సర జ్యేష్ఠశుద్ధ చతుర్థీ గురువారము. ఇది క్రీ. శ. 28-5-1789 కి సరిపోవుచున్నది.

గ్రంథ విషయము :– ప్రహ్లాదుని కోరికపై లక్ష్మీసమేతుఁడై వేదాచలమున విడిసిన నరసింహుఁడొకపరి గరుడాచల విహారమున బయలుదేఱుట – అక్కడ నొక చెంచెతను జేబట్టుట, – లక్ష్మీనరసింహుల నడుమ నారదుని కైలాటము – నరసింహుఁడు చెంచెతతో వేదాద్రికిఁ బయనమగుట – బెట్టుసరిచేసిన లక్ష్మీదేవి నెట్టెటో సమాధానపఱచుట – అంతలోఁ జెంచెత తండ్రి శిఖినాయకుఁడు తనకూఁతును లేవఁదీసికొని పోయెనని నరసింహునిపై నెత్తివచ్చుట – నరసింహుఁడొలిగట్టి వారితోఁ గలిసిమెలిసి చెంచుహోబఁడగుట – (కాంజి వెంకటాద్రి వాసంతికా పరిణయమున నరసింహుఁడు చెంచెతను జేపట్టుటతోసరి మఱి యా రెండవఘట్టము లేదు.

ఇందు దరువులన్నియుఁ దాళ ప్రధానములై మంచి పరువుగల నడకతో సాగినవి. అట, ఏక, త్రిపుట, రూపకము, జంపె, కుఱుచ జంపె తాళములు వాడఁబడినవి. ద్విపద లాఖ్యానశైలీ పరములుగా నున్నవి. సంధి ప్రయోజనాత్మకములగు వచనములు తఱచు, కంద గీత

2. వారి వ్యాసము 'యక్షగానము లేక జక్కులపాటలు, — ఆంధ్రపత్రిక దుర్మతి సంవత్సరాది సంచిక, 1921.

పద్యములు విరళముగాఁ బ్రయుక్తములు ; ఏలలు, శోభనము, ధవళ మును గలవు. ఒక కందముతో గ్రంథారంభము. - జంపెలో షష్యంత ములు, ద్విపదతో గ్రంథాంతము. రచన చక్కనిది. గ్రంథము యక్ష గానమని పేర్కొనఁబడినది.

---

30. భీమసింగికవిరాజు

రాణీరాజవిలాసము :*

ఈ గ్రంథకర్త పేరేమో యిదమిత్థముగాఁ దెలిసినది కాదు. కాని గ్రంథమునఁ బలుతావుల భీమసింగిరాజులగు జంపన నరసింహా ప్పల విజయరామ భూపతులు పేర్కొనఁబడిరి. గ్రంథాంతమున " రాణీ రాజ విలాసం బీగతి రచియించిన కవిరాజును " అని మాత్రము గలదు. ఈకవిరా జెవఁడో భీమసింగి ప్రాంతమువాఁడై యుండును. ఆ రాజులే తత్కృతి పోత్సాకులై యుందురు. భీమసింగి విశాఖమండలమున శృంగవరపు కోట తాలూకాలోనున్నది. దీని కనతిదూరమున నున్న పద్మనాభమను గ్రామము నొద్ద విజయనగర రాజగు పూసపాటి రెండవ విజయరామరాజునకును, కుంఫిణీవారికిని జరిగిన యుద్ధము ప్రధాన విషయముగాఁ జట్రాతి లక్ష్మీనర్సు రచించిన పద్మనాభ

* ప్రా. లి. పు. భాం. ఆర్. నం. 540 కేటలాగులోనిది రాజారాణి విలాస మని పేర్కొనఁబడినది. కాని గ్రంథాంతమున నిది రాణీరాజవిలాసమని కవిచేఁ బేర్కొనఁబడినది.

యుద్ధమను గ్రంథమున [1] 116 వ పద్యమునఁ బూసపాటి విజయ రామ రాజు పక్షమున జంపన విజయరామావనీంద్రుఁ డాయుద్ధమునఁ బాల్గొని నట్లు చెప్పఁబడినది. అందే 278 వ పద్యమున జంపన అప్పలరాజును నతఁడు యుద్ధమున నిహతుఁడైనట్లు గలదు. ఈ యుద్ధము క్రీ. శ. 1794 లో జరిగినది. [2] కాఁగా నీ గ్రంథము 1794 సం. న కించుక పూర్వము రచింపఁబడి యుండినట్లూహింపఁబడుచున్నది.

గ్రంథ విషయము :— మగధరాజపుత్రి స్వయంవరమునఁ గాశ్మీర పతిని వరించుట — అతఁడొకనాఁడు మృగయా విహారము నేయఁ బోయి వనమున విహరింపవచ్చిన వైశ్య శూద్రముని కన్యల నిరువురఁ జూచి మోహించి, వారి పితరుల యనుమతిపై వారిని జేపట్టి యందుం డుట - అట నంతఃపురములో విరహావిహ్వలయగుచున్న రాణి దూతికల వలన సంగతి విని రాయబారము లంపుట — అతఁ డానవాలిచ్చుట ఉండఁబట్టక రాజుకడకు రాణి స్వయముగా బయలుదేఱుట - రాజుతో, సవతులతో నామె సంవాదము — సమాధానము.

ప్రసిద్ధ కర్ణాటక హిందుస్తానీ రాగ తాళములలో నున్న దరు వుల మయమైన రచన యిది. దరువులక్రింద స్వరజతులు, శబ్దములును బలు తావుల నుపాహరింపఁబడినవి. హిందూస్తానీ దరువులగు టప్పాలు, టుమ్రీలు నుండుట విశేషము. పద్యములు చాలఁగలవు. ద్విపదలు లేవు. అక్కడక్కడ హిందీభాష కొంత ప్రయుక్తము. గ్రంథమంతయు సంవాద శైలియందే గలదు. " రాజు వాక్యం ", " రాణివాక్యం " మొ. పాత్రల సంభాషణ పీఠికలు గలవు. నాయిక విరహవేదన ఘట్ట

1. ముద్రితము — లక్ష్మీ ప్రింటింగు వర్క్స్, రాజమండ్రి, 1934 ప్రచురణ కర్త :— శ్రీ వత్సవాయి రాయజగపతి వర్మ.

2. చూ. విశాఖ జిల్లా గెజిటీరు, పుట 339.

మున ప్రబంధము భామ కలాపముల పోకడలు గలవు. పారిజాతాప హరణ రాధామాధవ సంవాద ప్రబంధము లందలి పద్యములు గొన్ని గ్రహింపఁబడినవి. కాని యీ కవి రచనయుఁ గడు చక్కనిది. కవిచే నిది యక్షగానముగాఁ బేరొక్కనఁబడలేదు. కాని ప్రక్రియ యంతయుఁ దత్సదృశమైన దే; ప్రదర్శనోద్దిష్టమైనదని యూహింపవచ్చు.

---

31. నరుకూరు నారాయణకవి

పారిజాతనాటకము :♦

కవి విశ్వకర్మాన్వయుఁడు. నరుకూరి ముత్తయ్యకుఁ గాళమాంబకుఁ బుత్రుఁడు. కొండూరి వెంకటాచార్యుని శిష్యుఁడు. గ్రంథము నరుకూరి చెన్న కేశవ ముద్రగలది. కవి నివాస మదే కావచ్చును. (నరుకూరు నెల్లూరుతాలూకాలో నున్నది.) ఇది వెంకటగిరి ప్రభువును రేచర్లగోత్రజుఁడును, వెలుగోటి బంగారు యాచమనాయకుని కుమారుఁడైన కుమారయాచమ నాయకుని కంకితము. ఈ వేరింటిరాజులావంశమునఁ జాలమంది గలరు. "వెలుగోటివారి వంశచరిత్రము" లేక "వేంకటగిరిరాజుల వంశచరిత్రము" అనుగ్రంథము* నె 126–134 పుటల

♦ ఇది 1882లోనే ముద్రిత మని ఆం. వా. నూ. లోఁ గలదు. మఱల 1906. లో మదరాసు జీవరక్షా ము. శా. చేఁ బ్రచురితము.

* శారదాంబా విలాస ముద్రాయంత్ర ప్రచురణ, మదరాసు, 1910 గ్రంథకర్త:— వెల్లాల సదాశివశాస్త్రులు. అవధానము శేషశాస్త్రులుగారలు.

నడుమ నావంశమున 25 వ తరమువాఁడగు కుమార యాచమ నాయకుని యుదంతము గలదు. అందు 127 పుటలో " నరుకూరు నారాయణప్ప యనుకవి పారిజాతాపహారణమును యక్షగానమును వీరి కంకితముగా రచియించెను " అనికలదు. ఈకుమారయాచమ నాయకుఁడు బంగారుయాచమ నాయకుని తనయుఁడనియు, నితని జననము క్రీ. శ. 1762, పట్టాభిషేకము 1777, నిర్యాణము 1805 అనియు నందు గలదు. కాఁగా నారాయణకవి 1777 - 1805 సం. ల. నడుమ నుండె ననుట నిశ్చయము.

గ్రంథ విషయము:— కథ ప్రసిద్ధము. తిమ్మనగారి ప్రబంధమును జూచి తానీ నాటకమును రచించినట్లు కవి చెప్పినాఁడు. అదే కథా ప్రణాళిక కాని యిందు పుణ్యకవ్రతకథ పరిహరింపఁబడినది. సవతి కయ్యము పుట్టము ప్రసంచింపఁబడినది. రాధపాత్రకుఁ బ్రవక్తృగలదు. రచన చక్కనిది. దీనిపై భామకలాపము ప్రభావము, నర్వాచీన పారిజాత య. గా. లపై దీనిప్రభావము నతిమాత్రముగాఁ గన్పట్టును. ఇందు తాళ ప్రధానములైన దరువులు, ద్విపదలు, పద్యములు, కందార్ధములు, గీతార్ధములు, ఏలలు, అర్ధచంద్రికలు, శోభనములు, శ్లోకములు, చూర్ణికలు మొ. రచనా విశేషములు గలవు. సంధివచనము లాపేరఁ బేర్కొనఁబడినవికలవు. పాత్రల సంభాషణ పీఠికలు, పాత్రలను వారివృత్తాంతము గుఱించి పృచ్ఛించు మాధవివంటి పాత్ర హాస్యగాఁడను పేరఁ గలదు. వాఁడు పాత్రలప్రసంగములకు 'పేరడీ' లు చేయుట విశేషము. పాత్రలు ప్రవేశింపఁగనే స్వీయోదంతమును బ్రకటించుకొనుటగలదు. ముఖాముఖి సంభాషించుట గలదు. ఇది నాటకమని కవిచేఁ బేర్కొనఁబడినది. నాటకీయత ప్రస్ఫుటముగాఁగలదు. ఇది

ప్రదర్శనములందు విశేషప్రచారము గాంచినది. దీనికి "ఆటభాగవత" మనియుఁ బేరుగలదు.*

---

32. లింగమూర్తి కవి

శివ పారిజాతము:*

కవి గురించి వివరము లిందుఁదెలియరావు. గ్రంథ ప్రతి (డి. నం. 1944) విలేఖనకాలము "విశ్వావసు సంవత్సరం భాద్రపద

---

* మూ. ప్రా. లి. పు. భాం. ఆర్ నం. 560.

ప్రత్యంతరములు:— ప్రా. లి. పు. భాం. డి. నం. 1899—1900 తం. స. మ. కే. నం. 488 సత్యభామకథ — కర్త పేరిందుఁ గానరాదు. కాని యిది నరుకూరి పారిజాతము భాగమే. తం. స. మ. కే. నం. 487 రాధ కథ, ఆం సా. ప. నం 173 గొల్ల కథలోను నరుకూరి చెన్న ముద్రతోనున్న దరువులు గలవు నారాయణకవి గొల్ల కలాపముగూడ రచించి యుండెనా!

* ప్రా. లి. పు. భాం. డి.నం. 1944—ఆర్.నం. 1157. (ప్రా.లి. పు. భాం. డి. నం. 1945-ఆర్. నం. 1197 కూడా శివపారిజాతమే. ఇందు గ్రంథకర్త పేరు కానరాదు. ఇది పైదానికంటె వేఱని కేటలాగులోఁ గలదు. కానియది కేవలము స్వతంత్ర గ్రంథము కాదు. తక్కర్త యెవఁడో లింగమూర్తి గ్రంథ భాగములనే భాగుగా సంగ్రహించినాఁడు. ఆ పద పద్యములనే యించించుకమార్పుటకుఁ బ్రయత్నించినాఁడు.

ఆర్. 1157—45, 51, 57, 59, 62, 63, 64, 67, 72, 106 వ పుటలలోని ద్విపదలను, పద్యములను—

ఆర్. 1197— 13, 1, 4, 7, 8, 10, 12, 13, 16 వ పుటలలోని ద్విపదలతోఁ బరుసగాఁ బరిశీలించినచో నా పోలిక స్పష్టపడగలదు. 1157 లోని గొల్లభామ, సింగీ సింగర్ల ప్రసంగములు మొ. 1197లో విడువఁబడినవి.)

శు. 6 శుక్రవారం" ఇది క్రీ. శ. 9–9–1785 తేదీకి మాత్రమే సరి పోవుచున్నది. అనఁగా గవి యంతకుఁబూర్వఁ డనవలెను. రచనా ధోరణినిబట్టి చూచిన యతఁడంత ప్రూర్వఁడనిపించుటలేదు.

గ్రంథపుఁజెత్తుగడ యేమిటో గజిబిజిగానున్నది. మొదట "బాలరుద్ర వేషము" ప్రవేశము. అతనిని వెదకుచుఁ బార్వతిరాక. తరు వాతనొక "బైరాగివేషము" ప్రవేశించి హిందిలోఁ బ్రసంగించును. తదుపరి యొకచిన్న గొల్లకలాపము. సుంకరి శ్రీగిరి (గొ. క. ల.లో సుంకరి పేరు కొండయ్యగాఁ బ్రసిద్ధము) గొల్లభామతోఁ జెయిముట్టు సర సముచేయఁబోఁగా నామె యత్తగారు వచ్చును. అంత "ఎఱుకల వేషము"– పార్వతికిఁ బ్రియుఁడు ప్రసన్నుఁడగునని యెఱుకచెప్పుట- సింగనివర్ణన, ప్రసంగముగలవు. తరువాత "చెంచెత వేషము" న గౌరి, "బాలకివేషము" న గంగ, మీనాక్షి, పద్మాక్షి, కనకదుర్గయును వారెవరో శివుని వెదుకవత్తురు. "రుద్రవేషము" వారినివెదుకవచ్చును. త. నాయికానాయకుల విరహవేదన, సంవాదములు, అలుక తియ్యారిం పులు, సవతుల కయ్యముసాగినవి. గ్రంథముపేరు శివపారిజాతమే కాని యిందు పారిజాతప్రస క్తిలేదు. అసలు పారిజాతకథ సవతి మచ్చరము నకుఁ బేర్పడ్డది. కాఁబట్టి యిందును శివ సతుల సవతిమచ్చరము వర్ణిత మైనదికాఁబట్టి యీపేరుపెట్టబడినదనియూహింపనగును. మొదటఁగథా సంవిధానములోను రచనలోను లగువు బిగువులు గానరావు. రానురాను హెచ్చినవి. ఇందు గొల్లభామ కథకు బొత్తుగాఁ బ్రమేయములేదు. (ప్రతివిలేఖకుల దోషము లేమైన నిందుగలవేమో!) ఇందుఁబదములు, ద్విపదలు నెక్కు–న. తదుపరి పద్య సంఖ్యయు నందు సీస సంఖ్యయు నెక్కు–వ. వచనములు కొద్ది. సం. శ్లోకములు (కొన్ని ప్రసిద్ధములే), చూర్ణిక, యాలలు, సారంగపదము గలవు. గ్రంథమెక్కు–వగాఁ

భాగతల సంభాషణలలోనే సాగినది. ప్రవేశ సమయమునఁ భాగతలు స్వవిషయమును జెప్పుకొనుటయు నిందుఁగాననగును. రచన నిర్దుష్టము కాదుగాని చతురముగాసాగినపట్లు నిందుగలవు.

33. అక్కెనప్రగడ హరిదాసు

ఇతఁడు "శ్రీరామ నిత్యోత్సవ యక్షగానము, అమరేశ్వర స్వామి బాలచాముండి అమ్మవారి ఏకాంతసేవ" అను రెండు యక్షగానములను రచించినట్లును నవి ప్రచురితములైనట్లును ఆం. వా. సూ. లోఁగలదు. ఇతఁడు కుబ్జా కృష్ణవిలాస మను కావ్యమును రచించినట్లును నితనికాలము 18 వ శతాబ్ది యనియు వర్ణన రత్నాకరమునఁ గలదు. (గ్రంథములు నా కలబ్ధములు).

---

34. గోపాలుని సింగయ

ప్రభావతీ ప్రద్యుమ్నము:*

కవి విషయము:– గోపాలాన్వయుఁడు. భాస్కర మంత్రి పౌత్రుఁడు. వీరన మంత్రి పుత్రుఁడు. తల్లి యోబమ. ఆం. క. చ. నుండి తెలిసిన విశేషములు: ఇతఁడు నియోగి. మౌద్గల్య గోత్రుఁడు.

---

* ప్రా. లి. పు. భాం. డి. నం. 1910.

కిరాతార్జునీయాంధ్ర కావ్యానువాద మితని కృత్యంతరము. ఈ కవి కమ్మనులమండలములోనివాఁడు. ఈ కవి పుత్రుఁ డెనుబది సంవత్సరముల క్రిందట జీవించియుండెను. కాఁబట్టి కవి నూఱు సంవత్సరముల క్రిందటివాఁడు. (అది ఆం. క. చ. రచనాకాలమునాఁటికి) అది యథార్థమగునేని కవి క్రీ. శ. 13 వ శతాబ్ది తురీయపాదము నందుండె నన వచ్చును.

గ్రంథవిషయము:— ఇది పింగళి సూరనామ్యుని ప్రభావతీ ప్రద్యుమ్నమునకు యక్షగాన రూప పరివర్తనము. కథా ప్రణాళిక యథా సూరనీయముగా నడచినది. అందలి పద బంధములు, భావములును నిందలి దరువులలో విరివిగా దొరలినవి. అయినను సింగయ స్వతంత్రముగను జతురమైన రచన చేయఁగలఁడని తేటపడినది. ఇందు దరువులు, ద్విపదలు నెక్కువ. గద్యపద్యములు కొద్దిగా గలవు. ఎడనెడ నర్థచంద్రికలు, నొక్కొక ధవళము, శోభనము, ఏల, మంజరియును గలవు. దరువు లెక్కువగా దాళప్రధానములు. వివిధతాళశేషులు నుండుట విశేషము. రాగము లక్కడక్కడ పేర్కొనఁబడినవి. సూరన కృతిలోని గంగావతార నాట్యప్రసంగమిందు లేదు. కాని దానికి "బదులు" గా పగలాట ప్రదర్శన వర్ణన విపుల ముగా గలదు. అందు పాత్రలు తెరవెడలు క్రమము సూచింపఁబడినది. వేరడి, ప్రబంధజక్కిణి, చిందు, కొరవంజి, జోగిణి, మొ. నాట్యభేదములు పేర్కొనఁబడినవి. నటపారిపార్శ్వక, విదూషక ప్రసక్తి కలదు. ప్రేక్షకాగారమున రాణివాసపు వారికిఁ బ్రత్యేకపు తెరాన్ లుండినట్లు పేర్కొనబడినది.

35. పురిజాల లక్ష్మీ నారాయణ కవి

పారిజాతము: *

కవి కాశ్యపగోత్రుఁడు. పాపయామాత్యపౌత్రుఁడు. అనంత మాంబానాగయా మాత్యుల పుత్రుఁడు. తిరుమల తాతాచార్యుల శిష్యుఁడు. పాలకొండ రామభద్రనృపతి తత్కృతి ప్రోత్సాహకుఁడు.

దీనికిఁ కవి స్వహస్త లిఖితమైన తాళపత్రప్రతి లభించుటయు, లేఖనకాలము పేర్కొనఁబడి యుండుటయు విశేషము. ప్రతిచినర "కాల యుక్తినామ సంవత్సర పుష్య బ ఁం గురువారం సరిక్ పురిజాల లక్ష్మీ నారాయణుఁడు లిఖించెను." అనియున్నది. ఇది క్రీ. శ. 31-12-1618 తేదీకి మాత్రము సరిపోవు చున్నది. కాని గ్రంథ రచనాకాలమది కాఁజాలదు.

ఈగ్రంథమున క్షీరగిరి ప్రశంస గలదు. కృతి ప్రోత్సాహకుఁడు పాలకొండ రామభద్రనృపతి క్షీరగిరి పాలకొండకు సంస్కృతీకరణమై యుండుననియు నది రామభద్ర నృపతి యూరై యుండుననియుఁ దోఁచును. స్థానికముగా క్షీరగిరియనికవుల వ్యవహారముగల పాలకొండ పుర మొకటి నేఁటి శ్రీకాకుళ మండలమున నున్నది. అది వెనుక విశాఖ మండలమునకుఁ జెందియుండినది. ఆదినములలో నీప్రతి విశాఖమండ లమునుండియే సంపాదింపఁబడినది♦ కవియు విశాఖమండలమునకుఁ జెందినవాఁడై యుండును. రామభద్ర నృపతికాలము తెలియవచ్చుట లేదు. కాని క్రీ. శ. 1618 నాఁటికి విశాఖమండలమున యక్షగాన

---

* ప్రా. లి. పు. భాం. ఆర్. నం. 438.

♦ చూ. ప్రా. లి. పు. భాం. త్రైవార్షిక నివేదిక సం. 3--పుట 1178.

ములు వెలసిన జాడలేదు. అదికాక గ్రంథమున మాధవి పాత్రయు, భామకలాపము షక్కికయుఁ గన్పట్టుచున్నవి. అవి క్రీ. శ. 1672–1685 ప్రాంతమున నుండిన సిద్ధేంద్రయోగి సృష్టికిఁజెందినవి. మఱి యొక సంగతి ఇందు కవి మన్మథుని నవాబుతో సరిపోల్చిన సందర్భము నందలి యొక పద్యము:–

> "నెలయను తెల్లవాండు గరిణేలుగ (?) చిల్కలబారు సోలుదా
> దులుగ (?) సునాదమిచ్చుమగ తుమ్మెద పిల్లన గ్రోవికాండుగా
> దలఁకక పల్కు కోయిలలు తంబుర వాయదకాండ్లుగా నెమ
> ళ్ళలుకుడు తా సిపాయిలుగ నావలి తెమ్మరయున్ ద్విభాషిగా
> బలుఁడు మరుండు వెల్గడె నబాబయి పాంథజనాళినేచగన్"

ఇందలి గరిణేలు (గవిణే ు) సోలు దాదులను శబ్దముల కర్థము స్ఫురించుచున్నది కాని వాని స్వరూపము వింతగానున్నది. వాని యథార్థ స్వరూపము గవర్నరు, సోల్జరులునై యుండునా యని యను మానము. "తెల్లవాండు" శబ్దమున శ్వేత వర్ణుఁడగు పాశ్చాత్యుఁడు స్ఫురించుచున్నాఁడు. అతనికి నబాబు తోడి సంబంధమును ద్విభాషి శబ్దము సూచించుచున్నది. అట్టి సంబంధములు, నా తెల్లదొరల ప్రాభవము మనదేశమున క్రీ. శ. 1619 నాఁటి కేర్పడి యుండలేదు. విశాఖ మండలమున క్రీ. శ. 1757 లో జరిగిన చరిత్ర ప్రసిద్ధమైన బొబ్బిలి యుద్ధము కారణముగా కవిపేరు, నవాబు, దుబాసి మొదలగు పద జాలమున కటఁ బ్రచారము గల్గినది. 1757 తరువాత వచ్చిన కాలయుక్తి 1793–99 సం. లలోఁ బడినది. ఆ కాలయుక్తి పుష్య బహుళ ౧౦ క్రీ. శ. 30-1-1799, కాని యది బుధవారము. మఱునాఁడే కదా గురువారము – పు. బ. ౧౧. అంకెలోనో తిథిలోనో యేదో చిన్న యరమరిక యుండి యుండును గాని గ్రంథ లేఖనమైన దిన మదే యై యుండు

ననవచ్చును. (ఆ తరువాతి కాలయుక్తి 1853–59, లోఁజూచినను నీ యరమరిక తీరదు. ఎట్లయినను గ్రంథరచనా విషయమున నది 1859 కి ముందు జరిగెననుట సునిశ్చితము. 1799 సం. ను గ్రహించుట లెస్స యగును). అగుచో నదే కవి కాలమునగును గదా !

గ్రంథవిషయము :— కవి తన గ్రంథమును యక్షగాన ప్రబంధ మని పేర్కొనినాఁడు. అటఁబ్రబంధ శబ్దము కావ్య సామాన్యవాచి మాత్రమే కాదు. కొంత సార్థకమునైనది. చంద్రోదయాది వర్ణనలు, నాయిక విరహావస్థయు, గ్రంథాంత పద్య గద్యములు నందులకుఁ దారాక్ష్యములు. నాయిక మాధవితోఁ దన సాద వెళ్ళబోసికొను టయుఁ బ్రియునికడకు రాయబారములు బంపుటయు మొదలగునవి భామకలాపము ఫక్కిని దలఁపించును. పారిజాత కథతోఁ సంబంధము లేని రాధ పాత్ర కిందుఁ బ్రవక్తి గల్గినది. అది యొక యసందర్భమే యగును.

ఒక విశేషము :—ఇం దాట భాగవతములందుఁ బురుషులు స్త్రీ వేషములను ధరించుటగూర్చి సత్యభామకు సఖి పాత్రకు నడుమ నొక చర్చ సాగినది. పురుషులు స్త్రీ వేషములను ధరించు టుచితముగాదని సఖి వాదము. భంగాశ్వ జగన్మోహినీ వృత్తాంతములు చెప్పి సత్యభామ సఖి వాదమునకుఁ బ్రత్యాఖ్యానము చేసి విషయమును సమర్థించినది. ఈ ప్రసంగమునఁ గవియుద్దేశము పురుషులును స్త్రీ వేషములను బూన వచ్చునని సమర్థించుట. తగిన సందర్భము లేకున్నను నతఁడావిషయము నెత్తుకొని యక్షేల సమర్థింపవలసివచ్చినది ? అనఁగా స్త్రీ పాత్రలను బురుషులుగాక స్త్రీలే నిర్వహించుట యుక్తమను వాదము క్రొత్తగాఁ గవి సమకాలికులలో బయలుదేఱినదో ; లేక యక్కడక్కడ వీథి భాగవతములలోఁ దొలుత స్త్రీ పాత్రలను స్త్రీలే నిర్వహించుచుండి

రనియు నీ కవికాలమునాఁటికిఁ బురుషులు నందులకుఁ బూనుకొను చుండఁగా నచ్చటచ్చట యూహ్యోపణ బయలుదేఱి యుండుననియు నూహింపనగును.

ఈ యూహను గవి నివాసమగు విశాఖమండలమునకే పరిమిత ముగా నైనను గ్రహింపవచ్చును. "విశాఖపట్టణముజిల్లా వృత్తాంత సంగ్రహము" 130 వ పుటలో నా మండలములో నాఁడబడు "జన రంజకనాటకము" లలో "స్త్రీలు, పురుషులు వేషములు వేసుకుని వినికిడిచేసెడి" వారని కలదు. అందే 136 వ పుటలో నా జనరంజక నాటకములలోఁ బారిజాతమొకటి యని చెప్పఁబడినది. అది లక్ష్మీ నారాయణకవిదే కావచ్చును.

పై ప్రసంగమునుబట్టి యిది పదర్శనోద్దిష్టమైనదే యని చెప్ప వలెను. ఇందుఁ బ్రసిద్ధరాగతాళములలో దరువులు, ద్విపదలు, వచన ములు, పద్యములు, చూర్ణిక, శోభనము, మంగళహారతి మొ. కలవు. అటనట నెఱసు లున్నను సరసమైనదే రచన.

---

36. పటిహారం ఎంబారయ్య

కురవంజి:

ప్రతి ప్రా. లి. పు. భాం. డి. నం. 1855. ఇందు కవి గుఱించి వివరములు లేవు. పై ప్రతివిలేఖనకాలము "రుదిరోద్గారి సంవత్సరం మార్గళి నెల 10 వ తేదీ దశమీ శుక్రవారం" ఇది క్రీ. శ.

23-12-1803 కి సరిపోవుచున్నది. కవి యంతకొక్కింత పూర్వుడై యుండును.

రామానుజాచార్యుడొకపరి కురవంజి నే పథ్యము స్వీకరించి కాంచీపురాధిపుని పట్టమహిషియగు అసుందేవి తాయి కడకుంబోయి విశిష్టాద్వైతపరముగాఁ బాంచ భౌతికదేహ తత్త్వము, జీవేశ్వర మర్మములు మొ. వానిఁగూర్చి యుపన్యసించుటయుఁ బెరుమాళ్లు (శ్రీమహా విష్ణువు) సింగఁడై వచ్చుటయు నీ గ్రంథవిషయము. (ఎఱుకతె పెట్టిన యేకరువులో అద్దంకి సింగరాచార్యుల పేరు దొరలినది. అతఁడు క్రీ. శ. 1600 ప్రాంతమందుండిన రేటూరికవుల గురువు - చూ. ఆం.క. తే. 11 సం.) ఇందుఁ బ్రసిద్ధ రాగములలో దరువులు, తాళప్రధానములగు పదములు, ద్విపదలు, రెండు మూఁడు వృత్తములు, సంధి వచనములు గలవు. ఏల, ముచ్చట, అల్లో నేరేళ్ళు, పాళిపదం, సువ్వాల ధాతువు విశేషములు-రచన యొకమోస్తరు.

---

37. విశ్వేశ్వరుఁడు

ధర్మపురి మాహాత్మ్యము:

తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయము ప్రతి నం. 6688. ఈగ్రంథము ప్రత్యంతరమే ఆంధ్రసాహిత్య పరిషద్గ్రంథ భాండాగారమున "చంద్రరేఖా విలాస" మనుపేర నున్నది. (నం. 863) అది ప్రతీవిరేఖకుఁడు పెట్టిన పేరు. ఇందలి నాయిక చంద్రరేఖ. కాని "ధర్మపురి మహత్వం బెటువలెను" అనియే కవిచేసిన కథోపక్రమణిక. తిరుపతి

ప్రతి యూపేరనే యున్నది. ఇక కవి నామవిషయ మొకటి శంకా వహము. రెండు ప్రతులలోను గ్రంథారంభ ద్విపదలో "నిజకుల కర్త డను నాఁడ" నని యున్నాఁడు. కాని యది యొక పేరేమిటి! ఆం. సా. ప. ప్రతి గ్రంథాంత ద్విపదలో "విరచించె నీకథ విశ్వేశ్వరుండు" అని యున్నది. అదే కవిపేరు కాఁదగును. (కాని తిరుపతి ప్రతిలో "విరచించె నీకథ విశ్వేశు పేర" నని యున్నది. అది పొరపాటు కాఁదగును.) ఈకవి "అభినవ కవి రాఘవయ్య సేవకుఁ" డని చెంటను గలదు. అంతకంటెఁ గవిని గుఱించిన వివరములు దెలియవు. ఆం. సా. ప. ప్రతివిలేఖన కాలము: క్రోధన వైశాఖ బహుళ సప్తమి జయవారము 21-5-1805. కవి యంతకుఁ గొంత పూర్వు డగును.

గ్రంథవిషయము: గౌతమీ తీరముననున్న ధర్మపురిక్షేత్రమునకు సంబంధించినగాథ. బైలు పురీంద్రునికి ధర్మపురి రామలింగస్వామిదయ వలనఁ గలిగిన పుత్రుఁడగు దీర్ఘరాజు ప్రతిష్ఠాన పురాధీశు డగు శాలి వాహన భూపాలుని పుత్రికయగు చంద్రరేఖను బెండ్లి యుంకువ యగు కలియుగ పొన్నపూలు తెచ్చి పెండ్లాడిన కథ యది. అవి సాధించు టలో నతఁ డొనర్చిన సాహసకృత్యములు, నవాంతర వివాహ కథలు నిందు వర్ణితములు. కథాప్రధానమైన దీకృతి. ఇందుఁ దాళప్రధానము లైనదరువులు, ద్విపదలు, వచనము, గొలఁదిపద్యములు, కురుచ రేకులు, నడలు సమలఘువులు, ఉత్కళికలు, చిత్ర తాళము, రగడ మొ. రచనా విశేషములును గలవు. రచన మొదట వేలవము, దోషజుష్టముగా నున్నను జివరకు పోను పోను చిక్కబడినది.

---

38. దొడ్డినరసింహకవి

కరియబంటుని కథ:♦

కవి విషయము :- శంకరాచార్యుల శిష్యుఁడు. దొడ్డి లేక దొడ్డకొండయాభ్ధీశుఁడతని కిష్టుఁడై వసుసి కృతిపతియు నైనవాఁడు. గుత్తిరాజ్యమున గోట్లూరి తూర్పున "సదాశివరాయలు తాను అమరంగ జేసిన అగ్రహారం" బగు జంగాల గ్రామమున కధిపతియు, నాశ్వలాయన సూత్రుఁడు, భారద్వాజస గోత్రుఁడు, ఫణియప్ప పుత్రుఁడు నైన పద్మనాభయ గ్రంథాంతద్విపదలోఁ బేర్కొనఁబడినాఁడు. అతఁడే తత్కృతి ప్రోత్సాహకుఁడై యుండును. కవి కాలపు టుత్తరపు మేర మాత్రము నిర్ణయించుట కొక్క యూహారము గన్పట్టుచున్నది. ఈ కృతి ప్రతివిలేఖన కాలము "ప్రమోదూత సంవత్సర చైత్ర బ ౧౦." వార మనుక్తము. దీనినిబట్టి కాల నిర్ణయము కుదురదు. కాని యీ ప్రతివిలేఖకుఁడగు బమ్మహళ్ళి నారాయణప్ప కొడుకు రామప్ప యే అడయూరు ది. స. గ్రం. - జి. నం 74862 శతకంఠ రామాయణ యక్షగాన ప్రతి విలేఖకుఁడును. దాని లేఖన కాలము శుక్ల పుష్య ౧౩ శుక్ర వారము. అది క్రీ. శ. 2-3-1810 తేదీకి సరిపోవుచున్నది. కరియ బంటుని కథ ప్రతి విలేఖన సంవత్సరమగు ప్రమోదూత పై శుక్ల తరువాతిదే కావచ్చును. అనఁగా గవి క్రీ. శ. 1810 కొక్కింత ముందు వాఁడు కావచ్చును.

♦ అడయూరు ది. స. గ్రంథాలయము — జి. నం. 74880. (కన్నడ మోడి గలది)

గ్రంథ విషయము :- ధారా పురాధిపతి యగు కరియబంటు హళియ బీడు పురాధిపతి యగు బళ్ళాలు నాహ్వానమున హళియబీడు నకుఁ బోవుచుండఁగా ద్రోవలోఁ దొండనూరిపురమేలు నొక రక్కసి కూఁతురు పుండరీకాక్షి యనున దతనిని జూచి వలచుట - రక్కసి యతనిని జంపుట - ఆ రక్కసి శాపము దీరి మాలిని యను గంధర్వస్త్రీ యగుట - చివరికి శివుఁడు ప్రత్యక్షమై యతనిని బునర్జీవితు నొన ర్చుట - తదుపరి పుండరీకాక్షితోఁ గరిరాజు కల్యాణము. ఇందలి కథా ప్రధానాంశము లివి. నడుమఁ జక్కని సన్నివేశములు గలవు. ఈ కథ కన్నడదేశమునఁ గడు ప్రచారము గాంచినట్టిది. (ఈ కథనే 1750 ప్రాంతమున బొమ్మలాట సాంబయ్య కన్నడమున యక్షగాన ముగా రచించి యుండెను. చూ. ప్రా. లి. పు. భాం. డి. నం. 1169 బహుశా దాని కిది యాంధ్రభాషా పరివర్తమేమో?) ఇందుఁగరియ బంటుని తల్లికడ కాకాశవాణి కొరవంజి వేషంబు దాల్చి వచ్చినట్లు గల దదియొక విశేషమే. కథాంశము విశేషముగాఁగల య. గా. లలో నిది యొకటి. ఇందుఁ దాళప్రధానములైన దరువులు, వచనము, ద్విపదలు, పద్యములు, అర్థచంద్రికలు, రచ్చకేకులు, ధవళ శోభన ములు, గౌరీకళ్యాణమును గలవు. యక్షగానమని పేర్కొనఁబడినది. దరువులలో మాత్ర మక్క డక్కడ రచన చక్కగ సాగినది.

39. ఇటికెల తిమ్మయ

కన్యకా పురాణము : * (లేక చరిత్ర)

కవి విషయము :-- ఇతనిది వైశ్యకులము. చండ్రకుల గోత్రము. తాత గురవయ. తండ్రి చన్నమసెట్టి. తల్లి లక్ష్మమ. తాత పేరిటి వాఁడొక సోదరుడు గలడు. కృష్ణమాహ్వయుఁ డీతని దేశికుఁడు. కొన్ని ప్రతులలో (అం. సా. ప. 1537) యజుశ్శాఖీయు, నాపస్తంబ సూత్రుడు, శ్రీవత్ససగోత్రుఁడు నైన శివరామయ యీతని గురువుగాఁ బేర్కొనఁ బడినాడు. ఈకవి కాలావధి నిర్ణయించుటకును ప్రతిలేఖన కాలమే శరణ్యమైనది. (ప్రా. లి. పు. భాం.- డి. నం. 1843 ప్రతిలేఖన కాలము ప్రమోదూత శ్రావణశుద్ధ ప్రథమా బుధవారము- క్రీ.శ. 1-8-1810. కవి యంతకుఁ బూర్వుఁడని మాత్రము చెప్పనగును. ఇతని యుదంతము గొంత కావలి వెంకటరామయ్య దక్కును కవుల చరిత్రమునఁ బ్రసక్తమైనది. దానిని బట్టియు నీ యూహా సమంజసమైనదని తోఁచును. గ్రంథరచనా వైఖరిని బట్టి 18 వ శతాబ్దికిఁ జెందినవాడనిపించుచున్నది. (ఇప్పటికిది యూహా మాత్రము)

* 1. ప్రా. లి. పు. భాం. - డి. నం. 1843, ఆర్. 977, ఆర్. 1048.

2. అం. సా. ప. - నం. 1332 1537, 1617, 1684, 2306. (ఈప్రతులలోఁ భాష భేదములు విశేషము)

3. అడయారు ది. స. గ్రం. ఆర నం. 32 (ఎమ్) 16.

గ్రంథవిషయము:— ఇది ప్రసిద్ధమగు వైశ్యుల యిలవేల్పు కన్యకా పరమేశ్వరి చరిత్రము. దీనికి మూలము స్కాంద పురాణము.♦ ఇది భాస్కరాచార్యులకు నతనిచేఁ దిమ్మ్మయకు ముందే యాంధ్ర మునఁ బద్య ద్విపద కావ్యములుగా వెలసినది. [2]ఈకథా మధ్యమునను భాస్కరాచార్యుల పాత్రకుఁ బ్రశక్తిగలదు. తిమ్మ్మయ కృతిలోను భాస్కరాచార్యుల ప్రశంసగలదు. ఆంధ్రకవి తరంగిణిలో నీభాస్కరాచార్యుల యుదంతముగూర్చియు, నీకథా విషయముగూర్చియుఁగొంత చర్చగలదు. చూ. సం 8-పుటలు 206-218)

ఇది వస్తు విస్తృతిగల యొకపెద్ద యక్షగానము. యక్షగాన మనిపేరొక్కనఁబడినది. ప్రదర్శనకుఁ బనికిరాదని చెప్పవచ్చును. ఇందాశ్వాస విభాగ ముండుట గమనింపఁదగినది. (అశ్వా.గ) రచన యంత ప్రౌఢమునుగాదు, పేలవమునుగాదు. సలక్షణమైన భాషయే వాడబడినది. కాని దోషరహితము గాదు. ఇందు దాశ్వప్రధాన ములైన దరువులు తఱుచు. ద్విపద వచనముల పాలును మిక్కుటమే. పద్యములు సకృత్తు. ఏలలు, త్రిభంగులు, దండక చూర్ణికలును గలవు.

♦ సంస్కృత స్కాం. పు. లోని యీ కథా భాగము ప్రతి అం. సా. ప. లోఁగలదు. నం. 288.

2. అం. సా. ప. నం. 2297 – భాస్కరాచార్య కృత "వాసవీ మాహాత్మ్యము". ఆది పొరపాటునఁ బరిషదకారాద్య ముద్రిత గ్రంథ సూచికలో యక్ష గానముగాఁ బేరొక్కనబడినది. అది పద్యకావ్యము.

40. సన్నిధిరాజు జగన్నాథ కవి

ఎఱుక ల కుర వం జి : ♦

కవి విషయము :— పేరు జగన్నాథకవి లేక జగ్గకవి. ఇంటి పేరు సన్నిధిరాజు లేక సన్నిధానము. వెలనాటి బ్రాహ్మణుఁడు. కాశ్యపగోత్రుఁడు. ఇతని తాత పేరు కూడ జగ్గకవియే. అతనికి సుందరమ్మ యందు నలుగురు పుత్రులు. అం దమ్మయగారికి జగ్గయ, జయసుందరప్ప, గురులింగము ననువారు పుత్రులు. కవి గురువు శృంగేరీ మఠాధిపతి యగు శంకరాచార్యులవారఁట. కవి యుప్పాడ (పిఠాపురము దగ్గర నున్నది) పురవాసి. కవి కాలనిర్ణయమున కొకయాధారము గలదు. ఈతని కృతియొక్క ప్రా. లి. పు. భాం. ప్రతి డి. నం. 1884 లేఖన కాలము బహుధాన్య ఫాల్గుణ బ ఆ శుక్రవారము — క్రీ. శ. 19-3-1819. గ్రంథ మంతకుఁబూర్వము రచింపఁబడె ననుట నిశ్చయముగదా. ఇతఁడు క్రీ. శ. 1810 ప్రాంతములవాఁడని శతక కవుల చరిత్రమునఁ బేర్కొనఁబడినాఁడు. అది సత్యముకావచ్చును. వానినుండి తెలిసిన విశేషములు :— కవి యజుశ్శాఖి. తల్లి పేరమ. కృత్యంతరము రాజలింగశతకము. అది వాకతిప్పరాజశేఖరున కంకి

♦ 1. ప్రతులు :— ఆం. సా. ప. – నం. 4543, 1244.

2. ప్రా. లి. పు. భాం. – డి. నం. 1852, 1853, 1883, 1884.

3. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయము – నం. 9 (తాళపత్ర గ్రంథములు.)

ఇది ముద్రితము – ఉమా మహేశ్వరప్రెస్, మదరాసు, 1897 (ప్రచురణ కర్త:- పాదర్తి అక్కయ్య దేవర.)

తము. (వాకతిప్ప కూడ పితాపురముతాలూకాలోనిదే) శ. క. చ. న సీతసి కురవంజి రచనము వేరొక్కనఁబడినది.)

గ్రంథ విషయము :— ఇందు జీవోత్పత్తినుండి విదేహ కైవల్య ముక్తి ప్రాప్తివఱకుఁగల తత్త్వ మద్వైతపరముగాఁ బ్రపంచింపఁబడినది. జీవసతికడకు సుకర్మ మెఱుకతయై వచ్చును. మూల ప్రకృతి సింగఁడాయెను. వారనేక విషయములపై వాద ప్రతివాదములు సలుపుదురు. ఇది జీవయెఱుకల కొఱవంజి యనియు జ్ఞానయెఱుకల కొఱవంజి యనియుఁ గవిచేతనే (యతి ఘటితముగా) వేరొక్కనఁబడినది. కురవంజి యనియే కాక యక్షగాన మహాప్రబంధమనియుఁ బేరొక్కనఁబడినది. ఇందు హాస్యగాఁడు పాత్రలను బలుకరించుటయుఁ బాత్రలు స్వవిషయమును జెప్పుకొనుటయుఁ గలదు. ఇందసలే గహనమైన విషయమింకను గ్లిష్టముగాకుండఁ గొంతవట్టు పరిభాషానిరపేక్షముగా సరళముగాఁ జాలవరకు వచనములో వివరించినాఁడు. కవి పాత్రల నామము సంవాదములును గలవు. కాని యిది ప్రదర్శనమున రాణింపదు. ఇందలి భాష సలక్షణమైనది. (సింగని ప్రసంగాది సందర్భములందుఁదప్ప). శయ్యా ప్రసన్నమైనది. ప్రసిద్ధ రాగ తాళములలోఁ గొలఁదిపాటి దరువులు గలవు. కొలఁదిపాటి పద్యములును గలవు. ద్విపదలు, వచనములు నెక్కువ. ఏలపద మొకటి, సంస్కృతచూర్ణికలు, దండకములు నొకటి రెండు, శ్లోకము లనేకము గలవు. అమరశ్లోకము లుదాహరింపఁబడినవి. కవి స్వతంత్రముగా వ్రాసినవియుఁ గలవు. శ్లోకములకుఁ దెలుఁగున వ్యాఖ్యానమును గలదు. ఇట్టి కృతులందు కవిత్వపుఁ బాలు నెన్నుట కష్టము.

41. బు (జ?) క్క మ సాం బ య్య

బ ల్లా ణ రా జ చ రి త్ర ము : *

కవి యింటిపేరు బుక్క-మో, జక్క-మో నిక్క-చ్చిగాఁ జెప్ప వలనుపడలేదు. ఇతఁడు వీరశైవుఁడు. యోగ విద్యాభ్యాసరతుఁడు. గుహేశ్వరస్వామి భక్తుఁడు. ఇంతకంఁటె వివరము లెఱుఁగరావు. అతని కృతి ప్ర. కి. పు. భాం. ప్రతి డి. నం. 1914 లేఖన కాలము ఆంగిరస నూర్గశిర శు ౧౦ ఆదివారము 13-12-1812 కావున నంతకంఁటెఁ బూర్వుఁడు కావచ్చునని మాత్రమే చెప్పనగును. కాని యించుక ప్రాచీనుని వలెనే కన్పట్టుచున్నాఁడు.

గ్రంథ విషయము : నారదప్రేరితుఁడై శివుఁడు మిండజంగమై క్రూర వీరశైవవ్రతదీక్షితుఁడగు సింధు కటకాధీశ్వరుని భల్లాణుని బరీక్షింప వచ్చుట - తనకుఁ బద్మినీజాతి వేశ్యకావలెననుట. అట్టి వేశ్య దొరుకక భల్లాణుఁడు తనభార్యయగు చల్లమాదేవినే యతని కడకుఁ బంపుట—శివుఁడు శిశురూపము ధరించుట - వారికి మోక్షమిచ్చుట యనున దిండలికథ. (ఇందు బల్లాణుఁడు పూర్వజన్మమునఁ గిరాతుఁడని చెప్పఁబడినది.) రచన శివకవి సామాన్యములైన దోషములుగల దైనను జాలచక్కనిది. ఇందలి దరువులెక్కువగాఁ దాళప్రధానములు. ప్రసిద్ధ కర్ణాటక రాగప్రధానములు గొలఁది గలవు. వచనములు నున్నవి. ఏలలు, జోలలు, త్రిభంగులు, అర్ధచంద్రికలును గలవు. ముఖారిచేకులు విశేషము. ఇదియక్కగాన ప్రబంధమని పేర్కొనఁ బడినది. శ్రవ్యదృశ్యములకు నడిమివాటముగా నడిచినది.

---

* ముద్రితము: పమ్మి త్యాగరాయశెట్టిగారి శ్రీరాజరాజేశ్వరీ నికేతన ము. శా మదరాసు, 1904.

42. కాటమరాజు వెంకటజోగి

ముక్తికాంతా విలాసము : *
(కురవంజి)

కవి విషయము :— శ్రీవత్స సగోత్రుఁడు. కాటమరాజు కొండమరాజ పౌత్రుఁడు. వెంకమాంబా చెంచమరాజుల పుత్రుఁడు. ఇతని కృతి ఆం. సా. ప. ప్రతి విలేఖనకాలము ప్రజోత్పత్తి మాఘ శుద్ధాష్టమి మంగళవారము — 21-1-1812. కవి యంత కించుక పూర్వుఁడు కాఁదగును.

గ్రంథ విషయము :— ముక్తికాంత యెఱుకతయై వచ్చి మనఃకాంతకడ నోంకార ప్రభావము నుగ్గడించి తత్స్వరూపుఁడగు పరబ్రహ్మ యనుసంధానమునకై యాసనములు, ముద్రలు మొదలగునవి వివరించును. ఆపై మనఃకాంత ప్రబోధితయై సాకార పరబ్రహ్మమును సాక్షాత్కరింపఁజేసికొనును. తదుపరి యామెకు నోంకారమునకును వివాహము. ఈ గ్రంథమున విషయపటుత్వము లేదు. రచన పేలవమైనది, దోషభూయిష్టము. బోడిదరువులు, ద్విపదలు, చిన్న వచనములు గలవు. కురవంజి యని పేర్కొనఁబడినది.

---

* 1. ఆం. సా. ప. నం. 4525.

2. శ్రీనేదునూరి గంగాధరంగారికడ నొక తాటియాకు ప్రతిగలదు.

43. భారతి రామరాజు

ఇతఁడు మాగధ వంశీయుఁడు. (భట్టురాజు కౌస్కర పౌత్రుఁడు. మంత్రి (మంచి?) రాజుపుత్రుఁడు. (చూ॥ జలక్రీడలు) తన గ్రంథము లన్నియుఁ బోట్లదుర్తి హరి కంకితము చేసినవాఁడు. అనఁగా నీతఁడు పోట్లదుర్తి వాస్తవ్యుఁడని తోఁచుచున్నది. పోట్లదుర్తి కడప మండలమునఁ గలదు. కాని యితఁడు నెల్లూరు జిల్లా మాన్యాలులో (ఫుట 698-99) నెల్లూరు మండల కవి యైనట్లును, క్రీ. శ. 1813 ప్రాంతమున నుండినట్లును బేరొక్కనఁబడినాఁడు.

ఇతని గ్రంథములు:

1. జలక్రీడలు:

ముద్రితము :- సరస్వతీ నిలయ ము. శా. మదరాసు - తృతీయ ముద్రణ, 1883.

గ్రంథాంతమున నిది యానంద మాఘ శుద్ధ హరి వాసరమున రచింపఁబడినట్లు గలదు. అది 1795 సం. కావచ్చును. ఇందు భాగవత దశమస్కంధ పూర్వభాగ కథగలదు. కాని యశోదతో గోపికలు కృష్ణుని యాగడముల గుఱించి చెప్పుట, గోపికా వస్త్రాపహరణ (అదే జలక్రీడలు) మను నీ రెండు విషయములే వివరముగాఁ గలవు. ఇందుఁబ్రసిద్ధ రాగ తాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు, వచనములు (సకృత్తుగా), కందార్థములు, సీసార్థములు రెండు సం. చూర్ణికలును గలవు. చక్కని రచన. గ్రంథకర్త భాగవతము నొంట బట్టించుకొన్న వాఁడే కాని లేనిపోని యనుకరణముల పొంతకుఁ బోలేదు. పాత్రల సంవాదములు సమృద్ధిగనే కలవు. కాని కథా వర్ణ

నాదిక శ్రవ్యధోరణియుఁగలదు. కొన్ని వర్ణనములు పాత్రముఖమునఁనే ప్రవర్తితము లైనవి. గ్రంథకర్తచే నిది చదువుటకును "నటియింపఁబఁబుటకు నుద్దేశింపఁబడినది.

2. గొల్లభామవేషము:

(ప్రా. లి. పు. భాం. — డి. నం. 1873, 1874, 1876). ఇందు మొదటఁ జల్ల నమ్మవచ్చిన గొల్లభామకు నొక బ్రాహ్మణునకును సంభాషణ — అందు గొల్లభామ తమ నిత్య కృత్యములు, గొల్లవారి కులాచారములు నుగ్గడించును. సముద్ర మథన కథ నుదాహరించి జగమెల్ల గొల్లయనును. ఆబ్రాహ్మణ పాత్రధారి యెవఁడో ప్రదర్శక ముఖ్యుఁడై యుండును. గొల్లభామ యతనిని "మాధవీ" యని సంబోధించుట గలదు. ఆమె "తెరవెళ్ళి" వచ్చుట చెప్పఁబడినది. పిదప ఘట్టమున సుంకరి కొండని రాక, గొల్లభామతోఁ జెయి ముట్టు సరసము, నాపె యత్త వచ్చుటతో నతఁడు చెపాయించుటయుఁ గలవు. ఈ గ్రంథమున రచన దాని కోవఁకుజెందిన వానిలో నది కొంత బాగుగనే యున్నది. కాని హాస్య ప్రసంగములం దసభ్యత యధికమైనది. ఇందు దరువులు, ద్విపద, పద్యములు, వచనము, శ్లోకములు, తద్వ్యాఖ్యానము, ఏలలును గలవు. గ్రంథమంతయు సంభాషణల మయము. ఇందు నక్కలపాటి సంజీవకవి గ్రంథ విషయము కొంత గ్రహింపఁ బడినది. పోట్లదుర్తి హరితోపాటు రమణక్క-పేట హరియు స్మరింపఁబడినాఁడు. డి. 1873 ముఖపత్రమున నిది "ఆట భాగవతమందు గొల్లకథ" యనియు నిది యూనాము గ్రామమున లభించిన పుస్తకమనియు, 'అటతాళం — సారంగతాళం వల్లనే యీ గొల్లకలాపం యావత్తు వినకరిచేస్తున్నారు.' 'కొందరు ప్రత్యేకం రాగములు పాడుతా' రనియు గలదు.

3. బాలింతవేషకథ:

అడయారు ది. స. గ్రం. ప్రతి – జి. సం. 75047. ఇది రామకవి రచన యనియుఁ బోట్లదుర్తి చెన్నుని కంకిత మునియు మాత్రమే పేర్కొనఁబడినది. పోట్లదుర్తి రామకవియని యుంఘటను బట్టి యీ రామకవి భారతి రామరాజగునేమో యనిపించుచున్నది. ఇం దెదురొక్కండ కేశవుఁడును 'తలంపఁబడినాఁడు. యశోద గర్భవేదన, మంత్రసాని రాక, ప్రసవము నిందలి విషయములు. లాలి పాటతో గ్రంథాంతము. ఇందు దరువులు, పద్యములు, ద్విపదయుఁగలవు. రచన నీరసముగానున్నది.

4. పారిజాతము:

ఆం. సా. ప. లో నం. 4120 వివిధ వినోదములను నొక కలగూరగంప గ్రంథ సంపుటమునఁగొలఁది యాకులలో పోట్లదుర్తి చెన్నారాయని ముద్రతో "రుక్మిణీవేషము కథ" యు, నాయిక నాయకునకు "జాబు వ్రాసే ద్విపద" యుఁగలవు. భారతి రామరాజు తన జలక్రీడలు గ్రంథాంత ద్విపదలో "పారిజాతాది ప్రబంధ కల్పనుఁడ" నని చెప్పుకొని యున్నాఁడు. అతఁడు గొల్లకలాపముతో పాటు భామకలాపమును గూడ రచించి యుండును. పైకలగూర గంపగ్రంథభాగములు ప్రాయికముగా నందలి భాగములే కావచ్చును. సమగ్రగ్రంథము లభింపలేదు. పోట్లదుర్తి జలక్రీడలు, గొల్లకలాపము మాత్రమే విపులప్రచారము గాంచినవి.

---

44. ఆలపాక పెద్దు

భల్లాణ నాటకము:

కవి విషయము:— శాలివాహన (కుమ్మరి?) వంశ్యుఁడఁట. వీరశైవుఁడు. సంతోష శివజ్ఞానస్వామిశిష్యుఁడు. పాపాంబా వైద్దెప్ప లకుఁ బుత్రుఁడు. లింగమాంబా పెద్దనల పౌత్రుఁడు. అతనియూ రాలపాక. ఇతనిగ్రంథము బిల్వేశ్వరస్వామి కంకితము. బిల్వపురి కోకిలాంబ కవి కిలువేల్పు. (ఆలపాకయు, బిల్వపురియనఁగా పోలింగరు సమీపమునఁ గల తిరువల మను క్షేత్రమును ఉత్తరార్కాటు జిల్లా వాలాజ తాలూకాలో నున్నవి.) ఈ గ్రంథముయొక్క ప్రా. లి. పు. భాం. ప్రతి డి. నం. 1915 చివరనొక వ్రాఁత గలదు:—

"ధాతువు నామ సం. కార్తీకి నెల 21 తేది బుధవారం పర్వ కాలం గ్రహణం పుణ్యకాలం వుదయమయిన పన్నెండు ఘడియల నరమీఁద ఘనుచేరిలో ప్రాంసుకోటిచేసినది" అని. అది 4-12-1816 తేదీకి సరిపోవుచున్నది. ఈ గ్రంథరచన చుంతకించుకముందు జరిగి యుండును.

గ్రంథవిషయము:— కథ ప్రసిద్ధము. భల్లాణుఁడు మిండ జంగమువేషమునఁ దను బరీక్షింపవచ్చిన శివునికడకుఁ దనసతినే సాని వేషమునఁబంపుట — భవుఁడు భల్లాణుని భక్తికిమెచ్చి కైలాస మనుగ్ర హించుటయు ననున దీకథ. ఈగ్రంథారంభమునఁ జిత్రమైన ప్రస్తా వన కలదు. భల్లాణుని వాకిటికావలి గొల్లఁడు "ఎకసక్కెంబాచి నాయఁడు" నాటకప్రదర్శకులను బలుకరించును. వారు బాచినాయ నిపై నెకసక్కెముగాఁ బాటపాడుదురు. బాచినాయఁడు సభవారికి

భల్లాణరాజు రాక తెల్పి ప్రపర్మకులను "కథ ప్రసంగించవోయి" యని హెచ్చరించును. అంత భల్లాణ ప్రశంసాత్మకమగు నొక ద్విపదతో గథా రంభమగును. గ్రంథమంతయు వ్యావహారికభాషలో నడచినది. తా ప్రధానములైన దరువులు, ద్విపదలును గలవు. వచనమునను బాత్ర సంభాషణలు గలవు. కొలఁది హాస్యప్రసంగము లున్నవి. గ్రంథమ నాటకమని పేర్కొనఁబడినందులకుఁ దగినట్లున్నది. కాని రచన యొ మాదిరి.

---

45. గుఱ్ఱము చినకపోదయ్య

పీఠికా చరిత్ర:♦

కవి విషయము:— శివ కవీంద్రుఁడట. శైవ కులజుఁడఁట (జంగమేమో;) తండ్రి గణపతయ్య. తల్లిసోమమ. అన్న పెద కపో దయ్య. తమ్ముఁడు రాచయ్య. ఈ చిన కపోదయ్య గ్రంథాంతర మగు దారుకా వనక్రీడ యను సువాల (ప్రా. లి. పు. భాం. డి. నం. 1887) నుండి యీతని తాత బొలంక నామధేయుఁడనియు నాయ నమ్మ పర్వతమ్మయనియుఁ దెలిసినది. ఇతని గ్రంథములు రెండును కొంపిచర్ల శంకరేశ్వరుని కంకితములు. కొంపిచర్ల కడపజిల్లా వాయల్పాడు తాలూకాలోనున్నది. అది యీతని నివాసము గావ చ్చును. ఈ వీ. చో. చ. ప్రతి డి. నం. 1941 లేఖనకాలము ఈశ్వర చైత్ర శు 7 జయవారం — 25-3-1817. కవి యంతకుఁ బూర్వుఁడని మాత్రమ చెప్పనగును.

♦ ప్రా. లి. పు. భాం.— డి. నం. 1940, 1941.

గ్రంథ విషయము :– దక్షారామమున నన్య (న్నె?)-చో డను భోగపుఁ జానకుఁ బార్వతియంశమున వీరచోడు పుట్టుట. భీమనాయకుఁ డామె శీలమును బరీక్షించి మెచ్చి, యామె యెంగిలికూడుఁగూడఁ గుడిచి యామె మహిమను లోకమున వెలయించుట, ఆమె కైలాసమున కేఁగుట యనుశైవకథ (పండితారాధ్య చరిత్రమున దీని ప్రసక్తి గలదు) యిందు వర్ణితము. ఇందుఁ బురాతన భక్తచరిత్రములు, కామశాస్త్రాది విషయములను బలుమఱు ప్రసక్తములు. రచనచక్క-నిది. సంవాదము లెక్కు-వగా సాగినవి. దాళప్రధానములగు దరు వులు విరివిగాఁగలవు. ద్విపదలు, వచనములు, గొలఁది పద్యములు, అర్ధచంద్రికలు, ఏలలు, బొళిరేకులు, బొళరచ్చలు, పాళిరేకులు, మటిమె రేకులు, అనువులు నడలు, త్రిభంగులు మొ॥ రచనా విశేషములు గలవు. గ్రంథము యక్షగానమని పేర్కొ-నబడినది.

---

46. శ్రీనివాస కవి

పారిజాతాపహరణము : ♦

కవి విషయము :– ఇంటిపేరు తెలియదు. రామచంద్రపుర వాసి. వెలనాటి వైష్ణవుఁడు ఈతఁడు తన గ్రంథారంభమున నహో బిల మఠపతి యగు రంగనాథస్వామిని దలఁచియున్నాఁడు. అహోబిల మఠాధిపతులలో రంగనాథస్వామి నామధేయులు నల్వురుగలరు.

♦ అం. సా. ప. సం. 184.

వారికాలములు వరుసగా, (1) క్రీ. శ. 1811 - 182 (2) 1833 - 183 (3) 1882 - 1888 (4) 1913-23.[1] ఈ గ్రంథమున సత్యభామ గ్రేవ లేఖలోఁ బేర్కొనఁబడిన ఒహుధాన్యవత్సరమును గ్రంథరచనాబ్ద నకు భంగ్యంతరసూచనగా గ్రహింపవచ్చునేని యది మొగటి రం నాథస్వామి మఠాధిపత్య కాలమునఁ బడుచున్నది.

గ్రంథ విషయము :—ఇదియొక ఉద్దండగ్రంథము. సర్వాంగస-పూర్ణ మైన పారిజాతము. శ్రీ రంగేశున కంకితము. అందుచే దీనికి రంగపు పారిజాతమనియు నామాంతరము. ఇందు బాలకృష్ణకథ, గొల్లకథ సుంకరికథ, రాధకథ, రుక్మిణీకథ, సత్యభామకథ — అని యిట్ వాంతర కథా విభాగము, ప్రతి కథకుఁ బ్రత్యేకముగాఁ గ్రారంభ ప సమాప్తుల సూచనయు నున్నవి. ఇందు శ్రీకృష్ణుఁడే సుంకరి కొండ వచ్చెనట; శారద సత్యభామ కెఱుకచెప్పవచ్చినదఁట; ఇందు పాత్రలు ప్రదర్శన ప్రవర్తకుఁడగు హాస్యగానిచేఁ బ్రవేశింపఁబడి స్వీయోదంతములు జెప్పుటగలదు. ఇందుఁ బ్రసిద్ధ రాగతాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు, కందార్థములు, ఏలలు గలవు. రచన మనోజ్ఞమైనది. ఇందలి హిందూస్తానీ బేహాగ్ రాగము, జుల్వా తాళముల వాడకమునుబట్టి చూడ నిది ప్రాచీనరచనగాఁ దోపదు. పై కాలనిర్ణయము సమంజసముగా వచ్చును. కవి దీనిని నాటకమని పేర్కొనెను. పాడుటకు నాడుటకు నుద్దేశించియుండెను.

---

1 చూ. శ్రీ. ఎస్. ఎన్. వెంకటేశయ్యరుగారి అహోబిల మహచరిత్ర (అంగ్ల గ్రంథము.)

47. శేషము రంగాచార్యులు

శేషము రంగాచార్య కృతము లొక మూఁడు యక్షగానములు లభించినవి. భావనారాయణ విలాసము[1], రతిమన్మథ విలాసము[2], శివకేశవపారిజాతము[3], మూఁడును నముద్రితములు. శి. కే. పా. న కవిని గుఱించి విశేషము లేమియు లేవు. (ప్రతి యసమగ్రము) భావ నారాయణ రతిమన్మథవిలాసము లందలి గ్రంథాంతగద్య లొక్క-తీరుగ నున్నవి. అందు కవి తండ్రి చెన్నుభట్టారకుఁడని యున్నది. భా. నా. వి. న నవతారిక లోపించినట్లున్నది. ర. మ. వి. - అవతారి కలో నితనితల్లి వేంకమాంబిక యనికలదు. రంగాచార్యుని తండ్రి చెన్నుభట్టు అభిమన్యుకల్యాణ[4] మనునొక ద్విపద కావ్యమునకుఁ గర్త. చెన్నుభట్టు పెద్దన్నగారు రఘునాథార్యుఁడు కులశేఖరమహీ పాల చరిత్ర[5] మనునొక ప్రబంధమునకుఁ గర్త. పై గ్రంథములవలన రంగాచార్యుని పూర్వుల చరిత్ర కొంత తెలియనగును. పితృపితామహా క్రమమున వారు చెన్నుభట్టు, వేంకటార్యుఁడు, భట్టరార్యుఁడు, రామానుజాచార్యుఁడు, ఆహోబల గురుఁడు. భా. నా. వి. న నది పొన్నూరు భావనారాయణస్వామికి సంబంధించిన దని గలదు. పొన్నూరు గుంటూరు మండలములోనిది. కాఁగా కవి తత్ప్రాం తీయుఁడని చెప్పవచ్చును.

1. ప్రా. లి. పు. భాం. డి. నం. 1931.

2. ఆం. సా. పు. నం. 3120.

3. ఆం. సా. ప., నం. 3139 (ఈప్రతిపై "లేబిలు" రుక్మిణీ పరిణయమని యున్నది. కాని గ్రంథాంతమున "శేష భట్టరు రంగాచార్య విరచితోయాం శివకేశవ పారిజాతే రుక్మిణీ విరహ...అని యున్నది)

4. ప్రా. లి. పు. భాం. డి. నం. 1026., ఆం. సా. ప., నం. 2631.

5. ఇది యిటీవల ప్రా. లి. పు. భాం. వారిచేఁ బ్రకటితము.

కవికాలము పిదప మేర నిర్ణయించుటకు మాత్రమె మొక్కయాధారముగలదు. భా. నా. వి. ప్రతి విలేఖనకాలము 'చిత్రభాను నామసంవత్సర అశ్వీజ శుద్ధ 14 అంగారక వారం' అది ఇ. శ. 27-9-1812, 29-10-1822 తేదీలకు సరిపోవుచున్నది. కాలము చతుర్దశి యనులకు మాఱుగాఁ బేర్కొనఁబడిన యమావాస్య యంకెల వాడకము పద్ధతి మన దేశమున 1842 నాఁటికిఁగానరాదు. రంగాచార్యులు 1822 సం.కుఁ బూర్వుఁడనుట స్పష్టము. కాని యతని గ్రంథముల రచనా ప్రక్రియనుబట్టి యతఁడు 18 వ శతాబ్దికిఁబూర్వుఁడు కాఁజాలఁడని చెప్పవచ్చును. అది దిగువ నిరూపింపఁబడును.

భావనారాయణ విలాసము :

కొండవీటి సీమలో నండూరి గూనిగోవిందుఁడను విప్రోత్తముఁడు మహాభక్తుఁడొకఁడు గలఁడు. అతఁడు కారంచేటి కులాగ్రణియగు నరసింహుఁడను తన మేనమామతోఁ గాశికిఁబోయి విశ్వనాథుని సేవించుచుండును. అటనొక విప్రుఁడు గోవిందునకుఁ దనకూతునక్కలాంబిక నిత్తుననును. గోవిందుఁడు పెద్దవాఁడును బ్రహ్మచారియు నగు మేనమామ యుండఁగా దనకు మరియాద గాదని యా సంబంధము నతనికిఁ గుదుర్చును. కాని యొకసమయము చేయును — వారిరువురికిఁగల్గిన కూతును తన కీయవలెనని. నరసింహుఁడు సమ్మతించును. కాశీ భావనారాయణస్వామి ప్రభృతు లందులకు సాక్షులు. గోవిందుఁ డత్తమామలను నిజదేశమునకుఁ గొనిపోవును. వారి కొకయాఁడుపిల్ల కలిగి యామె కెనిమిదేండ్లు రాఁగానే గోవిందుఁ డొకపరిమామను బల్కరించి చూచును. అతఁ డత్త నడుగుమనును. ఆమె సనేమిరా గూనివాఁడు, ముదుసలియునగు గోవిందునకుఁ బిల్ల నీయ ననును. ఆమె మాట కిరుగుపొరుగమ్మలక్కలు దోడుపడుదురు. నర

సింహుఁడు తనబొమను ప్రదోసిపుచ్చును. గోవిందుఁడు తన సాక్షులను బేరొక్కొనును. అంతఁ దత్రత్యులు తగవరులు మాటలాడని సాక్షులసంగతి విని యపహసింతురు. గోవిందుఁడు గడువడిగి యాగడువొక తప్పమై యది మఱునాఁటితోఁ గడతేఱ నసఁగా "భావనారాయణస్వామి పలుక వేమి" యని యాక్రోశించును. ఆత్మహత్యకు నుద్యోగించును. స్వామి ప్రత్యక్షమై గోవిందుని వెనుదిరిగిచూడక ముందు పదమని చెప్పి సపరివారముగా బయలుదేఱును. గోవిందుఁడు వెనుదిరిగి చూచును. స్వామి సపరివారముగా నూరి పొలిమేర నిలిచిపోవును. గోవిందుఁడు "అనరాఁదగిన యూరవల నుండంగఁ బోనూర నిలువంగఁ బోలునే మీ" కనును. స్వామి యక్కడికే యూరిపెద్దలను రప్పించి సాక్ష్యము చెప్పును. గోవిందుని పెండ్లి జరుగును.

ఇది పొన్నూరు క్షేత్ర మాహాత్మ్యమునకు సంబంధించిన గాథ. ఇందు స్వామివారి మహిమమాట యటుండఁ గడమ కథయంతయు నొక సాంసారి కేతివృత్తము. ఆయమ్మలక్కల ప్రసంగములు మొదలగు సందర్భములను జూడనది యంతయు మనతెనుఁగింట్ల పెండ్లి ముచ్చట కొక చక్కని రూపకల్పనవలె నున్నది. సన్నివేశమునకుఁ దగినరచన సాగినది. ఇది శృంగారనాటకమని వక్కాణించినాఁడు కవి. నాటకీయత యున్నది. కాని శృంగారము స్ఫుటముగాదు.

రతిమన్మథ విలాపము:

నారదుఁడొక సౌగంధిక ప్రసవము కారణముగా మన్మథుని (ప్రద్యుమ్నుని) దేవేరుల నడుమ సవతి మచ్చరము నెసకొల్పుటయుఁ జిట్టచివర నెల్లరు నేకీభవించుటయు నిందలి ప్రధానవిషయము. పారిజాతకథ చట్టున స్ఫురించును. రచన భామకలాపము ఫక్కి నడచినది.

కథారంభమున ముఖ్యపాత్ర లొక్కొక్కరే వరుసగా వచ్చి "వినుఁ డింక వేడ్కనా వృత్తాంతమెల్ల" – ఇత్యాదిగాఁ దలయొకద్విపదలో స్వవిషయమును జెప్పుకొనుట గలదు. "వచ్చె రుక్మవతీ వధూమణి" ఇత్యాదిగాఁ బాత్ర ప్రావేశిక ధ్రువలును గలవు. పాత్రలు తెర వెడలు ప్రసక్తి గలదు. "రతివేషపు కథ", "మన్మథవేషము" ఇత్యాదిగఁ బ్రత్యేకపు శీర్షికలు గలవు. కాని గ్రంథము "సర్వంబు నేకాశ్వాసము". "మాధవి" బలుకరింతకును బ్రసక్తికల్గినది. ఇదియంతయుఁ జూడ నిది క్రీ. శ. 1672 – 1685 ప్రాంతముల నున్న భామకలాప కర్త సిద్ధేంద్రయోగి కర్వాచీన రచన యని తోఁపక మానదు. గ్రంథాంత గద్యలోఁ గవి దీనిని "శృంగార నాటకగేయ యక్షగాన" మని వ్యవహరించెను. అది సార్థకమైన దేకాని గేయనాటకమనియో, యక్షగానమనియో లేక య. గా. నాటకమనియో వ్యవహరించిన సరిపోవును. అయినను నట్లనుటలోఁ గవి యుద్దేశమిదియైయుండును:– ఆనాఁడు యక్షగానములు గేయరూప కథాఖ్యానమే యుద్దిష్టముగాఁ గొన్నియు, నాట్యప్రయోజనాత్మకములుగాఁ గొన్నియు రచింపఁబడు చుండియుండవచ్చును. రంగాచార్యుఁ డుభయప్రయోజనములను దన కృతిలోఁ బ్రతిష్ఠింపఁదలఁచెనుగాఁబోలు. ఇందలి రచన యపేలవమైన సరళశైలిగలది. నాయికల విప్రలంభ సందర్భములందుఁ బ్రబంధపు బోకడలు గలవు. ఇందలి కథలోఁ గొంత క్రొత్తదనమున్నది. కాని కల్పనలో విశిష్టత కానరాదు.

3. శివకేశవ పారిజాతము:

గ్రంథనామమునుబట్టి యిది ద్వ్యర్థియా యన్న యనుమానము కలుఁగవచ్చును. కాని కాదు. ఇందు గథాపాత్రములలోనే కాని సన్నివేశ సందర్భములందు భిన్నత్వము లేదు. శివుఁడును గృష్ణుఁడును

నాయకులు. పార్వతియు రుక్మిణియు నాయికలు. ప్రతి నాయికలు గంగ, సత్యభామ. నారదానీత పారిజాత ప్రసవము కారణముగా సత్యా రుక్మిణుల సవతి మచ్చరము ప్రసిద్ధము. ఆసవతి కయ్యపుఁ గథ పట్టునకుఁ గావ్యత్వ ప్రతిష్ఠ తిమ్మనగారి వెట్టుబడి. దానిపై సిద్ధేంద్రుని కలము తునకాలుగాఁ గూచిపూడి భాగవతులు భామ కలాప లాభములను దీసిరి. అనేక యక్షగానముల కదే కథావస్తువో యొక ప్రధాన సన్నివేశమో యైనది. అంతటితో సరిపోలేదు. తత్స దృశ కథలకును పారిజాతపువాసన తగిలినది. సత్యా రుక్మిణుల తరువాత సవతికయ్యమునకుఁ బేరుపడ్డ జంట గంగాగౌరులు. వారికయ్యమునకు పారిజాతమునే నిమిత్తమొనర్చి కొందఱు కవులు ముచ్చటపడి శివపారిజాతములను సృజించుట విశేషము. రతిమన్మథుల కథయందును భంగ్యంతరమునఁ బారిజాతమును స్ఫురింపఁజేసిన రంగాచార్యులీ కావ్యమునం దుభయకథల నేకత్ర సంఘటించెను. ఇది విశేషములలో విశేషము.

ఇందు నాయికా నాయకులు జంటజంటలుగా రంగమున్పైఁ బ్రవేశించి మాధవునితో (ఇట నర్మసచివుఁడు) స్వీయ వృత్తాంతముజెప్పుకొందురు. ప్రతి నాయికల విరహవేదనముగూడ నుమ్మడిగనే సాగినది. సత్య చెలికత్తె మాధవికాఁగా గంగ చెలికత్తెశాంభవి యఁట; ఆచెలికత్తెలు శివకేశవుల కడ కేఁగువేళకు నారదుఁడు పారిజాత పుష్పములు గొనివచ్చును. మఱుల ప్రతినాయికల విప్రలంభ విజృంభము, చంద్రోపాలంభాదులు. తరువాత నీప్రతిలో గ్రంథము కొఱవడినది. సవతుల కయ్యము, వారు సమాధానపడుటయు నూహ్యములు. ఇందలి రచన యచటనచటఁ బ్రబంధపు గంధము గుబాళించుచు సరసముగా సాగినది.

ఈ శి. కే. పా. నఁ గలట్టి ప్రక్రియ ప్రాచీన యక్షగానమ లంచెందును గానరాదు. పుట్టువు పొలకువలలో భామ కలాపము పారిజాత తత్సదృశకథేతివృత్తములగు యక్షగానములు, శివపారిజాత ములు శివకేశవ పారిజాతములును క్రమముగా నొకదాని కొకటి యర్వాచీనము లని యూహించుట సమంజస మనిపించును (ఆధారము లీనాడుపలబ్ధమై నంతలో) ప్రకృత గ్రంథము (నామట్టునకు నాకిప్పటికి) 18 శ. ఉత్తరార్ధపు రచనగాఁ దోఁచుచున్నది.

రంగాచార్యుల కృతులలో దరువులు, ద్విపదలు, పద్యములు, లక్షువచనములును సామాన్యముగాఁ గన్పించును. ర. మ. వి. న మాత్రము దరువులకు రాగములు పేర్కొనఁబడినవి. అందలి నవరోజు మొదలగు కొన్ని రాగములు ప్రాచీన యక్షగానములలోఁ గన్పింపవు. భా. నా. వి. న శ్లోకములు, చూర్ణిక, మంజరీ ద్విపదలును విశేష ములు. శి. కే. పా. నఁ గందార్థములు విశేషము. మూఁడింటను రచన ప్రౌఢముగా నున్నది. నాటకీయత ప్రస్ఫుటముగా నున్నది.

---

48. పాకనాటి గణపతిరెడ్డి

గోపాల విలాసము: *

కవి విషయము:— కవిగోన బుద్ధారెడ్డి, అనుములగుండ్రము బొమ్మన, తంగెళ్ళ యాచన్న, బొలబ్రహ్మారెడ్డి, చిన్నన్న పెద్దన్న

---

* ఇది యైదాఱు ముద్రణలు గావించినది. అందొకటి:— రాయపురం రత్నా నాయకర్ శ్రీసరస్వతీ ము. శా., మదరాసు, 1886 (ఈప్రతిలో గ్రంథాంతమునఁగవి పంచావతార ద్విపద గలదు, ముఖపత్రమున నిది పాకనాటి గణపతి రెడ్డిగారిచే రచింపఁ బడినదని కలదు)

పిన్నమరెడ్డి యనువారలను తన వంశకర్తలుగా స్మరించియుండెను. కవి పితామహులు పెద్దమండలేంద్రుఁడు, సుజ్ఞానాంబ. వారికి విశ్వనాథుఁడు, కాళపరెడ్డి, పిన్నమరెడ్డి, అంగడిరెడ్డి యనువారు పుత్రులు. అందు పిన్నమరెడ్డికి కామాక్షమ్మయందుఁగల్గిన వాఁడీ గణపతికవి. ఇతనికాలానధి నిర్ణయ విషయమునను నొకప్రతివిలేఖనకాలమే శరణ్యమగుచున్నది. ఆం. సా. ప. సం. 135 తాళపత్ర ప్రతిలేఖనకాలము చిత్రభానుకార్తిక శుద్ధనవమి శనివారము. అనఁగా క్రీ.శ. 23-11-1822 రచనా రీతిని బట్టిగ్రంథము కొంతప్రాచీనమైనదిగనే తోఁచును.

గ్రంథ విషయము :-- శ్రీ కృష్ణజననము. బాల్యక్రీడలు యథాభాగవత కథితముగా మధురఫణితి నతిమాత్ర మనోహరముగా వర్ణింపఁబడినవి. ఇందు పోతనగారిపోకడలుగాక పద్యములే కొన్ని యున్నదున్నట్లుగా గ్రహింపఁబడినవి. ఇందుఁ దాళ ప్రధానములగు దరువులు ద్విపదలు, పద్యములు, సంధి వచనములునుగాక అర్ధచంద్రికలు, అల్లో నేరేళ్ళు, ఏలలు, జోలలు, త్రిభంగులు, గొబ్బిళ్ళు, వెన్నెల పదము మొదలగు చవులూరించు చక్కని దేశిరచనలు గలవు. కవి వైవిధ్యమును బ్రదర్శించుటయ కాక యాఛందస్సులను సందర్భసుందరముగాఁ బ్రయోగించుట గమనింపఁదగినది. గ్రంథము యక్షగానమని పేర్కొనఁబడినది.

---

49. ఆత్రేయపురపు తమ్మయ

గొల్లకలాపము : ♦

కవి గుఱించి వివరములు తెలియవు. ఇతని కృతులలో దరువు లలోఁ దఱచు ఆత్రేయపురి గోపాలముద్ర కలదు. కవి యింటిపే రాత్రేయపురపువారు. ఇతని గొల్లకలాపపుఁ బ్రతులు కొన్నిట (డి. 878 – 79) నిది "ఏడిద భాగవత" మని పేర్కొనఁబడినది. గోదావరిమండలమునందలి యమలాపురము తాలూకాలోని దాత్రేయ పురము, రామచంద్రపురము తాలూకాలోనిది యేడిద. కాఁగా గవి గోదావరీ మండలమువాఁడని నిశ్చయింపనగును. డి. నం. 1878 ప్రతి విలేఖనకాలము విరోధి జ్యేష్ఠ బహుళ షష్ఠి సోమవారము —— 22-6-1829. డి. నెం. 1879 ప్ర. వి. కాలము పార్థివ పుష్య బహుళ త్రయోదశీ శుక్రవారము. ——3-2-1826 కాఁగా గవి యంతకుఁబూర్వుఁడని చెప్పనగును. (కాని యంత పూర్వుఁడుగాఁదోఁపదు.)

* ప్రా. లి. పు. భాం. – డి. నెం. 1877, 1878, 1879, 1071. ఆర్. నెం, 485. ఇందు డి. 1877, ఆర్ 485 ప్రతులలో గ్రంథకర్త పేరు గాన నగును. ఆత్రేయ పురి గోపాల ప్రశంస యన్నింటను గలదు. అయిదింట నెడ నెడ పాఠభేదము లున్నను సమానముగా నున్న గ్రంథభాగమేయొక్కఁ. ఐదు నొక దాని ప్రత్యంతర ములే యనవచ్చును. గాని యైదు నసమగ్రములు డి. 1871 1971 లలో గ్రంథాది భాగములుగలవు. డి. 1877 ఆరంభించి, 1971 చూడు కొనుచు బిదప 1878 లోఁ దొమ్మిదవ యాకు మొదటి ప్రక్కనుండి కాని, 1879 లోని యెనిమిదవ యాకు రెండవ ప్రక్కనుండి కాని చివరంటఁ జదివినచో గ్రంథము స్వరూపము తేలఁగలదు.

గమనిక :— ఈ గొల్లకలాపమున కనుబంధ రచన యగు సముద్ర మథన కథ ఆర్. 485 లోను, డి. 1947 లోను గలదు.

గొల్లకలాపమున కనుబంధ కథ సముద్రమథనము. మథనము గొల్లల కులవృత్తిగనుక నది సాకుగా గొల్లజాతి గొప్పదన ముగ్గడించుటకును జగమెల్ల గొల్లయనుటకును గొల్లభామ సముద్రమథన కథాఖ్యానముసేయుట గొల్లకలాపములందుఁ దఱచు కాననగును. తిమ్మయ సముద్రమథన కథ రచించినాఁడు. ఆమె తక్రప్రాశస్త్యమును దమ కులాచారాదికము నుగ్గడించుట గొ. క. లలో సామాన్య విషయము. తిమ్మయ కృతియందు నదేవిషయము. ఇందలి రచన యొకమో స్తరు. ఇందు ద్విపదలు, దరువులు, కందములు, వచనములు గలవు. అక్కడక్కడ దరువులకు రాగనామములు వేర్కొనఁబడినవి. సముద్రమథన భాగమునఁ జూర్ణికయొకటి కలదు.

ఆం. సా. ప. లో నం. 4474 - వివిధ కవుల భామకలాపముల కలగూర గంప సంపుటమున (12, 16, 53, 110 అంకెలు గల యాకులలో) ఆత్రేయపురి గోపాల ప్రశంస గలదు. ఒకచోఁ దమ్మయ పేరు గూడ తడవఁబడినది. అనఁగాఁ దమ్మయ భా. క. ను గూడ రచించియుండును. భా. క., గొ. క. లను రెంటిని రచించిన కవులు మఱికొందఱు గలరు. అది సిద్ధేంద్రునినాఁటినుండి వచ్చిన సంప్రదాయ మేమో!

50. అగస్త్యరాజు రామన

సీతాకల్యాణము :*

కవి అగస్త్య రాజాన్వయుఁడు. అక్కమాంబా చెన్నమంత్రుల పుత్రుఁడు. ఇతఁడు గ్రంథమున పామూరు మదన గోపాలస్వామి ప్రశంస గలదు. అది కవి నివాసము కావచ్చును. (పామూరు నెల్లూరు జిల్లా కనిగిరి తాలూకాలోఁ గలదు.) ఇతని కృతి ప్రతి డి. నం. 1959 లేఖన కాలము :— విరోధి భాద్రపద శు. ౧౧. సౌమ్య వారము — 9—9—1829. కవి యంతకుఁబూర్వుఁడు కావలె. గ్రంథ రచనా రీతి సుగ్రీవ విజయమును బోలినది కాని యంత ప్రాచీనమై యుండదు. 17—18 శతాబ్దుల నడిమి కాలమున రచింపఁబడి యుండ వచ్చును. (ఇప్పటికిది నాయూహా మాత్రమ). ఇందలి కథ ప్రసిద్ధము రచన సలక్షణ మైనది, చక్కనిది. ఇందు సీత కడకు శ్రీరాముఁడే యెఱుకతమై వచ్చుట విశేషము. ఇందుఁ దాళప్రధానము లగు దరువులు, ద్విపదలు, సలఁతి సంధి వచనములు, గొలది పద్యములు, అర్ధ చంద్రికలు, ధవళ శోభనములు, సువ్వి, లాలి, జోలపాటలు మొ॥ గలవు. గ్రంథము యక్షగానమని పేర్కొనఁబడినది.

---

* ప్రచురణలు :— 1 వెస్లువార్డు అండుకో, మదరాసు, 1946. 2, ఎన్. వి. గోపాల్ అండుకో మదరాసు, 1950 (ముద్రిత ప్రతులోఁగవి తండ్రిపేరు మొ. విషయములఁ దప్పులు గలవు. అంశులకు ప్రా. లి. పు. భాం.డి. నం. 1958, 1959 చూచునది).

51. బలభద్రదాసి

కపోతవాక్యము : ♦

కవి సోమయ సోమని (బసువని) భామ మల్లాంబిక పట్టి. పేరును బట్టి గ్రంథము స్త్రీ కృత మనిపించును. అన్ని ప్రతులలో నాపే రట్లనే యున్నది. పట్టియను మాటను బట్టి యేమియుఁ జెప్పఁ జాలము. గ్రంథము కర్ణరచెన్నుని కంకితము.

డి. నం. 1844 ప్రతి లేఖన కాలము :— విరోధి మాఘ శు. 15 ఆదివారము — 7—2—1830. డి. నం. 1845 ప్ర. వి. కాలము విరోధి కార్తిక శు. 5 భానువారము. — 1—11—1829. గ్రంథ రచన 1829 సం. కుఁ బూర్వమనుట స్పష్టము. రచనా రీతిని బట్టి ప్రాచీనత క్వాచిత్కము ద్యోతమాన మగును.

గ్రంథ విషయము :— భారతము శాంతి పర్వమునఁ గల పరోపకార పరాయణ ధర్మ ప్రబోధాత్మక మగు కపోత వాక్యోపాఖ్యాన మిందు మనోహరముగఁ బ్రపంచింపఁబడినది. ఇందు విడి విడిగా రాగ తాళ ప్రధానములగు దరువులు, ద్విపదలు, కందములు, చౌపదములు జాళిపదాలు, నడలు, రేకులు, అనువులు, అర్ధచంద్రికలు, సువాలమొ. రచనా విశేషములు గలవు. మంచి పలుకుబళ్ళు గల పదగతి, సూనృతమైన భావావేశమును గల రచన. య గా. అని పేర్కొనఁబడినది.

♦ ప్రతులు:— 1 తం. స. మ. కే. నం. 474—475.

2 ప్రా. లి. పు. భాం. డి. నం. 1844, 1845, 1846.

(కని విషయమునకు తం. స. మ. ప్రతి గ్రాహ్యము)

52. సిరిప్రెగడ సుబ్బారాయుఁడు

(ప్రా. లి. ప్ర. భాం. డి. నం. 1956, 1957— సారంగధరనాటకము హరితస గోత్రుఁడు, వెంకట్రామయ్య పుత్రుఁడునైన సుబ్బారాయని కృత మని యున్నది. అంనే డి. నం. 1889, 1890— నలనాటకమున నది శిరు ప్రెగడ (సిరిప్రెగడ సుబ్బరాయ కవి కృత మని యున్నది. (కేటలాగు కర్తలు "గ్రంథకర్త వేరిందుఁగానరా" దని ప్రాసిరి. కాని డి. 1890 ప్రతిగల సంపుటము 137 వ పుట రెండవపంక్తిలోఁ గవివేరు స్పష్టముగాఁగలదు). ఉభయ గ్రంథములు నేకకర్తృకము లనుటకుఁ గథోపక్రమణిక, నిర్వహణ, రచనల యందుఁగల సామ్యమే ప్రబలమైన తార్కాణ. అందులకు రెండింటను గల కోలకేతన కథా ప్రస్తావన, రాజపాత్ర ప్రావేశిక ధ్రువ, రాజుగారి మృగయూసన్నాహము, రాజపురోహిత ప్రావేశికధ్రువ మొదలగు సందర్భములు బోల్చి చూడనగును. రెండును శివాంకితములు.

రెండుగ్రంథములును బ్రసిద్ధేతి వృత్తములు. రెండింట దరువులు ద్విపదళ్ళు వచనములు సమపాళముగా నున్నవి. ఏలలున్నవి. నలచరిత్రలో సదనముగా శోభనములు, గొలఁది పద్యములును గలవు. అందాశ్వాస విభాగముండుట యొకవిశేషము. రెండును నాటకములని పేర్కొనఁబడినవి. సారంగధరనాటకము పాఁపటకు, నాఁపటకు నుద్దేశింప బడినది. రెండు నొకవిధమగు వ్యావహారికభాషాధోరణిలో సాగినవి. రెండును బ్రౌఢ రచనలుగావు. నలనాటకము బిల్వపురీశున కంకితము. బిల్వపురి యనఁగా ఉత్తరార్కాటు మండలమునందలి తిరువలమను క్షేత్రము. కవి యాప్రాంతపువాఁడు గానచ్చును.

డి. 1957 ప్రతిచివర "విరోధి నామ సంవత్సర శ్రావణ శు. 15 శనివారం పుదుచేరిలో ఈ సారంగ నాటకం సంపూర్ణంగా మాజేటి సర్వేశలింగం వ్రాసుకొనెను." అని యున్నది. క్రీ. శ. 14–8–1829 విరోధి శ్రావణ శు. 15 అనఁగా బూర్ణిమయే కాని శుక్రవారము. ఆ మఱునాఁడుగదా శనివారము. ఇక్కడ తిథివిషయమున నేదో చిన్న తికమకగలదు. అదియట్లుండ నీ డి. 1957 తాళపత్రప్రతి, అట్టిచో నది తరువాతి విరోధి (క్రీ. శ. 1889 యనుట కా కాలమునకుఁ గాగితములు నచ్చు వచ్చియుండుటచే నది పొసఁగదు కదా. ఈ ప్రతి విలేఖకుఁడగు మాజేటి సర్వేశలింగమే ప్రా. లి. పు. భా., నందలి యనేక తాళపత్ర గ్రంథముల ప్రతి విలేఖనములు చేతి మీఁదుగా నడచిన పూర్ణకాముఁడు. ఆయాప్రతి విలేఖనకాలము లనేకము పరిశీలింపఁగా నతఁడు క్రీ. శ. 18 శతాబ్ది పూర్వార్ధమున నుండినట్లు తెల్లమగుచున్నది. అందుచే నీప్రతి విలేఖన వత్సరమగు విరోధిని 1829 గా గ్రహింపనగు. సుబ్బరాయని కృతులంతకుముందు పుట్టినవనవలెఁ గాని యేమంత ప్రాచీన రచనలుగాఁ దోఁపవు.

---

53. వేల్పూరి వేంకట కవి

కవి విషయము:—ఆపస్తంబ సూత్రుఁడు, మహాద్భల్యసగోత్రుఁడు, బహ్మన లేక బొపనామాత్యుని పుత్రుఁడు. గొంగాళ రామశాస్త్రి శిష్యుఁడు. (ఇవి యీయన రామలీల, గౌరీశంకరవిలాసముల నుండి యెఱుకపడిన సంగతులు). ఈయన నివాసము విశాఖమండల విజయ

నగర రాజ్యమందలి రావివలస. కృతులు:— విచిత్రరామాయణ కావ్యము, గౌరీశంకర విలాస నాట్యప్రబంధము,[1] రామలీల[2] యక్ష గానము, జానకీరామశతకము, గోవ్యాఖ్రు పరిచయము మొదలగునవి. ఈయన "త్రిషష్టి వర్షముల్ యుర్వరఁ గీర్తినొంది చనె నొప్పుగ స్వర్గము యాగ కర్మశాఖర్వము శాలివాహన శకంబున వహ్ని గాద్రి చంద్రులం, బర్వవిరోధి కృన్మహిత వత్సర యాశ్వీన కృష్ణ పంచమిన్" అనఁగా శా. శ. 1773-78- క్రీ. శ. 1851 అది యీయన నిధనకాలము. ఈయన 63 సం. లు జీవించినట్లు పై పద్య మునఁ జెప్పఁబడినది. కావున నీయన జననము క్రీ. శ. 1778 అగుచున్నది. వహ్ని శబ్దమునకుఁ ద్రేతాగ్నులనుగాక పంచాగ్నులను గ్రహించినచో నీయన కాలము క్రీ. శ. 1780 - 1853 అగును. "ఇర్వదినాల్గు హాయనము లింపు దనర్చినకాలమాదిగా" నీయన కృతులు రచించి నారఁట. అనఁగా క్రీ. శ. 1804 ప్రాంతమున నీతని యక్షగానముల రచన జరిగినదని యూహింపవచ్చును. (ఈ విషయము లీయన రామలీల గౌ. శం. విలాస ముద్రిత పత్రి కితని ద్వితీయపుత్రుఁడగు వెంకట రామయ్య సంతరించిన ముఖబంధ పద్యములవలన నెఱుఁగనై నవి. ప్రాయికముగా నితని కృతులన్నియు విజయనగర సమీపమునఁ గల రామతీర్థ క్షేత్రస్వామి కంకితములు.

గ్రంథ విషయము

రామలీల:

రామాయణ మాఱుకాండలు నిందు సంగ్రహముగా రచింపఁ బడినవి. కాండాంత కవి విషయక గద్యలు వినా గ్రంథము నిర్వచ

(1) (2) రెండును విశాఖపట్టణము శ్రీ శారదా ముకుటము. శా. లో ముద్రి తములు., సం. 1900.

నము. ప్రసిద్ధ రాగతాళములలో దరువులును పద్యములును విరివిగాఁ గలవు. ఎడనెడ ద్విపదలు. ఆఖ్యానశైలి యెక్కువ. రచన చక్కనిది. యక్షగాన కావ్యమని పేర్కొనఁబడినది.

గౌరీశంకరవిలాసము:

గంగా శంకరుల చైత్రరథ వన విహారము — అట శివుని గంధర్వాంగనల పొందు-వారును గంగయు నెట్లో సమాధానపడిరనఁగా గౌరీదేవి యాగమనము — సవతుల కయ్యము — శివు డెట్లో సమాధానము గుదుర్చుటయు నిందలివిషయము. ఇది కొంత పట్టు కూర్మ నాథకవి మృత్యుంజయ విలాసము ఫక్కిని రచింపఁబడినది. ఇందాశ్వాస విభాగము (3) గలదు. ఇది శృంగార నాటక ప్రబంధమని పేర్కొనఁబడినది. ఇందలి ప్రధాన రసము శృంగారము. పాత్రల సంభాషణలతోఁ గథా ప్రవృత్తి నాటకోచితముగా నున్నది. పుర వనాది వర్ణనములు, మదన చంద్రాస్తాలంభములును ప్రబంధోచితముగా నున్నవి. ప్రసిద్ధ రాగ తాళములలో దరువులు, పద్యములు, వచనములు, ద్విపదలును గలవు. రచన చక్కనిది.

---

54. చెళ్ళపిళ్ళ నరసకవి

ఈయన రచించిన యామినీపూర్ణ తిలకావిలాస ప్రబంధము (బందరు శృంగారకావ్య గ్రంథమండలి ప్రచురణ, 1941) నకు కీ. శే. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు పీఠిక వ్రాయుచు నరసకవిగారు తమ

పిన్నముత్తాతగారనియు, వారు గోదావరిమండలమునందలి కడియం గ్రామ వాస్తవ్యులనియు, క్రీ. శ. 1795 - 1840 సం. ల నడుమ నుండిరనియు, వారు అహల్యా సంక్రందన విలాసము, ఏకాంత సేవా కలాపము ననుసరించి రెండు యక్షగానములు రచించియుండిరనియుఁ, గవి స్వహస్తలిఖితములగు ప్రతులకుఁ దాము స్వయముగాఁ బ్రతులు తయారుచేసికొనియున్నను నవి యంతరించినవనియు వ్రాసియుండిరి. (నరస కవిగారు యూ. పు. తి. విలాసమున పిఠాపురము రావు వేంకట నీలాద్రి రాయ నృపతిని బేర్కొనియుండుటచే నా నృపతి "నూఱు సంవత్సరములక్రిందట నుండినవాఁడై నందున నాతనికాలములో నుండిన కవియు దాదాపుగా నూఱు సంవత్సరముల క్రిందటివాఁ" డని శ్రీ వీరేశలింగముగారు ఆం. క. చ. లో నరసకవి చరిత్రమున వ్రాసినారు.)

---

55. శివలెంక మల్లనారాధ్యులు

వీరభద్ర విజయము:

కవి విషయము: ఇతని పితామహుఁడును మల్లనారాధ్యుఁడు. తండ్రి మహాదేవారాధ్యుఁడు. గురువు రామయ్య దేశికుఁడు! గ్రంథ మేలూరు జలాపహారీశ్వరున కంకితము. కాఁగా నితఁ డేలూరు వాస్తవ్యుఁడని యూహింపఁదగియున్నది. ఇతని కాల నిర్ణయమున కొక యాధారముగలదు. ఈ వీ. వి, యొక్క ప్రా. లి. పు. భాం., ఆర్. సం. 614 ప్రతి విలేఖనకాలము శుభ కృత్కార్తిక శు. ౧౧ ఆది వారము — క్రీ. శ. 13-11-1842. గ్రంథరచన యంతకుఁబూర్వమనుట

నిశ్చయము. శ్రీ రాజా మంత్రిప్రగడ భుజంగరావుగారు సంతరించిన ఆధునిక కవి జీవితములను గ్రంథమున (నెం. 134 గా) నున్న శివలెంక నాగభూషణముగారి చరిత్రమున వారి నివాస మేలూరికి సమీపమున నున్న వంగూరనియు, వారు శైవబ్రాహ్మణులు, ఆపస్తంబసూత్రులు, సాలంకాయనగోత్రులు నను విశేషములు దెలియుటతోపాటాయన మల్లనారాధ్యుల పౌత్రులనియు, వారి జనన కాలము క్రీ. శ. 28-4-1872 అనియుఁ దెలియవచ్చినది. అందుచే వారి తాతగారగు మల్లనారాధ్యులు 19 వ శ. పూర్వార్ధమున నుండినట్లు స్పష్టము.

గ్రంథ విషయము:— మూఁడాశ్వాసములుగా విభక్తము. ఇందు వీరభద్ర విజయ కథా ప్రధానమైనది ప్రథమాశ్వాసము మాత్రమే. ద్వితీయమునఁ బార్వతీకల్యాణము, తృతీయమునఁ గుమార సంభవ తారకవధములుప్రధానవిషయములు. గ్రంథనామము పూర్తిగా సార్థకముగాదు. ప్రసిద్ధ కథాసందర్భముల కింతవిరుద్ధముగాఁ కవి యిం దలఁతి యలతిఁ మార్పుల నవధరించి యుండెను. కాని యవి కావ్య గుణాపకర్షకములు గాలేదు. ఇందుఁ బ్రసిద్ధ రాగ తాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు, వచనములు, కందార్ధ సార్ధములు, సువ్వి, జోలలు, శోభనములును గలవు. రచన చక్కనిది. కూర్మనాథ కవి మృత్యుంజయవిలాస రచనాప్రక్రియతో దీనికిఁ జాల పోలిక గలదు. ఎఱుక, పార్వతి యనుతాప ఘట్టములందు రచనలోఁగూడ బోలిక స్పష్టపడినది. ఇదియు మృ. వి. వలె నవతారికలో యక్షగాన మనియు నాశ్వాసాంతగద్యలో శృంగార నాటక గేయప్రబంధమనియుఁ బేర్కొనఁ బడినది. కాని యిందు శ్రవ్యకావ్యధోరణి యెక్కువ. గర్భకవిత్వ మట నట ప్రదర్శింపఁబడినది. యుద్ధవర్ణన లుదాత్తముగా నడచినవి. ఎఱుక ఘట్టము నేర్పుగాఁ జిత్రింపఁబడినది.

56. ముమ్మడిదేవుల తిరుమలకవి

గీతరఘునందనము:*

కవి విషయము:—పరాశర సగోత్రుఁడు. రామచంద్రయతి శిష్యుఁడు. హరిహరాద్వైతి. ఈతని తండ్రిపేరు గూడ తిరుమలార్యుఁడే. తల్లిలక్ష్మమ్మ. చిత్తూరు కవికుటుంబమునకుఁ జీరనివాసమఁట. కాలము: ఈగ్రంథముయొక్క ఆం. సా. ప. ప్రతిలేఖకుని శ్లోక మొకటిగలదు — "గురువారేఽక్షయబాహుల బహుళాష్టమ్యాం స సచ్చిదానందః, గీతరఘునందనం నిజ పితృ తిర్మలరచిత మలిఖ దిదమ్" ఆ యక్షయబాహుల (కార్తిక) బహుళాష్టమి గురువారము క్రీ. శ. 29-11-1846 కి మాత్రము సరిపోయినది. ఆనాఁడా ప్రతిని లిఖించిన సచ్చిదానందుఁడు గ్రంథకర్త కొడుకునని చెప్పియున్నాఁడు. కాఁబట్టి తిరుమలకవి క్రీ. శ. 19వ శతాబ్ది పూర్వార్ధమున నుండి యుండెననుట నిశ్చయము.

గ్రంథ విషయము:— ఇందు రామాయణ సూఁచు కాండల కథయు యథావాల్మీకి ప్రమాణికముగాఁ గలదు. దానివలె నిదియు "సాత్యేగేయేచ మధుర"మ్మనఁదగినది. వాల్మీకి రామాయణము ననుదినము నర్థపరాయణుఁడై పారాయణ మొనర్చిన వాఁడట కవి. కాని యతఁడిందు భోజ చంపువునుగూడ బలుకరింపక నిడువలేదు. గీత రఘునందన మనఁగానే గీతగోవిందము స్ఫురణకు వచ్చును.

* ఆం. సా. ప.— సం. 6

ఇందలి బాలకాండ మాత్రము 1896 లో ప్రకాశకం ఆనందాచార్యుల వారిచేఁ బ్రకటితము. (ఈఆనందాచార్యుల వారి పుట్టుక 1843 లో ననియు, వారి తండ్రిగారికి తిరుమలకవి పుత్రుఁడైన సచ్చిదానందముగారు మిత్రులనియు డాక్టరు శ్రీనేలటూరి వెంకటరమణయ్యగారు సెలవిచ్చియున్నారు).

రెండును గీతిధర్మ ప్రకృష్టములే కాని రెండింటను ప్రధానభేద మొకటి కలదు. గీతగోవిందము భావ ప్రధానమైనది. గీతరఘు నందనము వస్తుప్రధానమైనది. ఇందు సుదీర్ఘసంవాద శైలీ చాతురి, నాటకీయ సన్నివేశ ప్రకల్పన శిల్పమును గని చూపియున్నను, పాటపాలెక్కువ యని యాపేరే చెప్పకచెప్పుచున్నది. ఇది ధారా ధోరణీ భాసురము లగు దరువులతో తాళప్రధానములు, గతి గంభీరములగు ద్విపద లతో బరువులెత్తు పదపద్యములతో, ఏలలు, అర్ధచంద్రికలు, లాలి పాట, శోభనములు మొదలగు గేయవిశేషములతో నిర్వచనముగా సంతరింపబడినది. ఇదిదలి భాష సలక్షణమైనది. రచన నిర్దుష్టమైనది. ప్రబంధమనిపేరొక్కొన బడినంసలకుఁ దగినట్లు చక్కని వర్ణనలును గలవు. అన్నిటిని మించిన దిందలి రసప్రసన్నమగు శైలీ లాలిత్యము.

---

57. కానుకొలను వెంకటదాసు

శ్రీకృష్ణనాటకయక్షగానమహాప్రబంధరాసక్రీడావిలాసము*

కవి విషయము:—శ్రీవత్ససగోత్రుఁడు. కానుకోలను భావయామాత్య పుత్రుఁడు. "ఈయనకే నాయనప్పయని నామాంతరము.

---

* కవి శ్రీకృష్ణనాటకమను యక్షగాన మహాప్రబంధము నాశ్వాస బహుళ ముగా రచించియుండినట్లును నందుఁ చతుర్థాశ్వాసము రాసక్రీడావిలాస మనియు గ్రంథాంతగద్యవలనఁ దేటపడుచున్నది. ఆ చతుర్థాశ్వాసము మాత్రమే నేఁడు లభించుచున్నది. ... అం. సా ప. తాళపత్రప్రతి నం.2748. ఇది 1926 లో బందరు నేషనల్ ప్రెస్ వారిచేతను, 1948 లో ఏలూరు వెంకట్రామ పవర్ ప్రెస్ నందును ముద్రింపబడినది. ముద్రణప్రోత్సాహకులు గ్రంథకర్తగారి పౌత్రులని రెండిటి ముఖ పత్రములమీఁదను గలదు.

చింతగుంటపాలెపు రామశతకకర్త. ... 1816 వ సం. లోఁ బైకవి 12 వత్సరముల ప్రాయమున నుండఁగా నీశతకము వ్రాసెనట" అనియు నతనినిగుఱించి శతకకవులచరిత్రలోఁ గలదు. చింతగుంట పాలెము బందరులో నొక పేటయఁట.

గ్రంథవిషయము:—గోపికాకృష్ణుల రాసక్రీడలు. ప్రసిద్ధరాగతాళములలోఁ గవినామాంకితములగు దరువులు, పద్యములు, శ్లోకములును గలవు. కవిత్వమెంతయు హృదయంగమము. రాసక్రీడఘట్ట మతిమాత్రమనోజ్ఞము. కవి సంగీతజ్ఞానము వెల్లివిరిసినది. దరువులు సలక్షణములైన చక్కని కృతులవలె నున్నవి.

---

58. జ్యోతిరామయ్య

పారిజాతనాటకము:

పై గ్రంథము ఆం. సా. ప. ప్రతిలెం. 1743 అసమగ్ర మైనది. ప్రత్యంతరము లభింపలేదు. గ్రంథములోపలఁ గవినామాదులు తెలియుట కవకాశము లేదు. "లేబిలు"పై జ్యోతిరామయ్యపేరు కన్పట్టుచున్నది. అతఁడుకాని యేతద్గ్రంథకర్తయై యుండునాయని వట్టియనుమానముమాత్రమే. అతఁడే కర్తయగునేని గ్రంథరచనా కాలమును నిర్ణయించుట కొక యాధారముగలదు. జ్యోతిరామన తన కృతి ప్రోత్సాహకులలో నొకఁడని శ్రీధరమల్లె వెంకటస్వామి తన బ్రహ్మోత్తరఖండమునఁ జెప్పియున్నాఁడు. (చూ. ఆం. క. చ. తృతీయభాగము

వేంకటస్వామి "శకవర్షగణనంబు శైలరామమునింమ, పరిమితంబై ధాత్రిబరగుచుండు యువనామ సంవత్సర" మునఁ తనగ్రంథము రచించినట్లు చెప్పుకున్నాఁడు. అది శా. శ. 1787 — క్రీ.శ. 1865 అగుచున్నది. జ్యోతిరామనయ్య నాప్రాంతమువాఁడే యగును. వేంకటస్వామి జ్యోతిరామయ్య విష్ణువర్ధనగోత్రుఁడైన సుబ్బనకుఁ గొడుకనియు నతనికి లక్ష్మీనారాయణ, చెంగల్వరాయఁడునను సోదరులున్నట్లును జెప్పినాఁడు.

ఈ పారిజాత నాటకము చేజెర్ల చెన్న కేశవ స్వామి కంకితము. (చేజెర్ల గుంటూరు జిల్లా, ఒంగోలు తా॥) గ్రంథమంతయు సత్యభామ స్వగతమువలె నున్నది. ఆమె కృష్ణుని వెదకి కొనుచు వచ్చుటయుఁ దనపెండ్లిముచ్చట ముచ్చటించుచుఁ దన వలవంత వెళ్ళఁబోసి కొనుటయు నున్నంతలో నిందలి విషయము. ఇందుఁబ్రసిద్ధ తాళ ప్రధానము లైన దరువులు, ద్విపదలు, పద్యములు గలవు. రచన బాగు లేక పోలేదు.

---

59. జండాళనంజప్ప

జ్ఞానకురవంజి:*

ఈ నంజప్ప తాను జ్యోతి రామగురుని శిష్యుఁడ ననిమాత్రము చెప్పుకొనినాఁడు. అతఁడు పై జ్యోతి రామయ్యయే యగునేని నంజప్ప

* ఇది 1867 సం. ననే ముద్రితమైనది. ప్రచురణ వివరములు తెలియవు. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయమున నొక ప్రతికలదు. — నెం. 150.

కాలము 19 శ. పూర్వార్ధముగా గ్రహింపవచ్చును. ఇతని జ్ఞాన కుర వంజి స్త్రీ కథ, పురుష కథ అని ద్విధా విభక్తము. మొదటి భాగ మున నెవరో మునికాంతకు ముక్తికాంత యొకుకతయై యద్వైత తత్త్వమును గూర్చి యొకుక చెప్పుటయు, నపరార్ధమున పరమాత్మ యగు సింగడు సింగిని వెదకుచు వచ్చుటయు వారి సంవాదమును విషయములు. సాంకేతిక పరిభాష యొక్కువ. ఇందుఁ బ్రసిద్ధ రాగ తాళములలో దరువు లనేకము, దరువులలో సంవాదములు, కందార్ధ ములు, ఏలలు, ద్విపదలు, పద్యములు (జాత్యుప జాతులు మాత్రము), వచనములు, సంధి వచనములు, నొక దండకము, నొక చూర్ణికయుఁ గలవు. రచన వేలవము. దోష దోహలము. ఛందోదోషము లనే కము. గణ యతిప్రాసములలో నేదో యొకటి నప్పినఁజాలు నన్న రకము వాఁడు గ్రంథకర్త. గ్రంథము యక్షగానముగాఁ బేర్కొనఁ బడినది.

---

60. తరిగొండ వేంగమాంబ

ఈమె యింటిపే రసలు తరిగొండవారుకాదు. తరిగొండ కడప మండలము వాయల్పాడు తాలూకాలో నొకగ్రామము. ఈమె పుట్టినింటి వారు కానాలవారు. నందవరీక బ్రాహ్మణులు. వాసిష్ఠ గోత్రులు. ఈమె తండ్రి కృష్ణార్యుఁడు. తల్లి మంగమాంబ. భర్త

ఇంజేటి * వంశ్యుఁడును, శ్రీవత్సగోత్రుఁడు, తిమ్మయార్యుని పుత్రుఁడు నైనవెంకటాచలపతి. కాని యీమెకుఁ దరిగొండవెంగమ యనియే ప్రసిద్ధిగల్గినది. తరిగొండ నరసింహుఁ డామె కిలువేల్పు. తిరుపతివేంక టేశ్వరుఁ డిష్టదైవతము. ఆయిరువురకు నభేదముపాటించి చాల కృతులను సముద్రకముగా నర్పించిన దామె. కొన్నిటిని సుబ్రహ్మణ్య గురున కంకితము చేసినది.

ఈమె 1840 సం. నందు జీవించి యుండినట్లు కీ. శే. సి. పి. బ్రౌను దొరగారు తమనిఘంటువున వ్రాసియున్నారు. కాని యప్పటి కామె వార్ధకదశయందుండెనని యూహింపనగును.

ప్రా.లి.పు.భాం.ఆర్.నం. 1056 పారిజాతాపహరణ నాటకము (వెంగమకృతము) ప్రతి చివర "దుర్ముఖినామ సంవత్సర ఆషాఢశుద్ధ 6 గురువారమునకుసరియయిన 1896 సంవత్సరం జులాయినెల తేదీ 16 న శ్రీతరిగొండ వేంగమ్మ గారికి మునిమనుమఁడనూన్న, వేంగమ్మ గారికి కోడలైన చెంగమ్మగారికి మనుమఁడైన గరిడిమి ..గుమ్మన్న కొమాకుఁడయిన గంగాధరప్ప, గాదంశెట్టి పుల్లయ్య వ్రాసిన అసలు మాతృకనుపట్టి సంపూర్ణముగా గ్రంథంపూర్తిగా వ్రాయడమైనది." అని యున్నది. 1896 నాఁటి కామె పౌత్రులకు దౌహిత్రులున్నా రనఁగా నామె 18 వ శతాబ్దిచివరికే పుట్టియుండును. ఆమె గ్రంథరచన-యక్షగాన రచనమైన 19 వ శతాబ్ది ప్రథమ పాదమున జరిగియుండును.

---

*కొన్ని తావుల నింజేటి, నుంజేటి యనియుఁగలదు. అది లేఖకుల పొరపాటై యుండును. ఇంజేటి—అనుగ్రామము కర్నూలుజిల్లా కోయిలకుంట్లతాలూకాలో గలదు. దానినిబట్టియే ఆయింటి పేరెర్పడి యుండును.

వెంగమాంబ విషయ మామెగ్రంథముల నుండియే విశదమగుచున్నది. అందు ద్విపదభాగవతము (ప్రా. లి. పు. భాం., డి. నం. 1013) నుండి యొక్క—వసంగతు లెఱుకపఱఁగలవు.

కెంగమాంబ "నాచిన్ననాట నోనామాలనైన, నాచార్య లెనరు నాకాన తీలేదు" అని చెప్పినది. కాని పదునైదు కృతులు రచించినట్లోడయామె. అవి 1. నరసింహ శతకము, 2. నరసింహ విలాసకథ, 3. శివనాటకము, 4. రాజయోగసారద్వీపద, 5. కృష్ణ నాటకము, 6. పారిజాతాపహరణము, 7. రమాపరిణయమను పెండ్లి పాట, 8. చెంచునాటకము, 9. శ్రీకృష్ణమంజరి, 10. రుక్మిణీ నాటకము, 11. గోపికా నాటకము, 12. ద్విపదభాగవతము, 13. వేంకటాచల మాహాత్మ్యము, 14. వాసిష్ఠరామాయణము, 15. ముక్తికాంతా విలాసము. ఇందు శతకములు, పద్యద్విపదకావ్యములు, యక్షగానములు, పాటలును గలవు. ప్రక్రియావైవిధ్యమే కాదామెసాహిత్య మందుభక్తి, శృంగారము, వేదాంతము మున్నగా విషయవైవిధ్యమును గలదు. ఆమెగ్రంథములు పదునొకండు లభించినవి. అందాఱు ముద్రితములు. (4, 8, 13, 14, 15,). పైపట్టికలోయక్షగానములేడు గలవు. (3, 5, 6, 8, 10, 11, 15). అందు రుక్మిణి నాటక మలభ్యము. నారసింహ విలాసకథయు యక్షగాన మగునేమో కాని యదియు నలభ్యము.

గ్రంథసమీక్ష

శివనాటకము[1]:

దీనిని శివనాటకమనియుఁ గనయిత్రి వ్యవహరించినది కాని ప్రతివిలేఖకులు కొందఱొక క్రొత్తపేరు పెట్టినారు – శివపారిజాతమని.

1 ఆం. సా. ప. ప్రతులు:— నం. 2175 – 77 (కాగితము), నం. 1493, నం. 1749 లో నెనిమిదాకు లింబలి యొఱుక పుట్టము. ఆది పారపాటున వేంకటేశ్వర కల్యాణమను యఁ. గా. గాఁబోర్కొనఁబడినది. (ఆం. సా. ప. ముద్రిత గ్రంథ సూచిక లో) అడయారు ప్రతులు :— 32 (ఇ) 19, 32 హెచ్, 8. ఆం. సా. ప. ప్రతిలో మాత్రము వెంకమాంబ తండ్రి శేషాచార్యుఁడని యున్నది. కాని అడయారు ప్రతులలో నామె కడమగ్రంథములలో కృష్ణార్యుఁడనియే కలదు. అదే గ్రాహ్యము.

పారిజాత ప్రసక్తి యిందెక్కడను గానరాదు. కాని నారదుఁడు పారిజాతము కారణముగా సత్యా రుక్మిణుల మధ్య సవతికయ్యము తెచ్చి పెట్టినట్లే యిందొక రత్నహారముద్వారా గంగా గౌరుల నడుమ నది కల్పించును. సందర్భ సాదృశ్యమునుబట్టి లేఖకుఁడు చేసిన పనియిది. ఇందు లక్ష్మీ కొరవంజియై గంగ కెఱుక చెప్పుట, నారాయణుఁడు సింగఁడగుట, సింగీ సింగళ్ళ ప్రసంగము, సవతుల సంవాదము హృదయంగమముగా సాగినవి. అప ప్రయోగము లనేకమున్నను సహృదయ సంభావనమునకుఁ గొదువపడదు. వెంగమ శివకథ యగుటచేఁగాఁబోలి గ్రంథమును రాచవీటి వీరభద్రున కంకితమిచ్చినది.

బాలకృష్ణనాటకము[2]:

గోపికాకృష్ణ సంవాదము:— కృష్ణుఁడదృశ్యుఁడగుట — గోపికల యన్వేషణ — అతఁడు ప్రసన్నుఁడై వారితో జలక్రీడ లాడుట — అంతలో రాధ గోపాలుని పాలికిఁ జెలికత్తెను బుత్తెంచుట — గోపికలా రాధా సఖుపైఁ గోపించుట — కృష్ణుఁడు రాధను ప్రసన్నుఁజేసికొనుట — ఇదీ యిందలి విషయము. రచన యొక మోస్తరు.

పారిజాతాపహరణము[3]:

కృష్ణుఁడు పారిజాత వృక్షమును దెచ్చెదనని సత్య ననునయించి సుఖించుచున్న ఘట్టముతోనిందలి కథారంభము. పూర్వకథ సంగ్రహ

---

2 ఆం. సా. ప. – నం. 1566. వెంగమ తాను కృష్ణనాటకమును, గోపికా నాటకమును రచించినట్లు మాత్రము ద్విపద భాగవతమునఁ జెప్పినది. కాని యీ బాలకృష్ణ నాటకమునదే నేఁడుపలబ్ధము. అందా పేరట్లనే యున్నది. విషయమును బట్టియిది పై రెండిట నేదైనను గావచ్చును.

3 ప్రా. లి. పు. భాం., న. విష్ణు పారిజాత మను పేరున్నది — ఆర్. నం. 1056. శివవిలాసము తప్పుగా శివ పారిజాత మని వ్యవహృతమైనది. తద్భిన్నత గుర్తింపఁబడుట కిది విష్ణు పారిజాతమైనది. (ఇది సుమారు రెండువేల గ్రంథము).

ముగాఁ బ్రస్తావింపఁబడినది. కృష్ణుఁడొకనాఁడామెను గికురించి కడమ రాణులఁ గలియఁబోవుట – సత్య విరహము – సత్యాకృష్ణుల సందేశములు, సంవాదములు – సత్య కడకు సరస్వతి కొరవంజియై వచ్చుట – బ్రహ్మ సింగఁ డగుట – సత్య తపస్సు చేసి స్వామిని బ్రసన్నుఁజేసికొనుట – కృష్ణుఁడు స్వర్గమున కేఁగుట కొక నెపము కల్పించుకొనుట – నరకాసురవధ కథ యప్పు డనుసంధింపఁబడినది. సంకరోభ చిత్తమైన మార్పు – తదుపరి పారిజాతాపహరణము – ఇంద్రోపేంద్రుల యుద్ధము – దివిజ తరువు సత్యభామ పెరటికిఁ దిగఁగానే సవతుల కయ్యము – రుక్మిణితీర్పు – సత్య సవతులకుఁ బూలవాయనము లిచ్చుట – ఇట్లు పారిజాతకథ బహుధా ప్రపంచింపఁబడినది. శృంగార హాస్య రసములు వెల్లివిరిసినవి. సంభాషణలు చతురముగా, రచన రసోత్తరముగా సాగినవి.

చెంచునాటకము[4]:

చెంచులక్ష్మి చెల్లెలు తనప్రియుని వెదకికొనుచు బావగారి భవనపుఁ జాయలకు వచ్చును. అట తరిగొండ నరసింహస్వామి ద్వార పాలకులచేఁ బృచ్ఛితయై చెంచెత తనచరిత్ర, తనవారి చరిత్రయావత్తు నేకరువు పెట్టును. తరువాత నామె ప్రియుఁడు చెంచునాయఁకుఁడు వచ్చును. అతనితోఁ వాదులాటయైనతరువాత చెంచెతబుజుత నతనికప్పగించి వేటకు బోవును. ఆమె తిరిగి వచ్చు సరికిఁ జెంచునాయని బెదిరించి యొకపులి యాశిశువు నెత్తుకొని పోవును. చెంచెత యంగలార్చి

4 అమెరికన్ డైమండు ము. శా. ప్రచురణ, మదరాసు, 1927, 1929. ఈముద్రణ నిర్దుష్టముగాదు. ఇందలి గ్రంథాంత ద్విపదలో చెంగమాంబ తల్లి గంగమాంబ యనికలదు. కడమ గ్రంథము లందెల్ల మంగమాంబయనియే గలదు. అదియే గ్రాహ్యము.

యార్చి చివరికి శ్రీ వెంకటేశునకు మొక్కుకొని శిశువును బడయును. ఇందు చెంచుల కులాచారములు చక్కఁగా వివరింపంబడినవి. చెంచెత పుత్రశోక ఘట్టము హృదయము నుదిలగొను నట్టిది.

చ: క్తి కాంతా విలాసము[5] :

దీనికి వేదాంత జ్ఞానబోధిని యని నామాంతరము. ఇందలి విషయము వేదాంతమైనను రచన సాంకేతికముగా నొకభామకలాపమువలె నడచినది. జగదీశ్వరుఁడు మాయను వీడి ముక్తికాంతను బొందఁగోరి యామె మందిరమునకు వచ్చుట – (జ్ఞానకాంత చెలికత్తె) తలుపు మూయుట – తలుపుకడ నావ లీవల నాయికానాయకుల సంవాదములు –అనంతరము మాయాశక్తి వైరాగ్య జ్ఞాన శక్తులతో వాదించుట – మొ॥ విషయములు, కృష్ణుఁడు సత్యయింటికి వచ్చుట చెలికత్తెలు తలుపులు మూయుట, సత్యా కృష్ణుల సంవాదములు తదుపరి సత్యా రుక్మిణుల సవతికయ్యము మొ॥, సందర్భములను దలఁపున కెలయించును. విషయము క్లిష్టమైన వేదాంతమైనను జెప్పుటలో సాధ్యమైనంత సౌలభ్యము జూపినది, గ్రంథకర్త[?]. ఇది సుబ్రహ్మణ్య గురున కంకితము.

వెంగమ యక్షగాన కృతులన్నియు మంచి నాటకపువాటము గల్గియుండును. అందలి దరువు లెక్కువగాఁ బ్రసిద్ధ తాళప్రధానములు. అట నట రాగములు వేర్కొనబడినవి. ద్విపదలు, మంజరి, పద్యములు, సీసార్థములు, వచనములు, ఏలలు, గొబ్బిళ్ళు, సువాలలు, ధవళశోభన

---

5 ఇది క్రీ. శ. 1869 లోనే అచ్చయినది. రాజమండ్రి గౌతమీగ్రంథాలయమున నొకప్రతికలదు. నం. 176. అందుండి ముద్రణ ప్రచురణ వివరము తెలిసినది కాదు.

ములు, మంగళహారతులు, చూర్ణికలు, దండకములు మొ॥, పలురక ముల రచనా విశేషములు నానేకములుగలవు. లోకోక్తులు, ప్రయోగ విశేషములు నానేకములుగలవు. ఆమె తన వేంకటాచల మాహాత్మ్య ములో శృంగారమునకును దనకును జుక్కెదురన్నట్లు మాటలాడినది. కాని యామె యక్షగానము లందది సమృద్ధిగాఁ గలదు. అటవిక జాతుల జీవిత విశేషములనుండి గహనములైన యోగశాస్త్ర రహస్య ముల వఱకుఁగల యనేక విషయము లామె కథిగతార్థములు. సవతి కయ్యము ఎఱుక ఘట్టము మొదలగు పట్టులందభినివేశము తోడి నిపుణ నిర్వహణము ప్రకటించినది. ఆమెవలె నిన్ని యక్షగానము లింత సమర్థముగా రచించిన కవయిత్రులులేరు. సరికదా కవులు నరుదు.

---

61. శీర్షాడు వెంకటరాయకవి

కవి విషయము :— బ్రాహ్మణుఁడు. విశ్వామిత్ర గోత్రుఁడు. తలిదండ్రులు చెన్నాంబా వేంకటరమణార్యులు. పితామహుఁడు దాసయ్య. ప్రపితామహుఁడు వెంకటయ్య. (ఇతని పినతండ్రి సంజుం డయ్య. అక్క సాకాంబ, అన్న దాసయ్య. తమ్ముఁడు గుండయ్య). అహోబిల జోస్యుల యనుఁజుఁడును సింగవరము నివాసియు నగు నరహరి జోస్యు లీతని గురువులు. ఇతని య. గా. నాటకకృతులు మూఁడు.

కృష్ణనాటకము [1] శివనాటకము [2] రామాయణము [3] మొదటిది రెండవదానియందును, నారెంటిని మూడవదానియందును బేరొక్కనఁ బడినవి. మూఁడును లేపాక్షి హరిహరుల కంకితములు. కవి నివాసమది కావచ్చు. (లేపాక్షి అనంతపురమండలమున హిందూపురము తాలూకాలో నున్నది). శివనాటకమున రచనాకాలము చెప్పఁ బడినది. అందు రెండుభాగములు. ప్రథమ భాగాంతమున "శాలివాహశకము వెయ్యిన్ని, యేఁబదూర్లరవయ్యునొక్కటి యనెడి, ఘన విళంబి"యును, గ్రంథాంతమున "శాలివాహన శకాబ్దముల వెలయుచు నుండెడి వెయి న్నేఁబది నూర్లనరవయి రెండన నమరిన వికారి" యును బేరొక్కనఁబడినవి. అవి వరుసగా శా. శ. 1761 – 62 అనఁగా క్రీ. శ. 1839 – 1840 అగుచున్నవి. కవి క్రీ. శ. 1840 ప్రాంతము వాఁడనుట నిశ్చయము.

ఈ లేపాక్షి నాటకత్రయము రాయలసీమలోఁ బ్రదర్శన ప్రతిష్ఠ లెక్కువగా సంపాదించినది. మూఁడును బ్రసిద్ధేతివృత్తములు. కృష్ణ నాటకమునఁ గృష్ణజన్మాదిగా జలక్రీడలవఱకు నున్నది కథ. ఇందు పూతనచే గొల్లభామ, ఎఱుకలసాని వేషములు వేయించినాఁడు కవి. శివనాటకమున దక్షాధ్వరధ్వంసము, పార్వతీకల్యాణకథయుఁ గలవు. ఇందు విదూషకుని హాస్యము, సూత్రధారుఁ డెఱుకలసానినిఁ బల్కరించుటయుఁ గలవు. ఈ రెండిటఁ బ్రథమ ద్వితీయ "విలాసములు"గా గ్రంథవిభాగము కాననగును. రామాయణమున బాలా యోధ్య

---

1 1931 లో విశాఖపట్టణమున డి. వి. యన్. గుప్తచే, 1947, 1950 సం. లలో మదరాసు వెస్టువార్డు అండుకోవారిచేతను ముద్రితము.

2 ముద్రితము. ప్రచురణ వివరములు తెలియవు. రాజమండ్రి గౌతమీగ్రంథాలయమున నొకప్రతి గలదు. నం. 195.

3 పద్మనాభవిలాసము, శా. లో ముద్రితము. మదరాసు, 1907.

కాండలు "మొదటిరాత్రికథ"గను, అరణ్య కిష్కింధా సుందరకాండలు "రెండవరాత్రి కథ" గను, యుద్ధకాండము "మూడవరాత్రి కథ" గను వింగడింపఁబడినవి. అనఁగా నది మూఁడురాత్రుల ప్రదర్శనమున కుద్దిష్టమన్న మాట. ఈ మూఁడు కృతులందును విడి విడిగాఁ బ్రసిద్ధ రాగ తాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు, సంధివచన ములు, పాత్ర సంభాషణా ప్రచురములైన వచనములును గలవు. మూఁడింటను నాటకీయత వెల్లి విరిసినది. కాని రచన యొకమో స్తరు. భాషలో వ్యావహారికసరళి కొంత చూపట్టుచున్న ది.

---

62. మార్జోళ్ల పీరయ్య

ముద్ధసంగయ్య కథ :

కవి విషయము :— తండ్రి మార్జోళ్ళ మల్లయ్య. తల్లి లింగమ్మ. కవి తన గ్రంథమును చేబ్రోలి శంభున కంకితముచేసియుండుటచేతను, గ్రంథమునఁ బెద్దాపురము శైవులను బేరొక్కనియుండుటచేతను గోదా వరీ మండలవాస్తవ్యుఁడనఁ జెల్లును.

ఆం. సా. ప. లో మాత్ర మీతని ముద్ధ సంగయ్యకథ కొక తాళపత్ర ప్రతిగలదు. సం. 4540. (ఇది అముద్రిత గ్రంథసూచికలోఁ జేరలేదు.) ప్రతివిలేఖనకాలము :— "విశ్వావసు సంవత్సర జ్యేష్ఠ శుద్ధ అష్టమీ శుక్రవారం" అది క్రీ. శ. 12-5-1665, 13-6-1845 తేదీలకు సరిపోవుచున్న ది. రచనారీతినిబట్టి రెండవ దేగ్రాహ్యము. అట్లనుట కింకొక యూహ యుపబలకముగా నున్న ది. ప్రా. లి. పు. భాం. ఆర్.

నం. 59 (ఎ) కూచిమంచి తిమ్మకని రాజశేఖర విలాసము ప్రతివిలేఖకుఁ డైన చాగంటి మల్లయ తాను "శార్వరినామసంవత్సర ఫాల్గున శు 12 గురువారమురోజువరకు మారుజోళ్ళ మల్లయ్య ప్రతిచూచి" వ్రాసి కొంటిననియున్నాడు. మారుజోళ్ళ వీరయ్య తండ్రిపేరు మల్లయ్యయే. ఆ మల్లయయు నీమల్లయయు నొక్కరేకావచ్చును. ఏ రా. శే. విలాస ప్రతివిలేఖనకాలము క్రీ. శ. 4-3-1841 తేదీకి సరిగా సరిపోయినది. మల్లయ యాకాలమువాఁడే లేదా యంతకించుక పూర్వుడగును. ఎంతపూర్వుఁడనుకొందమన్నను క్రీ. శ. 1750 ప్రాంతమున నుండిన కూచిమంచితిమ్మకవికిఁ బూర్వుఁడు కాఁడుగదా. ఇతఁడుగాకపోయినను నితని పుత్రుఁడైన వీరయ్యయైన 19 శతాబ్ది పూర్వార్ధమున నుండియుండునని యూహించుట లెస్సయనిపించుచున్నది.

గ్రంథ విషయము :— బసవేశ్వరుని సమకాలికుఁడును, అష్ట ముద్గలలో నొకఁడును, సానింటికేగి యట ఋశ్యశృంగునివలెఁ బ్రవర్తించినవాఁడును నగు సంగయ్య కథ యిందు వర్ణితము. ఇది బసవ పురాణాద్గృహీతము. (చూ. బ. పు. తృతీయాశ్వాసము). ఇందుఁ దాళ ప్రధానములగు దరువులు, ద్విపదలు, వచనములు, కొలఁదిగాఁ బద్యములు, ఏలలు, అర్ధచంద్రికలు, సం. చూర్ణిక, స్వర జతియుఁ గలవు. య. గా. అని పేరొక్కనఁబడినది. కవి యటనట భావ ప్రౌఢిని గనఁబఱచియుండెను. కాని రచనలో శిథిలపదములను జేయని దోషములు కొన్ని చేసియుండెను. — ఐతే, ఇనుపించె, అనుకూల వేణిరో, నా ప్రాణనాథుణ్ణి, లోకతరబడి మొ. ప్రయోగములు; ఎ - యలకు, ఇ - విలకు యతి, ద్విపదలో నింద్రగణములకు బదులు పంచమాత్రాకములైన చంద్రగణముల ప్రయోగము - ఇట్టి వీ గ్రంథ మంత ప్రాచీనము గాఁదని తోఁపఁ జేయును.

ఒకపరి పెద్దాపురమునందలి శైవులుండఱును త్రిపురాంతకము మీఁదుగా శ్రీశైలయాత్రకుఁ బోయినారఁట. అక్కడ శిఖరదర్శనము చేసికొని మల్లికార్జునమంటపమునఁ గూర్చున్న వేళ వారిలో బొప్పె బసవన్న వంశ వర్ధనుఁడును, మాచలి శంకరమ్మ యగ్రతనుజుఁడునైన పేరయ్యచనమల్లు వీరకవి పఠింపఁగా బసవ పురాణము వినుచు నందలి ముగ్ధసంగయ్యకథ "యక్షగానంబై తె యెంతశృంగారముఁగ నుండునో" అని యనఁగా వీరకవియందులకుఁ బూనెనఁట. (ఇందు పేరయ్య రమణిపార్వతమ్మయు స్మరింపఁబడినది).

63. ఫులహరిఫిరోజి

సాత్రాజితీయము: ♦

కవి విషయము:— గుంటూరు మండలములోని సత్తెనపల్లిలో స్థిరపడిన యొకమహారాష్ట్రక్షత్రియ కుటుంబమునకుఁ జెందినవారీయన. వీరు ఛత్రపతిశివాజీ వంశీయులు. వీరి పితామహులైన పాపాజీగారును, శివాజీ మనుమలైన పాహాజీగారును సమకాలికులు, బంధువులునైయుండిరి. వారుక్రీ. శ. 1700 ప్రాంతము నందుండినవారు. ఫిరోజి కవిగారి జీవితకాలము క్రీ. శ. 1829 - 1889. వీరు బహు

♦ 1945 లో గుంటూరు వెంకటేశ్వర అండుకోవారు ప్రచురించిన 'శ్రీఫిరోజి ఋషిగ్రంథావళి' అను సంపుటమున నిడియుఁగలదు. ఆసంపుటమున కపోద్ఘాతముగా శ్రీమహావాది వెంకటరత్నఁగారు వ్రాసిన గ్రంథకర్త జీవిత సంగ్రహమునుండి విషయమిందు గ్రహింపబడినది.

గ్రంథకర్తలు. వీరి కృతులలో విషయవైవిధ్యము, ప్రక్రియావైవిధ్యమునుగలదు. వీరనేక యక్షగానములును రచించి యుండిరని తెలియుచున్నది కాని యం దిప్పటికి లభించిన దీ సాత్రాజితీయ మొక్కటియే.

గ్రంథవిషయము :— ఇందు శమంతకోపాఖ్యానము, జాంబవతీ సత్యాకాళిందీ నాగ్నజిత్తీ భద్రాలక్షణా పరిణయ కథలు, నరకాసుర సంహారకథయు వర్ణితములు. వస్తైక్యము కొఱవడినది. కవి దీనిని "సాత్రాజితీ నాటకఁబను యక్షగానంబు" అనిపేరొక్కానెను. కాని యిందు నాటకీయత తక్కువ ఆఖ్యానశైలిపాలే యధికమై శ్రవ్యకావ్యమువలెనున్నది. ఇందు ప్రసిద్ధరాగతాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు, కంద గీతసీసార్ధములు గలవు. వచన ప్రయోగము క్వాచిత్కము. రచన చక్కనిది.

---

64. పోడూరి వేంకటరాజు

సుకుమారీపరిణయము :*

కవి విషయము :— ఆపస్తంబ సూత్రుఁడు, భారద్వాజ గోత్రుఁడు. శ్రీ రామయామాత్య పౌత్రుఁడు. వెంకటాచలమంత్రి పుత్రుఁడు. బుచ్చిరామయ, రామ మూర్తులకు సోదరుఁడు. ఇతని కృత్యంతర మగు రామలీలా విలాసము [1] నుండి యితఁడు విశాఖమండల విజయ

---

* ప్రా. లి. పు. భాం., ఆర్. నం. 440

1. ప్రా. లి. పు. భాం., ఆర్. నం. 612.

నగరాధి పతియగు విజయరామరాజాశ్రితుఁడనియు నితని నివాస మేనుగవలస (విశాఖ జి. చీపురుపల్లి తా.) యనియుఁ దెలిసినది. మఱియు నందీతని వంశావళి విపులముగాఁ గలదు.[2] ఇతఁడు శివ రామాభ్యుదయ కర్తయగు పోడూరి పెదరామా మాత్యుని యన్న గారి కోవవాఁడు. రామవిలాసము ప్రా. లి. పు. భాం., ప్రతి కవి స్వహస్త లిఖితము. లేఖన కాలము "ఆనంద నామ సంవత్సర చైత్ర శు. 15 గురువారం" గాఁ బేర్కొనఁబడినది. అది క్రీ. శ. 13-4-1854 తేదీ యగుచున్నది. అదే కవికాలము. సునిశ్చితము. ఆ నాఁటికి విజయనగరమున మూఁడవ విజయరామరాజు రాజ్యము చేయు చున్నాఁడు.[3]

గ్రంథ విషయము:— నారదుఁడు సృంజయ రాజపుత్రియగు సుకుమారినిఁ బెండ్లియాడిన పురాణకథ యిందలి వస్తువు. ఇదియుఁ గూర్మనాథకవి మృత్యుంజయ విలాసమువలె త్రిధాశ్వాస విభాగము కలిగి యవతారికలో యక్షగాన మనియు, నాశ్వాసాంత గద్యలలో శృంగార నాటకగేయ ప్రబంధమనియుఁ బేర్కొనఁ బడినది. ఇది "జనులు – తగిన వేషంబులన్ ధరియించి సభల సొగసుగాఁ దెలుపఁ" ననువుపడునట్లు రచించితినని యున్నాఁడు కవి. ఇందు పాత్రలు "తెర బయలు దేఁ దరువు" లు, "మాగధి యనే పరిహాసక వేషధారి" పాత్రలను బలుకరించుట, పాత్రలు స్వీయోదంతము జెప్పుట, పాత్రలు ప్రవేశింపఁగనే దేవతా స్తోత్రము చేయుటయు విశేషములు. ఒక్క-చోహంగుదారుని ప్రసంగము గలదు. ఇందుఁ బ్రసిద్ధ రాగ తాళములలో

2. వివరములకు చూ. ప్రా. లి. పు. భాం., త్రైవార్షిక గ్రంథ దీపిక 4 వ భాగము — పుటలు 1549–54.

3. ఇతని రాజ్య కాలము 1848–1879 అని విశాఖ జిల్లా గెజిటీరులోఁ గలదు.

దరువులు, విరివిగాఁబద్యములు, ద్విపద, వచనము, కందాలంకారము, చూర్ణిక, దండకము మొ॥ రచనా విశేషములు గలవు. ఇందెఱుక ఘట్టము గలదు. సుకుమారీ విరహా వేదన ఘట్టమున మన్మథుని పాదు పాతో సరిపోల్చి ప్రశంసించిన దండక మత్యంతత మనోజ్ఞము. గ్రంథ మున నాటకీయత మిక్కుటము. రచన రసోత్కటము.

---

65. మరింగంటి భట్టరు రామానుజాచార్యులు

శ్రీ రామనాటకము:*

కవి విషయము :– శ్రీవైష్ణవుఁడు. వాద్దల్యసగోత్రుఁడు. రామానుజాచార్య పౌత్రుఁడు. తిరుమలాచార్యపుత్రుఁడు. గంజాఁజిల్లా గుజ్జువాడ నివాసి. (చూ. ముద్రితప్రతి) ఈతఁడు దరువూరి అప్పలా చార్యులు, వారణాసి అచ్యుతరామకవి అనువారు తనకిరువురు శిష్యులు

---

* ప్రకటన :— 1 గౌతమీ గ్రంథాలయ తాళపత్ర ప్రతి నం. 98. అసమ గ్రము. శ్రీరామనాటమను పేర నున్నది. కవిపెట్టిన పేరదే కాని లక్ష్మణుఁడు పునర్జీవితుఁడగుట వినిన రావణుని సంరంభ మిందలివిషయము. 2. ప్రా. లి. పు. భాం. ఆర్. నం. 966 బొమ్మలాట రామాయణమను పేరనున్నది. లక్ష్మణమూర్ఛమఁ దరు వాతికథ యిందుగలదు. 3. లక్ష్మణమూర్ఛయను పేరనిది 1908 లో మదరాసులో ఎద్దనపూడి సంజీవయ్య అండుసన్నవారిచే మురహరి ము. శా. లో మొదటి కూర్పుగా ముద్రితము. ఇందు గ్రంథపరిష్కర్తల చేర్పులు మార్పులునుగలవు ఇందు విషయము లక్ష్మణమూర్ఛపుట్టమే కాక రామపట్టాభిషేకము వఱకును గలదు.

గలరనియు నారీగ్రంథ రచనలోఁ దనకుఁ దోడ్పడి రనియుఁ జెప్పి యున్నాఁడు. (గౌ. గ్ర. ప్రతి). ఈ వారణాసి అచ్యుత రామకవియే సురతాణీపరిణయ[1] మను ప్రబంధమును యీ రామానుజాచార్యుని ప్రేరణమున రచించెను. (అం దీ రామానుజాచార్యుఁడు గుజ్జ్వాడాగ్రహార నివాసి, మ. భ. రామానుజాచార్య పౌత్రుఁడు తిరుమలాచార్య పుత్రుఁడు నని చెప్పఁబడుటయేగాక యీతని వైదుష్యప్రశస్తియు, వంశావళి ప్రశంసయు విపులముగాఁ గలదు.) ఆ గ్రంథాంతమునఁ దద్రచనాకాలమిట్లు చెప్పఁబడినది. – "విరచింపంబడె నీప్రబంధము... శాలివాహన శకాబ్దిన్ రసాగక్షమూధర చంద్రాంచిత సంఖ్యాకాంతరల సన్మానోన్న తానంద వత్సర సత్కార్తిక శుక్ల సప్తమిని భాస్వత్సౌరి వారంబునన్" అనఁగా శా. శ. 1776 – క్రీ.శ. 1854. మఱి తత్కృతి ప్రేరకుఁడగు నీ మరిగంటి భట్టరు రామానుజాచార్యుఁడా 1854 సం. న నుండెననుట సుస్పష్టము. ఇతఁడు గణచతుర్థ్యుపాఖ్యానాది ప్రబంధము లనేకము రచించినాఁడని సు. ప. నఁ గలదు.

ప్రస్తుత గ్రంథవిషయము :– ఇతఁ డీ శ్రీరామనాటక మను పేర రామాయణము నంతటిని రచించియుండెనో లేదో తెలియదు కాని యుపలబ్ధములగు ప్రతులలో లక్ష్మణమూర్ఛ ఘట్టమునుండి రామ పట్టాభిషేకము వఱకుఁగల యుద్ధకాండకథ యున్నది. వీరరస ప్రధా నములుగు నీ గ్రంథసందర్భములకుఁ దగినట్లుయుద్ధసన్నద్ధుఁడగు ధీరోద్ధత నాయకుని గమనగాంభీర్యమును దలపించు ప్రౌఢరచనా పరిపాటి గల పద్యగద్యముల ప్రాచుర్యమిందుఁ గలదు. దరువులు విరళము. ప్రసిద్ధ రాగతాళములలో(హిందుస్తానీవి కూడ) నున్నవి. సంధి వచనములతో పాటు పాత్రల సంవాదాత్మక వచనములును దఱచుగలవు. వచ

1. వేగుజొక్క– గ్రంథమాల ప్రచురణ – బరంపురము, 1932.

సములంగు వ్యాసహారికభాషాసరళి కొంతగన్పట్టును. అమరశ్లోకము లనేకము చేర్కొనఁబడినవి. కొనుఁగునఁ బదార్థ వివరణమును గలదు. ద్విపదలు కొద్దిగాఁగలవు. ఇందలి భాషయందును భావములందును జక్కని ప్రౌఢిగలదు. కాని దానికిఁ గొంతవఱకు భాస్కరరామాయణము మూఁదలయైనది. కథకొంత పెంచఁబడినది. సరిక్రొత్త సన్నివేశములును గొన్ని కల్పింపఁ బడినవి. ఇందు సూత్రధార ప్రసక్తి గలదు. అతఁడే ప్రస్తావన నడపినాఁడు. (ముద్రితప్రతిలోని ప్రస్తావన పరిష్కర్తలచేఁ.) దీని నాథునికరంగస్థల నాటకముగాఁ దీర్చుటకుఁ బరిష్కర్తలు ప్రయత్నించిరి కాని మూలగ్రంథమువలె "సర్వంబు నేకాశ్వాసము" గనే యున్నది. అంకరంగ విభాగములు చేయఁబడ లేదు. ఇందలి సంధివచనము లట్లనే యున్నవి.) ఈ గ్రంథము తోలు బొమ్మలాటల కుపయోగింపఁబడుచుండినట్లు ముద్రితప్రతి పీఠికలోఁ బరిష్కర్తలు వ్రాసియున్నారు. ఇందలి అమరశ్లోకోదాహరణ వివరణము లుండుటఁజూడ నసలిది బొమ్మలాటల కొఱకే వ్రాయఁబడినదా యనిపించును. అది బొమ్మలాటల పరిపాటి.

---

66. దరువూరి అప్పలాచార్యులు

ఐరావణ (త) చరిత్ర: ♦

కవి విషయము:— ఆత్రేయస గోత్రుఁడగు నృసింహార్యునకు శ్రీనివాస, జగన్నాథ, వెంగళ, సుందర నామధేయులు తనయులు. అందు

♦ ప్రా. లి. పు. భాం. ఆర్. నం. 436.

శ్రీనివాసార్యునకు నరసమ్మయందు నరసింహ, రంగ, జగన్నాథ నామధేయులు పుత్రులు, అందు రంగార్యునకు రంగాంబ యందు అప్పలాచార్యులు, శ్రీనివాస, రంగార్య లక్ష్మణార్యులు పుత్రులు. ఇతఁడీ గ్రంథము నే తేటి పార్వతీశము ప్రోత్సాహమున సింహాద్రిపతి కంకితముగా రచించి యుండెను. దీనికిముందు సంస్కృతాంధ్రములందు మఱికొన్ని కృతులు రచించినాఁడఁట. ఈగ్రంథమునుండి యితని గుఱించి యెఱుఁగనగు విషయ మింతియ. ఇతఁడు శ్రీకాకుళ మండలము వాఁడనియు, శ్రీరామ నామక కర్తయగు మరింగంటి భట్టరు రామానుజాచార్యుని శిష్యుడనియు, వారణాసి అచ్యుతరామకవి కతని సురతాణీ పరిణయప్రబంధ రచనయందుఁ దోడ్పడె ననియు నతనికి మాఱుఁట గురువనియు, నతనితో జంటగా లక్ష్మీనారాయణ విలాసమను యక్షగానమును రచించి యుండెననియు నా యీగ్రంథములనుబట్టి తెలియుచున్నది.* సురతాణీ పరిణయ ప్రబంధ రచనాబ్దము క్రీ. శ. 1854 అని మీఁద రామానుజాచార్యుల యుపంతమునఁ జెప్పఁబడినది. మఱి అప్పలాచార్యులు నప్పుడుండెననుట నిశ్చయము. ప్రా. లి. పు. భాం., ఆర్, నం. 437 సురతాణీ పరిణయ ప్రతివిలేఖకుఁడీ దరువూరి అప్పలాచార్యుఁడే. తల్లేఖన కాలము భావజ్యేష్ఠ శుక్ల ద్వాదశి గురువారము. సు. ప. రచన 1854— ఆనంద సం. ఈభావ తరువాతిది కావలె. అది 1874. సు.ప. రచనలోఁ దోడ్పడునాఁటి కప్పలాచార్యులు సుమారు పాతిక ముప్పది యేండ్లవాఁడైన నైయుండును. అతఁడు క్రీ. శ. 1825-1875 సం.ల నడుమ నుండెనని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

గ్రంథ విషయము :— గాంధారి వ్యాసప్రోక్తమగు నైరావణ వ్రతము (గజ గౌరీవ్రతము) నాచరించి తన యదృష్టమునకు గర్వపడు

* చూ. ఇందలి నం. 65, 67 కవులయుదంతము.

చుండును. అది కుంతికి మనస్తాపహేతువగును. అది తెలిసి యర్జునుఁడు, దుర్యోధనాదులు తమ తల్లి వ్రతమునకు మంటి యేనుఁగునుమాత్రమే "తయారు" చేయించి యుండగాఁ దాను మింటియేనుఁగునే తెచ్చి తనతల్లి వ్రతము నెఱవేర్చుట, యిందలి కథ. ఇందు బ్రసిద్ధ రాగ తాళములలో దరువులు, ద్విపదలు, పద్యములును గలవు. గ్రంథాంత గద్య వినా యిది నిర్వచనము. యక్షగానమని పేర్కొనఁబడినది. శ్రవ్యకావ్యధోరణి నున్నది ప్రౌఢరచన కాదు. ఇది బహుశా అప్పలాచార్యుని బాల్యరచనయై యుండును.

---

67. దరువూరి అప్పలాచార్యులు వారణాసి అచ్యుతరామకవి

లక్ష్మీనారాయణ విలాసము :*

కవి విషయము :— ఈ జంట కవులు శ్రీకాకుళ మండల వాస్తవ్యులు. ఆ మండలము నందలి శ్రీ కూర్మక్షేత్రస్వామి కంకిత ముగా, రామానుజాచార్యుని పౌత్రుఁడును, వేంకటలక్ష్మీరంగార్యుల పుత్రుఁడు నగు కొండుపర్తి అప్పలార్యుని ప్రేరణమునను సాహాయ్య

---

* ప్రతులు : 1. ఆం. సా. ప., నం. 2648 (కాగితము)

2. ప్రా. లి. పు. భాం., ఆర్. నం. 762 (కాగితం)

3. రాజమండ్రి ఆంధ్రేతిహాస పరిశోధకమండలిలో నొకతాళ పత్ర ప్రతిగలదు. (వరదదెబ్బతిన్నది)

మునను బ్రహ్మ పురాణోక్త ప్రకారముగా నీ గ్రంథము నిద్దఱును గలిసి రచించిరి. ఇందుఁదమ గురువగు మరింగంటి భట్టరు రామానుజాచార్యుని స్మరించిరి. అతని శ్రీరామ నాటక రచనలో నీ యిరువురును దోడ్పడి నట్లుండఁగలదు. ఈ ల. నా. విలాసమునందీ కవుల పూర్వ రచన యగు సురతాణీపరిణయ పద్యకావ్య ప్రశంస వచ్చినది. కాని ల. నా. వి. వలె సురతాణీ పరిణయము జంటకవనము గాదు. ఇందలి గద్యలవలె నందలిగద్య లుభయ నామాంకితములు గావు. అది అచ్యుతరామ కవ్యుపజ్ఞమాత్రమే. అందప్పలాచార్యుఁడు తనకు రెండవ గురువనియు, నా గ్రంథ రచనలోఁ దన కతని తోడ్పాటు గల దనియు మాత్రమే చెప్పినాఁడు.

అప్పలాచార్యుని విషయము పూర్వోక్తము. అచ్యుతరామ కవి గుఱించి యతని సురతాణీ పరిణయము నుండి యెఱుకపడు విశేషములు :— ఇతఁడాపస్తంబ సూత్రుఁడు. భారద్వాజ గోత్రుఁడు. వారణాసి సాంబన పౌత్రుఁడు. ఎనమండ్ర రామయోగికి జ్ఞాపిత్రుఁడు. ఎఱ్ఱమకును నరసింహ కవికిని బుత్రుఁడు. రామయోగియనువాని కగ్రజుఁడు. (ఇతఁడు శ్రీకృష్ణ సుధారస మను నింకొక ప్రబంధమునుగూడ రచించి యుండి నట్లు తెలియుచున్నది.) ఇతని సురతాణీ పరిణయ రచనా కాలము క్రీ. శ. 1854* తదర్వాచీన మీ ల. నా. వి. బహుశా 1860—65 ప్రాంతమున రచింపఁబడియుండును.

గ్రంథ విషయము :— క్షీరసాగర మథన కథయు, లక్ష్మీనారాయణుల వివాహము నిందు వర్ణ్యములు. ఈ ల. నా. విలాసమున కనేక సందర్భములందు గోగులపాటి కూర్మనాథ కవి మృత్యుంజయ విలాసమే

* చూ. ఇందని మరింగంటి భట్టరు రామానుజాచార్యుల యుదంతము. (నం. 65)

యొరవడి యైనది. కథా ప్రణాళికలోను రచనా ప్రణాళికలోను మృ. వి. నకు సమానాంతరముగాఁ బయనించినది ల. నా. వి. అసలు గౌరీ కల్యాణ కథకును, లక్ష్మీ కల్యాణ కథకును బోలికలు లేవు. కాని యీ కవులు ప్రౌఢులగుటచే గౌరీ కల్యాణ కథకు సన్నిహితముగా లక్ష్మీ కల్యాణకథను ససందర్భముగా మలఁచినారు. ఇందు లక్ష్మీయుఁ బార్వతివలెఁ బ్రియుని గూర్చి తపశ్చర్యకుఁ బూనుకొనును. ఆ సందర్భ మున మృ. వి. న వర్ష హేమంత గ్రీష్మర్తువులు మూఁడును మూఁడు సీసములలో వర్ణితములు. ఇందును నా మూఁడేమూఁడు, సీసములలోనే వాని ఛాయలుగా వర్ణితములు. అందలి శివుని వలెనే విష్ణువును నిందుఁ గపటవటువగును. అందు భృంగియు శివుఁడు నెఱుకలసాని వేషములు వేయఁగా నిందు నారద నారాయణులు కొత్తెమ సాని వాలకములు దాల్తురు. ఇట్లే యీ కథాసందర్భను కరణము. రచ నలోఁగూడ మృ. వి. నుండి దరువునకు దరువు, సీసమునకు సీసము, ద్విపదకు ద్విపద, వచనమునకు వచనము, శ్లోకమునకు శ్లోకముగా నందలి మంచిపట్టెల్ల విడిచి పెట్టక, యొకప్పుడు వరుసయును దప్పక యందులో ననుకరణము నందులో మార్పునుగా ననుకరించినారీ కవులు. మృ. వి. న "ప్రత్యక్షమయ్యె" నని యున్న నిందు "నాశ్చాత్కరించె" నని మార్పు. అంతేకాదు మృ. వి. వలెనే యిదియు మూఁడాశ్వాసము లుగా విభాగింపఁబడినది; అవతారికలో యక్షుగానమనియు, నాశ్వా సాంతగద్యలలో శృంగారగేయ ప్రబంధమనియుఁ బేరొక్కనబడినది. ఇట్టి యను కరణము నీ కవులెందుకు చేయవలసి వచ్చినదో బోధ పడదు. (వీరును గూర్మనాథకవియు నొక్కమండలము వారే. కూర్మ నాథకవి వీరికి రెండు మూఁడు తరములు పూర్వుఁడు).

రచనావిషయమున మృ. వి. విమర్శయే దీనికిని జాలవఱకు సరిపడును. సలక్షణమైన భాషయు ప్రసన్నమైన శైలియుఁ గలది.

య. గా. కృతులలో నొక బృహద్గ్రంథము. కథ చతురముగా బ్రపంచింపఁబడినది. శృంగార మంగిరసము, హాస్యమంగము. వర్ణన లనేకము సుబీర్ణముగ సుందరముగఁ జేయఁబడినవి. చతుర సంవాదములుగలవు. జాతీయములు నన్యభాషా పదప్రయోగ విశేషములు ననేకము గలవు. ఘనముఁ బ్రసిద్ధ రాగ తాళ ఛోరాళములైన దరువులు (రాగములలో జయంతసేన విశేషము) ద్విపదలు, పద్యములును సమపాళముగా నున్నవి. అప్పగింతలు, సువ్వి, శోభనములు, లక్ష్మీకల్యాణము ననుపెండ్లివేడుక పాటలు, శ్లోకములు, దండకచూర్ణికలును గలవు. సగము పద్యము సగము దరువునైన సీసార్ధ కందార్ధములు సీసాలంకార కందాలంకారము లను పేరఁ బ్రయోగింపబడినవి.

---

68. సింహాద్రి దాసుఁడు

భల్లాణ చరిత్ర :*

కవి విషయము :— దాసరికులమువాఁడు. అంతన పౌత్రుఁడు. కమలాంబకుఁ వెంకటనరసుకుఁ బుత్రుఁడు. కవి తన గ్రంథమున దీవెన నరసింహుని, సింహాద్రి యేగంటి నీలయుని, సింహాచల నరసింహుని స్మరించినాఁడు. ఆం. సా. ప. ప్రతివిలేఖనకాలము "రాక్షసనామ సంవత్సర భాద్రపద బ ౧౦ శుక్రవారం" అనఁగా క్రీ. శ. 5-10-1815

---

* ముద్రితము. ప్రచురణ వివరములు తెలియవు. అముద్రిత ప్రతులు :— 1. ఆం. సా. ప. నం. 3490.

2. ఆంధ్ర విశ్వకళా పరిషత్ప్రతి టి. 123/ఎన్. 71.

తేదీ. గ్రంథరచన మంతకుఁ బూర్వముకాని యెంతోపూర్వమై యుండదు.

గ్రంథ విషయము:— భల్లాణ కథ: పూర్వోక్తము. కాని యొక విశేషము. కవి సురాభాండేశ్వర కథ చెప్పి యందలి యీడిగ దంపతులే పిదప జన్మమునఁ జల్లమా భల్లాణులైరని చెప్పినాఁడు. ఇందుఁ బ్రసిద్ధ రాగ తాళములలో దరువులు, ద్విపదలు గలవు. పద్యములు కందములు మాత్రము లెక్కకుఁ గలవు. నిర్వచనము. రచన బహుదోషదుష్టము. ఇం దాశ్వాస త్రయ విభాగము గలదు. యక్షగాన మని పేర్కొనఁబడినది.

---

69. కోవెల తిరువేంగడ దాసు

తిరుమంగయాళ్వారు చరిత్ర:♦

కవి విషయము:— కోవెల వేంకటాచార్యుని పౌత్రుఁడు. నర సింహాచార్యుని నందనుఁడు. శ్రీరంగ తిరుమల శ్రీభట్టరార్యుని శిష్యుఁడు. ఇతని గ్రంథము శోభనాచల నరసింహస్వామి కంకితము. (శోభనాచల మనఁగా మంగళగిరికి మజీయొక పేరేమో; అదినృసింహా క్షేత్రమే. కవి నివాసమది కావచ్చును). ఈగ్రంథమును 'శేష భట్టరు అప్పలదాసుఁడు వేంచేపు చేసుకున్న' దనియున్నది. ఆం. సా. ప. లోని రతిమన్మథవిలాసము ప్రతి (నం. 3120) చివర "శ్రీమాన్ శేషభట్టరు రంగాచార్యులు గారు రచించిన రతిమన్మథ

♦ ఆం. సా ప. నం. 3019.

విలాసము వారి కుమారుఁడు అప్లాచార్యులు వ్రాసెను. "శ్రీ మంగళాచల లక్ష్మీనృసింహార్పణమస్తు" అనియున్నది. ఇతండును బైఅప్పలదాసుఁడు నొకరే కావచ్చును. అగుచో నా రంగాచార్యులు క్రీ. శ. 1800 ప్రాంత మందుండిన వాఁడుగా నూహింపఁబడినందున * నాతని పుత్రుఁడగు నప్పలాచార్యుఁడు 1850 - 40 సం.ల ప్రాంతమున నుండి యుండును. అతఁడు "వేంచేపు" చేసికొన్న యీతిరుమంగయాళ్వారు చరిత్రరచన మంతకుఁగొంత పూర్వపుది కావలెను. ఇవి యన్నియు నూహాల్పై నూహలు. (ఇవి యథార్థములు కాకపోవచ్చును. కాని భావిపరిశోధన కుపస్కారకములు కావచ్చునని యిట నుటంకింపఁబడినది.) కాని రచనా రీతినిబట్టి చూచినను నిది యంత ప్రాచీనరచనగాఁదోఁపదు. (నామట్టునకు నాకిప్పటికిది క్రీ. శ. 1800 1850 నడుమ రచింపఁబడినదిగాఁ దోఁచును. ఈయూహా నొకరు గ్రహింప నక్కఱ లేదు. నాయూహా తెలుపుకొంటిని. అంతియ).

గ్రంథ విషయము :— పన్నిద్దరాళ్వారులలో నొకఁడగు తిరుమంగయాళ్వారు పూర్వచరిత్ర మిందు వర్ణింపఁబడినది. (అది ఆచార్యసూక్తిముక్తావళి, దివ్యసూరి చరిత్రము, గురుపరంపరా ప్రభావము మొ. గ్రంథము లందుఁగలదు.) ఇంకలిది సలక్షణమైన భాష. సరళమైన రచన. గ్రంథము సగపాలు పద్యములే. కడమభాగము ప్రసిద్ధరాగతాళముల నున్న దరువులు, ద్విపదలు, కొలఁది వచనములును. శ్లోకము, కిటాబు మొ. ఉర్దూ పదప్రయోగములు కొద్దిగలవు. మృత్యుంజయ విలాసమువలె నవతారికలో యక్షగానమనియు, నాశ్వాసాంతగద్యలో (సర్వంబునేకాశ్వాసము) 'శృంగార నాటక గేయప్రబంధ' మనియుఁ బేర్కొనఁబడినది.

---

* చూ. ఇందలి నం. 47 కవి చరిత్ర.

70. కోవెల రాఘవదాసు

ప్రణయ కలహ కలాపము:♦

కవి విషయము:— ఇతఁడీ ముంద వర్ణితుఁడైన కోవెల తిరువేంగడాచార్యున కగ్రతనయుఁడు. ఇతని తల్లి రంగమ. గురువు శ్రీ రంగరాజభట్టరు. ఇతఁడును దండ్రివలె శోభనాచల నరసింహ భక్తుఁడే. ఇతని గ్రంథమును శేషభట్టరు అప్పలదాసుఁడు "వేంచేపు" చేసికొన్న బే కావున నితఁడును క్రీ. శ. 1800-1850 ప్రాంతమువాఁడై యుండిన నుండవచ్చును.

గ్రంథవిషయము:— ఇది నిన్నెడ నుడనారను తిరువాయిముడి నుండి గ్రహింపఁబడినదఁట. శ్రీకాంతుఁడొకనాఁడు శ్రీకాంత నెడఁబాసి భూకాంత కడకేఁగి మగిడి యిందిరామందిరమునకు రాఁగా నామెయతని వాలకముచూచి యలుక చిత్తగించినది. వెన్నుఁడు వెనుదిరిగినాఁడు. అప్పుడింక నామె విరహావేదన. హరి యామె కడకొక యెఱుకతను బంపెను. ఎఱుకత కోరిక లీడేరునని చెప్పి యరిగినంత హరివచ్చి తరువాయి దీర్చినాఁడు. ఇది యిందలికథ. ఇది కడు పిన్న కృతి. సలక్షణమైన భాషయు సరళమైన రచనయుఁగలది. ఇందు దరువులు, ద్విపదలు, పద్యగద్యములు గలవు. శృంగార నాటకగేయ ప్రబంధమని పేర్కొనఁబడినది. (ఇందలి ఎఱుకపుట్టమున మృత్యుంజయ విలాస మందలి దరువొకటియిందు యథాతథముగా నున్నది.)

♦ ఆం. సా. ప., నం. 3019.

71. బోడిచర్ల సుబ్బకవి

కవి విషయము :— ఇతఁడు కర్నూలు మండలకవి. నందవరీక బ్రాహ్మణుఁడు. కుత్ససగోత్రుఁడు. మిశ్రమరి రామాయణము,[1] ప్రహ్లాదనాటకము[2] ననునవి యితనికృతులు. రెండిటను గరుడాచల నరహరి ముద్రలున్నవి. ప్రహ్లాదనాటక గ్రంథాంతద్విపదలో నితఁడు హనుమంతరాయని కప్పయైన లక్ష్మాంబ కగ్రసూనుఁడని మాత్రము తెలియవచ్చినది. లక్షణాపరిణయ య. గా. కర్త మఱియొక సుబ్బకవి గలఁడు — ఇరువురకు నింటిపేరు స్థలకుల గోత్రములును సమానముకాని యతఁడు వేఱు. అతనిపూర్తిపేరు బొడ్డుచర్ల వెంకటసుబ్బయ్య. ఇతఁడు త్తసుబ్బయ్య. అతనితల్లి వెంకమ్మ. ఇతనితల్లి లక్ష్మమ్మ. అతని గ్రంథము భద్రగిరినాసముద్రగలది. ఇతనిగ్రంథములు గరుడాద్రినరహరి ముద్రగలవి. ఇత్రరాధారము గన్పట్టు దనుక నిరువురువేఱని పరిగణించుటయే సమంజసము.

సుబ్బకవి రామాయణమును 1910 లోఁ బ్రచురించిన యతఁడతని పౌత్రుఁడే అనఁగా సుబ్బకవి కాలమంతకు సుమారఱువది యేండ్లు వెనుకకుఁ బోవును. సుబ్బకవి రామాయణమునఁ బూర్వకవి స్తుతిలో "వెంగాంబికను" స్మరించి యుండెను. ఆమె 1840 ప్రాంతముదనుక నుండిన తరిగొండ వెంగమాంబయే కావచ్చును. ఇతని ప్రహ్లాద చరిత్రలో శుక్రాచార్యుల పంచాంగప్రసంగమున ఈశ్వరనామసంవత్సరము

---

1. బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు 1910 లో ముద్రితము. ప్రచురణకర్త :— "గ్రంథకర్తగారి పౌత్రుండగు" బోడిచర్ల వెంకటరావు. (ప్రథమ రాత్రి కథమాత్రమే ప్రచురితము)

2. మచిరాసు "కాటేజి ఇండస్ట్రీస్ పబ్లిషింగ్ హౌస్" ప్రచురణ, శ్రీలక్ష్మీ విలాస ము. శా. 1948.

పేర్కొనఁ బడినది. అది 1877 లోఁబడిన ఈశ్వరయే కావచ్చును. సుబ్బకవి 19 వ శతాబ్ది మూడవ పాదమునను గొంచెమిటునటు నుండె ననుట నిశ్చయము.

(మిట్టేమరి) రా మా య ణ ము :

మిట్టేమరి పురధాముఁడైన కోదండరామునిఁగూర్చినది. ముద్రిత ప్రతివెనుకనున్న ప్రకాశకుల సూచననుబట్టి సుబ్బకవి రామాయణము నంతటిని నాల్గు రాత్రుల ప్రదర్శనమునకుఁ బనికివచ్చునట్లు రచించెనని తెలియవచ్చుచున్నది. అందు " మొదటి రాత్రి కథ " మాత్రమే ప్రచురింపఁబడినది. ఇది బాలకాండ కథ. కవి తానిది " నృత్తగీత కలన " రచించితిననెను. ఇందలి యెత్తుగడచిత్రమైనది. గణపతి సరస్వతులు తమస్తుతుల నెంటవచ్చి యీ "రామనాటక నటనాభిరాము" లగు నటుల నాశీర్వదింతురు. తరువాత నారదుఁడువచ్చి తాను " ఫలానా " అని, బాలకాండ కథాసంగ్రహము చెప్పి భాగవతులను (నటులను) దీవించును. తరువాత " తలారి గురికాఁడు " (కటికవంటిపాత్ర సభవారికి దశరథాగమనమును హెచ్చరింపవచ్చును. ఇందుఁ బాత్ర ప్రవేశ కథానుసంధాన సూచనలు గలవు. కొన్ని పాత్రలు ప్రవేశింపఁగనే స్వయముగాఁ దమపరిచయ మొనర్చుకొనుటయుఁ గలదు. సూత్రధారుఁడు పాత్రను సంబోధించుట యొక్కచోఁ గలదు. అది మంత్రసానిని బలుకరించిన సందర్భము. ఇందు ప్రసిద్ధరాగతాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు, వచనములు, నలుగుపాట, శోభనము గలవు. సంస్కృతవచనములు, వచనములందు సంభాషణలును గలవు. రచన చాల నాటకోచితముగ నున్నది. అంత సలక్షణముగ లేకపోయినను, సరసముగనే యున్నది. కవి దీనిని వాల్మీకిరామాయణమును విని " మామరు

లాసండమండ, సంగీత సాహిత్య సరసప్రసంగ, సంగతినే సల్పు సరస నాటక " మని యున్నాఁడు.

ప్రహ్లాద చరిత్ర:

కథ ప్రసిద్ధము. ప్రహ్లాదుని తల్లి పేరు లీలావతియని భాగవతము. సుశీలయని సుబ్బకవి మార్పు. ఇందు గ్రంథారంభమునఁ గటిక చాని రాక గలదు. వాఁడు హిందీ తమిళ కన్నడములలోఁ బ్రసంగించి యుండుట విశేషము. ఇందుఁ బాత్రప్రవేశ సూచనలు, పాత్రలు స్వవిషయమును జెప్పుకొనుటయుఁ గాననగును. ప్రసిద్ధ రాగతాళములతో పదువులు, ద్విపదలు (ద్విపదకును నీలాంబరి రాగ ముదాహరింపఁబడినది), పద్యములు పరకీయములు, (పోతనగారివి — కవి చెప్పి గ్రహించినాఁడు) స్వకీయములును, వచనములు, దండకముల మొ. గలవు. సంభాషణ లెక్కువగనే యున్నవి. రచన యొకమో స్తరు. యక్షగానమని పేర్కొనఁబడినది.

---

72. పడకండ్ల గురురాజకవి

ఇతఁడు బళ్ళారి మండలకవి యనియు, 1860 ప్రాంతమున నుండినవాఁడనియు, నితఁడు పద్మావతీ పరిణయము, అనిరుద్ధ చరితము నను నాటకములను రచించియుండెనని యీతని శేషధర్మములను గ్రంథమునుండి తెలియుచున్నదనియు ఆంధ్రకవుల చరిత్రమునఁగలదు. ఆ నాటకములు ప్రాయికముగా యక్షగానములు కాఁదగును. అవి యలభ్యములు.

---

73. కాట్రంబాక కేశవాచార్యులు

కవి విషయము :— హారితసగోత్రుఁడు. కాట్రంబాక శ్రీ రాఘవాచార్యుని పుత్రుఁడు. ఇతఁడు భూతపురీశుని కంకితముగా రెండు యక్షగానములను రచించియుండెను — రామానుజవిజయము (1), పతివ్రతా మాహాత్మ్యము (2). మొదటి దానిని కవి తాను హారితస గోత్రుఁడును, అప్పలాచార్య పుత్రుఁడు నైన "చెంగోలం నృసింహార్య మత్సఖుని మతిమంతు నతని యనుమతిం జెప్పినాఁడ" నని యున్నాఁడు. (ఆశ్వాసాంతమున). ఈ గ్రంథము "చంగోలు నరసింహాచార్యుల వారి వర్తమానరత్నాకర మను స్వకీయ ముద్రాక్షరశాలయందు 8-5-1858 న అచ్చువేయించి ప్రకటింపబడియె" నని ముఖపత్రమున నున్నది. రెండవ గ్రంథమున నితని రామానుజ విజయ యక్షగాన రచనయు భార్గవ పురాణాంధ్రీకరణమును బేరొక్కనఁబడినవి. అది కవి తన గురువగు సచ్చిదానందేంద్ర యోగీశ్వరు నాదేశమున రచించితి నని యున్నాఁడు. తన్ముఖపత్రమున నది "...కాట్రంబాక రాఘవాచార్యులుగారి కుమారుఁడైన కేశవాచార్యులవారిచే నూతనముగా రచియింపఁబడి...29-10-1860 తేదీన భువనగిరి రంగయ్యసెట్టిగారి జ్ఞాన సూర్యోదయ మనే స్వకీయ ముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడియె" నని యున్నది. కాఁగా కవి 1860 ప్రాంతమునం దుండె ననుట సునిశ్చితమైన విషయము.

రామానుజ విజయము :

ఇది విశిష్టాద్వైత మత సుప్రతిష్ఠాపకుఁడగు శ్రీమద్రామానుజాచార్యుని జనన ప్రకారము, యాదవ ప్రకాశునికడ నతని విద్యా

భ్యాసము, యామునాచార్యునితో నతని సమావేశము, నతని సంసారము, సన్యాసాశ్రమము, బీబినాంచారితో సుఖించుచున్న యాదవాచలస్వామి రామప్రియుని ఢిల్లీనుండి యాదవాద్రికిఁ దోడ్కొచ్చుటయుఁ దాను శ్రీరంగమున శిలారూపముగా నర్చావతారమై నిజధామమున కేఁగుటయు ననుఁ గథలు గలది. కథా ప్రధానమైన దీయక్షగానము. గ్రంథకర్తకుఁ గథనడుపుట తెలియదు. అవాంతర కథానుసంధాన చాకచక్యములేదు. రచన యొకమోస్తరు. ఇందు దరువులు తాళ ప్రధానము లెక్కువ. రాగప్రధానములు గొలఁది. ద్విపదలు, జాత్యుపజాతి పద్యములు, కొలఁది సంధివచనములు, శోభనము, తలంటు, నలుగు, లాలిపాటలు, దండకము, అర్ధచంద్రికలు, కందార్ధములును గలవు. ఇది రెండాశ్వాసముల కృతి.

పతివ్రతా మాహాత్మ్యము :

నారదునకు బ్రహ్మ చెప్పినట్లుగా నిందుఁ బతివ్రతా లక్షణములును, లక్షణ, అనసూయ పుత్రి సునందిని, సావిత్రి, దాక్షాయణి, సీత మొదలగు మహాపతివ్రతల చరిత్రములు నిందుఁ బ్రస్తుతములు. ఇందు తాళ ప్రధానములగు దరువులు, ద్విపదలు, కందార్ధములును గొలఁదిగాఁ బద్యములును గలవు. నిర్వచనమని చెప్పవచ్చును. ఆఖ్యానశైలీ ప్రచురము. రచనప్రౌఢమునుగాదు. పేలవమునుగాదు. రామానుజ విజయ రచనకంటె మేల్తరము. ఇది మూఁడాశ్వాసములుగా విభక్తము. తన యీ కృతులను రెండింటిని యక్షగానములని పేర్కొనినాఁడు కవి. (పతివ్రతా మాహాత్మ్యము 1922 లో మదరాసు శశిరేఖా ము. శా. లో మఱల ముద్రితమైనది.)

74. వేదాల తిరునారాయణాచార్యులు

ఇతఁడు వేదాల వేంకట నృసింహాచార్యుని పౌత్రుఁడు. వేంకటాచార్యుల పుత్రుఁడు. బుక్కపట్టణము తిరువేంగడాచార్యుని శిష్యుఁడు. ఇతని శకుంతలా నాటకము ప్రారంభమున "గ్రంథ స్వాతంత్ర్యాధికారిని దెలుపు ద్విపద" యొకటి యేతదుపజ్ఞమే గలదు. అందీ గ్రంథ స్వాతంత్ర్యమును గని తానే స్వయముగ చతురంగ పట్టణము పార్థసారథి యనునాతని కిచ్చివేసినట్లు తెల్పియున్నాఁడు. ఆ పార్థసారథయ్యచే 6-5-1864 తేదీని సాలవ చిన్నస్వామిరాజుగారి ప్రచండ సూర్యాలోక ముద్రాక్షరశాలయందు ముద్రితమైన యీ తద్గ్రంథము నకుఁ బ్రచురణకర్త. అనఁగా, కవియు నప్పటివాఁడే యని ఋజువగుచున్నది. ఇతఁడీ శకుంతలా నాటకమునేకాక ప్రహ్లాద నాటకమును గూడ రచించియుండెను. (ప్రచురణ :— 1. ఆది విద్యా తరంగిణి ము. శా., మదరాసు, 1893. 2. శ్రీరంగ విలాస ము. శా. మదరాసు, 1904. ఇందును నీ గ్రంథస్వామ్యము చతురంగ పట్టణము పార్థసారథికిఁ జెందవలెనని కవి ప్రకాశిన ద్విపద గలదు.)

రెండింటను గథ ప్రసిద్ధము. శ. నా. కథా ప్రణాళిక కాళిదాసీయము ననుసరించి కాక భారత కథా సంవాదిగా సాగినది. రెండింటను కటికము పాత్ర (ప్ర. నా. న వీఁడు హిందీలోఁ బ్రసంగించుట కాననగును), పాత్రల తెర ద్విపదలు (తెరలోనుండి సభవారికిఁ బాత్రలు దమ యుదంతముఁదామై తెలియఁజేయు నట్టివి), పాత్రలు తెర వెడలు దరువులు (హంగుదారులు పాత్ర ప్రశంసాత్మకముగాఁ బాడు నట్టివి), సంధి వచనములును గలవు. రెండింటను ప్రసిద్ధకర్ణాటక హిందూస్తానీ రాగ తాళములలో దగువులు, ద్విపదలు, పద్యములు, కంద సీసార్ధ

ములు సంధి వచనములే కాక సంధి ద్విపదలు, వచనములలో దరువు లలోఁ బాత్రల సంవాదములు, నక్కడక్కడ శ్లోకములు తేవారము లును గలవు. రెండిటను రచన నాతి ప్రౌఢము, నాతి పేలవము. శకుం తలా నాటకము శ్రీకాకుళపురి వల్లభరాయని కంకితము. ప్రహ్లాద నాటకము శేషశైలధామున కంకితము. రెండిటను, దరువు చివర నాయూ దేవరల ముద్రలు గలవు.

---

75. చిలకమఱ్ఱి నారాయణాచార్యులు

ఇతఁడు భాగవత దశమస్కంధ పూర్వ భాగ యక్షగానమును రచించెనని శతకకవుల చరిత్రవలనఁ దెలియవచ్చినది కాని గ్రంథ మిపు డుపలబ్ధము గాదు. ఇతఁడు పిఠాపురమునకుఁ జేరువనున్న కొమర గిరివాసుఁడని తోఁచుచున్న దనియుఁ బల్లేరుమూడి వేంకట గురుని కడ నీతఁడనేక విద్య లభ్యసించెనని యు, నితఁడు గణోదయ ప్రబంధ, వేణు గోపాల శతకములకుఁ గర్తయనియు, నితని శతకరచనా కాలము శా. శ. మాని దంతావళ మానీశకువల – రక్తాక్షి = 1787 – క్రీ. శ. 1865 అనియు శ. క. చ నుండి యితని యుదంత మెఱుఁగ నగును.

---

76. నల్లపాటి శేషాచలదాసు

అవనిజా చరిత్ర :

కవిగురించి విశేషములేమియుఁ దెలియవు. ఇతనిగ్రంథము "నే. వెంకటసుబ్బాశాస్త్రులవారి సరస్వతీ ము. శా. యందు బందరు సంకా సుబ్రహ్మణ్యముగారిచే నచ్చువేయించి ప్రచురింపంబడియె". ప్రచురణ తేది 20-9-1869. కవి యానాఁటివాఁడేకాని యంతకించుక పూర్వుఁడుకాని యైయుండును. సీత తన వనవాసాదికముగూర్చి శ్రీరామునితోఁ జెప్పుట యిందలి విషయము. ఇందుఁ బ్రసిద్ధ రాగ తాళములలో దరువులు, పద్యగద్యములును గలవు - రచన మంచిదే.

---

77. తిరువగరి అనంతదాసు

రామనాటకము (కుశలవనాటకము) ♦

ఇతఁడు తిరువగరి కేశవార్యుని పుత్రుఁడు. పల్లేరుమూడి శింగ రాచార్యుల పుత్రుఁడైన రామానుజాచార్యునకు శిష్యుఁడు. ఇతనికి సాతాని అనంతయ్యగారని స్థానిక వ్యవహారము. ఇతఁడు నెల్లూరు మండలమునందలి నరసాపురము (నరసింహపురము) వాఁడనియు నతఁడీ రామనాటకమునేకాక హరిశ్చంద్ర ప్రహ్లాద నాటకాదులును రచించి

♦ కోళప్పన్ జేరి లక్ష్మణమొదలారివారి జీవరత్నాకర ముద్రాక్షరశాల. మదరాసు, 1906.

యుండెననియు, సమకాలమువాఁడుగను 1873 లో ముద్రితమైన నెల్లూరుజిల్లా మాన్యూలులోఁ (పుట 698 – 701) బేర్కొనఁబడెను.

ఇతని రామనాటకమొకటే యిపు డుపలబ్ధము. ఇందలి కథ కుశలవుల చరిత్ర. ఇది కుశలవనాటకమను పేర మిగులఁ బ్రసిద్ధివడసినది. ఇది కవిచే నాట్యోద్దిష్టమైనది. చక్కని సంవాదశైలిగలది. రచన చక్కనిది. ఇందుఁ బ్రసిద్ధ రాగ తాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు, కంద సీస వృత్తార్ధములు, సంధివచనములును గలవు.

---

78. కొండూరి సీతారామకవి

(మఱ్ఱినగర) సావిత్రీనాటకము:*

ఇతఁడు కొండూరు వేంకటేశ్వర వేంకమాంబల పుత్రుఁడు. ఇతఁడు నెల్లూరు జిల్లా వెంగల్లు వాస్తవ్యుఁడనియు, శివ పారిజాతము, ఇలావతీ చరిత్ర, కృష్ణవిలాసము లతని కృత్యంతరము లనియు నెల్లూరు జిల్లా మాన్యూలు వలనఁదెలియుచున్నది. (పుట 698 – 701). ఇవియు య. గా. నాటకములై నఁగావచ్చును గాని యిపుడు పలబ్ధములు గావు.

ఇతని సావిత్రీ నాటకము ఇందూరి నరసింహా రెడ్డి ప్రోత్సాహమున మఱ్ఱినగర చెన్నరాయని కంకితముగా రచింపఁబడినది. ఇందుఁ బ్రసిద్ధమగు సావిత్రీ చరిత్రము మూఁడు రాత్రుల ప్రదర్శనమునకుఁ

* ముద్రితము :— అమెరికన్ మైమండు ప్రెస్., మదరాసు. 1928.

గాను విశేషముగఁ బ్రపంచింపఁబడినది. ఇందుఁబ్రసిద్ధ రాగ తాళము లలో దరువులు, ద్విపదలు, పద్యములు, కందార్ధములు, సంధి వచనము లును గలవు. ద్విపదలకును రాగము లుదాహరింపఁబడుటయు, ద్విపదా ర్ధములు, పద్యములలో గోమూత్రికా రథాది బంధములును విశేష ములు. రచన సంవాదశైలీ ప్రచురము. ప్రౌఢము.

---

79. విజయనగరపు చెంగల్వరాయకవి

ఇతఁడు విజయనగరవంశోజ్జ్వలుఁడనియుఁ దిరుమల తాతాచార్య శిష్యుఁడనియు మాత్రము రాయపుర చెన్న ముద్రతోనున్న యితని గొల్లకథ, ఎఱుకల కథ (తం. స. మ. కే. నం. 485, 486) అను గ్రంథముల వలనఁ దెలియుచున్నది. ఇతఁడు మదనగోపాల శతకమును రచించినట్లు శ. క. చ. వలనఁదెలియుచున్నది. ఆ శతకమున నితఁడు వెంకటగిరి విభుని పుత్రుఁడని తెలియుచున్నది. ఇతని కాలము 1871 ప్రాంతముగా ఆం. వా. సూ. పీఠిక 93 వ పుటలోఁ బేర్కొనఁబడినది. అది యథార్ధమనలేము. ఇతఁడింకను గొంత పూర్వుఁడు గాఁదోచును. (శ. క. చ. లో. నితని కాలనిర్ణయము గాలేదు.)

గొ ల్ల క థ :

ఇందుఁ దక్రమును విక్రయింపవచ్చిన గొల్లభామ రాయపుర గృహిణులతోఁదమ గొల్లజాతి గొప్పదనమును జల్ల ప్రాశస్త్యము నుగ్గ డించును. తమ కాలము తెగలు నాచారములు నేకరువు పెట్టును.

పిడప ఘట్టమున సుంకరి కొండయ్య వచ్చును. వాఁడు సుంకము గాని తెప్పత్యాగమ్మాయముగాఁ జుంబనము గాని యిమ్మని మొఱ్ఱిడిచేయును అమె తన యత్తను బిలిచెదనని బెదరింపఁజూచును. వాఁడసాధ్యుఁడు "గుత్తలోగడను మీ యత్తమా" కనును. ఇదీ కథ. ఇందు దరువులు, ద్విపదలు, గీత పద్యములు నెక్కువగాఁ గలవు. సంధి వచనములు కొద్ది. సంవాదము లెక్కువ. కథకు జరుగుపాటు తక్కువ. రచన సరసమైనదే.

ఎఱుకలకథ:

పీతహిణి యగు సత్యభామ కడకు నలున యానతి సరస్వతి "కొరవంజి వేషమిమ్మగా ధరియించి" వచ్చును. ఎఱుకల కులాచారములఁ గూర్చి దీక్షముగా నుపన్యసించును. సాముద్రిక శకున శాస్త్ర ప్రసంగము చేయును. తాను తిరిగిన దేశముల, కొలిచిన దేవరల పేర్లఁ గరువుపెట్టును. సత్య ఖిన్నతకు సన్నిహితమైన నారదానీత పారిజాత వృత్తాంతము నెఱుకచెప్పును. కృష్ణుఁడువచ్చి యామెకోరిక నెఱవేర్చునన్నాఁడనియుఁ జెప్పును. ఇందు దరువులు, ద్విపదలు, పద్యములు, శ్లోకములు, చూర్ణికలును గలవు. రచన సరసమైనది.

---

80. బెహరా అప్పల నరసింహులు

గ్రంథోపాఖ్యానము:

ఈతఁడు బెహరా జంపనయ మనుమఁడు. వెంకాంబ, ఆదినారాయణులకుఁ బుత్రుఁడు. నివాసము మహేంద్ర పర్వత ప్రాంతమున,

మహేంద్ర తనయానదీ తీరమున శ్రీకాకుళమండలమున మందసా దగ్గరనున్న వేంకటరాయపురము.

ఈ గ్రంథము "కవి యిష్టానుసారంబుగ నిశ్చింత తేవప్పెరు మూళ్ళయ్యగారిచేతఁ బరిష్కరింపించి, తత్తదవసరోచిత ప్రతిమలను జేర్చి పిళ్ళారిసెట్టి రాఘవయ్య నాయని వారి స్వకీయ భారతీ నిలయ ముద్రాక్షరశాలయందు 5–6–1873 తేదీన ముద్రింపించి ప్రకటింపఁ బడియె" నని ముద్రితప్రతి ముఖపత్రముఁగలదు. ఆ 1872 నాఁటి గ్రంథ పరిష్కరణ ముద్రణములు కవి యిష్టానుసారముగా సాగిన వనఁగాఁ గవి యెట్లును నప్పటివాఁడే యగును గదా.

ఇందలి కథ ప్రసిద్ధము. ఇందు జరుగఁబోవు సంఘటనలెల్ల ముందుగనే ప్రత్యేక శీర్షికలద్వారా సూచింపఁబడినవి. పాత్రలు తెర లోనికి వచ్చుట, తెర బయలెడలుట, "మాధవి వేషగాఁడు" ప్రశ్నలడుగుట, పాత్రలు తమ యుపంతమును జెప్పుట, ఉత్తమ పాత్రలు ప్రవేశించునపుడు తెరలో నుండి దైవస్తుతి చేయుట మొ॥ విశేషములు గలవు. ముఖారి ప్రముఖ రాగములలో దరువులు, ద్విపదలు, సీస గీతములు, సీస కందార్ధములు నొకదానికంటె నొకటి యధికతరముగ వాడఁబడినవి. సంధి వాక్యములు పద్యగద్యములు రెంటను గలవు. సంవాదశైలి యెక్కువ. ఇందుఁ జూర్ణికయు 'రాగ వరుస' లో నడిపింపఁబడినది. దరువులలో ముద్రలు గలవు. రచన యొకమోస్తరు. నాటక ప్రబంధమని పేర్కొనఁబడినది.

81. ఉప్పలూరి వీరరాఘవుఁడు, గంగాధరుఁడు

భూమికాలాపము: ♦

ఈ జంటకవులు "కిటినది" యొడ్డున నున్న కొప్పాకపుర వాస్తవ్యులఁట. అది విశాఖమండలమున సర్వసిద్ధిశాలూకాలో వరాహానది యొడ్డున నున్న ఏటికొప్పాక. అందుప్పలూరి వీరరాఘవ కవి తండ్రిగురుమూర్తి, తాతగంగన్న యనియు నిందుఁ బేర్కొనఁ బడినది. ఈ వీరరాఘవులుగారు, గంగాధరంగారును సన్నిహితజ్ఞాతులనియు, నిప్పటికి సుమారు వందసంవత్సరముల క్రిందటివారనియు—నేటికొప్పాక ప్రాంతమువారిని "వాకబు" చేయఁగాఁదెలిసినది. ఇప్పటికిని వీరరాఘవ గంగాధర కవులపౌత్రులు తత్తన్నామధేయులే యూయూర నున్నారఁట. అనఁగా నీజంట కవులు 19 శతాబ్ది యుత్తరార్ధమున నుండి యుందురని చెప్పనగును.

గ్రంథ మసమగ్రము. ఉన్నంతలో శ్రీకృష్ణుఁడు నర్మసచివుఁడైన "మాధవుని" ద్వారా సత్యభామకు లేఖ నంపించుటయుఁ బిమ్మట "రుక్మిణీవేషకలాప" మను నవాంతరశీర్షికక్రింద కృష్ణాన్వేషిణియై వచ్చిన రుక్మిణి "మాధవి" తో స్వవిషయమును జెప్పుటయుఁగాననగును. ఇందు దరువులు, ద్విపద, మంజరి, పద్యములును గలవు. మంజరిలోఁ బ్రాసయతి పాటింపఁ బడినది. రచనయొక మోస్తరు.

♦ ఆం. సా. ప. నం. 4527.

82. దూపాటి శేషాచార్యులు

శాకుంతల నాటకము : *

లాహితాన్వాయ వైష్ణవుఁడగు పట్టాభి రామాచార్యులకును రాఘవాంబకును వేంకటరత్నమాచార్య, వేంకటాచార్య, కొండమాచార్యులను పుత్రులు గలిగిరి. అందు కొండమాచార్యులకు రంగమ యందు తిరుమల, వరద, నరసింహ, పట్టాభిరామ, శేషాచార్యులను వారు పుత్రులు. ఆకడగొట్టువాఁడే యేతద్గ్రంథకర్త. ఇతఁడు శ్రీశైలా స్వయ సింగరాచార్యుని శిష్యుఁడు. ఈతఁడు 1871 సం. నకుఁ బూర్వుఁ డని శ. క. చ. (చూ. పుట 421 – దూపాటి తిరుమలాచార్యుని చరిత్ర). వావిళ్ళవారి ప్రచురణ (1926.) యగు భక్తి శతక సంపుటము ద్వితీయ భాగమునఁగల దూపాటి తిరుమలాచార్యుని ముకుందశతకము నకుఁ బీఠిక వ్రాయుచు శ్రీ శేషాద్రి రమణ కవులు "ఈకవి నివాస స్థానము బొపట్లకుఁ బదిమైళ్ళ దూరమున సముద్రతీరము నందున్న ఓడశేవు. ... ఈయన తన యెనుఁబదవ యేట పరమపదవి చేరెను. ఈకవి సోదరుఁడగు దూపాటి శేషాచార్యకవి ప్రౌఢకవి. ఈయన రంగధామ, నకరికంటి నృసింహాద్రి శతకములు, శకుంతలా ధనంజయ విలాసాదిగేయ ప్రబంధములు వ్రాసినాఁడు. మా పితామహులగు శేషాచార్యులకీ తిరుమలాచార్యకవి యగ్రజాతుఁడగు కతన మేమీ కవిజీవిశము సవిధముగాఁ దెలుపఁ గలిగితిమి. కవి మనుమ లిప్పుడు ఓడశేవులో నున్నారు. ... ... ఈకవి గతించి యిప్పటికి ముప్పది సంవత్సరములు దాటినవి" అని వ్రాసియున్నారు. ఈ పీఠిక వ్రాయ

---

* ప్రచురితము :— నేలటూరు సుబ్రహ్మణ్యంగారి విద్యావిలాస ముద్రాక్షర శాల. (ఊరు?). ప్రమోదూత (1930 ?)

బడిన తేదీ 5-2-1925 అప్పటికి ముప్పదియేండ్లకిందట దూపాటి తిరు మలాచార్యుడు తన యెనుబదవయేటఁ బరమపదించె ననఁగా నతని జీవితకాలము 1815 - 1895 సం. ల నడిమికాల మగుచున్నది. ఆతని కడగొట్టు సోదరుఁడగు శేషాచార్యుఁడు 1830 - 1900 సం. ల నడుమ నుండి యుండును. ఇతని ధనంజయ విలాసగేయప్రబంధము శాకుంతల నాటకమువలె యక్షగానమై యుండును గాని లభింపలేదు.

ఈశాకుంతల నాటకమందలి కథాప్రణాళికకుఁ గాళిదాసీయము మూఁదలకాని యిందనావశ్యకమైన ప్రపంచీకరణము గొంత కనిపిం చును. ఇది యక్షగానమనియు, నాటకమనియు, గేయప్రబంధమనియుఁ బేర్కొనఁబడినది. మూఁడుల్లాసములుగా విభజింపఁబడినది. ఇందు సూత్రధార ప్రవర్తితమైన ప్రస్తావనగలదు. అందీ నాటకప్రయోగ మునుగూర్చిన తౌర్యత్రిక రూపాద్గోప విషయప్రసక్తిగలదు. ఇందుఁ బ్రతిముఖ్యపాత్ర విషయమునను " ..... (ఫలానా వేషధారి) తెరలోకి నచ్చి చనువవలసిన ద్విపద ", " వేషధారి తెరవెడలు దరువు " అని కలదు. పాత్రల వృత్తాంతములు పాత్రేతరులు జెప్పునట్లుగలదు. హాస్య గాఁడు పాత్రలను బలుకరించుట గలదు. కథాసంధులు (పాత్రాంతర ప్రవేశ సూచకములైన సంధివాక్యములు) గలవు. కొన్ని ప్రదర్శన సూచనలు, విషయ విషయమునకును బ్రత్యేకశీర్షికలును గలవు. ఇందలి హాస్యగాఁడు బ్రాహ్మణుఁడఁట. అతని ప్రసంగములందుఁ జమత్కార ముత్కో పాఔచిత్యము బాటింపఁబడినది. వేట, యెఱుకల ప్రసంగ ములు స్వభావోక్తిసుభగములు. నాయిక విరహ వివాహాది సందర్భము లందు ప్రబంధఘణితి ప్రాగల్భ్యముగలదు. ఇందలి భాషయు భావములు నతి ప్రౌఢములు. కవికడ నొక ప్రౌఢప్రబంధమును రచించుటకుఁ దగిన సామగ్రి గలదు. ఇందుఁ బ్రసిద్ధ రాగతాళములలో దరువులు,

ద్విపదలు, పలురకముల పద్యములు, కంద సీసార్ధములు, సంధి సంభాషణ వచనములును గలవు.

---

83. తిమ్మరాజు లక్ష్మణరావు

రుక్మిణీకల్యాణము : *

బ్రాహ్మణకులము వాజసనేయశాఖయందుఁ బిట్టలాన్వయమున భూతి తిమ్మయార్యుఁడను నతఁడు భాగ్య పురాధిపుని కొలువులోఁ గొన్నాళ్లుండుటచే నతని సంతతివారికిఁ దిమ్మరాజువారని పేరువచ్చిన దఁట. ఆ తిమ్మరాజునకు నరసయ, నరసయకు బొల్లయయుఁ గొడుకులు. బొల్లయకు లక్ష్మమయందు గలిగినవాఁడీ గ్రంథకర్త. ఇతనికి మాతులుఁడు, గురువునైనవాఁడు కేతరాజు రామయోగీంద్రుఁడు. గ్రంథకర్త యీ రుక్మిణీకల్యాణ గ్రంథాంత ద్విపదలోఁ దానిదివఱకు "రవి శశికాంతులన్ రాజుల కథను" రచించి దానిని బ్రకటించుటకు ముందు కృష్ణునిపేర నొక కృతి జెప్పవలెనని దీనిని రచించినట్లు చెప్పియున్నాఁడు. దీని ప్రచురణ 1875 సం.లో. కావున నతఁడా 1875 లో నుండెనని చెప్పఁదగియున్నది.

గ్రంథ విషయము :- ప్రసిద్ధము. యక్షగానములలో నిదిచాల మేలిమిగల రచన. వివాహఘట్టము సమ్యగ్వర్ణితము. ఇందుఁ బ్రసిద్ధ తాళ ప్రధానము లగు దరువులు, రాగప్రాముఖ్యమును గల నలుగు,

---

* ప్రచురణ :— పువ్వాడ వెంకటరావు పంతులుగారి వర్తమాన తరంగిణీ ము. శా., 1875.

బంతులాట, శోభనపుఁ బాటలు, ద్విపదలు, వచనములు, కందార్ధ ములు, లాలి, ఏలలు, అర్ధచంద్రికలు, రగడ, లావణి యను నొక పదచ్ఛందో విశేషమును గలవు. యక్షగానమని పేర్కొనఁబడెను.

---

84. వరిగంటి శేషగిరిదాసు

జగన్మోహన శ్రీకృష్ణ విలాసము:

"ఇది నెల్లూరు మూలస్థానీశ్వరునిపేట నివాసులగు వరిగంటి శేషగిరిదాసుగారిచే రచియింపఁబడి వారిచే గ్రంథ స్వాతంత్ర్యమును బొందిన వంగీపురం రామకృష్ణమాచార్యులచే శ్రీసరస్వతీనిలయ ముద్రా క్షరశాలయందు ముద్రింపించి వంగీపురం రంగాచార్యులచేఁ బ్రకటింపఁ బడియె" ననియు, నా ప్రచురణవత్సరము 1876 అనియు గ్రంథముఖ పత్రమున నున్నది. కవి కాలము సులువుగాఁ దెలిసినది. ఇతని కృత్యంత రములు:— సంగ్రహరామాయణము (సంస్కృతము), అష్టపదులు, భాగవత రామాయణాంధ్రీకరణములు, భక్తవత్సల శ్రీరామ సుధా కరము, హరికీర్తనలు, కుచేలోపాఖ్యానము, ధ్రువచరిత్ర, భగవద్గీతా వ్యాఖ్యానము. (చూ. నెల్లూరుజిల్లా మాన్యాలు, పుటలు 698-701). ఈయన రామాయణ య. గా. ను గూడ రచించినట్లు తెలియుచున్నది. (గ్రంథము నా కలబ్ధము).

జ. శ్రీ. వి.:— వేణుగాన మాలించి గోపికలు తమ తమ పనులు మాని యత్తల మాట నలక్ష్యము చేసి కృష్ణుఁడున్న యెడకుఁబయన

మగుటయు నాతఁడు వారలతోఁ జాలతడవు సయ్యాట లాడి చివరికిఁ బ్రసన్నుఁడగుటయు నిందలి విషయము. రచన చక్కనిది. ప్రసిద్ధ రాగ తాళములలో దరువులు, డోరాలు, నడుమ నడుమ నలఁతి సంధి వచనములు నక్కడక్కడ గీతములు కందములును గలవు.

---

85. ఏనుగుల చూడమ్మగారు

రుక్మిణీ కల్యాణము:

ఈమె ఎరగుడిపాటి వేంకటాచలము పంతులుగారి పుత్రికయఁట. పంతులుగారు 19శ. ఉత్తరార్ధమున నుండినట్లు వినికిడి. గ్రంథముద్రణ తే. 11–8–1879 న కాకినాడ ముద్రాక్షరశాలయందు జరగినది కావున నీమెకాల మొకవంక సునిశ్చితము. ఈమె రుక్మిణీ కల్యాణము యక్ష గానమని చెప్పఁబడలేదు. కాని యా లక్షణము కొంతపట్టినది. ప్రసిద్ధ రాగతాళములలో దరువులు, సంధివచనములు, జోలలు, లాలి, గొబ్బి, నలుగు, మేలుకొలుపు, మంగళహారతులు మొ॥ పలుపాటలు నిందుఁ గలవు. ఇందు రెండు వంతులు కృష్ణుని బాల్య క్రీడాదికమే వర్ణితము. రుక్మిణీ కల్యాణముతో గ్రంథాంతము. ఆఖ్యానశైలి యెక్కువ. రచన సలక్షణము. సరసము.

---

86. భారతుల శ్రీరంగకవి

భారతులవారిది యజుశ్శాఖ. అందుఁ గవివంశము - పితాపుత్ర క్రమమున :— నరసయ్య - కేశవయ్య - రాఘవయ్య - కేశవయ్య - రంగార్యుఁడు (భార్య ఆదెమాంబ) - ఈ శ్రీరంగకవి. ఇతని కృతులు :- శ్రీకృష్ణ లీలలు, కృష్ణవిలాసము. ఇవి కవిపెట్టిన పేర్లు. కాని వరుసగా శ్రీకృష్ణ జలక్రీడలు, పారిజాతము ననుపేళ్ళతో రెండును కంచనపల్లి జగన్నాథరాయునిచే మదరాసు వర్తమాన తరంగిణి ము. శా. లో 1881 లో ముద్రాపితములై ప్రచురింపఁబడినవి. కవి రెండిటను గ్రంథాంత ద్విపదలలోఁ గృతిప్రోత్సాహకుఁడును, బ్రచురణకర్తయు నగు కంచనపల్లి జగన్నాథరాయుని (ఆయన పలినాటి దేవస్థాన ధర్మ కర్త యుఁట) ప్రశంసచేసియున్నాఁడు. అదికాక రెండిటను గృతిరచనా కాలము "శాలివాహన శక చంద్ర తారాపథ ద్విప ధవళ రుక్సంఖ్య వహిగాంచిన ప్రమాది" వత్సరముగాఁ బేర్కొనఁబడినది. అది శా. శ. 1801 — క్రీ. శ. 1879. అందు శ్రీకృష్ణలీలలు ముందు రచింపఁబడినది. రెండును మూచెర్ల చెన్న కేశవాంకితములు. కవి గుంటూరు మండలమువాఁడై యుండును.

శ్రీకృష్ణలీలలు :

ఇందుఁ గృష్ణ జననము, పూతనాహారణము, కృష్ణుని యాగడి ములఁగూఁచి యశోదతో గోపికల "పిరియాదు" లు, జలక్రీడలును విషయములు. ఇందలిరచన చక్కనిదేకాని గోపికల "పిరియాదు" ల సందర్భమున హాస్యలాలసుఁడై కవి యత్నింతవ్య మగు నసభ్యతకు ననౌచిత్యమునకు నొడిగట్టినాఁడు.

కృష్ణవిలాసము :

కవి ప్రచురణకర్తృ వంశ ప్రశంస లెక్కువగా దీనినుండియే తెలిసినవి. ఇందుఁ గవి తన గురువగు వ్యాకరణము ఆదినారాయణార్యుని, నృసింహ భారతీస్వామి యతీంద్రుని స్తుతించినాఁడు. ఇందలికథా ప్రథమఘట్టము ప్రియురాండ్రతో కృష్ణుని సమాగమము ; పిదప ఘట్ట మునఁ బారిజాత కథ పూర్తిగాఁ గలదు. ఇందలి రచన పూర్వపు దానికంటె మేల్తరము. అయినను రెండిటను రచన సలక్షణభాషలో సరళముగా మధురముగాఁ జాలవరకు నిర్దుష్టముగా (వచన సంభాషణ లలోఁదక్క) నున్నది. రెండిటను ప్రసిద్ధ రాగతాళములలో దరువులు, ద్విపదలు, సంధివాక్యములు సంభాషణములు గూడఁగలిగిన గద్యపద్య ములు, రగడ, ఏల, శబ్దజతి, శోభనము మొ॥ విశేషరచనలును గలవు. రెండును నాటకములని పేరొక్కనఁబడినవి.

---

87. కొల్లము సీతారామకవి

ఈతఁడు దేవకీసుతానయన మను యక్షగానమును రచించినాఁ డఁట. కాని గ్రంథ మలభ్యము. ఇతఁడు నందవరీకుఁడు. కాశ్యప గోత్రుఁడు. లక్ష్మమారామకృష్ణార్యుల పుత్రుఁడు. ఇతఁడు "క్రీ. శ. 1880 సం. ప్రాంతమువాఁడై యుండును". ఇతని కృత్యంతరములు :— యోగాంజనేయ స్తవ తారావళి, హరిచరణ స్తవరాజము, ఘటికాద్రీశ శతకము, శ్రీరమాకాంతరంగ శతకము, విజయ ప్రతిజ్ఞాపూరణకథ. (ఈవిషయమంతయు శతకకవుల చరిత్రవలనఁ దెలియవచ్చినది.

---

88. కొదమగుండ్ల శేషాచార్యులు

కవి కాశ్యప సగోత్రుఁడు. కొదమగుండ్ల అప్పళాచార్యుని పుత్రుఁడు. కవినివాసము వేటపాలెము. (ఇది గుంటూరు మండలము లోనిది కాదగును) ఇతఁడు వరుసగా కృష్ణవిలాసము, వసురాజవిలాసము, పూరూరవశ్చక్రవర్తి విలాసము ననుమూఁడు నాటకములను రచించియుండెను. (పూర్వకృతులు చిదప కృతులలోఁ బేర్కొనఁబడినవి.) ఇందు మొదటి దిప్పుడుపలబ్ధముగాదు. రెండవది కృతిభోక్తాసాహకుఁడగు కంచనపల్లి జగన్నాథరాయుఁడే ప్రచురణ కర్తగా 12-2-1880 తేదీన మదరాసు వర్తమాన తరంగిణీ ము. శా. లో ముద్రితము. మూఁడవది గ్రంథకర్త తండ్రియే పరిష్కర్తగా, కృతిభోక్తాసాహకుఁడగు ముమ్మడిసెట్టి వీరాసామినాయుఁడుగారిచేత మచిలీపట్టణములోని వంగిపురం రుక్మిణమ్మ గారి ము. శా. లో 23-1-1885 తేదీన ముద్రితము. కవికాలము సుళువుగా గ్రహింపనగును.

వసురాజవిలాసము :

ఇది రామరాజభూషణుని వసుచరిత్ర ప్రబంధమునకు వీథినాటక రూప పరివర్తనము. కథాప్రణాళిక, వర్ణనలు, రచన, శాబ్దిక చమత్కారము మొదలగు విషయము లందలి యనుకరణమునుబట్టి యిది వసుచరిత్ర కొక మానసపుత్రిక యనవచ్చును. కథారంభమున రాజాగమన సూచకముగా "చోపుదారు" రాక, అతని ఉద్యూప్రసంగము, వసురాజు వనవిహారముహూర్త నిర్ణయము చేయవచ్చిన రాజగురువు పాత్ర, అతని శిష్యుల హాస్య ప్రసంగములు మున్నగునవి యిందలి విశేషములు. ఇందుఁ బ్రసిద్ధరాగతాళములలో దరువులు, ద్విపదలు, ప్రబంధ ధోరణిబట్టిపోయిన పద్యగద్యములునుగలవు. ఇది

నాటకమనియుఁ గేయప్రబంధమనియు బేరొక్కఁబడినది. మూఁచెర్ల చెన్న కేశవస్వామి కంకితము.

పురూరవశ్చక్రవర్తి విలాసము:

ప్రసిద్ధమైన ఊర్వశీ పురూరవుల ప్రణయగాథ యిందు వర్ణితము. నాటకారంభమున సూత్రధారుఁ డొక సంస్కృత ప్రసంగమున గథాసంగ్రహమును జెప్పి విష్వక్సేన స్తుతి చేయును. ఇందది శృంగార రూపకమనియు, వేషభాషా విశిష్ట నాటకమనియుఁ వేఱే గేయప్రబంధమనియుఁ బేరొక్కఁబడినది. ఇందుఁబాత్రల "కథాసంధులు" (అనఁగాఁబాత్ర ప్రవేశసూచకముగా తదుపరంత మే సూత్రధారప్రాయుని చేతనో ముందుకొంత ప్రస్తావింపఁబడుట) గలవు. ఇందొక కైవారమున నుర్దూ సంస్కృతముల ప్రయోగముగలదు. కందార్ధములెక్కువ. తరువాత సీసార్ధములు, ప్రసిద్ధరాగ తాళములలో దరువులు, ద్విపదలు సంధివచనములు, వచనములలో సంభాషణలు, కొలఁదిపాటి పద్యములు (అందు తురంగప్రయాత మనునది విశేషము), జోల, మంగళహారతి, తేవారముగలవు. దరువుల చివరఁ గృతిపోత్సాహకునిపేరు వచ్చుచుండును. ఇది శ్రీరంగేశున కంకితము. ఇందలి రచనప్రబంధోచితమైనది. కవి చక్కని నైదుష్యము గలవాఁడే.

---

89. ఉపాధ్యాయుల మృత్యుంజయకవి

వామనచరిత్రము:

కవి ఉఁగపుర నివాసి. ఉపాధ్యాయుల కాశీపతి పుత్రుఁడు. పావన యను నామాంతరము గలవాఁడు. కృతి ప్రోత్సాహకుఁడు

చదుము సుబ్బరాయణి. అతఁడే ప్రచురణ కారకుఁడన్నట్లును దోఁచు చున్నది. గ్రంథ ముద్రణము మదరాసు ఆది సరస్వతీ నిలయ ము. శా. లో 1890లో నైనది. కవి యప్పుడున్నట్లుతోఁచుచున్నది.

గ్రంథవిషయము ప్రసిద్ధము. ఇది యైదుఖండములుగా విభాగింప బడినది. యక్షగానమని పేరొక్కనఁబడినది. దరువుల మయ్యమైనది. దరు వులురాగతాళములతోఁగలిసియు, విడిగాఁ దాళప్రధానములునుగలవు. పద్యములుకొద్ది, ద్విపదయున్నది.(ద్వితీయఖండమంతయు ద్విపదయే). వచనము గ్రంథావతారికలో నొక్కచోఁగలదు. కందార్ధములు, చూర్ణిక, శారదపద్యము, చౌపద్యష్టకము, శోభనము గలవు. ఇందలి ఖండ విభాగ మనావశ్యకము. కథ చెప్పుచున్నట్లుండును, గాని జరుగు చున్నట్లుండదు. కవి సహజముగా నొడుదుడుకులు లేకుండ రచన చేయగలవాడే కాని భాగవత పద్యములను గరువులుగాఁ బరివర్తింప యత్నించినాఁడు గావున నడుమ పేఱుబిగింపులుచేఁ రచన కొంచెము పెటుకుగా దయ్యారైనది.

---

90. కేశవపట్టణము జియ్యరయ్య

న ల నా ట క ము:

కవి కేశవపట్టణము రామానుజాంబాభాష్యకారులకుఁ బౌత్రుఁడు. యతి రాజమ్మనాథమునీంద్రులకుఁ బుత్రుఁడు. 37వ "గ్రైనెడియర్సు రెజిమెంటల్" పాఠశాల తెలుఁగు ఉపాధ్యాయుఁడట. కృతిపతి చోడ

వరము జమీందారగు చెవ్వాకుల సుబ్బయ్య. ప్రచురణ కవిరంజనీ ప్రెస్, మదరాసు, 1881. కవి గ్రంథప్రచురణ కాలమునాఁటి వాఁడుగనే తోఁచుచున్నాఁడు.

గ్రంథ విషయము ప్రసిద్ధము. ఘటికుని (కటికము ?) రాకతోఁ గథారంభము. వాని ప్రసంగము హిందీలోఁ గలదు. ఇందుఁబాత్రల "తెరద్విపదలు", పాత్రప్రవేశపు దరువులును గలవు. ఇందలి దరువులు ప్రసిద్ధ రాగ తాళములలోనేగలవు. ఇంగ్లీషు మెట్టుకాటి గలదు. ద్విపదలు, పద్యములు, సంధి సంభాషణ వచనములు, సీసార్ధాదులును గలవు. రచన సలక్షణము, సరసమైనది.

---

91. బుక్కపట్టణము శతగోపసూరి

తారాశశాంక విలాసము :

కవి బుక్కపట్టణము స్వామి జియ్యరునకుఁ బుత్రుఁడు. ఆసూరి వేంకటాచార్యునకు శిష్యుడు. కవికాలము నిర్ణయించుటకుఁ దగిన యాధారములేదు. గ్రంథముద్రణము 1882 సం. (ఆది విద్యావిలాసము. శా. మదరాసు). కవి యించు మించప్పటి వాఁడుగనే తోఁచును.

గ్రంథవిషయము :— ప్రసిద్ధము. కవి శేషమువెంకటపతి శశాంక విజయమును జూచియుండును గాని యనుకరించుటకుఁ బ్రయత్నింపలేదు. రచనలోఁగొంత విదగ్ధతఁ జూపినాఁడు. కాని రసము కొంచెము మందురుపాకమునఁ బడినది. ఇందు విదూషక ప్రాయుఁడై న

వికటకలాపుని హాస్యప్రసంగములలోఁ జమత్కారమున్నను సున్నితము తక్కువ. గ్రంథమున వచనమునందును సంభాషణలు గలవు. నాటకీయత యెక్కువ. సక్రమమైన రంగవిభాగము చేయుట కనువుగానున్నవి సన్నివేశములు. ముఖ్యపాత్రల ప్రవేశసూచనలు, పాత్రలచే స్వవిషయ వివరణములును గలవు. అనేక ప్రసిద్ధ రాగ తాళములలో దరువులు (దరువులందుఁ గరిగిరి వరదముద్ర), పద్యములు, ద్విపదలు, సంధివచనములు, సంధిద్విపదలు, సంధి – అర్ధకందములు, (కందార్ధములు), ఏలలునుగలవు. ఇది నాటకమని పేర్కొనఁబడినది.

---

92. మామిళ్లపల్లి వెంకటాచలమయ్య

(నూతనపురి) ఏ కా ం త సే వ :

(ప్రచురణ :— శారదానిలయ ము. శా., 1882)

కవి ఆపస్తంబ సూత్రుఁడు. కౌశిక సగోత్రుఁడు. వెంకట రామయ పౌత్రుఁడు. సుబ్రహ్మణ్య పుత్రుఁడు. కవి నివాసము నూతన పురి. కవికాల నిర్ణయమున కాధారము గన్పట్టదు. గ్రంథ ప్రచురణ వత్సర ప్రాంతమే యైనను గావచ్చునని యూహా మాత్రము.

ఏకాంతసేవ యనఁగా నిత్యార్చన సాగు దేవాయతనములలో ముఖ్యముగా భోగనిలయములగు వైష్ణవాలయములలో రాత్రి గుడి తలుపులు మూయుటకు ముందర్చకు లమ్మవారిని స్వామివారిని యథా విధి నుపచరించి వారి యుత్సవ విగ్రహములను బానుపుపై నిబవళింపు

చేయఁగా, గుడిచేటులు లాలిపాటలు పాడి ద్వారపాలక నిమిత్త మష్ట దిక్పాలకులకు బహుపరాకులు చెప్పి వెడలిపోఁగా నీక నమ్మవారు స్వామివారికిఁ జేయునదిగా నూహింపఁదగిన పర్యంక సపర్య. మధురభక్తి ముదితాత్మలగు కవులు కొంద ఱాసన్నివేశమును బురస్కరించుకొని దానికిఁ బ్రస్తావనగా నింత కథాంగము గల్పించి నాయకుని వివిధోప చారములకు వివిధగీత ప్రభేదములను బ్రయోగించి యేకాంత సేవా మకుటముతో ననేక మధురగేయ ప్రబంధములను వెలయించిరి. అవి భక్తి శృంగారములకు, సంగీత సాహిత్యములకు నాలవాలములు. అట్టిదే వెంకటాచలకవి గ్రంథమును. అది కవిచే యత్నముగాన మని పేరొక్కనఁబడినది. ఇందలి నాయికా నాయకులు లక్ష్మీనారాయణులు. ఇందు వారి రాయబారములు, సంవాదములు, సమాగమము, భక్తుల యుపచారములు, ద్వారపాలకుల హెచ్చరికలు, మేలుకొలుపులు, కల్యాణోత్సవము విషయములు. ఇవి కాక యిందు వివిధరాగ తాళ ములలోఁ బదములు, దరువులు, కీర్తనలు, శ్లోకములు, పద్యము, ద్విప దలు, వచసములు, అష్టకములు, ఏలలు, పలురకముల స్త్రీల వేడుక పాటలును గలవు. రచన చక్కఁగనే యున్నది.

93. నాదెళ్ల పురుషోత్తమ కవి

అహల్యా సంక్రందన నాటకము:

(ప్రచురణ:— కేశరాజుసమూహివారి స్వధర్మ ప్రకాశిని ము. శా., 1—శి—1883

కవి హారితసగోత్రుఁడు. తల్లి సుబ్బమ. తండ్రి కామయ. ఇతని జన్మస్థానము కృష్ణా తీరస్థమగు సీతారామపురాగ్రహారము. జననము 1863. నిర్యాణము 27—11—1938. కృత్యంతరములు:— హరిశ్చంద్ర నాటకము, పారిజాతాపహరణము, సారంగధర నాటకము మొ. (చూ. 'ఆంధ్ర రచయితలు'). ఇవియు యక్షగానము బాణీని నడచినవే కావచ్చును. కాని నేఁ డుపలభ్యమాన మగున దీయహల్యా సంక్రందన నాటకము మాత్రమే.

ఇందలి కథ ప్రసిద్ధము. రచన కొంత సరసమైనదే. వేత్రధర పాత్ర ప్రవేశముతో నిందలి కథారంభము. వాఁడు "వాటిజ్జట్, కోప్‌కైస్ట్, కామోష్" అని యీ ప్రకార మాంగ్ల హిందీభాషలలోఁ బ్రసంగించును. హాస్యగాఁడు పాత్రలను బలుకరించుటయు నెకసక్కెపుఁ బ్రసంగములు చేయుటయుఁగలదు. పాత్ర ప్రవేశ సూచనలు, పాత్రలు తమ వృత్తాంతము జెప్పుకొనుటయుఁగలవు. ఇది యక్షగానమనియుఁ నాటకమనియుఁ బేర్కొనఁబడినది. ప్రదర్శనకుఁజాకలి పట్టు దివిటీ ప్రసక్తి వచ్చినది. రచనలో దరువులు మొదలగు యక్షగానపు సజ్జంతయుఁ గలదు.

94. బొందుగయాదవదాసు

ఇతని పితామహుఁడు శేషయ్య, తండ్రి సీతారామయ. నివాసము గజవెల్లి సీమ — (దే. చ.) ఇతని కృతులు దేవయాని చరిత్ర [1] ప్రహ్లాద చరిత్ర [2] రామదాసు చరిత్ర [3] గరుడాచల నాటకము [4] 1882 సం. న మదరాసు ఆదికలానిధి ము. శా. లో ముద్రితమై ప్రకటింపఁబడిన తాడిపర్తి లక్ష్మణదాసుగారి ప్రహ్లాద నాటకములో నీయాదవదాసుగారి ప్రహ్లాదచరిత్ర పేర్కొనఁబడినది. యాదవదాసు తన దేవయాని చరిత్రను చిత్రభాను భాద్రపదశుక్ల దశమి భృగువాసరమున రచించితినని చెప్పినాఁడు. అది 22-9-1882 తేదీ యైనది. ఇతఁడు 19 శ. ఉత్తరార్ధమున నుండినట్లు నిశ్చయింపవచ్చును.

ఇతని గ్రంథములు నాల్గును బ్రసిద్ధేతివృత్తములు. భద్రాచల రామార్పితములు. నాల్గును నాటకీయతగల రచనలు. అందు దేవయాని, రామదాసు చరిత్రములు యక్షగానములనియు, గరుడాచలము నాటకమనియుఁ బేర్కొనఁబడినవి. నాల్గింటను పాత్రలు తెర వెడలు కీర్తనలు, పదములు, ద్వారపాలకుఁడు లేక ద్వారకుఁడనువాఁడు (కటికమువంటి పాత్ర) పాత్రలను బలుకరించుటయుఁ బాత్రలు స్వ

నాల్గును ముద్రితములు :—

1. పెస్టువార్డు అండుకో., మదరాసు, 1949.
2. కొండా శంకరయ్య, చందా నారాయణశ్రేష్ఠి, సికింద్రాబాదు, 1951.
3. పెస్టువార్డు అండుకో., మదరాసు, 1949.
4. కర్రా అచ్చయ్య అండు సన్సు., రాజమండ్రి, 1931.
   యస్. వి. గోపాల్ అండుకో., మదరాసు, 1949.

విషయము జెప్పుటయుఁ గలవు. ప్రహ్లాద, గరుడాచలములందుఁ గథా రంభమున దేవకాంతలును, రామదాసు చరిత్రమున వారకాంతలును వచ్చి తమ, యా యా కథలందలి రాజప్రశంసలు, నాట్యప్రసంగము లును సెఱపుట కాననగును. నాలుగింటను చరువులు, కీర్తనలు, పదములు, పద్యములు, సంధివచనములు, ద్విపదలు, కందార్థములు, పీలలు మొదలగునవి గలవు. కవి తన కృతులను సలక్షణముగ వ్రాయఁబోయి విలక్షణముగ వ్రాసినాఁడు. కవి యనభిజ్ఞుఁడు. అతనికి భాషాలక్షణాధికారమేమియు నున్నట్లు కానరాదు. ఉత్పల చంపకాది వృత్తములందు గణపరిగణమున మాత్రల మానము ప్రయోగించి నాఁడు. కాని యితని నాటకములు పామరజన సుబోధములై కొంత ప్రచారము బొందినవి. ఇతని నాటకము లిప్పటికిని బళ్ళారిసీమలో నాడఁబడుచుండునని శ్రీ రావిపాటి లక్ష్మీనారాయణగారు (డి. ము. కోర్టు నాజరు - గురజాల) తే. 30-6-55 న నా కొక లేఖ వ్రాసి యున్నారు.

---

95. వంకదారి బాలగురవప్ప

భల్లాణరాజు చరిత్ర ము:

(ప్రచురణ – గీర్వాణ భాషారత్నాకరము. శా. మదరాసు, 1887.)

కవి భీమునిపాడు (కర్నూలు జి. కోయిలకుంట్ల తా.) వాస్తవ్యుఁడు. వైశ్యుఁడు. ఎల్లయసెట్టికిఁ బ్రపౌత్రుఁడు. సుబ్బయకుఁ

బొత్తుఁడు. చిన్న గురువయ్యకు లక్ష్మమకుఁ బుత్రుఁడు. ఇతని భ.రా. చరిత్ర రచనాకాలము చిత్రభాను కార్తీకకృష్ణ తదియ విధువారము అనఁగా 27-11-1882 తేది.

భల్లాణరాజు కథపూర్వోక్తము. ఈకవి "మునుపటి నాటకం బులరీతు లరసి, యొనఁగూర్చి నాటక మొనరించి నాఁడ" ననెను. ఇందలి రచన నాటకోచితము. చక్కని దనవచ్చును. ప్రసిద్ధరాగతాళములలో దరువులు, పాత్రలు తెరవెడలు దరువులు, దరువులలోఁ గృతిపతియగు భీమునిపాడు భీమేశుని ముద్రలు, ద్విపదలు, పద్యములు, సంధివచన ములు, పాత్రలవచనములు (సాధారణముగ సంబుద్ధ్యంతములు, నంత్య ప్రాస ప్రచురములునై యుండును.) ఏలలు, దండకము, శోభనము, కందసీస ద్విపదార్ధములును గలవు.

---

96. వారణాసి సుబ్బరాయకవి

అనసూయానాటకము:

(ప్రచురణ :- శ్రీ వాణీనిలయ ము. శా. మదరాసు, 1882.)

కవి తిరుపతివాస్తవ్యుఁడు. మంజువాణిరామకవి శిష్యుఁడు. కృతిప్రోత్సాహకులగు దేవతపుల్లయ, పచ్చిపులుసు కామయ్యసెట్టి యనువారలే ప్రచురణకర్తలునని ముఖచిత్రముపై నున్నది. అనఁగా గవియు నప్పటివాఁడే యనుట నిశ్చయము.

గ్రంథవస్తువు. ప్రసిద్ధము. ఇది నాటకము, ప్రబంధమునని పేర్కొనఁబడినది. ఇందు ప్రసిద్ధరాగతాళములలో దరువులు, పద్యములు, ద్విపదలు, కంద ద్విపదార్ధములు, ఏలలు, సంధివచనములు, సంధిగీతములు, శ్లోకములునుగలవు. ఇందలి దరువుల చివరఁదఱుచు పైడిపాటి హరిముద్రగలదు. ఇందు పైడిపాటి నరసనమంత్రి పౌత్రుఁడును, బుచ్చనపుత్రుఁడునునగు నొకకవి (పేరు లేదు) తాను వారణాసి సుబ్బరాయకవి రచించిన కథనుగ్రహించి కొన్ని దరువులు పద్యములును జేర్చితినని చెప్పినాఁడు. (చూ. గ్రంథాది ద్విపద). ఇందలి ద్వివిధమైనరచనలలో నొకటి వేలవము, తప్పులుగలది. రెండవది కొంత మేల్తరము.

---

97. గోపాలరామదాసకవి

సీతాస్వయంవరము:

(ప్రచురణ :— ఏళుమల పిళ్ళగారి వివేకరంజనీ ము. శా., 1884)

కవి గుఱించి వివరము లెవ్వియు నిందులేవు. "పుణ్యసీమంతినీ బాలికా ప్రముఖులు చదువుకొనుట కుపయుక్తముగా రుంపుమారుత వీర బిరుదాంకిత శ్రీ రామతంవేంకట సుబ్రహ్మణ్య శృంగార కవీంద్రునిచే నవీనముగాఁగొన్ని విషయము" లిందుఁ జేర్పఁబడిన వని ముఖపత్రమునఁగలదు.

ఈకవులు గ్రంథ ప్రచురణమునాఁటివారే యైనను గావచ్చును. ఇది యుత్తయూహ. ఆధారమేమియులేదు.

గ్రంథ విషయము:— ప్రసిద్ధము. ఇందుఁబ్రసిద్ధ రాగతాళము లలో దరువులు, నడుమఁ జిన్నచిన్న వచనములు, నెడనెడఁబద్యము లును గలవు. లావణి, తొహారావరువు, గౌరీ కల్యాణము విశేష ములు. ద్విపద లేదు. యక్షగానమని వేరొక్కనఁబడినది. రచన సామాన్యముగా నున్నది.

98. వెలుగోటి వెంకట రమణయ్య

వరరుచి విజయము:

(ముద్రణ: చిత్రలిపి ము. శా., బళ్ళారి, 1886)

కవి నివాసము అనంతపురము జి. గుత్తి తా. ఉరవకొండ. దేవాంగ కులమువాఁడు. గౌరీశ్వరుల (?) పుత్రుఁడు. ఇతఁడు స్వకీయ గ్రంథస్వామ్యము చిత్రలిపి ముద్రాక్షరశాల వారికిచ్చినట్లు చేసిన ప్రక టన గ్రంథముపైఁ గన్పట్టును. కాఁగా నితఁడు 1886 లో నుండె ననుట నిశ్చయము.

గ్రంథ విషయము:— బ్రహ్మాండ పురాణోత్తరకాండ మందలి దేవల చరిత్రమునుండి గ్రహింపఁబడినదఁట. భూలోకమున శ్రుతు లప శబ్దకలితములైనవని నారదునివలనఁ శివుఁడెఱింగి దేవాంగుని మానుష వేషమునఁ దత్సంస్కరణార్థము బంపుట—అతఁడే వరరుచి—అతఁడు భోజాస్థానియై బహుశాస్త్ర పారంగత భట్టాచార్యుఁడను వానిపుత్రిఁ గళావతి యను దానినోడించి యామె నొకమూర్ఖుఁడగు బ్రాహ్మణ

బాలకునకు వివాహ మొనర్చును. అతఁడే పిదపఁ గాళిదాసుగా వ్యవహృతుఁడైన నాఁడఁట; ఇదియొక చిత్రమైనకథ. సరస గ్రథనమును సాగిపోయిన దిందు. తాళ ప్రధానములగు దరువులు, ద్విపదలు, పద్యములు, చిన్నవచనములు. అర్ధచంద్రికలు గలవు. సంవాదములెక్కువ. ఇది ప్రకటన కర్తలచే యక్షగానమని పేర్కొనఁబడినది.

---

99. బాగేపల్లి అనంతరామాచార్యులు

ఈయన 19 శ. ఉత్తరార్ధమున అనంతపుర మండలము హిందూపురము వాస్తవ్యులై, నగరి యను నూరనొక గుమాస్తా యుద్యోగమున నుండినవారై, ఆ ప్రాంతములందు హరికథోపన్యాసకులుగాఁబ్రసిద్ధి వడసిన వారఁట. వీరు యక్షగాన ప్రాయములైన హరికథలను గొన్నిటిని రచించియుండిరి. కొన్నిటిని యక్షగానము లనియు వ్యవహరించిరి. వీరికృతులు :—

1. చండ్రహాస చరిత్రము.
2. మూఁడున్నర వజ్రము.
3. అనసూయా చరిత్రము.
4. కుచేలోపాఖ్యానము.
5. సావిత్రీ చరిత్రము.
6. సుభద్రా పరిణయము.
7. శశిరేఖా పరిణయము.
8. ప్రహ్లాద చరిత్రము.
9. రుక్మాంగద చరిత్రము.
10. ఉషా పరిణయము.
11. రామాశ్వమేధము.

ఇవి యన్నియు నముద్రితములు. ఇందుఁజివరి నాల్గు లభించుట లేదు. * కడమ యేఁడింటఁ బైపట్టికలోని 3, 5, 6, 7 నం. ల గ్రంథములు మాత్రము యక్షగానములుగాఁ బేర్కొనఁబడినవి. కాని వానిలో నట్లు పేర్కొనఁబడని వానిలోనుగూడ రచనా ప్రక్రియ యొక్కఫక్కిగనే నడచినది. అన్నిట తొహారాలు, సమపాళముగా వివిధ ప్రసిద్ధకర్ణాటక హిందుస్తానీ రాగములు, (గజల్ — ఒకపార్సీ మట్టు; లావణి — ఒకమహారాష్ట్ర పదచ్ఛందము. ఇందని రాగములుగాఁ బ్రయుక్తములు), ఏకాట త్రిపుట రూపకాది తాళములలోఁ బాటలు (పల్లవి-అనుపల్లవి చరణ విభాగముతో), పద్యములు, గొన్నిట షట్పదులుమాత్రమ,కొన్నిట ద్విపదలు, గొన్నిట నవియునివియు, నొంటరెంటఁదక్కఁదక్కిన యన్నిట వచనములును విరివిగాఁ వాడఁబడినవి. అన్నిటఁ గథా వస్తువులు ప్రసిద్ధమైనవే — ఒక్క మూఁడున్నర వజ్రమునఁదక్క. అందు చరిగొండ ధర్మన చిత్రభారతము నందువలె గయోపాఖ్యాన కథ మూఁదలగా విచిత్ర కల్పన కొంతచేయఁబడినది. అల్ప దోషము లెడ నెడ నున్నను నన్ని గ్రంథములందును భాష సలక్షణమైనది. రచన చక్కనిది. శశిరేఖా పరిణయ రచన యన్నిట నుత్తమ మైనదిగాఁ దోచును. (తద్రచనా కాలము "వ్యయ సంవత్సరవై శాఖ శుక్ల గురు వాసర సంయుత దశమి" అనఁగా 13-5-1886). ఈగ్రంథము లన్నియుఁ గథాఖ్యానమునకు మాత్రమే పనికివచ్చునట్టివి. అస లందులకే యుద్దిష్టములు.

---

* కడమ యేడింటి వ్రాత ప్రతులఁ శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారి కడనున్నవి. వారు దయతో నాకు గ్రంథములెల్లఁజదువ నిచ్చిరి., కర్తృ సమాచార మెల్లఁదెలిపిరి, వారికిఁగృతజ్ఞుడఁను.

100. వారాల కృష్ణయ్య

సారంగధరచరిత్ర:*

1886 సం. న బెనుగొండ చంగయ్య ప్రచురించిన యీ సా.చ. ప్రతిలో గ్రంథకర్త తన గ్రంథ స్వామ్యమును బచురణకర్తకు స్వయముగా దత్తమొనరించినట్లు చెప్పఁబడినది. దీనినిబట్టి కవియు నా కాలమున నందుండినట్టే బుజువగుచున్నది. కవి నివాసము నృసింహపురమఁట. ఇంతకంటెఁ గవిని గుఱించిన వివరములు దెలియుటలేదు.

గ్రంథవిషయము:— ప్రసిద్ధము. ఇందుఁ బాత్రప్రవేశసూచనలు, పాత్రలు పుచ్చింపఁబడి స్వవిషయముఁ జెప్పుటయుఁగాననగును. తాళప్రధానములగు పదములు, పద్యములు, ద్విపదలు, సంధివచనములునుగలవు. ప్రధాని మొ॥ పాత్రలపదములు కొన్ని హిందూస్తానీలోఁగలవు. గ్రంథము సంవాదశైలీప్రచురము. ప్రదర్శనానుకూలము. రచనయొక మోస్తరు. యతిదోషము లెక్కువ.

---

* ప్రచురణలు:— 1. బెనుగొండ చంగయ్య, శైవ సిద్ధాంత ము శా., మదరాసు, 1885.

2. శ్రీ రామానుజ విలాస ము. శా., మదరాసు. 1926.

3. వెస్లు వార్థ్ ఆండు కో., మదరాసు. 1950

101. మోక్షగుండము సుబ్బకవి

సీతాకల్యాణము:

(ప్రచురణ :— చిత్తూరు గురుస్వామి మొదలారివారి కవిరంజనీ ము. శా. 6-7-1886)

కవి భారద్వాజగోత్రుఁడు. సుబ్బమాంబా జయరామయ్యల పౌత్రుఁడు. సుబ్బమా చలమయ్యల పుత్రుఁడు గొప్ప శాస్త్రి పండితుఁడు. కర్నూలుజిల్లా కంభముతాలూకా మోక్షగుండ్లగ్రామ వాస్తవ్యుఁడు. కాలము గ్రంథప్రచురణ వత్సర ప్రాంతమైనఁ గావచ్చును. ఇది యూహామాత్రము. ఈయూహకుఁగొంత యుపన్యాసకము రచనాప్రక్రియ.

గ్రంథము నాటకమని పేరొక్కనఁబడెను. రెండురాత్రులకథగా విభక్తము. ఇంచుమించు రామాయణ బాలకాండకథ యంతయు నిందున్నది. ఇందు విరసూత్కయగు సీతకడకు రాముఁ డెఱుకతయై వచ్చుటవిశేషము. ముఖ్యపాత్రలనుబట్టి కథలో నొక్కొక్కఘట్టమునకు "దశరథవేషము కథ, బాలింతవేషముకథ, విశ్వామిత్రవేషము కథ" — ఇత్యాదిగాఁ బ్రత్యేకశీర్షికలు గలవు. కొన్నియెడలఁ బాత్ర ప్రావేశికధ్రువలు గలవు. కొన్నియెడలఁ హాస్యగాఁడు తెరలోనున్న పాత్రలను బృచ్ఛించి తద్వృత్తాంతము చెప్పించుట గలదు. ఇందుఁ బ్రసిద్ధరాగతాళములలో, దరువులు, ద్విపదలు, కందసీసార్ధములు, పద్యములు, ఆఖ్యాన సంవాదోభయ ప్రయోజనాత్మకములగు వచనములు గలవు. దరువులలో మోక్షగుండము ముక్తీశ్వరుని ముద్ర గలదు. రచన చప్పచప్పగానున్నది. తప్పులు గలవు.

102. మైనముపాటి వీరరాఘవయ్య

బాలగోపాల విలాసము:

(ప్రచురణ:— శ్రీవాణీ వినోదమందిర ము. శా., మదరాసు, తొలికూర్పు, 1887)

కవి భరద్వాజసగోత్రుఁడు. నియోగిబ్రాహ్మణుఁడు. తండ్రి అయ్యనకవి. తాతగురుమూర్తి. ముత్తాత అయ్యన. సాంబలక్షణా విలాసకర్తయగు కామన కనుజుఁడు. గురువన కగ్రజుఁడు. గ్రంథము నాలకూరపాటి వేణుగోపాలస్వామి కంకితముచేసియుండుటచే నది యీతని నివాసము గావచ్చును. కవి కాలము నిర్ణయించుట కాధారములేదు. కాని 19 శ. ఉత్తరార్ధము వాఁడనియే శోఁచుచున్నది.

గ్రంథము మూఁడు ప్రకరణములుగా విభక్తము. 1 లోఁ గృష్ణ జననము, గోపికలతో గోడిగము, 2 లో గోపికావస్త్రాపహరణము, 3 లో గోపికాగీతలును బ్రధాన విషయములు. రచన యంత సలక్షణ మైనదికాదు. కాని కొంత సరసమైనదే. ఇందుఁ బ్రసిద్ధ రాగతాళముల లోఁగీర్తనలు, ద్విపదలు, పద్యములు (కవిచెప్పి పోతనగారి పద్యము లను గొన్నిటిని గ్రహించినాఁడు), కందార్ధములు, చిన్నచిన్నవచన ములును గలవు. సంవాదశైలి పాటింపఁబడినది. గ్రంథము యక్ష గానమని పేర్కొనఁబడినది.

103. కోకా వెంకటరామానుజులు నాయుఁడు

గజేంద్రాళ్వారు చరిత్ర:

(ప్రచురణ:— శ్రీ నికేతన ము. శా., మదరాసు, 1887)

కవి ఆదివెలమ. సీతయ్య రమణాంబల పుత్రుఁడు. కాండూరి తిరువెంగడాచార్యుని శిష్యుఁడు. రక్షకభటశాఖాధికారము నిర్వహించినవారు. 19 శ. ఉ. భా. న నుండినవారు. ఈ విషయము లాతని కృత్యంతరమగు భగవద్దీతాగర్భితభావబోధిని (రాజమండ్రి, సరస్వతీ ము. శా. ప్రచరణ 1959) నుండి యెఱుఁగనైనవి. గ్రంథవిషయము గజేంద్రమోక్షణ కథ. యక్షగానమని పేర్కొనఁబడినది కాని హరికథ, కీర్తనలు, డోరాలు, తేవారములు, వచనములును దఱచు. అక్కడక్కడ పద్యములు, (పోతనవి కొద్ది యథాతథముగ గ్రహింపఁబడినవి. కొన్ని యనుకరింపఁబడినవి.) జాతిస్వరమట్లు, తంగపాటమట్టు గలవు. రచన చక్కనిది.

---

104. యమ్మనూరి వెంకటసుబ్బకవి

ఇతఁడు ముల్కినాటి బ్రాహ్మణుఁడు. శ్రీవత్సగోత్రుఁడు. ఇతని ప్రపితామహుఁడు సర్వేశ్వరావధాని. పితామహుఁడు పరమేశ్వరయ్య. తండ్రి నీలకంఠయ. తల్లి పుల్లమ. (ఆమె ఆలూరి వేంకట రామయగారి పుత్రియఁట.) ఇతఁడు వేములపల్లె (కర్నూలు మండలము) వాస్తవ్యుఁడు. రాయలసీమలో వేములపల్లె నాటకములని

ప్రసిద్ధిగాంచిన వితని నాటకములే. అందు యన్. వి. గోపాల్ అండుకో, మదరాసువారి ప్రచురణ 1946) యగు ద్రౌపదీ కల్యాణము ముఖ పత్రము వెనుక గ్రంథకర్త స్వీయగ్రంథ ముద్రణ విక్రయాది స్వామ్య మును శా. శ. 1816 అనఁగా క్రీ. శ. 1894 సం. న బహూగు త్యాగ రాయశాస్త్రిగారి కిచ్చినట్లు గ్రంథకర్తయే చెప్పిన సీసమాలిక యొకటి గలదు. 1887లో మదరాసు శైవసిద్ధాంత ము. శా. వారు ప్రచురించిన మైరావణ చరిత్ర నాటకమునఁ దద్గ్రంథకర్తయగు బూచుపల్లె కొండయ్యయును సుబ్బకవినిఁ దన గురువుగా స్తుతించి యుండెను. అనఁగా సుబ్బకవి 19 శ. ఉ. భా. న నుండెననుట నిశ్చయము.

ఇతని కృతులు:

(1) ఉషా పరిణయము (య. గా. ప్రబంధము)

(2) విరాట పర్వము (నాటకము – రెండు రాత్రుల కథ)

(3) ద్రౌపదీ కల్యాణము (,, ,,

(యీ మూఁడును వేములపల్లె వెంకటాచలపతి కంకితములు)

(దరువులలో నా ముద్రలును గలవు)

(4) గయోపాఖ్యానము లేక కృష్ణార్జునసంవాదము | నాటకము. వెంకటాపల్లి (పత్తి కొండ తా. కర్నూలు జి.) గోపాలున కంకితము.

---

* మొదటి మూఁడును 1894 సం. న బహూరు త్యాగరాయశాస్త్రిగారి నిర్వాణ భాషా రత్నాకర ము. శా. యంత్ర ముద్రితములై. నేటి దనుక యన్. వి. గోపాల్ అండ్ కో., అమెరికన్ డైమండ్ ప్రెస్ మొదలగు వారిచేఁబునఃపునర్ముద్రితములగుచు వచ్చుచున్నవి. గయోపాఖ్యానము యన్. వి. గోపాల్ అండ్ కో వారిచే 1934, 1947 సం. లలోఁ బ్రచురితము.

ఈ కృతులన్నిట నితివృత్తము ప్రసిద్ధమైనది. ప్రసిద్ధ రాగ తాళములలో వరువులు, ద్విపదలు, పద్యములు, సంధి వచనములు (సంధి పద్యములుగూడ) వీని లోని రచనా ముఖ్యాంగములు. వచన ములో బాత్రల సంభాషణములునుగలవు. అన్నిట రచన సలక్షణము, సరసము, ప్రవర్ధనోచిత్యమునై నది. ఇవి ప్రదర్శనలకెక్కి మిక్కిలి రాణించినవి రాయలసీమ ప్రాంత యక్షగాన కవులెందఱో అర్వా చీనులేకాక సమకాలికులును సుబ్బకవిని దమ కృతులలోఁ బ్రశంసించి యుండిరి.

105. బూచుపల్లె కొండయ్య

మైరావణ చరిత్ర :

(ప్రచురణ: శైవసిద్ధాంత ము. శా., మదరాసు, 1887)

కవి తనవంశ మొకచో బూచుపల్లె యనియు నింకొకచోఁ బెడకంటి యనియుఁ జెప్పినాఁడు. పెడకంటి గంగిరెడ్డి కొమకు కొండి రెడ్డికి రామమ్మ యందు గంగిరెడ్డి, ఈ రెండవ గంగిరెడ్డికి నాగమయందీ గ్రంథకర్తయుఁ గొమకులు. గ్రంథము బూచుపల్లె పురధాముని కంకితము. బూచుపల్లి కడపజిల్లా పులివెందల తాలూకాలోఁ గలదు. అది కవి నివాసము గావచ్చును. కొండయ్య ముల్కినాటి కులీనుఁడు. వేములపల్లె వాస్తవ్యులైన సుబ్బయ కవిని దనగురువుగా స్తుతించి యుండెను. అతఁడే 19 శ. ఉత్తర భాగమున నుండిన యమ్మనూరు వెంకట సుబ్బకవి. (ఇతని యుదంతము సద్గురుపూర్వోక్తము) మఱి కొండయ్య కవియు నప్పటివాఁడే యగును.

గ్రంథవిషయము: ప్రసిద్ధము. ప్రసిద్ధ రాగతాళములలో దరువులు (బూచుపల్లె శౌరి ముద్రలతో), ద్విపదలు (రాగములతో, పద్యములు, సంధివచన పద్యద్విపదలు, దండకము సంభాషణ వచనములును గలవు. రచనలో దోషము లెడనెడఁ గలవు. ప్రదర్శనోద్దిష్టమైనది.

---

106. గుండు అద్వైత బ్రహ్మశాస్త్రి

సత్యభామా పరిణయము:

కవి కాముకాయన గోత్రుఁడు. గుండు వేంకట నృసింహుని ప్రపౌత్రుఁడు. సూర్యనారాయణ సోమయాజికిఁ బౌత్రుఁడు. వీరమాంబా ముకుందస్వాముల పుత్రుఁడు. కారుమూరు (రేపల్లె తాలూకా, గుంటూరుజిల్లా) వాస్తవ్యులైన వత్యం అద్వయ బ్రహ్మయగారి దౌహిత్రుఁడు. బుచ్చమాంబా వల్లభుఁడు. అప్పయ, యజ్ఞనారాయణ లనువార లితని పెదతండ్రులు. సూర్యనారాయణ సోమయాజి, వాసుదేవ పర బ్రహ్మశాస్త్రి యనువార లితని సోదరులు. ఈతని యక్క సెల్లేండ్లలో నొక్కతె వావిలాలవారి కోడలు రాజ్యలక్ష్మమ్మ. ఆమెయే 1887 సం. లో నన్నగారి గ్రంథమును విశాఖపట్టణము నందలి యిండియన్ లా పబ్లికేషన్ ప్రెస్సులో నచ్చువేయించి ప్రచురించినది. గ్రంథకర్త 1880 ప్రాంతమున నుండెననుట నిశ్చయము.

ఈ గ్రంథమునకు సత్రాజిన్నాటకమనియు నామాంతరము. కథావస్తువు ప్రసిద్ధము. ఇందెచ్చటను సత్యభామ గొంతు వినిపించదు.

గ్రంథారంభమున దండహస్తుఁడను (కటికమువంటి) వాఁడు ప్రవేశించి పాత్రాగమనమును సూచించును. వానిచేఁ బ్రేరింపఁబడి పాత్రలు వెరలో నుండి ద్విపదలలోఁ దమ వృత్తాంతము జెప్పుటయు, మఱల నదేవిషయము పాత్రముఖముగాఁ దెరవెడలు దరువులలోఁ బ్రసక్త మగుటయుఁ గలదు. ఒక్కొక పాత్ర ప్రవేశమున కొక్కొక ప్రత్యేక శీర్షిక – "సత్రాజిత్తు వేషం కథ" ఇత్యాదిగా. గ్రంథము నాటకీయతా ప్రకర్షము. రచన చక్కనిది. ప్రసిద్ధ రాగ తాళములలో సంవాదపు దరువులు, సంధిదరువులు, సంధివచనములు, ద్విపదలు, ఏలలు, కంద సీసార్ధములు, పద్యములు గలవు. ద్రావిడ గీత ప్రబంధవిశేషమగు తేవారము ద్వివారము ప్రయుక్తము. గ్రంథముఁ యక్షగానమని వేర్కొనఁబడినది. మంగళగిరి నృసింహస్వామి కంకితము. (కుసుమ కోమలీ నాటక మొకటి యితని కృతియని గుండు అచ్చమాంబగారి "సంపెగ" అను గ్రంథము అట్లుపై గలదు. అది యక్షగానము అగునేమో!)

ఏతద్గ్రంథ పరిష్కర్తయైన ధూళిపాళ కృష్ణకవి ధ్రువనాటకము, కుసుమకోమలినాటకము మొ॥ రచించెనని ముఖపత్రముపై గలదు. ప్రాయికముగా నవి య. గా. లై యుండఁబోలును.

107. వరిగంటి వేంకటరమణదాసు

దండధర విలాసము:

(ప్రచురణ:— గ్రంథకర్తచే ముద్రణవిక్రయాధికారములు పొందిన సరస్వతీ తిరువేంకటాచార్యులచే నెల్లూరు సరస్వతీ నిలయ ముద్రాక్షరశాలయందు 1887 సంలిన ముద్రితము)

కవి నివాసము నెల్లూరుమూలపేట "శ్రీమద్రామాయణ భాగవత జగన్మోహనకృష్ణ విలాస రుక్మిణీ కల్యాణ కుచేలోపాఖ్యాన ధ్రువచరిత్రాజామిళోపాఖ్యానాద్య భిధాన యక్షగాన నిర్మాణప్రవీణుండు, శ్రీవత్సగోత్రోద్భవుండునునగు శేషగిరిదాసు పుత్రుండు" డీతడు. (శేషగిరిదాసు చరిత్ర పూర్వోక్తము – చూ. నం. 84). ఇతని కాలము 1887 ప్రాంతమగుట స్పష్టము.

ఈదండధర విలాసమునకే వికటనాది చరిత్రమని నామాంతరము. ఇది గరుడ పురాణాంతర్గతమైనది. ఇందలి రచన సలక్షణము, చక్కనిది. ఇందు వివిధ రాగతాళములలో దరువులు, డోరాలు, పద్యములు, కందార్ధములు, రగడ, వచనములును గలవు. కవి దీనిని ప్రబంధమని మాత్రమ పేర్కొనెను. ప్రకటనకర్తలు యక్షగాన మనిరి. కవి తనతండ్రిగారి కృతులను యక్షగానములని పేర్కొనెను. ఇదియు నట్లనేయున్నది. కాని యుభయుల కృతులను హరికథా ప్రాయములై నరచనలు.

108. కేశిరాజు వెంకట సుబ్బరాయ కవి

రామదాసు నాటకము:

(ముద్రణ:— రాజన్ ప్రెస్, రాజమండ్రి, 1927 ప్రచురణ కర్త:- తమిరిశ వేంకట రమణారావు)

కవి ఆపస్తంబ సూత్రుడు. హరితసగోత్రుడు. ఆర్వేల నియోగిబ్రాహ్మణుడు. కేశిరాజు సీతాంబా పట్టాభిరామామాత్యుల పౌత్రుడు. కామాంబా ఫుల్లమరాజుల పుత్రుడు. ఆచంట రాజ లింగామాత్య దౌహిత్రుడు. లక్ష్మీసుబ్బరాయని కనుజుడు. కవి నివాసము రాజమహేంద్రవరమున కనతి దూరమున నున్న మలకపల్లి. వృత్తిచే నుపాధ్యాయుడు. ఈయన జననము 1858 సం. ర ప్రాంతము. మరణము 1899 సం. రామదాస నాటక రచన "కలియుగాది నవాష్ట ఖచరాబ్ధి సంఖ్య – 4989." అనగా క్రీ. శ. 1888. ఇతని కృత్యంత రములు:— సర్వేశ్వర వేంకట రమణ శతకము, వేంకటేశ్వర తారా వళి, చోర చరిత్రము అను తిరుమంగయాళ్వారు చరిత్ర, భద్రాద్రి రామాయణము, ఏకాదశీ మహిమా సర్వస్వము — (ఈ విషయము లెల్ల గ్రంథావతారికలోని యొక ద్విపద వలనను గ్రంథమునకు గ్రంథ కర్త పుత్రులును, రాజమహేంద్రవర వాస్తవ్యులైన శ్రీ కేశిరాజు సత్యనారాయణగారు తే. 20—11—1926 న రచించిన పీఠిక వలనను నెఱుగనైనది.)

గ్రంథ పీఠికలో నీ రామదాస నాటకము గుఱించి యిట్లున్నది. "ఇది సర్వధార్యబ్దమున ననగా 1838 వ సంవత్సరములో గవి ముప్పది యొకటవ యేట వ్రాసిన పద పద్యాత్మక మగు యక్షగానము.

ఇది యిప్పటి నాటకములవలె వ్రాయు నభిప్రాయముతోఁ గవి 1889 వ సంవత్సరములో నారంభించి ప్రాత నాటకమంచలి కొన్ని భాగములు స్వీకరించి కొంతవఱకు రచించు నప్పటికి వ్యాధిగ్రస్తులై పరలోకగతులైరి. ఆ వ్రాసిన కొంత భాగమును అనుబంధముగాఁ జేర్చఁబడినది''. ఆ యనుబంధములో నాందీప్రస్తావనలు గలవు. ప్రస్తావనలోఁ బాల్గొన్నవారు సూత్రధార, వైతాళికులు, చోపుదారు. అందు నాయికా నాయక పాత్రల పరిచయమును గలదు. నాట కారంభమున నొక కథాసంగహా సీసము. పిదపఁ జోపుదారు పాత్ర ప్రవేశిక ధ్రువ, "ఖామూష్, సైలెన్సు" ఇత్యాదిగా వాని ప్రసంగమును గలవు. "కట్టియం" (ఆ చోపుదారే) ఒక సంధి వచనమున నెవరి చేతనో (బహుశా ప్రదర్శక ముఖ్యుఁడెవడో యై యుండును) పృచ్ఛితుఁడై తాను తానిషా రాకను సభవారి కెచ్చరింప వచ్చితి ననును. తరువాత తానిషా తెరలోనుండియే "వినుఁడు మామక వంశ విస్తార మెల్ల" నని యొక ద్విపద నెత్తుకొనును. త॥ "వెడలి వచ్చె నిదిగో తానిషా భూవిభుఁ" డని దరువు. రామ దాసాది పాత్ర ప్రవేశములు నిట్లే. ఇందు రామదాసుతోఁ బ్రసంగించిన ద్వారపాలకుఁడు తంజా వూరి కటికము వలెనే ప్రవర్తించును. ఎఱుకలసాని పాత్రకుఁగూడ నిందుఁబ్రసక్తి గలదు. ప్రసిద్ధ రాగ తాళములలో దరువులు, కందార్ధ ములు, పద్యములు, నన్నిటికంటె నెక్కువగా నచన భాగము, నందులో నాధునిక నాటకములందలి వాకో వాక్యపద్ధతియు నున్నవి. ఈ నాటక మైదంకములుగ విభజింపఁబడియున్నది. అంకము లనేక రంగములుగ విభక్తములు. కాని "ఈ గ్రంథమూలమగు చిత్తు ప్రతి యందు అంకరంగ విభజనము గాని, ప్రవేశ నిష్క్రమణములు గాని లే" వని పీఠికాకారు లనియున్నారు. ఇది యంతయుఁజూడ నిది మొదట యక్షగానముగనే రచింపఁబడి, పిమ్మట నాధునిక నాట

కముగాఁ బరిసమాప్తింపఁబడుటకుఁ బ్రయత్నము జరిగిన మనుట స్పష్టము. అది యప్పటి కపుడే తెనుఁగుగడ్డపై డేరావేసిన ధార్వాడ నాటక సమాజము వారి ప్రదర్శనల ప్రభావమును సూచించును.

గ్రంథ విషయము:— ప్రసిద్ధమగు భద్రాచల రామదాసు చరిత్రము. ఇందలిరచన మిక్కిలి చక్కనిది.

— —

109. కురుచేటి సుబ్బరాయకవి

గౌరీశంకరవిలాసము:

కవి విశ్వకర్మ వంశ్యుఁడు. సువర్ణగోత్రుఁడు. నాగలింగయ పుత్రుఁడు. అనుమలగిరి శివరామయ శిష్యుఁడు. గ్రంథము "గ్రంథ కర్తచే శ్రీరంగనాయకీవిలాస ముద్రాక్షరశాల యందు ముద్రింపించి ప్రచురింపఁబడియె. నెల్లూరు, 1889 సం." అని ముఖపత్రముపై నున్నది. కవి 1889 సం. న నుండినాఁడనుట నిశ్చయము. ఏతత్కృతి ప్రోత్సాహకుఁడు మినగంటి పురవాసి బండిమల వీరరాఘవరెడ్డి.

గ్రంథవిషయము:— శివుని దారుకావన విహారము, నారదుని వలన సంగతి తెలిసి గౌరి యలుకచిత్తగించుట - అక్కడినుండి తలుపు కడ గౌరీశంకరుల సంవాదములు, చివరి కిరువురును సమాధానపడుట., రచనదోష బహుళమైనది. ఇందు శేహానా, దర్బారు, కమాసు మొ. హిందూస్తానీరాగములలో, అటాదితాళములలో వర్ణమెట్లు (వరుసలు) గల దరువులు, ద్విపదలు, పద్యములు, వచనములు కందార్ధములు

ఏలలు, (ఏలలందును సంవాదముండుట విశేషము, జావళి తంగం మొ. రచనా విశేషములునుగలవు. సంధిద్విపదలును గలవు. సంవాదశ్లోకిం బ్రాచుర్యమెక్కువ. యక్షగానమని పేర్కొనఁబడినది.

---

110. పడకండ్ల స్వామిరాయకవి

లక్షణా పరిణయము:

(ప్రచురణ:— జ్ఞానసూర్యోదయ ప్రెస్., మదరాసు.) (1892)

కవి ప్రథమశాఖ నియోగి. కాశ్యపసగోత్రుఁడు. నరసయ మంత్రి ప్రపౌత్రుఁడు. అన్నమరాజ పౌత్రుఁడు. అక్కిరాజు పుత్రుఁడు. తల్లి లక్ష్మమ్మ. చాపరాజు, పెదతిమ్మరాయుఁడు, చిన తిమ్మయ యను వారలితని సోదరులు. వీరదేశికుఁడితని గురువు. పడ కండ్ల (నెల్లూరుజిల్లా, ఆత్మకూరు తాలూకా) కరణిక మితని వృత్తి. ఇతఁడీ గ్రంథమును విరోధి సం. చైత్రమున రచించినట్లు చెప్పి యున్నాఁడు. ఈవిరోధి 1889 లోఁ బడిన విరోధియే కావచ్చును.

కవి "పరగలక్షణ కన్యకా పరిణయంబు, నాటకము జేసి యాడించినాఁడ జగతి" నని యున్నాఁడు. అంతేకా దొకవిశేషము— గ్రంథ మధ్యమున (పుటలు 28-29) "యీవన లక్షణ కన్యక వేషము గట్టిన నాయకి" వక్కాణ యొక టిట్లున్నది.

"గోను దిన్నె రామాయణకథలజ్ఞైన
బుగ్గసాని యటందురు భువిని జనులు
ఘనత లక్షణ వేషము కవియ నాకు
నాజ్ఞచేయఁగఁ గట్టితి నార్యులార"

అంతేకాకకవి "ఊర్మిళనొనర్చి నటకులన్ రప్పించి పుత్రవాత్సల్య భద్రిమాసంబులు తనగ్రామంబున నిల్పి భోజనక్రియలనొసంగి కథలన్ నేర్పించి వేషంబులకు వలయు గణియంబులను, వస్త్రంబులను నొసంగిన మన్ననకు చంద్రునిన్ స్తుతింతు" నన్నది బుగ్గసాని. అట్టిదట కవి యభినివేశము. గ్రంథము నాటకీయతా ప్రకృష్టమని వేఱు చెప్పనక్కఱలేదు. ఇందును పాత్రప్రవేశసందర్భములందుఁ దత్పరిశేషాత్మకముగా ద్విపదలును దరువులును గలవు. గాని యవి పాత్రముఖమునఁ బఠింపఁబడునవికావు. నాటకారంభమున దఫేదాసు (కటికమువంటి వాఁడు) హిందీ ప్రసంగములు గలవు. ప్రసిద్ధ రాగతాళములలో దరువులు, జావిళులు, ద్విపదలు, పద్యములు, కందగీతార్ధములు, సంధివచనములు, వచనములలో సంభాషణలు దండకము మొ. గలవు. కథ ప్రసిద్ధమైనది. రచన సలక్షణము సరసము నైనది.

---

111. చదలువాడ సూర్యరామకవి

గ్రంథోపాఖ్యానము:

ప్రచురణ :— 1889 సం. న. వీరరాఘవ ముద్రాక్షరశాల (నెల్లూరు?) యందు శిక్షాలాధికారులు "సదరు గ్రంథకర్తచే గ్రంథస్వాతంత్ర్యము బొందిది" నట్లు ముఖపత్రమునఁగలదు. అనఁగాఁగవి 1889 లో నుండిన వాఁడనుటస్పష్టము). కవి చదలువాడ లక్ష్మీవాచ్యుత రామయ్యలకుఁ బౌత్రుఁడు. సుబ్బలక్ష్మీ సుబ్బరామయలకుఁ బుత్రుఁడు. గ్రంథమున అనంతపురవర కవిపురధాముల ముద్రలు గలవు. నెల్లూరు తాలూకాలో "అనంతవరం నరకవిపూడి" యను నొకయూరు గలదు. కవి నివాస మదికావచ్చును.

కవి యీగ్రంథమును గేయప్రబంధమనియున్నాఁడు. గ్రంథము మూఁడుల్లాసములుగావిభాగింపఁబడినది. మూఁడుల్లాసములును మూఁడు రాత్రులకథలుగాఁ బేర్కొనఁబడినవి. అనగా నిది ప్రదర్శనోద్దిష్టమను టలో సందేహములేదు. ప్రచురణకర్తలు దీనిని నాటక మనియే పేర్కొనిరి.

ఇందుఁ బ్రతిపాత్రయు స్వవిషయము నుగ్గడించుటయు, సూత్రధార పృచ్ఛితమై తెరవెడలుటయుఁ గలదు. పాత్ర సంవాదములు హెచ్చుగనే గలవు. ఇందు ద్విపదలు, ప్రసిద్ధరాగతాళములలోఁ బల్లవి యుక్తములుగా దరువులు, పద్యములు, నర్ధపద్యములు, సంధి వచనములు, ఏలలు, దండకము చూర్ణికయును గలవు. ఇందలికథ ప్రసిద్ధమైనది. రచన సలక్షణమే కాని సామాన్యమైనది. తప్పులు తక్కువకాని ప్రౌఢియుఁ దక్కువ.

---

112. ఊప్పులూరి కనకయ్య దాసు శ్రీరాములు

ఈజంటకవులరచన సాత్రాజితీవిలాసమను భామకలాపము * వీరు రువురు 19శ. ఉ. భా. ని నుండినవారు. ఇరువురును సన్నిహితజ్ఞాతులు. ఇందు దాసు శ్రీరాములుగారు సుప్రసిద్ధులు, దేవీభాగవతాది బహు

---

* 1873 సం.న వ్రాయఁబడిన దీనికాగితపుఁ బ్రతియొకటి యీకవుల సన్నిహితజ్ఞాతులలో నొకరగు శ్రీ బండా కనకయ్యగారికడ (వీరు నేఁడు గుడివాడలో వకీలు వృత్తియందున్నారు) నున్నది. దయతోనా కాప్రతిఁ జూడనొసంగినవారికిఁ గృతజ్ఞుఁడను.

గ్రంథకర్త. వీరితండ్రికన్నయ్యమంత్రి, అల్లూరి (బండరుతాలూకా) కరణము. (శ్రీ) మధునాపంతులవారి ఆంధ్రరచయితలలో వీరిచరితము చూడదగును). కనకయ్యగారి తండ్రి మల్లయ్యమంత్రి.

ఈకవుల భామకలాపము రచన కూచిపూడి భా. క. బాణీ నున్నది. రచన మిక్కిలిప్రౌఢము సరసమునైనది. కాని యలసములైన హాస్యప్రసంగములు కొన్ని కావ్యోచితిని దిగనార్చుచున్నవి.

---

113. కడియాల వీపూరిఆచారి

పోతులూరి వీరబ్రహ్మము నాటకము:

(ముద్రణ :— పమ్మి త్యాగరాయ సెట్టిగారి ఆనందభారతి ము. శా., మదరాసు, 1948. ప్రచురణకర్త:—పరిమి వీరాచార్యులు.)

ఈగ్రంథమును పరిమి వీరాచార్యుల కోరికపై కొండశంకర కవి కొంతయుఁ గడియాల వీపూరి ఆచారి కొంతయునుగా రచించిరఁట. వికృతి సం. న గ్రంథరచన ముగిసినదని యున్నది. గ్రంథప్రచురణ కాలమునకు ముందటి వికృతి 1890—91 సం. లలోఁ బడినది. గ్రంథ రచనాకాలమదే కావచ్చును. వీపూర్యాచారి విశ్వకర్మకులజుఁడు. కశ్యపసగోత్రుఁడు. తలిదండ్రులు మహాలక్ష్మి, మల్లయ. నివాసము వినుకొండసీమలోని పోట్లూరు.

ఇందుఁ బ్రసిద్ధుఁడగు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాశ్రయించిన దూదేకుల సిద్ధయ్యచరిత్రము ప్రధానవిషయము. రచన యొక మోస్తరు. దరువులు మొదలగు యక్షగాన రచన సజ్జంతియుఁగలదు. గ్రంథము 'నాటకాలంకార సాహిత్య' మని పేర్కొనఁబడినది.

(ఈ కవి నిజలింగ చిక్కయ్య నాటకమునుగూడ రచించినట్లు "బ్రిటిష్ మ్యూజియమ్ లైబ్రరీ కేటలాగు" వలనఁ దెలిసినది. గ్రంథము నాకలభ్యము.)

---

114. మద్దిరాల వెంకటరాయకవి

ఏకాంత సేవా విలాసము:

(ప్రచురణ :— శైవసిద్ధాంత ము. శా., మదరాసు, 1891.)

కవి భారద్వాజసగోత్రుఁడు. వెంకటలక్ష్మీ నాగనార్యుల పుత్రుఁడు, పీఠపురవాసి. 19 శ. ఉ. భా. వాఁడు కానచ్చునని యూహామాత్రము.

ఏకాంతసేవ విషయము పూర్వోక్తము (చూ. ఇందలి 102 వ కవి యుదంతము). ఇందలి నాయికా నాయకులు గౌరీ కుక్కుటేశ్వరులు. గంగపాత్రునుగూడ ప్రసేశపెట్టి సవతికయ్యము గల్పించినాఁడు కవి. ఇందు దరువులు, పద్యములు, శ్లోకములు, చూర్ణిక, ద్విపద పలు రకముల పాటలును గలవు. నిర్వచనము. రచన ప్రౌఢము, మధురము, మనోహరము. ఇది "మద్దిరాల వెంకటరాయ కవివర్యులచే యక్షగానముగ రచింపఁబడి" నది యని ముఖపత్రమున మాత్రము కలదు. అసలు యక్షగానరచనా ప్రక్రియ కొంత గలదు.

115. నగళ్లపాటి సుబ్బదాసు

యామినీ పూర్ణచంద్రోదయము :

(ప్రచురణ న్యూట్రల్ ము. శా., బళ్ళారి, 1891.)

కవి తలిదండ్రులు చెంచుమాంబా బుచ్చయ్యలు. నివాసము రాయలసీమలోని జంబులమడుగు. కాలము 1891 ప్రాంతము (గ్రంథ ముద్రణ ప్రశంస నితడు చేసియున్నాడు. ముద్రణకాలమున గ్రంథ పరిష్కర్తయు నితడే)

బిల్హణకవిచరిత్ర మిందు వర్ణితము. గ్రంథము యామినీ పూర్ణ చంద్రోదయము కాని రచన బహుదోషాకరము. గ్రంథారంభమున గణపతి సరస్వతుల స్తుతులుగాక "విఘ్నేశ్వరుని వేషం రావడం", "సరస్వతి వేషం రావడం", విఘ్నేశ్వరునితో హాస్యగాడు ప్రసంగించుట మొ॥ అంకాలి విశేషములు.

116. కోట వెంకటప్పయ్యశాస్త్రి

బాణాసుర నాటకము :

(ప్రచురణ :— ఇండియన్ లా ప్రెస్., మదరాసు, 1894.)

కోట సాంబయ్య కొడుకు వెంకటశాస్త్రి. అతనికి దత్తుడు నరసింహామూర్తి. నరసింహామూర్తికి జిట్టివల్లమ్మయందు వెంక

టప్పయ్య, సత్యనారాయణ, సాంబమూర్తి యని మువ్వురుపుత్రులు. అం దగ్రజు డీగ్రంథకర్త. ఇతని నివాసము పాతపట్టణము (శ్రీకాకు ళము జిల్లా. గ్రంథమును "పదియు నెనిమిదినూర్ల తొంబదియు మూఁడు సంఖ్యగల వత్సరమునందు సరభసమున మే నెలాదిని వ్రాయఁగాఁ బూనినాఁడ" ననున్నాఁడు గ్రంథకర్త. అనఁగా 1893 సం. గ్రంథరచనాకాలము.

గ్రంథవిషయము ప్రసిద్ధము. కవి "బాణాసుర నాటకమను నీ గేయ ప్రబంధము చర్మ విగ్రహము చే నాడించుటకును, వేషముల ధరించి నాటకమాడుటకును అనుకూలముగ నుండునటుల రచింపుఁడని నా మిత్రులొక కొందఱు ప్రోత్సాహపరచినందున నేనందుల కియ్య కొంటి" ననియున్నాఁడు. ఇందలి లొట్టకిత్తడు, రత్నాలు, పోలిగాఁడు నను పాత్రలు తోలుబొమ్మలాటలోఁ బ్రసిద్ధులైన కేతిగాఁడు, బంగా రక్క, జుట్టుపోలిగాఁడు ననుపాత్రలవంటివి. ఇందుఁ బ్రసిద్ధ రాగ తాళము లలో దరువులు, ద్విపదలు, పద్యములు, సంధి ద్విపదలు, సంధి వచన ములు, వచనములలో సంభాషణలును గలవు. అమర శ్లోకోదాహరణ ములు గలవు. సమాసభూయస్త్వము గల వర్ణన పద్యములకు వచన వ్యాఖ్యానములు గలవు. సంవాదశైలి ప్రచురముగా నాటకీయతా ప్రకృష్టముగా నున్నది. కవి విదగ్ధుఁడేకాని పామర సామాజికుల నుద్దేశించి రచించినట్లున్న దీగ్రంథము. ఉదాత్త పాత్రల ప్రసంగము లైన నుదాత్తముగా లేవు.

117. ఓగిరాల పాపయ్య

రామనాటకము :*

కవి విశ్వకర్మ కులజుఁడు. ఉప్పవేలూరు పురనివాసి. భాస్కర రామాయణానుసారముగా నా పట్కాండలును "నాటక యక్షగానం బుగా" 1852 సం. న రచించినాఁడఁట. అందు బాలారణ్యకాండలు మాత్రమే ముద్రితములు. రెండును ప్రదర్శన ప్రతిష్ఠలు గాంచినవని తెలియుచున్నది. అందు బాలకాండము నప్పటి మచిలీపట్టణము గార్సన్ జే. పటాలము 42 వ రెజిమెంటువారు పదునాల్గు సం. లు ప్రదర్శించి రనియుఁ బ్రచురణకర్త యిందుఁగొన్ని క్రొత్తవిషయము లును, తెర దరువులును జేర్చినట్లును బ్రచురణకర్త పీఠికవలనఁ దెలియు చున్నది. బాలకాండలో విష్ణ్వీశ్వర వేష ప్రవేశము, ఆస్థాన సంతోషి, మంత్రసాని మొ॥ పాత్రల ప్రసంగములును విశేషములు. అరణ్య కాండమున నాశ్వాస విభాగము విశేషము. రచన యొక మోస్తరు.

---

* బాలకాండ ముద్రణ వివరములు తెలియవు. ప్రచురణకర్త పైడిపాటి సుబ్బారాయడు. గౌతమీ గ్రంథాలయమున నొక 'కాపీ' గలదు.— నం. 181. (గ్రంథ రచనా కాల మిందు పేర్కొనఁబడినది.) ఇందు ప్రక్షిప్తభాగము కొంత గలదు.

ఆ. కా. ముద్రణ:— హిందూ రత్నాకర ము. శా., మదరాసు. 1895. దీని ముఖ పత్రమున గ్రంథకర్తయే స్వయముగా గ్రంథ స్వామ్యమును శివునూరు వీర మల్లయ అను నతనికిచ్చినట్లు గలదు. గ్రంథాంత ద్విపదలో మద్దాల కాశీపతి ఆచారి యను నతఁడీ గ్రంథప్రచురణకుఁ గారణభూతుఁడని చెప్పినాఁడు కవి.

118. శ్రీ రా జా మృ త్యు ం జ య నిశ్శంక బహా దు ర్

"శ్రీమన్నా రాయణమూ ర్తివారి శుభదశావతార లఘునాటక రూపక యక్షగానము."

(ప్రచురణ :— ఆర్షముద్రాశాల, విశాఖపట్టణము, 1897.)

గ్రంథక ర్త సంగమనలస (శ్రీకాకుళం జిల్లా పార్వతీపురము తాలూకా) జమీందారు. నిశ్శంక వంశ్యులు (ఓడ్రక్షత్రియులు). వేంకటభూపాల పౌత్రులు, సన్యాసాంబా పెద్దనృపాలపుత్రులు. బహు శ్రుతులు, బహుకృతి ప్రణేత. వీరి రాజ్యకాలము 1850 — 1907. వీరి కృత్యంతరములు :— భూపతిపరిపాలన దర్పణము, శంభు శతకము, గౌరీవివాహము (పదము), "శ్రీవేషధారు లచ్చెరువడఁ బారిజాత మను భామా కలాపము రచించె" (ఇది లభ్యము కాలేదు). (ఈ విషయములు వీరియాస్థానకవి శిరోమణులగు కీ. శే. తనికెళ్ల ప్రకాశశాస్త్రి గారి నిశ్శంకవంశమను కావ్యమునుండి యెఱుఁగనగును).

వీరిగురువర్యులు ప్రసిద్ధులైన శ్రీ పరవస్తు వేంకటరంగనాథాచార్యులు. వారే గ్రంథప్రచురణకర్తలు. (ఆర్షముద్రాశాల వారిదే).

నిశ్శంక సీతమాంబ రచించిన దశావతార కీర్తనల ననుసంధించి కందగీత వద్యములు, నలంకారము లనుపేరఁ గొన్నిచేర్చి జయవిజయ మహావిష్ణు ప్రశ్నోత్తర ప్రశంసాత్మకముగా నొక్కొక్క యవతారకథ చెప్పినారీ గ్రంథమును మృత్యుంజయప్రభువు. రచన సరళము, సలక్షణము నైనది.

119. రఘునాయకం రావానుజసూరి

కన్యకా విజయము:

కవి చెన్నపురివాసి. రఘునాయకం తెన్నరంగంసుపౌత్రుడు. అళగరయ్యకు జియ్యమాంబకుఁ బుత్రుఁడు. కృతి ప్రోత్సాహకుఁడు బరంపురం వాస్తవ్యుఁడగు ఆత్మకూరి చిట్టిరామయ్యశ్రేష్ఠి. (కృతికర్తృ ప్రేరకుల వంశచరిత్రము గ్రంథమున విపులముగాఁగలదు.) ఈ చిట్టిరామయ్యగారి యల్లుఁడగు కల్లేపల్లి కృష్ణమూర్తి గ్రంథ ప్రచురణకర్త. గ్రంథ ముద్రణము విశాఖపట్టణము శ్రీ శారదా ముకుటము. శా. లో 1898 సం. న జరిగినది. కవి 19 శ. ఉ. భా. న నుండె ననుట నిశ్చయము. ఇతఁడు కవి మాత్రుఁడుగాక రాజసభాసన్మానము లందిన గాయకుఁడఁట. నలచరిత్ర, గజేంద్ర మోక్షము, ధ్రువచరిత్రము నను నింకొక మూఁడు యక్షగానములను రచించెనని యీ గ్రంథావతారికలోఁగలదు. కాని యవి లభ్యములు కాలేదు.

ఈగ్రంథమును ఇటికెల తిమ్మయ కన్యకా చరిత్ర యు. గా. వలె భాస్కరాచార్యోపజ్ఞమైన వైశ్యపురాణము ననుసరించినదే. దానివలె నిదియు నెనిమి చాశ్వాసములుగా విభజింపఁబడినది. ఇందు దరువులు, పద్యము, అర్ధపద్యములు, ద్విపదలకు మాఱు తోహారాలు, గౌరీ కల్యాణము మొ. గలవు. రచన శ్రవ్యధోరణి నున్నది. అల్పదోషములున్నను ప్రౌఢమైనదే. తిమ్మయకృతిని మించి యున్నది.

---

120. గాయకవాడ పెద్దన

ఇతఁడు మహారాష్ట్రగాయకవాడ వంశజుఁడు. కాశీవసు గోత్రుఁడు. ఆపస్తంబ సూత్రుఁడు. నాగయామాత్యపుత్రుఁడు. మెట్ల వారిపాళెం వాస్తవ్యుఁడు. నలచరిత్ర యను జంగముకథ, నలచక్రవర్తి నాటకాలంకారము, హరిశ్చంద్ర నాటకము ననునవి యితని కృతులు. ఇందు రెండవది 1893 లో మదరాసు పమ్మి అరుణాచల సెట్టిగారి శ్రీ వెంకటేశ్వర ము. శా. యందు ముద్రితము. ముఖ పత్రమ్మునై నున్న "కాపీరైటు" ప్రకటనలోఁ బ్రచురణకర్త యీ గ్రంథ స్వామ్యమును గ్రంథకర్త నుండియే గ్రహించినట్లు గలదు. అనఁగా బెద్దన 1898 లో నుండె ననుట స్పష్టము. న. చ. నాటకాలంకారము మాల్యాద్రి లక్ష్మీనరసింహుని కంకితము. ఇం దాశ్వాస విభాగము, గ్రంథాదిని గణపతిని, కథాఖ్యాత శ్రోతలగు బృహదశ్వ ధర్మరాజు లను బాత్రలవలెఁ బ్రవేశపెట్టుటయు విశేషములు. హరిశ్చంద్ర నాటకము వెలిగండ్ల (పొదిలి తా. నెల్లూరు జి.) నివాసి తోట రామ నాయని పోత్సాహమున రచింపఁబడినది. (తత్ప్రచురణ:— అమెరికన్ డైమండు ప్రెస్, మదరాసు, 1928). రెండింటను వస్తువు ప్రసిద్ధము. రచన యొకమోస్తరు. తప్పులు గలవు. య. గా. 'బాణీ' గలదు. వచనములందును సంభాషణలు గలవు.

---

121. గొ ము చ్చు అ బ్బ య దా సు

ఇతఁడు "నెల్లూరు జిల్లా కావలి తాలూకా చింతలదేవి పోష్టు మట్లిగుంట గ్రామ నివాసియగు గొట్లెముచ్చు రంగదాసు సుతుండగు అబ్బయదాసు" (ఇవి అతఁడు వ్రాసికొన్న గ్రంథాంత గద్యలందున్న ముక్కలే). పంచమకు) వైష్ణవుఁడు. తాను గాయకవాడ పెద్దన శిష్యుఁడనని కంతోక్తిగా దన గ్రంథములన్నిటఁజెప్పినాఁడు. గాయకవాడ పెద్దన 1898 ప్రాంతమున నుండినట్లు మీఁద నిరూపింపఁబడినది. అతని శిష్యుఁడీతఁడీ 20 వ శతాబ్ది పూ. భా. (పూర్వభాగమున) న నుండి యుండును.

ఇతని కృతులు :— 1. వీరవిజయ విలాసము (వెలిగండ్ల), 2. శశిరేఖా పరిణయము (మట్లిగుంట), 3. ద్రౌపదీ కల్యాణము (చీమల పంట), 4. సుందర సైంధవ గార్దభ పరాభవ నాటకము (ఆదిమూర్తిపురము). నాల్గును నెల్లూరు మండలమందలి యీయూ గ్రామములలోని "కామందు" ల ప్రోత్సాహమున రచింపఁబడినవి. నాల్గును మదరాసు వెట్లు వార్డు వారిచే అమెరికన్ డైమండ్ ము. శా. యందువరుసగా 1937, 1949, 1953, 1953 వ సం.లలో ముద్రితములై ప్రచురింపఁబడినవి. శశిరేఖాపరిణయము 1949 సం. ప్రతి యీఁబడ కూడదు. అనఁగా నీగ్రంథము లంతకుఁజాల సం. లు ముందే ముద్రితములై ప్రతులు చెల్లిపోయినవని యూహింపనగును. ఇతని సు. సై. గా. ప. గ్రంథమున అ. డై. ప్రెసు అధికారియగు వేలూరి కుప్పు స్వామి ప్రశంస గలదు. ఈ కృతి చతుష్టయేతి వృత్తములును ప్రసిద్ధములు. నాల్గును నాటకములని పేర్కొనఁబడినవి. కాని సమకాలికపు యక్షగానముల "బాణీ" నున్నవి. రచన బహుదోషములు గలది.

---

122. గొన్నాబత్తుల అమ్మనార్యుఁడు

బిల్హణీయ నాటకము:

కవి విశ్వకర్మ కులజుఁడు. మణిభద్ర గోత్రుఁడు. సన్యాసి పౌత్రుఁడు. చిట్టెను వీరయోగులకుఁ బుత్రుఁడు. శ్రీమదభహార గొడవర్తి శోభనాద్యాచార్యుని శిష్యుఁడు. కృతిపతి గానుగుల పెద్దయార్యుఁడు. గ్రంథము "కృతిపతియగు పెద్దనార్యునిచే విశాఖపట్టణంబున శ్రీ శారదామకుటము. శా. లో ముద్రింపించి ప్రచురింపఁబడియె" నని ముఖపత్రము. ప్రచురణ వత్సరము 1901. కాని విశాఖపట్టణమునఁ గృతిసమర్పణ మహోత్సవము 1884 లో జరిగెనని గ్రంథముచివరనున్న తద్విషులవర్ణన సందర్భమునఁ గలదు.

గ్రంథవస్తువుప్రసిద్ధము. ఇందు సంస్కృత నాటకములందువలె సక్రమమైన నాందీప్రస్తావనలు గలవు. సూత్రధారప్రవేశక్తిగ్రంథమధ్యమునను గలదు. సంధివచనములు తఱచు. సూత్రధారుఁడు కథాకథనమొనర్చుచుండును. అక్కడక్కడ తక్కిన రచనాప్రక్రియ యంతయు యక్షగానపుఁ "దరహా"కుఁ జెందినట్టిదే. కవి మంచిపండితుఁడు. కండగల రచన చేసినాఁడు.

---

123. పెమ్మరాజు వెంకటరాజు

సుందరకాండము :

(ప్రతులు :— ఆం. సా. ప, నం. 3038, ప్రా. లి. పు. భాం., నం. ఆర్. 1470)

కవి యూర్వేలనివాడు. కౌండిన్యసగోత్రుఁడు. బ్రహ్మన్న పుత్రుఁడు. కవి కాలము నిర్ణయించుటకుఁ బ్రబలాధారము లేదు. ఆం. సా. ప. లోని కొర్నిపాటి ప్రతి చివర లేఖకుని వ్రాఁతలో అక లంక రంగాచార్యులు పేర్కొనఁబడినాఁడు. ఆం. క. చ. ప్రకార మప్పటికి "నూఱు నూట యేఁబదియేండ్ల క్రిందట నుండియుండ వచ్చు" నని చెప్పఁబడిన కటికినేని రామయ తా నకలంక రంగాచార్యుని సాహాయ్యమునఁ గువలయానం దానువాదము చేసితినని చెప్పుకొనెను. ఆ రంగాచార్యు లితఁడగునో కాదో ; ఇతఁడు నలుబది యేండ్లక్రిందటి వాఁడని కీ. శే. కొత్తపల్లి సూర్యారావు గారు తయారు చేసిన పరిష త్తాళ పత్ర గ్రంథ పట్టికలో నుదాహరింపఁబడినది. సూర్యారావు గారన్నట్లీతఁడు 19 శ. ఉ. భా. న నుండినవాఁడు గావచ్చును.

ఇందలి కథ ప్రసిద్ధమైనదే. మార్పులు లేవు. భాష సలక్షణ మైనది కాని రచన సామాన్యమైనది. గ్రంథము యక్షగాన మని పేర్కొనఁబడినది. కాని మూఁడు వంతుల ముప్పాతిక ద్విపదయే. అటనట నటూది తాళములలోఁగొలఁది దరువులు, కీర్తనలు నొక్కచో ఏలలును గలవు.

---

124. ధేనువకొండ వెంకయ్య

విరాటపర్వము: ♦

కవి కౌశిక గోత్రుఁడు. ఆశ్వలాయనసూత్రుఁడు. గౌరమాంబా వెంగనార్యుల పుత్రుఁడగు కంచి రాజమంత్రికి మహాలక్ష్మయ్యయను పిచ్చయ, వెంకన్న, రాముఁడు ననుపుత్రులు గలిగిరి. అందు పిచ్చయకు కనకమాంబయందు సుబ్బయ, వెంగన, కంచివరదుఁడు వేంకటాచలామాత్యుఁడు, చిన్నయ యను పుత్రులు గలిగిరి. అందు నాల్గవయాతఁడీ గ్రంథకర్త. 1902 సం. పు ముద్రిత ప్రతి ముఖపత్రముపై "ఇది వంగోలు తాలూకా ధేనువకొండ వెంకయ్యగారిచే రచియింపఁబడి వంగోలు కాపురస్థుడు కురుగంటి వెంకటరమణయ్యగారిచే.....ప్రచురింపఁబడినది" అని కలదు. కవి 1900 సం. ప్రాంతమువాఁడని యూహింపవచ్చును.*

ఈ గ్రంథము మహాయక్షగానమనియు నాటకమనియుఁ బేర్కొనఁబడినది. ఇందుఁ దిక్కనగారి పద్యము లనేకము యథాతథముగా గ్రహింపఁబడినవి. పసితికొన్ని దరువులుగా మలఁచబడినవి. ఇందలి దరువులీ నాఁటికి నాంధ్రదేశ మస్నిమూలల గ్రామసీమల "కామందుల" (కామధేను శబ్దవికృతి?) లోగిళ్ళు లందును గంభారుల

♦ ప్రచురణ:— పూర్వభాగము మాత్రము సి. యస్. ముద్రాక్షరశాల (మదరాసు) యందు, 1902 లో ముద్రితము. 1903 లో మదరాసు అమెరికన్ మైమండు ము. శా. వారిచే ప్రచురితము. ఇందు కవి వంశాదికము, ఆశ్వాస విభాగము మొ. ఎత్తివేయఁబడినవి. అవి పూర్వప్రచురణమునఁ గలవు.

* శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, శ్రీ కేశుమళ్ళ కామేశ్వరరావుగారల అభిప్రాయము నిదే.

కల్పములందును వినఁబడుచుండును. కొంత యనుకరణము, కొన్ని దోష ములు సున్నను వెంకయ్యగారి రచన కమనీయకమనిదని చెప్పవచ్చును. సులభశైలిలో నెంత చమత్కారమైన భావమునైనను చేవగల మాట లతోఁ జెప్పఁగలఁడు. అందులకు యావచ్చాంధ్రమున ననతికాలమున విశేష ప్రచారము గాంచిన "నినుజూచి నా విభుఁడు" "ఎంతా మాట్లాడితివమ్మా" అన్న సుధేష్ణాద్రౌపదుల దరువులే తార్కాణలు. ఇంపువచనము నందును బాత్రల సంభాషణలు గలవు. ఇతఁడీ విరాట పర్వమునే జంగంకథగాఁ గూడ రచించి యున్నాఁడు. (అదియు ముద్రితమైనది.

---

125. గైనేడి వెంకటస్వామి నాయఁడు

యేసు నాథ కథామృతము:

(ముద్రణ :– స్కాటిష్‌ప్రెస్, మదరాసు, 1904)

కవి పైడిపాటి గోత్రుఁడు. అప్పన పౌత్రుఁడు. రంగనాయ కుని పుత్రుఁడు. శ్రీకాకుళ మండల వాసి. 1900 సం. ప్రాంతము వాఁడని తోఁచును.

గ్రంథవిషయము:– యేసుక్రీస్తు చరిత్రము. రచన సరళము నవేలనము నైనది. కవి భావనలో భక్త్యావేశము, సత్యాత్మికతయు గోచరించును. యక్షగానమని వేరొక్కనఁబడినది. ఇందు దరువులు, తోహరాలు, ద్విపదలు, గద్య పద్యములు మొ. గలవు.

---

126. సందడి నాగదాసు

పంచాక్షరీ ప్రభావము:

(ముద్రణ :— గీర్వాణభాషా రత్నాకరము. శా., మదరాసు, 1907. ప్రచురణ కర్త : అన్నదేవర వీరేశలింగం).

కవి గురించి వివరము లిందెఱుఁగఁబడవు. గ్రంథ ప్రచురణ కర్తయే కృతి ప్రోత్సాహకుఁడు నని యుండుటచే నితఁడు 1907 సం. ప్రాంతమునసుండె ననవలెను. కృతి రచనా కాలము వికృతి మార్గశిర బహుళ దశమి విధువారముగాఁ బేర్కొనఁబడినది. ఈ వికృతి 1890–91 కాఁదగును. ఇం దితని కృత్యంతరములుగాఁ బేర్కొనఁబడినవి :— లక్ష్మీనారాయణ శతకము, శ్రీపతి శతకము, భగవద్గుణ కీర్తనలు, భజగోవింద కందార్థములు, అచల బోధ సీసార్థములు, శ్రీరామ శతకము, జీవన్ముక్తి విచారము, భగవద్గీత కందార్థములు, స్వర శాస్త్రము, సర్వమత సమత్వ సిద్ధాంతము, సకల తత్వార్థ దర్పణము.

ప్రస్తుత గ్రంథ విషయము :— పాశుపతార్థము తపోదీక్ష నున్న యర్జునుని కింద్రుఁడు పంచాక్షరీ మంత్రోపదేశము చేయుటయే యిఁదలి ముఖ్యవిషయము. ఇంద్రార్జున సంవాదమని యీ గ్రంథ నామాంతరము. దీనఁ గథ యేమియులేదు. చివరికి శివుఁడు ప్రసన్నుఁడగుట చెప్పఁబడినది. గ్రంథము యక్షగానమని పేర్కొనఁబడినది. రచన కొంత ప్రౌఢమైనదే.

---

127. కందాళ్ళ రామాచార్యులు

కవి వాధూలసగోత్రుఁడు. లక్ష్మాంబా శేషయాయ్యుల పుత్రుఁడు. శ్రీరంగం కృష్ణకవికి దాహిత్రుఁడు, శిష్యుఁడు. కడప మండలము జమ్మలమడుగు తాలూకా బెడుదూరు గ్రామవాస్తవ్యుఁడు. ఇతని కృతులు ద్రౌపదీ వస్త్రాపహరణము [1], హరిశ్చంద్ర [2], కళాపూర్ణోదయము [3]. ఇందు కళాపూర్ణోదయము బహూరివారి ప్రచురణ (1911 సం.) పరిష్కర్తలలో కందాళ్ళ రంగాచార్యు లొకఁడు. ఇతఁడు రామాచార్యుల యనుజుఁడనియు, నా గ్రంథరచనలో నడుమ నన్నగారు చనిపోఁగా నితఁడు పూరించినట్లును నందేగలదు. కాఁగా రామాచార్యులు 1900 స. ప్రాంతమునందుండె ననవచ్చును.

ద్రౌపదీ వస్త్రాపహరణము, హరిశ్చంద్ర నాటకము లందలి వస్తువు పురాణప్రసిద్ధమైనది. కళాపూర్ణోదయ నాటక మందలి కథ సుప్రసిద్ధమైన పింగళి సూరనార్యుని ప్రబంధేతివృత్తము. ఇందు కల భామినీవృత్తాంతముమాత్రము పూర్తిగా ఁగలదు. కాని కళాపూర్ణోదయ మింకను గానేలేదు గ్రంథము సరి. రామాచార్యుని కృతి నామము సార్థకము గాదు. అయితే అతఁడు గ్రంథరచన పూర్తికాక

---

1 1906 లో మదరాసు జీవరక్షా ము. శా. యందును, 1930 లో ముద్దాల శేషాచలం సెట్టి (మదరాసు) చేతను ముద్రితము.

2. మొదట బహూరివారి గీర్వాణ భాషా రత్నాకర ము. శా. (మదరాసు) వారి చేతను, 1950 లో మదరాసు యస్. వి. గోపాల్ అండుకో వారిచేతను ముద్రితము.

3. బహూరివారి గీ. భా. ర. ము. శా. మదరాసు, 1911 (ఇందు మొదటి రెండు కృతులును జేర్చఁబడినవి.)

మునుపే కాలధర్మ మొందినాఁడు. తమ్ముఁడు తరువాయి కొంతవఱకే తీర్చినాఁడు. ఇందలి కథాప్రణాళిక యథా సూరనీయముగా నడచినది. భావములు ననేకము గ్రహింపఁబడినవి, యనుకరింపఁబడినవి. రచన విషయమున రామాచార్యులు స్వతంత్రముగనే వ్యవహరించినాఁడు.

ఇతని గ్రంథములు మూఁడును నాటకములని వ్యవహరింపఁబడినవి. మూఁడింటను రచన యంత ప్రౌఢిగలది కాదు. కాని సలక్షణము నపేలవమునై నది. ప్రసిద్ధ రాగతాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు, వచనములు (అన్నియు సంభాషణ పద్యములే), చూర్ణికలుఁ మొదలగు రచనాంగములు, సూత్రధార ప్రవేశోక్తి, చోపుదారు పాత్ర మొదలగునవి మూఁడింటను సమానము. హరిశ్చంద్ర కళా పూర్ణోదయములందు గ్రంథారంభమున నటీనటుల ప్రస్తావన విశేషము. కళాపూర్ణోదయ ప్రస్తావనలో సభా ప్రార్థన, వసంతకీర్తన, గణపతివేషములు, "నృత్యగీత వాద్య స్వర తాళ మేళనంబుగా నాడుట" కుద్దేశింపఁబడినది.

---

128. క్రొవ్విడి రాముకవి

ఇతఁడు కౌండిన్య గోత్రుఁడు. ఆపస్తంబ సూత్రుఁడు. హారీతస గోత్రుఁడు. తండ్రి లక్ష్మీనారాయణ. తల్లి నాగాంబ. జననము విభవ శ్రీరామ జయంతి (క్రీ. శ. 1868. భీమవరము తాలూకా ఆరేడు స్వగ్రామము. ఇతని కృతులు చిత్ర రాఘవాదులు చాల గలవు. అందు యక్షగానములు :— ఇళోపాఖ్యానము, దేవాసురనాటకము,

(కాండ పంచకము), సత్యభామావిలాసము. (చూ. "ఆధునిక కవి జీవితములు", దేవాసురనాటకము సవనకాండ మాత్రమే నేఁ డుప లబ్ధము. (ప్రచురణ — మంజువాణీ ము. శా., ఏలూరు. మొదటి కూర్పు, 1905.) ఇందలి విషయము వామనావతార చరిత్రము. పోతన పద్యము లనేక మిందు గ్రహింపఁబడినవి. దరువులు, అర్ధపద్యములు (ద్విపదార్ధములు విశేషము), సంధి సంవాద వచనములును గలవు. రచన యంత సలక్షణము గాదు.

— —

129 కెళ్ళ కప్పయ్య

నలచరిత్ర నాటకము:

(ప్రచురణ :— యన్. వి. గోపాల్ అండుకో, మదరాసు 1949)

కవిపేరు కుప్పయ్య అని గ్రంథమునఁ గొన్ని చోట్లఁ గలదు. గ్రంథము "విజయరామ గజపతి మహారాజ తనూభవ ... శ్రీమదానంద గజపతిరాజ బిడౌజ పరిపాలిత శ్రీమద్వేచలపురనివాస శ్రీసాగినేటి రామచంద్రరాజశేఖరునిపై" జెప్పఁబడినది. ఈఆనంద గజపతి రాజ్యకాలము 1879-1897 (చూ. విశాఖ జి. గెజిటీరు). కాఁబట్టి కవి 19 శ. ఉ. భా. న నున్నవాఁడని చెప్పవచ్చును. గ్రంథవిషయము ప్రసిద్ధము. రచనచక్కనిదే. య. గా. ప్రాయనాటకము. సంధి—సంవాదవచనములు రెండునుగలవు.

———

130. నిశ్చింత ఎంబారయ్య

ప్రహ్లాద విజయము:

ముద్రణ:— కమలాలానంద ము. శా., మదరాసు, సం. (?)

కవి పరాంకుశసగోత్రుఁడు. రామానుజయ్య పౌత్రుడు. భట్ట రాయ్యని పుత్రుడు. పచ్చయప్ప కాలేజీలో చేరిన గోవిందప్పనాయుని వారి మిడిల్ స్కూలు 'తెలుఁగు పండితుడు'. ఇతఁడు తన గ్రంథారంభ మునఁ జిన్నయ్యసూరిని స్తుతించియుండెను. కనుక నాధునికుఁడనుట స్పష్టము. (19 శ. ఉ. భా. నను౦డి యుండును). తన ప్రహ్లాద విజయ మును య. గా. అనిపేరొ౦కనినాఁడు. ఇది "బాలికల కత్యంతోప యుక్తమగునట్లు" రచింపఁబడినదఁట. ఇందు తాళప్రధానములైన పదువులు, ద్విపదలు, పద్యములు, సంధివచనాలు, అర్ధచంద్రికలు, ఏలలు, ధవళశోభనములు, సుప్రభాలు మొ. గేయ రచనలును గలవు. రచన సలక్షణము, సరసము నైనది.

---

131. ముడుంబ నరసింహాచార్యులు

ఈయన శ్రీవైష్ణవుడు, వీర రాఘవాచార్య పుత్రుఁడు. జన్మ స్థానము శ్రీకూర్మముదగ్గర అచ్యుతపురి. కాలము క్రీ. శ. 1841-1927. గరుడాచలనాటక మీయనరచన. (చూ. శ్రీ మధునాపంతుల వారి "ఆంధ్రరచయితలు"). గ్రంథము లభ్యముకాలేదు. ఇది యట్లుగాన మగునేమో!

---

132. చతుర్వేదుల వెంకటనరసింహయ్య

ఈయన గుంటూరుజిల్లా నర్సారావుపేటతాలూకా విప్రులపల్లి అగ్రహారం వాస్తవ్యులు. కాలము క్రీ. శ. 1855 - 1915. ద్రౌపదీ వస్త్రాపహారణము, సీమంతినీ పరిణయము, రాధాకృష్ణ సంవాదము మొదలగు యక్షగానము లనేకము రచించి వానిని బొమ్మలాటవారిచేఁ గూడ నాడించుండెడివారట. ఆగ్రంథము లలభ్యములు. (ఈవిషయ మంతయు కాకినాడ పి. ఆర్. కళాశాలాంధ్రోపన్యాసకులైన శ్రీచతుర్వేదుల సత్యనారాయణశాస్త్రిగారివలనఁ దెలిసినది).

---

133. ద్విభాష్యం పుల్లకవి

కవి నివాసము దుర్గాడ. జననము 8-9-1872. తండ్రి జగన్నాథము. తల్లి వేంకటాంబ. ఆరామద్రావిడులు. వాలఖిల్యసగోత్రులు. శ్రీకృష్ణ గోపీజలక్రీడా భాగవతమను యక్షగానము - వీధి నాటకము నీతఁడు రచించెనఁట. (చూ. ఆధునిక కవిజీవితములు). గ్రంథ మలబ్ధము.

---

134. కళ్లేపల్లి వెంకటరమణమ్మ

ఈమె తండ్రి కురవి రామశాస్త్రి. తల్లి కామనాంబ. భర్త శివరామయ్య. బడగలనాటి కరణకమ్మ వైదికులు. భారద్వాజ గోత్రులు. నివాసము గంజాం జిల్లా బరంపురము. జననము 1875. వరలక్ష్మీ పూజా విధాన మీమె యక్షగాన కృతియఁట. (చూ. ఆ. క. జీ.). గ్రంథ మలబ్ధము.

---

135. నందివాడ జగన్నాథకవి

ఈయన నివాసము ఏలూరు తాలూకా స్వామిపురము. జనము 1878. ఈయన "హరికథా రూపంబుగా యక్షగానంబు" లనేకము రచించిరఁట. (చూ. ఆ. క. జీ.) అవి :—

1. శ్రీకృష్ణుని రాయబారము.
2. శ్రీమద్రామాయణము. (షట్కాండలు)
3. సీతాకల్యాణము
4. హైమవతీ పరిణయము.
5. గయోపాఖ్యానము.
6. హరిశ్చంద్రోపాఖ్యానము.
7. వామన చరిత్రము.
8. కాళీయమర్దనము.
9. చిత్రకేతూపాఖ్యానము.
10. ఇళోపాఖ్యానము.
11. చంద్రహాస చరిత్రము.
12. సానందోపాఖ్యానము.
13. సత్యవతీ చరిత్రము.

ఇందొక్కటియు లభింపలేదు (నాకు).

---

136. త్వరకవి రామకృష్ణయ్య

ఇతడు శ్రీవైష్ణవగోత్రుడు. సీతమాంబా మంగనాయకాత్మజుడు. నెల్లూరు మండలం మందలి విలుకానిపల్లె వాస్తవ్యుడు. ఈయన 19 శ. ఉ. భా. నను, సిశతాబ్ది ప్రథమ పాదమునఁ గొంత కాలము నుండిరని యు, యక్షగాన ప్రబంధములు గానింపుచు నందుఁ దానుగూడఁ బొగ్గుగానుచు నుండెడి వాఁడనియుఁ దెలియుచున్నది.* తాను "నానావిధ యక్షగానములు" రచించితి నని చెప్పినాఁడు. అందు భవానీ శంకర విలాసము[1], వీరభద్రవిజయము[2], నను నవి మాత్రము నేఁటివఱకు లభ్యములు. భ. శం. వి. గద్యలో నితని కృత్యంతర ములు బోధపడఁబడినవి. సక్కనీ, రతి, ద్రౌపదీ పరిణయములు, గ్రహణోపాఖ్యానము, గులసీ మహాత్మ్యము, చెన్న కేశవ సంవాదము, సక్కుబాఁయి సంవాదము, గోపాల మహాత్మ్యము, గోపాల స్థల పురాణము, గజేంద్ర మోక్షము, సహస్రకంఠ రామాయణము.

పడమటి భవానీశంకరవిలాసము కోయిలూరి వల్మీకనాథస్వామి కంకితము. కృతి ప్రోత్సాహకుఁడు నంటిమిట్ట రామలింగస్వామి నాయుఁడు. ఇది యక్షగానమని పేర్కొనఁబడినది. చాలకావన

* ఈవిషయము డాక్టరు శ్రీ వేలటూరి వెంకటరమణయ్యగారు మొదలగు నెల్లూరు మండలి ప్రముఖుల వలన వింటిని.

1. ఇది 1892 లో నెల్లూరు పకీరయ్యనాయునిచే మదరాసు యస్. కుప్పుస్వామి చెట్టికి అంకితముగా వారి మ్యాక్ ఆఫ్ ఎడిబగో ప్రెస్ నందును, 1909 లో మదరాసు బి. వి. గంగయ్య సెట్టిగారి శ్రీ లక్ష్మీనృసింహవిలాస ప్రెస్‌లోను ముద్రితము.

2. ఈ స్వల వీరన్న శ్రేష్ఠిచే 1930 లో మదరాసు చంద్రికా ముద్రణాలయమునఁ ముద్రితము.

కాంతలఁగూడి వచ్చిన వాల్మీకినాథునకును గామాక్షికిని జరిగిన సంవాద మందలి విషయము. వీరభద్రవిజయ మిందు కూరిపేట నివాసి యగు సూరి సుబ్బానాయుని ప్రోత్సాహమున రచితము. ఇందు దక్షాధ్వర ధ్వంసమునుండి గౌరీకల్యాణము వఱకుఁగల కథ వర్ణితము. ఇంచలి కథా ప్రణాళిక శివలెంక మల్లనారాధ్యుని వీరభద్ర విజయము నందున్నట్లే యున్నది. అసలు రెండును "వాయు పురాణోక్త ప్రకారంబున" రచింపఁబడిన యక్షగానములు. త్వరనవివారి కృతి రెండు భాగములు. గేయ ప్రబంధమని పేర్కొనఁబడినది. ఇందు గ్రంథారంభమున సూత్రధారుఁడు కథోద్ఘాతము సుపన్యసించుట గలదు. ఆయన కృతులు రెండిటను రాగ తాళ ధారాళములగు దరువులు, ద్విపదలు, పద్యములు, కందార్ధములు, సంధి వచనములు మొ. గలవు. రెండిటను సంవాదశైలిపా లధికమే గాని యందులకు వచన ముపయుక్తము గాలేదు. రెండిటను రచన సలక్షణము. ప్రౌఢియు సారస్యమును గలది.

---

137. గోపాలుని హనుమంతరాయశర్మ

ఈయన నివాసము వినుకొండసీమ ముప్పాళ్ళ. జననము 1888. క. క. జీ. లో నీయన "యక్షగాన ప్రబంధములు" గాఁ బేర్కొనఁబడినవి:—

1. నృగచరిత్ర. 2. సానందోపాఖ్యానము.
3. సత్య హరిశ్చంద్ర 4. చంద్రకాంత.

ఒక్కటియు లభించినదికాదు. (ఈయన గోపాలుని సింగయ మనుమఁడగునో!)

---

138. జ్యోతి కోటదాసు

చిరియాళ మహారాజు నాటకము :

కవి పంచమకులజుఁడు. కేచర్ల గోత్రజుఁడు. తలిదండ్రులు పోలమ, ఓబయ. తిరుపతి, వెంకటప్పల కనుజుఁడు. వూరే శేషాద్రుల శిష్యుఁడు. తాళ్ళూరు (బళ్ళారిజిల్లా) నివాసి. 1903 సం. న మదరాసు లోని స్వకీయ శ్రీరామవిలాస ము. శా. యందుఁ దనగ్రంథమును ముద్రించిన పెసల నమ్మాళ్వారు సెట్టిని, గ్రంథపరిష్కర్తయైన చీమ కుర్తి వీరరాఘవకవిని దనగ్రంథమున నీతఁడు ప్రశంసించి యున్నాఁడు. గ్రంథరచన ప్లవమాఘమని వేఱొకనినాఁడు. అది 1902 సం.

గ్రంథవిషయము చిఱుతొండనంబి కొడుకగు సిరియాలుని చరిత్ర. ఇందుఁ బ్రసిద్ధరాగతాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు అర్ధపద్యములు, ఏలలు మొ॥ గలవు. సంధివచనములు తఱుచుగానున్నవి. కాని సంవాద వచనములులేవు. చోద్యుదారి పాత్రగలదు. రచన పామర జనాభిరుచికిఁ దగినట్లున్నది.

139. చీమకుర్తి వీరరాఘవ కవి.

చంద్రసేన మహారాజు నాటకము :

(ప్రచురణ :– శ్రీరామ విలాస ము. శా., మదరాసు, 1903)

కవి ఆపస్తంబ సూత్రుఁడు కౌండిన్యసగోత్రుఁడు. వెంకయ్య పౌత్రుఁడు. భద్రమాకోటేశ్వరామాత్యుల పుత్రుఁడు. ఇల్వావులూరి

కోటేశ్వరస్వామి శిష్యుఁడు. ఇతఁడు పై శ్రీరామ విలాస ము. శా. యం దే 1903సం.న ముద్రితమైన జ్యోతి కోట బాసు చిరియాళపుహారాజు నాటకగ్రంథ పరిష్కర్త కాబట్టి 1903 లో నుండెననుట నిశ్చయము. తన గ్రంథరచనా కాలము వికారి-ఆశ్వయుజమని చెప్పినాఁడు. అది 1899 సం. ఇతని కృత్యంతరము సావిత్రీ పరిణయము.

గ్రంథ విషయము:— చఁద్రసేనుఁడను శకరాజు మృగయా విహారార్థ మడవికరిగి యచటఁ బౌలవ్యముని యాశ్రమమున నొక నిమిత్తము పెంపఁబడుచుండిన పద్మగంధియను సింధురాజ పుత్రినిఁజూచి మోహించి గాంధర్వవిధినిఁ బరిణయమూఁది నిజరాజధాని కరుగును. పిదపఁ గొన్నాళ్ళ కామె కొడుకునెత్తుకొని రాఁగాఁ దా నామె నెఱుఁగ ననును. పద్మగంధిప్రార్థనపై శీఘ్రుఁడు ప్రత్యక్షమై చంద్రసేనునిచే దారపుత్రులను స్వీకరింపఁజేయును. ఈకథ శాకుంతల కథకుఁ బ్రతిబింబముగా సృజింపఁబడినది. ఇందానాఁటి యక్షగాన ప్రక్రియ యంతయుఁ గలదు. కాని వచనమున సంవాదము లతివిరళముగా నున్నవి. గ్రంథారంభమున "ఘట్టికుఁడు" లేక "కట్టియవాఁడు" వచ్చుటయు హిందీలోఁ బ్రసంగించుటయుఁ గాననగును. తెరలోపల నృత్యము సల్పుచున్న నాయికాపాత్రను సూత్రధారుఁడు బల్కరించుటయుఁ బాత్ర స్వవిషయము జెప్పుటయుఁ గలదు. సూత్రధారునకు ద్వారకుండను పర్యాయపదము వాడఁబడినది. గ్రంథము యక్షగానమనియు, నాటక మనియు, గేయప్రబంధమనియు బేర్కొనఁబడినది. రెండాశ్వాసములుగా విభక్తము. రెండాశ్వాసములును రెండురాత్రుల ప్రదర్శనకుద్దేశింపఁ బడినవి. రచన ప్రౌఢమైనదనియే చెప్పవచ్చును.

'హరికథా పితామహ'

140. శ్రీ మదజ్జాడాదిభట్ల నారాయణదాసు

ఆంధ్ర హరికథా పితామహులు శ్రీ నారాయణదాసుగారు సుప్రసిద్ధులు. వీరు ద్రావిడ బ్రాహ్మణులు. భారద్వాజ సగోత్రులు. ఆదిభట్ల వేంకటచయని లక్ష్మీనరసమ్మల పుత్రులు. బొబ్బిలితాలూకా అజ్జాడాగ్రహారము వీరి స్వస్థలము. విజయనగరము చిరనివాసము. ఆనందగజపతి మహారాజుచే ననేక ఘనసన్మానము లందినవారు వీరు. బహుభాషా వైదుషీ సంగీత సాహిత్య విశేష శేషుషీ ధురంధరులు. పుంభావ సరస్వతులు. వీరి జీవితకాలము 1864 - 1945. (చూ - "ఆంధ్ర రచయితలు").

వీరు "హరికథ" లనేకము రచించి వానినెల్ల యక్షగానము లని వ్యవహరించినారు. రెండును గద్య పద్య గేయాత్మకము లగుటయే వాని ప్రక్రియాసాదృశ్యమునకును బర్యాయవ్యవహారమునకును గారణ మైనది. కాని మనవాఙ్మయమున "హరికథలు" 19 శ. ఉత్తరార్ధము నుండియే కన్పించును. యక్షగానములు ప్రాచీనములు.

యక్షగానము లెక్కువగా దృశ్య ప్రయోజనాత్మకములు. హరికథ లేక పాత్రాభినయోపన్యాస ప్రయోజన పరిమితములు. కాని ప్రక్రియలో రెండిట నేదో సాదృశ్యము తోఁచి దానుగారు, బాగేపల్లి అనంతరామాచార్యులవారు మొదలైన పండితులు హరికథలనే యక్షగానములని వ్యవహరింప నారంభించిరి. ఆ వ్యవహారము పరంపరగా వ్యాప్తినంది హరికథ యనఁగా యక్షగానప్రాయ రచనమనుటకు మాఱు యక్షగానమనఁగా హరికథయే యని కొంద అనుకొనునంత

వఱకు వచ్చినది. కాని దాసుగారివికాని, యా చార్యులవారివికాని తదితరులవికాని యక్షగానములుగా వ్యవహృతములైన హరికథ లొక వేళ సందు గొన్ని కొంతవఱకు నాట్యధర్ములే యైనను నేకైక వ్యక్తిచే నేపథ్య రహితముగా సాభినయముగా నుపన్యసింపఁబడుటయే కాని యక్షగానములవలెఁ బాత్ర నేపథ్య బహుళముగా నేనాఁడును బ్రదర్శింపఁబడలేదు.

దాసుగారి హరికథలు :— అంబరీష ధ్రువ ప్రహ్లాద సావిత్రీ హరిశ్చంద్ర మార్కండేయ భీష్మ చరిత్రములు, గజేంద్రమోక్షము, రుక్మిణీపరిణయము, జానకీ శపథము, యథార్థ రామాయణము, (ఇవి యన్నియు 1929 సం. నకు ముందే బెజవాడ సరస్వతీ బుక్ డిపో వారిచేఁ బ్రచురింపఁబడినవి). ఇవికాక వీరు సారంగధర నాటకమును రచించిరఁట. అదియు యక్షగాన ప్రాయమైన వీధినాటకమై యుండు నేమో ! పై కృతులన్నియుఁ బ్రసిద్ధేతివృత్తములే. అన్నిట రచన యతిమనోజ్ఞమైనది. వానిలో సామాన్యముగాఁ గాననగు రచనా విశేషములు :— వివిధ ప్రసిద్ధ రాగతాళములలోఁ గీర్తనలు, మరాటీ బాణీ హరికథలలోని డోరాలకు తొహరాలకును బదులుగా మంజరి (మంజరీ ద్విపదగాదు), గద్యపద్యములు, నక్కడక్కడ ద్విపదయు, దండకములు మొదలైనవి. యక్షగానములలోవలె నీ హరికథలలో సంధివచనములు, పాత్ర ప్రవేశ సూచనలు, తెర ద్విపదలు మొదలగునవి యుండవు. కొన్నిట వచనము లున్నను నవి సుదీర్ఘములు, వర్ణనాత్మకములు, నాఖ్యానశైలీ ప్రచురములునై యుండును.

అంబరీష చరిత్రోపోద్ఘాతమున నట్టి యక్షగానములగుఱించి దాసుగారిట్లనియున్నారు :— " ఈ యంబరీషోపాఖ్యానము దొట్టి మఱి కొన్ని యక్షగానములను వ్రాసియుంటిని. యక్షగానము లనఁగా స్వర

నియమములగు నక్షర సందర్భములు పద్యములవలె, దద్గీతబంధములం గూడ సమన్వాకరణచ్ఛందోబంధములుగఁ దెలియుసది... ...ఆంధ్ర యక్షగాన ప్రబంధము లధ్యాత్మ రామాయణ మృత్యుంజయ విలాసములు .....బాఠశాలలకు వెలికానేల; — యక్షగానములు గూడ వాగ్గేయకార ప్రణీతములైనచోఁ బాఠశాలల నంగీకరింపఁబడవలసిన దే. నేఁ దెలిసినమట్టు యక్షగానముల కుదాహరణముగ నిందుతోఁ బది విరచించినాఁడను" — ప్రహ్లాద చరిత్రావతారికలో యక్షగాన ప్రయోగముగూర్చి యది శ్రుతి లయాత్మకమై రాగ వైవిధ్యము జాతిమార్గనయుతమైన స్వరాలాపనయుఁ గలిగిన గానముతో, రసానుకూలమైన నృత్యముతో నొప్పుచుండవలెనని చెప్పినారు దాసు గారు. హరికథా యక్షగానోత్పత్తి పరిణామ చరిత్రను బరిశీలించి చూచినచో యక్షగాన మనఁగా హరికథ యనుట సరిపడదుగాని దానిని హరికథవలెఁగూడఁ బ్రయోగింపవచ్చునన్నచో యక్షగాన విషయమున నదియొక యదనపుఁ బ్రయోజనముమాత్రమే యగును.

---

141. పసుమర్తి కృష్ణమూర్తి

పార్వతీ పరిణయము:

(ప్రచురణ వివరములు తెలియవు. ప్రథమ ముద్రణ, 1922. గౌతమీ గ్రంథాలయమున నొక ప్రతి కలదు — నం. 382)

శ్రీ మదజ్జాడాదిభట్ల నారాయణదాసుగారి శిష్యులీ కృష్ణమూర్తిగారు. తమ పార్వతీ పరిణయమును గురువుగారికే యంకిత మిచ్చినారు. ఈయన యాశ్వల నయోగి. నాగభూషణామాత్యుని

పౌత్రుఁడు. రామనాథ మంత్రి పుత్రుఁడు. బరంపుర నివాసి. కళ్ళికోట కాలేజీ తెలుగు పండితుఁడు. ఆథునికుఁడనుట స్పష్టము. ఈయన కృత్యంతరము త్యాగరాజు చరిత్ర పద్యకావ్యము.

ఈ గ్రంథకర్త "మునుపెవ్వారలుఁ భార్వతీ పరిణయంబున్ యక్షగానంబుగా, నొనరంజేయరుగాన దానికయి యుద్యోగింతు నేనిప్పుడున్" అని యనియున్నారేకాని యీకథ యిదివఱకే యొకరిచేఁ గా దనేకులచే యఁ. గా. కావ్యవస్తువైనది. ఈయన తన గ్రంథమును యక్షగాన ప్రబంధ మనియున్నారు. కాని యది హరికథ. అట్లనుటలో గురువుగారి పరిపాటిఁ బాటించినారు. విశేష మేమనఁగా నిందు త్రిభాశ్వాసవిభాగము గలదు. కథ మార్పులులేక సంగ్రహముగా నాఖ్యానింపఁబడినది. రచనలో నాటకీయ పాటవము లేదుకాని ప్రబంధ ప్రాగల్భ్యము గలదు. ఇందు స్వరపఱుపఁబడిన కీర్తనలు, పద్యము లును మెండు. రాగమాలిక, మంజరి (మంజరీ ద్విపదకాదు - సాధారణముగా హరికథలలో నుండు తోహరాలకు, డోరాలకును ప్రత్యామ్నాయముగా వాడఁబడిన గీత ప్రబంధ విశేషము), 'దిండి' యను వృత్తివిశేషమును గలవు.

---

142. ధనకుధరం రామానుజాచార్యులు

బిల్హణీయము :

కవి హరితసగోత్రుఁడు. పాంచరాత్రవైష్ణవుఁడు. సుభద్ర మాంబా రామానుజాచార్యుల పౌత్రుఁడు. నరసమాంబాచ్యుతాచార్యుల పుత్రుఁడు. ఆలపాడు (తెనాలి తాలూకా) వాస్తవ్యుఁడు. ఈయన 1954 సం. నఁ జనియించినారని కాకినాడ పి. ఆర్.

కళాశాల ప్రాచ్య భాషా శాఖాధ్యక్షులైన శ్రీమాన్ ఈయుణ్ణి వేంకట వీర రాఘవాచార్యులవారు తెలిపినారు.* కవి కృతి 1903 సం. న బొప్పట్ల భారతీ విలాస ము. శా యందు ముద్రితము. రచన యంత కించుకముందే జరిగియుండును. కృతి ప్రోత్సాహకుడు పేర్ల వెంకట సుబ్బారావు.

గ్రంథ విషయము:— ప్రసిద్ధము. రచన సలక్షణమైనదే కాని చచ్చుగా నున్నది. ప్రక్రియలో నొక విశేషమున్నది. ఇందుఁబ్రసిద్ధ రాగతాళములలో 11 దరువులు, 3 కందార్ధములు, 1 సీసము, 1 సీసార్ధము, అయిదారు వృత్తములు, గీత పద్యములును బోను గడమ గ్రంథమంతయు రగడ ప్రచురముగా రచింపఁబడినది. ద్విపద మచ్చున కైన లేదు. కథాగతి యాఖ్యానశైలి ప్రధానముగా సాగినది. ఇది యచ్చు మచ్చు జంగం కథ "బాణీ". యక్షగానములందు ద్విపద రహితము లతి సకృత్తు. కాని రగడ ప్రచురములు గానరావు. ఆధునిక యుగమునఁ గవులు గేయప్రబంధమని మాత్రము పేర్కొని విడిచిన కొన్ని జంగం కథలను బ్రకటన కర్తలు యక్షగానములని వ్యవహరించిరి. ఉదా:— పుసులూరి సుబ్బరాయ కవి "యక్షప్రశ్నలు"— మదరాసు సుబ్రహ్మణ్య విలాస ము. శా. ముద్రణ, 1915. అందులకుఁగారణము ప్రచురణ కర్తల యనభిజ్ఞత యనవలె. కాని యీ బిల్హణీయమువిషయమున వచ్చిపడిన చిక్కేమనఁగా గ్రంథకర్తయే స్వయముగా స్పష్టముగా దీనిని యక్షగానమని యెత్తుగడలోనే పేర్కొని యున్నాఁడు.

---

* కవిగారి పుత్రులు శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులుగారిప్పుడాల పాడులో నున్నారు. వారు నా కిటీవల నొకలేఖ వ్రాసినారు. వైద్య విద్యా సంస్థాన మను సంస్థ నడుపుచున్నారు. 'రామానుజ కీర్తికాముది" అను పేర నొక గొప్ప సంచికాపరంపర ప్రకటించుచున్నారు.

143. వేలూరి కన్నయదాసు

మహాభారత విలాసము:

కవి కార్వేటినగర (చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకా) వాస్తవ్యుఁడు. బాలస్వరూపానంద స్వాములవారి పౌత్రుఁడు. ఇతని మ. భా. విలాసము 1903 సం. న మద్రాసులో "గ్రంథకర్తచే సర్వస్వాతంత్ర్యమును బొందినవారగు వంకాయల కృష్ణస్వామిసెట్టివారిచే స్వకీయ శ్రీరంగవిలాస ము. శా. యందు ముద్రింపించి ప్రచురింపంబడియె". అనఁగా కవి 1903 లో నుండె నన్నమాట. గ్రంథరచన ప్లవకార్తికమున జరిగిన దని చెప్పినాఁడు. అది 1901. ఇందు మహాభారత మూలకథ నంతటిని జెప్పవలెనని కవిపూనిక. ద్రౌపదీ స్వయంవర ద్యూత ఘట్టములను బెంచినాఁడు. కడమ ఘట్టములను సంగ్రహించినాఁడు. ధర్మరాజు పట్టాభిషేకముతో గ్రంథాంతము. నడుమ లేని పోని క్రొత్తవిషయములు గొన్ని గ్రహించినాఁడు. ఆంధ్రమహాభారత గద్యపద్యములను గొన్ని గ్రహించినాఁడు. స్వయముగ దనువులు, అర్ధపద్యములు, పాటలు, వచనములు, రచించినాఁడు. గ్రంథారంభమున "ఆస్థానసంతోషి" పాత్ర గలదు. నడుమ నసభ్యహాస్య ప్రసంగములు జాలఁగలవు. రచన నీరసము గానున్నది. తప్పులు కుప్పలు. కవిచే నిది నాటకమని వేర్కొనఁ బడినది. ప్రదర్శనోద్దిష్టమైనది. (ఇతఁడు నలచరిత్ర యక్షగానము కూడ రచించినట్లు ఆం. వా. సూ. వలనఁ దెలియుచున్నది. కాని గ్రంథ మలబ్ధము.)

---

144. పాలుట్ల లక్ష్మణకవి

ఇతఁడాపస్తంబసూత్రుఁడు. మూర్దన్యసగోత్రుఁడు. పాపయ మంత్రి పౌత్రుఁడు. వెంకమాంబా పిచ్చయలపుత్రుఁడు. స్వయంప్రకాశ బ్రహ్మానందస్వాములవారి శిష్యుఁడు. కర్నూలుజిల్లా మార్కాపురం తాలూకా దిగువపాలెం కాపరస్తులు", "వినుకొండ గవర్న్మెంటు గరల్సుస్కూలు హెడ్మాష్టరు" అని 1904లో మదరాసుజీవ రత్నాకర ము. శా. లోఁ బ్రచురితమైన యీతని కుచేలోపాఖ్యాన య. గా. ముఖపత్రమువలనఁ దెలిసినది. అనఁగాఁ గవియు నప్పటివాఁడే యను టలో సందేహములేదు. ఆ కుచేల యక్షగానమున నితని పూర్వపురచన ధర్మాంగద యక్షగానము పేర్కొనఁబడినది. (ఇదియు మొదట 1904 లో జీ. ర. ము. శా. యంమను బిదప 1933 లో మదరాసు చంద్రికా ము. శా. యందును ముద్రితము.)

రెండు గ్రంథము లందును వస్తువు ప్రసిద్ధము. రెండును యక్ష గానము లనియు నాటకము లనియుఁ బేర్కొనఁబడినవి. రెండిటను బామరజన మనోజ్ఞములైన హాస్య ప్రసంగములు గలవు. చోపుదారి వాలకము గలదు. రచన యొక మోస్తరు.

---

145. పురాణం పిచ్చయ్య

ఇటీవలి నెల్లూరు మండల విద్వత్కవులలోఁ బిచ్చయఁగారొకరు. వీరిది పుదూరు ద్రావిడ శాఖ. తలిదండ్రులు సావిత్రీ లక్ష్మీ నృసింహులు. తాత ముత్తాతలు కేశవ కృష్ణార్యులు. గురువు

నేలటూరి వేంకట రామాచార్యులు. ఈయన 1871—1951 సం. మ నడుమ నుండిన వారని వీరి భాగినేయులును, సుప్రసిద్ధాంధ్ర చరిత్ర వాఙ్మయ పరిశోధకులు నైన డాక్టరు శ్రీ నేలటూరి వేంకట రమణయ్య గారు తెలుపుచున్నారు పిచ్చయగారు విజయాశ్వ చరిత్రాద్యనేక ప్రౌఢ ప్రబంధములును యక్షగానములును రచించి యున్నారు. వీరి య. గా. కృతులు :— *

1. మైరావణ చరిత్ర.
2. కపట వేశ్యా నాటకము.
3. శశిరేఖా పరిణయము.
4. యక్ష ప్రశ్నలు.
5. అర్జున విజయము. (సైంధవ సంహారకథ)
6. చిత్రాంగీ సారంగ ధరము.
7. గౌరీశంకర సంవాదము.

ఈ కృతులన్నియు ప్రసిద్ధేతి వృత్తములు. కపట వేశ్యా నాటకమున మాత్రము కందుకూరు రుద్రకవి నిరంకుశోపాఖ్యాన ప్రబంధ కథ గ్రహింపఁబడినది. కవి తన కృతులను యక్షగానము లనియు, నాటకము లనియు, యక్షగాన నాటకము లనియు వ్యవహరించెను. అన్నిటనుఁ రచన సలక్షణము, సరసము నైనది. చక్కని ప్రౌఢిసారస్యములు గలది. అన్నిటను ప్రసిద్ధ కర్ణాటక, హిందూస్తానీ రాగ తాళ

---

* ప్రచురణ వివరములు :— 1, 2 — ఉప్పల వీరన్నచే మదరాసు చంద్రికాము. శా., 1911, 20, 24, 30, 1926, 31.

3, 4. — యన్. వి. గోపాల్ అండుకో., మదరాసు, 1939, 45, 59

5, 6. — ఈశ్వరి అండుకో., మదరాసు, 1949, 1951.

7. — (ఇది 1914 లో ముద్రితము. చూ. ఆం. వా. నూ) ముద్రణ వివరములు తెలియవు. గ్రంథము లభ్యము కాలేదు. (వీరి గ్రంథములలో వీరే స్వయముగా రచించిన పీఠికలు, ప్రచురణ కర్తృ ప్రశంసాత్మక పద్యములు, స్వవిషయ ప్రసక్తియుఁ గాననగును).

ములలో దరువులు, ద్విపదలు, పద్యములు, అర్ధపద్యములు మొ॥ గలవు. కపటవేశ్యా నాటకమున పార్శీడోరా గజల్లహ్లును, తెర ద్విపదలును జావళీలును గలవు. శశిరేఖా పరిణయము, యక్ష ప్రశ్నలు, అర్జున విజయములందు డోరాలు (అ. ని. న డోరాలతో పాటు రగడలును) తఱుచు. అర్జున విజయమునఁ గప్ప నన్నిటను నాటకీయత సమృద్ధిగనే గలదు కాని సంధి వచనములు దఱుచు. సంవాద వచనము లతి విరళముగాఁ బ్రయుక్తములు. కొన్నిట లేనేలేవు. కపటవేశ్యానాటకము రెండు రాత్రుల కథ. చిత్రాంగి నాటకము రెండు భాగములుగా మాత్రము విభక్తము. అర్జున విజయ మాఖ్యానశైలీ ప్రచురము. దీనిగుఱించి చిత్రాంగి నాటకము చివరఁ బ్రచురణ కర్త వెక్కణ యొకటి గలదు. — "ఈగ్రంథమున జంగములు, దాసరులు, మొదలగువారు గుమ్మెట వాయించుచు వేషములతో నాడుచు గ్రామములలో కథను చెప్పి సంపాదనచేసి జీవించుట కనువుగా నుండు నట్లు వ్రాయఁబడినది" అని. ఇది నాటకమనియే కవిచే వ్యవహృతము. అసలాయన తన కృతులన్నిటి నట్లే వ్యవహరించెనుగద. కాని యీ డోరాలు, రగడలు నా సంధి వచన ప్రాచుర్యము నా కథా కథన ధోరణి మొ॥ విషయములు జూచినచో నత్యంతాధునికులైన వీరి కృతులపై నాధునిక నాటక ప్రభావమైన పడలేదు కాని హరి కథలు, జంగంకథల ప్రభావము గొంత పడినట్లు దోఁచుచున్నది.

---

146. భమిడిపాటి అప్పకవి

భామకలాపము:

కవి విశాఖ మండలమందలి గొరపల్లి వాస్తవ్యుడు. భమిడిపాటి బుచ్చనామాత్యుని పుత్రుడు. ఇతని యక్షగానకృతి పారిజాతమను సత్యభామ కలాపము. (ముద్రణ:— ఆర్య ముద్రాశాల, విశాఖపట్టణము, 1906). ఇందుసత్యభామా సందేశసందర్భమున లెటరు, టికెటు, రైలు, సీలు, కవరు మొదలగు నాంగ్లపదములు ప్రయోగింపఁబడినవి. కవి యాధునికుఁడనుట నిశ్చయము. ఈగ్రంథము విజయనగరప్రభువును, పూసపాటి ఆనంద గజపతిరాజు పుత్రుఁడున్నైన విజయరామరాజు రాజ్యకాలమున గొరపల్లి మిరాశీదారైన కావలి వీరభద్రరావుగారి కంకితమైనదని గ్రంథస్థమైన యాధారము గలదు. విజయనగర ప్రభువులలో విజయరామరాజులు నలుగురుగలరు గాని యానందరాజు లిద్దరే. మొదటి యానందరాజు రాజ్యకాలము క్రీ. శ. 1757—1759. అతని వెనువెంట 1759 నుండి 1794 వఱకు రాజ్యము చేసిన వాఁడు రెండవ విజయరామరాజు కాని యీగ్రంథమునఁ బ్రయోగింపఁబడిన యాంగ్లపదములలో ముఖ్యముగా రైలు మొదలగునవి వీరికాలము నాఁటికి మనదేశమునఁ బొడచూపుట కవకాశమేర్పడదు. రెండవ యానందరాజు రాజ్యకాలము 1879-1897. అలు వెమ్మలు నతని పత్తిపుత్రుఁడైన నాల్గవ విజయరామరాజు రాజాయెను. (చూ. వైజాగ్ డిస్ట్రిక్టు గెజిటీరు). ఈ గ్రంథ మీ విజయరామరాజు రాజ్యారంభవత్సరమగు 1897, గ్రంథప్రచురణ వత్సరమగు 1906 ల నడుమ రచింపఁబడి యుండు ననుటయే సమంజస మగును.

ఈగ్రంథమంతయు భామకలాపము "భాణీ" నున్నది. పారిజాతవృత్తాంతము మాధవితోడి సత్యభామ స్వప్నకథనమున నిమిడిపోయినది. చివర సవతుల కయ్యము గలదు. గ్రంథము యతఁ గానమునియుఁ బేరొక్కనబడినది. ఇందు దరువులు, పద్యములు, ద్విపదలు, నొకచూర్ణికయుఁ గలవు. సత్యభామ "లెట" రొకటే వచనము. అన్యభాషాపదములపైఁ గవి కెక్కువమోజు కాని రచన సలక్షణముగా ససారస్యముగా సాగినది.

---

147. ఆకెళ్ల అప్పయ

గొల్లకలాపము:

ఇతఁడొక విశాఖ మండల కవి. ఇంతకు మించి వివరము లెఱుఁగరావు. ఇతని కృతి "పూసపాటి వేంకటపతి భూనాయకోత్త మాంకితము". "ఏతత్కృతి నాయకునిచే విశాఖపట్టణంబున శ్రీ శారదా మకుట ముద్రాక్షరశాలలో నచ్చువేయించి ప్రకటింపబడియె" నని ముఖపత్రము. ప్రచురణ వత్సరము 1906. కవి యప్పుడుండినాఁడనుట స్పష్టము.

ఈ గ్రంథము మూఁడు భాగములు:— మొదటి దెఱుకల కలాపము. ఇందెఱుకత సూత్రధార పృచ్ఛితయై తమ జాతి వృత్తాంతము నుగ్గడించుటయుఁ దదుపరి "చోడిగాడు" (సింగఁడు రాఁగానతనితో సంవాదము జేయుటయు విషయము — రెండవది గొల్లకలా

పము, గొల్లభామ హాస్యగానిచేఁ బృచ్ఛితయై చల్ల గొప్ప నుగ్గడించు టకు సముద్ర మథన కథ నాఖ్యానించుట యిందలి విషయము — మూఁడవది కొండాయ కలాపము. ఇందు సుంకరి కొండయ్య గొల్ల భామల సంవాదము, నామె యత్తగారు వచ్చి కొండయ్య బొరిఁబడ్డ కోడలిని విడిపించుకొనిపోవుటయు విషయములు. ఇందు దరువులు, పద్యములు, ద్విపదలు, వచనములు, కందార్ధమును గలవు. రచన చక్కనిది.

148. వేదంభట్లు వేంకటరాయ కవి

జలక్రీడావిలాసము:

ఇతఁడు విశాఖమండల కవి యనుట తక్క నింకేమియు వివరము లెఱుఁగరావు. ఇతఁడుఁను పూసపాటి వేంకటపతి రాజుకే గృతి నిచ్చి నాఁడు. ఈ రాజు రేగులవలస (గజపతినగరము తాలూకా) జమీం దారనియు నతని వంశవృత్తమొక సీస మూలికలో నిందుఁగలదు. (ఇతఁడే ఆకెళ్ళ అప్పయ గొల్లకలాపమునకును గృతిభర్త). ఈ జలక్రీడా విలాసము "ఏతత్కృతి నాయకునిచే విశాఖపట్టణంబున శ్రీ శారదా మకుట ముద్రాక్షరశాలలో నచ్చువేయించి ప్రకటింపబడియె." ప్రచు రణ సం. 1906. కవియు నప్పటివాఁడనుట స్పష్టము.

సూత్రధారుఁడు కృతి నాయకునిఁ బ్రశంసించి కథాక్రమ నిరూ పణము చేయుటతో నిందలి గ్రంథారంభము. త॥ అతఁడు వినాయకు

నితో సంస్కృతమునుఁ బ్రసంగించును. అతఁడు పాత్రములను బలుకరించు టయు, సంధివచనములను గద్యాను సంధాయక పద్యములను బఠించు టయు నింపుఁగానఁగనగును. పాత్రలు "తెర బయలు దేఱు దరువులు" గలవు. అందుఁ బాత్రలు స్వవిషయమును స్వయముగాఁ జెప్పుట కాన నగును. ఇది నాటకమని పేరొక్కొనఁబడినది. ఇందు దరువులు, ద్విప దలు, పద్యములు, సంధివచనములును గలవు. ఎఱుకత పాత్రకుఁ బ్రవేశ్యగలదు. గృష్ణుని జననముఁ బాల్యక్రీడలు, జలక్రీడలును నిందలి విషయములు. రచన చక్కనిదే.

---

149. గరిమెళ్ల వెంకటజోగి

వేణుగోపాల నాటకము:

కవి గరిమెళ్ల వేంకట మనీషి పుత్రుఁడు. గ్రంథము మాఁ రేళ్ళ వేంకటాచలపండిత ప్రభు పరిపాలితమైన కళింకోట (విశాఖమండలము) జమీలోని నరసింగపల్లి వేణుగోపాలున కంకితము. కృతి ప్రోత్సా హకుఁడు నరసింగపల్లి వాస్తవ్యుఁడైన మజ్జి వెంకునాయుడు. అతఁడే గ్రంథ ప్రచురణకర్త. ముద్రణ విశాఖపట్టణము శ్రీశారదా ముకుట ము. శా. లో 1906 లో జరిగినది. అనఁగాఁ గవి యప్పటి వాఁడే యగును గదా. ఈ కృతికి భాగవతకలాపము, పారిజాతము నని నామాంతరములు. ప్రణాళికలో రచనలో నిదియొక చక్కని భామకలాపము.

---

150. బళ్ళ సీతారాములు

రాధామాధవ నాటకము:

కవి రుక్మాంగదసగోత్రుఁడు. బళ్ళ వేల్రాజుపుత్రుఁడు. వెంక ట్రాజు సోదరుఁడు. వ్రాలపల్లి నివాసి. నరసింగపల్లి మజ్జి వెంకునాయు నకుఁ దృతీయభ్రాతయగు పోతరాజునాయుఁడు కృతి ప్రోత్సాహకుఁడు. వెంకునాయుఁడీ గ్రంథప్రచురణకర్త. ముద్రణ విశాఖ శారదా మకుట ము.శా. యందు 1906 లో జరిగినది. మఱి యీకవియు నప్పటివాఁడే యగును. ఈగ్రంథమున నాయికపేరు మాఱినది కాని ప్రక్రియ యంతయు భామకలాపమునందలిదే. రచన సరసమైనది.

---

151. గరిమెళ్ళ వెంకటేశ్వరకవి

సముద్ర మథనము:

కవి విశాఖమండలము చోడవరము వాస్తవ్యుఁడు. గరిమెళ్ళ వెంకటజోగికవి (వేణుగోపాలనాటకకర్త) పుత్రుఁడు. ఈసముద్ర మథ నమునందలి దరువులచివర నరసింగపల్లి వేణుగోపాల ముద్రతో పాటు కశింకోట మాశేళ్ళ వెంకటాచలప్రభువు, మజ్జి వెంకునాయుఁడు, నతని సోదరులప్రశంస గన్పట్టుచున్నది. ఇదియు 1906 లో మజ్జి వెంకు నాయనిచేతనే విశాఖ శ్రీశారదామకుట ము. శా. లోనే ముద్రాపిత మైనది. కవి తానీగ్రంథమును శార్వరిచైత్రమున రచించితినని చెప్పి

నాఁడు. ఇది క్రీ. శ. 1900 సం. నఁ బడిన శాస్త్రీయనుట నిస్సంశయము. గ్రంథవిషయము సముద్రమథన కథను జల్లనమ్మ వచ్చిన గొల్లభామ యాఖ్యానించినట్లు గలదు. ప్రాకృత గొల్లకలాపమును బోలినది. రచన చక్కనిది. సత్యభామా కృష్ణసంవాదమను పద్య సంవాదకావ్యము, దశావతార జావళీలు ననునవి వేంకటేశ్వరకవి కృత్యంతరములు.

---

152. కీర్తి వెంకటరామకవి

ఎఱుకలకథ:

కవి నివాసము గొబ్బూరు. (విశాఖ మండలము నందలి అనకాపల్లి తాలూకా). ఆపస్తంబ సూత్రుఁడు. కాశ్యపసగోత్రుఁడు. అనంత రామయ, కోదండ రామయ, పాపన యనువార లతని పితృపితామహ ప్రపితామహులు. గురువు కీర్తి అనంతరామయ (తండ్రి?). ఈడూరి బ్రహ్మజి ఛందోగురువఁట. కృతి భర్తయుఁ బ్రచురణ కర్తయు మజ్జి వెంకునాయుఁడు. ప్రచురణ వత్సరము 1906 * కాఁగాఁ గవియు నప్పటి వాఁడనుట నిశ్చయము.

ఇతని గ్రంథము రెండుభాగములు. మొదటిది సుజ్ఞాన బోధిని యను నెఱుకత కథ. ఇందెఱుకత పిండోత్పత్తి లక్షణము నుండి జీవ

---

* ఇందలి 157—160 ఈ నలువుర కవుల కృతులును మజ్జి వెంకు నాయుని ప్రోత్సాహమున రచింపఁబడి యతని చేతనే మొదట 1906 సం. న విశాఖ పట్టణ మందలి శ్రీ శారదా ముకుట ము. శా. యంద్రాక్షరపు సంపుటముగా ముద్రాపితములై ప్రకటింపఁబడినవి. ఇవి వెంకునాయునిచేఁ బ్రవర్తనకు వెక్కినవని వినుకలి.

బ్రహ్మైక్యాను సంధానము వఱకుఁ గల తత్త్వరహస్యమును సంగ్రహముగా నుపన్యసించును. రెండవది చోడిగాని (సింగని) కథ. వాఁడు సింగిని వెదకుచు వచ్చును. పిదప వారికుఱుని సంవాదము. ఇందు హాస్యఁగాడు పాత్రలను బలుకరించుట కానగును. ఇది యక్షగానమని పేర్కొనఁబడినది. రచన యొక మోస్తరు. (ఇందు పూర్వకవి స్తుతిలో రుద్రకవి పేరు గలదు.)

---

153. పరాశరంశేషాచార్యులు

తిరుమంగయాళ్వారు చరిత్ర:

(ప్రచురణ :— టి. చెంగల్వరాయనాయుని మురహరి ప్రెస్., మదరాసు, 1907)

కవి నివాసము తెనాలి తాలూకా వేరుకలపూడి. వైఖానసుఁడు. భారద్వాజసగోత్రుఁడు. ఘన్నమాంబా జోగయాచార్యుల పుత్రుఁడు. తమ్మపూడి నివాసి సూర్యదేవర జోగయ యీతని కృతి భర్త. కవి స్వయముగా గ్రంథారంభమునఁ బ్రచురణ కర్తలగు చెంగల్వరాయ ప్రభృతులను బ్రశంసించెను. కావున నితఁడు గ్రంథ ప్రచురణ వత్సరమగు 1907 సం. న నుండెననుట నిశ్చయము.

పన్నిద్దరాళ్వారులలో నొకఁడగు తిరుమంగయాళ్వారు చరిత్ర మిందలి యితివృత్తము. కవిదీనిని యక్షగానమనియు నాటకమనియుఁ బేర్కొనెను. యక్షగానములందువలె నిందు సంధివచనములు తఱుచు;

ఒక్క-చోఁదెర ద్విపదయుఁగలదు. కాని యీఖనిక నాటకమువలెనిది పాత్రలవచన సంవాదప్రచురమైన రచన. దరువులు (హిందూస్తానీ రాగముల వాడకపెక్కువ), పద్యములును గలవు. రచన సరళమైనది కాని తప్పులు గలవు. (ఇతఁడు హరిశ్చంద్ర యక్షగానమును గూడ రచించినట్లు ఆంధ్రనాటక కళాపరిషత్తు ప్రకటించిన యు. గా. ల పట్టిక వలనఁ దెలియనగును).

---

154. మండూరి సుబ్బరాయకవి

సత్యభామాకల్యాణము:

కవి కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలూకా దుద్యాల నివాసి. కంసాలి. కాళికాంబా కాళిదాసుల పుత్రుఁడు. లక్ష్మమా సుబ్బయల పౌత్రుఁడు. వేరమా వెంగయల ప్రపౌత్రుఁడు. ఇతఁడు తన గ్రంథమును 1907 సం. నమదరాసు శ్రీ నికేతన ము. శా. యందు ముద్రించిన మేనలూరి కృష్ణస్వామినిఁ బళంసించినాఁడు. కాన 1907 సం. నకుండెననుట నిశ్చయము. ఇతఁడు తన కృతిని నాటక మనియు, మహాప్రబంధమనియుఁ బేర్కొనినాఁడు. ప్రచురణకర్తలు "యక్షగాన కంపెని డ్రామా" యనిరి. గ్రంథము రెండు రాత్రుల కథగా విభక్తమగుటయు, దరువుల చివరముద్రలు, సంధివచనములు, తెర ద్విపదలు మొదలగువాని యునికియు నిది యక్షగానమనిపించు చున్నవి. వచన సంవాదములు మొ॥ సందర్భము లాఖనికనాటక ప్రభావఫలితములు గావచ్చును. రచన యొకమోస్తరు.

---

155. వద్ది తాతయ్య

శశిరేఖా పరిణయము :

ప్రచురణ: మాదేటి సన్యాసయ్య అండు సన్సు, రాజమండ్రి.
1908, 1936)

ఇతఁడు "గోదావరీ తీరస్థిత కోనాల గ్రామ కాపగస్తుడు. తద్గ్రామ రిజల్టు స్కూలుపాధ్యాయుఁడు," ఇతని ప్రపితామహులు అయ్యన్న, నూకమాంబ. పితామహులు భూపతి సీతమాంబ. తలి దండ్రులు భూపతి వెంకమాంబ. స్వస్థలము ఎర్ర గూడెం తాలూకా వనఫురము. "పద్మగర్భుని పాదభవుఁడు" ఆపస్తంబ సూత్రుఁడు. మార్కండేయసగోత్రుఁడు. వంగిపురి వెంకటాచార్యుల శిష్యుఁడు. గ్రంథాది నితఁడు వచనమున నొక విజ్ఞప్తిచేసి యుండుటయు, గ్రంథాంతమున నితఁడు ఎర్ర గూడెము తాలూకా తహసీల్దారు వైజర్సు అప్పారావుగారికిఁ జెప్పిన పద్యములు, తల్లాప్రగడ సూర్యనారాయణ రావు ప్రభృతులిచ్చిన సమస్యలను బూరించి చెప్పిన పద్యములు జూడ నితఁడాధునికుఁడని తెల్లమగుచున్నది.

తాతయ్య తనగ్రంథమున అప్పుప్ప కవి శశిరేఖా పరిణయ ప్రబంధము ననుకరించినాఁడు. అతని స్వతంత్ర రచనయు సరసమైనది. తన కృతిని నాటకమని పేరొక్కనినాఁడు. యక్షగాన ఫక్కినున్నది. దరువులు, పద్యములు, తఱుచు ద్విపదలు, ఏలలు, సంధివచనములు, సంవాదవచనములును గలవు. (రుక్మిణీ కల్యాణ య. గా. ఇతని కృత్యంతర మని ఆం. నా. కో. పరిషత్తు పట్టిక .

---

156. కాలంపెట్టి గురవయ్య

కవి నెల్లూరు వాస్తవ్యుఁడు. బలిజ కులజుఁడు. ఇతని కృతులు చిత్రాంగి నాటకము, పురూరవశ్చక్రవర్తి జనన నాటకము (రెండును మదరాసు పబ్లిక్ త్యాగరాయ సెట్టిచే వారి శ్రీరాజరాజేశ్వరీ నికేతనము. శా. యందు వరుసగా 1908, 1914 సం. లలో ముద్రితములు). చిత్రాంగి నాటకమున గ్రంథకర్త సర్వస్వామ్యములును ప్రచురణకర్త కిచ్చిన శ్లోక ప్రకటన చేసినాఁడు. అనఁగా నీతఁడు 1908 సం. న నుండె ననుట స్పష్టము.

గ్రంథ విషయములు :— ప్రసిద్ధములు. రెండిట దరువులు, ద్విపదలు (ప్రావేశిక ధ్రువలు, తెర ద్విపదలు గూడ), కందార్ధములు, పద్యములు, ఏలలు, గొబ్బిపాటలు, సంధి వచనములును గలవు. పు. చ. జ. నాటకమున సంవాద వచనములును సకృత్తుగాఁ గలవు. రెండిట భటపాత్ర ప్రవేశ ధ్రువ, తదుపరి కథానుసంధాయక ద్విపదల తోడను గథారంభమగును. రెండును నాటకములనియే పేర్కొనఁ బడినవి. కాని "బాణీ" యక్షగాన సదృక్షము, రెండిటను రచన పేలవము, దోషయుతము.

---

157. వినుకొండ కాళకవి

మార్కండేయ విలాసము:

(ప్రచురణలు:— మదరాసు ఉప్పల వీరన్న శ్రేష్ఠి అంకు సన్సు 1922. వెస్టువార్డు అండుకో, 1936)

ఇతఁడు విశ్వకర్మకులజుఁడు. వీరమాంబికా తనయుఁడు. గ్రంథము చోళపుర - నరసింహుని కంకితము. ఇందుఁ గథారంభమున ఘటికుని (కటికము) మాటలలో 'సై లెన్సు' అను నాంగ్లపదము ప్రయుక్తమైనది. కవి యాథునికుఁడే కావచ్చును. వి. కాళదాస కృతము మార్కండేయవిలాస మను యక్షగానము 1873 లోఁ ప్రచురితమైనట్లు ఆం. వా. సూ. వలనఁ దెలియనగును. అది యీ కవిదే కావచ్చును. ఇతఁడు 1911 ప్రాంతమున నొనుగుంట వీరబ్రహ్మము రచించిన శివరామ నాటకమునఁ "పూర్వకవులస్తుతి" కి "ఇప్పటి కవులస్తుతి" కిఁ బిదపఁగల "మృతకవులస్తుతి" లోఁ బేర్కొనఁబడి నాఁడు. కవి 19 శ. ఉ. భా. నుండినాఁడని చెప్పవచ్చును.

గ్రంథ విషయము ప్రసిద్ధము. ఇందు దరువులు, పద్యములు, ద్విపదలు, వచనములు మొ॥ వానిలో సంధి - సంభాషణలు రెండును గలవు. ఇది నాటకమని బేర్కొనఁబడినది. రచన యొకమో స్తరు. అనుచితములు, జమత్కారానహాములు నైన సందర్భములు చాలఁ గలవు.

---

158. కొత్తూరు రంగనాయకమ్మ

ఆండాళు చరిత్ర :

ఏతద్గ్రంథకర్త్రి యీచంబొటి శ్రీనివాసాచార్యుల శిష్యురా
లని మాత్రమే యిందలి కొన్ని పాటలవలన దెలియుచున్నది. వర
యూరు జియ్యరు తిరుపతి సంబంధురాలగు రామానుజమ్మ యనునామె
రచించిన శ్రీరంగనాథ పంగుణ్యుత్తరోత్సవ యక్షగానముచివర గంగ
చి దను రంగనాథస్తుతి పరమైన యొక గేయరచన చరమ చరణమునందు
"ఈచంబొటి శ్రీనివాసాచార్యకృపను - రంగదాసు రాలినిభోవరా"
అనికలదు. రామానుజమ్మ కృతి ప్రచురణకర్త్రి కొత్తూరు రంగనా
యకమ్మ. ఆ తంగచిందులోఁ బేర్కొనఁబడిన రంగదాసు లీరంగనా
యకమ్మయేగావచ్చును. ఈరంగనాయకమ్మ గురువు, ఆండాళు చరిత్ర
కృతికర్త్రి గురువు నొక్కరే కావున నామెయు నీమెయు నొక్కరే కావ
చ్చునేమోయను నూహ నొడముచున్నది. అగుచో, రామానుజమ్మ
కృతిని రంగనాయకమ్మ మదరాసు శ్రీరామానుజ విలాస ముద్రా శా
యందు 1917లో ముద్రిపించి ప్రచురించినది కనుకను, అండాళుచరిత్ర
మొదట మదరాసు శ్రీకురుమూర్తి శ్రీనివాస ము. శా. యందు
1907 లో ముద్రితమైనది కనుకను రంగనాయకమ్మ యీశతాబ్ద్యా
రంభమున నుండెనని చెప్పవచ్చును. ఇవ్వటికిది యంతయు నొక
యూహామాత్రము.

ఆండాళనఁగా భూదేవి యవతారముగాఁ పెరియాళ్వారగు విష్ణు
చిత్తునిపుత్రిగా, చూడికుడుత్త నాంచారు లేక ఆముక్తమాల్యదగాఁ
బ్రసిద్ధి వడిసిన గోదాదేవి. ఆమెచరిత్ర మిందువర్ణితము. ఇందాళ్వా
రుల చరిత్రముగూడఁ గొంత చెప్పఁబడినది. కొరవంజి పాత్రకుఁ

ప్రబస క్తికల్గినది. గ్రంథము యక్షగానమని పేర్కొనఁబడినది. అలఁతి దోషములున్నను రచన చక్కనిది. ముఖ్యముగా నాండాళు పెండ్లి వేడుకల పాటలు ముచ్చటగా రచింపఁబడినవి. భక్తిశృంగారములు బాగుగాఁ బోషింపబడినవి.

---

159. కొండముది బంగారయ్య

కవికాపురము గుంటూరుజిల్లా నరసరావుపేట తాలూకా కొణిదెన సివారు రాజుపాలెము. విశ్వబ్రాహ్మణుఁడు, కాశ్యపసగోత్రుఁడు. నాగమాంబా సుబ్బయల పుత్రుఁడు. ఈతని కృతులు వృత్రాసుర మహారాజు నాటకము (గోపాల విలాస ము. శా., మదరాసు, 1908). శశిరేఖా పరిణయము (దేవానంద ముద్రణాలయము మదరాసు, 1920).

రెండింటను నితఁడు ఫణిభవుసంగ, కందుకూరు రుద్రకవులను బూర్వకవులుగాస్తుతించెను. వృ. మ. నాటకమున "ఇప్పటి కవుల స్తుతి" యనుశీర్షికక్రింద వెల్లటూరు శేషావధానులు, వడ్డిపాటి నిరంజనకవి, యలవర్తి ఆంజనేయశాస్త్రి, శిరికొండ దశరథరామశాస్త్రి, కడియాల వీపూరిరంగాఖ్యుఁడు, కలగాని వీరయాచార్యుఁడు, అడ్డాడ వీరభద్రుడు - అను వారిని స్తుతించెను. ఇందలి యలవర్తి ఆంజనేయశాస్త్రియే 1908 లో ప్రచురితమైన యీ వృ. మ. నా. గ్రంథపరిష్కర్త. అనగా బంగారయ్యయు నప్పటివాఁడే యనుట నిశ్చయము.

వృ.మ.నాటకము వడ్డేశ్వరపుర వాసి మూర్తి(మూర్తి?)రాజు శేఖరాయ్యని ప్రోత్సాహమున రచింపఁబడినది. ఇందు వృత్రాసురవిజృంభము,

వధము, మహేంద్రుని ప్రచ్ఛన్నత, నహుషు నింద్రపదవి, అగస్త్య శాపము, దేవేంద్రపునఃప్రతిష్ఠ - అను విషయములు వర్ణితములు. ఇది మూడురాత్రుల కథగా విభక్తము. శశిరేఖా పరిణయకృతి ప్రోత్సాహకుడు. చందవరవాసి పూసపాటి వేంకటరత్నము. రెండింటను దరువులు, ద్విపదలు, పద్యములు, నర్ధపద్యములు, సంధి వచనములు, సంవాద వచనములును గలవు. వృ. మ. నా. గ్రంథారంభమునఁ జోపుదారు, సూత్రధారుల సంభాషణగలదు. శ. ప. నా. గ్రంథారంభమున వేత్రపాణితో "సభికులు" (సామాజికులు) సంభాషించి నట్లుండుట విశేషము. రెండును నాటకములని పేర్కొనఁబడినవి. రచన బాగుగనే యున్నది.

---

160. గోనగుంటి వీరబ్రహ్మము

శివరామనాటకము:

ముద్రణ :— దుగ్గిరాల వజ్ఝపాటి నిరంజన శాస్త్రిచే - ప్రబోధినీ ము. శా., 1911. ప్రతిష్కర్త :— కొండముది బంగారయ్య.

ఇతఁడు గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా పెదపాలెం గ్రామ వాస్తవ్యుఁడు. ఆదెమ, అమ్మయల పౌత్రుఁడు. పిచ్చమ పున్నయల పుత్రుఁడు. మూరెళ్ళ సాంబయ శిష్యుఁడు. పూర్వ కవుల స్తుతిలో నీతఁడు బాణాల శరభేంద్రుని, కొమ్మాజి సోమనాథుని, ఫణిధవు సంగ కవిని, కందుకూరి రుద్ర కవిని, గుత్తికొండ జనార్దనుని, విశ్వనాథావధూతను, వేమనను బేర్కొనెను. పోతులూరి వీరబ్రహ్మమును

స్తుతించెను. "మృతకవుల స్తుతి" యను శీర్షిక క్రింద కడియాల వీపూరి యాఖ్యుని, వినుకొండ కాళిదాసుని, కొండ శంకరాచార్యుని స్మరించెను. "ఇప్పటి కవుల స్తుతి" లో అలవర్తి ఆంజనేయశాస్త్రి, వడ్డిపాటి నిరంజనశాస్త్రి, సిరికొండ దశరథరామశాస్త్రి, అడ్డాడ వీరభద్రుడు, కొలగాని వీరయ్య, మచ్చా సుబ్బయాచార్యుడు, వంగవోలు పిచ్చయ, కొండముది బంగారయ్య, చుండూరి సుబ్బయ సూరి మొ॥ వారిని బేరొక్కానెను. ఇందలి వడ్డిపాటి నిరంజన శాస్త్రి, కొండముది బంగారయ్య లీ శివరామ నాటక ముద్రణ పరిష్కరణ కర్తలు. ప్రకటన సం. 1911. గ్రంథకర్త 1911 సం. న నుండెననుట నిశ్చయము. (ఇతడు 'మృతపండిత స్తుతి' లో మార్గసహాచారి, వెల్లటూరు శేషావధాని, కనపర్తి బసవయ్య, కోడూరి వియ్యన్న, కొర్తుర్తి సర్వయాచార్యులు, కోసూరి పాపయ, పులివర్తి పార్వతీశము, నూతలపాటి సుబ్బయ్య, శ్రీ కట్టా భాష్యకారులు నను వారినిఁ బేరొక్కానెను). ఏతత్కృతి ప్రోత్సాహకుఁడును, ప్రకటనకర్తయు గోనుగుంట కుమారస్వామి.

గ్రంథ విషయము :— క్రీ. శ. 1811 ప్రాంతమున నెల్లూరు మండలమున విశ్వబ్రాహ్మణ కులమున జనించి (నారదుఁడే యిట్లు శాపవశమున జనించెనని కట్టుకథ), మైహిక విషయవిముఖుఁడై తలిదండ్రులను విడిచి భైరవకోనలోఁ బసులకాపరి వృత్తిజరించుచు శివుని కృపవలన జ్ఞానియై యాయన యా దేశమువలన గృహస్థాశ్రమము స్వీకరించి వివిధవర్ణములవారికిఁ దత్తోపదేశకుఁడై సర్వశాస్త్ర సమాధానమను నొక మహాగ్రంథమును రచించి, అనుములకొండయందు సమాధి నందిన శివరామ బ్రహ్మేంద్ర స్వామి చరిత్రమిందు వర్ణితము. ఇందు దరువులు, ద్విపదలు (తెర ద్విపదలుగూడ), పద్యములు, సంధి-సంవాద వచనములు, కందార్ధములు, ఏలలు, దండకములు గలవు. గ్రంథా

రంభమునఁ బ్రథమ పాత్ర ప్రవేశము గూర్చి సభవారికిఁ జెప్పవచ్చిన భటుని సూత్రధారుఁడు పలుకరించుట గలదు. ఇం దంక విష్కంభ ముండుట (రెండు) యొక విశేషము. కాని యీవిష్కంభము సమంజసముగ లేదు. గ్రంథకర్తచే నిది నాటకమని పేర్కొనఁబడినది. నాట్యోద్దిష్ట మైనది.

ఇందలి రచన :— అతి నికృష్టముగా నున్నది. ఇది భాష, భావ ములు, లక్షణము, శైలి మొదలగు విషయము లన్నింటి నుద్దేశించి యనుచున్న మాట. ఎంతటి సహృదయునకైన నీ గ్రంథమును జదువఁగానే

"నాకవిత్వ మధర్మ్యాయ మృతయే దండనాయచ
కుకవిత్వం పునస్సాక్షాన్మృతి మాహుర్మనీషిణః"

అను శ్లోకార్ధము హృదయ గోచర మగును.

(ఆం. సా. క. పరిషత్పట్టికలోని తపతీ పరిణయ య. గా. ఇతనిదే. అది 1913 లో నచ్చయినదఁట. అలభ్యము).

---

161. ఎల్లనూరు నరసింహ కవి

కవి కొడిది కాపు కులజుఁడు. పాలాకుసగోత్రుఁడు. అశ్వత్థరెడ్డి పౌత్రుఁడు. మంగమాంబా నరసిరెడ్ల పుత్రుఁడు. ఇతని నివాస మనంతపుర మండలమునఁ దాడిపత్రి తాలూకా ఇగుడూరు.

ఇతని య. గా. నాటక కృతులు* కృష్ణవిజయము (1), సావిత్రీ నాటకము (2), సైంధవ పరాభవ నాటకము (3), రామనాటకము 4), సూక్ష్మరామాయణము(5). ఇందుఁ జివరి రెండిట నితఁడు వేములపల్లె యక్షగాన కవి యమ్మనూరి వేంకట సుబ్బ కూర్యుని స్తుతించినాఁడు. సుబ్బకవి 19 శ. ఉ. భా. ని నున్న వాఁడు. (చూ. ఇందలి 104 కవి చరిత్ర). నరసింహ కవి గ్రంథములలో మొదటగా కృష్ణవిజయము 1914 లో ప్రచురితమైనదని ఆం. వా. సూ. వలన తెలియుచున్నది. దాని నితఁడు ప్రమాదీచ సంవత్సరమున రచించితి ననిచెప్పినాఁడు. ప్రమాదీచ 1914 లోఁబడినది. కాఁగా నరసింహ కవి సుబ్బకవి చివరి దినములలో బాలుఁడై 19 శ. చివరి పాదమునఁ గొంతకాలము ని శతాబ్ది పూర్వార్ధమున గొంతకాలము నుండెనని యూహింపఁబడి యున్నది.

ఇతని యక్షగాన కృతులలో ఇగుడూరు, చుక్కలూరు, గాండ్లపాటి హరిముద్రలు గలవు. ఆ యూళ్లన్నియును గవి యింటిపేరిటి

* పై కృతులలో (1) (5) ఇగుడూరి హరి కంకితములుగా సరస వేంకట భూపాలుని నాతని ప్రోత్సాహమున రచింపఁబడినవి. (1) ఒక ముద్రణ :— సి. వి. కృష్ణా బుక్ డిపో, మదరాసు, 1949

(2) చుక్కలూరి హరికంకితము. కృతి ప్రోత్సాహకుఁడు గ్రంథ కర్త పెదతండ్రి కొడుకగు ఎల్లనూరు నరసింహారెడ్డి. బరూరి వారి ప్రచురణ, మద్రాసు, 1937.

(3) గాండ్లపాటి హరి కంకితము. కృతి ప్రోత్సాహకులు దబ్బర కొండయ, చేరెడ్డి బాలయ్య, దుబ్బ నాగిరెడ్డి: సి. వి. కృష్ణా బుక్ డిపో ప్రచురణ :— 1954.

(4) మద్రాసులో 1933 లో బరూరి వారిచేతను, 1947లో ఎన్. వి. గోపాల్ ఆండుకో వారి చేతను బ్రచురితము, (ఇందితఁ డప్ప కవిని కంకంటి పాపరాజ కవిని స్మరించి యుండుట విశేషము).

(5) మదరాసు బ్రౌడన్ ప్రెస్ ముద్రణ :— 1926: బరూరి వారి ముద్రణ 1941.

యూరును దాడిపత్రి తాలూకాలోఁ గలవు. నితని కడమ కృతు లన్నియు బేరొక్కనఁబడినవి. ఇతఁడీ నాటకములనేకాక మయూరధ్వజ చరిత్ర, సత్యభామా వివాహము, వేంకటేశ్వర భక్తవిజయము ననుమూఁడు హరికథలను రామశతకమునుగూడ రచించినట్లుందు చెప్పుకొనెను.

నరసింహ కవి నాటకము లన్నియుఁ ప్రబంధోత్తమములు. కృష్ణ విజయము నందలి కథ కంస వధము. రామనాటకమందలిది కుశలవ కథ. సూక్ష్మ రామాయణమున బాలకాండముదక్కఁ గడమ యైదుకాండలు "అంతయు నొకరాత్రి కథ యొనర్చి" రచించినాఁడు. అన్నిటను వివిధ రాగ తాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు (సంధికిఁగూడ), సంధివచనములు, వచనప్రచురముగాఁ బాత్రల సంవాదములును గలవు. అన్నిటను రచన సలక్షణమైనది. మిగుల చక్కనిది. అందు క్రమ పరిణతి గోచరించును. అన్నియు నాట్యోద్దిష్టములైనవి. నాటకములని పేరొక్కనఁబడినవి. ప్రదర్శనములకెక్కి రాయలసీమలో లేపాక్షి నాటకములు, వేములపల్లె నాటకములవలెనే నరసింహ కవి నాటకములును తాడిపత్రి నాటకములని పేర్వడసినవి.

---

162. విూసరగండ ఓబుళరాజు

ఉషాపరిణయము:

ముద్రణ:— వెస్లు వార్డు అండు కో, మదరాసు 1916 గ్రంథ పరిష్కర్త — ఉపేంద్ర శ్రీరామరాజు)

కవి నివాసము వెంకటాంపల్లె (అనంతపురము తాలూకా). భార్గవసగోత్రుఁడు. ఓబరాజు పుత్రుఁడు. ఇతఁడు గ్రంథ ప్రచురణము

నకు సాహాయ్యమొనర్చిన వంకిదారి రోశన్న సెట్టినిఁ బ్రశంసించినాఁడు. ప్రచురణ సం. 1916 కావున నప్పటివాఁడే. గ్రంథము నాటకమని పేర్కొనఁబడినది. రచన సమకాలిక య. గా. నాటకపు ఫక్కినున్నది. వచన ప్రచురముగాఁ బాత్రల సంభాషణలు గలవు. శైలి నాతి ప్రౌఢము, నాతిపేలవము. శ్రీకృష్ణ శతక మితని కృత్యంతరము.

---

163. ఈపేంద్ర శ్రీరాములు

రుక్మిణీ పరిణయము :

(ప్రచురణ కర్త :— గ్రంథి విరూపాక్ష సెట్టి, వెంకటాంపల్లె, సం. తెలియదు.)

కవి నివాసము కల్లుమడి (గుత్తి తా. అనంతపుర మండలము. భారద్వాజసగోత్రుఁడు. సుబ్బనూ తిప్పరాజుల పౌత్రుఁడు. రామాంబా తిరుపతిరాజుల పుత్రుఁడు. గ్రంథము నచ్చువేయించిన గ్రంథి విరూపాక్ష సెట్టి ప్రశంసను జేసియుండుటచే నితఁ డాధునికుఁ డనుట స్పష్టము. ఇతఁడే పూర్వోక్తమైన మొసరగండ ఓబుళరాజు ఉషా పరిణయము 1916 సం. నాటి ముద్రణమునకుఁ బరిష్కర్త. అందుచే నితఁడు నప్పుడుండినవాఁ డనుట నిశ్చయము. ఇతఁడు కవిస్తుతిలో అప్ప కవిని, కంకంటి పాప రాజును, కిడాంబి రాఘవాచార్యుని, యమ్మ నూరి వెంకటసుబ్బకవినిగూడఁ జేర్చియుండుట విశేషము. (సుబ్బ కవి ప్రశంసాత్మకముగను, కుకవి నిందాపరముగను నిందున్న రెండుత్పల మాల పద్యములెల్ల నూరు నరసింహకవి రామనాటకము, సూక్ష్మ

రామాయణములందు యథా తథముగ గస్పట్టుచున్నవి.) ఓబుళ రాజు ఉషా పరిణయ ముఖపత్రమున నీ శ్రీరామరాజు రుక్మిణీ శకుంతలా పరిణయములను రెండు గ్రంథములను రచించినట్లు గలదు. కాని రుక్మిణీ పరిణయమొక్కటే లభ్యమైనది.

గ్రంథ విషయము. ప్రసిద్ధము. ఉపోద్ఘాత ద్విపద, నటీనట సంవాద రూప ప్రస్తావన, చోబ్దారి రాకలతోడ గథారంభము. ఇందు కందార్ధము లెక్కువ. పదములు, దరువులు, ద్విపదలు, కొలది పద్యములును గలవు. సంధివచనములు, కొద్ది సంవాద వచనములు నెక్కువ. గ్రంథము నాటక మని పేర్కొనబడినది. నాటకీయత యెక్కువ గలదు. రచన యొకనాస్థరు.

---

164. తంగుటూరు వెంకటరామయ్య

ప ద్మా వ తీ ప రి ణ య ము :

(ప్రచురణ :— అమెరికన్ డ్రామంకు ప్రెస్., మదరాసు 916. ప్రచురణ కర్త :— వంకదార రోశన్న. పరిష్కర్త కిడాంబి రాఘవాచార్యులు)

కవి అనంతపురం తాలూకా వెంకటంపల్లె నివాసి. వైశ్యుడు. వరదాంబా తిప్పయ్యల పుత్రుడు. మాల్యవంతం వెంకటాచలమయ్య శిష్యుడు. పూర్వోక్తమైన ఉపేంద్ర శ్రీరామరాజు ఉషాపరిణయము

నందుఁ బేర్కొనఁబడిన కిడాంబి రాఘవాచార్యుఁడే గ్రంథ పరిష్కర్త. శ్రీరామరాజు 1916 ప్రాంతమువాఁడు. ఈ గ్రంథము ప్రచురణ సం. 1916. కావున నీ వెంకట రామయ్యయు నప్పటి వాఁడే యగును. (ఈ గ్రంథము చివర విడి రచనలు కొన్ని గలవు. అందుఁ బ్రచురణ కర్త ప్రశంస గలదు. యమ్మనూరి వెంకటసుబ్బ కవి పేరును బ్రస్తుతమైనది.)

గ్రంథ విషయము :— వరాహ పురాణోక్త ప్రకారము పద్మావతీ వేంకటేశ్వరుల పరిణయ గాథ. ఇందు పదపద్య ద్విపద కందార్ధములు గలవు. సరళమైన వచనములో సంవాద శైలీ ప్రాబల్యము గల గ్రంథమిది. గ్రంథారంభమునఁ జోఫుదారి రాక, పదముల చివర ముద్ర సాధారణ విషయము. నాయకుఁడే నాయిక కడ కెఱుక చెప్పఁ బోవుట యొక విశేషము. గ్రంథము యక్షగానమని పేర్కొనఁబడినది. రచన నిరాడంబరము, సరసము నైనది

---

165. ముడుంబై అలమేల్మంగతాయారమ్మ

సుల్తానీ కల్యాణము :

(ముద్రణ :— వాణీ ము. శా. బెజవాడ, 1917)

ఈమె కౌశికగోత్రజ. నరసింహా దేశికుని శిష్యురాలు. గ్రంథాంత ద్విపదలో నీమె పీఠికాపుర కుంతిమాధవస్వామిని స్మరించి యుండుటచే గోదావరీ మండలవాసిని యని తోఁచును. గ్రంథారంభమున స్వయముగా నొకవచన పీఠిక వెలయించి యుండుటచే నీమె యాథునికురాలని చెప్ప వచ్చును.

సుల్తానీ కల్యాణమనఁగా నిందలి యితివృత్తము వైష్ణవగాథలలో గడుప్రచారమందిన బీబినాంచారికథ. ఈకథ కాకర మాచార్య సూక్తిముక్తావళి. సురతాణి కల్యాణముపేరఁ గర్తృత్వమెఱుఁగఁబడని యింకొక యక్షగానముగలదు. దానిని దాను జూచినట్లు చెప్పినదీమె. ఈమెరచనయే మేల్తరమైనది. ఇది తాళప్రధానములైన దరువులు ప్రచురముగాఁ గలరచన. ఇందు ద్విపదలు, సీసములు, కందములు ఏలలు, లాలి, అర్ధచంద్రికలు, ధవళశోభనములు, సంధి వచనములు, గలవు. యక్షగానమని పేర్కొనఁబడినది.

---

166. తిరువీధి చెంచు సుబ్బదాసు

ఉ ష ా ప ర ి ణ య ము :

(ప్రచురణ :– వి. వి. నాయుఁడు అండు సన్సు, నెల్లూరు సం. ?)

కవి నివాసము " నెల్లూరుజిల్లా వేంకటగిరి సంస్థానము ఇలాకా కొచ్చెర్లకోట ". తలిదండ్రులు వరలక్ష్మీ వేంకటరామాఖ్యులు. గురువు ముసలయాచారి. కృతిభర్త నెల్లూరుజిల్లా పొదిలితాలూకా వల్లాయపురివాసి పొతకమూరి లక్ష్మీనరసింహము. ఈకృతియందలి దరువులలో వల్లాయపురి కోదండరాముని ముద్ర యుండుటచే దీనికి వల్లాయపురి ఉషాపరిణయ మనియుఁ బేరు. ఈ కవి నారాయణతత్వ విలాసమను నింకొక యక్షగానమును రచించి నట్లును నది 1913 లో ముద్రితమైనట్లును ఆం. వా. సూ. వలనఁ దెలియుచున్నది. అది

యలభ్యము. ఈయుషాపరిణయము పింగళ్ళనై శాఖమందు రచింపఁబడి నట్లు ప్రచురణ కర్తలు తెలిపినారు. 1917 పింగళ. కవి యీశతాబ్ది వాఁడే యైయుండును.

ఉషాపరిణయకథ ప్రసిద్ధమైనది. ఇందు దరువులు, పద్యములు, నర్ధపద్యములు, సంధి—సంవాద వచనములునును గలవు. గ్రంథము గేయ ప్రబంధ మనియు, నాటకమనియుఁ బేర్కొనఁబడినది. రచన సరళ గ్రాంథికములోఁ జక్కఁగనే సాగినదన వచ్చును గాని యక్షిం తవ్యములగు దోషము లనేక మున్నవి.

---

167. మరుధూరి తాతాచార్యులు

ఇతఁడు గుంటూరు జిల్లా నరసారావుపేట తాలూకా వేమవర గ్రామ వాస్తవ్యుఁడు. భారద్వాజసగోత్రుఁడు. మరుధూరి వేంకటా చార్య పుత్రుఁడు. ఇతని కృతి "పారిజాతం బను శ్రీకృష్ణలీలా విలాస నాటకము". కవి పెట్టిన పేరదే కాని యిది శ్రీ సత్యభామా మనోల్లాస నాటకమనుపేర 1919 లో నరసారావుపేట రాజ్యరమా ము. శా. యందు ముద్రితమైనది. కృతిపతియైన జుజ్జూరి ఆదినారాయణ (వేమ వరవాసి) యే ముద్రణ సహాయుఁడని ముఖపత్రము. అనఁగాఁ కవి 1919 సం. ప్రాంతముననున్న వాఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

ఈకృతియందు నంది తిమ్మనగారి పారిజాతాపహరణ ప్రబంధ ప్రణాళికయే పాటింపఁబడినది. రచనలోఁ దదను కరణమును గలదు.

ఇందు దరువులు, ద్విపదలు (పాత్రలు తెరవెడలు సందర్భములందును), పద్యములు, కందార్ధములు, సంధివచనములును గలవు. "చోఫుదారు" లేక "కట్టియం" పాత్రగలదు. రచన నిర్దుష్టముకాదు గాని యొకింత సరసమైనదే.

---

168. వీణె సుబ్బరాజు గాజుల పెండ్లూరు శేషగిరిరాజు

కుశలవ నాటకము:

వీణె సుబ్బరాజు మనుమఁడు శేషగిరిరాజు. వీరు మాగధ కులజులు (భట్రాజులు). సుబ్బరాజు తండ్రి చన్నమరాజు. గురువులు చదలువాడ నృసింహాచార్యులు, రమణాచార్యులు; సుబ్బరాజు సంతవేలూరువాసి. (ఈకృతికి సంతవేలూరు కుశలవ నాటకమనియే పేరు; రామనాటకమని నామాంతరము). శేషగిరిరాజు పెండ్లూరు పురవాసి. ఈశేషగిరిరాజు మేనల్లుడైన కోడూరు సుబ్బరాజీ గ్రంథ స్వాతంత్ర్యమును కడూరు చెంగల్వరాజుగారికిచ్చినట్లు చెంగల్వరాజు గారు 1922 సం. న మదరాసు సరసా ము. వా. యంత్రము ముద్రింపించి ప్రచురించిన ప్రతిమీఁదను, చెంగల్వరాజుగారి నుండి గ్రంథస్వాతంత్ర్య మునుబొంది 1931 లో మదరాసు వెస్టువార్డువారు ప్రకటించిన ప్రతి మీఁదను గల ముఖపత్రములవలనఁ దెలియుచున్నది. (రెండిటను రెండవ పుటలో నీగ్రంథ స్వామ్యప్రదాన ప్రశంసాత్మక మగు నొక సీస మాలికయుఁ గోడూరు సుబ్బరాజు కృతముగాఁ గన్పట్టును). కాఁగా గ్రంథకర్తలిరువురు సీశతాబ్ద్యారంభమున నుండినటు గ్రహింపవచ్చును.

గ్రంథవిషయము :— ప్రసిద్ధము. ఇందు జైమిని భారతకథా రీతి గ్రహింపఁబడినది. ఇందలి పద్యములు, వివిధ ప్రసిద్ధ రాగతాళము లలోనున్నవికావు. తాళప్రధానములును గొన్ని గ్రొత్తనడకలును గలవు. ద్విపదలు పద్యములు, కందార్ధములు, కొలదిపాటి చిన్న సంధి-సంవాద వచనములు, రెండుచూర్ణికలు, నొక్కొక జావళి, రగడ, గొబ్బి, నలుగు, లాల, జోలపాటలును గలవు. రచన హృదయంగమముగా నున్నది. ఇది "ఆఱురాత్రిళ్ళ నాటకమునకును, బొమ్మలాటకును ఉపయోగముగా" రచింపఁబడినదని ముఖపత్రమునఁ గలదు. గ్రంథారంభమున గటికము పాత్రకుముందు వినాయక తదర్చక పాత్రలను గూడ కవి ప్రవేశపెట్టియుండుట విశేషము.

---

169. కాకరపర్తి నృసింహకవి

సంగీత సారంగధర నాటకము :

(ప్రచురణ :— ఆర్. సంజీవిరావు అండ్ సన్ వారిచే శ్రీరామా విలాసము. శా., విజయనగరము, 1927)

కవి గురించి విశేషము లెవ్వియుఁ దెలియవు. కృతిపతి పొట్లపెదచ్చనార్యుఁడు ఈగ్రంథ ప్రస్తావనలో విదూషక ప్రసంగమున "బోయర్సుయుద్ధము" ప్రశక్తివచ్చినది. చరిత్ర ప్రసిద్ధములైన ఆఫ్రికాబోయరు యుద్ధములు క్రీ. శ. 1877 - 1902 సం. ల నడుమజరిగినవి. ఈకృతి ప్రచురణ వత్సరము 1927. కవి 1900 - 1927 నడుమనుండి యుండును.

గ్రంథవిషయము ప్రసిద్ధము. రచన చక్కనిది. ఇది 'నాటకము యక్షగాన శృంగాటకమ్ము' అని కవిచే బేర్కొనఁ బడినది. ఆశృంగాటక శబ్దము సార్థక మగునట్లే యున్నదిందలి రచనాప్రక్రియ. ప్రారంభమున సూత్రధార విదూషకులచే సలక్షణముగాఁ బ్రవర్తింప బడిన ప్రస్తావనయుఁ గలవు. గ్రంథమధ్యమున విదూషక ప్రసంగము లున్నవి. గ్రంథ మైనంకములుగను నంకములు తిరిగి యనేకరంగములు గను విభాగింపఁబడినది. ఇందు సంధివచనములు లేకుండ ముఖాముఖిగా సరళశైలిలో వచన ప్రచురముగాఁ బాత్రల సంభాషణలు, స్వగత ములు, నేపథ్యప్రసంగములు, పాత్రలు సూటిగాఁ బ్రవేశించు పద్ధతి (బండు రెండుచోటులఁదక్క)యుఁ బ్రసిద్ధ రాగతాళములలోఁ బాటలు, పద్యములు, వచనములు నొక్కొక్కచో ద్విపదయు రగడయుఁ బ్రయుక్తమైనవి. ఇదియంతయు సంస్కృత పాశ్చాత్య నాటక ఫక్కిక లకు నడిమి వాటముగా నడుచుచు ధారావాడనాటకపుఁ బోకడలుగూడ సంతరించుకొన్న నాఁటి ధర్మవరము కృష్ణమాచార్య ప్రభృతుల నాటక ముల రచనాప్రక్రియకు దీటుగా నున్నది. కాని యక్షగాన ప్రక్రియతో నెట్టిపోలికయు గానరాదు. గ్రంథకర్తయే స్వయముగా యక్షగాన మనియుఁ బేర్కొనియుండుటచే దీని కిచటఁ బ్రసక్తి కలిగినది.

---

170. ఎన్. వెంకటరామయ్య

ఇతఁడు సత్యనారాయణ వ్రతమను యక్షగానమును రచించె ననియు నది బెజవాడ వాణీ ముద్రాక్షర శాలలో ముద్రితమై తేదీ 4-8-1934 న నితని చేతనే ప్రకటితమైన దనియుఁ దెలియు చున్నది. గ్రంథ మలబ్ధము. (ఇతని నివాసము చినయనమదలయని తెలియుచున్నది.)

---

171. శ్రీ రాజా వేంకటాద్రియ్యప్పారావు బహద్దరు

వీరు ఉయ్యూరు సంస్థాన ప్రభువులు, సాహితీ వల్లభులు. వీరు 1948లో కొండపల్లి వీరవెంకయ్య (రాజమండ్రి) సమూలముగా ప్రచురించిన తమ శ్రీకృష్ణలీలా తరంగిణి – యాంధ్రానువాద గ్రంథము చివర స్వవిషయము నుటంకించుచు నందు "కాకతి రుద్రాంబకథ యక్షగాన ప్రబంధ శోభలఁబొందు పరచినాఁడ" ననియున్నారు. తమ తరంగిణి యనువాద కాలమును "ఐదువేలును నలువది యైదవ కలి తారణాబ్దము" గాఁ బేర్కొనినారు. అది క్రీ. శ. 1944. కాకతి రుద్రాంబకథ యంతకుముందే రచింపఁబడిన దన్న మాట. ఇట్లు చరిత్ర ప్రసిద్ధులగు వ్యక్తుల జీవితోదంతములును యక్షగాన కావ్యవస్తువు లగుట యొక విశేషము. ఈ రుద్రాంబ యక్షగానము ముద్రితమైనదఁట. కాని లభ్యము కాలేదు.

---

172. బళ్ళ రామరాజు

శ్రీకృష్ణలీలలు:

(ప్రచురణ: కాళహస్తి తమ్మారావు అండు సన్సు రాజమండ్రి వారిచే త్రొమ్మిదవ కూర్పు, 1945)

కవి రుక్మాంగదసగోత్రుఁడు. రాజమాంబా సీతారామరాజుల పుత్రుఁడు. బళ్ళ సీతారామరాజు వ్రాలపల్లి రాధామాధవ నాటకకర్త

అతఁడు క్రీ. శ. 1906 సం. న నుండినట్లు నిశ్చితముఁగా దెలియవచ్చినది. (చూ. ఇందతని యుదంతము, నం. 150). అతని పుత్రుఁడైన యీతఁ డీశతాబ్ది పూర్వార్ధము నందుండె ననుటలో విప్రతిపత్తి లేదు.

ఇతని గ్రంథము పలు చిన్నచిన్న రంగములుగా విభాగింపఁబడినది. కృష్ణజననాదిగా నుగ్రసేన పట్టాభిషేకము వఱకుఁగల భాగవతకథలోని ముఖ్యాంశము లొక్కొక్కరంగమున నొక్కొకటి మిక్కిలిసంగ్రహముగాఁ జెప్పఁబడినవి. ప్రతి సన్నివేశమును బాత్రముఖముగా నాటకీయముగాఁ బ్రవర్తితమైనది. అంతయు సూటియైనపద్ధతి. కీర్తనలు, నటనము, పద్యములు నిందలి రచనాంగములు. అన్నియుఁ బాత్ర సంవాదాత్మకములే. వర్ణనగాని కథనముగాని లేవు. రంగప్రయోగ సూచనలు, పాత్రావస్థాసూచనలు, మొ॥ గలవు. ఇది యాధునిక రంగస్థలనాటకప్రక్రియ కతిసన్నిహితముగా నున్నది. కాని కవి గ్రంథాంత గద్యలో దీనిని 'యక్షగాన ప్రబంధ' మని పేరొక్కసియుంటచే నిచటఁ జేర్పవలసి వచ్చినది.

---

173. మాడ అప్పలస్వామి

రామదాసు నాటకము:

(ముద్రణ:— నేషనల్ ప్రిటింగువర్క్సు, యలమంచిలి.)

(1950)

ఇతఁడు నాగమళ్ళ గోత్రమువాఁడు. మామిడివాడ శివారు కలవలపల్లి (విశాఖమండలము, యలమంచిలితాలూకా) గ్రామస్థుఁడు.

గొబ్బూరునివాసియగు కీర్తి వెంకటరామయ్యపంతులుగారి శిష్యుఁడు. ఈకీర్తి వెంకటరామయ్య ఎఱుకలకథ అను య. గా. నకుఁ గర్త. ఈయన 1906 సం. న నుండినవాఁడని నిశ్చయింపఁ బడినది. (చూ. ఇందతని యుదంతము సం. 152). అతని శిష్యుఁడగు అప్పలస్వామి తా నీకృతిని సర్వజిన్నామవత్సరాషాఢమున రచించినట్లు చెప్పినాఁడు. ఇది 1947లోఁ బడిన సర్వజిత్తే కావచ్చును. అప్పలస్వామి యీ శతాబ్ది పూర్వార్ధమున నుండినవాఁడనుట నిశ్చయము. (ఇప్పుడుకూడ నున్నాఁడేమో!)

గ్రంథవిషయము :— ప్రసిద్ధుఁడగు భద్రాచల రామదాసు చరిత్రము. యక్షగానమని పేర్కొనఁ బడినది. ఆ ప్రక్రియ సమృద్ధిగానున్నది. విశేషములులేవు. రచన 'నా కవిత్వమధర్మాయ...' అను శ్లోకమును జట్టున జ్ఞప్తి కెలయింపఁ గలట్టిది.

---

174. నల్లమిల్లి బసివిరెడ్డి

ఈయన జీవత్కవి. జననము 30-9-1897. నివాసము తూర్పు గోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకా రామవరము. రెడ్డికులజులు. సిరిపాలగోత్రజులు. తల్లిదండ్రులు బుల్లెమ్మాంబా బాపిరెడ్డులు. ఈయన ఆంధ్రప్రాంతమున హరికథకులుగా సుప్రసిద్ధులు. హరికథాఖ్యానమునందే కాక రచనమునందును నిష్ణాతులు. బహు గ్రంథ

కర్తలు.* భారత రామాయణ భాగవతములు మూఁడింటి హరికథా రూప పరివర్తనములు నతిసమర్థముగా ఒక్కచేతి మీఁదుగా నిర్వహించిన నిపుణులు. ఇవికాక భక్తవిజయము, జాతీయభారతము (గాంధి చరిత్ర), శశిరేఖా పరిణయము, వేమన చరిత్ర, గోస్తనీనదీ మాహాత్మ్యము ననుహరికథలు, శ్రీకృష్ణశైశవము (కంసవధ), ప్రహ్లాదచరిత్ర, కుశలవ, సైరావణచరిత్ర మొదలగు యక్షగానప్రాయ నాటకములును రచించియుండిరి. వీరి రచనలలో శ్రీమద్రామవర రామాయణము (షట్కాండలు - మూఁడు భాగములు) యక్షగానప్రబంధముగా గ్రంథకర్తచే వేయ్కొనబడినది. కాని గ్రంథమంతయుఁ బ్రసిద్ధరాగతాళములలో తొహరాలు, భజన కీర్తనలుగను, నడుమ నడుమ చిటిపొటి వచనములతోను సిండి యున్నది. అయితే ఇందు సంవాదశైలీ ప్రాచుర్యముతో నాటకీయత ప్రస్ఫుటముగ నున్నది. ఇది భజన కూటములందు నిరాహార్యకముగనే ఆయా కథాపాత్రములు ప్రాతినిధ్యము వహించిన భక్తులచే నాటకీయముగఁ బలుతడవులు ప్రవర్తిత మైనది. (యక్షగాన ప్రదర్శనలం దిట్టి వింత సంప్రదాయ మొకటి కన్నడదేశమున నున్నదని నన్నగా వింటిని). ఆంధ్రదేశమునందును నీ యాధునిక కాలమునసే యిట్టిగ్రంథములు గొన్ని బయల్వెడలినవి. అవి అన్యత్ర ప్రసక్తములు. యక్షగాన పరిణామ చరిత్రలో నిదియొక

---

* ముఖ్యగ్రంథ ప్రచురణ వివరము : (1) శ్రీమద్రామవర రామాయణము: 2) శ్రీ మదాంధ్రభారత వీరచరిత్రము (హరికథ)-రాయవరము మేరీ ముద్రాక్షరశాల, సం. వరుసగా 1926-27; 1940. (3) సైరావణచరిత్రము, (4) సంగీత భక్తరామదాసు (య. గా. నాటకములు లేక నాటకభజన కీర్తనలు), (5) వేమనయోగి చరిత్రము (హరికథ) — రామచంద్రపురము శ్రీ వాణీ ము. శా. సం. వరుసగా 1928, 1928-1932. (6) జాతీయభారతము — యు, ఎన్. ము. శా. మాచుపేట, 1950. (ఈ భాగవతము హరికథ మొ॥ కొన్ని అముద్రితములు).

యపూర్వ విషయము. ఈవిషయము, ఆదిభట్ట నారాయణదాసాదుల వలె వీరును హరికథలను యక్షగానములుగా వ్యవహరించిన విషయము నసలు యక్షగానోత్పత్తి చరిత్రమునుబట్టి యంత సమంజనములుగాఁ దోఁపక పోయినను, యక్షగానమునకును హరికథలకు నీ భజన నాటకములకును జన్యజనక భావ సంబంధము లేకపోయినను, ప్రక్రియలో దానికిని వీనికి నే కొంతయో సాదృశ్యము (సంగీతనాటకీయతల స్థితత్వమునందు) దోఁచి పండితులైన యా పెద్దలట్లు వ్యవహరించి యుండుటను గేవలము గాదనలేము. ఈవిషయమును గూడ బహుముఖ చిత్రమైన యక్షగాన పరిణామచరిత్రలోనొక మెట్టు (బహుశః చివరి మెట్టు)గా (ఇప్పటిమట్టున్నకైన) గ్రహించుట లెస్స యనుకొందును.

ఈ సందర్భమున శ్రీ బసివిరెడ్డిగారు స్వయముగ వక్కాణించిన యభిప్రాయమునే ఇందుఁ బొందుపఱచుచున్నాను: "సంగీతముతోఁ గూడిన కీర్తనలు, పద్యములు, గద్యములతో నడచునవన్నియును యక్షగాన కావ్యములే యని నా యభిప్రాయము. యక్షగానములలో నాటకములు, హరికథలు, కావ్యములు – అన్నియు చలామణీ యగుచుండును. హరికథలన్నియు యక్షగానకావ్యములే యని చెప్పనగును. ఇంచుమించు నేను వ్రాసినవి ఒక్క– డ్రామాలు జయప్రద వగైరాలు తప్ప తక్కిన వన్నియు యక్షగానకావ్యములే. రామాయణము కేవలము కీర్తనలు, డోరాలు, వచనములే గాన యక్షగానము లంటిని. యక్షగానములని అన్నను అనకపోయినను కీర్తనలతో నిండినవన్నియు యక్షగాన ప్రబంధములే యని నా యుద్దేశము."

బసివిరెడ్డిగారి రచన బహువిధ గద్యపద్యగేయ భాసురము, సరసము, సలక్షణము, సరళము, చతురమునైనది. ఆయన సహజ పాండిత్యస్ఫురణములు, సహజకవి బిరుదాభిరాములు:

అనుబంధము
(1)
20. శతాబ్ది పల్నాటి యక్షగాన కవులు

1. కీ. శే. కన్నెగంటి ప్రభులింగాచారి :

తక్కెళ్లపాడు నివాసి. విశ్వబ్రాహ్మణుడు. అష్టావధాని. ఇతని య. గా. కృతులు :— జయప్రద నాటకము, తారా చంద్రము, పాంచాలీ స్వయంవరము, గయోపాఖ్యానము. ఇతని పల్నాటి వీర చరిత్ర నాటకము యక్షగానమగునో కాదో తెలియదు.

2. కీ. శే. తంగెడ లక్ష్మీకాంత కవి :

మోర్జంపాడు వాస్తవ్యుడు. నియోగి. జగన్మోహినీ నాటకకర్త.

3. కీ. శే. మల్లెం సుబ్రహ్మణ్యాచారి :

విశ్వబ్రాహ్మణుడు. సావిత్రీ నాటకకర్త.

4. కీ. శే. కొండ భవానీ శంకరాచార్యులు :

వేమవరము నివాసి. విశ్వబ్రాహ్మణుడు. వీర బ్రహ్మ యోగి నాటకకర్త.

5. కొండరాజు మల్లయాచారి :

వేమవరము నివాసి. విశ్వబ్రాహ్మణుడు. నల నాటకకర్త.

6 కూరపాటి కోటమరాజు :

నాగులవరము. భట్రాజు. ఉషా కన్యా పరిణయ కర్త.

7. దుగ్గరాజు సీతయ్య :

ఉషాపరిణయ నాటక కర్త.

8. బత్తుల లక్ష్మయ్య :

ప్రవరాఖ్య నాటక కర్త.

గమనిక :— ఈయనుబంధమున కాధారములు :— శ్రీరావిపాటి లక్ష్మీనారాయణ గారు (గురజాల) రచించిన పల్నాటి చరిత్ర ; వారు నాకు తే. 30—6—55న వ్రాసిన యుత్తరము. పై నాయా కవుల య. గా. కృతులు మాత్రమే పేర్కొనబడినవి. అందొకటియు లభ్యముకాలేదు.

దక్షిణ దేశ యక్ష గాన

కవులు - కావ్యములు

1. రఘునాథనాయకుఁడు

ఇతఁడు సుప్రసిద్ధుఁడగు తంజాపురాంధ్ర నాయకరాజు. అచ్యుతప్ప నాయకునకు మూర్తిమాంబకునుఁ బుత్రుడు. ఇతని రాజ్యకాలము క్రీ. శ. 1600 - 1631. ఇతని యాస్థాన మనేక సంస్కృతాంధ్రకవులకును, గవయిత్రులకును నాశ్రయమై నెగడినది. ఇతఁడే చేమకూర వెంకటకవి విజయవిలాసమునకుఁ గృతిభర్త. కృతిభర్త యగుటయేకాక స్వయముగ కృతులనేకము రచించినాఁడు. అందు రామాయణము, వాల్మీకిచరిత్రము మొదలగు పద్యకావ్యములు, నలచరిత్ర మొదలగు ద్విపదకావ్యములే గాక (ఈ మూఁడును నేఁ డుపలబ్ధములు) యొండు రెండు యక్షగానములు నుండుట విశేషము. కాని యవి నేఁడలభ్యములు.

1. శ్రీ రుక్మిణీ కృష్ణ వివాహ యక్షగానము:

ఇది యీతని కృతిగా సంగీత సుధలోఁ బేర్కొనఁబడినది. (చూ. సం. సు. చరిత్రమ్., శ్లో 63. Published in the journal of the Music Academy, Madras, 1930. Vol. I. Pp. 63) ఈ శ్లోకమే గోవింద దీక్షితుని సాహిత్యసుధలోనిదిగా శ్రీ యస్. కృష్ణస్వామయ్యంగారి Sources of Vijayanagar History 269 వ పుటలో నుదాహృతము.

2. జానకీ కల్యాణ చాటుకావ్యము:

ఇది యీతని కృతియైనట్లీతని కొడుకగు విజయరాఘవుని రఘునాథ నాయకాభ్యుదయము (తం. స. మ. ప్రచురణ, 1951. పుట. 21) వలనఁ దెలియవచ్చినది. ఇది యక్షగానమని పేర్కొనఁబడలేదు. రఘునాథుఁడే పేర్కొనియుండిన దీనిని యక్షగాన మనియే యని యుండెడివాఁడేమోగాని పేర్కొనినవాఁడు విజయరాఘవుఁడు కావున నతని

తరమునుండి తంజావూరున యక్షగానమున కాపేర వ్యవహారము సన్న గిల్లి నాటకము, చాటుకావ్యము నని వ్యవహారము గలిగి నట్లతని యక్షగాన ప్రాయ రచనలనుండియే (చూ. కాళీయమర్దనము — తం. స. మ. కే. నం. 500, పూతాతానా హరణము — నం. 554, ప్రహ్లాద చరిత్ర — నం. 541.) యెఱుక పడుచుండుట వలనఁ జాటు కావ్యముగాఁ బేర్కొనఁబడిన యీ జానకీ కల్యాణము యక్షగానము కావచ్చునని యూహ.

ఇంతకును రఘునాథుని యక్షగాన రచన మొక్కటియు స్వరూపము దెలియకుండఁ బోయినది.

---

2. కృష్ణాధ్వరి

ఇతఁడు పై రఘునాథ నాయకున కనేక కృతు లంకిత మిచ్చిన వాఁడు. తన నైషధ పారిజాతీయమున (తం. స. మ. నం. 172) నాతని కృతికన్యల యెడ నతని వాల్లభ్యమును ప్రశంసించుచు నొక సీస పాదమున 'కల్యాణ కౌముదీ కందర్ప నాటక కన్యోద్వహన బద్ధ కంకణుం' డని పేర్కొనెను. ఆ నాటక మలభ్యము. అది యానాఁడు రఘునాథు నాస్థానముననే వెలసిన కమలినీకలహంసాదులవలె సంస్కృత రూపకమై యుండునని తోఁచును. అది తెలుఁగు గ్రంథమే యై యుండు నెడల మార్గ నాటకములవంటి నాటకము లానాఁటికిఁ దెనుఁగునఁబుట్టినట్లు కానరానందున యక్షగానమైయుండునని యూహ. అంతమాత్రముచేతనే దాని కిట సీపాటి ప్రసక్తి గల్గినది.

---

3. విజయరాఘవనాయకుఁడు

ఇతఁడు తంజావూరు రఘునాథ నాయకుని పుత్రుఁడు. అతని తరువాత క్రీ. శ. 1633 – 1673 సం. ల నడుమ తంజావూరి నేలిన వాఁడు. అతనికి సాహిత్య ప్రక్రియ లన్నిట యక్షగాన మనిన నతి మాత్ర ప్రీతి. తద్రచనలో నతి విదగ్ధుఁడు. ఆస్థాన కవులచే ననేక యక్షగానములు రచింపఁజేయుటయేకాక తాను స్వయముగా బహు కృతులు రచించి తన కొలువు నట్టువమేళములచేఁ బాడుచు ప్రయోగింపఁ జేసి వినోదించెడివాఁడు. రఘునాథనాయకుని కాలమున రాజ సభా ప్రవేశపురస్కారము లభించిన యక్షగానమునకు విజయ రాఘవుని కాలమున రంగభోగము విస్తరిల్లినది. తత్ప్రక్రియ యొక విశిష్టపరిణతి నందినది. తంజావూరు తన్మహానీయస్థితి మూలమై నిలిచినది. నాఁటి నుండి యక్షగానముయొక్క ప్రదర్శన ప్రయోజనము బాగుగా గుర్తింపఁబడి యది కోటలోని రాజుగారికిని బేటలోని ప్రజలకును సమానముగా నాదర పాత్రమై సర్వోపభోగ్యమై యాంధ్రులకు నాట కము లేదన్న లోటు కొంత తీర్చినట్లైనది. నాఁటి నుండి తంజావూరిలో యక్షగానము తన పేరు గోల్పోయినను బలిష్ఠగోల్పోక, చాటు కావ్య ముగాఁ బరిగణింపఁబడినను నాటక నామకరణము చేయించుకొని, తత్ప్రాపి మహానాటకమనియుఁ గొందఱిచే వ్యవహృతమైనది. (అట నాటక శబ్దమును వీధి నాటకమునందువలె రూపక సామాన్యవాచిగా గ్రహింపవలెను. మహా నాటకమనుట వట్టి మాటవరుస.)

విజయరాఘవుని ప్రస్తోద చరిత్ర (తం. స. మ. కే. నం. 541) గ్రంథారంభమున నొక సుదీర్ఘ సీస మాలికలో నతని కృతుల పట్టిక యొకటి కలదు. అందు బహు విధ కావ్యములు పేర్కొనఁబడినవి.

వానిలో యక్షగాన ప్రాయ రచనల పాలే యధికము. నాటక శబ్ద సూచనచేతను, సూచన లేకున్నను నుపలబ్ధము లగుటచేతను వానిలో యక్షగానములని యూహింపఁదగినవి పదుమూఁడు :—

౧. రాజగోపాలవిలాసము, ౨. ఉషాపరిణయము, ౩. కాళీయ మర్దనము, ౪. రఘునాథాభ్యుదయము, ౫. మోహినీ విలాసము ౬. ప్రహ్లాదచరిత్రము, ౭. పూతనాహరణము, ౮. ఒకమంజరీ ద్విపద ప్రబంధమునకు నాటక పరివర్తనము (అసలు గ్రంథనామ మేమో!) ౯. విప్రనారాయణ చరిత్ర, ౧౦. సముద్రమథనము, ౧౧. కృష్ణ విలాసము. ౧౨. జానకీ కల్యాణము, ౧౩. పుణ్యకవ్రతము.

ప్రహ్లాదచరిత్ర పట్టికలో నాటక శబ్దసూచితము గాకపోయినను, గ్రంథ మలభ్యమైనను నితఁడు రుక్మిణీ కల్యాణమును గూడ నాటకముగా రచించినట్లతని గ్రంథాంతరమగు రఘునాథనాయకాభ్యుదయ ద్విపద కావ్యాశ్వాసాంత గద్యవలనఁ దెలిసినది. దీనినిబట్టి ప్రహ్లాద చరిత్ర పట్టికలో నాటక శబ్ద సూచితములుగాని మఱికొన్ని గ్రంథములును నాటకములు గావచ్చునని యూహింపఁ దగియున్నది.

ఇందిపు డుపలబ్ధములగునని యైదుమాత్రమే. అందు విప్రనారా యణ చరిత్రము, రఘునాథాభ్యుదయము * నానువి వరుసగా 1950, 51 సం. లలో తం. స. మ. వారిచేఁ బ్రకటింపఁబడినవి. కడమమూఁడు ముద్రితములు. * అవి :

---

* ఇది తన్నాత్మకా ప్రాయమగు రఘునాథ నాయకాభ్యుదయ ద్విపద కావ్య ముతోఁగూడ నొక్క—సంపుటముగా డాక్టరు శ్రీ నేలటూరి వెంకటరమణయ్య, శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారల విలువ గల విపులము లగు ఆంగ్లాంధ్ర పీఠి కలతోఁ బ్రకటింప బడినది. ఇందలి రఘునాథ విజయరాఘవుల కాలముల కవియే ఆధారము.

* ఇవి యిటీవల ఆం. వి. క. ప. వారిచేఁ బ్రచురింపఁ బడినవి.

౧. కాళీయమర్దనము. (తం. స. మ. కే. నం. 500)
పూతనాహరణము. (తం. స. మ. కే. నం. 554)
ప్రహ్లాద చరిత్ర. (తం. స. మ. కే. నం. 541)

విజయరాఘవుఁడు మన్నారుగుడి క్షేత్రస్వామియగు రాజ గోపాలదేవుని భక్తుఁడు. మన్నారని స్వామినామాంతరము. మన్నారు దాసని విజయరాఘవుని మాఱుపేరు. ప్రాయికముగా నతని ప్రతి కృతియు రాజగోపాలస్వామి కంకితమైనదని చెప్పవచ్చును. ప్రహ్లాద చరిత్రమునఁదప్ప ప్రతిగ్రంథారంభమునను 'భోజకన్యాముఖాం భోజ రాజమరాళ' — ఇత్యాదియగు దత్తునతి సీస మొకటి గలదు. తదుపరి రఘునాథనాయకాభ్యుదయ ద్విపదకావ్య ప్రారంభమునందలి 'శ్రీరాజ గోపాల చిరకీర్తిజాల', 'కలాశాంబునిధి కన్య కల్యాణధన్య' యను ద్విపదలు పూతనాహరణమునఁదక్కఁ గడమ యన్నిట నున్నవి.

సామాన్యముగాఁ ప్రతి కృతియందు నిష్టదేవతా స్తుతికిఁ బిదప నొకవచనమున విజయరాఘవసంబుద్ధులు కొన్ని, యీవెనుకనే 'పరాకు స్వామివారు హావణించిన.....నాటకంబు నటన పటిమ గనుపించ వినుపించేము వినవధరించుండ' యని రూపక ప్రరోచన గనిపించును. ఇది ప్రదర్శకులచే పఠింపఁబడుట కుద్దేశింపఁ బడినట్లు తోఁచును. ఇదియే 'కైవార' మని రఘునాథాభ్యుదయ విప్రనారాయణ చరిత్రములందు బేర్కొనఁబడినది. ప్రతి కృత్యంతమునను గవి స్వవిషయకమగు నొక వచనము, నందు గడమ మూఁడింట మాత్రమే యొక శుభాశంసన మునుగలవు. అదే భరత వాక్యముగాఁ బూతనా హరణమునఁ బేర్కొనఁబడినది. ఆకైవారము, భరతవాక్యము ననునవి కవి యుద్దేశ పూర్వకముగనే ప్రవాసియుండును. కొన్నిటి ప్రతులలో నామాటలు లోపించి యుండవచ్చును. కా. మ., పూ. హా., ప్ర. చ. మూఁడును

నాటకచాటు కావ్యములని కంకోక్తిగాఁ జెప్పబడినవి. కడమ రెండు నాటకములని మాత్రము పెరొక్కొనఁబడినవి. అన్నియుఁ బ్రబర్శనోద్దిష్టములైనవని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. కొన్నిట రంగప్రయోగ సూచనలును గలవు.

గ్రంథ సమీక్ష

1. కాళీయ మర్దనము:

రాజగోపాలస్వామి గోపీల గోప్రళయులను మునుల సంప్రార్థన మునఁ దపమును నెఱపిన కాళీయ మర్దనకేళి మఱుల నొక నాటకము వలె ప్రదర్శించుట యిందలి విషయము. ఇదికడు చిన్న కృతి. కథా శరీరము, నాటకీయతయుఁ దక్కువ. గ్రంథ మంతయు నొక చిన్న వచనము, నొక చిట్టి దరువు చొప్పున సాగిపోవును. దరువులు ఆహిరి, సావేరి, ముఖారి, నాట, వసంత, భైరవి, గుమ్మకాంబోది, కల్యాణి మొదలగు రాగములలో నున్నవి. ఒకసీసము నొకయాట వెలఁదియు నొండు రెండు చోట్ల ద్విపదలును గలవు. రచన యేమంత ప్రౌఢము గాదు; ప్రారంభదశను సూచించును.

ఇందు కవి తన పితృవర్గము మూఁడు తరముల వారినిఁ బేరొక్కొనెను. వారు చినచెవ్వయాచ్యుత రఘునాథులు.

ఇది యనఁగా, జలక్రీడలు — గోపికా వస్త్రాపహరణ మనఁగా నిట్టి యక్షగానము లానాఁడు రంగమున నెట్లు ప్రదర్శింపఁబడు చుండెడివో!

2. రఘునాథాభ్యుదయము:

ఇది విజయరాఘవుని రఘునాథ నాయకాభ్యుదయ ద్విపద కావ్యమునకు యక్షగాన రూపపరివర్తనము. అందలి ద్విపద చరణము

లనేకము గ్రహింపఁబడి నచ్చుమ దరువులు, వచనములు ననుసంధింపఁ బడినవి.

ఇందలి యవతారికలో నాయకరాజ వంశ చరిత్ర ప్రశస్తులు, తంజాపుర వర్ణనయును గలవు. ఇది విజయ రాఘవు నెమటనే ప్రవర్తింపఁబడినట్లు గలదు. అందు స్త్రీలును పాత్రధారణము చేసినట్లు చెప్పఁబడుట విశేషము.

ఈగ్రంథము తాత్కాలికేతి వృత్తమగుట గమనింపఁ దగినది. అయ్యును చారిత్రకమైన విలువగలది. విజయరాఘవుని తండ్రియగు రఘునాథుఁడే యిందలి నాయకుఁడు. ఇందలి కథను ద్విధా విభజింప వచ్చును. పూర్వభాగము చిత్రరేఖయను పౌర (వార) కాంతతో నతని శృంగార కలాపము. పూర్వభాగమున నాఁటి నాయకరాజుల ప్రాభవ మెల్లఁ గన్నులకుఁ గట్టును. ఉత్తరభాగమునన్నొక క్రొత్తపోకడగలదు నాయకుఁడు సపరివారముగా స్వారివెడలుట రాజవీథుల సౌధ జాలకముల నుండి పౌరకాంత లతనిఁ జూచుట, అం దొక సుందరి చిత్రరేఖ యను నామె యతనిఁ జూడఁగనే మోహపరవశయగుట మొ॥. ఇది 'ఉలా' ప్రబంధపు పెత్తుగడ యని వీథికా కారులగు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు గుర్తించిరి. తొంబది యాఱు విధములగు తమిళ ప్రబంధములలో 'ఉలా' యొకటి* తంజాపుర

* "ఉలా" లక్షణము వైద్యనాథ దేశికుని 'ఇళక్కణ విళక్కప్పాటి యల్' అను తమిళలక్షణ గ్రంథమునఁ గలదు. సూత్రములు : 97 — 102, తమిళమున ఉలాకు 'కలివెణ్బా' ఛందో నియమము గలదు తొల్కాప్పియమున ఉలా పేరొక్కనఁ బడలేదు. కాని యాలక్షణమునకుఁగొంత ప్రసక్తి యున్నట్లూహింప వచ్చునట. (ఇది నేను గ్రంథములఁగన్న విషయము గాదు. పండితుల వలన విన్నది మాత్రమే).

ప్రభువగు విజయరాఘవుండా తమిళ సాహిత్య సంప్రదాయమును గ్రహించుటలో వింతలేదు. తరువాతి దక్షిణాంధ్ర యక్షగాన కవులనేకు లనేకవిధముల విజయరాఘవు ననుకరించుచువచ్చిరి. విజయరాఘవుఁ డిందు త్తరభాగమునసే యాంధ్రప్రబంధ ప్రక్రియను గూడ భాగుగాఁ జొప్పించినాఁడు—నాయిక విరహావేదన, చెలుల శిశిరోపచారములు, రతిరాజ పూజ, చంద్రమదన మందానిలోపాలంభాదులేగాక చిలుక రాయబారముగూడ నుండుట యొక విశేషము. ఇందున్నట్లు చిలుకలకు, నక్లే గోపికా వస్త్రాపహరణాది యక్షగానములందు జలక్రీడలాడు మొలబోడి యాడువారికిని సంభాషణలు దగిల్చిన యాయాగ్రంథకర్త లవి యెట్లు ప్రదర్శింపఁబడవలెనని యూహించిరో తెలియదు. విజయరాఘవుఁడీ గ్రంథమును నాటకము, ప్రబంధము నసియుఁ బేర్కొ-ని యుండుటచేతఁ బూర్వోత్తర భాగములఁ గ్రమముగా నా రెండింటి లక్షణములును బట్టిసవి.

ఇందలి రచన మంచి యొడుపు గలది. ఇందుఁబద్య మొకటి, పలుతావుల ద్విపదలు, ప్రసిద్ధ రాగ తాళములలో దరువులు, పదములు, సంధి వచనములును గలవు. వచనములలో సంభాషణ కొలఁదిగాఁగలదు. '(ఇక్క-డ) సరిపోయిన పదం వినిపించేది' అని యిట్లొకటి రెండు చోట్ల ప్రయోగ సూచనలు గలవు.

ఇందు గ్రంథాంత గద్యలో "రఘునాథ భూపాలుండు...నిజలీలా విలాస శృంగాటకంబుగా నాటకంబు హావణించిన తన ముద్దుపట్టి యగు విజయరాఘవ పట్టభద్రునకుఁ బట్టంబు గట్టి" నట్లు గలదు. అనఁగ రఘునాథుఁ డీగ్రంథరచన నెఱిగిఁయున్నట్లు తోఁచును. రఘునాథుని నిధన కాలము క్రీ. శ. 24-1-1631 (చూ. మల్లంపల్లి వారి పీఠిక పుట 27, 28). అందుచే రఘునాథాభ్యుదయ రచన క్రీ. శ. 1630 లో జరిగినట్లూహింప నగుచున్నది.

3. పూతనాహరణము :

ఇది నాటకీయతయు జాతీయతయు వెల్లివిరిసిన యక్షగానము. ఇందిది 'యశోదా వాక్యం' ఇది 'చెలికత్తె వాక్యం' అని యిట్లు పాత్ర సంభాషణ సూచనలు గలవు. ద్విపదలు, దరువులు, వచనములును గలవు. సంభాషణలు వచన ప్రచురముగాఁ బాత్రోచిత భాషలో సాగినవి. కవి వచనములను పేర నవి వచనములు గావు. పద్యములే యుదాహరింపఁబడినవి. అవి కథానుసంధాయకములు. అనఁగాఁ గవి వచనమనిన నది పద్యమైనను. సంధివచనమన్నమాట. ఇందుఁ గొన్ని రంగప్రయోగ సూచనలు గలవు. ఉదా :—

1. "అవురా యీ రీతిఁజెలి చేతనున్న కుమారునిఁ జేకొని యశోద చెక్కిలినొక్కి యక్కునఁ జేర్చి ముద్దాడి యొక్క దరువు బాలచుఁజక్కని కోపులు రహికెక్క నటించెనట యెటువలెను".

2. "పొత్తులలో బాలుని యశోద యెత్తుకొని యప్పుడు తత్తదిగ తోమని తగు కరతాళంబు లొత్తులు నటియించెను".

3. "కొంత సేపు తామును సివమూడి యంతట సివము నిల్పేది".

4. "యశోద రంగమధ్యంబున మంగళ ప్రదంబుగా నటించెనట యెటువలెను".

ఇందు గ్రంథాంతమున భరత వాక్య ముటంకింపఁబడినది.

ఇందలి కథ ప్రసిద్ధమైనది. విగతాసువైనఁ బూతన కళేబర మీడ్చుటకు నందుని యూన వచ్చిన గొల్లల సుద్దులు, వారి పదగోష్ఠి, నందనందనునకు "భూతావేశ జాత భీతి విమోచనంబునకు స్వస్తివాచనం బొనరింప" వచ్చిన పురోహితుల ప్రసంగములును హాస్య ప్రకృష్ట

ములై పాత్రోచిత భాషలో జాతి వార్తాచమత్కార చారువులుగా సాగినవి.

ఇందు పురోహితుల సంకల్పమునఁ బేరొక్కనఁబడిన ఖర సంవత్సరమును గ్రంథరచనాబ్దమున కొకి భంగ్యంతర సూచనగా గ్రహించినచో నది విజయరాఘవుని పరిపాలన కాలమున క్రీ. శ. 1651 అగుచున్నది.

4. విప్రనారాయణ చరిత్ర:

విప్రనారాయణుఁడు ద్రవిడ దేశమున వైష్ణవమత ప్రవర్తకులగు పన్నిద్దరాళ్వారులలో నొకఁడు. అతని కథ రసికలోక ప్రసిద్ధము. అది యితివృత్తముగాఁ దెనుఁగున నొక మూఁడు ప్రబంధములును, నాలుగు యక్షగానములును వెలసినవి. రచనాప్రౌఢిని బట్టి యీ యక్షగానములలో విజయరాఘవ కృతియే మేల్తరమైనది; అసలు నేఁడుపలబ్ధములగు నతని కృతులన్నిట నదియే మిన్న.

విజయరాఘవుఁడు తనకెంతో ప్రాచీనుఁడైన విప్రనారాయణుని సమకాలికునిగాఁ జిత్రించెను. కథారంగమును శ్రీరంగమునుండి మన్నారుగుడికి మార్చెను. అతఁడు తన యాస్థానముననే విచారింపఁ బడినట్లును, దేవదేవి తనయెమటఁ బడకేళిక వినిపించినట్లును భావికొనెను. ఇది యసంగతము స్థూలముగాఁ జూచినచో నతని సాహిత్యమంతయు నిట్లే తదవహంప్రత్యయ ప్రవణముగా నున్నదని చెప్పవచ్చును.

ఇందు చక్కని హాస్యకుశలతఁ బ్రదర్శించినాఁడు కవి; కాని శృంగారపు నంగిరి యోడినాఁడు. నాయకపాత్ర యందలి యుదాత్తత నించుక చెనకినాఁడు. కాని దేవదేవి, విటకంటకి, విప్రనారాయణ శిష్యుల పాత్రలను దత్తదుచితముగాఁ జిత్రించినాఁడు.

ఇందు దరువులు, పదములు, దీర్ఘవచనములు, ద్విపదలు, పద్యములు, సంస్కృత చూర్ణికలు, తమిళ ప్రసంగములు, అష్టకము, యూల (ఏల) పదము, విన్నపము నను రచనా విశేషములు గలవు. పాత్రల సంభాషణలు నాటక ఫక్కిని చక చక నడచును. అచ్చటచ్చట ముచ్చటైన వర్ణనలును గలవు. ఇందు వచన రచన కంటె దరువు హరువు, కందము చందమును మేల్తరములు.

ఇందు స్వామి తిరువారాధన సంరంభమున సంకల్ప వ్యాజమునఁ బేర్కొనఁబడిన నందననామ సంవత్సరము విజయరాఘవుని రాజ్యకాలమున క్రీ. శ. 1652. అది యేతత్కృతి రచనాకాలమైనఁ గావచ్చును. కాని, ప్రౌఢినిబట్టి కాక రచనా ప్రక్రియా పరిణతినిబట్టి చూచినచో నిది పూతనా హరణమునకు ముందే రచింపఁ బడినదా యనిపించును.

5. ప్రహ్లాద చరిత్రము :

ఒక సుదీర్ఘ సీస మాలికలోఁ గవి స్వీయకృతులన్నిటిని బేర్కొనుటతో గ్రంథారంభము. అందుచే నా కృతులన్నిటికి నిది పీఠిక రచన యనఁదగును. అందు మన మూహింపఁగల యంతటిలో వి. నా. చ. కడపటిది. తద్రచనాకాలము క్రీ. శ. 1652. అనఁగా నిది యంతకుఁ దరువాతిదని మాత్రము చెప్పనగును.

కథ ప్రసిద్ధము. ఇందలి హిరణ్యకశిపుని కొలువుకూటము నాయకరాజాస్థాన సన్నివేశమునే తలపించును. అర్వాచీన యక్షగానము లనేకమున నొక సాంప్రదాయికపాత్రగా రూపొందిన కటిక వాని వాలకము మొదటగా నిందే కన్పట్టును. ఇందు ప్రహ్లాదుని గురువులు, పాములజోగి, జెట్లు, పురోహితులు మొదలగువారి ప్రసంగములలోఁ బాత్రోచిత భాష ప్రయుక్తమైనది. ఇందును :— "ఇక్కడ

విదూషకుండు హాస్యస్ఫుటమాటలాడేది", "పదం సమయోచితంగా వినిపించేది", ఈ దరువాడి తీరుచున్నే హిరణ్యకశిపుని కళేబరం త్రోసివేసేది" అని యిట్లు గ్రంథ మధ్యమునఁ బలుతావుల రంగ ప్రయోగ సూచనలు గలవు. "ప్రహ్లాదోఽహ మభివాదయే", "మొక్కెను మొక్కెనయ్యా" ఈ రెండింటిలో సరిపోయేది చెప్పి మొక్కేది" అను సూచనలో నిది పండిత పామర సామాజికు లిరువురకు నుద్దేశింపఁబడినదని తోఁచును. గ్రంథాంతమున కేటలాగులో వివరింపఁబడిన విశేష మొకటికలదు. అది "ఈ ప్రహ్లాద చరిత్రకు పాత్ర ప్రవేశాలు వివరం" — "నరసింహుఁడు (౧), ప్రహ్లాదుఁడు (౧), వానరం (౧), కటికవారు (౨), రంభోర్వసులు (౨, కూడానుజనం (౩౦)." ఇదంతయుఁ జూడ నాఁడీ నాటకములు రాజాస్థానములందుఁ బ్రదర్శింపఁబడిన వనుట నిశ్చయము.

ఈ గ్రంథమునను నాటకీయత వెల్లివిరిసినది. రచనలోఁ బూత నాహరణమునకును దీనికినిఁ జాల సామ్యము గలదు. ఇందును వచన భాగ మెక్కువ. దరువులు చిన్న చిన్నవి, అంత తఱచుగా లేవు. ద్విపద భాగమును దక్కువయే. ఇందొక "విన్నపము" ను గలదు.

విజయరాఘవుని కృతులను రచనా ప్రౌఢినిబట్టి సమీక్షించి నచ్చోఁ బాత్రోచిత భాషా ప్రసంగాదులందలి వ్యావహారిక ధోరణి బుద్ధిపూర్వకమైనది. కావున నది పరిగణింపకున్నచో నతఁడసలు లక్షణ ప్రతిపత్తిగల కవియనియే చెప్పనగును. అతని రచనలో సారళ్యము లేని పట్టుగాని, సారస్యములేని భావముగాని సాధారణముగ నుండవు. దృశ్యరచన కెట్టి రచన యుపాదేయమో యట్టి రచనమే చేసినాఁడతఁడు. దరువు, పదము, ద్విపద, గద్యము, పద్యము మొదలగు ప్రతి రచనావిశేషము గతి రహస్యము నతని కథిగతార్థమే. వానిని సంద ర్భానుసారముగాఁ బ్రయోగించుటయందును నిపుణుఁడు.

రచనాప్రక్రియను బట్టి యతని కృతులను సమీక్షించినచో నొక క్రమపరిణతి కనిపించును. అతనికృతు లంతకంతకు గేయధర్మమును దగ్గించుకొని రూపక కళ నెక్కువ సంతరించుకొన్నవి. వానిపై మార్గ నాటక ప్రభావ మించుక పొడసూపినది. విజయరాఘవుఁ డుద్దేశపూర్వ కముగ యక్షగానమునకా పేరికిఁ బ్రత్యామ్నాయముగా నాటక నామకరణము చేసినట్లు తోఁచును.

యక్షగాన మన్న నతివేలప్రియత్వము జూపి విదగ్ధతతో నా ప్రక్రియ కొక విశిష్టపరిణతి కల్పించి యర్వాచీన కవులకుఁ గొందఱు కను కార్యుఁడై కొంతకాలముపా టొక విశిష్టరచనా ప్రక్రియగా పరిఢవిల్ల గల సాహిత్య ప్రతిష్ఠ దానికి గడించిపెట్టిన విజయరాఘవుఁడు కడు శ్లాఘనీయుఁడు. యక్షగాన ప్రదర్శన ప్రతిష్ఠ లడుగంటినను దద్వాఙ్మయ చరిత్రలో నతనికీర్తి చిరస్థాయి.

---

4. కామరుసు వెంకటపతి సోమయాజి

విజయరాఘవ చంద్రికా విహారము (లేక విలాసము) :*

కవి తంజావూరు విజయరాఘవ నాయకుని "పట్టంపు కవి" నని పలుమఱు చెప్పుకొనియున్నాఁడు. విజయరాఘవుని రాజ్య కాలము క్రీ. శ. 1633–1673. అగుటచేఁ గవియు నాకాలమువాఁడే యగును.

---

* అముద్రితము. తం. స. మ. కే. సం. 603. ఇది యిటీవల (1956 సం.) ఆం. వి. క. ప. వారిచేఁ బ్రచురితము.

గ్రంథవిషయము :— విజయరాఘవుఁ డొకనాఁటి వేయి పాద చారియై చంద్రికా విహారియై నగరి సానికూఁతుల 'కేరి' (ఉనికిపట్టు) దారిగా రాఁగా నాయనివారి బైటి నాటకశాల పఱుచైన లీలావతి యాతనిఁజూచి మోహించెను. ఇదియుఁగొంతవట్టు "ఉలా" ప్రబంధపుఁబోకడ. తదుపరి యాపెవిరహ వేదనాదికము ప్రబంధోచితముగా నాగినది. పూర్వ మామెయే యూర్వశియఁట, విజయ రాఘవుఁడే విజయుఁడఁట! అని యామె యొకకల గన్నదఁట! ఊర్వశికిఁ బూర్వసఖ గావున రంభ "కొరవంజి" యై వచ్చి లీలావతిని దీవించినదఁట. లీలావతి చెలికత్తెయగు చకోరికచే నాయనివారికి వలపువక్కాణ కమ్మ పంపెను. ఆయనయుఁ 'దన చిరంతన వృత్తాంత మెఱుంగును గనుక' నామె మనవి నంగీకరించి యొకవెన్నెలదేయి లీలావతి కేరి కరిగి యాపె కోరిక నెఱవేర్చెను.

రచన :— గ్రంథారంభమున విజయరాఘవ సంబుద్ధి ప్రచుర ముగా, కవి కావ్యసంకల్ప విషయికముగా నొకదీర్ఘవచనము గలదు. ప్రాయికముగా నది "కైవాగము" కాఁదగును. తదుపరి నాందీ శుభాచారము, దేవతాస్తుతి, నాయకప్రశంసలతోఁ గథారంభము. గ్రంథాంతమున భరతవాక్య మనుపేర కవినామ నాటక నామములతో, నాయక శుభాశంసనముతో గద్యగలదు. కవి తన కృతిని విజయ రాఘవునివలెనే నాటకచాటుకావ్య మని పేర్కొనినాఁడు. "శృంగార రసవర్షావిర్భావంబునకు గరోబెటకంటుగా" నిర్వహించితి నని యున్నాఁడది యథార్థము. ఇందు ప్రసిద్ధ రాగతాళములలో దరువులు, పదములు, కొలఁది పద్యములు, ద్విపదలు, సంధివచనములు, సువాల, శోభనము గలవు. సంభాషణలు తఱుచు దరువులలోను, ద్విపదల లోను నున్నవి. రచన సరసమైనది. వర్ణనలు స్వభావోక్తి సుభగము లైనవి.

ఇందలి పదములు శ్లేత్రయ పదఫక్కి మూఁదలగా రచింపఁబడినవి. అసలు శ్లేత్రయ పదమే యొకటి "సుదిన మాయెనే యీ ప్రొద్దు" అనునది యిందు గ్రహింపఁబడినది. (చూ. ఆంధ్ర గాన కళా పరిషత్పత్రికురణ "శ్లేత్రయ పదములు" విజయరాఘవముద్ర, నం. 11 రాగతాళములు మాఱినవి కాని యచ్చముగా నిదే పదము). ఇందు "కొరంద(జి) దరువు" లొక విశేషము. వానిలోఁ గొరవంజి వేషభాషలు వర్ణితములు. ఇందనేక ప్రయోగ విశేషములును గలవు.

---

5. పసుపులేటి రంగాజమ్మ

మన్నారు దాస విలాస నాటకము:

ముద్రితము (ఆం. సా ప. ప్రచురణ, 1927.)

రంగాజమ్మ విజయరాఘవ నాయకుని యాస్థాన కవయిత్రి. తండ్రి వెంకటాద్రి. తల్లి మంగమాంబ. ఈమె బహుముఖ వైదుష్యము గలది. మన్నారుదాస విలాసము, సుషాపరిణయము నను ప్రబంధములు రామాయణ భాగవత భారత కథాసంగ్రహములు మొదలగు ననేక కృతులు రచియించి విజయరాఘవ విరచిత కనకాభిషేకయైనది. (చూ. మ. దా. వి. నాటక గ్రంథాంత గద్య.)

తెలియవచ్చి నంతలో మన్నారుదాస విలాస ప్రబంధ* మామె ప్రథమ కృతి. నాటకమామె చరమకృతి. ఈ నాటక మా ప్రబంధము నకుఁ బరివర్తనమే. రెండిటిని బోల్చి చూడఁగా దేలిన విషయములు :

---

* ఇది ఇంకను ముద్రితముగనే యున్నది. తం. స మ. కే. నం. 214. (పొరపాటున కేటలాగులో ముద్రితమని సూచింపబడినది.)

రెండిట నితివృత్త మొక్కటియే. ప్రబంధమున దీర్ఘముగా వర్ణితములైన నాయిక వనవిహారాదికము, విప్రలంభము, పెండ్లి వేడుకలు మొ॥ నాటకమున సంగ్రహింపఁబడినవి. అందొక దీర్ఘవచనమునన్న భోజనవర్ణన నాటకమునఁ బరిహరింపబడినది. ప్రబంధమునలేని విద్వద్గోష్ఠి, జోస్యుల "యేషాగాథాలు" ఎఱుక ఘట్టము, గొల్లల ప్రసంగములు, పురోహితుల తగవులాట, ముత్తైదువుల ముచ్చటలు మొ॥ నాటకమునఁ గ్రొత్తగాఁ జేర్చఁబడినవి. నాటకము నందలి పద్యములు చాల ప్రబంధమునందున్నవే. ముఖ్యముగా సీసములు నాటకము నందున్నవన్నియు (ప్రారంభసీసముదక్కా) యథాతథముగఁ బ్రబంధము నందున్నవే. ప్రబంధ సీసములు మఱికొన్ని నాటకమున దరువులుగా, ద్విపదలుగాఁ బరివర్తింపఁబడినవి.

మన్నారు దాసనఁగా విజయరాఘవుఁడే. అతని విలాసమనఁగా నతని సభావైభవము, నిష్పక్షపాతమగు మన్నారుస్వామి కతఁడొనరించు ఫాల్గునోత్సవము, నూరేగింపు, నాసందర్భమునఁ గాంతిమతి యనునొక యువతి విజయరాఘవునిఁజూచి మోహపరవశయగుట, (ఇది 'ఉలా' ప్రబంధపు బోకడ), ఆమెతో నతని వివాహము నిందు వర్ణితములు. ఈగ్రంథమునకు రఘునాథాభ్యుదయముతోఁ గొంత పోలిక గలదు. సమకాలిక జాతీయజీవన ప్రతిబింబన మీగ్రంథమునఁ గల గొప్ప విశేషములలో నొకటి.

రచన :- వరుసగా గ్రంథాద్యంతములందుఁ గైవారము, భరతవాక్యమును గలవు. రెండును గద్యలే. కైవారమున దైవస్తుతి, భరతవాక్యమునఁ గవయిత్రి విషయమును గలవు. కవి వచనము లనుపేరఁ బద్యములున్నవి. వేఱు సంధివచనములు గలవు. అవి వచనములే. వరుసగా రెండిటఁగథాఖ్యానానుసంధానము లుద్దిష్టములు. ఇందలి ప్రధాన

రచనా విశేషములు దరువులు, పద్యములు, వచనములు. దరువు లెక్కువగా ముఖారి ప్రముఖ ప్రసిద్ధ రాగములలోఁ గలవు. అందుఁ చాళము కంటె రాగమునకే యధిక ప్రతిపత్తి. కొన్ని యచ్చు మచ్చు జావళీలవలె నున్నవి. పద్యములలో సీస ప్రాచుర్యము గనిపించును. అవి ప్రతిపాద సమతాపాదనముతోఁ జక్కఁగా నున్నవి. వచనములోఁ బాత్రల సంభాషణలును దస్తదుచిత భాషలో నాఁటి తంజావు రాంధ్ర వ్యవహార సరళిలో నడచినవి. సంధి వచనము లనుప్రాస ప్రచురములు. ఇవికాక శ్లోకములు, చూర్ణికలు, బహువిధ ప్రాకృత తమిళ కన్నడ ప్రసంగములు, ద్విపద, మంజరి, లయగ్రాహి, ధవళ శోభనములు, సువ్వాలలు, జోలలు మొ॥ రచనా విశేషములు గలవు. అచ్చటచ్చట లక్షణచ్యుతి యున్నను జక్కఁగనే సాగినది రచన.

ఇందిది 'ఆచార్యుల మాట,' 'ఇది రాజచంద్రుండు చదివే ద్విపద' అని యిట్లు పాత్రప్రసంగ సూచనలు, నొక్కొక్క సన్నివేశమై పోవునంత "అనంతర కథా సంవిధానం బెటువలెను" అని యిట్లంక ప్రాయ సందర్భవిభాగ ప్రయోగ సూచనలును గలవు. ఇందుఁ దంజాపురము, ఊరేగింపు, పెండ్లిమున్నీము మొ॥ వాని వర్ణనలు గలవు. తంజాపుర వర్ణన ప్రబంధోచితముగా నున్నది. తక్కినవి స్వభావోక్తికిఁ దగియున్నవి. కవయిత్రి తానీ గ్రంథమును శృంగార కరుణహాస్య శాంతాది రసంబులు పొదల 'రచించితి' నన్నది. శృంగారహాస్యములు సమృద్ధిగాఁ గలవు. గాని కడమవాని కసలు ప్రసక్తి లేదు.

ఇందు ఫాల్గునోత్సవ శ్రీముఖమున శుభ కృత్ఫాల్గునము పేర్కొనఁబడినది. అది విజయరాఘవుని రాజ్యకాలమున క్రీ. శ. 1663 సం. నఁ బడినది. ఈ గ్రంథ రచన మంత కించుక తరువాత జరిగియుండును.

6. పురుషోత్తమ దీక్షితుఁడు

తంజావురాన్నదాన మహా నాటకము : *

ఆంధ్ర వాఙ్మయమున నపూర్వము, విలక్షణము నైన కృతి యిది. గ్రంథకర్తయగు పురుషోత్తమ దీక్షితుఁడు విజయ రాఘవు నాస్థానకవి. అతనికే తన కృతి నంకితమిచ్చినాఁడు. సత్ర మరు లని గ్రంథనామాంతరము. తంజావూరిలో నాయక రాజులు నెలకొల్పిన యన్నసత్రములో సకుటుంబముగాఁ 'దడియా' వేసిన పప్పు తిప్పాభట్లను సోమరిపోతు భావనయ్య యొకఁడు తైతక్కలాడి డబ్బు సంపాదించుకొనుటకు సత్రమునకు వచ్చిన ఉత్తరాది వెంగసాని, జక్కుల రంగసాని యను వారితోఁజేసిన విరసములైన శృంగార ప్రసంగము లిందలి ప్రధాన విషయము.

ఇందు గ్రంథాద్యంతములందు గద్యలోఁ గైవారము, భరత వాక్యము, వరుసగాఁ గృతిపతి సంబుద్ధులును, శుభాశంసనము విషయములుగా నున్నవి.

ప్రక్రియగా నిది యొక ప్రపరిణత యక్షగానము. రచన ప్రహసన ప్రాయమైనది. గ్రంథమంతయు వచన ప్రచురమైనది. పాత్రల సంభాషణలలో నిందున్న వచనభాగ మిఁక నే యక్షగానము నందును గన్పట్టదు. అం దఱవయాస వచ్చిపడిననాఁటి తంజావురాంధ్ర భాషావ్యవహార ఫక్కి పరిశీలింపఁదగినది. కొందఱు సత్రోద్యోగుల సంభాషణలలోఁ గేవల మఱవమే వాడఁబడినది. ఇందలి దరువులు చిన్న చిన్నవి సాధారణముగాఁ బాత్ర ప్రవేశ సందర్భములందుప

* తం. స. మ. కే. సం. 529. ఇటీవల ఆం. వి. క. ప. చేఁ బ్రచురితము.

యోగింపఁబడినవి. పద్యము ఒక్క కందము నొక శార్దూలమును గలవు. ఇందొక మూఁడు చక్కని పదములు గలవు. అందొకటి విజయరాఘవాంకితము. ఒకటి విజయ రాఘవ కృతియే కాఁదగును.

తాత్పర్యలికేతి వృత్తములు, హాస్యప్రధానములు నగు నిట్టి కావ్యములు పూర్వాంధ్ర వాఙ్మయమున మిక్కిలి యరుదు. కవి యీ కృతిని శృంగార హాస్యాద్భుత ప్రధానంబుగా రచియించితి నని యన్నాఁడు. కాని శృంగారమున కింపు రసస్థితి లేదు. సరికదా యది రసాభాసము మాత్రమే యైనది. ఇందలి హాస్యము మిగుల చమత్కారవహమైనదే కాని యదియు రసస్థాయి కాదు. కవి హాస్య వ్యాజమునఁ బలుతావులఁ ననౌచిత్యమునకుఁ బాల్పడినాఁడు. ఇందద్భుతము పొడ గానరాదు.

సత్రము కరణము తిరుమలకొళంది తమిళప్రసంగమున "కీలక-ళంగుని" పేరొక్కనబడినది. గ్రంథ రచనాకాలమున కదియొక భంగ్యంతర సూచనకావచ్చును. అది విజయ రాఘవుని రాజ్యకాలమున క్రీ. శ. 1669లోఁ బడినది.

---

7. కోనేటి దీక్షితచంద్రుఁడు

విజయరాఘవ కళ్యాణము :♦

ఈ గ్రంథకర్తయు విజయరాఘవు నాస్థానకవియే. ఏతత్తర్కాంతాంత భరతవాక్యమును (గద్య) బట్టి యితఁడు రామానుజాచార్య తనయాగ్రగణ్యుఁడు, విజయరాఘవ సన్మానితుఁడు, శతక్రతు శ్రీనివాస దేశిక ప్రతిష్ఠాపితోపాధ్యాయ వైభవధుర్యుఁడును, సోమయాజియు, సంగీత సాహిత్యవిద్యా విశారదుఁడును, వాదనిపుణుఁడు నని తెలియుచున్నది.

రాజగోపాలస్తుతి, విజయరాఘవ కైవారములతో గ్రంథారంభము. తదుపరి తంజాపుర వర్ణనాదికముతోఁ గథారంభము. మృగయావిహారార్థము వనమున కేఁగినాఁడు విజయరాఘవుఁడు. వనవిహారార్థమచటికి వచ్చినది మదనమంజరి యను రాజపుత్రి. వారి కచట తొలిచూపులో వలపు తొలకరించినది. అది వారి కళ్యాణమునఁ బర్యవసించిన కథయే యిందలి యితివృత్తము. ఈకృతి కితివృత్తరచనా ప్రణాళికలయందు రంగాజమ్మ మన్నారు దాసవిలాస నాటకముతోఁ జాలపోలిక గలదు. మృగయాప్రసంగ సందర్భము మాత్ర మొకఁ డెక్కువ. ఇందుఁగల పోలిక యంతయుఁ బ్రణాళికకుఁ జెందినది. రచన స్వతంత్రముగను ప్రౌఢముగను సాగినది.

ఇందు కొలఁదిపద్యములు, ద్విపదలు, కవివచనములు, సంవాదవచనములు, వర్ణనల పట్టున ననుప్రాస ప్రచురములగు దీర్ఘవచనములు,

---

♦ తం. స. మ. కే. సం. 602. ఇటీవల ఆం వి. క. ప. వారిచేఁ బ్రచురితము.

ప్రసిద్ధరాగములలో దరువులనేకము, బహువిధపదములు, ధవళశోభనములు, సువ్విపాట, లక్ష్మీకల్యాణము, కొరవంజి దరువు, శ్లోకములు, చూర్ణికలును గలవు. సంవాదవచనములలోఁ బాత్రోచిత భాష పాటింపఁబడినది. సన్నివేశములు వాస్తవికముగ నున్నవి. కతిపయ ప్రయోగ సూచనలు గలవు. కవి తన కృతిని నవరసశృంగాటక మగు నాటకరాజమనియు, మహానాటకమనియుఁ బేర్కొనెను. అవి మాట వరుసలు.

విశేషములు :—కృతి నాయకుని తండ్రి తాతల తరము లిందుఁ బేర్కొనఁబడినవి. అతఁడు రామభద్రానుజుఁడని తెలియవచ్చినది. ఇందలి మృగయావిహార సందర్భమునఁ జెంచుల ప్రసంగములు, పదములు నాటవిక జీవిత విశేషములను జక్కగా విశదపరచుచున్నవి. ఇందెఱుక ఘట్టము, విద్యద్గోష్ఠి మొ॥ గలవు. ఊలాప్రబంధపుఁ బోకడయుఁ గలదు.

---

8. మన్నారు దేవుఁడు

హేమాబ్జ నాయికా స్వయంవరము : *

మన్నారుదేవుఁడు తంజావూరు విజయరాఘవ నాయకునకు రాజగోపాలాంబిక యందుఁ గలిగిన తనయుఁడు. ఇతఁడు తంజావూరు గద్దెనెక్కలేదు. క్రీ. 1673 లో మధుర నాయక రాజులతో సంభవిం

* తం. స. మ. కే. నం. 674. ఇటీవల ఆం. వి. క. ప. ప్రచురితము.

చిన యుద్ధమునఁ దండ్రితో పాటితేఁడును నిహతుఁడయ్యెను. ♦ కాని హే. స్వ. గ్రంథాంత గద్యలో నీతఁడు కనకతులాది దానములు, నగ్రహార ప్రతిష్ఠాపనములును జేసియుండెనని చెప్పఁబడుట జూడఁ దండ్రి రాజ్యకాలమునఁ దాను యువరాజ పట్టభద్రుఁడై యుండినట్లు తోఁచును. ఆ గద్యవలన నీతఁడు విజయరాఘవాభ్యుదయాది ప్రబంధములు రచించి నట్లు తెలియుచున్నది. కాని యీ హేమాబ్జ నాయికా స్వయంవర మొక్కటే నేఁ డుపలబ్ధము.

క్షీరసాగర మథన కథయు, గాజపుత్రికా స్వయంవర గాథ లును బ్రసిద్ధములు. కవి యీ రెండింటిని దనతండ్రి యిష్టదైవతములగు హేమాబ్జనాయికా రాజగోపాలస్వాముల (లక్ష్మీనారాయణులు) కల్యాణకథా చిత్రణవ్యాజమున జోడించినాఁడు. నడుమ ప్రబంధ ఫక్కిగా నాయికా నాయకుల విరహవేదన, రాయభారములు మొద లగునవి ప్రవేశ పెట్టెను. ఇందు విజయరాఘవుఁ డా వివాహ సంధానకర్త యఁట! ఇది యసంగతము. విజయరాఘవుని యాస్థాన యక్షగానములలోఁ దదుపజ్ఞములు రెండింటియందు, నాస్థాన కవి కృతులలో దీనితోఁ గలిసి నాల్గింటను విజయరాఘవపాత్ర కన్పట్టును. అవి యతని యాస్థానమున బ్రదర్శితములైనటుల తెలియుచున్నది. మఱి యతని పాత్ర నెవ్వ రెట్లభినయించెఁడివారో, అది యతని కెట్టు ప్రియము గొల్పినదో యూహకందని విషయము.

ఇందలి కథా సంవిధాన మంత లగువు బిగువులు లేనిది. కథ యొక విధముగాఁ బ్రసిద్ధమైనదైనను దచ్చిత్రణమున కవిసమకాలి కములగు పరిస్థితుల ప్రభావము బాగుగాఁ బడినది. ఇందలి నాయకుని

♦ Vide., "the Nayak kings of Tanjore," page 153 By Sri Vriddhagirisan.

కొలువు సింగారము, ముత్తైదువలు, పురోహితులు మొదలగువారి ప్రసంగములు – అన్నియు నట్టివే. ఆ ప్రసంగము లతి చతురములు, చమత్కార జనకములును గాని యందు విరసత్వమును గలదు.

మన్నారుదేవుని రచన యొకుదుసుకులు లేనిది చక్కని పలుకుబళ్ళు, సజీవమ్మైన ప్రయోగ విశేషములును బలుతావులఁ గలవు. కవి కనుప్రాస ప్రియత్వముగలదు. వచన రచనలో నదిహెచ్చు. వచన భాగ మెక్కువగనే యున్నది. వచనములో నలఁతి యలఁతి పదములతో నర్థవంతముగాఁ సంఘటనలు నడచును. ద్విపదల నలవోక పలుపోకలు పోయినాఁడు కవి. దరువు లెక్కడి కక్కడఁ దెగజెప్పును. అన్నియుఁ బ్రసిద్ధరాగ తాళాంకితములే. సువాల, ధవళ శోభనములు మొ॥ పెండ్లిపాటలు గలవు. లక్ష్మీకల్యాణము, సాంగత్య పదమును విశేషములు. గ్రంథారంభమున శైవారగద్య వంటి దొకటి కలదు. గ్రంథాంతమున భరతవాక్యము గలదు.

ఇందు కడలిరాయని కమ్మవక్కణలో సౌమ్య చైత్ర శుద్ధాష్టమి హేమాబ్జనాయికా స్వయంవర ముహూర్తముగాఁ బేర్కొనఁ బడినది. అది విజయరాఘవుని రాజ్యకాలమున క్రీ.శ. 29-3-1669 అగుచున్నది. అది గ్రంథరచనా కాలమునకు భంగ్యంతర సూచన కావచ్చును.

---

9. చల్ల సూరయ

వివేక విజయము :

(అముద్రితము. త. స. మ. కే. నం. 604, 605)

గ్రంథకర్త యగు చల్ల సూరయ పొందవాక వాసియు, సాంగవేదాధ్యయనశాలియు, అద్వైతవాదైకపరుఁడును, ఆపస్తంబ సూత్రుఁడును, కౌండిన్యసగోత్రుఁడు, పాపమా సూరుభట్టార్యుల పౌత్రుఁడును, లక్ష్మమా సూరయార్యుల పుత్రుఁడు నని యవతారికలోఁ గలదు. గ్రంథము దక్షిణద్వారకాధాముఁడగు రాజమన్నారు స్వామి కంకితము. (తంజావూరు మండలమందలి మన్నారుగుడియే దక్షిణద్వారక [1]. కవి నివాస మగు పొందవాక చెంగల్పట్టుమండలము లోనిది [2])

గ్రంథారంభమున శ్రీమత్సదానంద చిన్మయయోగి స్మరింపఁబడినాఁడు. అతఁడీ కవికిఁ దత్త్వోపదేశము చేసిన గురువై యుండును. 16 వ శతాబ్ది చివరనుండిన సత్తాత్రేయయోగి శిష్య పరంపరలో మూఁడవతరమున సదానందుఁడను నొక యవధూత యుండినట్లు, నతఁడు గ్రంథకర్త యనియును దెలియుచున్నది. [3] ఈ సూరయ యతని శిష్యుఁడే యగుచో 17 వ శతాబ్ది నడుమ నుండెనని యూహింప వచ్చును. (ఇప్పటి కిది యూహామాత్రము. నిర్ణయము కాదు.)

(1) చూ. కాళికవి రాజగోపాల విలాసము.

(2) Alphabetical list of Villages in the Madras Presidency. 1906.

(3) చూ. ఆంధ్ర కవి తరంగిణి — సంపుటము 10, పుట 183.

గ్రంథ విషయము:— కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయమున కీదియొక మానసస్ఫుర్తిక యని చెప్పినఁ జాలును. అది యిదివఱకే యాంధ్రమున నందిమల్లయ ఘంటసింగయలను జంటకవులచే నదే పేరుతోఁ బ్రబంధముగాఁ బరివర్తింపఁబడినది. సూరయ తన కృతిని "నాటకముగ, కూటనాటకాకలన" రచించితి ననున్నాఁడు. తత్త్వతఃఇది యక్షగాన ప్రాయమైన రచనయే. ఇందు వివిధ రాగములలో దరువులు, దీర్ఘద్విపదలు, వచనము, పద్యములును గలవు. రచన సలక్షణము, సరళము నైనది. కాని కవికి వేదాంత మతవాదములతోఁ గల పరిచయ మితరములయెడఁ గానరాదు.

---

10. పెదకెంప రాయఁడు

గంగాగౌరీవిలాసము: *

ఈ గ్రంథమును "హిరియకెంపనృపతి" లేక "పెదకెంప రాయఁడు" రచించినట్లు గలదు. "హిరియ" కన్నడ శబ్దము. "పెరియ" అను తమిళ శబ్దమునకును, "పెద్ద" అను తెనుఁగు శబ్దమునకును సమానార్థకము. హిరియ శబ్దపు టునికిని బట్టి కవి కన్నడ దేశవాసియై యుండుననియు, నేతద్గ్రంథ రచనచే నాంధ్ర భాషాభిజ్ఞుఁడు ననియుఁ దెలియవచ్చును. మైసూరు మండలమున శివసముద్ర ప్రాంతమునకు క్రీ. శ. 1418 నుండి 1728 వఱకు కెంపగౌడులను రాచవా రేలికలై యుండిరి.[1] అందు హిరియకెంపగౌడ నామధేయు లిరువురు

* అముద్రితము. ప్రా. లి. పు. భాం., డి. నం. 1864.

(1) For details Vide., Mythic Society Quarterly Vol. XII No. 4. (July, 1923) for Mr. B. Puttayya's Paper on the Kempa Gowda Chiefs. (Geneological table appended) – Page 738.

గలరు. మొదటి యతఁడు క్రీ. శ. 1513 — 1569 స. లనఁగను నుండిన వాఁడు. ఇతఁడే బెంగుళూరు నిర్మాత యఁట. రెండవ యాతఁ డతని చిన్న మనుమఁడు. ఇమ్మడి హిరియకెంప నామధేయుఁడు. ఇమ్మడి యనఁగా రెండవ యని యర్థము. అసలు పేరు హిరియకెంపఁ డనియే. ఈతని కాలము పదునేడవ శతాబ్ది యుత్తరార్ధము[2]. ఈ యిరువు రిలో నివ రీ గ్రంథకర్త యన్నది ప్రశ్న. యక్షగానము పుట్టినిల్లనఁ దగిన తెనుఁగునాటనే మొదటి హిరియకెంపని కాలము నాఁటి యక్ష గానములు లభింపలేదు. దక్షిణదేశమున తెనుఁగు యక్షగానమునకు వ్యాప్తి కల్గిన తర్వాత, నా శతాబ్ది తుది పాదమునఁగాని, కన్నడ విష యమున యక్షగానము లవతరించిన ట్లాధారములు గానరావు. క్రీ. శ. 1682 — 1713 సంవత్సరముల నడుమ మైసూరు పరిపాలకులగు చిక దేవరాయ కంఠీరవ రాజాస్థానములందు తెనుఁగున యక్షగానములు వెలసినవి. ఆకాలముననే కన్నడ యక్షగానమునకుఁ బ్రారంభదశయై యుండును. ఈ గంగా గౌరీవిలాసము గూడ నాకాలముననే, అనగా, 17 వ శతాబ్ది చివర వెలసియుండును. అది రెండవ హిరియ కెంపని కాలమునకు సగిపోవును. అదికాక మొదటి హిరియకెంపని కాలమునకీ కెంప గౌడులకుఁ దెలుఁగుతోఁ బరిచయ మేర్పడి నట్లు తెలియదు. మఱియొక విషయము — ఈగ్రంథమున రచనా ప్రక్రియ యంత ప్రాచీనమైనదిగాఁ దోఁపదు. మొదటి హిరియకెంపఁడే గ్రంథకర్త యగునెడల నిది నేఁడు మన కుపలబ్ధములైన యక్షగానము లలోఁ గవుల కాలము తెలిసినవంతలోఁ బ్రాచీన తమమైన రుద్రకవి

(2) పుట్టయ్య గారిచ్చిన వంశ వృక్షమున నితని కాల మిదమిత్థమని పేర్కొనఁ బడక పోయినను నితని పెద్దన్నయగు ముమ్మడి కెంపగౌడుఁడు లేక మాలెకెంపరాయఁ డను వాని పరిపాలన కాలము క్రీ.శ. 1658 — 78 అని గలదు. అందుచే నతని చిన్న తమ్ముఁడగు నీ రెండవ హిరియకెంపఁడు 17 వ శతాబ్ది చివర నుండినాఁ డనుట సంశయింప నక్కఱలేదు.

సుగ్రీవ విజయము కంటెను బూర్వమైన రచనలెను. అందలి ప్రధాన రచనాంగములు: తాళప్రధానములైన దరువులు, ద్విపద, అర్ధచంద్రికలు, ఏలలు మొదలగు దేశి పదములు, కొలది పద్యములు, చిన్న చిన్న సంధి వచనములు. గంగా గౌరీ విలాసములోఁ బ్రసిద్ధ రాగ తాళములలో దరువు లెక్కువగా నున్నవి. సంధి వచనములకు బదులు కందము లెక్కువగా గీత పద్యములు, నక్క డక్కడ నొకటి రెండు సీసములు, వృత్తములును గలవు. దేశికవితా రీతులు గానరావు. దరువులలో రాగ ప్రాధాన్యము యక్కుగాన రచనలో నర్వాచీన శైలిని సూచించును. అది కర్ణాటక సంగీతమునకుఁ బ్రచారము కలిగిన తరువాత నేర్పడినది. గంగా గౌరీవిలాసము సుగ్రీవ విజయమున కర్వాచీన రచన యని చెప్పనొప్పును. కనుక రెండవ హిరియకెంపఁడే యేతద్ గ్రంథకర్తయనియు, నీగ్రంథము 17 వశతాబ్ది యుత్తరార్ధమున రచింపఁబడినదనియు నూహించుట లెస్స.

గ్రంథ విషయము:— నాయికా నాయకులగు గంగా గౌరీ శంకరుల పరస్పరాన్వేషణము—చెలికత్తెలచే రాయబారములు—వారి సమాగమము. రచన: గ్రంథారంభమునఁ గవి తనుదాఁ బ్రశంసించు కొనినంత పగడగా లేదు. కాని సరస సంభాషణలతో హృదయంగమముగనే యున్నది.

---

11. చికదేవరాయాస్థాన కవి

చికదేవరాయ విలాసము: *

కన్నడ దేశమునను నందును రాజాస్థానములందును గొన్ని తెలుఁగు యక్షగానములు వెలసి యుండుట కడు ముదావహమైన విషయము. మైసూరి యొడయుండ్రలోఁ జికదేవరాయఁ డొక దొడ్డ ప్రభువు. అతఁడు శ్రీరంగపట్టణము రాజధానిగా క్రీ. శ. 1672-1704 సం. ల నడుమ మైసూరి నేలెను.[1] అతఁ డెంత యూహావ శూరుఁడో యంత సాహిత్య రసాభిజ్ఞుఁడు. స్వయముగ కవి.[2] కవి పండిత పోషకుఁడు నైన వాఁడు. అతని యాస్థానమున ననేక కన్నడ కావ్యములు, కొన్ని సంస్కృతకావ్యములు, తెలియవచ్చినంతలోఁ దెలుఁగున నీ యక్షగాన మొకటియు నొక శతకము[3] గొన్ని చాటువులును వెలసినవి. ఆ చాటువుల కర్తయు నీ యక్షగాన కర్తయు నొక్కరే యని యూహింప నగును.[4] కాని యాతని పేరేమో తెలిసినదికాదు. గ్రంథము మైసూరి చికదేవరాయ ప్రశంసాత్మకమై, తదంకితమై యుండుటచే నది క్రీ. శ. 1672–1704 సం. ల నడుమనే రచింపబడి యుండెనని నిశ్చయింపవచ్చును.

---

* అముద్రితము. ప్రా. లి. పు. భాం. డి., నం. 1880.

(1) Vide., Hystory of Mysore By Sri Hayavadana Rao.

(2) గీత గోవింద ఫక్కిని గీత గోపాలమను కన్నడ కృతిని రచించినాఁడు. (ఇది ముద్రితము).

(3) ప్రా. లి. పు. భాం., కన్నడ డి. నం. 4–11.

(4) చాటువులు వేటూరివారి చాటుపద్య మణిమంజరిలో నుదాహరింపఁబడినవి. యక్షగాన గ్రంథాది శార్దూలవృత్తము – 'శ్రీ రంగైక విహారి శౌరి' యనునదియుఁ జివరనున్న "కురు విరాట వరాట" ఇత్యాదియగు సీసము చాటుపద్య మణిమంజరిలో నగలవు. యక్షగాన రచనా శైలియుఁ జాటువుల శైలియు నొక్కమాదిరిగ నున్నవి.

గ్రంథవిషయము :— వైష్ణవ స్తుత్యాదికము చిక్కదేవరాయ పరముగాఁ బద్యములలో షష్ఠ్యంతములు, అతని తలిదండ్రులగు అమృతమాంబయు దేవరాయలును స్మరింపఁబడిరి. శ్రీరంగపుర వర్ణన — ఆయన విజయము లనేకము ప్రశంసింపఁబడినవి.

కథ :— చిక్కదేవరాయ లొకనాఁడు వాహ్యాళి వెడలును. చంద్రరేఖ యను పౌరకాంత యతనిఁ జూచి మోహించును. ఆమె విరహవేదన — ప్రబంధపుతంతు — చెలికత్తెచే రాయబారము — నాయకుని సమ్మతి — పల్లకీపై రాచనగరికి నాయిక పయనము — పడకటింటి ముచ్చట — నైతాళీయ గీతములతోఁ జిక్కదేవరాయల ప్రశంసతో గ్రంథము ముగియును.

ఇందలి చిక్కదేవరాయ శౌరి కొలువు సింగారము, ఆ యాభరణ విశేషములు, ఆడంగుల పరిచర్య, సభాగోష్ఠి, కథావస్తువు, ఆ ఉలా ప్రబంధపు కెత్తుగడ, రచనా ప్రణాళిక యంతయుఁ తంజావూరు నాయక రాజులనాఁటి వైభవము, నా యక్షగానపు బాణీని స్ఫురణకుఁ దెచ్చుచున్నది. చిక్కదేవరాయలు గద్దెనెక్కిన రెండేండ్లలోఁ దంజావూరున నాయకరాజ్య మంతరించినది. అప్పుడు విజయరాఘవ నాయకు నాస్థానాంధ్ర కవి యెవఁడైనఁ జిక్కదేవరాయల రసికతఁగూర్చి విని యితని కొలువునకుఁ జేరియుండెనా యనిపించును.

ఇందలి రచన సరసమగు ప్రౌఢమునగు ప్రబంధ ధోరణి నున్నది. తాళప్రధానములగు దరువులు, ఎక్కువగా అర్ధచంద్రికలు, పద్యములు, ద్విపదలు, సంధి వచనములును గలవు. ఇది యక్షగానమని కవిచేఁ బేర్కొనఁబడినది.

ఈ చిక్కదేవరాయలనాఁటి నుండి మైసూరు సంస్థానమునను నాంధ్రవాఙ్మయలత కొనలుసాగి ననలెత్తినది.

12. కంఠీరవ నరసరాజు

"అరసన వర మేలణ నాటకగళు" అని మైసూరి చిక్కదేవ రాయల పుత్రుఁడైన కంఠీరవరాజు కృతములుగాఁ గొన్ని యక్షగాన ప్రాయములైన చిఱిపొటి తెనుఁగు రచనలు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని కన్నడ తాళపత్ర గ్రంథ సంచయములో డి. నం. 1128 సంపుటములోఁ గన్నడమోడితోఁ గానవచ్చుచున్నవి. (దీని ప్రతులు మైసూరు ప్రాచ్య గ్రంథ భాండాగారమునఁ గూడ నున్నట్లు తెలిసినది.)

చిక్కదేవరాయల పుత్రుఁడైన యీతని పూర్తిపేరు కంఠీరవ నరసరాజు. ఇతఁడు క్రీ. శ. 1704 - 1713 సం. ల నడుమ శ్రీరంగ పట్టణము రాజధానిగా మైసూరు రాజ్యమును పాలించెను. ఇతఁడు పుట్టుమూఁగి. ఇతనికి మూకరసనియు నామాంతరము[1] అట్టి యీతఁ డెట్లిన్ని కృతుల నదియుఁ దెనుగున రచింపఁగల్గెనా యని యనిపింపక మానదు.

ఈ కృతుల్లం దెక్కువపాలు కంఠీరవరాజ శృంగార ప్రసంగాత్మకములే, తత్ప్రశంసాభూయిష్ఠములే. అవి కంఠీరవ రాజకృతులేయైన పక్షమున నతఁడట్లు స్వకుచమర్దనము చేసికొనియుండునా యని మఱి యొకశంక. అయితే అన్నిటను నతని కర్తృత్వము నిరూపించునట్టి యాధారములు పొడగట్టును.

(1) Vide., History of Mysore, Vol. II., Chap. I.. Pp. 1–17

గ్రంథసమీక్ష

1. కొరవంజికట్లె :

ఈ సంపుటిలోఁ దెలుఁగు కన్నడ తమిళ వ్రాకృత భాషలు నాల్గింటను నికొరవంజి కట్లె ♦ గలదు. అందుఁ దెనుఁగు కట్లెయందలి విషయము శ్రీరంగేశుని దర్శించి వచ్చుచున్న కంఠీరవరాజును బొంచాల పతి కూఁతురు కాంచనలత చూచి మోహించుట, తదుపరి యామె వలపు వాపోక, భారతీదేవి కొరవంజియై వచ్చి యామె కిప్పుతావాప్తి కాఁగలదని సోదె చెప్పుట. ఇందొక్క శ్లోకము, గీతము, సీసము, ఏలపదము, కొలఁది దరువులు, ద్విపదలు, చిన్న సంధివచనములును గలవు. దరువులు ప్రసిద్ధ రాగతాళములలోఁ గలవు.

తెనుఁగునఁ గొరవంజులను పేరఁ గొన్ని యక్షగానప్రాయ రచన లీ కాలమునుండియే కన్పట్టుచున్నవి. ఈ కొరవంజియో, కంఠీరవ రాజ సమకాలికుఁడును, శహాజీ యాస్థానకవియునగు గిరిరాజకవి రాజ మోహన కొరవంజియో (దానిగుఱించి ముందు తెలియఁ గలదు) - ఈ రెండిట నేదిముందు పుట్టినదో నిర్ణయించుట కష్టము. కొరవంజి యనఁగాఁ గొరవజాతి స్త్రీ యని యర్థము. ఎట్లుకచెప్పుటామె వృత్తి. ఆ పాత్రకుఁ బ్రసక్తిగల యక్షగానములకే యీపేరు గల్గినది. ఇదివఱకే విజయరాఘవాస్థానకవుల కృతులందుఁ గొన్నిట కొరవంజి నామరూపములు స్పష్టపడినవి. కాని యీ గ్రంథము లాపేర వ్యవహృతములు గాలేదు. (విశేషములు ప్రకరణాంతమునఁ దెలియనగును.)

♦ కట్లె యనఁగా రచన లేక పద్ధతి లేక నిర్మాణమయని యర్థము. (చూ. ఆందలి తెనుఁగు కట్లె – పరిశోధన పత్రిక జయ హేమంతి సంచికలోఁ బ్రకటితము.

2. పంచాయుధకళ్లె :

శ్రీరంగేశుని పంచాయుధములునుఁ గంఠీరవరాయని రక్షించునుగాక యను శుభాశంసనమే యిందలి విషయము. ఇందాఱు సంస్కృత శ్లోకములు, నాఱు శ్లోకములక్రింద నాఱు ద్విపదలు, నడుమ నాలుగుతావులఁ దాళ దరువులును గలవు.

3. లక్ష్మీ విలాసము :

ఇందు నిండుకొలువుండిన కంఠీరవరాజు కడకతని సామ్రాజ్య లక్ష్మి సపరివారముగా వచ్చి నటియించి యాతని దీవించుట విషయము. ఇందలి రచనావిశేషములు శ్లోకము, ద్విపద, దరువు, సీసము, సంధివచనము.

4. కలవాణీ విలాసము :

కంఠీరవరాయని వలచి వచ్చిన కాంభోజరాజ పుత్రి వేడికోలిందలి విషయము. ఇందు ప్రసిద్ధ రాగతాళములలో దరువు లెక్కువ. ఒక దీర్ఘద్విపద, శార్దూల వృత్తమున నొక పద్యము (తెలుఁగు), నొక శ్లోకము (సంస్కృతము), నొక సంధివచనమును గలవు.

5. నాట్య విద్యా విలాసము :

ఒక నాట్య విద్యా విలాసిని కంఠీరవరాయ సముఖమునఁ బడకేళికలు సలుపుట యిందలి విషయము. ఇందు ప్రసిద్ధ రాగతాళములలోఁ బదములు, ద్విపదయు, నొకరెండు శ్లోకములును గలవు.

6. వసంతోత్సవ విలాసము:

ఇందు నాంది ప్రస్తావన లుండుట విశేషము. కృతికర్తృ విషయము గూర్చి నటి పృచ్ఛింపఁగా సూత్రధారుఁడు కంఠీరవరాజుని

కంఠోక్తిగాఁ జెప్పుటయు నింకొక విశేషము. నటి వసంత వర్ణన చేయును. తదుపరి కంఠీరవుఁడు కొలువుదీఱుట. సూత్రధారుఁడీ "నాట్య ప్రబంధ" ప్రయోగమున్నచో నటిని హెచ్చరించుట, బిరుదు పాత్రలు (స్త్రీలు) కొందరాయన యెదుటికి వచ్చి పదాభినయము పట్టుటయు నిందలి విషయములు. ఇందు దరువులు, ద్విపద, సంధివచనములు, ఒక సీసము, సంస్కృతప్రాకృతముల నొక్కొక్క శ్లోకమును గలవు.

7. విభక్తి కాంతావిలాసము:

ఇందును నిది కంఠీరవరాజు కృతియని యున్నది. ఇందుదాహరణ కావ్యములందువలె వరుసగా నాయా విభక్తులలోఁ గలకంఠీకృత కంఠీరవ ప్రశంస సాగినది. ఇది సంస్కృత ప్రచురమైన రచన. సంస్కృతము చూర్ణికా శ్లోకము లందేగాదు, వచనమునందును, దరువు లందును గలదు. తెనుఁగునను కొన్ని దరువులు, కందములు, ఎత్తుగీతులు లేని సీసములును గలవు. ఇది ప్రదర్శన కుద్దేశింపఁ బడినట్లు స్పష్టపడినది. నటీ సూత్రధారుల పూర్వరంగ ప్రవర్తకత్వప్రసక్తియు నిందుఁగలదు.

8. అష్టదిక్పాలక విలాసము:*

ఇది వాసవి నాటకము, పావకి, నైవస్వతి, నైరుతి, వారుణి, వాయవి, కౌబేరి, ఐశాని నాటకములని యెనిమిది వాంతర విభాగములుగల యొక పెద్ద నాటకము. ఇంద్రుఁడొకనాఁ డష్టదిక్పాలక సమేతుఁడై నాటకశాలఁ బరీక్షింపరాఁగా నాయా దిక్పాలక ప్రతినిధు

* ఇందలి 'ఐశాని' నాటక భాగము మాత్ర ముపలభ్య ప్రతులం దెన్ను గానరాదు.

లట్లు వాసవీ ప్రభృతులైన యెనమండ్రు వేల్పు నట్టువకత్తెలు వచ్చి పంతము పట్టి గజ్జెకట్టి తమ తమ విద్యల తారతమ్యము నిర్ణయింపుమని యాతనిఁ గోరుచురు. ఆవేళ సురముని యమరేంద్రునితో కంఠీరవరాజు వీరల విద్యల తారతమ్యము నిర్ణయింపఁగలవాఁడని చెప్పెను. అంత దేవేంద్ర నిదేశమున వారు మేళము కట్టుకొని కంఠీరవేంద్రుని సముఖమునకు వచ్చిరఁట. వరుసగా నొక్కొక్కరే తమ తమ నాట్య విద్యా నైపుణ్యమును సప్తతాళములందును బదాభినయ పురస్సరముగాఁ బ్రదర్శించిరఁట. ఇందలి విషయ మిది. ఇందింకను శ్లోకములు, పద్యములు, దరువులు, ద్విపదలును గలవు. చిన్న చిన్న సంధినచనములతోఁ బాత్ర ప్రవేశ సూచనలు, యవనికాంతర నిర్గమన ప్రసక్తియు గలవు.

ఈకంఠీరవ కృతులలోఁ రచనలోఁ జక్కని నైవిధ్యము, నైక్యము, మృదుమధుర పదగుంభనమును గలవు. అన్నియుఁ బ్రదర్శనోద్దిష్ట ములే యనిపించును. అయితే అన్నియుఁ బద చాళికలవంటివి మాత్ర మన్నియు స్త్రీ ప్రాయములు. నైశికీవృత్తిపేశలములు. అన్నిటను రాజ ప్రశంసలు, నాట్య సంగీత శృంగార ప్రసంగములే ప్రధానవిషయ ములుగాని యెందును నొక విస్తృతమైన కథగాని, విశిష్టమైన సన్ని వేశముగాని లేవు. అవి నాఁడు కంఠీరవరాయ సముఖము నగరి నట్టువ కత్తులచేఁ బ్రయోగింపఁ బడినట్లే తోఁచును. స్త్రీపాత్ర ప్రయోగ మిందు స్పష్టపడినది. కొన్ని యేకపాత్ర ప్రయోగభాజనములుగాఁ గన్పట్టుట యొక విశేషము. కవి యెవఁడైనను కంఠీరవుఁడైనను గాకపోయినను గొప్ప కళాకుశలుఁ డనిమాత్రము స్పష్టము.

13. శ్రీ నారాయణ తీర్థులు

పారిజాతాపహరణము: *

శ్రీకృష్ణలీలాతరంగిణీ కృతి ప్రతిష్ఠామహితుఁడగు శ్రీ నారాయణతీర్థపాదుఁడు తెలుఁగునను యక్షగాన ప్రాయమగు నొక కృతిని వెలయించియుంచుట యాంధ్రుల యదృష్టము. అయితే అది దక్షిణ దేశముననే పుట్టి యచ్చటనే ప్రచారము సంపాదించినట్లు కన్పించుచున్నది. అచటనుండి అన్యత్ర తత్ప్రతులు లభించుటలేదు.

తీర్థుఁడాంధ్ర బ్రాహ్మణుఁడు. గోదావరిమండలములోని కూచిపుంచి-అగ్రహార నివాస్తవ్యుఁడు. కాని యెప్పుడో అఱవదేశ మందలి మెరట్టూరునకుఁ జనిగినాఁడు. అతఁడక్కడే యీపారిజాతనాటకమును రచించినాఁడని శ్రీరాఘవన్ గారనుచున్నారు. [1] అతనికాలము క్రీ. శ. 1700 ప్రాంతమని డా. ఎమ్. కృష్ణమాచార్యుల వారనిరి. [2]

ఈగ్రంథమునఁ గర్తపేరిదియని ప్రత్యేకముగాఁ జెప్పఁబడలేదు. రచన తరంగిణి ధోరణికి భిన్నముగా నున్నది. అందుచే దీని విషయ

* అముద్రితము. తం. స. మ. కే నం. 544. మఱియొక ప్రతి మెరట్టూరులోఁ గలదని డాక్టరు శ్రీ వి. రాఘవన్ గారు చెప్పిరి.

చూ. journal of the Madras Music Academy, 1942., Nos. 1 to 4. p. 74. మెరట్టూరు ప్రతి పత్ర సంగ్రహమిం దుదాహరింపఁ బడినది. తంజావూరు మెరట్టూరు ప్రతులు రెండును గలిసినచే సమగ్రప్రతి తయారుకాఁగలదు.

(1) నారాయణతీర్థులవారి గురించి యా యా విశేషములకు రాజమండ్రి కొండపల్లి వీరవెంకయ్య ప్రచురణ (1948) శ్రీకృష్ణలీలా తరంగిణికి ముఖబంధ ములుగా నున్న శ్రీ రాఘవన్ ప్రభృతుల రచనలు చూడనగును.

(2) History of classical Sanskrit literature, p. 345 by Sri M. Krishnamachary a.

మునఁ దీర్థుల కర్తృత్వము నెవ్వరైన శంకింపవచ్చును. కాని దరువుల చివరఁ దీర్థపాదునిముద్రలు తంజావూరుప్రతిలో నాఱు తడవలు మెరట్టూరుప్రతిలో మఱి రెండు తడవ లెక్కువగను గన్పట్టుచున్నవి. తరంగిణిలోని మూఁడు కీర్తనలు (1వ తరంగము 16, 17 వ కీర్తనలు, 12 వ త. 3 కీర్తన) యథాతథముగా నిందు గలవు. ఇందు గ్రంథారంభమున సంస్కృతమునఁ గల కథాసంగ్రహ రచనాపద్ధతి తరంగిణి యవతారికను దలఁపించుచున్నది. అందుచే నిది నారాయణతీర్థ కృతమని నిశ్చయింప వచ్చును.

ఇందలి కథ ప్రసిద్ధమైనది. రచన తరంగిణి రచనకుఁ దీసికట్టినను యక్షగాన సహజమగు సౌకుమార్యము గలది. గ్రంథ మంతయు దరువు, వచనముచొప్పున సాగిపోవును. అందు సంధి వచనము లెక్కువ. ఒండు రెండుచోట్ల వరుసగా రెండు మూఁడేసి దరువులు ప్రయుక్తములు. నడుమ నతి విరళముగా ద్విపదయు శ్లోకములును గలవు. మెరట్టూరు ప్రతినిబట్టి యిందలి దరువులు ప్రసిద్ధరాగ తాళములలోనున్నవని గ్రహింపనగును. ఇందు కటికవాని పాత్రకుఁ బ్రసక్తి గలదు. ఇది ప్రదర్శనోదిష్టమైనట్లుగనే తోఁచును.

14. శహాజీ

తంజావూరిలో నాంధ్రనాయక రాజ్య మంతరించిన తరువాత మహారాష్ట్ర ప్రభుత నెలకొన్నది. ఆ మహారాష్ట్ర ప్రభువులును బ్రియం పడి నాయకరాజులవలెనే మన భాషావాఙ్మయముల నాదరించుట చరిత్రలో నొక యపూర్వ సన్నివేశము.* వారు యక్షగానము నెడనే యెక్కువ మక్కువ గలవారగుట యింకొక విశేషము. వారు యక్ష గానకవుల నాదరించుటయ కాము స్వయముగ ననేక యక్షగాన ప్రాయ రచనలుప చరించిరి. అట్టివారిలో ప్రాతఃస్మరణీయుఁడు శహాజీ. ఇతఁడు భోసల వంశీయుఁడు. ఛత్రపతి శివాజీ సవతి తమ్ముఁడగు ఏకోజీకి దీపాంబిక యందుఁ గలిగిన తనయుఁడు. కీ. శ. 1684–1712 సం.ల నడుమ తంజావూరి నేలినవాఁడు. ఇతఁడపర విజయరాఘవుఁడు. అతని వలె నతిమాత్ర గీతి సాహితీ ప్రీతిగలవాఁడు. నాట్యకళా కోవిదుఁడు. శృంగార శూరుఁడు, హాస్యచతురాస్యుఁడు. అతని సాహిత్య మంతయు నాలక్షణములకుఁ బ్రమాణ భూతముగా నున్నది.

శహాజీపేరఁ దదంకితములు గాక, తదుపజ్ఞములుగా నిఱువది రెండు యక్షగాన ప్రాయ రచనలు గన్పట్టుచున్నవి. అన్నియు నముద్రిత ములు. తంజావూరు సరస్వతీ మహాలు పుస్తకభాండాగారమున నన్నిటి

సూచన:— ఇందుఁ జేర్కొనబడిన తంజావూరు మహారాష్ట్ర ప్రభువుల రాజ్యకాలాదిక చరిత్రాంశముల కాధారము:—

"Maratha Rule in the Carnatic" By Sri C. K. Srinivasan. (Annamalai University Publication, 1945)

* (వివరములకు) చూ. శ్రీ 'మల్లంపల్లి సోమశేఖరశర్మగారి "తంజావూరి మహారాష్ట్ర) భూపతులు — ఆంధ్రసాహిత్యము" అను వ్యాసము — భారతి, డిసెంబరు, 1953 జనవరి, 1954.

ప్రతులును గలవు. శహాజీ మహారాష్ట్రుడయ్యు నాంధ్రమున నన్నికృతు లన్యభాష యాస లేకుండ వ్రాయుట గమనింపఁ దగినది. అతని యాస్థాన మున యక్షగాన రచన చేసిన యాంధ్రకవు లనేకులు గలరు. ఎడ నెడ వారి ప్రశంసయుఁ దఱుచు వారి కృత్యవతారికల తీరును శహాజీ కృతు లందుఁ గన్పట్టును. అందురెండు కృతు లస లతనివి కావనియే యనిపించును. కడమ కృతుల విషయమునను శహాజీ తదాస్థాన కవుల సాహాయ్యమును గ్రహించి యుండును. కాని కొన్ని కృతుల ప్రతి విలేఖన కాలములనుబట్టిచూడ శహాజీ గ్రంథరచన క్రీ. శ. 1704 ప్రాంతమున జరిగియుండినట్లు తోఁచును. అనఁగా నప్పటికి శహాజీ శంజావూరునకు వచ్చి పాతికేండ్లు పైచిల్లుకైనది. సింహాసనము నెక్కినాఁటికి యుక్త వయస్కుఁడై యుండును. సహజముగా భాషా సాహిత్య ప్రియం భావుకుఁడగు నతని కచట నింకను ప్రచారము నందుండిన యాంధ్ర భాష నభ్యసించుటకా పాతికేండ్ల కాలము చాలకపోదు. ఇఁక దదాస్థానకవి కృత్యవతారికా శ్లోకాదిక గ్రహణ విషయము. శహాజీయే స్వయముగాఁ బ్రియంపడి వానిని గ్రహించియుండవచ్చును. లేక యానాఁటి ప్రతి విలేఖకు లప్పటప్పట తదాస్థాన కవులు చెప్పుచు వచ్చిన శ్లోకాదులందుఁ దమకు నచ్చిన వానిని గొన్నిటి నందందు జొప్పించి యుండవచ్చును. ఏదెట్లయినను బైచిలుకు రెండు మాటకేమి గాని కడమ యిఱువదింటను రచనలో శహాజీ భాగస్వామ్య ప్రతిపత్తి యధికముగనే యుండును.

ఆ యిఱువదింటను బదునాఱు నాటకములుగను, నాలుగు ప్రబంధములుగను గ్రంథకర్తచే బేర్కొనఁబడినవి. నాటకములన్నియు "నుదారవేషభాషా భూషితము" లని పేర్కొనఁబడినవి. అవి సంవాద శైలీక వచన ప్రచురములుగను, ప్రబంధములు నాట్యోద్దిష్టగీతి బంధ

ప్రక్షిప్తములుగను నున్నవి. అవి యన్నియు నాఁడు ప్రదర్శింపబడినట్లే వానిలోగల సూత్రధార వచనములును, గొన్ని ప్రయోగ సూచనలును విశద మొనర్చుచున్నవి.

ఆ గ్రంథములు సాధారణముగా జయేత్యాదియగు నొక "తోడియం" దరువుతోఁ బ్రారంభమగును. స్తుత్యాదికము, పిదప నొక సూత్రధార వచనమున గ్రంథనామ కర్తృనామ నిర్దేశము నాపై నొక ద్విపదలోఁ గథాసంగ్రహము చెప్పఁబడుటయుఁ గలవు. కథాసంగ్రహద్విపద ప్రబంధములందు మాత్రము కానరాదు. ముందే వినాయక స్తుతి యున్నను గథాసంగ్రహ ద్విపదకుఁబిదప నతని యాగమన ప్రస క్తియుండును. అనఁగాఁ బ్రదర్శనవేళ నొక కుఱ్ఱవాఁడెవఁడో వినాయక నేపథ్యముతోఁ రంగమునఁ బ్రవేశపెట్టఁబడి ప్రదర్శకులైన భాగవతుల పూజ నందుకొని పోవుచుండు టాచారమై యుండును. ఆ పిమ్మట "ఆస్థాన సంతోషి" యగు కటికవాని వాలకము ప్రవేశ ప్రసంగము లుండును. అంతటఁ గథారంభము. గ్రంథాంతమున సాధారణముగా నొక ద్విపదలోఁ గాని గద్యలోఁ గాని కృతిసమర్పణ ముండును. ఆ సమర్పణము తఱుచు శహాజీ యిష్టదైవత మగు త్యాగేశ్వర స్వామికై యుండును. ఇది యతని కృతుల యాద్యంతముల సామాన్య స్వరూపము. ఇఁక ప్రత్యేకముగా నాయాగ్రంథ విశేష విషయములు మాత్ర మొక క్రమము ననుసరించి తెలుపఁబడును.

1. విఘ్నేశ్వరకల్యాణము: (1)

సిద్ధి బుద్ధి యను బ్రహ్మపుత్రికలతో వినాయకుని వివాహ మిందు వర్ణితము. ఇది విఘ్నేశ్వరకల్యాణమే కాఁబట్టి గ్రంథారంభ

(1) తం. స. ము. కే. సం. 610-616.

మున మఱి వేఱే యతనిపాత్ర ప్రవేశ సూచన లేదు. సరిగా లగ్న సమయమందే యతని పాత్రకుఁబ్రసక్తి. ఇందలి దరువులు ప్రసిద్ధ రాగ తాళములలో నున్నవి. కొన్నిటి కజువ – తెలుఁగు మాతృక లుదాహరింపఁబడినవి. మాతృక లనఁగా నీ దరువుల వరుసలకు నాఁడు ప్రసిద్ధములగు పాటల యొరవడులు.

2. శచీపురందరము : [2]

ఇందలి వినాయక పాత్ర ప్రవేశ ఘట్ట మక్కఁడి కది యొక చిన్న ప్రహసనమువలె నున్నది. శచీంద్రుల వివాహ మిందలి యితి వృత్తము. అది శహాజీ యేలు తంజాపురమున జరిగినదఁట. ఇందు వచనము పాలెక్కువ. దరువు లనేకము మాతృకానుసారము రచింపఁబడినవి. ప్రౌఢమైన శ్లోక రచనయుఁ గలదు. హాస్యముకోఱ కసభ్య పద ప్రయోగము, ననుచిత సన్నివేశ కల్పన గావించినాఁడు గ్రంథకర్త.

పాత్రల పరిచయ మిందు ద్వివిధముగ నున్నది. సూత్రధారు ననుమతిపై భాగవతులే పాత్రలను బలుకరించుట, పాత్ర ప్రవేశ సమయమున, దత్తద్వేష భాషాదిక వర్ణనా రూపమైన దరువుల ద్వారా కావించుట. మఱియు గ్రంథస్థములగు నాధారములను బట్టి యీ నాటక ప్రదర్శకులగు భాగవతులలో బ్రాహ్మణులు గలరనియుఁ, గోవెల మణియగాని వంటి వాఁడును సూత్రధారత్వము వహించెడివాఁడనియు, మద్దెల, తాళము, తంబుర, తిత్తి మొదలగునవి నాఁటి ప్రదర్శనపు హంగువాద్యము లనియు నూహింపనగును. శహాజీ యాస్థానకవి యగు గిరిరాజ పదము లిందు బ్రశంసింపఁబడినవి.

(2) త. స మ. కే. సం. 625 – 627.

3. వల్లీకల్యాణము: [3]

కేటలాగులో వల్లీకల్యాణ మని యున్నది. కాని కవి పెట్టిన పేరు కుమారస్వామి కల్యాణము. ఎట్లనుకొన్నను దగవులేదు. వల్లి యను చెంచెతను గుమారస్వామి పెండ్లియాడిన కథ యిది. దక్షిణ దేశమునఁ గడు ప్రచార మందిన కథలలో నిది యొకటి. మన చెంచు లక్ష్మి లేక గరుడాచలము కథయు నించుమించు చిట్టిదే.

ఇందు ద్విపదభాగ మెక్కువ. దరువులును, వచనము గొలఁదిగాఁ గలవు. ఇందు "నాటకశాల భామల" ప్రసక్తి వచ్చినది. గిరిరాజ పదముల ప్రశంసయుఁ గలదు.

4. శాంతాకల్యాణము: [4]

కథ ప్రసిద్ధము. వేశ్యలతో ఋశ్య శృంగుని సమావేశ ఘట్ట మిందు రక్తికట్టినది. కాని కులవధువగు శాంత పాత్ర మొక వెల వెలఁది పాత్రవలెఁ జిత్రింపఁబడినది. అట్లే మహర్షి లంతవారు "మామూలు భంగు బైరాగులనలె" చిత్రింపఁబడిరి. ఇందు ద్విపద, దరువులు, వచనములు, శ్లోకములు గలవు.

5. ద్రౌపదీకల్యాణము: [5]

కథ ప్రసిద్ధము. కవి వివరములను విడిచిపెట్టకుండఁగనే సంగ్రహ ముగాఁ దెమల్చివై చినాఁడు. కాని రచన మైతిహాసికస్థాయి నందు

(3) త. స. మ. కే. నం. 590 — 596 నం. 596 ప్రతి విలేఖన కాలము: తారణ – ఆశ్వయుజ శుక్ల షష్ఠి స్థిరవాసరము క్రీ. శ. 23—9—1704.

(4) త. స. మ. కే. నం. 628 — 630

(5) ,, ,, ,, 535 — 538

కొనలేకపోయినది. ఇందవతారికలో సభానాయక ప్రశంసాత్మకమైన గద్య 'కైవార' మని పేర్కొనఁబడినది. కథాసంగ్రహ ద్విపదలేదు. రాగతాళము లుదాహరింపఁబడని చిన్న చిన్న దరువు లనేకము. ఒక యుత్పలమాలయు, నొక కందము, నాలుగుచోట్ల ద్విపదయుఁగలవు. గ్రంథము సాబాలు వచనమనియే చెప్పవచ్చును. అందు సూత్రధార వచనము లెక్కువ. రచన సామాన్యమైనది.

6. కృష్ణలీలా విలాసము: [6]

కృష్ణ జననము, బాల్యక్రీడలు, సత్యా పరిణయము నిందలి కథావస్తువులు. ఇందలి యవతారిక సరస్వతీ కల్యాణము దానితో సమానముగ నున్నది. ఇందు సూత్ర ధార వచనములు, శోభన గీతాదులును గలవు. గ్రంథాంతమందలి మంగళగీతము శహాజీ జలక్రీడలు, సతీపతిదాన విలాసములందును గలదు.

7. జలక్రీడలు: [7]

కథ ప్రసిద్ధము. హాస్యము కొఱకు పప్పు తిమ్మక్క, పాపావధాని యను రెండు పాత్ర లింపుఁ గల్పితములైనవి. ఇది యెట్లు ప్రదర్శనీయమో యూహకందకున్నది. ఇది 'నవ్యనాటక' మని పేర్కొనఁబడినది. ఇందు జిన్నచిన్న దరువులు, సూత్రధార, పాత్రవచనములు, ద్విపద, శోభనము గలవు. రచన యొకతీరు.

(6) తం. సం. మ. కే. సం. 505 — 506 (ఇది నా కలభ్యమైనది. దీని గురించి పై మాటలు కేటలాగునుబట్టి వ్రాయఁబడినవి.)

(7) తం. సం. మ. కే. సం. 521 — 527.

8. సతీపతిదానవిలాసము: [8]

ఇదలికథ కృష్ణతులాభారగాథ, ప్రసిద్ధము. చక్కని హాస్య ద్యోతక సందర్భములతో సరసముగా నున్నది. ఇందుఁ జిన్న చిన్న దరువులు, సూత్రధారపాత్రల వచనములు, ద్విపద, శోభనము గలవు.

9. సీతాకల్యాణము: [9]

కథప్రసిద్ధము. ఇందలి శహాజీప్రశస్తిగద్య 'కైవారగద్య' గాఁ బేర్కొనఁబడినది. ఇందు దరువులు, ద్విపద, గద్యపద్యములును గలవు. సూత్రధార వచనములున్నవి. రచన చక్కనిదే.

10. రామపట్టాభిషేకము: [10]

కథ ప్రసిద్ధము. ఇందు తలవరులు భరతునితోఁ దమిళమునఁ బ్రసంగింతురు. వారి చేతిలోఁ దుపాకులు గలవఁట! (అట్టి తలవరులు నాఁడు మహారాష్ట్ర ప్రభుత్వోద్యోగులై యుందురు) ఇందలి రచనలో విశేషములేదు. సన్నివేశములేని వస్తువు. చప్పని రచన.

11. రతికల్యాణము: [11]

ఇందలి యెత్తుగడ కొంత క్రొత్తది. "నాంది ద్విపద" యొక విశేషము.

---

(8) తం. స. మ. కే. నం. 644 — 650.

(9) ,, ,, ,, ,, 663 — 672.

(10) ,, ,, ,, ,, 572 — 577.

నం. 577 ప్రతి విలేఖన కాలము: తారణ భాద్రపద కృష్ణైకాదశి, సౌమ్య వాసరము క్రీ. శ. 13—9—1704.

(11) తం. స. మ. కే. నం. 561 — 567.

కథ ప్రసిద్ధము. తీస్సు కొత్తది. రతిమన్మథుల వివాహము శాహేంద్రుఁ డేలు తంజాపురమున జరిగినదఁట, అందలి రచన సరసముగ నున్నది. దరువులలోను సంభాషణలు చక చక నడచినవి.

ఇందాంధ్రపాణిని బిరుదాంచితుఁడైన శేషాచలపతి యను పండితునకు శహాజీ కావించిన సన్మానము, శహాజీపై గిరిరాజ కవి పద్యములు రచించిన విషయమును ప్రశంసింపఁబడినవి.

12. రుక్మిణీ సత్యభామా సంవాదము: [12]

ఇందుఁ గథాసంగ్రహ ద్విపదతోనే గ్రంథారంభము. స్తుత్యాదికము లేదు. కటికము ప్రసక్తి కానరాదు. సవతుల సంవాదము కంకెను సతీపతులది రక్తికట్టినది. సూత్రధార వచనములు, ద్విపదలు నెక్కువ. ఒక సీసము, నొక కందము, చిన్న చిన్న దరువులును గలవు. సంవాదములం దుత్తరప్రత్యుత్తరపు దరువులు పెద్దవి. గ్రంథము చివర "వృత్తదరు"వను నొక రచనావిశేషము గలదు. చూడఁగా నది సీస పద్యమే దరువుగా మలఁపఁబడినది. కాఁగా దీనిని సీసార్ధమనవచ్చును.

13. కిరాత విలాసము: [13]

అవతారికలోఁ గొంత క్రొత్తదనమున్నది. తనతోఁ బగడ సాలాడి పందెమున స్వసర్వస్వము నోడినారదుని "సలహా" ప్రకారము కిరాతవేషమున నడవికేఁగిన శంకరుని భిల్లాంగనా నేపథ్యమునఁ బార్వతి కలిసికొనుట యిందలి విషయము. గ్రంథ మంతయు నొకదరువు, నొక వచనము చొప్పున సాగిపోవును. సూ. వ. లెక్కువ. పాత్రల సంభాషణ వచనములును గలవు. ఇందలి రచన పొల్లుమాట లంతగా లేనిది; నిర్దుష్టము, సరళము నైనది.

---

(12) తం. స. మ. కే. నం. 583 — 586.

(13) తం. స. మ. కే. నం. 501 — 504.

14. సతీదానశూరము: [14]

శాహారాజు సాహిత్య వైయాత్యమును పట్టి యిచ్చునట్టి విశిష్ట కృతి యిది. ఇందలి వస్తువు క్రొత్తది. రచన కడు చక్కనిది. మోరో భట్లను బ్రాహ్మణుఁడు సశిష్యుఁడై తిరునాళ్ళకని బయలుదేఱి యట మగనాలి యగు నొక మతంగ భామను జూచి కామించుట. ఆపెయు, నతని శిష్యుఁడును వారింపఁజూతురు. అదియొక పెద్ద వాగ్వాదము. కాని లాభము లేకపోయెను. పిదప నామె భర్తయే వచ్చి సంగతి గ్రహించి యొక ధర్మోపన్యాసము చేయును. అంతకును బంధులు దారికి రాకుంట చూచి యయ్యవారికిఁ దన దారను ధారవోయుటకు నిశ్చయించును. అప్పు డయ్యవారిలోఁ బరివర్తనము పొడసూపును. చివరకు శివుఁడు సాక్షాత్కరించి యందఱికిను మోక్షము ననుగ్రహించును. ఇది యిందలి విషయము.

ఇది సంవాదశైలీ ప్రచురమైన రచన. చమత్కారావహములైన శృంగారస్వారస్యములు, ప్రశస్యములైన హాస్య ప్రసంగములు నిందు గలవు. రసాభాసమైనను రక్తిగట్టినది శృంగారము. వస్తువిషయమునఁ బ్రసిద్ధమైన సురాభాండేశ్వర కథను, సన్నివేశ రచనా ఫక్కికలలోఁ దంజాపురాన్నదాననాటకము నిది జ్ఞప్తి కెలయింపఁ గలదు.

ఇందు వచనము పాలధికము. దరువులు కొద్ది. సం. శ్లోకములు సుమారు నలువది గలవు. అందుఁ గొన్ని భర్తృహరి సుభాషితము మొ॥ ప్రసిద్ధ గ్రంథాంతరములనుండి గ్రహింపఁబడినవి. సం. శ్లోకోక్తులు నెక్కువగలవు. ఆ గ్రహించుటలో మంచి సందర్భోచితజ్ఞతఁ బ్రకటించి నాఁడు కవి. యిందు గ్రంథ మధ్యమునఁ బాత్ర భాగవతులను బల్కరించుట గలదు.

---

(14) తం. స. మ. కే. సం. 638 — 643.

15. భక్తవత్సలవిలాసము: [15]

ఈ కృత్యాది స్తుత్యాదికమునఁ గొంత క్రొత్తదన మున్నది.

పరమేశ్వరుని బాణాసుర వర పరిపాలన యొక్కటియే యిందలి భక్తవాత్సల్య ప్రదర్శన ఘట్టము. కాని తద్వ్యాజమున శివ పార్వతులకు విరహము గల్పించి, తన విప్రలంభ శృంగార వర్ణనా వైదగ్ధ్య ప్రకటనమున్నకై కవి యీ కృతిని రచించినట్లు తోఁచును. ఆ పురాణ దంపతుల స్థాయికిఁ దగినట్లు లేదు గ్రంథము.

ఇందు దరువులు, ద్విపదలు, గద్య పద్యములు గలవు. వృత్త దరువుల పేరిట సీసార్ధము లుదాహరింపఁ బడినవి. పద్యము లనుప్రాస విశిష్టములుగా సమాస ప్రచురములుగాఁ ప్రబంధ ఫక్కిని నడచినవి. వర్ణనలలో వ్యావహారికపు నుడికారముతో సంభాషణలు సరసముగా సాగినవి. రచనలో ననౌచిత్య మున్నను బేలవత్వ మెక్కడను గాన రాదు. ఆప్రౌఢి విషయమున శిష్టోక్తులలో నిది యొక మేలుబంతి.

16 గంగాపార్వతీ సంవాదము: [16]

కలహాభోజనుని క్రీలాటము మూలముగా గంగా పార్వతులకు సవతికయ్యము తలయ్దించుటయు, శివుఁ డర్ధనారీశ్వర గంగాధర సమాఖ్యలు వహించుటతో నాకలహ మంతరించుటయు నిందలి ప్రధాన విషయము. సవతికయ్యము ఘట్టము రక్తికట్టినది. పార్వతికి శకునము జెప్పవచ్చిన నల్లేరు శివుఁడు నతని పెండ్లము చింతపట్టి పోచెక్కయునను రెండు నీచపాత్రల విరస ప్రసంగముల ద్వారమునను, నారఁ తచ్చి ష్యుల ప్రసంగముల వలనను విపరీతమైన యసభ్యహాస్య ధోరణిఁ బ్రకటించినాఁడు కవి.

(15) తం. స. మ. కే. నం. 117. ఇది కేటలాగులోఁ బేర్కొనఁ బడలేదు. తత్పూర్వ వివేకుఁడు నట్టువ చింతామణి.

(16) తం. స. మ. కే. నం. 513 – 518.

చేయుటిరిగిన రచన, చక్కని తెనుఁగు నుడికారపు సొంపుగులుకు చున్నది. దరువులు సూ. వ. లును దఱుచు. అక్కడక్కడ పద్యములు, పాత్రల వచనములును గలవు. సూ. వ. లు శబ్దాలంకార ప్రచురములు. పాత్రలవచనములు వ్యావహారిక ధోరణిలో నున్నవి.

17. పంచరత్న ప్రబంధము: [17]

ఇందొక కథగాని సన్నివేశముగాని లేవు. పరమేశ్వరుని కొలువు నకు వరుసగా కొందఱు బిరుదు మిటారులు, నవసిద్ధజోగి యను వాఁ డొకఁడు నొకచెంచు, నట్టహోజు, నొక బిరుదుబంటు, గొందఱు "నాదనఖాండ్లు" ను వచ్చి నాట్యప్రదర్శనములు చేయుదురు. రత్న ములవంటి నట పంచకముయొక్క నృత్యప్రబంధ ప్రదర్శనము వస్తు వగుట గ్రంథమున కాపేరు వచ్చియుండును. ఇందాయిత్తం, జతి, మోహారం, గణపతి కవుత్తం, నెలకట్ట, సొల్లుకట్టు మొ॥ నాట్యోప యోగి గీత ప్రబంధ విశేషము లనేకము గలవు. దరువులలోను భాష తక్కువ, స్వరతాళముల గడబిడ యెక్కువ. ఇది 'ఉదార వేష భాషా భూషితంబగు', 'ఘన నాట్య శాస్త్ర వైఖరులను మించు' నని పేర్కొనఁబడినది. నవసిద్ధజోగి ప్రసంగమున మరాటీ భాషలో దరువు లుండుట విశేషము.

18. విష్ణుపల్లకి సేవా ప్రబంధము: [18]

విరహ విహ్వలయైన లక్ష్మి విష్ణుదేవునిపాలి కిరువురు చెలికత్తె లను బుత్తెంచును. వార లా దేవుని కొలువును గొనియాడి, స్వామి సముఖము గావించుకొని దేవి మనవిని విన్నవింతురు. స్వామి

(17) తం. స. మ. కే. నం. 540.

(18) ,, ,, ,, ,, 618 — 619.

సమ్మతించి సపరివారుఁడై పల్లకిపై బయలుదేఱును. అక్కడ పఱుక టింటి వర్ణన – తదుపరి విష్ణుస్తుతి – అవతారవర్ణన – స్వామి కారగింపు పవళింపుసేవలు – మేలుకొలుపు – శోభనపాఠము. ఇది యిందలి విషయము. రచన యొక మాదిరి. ఇందు దరువులు, ద్విపదలు, పద్యములు, సూ. వ. లే గాక రగడలు (అందు మయూర గతి విశేషము; ప్రసిద్ధము నగు నవవిధ రడగలలోఁ జేరనిది) చూర్ణిక, లయగ్రాహి లాలిపాట, ఆరతులు, అష్టకము, ధవళశోభనములు, మేలు కొలుపును గలవు.

19. శంకరపల్లకి సేవా ప్రబంధము: [19]

దీని యవతారిక తీరు వేఱు.

ఒకరితో నొకరు చెప్పుచున్నట్లు శివుని కొలువుచెలువు కొని యాటతోఁ గథారంభము. గౌరీ సఖులు స్వామి సముఖ మెట్లో చేసి కొని తమ దేవి మనవి విన్నవింతురు. శివునియాజ్ఞ యైనట్లే – పల్లకి వచ్చును – తద్వర్ణన – బోయిల కమరుల హెచ్చరికలు – పల్లకి గౌరి నగరి మొగసాల దిగఁగానే నంది యొక చూర్ణిక నందుకొనును. – తదుపరి పడకటింటివర్ణన – అమ్మవారి సింగారింపు – అయ్యవారి యూరగింపు – పవళింపుసేవ – చెలిక త్తెల యప్పగింతలు – జాము జామునకు వాకిలి కావలివారల హెచ్చరికలు – నాల్గవజాము గడచునంత–మంగళహారతులు. ఇందలి విషయ మిది. రచన చక్కనిది. ఇందును దరువులు, ద్విపదలు, పద్యములు, అష్టకములు, చూర్ణిక, మంగళహారతులు మొ॥ రచనా విశేషములు గలవు.

ఈపల్లకి సేవాప్రబంధముల గురించి ప్రత్యేకముగాఁ జెప్పవలసిన దొకమాట కలదు. శేషాజీ కృతి సముచ్చయమునందు వీని దొక

(19) తం. స. మ. కే. నం. 620 — 624.

విశిష్టత. ఇని నిన్న మొన్నటి దనుకఁ దంజాపుర పరిసర దేవాయ తనము లంకుఁగొన్నట నాయ్తా దేవోత్సవ సందర్భములం దాచార సిద్ధముగాఁ బ్రదర్శింపఁబఱుచుండెఁడివని తెలియుచున్నది. వీని ప్రదర్శన ఫక్కికనుగూర్చి శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారిట్లు సెలవిచ్చి యున్నారు.*

"పల్లకి సేవా ప్రబంధములు చిత్రమైన కల్పనతోఁగూడిన నాట్యాధిక్య ప్రధానములైన నాటకములు. శివుని, విష్ణుని పల్లకి సేవయే యీ నాటకములలోని ప్రధానేతివృత్తము. నాట్యకళా ప్రవీణ లైన తరుణీమణులు పల్లకి బోయీల పాత్రలను ధరించి స్వామి పల్లకి సేవ చేయుదురు. ఇందు నిమిత్తము పల్లకి బోయీలలో ముందువారు వెనుకవారు రెండు గుంపులుగ నేర్పడి కథ వినిపింతురు. చిత్రమైన పరికల్పనమిది. కథ యేమియు లేదు. కాని కృతికర్త నాట్యాభినయముల కనుకూలముగ నుండునట్లు కడుచమత్కారముగరచించెను."

20. త్యాగ వినోద చిత్ర ప్రబంధము: [20]

ఇది యొక చిత్ర ప్రబంధము. 'శంకరకాళీనటనవాద మహానాటక' మనియుఁ బేర్కొనఁబడుట విశేషము. ఇది షడంకములుగా వింగడింపఁబడియుండుట యింకొకవిశేషము. ప్రశ్యంకాంతమందును గ్రంథకర్త గద్య గలదు. ఈగ్రంథము విషయమై యొక ముఖ్యవిశేషము గమనింప వలసియున్నది. ఇందుపక్రమోప సంహారములందు విపుల ముగా నచ్చపు సంస్కృత శబ్దబాహుళ్యముగా మహారాష్ట్రభాష వాడబడినది. ఎడనెడఁ దెలుఁగునకును బ్రస క్తి గలదు. అందుచేతనే దీని కిటఁ బ్రస క్తి గల్గినది.

---

* చూ. వారి వ్యాసము భారతి. డిసెంబరు. 1953.

(20) తం. స. మ. కే. నం. 530 — 534. ఆంధ్ర వాఙ్మయ సూచికలో శహాజీ కృతిగా నుదాహృతమైన కాళీ తాండవ నాటకమిదే.

ఆ ప్రసక్తి యెట్టిదనగా: ప్రథమాంకమున గ్రంథము గూర్చి మహారాష్ట్రభాషలో సూత్రధారుఁడు గావించిన ప్రసంగమున కొక ద్విపదలో నొకవచనములో నాంధ్ర వివరణము గలదు. చతుర్థాంక మునఁదెనుగున 'సవ్యాపసవ్య సమపదలీలాదరు' వనునదొకటి గలదు. షష్ఠాంకమునఁ గవి తన గ్రంథమును దానే యొకచో సింహావలోకనము చేసికొన్న సందర్భమునం దొక తెలుఁగు దరువు గలదు. అందే తెలుఁ గున 'క్రమసప్తస్వర వర్ణార్ధలీలా' పేర నొక్కఁ జే దరువు తోడి, కల్యాణి, ఖాబీ, శంకరాభరణములను నాలుగు రాగములందుఁ బ్రవ ర్తింపఁజేయుట కనువైన ది గ్గలదు. గ్రంథము చివరిభాగమున 'జక్కిణీ దరువు' లను నింకొక రచనా విశేషము తెలుగునఁ గలదు.

గ్రంథము త్యాగేశాంకితము. త్యాగేశుఁడు కవి కిష్టదైవతము. గ్రంథప్రతిపాద్య విషయము తన్మాహాత్మ్యము – అనగా నాట్యనైపుణ్య మునఁ దనయంతవారు లేరని విఱ్ఱవీగెడు భద్రకాళి గర్వ ముడుపఁ దలఁచి నారదుఁ డంపులకు నటరాజ మూర్త్యంతరమగు త్యాగేశునిఁ బుట్ కొల్పుట. వార లిద్దఱకు వాదోపవాదములు సడుచుటయు నవి వివిధ సృత్క్రియాప్రక్రియలద్వారా ప్రదర్శనరూపము దాల్చుట, తుదకు భద్రకాళి యోడుట, త్యాగేశుఁడు విజయ సూచకముగాఁ దత్పణిపాయమగు కాళీపాణిగ్రహణము సేయుటయు నిందలి విషయము.

గ్రంథముపెద్దది. విషయము స్వల్పము. కాని రచనావైచిత్రి రమణీయము! చమత్కారావహము! ఆశ్చర్యకరము! కవి తనసంగీత సాహిత్య భరత విద్యానిపుణత్వము నిరూపించుకొనుకు రచించినట్లు న్నది. అక్షరములతో నాటలాడినాఁడు. శబ్దజాలముతో నింద్రజాలము చేసినాఁడు. బహుభాషాభణితులతోఁ దదర్థగతులతో రాగతాళ సంగతులను తరంగములతో నాచి సాచి బారలువైచి యాడినాఁడు. ఇట్టి చిత్రచిత్ర ప్రక్రియ గలది కనుకనే యిది చిత్ర ప్రబంధమైనది.

గ్రంథము గీత ప్రచురమైనది. అక్కడక్కడ సంస్కృతశ్లోకములున్నవి. ప్రసిద్ధ రాగ తాళ మేళన మనేకథా ప్రదర్శింపఁబడినది. సంస్కృతిమునందును దరువులు రచింపఁబడినవి. తెలుఁగునందు కొద్ది. మరాటి 'లీలా' దరువు లధికము. సూళాదితాళని స్తరణ, గాళరాగ ప్రభేద ప్రస్తారము, ఒక్కదరువులోఁ జతుర్విధ రాగానుకూల్య మిమిడ్చుట, భిన్న భాషలు, నందులో శ్లేషలు, శబ్దాలంకారములు, ననులోమాది ప్రక్రియలు మొ॥ గలవు. దరువులకుఁ దఱుచుగా స్వరకల్పన (స్వరజతి), తాళక్రమము (స్వరచొల్లుజతి) నుదాహరింపఁబడినవి. సంగీత సాహిత్యములతో శతావధానము చేసినాఁడు శహాజీ. కవి మాత్రుఁ డిట్టి గ్రంథము రచింప లేఁడు. శహాజీ నిస్సందేహముగ మహా విద్వాంసుఁడై యుండునని చెప్పవలెను. అతని కృతులందేకాదు యావద్దక్షిణాంధ్రయుగ వాఙ్మయమునందు నిది యత్యపూర్వము, నపూర్వము నైన కృతి. అయితే పూర్తిగాఁ దెలుఁగు కృతి కాక బోయె నన్నదే విచారము.

శహాజీ కృతులందు నస్తునై విధ్య మనల్పము. ఒంకు రెండు తక్క నన్నియు పొగాణికేతివృత్తములు. కాని యాతఁడు తీర్చిన తీర్పు క్రొంజవిగలది. చురుకైన శృంగారహాస్యప్రసంగములు కొల్లలుఁ కాని వానిలో ననౌచిత్య మత్యధికము. అతని కృతులన్నియుఁ బ్రదర్శనసౌలభ్యము గలవి. కాని యథాతథముగ నన్నియు. ప్రదర్శన యోగ్యములు గావు.

యక్షగాన చరిత్రలో శహాజీ కృతులఁ గూర్చి యెన్నఁదగిన విశేషములు: అవతారికలోని కథా సంగ్రహ ద్విపద, వినాయక పాత్ర ప్రవేశము, కటికము వాని నొక సాంప్రదాయిక హాస్యపాత్రగా రూపొందించుట, గ్రంథమున నడుగడుగునను బాత్ర ప్రవేశసూచక

ములు, కథానుసంధానకములు నగు సూత్రధార ప్రసంగములు, ఎడ నెడఁ బదర్శన ప్రవర్తకులైన భాగవతులు పాత్రలను బలుకరించుట మొ॥. అతని ప్రబంధ రచనయు నొక గొప్పవిశేషమే. అందు మార్గ నాటక సంప్రదాయానుసారముగా త్యాగ వినోద చిత్ర ప్రబంధము నందలి యంకవిభాగము, నందందవతారికలు మార్గనాటక నాందీ ప్రస్తావన సందర్భములను దలపింపఁజేయుటయును విశేషములే.

---

15. వాసుదేవకవి

పార్వతీ పరిణయము: *

ఏతద్గ్రంథావతారికలో నొక సూత్రధార వచనమున శాహ రాజ ప్రణీతమని యున్నది. కాని గ్రంథాంతమున శహాజీ పరముగా నున్న మంగళ గీతమున "... శ్రీ వాసుదేవకవి వచస్సంతుష్టాయ మంగళ" మ్మని యుండుటం బట్టియు, మహారాష్ట్రుఁడగు శహాజీ కృతు లం దెందును గన్పట్టని యాంధ్ర కవిస్తుతి యిందుండుటను బట్టియు వాసుదేవ నామధేయుఁడగు కవి యొకఁడు శహాజీ యాస్థానమందుండి యుండుననియు, నతఁడే దీనిని రచించి యుండుననియు నూహింప వచ్చును.

ఒక విశేషము:- బాలమనోరమాఖ్య సిద్ధాన్తకౌముదీ వ్యాఖ్య యొక్క చివర గద్యలో నిట్లున్నది.

* తం. స. మ. కే. సం. 545 — 553.

"శ్రీ శహాజి శరభోజి తుకోజిభోసల చోళమహీ మహేంద్రా మాత్య ధురంధరస్య శ్రీ మదానందరాయ విద్వత్సార్వభౌమస్య అధ్వర్యుణా ... లబ్ధ విద్యా వైశ్యేన ... వాసుదేవ విదుషా విరచితా యాం సిద్ధాంత కౌముదీ వ్యాఖ్యాయాం బాలమనోరమాఖ్యాయాం..."

అనఁగా బాల మనోరమ కర్తయైన వాసుదేవ దీక్షితుని గురువైన యానందరాయమఖి శహాజీ కాలము నుండి తంజావూరు మహారాష్ట్ర ప్రభువుల యొద్ద మంత్రిగా నుండినట్లు తెలియుచున్నది. ఈ వాసుదేవ దీక్షితుఁడే గురువుగారి చలువవలన శహాజీ యాస్థానమున కెక్కి యతనిపేర నీ పార్వతీ పరిణయమును వెలయించెనేమో; అగుచో నీతఁడు శహాజీ రాజ్యకాలమగు క్రీ. శ. 1684 - 1712 ప్రాంతమున నుండె ననవలెను.

ఈ పార్వతీ పరిణయమునందలి యవతారికలోని స్తుత్యాదికమే శహాజీ విఘ్నేశ్వర కల్యాణము, శచీ పురందరాదులకును మూఁదల యైనది. ఇందుఁ గొన్ని స్తోత్ర శ్లోకముల తరువాత 'నాఁది' ద్విపద, శాహారాజ సభాప్రశంస సీసము, కథాసంగ్రహ ద్విపదయుఁ గలవు. ఇందును శహాజీకృతులందువలె రంగముపై వినాయకుని వాలకము ప్రవేశ ప్రసంగములు గలవు. ఆసందర్భమునఁ గల పాత్ర వర్ణన ద్విపద, ప్రవేశపు దరువు నదేమాదిరిగా శహాజీ కృతులందుఁ దఱచు కన్పట్టును. ఇందు కటికము ప్రసంగముగూడఁ గలదు. ఇది "వేషభాషా భూషితం బగు - చారు నాటకము - లాస్యముల రాజిల్లు" నది యని పేర్కొనఁ బడినది.

ఇందలి కథ ప్రసిద్ధము. పార్వతీకల్యాణ కథా పూర్వరంగము లైన కామదహనాది ఘట్టములు విడువఁబడినవి. పార్వతిని బరీక్షింప వచ్చిన శివుని వాలకము మాత్రమునది (వృద్ధబ్రాహ్మణుఁడుగా). కవి

విదగ్ధుఁడేకాని యుదాత్తతఁ బ్రవర్తించలేకపోయినాఁడు. కోరి యనౌచిత్యమున కొడిగట్టినాఁడు. ఇది పురాణదంపతుల పుణ్యకథ యన్న మాటే మఱచిపట్లున్నది. హాస్యముకొఱకు కసభ్యత నాదరించినాఁడు. మంగళాష్టకములను 'పేరడీ' చేసిన మహాశయుఁడతఁడు.

ఇందు దరువులు, ద్విపదలు, సీసాది పద్యములు, సంస్కృత శ్లోకములు, వచనమును గలవు. దరువుల వరుసలకు మాత్రికలుగూడ నుదాహరింపఁబడినవి. రచన ప్రౌఢము.

---

16. నివర్తి శేషాచలపతి

శహాజీ యస్థానమున వెలసిన శాహారాజ విలాసము[1], సరస్వతీ కల్యాణము[2] ననుఁ రెండు తెలుఁగు యక్షగాన నాటకములు శేషాచల పతియను కవి రచించినవిగాఁ గన్పట్టుచున్నవి. అందు శా. వి. న "శేషాచలపతి" 'అష్టభాషా కవిత్వంబు లమరు సుకృతి' యని మాత్రమే గలదు.

స. క. అవతారికనుబట్టి యీతఁడు నివర్తి వంశ్యుఁడనియు, సీతని సూత్రగోత్రము లాపస్తంబ భారద్వాజార్షము లనియుఁ దెలియుచున్నది. అం దితని తండ్రిపేరు చొక్కనాథ మహామాత్యనాథుఁడని యున్నది. అనఁగా నితఁడు క్రీ. శ. 1659–1682 సం. ల నడుమ

(1) తం. స. మ. కే. నం. 632

(2) ,, ,, ,, 651–657

మధుర నేలిన యాంధ్ర నాయక రాజగు చొక్కనాథుని యమాత్యుఁడా, లేక యతనిపేరే చొక్కనాథామాత్యుఁడా యని శంక. శాహాజీయమను నొక శృంగారపదముల గ్రంథము♦ చివర నొక పదమున "చొక్కనాథ పాలాశాహేంద్రుండు" అని కలదు. ఆ పదకర్త పేరు చొక్కనాథుఁడగునా ? ఆతఁడీ శేషాచలపతి తండ్రి యగునా ? యని యింకొక శంక. శహాజీ రాజపుర విద్వత్పరిషత్తున గణనీయుఁడగు రామభద్ర దీక్షితునకు గురుస్థానమైన యతఁడొక చొక్కనాథ దీక్షిత నామధేయుఁడు గలడు. * కాని యతనికిని యీ శేషాచలపతికిని పితాపుత్ర సంబంధము గలదో లేదో తెలియదు.

ఇక నొక విశేషము: శహాజీ యాస్థానమున నాంధ్రపాణిని బిరుదాంచితుఁడగు నివృత్తి శేషాచలపతి కృతముగా వెలసిన సంస్కృత గ్రంథములు రెండు కన్పట్టుచున్నవి.

అవి ఆంధ్ర వ్యాకరణము [1], భోసల కోసలేంద్ర చరితము [2], రెండింటను నితని యాంధ్ర పాణిని బిరుదము స్మరింపఁబడినది. భో. కో. చ. న నితఁడు శహాజీచే గనకాభిషేకాది సత్కారములు పొందినట్లును, నితఁడు భారద్వాజ గోత్రుఁడు, నివృత్త్యన్వయుఁడు, అక్కదేవీ విభుఁడును నైన వేంకటపత్యనూత్యుని పుత్రుఁ డనియుఁ గలదు. శహాజీ రతి కల్యాణమున నొక ప్రతిలో (తం. స. మ. ప్రతి నం. 541) నితని యాంధ్ర పాణిని బిరుదము, శాహారాజ కృత సన్మానము స్మరింపఁ

♦ తం. స. మ. కే. నం. 468

* Vide Indian Antiquary, Vol. 33.

(1) తం. స. మ. కే. నం. 773 — 774.

(2) ,, సంస్కృత గ్రంథముల కేటలాగు నం. VIII. నం. 4238.

బడినవి. కామకళానిధి గ్రంథకర్తయైన నెల్లూరు శివరామ కవి యీతని పేరు నింటి పేరు, బిరుదు స్మరించి యీతఁడు తన గురువని వక్కాణించినాఁడు.

కాఁగా నీ యాంధ్ర పాణిని శేషాచలపతియు, యక్షగాన నాటకకర్త యగు శేషాచలపతియు నొక్కఁడా కాదా యనునది ప్రకృత ముదయించు ప్రశ్న. అనేక విషయముల సామ్యము గన్పట్టుచున్నది. కాని కవి పితృనామ విషయమున శంక పొడగట్టుచున్నది. భో. కో. చ. న వేంకటపత్యసూత్యుఁడు శేషాచలపతి తండ్రి యని కలమగదా, కాని సరస్వతీ కల్యాణమునందుఁ బేర్కొనఁబడిన చొక్కనాథ మహామాత్యనాథుఁ డనఁగా మధుర చొక్కనాథుని మంత్రి యతఁడగునో కాదా, అసలు చొక్కనాథునకు నివర్తి లేక నివృత్తి వేంకటపతి యను మంత్రి యుండెనో లేదో, లేక వేంకటపత్యా మాత్యునకుఁ జొక్కనాథుఁడను నొక సోదరుఁడుండెనేమో, ఆంధ్ర పాణిని బిరుదాంచితుఁడును యక్షగాన కర్తయు నా యన్నదమ్ముల పిల్లలేమో, ఇవి యిప్పటికిఁ దెమలని శంకలే యగుచున్నవి. తెలుఁగు గ్రంథముల విషయమున మాత్రము రెండు నొక్కతీరువి కనుకను, నొక్కదానిలో, గవి గురించి వివరములు లేకపోయినను రెండిట గర్తృనామము, కృతిపతి యగు శహాజి భవన వర్ణన గల యొక చూర్ణికయు నొక శ్లోకమును సమానముగ నున్నవి కావునను నా రెండింటినైన నేక కర్తృకములుగా గ్రహింపవచ్చును.

గ్రంథసమీక్ష

శాహరాజ విలాసము :

శాహరాజు సేతుయాత్ర చేసికొనివచ్చి తంజాపుర వీధులలో స్వారి వెడలుటతోఁ గథారంభము. అపుడు కాంభోజరాజు పుత్రి లీలా

వతి యతనిఁజూచి మో హించినదఁట. ఇది యులాప్రబంధపు కెత్తుగడ. విరహవేదన, దౌష్ట్యము, ఎఱుక పుల్పము ప్రేయసీ ప్రియుల సంయోగ మము తదుపరి పుట్టుములు. కటిక ము, సింగీ సింగళ్ళు మొ॥ వారం దలి యితర పాత్రలు.

రచన : కవి ప్రౌఢపండితుఁడని నిరూపించుచున్నది. "అతఁడష్ట భాషా కవిత్వంబు లమరు సుకృతి" యఁట. ఇందష్టభాషా ప్రయోగము లేదు గాని, తెలుఁగున దరువులు, గద్య పద్యములును ధవళశోభనము లు నొక వెన్నెల పదమును గాక సంస్కృతమున ననేక శ్లోకములు, వచనములు, అష్టపదులును సలక్షణముగా విరచింపఁబడినవి. తమిళ కన్నడము లందందు రెండు చిన్న ప్రసంగములును గలవు. దరువుల చివర సాధారణముగ శాహారాజపరముగ 'శేషాచల కవినుత' యని యుండును. కవి తన కృతిని నాటకమని వేరొక్కనినాఁడు. అవతారికలోఁ గృతిపతి శుభాశంసన శోభనములే షష్ఠ్యంతములుగ నున్నవి. కథాసంగ్రహ మొక సీసములోను శహాజీ వంశావతార మొక దీర్ఘద్విపదలోను జెప్పఁబడినవి. శహాజీ యాస్థానమునం దుండిన త్ర్యంబక పురోహితులగు పండితులు, రామకవి ప్రభృతులును వేరొక్కనిఁ బడిరి.

సరస్వతీ కల్యాణము:

ఏతద్గ్రంథావతారికయే శహాజీ జలక్రీడ, సతీపతిదాన విలాసము మొదలగు ననేక గ్రంథావతారికల కొరవడి యైనది. అవతారికలో నొక సూత్రధారవచనమున నిది "శాహామహారాజ ప్రణీతంబైన" దనికలదు. కాని యా వెనువెంటనే యున్న కథాసంగ్రహ ద్విపదలో :-

"చిరపుణ్య రతిమతి శేషాచలపతి
వరశాహా విభువేర వహినిదై వార
పరగు సరస్వతీ పరిణయం బనెడు
సహసనాటకము లాస్యముల రాజిల్లి
భావముల్ దగువేష భాషాదు లమరఁ
గావించె భరతులు గాయకుల్ మెచ్చ"

అనియున్నది. దీనిని శేషాచలపతి కృతిగనే పరిగణించుట లెస్స.

సరస్వతీచతుర్ముఖులు పురాణదంపతులే కాని వారి కళ్యాణ కథ యిందుఁ గొన్ని మార్పులందినది. కవి ప్రౌఢుఁడే గాని కథకుఁ బౌరాణికతా ప్రతిపత్తిని గల్పింపలేక పోయినాఁడు. ఇందు ధూమర కుఁడు, మల్లులు, పండితులు మొదలగు వారిప్రసంగములు కాలప్రభావమునకు లోఁగిన కవి హాస్య ప్రవణత్వమును వెల్లడించుచున్నవి.

ఆ పురాణదంపతులపెండ్లి శాహారా జేలు తంజాపురిలో నైన దఁట. ఇందు ద్విపద లెక్కువ. చిన్న చిన్న దరువులు, సూత్రధార పాత్రధారుల వచనములును గలవు.

అందు నాఁటి తంజావూరు మాండలిక వ్యవహారఘనితి బాగుగాఁ గన్పట్టును. సూత్రధారి పాత్రలను బలుకరించుట గలదు.

ఇందలి స్తోత్రశ్లోకముల రచన యుద్ధసన్నద్ధుడఁగు ధీరోద్ధత నాయకుని గమన గాంభీర్యమును దలఁపించును. గ్రంథము మంచి నాటకపువాటము గలిగియున్నది.

---

17. బాలకవి సుబ్బన్న

శహాజీ యాస్థానమునవెలసిన య. గా. నాటకములలో లీలావతీ శాహారాజీయ [1] మనునది బాలకవి సుబ్బన్న కృతమని కలదు. పంచకన్యాపరిణయ [2] మనుదానిలో నది బాలకవి కృతమనిమాత్రము గలదు. ఈ రెండింటి గ్రంథాంతగద్యలు నున్నంతమట్టున నొక్కఫక్కిగా నున్నవి. పం. క. ప. న కొక్కటే ప్రతియున్నది. అందు శైథిల్య మెక్కువ. ఆ శిథిలభాగమున గ్రంథకర్త పేరు జారిపోయియుండును. శాహామహారాజకల్యాణ [3] మను నింకొక కృతి గలదు. తత్పూర్వపరిస్థితియు నిట్టిదే. అందు గ్రంథాంత గద్య లోపించినది. కర్తృనామ సిద్ధేశమే కాదు, బిరుదప్రస క్తియును లేదు. కాని పం. క. ప. న. గ్రంథాంతగద్యకు ముందున్న 'ఎంతకాలము చంద్రుఁడీశుని మూళ్ళిపై గాంతిమంతుండయి కదలకుండు' నను ఫలశ్రుతి సీసము శా. మ. రా. క. గ్రంథాంతమున నక్కలే కలదు. (ఎత్తుగీతి మాత్రము కొఱవడినది.)

ఆ యీ యుపపత్తులనుబట్టియు నింకను గొంత రచనా సామ్యమునుబట్టియు నిప్పటి కీ మూఁడును బాలకవి సుబ్బన్న కర్తృకములు గావచ్చునని యూహింపఁబడుచున్నది.

లీలావతీ శాహరాజీయము:

కాశ్మీరదేశాధీశుఁడగు రాజకంఠీరవుని పుత్రి లీలావతి వెన్నెల బయట విహరించుచు మొగమెత్తి చంద్రునిఁ జూడఁబోయి యొక

1. తం. స మ. కే నం. 588 — 589
2. ,, ,, ,, 539
3. ,, ,, ,, 631

మేడపై నున్న శశిజీ ముఖచంద్రునిఁజూచి మోహించినదఁట. తదు పరి యామె విరహావేదన, చెలిక త్తిచే రాయబారము, ఎఱుక ఘట్టము తుద నాయికా నాయకుల సమాగమము.

రచనలో సందర్భశుద్ధి తక్కువ. శయ్యాలాలిత్యము గలదు. కాని భావప్రౌఢి లేదు. శబ్దదోషములును గలవు. బాలకవి రచనవలెనే యున్నది. ఇందు పదములు, ద్విపదలు, మంజరి, పద్యములు, అవ తారికలో నొక 'కైవార' గద్యయుఁ గలవు.

పంచకన్యా పరిణయము:

శ్రీకృష్ణుఁడు కందుకక్రీడ పండెమునెపమున సుదామునిఁ జూడఁ బోవ నొకయైదుగురు కన్యలెవరో యతని కెదురుపడుట – అతఁడు వారిని వలచుట – ఒక గోపకుని ద్వారా వారి వర్తన మరయుట – ఖిదప సుదాముని ద్వారా వారితోఁ జెలిమిచేయుటకుఁ బ్రయత్నించుట – వారు జలక్రీడ లాడుచుండ వస్త్రాపహరణ మొనర్చుట – 'చీరలడుగ వచ్చినను బెదరించి పెండ్లాడుట' – ఇది విషయము.

పంచకన్యల పేర్లు:– కలకంఠి, కనకాంగి, ఇందువదన, మనో రమ, చిత్రరేఖ.

రచన యొకమోస్తరు. దరువులు, ద్విపదలు, గద్యపద్యము లును గలవు. ఇందు ప్రసంగియనఁగా 'దశావతారాలాడే భాగవ తుఁడు' (కన్నడమున యక్షగానమునకు 'దశావతార – ఆట' యనియు వ్యవహారము గలదు). కేతినాయని (కటికము) కోరిక నతనిపై పాడిన పదమొకటి విశేషము.

శాహమహారాజ కల్యాణము:

తంజాపుర తత్పురాధీశ ప్రశంస — శాహారాజు కొలువు — కొలువులో నాట్యగోష్ఠీ వినోదము — తదుపరి శాహారాజు స్వారి — పౌరకాంత లతనిఁ గాంచి మోహపరవశలగుట — అతఁడు నగరికి మగిడినను నతనిపైఁ దగులొక్కినిన మనసు మగుడక యొక రాజకన్యక రూపావతీ నామధేయ విరాళిఁ గుందుట — నారదుఁ డొకుకతవై వచ్చుట, చెలిక త్తె దొరవారి సమ్మతి గొనివచ్చుట — ఆ రాత్రియే దొరవారు స్వయముగా రూపావతి యింటికి విచ్చేయుట — విషయము.

ఇందలి, లీలావతీ శాహారాజీయమందలి కథావస్తువులు ముందు నాఁటి విజయరాఘవ కల్యాణ, విజయరాఘవ చంద్రికా విహారములను గొంత కొంత పోలియున్నవి. ఇందలి రచన సరళముగాఁ జాలవఱకు నిర్దుష్టముగనే యున్నది. వాడిన రాగము వాడకుండ రాగ బహుళ ముగా, దరువు లనేకము సరసముగాఁ జెప్పినాఁడు కవి. గ్రంథకర్తకు సంగీతశాస్త్ర పరిచయ మెక్కువగా నుండినట్లున్నది. బాలకవికి రాను రాను బాగుగా చేయితిరిగినట్లున్నది. కొరవంజి దరువొకటి యిందు గలదు. అందు కొరవంజి రాకయే చెప్పబడినది. సువాలలు, ధవళ, మంగళగీతములు నిందుగలవు.

18. రామకవి

వాదజయకొరవంజి: *

ఈ గ్రంథమునుగూర్చి తం. స. మ. కేటలాగులో నిట్లు గలదు.

"అసమగ్రము, తప్పులు కుప్పలు, వ్రాత జిలుగు, శైథిల్యము గలదు. గ్రంథనామముగాని తత్కర్తృనామముగాని తెలియ నవకాశము గాన్పింపదు. గ్రంథ ప్రతిపాద్యము గూడఁ దెలియుట కష్టతరము. ముఖ పత్రమున "వాదజయ కొరవంజి నాటకం" అని నిర్దేశింపఁబడెను."

అది కొంతవఱ్ఱు నిజము. గ్రంథమందెల్లెడ శాహారాజు ప్రశంస గన్పట్టుచున్నది. అందుచే నిది శాహాస్థానకవి యెవఁడో రచించియుండు ననుట నిశ్చయము. గ్రంథమున కొక్కటే ప్రతి లభించినది. అది యసమగ్రము, 160 గ్రంథముల (గ్రంథము = 32 అక్షరములు) పరిమాణము గలది. ఆ యింతగ్రంథములో సుమారేఁబది గ్రంథముల భాగము నాక్రమించిన దొక యవదరువు ప్రసంగము. అందు రామకవి పేరొకటి దొరలినది. శేషాచలపతి శాహారాజవిలాస కృత్యవతారిక యంచున్న శాహారాజ సభాప్రశంసాత్మకమగు పద్యములో " .....సభాసీనుల్ బుధీజుల్ కవుల్ రామాముల్....." అని యున్నది. దీనినిబట్టి శహాజీ యాస్థానమున రామకవి నామధేయుఁడొకఁడుండినాఁడనుట స్పష్టము. కావునఁ బ్రస్తుత గ్రంథమా రామకవి కృతమని యూహింపవచ్చును. కాని యతఁడు తమిళుఁడై నట్లిందు సూచింపఁబడినది. అయినను ననేకాంధ్రకవులకుఁ బట్టుకొమ్మయగు శహాజీ యాస్థానమున నతఁడెట్లో నాలుగు తెలుఁగుముక్కలు నేర్చి యీ గ్రంథమును గూర్చియుండుననుట యసమంజసముగాదు.

* తం. స. మ. కే. నం. 597.

ఆంధ్ర వాఙ్మయ సూచికలో వాదజయ కొరవంజి నాటక మొకటి శహాజీ కర్తృకముగా నుదాహరింపఁబడినది. అది యిదే యనుకొందును. ఇందలి శాహారాజ ప్రశంసను జూచి యిది తత్కర్తృక మేయని ఆం. వా. సూ. కారులు పొరపడియుందురు.

గ్రంథభాగ ముపలబ్ధమైన యంతలో గ్రంథనామము సార్థకము గాదు. ఇందు వాదజయము * ను లేదు. కొరవంజియును లేదు. శాహా రాజును మోహించి యొకకాంత విరహ నిశ్వాలలై ప్రలపించుటయు, నామె ప్రియసఖి నాయకునితో నాయికాప్రశంస యొనర్చి యా మె నేలుకొను నుపాయ ముపదేశించుటయు నున్నంతలో నిందలి విషయముగాఁ దోఁచును. శాహారాజ కృతులన్నియున్నను నందిట్లు తఁడే నాయకుఁడుగా నున్న దొక్కటియుఁ గానరాదు. అందుచే నిది తదితరకృతమే యనుట లెస్స.

గ్రంథము దరువులమయము. రచన చక్కనిదే.

---

19. దర్బా గిరిరాజు

ఇతఁడు శహాజీ యాస్థానమును దదుపరి శహాజీ యనుజుఁడగు శరభోజీ యాస్థానమును నాశ్రయించి యుండెను. వా రిరువురి పేర ననేక యక్షగానములను బదములను వెలయించి యుండెను. శహాజీ రాజ్యారంభవత్సరము క్రీ. శ. 1684, శరభోజి రాజ్యాంత వత్సరము

---

* తం. స. మ. లో వాదజయ మను నింకొక గ్రంథము (కే. సం. 598 — 601) గలదు. అది గిరిరాజకవి కృతము. దానికిని దీనికిని సంబంధములేదు.

క్రీ. శ. 1727. గిరిరాజా నడుమ నుండియుండును. అతని గురించిన వివరము లతని గ్రంథముల నుండి యెఱుకపడినవి కావు. కాని యతని యనుజుఁడగు కవి గిరి రచించిన రుక్మాంగదచరిత్ర మను ద్విపద కావ్యావతారికలో నా కవుల విషయము గలదు. * అందు గిరిరాజు దర్భాన్వవాయుఁడు, నాపస్తంబస-త్రుఁడును, లోహితగోత్రుఁడు ననియుఁ జెంగమాగోపాల మంత్రు లతని పితామహులనియు, నతని తల్లి జానకాంబ యనియుఁ దండ్రి యీశ్వరాధ్యుఁ డనియు, గిరిరాజునకు గోపన యను నగ్రజుఁడును, వెంగనయుఁ గవిగిరియు ననుజులున్నట్లును విదితము. అతఁడు శరభోజీ యాస్థానకవి యనియు స్పష్టపడినది. ఇతఁడు శరభోజీ రతికల్యాణము, వల్లీకల్యాణము శచీపురందరములందు పద కర్తగా స్మరింపఁబడినాఁడు. ఆయా కృతి రచనా వ్యాసంగమున నితఁడు శరభోజీకిఁ దోడ్పడియుండును. ఇతని పదము లనేకము యక్షగానము లొక యీఱును తం. స. మ. లో గలవు. అన్నియు నముద్రితములు. అన్నియు రాజ సంబంధేతివృత్తములు — శరభోజీపై నైదును, శరభోజిపై నొక్కటి.

శారభేంద్ర చరితము: [1]

ఈ కృతికిఁ గవిపెట్టిన పేరేమో తెలియదు. ప్రతిపాద్య విషయమును బట్టి తం.స.మ. కేటలాగులో శారభేంద్ర చరిత్ర మని పేర్కొనఁబడినది. ఇందలి విషయము — శారభరాజు స్వారివెడలుట, ఒక సాని కూఁతు రతనిని మోహించుట, వారిసమాగమము. నాఁటి ఒహాయక్షగాన కృతులం దది పాడిన పాటయే. ఈకృతి యక్షగానమని కవిచేఁ బేర్కొనఁబడుట విశేషము. తంజావూరు ప్రాంతమున ముందు తరముల

* చూ. తం. స. మ. కే. నం. 353., పుట 123 — 124.

(1) తం. స. మ. కే. నం. 496.

నుండియు నేతాద్యగ్రచనలకు యక్షగానము లను వ్యవహారము పోయి చాటు కావ్యములు, నాటకములు నను వ్యవహారము స్థిరపడిపోయిన కాలమున గిరిరాజు మరలపూర్వ వ్యవహారమును స్మరించుటయుఁబూర్వ య. గా. లవలెఁ దనకృతిని తాళ్ళప్రధానములగు దరువుల నింపుదన ముతో నిర్మించుటయు విశేషమే. ఇందు ద్విపదయుఁ గంద, గీత, సీస ములు, వచనములు, నలఁతిగాఁ బ్రయుక్తములు. రచన సరసముగనే యున్నది.

ఇందు నాయిక విరహోత్కట్టమున నొక పదమున శాహారాజ సంబుద్ధిగా "నాగేశ్వరకవి సన్నుత" యని యున్నది. అనఁగా శహాజీ యాస్థానమున నాగేశ్వర నామధేయుఁడొక కవి యుండెనా లేక యది నగేశ్వరశబ్దమై గిరిరాజునే సూచించునా యన్నదొక శంక.

రాజమోహన కొరవంజి : [2]

ఇది యక్షగాన ప్రాయమైన రచనయే. కొరవంజి పాత్ర విశిష్టమై యాపేర ప్రవహృతములై వెలసిన కొలఁది తెలుఁగు కృతులలో నిదియు, మైసూరి కంఠీరవరాజు కొరవంజి కథ్ళెయు మొట్ట మొదటి తరమునకుఁ జెందునట్టివి.

కొరవంజులలో సాధారణముగా నాయికా నాయకుల విప్రలంభము, నాయిక కామె ప్రియ సమాగమము గూర్చి కొరవంజి సోదె చెప్పుటయుఁ బ్రధానవిషయములు. అందుఁ గొరవంజి వేషభాషలు కొలిచిన దేవతలు మొ. విషయము లనేకము ప్రసక్తము లగును. చివరఁ గొరవంజి ప్రియుఁడు సింగఁడు సింగిని వెదకుకొనుచువచ్చి యామెతో వాదు లాడుటయు నుండును. ఈ రాజమోహన కొరవంజి యచ్చు మచ్చిదే తీరుది. ఇందు శాహారాజే నాయకుఁడు. నాయిక యొక రాజ కన్య.

2. తం. స. మ. కే. నం 509—511, 570

ఇందు దరువులు, పదములు నెక్కువ. ద్విపదయు, సంధిసంభాషణ వచనములును గొలఁదిగాఁ బ్రయుక్తములు. దరువులు కురంజి, సౌరాష్ట్ర, పూరివి, బిజావంతి, పాడి, నీలాంబరి మొ॥ రాగములలోఁ గలవు. దరువులలో శాహారాజ పరముగా 'గిరిరాజనుత' ముద్రగలదు. కతిపయ సూత్రధార వచనములును, రంగప్రయోగ సూచనములును గలవు. రచన చక్కనిది.

రాజకన్యా పరిణయము: [3]

ఇందుఁ గొరవంజి పాత్రలేదు. కాని కడమ కథ యంతయు రాజమోహన కొరవంజినిఁ బోలినదే. అలఁతి యలఁతి మార్పులు గలవు. గిరిరాజీ గ్రంథమునే ముందు రచించి పిదపఁ గొరవంజి పాత్రను ప్రవేశ పెట్టిన బాగుగ నుండునని పిదప రా॥ మో. కొరవంజిని రచించి యుండునని తోఁచెడిని. ఇందు రాగతాళము లుదాహరింపఁబడని దరువులు, పల్లవితోఁ బదములు, పాత్రల సంభాషణ వచనములు సూత్రధారుని సంధివచనములు, ద్విపదలు, నొకశ్లోకము, నొక యుత్పల మాలయుఁ గలవు. దరువుల చివళ్ళ "గిరిరాజనుత" ముద్ర గలదు. రచన 'సాదా' గా నున్నది.

వాదజయము: [4]

వారవధువు లిరువురకుఁ దమతమ నాట్య విద్యానైపుణ్యము గురించి పంతము పడినది. అందొకతె యప్పుడే శాహారాజు మెప్పు నడసినది. మరియొకతె యతని మెప్పించి, మరుకేళిఁ గలయఁగలనని ప్రతినపట్టినది. అంతపనియుఁ జేసినది. – ఇది యిందలి ప్రధాన విష

(3) తం. స. మ. కే. నం. 568–569.

4. ,, ,, ,, 598–601

యును. ఇందు దరువు లెక్కువ. సూ. ధా. వచనములు నెక్కువే. వారవధూ సంవాదములు వచనములో సాగినవి. ద్విపదయు, నొక దండకము, నొక శోభనము, నొక మంగళగీతమును గలవు. ఇందలి కోలాట ప్రసంగము కవికిగల వివిధ తాళజ్ఞానప్రవీణతను దెలియఁ జేయుచున్నది. రచన చక్కనిది. గ్రంథము నాటకమని పేర్కొనఁ బడినది.

పర్వాంగ సుందరీవిలాసము: [5]

ఏతద్గ్రంథావతారికలో శేషాచలపతి సరస్వతీ కల్యాణమునందలి స్తోత్రశ్లోకములు గన్పట్టును. గ్రంథాంత మంగళగీతము పార్వతీకల్యాణము చివరనున్న వాసుదేవకవి నామాంకితమైనదే యిందును గలదు. కాని యీగ్రంథము శేషాచలపతి కృతమని కాని, వాసుదేవకవి కృతమని కాని యనరాదు. ఇందలి కథాసంగ్రహద్విపదలో 'గరిమతో గిరిరాజకవి రచియించె' నని స్పష్టముగాఁగలదు. గిరిరాజకవి ముద్రతో నతని యితర కృతులందున్న దరువులు నిందుఁ గలవు. కాఁగా నా స్తోత్రశ్లోకములును, నామంగళగీతము సరస్వతీ పార్వతీ కల్యాణముల ప్రతివిలేఖకుఁడైన వెంకటరంగయ్యయే యీ గ్రంథమునకును బ్రతివిలేఖకుఁడగుటచే నతనిచేతనే యిందుఁ జొప్పింపఁబడి యుండునని యూహింపఁదగియున్నది.

గ్రంథరచనాకాలము కే. నం. 660 ప్రతీవిలేఖనకాలము తారణ పుష్యశుద్ధ ప్రతిపద్ - స్థిరవాసరమని యున్నది. అది క్రీ. శ. 16–12–1704 తేదీకి సరిపోవును. గ్రంథరచనాకాల మంత కించుక ముందు జరిగియుండును.

5. తం. సం. మ. కే. నం. 658 — 662

ఒక శివరాత్రినాఁడు శాహారాజు పంచనదేశ్వరస్వామి కోవెల మండపమునఁ గొలువుండును. అపుడచటికి స్వామిని దర్శింపవచ్చిన కుంతలేశ్వరకుమారి సర్వాంగసుందరి శాహారాజును జూచి మోహించును. తమపరి తండ్రి పెండ్లిమాటలపైఁ గార్యమునెఱు వేరును. ఇందలి ప్రధానవిషయమిది. రచన చక్కనిదే. అటనట ననుచిత సందర్భములు లేకపోలేదు. ఇది "శృంగారవేష భూషాదిభూషితంబగు...నాటకం" బని పేర్కొనబడినది.

లీలావతీ కల్యాణము : [6]

ఇది శరభోజి నాయకమైన కృతి. ఈ శరభోజి శహాజీ యనుజుఁడు. క్రీ. శ. 1712–1728 సం.ల నడుమ తంజాపురము నేలినవాఁడు. అతఁడీ గ్రంథమున వర్ణింపఁబడిన తీరు జూడ "కవులకు ముంగిటి కల్పభూజం" బయిన దొడ్డ ప్రభువని తెలియుచున్నది. కాని యతని యాస్థానమున వెలసిన తెలుఁగుకృతి యిది యొక్కటియే కన్పట్టుచున్నది. దీని కర్తృత్వ మిదమిత్థమని లేదు. కాని గ్రంథమున శరభోజి విశేషముగా "గిరిరాజనుత" యనునది నాలుగుపర్యాయములు ప్రయుక్తమైనది.

శరభోజి యాస్థానము నలంకరించిన తెలుఁగు కవులలో నిప్పటికిఁ దెలియవచ్చినది గిరిరాజు పేరొక్కటే. గిరిరాజు శరభోజీపైఁ జెప్పిన పదములా ముద్రతోఁగూడ తం. స. మ. లోఁ గన్పట్టుచున్నవి. కాఁగా గిరిరాజే తద్గ్రంథకర్త యనుట లెస్స.

మహారాష్ట్ర దేశమునఁ గల్యాణపురి పరిపాలకుఁడగు కీర్తిచంద్ర నృపతి తన కూఁతురగు లీలావతి కనురూప వరునిఁ జూడనొక యోగిని నియోగించును. ఆమె యాశరభోజి సంబంధము గుదుర్చును. పెండ్లి తంజాపురిలో నగును. ఇందలి విషయమిది.

(6) తం. స. మ. కే. నం. 587.

ఇది నిర్వచనము. ద్విపదలు తరచు. అందు ప్రాసయతులు పాటింపఁబడినవి. దరువులు, పద్యములు, శ్లోకములు మంజరి (మంజరీ ద్విపదకాదు. ఒక మహారాష్ట్ర గీతిచ్ఛందస్సు. మన హరికథలు కొన్నిటఁ గానవచ్చును). వెండిరేకు అను రచనా విశేషములు గలవు. రచనలోఁ జక్కని చాకచక్యము గన్పడుచున్నది. ఇంపు సూత్రధార ప్రసక్తి లేదు. కానిగిరిరాజు కృతులన్నియు రంగప్రయోగ యోగ్యములై నవే.

---

20. అన్నదానము వేంకటాంబ

రామాయణము (బాలకాండము)*

గ్రంథారంభమునఁ బ్రకటనకర్త్రి యొక విజ్ఞప్తిచేసి యుండిరి. అందు గ్రంథకర్త్రి గుఱించి "ఇప్పటికి సుమారు రెండువందల సంవత్సరముల క్రిందట నేలంజిల్లా హోసూరుతాలూకా తోగీర అగ్రహారమను శ్రోత్రియ గ్రామమందు నా పూర్వికురాలైన అన్నదానం వెంకట రామావధానుల భార్య వెంకటాంబ ...." అని యున్నది. దీనిని బట్టి గ్రంథకర్త్రి 18వ శతాబ్ది ప్రథమపాదమున నుండెనని చెప్పవచ్చును. వెంకటాంబ గ్రంథాంత ద్విపదలోఁ దనపేరును భర్తపేరును బేర్కొన్నది. అవి సరిపోయినవి. కానియామె నివాసము మాత్రము ప్రకటన కర్త్రియన్నట్లుకాక కావేరీనదీతీరము వీరరాజమను నగ్రహారమని యున్నది. దానికే తోగీర మఱియొక పేరు కాబోలు.

* ముద్రితము. చంద్రమౌళీశ్వర ము. శా. కర్నూలు, 1912. ప్రకటనకర్త్రి అన్నదానము రామలక్ష్మమ్మ.

గ్రంథకర్త తనకృతిని యక్షగానమనుచు నాడువారు పాడుటకు మాత్రమే యుద్దేశించినది. ప్రకటనకర్త లీగ్రంథమును వ్రాతప్రతుల మూలమునఁగాక పారాయణ పరులగాత్రములనుండి సేకరించిరి. అట్లు నానోట నానోట నానివచ్చుటచేతను, ముద్రాపకుల పరాకు వలనను కొంత గ్రంథకర్త యభిజ్ఞతవలనను నీగ్రంథ మనేకదోషముల కాకర మైనది. ఇందుఁ బ్రసిద్ధ రాగతాళములలో పదువులు, కీర్తనలు, ద్విపదలు, సీస గీతపద్యములు, వచనము, లాలి, శోభనము, మంగళ హారతి మొ॥ పాటలు గలవు. కథ ప్రసిద్ధమైనది. అంతయు నాఖ్యాన శైలి. అటనట వర్ణనములు గలవు. రామసిబొల్యము, సీతాకళ్యాణ ఘట్టము చక్కఁగా దెనుఁగుదన ముట్టిపడునట్లు వర్ణింపఁబడినవి.

---

21. తిరుమలకవి

చిత్రకూట మాహాత్మ్యము :♦

మధురాంధ్రనాయక రాజాస్థానమున వెలసి మనకు లభించిన యక్షగాన మిది యొక్కటే. ఇది 'విజయ రంగావసిశ్వర సభార్హముగా, నర్తనయోగ్యముగా' వెలసినది. మధుర విజయరంగచొక్కనాథ నాయకుని రాజ్యకాలము క్రీ. శ. 1706 - 1732. * (అతని యాస్థా నము నాశ్రయించిన కుందుర్తి వేంకటాచలపతి కవి తాను "బహు

♦ తం. స. మ. కే. నం. 520.

* Vide., History of the Nayaks of Madura By Sri R. Sathya nadha Aiyer.

(Madras University Publication).

నాటకములు'' రచించినట్లు తన మిత్రవిందాపరిణయ కార్తీక మహాత్మ్య కృతులందుఁ జెప్పుకొనినాఁడు. అవి యెవ్వియు నేఁడుపలబ్ధములు గావు. ఆనాఁటికి మనకు మార్గనాటకములవంటి నాటకములు లేవు. కావునఁ బ్రొయిక్‌ముగా నవి యక్షగానములే యైయుండును)

ఈ చి. కూ. నూ. కర్తయగు తిరుమలకవి, (యింటిపేరు తెలియదు) బాలసరస్వతిమఖి పౌత్రుఁడనియు, వేంకటాధ్వరి పుత్రుఁడనియు, "సంగీత సాహిత్య చతురుఁడౌ విజయరంగచొక్కాఖ్యని రమణుని కృపను ... ఘనబహుమానములఁ గాంచిన వాఁ" డనియు నీగ్రంథమూలమునఁ దెలియుచున్నది.

చిదంబరక్షేత్రమున విశ్వకర్మనిర్మితమైన కనకసభలో నర్తన కళాప్రావీణ్య విషయమునఁ బోటీపడి యెఱికొకరు తీసిపోని ప్రతిస్పర్ధులుగా నిలిచిన కనకసభాపతికిఁ దిల్లాదేవికి (శివ పార్వతులకు) తిల్లగోవిందరాజులు గాంధర్వవివాహమును సంఘటించుటయుఁ దదుపరి వారి వినోద విహారములు నిందలి ప్రధాన విషయములు. (శహాజీ త్యాగవినోద చిత్రప్రబంధము నించుమించిట్టిదే). దీనికి "తిల్లగోవింద రాజనాటక" మనియు నామాంతరము.

ఇందలి కథాసంవిధానము :— 'ఇది మొదటినాటి సంవిధానము - ఇది రెండవనాటి సంవిధానము' అని యిట్లు నాల్గు ఘట్టములుగా విభాగింపఁబడినది. చూడఁగా నిది చతుర్దిన ప్రదర్శనోద్దిష్టమాయనిపించును. కాని గ్రంథపరిమాణ మల్పము (560 గ్రంథములు మాత్రము). ప్రదర్శించుట కొక్కరాత్రి చాలు. అట్టిచో నా విభాగమంక సంకాశమనుకొనుట లెస్స. (శహాజీ త్యాగ వినోద ప్రబంధమున అంకవిభాగము గలదు. అప్పటికే యక్షగానముపై మార్గనాటక ప్రభావము కొంత పొడసూపినది.) ఆ మొదటినాటి, రెండవనాటి యను

మాటలు కథా కాలమునకు సంబంధించినవియై యుండును గాని ప్రదర్శనకాలమునకు సంబంధించినవియై యుండవు.

ఇందు ప్రసిద్ధరాగములలో కర్ణాట హిందూస్తానీ బాణీలకుఁ జెందిన దరువులుగలవు. సమపద మను రచనావిశేష మొకటి పలు మఱు ప్రయుక్తము. అష్టకము, ఉత్తర ప్రత్యుత్తర పదమును గలవు. రచన చక్కనిది. అందును వచనరచన. వచనమున సంభాషణలు గలవు. ఇది "స్వామి వాక్యం" - ఇత్యాది పాత్ర సంభాషణ సూచనలు గలవు. సంధివచనములు ప్రసంగము లను పేర వ్యవహరింపఁబడినవి. గ్రంథ మధ్యమునను గైవారములు గలవు. ఒక గుజరాతి కోపు నొక జక్కిణియుఁగలవు. పేరణి, పదచాళికయుఁ బేరొక్కసఁబడినవి.

గ్రంథమున నాటకీయత ప్రస్ఫుటముగ నున్నది. కవి దీనిని మహానాటక మనియెను గాని యది వట్టి మాటవరుస. కథా సంవిధాన చతుర్థావిభాగమును బట్టి యిది చతురంకిక యని చెప్పవచ్చును. క్లిష్ట వృత్తము. శైశికీవృత్తిగలదు. ప్రథమ చరమాంకములందు సచేటియైన నాయిక వనవిహారాదులు వర్ణితములైనవి. కాన నవి స్త్రీ ప్రాయత్వ విశిష్టములు. కాఁగా నాటికా లక్షణము కొంత పట్టిన దన వచ్చును. ఇది విజయరంగని సభలో "వగకోపుల వైపు లమర ఇంచుబోణులు నటించు" భాగ్య మందినదని యూహించుటకవకాశ మున్నది.

22. తుళజ రా జు

తంజావూరి మహారాష్ట్రప్రభువు (క్రీ. శ. 1728–36), ఏకోజీ దీపాంబికల పుత్రుఁడు, శహాజీ శరభోజుల యనుజుఁడు నైన తుళజరాజ కృతములుగా తం. స. మ. లో రెండు తెలుఁగు య. గా. నాటకము లగుపించు చున్నవి.

శివకామ సుందరీ పరిణయము : [1]

ఇది చిదంబరక్షేత్రగాథ. క్షేత్రస్వామి కనకసభాపతి (శివుఁడు). శివకామసుందరి (పార్వతి) యతని దేవి. వా రిరువురి వివాహమిందలి ప్రధానవిషయము. (తిరుమలకవి చిత్రకూట మాహాత్మ్యమునందు నిదియే ప్రధానవిషయముకాని యాతని తీర్పు వేఱు) ఇఁదలి రచన యంత ప్రౌఢమైనదికాదు. కథనభాగ మెక్కువ. గ్రంథమంతట సూత్ర ధారప్రసక్తి కడుహెచ్చు. అవతారికా స్తోత్రశ్లోకపఠనము, గ్రంథాంత మందలి సుదీర్ఘ కల్యాణకథనము, పాత్రప్రవేశ సూచనలు, తద్వర్ణ నము నన్నియు నతని పనులే. స్థూలముగా యావద్గ్రంథము నొక దరువు నొక వచనముచొప్పున నడచును. మూఁడు నాల్గు తావుల ద్విపదలు, కందములు, నొక్కొ ఁ ధనళమును గలవు.

రాజరంజన విద్యా విలాసము : [2]

ఇందలి ప్రధాన విషయమిది :— అరిషడ్వర్గ జనయిత్రి యగు మాయాదేవి గాత్ర పురాధీశుఁ డగు జీవరాజు తన్ను విడనాడె నని

---

1. తం. స. మ. కే. నం. 633 — 635

2. ఇది కేటలాగులోఁ బేర్కొ ఁనఁబడలేదు.
తం. స. మ. న. ప్రతి. నం. బి. 13944

పుండరీక పురాధీశుఁడగు నాత్మ మహారాజుతో మొఱ బెట్టుకొనుట. ఆత్మ మహారాజు పనుపున మోహుఁడు యతివేషము ధరించి జీవరాజు నెదుట వింతవింత విద్యలు ప్రదర్శించుట – వాని కిటుకు దెలిసి జీవరాజు తపశ్చిత్కీర్షువగుట – ఆత్మరాజు శివ స్వరూపమున సాక్షాత్కరించుట – జీవరాజు ముక్తి నిమ్మనుట – "సంసారములో నున్న ప్పటికిన్ని పూస లలో దారమువలె నిస్సంసారివై నిరామయుండవై యుండవోయి" అని శివుని యుపదేశము – తదుపరి మాయా దేవీ జీవేశ్వరుల యాధ్వ ర్యమున రతిమన్మథులకు వివాహము జరుగుట.

ఇందలి విషయము తాత్త్వికము. వివేచన సాంకేతికము. జీవన్ముక్తిని గృహస్థాశ్రమమును నద్వైతవాదమును నిది సమర్థించును. ప్రబోధ చంద్రోదయమునకు మానస పుత్రిక వంటిది. ఇందు విష యము పటువై నదై నను రచన సరళమైనది, చక్కనిది. ఇందు దరువులు ద్విపదలు, కందములు, సీసములును గలవు. పద ప్రయోగములలోఁ జక్కని వాడుక నుడికారము గలదు. కొన్ని యన్య దేశ్యములు గలవు. మోహుని రాక మోహనరాగములో, శంకరసాక్షాత్కా రము శంకరాభరణములో నిట్లు చెప్పుటొక చమత్కారముగాఁ బొటింపఁబడినది. రంగముపై నున్న మఱియొక పాత్ర మాటలలోఁ దమ వేసు తడవఁబడఁగానే పాత్రలు ప్రవేశించు టది యొక వైచిత్రి గలదు. భాగవతులు పాత్రలను బల్కరించుట గలదు.

పై కృతులు రెండింటికి నవతారికల తీరులో రచనా ధోరణి లోను జాల పోలికలు గలవు. రెండింట గ్రంథారంభమున నాందీ శుభా చారము, వసంత వర్ణన, సూత్రధార పారి పార్శ్వకులచేఁ బ్రవర్తిత మైన ప్రస్తావనయుఁ గలవు. అది మార్గ నాటక సంప్రదాయానుకర ణము. అంతేకు ముందటి య. గా. లలో నిట్టి సక్రమమైన మార్గ

యూపక స్థాపన సదృశమైన ప్రస్తావన లేదు. గ్రంథములు రెండును గర్తచే నాటకములని పేర్కొనఁబడినవి. ప్రదర్శనోద్దిష్టము లైనవి.

---

23. ఏకోజీ

విఘ్నేశ్వర పరిణయము : *

పై తుళువ రాజపుత్రుఁడును, క్రీ. శ. 1736—37 సం. లలోఁ దంజావూరి యేలికయునగు రెండవ ఏకోజీ రచించిన దీ గ్రంథము. శహాజీ విఘ్నేశ్వర కల్యాణమునందును నిందును ప్రధాన విషయ మొక్కటే కాని యిందించుక మార్పు గలదు. భారత రచనారంభఁ డగు వ్యాసుఁ డుపాసింపఁగా వినాయకుఁడును, సిద్ధిబుద్ధి కన్యలతో సర స్వతియు నత్తురు. వినాయకుఁ డాకన్యలను జూచి మోహించును. వ్యాసుఁ డతని భారతము వ్రాసిపెట్టుమనఁగా నతఁ డాకన్యలతోఁ దనకుఁ బెండ్లి చేసిపెట్టుమని యొక కట్టడి చేయును. వ్యాసుఁ డెట్లో యూపని నెఱ వేర్చును. అతని భారత రచనా వ్యాసంగ మవిఘ్నముగాఁ గొనసాగును.

ఇందలి రచన యొకమో స్తరు. నాంది, పారిపార్శ్వకుఁడు లేని ప్రస్తావనయుఁ గరచు సూత్రధార వచనములును గలవు. సంగీత మరంద మను గేయప్రబంధ విశేషమొకటి కలదు. ఈయేకోజీ ద్విపద రామాయణమునుగూడ రచించి యుండెను. ♦

---

* తం. స. మ. కే. సం. 606—609

♦ ,, ,, ,, 352

24. భాస్కర శేషాచలకవి

నాంచారు పరిణయము :

భాస్కర వేంకటాచలకవి సేతునాహాత్మ్య కావ్యావతారికలో నతని సోదరుఁడగు శేషాచలకవి నాంచారు పరిణయమను యక్షగానమును రచించినట్లు గలదనియు, భాస్కరవెంకటాచల కవిని దక్షిణాంధ్రదేశమున వెలసిన వాఙ్మయమునకు సంబంధించిన వానిగా శ్రీ వాడి సేతురామయ్యగారు ఆం. సా. ప. పత్రిక సం. 7. 84-92పుటలలోఁ దాము ప్రకటించిన "చోళపాండ్య దేశాంధ్ర ప్రాబల్యము' అను వ్యాసమునందుఁ దెలిపినారనియు, నం దాకవి కాలము క్రీ. శ. 1731-1767 ప్రాంతమని వారి యభిప్రాయ మనియు శ్రీ నిడుదవోలు వేంకట రావుగారు తమ దక్షిణదేశీయాంధ్రవాఙ్మయ మను గ్రంథము—475-76 పుటలలో నుటంకించినారు. నాంచారు పరిణయము గ్రంథ మలభ్యము.

---

25. ఆలూరి కుప్పన్న

పార్థసారథి విజయము : •

కుప్పనార్యుఁడు కశ్యపసగోత్రుఁడు, ఆపస్తంబ సూత్రుఁడు, నరసమాంబా వేంకటేశ్వరుల పుత్రుఁడు. కస్తూరిరంగకవి శిష్యుఁడు నని యతని పా. వి. నఁ గలదు. అతని కృత్యంతరమగు ఆచార్యవిజయము వలనఁ దెలిసిన విశేషములు: ఇతఁడు "వేంకటగిరి సుధీపాత్రుఁడు",

---

• ప్రా. లి. పు. భాం. డి. నం. 1907 అండ్ ఆర్. నం. 758.

"శ్రీమద్భోసల తుళజ మహారాజ కటాక్ష సముల్లసితుఁడు" — తచ్ఛ్లోకేంద్ర దత్తాంధ్ర కాళిదాస బిరుదాంచితుఁడు, పంచనదస్థల పురాణము, రామాయణ భాగవత యక్షగానములు, పరమ భాగవత చరిత్ర, ఇందుమతీ పరిణయము, హారికథా సుధారసకావ్యము ననునవి యితని కృత్యంతరములు. ఆచార్య విజయము, భాగవత యక్ష గానము (ఇదే పార్థసారథివిజయము) మాత్రమే నేఁడుపలబ్ధములు.

పా. వి. కృతిపతి ఆత్రేయ గోత్రుఁడైన చోళపురము వేంకటాచల విభుఁడు. (అతఁడే కుప్పన రామాయణ య. గా. నకును గృతిపతి యని యిందలి యవతారికలోఁ గలదు. అందతని వంశావతారమును గలవు). గ్రంథము పేరతఁడుపెట్టినదే. (అతఁడు చెన్నపురి తిరువల్లిక్కేణి పార్థసారథిస్వామి భక్తుండని యూహింపనగును). అతనిని బట్టి కవి కాలము నిర్ణయింప వలనుపడినదికాదు. కవి తాను చోళ (తంజాపురమండల)ప్రభువగు తుళజరాజుచే సన్మానితుఁడ ననియున్నాఁడు కాని యీ తంజావూరు మహారాష్ట్ర ప్రభువులలోఁ దుళజ నామధేయులిరువురు గలరు. ఒకరి రాజ్యకాలము క్రీ. శ. 1728 - 36. ఇంకొకరి కాలము క్రీ. శ. 1765 - 87. ఇతఁడి రెండవ తుళజరాజుకాలమునసే యుండినాఁడనియు, నితని గురువగు కస్తూరిరంగ కవి 1790 సం. ప్రాంతమునఁ దంజావూరి సంస్థానమం దుండినవాఁడనియు ఆం. క. చ. (పుట 170 - 174). కస్తూరిరంగ కవి యానందరంగపిళ్ళె పేరఁ బ్రసిద్ధ మగు రంగరాట్ఛందమును రచియించినవాఁడు. ఆనందరంగపిళ్ళె డూప్లేకడ దుబాసి. డూప్లే క్రీ. శ. 1742 - 55 సం. ల నడుమఁ బుదుచ్చేరిలో ప్రాంచి గవర్నరు *. అనఁగా రంగకవియు, నతని శిష్యుఁడైన కుప్పనయు 18 వ శతాబ్ది నడుమ నుండిరనుట నిశ్చయము.

* Vide, pages 12 & 255 of the Maratha Rule in the Carnatic.

గ్రంథవిషయము:— కుప్పన తన కృతిలో భాగవత దశమ స్కంధము నంతటి నాపోశనము పట్టినాడు. ఇది సుమారు పదివేల గ్రంథము. మన యక్షగానములం దింతటి బృహద్గ్రంథము మఱిలేదు. ఇది రెండుభాగములుగా వింగడింపఁబడినది. ప్రతిభాగము చివరను కృతి పతి ప్రశంసాపద్యములు, కవి స్వవిషయము కథానుక్రమణికయుఁ గల గద్యము నున్నవి. కవి దీనిని యక్షగాన ప్రబంధమని వేర్కొనినాడు. కాని యక్షగానముయొక్క రూపకప్రయోజన ముపేక్షింపఁబడినది. ప్రబంధముయొక్క కథా సంవిధాన ప్రకృష్టత్వమును గానరాదు. కథాకథనవిధానము పురాణధోరణినిబట్టి పోయినది. రచనమాత్రము రాను రాను ప్రబంధోచితముగా రూపొందినది. అతి దీర్ఘవృత్తములు, నాఖ్యానశైలీ ప్రచురములు, వర్ణనా బహుళములు నగు నిట్టి యక్ష గానములనుబట్టి యక్షగానము లన్నయుఁ బ్రదర్శన యోగ్యములు కావనియే కాక కొన్ని కవులచేతనే ప్రదర్శనోద్దిష్టములును గావని చెప్ప వలెను. ఇందు తాళప్రధానములగు దరువులు, ద్విపదలు, వచనములు, కొలఁది పద్యములు, అర్ధచంద్రికలు, కోలాటవర్ణములు, నలుగుపాట, ఊంజలు, (ఊయెలపాట), దండకము మొదలగునవి గలవు.

దరువులలో సంభాషణలు, ద్విపదవచనములలోఁ గథాకథన మును గలవు. వర్ణనలు మూఁడిటను గలవు. పోతన రచన కనుకరణము లును గలవు.

26. పిన్న బయలాచార్యులు

గొడగూచి చరిత్ర: ♦

గ్రంథము "శ్రీ మజ్జగద్గురు నిరంజన చరణకమల సేవా పరాయణ వీరార్యాత్మ సంజాత మాళిగార్య తనూభవ భవ పరాఙ్ముఖ పిన్నయలాచార్య ప్రణీతం" బని యున్నది. గ్రంథారంభమున సుగుణనగర (సుగుటూరు) నిరంజన నృసింహార్య గురువు స్మరింపఁబడినాఁడు. ప్రతిచివర "విరోధికృతు సంవత్సరం చైత్ర శుద్ధ (7) వరకు దేవండపల్లి తాలూకాసుబా, సుగుటూరీశాన్యభాగం వీధింటి నారణప్పగారి కుమారుఁడు శివరామప్ప" యనియు, నిది "శ్రీ శృంగేరీ సచ్చిదానంద భారతీంద్రస్వాముల చరణారవిందములకుఁ బ్రీతిగా వ్రాసిన గొడగూచి చరిత్ర" యనికలదు. దేవండపల్లి తాలూకా బెంగుళూరు జిల్లాలో, శృంగేరి కడూరు జిల్లాలోను గలవు. రెండును మైసూరు రాష్ట్రమునఁగలవు. శృంగేరీ పీఠ గురు పరంపరలో సచ్చిదానంద భారతులు ముగ్గురు గలరు. వారికాలములు వరుసగా— క్రీ. శ. 1633 - 1663, 1705 - 1741, 1770 - 1814 * ఇందు రెండు మూఁడవ వారికాలమున మాత్రమే విరోధి కృత్తు 1731, 1791 లలోఁ బడుచున్నది.

అడయారు దివ్యజ్ఞానసమాజ గ్రంథాలయములోని జి. నం. 74862 శతకంఠ రామాయణ యజ్ఞానము ప్రతివిలేఖకుఁడు "బమ్మళ్లి

♦ అడయారు దివ్యజ్ఞానసమాజ గ్రంథాలయమున నొక సమగ్రప్రతిగలదు. అలమర నం. 32, యఱ్ 33, జి. నం. 74907.

* చూ. మైసూరు గెజటీరు సం. 1 — పుట 307 లోని శృంగేరీ మఠగురుపరంపర.

నారణప్ప కుమారుఁడు రామప్ప". ప్రత్యంతి విలేఖన కాలము శుక్ల పుష్య బ 13 శుక్రవారము. ఇది క్రీ. శ. 2-2-1810 తేదీకి సరిపోవు చున్నది.

ఈ శ. క. రా., గొ. చ. ల ప్రతి విలేఖకులు పితృ నామ సామ్య మునుబట్టి సోదరు లగుదురు. పై శ. క. రా. ప్రతి విలేఖన కాలమును బట్టి యీ సోదరులు 1800 సం. కావల నీవలఁ గొన్ని యేండ్లు పాటుండి యుందురని యూహింపనగును. గొ. చ. ప్రతి మూడవ సచ్చిదానంద భారతి కాలమున 1791 లోఁ బడిన విరోధికృ త్సంవత్సర చైత్రమున లిఖింపఁబడియుండును. గ్రంథమంతకు ముందునాఁటిది కావలెను. గ్రంథకర్త నృసింహార్య గురునిఁ బేర్కొనెను. అతఁడు మూఁడవ సచ్చిదానందభారతికి ముందు క్రీ. శ. 1707-1770 సం. ల నడుమ శృంగేరీ మఠాధిపతియగు నరసింహభారతి కావచ్చును. గ్రంథ రచనాకాల మీ ప్రాంతమునఁబడుననియు గ్రంథము మైసూరు రాష్ట్రి మునకుఁ జెందినదనియు ననవచ్చును.

గ్రంథ విషయము:— శివలింగముచేఁ బాలు ద్రావించిన మహా భక్తురాలగు గొడగూచి కథ యిందు వర్ణితము. గొడగూచి కథ బసవపురాణమునఁగలదు. ఇది వీరశైవ వాఙ్మయ శాఖకుఁ జెందు నట్టి రచన. యక్షగాన మని పేర్కొనఁబడినది. ఇందు ప్రసిద్ధ తాళ ప్రభానములగు దరువులతోపాటు రాగప్రభానములును గలవు. ద్విపద లు, వచనములు, పద్యములు, ఏలలు, అర్ధచంద్రికలును గలవు. ఒక్కచో రెండు ముక్కలు కన్నడము వాడఁబడినది. చెప్పగల రచన కాదు. శివకవిగ్రంథసామాన్యమైన దోషములు గలవు.

---

27. నుదురుపాటి వెంకన

పార్వతీకల్యాణము: *

ఆం. సా. ప. లో నున్న యీయప్రకాశము 'ఉద్దండకవి' లేక 'మహోద్దండ బిరుద ప్రశస్తుండైన వెంకనకవీంద్రుఁడు' రచించినదిగా మాత్రము తెలియుచున్నది. ఇతఁడే పుదుకోట ప్రభువగు కోటిరాయ రఘునాథతొండమాన్ ఆస్థానకవియైన నుదురుపాటి వెంకన యని తెలియుచున్నది. ఇతని తండ్రియగు సీతారామాచార్యుఁడు 'మహోద్దండ కవి బిరుద ప్రశస్తు' డని వెంకన యాంధ్రభాషార్ణవమునుండి యెఱుఁగ నగును. వెంకనయు 'ఉద్దండవిద్యత్కవిత్వాంకనుండు' (చూ. ప్రా. లి. పు. భాం. డి. నం. 1992 - అతని బృహన్నాయికా నాయకము) కోటి రాయ రఘునాథ తొండమాన్ రాజ్యకాలము 1769–89, (చూ. డా. సేలటూరి వెంకటరమణయ్యగారి దాక్షిణాత్యాంధ్ర నాహిత్యము–పుట 58). ఈ వెంకనకవి కాలమునదే యగును. ఇతఁడు బహుగ్రంథకర్త. అందు ప్రసిద్ధ మాంధ్ర భాషార్ణవము.

ఈ పా. క. గ్రంథవస్తువు సుప్రసిద్ధము, కాని యలఁతి యలఁతి మార్పులు నవధరించినాఁడు గ్రంథకర్త. అవి కామదహనఘట్టము పరిహరించుట, శివుఁడు వృద్ధవిప్రుని రూపమునఁ బార్వతినిఁ బరీక్షింప వచ్చుట మొ. ఇంచు ప్రసిద్ధ రాగతాళములలో ననేక కీర్తనలు గలవు. అన్నిటికిని పల్లవి, అనుపల్లవియు నేర్పరింపఁబడినవి. ద్విపదలు, చిన్న

---

* ఆం. సా. ప. నం. 166 ఔత్తు క్కాడునుండి సంపాదితమైన దీని గ్రంథ లిపిప్రతి యొకటి డా. వి. రాఘవన్ గారికడఁ గలదు. ఇది యూత్తు క్కాడులోఁ బ్రచారింపఁ బడుచుండెడిదని వారు చెప్పినారు.

చిన్న సంధివచనములు, కోలాట దరువులు, సువ్వాల, తలంటు శోభనము, ధవళము, నలుగుపాటలు, జోల, మేలుకొలుపు గలవు. సంస్కృతమునను గొన్నికీర్తనలు, గొందరి శ్లోకములు, నొక చూర్ణికయుఁ గలవు. వచనములో సంభాషణలు లేవు కాని సంవాద శైలి యొక్కువగనే పాటింపఁబడినది. ఒక్కనీసము తప్ప మఱిపద్యములు లేవు. రచన సరళము, సరసము, జాతివార్తా చమత్కార సముపేతము, పాత్రోచిత వ్యావహారములలో నాఁటి వ్యావహారికపు నుడిగారమునకు నిండుదనమబ్బినది. శృంగారమునకు హాస్యము హంగుచేసినది. కథ రక్తికట్టినది.

ఇది పుదుకోట వాఙ్మయమున య. గా. నకసలే పుట్టగతులు లేకపోలేదని యెత్తిచూపుచున్నది.

---

28. మాతృభూత కవి

పారిజాతాపహరణము : *

ఇది క్రీ. శ. 1787 - 1798 సం. ల నడుమఁ దంజావూరి నేలిన మహారాష్ట్రి ప్రభువగు అమరసింహుని కంకితముగా నతని యమాత్యుఁడగు శివరాయ మంత్రి ప్రేరణమున మాతృభూత కవిచే

* తం. స. మ. కే. సం. 543.

ఒక సూచన :— మదరాసు ప్రభుత్వ ప్రాచ్య గ్రంథ ప్రచురణ సం. IX అయిన అభినయ దర్పణ మను గ్రంథమునకుఁ గర్తయగు లింగమగుంట మాతృభూత నయు నీతఁడు నొక్కఁ డే యని యీ గ్రంథ పీఠికాకారులు వక్కాణించియున్నారు. అది యవిచారమూలకము. అ. ద. కర్త కాశ్యపగోత్రుఁడు. అతని తండ్రి మృత్యుంజయుఁడు. ఈ మాతృభూతని గోత్ర పైతృనామములు వేఱు. వివరములకు చూ. తం. స. మ. కే. పుట 223.

రచింపఁబడినది. ఇతని గోత్రము శాండిల్యము, తండ్రి రంగార్యుఁడు, ఇతఁడు త్రిశిరగిరి మాతృభూతేశ్వరస్వామి భక్తుఁడు.

గ్రంథ విషయము :— కడు పెద్దది. మొదట వరుసగా వినాయకుఁడు, కటికము, దాష్టిక పండితుఁడు నను పాత్రల ప్రవేశము. తరువాత పార్వతీ పరమేశ్వరుల ప్రసంగము. ఈ పాత్రలకు గాని తత్ప్రసంగములకుఁగాని ప్రధాన కథతో నెట్టిసంబంధమును లేదు. అట్టివే యీ తరువాత నున్న లీలావతి యను భోజకన్యావృత్తాంతము[1], భాషాదేవి గొల్ల కలాపమును. ఇవి యీ పారిజాత కథకు ముఖబంధములుగా నెందుకు రచింపఁబడినవో దురూహము![2] పారిజాతాపహరణ ఘట్టమునకుఁ బిదప నిందున్న జలక్రీడలు-గోపికావస్త్రాపహరణ కథయు నట్టివే. దాని కిటఁ బ్రకరణము లేదు. పారిజాత కథతోఁ బ్రసక్తిలేని రాధ పాత్ర కిందు బ్రసక్తి గలదు. ఆ కథ కనుబంధప్రాయమైన పుణ్యక వ్రతకథ కిందు ప్రసక్తి లేదు. సనతి కయ్యము, సింగీ సింగళ్ల ప్రసంగము లిందు గలవు. కానీ యే కథలోనైన రక్తికట్టవలసిన ఘట్టు లవి యిందు రక్తికట్ట లేదు. భావములను, పద బంధములను, పద్య పాదములకుఁ బాదములనే తిమ్మనగారి పారిజాతాపహరణము నుండి గ్రహించిన మాతృభూతన యాయన సత్యభామ యలుక చిత్రించిన ఘట్టమును నాల్గు ఘట్టులలో నడిపించియుండఁగా దాను ముప్పది ఘట్టులుగా సాగఁదీసినాఁడు. తిమ్మనార్యునకు మూఁడాశ్వాసముల పైచిలుకు పట్టిన పారిజాతాపహరణ ఘట్టము నొక్కముక్కలోఁ దెమల్చివైచినాఁడు మాతృభూతన. ఈమార్పులు యక్షగానప్రాయ రచనలో సముచితము

1. ఇది ప్రా. లి. పు. భాం. డి. నం. 1886 దాదినీ వేష కథ యను నీలావతి విజయమును బోలియున్నది

2. ఇవి బహుశా ప్రతి విలేఖకుఁడు వ్రాసికొన్న యేవో గ్రంథాంతరముల భాగము లేమో.

లనియే చెప్పవచ్చును. కాని మొత్తముపై గథను సమ్యక్సంవిధాన ముతో నాటకోచితముగా మలచలేకపోయినాడు కవి.

ఇది నాటక మని పలు తావులఁ బేర్కొనఁబడినది. ఏపంకము లుగా విభాగింపఁబడియుండుట విశేషము. కాని యంతమాత్రమే సంస్కృత నాటకానుకరణము. మఱే సూత్రధార ప్రవక్తియైనను లేదు. తక్కినదంతయు యక్షగాన ఫక్కికయే. సాధారణముగా ముందు పాత్ర ప్రశంసయుఁ దదుపరి పాత్ర ప్రవేశము దరువు నుండును. పాత్రల తెర నుఱుగు ప్రసంగములు, మాధవి పలుకరింపులు, నవతి కయ్యము మొదలగునవి భామకలాపపు "భాణి" నిఁ దలఁపింపఁ జేయును. సింగీ సింగళ్ల ప్రసంగములు కొరవంజి కోవను జ్ఞప్తికెలయించును. ప్రష్యంకాదియంమను గృతిపతి నుద్దేశించియున్న 'అవధరింపు' మను నెత్తుగడయుఁ బ్రత్యంకాంతమందును గల గద్యలు, మధ్యనున్న సుదీర్ఘ వర్ణనలును ప్రబంధ ఫక్కిని దలఁపించును.

ఇందు సంస్కృతమున నుమాపు పాతిక శ్లోకములు, నాలుగైదు చూర్ణికలు, గొలఁది తమిళ కన్నడ మహారాష్ట్ర భాషా ప్రసంగము లును గలవు. తెలుఁగున వచనములు తఱుచు ద్విపదలు, దరువులు ('ఉత్తరాది దరువులు' గూడ - దరువులలోఁ గృష్ణుఁ డుద్దిష్టుఁడుగాఁ ద్రిశిరగిరి నిలయ సఖముద్ర తఱుచు గన్పట్టును), పద్యములును గలవు. సీసములు సుమా రొక శతమానమున్నవి. అందు ప్రతిపాద సమతా పాదనముతోడి తూగు బాగుగ నున్నది. తలుపు పాట, నలుగు పాట, శోభనములు, గౌరీ కల్యాణము మొదలగునవి కలవు. రచన ప్రసిద్ధ పదములతో (కతి పయ ప్రయోగవిశేషములు గలవు), నాటకోచిత ముగా సరళమై యున్నది. భావము లా వృత్తి యైనను నొక్కపట్టు ననే యొక్కపెట్టున సుళువుగా, ధారాళముగా, ఛందస్సుందర ముగాఁ బద్యములను గుప్పింపఁ గలఁడు కవి.

---

29. మెరట్టూరు వెంకటరామశాస్త్రి

ఆంధ్రులనాట్యకళా ప్రతిష్ఠకుఁ గూచిపూడి యెట్టిదో యఱవలకు మెరట్టూరు (లేక మెలట్టూరు – అది తంజావూరికి సుమా రామడ దూరము) అట్టిది. మెలట్టూరు భాగవతమేళ నాటకములకుఁ బెట్టినది పేరు. భామకలాపముల విషయమునఁ గూచిపూడివారికిఁ గులపతి సిద్ధేంద్రయోగి. భాగవతమేళ నాటకముల విషయమున మెలట్టూరు వారికి వేంకటరామశాస్త్రి యట్టివాఁడు. ఈయన వెలనాటి తెలుఁగు బ్రాహ్మణుఁడు. ఇంటిపేరు తెలియదు. మెలట్టూరు వెంకటరామశాస్త్రి యని వ్యవహరించుటే పరిపాటి యైనది. ఈయన శ్రీ వత్సగోత్రుఁడు, గోపాలకృష్ణార్యుని పౌత్రుఁడు, లక్ష్మణార్యుని శిష్యుఁడు, దేవీ నృసింహోపాసనములు చేసిన మహాభక్తుఁడు, నాట్య సంగీత సాహిత్య విద్యావిశారదుఁడు నని యాతని గ్రంథముల వలనను, స్థలజ్ఞులగు పెద్దల వలనను, అన్నికుడిగ్రామము (తంజావూరుజిల్లా, కుంభకోణము తా.) నందలి యీయన బంధువర్గమువారి వలనను దెలియవచ్చినది. ఆయన తన వార్థకమున ప్రసిద్ధుఁడగు త్యాగరాజునకు సమకాలికుఁడై నట్లు ఆచార్య శ్రీ పి. సాంబమూర్తి, డాక్టరు వి. రాఘవన్ మొదలగు తమిళ దేశపు బండితు లనేకు లనుచున్నారు. త్యాగరాజు కాలము క్రీ. శ. 1759 – 1847.* అనఁగా వెంకటరామశాస్త్రి 18 శ. నడుమను జీవరను గూడ నుండి యుండునని యూహింప నగును. శ్రీ సుబ్బరామదీక్షి తారుగారి 'సంగీతసంప్రదాయ ప్రదర్శిని' నిఁ బట్టి యితని కాలమింకను వెనుకకుఁబోవును. అందితఁడు తంజావూరి మహారాష్ట్రప్రభువులు, రెండవ

* చూ. శ్రీమాన్ వింజమూరి నరసింహాచార్యులవారి శ్రీ త్యాగరాజు చరిత్ర ఆంధ్రగ్రంథమాల ప్రచురణ, మదరాసు, 1934.

శరభోజి, శివాజీల కాలమున నుండినట్లు **గల**ము. ఆరాజుల రాజ్యకాలములు వరుసగా క్రీ. శ. 1798-1833, 1833—55 దీనినిబట్టి వెంకట రామశాస్త్రి 19 శ. పూర్వార్ధమునను నుండినట్లు చెప్పవలెను.

వెంకటరామశాస్త్రి కృతులు :

ఇతని నాటక కృతులుగాఁ జెప్పఁబడునవి పండ్రెండు :—

1. ప్రహ్లాద చరిత్ర.
2. రుక్మాంగద చరిత్ర.
3. మార్కండేయ చరిత్ర.
4. ఉషాపరిణయము.
5. హరిశ్చంద్ర.
6. సీతాకల్యాణము.
7. రుక్మిణీ కల్యాణము.
8. కంస వధ.
9. శివరాత్రి నాటకము.
10. సత్సంగరాజు నాటకము.
11. అసత్సంగరాజు నాటకము.
12. జగల్లీలా నాటకము.

ఇవియన్నియుఁ దెలుఁగున రచింపఁబడినవేనట. మొదటి యాఱును దెనుఁగువే యని చూచి తెలిసికొంటిని. కడమ యాఱింటిలో నన్నియు నితని కృతులగునోకాదో, వానిప్రతులసలు దొరుకుచున్నవో లేదో సరిగాఁ దెలియదు. అవి యంతగాఁ బ్రదర్శనలకెక్కి రాణించినట్లును దోఁపదు. ఈ గ్రంథము లన్నియు నముద్రితములు. కొన్నిటి ప్రతులు విడి విడిగా శ్రీ వి. రాఘవన్‌గారివంటి వాఙ్మయ పరిశోధకుల యొద్దను, శ్రీ ఆర్. కల్యాణ రామయ్యర్ బి. ఏ., (మదరాసు) గారి యొద్దను గలవు.

తంజావూరు మండలమున మెలట్టూరు, శూల మంగళము ఊత్తుక్కాడు మొదలగు గ్రామముల చుట్టుపల్లను గొన్నిటి ప్రతులు లభింపఁగల వను నాశ గలదు. శూల మంగళము భాగవతులలో నొక

రును, ప్రస్తుతము మదరాసువాసులు నగు శ్రీ కల్యాణ రామయ్య గారియొద్ద నై పట్టికలోని మొదటి యాఱింటి గ్రంథ లిపిప్రతులు గలవు. (అందలి ప్రహ్లాదచరిత్ర, ఉషాపరిణయములకు మాత్రము నేను మదరాసు ప్రా. లి. పు. భాం. లిపి పండితులచేఁ దెలుఁగు లిపిప్రతులు తయారుచేయించుకొంటిని. ఆ యఱువదేశము ప్రతులు తప్పులతడకలు; తెలుఁగు శబ్దముల స్వరూపములే మారిపోయినవి. ప్రతిష్టితములు హెచ్చు). సీతాకల్యాణము రుక్మాంగద చరిత్రల యసమగ్ర ప్రతులు మాత్రము తం. స. మ. నకుఁ జేరినవి. (కే. నం. 673, 582) ఆ సీ. క. గురించి కేటలాగులో 'కర్త తెలియదు' అనియున్నదిగాని గ్రంథమునం దవతారికలోనే యిది '...లక్ష్మణాఖ్యుని కృపవల్ల...గోపాల కృష్ణయ్య కొమరుఁడై నట్టి వెంకటరాముండు...విరచించె' నని కలదు. రుక్మాంగదము ప్రతిలో గ్రంథకర్తనామము గానఁబడు కాని కల్యాణ రామయ్యరుగారు మెలట్టూరు వెంకటరామశాస్త్రి కృతియని చూపిం చిన రుక్మాంగద చరిత్రము ప్రతియు నసమగ్రమగు తం. స. మ. ప్రతియు నున్నంతమట్టున కొక్కతీరుగనే యున్నవి. తం. స. మ. లో నున్న "నానావిధ నాటకములు" అను రెండు కలగూరగంప సంపుట ములలోఁ (కే. సం. 802, 803) నై పట్టికలోని మొదటి యాఱింటి పేళ్లును గల గ్రంథభాగములు చెదరుగా నున్నవి. అందుకొన్ని మె. వేం. రా. శాస్త్రి గ్రంథభాగములే. ఇవికాక తం. స. మ. లో "నాటకపాత్రలు" అను నింకొక గ్రంథము (కే. నం. 799) గలదు. అందు "రామాపండితుల నాటకాలు" అని పదమూఁడు నాటకముల పట్టిక యొకటి కలదు. ఆ రామాపండితుఁడే వేం. రామశాస్త్రి యగునో కాదోకాని యా పట్టికలో వేం. రా. శాస్త్రి నాటకముల పేళ్లుమాత్ర మైదు (రుక్మాంగదము, ఉషా రుక్మిణీ సీతా కల్యాణ ములు, శివరాత్రి నాటకము) కన్పడుచున్నవి.

వేంకటరామశాస్త్రి కృతులెల్లను నాటకములని పేర్కొనఁ బడినవి. అన్నియుఁ బ్రదర్శనయోగ్యములు. అందెకువగాఁ బ్రదర్శనల కెక్కి రాణించినవి. ప్రహ్లాద, రుక్మాంగద, మార్కండేయ చరిత్రములు, ఉషాపరిణయము, ఇటీవల హరిశ్చంద్ర. అందు ప్రదర్శనవిషయమునఁ బ్రహ్లాద చరిత్రము, రచనావిషయమున నుషాపరిణయమును గొప్పవందురు. ఇక్కడ ప్రతిగ్రంథమును బ్రత్యేకముగా విమర్శింపఁ బనిలేదు. అన్నియుఁ బ్రసిద్ధేతివృత్తములు. అన్నిట రచనాప్రక్రియయు నించుమించు చొక్కమాదిరిగనే యుండును. స్థూలముగాఁ దత్స్వరూపమిట నిరూపింపఁబడును.

ప్రతి గ్రంథారంభమునను గ్రంథనామ నిర్దేశకమగు కంద మొకటియుఁ బిమ్మటఁ గథాసంగ్రహము, కవి స్వవిషయము నుటంకించు ద్విపదయు నుండును. కథారంభమునకు ముందు గణపతి స్తుతి మాత్రమేకాక పాత్రప్రవేశ సందర్భముగూడ నుండును. సాధారణముగఁ బ్రతి పాత్రప్రవేశమునకును సూచనగా నొక సంధివచనము, పాత్రప్రవేశమునకును సూచనగా నొక సంధివచనము, పాత్రవర్ణన ద్విపద, ప్రావేశిక ధ్రువయు నుండును. కథా సంవిధానము తఱుచు సంధివచనములద్వారా సూచింపఁబడును. సంధివచనాలేకాక పాత్రల సంభాషణవచనములు గూడ నక్కడక్కడ నున్నవి. కాని సంభాషణలు తఱుచు దరువులు, దీర్ఘద్విపదలలోనే జరుగును. గ్రంథాంతమున మంగళము, ఫలశ్రుతియు నుండును. గ్రంథమున ద్విపదభాగము, దరువులు నెక్కువ. పద్యాలు ప్రసిద్ధవృత్తాలు, జాత్యుపజాతులు, తదర్ధపద్యాలనఁగాఁ గందార్ధాలు, గొలఁది సంస్కృత శ్లోకములు చూర్ణికయుఁ బ్రయుక్తములైనవి. దరువులు ప్రసిద్ధ రాగశాఖముల లోనేకలవు. రాగాలు ఆహిరి, ముఖారి, ఉసేని, బిలహరి, మోహన, ఘన్నాగవరాళి, పంతువరాళి, కల్యాణి, దేవగాంధారి, మధ్య

మావతి, సురటి, మొ॥. తాళాలు ఆది, చాపు, రూపకము మొ॥. ఆది తాళము వాడక మెక్కువ. సంగీతశాస్త్ర దృష్టితోఁ జూచినచో వేం. రా. శాస్త్రి కృతులలోఁ గొప్ప విశిష్టత గోచరించును. అపు రూపములగు రక్తిరాగము లెన్నింటికో చక్కని లక్ష్యములు రచించి నాఁ డతఁడు. ముఖ్యముగా నాహరినో ముఖారినో యెత్తుకొనెనా యొక్కరాగమునే విభిన్న సంచారములతో వివిధరసోత్పత్తి కుపయో గింపఁగలఁడు. అదొక గొప్పనేర్పు. ఉశేని స్వరజతి నితని ప్రతిభకొక తారాకాణముగాఁ బేర్కొందురు పెద్దలు. వెంకటరామశాస్త్రి కృతు లన్నిట రచన రూపకోచితమైన సరళశైలిలో సాగిపోవును. నాఁటి తంజావూరు తెలుఁగువాఁడుక నుడికారపు సొంపులు నట నటఁ జిలుకరింపఁబడినవి వెం. రా. శాస్త్రి ప్రహ్లాదాది నాటకములు నేఁటికి నేఁటఁ బ్రదర్శింపఁబడుచున్నవి. తత్ప్రదర్శన ప్రక్రియ యొక విశిష్ట సంప్రదాయమునకుఁ జెందినది. (అది స్థలాంతరమందుఁ బ్రకటము).

---

30. త్యాగరాజు

త్యాగరాజ కృతు లనుసరి కతని భగవత్కీర్తనలే స్ఫురించును. అతని వ్యక్తిత్వము భక్తి, సంగీతము ననుఁ రెండు మహాప్రవాహముల సంగమక్షేత్రము. కాని యందుఁ గవితయు నంతర్వాహినిగాఁ బ్రవహించుచుండును. అతఁడు భగవన్నామకీర్తనలే కాదు తన్మహిమా ప్రతిపాదకములు, దత్కీర్తనసాధములు నగు కావ్యములుగూడ నొక మూఁడు రచించినాఁడు. అవి యక్షగానములని పేర్కొనఁబడలేదు

కానవాని రచనాప్రక్రియ యక్షగానప్రాయమైనదే. ఆయనవంటి ప్రశస్త వాగ్గేయకారుల సాహిత్య సృష్టికిఁ దగిన దారచనయే. కాని యతని కీర్తనల కున్న ప్రసిద్ధి యీ కావ్యముల కింకను రాలేదు. అవి సీతారామ విజయము, నౌకాచరిత్ర, ప్రహ్లాద భక్తివిజయము ననునవి.

త్యాగయ కృతులనుబట్టి యతని గుఱించి తెలియవచ్చు విశేషములు గృహ గురు పితృనామ నివాసములు మాత్రమే. ఇతరాధారములను బట్టి యతని చరిత్రమును దెలుపుగ్రంథములు మనకున్న వానిలో ముఖ్యములైనవి : 1. శ్రీమాన్ వింజమూరి నరసింహాచార్యులు గారి శ్రీ త్యాగరాజు చరిత్ర 2. ఆచార్య శ్రీ విస్సా అప్పారావు గారి సంపాదకత్వమున వెలువడిన త్యాగరాజస్వామి శతవార్షికోత్సవ సంచిక, 3. శ్రీ పి. సాంబమూర్తిగారి 'Great Musical Composers of S. India'. వానినిబట్టి తెలియవచ్చిన విశేషములలో ముఖ్యమైనవి: త్యాగయ యింటి పేరు కాకర్లవారు. ఈ కాకర్లవారు ములికినాటి బ్రాహ్మణులు. భారద్వాజసగోత్రులు. త్యాగయ పితామహుఁడు గిరిరాజబ్రహ్మము. తండ్రి రామబ్రహ్మము. తల్లి శాంతమ్మ. (సీతాంబయని వాలాజీపేట చరిత్రలోఁ గలదని త్యా. శ. వా. సంచిక) త్యాగయ సంగీత గురువుగాఁ బ్రసిద్ధుఁడైనవాఁడు సొంఠి వేంకట రమణయ్య కాని త్యాగయ నౌకాచరిత్రమున శ్రీరామకృష్ణమోదాఖ్యునిఁ బురుషార్థదాయకుఁడగు తనదేశిక వరునిగా స్మరించియుండెను. అతఁడు త్యాగయకుఁ దత్త్వోపదేశము చేసిన గురువై యుండును. త్యాగయ నివాసము తంజావూరు మండలములోని తిరువయ్యూరు. (అదే పంచనదము. త్యాగేశ్వరస్వామి క్షేత్రము.) జీవితకాలము. క్రీ. శ. 1759–1847.

గ్రంథవిషయము

సీతారామవిజయము:

ఇది వెనుక నెప్పుడో వాలాజ నగర్ లోక్ నారాయణశాస్త్రి గారిచేఁ బరిష్కృతమై ముద్రితమైనదని త్యా. శ. వా. సంచిక వలనఁ దెలియవచ్చినది. కాని నేఁడచ్చు ప్రతులుగాని, లిఖిత ప్రతులుగాని లభించుటలేదు. మదరాసు విశ్వవిద్యాలయ సంగీతశాఖాచార్యులు శ్రీ సి. సాంబమూర్తిగా రది కడుహృదయంగమమైన కృతియని సెల విచ్చినారు.

నౌకాచరిత్రము: [1]

గోపికావస్త్రాపహరణ మిందలి ప్రధానవిషయము. కాని కథా రంగము మారినది. నిమిత్తమును గ్రొత్తది. గోపికాకృష్ణులు యమునలో నౌకా విహారము సల్పుదురు. గోపికల గర్భభంగము నిమిత్తము కృష్ణుఁడు సంకల్పింపఁగాఁ దుపాను వచ్చును. నౌక కొక రంధ్ర మేర్పడును. నాయకునకు వస్త్రాపహరణ దోషము తగులకుండఁగనే సంకల్ప సిద్ధి యగును. అదియొక యౌచిత్యము. గోపికల కిష్టము లేకున్నను గోకలు విడచుట తప్పనిసరియైనది. అదియొక చమత్కారము. మార్పు మనోజ్ఞము.

---

(1) దీని లిఖిత ప్రతులు ఆం. సా. ప. (నం. 3807), తం. స. మ. కే. నం. 483), ప్రాచ్య. పు. భా. (డి. నం. 1896), లలో గలవు. అసలిది యాఱు తడవలు ముద్రితమైనది. 1873 లో మంజూరపట్టు రామచంద్రశాస్త్రిగారిచే, 1885 లో వెంకటరో శేషాచలశాస్త్రిగారిచే, 1892 లో జ్యోతిష్మతీ ముద్రణాలయమున కీ. శే. వేదము వెంకటరాయ శాస్త్రులవారిచే, 1930 లో మదరాసు ఆమెరికన్ మిషనువారిచే, 1949 లో మదరాసు సంగీత సభవారి పక్షమున శ్రీ పి. సాంబమూర్తిగారి చేతను, అదే సం. న మదరాసు ఆది అంధ్రుకోవారి చేతను ప్రచురింపఁ బడినది.

ఇందు పల్లవి, అనుపల్లవి. చరణముల వింగడింపుతోఁ గవి నామాంకిత ముద్రలతోఁ బ్రసిద్ధరాగ తాళములలోఁ జక్కని కృతులు, నలఁతి యలఁతి సంధివచన ప్రాయములైన గద్యపంక్తులును మెండు. ద్విపదలు, నక్కడక్కడ పద్యములునుగల వందులో శార్దూలముల వాడక మెక్కువ. అటనటఁ జిటిపొటి నెరసు లున్నను మిక్కిలి సరస మైనది రచన. త్యాగయ దీనిని బ్రదర్శనకు ద్దేశించి యుండె ననుట సందిగ్ధము.

ప్రహ్లాద భక్తి విజయము : [2]

ఇందలి వస్తువు ప్రహ్లాదునికథ. కాని యిందు హిరణ్యకశిపుఁడు, లీలావతి, చండామార్కులు మొదలగువారి పాత్రలకుఁ బ్రసక్తిలేదు. చివరికి నరసింహావతార ప్రసక్తియును లేదు. హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదునిబాధ పెట్టిన విషయము మాత్రము గ్రంథాది నించుక చెప్పఁబడినది. అంతే గ్రంథముగ్రంథ మంతయు హరినిఁ గూర్చిన ప్రహ్లాదుని గాఢమైన తపనయు భక్తి భావావేశమును గృతార్థతయు మాత్రమే ప్రధాన విషయముగా సాగినది. ప్రహ్లాదచరిత్ర నీరీతిగాఁ బాత్రైక ప్రధానముగా, బాహిరసన్నివేశముకంటెఁ బాత్రయొక్క యంతఃప్రవృత్తి తత్పోషణస్ఫాలనము ప్రధానముగా నిదివర కెవరును రచించియుండినట్లు గానరాదు. త్యాగయ యాత్మీయతను బట్టియిచ్చు గ్రంథమిది. ఇందు ప్రహ్లాదపాత్రతోఁ దాదాత్మ్యమందిన త్యాగయభక్తి రసస్థితి నందుకొన్నది. ఆప్రహ్లాదచరిత్రము నతిమాత్ర మనోజ్ఞముగా రచించిన ప్రథమాంధ్ర మహాకవి భాగవత కర్త బమ్మెరపోతన. పోతరాజు పోకడలు త్యాగరాజునకుఁ దప్పని సరియైనవి.

2. ఇది 1868 విద్వన్మోద తరంగణీ ము. శా. లో, 1949 లో మదరాసు ఆది అండుకో వారిచేతను ముద్రితమై ప్రకటింపఁబడినది.

త్యాగయ్య గ్రంథ ప్రారంభమున దీనిని ప్రబంధమని పేర్కొని యున్నను దత్తాపి పలుతడవలు నాటకమనియే వక్కాణించెను. ఇది "నాగతాళమృదంగరవళిచే మిగులఁ నాగరికం బభినయముచేఁ జెలఁగు" నని ముందుగనే చెప్పియున్నాఁడు. గ్రంథ మైదంకములుగా విభాగింపఁబడి యుండుట విశేషము. గ్రంథారంభము నందలి యిష్టదేవతాభివందనాదికమే నాంది. దౌవారిక సూత్రధారుల ప్రసంగమే ప్రస్తావన, ఫలశ్రుతియే భరతవాక్యము ననుకొన్నచో దీన నాటకలక్షణము కొంత పట్టిన దనవచ్చును. అయితే యదిమార్గ నాటకప్రభావమును మాత్రమే సూచించును గాని నిక్కచ్చిగా నాఫకిక్ కుపలక్ష్యభూతముగాదు. ఇందలి గణపతి ప్రార్థనమాత్రమే కాక పాత్రప్రవేశము, (దౌవారికుని కటికము వానివంటి) వాలకము, తెరవెడలు దరువు వంటి పాత్రప్రశంసాత్మక కీర్తనలు మొ. నాఁటి తంజావూరు య. గా. న నాటకములలోఁ గన్పట్టును. అంకవిభాగాది విశేషములు గూడ నందందు గానవచ్చును. కాని సంధి వచనముల నాశ్రయించు యక్షగానమున కంకవిభాగము సహజము కాదా యవసరమును లేదు. ఇందు నా యంకవిభాగము సార్థకముగాదు, సంధ్యంగోచితముగా లేదు. అర్థప్రకృతులకుఁ గార్యావస్థలకును సమన్వయము కుదురలేదు. కుదురుట కవకాశమే లేని యితివృత్త మైనది. ఇది త్యాగయచేఁ బ్రదర్శనోద్దిష్టమైనదని విశదమైనది; సంవాద ప్రచురమైనదే కాని సన్నివేశబలము చాలమి ప్రదర్శనమున రక్తికట్టదు.

ఇందు దరువులు, ద్విపదలు, గద్యపద్యములును గలవు. ఆ దరువులను గృతులనుట లెస్స. ఆ లక్షణము చక్కగా బట్టినది. పది సం. శ్లోకములు, నొక చూర్ణికయుఁ దెలుఁగున నొకదండకమును గలవు. అనేక ప్రయోగ విశేషములు గలవు. కృతి యతిరసవంత మైనది.

---

31. శివాజీ

అన్నపూర్ణా పరిణయము: *

తంజావూరి మహారాష్ట్ర ప్రభువులలోఁ జివరివాఁడును రెండవ శరభోజికొడుకు నగు శివాజీ కృతియిది. అతని రాజ్యకాలము క్రీ.శ. 1833 - 1855. గ్రంథము ప్రతి చివర నది జయనామ సంవత్సరము భాద్రపదమున లిఖింపఁబడినట్లు గలదు. అది శివాజీ రాజ్యకాల మున 1834వ సం. అగుచున్నది. శివాజీ సింహాసనస్థుఁడై యుండిన కాలమునఁనే యీగ్రంథము రచింపఁబడినట్లు గలదు. అనఁగా నీగ్రంథ రచన క్రీ. 1833 - 34 సం. ల నడుమనే జరిగి యుండును.

తంజాపురమున సిద్ధపుష్కరిణి చెంతఁ దప మొనర్చిన కొంకణ సిద్ధుని కోర్కెపై శివుఁడటఁ గొంకణేశ్వరుఁడను పేర వెలసెను. సిద్ధ మిత్రుఁడగు సుశర్మయను వైశ్యునకు శివుని వరప్రసాదముగా సిద్ధపుష్క రిణిలో నొక కమలకర్ణికలో నొక యాఁడుశిశువు లభించును. ఆమెయే అన్నపూర్ణ. ఇది పూర్వకథ - సూత్రధారప్రోక్తము. ఇఁక నీ నాటక కథ లోని ముఖ్యవిషయము: ఆమె పెంపకము, తపస్సు, కొంకణేశ్వరు నితోఁ బెండ్లి.

గ్రంథము నాటకమని పలు తడవలు పేర్కొనఁబడినది. నాంది, సూత్రధారపారి పార్శ్వికుల ప్రస్తావన, వసంత ప్రవేశము, అంకవిభాగము (రెండు), భరత వాక్యప్రాయమైన రంగనాథ కవీశ్వరుని (శివాజీ ఆస్థాన కవికాబోలు) యాశీర్వాదము మొ॥ విషయములు ముందటి తంజా వూరు నాటకములలోకంటె నిం దెక్కువగా మార్గనాటక ప్రభావమును

---

* తం. స. మ. కే. నం. 499.

బ్రస్ఫుట మొనర్చుచున్నవి. కాని మార్గనాటకములందు సూత్ర ధార ప్రసంగములు, ప్రస్తావన యందుఁ దక్క మధ్య మజి కన్పింపవు. తంజావూరి నాటకములు సాధారణముగా నడుగడుగున నతని కథాను సంధానక ప్రసంగములు లేనిదే నడువవు. అందును నీగ్రంథ మంతయు సూత్రధారుని ప్రలాపము వలె నున్నది కాని నాట్యకళా కలాపమిం దంతగాలేదు. అయినను నిది ప్రదర్శనోద్దిష్టమైనదే. ఏలన "రంగ భూమియందు నటింప జేస్తూన్నాము" అని దీని యెత్తుగడ. విఘ్నే శ్వర పాత్ర "ప్రత్యక్షంబుగా" ప్రవేశపెట్టబడినది. గ్రంథాంత మున నీనాటకపు వేషాల "నావనీసు" (Dramatics Personae) గలదు.* ప్రతివిలేఖకుని వ్రాతఁలో నగరిలో నొక భాగవతమేళ ముండినట్లును, నామేళపు "సబనీసు" (Accountant) కడ నీ గ్రంథ మూల ప్రతి యుండినట్లును గలదు.

రచన:— గ్రంథము పెద్దది. సరుకు తక్కువ. ద్వితీయాంకము వివిధ స్తోత్రములు గలిగి విసువెత్తించుచున్నది. రచన పేలవము. తప్పులు కుప్పలు. దరువులు, కోలాట, గొబ్బి, చెండ్లాట, నలుగు, సువ్వినాటలు, కందార్ధ సీసార్ధములు, సుమారు 40 సం. శ్లోకములు, కొలది చూర్ణికలును గలవు. అన్యదేశ్యములు కొన్ని ప్రయోగింపఁ బడినవి.

విశేషములు:— ప్రస్తావనలో శివాజీ ప్రశంస, వంశావతార మును గలవు. యతని యమాత్య దండనాయకులగు సదాశివరాయ

* ఇందీ నాటకమునవచ్చు పాత్రలు, నానాఁ డది ప్రదర్శింపబడినప్పు డాయా పాత్రలు ధరించినవారి పేళ్ళును గలవు. ఇది మన్మథ సంవత్సరము – ఆవణి నెలలోఁ దయారైన ట్లిందు గలదు. అనఁగా నీనాటకము 1835 లోఁ బ్రదర్శితమైనదన్నమాట.

మంత్రి కృష్ణరాయుఁడు వరహేంద్రుఁడును ప్రశంసింపఁబడిరి. ఈ శివాజీ ప్రశంసాత్మకముగా నాల్గు సీసపద్య గ్రంథసంపుటములు తం. స. మ. లో నున్నవి. (కే. నం. 811 - 814)

---

32. వెంకట కృష్ణా జెట్టి

శివపారిజాతము : *

ఈగ్రంథము తంజావూరి మహారాష్ట్రప్రభువగు శివాజీ యాస్థానమున రచింపఁబడినది. గ్రంథరచనాకాలము శివాజీ రాజ్యకాలమగు క్రీ. శ. 183౫ - ౭5 సం. ల నడుమఁబడుచున్నది. గ్రంథాంతగద్యలో నిది "శివాజీమహీపాలుని తెనుఁగుకవి వెంకటకృష్ణాజెట్టి కనకాజెట్టి చేసిన కవిత్వ" మని యున్నది. కాని యీగద్యకు ముందున్న మంగళములో "శ్రీ వెంకటుడ నే" నని చెప్పుకొనినాఁడు కవి. గ్రంథారంభమున నొకసీసములోఁదాను "కనకయ్య పుత్రుఁడ" నని చెప్పుకొనినాఁడు. కాఁగా "వెంకటకృష్ణాజెట్టి కనకాజెట్టి చేసినకవిత్వ" మనునది పొరపాటునఁ దారుమారై యుండునని యూహింపఁదగి యున్నది.

భగీరథునికోర్కెఁ జొప్పున శివుఁడు గంగను విడనాడెనని యాపె సోదరుఁడగు కపిలవిష్ణువు కోపించి శివునికిఁ బారిజాతముద్వారా గుణపాఠము నేర్పవలెనని సంకల్పించి నారదు నందులకు నియోగించును. చివరకు శివుఁ డామె నుపలాలించును. అది యిందలి ప్రధానవిషయము.

* తం. స. మ. కే. నం. 636 — 637

పారిజాత సన్నివేశ ప్రధానమైనది కృష్ణకథ. పారిజాత కథలోఁ ప్రధాన సన్నివేశము సవతికయ్యము. శివకథలోఁగూడ నా సన్నివేశ మున కవకాశ ముండుటచేతఁ బారిజాత వాసన దానికిని దగిలినది. కాని యిందు కవి సవతికయ్యపు సన్నివేశమును గల్పింపలేదు సరికదా యున్నకథయంద్దైనను సంవిధానమును జక్కఁగ దిద్దలేక పోయినాఁడు. రచన వేలవము, నీరసము, బహుదోషదుష్టమునై యున్నది. టప్పా దరువు, గీతార్థకందార్థాము లిందలి రచనా విశేషములు.

---

33. ఎల్లయకవి

చంద్రతారా విలాసము : *

సేలము మండలమున నుద్దండ మల్లసముద్ర మనుగ్రామమున నుండిన యాంధ్రవిప్రుఁడు, నాత్రేయ గోత్రజుఁడునైన రామభద్రుఁడను నాతనికి మల్లన, విశ్వనాథుఁడు నను నిరువురు పుత్రులనియు నందు విశ్వనాథునికిఁగాఁబోలు వేంకటాంబయం దీ యెల్లయకవి కలిగినాఁడనియు గ్రంథారంభమునఁగలదు. కోలాశేషాచలకవి నీలగిరియాత్రలో (చూ. మదరాసు ప్రభుత్వప్రాచ్యగ్రంథమాలా ప్రచురణ నం. 29, పుట 20–21) నీయెల్లయ 'యీరోడు' నివాసి యనియు, నితఁ డొక సంత్రస్థాపకుఁడును వ్యాపార వ్యవహర్తయు నై యుండెననియు, 'సంగీతసాహిత్య

* ప్రతులు: (1) ప్రా. లి. పు. భాం. ఆర్. నం. 130– (2) డిటో డిటో నం. 204 (3) 171. (తారాశశాంక మనుపేర నున్నది) ఇందు 2, 3 ప్రతులలో గర్తపేరు కానరాదు. కానియవి యీకృతి ప్రత్యంతరములే.

విద్యాప్రవీణుండు గావునఁ దారా శశాంక ప్రభృతి కతిపయనాటక ప్రబంధంబులు శృంగారాది రసానుబంధంబులుగ రచియించి యున్న వాడనియుఁగలదు. శేషాచలకవి నీలగిరియాత్ర 1846 – 47 సం. ల నడుమ జరిగినది. ఈ కావ్యమంత కించుక ముందు రచింపఁబడియుండును.

ఇందలి యితివృత్తము ప్రసిద్ధము. సుప్రసిద్ధమగు శేషము వెంకట పతి శశాంక విజయప్రబంధ సంవాదిగనే సాగిన దిందలి కథా రచనా ప్రణాళిక (అటఁతి మార్పు లొండు రెండుచోట్లఁ గలవు). అందలి రుచి మంతము లైన పద్యము లెన్నో మిక్కిలిగా ననుకరింపఁబడినవి. రచన సామాన్య మైనది. దోషము లధికము. సరసరచన గల పట్టులున్న వన్న నది శేషము వానిప్రభావము.ఇందు ప్రసిద్ధరాగతాళములలో దరువులు, ద్విపదలు, గద్యపద్యములు, కందార్ధములు, సీసార్ధములు, ద్విపదార్ధ ములు, వృత్తార్ధములు, (వృత్తదరువులు) ఏలపదము, శోభనమును గలవు. అమరము, భర్తృహరి సుభాషితాదుల నుండి శ్లోకములు గ్రహింపబడినవి. గ్రంథము యక్షగానమని పేర్కొనఁబడినది.

---

34. మారుపెద్ది చెంగల్వరాయశాస్త్రి

సుందరేశ్వర విలాసము : *

ఈయన చెంగల్పట్టు మండలమున స్థిరపడిన యొకవెలనాటి తెలుఁగు కుటుంబమునకుఁ జెందిన వాఁడు. కౌశికసగోత్రుఁడు. తిరుమల రాయ పౌత్రుఁడు, వేంకటరాయ పుత్రుఁడు. క్రీ. శ. 1810 ప్రాంత

* Published By Prof. P. Samba Moorthy, The Indian Music Publishing House, Madras 1952.

మున మరకాణము సమీపముననున్న పెరుంపేడు గ్రామమున జన్మించి నాఁడు. సంస్కృతాంధ్రములంతను, భరత గాంధర్వము లందును గాకలు తీరిన పండితుఁడై చెయ్యూరు జమీందారుల యాస్థాన సన్మానముల నందెను. అక్కడుండిన కాలముననే యాతఁడు వైద్యనాథుఁడను జమీందారు కోరికపై నీ సుందరేశ్వరవిలాస నాటకమును రచించెను. ఇతని కాకకుముందే చెయ్యూరులోఁ గందస్వామి దేవాలయమున వల్లీనాటకము (తెలుఁగు రచన. అది యంతకుముందు తిరుప్పోరూరులోఁ బ్రదర్శింపఁ బడుచుండెడిది) ప్రదర్శింపఁ బడుచుండెనఁట; అది కూడ నీతని సుం. వి. నాటక రచనకుఁగొంత ప్రోత్సాహకమై యుండును. ఈయన తేది 28–2–1900న కాలధర్మము నొందెను. సుం. వి. అక్షయ వత్సరచైత్రమున రచింపఁబడినట్లు గలదు. చెంగల్వరాయశాస్త్రి జీవిత కాలమున (1810–1900) అక్షయ 1856 అగుచున్నది. అది చెయ్యూరులో బ్రహ్మోత్సవసమయమునఁ బ్రదర్శింపఁ బడుచుండెడిది. *

మధురమీనాక్షి సుందరేశ్వరుల వివాహమిందు వర్ణితము. ఇందు ప్రసిద్ధరాగ తాళములలో దరువులు, కీర్తనలు ద్విపదలు, గద్య పద్యములును గలవు. గ్రంథమధ్యమునను సూత్రధార ప్రసంగములు (పద్యములలోఁగూడ) గలవు. పాత్రల సంభాషణలు తఱచు, నాటక మని పేర్కొనఁబడినది. నాటకీయత ప్రస్ఫుటముగానున్నది. రచన సలక్షణమైనది, చక్కనిదే.

---

* ఈవిషయములు సుం. వి నుండియు, దానికి శ్రీ పి. సాంబమూర్తిగారి యుపోద్ఘాతమునుండియు, చెంగల్వరాయశాస్త్రి కృత్యంతర మగు చారులీలావిలాసము (ప్రా. లి. పు. భాం. ఆర్. నం. 1052) నుండియు గ్రహింపబడినవి.

35. చల్ల నారాయణ కవి

(వాయలూరి) పారిజాతము: *

కవిది యజుశ్శాఖ. కౌండిన్య గోత్రము. అతని పితామహుఁడు నారాయణప్పయ్య. తండ్రి రామయ. భార్య శేషమాంబ. చెన్నపుర ప్రళయకావేరిమధ్యమునఁ గల పంచవన్నెయగ్రహార మొకటి పేర్కొనఁబడినది. అది కవి నివాసము కావచ్చు. గ్రంథము పొన్నేరి సీమలోని (చెంగల్పట్టుజిల్లా) వాయలూరు జాగీర్దారు ప్రోత్సాహమున నాయూరి జనార్దనుని పేర రచింపఁబడినట్లున్నది. కవి తన విద్యాగురునిగా మాకు జెట్టి తిరుమలరాయనిఁ బేర్కొనెను. అతఁడు మాకుజెట్టికాక మాకు పెద్ది తిరుమలరాయఁడగుచో సుందరేశ్వర విలాసకర్తయగు చెంగల్వ రాయశాస్త్రి తండ్రియగును. చెంగల్వరాయశాస్త్రికాలము క్రీ. శ. 1810-1900 అని మీఁదఁ బేర్కొనఁబడినది. అగుచో నీ రచన 19 శ. పూర్వార్ధమున జరిగియుండు ననవచ్చును. రచనాధోరణినిబట్టిచూడ నిది 19 శ. పూర్వభాగ రచనవలెనే తోఁచుచున్నది. ఇప్పటి కిదియొక యూహ మాత్రము.

గ్రంథము "పారిజాత నాటకాలంకార కావ్య శృంగార ప్రబంధ" మని పేర్కొనఁబడినది. రెండాశ్వాసములుగా విభాగింపఁ బడినది. ప్రథమాశ్వాసమునఁ బ్రధానవిషయము రాధా మాధవుల సరసము. అష్ట మహిషులును గృష్ణుని వెదకికొనుచు నొకరి తరువాత నొకరుగా వచ్చి ప్రసంగించుట, తదుపరి నారదుఁడు పారిజాతమును దెచ్చుట మొ॥ ద్వితీయాశ్వాస విషయము. పాత్రల ప్రవేశమునకు

---

* ఆం. సా. ప. నం. 1650. అసమగ్రము.

ముందు ప్రావేశిక ధ్రువాగాన మిందుఁగలదు. మాధవి పాత్రలను బలుకరించుటయు వారి యుదంతము చెప్పించుటయుఁ గలదు. ఇది భాణకలాపము "భాణీ". ఆశ్వాస విభాగము, నాశ్వాసాంతగద్యయు ప్రబంధ ఘక్కిని సూచించుచున్నవి. ఇందు ద్విపదపాలెక్కువ, పద్యము లక్కడక్కడఁగలవు. దరువులెక్కువగా నాదితాళములోఁ గలవు. దరువులందు వాయలూరి గోపాలముద్రగలదు. అక్కడక్కడ సం. శ్లోకములు నొక్కచోఁ జూర్ణికయుఁగలవు. రచన యొక మోస్తరు. దోషములు బోలెడు.

---

36. నెడాదూరు వేంకటాచార్యకవి

సమగ్ర రామనాటకము :*

కవిది శ్రీవాత్స గోత్రము. తండ్రిపేరుగూడ వేంకటాచార్యుఁడే. నివాసము తిరుచునాపల్లి జిల్లా యూగపురము. (కులిత్తళై తాలూకా).

ఈతని గ్రంథమున రామాయణము షట్కాండలును బ్రతివిషయము ననవసరమైన పెంపుము లేకుండా సంగ్రహముగాఁ జెప్పఁబడినది. కథాకథనమునఁగాని రచనలోఁగాని కసయును లేదు; పసయును లేదు. సంవాదాఖ్యానశైలి లిరుగు పొరుగుగా నడచును. ఇది నాటక మహా ప్రబంధమని పేర్కొనఁబడినది. వివిధ ప్రసిద్ధ రాగతాళములలో బల్లవి — అనుపల్లవులతో దరువులు, ప్రాసవచనములను నొక రచనా విశేషము—ఈరెండిటి తోడనే గ్రంథమంతయు సాగినది. ఇది పురాణ గోష్ఠికిఁ దగియున్న రచన.

---

* ప్రచురణ: నే. వెంకట సుబ్బాశాస్త్రులవారి సరస్వతీ విలాస ము. శా. ముదరాము, 18—10—1876

అనుబంధము

(2)

1. తం. స. మ. కే. నం. 799 "నాటకపాత్రలు" అను గ్రంథ సంపుటమునఁగొన్ని నాటకముల పట్టిక, పాత్రలు, పాత్రధారుల పేళ్లు నుదాహరింపఁబడి యున్నవి. అందు –

(అ) రామపండితుల నాటకాలు

1. ప్రబోధ చంద్రోదయము.
2. ప్రభావతీ ప్రద్యుమ్నము.
3. సీతా కల్యాణము.
4. పార్వతీ కల్యాణము.
5. రుక్మిణీ కల్యాణము.
6. ఉషా కల్యాణము.
7. రుక్మాంగద చరిత్ర.
8. యయాతి చరిత్ర.
9. ధ్రువ చరిత్ర.
10. శమంతకోపాఖ్యానము.
11. అనసూయోపాఖ్యానము.
12. శివరాత్రి కథ.
13. జానకీసుఖోల్లాస కొరవంజి

(ఆ) దొరవారి నాటకాలు

1. మాయావతీ పరిణయము.
2. మిత్రవిందా పరిణయము.
3. సుభద్రా కల్యాణము.
4. శాకుంతలము.
5. పారిజాతాపహరణము.
6. కృష్ణ జననము.
7. కృష్ణ దాన చరిత్రము.
8. ప్రతాప రామ కొరవంజి.
9. మోహినీ మహేశ్వర నాటకము.

ఈ రామా పండితుఁడెవ్వరో, యీ దొరగారెవ్వరో, యిద మిత్థమని తెలియవచ్చినది కాదు. (అ) పట్టికలో మెలట్టూరు వెంకట రామశాస్త్రి నాటకముల పేళ్లు కొన్ని కన్పట్టుచున్నవి. అందలి ప్రబోధ చంద్రోదయాదుల పాత్రధారుల పట్టికలలోఁ గానవచ్చు గురువయ్య కృష్ణుఁడు, తుప్పు, సుందరం మొ॥ వారి పేళ్లు తం. స. మ. కే. నం. 499 – శివాజీ అన్నపూర్ణా పరిణయ నాటకము వేషాల "నావసీను" లో గూడఁ గన్పట్టుచున్నవి. అనఁగా నీ దొరగారు 1833 – 55 సం. లలో తంజావూరు మహారాష్ట్ర ప్రభువగు శివాజీ యగునేమో యనియు, నా రామా పండితుఁడు శివాజీ కించుక పూర్వుఁడో సమకాలికుఁడో యైయుండిన మెలట్టూరు వెంకటరామ శాస్త్రి యగునేమో యనియు ననుమానము తోఁచుచున్నది.

విశేషములు :— పై పట్టికలలో ప్రబోధ చంద్రోదయము, సీతాకల్యాణము, ఉషా కల్యాణము నను వానికి మాత్రము పాత్రధారి నామోదాహరణము గలదు. అందు స్త్రీపాత్రల కెదుటఁగ బురుష నామములే గలవు. ప్రబోధచంద్రోదయమునందు 6 అంకాలు, 124 వేషాలు. ప్రభావతీ ప్రద్యుమ్నము మూఁడు దినముల సంవిధాన ముగా వింగడింపఁబడినది. యయాతి చరిత్ర రెండు. మోహినీ మహేశ్వర నాటకము నాలుగంకములది. పై పట్టికలలో రెండు కొరవంజు లుండుట గమనింపఁదగినది. ఇందలి భిన్న భిన్నేతి వృత్తములు గల గ్రంథములలోఁగూడ సామాన్యముగాఁ గనిపించు పాత్రలు గలవు. అవి విఘ్నేశ్వరుఁడు, ప్రమథ గణాలు, మణియం, కుకుక్కులు, పరి చారకుఁడు, బిక్కాజి నాయఁడు, మహల్దారులు, సుయిణి, బురడవేషం, వైకాదినీవేషం జోసి మొదలైన పై పాత్రలలోఁ గొన్నింటి స్వరూప మీనాఁడు మనయూహా కందదు. మన కలభ్యములగు నానాఁటి యఁ. గా. నాటక గ్రంథములందుఁ గన్పింపవు. ఆయా పాత్రలు కొన్ని గ్రంథ

గతములు గాక ప్రదర్శన వేళ మాత్రమే ప్రవేశపెట్టఁబడుచున వని యూహింపఁదగి యున్నది. మీఁద బేరొక్కనఁబడిన వానిలోఁ మొదటి నాలుగైదు పాత్రలు నాటక పూర్వరంగ ప్రవర్తన కుపయోగపడునవి. అందు "మణియం" అనఁగా మఠ దేవాయతనాద్యధికారి, కురుకు-ళనఁగాఁ బూజారి లేక పురోహితుఁడని యర్థము. (ఆ రెండును తమిళ శబ్దములు). ఈ రెండు పాత్రలు సీ యించుమించు నాటకములలోను గన్పించును. బిక్కాజినాయని పాత్ర తొమ్మిదింట గన్పించును. ఆ బిక్కాజి శబ్దమున కర్థమేమోగాని కటికెముపంటి పాత్రయై యుండునేమోయని యూహ వొడముచున్నది.

2 – తం. స. మ. కే. నం. 802, 803 – నానావిధనాటక ములు :– ఇది యొక పెద్ద కలగూరగంప సంపుటము. ఇందు తలయుఁ దోకయు లేక, యున్నదైనను నొక పొందికలేని యందదుకుల వివిధ నాటకభాగములు గలది. అవి ప్రహ్లాద, హరిశ్చంద్ర, మార్కండేయ, రుక్మాంగద, పారిజాతము, కృష్ణలీలా విలాసము, సీతా కల్యాణము, పార్వతీ కల్యాణము, ఉషా పరిణయము. తం. స. మ. కేటలాగులో నుదాహరింపఁబడిన గ్రంథభాగములే కొన్ని. వానిసంబంధ మీ దిగువ సూచింపఁబడును.

ఇందలి రుక్మాంగదము – కే. నం. 578, 579, 582.
,, సీతా కల్యాణము– ,, ,, 673.
,, కృష్ణలీలా విలాసము ,, ,, 507, 508.

ఇందు చెదురుగా నున్న పారిజాత గ్రంథ భాగములకు కే. నం. 543 మాతృభూతన పారిజాతముతో భావ బాంధవ్యము చాలఁగలదు. చెదురుగాఁ గాక యొక్కచో నొక క్రమము ననుసరించి యున్న 150 గ్రంథముల పరిమాణము గల పారిజాతాము నారాయణ

తీర్థుల కృతి. ఇందలి సీతాకల్యాణ, రుక్మాంగదములను మెలట్టూరు వెంకటరామశాస్త్రి గ్రంథభాగములుగా గుర్తింపనగును. హరిశ్చంద్ర మార్కండేయాది గ్రంథ భాగములును గొన్ని యతనివే కావచ్చును.

3. ఆంధ్ర వాఙ్మయ సూచికలోఁ గల తం. స. మ. యొక్క యముద్రిత యక్షగానముల పట్టికలో నుదాహరింపఁబడినవానిలో నేఁ డుపలబ్ధములుగానివి, కేటలాగులోఁ జేర్పఁబడనివి :—

1. అనసూయోపాఖ్యానము.
2. కుశలవ కథ.
3. కొరవంజి — (ముద్దుకవి)
4. గంగా విశ్వేశ్వర పరిణయము.
5. గణేశ కల్యాణము.
6. గణేశ లీలార్ణవము.
7. గణేశవిలాసార్ణవము (కొరవంజి)
8. జలక్రీడ — (లింగోజీ)
9. జానకీ సుఖోల్లాస కొరవంజి. *
10. ధ్రువచరిత్రము. *
11. నటేశ విలాసము.
12. నారద గర్వభంగము.
13. ప్రభావతీ పరిణయము. *
14. మీనాక్షీ పరిణయము.
15. రత్నకేతూదయము.
16. రుక్మిణీ సత్యభామా సంవాదము. (లింగోజి)
17. విరాట్పురుష నాటకము.
18. శివరాత్र्युపాఖ్యానము. *
19. శ్రీ ప్రతాపరామ కొరవంజి.*

ఇందు (*) గుర్తులతోఁ జూపఁబడినవి "నాటకపాత్రలు" సంపుటమున నుదాహరింపఁబడినవే. ఇందలి నారద గర్వభంగ మనునది ప్రతి విలేఖకునిచేఁ బొరపాటుగా "నారద గర్వభంగం నాటకం" అని వేరొక్కనఁబడిన తం. స. మ. లోని కే. నం. 678 నారద గర్వభంగ వచన గ్రంథమే కాఁదగును. గణేశ కల్యాణ మనునది శహాజీదో, ఏకోజీదో యైన విఘ్నేశ్వర కల్యాణము కాఁదగును. (ప్రతి విలేఖకులొక గ్రంథమునకే తమ యిచ్చచొప్పున సదృశనామాంతరము

లను దగిలించుట గలదు. అనభిజ్ఞ లింకను నెన్నియో పొరపాటులకు బాల్పడుదురు). కే. నం. 542—పాండవాజ్ఞాతవాసము ప్రతి ముఖపత్ర మున "విరాట్‌పురుష నాటకం" అని యున్నది.

4. తం. స. మ. కే. నం. 598 — వాద జయము ప్రతిలో "సత్యభామా కొరవంజి" యను గ్రంథముగూడ గలదని కేటలాగులో నుదాహరింపఁబడినది. అది తం. స. మ. కే. నం. 486 — ఎఱుకల కథ కాఁదగును. అందు సత్యభామకు కొరవంజి సోదె చెప్పుటయే విషయము.

5. తం. స. మ. కే. నం. 528 — జీవనాటకము. ఇది జీవనాట కము కాదు. జీవములేని నాటకము. ఇందొక సన్నివేశముగాని, పాత్రల సంభాషణగాని దరువులుగాని ద్విపదలుగాని కానరావు. ఆఖ్యాన శైలిలో వచనప్రచురముగా నడచిన రచన. ఎడనెడ సం. శ్లోకములు, వాని దిగువ వచనమునఁ దద్వ్యాఖ్యానమును గలవు. విషయము తత్త్వము. కర్తపే రిందు గానరాదు. మోక్షకాంత కల్యాణమని దీని నామాంతరము.

(కే. నం. 557, 558 ముక్తికాంతా పరిణయము వేఱు).

తెలంగాణము
యక్షగానము
కవులు - కావ్యములు

1. (ధర్మపురి) శేషాచలకవి

(ధర్మపురి) రామాయణము:

(ప్రచురణ: వెస్టువార్డు, మదరాసు, 1934, కొండా శంకరయ్య, సికింద్రాబాదు, 1949

ఇతని నివాసము కరీంనగరు జిల్లా ధర్మపురి. కాలము క్రీ. శ. 1780 ప్రాంతము. కృత్యంతరములు నరసింహ నరహరి శతకములు. (చూ. గోలకొండ కవుల సంచిక. పూర్వకవి పరిచయము.) ఇతని రామాయణ యక్షగానము షట్కాండలును గలిగి ధర్మపురి రామాయణమను పేర తెలంగాణమునసే కాక యావదాంధ్రమునను విశేష ప్రసిద్ధి వహించినది. అయితే అది యథాతథముగాఁ బ్రదర్శింపఁబడినట్లు మాత్రము గానరాదు. ఆంధ్రదేశ రామాయణ వీథి నాటక ప్రదర్శనములం దిండలి దరువులు మాత్రము తఱచుగా గ్రహింపఁబడుట కద్దు. అది యెక్కువగా శ్రవ్యధోరణిని సాగిన రచన. అందు ద్విపద, పద్యములు, వచనము, ఏలలు మొదలగునవి గలవు గాని ప్రసిద్ధ రాగతాళములలో సాగిన దరువుల పాలధికము. అందుఁ బాత్రల సంవాద సందర్భము లందున్నవి కొన్ని మిక్కిలి మనోహరములు. రచన సలక్షణము నిరాడంబర సుందరమునై నది.

---

2. రాపాక శ్రీరాము కవి

ఇతఁడు పరకాల నివాసి యనియు, 1780 ప్రాంతము వాఁడ నియు, అధ్యాత్మ రామాయణ కర్తయనియు గో. క. సం వలనఁ దెలియ నగును. ఆంధ్రసాహిత్య పరిషత్తువారి పట్టికలో సం. 3549 గ్రంథ మధ్యాత్మ రామాయణమను యక్షగాన మనియు నది రాపాక లింగన పుత్రుఁడైన శ్రీరామకవిచే సూచర్ల రామమూర్త్యుని కోరికపై ఇల్లిందకుంట దేవుని కంకితముగా రచింపఁబడిన దనియుఁ గలదు. ఆపట్టి కలో సం. 3429 గ్రంథము ఇల్లిందకుంట రామాయణ యక్షగాన మని యున్నది. అది పై గ్రంథమునకే ప్రత్యంతరము గావచ్చును. కాని పరిషత్తులోఁ బట్టికలోఁగాక బీరువాలలోనే ప్రతియు లభింపక పోవుట శోచనీయము.

---

3. కానూరి వీరభద్ర కవి

బసవ మహిమామృత విలాసము: *

కవి విషయము :— కవి తనకు వియ్యన యని నామాంతరము గల దని చెప్పినాఁడు. ఇతని తల్లిపేరు అక్కనాగమ్మ. తండ్రిపేరు తెలియదు. ఇతనికిష్ట లింగాదిక జ్ఞానోపదేశముచేసిన గురుఁడు గుడ్డద మారెయ్య. కృతి ప్రోత్సాహకుఁడు కొలనుపాక సోమేశ్వరస్వామి భక్తుఁడగు సీతారామశాస్త్రి. ఆస్వామికే యీకృతి అంకితము. కొలిపాక (కొలను పాక నల్లగొండజిల్లాలో భువనగిరి తా. లో నున్నది.) కవి నివాసము.

* ప్రతి వివరము :— ప్రా. లి. పు. భాం. డి. సం. 1911

ఇతఁడిందుఁ బురాతన భక్తులను, భొల్కురికి సోమనాథాదులను జేర్కొ-
నిన తఱువాత " మాకు స్నేహితులైన భక్తమాహేశ్వరులను సంస్తు
తించితి నెఱువలెను " అని తన సమకాలికులను గొంతఱిని జేర్కొని
యుండెను. అందు ముఖ్యులు కందుకూరి మల్లికార్జునుని పుత్రుఁ
డైన బసవరాజు, బుద్ధిరాజు వీరేశు, కొమర్రాజు శంకరుఁడు. అ త్తలూరి
పాపకవి తన చెన్న బసవపురాణమునఁ గందుకూరి మల్లికార్జున మంత్రిని,
నతనిపుత్రుఁడైన బసవరాణ్మంత్రిని, బుద్ధిరాజు వీరనను తన కృతిపతి
యగు కందుకూరి అమృతలింగముగారి వంశావతార సందర్భమునఁ
బ్రశంసించి యుండెను. పాపకవికాలము " నూఱు సంవత్సరములకుఁ
బూర్వమని చెప్పవచ్చు " నని ఆంధ్రకవుల చరిత్రమునఁ గలదు.
కొమర్రాజు శంకరుఁడు సుప్రసిద్ధులైన కొమర్రాజు లక్ష్మణరావుగారి
పినతాతయు, శ్రీగిరి మల్లేశ వీరభద్ర శతకాది గ్రంథకర్తయు నగు
రామలింగ కవికిఁ దాతయనియు నతఁడు క్రీ. శ. 1800 ప్రాంతమువాఁడు
కావచ్చుననియు శతకకవుల చరిత్ర తెలుపుచున్నది. పై విషయములను
బట్టి కానూరి వీరభద్రకవి 18 శతాబ్ది యుత్తరార్ధమున నుండెనను
కొనుట సమంజస మనిపించుచున్నది.

ఈగ్రంథమున మొదట బలదేవ దండనాథపుత్రియైన గంగమను,
దదుపరి బిజ్జలు నాస్థానమున దండనాథుఁడైన పిదప రాజసోదరి యగు
నిలను బసవేశ్వరుఁడు వివాహమాడుట ప్రధాన విషయము. అతని
మహిమయు నౌదార్యమును బ్రకటితములైన రెండు సన్నివేశములు
గలవు. చివర శివైక్యసిద్ధిచెప్పఁబడినది. ఇది సంగీత ప్రబంధమని
పేర్కొనినాఁడు కవి. ఇందు ద్విపద, దరువులు (కొన్నిటికి రాగము
లుదాహరింపఁ బడినను గొన్ని తాళప్రధానములును గలవు), లాలి,
సువ్వి, అల్క, దండెయాడింపు పాటలు, పద్యములు, వచనములును
గలవు. రచన యొకమోస్తరు. నిర్దుష్టము గాదు.

4. చెల్వారు సన్యాసి

బసవ కల్యాణము: *

ఇతఁడు లావేరు శైవమఠమునకుఁ జెందినవాఁడు. గిరి మఠ మళియభగిచంద్ర శేఖరుని శిష్యుఁడు. "తాను కానూరు వియ్యన్న గారి సత్పుత్రి, మానుగా బసవనామామృత విలాస, కథలలో బసవని కల్యాణ మొప్పు, విధమంత చదువంగ విని సంతసించి" యీ మె యను మతిపై నీకృతి ఘటించినట్లు చెప్పినాఁడు. కానూరు వియ్యన – యనఁగా వీరభద్ర కవి కాలము 18 శ. ఉత్తరార్ధమని మీఁదఁ జెప్పబడినది. సన్యాసి యతని గ్రంథము నతని కొమార్తెవలన విని నాఁడనఁగా నప్ప టికి వీరభద్ర కవి గతించి కొద్దికాలమై యుండును. అనఁగా సన్యాసి 1810 ఆప్రాంతమున నుండి యుండును.

సన్యాసి కవి వియ్యన కృతి జూచియే గ్రంథము రచించినను, రెండిటను ప్రధాన విషయ మొకటే యైనను బోలికలులేవు. వియ్యన కృతిలో గంగమ వివాహము విపులముగా వర్ణితమై నీలమ సెండ్లి విష యము సంగ్రహింపఁబడినది. సన్యాసి కృతిలో నీలమ కల్యాణకాండయే యతి విపులముగా వర్ణితమైనది. ఇది యక్షగాన ప్రబంధమని వేరొక్కొ న బడినది. ఇందు దరువులు, ద్విపద, పద్యములు, లయగ్రాహి, రెండేసి రగడలు, చూర్ణికలు, దండకములు, కొట్నములపాట, నివాళిపాట, శోభనము మొ॥ గలవు. రచన పేలవము దోషభూయిష్ఠము నైనది.

---

* ప్రా. లి. పు. భాం., ఆర్. నం. 464, కేటలాగులో నితఁడు "అనుమోద సన్యాసి" గా నమోదైనాఁడు. అది తప్పు. గ్రంథాంత గద్యలో "..... కరుణా కటాక్ష వీక్షణ-అనుమోద సన్యాసి నామ్ని ప్రణీతంబైన ..." అను విసంధి లేఖనము జూచి తప్పుడువిరుపు విరిచి యదే కవి యింటిపేరని యపోహ పడినారు. కాని యతనిది చెల్వారన్వయమని యవతారికలో గలదు.

5. పరశురామపంతుల రామమూర్తి

కవి నివాసము వరంగల్లు సమీపముననున్న మట్టెవాడ. కాలము 1814 ప్రాంతమఁట. ఇతఁడు సీతారామాంజనేయ మను యక్షగానమును రచించెనఁట. (చూ. గో. క. సం.) గ్రంథ మలబ్ధము. ఈయన ప్రసిద్ధ వేదాంత గ్రంథమగు సీతారామాంజనేయ సంవాదమును రచించిన లింగమూర్తికవికిఁ గొడుకఁట. తండ్రిది పద్యకృతి. దాని కిది సంగ్రహమైన యక్షగాన రూప పరివర్తనము కాఁబోలు. ఇతని కృత్యంతరములు శుకచరిత్రము, వివేక సారము, అధ్యాత్మ రామాయణము.

---

6. యామునాల శేషాచలపతి

ఇతని నివాసము మధిర తాలూకా నాగవరప్పాడు. కాలము 1814 ప్రాంతము. ఇతని యక్షగానకృతి రామాయణము. అముద్రితము. ప్రతి కంభమునెట్టులోఁ గవి వంశజులకడఁ గలదట. ఇతని కృత్యాంతరము వసిష్ఠ జనక సంవాదము. (చూ. — గో. క. సం.)

---

7. ముద్దయ కవి

ఇతని నివాసము మంథెన. కాలము 1834 ప్రాంతము. మంథెన రామాయణమనునది యితని యక్షగానకృతి. అముద్రితము. ప్రతి మంథెనలో లభింపఁగలదఁట. ఆ ప్రాంతమునందుఁ బలువురు దీనిని గంతస్థముచేసి పాడుచుందురఁట. (చూ. — గో. క. సం.)

---

8. మరింగంటి వేంకట నరసింహాచార్యులు

నివాసము నల్లగొండజిల్లా కనగల్లు. కాలము 1842 ప్రాంతము. ఇందిరాలభాగవత మనునది యితని యక్షగాన కృతి యఁట. తొలాంక నందినీ పరిణయము కృత్యంతరము. రెండు నముద్రితములు. ప్రతులు హైదరాబాదు లక్ష్మణరాయ పరిశోధకమండలిలోఁ గలవఁట. (చూ. — గో. క. సం.)

---

9. పండరి రామానుజరావు

నివాసము సిద్ధిపేట తాలూకా రామాయమ్మపేట. జనసము 1830. మరణము 1908. ఇతఁడు గాంగేయచరిత్రమను యక్షగానమును రచించెనఁట. (అముద్రితము. ఇదియు నాకలభ్దము) ఇతని కృత్యంతరములు: అహల్యా సంక్రందనవిలాసము, హనుమద్దశ తారమండలి. (చూ. — గో. క. సం.)

---

10. రూప్తానుపేట రత్నమ్మగారు

ఈమె రెడ్డికులజ. జన్మస్థానము ఇప్పటూరు. నివాసము పర్గి తాలూకా రూప్తానుపేట. కాలము 1847 - 1929. ఈమె శివకురువంజి

యను కృతిని రచించినదట. అది ముద్రితము నైనదట (కాని ప్రతి నాకలభ్దము) అది యక్షగానప్రాయ రచనమే యైయుండును. యీమె కృత్యంతరములు వేంకటరమణ శ్రీనివాస శతకములు, బాలబోధ, దశావతార వర్ణన. (చూ. — గో. క. సం.)

---

11. దీక్షితుల పాపశాస్త్రి

ఈతనికాలము 1852 - 1892. ఇతని కృతి చెంచునాటకము. (చూ. — గో. క. సం.) అలభ్యము. అది ప్రాయికముగా యక్షగానమై యుండును.

---

12. రామదాస కవి

రామదాస కవికృతములుగా, కురుమూర్తి వేంకటేశాంకితములుగా రెండు యక్షగానములు గన్పట్టుచున్నవి. — (1) తారా శశాంకము (చందా నారాయణశ్రేష్ఠి ప్రచురణ, సికింద్రాబాదు, 1933) (2) భీమసేన విలాసము (వెస్టువార్డు ప్రచురణ, మదరాసు, 1936). రెండిటను గవి తాను శ్రీ రాజా బలవంత సవ్వాయి ముక్కర సోమభూపాలరావు బహద్దరుగారి పుత్రుండైన సీతారామ భూపాలు నాశ్రితుండ నని చెప్పుకొనెను. ఈ ముక్కర సీతారామ భూపాలుండు

నైజాం రాష్ట్రములోని ఆత్మకూరు సంస్థానాధిపతి. ఇతని జీవితకాలము క్రీ. శ. 1851 - 1905. (చూ. – గో. క. సం. లోని ఆత్మకూరు సంస్థాన చరిత్ర) కనుక నీ రామదాస కవి 19 శ. ఉత్తరార్ధమునం దుండెనని నిశ్చయముగాఁ జెప్పనగును.

ఇతని కృతులు రెండును ప్రబంధోత్తమములు. భీమసేన విలాస మనఁగాఁగీచకవధ కథ. తారా శశాంకమున నితఁడు శేషము వెంకట పతి పద్యములను గ్రహించినాఁడు. రెండును యక్షగానములని వేరొక్కనఁబడినవి. రెండిటను చిటిపొటి దరువులు, వచనములు పాత్ర సంవాద ప్రచురములుగా నున్నవి. అక్కడక్కడ ద్విపదలు పద్యము "సభాకై వారము", సూత్రధారుఁడు పాత్రలను విచారించుటయుఁ గలవు. రచన యొకమో స్తరు.

(ఈ రెండు గ్రంథములందును గ్రంథ ముద్రణకుఁ దోడ్పడిన బుక్కా లక్ష్మయ్య పుత్ర ప్రశంసగలదు.)

---

13. గోవర్ధనం వెంకట నృసింహాచార్యులు

ఈయన జన్మస్థానము నల్లగొండజిల్లా మిర్యాలగూడ తాలూకా విభురాపకేట. 1934 నాఁటి కీయన వయస్సు 80 సం. లు. (చూ. – గో. క. సం.) ఇతని యక్షగానప్రాయ రచనలు: అజామిళోపాఖ్యా నము (ముద్రితము – శ్రీ సుజనరంజనీ ము. శా., కాకినాడ, 1898); గొల్లకలాపము (అముద్రితము – ఆం. సా. ప., నం. 3760). అజా

మిళోపాఖ్యానము నుండి యీయనగుటించి తెలియనగు విశేషములు :- శ్రీవత్సనగోత్రుఁడు. రామానుజాచార్య పుత్రుఁడు. ప్రతాపగిరి రాణ్మాహాత్మ్యము, జాంబవతీ చరిత్రము, శంకరగురూపాఖ్యానము, అంబరీష రసాభ్యుద్విజయములు (?).

అజామిళోపాఖ్యానము జమలాపురపు వేంకటరావు, వలదు తిరుమలరావు దేశిపాండ్యా పటువారీల (మధిరహాబు పేష్కారు తాలూకా, జడచర్ల జిల్లా మహబూబునగరు) ప్రోత్సాహమున రచింపఁ బడినది. ఇందలి యితివృత్తము ప్రసిద్ధమగు భాగవతమునందలి యజామిళుని కథయే. గ్రంథము యక్షగానమని పేరొక్కనఁబడినది. రచన చక్కనిది. ఇదుఁ బ్రసిద్ధ రాగతాళములందు దరువులు, పద్యములు, ద్విపదలు, చిన్న చిన్న వచనములు, అర్ధ చంద్రికలు, కంద సీసార్ధములు, ఏకపది (మంజరి, యనునవి గలవు.

ఆం. సా. ప., నం. 3760 గ్రంథము గొల్లకలాపము కర్త "సుంకరి కొండయ్య" అని పరిషత్తువారి పట్టికలో నున్నదికాని యది పొరపాటు. సుంకరికొండయ్య గొల్లకలాపములందు సామాన్యముగాఁ గన్పించు నొకపాత్రమాత్రము. పై పరిషత్పత్రికలోఁ గొండయ్యపేరు గల భాగ మిపు డుత్సన్నమై యున్నది. కాని యందు 28 ఎ యాకు రెండవప్రక్క గ్రంథకర్త గోవర్ధనము వెంకట నృసింహాచార్యుఁడనియే యున్నది. కృతిపతి పాలకుర్తి నరసింహస్వామి. గొల్లభామ చల్లనమ్మ వచ్చి కృష్ణప్రశంస, రేపల్లెపురవర్ణనము జేసి, తక్రప్రాశస్త్యము, దమ కులాచారములు నుగ్గడించి జగమెల్ల గొల్ల యనుటకు సముద్రమథన కథను వివరించుట యిందలి విషయము. ఇందు దరువులు, వృత్తములు, ద్విపదలు, వచనములు, ఏలపదము, అమరశ్లోకోదాహరణములును గలవు. రచన సరసమైనది.

---

14. రంగరాజు కేశవరావు

కాలము 1858 — 1904. ఈయన య. గా. కృతి హనుమద్విజయము. (అముద్రితము. డా. శ్రీ బి. రామరాజుగారికడ నొక ప్రాత ప్రతిగలదు). విషయము ప్రసిద్ధము. రచన ప్రశస్తమైనది.

---

15. శ్రీరామకవచం కృష్ణయ్య

ఇతని జన్మస్థానము నల్లగొండజిల్లా నారాయణపుర సంస్థానము. కాలము 1863—1926. ఇతని యక్షగానకృతి భానుమతీ పరిణయము అముద్రితము, అలబ్ధము (చూ.— గో. క. సం.).

---

16. మరింగంటి వేంకట నృసింహాచార్యులు

ఈయన ప్రసిద్ధుఁడగు మరింగంటి సింగరాచార్యుల వంశమునాఁడఁట. ఇందిరాల భాగవత యక్షగాన కర్తయగు వేంకట నరసింహాచార్యుల పౌత్రుఁడు కావచ్చును. ఇతని నివాసము కనగల్లు, కాలము 1884 ప్రాంతము, యక్షగానరచన అనిరుద్ధవిలాసము. (నా కలబ్ధము) (చూ.— గో. క. సం)

---

17. తాడిపర్తి లక్ష్మణదాసు

ప్రహ్లాద నాటకము:

ఇతనికి రజా అల్లి లక్ష్మణరాయుఁడని నామాంతరముగలదు. ఇతఁడు హైదరాబాదు రాష్ట్రమునందలి దేవరకొండ సీమ

కొణుదూరు పరగణా పాహాబాదగ్రామసమీపమున నున్న సీతారామ పురాగ్రహారవాసి. గాలి సూర్యనారాయణదాసుని శిష్యుఁడు. ఇతని కృత్యంతరములు తిరుమంగయాళ్వారు చరితము, వేంకటేశ్వర చరితము, నృసింహశతకము. ఇతఁడు తన ప్రహ్లాద చరితమున నీకథనే తనవలె యక్షగానముగా రచించిన తిరునారాయణాచార్యులను, యాదవదాసును బేరొక్కొని యుండెను. తిరునారాయణాచార్యులు 19 శ. మధ్యమునను, యాదవదాసు 19 శ. ఉత్తరార్ధమునను నుండిన వారు. (ఈ యిరువుర యుదంతమును ఆంధ్రదేశ య. గా. కవుల ప్రకరణమునఁ జూచునది – పుటలు 139; 161). లక్ష్మణదాసు ప్రహ్లాద నాటకము 1882 లో మదరాసు ఆదికళానిధి ము. శా. యందు ముద్రితమైనది. కాఁగా నత్తఁడప్పటి వాఁడే యగును.

ఇతని ప్రహ్లాద చరితము యక్షగానమని పేరొక్కొనఁబడినది. ఇందు గ్రంథారంభమున నొకటి రాగి హిందుస్తానీ దరువు, "గంధర్వస్త్రీల వేషం కథ" యుఁ గలవు. పాత్రల తెరలోపలి దరువులు, తెర వెడలు దరువులు, హాస్యగాని పృచ్ఛలు, పాత్రలు స్వవిషయము జెప్పుట, సంధివచనములు, రంగప్రయోగ సూచనలును (ఉదా :– "వెడలె నరసింహదేవుఁడు – పెడబొబ్బ లిడుచు" అను దరువు "అంగున వుండే వారు చదువవలసినది" అని సూచన) గలవు. గ్రంథము సంవాద శైలీ ప్రచురమై నాటకీయతాప్రకృష్టమై యున్నది. కాని రచన ప్రౌఢమైనది కాదు. పోతరాజు భాగవతానుకరణ మిందు సమృద్ధిగనే యున్నది. ప్రసిద్ధ రాగతాళములలో దరువులు, పద్యములు, ద్విపదలు, వచనములలో సంధి-సంభాషణలు, తేవారములు, కందార్ధములు, చూర్ణిక మొదలగునవి యిందలి రచనాంగములు.

18. కావూరి వెంకట రామకవి

సత్యనారాయణ కథా సుధాలహరి :

ఇతఁడు సుబ్బా యిలాకా 'అశ్వారావుపేట నివాసి. లోహిత సగోత్రుఁడు. కావూరి బ్రహ్మసూరి పుత్రుఁడు. ఇతని కవితా గురువు కృష్ణ విజయ కర్తయైన చెఱుకుపల్లి గాంగేయ మహాకవియఁట. ఈ వెంకటరామకవి యార్యక్షత్రియుఁడు, నిమిషాంబా శతకకర్తయు, 19 శ. ననున్న యాధునికుఁ డనియు శతక కవుల చరిత్రవలనఁ దెలియు చున్నది. ఇతని స. నా. క. సు. లహరి 1885 లో మదరాసు వర్త మాన తరంగిణి ము. శా. యందు ముద్రితమైనది. ప్రచురణ కర్త కొండపల్లి వేంకట శివయ్య గారు. ఈతనిని వెంకటరామ కవి స. నా. క. సు. ల. యందుఁ బ్రశంసించినాఁడు. కాఁగా వెంకటరామ కవి 1885 ప్రాంతమున నుండినాఁ డనుట నిశ్చయము.

గ్రంథ విషయము :- ప్రసిద్ధ మగు సత్యనారాయణ వ్రతకథ. కథలో సారము లేదు గాని రచన చక్కఁగనే యున్నది. ఇందు దరువులు, ద్విపదలు, తోహారాలు, పద్యములు, ఏలలు, రగడ, దండకము, చూర్ణిక, తేవారములు, కందార్ధములు, సంధివచనములును గలవు. కవి దీనిని గేయప్రబంధ మని మాత్రమే పేర్కొనెను. కాని ప్రచురణ కర్తలచే నిది " సరస జనాంతఃకరణ సంచారణోచిత నృత్త గీత తాళాభి నయ చతుష్టయ శృంగారంబుగ రచియింపఁబడిన యక్షగాన" మని పేర్కొనఁబడినది.

19. తిరునగరు పాపకవి

హరిశ్చంద్ర మహారాజు చరిత్ర:

(ముద్రణ:— శ్రీ లక్ష్మీనృసింహ విలాస ము. శా., మదరాసు, సం. తెలియదు. వెస్టువార్డు, మదరాసు, 1941).

కవి నివాసము పట్టెము లేక వట్టెము. (మహబూబునగరుజిల్లా నాగర కర్నూలు తాలూకా). ఇతనిని వట్టెము పాపకవి యనియు వ్యవహరింతురు. ఇతని తండ్రి నరసింహ కవి. ఇతని కవితా గురువు చింతలపల్లి నృసింహ కవి. ఇతని కాలము 1873 - 1916 అనియు, తులాభార నాటకము, తిమ్మాజిపేట హరిశ్చంద్ర నాటకము, ఆనంద రామాయణము, సీతారామాంజనేయ శ్రీరామశతకము లనునవి యితని కృతులనియు గో. క. సం. వలన దెలిసినది. ఇందు మొదటి రెండును య. గా. ప్రాయ రచనలు. రెండవది మాత్రమే లభించినది. ఏతత్కృతి ప్రోత్సాహకులు తిమ్మాజిపేట మిడిజిల్లి మల్లయ సెట్టి, బుక్కా- లక్ష్మయ్య. గ్రంథవిషయము ప్రసిద్ధము. దరువులు, వచన ములు నెక్కువ. సంభాషణలు ప్రచురముగా సాగినవి. సంధి వచన ములు, పద్యములును గొలదిగా గలవు. రచన బాగుగనేయున్నది. గ్రంథారంభమున రంభోర్వసుల రాక, సూత్రధారుని "సభా క్షేవా రము", అతడు పాత్రలను బలుకరించుట, పాత్రలు స్వవిషయము జెప్పుట మొ. విశేషములు గలవు. కవి తన కృతిని శృంగార నాటక మని మాత్రము వేరొకనియుండెను. ప్రకటన కర్తలు యక్షగాన మనిరి.

20. పండరి విఠల రాయకవి

ఇతఁడు పండరి రామానుజరావుగారి పుత్రుఁడు. నివాసము రామాయమ్మపేట. (అది తండ్రి కాలమున. తదుపరి తిమ్మపురి కితఁడు మాఱినట్లున్నది గ్రంథములఁజూడ). జననము 1874, మరణము 1914 ఇతని రచనలు :— గజగౌరీ వ్రతము, శ్రీరామ విజయము, కౌసల్యా పరిణయము. ఈ మూఁడును యక్షగానములు, ముద్రితములు, తదితరము లముద్రితము లనేకమున్నవి. (చూ. — గో. క. సం.)

ఇతని య. గా. కృతులలో గజ గౌరీ వ్రతము, శ్రీరామ విజయము మాత్రమే లభించినవి. (మొదటిది కొండా శంకరయ్య ప్రచురణ, సికింద్రాబాదు, 1928. రెండవది చందా నారాయణ శ్రేష్ఠి ప్రచురణ, సికింద్రాబాదు, 1949). గజగౌరీ వ్రతమున గాంధారి మృద్గజ ప్రతిమతోఁ జేసిన వ్రతమునకే మురియుచుండ సర్జునుఁ డైరావతమును దెప్పించి కుంతిచే గజ గౌరీ వ్రతము చేయించిన కథ వర్ణితము. శ్రీరామ విజయమునందలి విషయము :— విశ్వామిత్రుఁడు తనకుఁ బ్రత్యేకముగా నమస్కరింప నేమఱిన యయాతిని జంపుమని శ్రీరామునిఁ బ్రోత్సహించుట — యయాతి నారదు నుపదేశమున నాంజనేయుని శరణుజొచ్చుట — హనుమద్రామ సంగ్రామము అది జగద్విలయ హేతువగుట — విశ్వామిత్రుఁడు విషణ్ణుడగుట — కౌసల్యాంజనీ దేవుల యాగమనముతో యుద్ధ విరమణము. గజగౌరీ వ్రతము తిమ్మపురి శ్రీధరి కంకితము. శ్రీరామ విజయము రావూరి హరి కంకితము. శ్రీ. రా. వి. కృతి ప్రోత్సాహకుఁడు పొన్నగంటి గోపాలరావు. రెండిట దరువులు, పద్యములు, సంధి వచనములు, ముఖ్యరచనాంగములు; ద్విపద లతివిరళముగాఁ బ్రయుక్తములు, రెండిట

గ్రంథారంభమున రంభోర్వశుల కాకలు, పాత్రల తెరదరువులు మొ. గలవు. రచన రెండిటఁ బ్రబర్మనోచితముగ నున్నది. కాని నిర్దుష్టము గాదు.

---

21. శేషభట్టరు కృష్ణమాచార్యుఁడు

రంభా నలకూబర విలాసము:

(ముద్రణ: శ్రీరంగ విలాస ము. శా., మదరాసు, 1891,

ప్రచురణకర్త: అయితా వెంకయసెట్టి, సికింద్రాబాదు,

కవి నివాసము నల్లగొండజిల్లా దేవులపల్లి తా. అడవిదేవులపల్లి. తండ్రి సింగరార్యుఁడు. కృతిప్రోత్సాహకుఁడు ధర్మాజీపేట నివాసి సిరి స్పురం రాజేశ్వర రాయుఁడు. గ్రంథకర్తయే స్వయముగాఁ బ్రచురణ కర్తకు గ్రంథముద్రణ విక్రయాధికారము నిచ్చునట్లు చివర యట్టపై నొక ప్రకటన పద్యము గలదు. అనఁగా కవి గ్రంథప్రచురణ వత్సర మగు 1891 ప్రాంతమున నుండినాఁడనుట స్పష్టము.

గ్రంథవిషయము:— నలకూబర జననము—అతఁడు పెద్దవాఁడైన పిదప నొకనాఁడు నందనవనమున రంభను దారసిల్లుట—వారొకరి నొకరు వలచుట— విరహవేదన—సమాగమము. గ్రంథము యక్షగాన మని పేర్కొనఁబడినది. ఇందు దరువులు (తెరదరువులుగూడ), ద్విపదలు, పద్యములు, విరళముగా సంధివచనములు, అచ్చటచ్చట 'ముచ్చట

అనుపేరమూఁడు ముక్కల వచనమున పాత్రల మాటలును గలవు. ద్వారపాలకుని పృచ్ఛలు, పాత్రల స్వవిషయోద్ఘాటనములును గలవు. రచన ప్రదర్శనోచితమైనది. నాతిప్రౌఢము. నాతిపేలవము.

---

22. గడ్డం రామదాసు

రామదాస కవి కృతములుగా, మిట్టదొడ్డిశ్రీరి కంకితములుగా నొక మూఁడు యక్షగానములు గన్పట్టు చున్నవి — కాళింగ (కాళీయ) మర్దనము [1], విప్రనారాయణ చరిత్రము [2], ప్రభావతీ విలాసము [3]. కాళీయమర్దన గద్యలో నీతఁడు కౌండిన్యసగోత్రుఁడు. బిచుకన పౌత్రుఁడు, రామాంబా చూచనల పుత్రుఁడు నని యున్నది. గో. క. సం. కవి పరిచయమును బట్టి యీ మూఁడు కృతులకును గర్త గడ్డం రామదాసని తెలియుచున్నది. అం దితని జన్మస్థానము సిద్ధిపేటయనియు (నివాసము మిట్టదొడ్డి కానచ్చును), నితఁడు పద్మశాలి కులజుఁడనియు, నాశుకవిరత్న బిరుదాంచితుఁడనియు ననేక కృతులు (23 పేర్కొనఁ బడినవి) రచించి నాఁడనియు, నితని కాలము 1878–1930 అనియుఁ గలదు.

ఇతని కాళీయమర్దన విప్రనారాయణ చరిత్రములు ప్రసిద్ధోపవృత్తములు. ప్రభావతీ విలాసము నందలి కథ జైమిని భారతమునుండి

(1), (2) — మదరాసు వెస్లువార్డు వారిచే వరుసగా 1935, 1950 సం. లలోఁ బ్రచురితములైనవి.

(3) – చందా నారాయణశ్రేష్ఠి ప్రచురణ, సికింద్రాబాదు, 1950.

గ్రహింపఁబడినది. (ధర్మజుని యాగాశ్వమును బట్టి యర్జునునితోఁ బోరికిఁదలపడిన హంసధ్వజ మహారాజు పుత్రుఁడగు సుధన్వుని పత్ని ప్రభావతి). ఈ మూఁడు గ్రంథములందును దరువులు, కీర్తనలు, పద్యములు, అర్ధపద్యములు, ద్విపదలు, సంధివచనములు గలవు. తెరలోని పాత్రలు పృచ్ఛింపఁబడి స్వవిషయము నుగ్గడించుట, తెర వెడలుదరువులు మొదలగునవి యున్నవి. మూఁడింటను శైలి పాత్రసంవాద ప్రచురమైనది. ప్రసన్నమైనది. రచన ప్రదర్శనోచితమైనది. సలక్షణమైనది.

---

23. ముద్దాల కాశీపతి

కవి విశ్వకర్మ కులజుఁడు. కాశ్యపసగోత్రుఁడు. కనకమాంబా నరసింహాచార్యుల పౌత్రుఁడు. కనకమాంబికా శాస్త్ర్యాచార్యుల పుత్రుఁడు. వీపూరి వెంకటార్యుని శిష్యుఁడు. ఇతని యఁ. గా. ప్రాయ నాటక రచనలు:- శతకంఠ రామాయణము. (సికింద్రాబాదు కొండా శంకరయ ప్రచురణ), మైరావణ (లేక) హనుమద్విజయము, గయనాటకము (1891 లో ముద్రితమని ఆం. వా. సూ.). మొదటిది మాత్రమే లభించినది. కడమ రెండిటి ప్రతులును బ్రిటీషు మ్యూజియమ్ లైబ్రరీలో నున్నవి. ఇతని శతకంఠ రామాయణమున దరువులలోఁ దరచు సికింద్రాబాదు సంగమేశ్వర ముద్రగలదు. ఆ సంగమేశ్వరుఁ డేతత్కృతిప్రోత్సాహకుఁడైన రాజారామయ శ్రేష్ఠి కిష్టదైవతము. రామయ్యశ్రేష్ఠి సికింద్రాబాదు నివాసియని యున్నది. 1895 లో చెన్నపురి హిందూ రత్నాకర ము. శా. యందు ముద్రితమైన ఓగిరాల పాపయ్య రామనాటక

కము అరణ్యకాండ గ్రంథాంతమున పాపయ్య తన రామనాటక బాలా రణ్యకాండలను సికింద్రాపుర బోచేపునందున్న నాటకపరుల ప్రోత్సా హముచే మద్దాల కాశీపతిమూచారి ముద్రించి ప్రచురించెనని చెప్పి నాఁడు. కాఁగా నీ కాశీపతి సికింద్రాబాదు ప్రాంతమువాఁడును, 19 శ. ఉత్తరార్ధమువాఁడు ననుట స్పష్టము.

శతకంఠ రామాయణ కథ వాసిష్ఠ రామాయణమునఁ గలదు. కథ యంతయు యుద్ధసందర్భ బంధురమైనను కాశీపతి తనగ్రంథమునఁ జక్కని సంవాద శైలి పాటించి కథను నిపుణముగా నిర్వహించినాఁడు. ఇందు దరువులు, ద్విపదలు, ద్విపదార్ధములు, కందార్ధములు, పద్య ములు, సంధివచనములు గలవు. రచన నాతిప్రౌఢము, నాతిపేలవము. ఇం దితఁడు రుద్రకవిని స్తుతించినాఁడు.

---

24. గవురహరాజు లక్ష్మీపతిరాయుఁడు

న ల చ క్ర వ ర్తి చ రి త్ర ము

ఇతఁడు ఋగ్వేది. మునినగస్సుని (?) సగోత్రుఁడు. వెంక మాంబా లక్ష్మీపతుల ప్రపౌత్రుఁడు. రామాంబా తిరుమలన్నల పౌత్రుఁడు. అంజమాంబా హరిరాయణ పుత్రుఁడు. ఇతని న. చ. చ. గ్రంథము ముఖపత్రముపై "అంబటి అనుమంతు ప్రవేశేపణ చేత పైగ్రంథకర్తచే సర్వస్వాతంత్ర్యముపొంది సికింద్రాబాదు నివాసుండగు శివనూరు వీరమల్లయ్య గారిచే హిందూ రత్నాకరము. శా. యంము

ముద్రింపించి ప్రచురింపఁబడియె – చెన్నపట్నము, 1897 సం." అని యున్నది. కాఁగాఁ గవి 1897 ప్రాంతము వాఁడనుట స్పష్టము.

గ్రంథము యక్షగానమని పేరొక్కనఁబడినది. ఇందు తాళప్రధానములైన దరువులు, ద్విపదలు, పద్యములు, వచనములు, కందార్ధములును గలవు. గ్రంథారంభమున రంభోర్వశుల రాక, హాస్యగాని మాటలు, పాత్రల తెరలోపలి దరువులు, తెర వెడలు దరువులు మొ. గలవు. గ్రంథమున నాటకీయతయున్నది కాని రచన మిక్కిలి వేలవమైనది.

---

25. గవండ్ల రాజలింగకవి

ఇతఁడు మెదకు జిల్లా నారసింహాపేట నివాసి. మనుకులరాజయాఖ్యమల్లమాంబా తనూజుఁడు. ఘట్టుపల్లి కుమారస్వామి శిష్యుఁడు. ఇతఁడు 19 శ. ఉత్తరార్ధము వాఁడని తోఁచుచున్నది. ఇతని యక్షగాన కృతులు:- 1. హరిశ్చంద్రమహారాజు చరిత్రము ('సికింద్రాబాదు నివాసులగు కంభంపాటి ఉదయాచలం గారిచే... శ్రీ వెంకటేశ్వరము. శా. యందు ముద్రింపఁబడియె. చెన్నపురి, 1902) 2. పుణ్యాంగద చరిత్ర (వెస్టువార్డు ప్రచురణ, మదరాసు, 1953.) మొదటిదాని కథ ప్రసిద్ధము. గౌరనకృతి యనుకరింపఁబడినది. రెండవది చోళదేశరాజ పుత్రుఁడైన పుణ్యాంగుని రథము క్రిందపడి యొక గోవత్సము మడియుటయు నందుపై రాజు పుత్రునికి మరణశిక్ష విధించుటయుఁ బుణ్యాంగపత్ని పతివ్రత చంద్రావతి ప్రార్థనపై శివుఁడు ప్రత్యక్షమై వారెల్లరకుఁ

నైలాస మనుగ్రహించుటయు నను కథ గలది. రెండిటను దరువులు (తెరదరువులుకూడ), ద్విపదలు, పద్యములు, అతి విరళముగాఁ బ్రయుక్తములైన యలఁతి యలఁతి సంధివచనములును గలవు. హరిశ్చంద్ర చరిత్రమున "ఆస్థాన సంతోషి" పాత్రగలదు. రెంటను నాటకీయత యెక్కువ. కాని రచన పేలవము, దోషబహుళము నైనది.

---

26. రాయభట్టు లక్ష్మీకవి

మాంధాతచరిత్రము:

(ముద్రణ:— ఉమామహేశ్వర ము. శా., మదరాసు, 1902.)

(ప్రచురణకర్త: కంభంపాటి ఉదయాచలము, సికింద్రాబాదు)

ఇతఁడు మన్నెవారి కొండాపురము ప్రభువైన జోగరాయుని పుత్రులు సుదర్శన రాయుఁడు, బాలకృష్ణరాయుఁడు ననువారి కొలువులో నుండిన రాయభట్టు. పాపయార్యుని శిష్యుఁడు, ఆథునికుఁడు కావచ్చును.

మాంధాత గర్వియై విధిని దూషించి రాజ్యమును దార పుత్రులను గోల్పోయి పలుపాట్లుపడి చివరికి శివానుగ్రహమును బొందుట యితని గ్రంథము నందలి యితివృత్తము. ఇందుఁ దొళ్ళ ప్రధానములైన దరువులు, ద్విపదలు, పద్యములు, అర్ధపద్యములు, ఏలలు, సంధివచనములును గలవు. రచన దోషభూయిష్ఠము. ఇది యక్షగాన మని ముఖపత్రమున మాత్రమున్నది. ఇందు గ్రంథారంభమున రంభోర్వ

శులరాక, తెరలోని పాత్రలు పృచ్ఛింపఁబడి స్వీయవృత్తాంతము జెప్పుటయుఁ గలదు.

---

27. కంభంపాటి ఉదయాచలము

ఇతఁడహల్యా సంక్రందనము, కలియుగ విప్రనారాయణ చరిత్రము నను రెండు యక్షగానములను రచించినట్లు నవి నరుసగా 1890, 1905 సం. లలో ముద్రితము లైనట్లును ఆం. వా. సూ. లోఁ గలదు. అగ్రంథము లలభ్యములు. ఇతఁడు సికింద్రాబాదు నివాసి యనియు, 1902 సం. ప్రాంతమున ననేక యక్షగాన నాటకములకుఁ బ్రచురణ కర్తయైనట్లును దెలియుచున్నది. (చూ. సం. 24, 25 కవుల యుదంతములు)

---

28. తిరునగరి వెంకటదాసు

కపిల దేవహూతిసంవాదము:

ముద్రణ:— హిందూ రత్నాకర ము. శా., మదరాసు, 1894.

ములుకుదురు లక్ష్మణాచార్యులు, తత్పుత్రుఁడు శ్రీనివాస రాఘవాచార్యుఁడు, పౌత్రుఁడు వీరరాఘవాచార్యుఁడు నను వారు గురుపరంపరగా వర్ధిల్లుచున్న తిరునగరు చాత్తాని నైష్ణవ వంశమందు సమ్మయ వెంకాంబలకు వెంకయ్య, వెంకయ్యకు నాంచారమ్మయందు

నమ్మయాళ్వారు, నమ్మయాళ్వారునకు రంగమాంబయం దీగ్రంథకర్త వెంకటదాసును గలిగిరి. ఇతఁడానందశైల శ్రీనివాస భక్తుఁడగు చంద్రమౌళిగురుని శిష్యుఁడు. ఇతని గ్రంథము నందు దేవహూతి కడకు నారదుఁడెఱుకతయై వచ్చిన పట్టున నెఱుకల దేవతలలో వేగండ్ల తల్లి, గంగపురి చెన్నుఁడు, మన్నెముగిరి సామి, గుణిగానిపల్లె సంజీవ రాయఁడు, కొమ్మలఘట్టు శ్రీనివాసుఁడు, కురుమతీశుఁడు, పాంబండ రాముఁడు, మొ. వారు వేరొక్కనబడిరి. ఆయూళ్ళు తెలంగాణము లోనివి. గ్రంథ ప్రచురణకర్త అయితా వెంకయ్య సికింద్రాబాదు వాసియనియు, ప్రచురణ ప్రేరకుఁడగు వెంకటనరసు నాగరకందనూలు వాసి యనియు ముఖపత్రమునఁగలదు. కాఁగా గవి తెలంగాణము వాఁడన వచ్చును. గో. క. సం. లో 250 సం. ల క్రిందట హనుమ కొండలో నుండిన వాఁడని వేరొక్కనఁబడిన యతిరాజశతకకర్తయగు తిరునగరి వేంకటాచార్యుఁడే యీకవి యనలేము. ఈగ్రంథము మంత్రి మాటలలోఁ బ్రయుక్తమైన హిందీనిబట్టి, అసలు గ్రంథరచనా ధోరణిని బట్టిచూడ నితఁడాథునికుఁ డనిపించును.

ఈగ్రంథము కర్దమ ప్రజాపతి స్వాయంభువ పుత్రికయైన దేవ హూతినిఁ బెండ్లియాడుట, దేవహూతికిఁ గపిలమహర్షి పుట్టుట, అతఁడు తల్లికిఁ దత్త్వముపదేశించుటయు ననుభాగవతేతివృత్తము గలది. ఇందు యక్షగానోచితముగాఁ బురోహితుఁడు, మంత్రసాని, యెఱుకత మొద లగు పాత్రలు కొన్ని చేర్పఁబడినవి. ఇది యక్షగాన మనియు, నాటక మనియుఁ బేరొక్కనఁబడినది. ఇందు ప్రసిద్ధరాగతాళములలో దరు వులు, ద్విపదలు, పద్యములు, వచనములు, సువ్వి, అప్పగింతపాటలు గలవు. పాత్రల యవనికాభ్యంతర ప్రసంగములు గలవు. పాత్రల సంభాషణలెక్కువ. అవి సాగిన వచనములు "ముచ్చట" లను

పేర వ్యవహరింపఁబడినవి. ఇందలి హాస్యప్రసంగములం దసభ్యత గలదు. రచన యొకమాదిరిగ బాగుగనే యున్నదనవచ్చును.

---

29. మాదిరాజు వెంకట్రామదాసు

కు చే లో పా ఖ్యా న ము :

(ముద్రణ :— వాణీ ప్రెస్, బెజవాడ, 1910)

కవి కౌండిన్యసగోత్రుఁడు. తలిదండ్రులు కోటమ్మ, అప్పయ్య. నివాసము 'మధిర తాలూకాలో మడుపల్లి శివారు — అల్లినగరంబు'. గ్రంథరచనాధోరణి యీతఁ డాధునికుఁ డనుటకుఁ దగియున్నది. రచన పేలవము. దోషభూయిష్టము. ఇందు కీర్తనలు, ద్విపద, వచనము, పద్యములు, శ్లోకములును గలవు. ఇది నాటకమనియు యక్షగానమనియుఁ బేర్కొనఁబడినది.

---

30. ప్ర బం ధ ము అ న ం త య

(మన్నెంకొండ) విజయవిలాసము :

(వెస్టువార్డు ప్రచురణ — మదరాసు, 1933, 38)

గ్రంథము మన్నెంకొండ శ్రీహరికంకితము. కవి నివాసము మన్నెంకొండ కావచ్చును. కొన్ని దరువుల చివర హనుమద్దాసను పేరు గన్పడు

చున్నది. కవిపే రసలు హనుమంతయ్య యేమో యని యనుమానము గలుగుచున్నది. ఇతని తలిదండ్రులు మేఘుమాంబ, జగ్గయ్య. అగ్రజుఁడు కృష్ణదా సితని కవితాగురువు. ఇతఁడు వైష్ణవుఁడఁట. గ్రంథమధ్యమున నితఁడు మొట్టమొదటఁ దన గ్రంథము నచ్చు వేయించిన లక్ష్మయ్య (బుక్కా) పుత్రుఁడగు సిద్ధాంతిని స్మరించి యుండుట జూడ నాధునికుఁడని స్పష్టపడుచున్నది. ఇతఁడా ప్రచురణ సం. ను గూడ సౌమ్య యని పేర్కొనెను. అది క్రీ. శ. 1909 - 10 లోఁ బడిన సౌమ్య కాఁదగును.

గ్రంథ విషయ మర్జునున కులూచీ చిత్రాంగదలతో వివాహ మైన కథ. ఇందు గ్రంథారంభమున రంభాగమనము, పాత్రలు స్వవిష యము నుగ్గడించుట, హిందీ ప్రసంగములును గాననగును. దరువులు, ద్విపదలు, పద్యములు, చిన్న చిన్న వచనములు (తఱుచుగా, సంభా షణ ప్రచురముగా) నున్నవి. గ్రంథము యక్షగానమని పేర్కొనఁ బడినది. రచన "ససేమిరా" బాగుగ లేదు.

---

31. చెర్విరాల భాగయ్య

ఈయన మఖీరాబాదు నివాసి. వైశ్యుఁడు. పునిగెశిల గోత్ర జుఁడు. తలిదండ్రులు రాజమాంబ, వీరన్న. గురువర్గము: బసవయ్య, శంకరస్వామి, హనుమదాచార్యులు, మాలె పుల్లయాచార్యులు. ఈయన గ్రంథము లనేక మిటీవలనే యనఁగా 1950 ప్రాంతమున సికింద్రాబాదు గ్రంథ విక్రేతలును బ్రచురణకర్తలు నగు కొండా

శంకరయ్య, చందా నారాయణశ్రేష్ఠిగారలచే ప్రకటింపఁబడినవి. అందనేకముపై గ్రంథ ప్రచురణకర్తలో కృతి ప్రోత్సాహకునికో ముద్రణ విక్రయాది స్వామ్యము లిచ్చుచు గ్రంథకర్తయే స్వయముగాఁ జేసిన ప్రకటనలు గలవు. (చూ :– కనకతార, కాంభోజరాజు కథ, నాగార్జున చరిత్ర, మాధవచరిత్ర, మార్కండేయ విలాసము, విక్రమార్క-చరిత్ర, శ్రీకృష్ణ రాయభారము మొ॥). అందు మార్కండేయ విలాసముపై గ్రంథకర్త చేసిన ప్రకటన సం. 1947. మాధవ చరిత్రముపై గల గ్రంథకర్త ప్రకటన తేది 1-2-48. ఈయన గ్రంథప్రస్తావనలందును ప్రచురణకర్తను ప్రశంసించిన సందర్భములు గలవు. 1954లోఁ ప్రచురిత మైన యీతని పెదబొబ్బిలిరాజు కథ గ్రంథప్రస్తావనలోఁ దత్ప్రచురణ కర్తయగు చందా నారాయణశ్రేష్ఠి ప్రశంస గలదు. అనఁగా నీయన యెంత యాఢ్యునికుఁడో తేటతెల్లమగుచున్నది. (ఈయన నేఁడు సజీవు లని తెలిసికొంటిని). భాగయ్యగారు బహుశ్రుతులు, శతాధిక గ్రంథకర్త. ఈయన 34 (ముప్పదినాల్గు) యక్షగానములను రచించెను. అన్నియు ముద్రితములు. ఉపలభ్యమానములు 31. ఇన్ని యక్షగానములను రచించిన కవి మఱియొకఁడింతవఱకుఁ బుట్టలేదు.

ఈయన గ్రంథములు కొన్నిటి రచనాకాలము మాత్రమే సూచింపఁబడినది. అందుచే నీ దిగువ నవి ఆకారాది క్రమమునఁ బేరొక్కనఁబడును. ఏ గ్రంథమున కా గ్రంథముకడ విషయ సంగ్రహమును, జివర గ్రంథ సమవాయరచనా సమీక్షా సంగ్రహము నటుం కింపఁబడును. (ఈయన గ్రంథము లనేకము తెలంగాణములోని వివిధ గ్రామవాసులగు సంపన్నుల ప్రోత్సాహమున నాయా గ్రామదైవముల పేర రచింపఁబడినవి. ఆయా గ్రంథములకడ నాయా గ్రామనామ

ములు, వానితోపాటు గ్రంథ ప్రచురణ కర్తృకాల సూచనలును గుండలీకరణములలో నుటంకింపఁబడును).

1. అల్లీ-అర్జున చరిత్రము: (గుమ్మిడిదల. చందా 1954)

ఇది విచిత్ర భారతాంతర్గతమైన కథ యఁట. తీర్థయాత్రాపరుఁడైన యర్జునుఁడు మధురాపురమునేలు అల్లీరాణిని వివాహ మాడఁగోరును. ఆమె పురుషద్వేషిణి. అర్జునునితోఁ గయ్యమాడఁబోయి వియ్యమందును. ఇది జైమినిభారతమునందలి ప్రమీలా కథ నెక్కువ పోలియున్నది. వీరశృంగారాత్మక మీకథ.

2. ఆరెమరాటీల చరిత్ర: (పెద్దమాధాపురము. కొండా, 1951)

సోమోజీ, సుబంధోజీ, పీరోజీ అను ఆరెమరాటీసోదరులు కరిణెకల్లు పరిపాలకులు. వారి పినతండ్రి బడేగాం పరిపాలకుఁడగు సిద్ధోజీ భార్య రుక్కుంబాయి దురోభిధలవలన వారిని రాజ్యభ్రష్టులను గావించును. సోమోజీని జంపించును. సుబంధపీరోజీలను బంధించును. సోమోజీభార్య అతుంబాయి రుక్కుంబాయియుఁ దాను నొక్కరేవులో ముండమోయవలె నని శపథము చేసి పురుషవేషమునఁ బోయి సిద్ధోజీతోఁబోరి యతనిని దన కొడుకగు తులేరావుచేఁ బొడిపించును. తులేరావు బడేగాంప్రభువగును. ఇదీ ఇందలికథ. ఆరెమరాటీల వీరగాథ యొకపదముగా నిదివరకే ప్రచారమున నున్నది.

3. కనకతార: (వడ్డేపల్లి. కొండా, 1950)

పాండ్యరాజగు నుదయసేనుని తనయుఁడు కనకసేనుఁడు. కూఁతురు తార. ఉదయసేనుని సోదరుఁడగు క్రూరసేనుఁ డన్నను రాజ్యశత్రువే సంహరించి యతని కుటుంబమును బలుసిలుగుల పాలు

చేయును. తుదకుఁ గష్టములెల్ల గడ్డెక్కి కనకసేనుఁడు పట్టాభిషిక్తుఁడగును. కరుణరసప్రసిద్ధమగు నీకథ మొదట ధార్వాడ నాటకసమాజమువారిచేఁ గాఁబో లాంధ్ర దేశమునకుఁ బరిచితమైనది. అటుపిమ్మట భాగయ్యగారి యక్షగాన రచనకు ముందే రంగస్థలనాటకముగాఁ దెలుగున వెలసినది.

4. కాంతామతి: (వడ్డేపల్లి, కొండా, 1946)

కాంతామతి కుంతలరాజపుత్రి. ప్రతాపసేనుఁడను కాశ్మీర ప్రభువుయొక్కపత్ని. కాంచనమాలయను వేశ్య వలలోఁ దగులుకొనిన మగనిచే నిలు వెడలఁగొట్టఁబడి పలుపాట్లు పడిపడి చివరికి మగనిచే స్వీకృత యగును. ఇది కాశీమజిలీ కథాసరళిని నడచిన కథ. కరుణాద్భుత రసాత్మకమైనది.

5. కాంభోజరాజు చరిత్రము: (మహబూబాబాదు, కొండా, 1950)

కాంభోజరాజున కేడుగురు భార్యలు. చివరిభార్య మాణిక్యాల దేవికొడుకు రాజు కాఁగలఁడని రాజగురువువలన విని కడమభార్య లొక మిషపై రాజుతోఁ గొండెములుచెప్పి గర్భవతియగు నామె నిలువెడలఁ గొట్టించిరి. అడవులుబట్టిపోయిన యామెను శివపార్వతులు భిల్లవేష మున వచ్చి రక్షించిరి. ఆమెకు శరబంది యను పుత్రుఁడు గలిగెను. అతఁడుపెద్దవాఁడై యొకపరి వ్యాధిగ్రస్తుఁడైయున్న తండ్రినిఁ జూడఁ బోయెను. ఒక కీలుగుఱ్ఱము సాయమున సప్తసాగరములు దాటి యొంటి స్తంభము మేడనున్న యోజనగంధి యను యక్షకన్య కొప్పులోని సంజీవినిదెచ్చి రాజును బ్రదికించెను. రాజు శరబందిని గుర్తించి యతనికి రాజ్యమిచ్చును. ఈకథయు నిదివఱకుఁ బదరూపమునఁ బ్రచారమున నున్నదే.

6. కిరాతార్జున చరిత్రము : (ముట్రాజుపల్లె, చందా, 1953)

ఇందలి కథ ప్రసిద్ధమైనది.

7. కుశలవ నాటకము : (రాజంపేట, చందా, 1951)

కథ ప్రసిద్ధము.

8. కృష్ణగారడి నాటకము : (ముచ్చుగూరు, చందా, 1951)

గ్రంథ రచనాబ్దము 1947. ఇందొక నిమిత్తమునఁ గృష్ణుఁడు భీమార్జునులకు గర్వభంగము చేసిన కథ వర్ణితము. ఇది యమూలకము. కవి స్వకపోల కల్పితమువలెఁ గానవచ్చుచున్నది.

9. శ్రీకృష్ణ పారిజాతము: (మహబూబాబాదు, చందా, 1954)

కథ ప్రసిద్ధము.

10. శ్రీకృష్ణ తులాభారము : (మహబూబాబాదు, కొండా, 1951)

రచన 1951. కథ ప్రసిద్ధము.

11. శ్రీకృష్ణరాయబారము : వడ్డేపల్లి, కొండా, 1951)

కథ ప్రసిద్ధము.

12. తారకాసురవధ : (గుమ్మడిదల, కొండా, 1951)

గ్రంథ విషయము ప్రసిద్ధము.

13. నలమహారాజు చరిత్రము : (రాజంపేట, కొండా, 1952)

కథ ప్రసిద్ధము.

14. నాగార్జున చరిత్రము : (బీరంగూడెం, కొండా, 1953)

అర్జునున కులూచి యందుఁ గలిగిన పుత్రుఁడట నాగార్జునుఁడు.

ఒకమృగము నిమిత్త మతనికి నర్జునునకును దత్రాపి శివ శ్రీకృష్ణులకును యుద్ధము జరిగినకథ యిందు వర్ణితము. ఈకథ మహాలింగపురాణము నుండి గ్రహింపఁబడినదఁట.

15. పుండరీక చరిత్రము: (చింతలచెరువు, కొండా, 1950)

మహాభక్తవిజయ మందలి పుండరీక చరిత్రమిందు గ్రహింపఁబడినది.

16. పెదబొబ్బిలి చరిత్రము: (మశూరాబాదు, చందా, 1954)

పెదబొబ్బిలిరాజు కథ యనుపేర నొకపదము ప్రచారములోనున్నది. దానిని బట్టి యిది రచింపఁబడినది. క్రీ. శ. 1757 లో జరిగిన చరిత్ర ప్రసిద్ధమగు బొబ్బిలి యుద్ధము కథ యిందు వర్ణితము.

17. బభ్రువాహన చరిత్రము: (ఆంధ్రగ్రంథ మండలి., సికింద్రాబాదు, 1950)

అర్జునపుత్రుఁడగు బభ్రువాహనుని చరిత్ర మిందు వర్ణితము. ఈకథ జైమిని భారతమునందు గలదు.

18. బాలనాగమ్మ చరిత్ర: (మశూరాబాదు, చందా, 1954)

బాల నాగమ్మకథ పదరూపమున నిదివఱకున్నది. ఆంధ్రదేశమున మిక్కిలి ప్రచారము బొందినది. అదే యిందు గ్రహింపఁబడినది. ఇందలి కథా రంగములగు పానుగల్లు, నాగళ్ళపూడి, గండికోటయు తెలంగాణా రాయల సీమలకుఁ జెందిన వగుట గమనింపఁదగినది.

19. భద్రసేన విలాసము: (వేములవాడ, చందా, 1949)

భద్రసేనుఁడను రాకొమరునకును, సుశీల యను రాకొమార్తెకును బెండ్లిముహూర్తము నిశ్చితమగును. కాని యతని నొక యప్స

రసయు నామెనొక యైంద్రజాలికుఁడు నెత్తుకొనిపోవుదురు. భద్రసేనుఁ డచ్చెరచెప్పిన యుపాయమును బట్టి యైంద్రజాలికుని కూఁతునాశ్ర యించి యతనిఁజంపి యతనికూఁతును, సుశీలను వివాహమాడును. ఇది పండ్రెండు రాజుల కథలు, పదునాఱురాజుల కథలు మొదలగు వాని వరుసలో నడచిన కథ.

20. (చిరుతల) భాగవతము : (చందా, 1954)

శ్రీకృష్ణ జననాదిగాఁ గంసవధము వఱకుఁ గల భాగవతకథ యిందు వర్ణితము.

21. మాధవ చరిత్రము : (వడ్డేపల్లి, కొండా, 1948)

ఆత్మానందస్వామి శిష్యుఁడు మాధవుఁ డనువాఁడు గురుబోధను బూర్తిగా విశ్వసింపమిఁ బెక్కిడుమలు గుడిచి తుదకు వివేకము దెచ్చు కొనుట యిందలి ప్రధానవిషయము. ఇందు సరళమైన వేదాంతార్థ ప్రసంగములు గలవు.

22. మాయా సుభద్రా విలాసము : (అడ్డగట్ల, చందా, 1955)

సుభద్రార్జునులనడుమ శ్రీకృష్ణుఁడే మాయాసుభద్రయై వారినిఁ బరీక్షించి యర్జునుని గర్వ ముడిపిన కథ యిందు వర్ణితము. ఇదియొక యమూలకమగు చమత్కారావహమైన కథ.

23. మార్కండేయ విలాసము : (గుమ్మడిదల, కొండా, 1954)

కథ ప్రసిద్ధము. రచన 1947.

24. విక్రమార్క చరిత్ర : (కొంపల్లి, కొండా వీరయ్య, సికింద్రాబాదు, 1938)

ఇందు విక్రమార్కుఁడను రాజు తన్ను నిందించిన చంద్రకళ యను బ్రాహ్మణయువతిని గోరి పెండ్లాడి యామెను జెఱవెట్టుటయు, నామె యొక ప్రతిన వట్టి యతఁడు గుర్తింపకుండ నతనికే యొక కొడుకును గని కొడుకుచే నతని గొట్టించినంత పని చేసిన కథ వర్ణింపఁబడినది. ఇది తమిళ దేశమున ప్రచారమునన్న మంగమ్మశపథమను కథను జాలవఱకుఁ బోలియున్నది. ఈగ్రంథమే స్త్రీ సాహసమను పేర కొండా వీరయ్యగారిచే 1954 లోఁ బునర్ముద్రితమైనది.

25. సతీ తులసీ చరిత్రము: (భానూరు. కొండా, 1952)

తులసిగా వెలసిన పరమ పతివ్రతయగు బృందాదేవి ప్రసిద్ధ చరిత్రమిందు వర్ణితము.

26. సత్యభామా పరిణయము: (వడ్డేపల్లి, కొండా, 1943)

కథ ప్రసిద్ధము.

27. సత్యహరిశ్చంద్ర: (మఖీరాబాదు, కొండా, 1953)

కథ ప్రసిద్ధము.

28. సారంగధర చరిత్ర: (మఖీరాబాదు, ఆంధ్ర గ్రంథ మండలి, సికింద్రాబాదు, 1951)

కథ ప్రసిద్ధము.

29. సీతా స్వయంవరము: (భ్రమరంపేట, చందా, 1950)

కథ ప్రసిద్ధము.

30. సుగ్రీవ విజయము: (మఖీరాబాద, కొండా, 1926? వెస్టువాస్తవారిప్రచురణ, మదరాసు, 1943)

ఇందలికథ ప్రసిద్ధము. రుద్రకవి సుగ్రీవ విజయమును భాగయ్యగారు చూచియుండవచ్చును గాని దానికిని దీనికిని సంబంధములేదు. రెండిటఁ గథాప్రణాళిక తీరే వేఱు. దీనిగుఱించి 1946 లోఁ బ్రచురితమైన యితని సత్యభామాపరిణయము వెనుకటియట్టపై యితఁడే చేసిన ప్రకటనలో, "నాపిన్నవయసున ప్రథమమున రచించిన సుగ్రీవవిజయము-యక్షగానము అను పుస్తక మిప్పటికి నుఱూరు 20 సంవత్సరములనుండి యీ నిజాంరాష్ట్రమంతటను ప్రసిద్ధి వహించి, ఇప్పటికి లక్షకు పైగా సెలవయ్యేను" అనియున్నది.

31. పైంధవ పరాభవము : (మాధవపురము. ఆంధ్రగ్రంథ మండలి, సికింద్రాబాదు, 1950)

కథ ప్రసిద్ధము.

32. గయోపాఖ్యానము : (కొండావారిప్రచురణ. అలబ్ధము)

33. జయంత జయపాలము : (కొండా ప్రచురణ. అలబ్ధము)

34. మదాలసా పరిణయము : (చందావారిప్రచురణ. అలబ్ధము)

సమీక్ష

భాగయ్యగారు పైఁబేరొక్కనఁబడిన కృతుల నించుమించన్నిటిని యక్షగానము లని వ్యవహరించినాఁడు. కొన్నిట (ఉదా :— బభ్రువాహన చరిత్ర) భాగవతము, యక్షగానము, నాటకము అను పదములను పర్యాయములుగా ననఁగా సమానార్థకములుగా వాడినారు. అన్నియు నాటకీయతా ప్రకృష్టములు; కవిచే బ్రదర్శనోద్దిష్టములు నైనవి. ఇందు కొన్నిట గ్రంథారంభమున "గణపతి సరస్వతుల వేషము రాకడ", రంభోర్వశుల రాకయుఁ గలవు. బహుకృతి సామా

న్యముగాఁ బ్రచ్ఛకుఁడు (ఒక్కొక్కదానియందు ద్వారకుఁడు, సేవకుఁడు, ప్రధాని, హాస్యగాఁడు, సూత్రధారుఁడు – అని వివిధములుగా వ్యవహర్తుఁడు), పాత్రలు స్త్రీపుంసాదులు చెప్పులయుఁ గృతి కర్తృ భర్తృ (ప్రచురణకర్తృ) ప్రశ్నోత్తరాత్మకముగా నాటకపాత్రలచేఁ బ్రవర్తితమైన ప్రస్తావనయుఁ గన్పట్టును. ఆ ప్రస్తావన తఱుచు ప్రధాని, హాస్యగాఁడు నను నిరువుర నడుమ హిందీభాషలో జరుగును. ఒకప్పుడు ద్రౌపది మొదలగు నాటక పాత్రలచేతనే ప్రవర్తితమగును. కృష్ణగారడి నాటకమున మార్కనాటకము లందువలె నాంది, నాందీప్రస్తావనయుఁ గలవు.

భాగయగారి కృతులలో వస్తువైవిధ్య మొకటి గమనింపఁదగినది. పౌరాణిక గాథలు నందుఁ బ్రసిద్ధములు నెక్కువ. కాని అల్లీరాణి కథ, నాగార్జున చరిత్రము మొదలగు నప్రసిద్ధగాథలును గలవు. కృష్ణగారడి, మాయాసుభద్ర మొ॥ గ్రంథములందు పౌరాణిక గాథలే కవి స్వకపోల కల్పనలతో జిత్రములైన మార్పు లందినది. ఆంధ్ర మరాటీలు, కాంభోజరాజు, బాలనాగమ్మ చరిత్రలందు పదరూపమునఁ బ్రచారమున నున్న జానపదగాథలు గ్రహింపఁబడినవి. పెదబొబ్బిలి చరిత్రమందలిది చారిత్రకేతివృత్తము, నది యాంధ్ర జాతీయ వీరగాథయగుటయు విశేషము. కాంతామతి, భద్రసేనవిలాసము మొదలగునవి కాశీమజిలీ, పండ్రెండు రాజుల కథల బాణిని నడచిన కట్టుకథలు – అందు గొన్ని కవి స్వకపోల కల్పితములే కావచ్చును. ఈ కథలు వివిధరసముల కాకరములు. అల్లీ పాత్ర వైవిధ్యమును గలదు. రాజమహిషీ మంత్రిపాత్ర లెక్కువ. ఎఱుకలసాని, దొమ్మరిసాని, చాకలి, జాలరి, కోమటి, దొంగ మొదలగు వివిధ కులవృత్తులకు సంబంధించిన పాత్రలును గలవు. రాజపాత్రాదుల చిత్రణమునఁ దగిన సహజత్వము,

నుదాత్తతయుఁ గొఱవడినను నీచపాత్రలే నిసర్గ మనోజ్ఞముగాఁ జిత్రింపఁబడినవి. ఆయాపాత్రల సంభాషణలలోని తెలంగాణా తెలుగు వ్యవహారము నుడికారము గమనింపఁదగినది.

ఈ కృతులన్నిట సామాన్యముగాఁ గనిపించు రచనావిశేషములు:— తాళప్రధానములైన దరువులు, ద్విపదలు, పద్యములు, వచనము, కొన్నిట కందార్ధములు, ఏలలు, తోహారాలు మొదలగునవియుఁ గలవు. దరువులలో బాత్రలు తెరవెడలు దరువులునున్నవి. సంధివచనములేకాక సూటియైన సంవాదాత్మక వచనములును సమృద్ధిగాఁ గలవు. కొన్ని గ్రంథాంతములందు కవిగద్య గలదు. అన్నిట రచన సాధ్యమైనంతమట్టునకు సలక్షణముగనే సాగినది. లేక సలక్షణముగా రచించుటయే కవి లక్ష్యమనవచ్చును. కాని సామాన్య సామాజికుల నుద్దేశమునందుంచుకొని కాఁబోలు కవి సరళశైలిఁ బాటించెను. అది పేలవత్వము కాని సారళ్యము. వీనిలోఁ దప్పులేరి చూపుట కవకాశ మున్నను తెలంగాణమంతట వీరి యక్షగానములకు గొప్ప "చలామణీ" గలదు. అన్ని యక్షగానముల నింత వైవిధ్యముతో రచించిన భాగయగారికి యావత్తెలంగాణా యక్షగాన కవులలో నొక విశిష్టస్థాన మేర్పడఁగలదు.

---

32. మహమ్మదు అబ్దుల్లా

హనుమద్రామ సంగ్రామము:

(చందా వారి ప్రచురణ, 1954.)

కవి శేకుల సోమవరగ్రామ వాస్తవ్యుఁడు. చెర్వీరాల భాగయ్య గారి ప్రియశిష్యుఁడు. గ్రంథ విషయము ప్రసిద్ధము. శ్రీరామ విజయ

మనియుఁ బేర్కొనఁబడిన దిది. విశ్వామిత్రునకుఁ బ్రత్యేకముగా నమస్కరింప నేమఱిన యయాతి నిమిత్తము రామాంజనేయులకు యుద్ధము జరుగుట యిందలి కథ. కవి దీనిని యక్షగాన మని పేర్కొనినాఁడు. గురువుగారి గ్రంథముల ఫక్కిని నడిపినాఁడు రచన. తప్పులున్నవి. కాని తెనుఁగు మాతృభాషయైన కవి రచించినట్లే రచించియుండుట విశేషము. అసలొక మహమ్మదీయుఁడు తెనుఁగున యక్షగాన రచన మొనరించి యుండుటే విశేషము.

---

33. శ్రీ పెరుంబూదూరి వెంకట నరసయ్య

ఈయనకు అయ్యావారు వెంకటనరసయ్య యనియు వ్యవహారము గలదు. ఈతని తండ్రి వటపత్రశాయి. తమ్ముఁడు వెంకటకవి. వీరి నివాసము బూరుగుపల్లి. వీ రిరువురను బూరుగుపల్లి సోదరకవు లందురు. ఇరువురును వేర్వేఱ తెలంగాణలో వివిధ గ్రామవాసులగు సంపన్నుల ప్రోత్సాహమున ననేక యక్షగాన ప్రాయనాటకములను రచించినారు. ఇరువురును జీవత్కవులని వినికిడి.

అందు వెంకట నరసయ్య కృతులు:

1. అనసూయా నాటకము:

(వరదవెల్లి దత్తాత్రేయస్వామి కంకితముగాఁ జెప్పినది. ప్రచురణ, కొండా శంకరయ్య, సికింద్రాబాదు, 1939)

రచనాబ్దము శ్రీముఖ యఁట. ఇది 1936 కావచ్చును. ఇందలి వస్తువు ప్రసిద్ధము. ఇందు సుమతీ చరిత్రము గూడఁగలదు.

2. కనకతార : (చౌలమద్ది. కొండా, 1950)

దీనిపై గ్రంథకర్త గ్రంథసర్వాధికారములు ప్రచురణకర్త కిచ్చుచు నొక ప్రకటన చేసి యుండెను. గ్రంథవిషయము ప్రసిద్ధము. రచన విక్రమ – 1940 కావచ్చు.

3. కిష్కింధా కాండ నాటకము :

(హనుమాజి పేట. కొండా – 1938) రచన ఈశ్వర – 1937 కావచ్చు.

ప్రసిద్ధేతి వృత్తము.

4. చంద్రగుప్తనాటకము : (తక్కెళ్లపల్లి. కొండా, 1939)

రచన :– బహుధాన్య – 1938. ఇందలి చంద్రగుప్తుడు మగధేశ్వర పుత్రుండేకాని మౌర్యచంద్రగుప్తుడు గాడు. ఇతడు మీనాంక రాజపుత్రిని భ్రమరవేణినిఁ బెండ్లియుంకువ యగు హిమాలయస్థమణి నొకదానిని దానిని గాపాడు రాక్షసిని సంహరించి తెచ్చి వివాహమాడిన కథ యిందు వర్ణితము. ఈకథ శ్రీకృష్ణబోధామృతమునుండి గ్రహింపఁబడిన దఁట. (ఇందు కవి గ్రంథప్రచురణ కర్తృప్రశంస చేసియుండెను).

5. డాంగేయోపాఖ్యానము : (బన్నాజిపేట, చందా నారాయణ శ్రేష్ఠి, సికింద్రాబాదు, 1950. దీనిపై "గ్రంథకర్తవలన కాపీరైటు హక్కులనుపొందియున్నా" మను ప్రకాశకుల ప్రకటన గలదు).

గ్రంథనామము చిత్రమైనది. ఇతివృత్తము చిత్రమైనది. దుర్వాస శ్శాపమున హయమైన గంభ నిమిత్తముగా, నారదుని కైలాటము కారణముగా డాంగేయుఁడను రాజునకు శ్రీకృష్ణునకును బట్టుపంతములు గల్గినవి. డాంగేయుఁడర్జునుని శరణు జొచ్చును. కృష్ణుఁ డొక

వంక నొకవంక బొండవపక్షమున హనుమద్భీమ దుర్యోధనులును హయమునకై పెనుగులాడగా నది రంభ యగును. మూడున్న అ వజ్రములు ముట్టినంత శాపముదీఱునని దుర్వాసునివాక్కు. బలసంప దలో గృష్ణ హనుమద్భీములు వజ్రముల వంటివారు. దుర్యోధనుడఱవజ్రము. ఈకథయే యలతిమార్పులతో బాగేపల్లి అనంతరామాచార్యులచే హరికథగా రచింపబడినది. గయోపాఖ్యాన చిత్రభారత కథ లీ కథోపస్థితికి మూల భూతములై నట్లు తోచును.

6. మార్కండేయో పాఖ్యానము: (గరిశకుర్తి. కొండా, 1950)

ఇందు మార్కండేయుడు శంకరునిచే జిరంజీవత్వ వరమును బొందుటయేకాక పిదప బెండ్లిలేకయే యజ్ఞముచేసి హోమకుండము నుండి పుత్రులను బడయుటయు, వారియుదంతమును గొంత గలదు.

7. శశిరేఖా పరిణయము: (మానాలపురి కొండా, 1954)

కథ ప్రసిద్ధము.

8. శ్రీకృష్ణ తులాభారము: (స్తంభంపల్లి, కొండా, 1949)

కథ ప్రసిద్ధము.

9. సతీ సావిత్రీ పరిణయము: (మర్లపేట. కొండా, 1950)

కథ ప్రసిద్ధము. రచన:— 1949.

10. సుగుణవతీ నాటకము: (గోపాలరావుపేట, కొండా, 1954)

రచన 1932. గురునిచే గోరఁబడి, పతిచే ననుమానింపఁబడి, యడవిఁబట్టి యొకచోరుని బారినుండి తప్పించుకొని, పురుషవేషము

దాల్చి యొక దేశమున కేలికయై యొక సత్రశాలకడఁ దనచిత్రపటము పెట్టి యాముప్పురిని సంఘటితపఱచి నింఱసభలోఁ దన నిర్దోషత్వము నిరూపించి పతిచే స్వీకృతయైన పతివ్రత సుగుణావతియను రాజపుత్రి చరిత్ర మిందు వర్ణితము. ఇది చెర్కలాల భాగయగారి కాంతామతి కథను బోలినది.

పైకృతులన్నియు నాటకములని మాత్రమే పేర్కొనఁబడినవి. ప్రతికృతి ప్రారంభమునను దేవతాస్తుత్యనంతరము నటీసూత్రధారులచే సక్రమమైన ప్రస్తావన కలదు. అంత మాత్రమే సంస్కృత నాటకాను కరణము. ఆధునిక నాటకములందువలె సంధివచన విరహితముగా (కుండలీ కృతసూచనలతో), సూటిగా, వచనప్రకృష్టముగాఁ బాత్రల సంభాషణలు సాగినవి. కాని యదియు నొకపాటి యనుకరణము మాత్రమే. వీనిలో సంకరంగవిభాగము లేదు. ముఖ్యపాత్రలు ప్రవేశింపఁగనే స్వవిషయము నుగ్గడించుట గలదు. ప్రతిపాత్రయు సంభాషణలో ముందొక చిన్నదరువు నెత్తుకొని, వెంటనే యందలి యర్థమునే యొక చిన్నవచనమున విశదీకరించుట యీనాటకముల ప్రక్రియలోని ముఖ్యలక్షణము. ఒకపాటి పెద్ద దరువులందెల్ల చివర ముద్రయుండును. వెంకట సరసయ్యవారి నాటకములను బ్రపరిణతవీధి నాటకము లనఁ జెల్లును. అందు కనకతారా శశిరేఖాది నాటకములు "స్వదేశీ" నాటకములని పేర్కొనఁబడి యుండుట జూడ నాయభిప్రాయము సమంజసమనిపించును. ఇతని కృతులలో ముఖ్యములైన రచనాంగములు దరువులు, వచనములు, పద్యములు, కవి తనకుఁదెలిసినంతలో సలక్షణముగనే రచింపఁబ్రయత్నించెను, గాని దోష బహుళముగా నున్నవి కృతులు. అయినను నన్నియు బ్రదర్శనోచిత ప్రక్రియా ప్రకృష్టములుగ నున్నవి.

---

34. శ్రీ పేరుంబూదూరి వెంకటకవి

ఇతఁడు మాఁదఁ బేర్కొనబడిన వెంకటనరసయ్యవారి సోదరుఁడు. ఇతని కృతులు :—

1. **రుక్మాంగద నాటకము** (చిట్టాపురి, చందా, 1934)
2. **పుత్రకామేష్టియాగము** (మ్యాడంపల్లి, కొండా, 1936)
3. **ధాన్యమాలినీ చరిత్రము** (నామాపురి, కొండా, 1950)
4. **సుందర కాండము** (తక్కెళ్ళపురి, కొండా, 1953)
5. **ప్రహ్లాద నాటకము** (బూరుగుపల్లి, కొండా, 1955)

ఇవి యన్నియుఁ బ్రసిద్ధ పౌరాణికేతివృత్తములు. వీని ప్రక్రియ వెంకటనరసయ్య గ్రంథములకు మిక్కిలి సన్నిహితముగా నున్నది. అన్నగారి రచన కంటె తమ్మునిదే మేల్తరమైనది.

---

35. కాసాల బలరామయ్య

నళినీదేవి ప్రభావము : (మణూరు. చందా, 1950)

కవి విశ్వబ్రాహ్మణుఁడు. శ్రీముఖ గోత్రజుఁడు. బ్రహ్మనందాచార్య శిష్యుఁడు. రాగమాంబా రాజయాచార్యుల పుత్రుఁడు. మెదకు జిల్లా చూచనపల్లి నివాసి. గ్రంథరచనాకాలము విభవవై శాఖ శు. ౬. గురువారము. ఈ విభవ 1928 కావచ్చును. గ్రంథ విషయము

మౌద్గల్యమునిపత్నియు మహా పతివ్రతయు నగు నళినీదేవి చరిత్రము. ఇందు దరువులు, పద్యములు, ద్విపద, సంధివచనములు గలవు. సంవాద ప్రాచుర్యము గలదు. పాత్రలు స్తోత్రపూర్వకముగా స్వవిషయో ద్ఘాటనముతో దెరవెడలు దరువుతో ప్రవేశించుట చెప్పఁబడినది. గ్రంథము యక్షగానమని పేర్కొనఁబడినది. రచన నీరసమైనది.

---

36. జిల్లా వెంకటపసు

వెంకటరావుపేట నివాసి. మార్కండేయసగోత్రుఁడు. నరసమాంబా రాజయల పుత్రుఁడు. కోదండరామయ్య శిష్యుఁడు. ఇతఁడు 1939 లో చందా నారాయణ సెట్టి ప్రచురించిన గాజుల స్వామిదాసు స్వరోచ్యుపాఖ్యాన వీథి నాటకమునకుఁబఠిష్కర్త. ఆధునికుఁడనుట స్పష్టము. ఇతని కృతులు :— మురనరకాసుర వధ, కంసమర్దనము (రెండును కొండా వీరయ ప్రచురణలు (1950, 1952). రెండును యక్ష గానములని పేర్కొనఁబడినవి. చందా వారి ప్రచురణ (సం. 1949) యగు వెంకటరావుపేట చిరుతొండనాటకము, శ్రీ రామలింగప్రతిష్ఠ అను వీథి నాటకముగూడ నితనివే. నాల్గింటఁ గీర్తనలు, ద్విపదలు, పద్యములు, సంధివచనములు, పాత్రల తెరవెడలు కీర్తనలు, స్వవిషయోద్ఘాటనములు, సంవాదములును గలవు. రచన నిర్దుష్టముగాకపోయినను నీరసమైనది కాదు.

---

37. అణ్ణాచార్యులు

మండోదరీపరిణయము:

ఆపస్తంబ సూత్రుఁడు. శ్రీవత్సగోత్రుఁడు. కృష్ణయజుశ్శాఖ. తల్లి రంగనాయకమ్మ. తండ్రి చిటిగిద్దెమఠం తెన్నరంగంపొన్నడి. ఇతని యక్షగానకృతి మండోదరీ పరిణయము. (చందా నారాయణ సెట్టి ప్రచురణ, సం. తెలియదు). కిచ్చనపల్లి వెంకటేశ్వరున కంకితము. కృతి ప్రోత్సాహకులు మెదకుజిల్లా అందోలుతాలూకా చింతకుంటగ్రామ వాస్తవ్యులు (పదునెనమండ్ర వేళ్ళు గలవు). గ్రంథ రచన సం. సర్వధారి. ఇది 1948 కావచ్చును. గ్రంథ విషయము గోకర్ణక్షేత్ర మాహాత్మ్యాంతర్గతమైన మండోదరీ రావణుల పరిణయ కథ. ఇందు తెం దరువులు, సంవాదపు దరువులు, ద్విపదలు, ద్విపదార్ధములు, పద్యములు, అర్ధ పద్యములు, సంధి వచనములు గలవు. రచన యొకింత చక్కనిదే.

---

38. అంబేదరాజవీరప్ప

దుందిగల్ జిల్లా రాయగీరు తాలూకా గౌరాయపల్లి నివాసి. చండికాంబా శరభలింగముల పుత్రుఁడు. ఇతఁడు కేదారేశ్వర వ్రతము, భీష్మ విజయము, గజేంద్ర మోక్షము, మదన శేఖర విలాసము, భక్తసానంద, మార్కండేయ వజ్రకల్పన, సత్యనారాయణ వ్రతము, బ్రహ్మంగారి చరిత్రము, మల్లన్న చరిత్రము – అను తొమ్మిది యక్షగానములు రచించినట్లు 1949 లో కొండా శంకరయ్య

ప్రచురించిన యీతని మల్లన చరిత్ర వెనుకట్లపై గల పట్టికవలనఁ దెలియుచున్నది. అందు కృతి ప్రోత్సాహకులు నీతఁడును దీయించు కొన్న ఛాయా చిత్రము గూడ ముద్రితమైయున్నది. దీనినిబట్టి కవి యాధునికుఁడనుట స్పష్టము. ఇపు డీయన మల్లన చరిత్రము మాత్రమే లభ్యమైనది. ఇం దీశ్వరాంశసంభూతుఁడైన కొల్లాపురి మల్లన శివ కంచికిఁ బ్రభువైన యొక జానపద గాథ వర్ణితము. ఇందు దరువులు, తెర దరువులు, ద్విపదలు, పద్యములు, అర్ధపద్యములు, సంధి వచన ములు మొ. గలవు. రచన దోషదుష్టము. నీరసము.

---

39. అవధూత మల్లయ్య

సత్యనారాయణ వ్రతము: (ముద్రణ: వాణీ ము. శా., 1949)

కవి పద్మశాలి. రాఘవయ్యపుత్రుఁడు. లింగయార్యుని శిష్యుఁడు. మేడిచల్ తాలూకా కానుకుంట వాస్తవ్యుఁడు. ఈతని గ్రంథమున "ఈయక్షగానమును గ్రంథకర్తగారి అనుమతి లిఖిత పూర్వంగా పొందనిది పునర్ముద్రణము చేయించువారు మేము తీసు కొను చర్యలకు బాధ్యులగుదురు" అని యొక ప్రకటన గలదు. అందుచే నితఁ డాధునికుఁ డనుట స్పష్టము. గ్రంథవిషయము ప్రసిద్ధమైన స. నా. వ్రతకథ. ఇది యైదధ్యాయములుగా విభజింపఁబడి యుండుట విశేషము. ఇందు దరువులెక్కువ. తెరదరువులును గలవు. కొలది పద్యములు, నర్ధపద్యములు నున్నవి. సంధి సంవాద వచనములు గలవు. రచన యొక మోస్తరు.

40. మూటకోడూరు గోపయాచారి

పాలన చోళమహారాజు చరిత్ర: (చందా, 1949)

కవి చుంచనకోట పురవాసి. మణిభద్ర బ్రహ్మర్షి గోత్రజుఁడు. కాత్యాయన సూత్రుఁడు. వెంకమాంబా రామదాసాచార్యుల పుత్రుఁడు. ఇతని గ్రంథరచనాధోరణి యాధునికముగా నున్నది. రచనాబ్దమును సర్వధారిఫాల్గుణముగాఁ బేర్కొనెను. అది 1949 కావచ్చు.

గ్రంథవిషయము:— పాలన చోళమహారాజపత్నికిఁ బుత్రిక కలుగునని రాజగురువు చెప్పును. పుత్రుఁడని మంత్రి వాదించును. మంత్రసాని సాయమునఁ బురుటింటి రాచ యాడుబిడ్డనుగానిపోయి యొక యొడ్డెర్ల మగబిడ్డనుంచును. కొంత కాలమునకు రాజు వానికిఁ బట్టాభిషేకముచేసి విశ్వబ్రాహ్మణులను రాజసంరక్షులుగానుంచి మేగుగిరియాత్రకుఁ బోవును. కలుషాత్ముఁడగు మంత్రిమాటలు విని చిన్న రాజు విశ్వబ్రాహ్మణులను జిత్రహింసలు పెట్టును. వారు పెద్దరాజు కడకుఁబోయి మొఱ పెట్టుకొనిరి. అతఁడు వారినొక 'బహుమూపుల' మేళముగా "బనాయించి" నచ్చి రాజపత్ని కోరికపైఁ బాలనచోళ రాజు వాలకము తానే ధరించి చిన్నరాజును, మంత్రినిఁ దెగటార్చి మఱల రాచఱికము స్వీకరించును. ఇది యిందలి కథ. గ్రంథము యత్నగానమని పేర్కొనఁబడినది. ఇందు కరువులు, పాత్రలు తెర వెడలు దరువులు, సంధి–సంభాషణ వచనములు కొలఁది పద్యములు, కందార్ధములు, ద్విపదయుగలవు. గ్రంథారంభమున రంభోర్వశుల రాకగలదు. రచన యొక మోస్తరు.

---

41. పనుస హనుమద్దాసు

ఈయన నిజామాబాదుజిల్లా మానికబండారం నివాసి. నాభిళ్ళగోత్రోద్భవుఁడును, ఇమ్మడిసెట్టి కులభూషణుఁడు నగు లక్ష్మయ్య పుత్రుఁడు. బందలింగంపల్లి అబుల్‌కరీందాసుని శిష్యుఁడు. 1950 లో కొండావీరయ్య (సికింద్రాబాదు) ప్రకటించిన యీతని బాలనాగమ్మ నాటకముపై గ్రంథస్వామ్యమును ప్రకటనకర్త కిచ్చుచు నితఁడు చేసిన ప్రకటన ముద్రితము. ఈతఁడాధునికుఁడనుట స్పష్టము.

ఇతని కృతులు :—

1. మదనసేన నాటకము: (నగరఫురి. చందా, 1945)

రచన చిత్రభాను – 1942. చంపకయను కులట మదనసేనుఁడను రాజునకు వలపుకత్తెయై తనభర్తను దానేజంపి, రాజకుటుంబమును దురవస్థ పాలుచేయుటయు, నామెభర్త భూతమై యామె ప్రయత్నముల కడ్డుపడుటయు, రాజకుటుంబము స్వస్థత బొందుటయు ననుకథ యిందు వర్ణితము.

2. బాలనాగమ్మ నాటకము: రచన స్వభాను – 1943.

3. హనుమద్రామ సంగ్రామము: రచన తారణ – 1944.

4. (పోతులూరి) వీరబ్రహ్మంగారినాటకము: (నూకలూరు)

2, 3, 4 — కొండా వీరయుచే వరుసగా 1950, 51, 52 సం. లలోఁ బ్రచురితములు. మూఁడును బ్రసిద్ధేతివృత్తములు. హనుమద్దాసు కృతులన్నిటఁ బ్రారంభమున నటీసూత్రధారుల ప్రస్తావన గలదు. ఆధు

నిక రంగస్థలనాటకానుకరణమును సమృద్ధిగా గలదు. యవనికావ తరణరంగ ప్రయోగ సూచనలు గలవు. అయితే కొన్ని పాత్రలు ప్రవే శించినంత స్వవిషయమును జెప్పుట, దరువుల ప్రాచుర్యము వానిలో ముద్రలుండుట మొ. వానినిబట్టి వీటిలో మూలికమైన వీధినాటకము స్వరూపము గొంత తేటపడగలదు. రచన దోషభూయిష్ఠము.

42. పట్టోరి వీరప్ప

ఇతడు గుల్బర్గా బీదరజిల్లా సంగ రెడ్డితాలూకా హొట్టిపల్లి మూలివతన్‌దారు బక్కప్పరాయుని పుత్రుడు. ఇతని కృతులు మన్మథ సంహారము, క్రోధాపురి రైతు విజయము. (రెండును 1953 లో చందా నారాయణ సెట్టి (సికింద్రాబాదు) చే ప్రచురితములు). రెండవ దానిలోని ప్రారంభమున మహాత్మగాంధీ, భారత మాతృస్తుతులు గలవు. కవి యీ గ్రంథనికుడనుట స్పష్టము. దాని గద్యలో నది వికృతి సం. న రచింపబడినట్లు గలదు. అది 1950 సం. కావలెను.

మన్మథ సంహారమున నితివృత్తము ప్రసిద్ధమైనది. అది యక్ష గానమనియు వీధి భాగవత మనియు బేరొక్కనబడినది. రెండవ దానిలో గ్రంథ నామమే సూచించుచున్న ట్లితివృత్త మత్యం తాధునిక మైనది. క్రోధాపురిరైతగు కోటారెడ్డి కుటుంబము నొక జమీం దారు, పాపాలుకాపు తురకట్టింప యత్నించి తుదకు వాకే గతించి రైతుకే విజయము లభించిన కథ యది. ఇది వీధి నాటకమని పేరొక్కనబడుటయు, నిందు నటీ సూత్రధారుల ప్రస్తావనయు, అంక

రంగ విభాగము నుండుట విశేషము. రెండు గ్రంథములందును బాత్రలు ప్రవేశించునప్పుడు స్వవిషయమును జెప్పుకొనుటయు, సంధి వచనములు, సంవాదవచనములు, ముద్రలతో దరువులు, పాటలు, కందార్ధములు, పద్యములును గలవు. రచన దోష బహుళమేకాని దాని ధోరణిలో నది బాగుగనే యున్నదనవచ్చును.

---

43. ఆడెపు గోపాల్‌దాసు

కవి నివాసము మెదక్ జిల్లా గజవెల్లి తాలూకా అమదీపురము. ఇతని హరిశ్చంద్ర కృతి ప్రోత్సాహకుడు మేరుగు దుర్గయ్య. దుర్గయ శిష్యుడగు మంచాల నర్సయ్య ముద్రణ ప్రోత్సాహకుడు. కొండా శంకరయ్య 1953 లో ప్రచురించిన యీ గ్రంథమున గురు శిష్యుల ఛాయాచిత్రము గలదు. కవి యాధునికుడనుట స్పష్టము. పై కృతిలో హరిశ్చంద్ర చంద్రమతీ పరిణయము స్కాంద పురాణోక్త ప్రకారము రచింపబడినది. ఇది నాటకమని వేరొక్కనబడినది. ఇందు నటీ సూత్ర ధారుల గ్రంథ ప్రస్తావన గలదు. ఇతనిదే "సతీ తులసి యక్షగాన" మను నింకొక కృతి గలదు. (సికింద్రాబాదాంధ్ర గ్రంథమండలి ప్రచురణ, 1951). రెండిటను బాత్రల స్వవిషయోద్ఘాటనము, సంధి వచనములు, దరువుల ప్రాచుర్యము మొదలగు యక్షగాన లక్షణములు గలవు. రచన యొకమోస్తరు. ప్రయోగ సౌలభ్యము గలది.

---

44. ఆడెపు నారాయణదాసు

సుగ్రీవ విజయము :

ఇతఁడాదిలాబాదు వాస్తవ్యుఁడు. ఇతని సుగ్రీవ విజయము య. గా. కృతి ప్రోత్సాహకుఁడగు చందా నారాయణ శ్రేష్ఠియే దీనిని 1953 లోఁ బ్రచురించెను. కవి యాధునికుఁ డనుట స్పష్టము. ఇందు గ్రంథారంభమున గణపతి సరస్వతులును బాత్రలవలెఁ బ్రవేశించి స్వవిషయమును జెప్పుకొనుట గలదు. దరువులు, ద్విపదలు, పద్యములు, సంధి - సంభాషణ వచనములు గలవు. రచన యొక మోస్తరు. ఇది వేములవాడ రాజరాజేశ్వరున కంకితము.

---

45. వానమామల నరసింహ దాసు

బలిచక్రవర్తి చరిత్రము :

ఇతఁడు నర్సిపూర్ తా. పెదగొల్లపల్లికి నివాసి. వైష్ణవుఁడు. మంగమాంబా కృష్ణయ్యల పుత్రుఁడు. ఇతని యాశ్రితుఁడగు కృతి బలిచక్రవర్తి చరిత్రము. 1955 లో దానిని బ్రచురించిన చందా నారాయణ శ్రేష్ఠియే కృతి ప్రోత్సాహకుఁడు నైనట్లిం దతని ప్రశంస గలదు. (చూ. పు. 7) కవి యత్యంతాధునికుఁడనుట స్పష్టము. ఇందు కైర - సంవాదపు దరువులు, సంధి - సంభాషణ వచనములు, ద్విపదలు, కొలఁది పద్యములు గలవు. రచన యొక మోస్తరు.

---

46. గడిదె కృష్ణదాసు

శంబరాసురవధ:

ఇతఁడు శంబరాసురవధ యను య. గా. ప్రబంధమును రచించెను. 1951 లో దీనిని ప్రకటించిన కొండా శంకరయ్య గ్రంథస్వామ్యమును గ్రంథకర్త వలనఁ బొందిన ట్లొక ప్రకటన గ్రంథమునఁ గలదు. ఇందు దరువులు, పద్యములు, అర్ధపద్యములు, సంధి వచనములు గలవు. గ్రంథారంభమున గణపతివేషము, రంభోర్వశులరాక, ద్వారపాలకుని పృచ్ఛలు, పాత్రల తెర లోపలి దరువులు, తెర వెడలు దరువులు, సంవాదములును గలవు. రచన యొకమో స్తరు.

---

47. మోర మల్లేశము

అల్లీరాణి చరిత్రము:

ఇతనిది గట్టమల్యాల. ఇతని య. గా. కృతి అల్లీరాణి చరిత్రము - కొండా శంకరయ్య ప్రచురణ, సం. 1955. గ్రంథకర్త గ్రంథమును "అచ్చు వేయించిన" మెదక్ జిల్లా అంకిరెడ్డిపల్లె సుదర్శనమను వస్త్ర వ్యాపారినిఁబ్రశంసించి యున్నాఁడు (పుట 11). ఇతఁ డాభు నికుఁడనుట స్పష్టము. చెర్విరాల భాగయగారీగ్రంథ పరిష్కర్త. ఆయన రచించిన అల్లీ అర్జున చరిత్ర య. గా. కథయే యిందును గలదు. ఇందలి ప్రక్రియ యుపరిగ్రంథమును బోలినది. అక్కడక్కడ వచనములోను పాత్రల సంభాషణలు గలవు. రచన యొకమో స్తరు.

అనుబంధము

(3)

తెలంగాణా యక్షగానములు

ఈ క్రిందఁ బేర్కొనఁబడిన గ్రంథముల రచనా కాలము నిర్ధరించి చెప్పుట కాధారములు గన్పట్టుట లేదు. కాని రచనా ధోరణిని బట్టి యివియన్నియు నత్యంతాధునికము లై యుండునని తోఁచుచున్నది.

(అ) యక్షగాన నామాంకితములు — తత్కర్తృ విషయము :—

1. మైరావణ చరిత్ర :- (ప్రచురణ:- అ. డై. ప్రెస్సు. 1924, చందా, 1951.)

కర్త కొల్తూరు పురుషోత్తమ కవి. విష్ణువర్ధన గోత్రజుఁడు. ప్యారావరము. ఇందు ద్వారపాలకుని పృచ్ఛలు, పాత్రల తెరద్విపదలు, తెరవెడలు దరువులు, సంధివచనములు పద్యములు మొ॥ గలవు. అప్రశస్త రచన.

2. కాళీయమర్దనము : (కొండా, 1932)

3. సావిత్రీపరిణయము : (కొండా, 1950)

4. లక్ష్మణోపరిణయము : (చందా, సం. ?)

చుక్కాపురి నరహరి ముద్రగలవి.

కర్త :— వేల్పూరి నరసింహ కవి.

ఇందు సావిత్రి, లక్ష్మణ (దుర్యోధన పుత్రి) పరిణయ గ్రంథారంభము లందు "గంధర్వస్త్రీల రాకడ" గలదు. మూడింటఁ బాత్రలు

తెరవెడలు దరువులు, తెర ద్విపదలు, సంధి వచనములు, పద్యములు మొ. గలవు. రచన యొకమో స్తరు.

5. మా యా ప్రకృతి పురుష లీల : (చందా, 1933)

కర్త నాగన్నగారి భీమనార్యుఁడు. మెదక్ జిల్లా చెన్నగణ పురవాసి. కౌండిన్యసగోత్రుఁడు. రామచంద్రయోగిగారి శిష్యుఁడు. వెంకటరాజయోగిని, పరవసు తిరువేంగళ దేశికుని స్మరించినాఁడు. గ్రంథవిషయము వైదాంతికము. ప్రబోధ చంద్రోదయాదుల చాయ నడచినట్టిది. ప్రక్రియ పై గ్రంథములఁ బోలినది నాటక మనియుఁ బేర్కొనఁబడినది. అంత ప్రశస్తరచన కాదు. ఈ భీమనార్యుఁడు తారా శశాంక విజయమును యు. గా. ను కూడ రచించె నఁట. అది యలభ్ధము.

6. భద్రా యూ పా ఖ్యా న ము : (చందా, 1943)

కర్త :— కృష్ణకవి. కనుసానిపల్లి. శైవబహ్మ్మకుల సంజాతుఁడు. తలి దండ్రులు రామమ్మ, అంకయ్య. ఈతని భద్రాయూపాఖ్యాన కథ బహ్మోత్తరఖండము నుండి గ్రహింపఁబడినది. ప్రక్రియ పై గ్రంథములను బోలినది. రచన అప్రశస్తమైనది.

7. బభ్రువాహన చరిత్ర : (కాల్వపుటి, చందా, 1950)

కర్త :— పరవస్తు రంగయ్య, కూనుగ్గిరి నివాసి. పొన్న మాంబా లక్ష్మయ్యల పుత్రుఁడు. మయూరగిరి శరగోపాచార్యుల శిష్యుఁడు. గ్రంథ విషయము జైమిని భారతాశ్వమేధ పర్వమునుండి గ్రహింపఁబడినది. గ్రంథారంభమున రంభోర్వశుల రాక చెప్పఁబడినది. ప్రక్రియ పై గ్రంథములను బోలినది. రచన యొకమో స్తరు.

8. అంబరీషోపాఖ్యానము: (చందా, 1951)

కర్త:— గుండోబొదాసు. గుడికెంసుల పురము. ప్రక్రియ ఉపరి గ్రంథవత్. ప్రశస్త రచనకాదు.

9. కుమారస్వామి వివాహము: (చందా, 1951)

గ్రంథకర్తపేరు పైని తొడుపునూరి విఠోబాయనియు లోపల మక్తారాజ లింగకవి యనియుఁగలదు. రాజలింగకవియే గ్రంథకర్తయె యుండును. ఇతఁడు మెదక్ జిల్లా చంద్రపేట నివాసి. రాజమాంబా రామలింగేశ్వరుల పుత్రుఁడు. గ్రంథారంభమున రంభోర్వశుల రాక చెప్పఁబడలేదు గాని కడమ ప్రక్రియ యుపరి గ్రంథములను బోలినది. రచన యప్రశస్తమైనది.

10. బాలనాగమ్మ చరిత్ర: (కొండా వీరయ్య, 1953)

పోచవరపురీశున కంకితము. గ్రంథకర్తపేరు తెలియదు. ఇందలి పాత్రల హిందీ ప్రసంగములను బట్టి యూహనికుఁడని యూహింపఁదగును. ప్రక్రియ పై గ్రంథములను బోలినదే. సంధివచనములే కాక సంభాషణ వచనములును గలవు. గ్రంథారంభమున రంభోర్వశుల రాక చెప్పఁబడినది. రచన యొక మోస్తరు. (కొండా శంకరయ్య ప్రచురణ మొక బాలనాగమ్మ చరిత్ర య. గా. గలదఁట. అది ఎడ్లంబుచ్చి దాస కృత మఁట. అదియు నిదియు నొకటో కాదో తెలియదు).

11. చంద్రహాసచరిత్ర: (చందా, 1953)

వేముల రాజేశ్వరున కంకితము. గ్రంథకర్తపేరు తెలియదు. 1953 సం. న నున్న ఆడెపు నారాయణదాసు తన సుగ్రీవ విజయ

య. గా. ను వేములవాడ రాజేశ్వరునకే యంకిత మిచ్చెను. ఈచంద్ర హాస చరిత్రయు నతనికృతియే యగునా ? ఆంధ్రనాటక కళాపరిషత్తు వారిపట్టికవలన సికింద్రాబాదు నివాసి రాజవీరయ్యయను నాతఁడు చంద్రహాస య. గా. ను రచించినట్లును, నది 1907 లోఁ బ్రచురిత మైనట్లును దెలియుచున్నది. అది యిదియేయగునా ? ఇందలి రచనా ప్రక్రియ ఆధునికముగనే కన్పట్టుచున్నది. రచన ప్రశస్తమైనది కాదు. చంద్రహాసకథ జైమిని భారతాశ్వమేధ పర్వమునఁ గలదు.

12. చెన్నకృష్ణవిలాసము :

కర్త :– గడ్డం రాజ బంగరురెడ్డి. (అముద్రితము. డా. శ్రీ. బి. రామరాజుగారికడ నొక ప్రతిగలదు).

13. కురవంజి :

కర్త :– నరసింహదాసుఁడు (గడ్డం నరసింహారెడ్డి యగునేమొ. అముద్రితము. దీనిప్రతియు డా. శ్రీ బి. రా. రా. గారి కడఁగలదు).

14. సౌందర్యవీరనాటకము :

కర్త :– కశేవరపు వీరభద్రయ్య. ముద్రితము (ప్రచురణ కర్తలు బచ్చువీరన్న, చిలుకా బాల్ రెడ్డి అండుకో, సికింద్రాబాదు, 1911)

15. వేదాంత జీవచంద్రమహారాజా నాటకము :

కర్త :– రామరాజు రాజయోగి. ముద్రితము. (బాలాత్రిపుర సుందరీప్రెస్, వరంగల్, 1937).

ఆ. యక్షగానములని కవులచే బేర్కొనబడక పోయినను నాథునికి తెలంగాణా యక్షగాన లక్షణములు సమృద్ధిగా గలిగి యట్లు వ్యవహృతములగుచున్న గ్రంథములు.

1. న ల చ రి త్ర : (దామరవంచ, చందా, 1935)

2. కూ చ కొ ం డ రా మా య ణ ము : (కొండా, 1943

(సుందరకాండ) క ర్త : గుజ్జరి యెల్లదాసు. వైశ్యుడు. అంత ప్రశస్తరచన కాకపోయినను గొంత ప్రచారముపొందినట్టిది. బ్రిటిషు మ్యూజియమ్ లైబ్రరీ కేటలాగులో ఎల్లదాసు యుద్ధకాండ మను య. గా. కలదు. అదియు నీతనిదే యగునేమో !

3. అ న సూ యా చ రి త్ర ము : (చందా, 1936, కొండా1938)

బీబీపేట గోపాలాంకితము. గ్రంథకర్త పేరు తెలియదు. నాటక మని పేర్కొనబడినది. రచన యొకమో స్తరు.

4. హ ను మ ద్వి జ య ము : (చందా, 1949)

నసుకంటి పురీశాంకితము. క ర్త : పరాంకుశదాసు. హను మంతుడు బలరామ గదుత్పంతులకు గర్వభంగము చేయుట యిందలి ప్రధానేతి వృత్తము. రచనయొక మో స్తరు.

5. పో తు లూరి వీ ర బ్ర హ్మ ం గా రి చ రి త్ర : (ఆంధ్ర గ్రంథ మండలి, 1950)

క ర్త :– నార సత్తయ్య. వాసాలమర్రి గ్రామవాసి. కృతి ప్రోత్సాహకుడు దత్తాయపల్లి వడ్ల సిద్ధయ. ఇది భాగవత మనియు, నాటక మనియు బేర్కొనబడినది. రచన దాని ధోరణి నది సరసము) గనే యున్నదని చెప్పవచ్చు.

6. గయోపాఖ్యానము: (చందా, 1954)

తారానగరేశాంకితము. కర్త శీలు సంగన. సంగన పుత్రుడు. వైశ్యుడు. రచన యొకింత సరసముగనే యున్నది.

7. చిరుతల లవకుశ నాటకము: (చందా, 1955)

కర్త :— నిజామాబాదు జిల్లా కామారెడ్డి తాలూకా, సదాశివ నగరి నివాసియగు విశ్వజ్ఞ వేంకటేశము. రచన యంతప్రసక్తమైనదికాదు. (ఈ చిరుతల నాటకములనునవి చిరుతల నాట్యమండలి యను నొకనాట్యమండలి వారిప్రదర్శనముల కొఱకై రచింపఁబడినవి).

ఇవికాక యక్షగాన ప్రక్రియ (పాత్రల స్వవిషయోద్ఘాటనము మొ॥) రవంత గలిగి నాటకములని వ్యవహృతములై తెలంగాణాలో నిటీవల వెలసిన రచనలు కొన్నిగలవు. ఉదా: కథలాపురం గంగాధర కవి చిరుతొండ నాటకము, శివకుమార నాటకము, రాజక్కపేట మూసధారి నాటకము, వేములగంటి శ్రీనివాస కవి సత్యహరిచంద్ర, ఈవబత్తిని నరసింహులు మదనవిజయము, గాజుల స్వామిదాసు స్వరోచ్యుపాఖ్యానము మొదలగునవి (ఇవి యన్నియు కొండావారిచేతను, చందావారి చేతను, ప్రచురితములైనవి). వీని రచనా ప్రక్రియ పనున హనుమద్దాసు, బూరుగుపల్లి సోదరకవుల నాటక కృతుల ప్రక్రియ కతినన్నిహితముగా నుండును. ఈయాఱింటను నటీ సూత్రధారుల ప్రస్తావన, ప్రయోగ సూచనలు, సంధివచన విరహితముగా వచనములోఁగూడ సూటిగా సంభాషణలు మొదలగు విషయములు సమానము. స్వరోచ్యు పాఖ్యానము వీధినాటకమని పేరొక్కనబడుటయు నందంక విభాగ ముండుటయు విశేషములు. ఈకలగాపులగపు ప్రాచ్య పాశ్చాత్య ప్రాచీనాధునాతన రంగస్థల వీధినాటక ప్రక్రియలో యక్షగానపుఁబాలు నెన్నవలసిన పనిలేదు.

పరిశిష్టము

కాలము తెలిసి యక్షగాన కవులు

కర్తృత్వము తెలిసి యక్షగానములు

8. అంబరీషోపాఖ్యానము: (చందా, 1951)

కర్త:— గుండోబొదాసు. గుడికెందుల పురము. ప్రక్రియ ఉపరి గ్రంథవత్. ప్రశస్త రచనకాదు.

9. కుమారస్వామి వివాహము: (చందా, 1951)

గ్రంథకర్తపేరు పైని తొడుపునూరి వీరోబాయనియు లోపల మక్కాంరాజ లింగకవి యనియుఁగలదు. రాజలింగకవియే గ్రంథకర్తయై యుండును. ఇతఁడు మెదక్ జిల్లా చంద్రపేట నివాసి. రాజమాంబా రామలింగేశ్వరుల పుత్రుఁడు. గ్రంథారంభమున రంభోర్వశుల రాక చెప్పఁబడలేదు గాని కడమ ప్రక్రియ యుపరి గ్రంథములను బోలినది. రచన యప్రశస్తమైనది.

10. బాలనాగమ్మ చరిత్ర: (కొండా వీరయ్య, 1953)

పోచవరపురీశున కంకితము. గ్రంథకర్తపేరు తెలియదు. ఇందలి పాత్రల హిందీ ప్రసంగములను బట్టి యూహునికుఁడని యూహింపఁదగును. ప్రక్రియ పై గ్రంథములను బోలినదే. సంధివచనములే కాక సంభాషణ వచనములును గలవు. గ్రంథారంభమున రంభోర్వశుల రాక చెప్పఁబడినది. రచన యొక మోస్తరు. (కొండా శంకరయ్య ప్రచురణ మొక బాలనాగమ్మ చరిత్ర య. గా. గలదఁట. అది ఎట్టుంబుచ్చి దాస కృత మఁట. అదియు నిదియు నొకటో కాదో తెలియదు).

11. చంద్రహాసచరిత్ర: (చందా, 1953)

వేముల రాజేశ్వరున కంకితము. గ్రంథకర్తపేరు తెలియదు. 1953 సం. న నున్న ఆడెపు నారాయణదాసు తన సుగ్రీవ విజయ

పరిశిష్టము

(1)

కాలము తేలని యక్షగాన కవులు – కావ్యములు

1. అక్కనామాత్యుడు:

బ్రాహ్మణుడు. భారద్వాజసగోత్రుడు. సరభాద లింగోజీ పుత్రుడు. ఇతని కృతి బాలకృష్ణలీలా విలాసము. (తం.స.మ.– కే. సం. ౬౬౬) సత్యా రుక్మిణుల సవతి మచ్చర మిందలి ప్రధాన విషయము. రచన యొకమోస్తరు. నాటకమని కోర్కొనఁబడినది. యక్షగాన ప్రక్రియ సమృద్ధిగాఁ గలదు. ప్రదర్శనోద్దిష్టమైనది.

2. అక్కయకవి :

శ్రీరామమంత్రిపౌత్రుడు. తిమ్మాయ దండనాథ పుత్రుడు. ఇతనికృతులు :– (1) భీమసేన విజయము (తం. స. మ. - సం 489-93 రాజమండ్రి అంధ్రేతిహాస పరిశోధనమండలిలో నొక యసమగ్ర ప్రతి గలదు) (2) కృష్ణవిలాసము (తం. స. మ., సం, 478. ప్రా. లి. పు. భాం. కన్నడ డి. నం. 1330 – పుట 7 లో గ్రంథాంత ద్విపదమాత్రము గలదు.) భీ. సే. వి. కథ – కీచకవధము. ఇందు తిక్కన రచన యనుకరింపఁ బడినది. కృ వి. న గోపికలతోఁ గృష్ణుని పోకిళ్ళు ప్రధాన విషయము. రెండును గడు ప్రశస్తరచనగల యక్ష గానములు. తాళప్రధానములగు దరువులతో దేశీయగీతి బంధ బహుళముగా నున్నవి. ప్రాచీనయక్షగాన ఛక్కిఁ దలఁపించు చున్నవి. కృ వి. న రచ్చతాళము, లఘుశేఖరము నను తాళవిశేష

ములు, అర్ధచంద్రికలు, ధవళము, రచ్చకేకులు, జంపె రేకులునుగలవు. భీ. నే. వి. న ఏలలు, అనువులు, త్రిస్తబకలును విశేషములు.

3. అనుమకొండవురుపోత్తముఁడు:

ఆత్రేయసగోత్రుఁడు. ఆదిశుక్లయజుశ్శాఖీయుఁడు. నివాసము చనుగొండ్లాపురము (కర్నూలు జి. రామల్లకోట తా.) ఇతని పితరుల తరములు:- భానయ, ఓబమ - రంగయ, వెంగమ - చినవెంగన - వెంగమ - కవి. ఇతని కృతి అంగజవిజయము. (ఆం. సా. ప. 34) సృష్టికాండమందు మన్మథునకుఁ గల ప్రాముఖ్య మిందు వివరింపఁ బడినది. ఇం దర్ధచంద్రికలు, చెంచ్చు. దరువులు తాళప్రధానములు. రచనయొక మోస్తరు.

4. ఆమనచర్లకోదండరామయ్య:

ఇతనికృతి విజయవిలాసము. (శ్రీనికేతన ము. శా., మదరాసు, 1870) ఇందలి కథాప్రణాళికకుఁ జేమకూర ప్రబంధ మొరవడి. కాని రచనలోఁ బ్రయత్నపూర్వకమైన యనుకరణము లేదు. ఇందు కొరవంజిపాత్ర విశేషము. కొరవంజి శబ్దమిం దెఱుకతచెప్పు సోదెకుఁ బర్యాయముగాఁ బ్రయుక్తమగుట యింకొక విశేషము. ఇందుఁ దాళప్రధానములగు దరువులు, అర్ధచంద్రికలు, నెక్కువ. రచన సరసమైనది.

5. అయ్యగారిపీరకవి:

కౌండిన్యసగోత్రుఁడు. ఉమ్మనామాత్య పుత్రుఁడు. వీరన పౌత్రుఁడు. వెంకట శివన్న కవ్రజుఁడు. ఇతనికి వెంకటుఁడను పితృవ్యుఁడు గలఁడు. ఇతని కృతి చిత్రాంగద విలాసము లేక ధర్మాంగద చరిత్రము (పా. లి. పు. భాం., ఆర్. నం. 417), మదరాసు విశ్వవిద్యాలయ ప్రతులు: 531, 699) ఈగ్రంథమున మల్కాపుర విశ్వే

శుఁడు, కూర్మనాథుఁడు స్తుతింపఁబడిరి. వేగావతి నది ప్రస క్తియొక చో గలదు. ఆయూరు నానది శ్రీకూర్మక్షేత్రము విశాఖ మండలమునఁ గలవు. ప్రా. లి. పు. భాం. ప్రతి విశాఖమండలమునుండి సంపాదింపఁ బడినది. కవి విశాఖ మండలమువాఁడు గావచ్చు. గ్రంథ విషయము ప్రసిద్ధమగు పాముపాట జానపదగాథ. గ్రంథము మూఁడాశ్వాసము లుగా విభక్తము. కవి "యక్షగాన మొనరింతు వేషముల్గట్టి జనులు పాడి వినుపింప" అని వక్కాణించినాఁడు. ఇందు పాత్ర ప్రవేశరంగ ప్రయోగసూచనలు, పాత్రల స్వవిషయ నివేదనము గలవు. 1800–1850 ప్రాంతపు రచనగాఁ దోఁచుచున్నది. రచన యొకింత రసవంత మైనదే.

6. వీ ను గ లూ రి పా ప రా జు :

వేఁగినాటి బ్రాహ్మణుఁడు. కాశ్యపసగోత్రుఁడు. గంగాచల మంత్రి పుత్రుఁడు. తొండూరు (కడప జి. పులివెందల తా.) ఇతని కృతి రుక్మాంగద చరిత్రము (వెస్టువార్డు ప్రచురణ, మదరాసు, 1937) ప్రకటన కర్తలు మాత్రమే యక్షగానమని పేర్కొనిరి. ఆప్రక్రియ యంతయుఁగలదు. గ్రంథారంభము నందలి "చోపుదారి వేషకథ", వచన సంభాషణలు మొ... విషయములు జూడ నాధునిక రచన యని తోచును. రచనాకాలము నశవత్సరముగాఁ బేర్కొనఁబడినది. అది 1856 కాని 1916 కాని కావచ్చును. రచన చక్కనిదే.

7. క త్తి వీ రా స్వా మి:

వాల్మీకి గోత్రజుఁడు. రామస్వామి పుత్రుఁడు. ఇతని కృతి హరిశ్చంద్ర నాటకము (జీవరత్నాకర ము. శా., మదరాసు, 1906, అ. ఢి. ప్రెస్సు, మదరాసు, 1924) ఇం దాస్థాన సంతోషి తెరలోని

పాత్రలను బల్కరించుట, పాత్రలు వచనమున సంభాషించుటయుం గలవు. ఆధునిక రచన యనవచ్చును. గౌరన శంకర కవుల ద్విపదలు పద్యములును గ్రహింపఁబడినవి. ఈకవి రచనయుఁ గొంతసరసమైనదే. గ్రంథము తిరువళ్లూరు వీరరాఘవున కంకితము.

8: కీర్తి మల్లప్ప:

ఇతని కృతి తులాభారమను పుణ్యక వ్రతము (వేఱుగాన ము. శా., మదరాసు, 1923) బూదూరి కేశవాంకితము. ఇందలి మ్మైదువల ముచ్చటలు గ్రంథముయొక్క యూహనికతను స్ఫురింపఁ జేయును. రచన యొక మోస్తరు. ఇది యక్షగానముగా స్త్రీల పాటగాఁ బేర్కొనబడినది.

9. కూరపాటి అమరలింగామాత్యుఁడు:

వీపూరి వీరభద్రేశ భక్తుఁడు. గూడూరి సిద్ధలింగయ శిష్యుఁడు. ఇతని పితామహులు అమర లింగయ్య, వీరమ్మ. తలిదండ్రులు శరభమ, పెదరామ లింగయ్య. చిన రామలింగయ, వీరయ్య, మల్లయ్య, వీర భద్రయ్య యను వారలితని పితృవ్యులు. అనుజుఁడు వీరయ్య. ఇతని కృతి పార్వతీ కల్యాణము (ప్రా. లి. పు. భా., డి. 1909). 3 ఆశ్వా సములు. ఇందు రగడ, నడలు, లఘువులు, అర్ధచంద్రికలు, రచ్చ రేకులు మఱ్ఱి రేకులు మొ॥ దేశి రచనలు గలవు. కవితకమను వృత్తవిశే షము గలదు. శైలి చక్కనిదే కాని శివకవి సామాన్యములగు ఛందో వ్యాకరణ దోషము లనేకము గలవు.

10. కొత్తూరు రామలింగార్యుఁడు:

నాకనాడు కులజుఁడు, సదాశివ గోత్రజుడు. తలి దండ్రులు గోవిందాంబ, గంగిరెడ్డి. కృతి మహాభారత నాటకము. (సి. వి. కృష్ణా

బుక్ డిపోవారి ప్రచురణ మదరాసు. 1949) ఆది పర్వము నుండి శల్య పర్వము వఱకుగల తొమ్మిది పర్వములు, గదాపర్వము (భీమ దుర్యోధనుల యుద్ధము) నిందు గలవు. (అచ్చులో సుమారు 300 పుటల గ్రంథము) ఇదంతయుఁ బ్రబర్మనోద్దిష్టమై యక్షగానపు "బాణి" నున్న రచన. ఇందు ప్రసిద్ధరాగములలో దరువులు, పద్యములు, కందార్ధములు, ద్విపదలు, సంధి ద్విపదలు, సంధి పద్యములు, సంధివచనములు సంభాషణ వచనములును గలవు. చోప్పుదారి ప్రసంగములున్నవి. రచన ప్రశస్తమైనదే.

11. కోటవేటు రాఘవరెడ్డి:

నా(పా?)కనాడు కులజుఁడు. అచ్యుతగోత్రజుఁడు. తలిదండ్రులు పాపమ, వెంకటరెడ్డి. కృతి ధర్మాంగద నాటకము (శ్రీరామానుజ విలాస ము. శా. మదరాసు, 1925) వెంకట పురీశున కంకితము. రచన యాధునిక మని యనిపించుచున్నను సలక్షణము. సరళమైనది.

12. కోసూరి గంగాధరకవి:

యజుశ్శాఖి. హారితస గోత్రుఁడు. గంగరాజపౌత్రుఁడు. పాప మాంబా పుల్లమ్మ రాజుల పుత్రుఁడు. కృతి యొక కురువంజి (ప్రా. లి. పు. భాం. డి. నం. 1857) ముక్తికాంత మనఃకాంత కెఱుక చెప్పుట యిందలి విషయము. రచన సరళమైనది. నిర్దుష్టముగాదు.

13. గుడిపాటి రామదాసు:

కాశ్యపస గోత్రుఁడు. వెంకట రత్ననామాత్య పుత్రుఁడు. రామయ పౌత్రుఁడు. ఇతని నివాసము వడాలి (కృష్ణా జి. గుడివాడ తా॥) కృతి కాళిందీ విలాసము (ఆం. సా. ప., సం. 905) నాటకాలం కార కావ్య ప్రబంధమని పేర్కొనఁబడినది. కాని భామకలాపపు

"భాణీ" నున్నది. రచన యలంతి దోషములు గలదైనను సరసభావ సమృద్ధము. ఇందు పాత్రలు "తెరలోకి వచ్చుట", తెరవెల్పి వచ్చుట, తెరలో నుండియే ప్రసంగించుటయుఁ గలదు. సంవాద సందర్భము లందలి వచనములు ముచ్చట లని పేర్కొనబడినవి.

14. గుడిమెట్ల రామయ:

గురునాథ సూరిపుత్రుఁడు. ఇతని కృతి సత్యభామా కృష్ణసంవాదము లేక భామా కలాపము (ఆంధ్రేతిహాస పరిశోధక మండలి ప్రతి సం. 13) కృతి ప్రోత్సాహకుఁడు "బొబ్బిలి నృపాలపాలిత దేశాంత రాళ విలసిత గోళవల సాగరహార (పాలకొండ తాలూకా) నివాస భూసు రాగ్రేసర దూసికులీన సూరయాభిధానుఁడు" (కౌండిన్యస గోత్రుఁడు. సుబ్బసూపద్మనాభుల పుత్రుఁడు) ఇదియొక చక్కని ప్రౌఢ సారస్యములుగల భామా కలాపము.

15. గురుసిద్ధలింగము:

ఇతని కృతి శ్రీగిరి కురవంజి. (డి. నం. 1856 శివ పార్వతుల వివాహకథ యిందు వర్ణితము. ఇందలి కురవంజి మాయాశక్తి. ఇది శ్రీ శైలేశున కంకితము. ఇందు నివాళి పదములు, గౌరీ కల్యాణము మొ...పద విశేషములు గలవు. రచన సరళమైనది. నిర్దుష్టముగాదు.

16. (ఘట్టు) రామకవి:

ఇతని కృతి ఎఱుకల కథలు. (ఆం. సా. ప., సం. 1518) ఎదురుకొండ నరహరి ముద్రగలది. పార్వతి కొరవంజియై సత్యభామ కెఱుక చెప్పుట యిందలి విషయము. రచన యొక మోస్తరు. ఎదురు కొండ కేశవాకింతమైన గొల్లకలాప మొకటి (ఆం. సా. ప. 3807)

యితని రచన కావచ్చును. ప్రా. లి. పు. భాం, ఆర్. 172 పట్టాభి రామాయణమునఁ దక్కర్త ఘట్టు వేంకట రామకృష్ణకవి "తాళ్ళాది రాగ సందర్భ నాటక వేషజాతీయ విధములు సల్పినాఁడ" నని చెప్పు కొనెను. ఆతఁడు నీతఁడు నొక్కరే యగుదురేమో!

17. చింతలపల్లి లచ్చిరాజు:

ఇతఁడు ప్రా. లి. పు. భాం., రూపవతీ చరిత్ర య. గా. కృతికర్త యని ఆం. వా. సూ. లోఁ గలదు. దాని మూలప్రతి డి. 132. దానిని బట్టి తయారైన కాగితపుఁ బ్రతి ఆర్. 1469, మూలప్రతి నేడేలనో మృగ్యమైనది. అందు గ్రంథకర్త పేరుండి యుండును. ఆం. వా. సూ. కర్తలది చూచి యుందురు. ఆర్. 1469 లోఁ గర్తపేరు గాన రాదు. కృతి నాయకుఁడైన జన్నియ ముసల భూపతియే యిందలి కథానాయకుఁడును, అతని మంత్రివర్గమునఁ జింతలపల్లి రామనమంత్రి యొకఁడు పేర్కొనబడినాఁడు. లచ్చిరాజతని తమ్ముఁ డగునేమో! ఈ ముసల భూపతి వంశాను చరితమిట్లు పేర్కొనఁబడినది: పితా పుత్ర క్రమము జన్నియ నరస — కరియ — సిద్ధ — తిమ్మ — వేమ ముసల (1)—పెదవేము (భార్య సిరియమాంబ)—ముసల (2) భూపతులు, ఈ రెండవ ముసల భూపతియే కృతిభర్త. ఇతఁడు గడియంకభీమ, వడ్డియ వళవిభాళ, శలగోల బిరు దాంకుఁడు. ఇందతని భార్యలు బంధు మంత్రి వర్గమును జాలమంది పేర్కొనఁబడిరి.. కాని యితఁ డేయూరి ప్రభువో, ఏపాటి ప్రభువో, ఏనాటివాఁడో తెలియుటలేదు. గ్రంథ విషయము:— ముసలభూపతి సపరివారముగా స్వారివెడలి యుత్తర పినాకినీ పరీవాహ్యప్రాంత విపినమున వేటలాడి పెన్నయహోబలక్షేత్ర మునకేగి యఁటశఠగోప జియ్యరు శిష్యుఁడైన కిడాంబి రామానుజా చార్యుని పుత్రత్రయము వెంకట తిరువెంగళ రామాచార్యులనువారిలో

నగ్రజునిచే శంఖచక్రాంకితుఁడై స్వామికి గరుడోత్సవము జరిపి పురో న్ముఖుఁడాయెను. అపుడు రూపవతియను వారవనిత యతనిఁ జూచి మోహించినది. అంతనామె విరహవేదన — చెలికత్తెచే రాయబా రము — నాయకుని సమ్మతి — నాయికా నాయక సమాగమము. ఇది తంజావూరు నాటకములలోని యులా ప్రబంధ ఫక్కినిఁ దలపించు చున్నది. రచన నిర్దుష్టముకాదు గాని సరసముగనే యున్నది. ఇందర్థ చంద్రికలు, ఏలలు, ధవళ శోభనములు, రగడ, కోలాట పాటలు, మొ ... దేశి రచనలు గలవు.

18. చిగురుపేవు కృష్ణమార్యుఁడు :

ఇతని పితృ పితామహులు శ్రీనివాసాసందాచార్యులు. కృతి పద్మినీ విలాసము. (ఆర్. నం. 900) తిరువళ్ళూరు వీరరాఘవస్వామి కంకితము. రాయ చౌహత్తమల్లుఁడను రాజు కూఁతురు పద్మినిని శ్రీరంగ పతి వివాహమాడుట యిందలి కథ. ఈపద్మినినే ఒరయూరు నాంచారందురు. ఇందలి దరువులు తాళప్రధానములు. ఇందు ధవళ శోభనములు, కళికలు గలవు. రచనయొక మోస్తరు.

19. చెన్నయ :

ఇతని య. గా. కృతి ఉషా పరిణయము—ఆర్. 753 — ఈ సంపుటమునందేగల చెన్నయ కృతమగు యయాతి చరిత్ర ప్రబంధ గద్యనుండి యితఁడాపస్తంబ సూత్రుఁడు, నాత్రేయసగోత్రుఁడు కృష్ణయ పుత్రుఁడునని తెలియుచున్నది. ఉషాపరిణయమునఁ దాళ ప్రధానములగు దరువులు నొకరెండు దేశిరచనలును గలవు. రచన యప్రౌఢము.

20. చౌదరి రామదాసు :

కమ్మకులజుఁడు. కొలుచునూళ్ళ గోత్రజుఁడు. ప్రపితామహులు వెంకమాంబా ముత్తనలు. పితామహులు గంగమాంబ, నాయఁడు. తలి దండ్రులు కోనమాంబా గురువప్పలు. అగ్రజుఁడు రాయప్ప. ఇతని కృతి రుక్మిణీకల్యాణము. (అం. సా. ప. 3750. ఆర్. 458) సరస రచన. సింగీ సింగళ్ళ ఘట్టము మనోజ్ఞమైనది. సింగడు కోతి నాడించిన పాట చక్కఁగా నున్నది. ఇందర్థ చంద్రికలు, ఏలలు, అల్లో నేరేళ్ళు, శోభనము, సువ్వి, లాలి, మట్టె మొ... దేశి గేయములు గలవు. గ్రంథ మధ్యమున "మారకపురీ శ్రీ చెన్నరాయాధిపా" అను మకుటముతో నాల్గుపద్యములు గలవు.

21. జిల్లేళ్ళమూడి వెంకటరామామాత్యుఁడు :

ఇతని కృతి జాంబవతీ విలాసము (అం. సా. ప. 3066) తంగటూరి చెన్న కేశవాంకితము. భామ కలాపము "బాణీ"ని సాగిన జాంబవతీ ప్రణయకథ యిందలి ప్రధాన విషయము. ఇది శృంగార నాటకమని పేర్కొనఁబడినది. ఇందు పదపద్యములు, ద్విపదలు, తాళ ప్రధానములగు దరువులు, ఏలపదములు, సంస్కృత శ్లోకములును (కొన్ని అమరము, గీతలనుండి గృహీతములు) దెనుగునఁ దద్వ్యాఖ్యానమును గలవు. గ్రంథ "మభినయ శాస్త్రపద్ధతిని" రచించితినని యున్నాఁడు కవి. రచన సలక్షణము, సరళమునైనది. చక్కని జాతీయతఁ గలది.

22. జోగరాజు భార్గవకవి :

కౌశికస గోత్రుఁడు. చిదంబరార్యుని పౌత్రుఁడు. సంజమాంబా లక్ష్మీనరసాఖ్యులపుత్రుఁడు. ఇతని కృతి గయోపాఖ్యాన నాటకము.

(వెస్టువార్డు ప్రచురణ, మదరాసు, 1954) కృతి ప్రోత్సాహకుడు పెద చింతకుంట పురవాసి కుందూరు శేషారెడ్డి. ఇందు కర్ణాటక హిందూస్తానీ రాగ తాళములలో దరువులు, జావళ్లు, ద్విపదలు, పద్యములు, ఏలలు, కంధార్ధాలు, సంధి – సంభాషణ వచనములు, పాత్రప్రవేశ స్వపదలు, దరువులు, గ్రంథారంభమున "ద్వారకుని వేషపుకథ" తురకములో వానిప్రసంగము, వాడు పాత్రలను బృచ్ఛించుటయుఁ గలవు. రచన యంత్రప్రశస్తమైనది కాదు. గేయనాట్య ప్రయోజనోద్దిష్టమైనది. ఆధునికకృతి యని తోఁచును.

23. చేకుమళ్ళ మృత్యుంజయుడు :

ఆపస్తంబ సూత్రుఁడు, వాధూలసగోత్రుఁడు. చెంచెమ్మ సుబ్బాశాస్త్రుల పౌత్రుఁడు. లక్ష్మాంబా కృష్ణార్యుల పుత్రుఁడు. తల మంచి (నెల్లూరు తాలూకా) పురవాసి. ఇతనికృతి గౌరీశంకర విలాసము. కుడితిపాళెము (నెల్లూరు తా.) వాసి అల్లూరి ఆదినారాయణ కృతి పోత్సాహకుఁడు. "అలకలదోపు యక్షగాన" మని దీనికి నామాంతరము. శివుని దారుకావన క్రీడలఁగూర్చి నారదుని వలనవిని గౌరి యలుక చిత్తగించుటయు, నయ్యవారమ్మ వారినిఁ దియ్యారించుటయు నిందలిప్రధానవిషయము. ఇందువర్ణమెట్లు, కంధార్థములు నెక్కువ. రచన చక్కనిది.

24. తూము సీతారామదాసు :

ఆధునికుఁడని వినికిడి. ఇతని కృతి శ్రీమద్భగవద్గీతాసారము (రాజన్ ప్రెస్, రాజమండ్రి. ద్వితీయ ముద్రణ. 1933) ఇది కవిచేతనే యక్షగానమని పేర్కొనఁబడి యున్నను నిందు భగద్గీత 18 అధ్యాయములు నొక్కొక్కటొక్కొక రాగైకము తాళైకమునను కీర్త

నగాసాగినది. ఇదియక్షగానమగు నెడల యక్షగానమిక గేయప్రబంధ మనగానాచి యనవచ్చును. ఇందలి రచన చక్కనిది.

25. తేరులపురి నారాయణకవి :

శ్రీవత్సస గోత్రుఁడు. కిచ్చయప్రపౌత్రుఁడు. చలమయ పౌత్రుఁడు. మూర్త్యంబా శేషయార్యుల పుత్రుఁడు. ఇతనికృతి నల చరిత నాటకము (చామరాజ ప్రెస్, చూలై, మదరాసు, 10-9-1903) తేరులపురి శౌరి కంకితము. ఇందాశ్వాస విభాగము విశేషము. రచన సలక్షణము సరసము నైనది.

26. దుర్గరాజు చిదంబరము :

భారద్వాజస గోత్రుఁడు. ఆశ్వేల నియోగి. శాణప్రపౌత్రుఁడు. జానకీదేవి వెంకట రాముల పుత్రుఁడు. రెండుచింతల పురవాసి. అన్నంకి తిరుమలార్యుని శిష్యుఁడు. గొట్టిపోళ్ళ వేంకట తిరుమలార్యుడు కృతి ప్రోత్సాహకుఁడు. ఇతని కృతి అనిరుద్ధ నాటకము. (శ్రీరంగ విలాస ము. శా., మదరాసు, 1930, వెస్ట్రవార్డు, 1953) ఉషానిరుద్ధుల వివాహకథ యిందు వర్ణితము. గ్రంథారంభమున "ద్వారకునీ"రాక (చోద్భారి యనియు నిందు వ్యవహృతుఁడు.) వాఁడు తురకమునఁ బ్రసంగించుట, పాత్రలను బల్కరించుట, పాత్రప్రవేశపు తరువులు తెరద్విపదలును, సంధి – సంభాషణ వచనములు గలవు. రచన యాధునిక మైనదని పించును. సలక్షణము సరసమునైనదే.

27. దేవర శ్రీనివాసకవి :

మాధ్వుఁడు. ఆశ్వలాయన సూత్రుఁడు. కాశ్యపస గోత్రుఁడు. శతవధానులు లక్ష్మమ, నారాయణమూర్తి. గుంటూరి వెళ్ళపాలెపురి

వెంకటరాయుఁడు. ఇతని కృతి అనిరుద్ధ చరిత్రము లేక ఉషా పరిణయము. (ప్రా. లి. ఫు. భాం, డి. నం. 1968, ఆం. సా. ప., 2397, 3388. అసమగ్రములు. ఆం. సా. ప., ప్రతులలోఁ గవి పేరేలేదు. ప్రా. లి. ఫు. భాం., ప్రతిలోఁ బేరితోపాటు మైవిశేషములును తెలిసినవి. మూఁడు ప్రతులను సరిపోల్చిచూచి యొక గ్రంథముయొక్క ప్రత్యంతరములే యని కనుగొంటిని). ఇది నాటకమని పేరొక్కనఁబడినది. యక్షగాన ప్రక్రియా ప్రకృష్టమైనది. ఇందలి రచన నిర్దుష్టముగాదుగాని కొందఱను కొన్నట్లు నీరసమునుగాదు. కొన్ని కొన్ని పట్టుల మిక్కిలి సరసమైనది.

28. నందవరము సింగన :

బుక్కపట్టణ నివాసి. ఓబళ మంత్రిపౌత్రుఁడు నారాయణుని పుత్రుఁడు. ఇతని కృతి పారిజాతము (ది. 1901, 1902). కంభము కృష్ణుని కంకితము. ప్రశస్తరచన కాదు. అంత ప్రాచీనమైనదిగాఁ దోఁపదు.

29. నాగాన్వయ అప్పయ :

ధర్మాఖ్యుని శిష్యుఁడు. ఇతని కృతి చంద్రశేఖర విజయము (ఆం. సా. ప. 1622). శివుని త్రిపుర విజయకథ యిందు వర్ణితము. ఇది నాటక కావ్యమనియు నాటక ప్రబంధ మనియుఁ బేరొక్కనఁబడినది. ఇందు కందార్ధములు తఱచు. రచన యపేలవమైనది.

30. పట్టాభి రామయ్య :

సూర్యనారాయణసోమయాజి పుత్రుఁడు. ఇతని కృతి సుందర కాండము (ఆం. సా. ప. నం. 181, 275. రెండవదానిలోఁ గవిపేరు

కానరాదు. కాని యది 181 కిఁ బత్యంతరమే). ఇందలి యవతారి కలో తంజావూరు రఘునాథ రాయ రామాయణములోని "శ్రీసీతా లలితాంగీత్యాదియగు పద్యముండుట విశేషము. ఇది గేయ ప్రబంధ మని పేర్కొనబడినది. రచన సలక్షణము, సరమునైనది.

31. పాతూరి తిరుపతి:

నూతక్కి (గుంటూరు తా.) కరణము. ఆపస్తంబ సూత్రుఁడు. శ్రీవత్ససగోత్రుఁడు. వేరయపౌత్రుఁడు. అమ్మయకు నెల్లమాంబకుఁ బుత్రుఁడు. ఇతని కృతి సుందరకాండము (ఆర్. 870) తుమ్మపూడి (తెనాలి తాలూకా) హనుమంతునకుఁ గృతి. ఇదియక్షగానమని పేర్కొనఁబడక పోయినను నిందు కీర్తనలు, ద్విపదలు, పద్యములు, వచనములును గలవు. కవి కథను నాటకీయముగ నడిపించినాఁడు. కాని రచనలోఁ బట్టుతక్కువ, తప్పులెక్కువ. తుమ్మపూడి హనుమంతునకుఁ గృతులగు హనుమద్విజయములేక మైరావణ చరిత్ర ఆర్. 451, ఆర్. 939, డి. 1928, డి. 1929), రామాయణము (ఆం. సా. ప. 2986) నితని కృతులే కావచ్చును.

32. పాల యెంకరి బోడిమల్ల భూపాలుఁడు:

గురిగింజ గుంట (జి. కడప, తా. రాయచోటి) పురాధిపతి. అప్ప భూపతికిఁ బౌత్రుఁడు. ఎల్లమాంబా బొజ్జమల్ల భూపతులపుత్రుఁడు. ఇతని తమ్ముఁడొక అప్పభూపతి గలఁడు. ఇతని కృతి జానకీపరిణయము (ఆంధ్రేతి హాసపరిశోధక మండలి ప్రతి నం. 31, ఆం. సా. ప. 354, తం. స. మ. 481—482— ఇందుకర్త పేరు కనిపింపదు కాని నై కృతి ప్రత్యంతరమే యని నిర్ధరించితిని). ఇది అల్లో నేరేళ్ళు, త్రిభంగులు, రచ్చరేకులు, తుమ్మెద పదము, ఏలలు, అర్ధచంద్రికలు, ఛవళ

శోభనములు మొ... దేశి గీత ప్రబంధము లనేకముగల యక్ష గానము. దోపల్లె కంభము రామభద్రున కంకితము.

33. శ్రీ పేరుంబూదూరి తిరువెంగళాచార్యుడు :

యతీంద్ర గోత్రుండు. రామదాసార్య పుత్రుండు. ఇతని కృతి నీలాచల విలాసము. (ఆంధ్రేతిహాస పరిశోధక మండలి – నం. 395/49) ఎవరో యక్క సెల్లెండ్రిరువురు నీలాచల క్షేత్రమును దర్శించి క్షేత్ర దైవతముల ప్రశంస చేయుట యిందలి ప్రధాన విషయము. ఇది య. గా. ప్రబంధమని పేర్కొనఁబడినది. ఇందాశ్వాస విభాగము గలదు. కవి బంధగర్భ కవితా నైపుణిఁ బ్రదర్శించెను. రచన చక్కనిది.

34. పోలుగంటి వెంకట కృష్ణయ్య :

సరసమాంబా చిట్టయ మంత్రుల పుత్రుండు. కేశవ గురుని శిష్యుఁడు. ఇతని కృతి శారదకురవంజి కట్టణ (డి. 1942). కృష్ణుని త్రోడి వివాహము గూర్చి తలపోయుచున్న రుక్మిణి కడకు సరస్వతీ కురవంజియైవచ్చి యెఱుక చెప్పుట యిందలి విషయము. రచనయొక మో స్తరు. నిర్దుష్టము గాదు.

35. ప్రసంగి రంగప్ప :

ఇతని కృతి రుక్మాంగద చరిత్ర (సం. స. మ. కే. సం. 580-81) నాటకమని పేర్కొనఁబడినది కాని రచన ప్రబంధోచితము. ఇందు ప్రౌఢకవిమల్లన రుక్మాంగదచరిత్ర పద్యములెక్కువ గ్రహింప బడినవి. హరవిలాసము. శృంగార శాకుంతలము, కాళహస్తీశ్వర మాహాత్మ్యము, వాల్మీకి చరిత్రము, విజయ విలాసము మొదలగు ప్రబంధములనుండి గ్రహింపఁబడినవియుఁ గొన్ని గలవు.

36. భృగుబంధ్ల లింగకవి :

పోలనప్రతుండు. ఇతని కృతి లక్ష్మణ ప్రాణరక్షణము. (డి. 1938) పవని గోపాలస్వామి కంకితము. రచన నిర్దుష్టముగాదు. నీరస మైనది.

37. బేతపూడి పరబ్రహ్మకవి :

శ్రీవత్సగోత్రుండు. లక్ష్మీనారాయణామాత్యప్రతుండు. ఇతని కృతి శ్రీయాళ (సిరియాల) నాటకము. (ప్రచురణ రంగా వెంకటరత్నము, గ్రంథ విక్రేత, బెజవాడ. సం. తెలియదు). భటుని హిందీ ప్రసంగము, పాత్రల తెరద్విపదలు, వచన ప్రసంగములు, గ్రంథమధ్యమున సూత్రధారుండు పాత్రలతో సంభాషించుటయుఁ గలవు. రచన సరసమైనది. ఆధునికతా ముద్రగలది.

38. బొడ్డుచర్ల సుబ్బకవి :

నంద వరీకుడు. కుత్సగోత్రుండు. సుబ్బమాజ్వాలయా మాత్యుల పౌత్రుండు. వెంకమాంబా బాచయల పుత్రుండు. ఇతనికిఁ గృష్ణయ యను పినతండ్రి; వేర మాంబయను మేనత్త, శేషాద్రి, జ్వాలా సతి పిచ్చమాంబయను ననుజులును గలరు. బండివారి నాగులవర మితని నివాసము. మేడవరము సూరావధాని, చింతలచెల్లి శివరా మయ్యయు నితని గురువులు. ఇతనికృతి లక్ష్మణా పరిణయము (వంకా యల కృష్ణస్వామి అండు సన్ వారి పచురణ, మదరాసు. 1915) కృతి పోత్సాహకులు మేడవరము తిరుమలయ్య, మారాంపురవాసి దడికమళ్ల వెంకటప్పయ. గ్రంథవిషయము: కృష్ణునియష్ట మహిషులలో నొకతెయగు లక్ష్మణ పెండ్లికథ. నాటకమని పేర్కొనఁబడినది. రచన సరసమైనది. ఆధునికమైన దనిపించును. ఇందు కందార్థములవలె

వృత్తార్థములును, సంభాషణ వచనములును గలవు. (ప్రహ్లాద చరిత్ర, ఎల్లెమరి రామాయణ య. గా.ల కర్త మఱియొక బొడ్డుచర్ల సుబ్బ కవి గలడు).

39. మూళగిరి కవి :

వావిలపాడు నివాసి. ఇతని కృతి ఉషాపరిణయము. (ఆం. సా. ప. 1319) రచన యొక మోస్తరు. ఇందలి పద్యములు తాళ ప్రధానములు కొద్దిదేశి రచనలు గలవు.

40. మేరికపూడి కృష్ణయ :

భారద్వాజస గోత్రుడు. ఇతని ప్రపితామహుడు వేంకటనారాయణ. పితామహుడు వేరయ ఇతని సోదరులు వెంకయ, రంగయ తలి దండ్రులు సీతమాంబా లక్ష్మీనృసింహులు. పెదతండ్రి వెంకట నారాయణ. పినతండ్రి రామయ. అగ్రజుడు హనుమత్కవి. ఇతని కృతి రంభారావణ సంవాదము (భైరవ ము. శా.' బందరు, 1895) ఎవరో వేపారి కులజులు కృష్ణరావు, హనుమంతరావు, నాగేశ్వరరావు అనువారు కృతి ప్రోత్సాహకులు. రచన నిర్దుష్టము. శయ్యా లాలిత్యముగలది. ఆధునిక కృతి యనిపించుచున్న ది.

41. రామకృష్ణారెడ్డి :

భానుపురి నివాసి. ఇతని కృతి తారాచంద్ర విలాసము. (వేంకటేశ్వర ము. శా. మదరాసు 1914) గ్రంథారంభమున రంభోర్వశులరాక గలదు. పాత్రల సంభాషణలు వచనములోనగూడ నాగినవి. ఆధునిక రచన యని తోచును. ప్రశస్తకృతిగాదు.

42. రామలింగదాసు :

ఇతని కృతి శ్రీనివాస విలాసము (ఆల్. 457 గ్రంథము యొక్క రెండసమగ్రప్రతులు కలిసియున్న సంఘటనమిది. గ్రంథమధ్యమున నొకచూర్ణికలో — 11 వ యాశ్వ రెండవ ప్రక్కను, 29 వ ఆశ్వ రెండవ ప్రక్కను మాత్రమే కవిపేరు కన్పించును). శేషాచలేశుఁడు చెంచెతను బెండ్లి యాడిన కథ యిందు వర్ణితము. ప్రౌఢబంధము మోడి ప్రబంధోచిత రచన. ఇందు చెంచుల యుదంతము హృదయంగమముగా వర్ణింపఁబడినది ఇందు మాధవి పాత్రకుఁ బస్తి గల్గినది.

43. రామలింగ దాసు :

పై రామలింగదాసుఁడు నితఁడు నొకరో కాదో తెలియదు. ఇతఁడు పూరి పట్టణ నివాసి. ఇతని కృతి భాగవతము. (ఆం. సా. సం, 4310) కృష్ణజననము, బాల్యము, రుక్మిణీ కల్యాణము, నిందు వర్ణితములు. రచన సలక్షణమైనది. మిక్కిలి చక్కనిది.

44. రామానుజమ్మ :

వరయూరు జియ్యరు తిరువడి సంబంధురాలు. ఈమె కృతి శ్రీరంగనాథ పంగుణ్యుత్సరోత్సవ యక్షగానము. (1927 లో శ్రీ రామానుజ విలాస ము. శా. లో ముద్రితమై, కొత్తూరు రంగనాయకమ్మచే బ్రచురితము), దీనికి నంబెరు మాళ్లు చరిత మనియుఁ బేరు. ఇది పది నాళ్ళ రంగనాథస్వామి ఫాల్గుణోత్సవపు వేడుకలు ముచ్చటింపఁబడిన గ్రంథము స్వామిరంగనాంచారితో జెప్పకుండ వరయూరి నాంచారి కడ కేఁగుట — నారదుని కైలాటము — రంగనాచారు అలక — నమ్మాళ్వారి తియ్యారింపు — నాయికా నాయకులకుఁ

డలుపు కడుసంవాదము – తదుపరి సమాగమము మొదలగు విష
ములు గలవు. ఇందు ద్విపదార్ధకందార్ధ వృత్తార్థములును, బలువిధవ
పాటలునుగలవు. రచన యాద్యునికవ్మైనదిగాఁ దోఁచును. రకరకవ
దోషముల కాకర మీ గ్రంథము. శ్రవ్యకావ్య ధోరణి మెచ్చు.

45. రాయవురి చెన్నయార్యుఁడు :

ఆత్రేయసగోత్రుఁడు. తిమ్మయజ్వ పౌ త్రుఁడు. వేంగమాం
గిరిభట్టుల పుత్రుఁడు. వనిపెంట పురవాసి. ఇతనికృతి మల్లికా కల్ప
ణము. (ఆం. సా. ప. 2043) కృష్ణాతీరస్థ శ్రీచంద్రపురాధిపుడ
చంద్రగుప్తుని తపఃఫలితముగా నతనిసతి చంద్రిక పార్వతీదేవినే
వుగా బడయుట. ఆమెయే యేగంటి మల్లిక. ఆమె కల్యాణకథ యిం
వర్ణితము. ఇది యేగంటి క్షేత్రకథయె యుండును. రచన చక్కనిది

46. లాలా కన్నయ :

కాయస్థ కులజుఁడు. కాశ్యపసగోత్రుఁడు చెంచుగోప
దాసు పౌత్రుఁడు. తిరుపతి పురవాసి. కన్నయ్యలాలిఁనని నామ
తరము. ఇతని కృతులు :– (1) సుంకరికొండని కథ. (శ్రీరామ
నంద ము. శా. మదరాసు, 1906, ఆ డై. ప్రెస్, మదరాసు, 19
1950). సుంకరి కొండడు గొల్లకలాపములందు సాంపదాయికపా
ఇందు శ్రీకృష్ణుఁడే సుంకరి కొండడైనట్లు గలదు. గ్రంథమంతయు గొ
భామకు సుంకరికొండయకు సంవాదముగా నడచినది చివర స్వా
నిజస్వరూపము జూపును. ఇది తిరుపతి గంగజాతర వినోద క్ష
క్షేపమున్నకై రచింపఁబడిన నాటకమని కవి యన్నాఁడు. ఇం
భాష సలక్షణమైనది కాకపోయినను రచన సరసమైనదే. హా
ప్రకృష్టముగ నున్నది. భాషలో విలక్షణత గలదు. భావములఁ

విరసత్వము నున్నది. ఇందలి యుద్ధూపదములు, 'సీమ చీటీ రవికె గుడ్డ' మొదలగు ప్రయోగములనుబట్టి యిది యాధునికరచన యనవచ్చును. పరువులలోఁ దిరుపతి నరహరి ముద్ర గలదు. (2) శ్రీవెంకటేశ్వర పద్మావతీ పరిణయనాటకము. (ఎస్. వి. ఎస్. ప్రెస్, తిరుపతి, 1909). పత్కృతి పోత్సాహకుఁడు తిరుపతి నివాసి జగన్నాధసింగు కొడుకు తులసీ రాంసింగు. ఇది యైదురాత్రుల కథగా వింగడింప బడినది. ఇందు గ్రంథారంభమున "విఘ్నేశ్వరవేషం రాక" తెర ద్విపద, తెర వెడలు దరువు, పృచ్ఛక వాక్యములు, కంద సీసార్థములు, సంధి వచనములతోపాటు సంభాషణవచనములును గలవు. రచన యాధునికమైనదని చెప్పవచ్చును. తప్పు లధికముగాని కొంతకుఁ గొంత సారస్యము లేకపోలేదు.

47. లింగన :

వావిలిపాటి నివాసి, వెలమకన్నె కులజుఁడు. చెన్నయ పౌత్రుఁడు. రామార్యుని పుత్రుఁడు. ఇతనికృతి వావిలిపాటి కొరవంజి నాటకము (అడయారు ది. స. గ్రంథాలయప్రతి జి. నం. 74874) పుత్రకామేష్టిచేయుచున్న దశరథుని సతులకడకు శివుఁ డొకతయై పోయి వారికి సంతానముగూర్చి యొకటి చెప్పుట యిందలి విషయము. రచన పేలవమైనది.

48. లోకేరావు సోమన :

ఇతని బలభద్ర విజయ ద్విపదకావ్యము (తం. స. మ. కే. నం 306) నుండి యితఁడు లక్ష్మణదేవీకల్యాణము, శుకరంభా సంవాదమునను రెండు యక్షగానములను రచించినట్లు తెలియుచున్నది కాని గ్రంథము లలభ్యములు.

49. వాలె కోటయ్య :

బుచ్చయ్యపౌత్రుఁడు. లింగమాంబా రాచయ్యల పుత్రుఁడు. నాగలింగయ్య, చెన్నమల్లయ, ముసలయ్య అనువారల కనుజుఁడు. మహాదేవికి సోదరుఁడు. బీబిపేట ఘంటామఠస్థిత మహాదేవర శిష్యుఁడు. పచ్చకాంత భగిసూత్రుఁడును తోట మరబోధ కుర్తివాసియునైన మంచికంటి నాగలింగయ్య కృతి ప్రోత్సాహకుఁడు. కృతి చిఱుతొండ భక్తకథానిధానము (ఆర్. నం. 497). కథ ప్రసిద్ధము. బసవ పురాణోక్తము. ఇందు శివకవి కృతిసహజములైన దోషములు గలవుగాని యక్కడక్కడ రచన సరసముగనే యున్నది. (ఇది తెలంగాణము నకుఁ జెందినకృతియని తోచును.)

50. వాసిలి సుబ్బయ :

విశ్వబ్రాహ్మణుఁడు. వీరబ్రహ్మాఖ్యునిపౌత్రుఁడు. కామాంబా వేమయాచార్యుల పుత్రుఁడు. అరికట్ల సోమయాచార్యుని శిష్యుఁడు. ఇతనికృతి రాజయోగసార నాటకము (వంకాయలకృష్ణస్వామి సెట్టి ప్రచురణ, మదరాసు, సం. 1910 కాఁబోలు) ఇందలి విషయము కపిలదేవ గూఢ సంవాదము. తాత్త్వికము. భాగవతము నుండి గ్రహింపఁబడినది. రచన ప్రశస్తమైనదికాదు. ఆధునిక మనిపించుచున్నది. కృతి మహిమలూరి వేణుగోపాలున కంకితము.

51. వీరభద్ర కవి :

"మరకాణ భూమీశ వరలబ్ధ కవితాదురంధరుఁ" డఁట. అతని తలిదండ్రులు కాళమాంబా లింగనాఖ్యులు. కవి పితామహుఁడు నీలకంఠయ దేవీకీర్తనలు రచించినాఁడఁట. కవి ముత్తాత (వేము

తెలియను.) కన్నస్స చరితమనుకావ్యమును సంతరించెనఁట. ఇతని కృతి సీమంతినీ చరిత్రము (డి. 1960). కృతిప్రేరకుఁడు గ్రంథకర్తకు మేనమామ కొడుకు, నాకాంబికా వల్లభుఁడునైన శాంతయ. కృతిపతి ఆరణీపురము చంపకేశ్వరస్వామి. గ్రంథవిషయము సోమవార వ్రత మాహాత్మ్యకథ. ప్రదర్శనోపయోగికాకున్నను రచన చాల చక్కనిది.

52. వీరభద్ర కవి :

ఇతనికృతి శివభాగవతము (ఆర్. 800. కేటలాగులో నితని పేరు గుర్తింపఁబడలేదు). ఇందు కవిచేఁ బ్రాదర్తి లక్ష్మణేశ్వరస్వామి వెల్లపూడి మల్లేశ్వరస్వామి, మూలెకొండ నృసింహస్వామియు స్మరింపఁ బడిరి. గ్రంథవిషయము :— విప్రలబ్ధయగు పార్వతికడకుఁ గౌరవంజి వచ్చుట — సింగి సింగళ్ళసంవాదము — శివపార్వతుల సమాగము — నారదుఁడొక దివ్యకదంబ పుష్పము నర్పింపఁగా శివుఁడది పార్వతికిచ్చుట -గంగ చెలికత్తె యీ సంగతి నామెకుఁదెల్పుట మొ॥ ఈగ్రంథము కౌరవంజయని పేర్కొనఁబడినది. భామకలాపపుఢక్కి యొక్కువగాఁ గలది. ఇది శివకథ యగుటచే సఖపాత్రపేర మాధవికి బదులు శాంభవి యైనది. రచన బాగులేకపోలేదు.

53. వుల్లదాసు :

ఇతఁడు శ్రీమందానంద శైలనాసియైన శ్రీచంద్రమౌళి సద్గురుని శిష్యుఁడు. (కపిలదేవహూతి నాటకమును రచించిన తిరునగరి వెంకటదాసుగూడ నాతని శిష్యుఁడే) గోలిపురవాసి. ఇతనికృతి పంచపాండవులనాటకము (అ. డై. ప్రెస్, మదరాసు, 1928) గ్రంథముపై విరాటపర్వమనియు, భీమసేనవిలాసమనియు గీచకునివధమనియు ముద్రితమైయున్నది. కాని గ్రంథకర్త పలుతావులఁ బంచపాండవుల నాటక

మనియే పేరొక్కనినాఁడు. ఇది యక్షగానమనియుఁ బ్రబంధమనియు బేరొక్కనబడినది. ఇందలి విషయము విరాటపర్వ కథయందు భీముఁడు కీచకుని ద్రుంతునని ద్రౌపది కభయమిచ్చువఱకును గలదు. ఇంద ద్వారపాలకునిచేఁ బృచ్ఛింపఁబడి పాత్రలు స్వవిషయమును జెప్పుట గలదు. సంవాదశ్లైలియొక్కువ. రచన దోషభూయిష్ఠమైనది. ఆఱునికి కృతిగాఁ దోచును. ఇందు కురుమూర్తిహరి ఫలుమఱు స్మరింపఁ బడినాఁడు. ఇది తెలంగాణకుఁ జెందినది కానచ్చును.

54. వెంకటదాసు :

గంగ రాజేంద్రపుర వాసి. వైష్ణవుఁడు. సింగరదాస పౌత్రుఁడు. నారాయణాంబా గోవిందదాసుల పుత్రుఁడు. ఇతనికృతి ధర్మాంగద నాటకము. (ఆర్. 1368). ఇందలి చోద్యారికథ, మంత్రసానిపాత్ర, తెర ద్విపదలు మొదలగునాని యునికినిబట్టి చూడనిది 19 శ.రచనగాఁ దోఁచును. రచన యప్రౌఢమైనది.

55. వెంకటదాసు :

ఇతనికృతి కోటగిరి లేక మోటపురి ధర్మాంగద చరిత్ర. (సుబ్ర హ్మణ్యవిలాస ము. శా. మదరాసు, 1917, చందా నారాయణశ్రేష్ఠి సికింద్రాబాదు, 1952. మాఁదఁ బేరొక్కనఁబడిన వెంకటదాసకృతివేఱు, ఇదివేఱు, ఆకవులే వేర్వేరు.) ఇందు గ్రంథారంభమున రంభోర్వశుల రాక చెప్పఁబడినది. ద్వారపాలకుని పృచ్ఛలు, పాత్రల స్వవిషయో ద్ఘాటనము, తెరవెడలు కీర్తనలు, పరువులలో కోటగిరీశ, పెద్దపురీశ, సింబగిరి నారసింహ ముద్రలు గలవు. రచన యాఱునికమైనదని యనిపించుచున్నది. అతి పేలవమైనది.

56. వెంకటదాసు :

మీఁద పేర్కొ-నఁబడిన వెంకటదాసులు నితఁడును వేర్వేఅయి యుందురేమో ; ఇతని కృతి గొల్ల కలాపము (ఆర్. 487) ఇందు గొల్లభామ సముద్రమథన కథ నాఖ్యానించుట ప్రధాన విషయము. రచన యొక్కిం త చక్కనిదే. ఇందు బొండపిల్లిరామలింగ సఖుఁడు (దేవుఁడు) పేర్కొ-నఁబడినాఁడు.

57. వేంకటపతి కవి :

నవ (నర) సింహాపురి కరణము. ఇతనికృతి కాళింగ (కాళీయ) మర్దనము. (డి. 1847. 48, అ. డై. ప్రెస్. మదరాసు 1925, 29). తిరునల్లికేణి పార్థసారథి కంకితము. ఇందు దరువులు తాళప్రధానములు కతిపయదేశి రచనలు గలవు. ఒక్కింత ప్రాచీనమైనదిగాఁ దోఁచును.

58. వేంకటసూరి :

ఇతఁడు నారాయణసూరి పుత్రుఁడు. ఇంతకంటె నితని సూర్చి విశేషములు తెలియవచ్చుటలేదు. ఇతనికృతి 'గరుడాచల విలాసంబు నృసింహనాటకంబు' (ఆర్. 1571) ప్రసిద్ధమైన చెంచులక్ష్మి కథ యిందు వర్ణితము వర్ణనాబహుళమయ్యు సంవాద శైలీప్రచురము రచనయొక మోస్తరు.

59. వెంకట్రాది :

శ్రీవత్ససగోత్రుఁడు వైష్ణవుడు. ఎకోజమంత్రికిఁ బౌత్రుఁడు. తిమ్మోజికిఁ బుత్రుఁడు. ఇతనికృతి సుభద్రావివాహము (డి. 1967) ఇందలి దరువులును దాళప్రధానములే. రచనయొక మోస్తరు.

60. వెలువలి పెద్దయామాత్యుఁడు :

ఇతనికృతి భద్రకాళీకల్యాణము. (క్రీ. 1913). ఇందు మురు మళ్ళ పురమునవెలసిన భద్రకాళీ విశేషులపరముగాఁ బార్వతీపరమేశ్వరుల కల్యాణకథ వర్ణితమైనది. ఇందలి పద్యములు తాళప్రధానములు. భాష గ్రాంథికమేగాని నిర్దుష్టముగాదు. రచన పేలవమైనది.

61. శేషాచలదాసుఁడు :

కృష్ణరాయపురి కృష్ణాపట్టణము నివాసి. బోధాయన శేఖర సూత్రుఁడు. భారద్వాజసగోత్రుఁడు. శేషము రఘునాథార్యుని (కుల శేఖరమహీపాల చరిత్ర ప్రబంధకర్త యితఁడగునా?) పుత్రుఁడైన తిరువేంగనార్యుఁ డీతని గురువు. ఇతని కృతి గొల్లకథ (సముద్రమథన మనువేర 1906 లో మదరాసు మురహరి ము. శా. లో ముద్రితము) అనఁగా గొల్లకలాపము. చల్లనమ్మవచ్చిన గొల్లభామ సముద్రమథన కథ నాఖ్యానించుట యిందలి ప్రధాన విషయము. ఇందు సుంకరి కొండయకు బదులు శ్రీకృష్ణుఁడే గొల్ల భామను బట్టవచ్చును. ఇది నాలకమని పేర్కొనఁబడినది. రచన యొకమోస్తరు.

62. శేషాంబ :

ఈమె నివాసము కర్నూలుజిల్లా కోయిలకుంట్ల తాలూకా నందిపాటి గ్రామము. ఈమె కానాలవారి యాడుపడుచు. కానాల రంగయగారి పుత్రపంచకమునఁ గనిష్ఠుఁడు, నాశ్వలాయన సూత్రుఁడు, వసిష్ఠసగోత్రుఁడు, నందవరీకియు నగు మల్లయగారికి దత్తపుత్రుఁడైన రామస్వామి యీమె తండ్రి. శల్లి నిట్టు రప్పయ్యగారి పుత్రి రంగ మాంబ. ఈమె తన తమ్ముఁడు శేషయ్య ప్రోత్సాహమున మిత్ర

సుందాపరిణయ నాటకమును (1919 లో అనంతపురము బాలభారతీ ముద్రాలయము ముద్రితము) నందిపాటి కృష్ణముద్రతో రచించినది. మిత్రవింద శ్రీకృష్ణుని యష్టమహిషులలో నొకతె. భాగవతమున నష్టిపంజరముగానున్న యీమె పరిణయకథను నపూర్వపాత్ర చిత్రణము తోడను, సరస సంభాషణలతోడను, సన్నివేశములతోడను మాంస లముగాఁ దీర్చి మనోజ్ఞనాటక ఫక్కికను రచించినది శేషాంబ. గ్రంథా రంభమునఁ జోప్యనారి మొదలు ముఖ్యపాత్ర లన్నిటికిని ప్రాపేశిక ధ్రువా గానముతోడనే రంగప్రవృత్తి. తరంగములనుపేర నున్న తాళ మతు లిందలి రచనావిశేషములలో నొకటి. ఇది యీధునిక కృతియై యుండును.

63. శ్రీరామవ్రతి:

ఈమె తనపేరు చెప్పుట కిష్టపడక తండ్రి పేరు చెప్పినది. కాని తండ్రిది కౌశికగోత్ర మనియుఁ దనది శౌనక గోత్రమనియుఁ జెప్పి నది. ఈమె తల్లి విశాలాక్షమ్మ. ఈమె కృతి సీమంతినీ చరిత్రము. (1907 లో మదరాసు శ్రీ రాజరాజేశ్వరీనికేతన ము. శా. యందు ముద్రితము) సోమవార మాహాత్మ్యకథ యిందలి యితివృత్తము. రచన కడు చక్కనిది. ఇందలి పద్యములు తాళప్రధానములు "ఓడం" అను రచనా విశేషమొకటి యిందుఁగలదు.

64. సిద్ధనగౌడు:

ఇతఁడు తట్టకల్లు (గుత్తి తాలూకా, అనంతపురము జి.) నివాసి. ఇతని తలిదండ్రులు గౌరి, సింగన. ఇతని కృతి సారంగధర చరిత్రము (ప్రచురణ, ఎన్. వి. గోపాల్ అండు కో మదరాసు, 1935, 1949). ఇది నాటకమని పేర్కొనఁబడినది. ఇందు గ్రంథా

రంభమునఁ గథాసంగ్రహ ద్విపదయుఁ జోఫుదారి రాకయుఁగలవు. రచన యొకమో స్తరు.

65. సూర్యనారాయణశాస్త్రి సుత :

ఈమె పేరేమో తెలియదు. ఈమె కృతి శుక చరిత్రము. (దీనివ్రాతప్రతి యొకటి తే. 20 - 12 - 1900 న వ్రాయఁ బడినది. శ్రీ నేదునూరి గంగాధరం గారు తూ. గో. జిల్లా చొప్పెల్ల గ్రామ వాస్తవ్యులైన శ్రీ వాడ్రేవు శేషగిరిరాయకవి గారినుండి సంపాదించి నయత్తో నాకొసంగిరి. ఆకవిగారు దీనినెవరోపాడఁగా వ్రాసికొనిరఁట) ఇది సరికొల్లాపాట (పేట) వేఁగుగోపాలున కంకితము. జనక మహా రాజునకుఁ బ్రజ్ఞాంగన యందాంతరంగిక యజ్ఞఫలముగా ముక్తికాంత పుట్టుటయు నామెకు శ్రీశుకునితో వివాహ మగుటయు నిందలి విషయము. రచన యొకమో స్తరు. ఇందలి సాంకేతికసంవిధానము సమంజసముగ నున్నది.

పరిశిష్టము

(2)

కర్తృత్వము తేలని యక్షగానములు

1. అంబా వివాహము :

(ఆం. సా. ప. సం. 253). పార్వతీ వివాహమిందు వర్ణితము. ఇది కొరవంజి నాటకమని పేర్కొనఁబడినది. ఇందుశివుఁడే కొరవంజియై

విరహోత్కంఠయగు పార్వతీదేవిని సముదాయింపఁ బోవును. బ్రహ్మ సింగఁడగును. ఇం "దాస్థానసంతోషి" పాత్ర గలదు. రచన యొకింత చక్కనిదే.

2. అలమేలు మంగా విలాసము :

(డి. 1835, తిరుపతి శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయమున నొక ప్రతిగలదు. నం. 7109) ఇది వెంకటాచలపతి దేవున కంకితము. కృతిప్రేరకుఁడు మూళ్ళగిరి మంత్రి. ఆశ్వేల నియోగి, భారద్వాజస గోత్రుఁడు, నాపస్తంబసూత్రుఁడునైన తేజమంత్రి కిరు వురు భార్యలు. అం దక్కాంబకు రామమంత్రియు, సుబ్బాంబకు వెంకటరాయఁడు, మూళ్ళగిరి మంత్రియుఁ బుత్రులు. ఈ మూళ్ళ గిరియే కృతిప్రేరకుఁడు. ఇతఁడు కవిని వత్సర గ్రాసవాసములు, నూఱు వరహాలు, జోడు సేల్వాలునిచ్చి సత్కరించెనఁట. మూళ్ళగిరి మంత్రికి సుబ్బమయను భార్యయు, శ్రీనివాసుఁడను పుత్రుఁడును గలరు. ఇతనియింటిపేరు బండి, బంటి, బద్ది – ఈమూఁడిట నొకటి కాఁదగును. తేజమంత్రి మెల్పాగొండ పురము వశవాయి యఁట. గ్రంథమునఁ గామగిరి రామేశ్వరదేవుఁడు స్మరింపఁబడినాఁడు. అలమేలు మంగకు లక్ష్మీదేవికిని సవతిమచ్చర మిందు వర్ణితము. రచన బిగితక్కువ. ఛందోదోషము లెక్కువ.

3. ఉషా పరిణయము :

(తం. స. మ. కే. నం. 473) చంద్రభాను చరిత్ర, విజయ విలాసము మొదలగు ప్రబంధములనుండి పద్యములు గ్రహింపఁబడినవి.

4. ఎఱుకలవేష కథ :

(డి. 1839 - 41) ఇందు విరహిణియగు సత్యభామ కెఱుకత యెఱుక చెప్పుట. సింగితో సింగని సంవాదమును గలవు. ఎఱుక

దేవరల పట్టికలోఁగాక ప్రత్యేకముగాఁ గలిదిండి భోగలింగఁడు, పూల పల్లి పంకజనేత్రుఁడును స్మరింపఁబడిరి. రచన చక్కనిదే.

5. కణ్వాచరిత్రము :

(ఆర్. 1625). కణ్వుఁడు శివభక్తుఁడు. శివభక్తుల కలవి గానిదను లుండవు, ఇంద్రోపేంద్రాదులనైన శపింపఁ గలరని చెప్పుట గ్రంథ పరమార్థము. రచన యత్ప్రౌఢమైనది. అదియొక మాదిరి యాస గలది. అజువము కొంచె ముపయుక్తమైనది.

6. కురవంజి :

(డి. 1854) కుండిన పురగోపాలాంకితము. సరస్వతి యెఱుకత్తయై రుక్మిణి కెఱుక చెప్పుట యిందలి విషయము. సింగి సింగళ్ళ సంభాషణయుఁ గలదు. సింగఁడు కోతి నాడించిన పాటయు, వాని వాలకము వర్ణితమైన యొక "సువలా (సువ్వాల) ద్విపదయు" విశేషములు. రచన దుష్టము, బేలవము నైనది.

7. కొరిమెల్ల కురవంజి :

(ఆర్ 978). ఇందలి విషయము ప్రియ నిరీక్షణమున, సపత్నీ వ్యసనముననున్న సత్యభామకడ కెఱుకతవచ్చి స్వజాతివృత్తము, సంగ సాముద్రికాదికము నుపన్యసించుట – చివర సింగీ సింగల ప్రసంగ మున్నది.

8. కృష్ణ కథ :

(డి. 1860 – 62) ఇందలి విషయములు :– నర్మసచివుఁడగు మాధవునితోఁ (మాధవితో) గృష్ణుఁడు తనయవతార వివాహో

దంతములు ముచ్చటించుట - అష్టమహిషుల రాకలు - కృష్ణునివారి సౌందర్యమును వర్ణించి రాధగురించి యుబలాటము ప్రకటించుట - మాధవుని హాస్యప్రసంగములు - రాధ రాక - రాధాకృష్ణుల సంవాదము. రచన యొకవిధముగా సరసమైనదే. క్రి. 1861 ప్రతి ముఖపత్రమం దిట్లున్నది :- " ఆట భాగవతమందు కృష్ణకథ. కొందరు యీ కలాపము అంతా కేదారగౌళరాగం చేత వినుపిస్తున్నారు. కొందరు ఏకరాగంమీద బాగావుండదని ప్రత్యేకం రాగాలు పాడి వినుపిస్తారు. ఈసంగతి విశదంకొరకు వ్రాయబడ్డది. "

9. కృష్ణ జననము :

(క్రి. 1859). దేవకి పురిటినొప్పులు, మంత్రసాని బిలిపింపవలె ననుట, ఆమెరాక చెప్పఁబడనేలేదు, పుట్టువచ్చును - ఇవియుందలి విషయములు. రచన సామాన్యము.

10. కృష్ణ వేషము :

(ఆ. సా. ప. 3061. పరిషద్గ్రంథపట్టికలో నిందలి విషయములు " ఎఱుక మొదలైనవి " అని వ్రాయఁబడి యున్నది. కాని యిందెఱుక ప్రసక్తి లేదు. క్రమసంఖ్యలో నిందున్న మొదటియాఱాకులు నీ కృష్ణవేషము. పిదప నొక మూఁడు విడియాకులు కాక గొల్ల కలాపమునకు సంబంధించినవి గలవు. అందాత్రేయపుర సిమ్మకంటి పురధాములు స్మరింపఁబడిరి) ఈకృష్ణవేషముకథ యెత్తుగడలోఁ పై కృష్ణవేషమును బోలినదే. పిదప రాధా రుక్మిణులతోఁ గృష్ణుఁడు కూర్చుండగా నారదుఁడు పారిజాతము పట్టుకొని వచ్చుటయు, సత్యభామాగమన సూచనయుఁ గలవు. కవిత్వ మొకింత సరసమైనదే. తిమ్మనామల పద్యములు కొన్ని గ్రహింపఁ బడినవి.

11. కృష్ణసంబంధి కథ :

(ఆం. సా. ప. 3807. దీనికి కవిపెట్టిన పేరేమియో తెలియదు. పరిషద్గ్రంథ పట్టికలో నిది కృష్ణపారిజాతమని పేర్కొనఁబడినది. కాని యిందు పారిజాతప్రసక్తి గానరాదు). విషయము:- ప్రియాన్వేషియైన కృష్ణునకును సర్వసచివుఁడైన మాధవునకును ప్రసంగము - రాధ, రుక్మిణి, సత్యభామయు నొకరి తరువాతనొకరు కృష్ణుని వెదకుచు వత్తురు. రాధాదులకును కృష్ణునకును మాధవుఁడు మధ్యస్థుఁడుగా గొంతప్రసంగము నడుచును. రచన యప్రౌఢము.

12. గొల్లభామ పదము :

(ఆం. సా. ప. 2778). ఈగ్రంథ మొక యతుకుల బొంత. కొన్ని గొల్లకలాపములలోని (ఆం. సా. ప. 3515 మొ.) యక్కడక్కడి ముక్కలతో నొక క్రమమున సంకలితమైన గ్రంథము. ఇందెవ్వనపూడి రంగేశ - రామేశులు, తూమూరి శౌరియు స్మరింపఁబడిరి. సంజీవకవి (తూడూరి శౌరి పుత్రుఁడొక గొల్లకలాపము రచించిన సక్కులపాటి సంజీవకవి) పేరు ప్రసక్తమైనది. గొల్లభామ కథాఖ్యానము "బాపనయ్య," శ్రోతగా సాగిన గ్రంథము. ఈసంపుటి ముఖపత్రముపై నందివాటి నాగయ్యయను పేరు గలదు. అతఁడే గ్రంథసంకలన కర్తయైయుండును.

13. గొల్లవేషపు కథ :

(ఆం. సా. ప. 3515) ఇందును నెవ్వనపూడి రంగనాంచారు ప్రసక్తి గలదు. ఆం. సా. ప. 2778 తో సమానమైన రచన కొంత, భిన్నమైనవి కొంతయుఁ గలవు.

14. గొల్లవేష కథ:

(డి. 1875, 1876). ఇందు వచనములలో ముద్రలు గూడఁ గానరావు. గొల్లల తెగలు, కులమర్యాదలు, బిరుదులు మొదలగు నవి యిందలి విషయములు. సముద్రమథన కథ, సుంకరి కొండని కథయు లేవు. పోల్చిచూడ గొల్లభామ వేషము కథతోఁ గొంతపోలిక గలదు గాని నిశ్చయముగా నిది భిన్నరచన.

15. గోకర్ణేశ్వర విలాసము:

(ఆం. సా. ప. 1854) ధర్మపురీశునకు గోకర్ణేశ్వరునకు సంకేతము. ఇందలి విషయము:— ఆంధ్రదేశమునఁ గృష్ణాతీరమున గోకర్ణక్షేత్రమున దారుకావన మునిపత్నులు శివుని గూర్చి మునుపటి యనుభవము పునరుపలబ్ధికై తపముచేయు చున్నారని నారదుండు శివునికిఁ జెప్పెను. అతఁడు గౌరీసమేతుండై యచటికిఁ బోవును. అతఁడు గోకర్ణమునకు సతీసమేతముగ వచ్చినందులకు నారదునికడ దారుకావనాంగనలు క్షమచింత వెలిబుచ్చిరి. నారదుఁడంతట శివుని కావిషయము నివేదించును. తరువాతి గ్రంథభాగము కొఱవడినది. ఇందలి రచన సలక్షణము, సరళము నైనది. ఇది శృంగార సంకీర్తనాటకమని చెప్పఁబడినది.

16. చంద్రశేఖరవిలాసము:

(తం. స. కే. నం. 519). ఇది అష్టావధాని కవి కృతమని యున్నది. ఆ యష్టావధాని యనునది కవి బిరుదనామమై యుండును. నారదుఁడొక పారిజాతముతో గంగా గౌరులకు సవతికయ్యము గల్పించుట యిందలి ప్రధాన విషయము. ఆ పిమ్మట నీ సంపుటమున నొక గోసంగి మన్నె మాదిగవాఁడొక బవి నీనిని, నవనాథ సిద్ధులు

మొ. వారిని బిలిపించుటయుఁ బదుసరి సురతానీ జక్కిణీ యను నొక రచనా విశేషము (సం. 816 క్రింద కేటలాగులో విస్తృతము) గలవు. ఈ గ్రంథమొక తప్పులతడక. ఇందు చెప్పు మూఁడఱువ మహాటీ ప్రసంగములు నున్నవి. ఇది తంజావూరు మండలమునఁ బుట్టిన రచనగా దోఁచును. ఇందుఁ దాళ్ళపాక వారి సంకీర్తనలప్రసక్తి వచ్చినది.

17. జలక్రీడ :

(డి. 1881-2. కేటలాగులో నీకొండను ప్రత్యేకగ్రంథములుగా నుదాహరింపఁబడినవి. కాని కొండీట భేదము స్వల్పము. కొండీట బందపురి, ఉషమాకి, తిరువళ్ళూరు స్వాముల ముద్రలున్నవి). కృష్ణుని గోపికావస్త్రాపహరణ మింటి విషయము. రచన యొక మోస్తరు. (డి. 1882 లో జలక్రీడ తరువాత విజయరామునేలిన భుజగశయనుని కంకితమైన యొక భామకలాప భాగమున్నది. అందును బంచపురీశుఁడు స్మరింపఁబడినాఁడు).

18. నారదకొరవంజి కట్టణ :

(డి. 1943 - ఇది నారద కురవంజియని కేటలాగు. అది సరి కాదు) సూళాదిచెన్న కేశ వాంకితము, ఇంటి విషయము :- కంస నిర్బంధమున నున్న దేవకీదేవికడకు నారదుఁడు కొరవంజియై పోయి కృష్ణజననము సూచ్చి యొయ్యుక చెప్పుట. ఆ ప్రసంగమునఁ గన్నడము తోద్దిగాఁ బ్రయుక్తము. రచన దోషయుతము.

19. నీలావతీ విజయము :

(డి. 1866 — కేటలాగులో నిది దాదినీవేష కథ యని పేర్కొనఁబడినది. దాదినీవేష మన్నది గక్షిపాము భాగవతుల పగటి

వేషములలో నొకటి. కవి దీనిని "సిలావతీపరిణయంబను నాటక" మని మాత్రము పేర్కొనెను. పగటిచుక్క యను నొక దొంగవాని పాత్ర గలదు. ఆ పగటిచుక్క వేషము దాదినివేషముగాఁ బరిగణింపఁదగిన దగునేమో తెలియదు. ఏతాదృగ్రచనయే తం. స., కే. నం. 543 సంపుటమునను గలదు). గ్రంథవిషయము :— ఉజ్జయిని భోజరాజపుత్రి సిలావతి జాతకము గొప్పదని చెప్పి యామెను బెండ్లాడుమని యొక పురోహితుఁడు మగధరాజును బ్రోత్సహించును. భోజరాజు సమ్మతింపఁడు. మగధేశుఁడు తన కామె నొడఁగూర్చు వాని కర్ధరాజ్య మిత్తునని ప్రకటన గావించును. అంతఁ బగటిచుక్క యను దొంగ యందులకుఁ బూనుకొని భోజాంతఃపురము సొచ్చి రాజపుత్రిని మంచముతోఁగాని పోవుచుండును. ఆమె దారిలో మెలఁకువ గలిగి యాక్రోశించును. అప్పు డాసమీపమున మృగయావిహారానంతర విశ్రాంతుఁడై యున్న మాళవరాజామె మొఱవిని చోరునిఁదరిమి యామె నుజ్జయినిఁ జేర్చును. భోజరాజామెను మాళవపతికే యిచ్చి వివాహ మొనరించును. ఇందలి కథాసన్నివేశము చిన్నది. రచన యొక మోస్తరు. దయవులలో అర్కపురాటీశ్వరుఁడు, అగస్తీశ్వరుఁడును స్మరింపఁబడిరి.

20. పాండవాజ్ఞాతవాసము :

(తం. స. మ., కే. నం. 542). దీని ముఖపత్రమున విరాట్ పురుష నాటకమని యున్నది. గ్రంథనామము పాండవాజ్ఞాతవాసమైనను భారతకథ యంతయు సంగ్రహింపఁబడినది. అజ్ఞాతవాసకథలో నొక ముఖ్య ఘట్టమైన సైరంధ్రీకీచకమే గ్రంథమంతటి నావరించినది. ఉత్తర దక్షిణ గోగ్రహణముల యుబుసేలేదు. ఇందుఁ దిక్కనగారి భావములు, పదబంధములు, విజయవిలాస కవికర్ణరసాయనములందలి

పద్యములు, అక్కయ భీమసేనవిజయ య. గా. నందలి దరువులు నెఱవు తెచ్చుకొనఁబడినవి. పూర్వసంస్కృతగ్రంథము లందలి ప్రసిద్ధ శ్లోకములును గొన్ని గ్రహింపఁబడినవి. ఆయాశ్లోకముల క్రిందుగనుఁ దెనుఁగున వచన వ్యాఖ్యానము గలదు. ఎఱవుసొమ్మున కెందుల కీగఁ బడినాఁడో కాని యీకవి స్వతంత్రరచనయుఁ జక్కఁగనే యున్నది.

21. పారిజాతము :

(డి. 1903, 1904). కృష్ణుని రాణులు, రాధికయుఁ దమ తమ వృత్తాంతములు చెప్పుటతో గ్రంథారంభము. తరువాత పారిజాతఘట్టము. రచన చక్కనిదే. తిమ్మన పోతనల పద్యములు గ్రహింపఁబడినవి. ఇందు చావికొండపేట చెన్నరాయుఁడు, రామ తీర్థహరి, సత్యవరపు గోపాలుఁడును స్మరింపఁబడిరి.

22. పారిజాతాపహరణము :

(డి. 1905) వేంకటేశ్వరాంకితము. తిమ్మన ప్రబంధానుసరణము లెక్కువ గలదు. తాళప్రధానములైన దరువులును గొలఁది పాటి దేశిరచనలును గలిగి రచన బాగుగనే యున్నది. అర్ధచంద్రికలు పలుతావులలోఁ బ్రస్తరింపఁబడుట యొక విశేషమిందు.

23. పారిజాతము లేక భామా కలాపము :

(ఆం. సా. ప. 173) ఇదియొక సంకలితగ్రంథ సంపుటము. ఇందు నరకహరి నారాయణకవి, భారతి రామరాజు, మాతృభూతేశ మొదలగువారి పారిజాత యక్షగానములనుండి దరువులు, కలువాయి శతకమునుండి పద్యములును గ్రహింపఁబడినవి. అతుకులు హత్తుకొని యున్నవి.

24. పెరుంకూరత్తాళ్వారు చరిత్రము :

(ఆం. సా. ప. 175) ధన్విపురీశున కంకితము. దక్షిణదేశమున వైష్ణవ మతప్రవర్తకులగు పన్నిద్దరాళ్వారులలోఁ గూరత్తాళ్వారొకఁడు. ఆళ్వారుల చరిత్ర మాచార్యసూక్తిముక్తావళి మొదలగు గ్రంథములలోఁ గలదు. కూరత్తాళ్వారు చరిత్రమున గాండ్లసతి వైకుంఠమున కేఁగిన కథయు నదృశ్యచోరుని కథయు నిందు వర్ణితములు. ఇందలి భాష సలక్షణమైనదే కాని రచన యొకమోస్తరు.

25. ప్రహ్లాదవిజయము లేక చరిత్ర :

(ప్రచురణ :- మంగు వెంకటరంగనాథరావు. ముద్రణ :- శ్రీరామానంద ము. శా., మదరాసు 1905). ఇందలి దరువులలోఁ గఱుచు రామానుజపురి విహారుని ముద్రగలదు. అచటచటఁ జండసిరి కొండ నరసింహుఁడు స్మరింపఁబడినాఁడు. రచన యొకమోస్తరు.

26. బాలింత కథ :

(తం. స. మ. కే. నం. 484). దేవకీ వసుదేవుల తపస్సు, దేవకి వేవిళ్లు, బలరామకృష్ణుల జననము నిందలి విషయములు. (బలరాముఁడు రోహిణేయుఁడు గాని దేవకీతనయుఁడుగాఁడు). రచన సేలవమైనది. దోషదుష్టము.

27. భాగవతము :

(అడయారు ది. స. గ్రం. జి. నం. 74790). కృష్ణజననాదిగాఁ గంసవధము వఱకుగలఁ దశమస్కంధ కథ యిందు వర్ణితము. సత్యపుర వేణుగోపాలుని కంకితము. రచన చక్కనిదే.

28. భామకలాపము :

(ఆర్. 481) రాయఘడ వల్లభనారాయణస్వామి ముద్రగలది. రాయఘడ ఓడ్రదేశములోనిది. కథాప్రణాళికలోఁ గ్రొత్తదనమేమియు లేదుగాని రచన స్వతంత్రమైనది. రచన కొంత చక్కనిదే. (ఇది గొల్లకలాపమని కేటలాగులోఁ దప్పుగాఁ బేరొక్కనఁబడినది.)

29. భామకలాపము :

(డి. 1919). "ధరసింహాసనమై నభంబు గొడుగై" అను ప్రసిద్ధమగు దసరా పద్యముతో దీని యారంభము. ఇం దెఱుకఘట్టము విశేషము. కవి తన యీకృతిని జక్కనియని పేరొక్కనుట విశేషములలో విశేషము. రచన చక్కనిదే.

30. భామకలాపము :

(ఆర్. 429, డి. 1916–18) ఇదియొక కలగూరగంప సంపుటము. ఇందలి దరువులలోఁ గొడవళ్లూరు, పిప్పర, కలువాయి, తెరిగొండ, ఆతేయపురి, మొగలతుర్తి దేవర పేళ్లు గన్పట్టుచున్నవి. ఆయాయూళ్ల వెలసిన భామకలాపములనుండి కొన్నికొన్ని దరువుల నేర్చి యెవఁడో యీగ్రంథమును సంకలించినట్లు తోఁచును. ఇందు సిద్ధేంద్రుని గ్రంథభాగములును గలవు. (ఈ సంపుటము మంగువారి ప్రచురణ యగు భామకలాపముతోఁ గొంత పోలికగలది.)

31. భారతము :

(డి. 1920). గ్రంథవిషయము విరాటపర్వ కథ. ఇందు దేశి రచన లనేకములు గలవు. రచన చక్కనిది.

32. ముక్తికాంతా కల్యాణము :

(చింతామణివేట) (ఇది ముద్రితము. ప్రచురణ వివరములు తెలియవు. నేఁజూచిన ప్రతి కిన్నెర సంపాదకులగు శ్రీ పందిరి మల్లి కార్జునరావుగారి దగ్గరిది. దాని యట్ట లిరువైపులఁ జిరిగిపోయినవి.) గ్రంథ మద్వైతవేదాంత విషయికమైనది. ప్రబోధచంద్రోదయము వలె సాంకేతికపద్ధతి గలది. ముక్తికాంతకును జీవునికిని వివాహ మిందలి విషయము. రచనయు విషయావిష్కరణమును బాగులేవు. గ్రంథము చివర మంగళగీతములోఁ జింతామణివేట హనుమాన్నా యుఁడు స్మరింపఁబడినాఁడు.

33. రాధవేష కథ :

(డి. 1933) గ్రంథవిషయము, రాధ కృష్ణుని వెదుకవచ్చును. తరువాత మిత్రవింద రాక. త. అర్ధనారీశ్వరవేషము, తద్వర్ణన, గౌరి శివుని, శివుఁడు గౌరిని వెదకుచు వచ్చుట. త. లక్ష్మణా రుక్మిణుల రాకలు, కృష్ణునిరాక. గోపికావస్త్రాపహరణ కథ. త. రాధాకృష్ణ ప్రణయప్రసంగము. కథావిషయము కలగపులగముగా నున్నది. రచన సరసమైనదే. ఇం దంతర్వేది నృసింహస్వామి వీరవెల్లిపాలెము రంగ నాథస్వామియుఁ దలఁపఁబడిరి.

34. రాధవేష కథ :

(డి. 1934). రాధ కృష్ణునిజాడ గూర్చి మాధవి నడుగుటయుఁ దనవలపుసాద వెడలఁబోసి కొనుటయు నిందలి విషయములు. ఇది యేదో యక్షగానములోని భాగము మాత్రము.

35. రాధామాధవ విలాసము

(డి. 1932) చీరాల వేణుగోపాలస్వామి కంకితము. ఇందు గ్రంథారంభమునఁ బద్మసాలెల పట్టుసాలెల ప్రశంస యున్నది. కవి సాలెకులమువాఁడై యుండునోపును. చీరాలయే కథారంగముగాఁ గృష్ణజననము, రాధ పెంపకము, కృష్ణుని బాల్యక్రీడలు, యౌవనము, రాధాకృష్ణుల శృంగారప్రసంగములు నిందలి విషయములు. గ్రంథము తాళప్రధానములైన దరువుల మయము. అల్పదోషము లటనట నున్నను రచన చవిగొల్పునట్టిది.

36. రామనాటకము:

(ఇది కుశలవ నాటకమనువేర ముద్రితమైనది. మదరాసు వెస్లువార్డు ప్రచురణ—1953). నింబాద్రి నృసింహస్వామి కంకితము. అటనట దరువులలో ధర్మపురీశ ముద్రలు గలవు. గ్రంథాంత మంగళ గీతమున సదాశివపేట—ఆదిమపుర నివాసముద్ర గలదు. ఉత్తర రామాయణకథ యిందలి యితివృత్తము. ఇందు శాంతపాత్ర యునికి విశేషము. గ్రంథారంభమున రంభోర్వశుల రాక, పాత్ర ప్రవేశ సూచనలు. తెరవెల్లు దరువులును గలవు. ఒకచో అల్లా, ఖుదా శబ్దములకుఁ బ్రశక్తి గలదు. ఇది యాధునికకృతివఁ దోఁచును. రచన యొకమో స్తరుగాఁ జక్కనిదే.

37. రాములవారి యెఱుక:

(ముద్రణలు - 1. శ్రీలక్ష్మీనృసింహవిలాసప్రెస్, మదరాసు, 1913, అ. ప్రె. ప్రెస్, మదరాసు, 1929). శివధనుర్భంగము జరుగక ముందే శను జూచి మరులుగొన్న సీతకడకు రాముఁ డెఱుకత వేమము

దాల్చిపోయి యవశ్యంభావులగు విషయములను జెప్పుట యిందలి విషయము. రచన యొకమో స్తరు.

38. రుక్మాంగద (చరిత్ర):

(ఆర్. 205, డి. 1935). కథ ప్రసిద్ధము. రచన యల్పదోషములున్నను బాగుగనే యున్నది. ఇందు గ్రంథారంభమునఁ గటికము రాక గలదు. ఇందొక తుమ్మెద పదమున్నది.

39. రుక్మిణీవేష కథ:

(డి. 1936, 1937). క్రమముగా రుక్మిణియుఁ గృష్ణుఁడునువచ్చి తమ తమ వృత్తాంతములు చెప్పి వలపుసాదలు వెళ్లబోసికొనుట యిందలి ముఖ్యవిషయము, రచన యొకమో స్తరు.

40. లక్షణాకల్యాణము:

(రాజమండ్రి ఆంధ్రేతిహాస పరిశోధకమండలి. ప్రతి నం. తెలియదు) కృష్ణమహిషియగు లక్షణపెండ్లి కథ యిందు వర్ణితము. ఇందు తాళప్రధానములగు దరువు లెక్కువ. చందమామ పదము, అర్ధచంద్రికలు, అర్ధరేకులు, ఏలలు మొ. దేశిరచనలు గలవు. కవి రాచికుఁడు. లలిత లలితములగు పదబంధములతో సరసముగా రచన సాగించినాఁడు. దక్షిణులకొఱకు బ్రాహ్మణుల తగవులాట మొ. ఘట్టములు నిసర్గసుందరముగా నున్నవి.

41. లక్ష్మీకల్యాణము:

(గ్రంథమలబ్ధము) క్రీ. శ. 1500 ప్రాంతమందుండిన వెల్లంకి తాతంభట్టు కవి చింతామణి యను లక్షణగ్రంథమున (తే. సం. మం., కే. నం. 779–780). భూపాలలక్షణాధికారమున లక్ష్మీకల్యాణము

లోని శేషులనుపేర "సీరజోదరు రాణి నీలవేణికిని" అను నుదాహరణ మిచ్చెను. శేషులను దేశిరచనా విశేషమిపుడు యక్షగానములందు మాత్రమే యటనటఁ గన్పట్టుచున్నవి. కావున నాలక్ష్మీకల్యాణము యక్షగాన మగునని కొంద ఊహాగాన మొనర్చిరి. అది యథార్థమే కావచ్చును కాని యీ యుదాహరణము ద్విపదపాదమగుట గమనింపఁదగినది. ఇట గమనింపఁదగినది మఱియొక విషయమును గలదు. గౌరీకల్యాణమువలెనే లక్ష్మీకల్యాణ మనుపేర నొక పెండ్లిపాటయుఁ గలదు. (చూ. తం. స. మ. కే. నం. 674—మన్నారుదేవుని హేమాబ్జ నాయికా స్వయంవరము. అందది యచ్చముగా ద్విపదపాదములలో నుండుట గమనింపఁదగినది.)

42. శతకంఠరామాయణము:

(అడయారు ది. స. గ్రం. జి. నం. 74862). తన జ్ఞాతియగు దశకంఠునిఁ జంపిన రామునిపైఁ బగసాధింప నెంచిన మాయాపుర రాక్షసపతి శతకంఠుఁడను వానిపై రాముఁడు సతీసమేతముగా దండెత్తుటయు, సీత శతకంఠుని సంహరించుటయు నిందలి ప్రధాన విషయము. ఈ చిత్రకథ కాకరము వాసిష్ఠరామాయణము. ఈ య. గా. రచన పేలవము, దోషదుష్టము నైనది. గ్రంథప్రతి విలేఖన కాలము శుక్ల ఫుష్య బ ఁ౩ శుక్రవారము-క్రీ. శ. 2-2-1810. లేఖకుఁడు బమ్మల్లి నారప్ప కుమారుఁడు రామప్ప.

43. శివరాత్ర మాహాత్మ్యము:

(ఆం. సా. ప. 3802) గ్రంథము మట్టివాడ పురీశున కంకితము. మట్టివాడ ఒరంగల్లు చెంతనున్నది: దీనిని తెలంగాణ య. గా. గా గణింపవచ్చును. గ్రంథకర్త రామమూర్తి గురుమూర్తి

శిష్యుఁడఁట. ఈ రామమూర్తి గో. క. సం. లో క్రీ శ. 1814 ప్రాంతమున మట్టివాడలో నుండినవాఁడని యుదాహరింపఁబడిన పరశు రామపంతుల రామమూర్తి కవి యగునేమో; గ్రంథ ప్రతిపాదిత విషయము భారతాది పర్వమందలి కల్మాషపాద కథ. రచన సలక్షణ భాషలో నున్నది కాని సామాన్యమైనది. ఇం దధ్యాత్మలనుపేర నొక ద్రువా విశేషమున్నది.

44. సవతివాదము:

(డి. 1951, 1952 - రెంటికిని స్వల్పభేదము). పారిజాతము కారణముగా రుక్మిణీ సత్యభామల సవతికయ్య మిందు వర్ణితము. రచన సరసమైనది. (డి. 1951 లో దీవికొండ, విడియాపురి చెన్న కృష్ణులును, 1952 తరువాతి గ్రంథభాగమునఁ గేశవరపు గోపాలుఁడు, పొట్లదుర్తి చెన్న రాయుఁడును స్మరింపఁబడిరి. అసలివి యన్నియు భామకలాపముల భాగములవలె నున్నవి.)

45. సముద్రమథనము:

(డి. 1946-సమగ్రము, డి. 1948 - అంత్యభాగము లుప్తము. డి. 1950 - నడుమను జివరను గొంత లుప్తము) తాడిపర్తి గోపాల ముద్రగలది. పోతన భాగవత క్షీరసాగరమథన కథాసందర్భమునందలి పద్యములు, ఆత్రేయపురి గొల్లకలాపమునందలి పరువులు సనేకము గ్రహింపఁబడినది. కవి స్వంత మతిస్వల్పము.అదియు నేమంత ప్రౌఢమైనదికాదు.

46. సాంబశివ విలాసము:

(డి. 1953, 1954) గ్రంథారంభమున పట్టిన వీరభద్రస్వామి ప్రశంసగలదు. గోదావరి పాయ యగు వసిష్ఠసాగర సంగమస్థలమున

వెలసిన లక్ష్మణేశ్వరుని పరముగా గంగా వివాహము, నారదుని కైలాటము కారణముగా గంగా గౌరీ వివాదము నిందలి విషయములు. రచన సరసముగనే యున్నది. ప్రదర్శనయోగ్యత బాగుగా గలది. కవి దీనిని సంగీతప్రబంధమని పేర్కొని యుండెను. గ్రంథకర్త గోదావరీ మండలవాసి.

47. సాత్రాజితీ పరిణయము:

(డి. 1955). దీని యసలు పేరిదికాదు. ఇకయొక భామకలాపభాగము. మాధవితో సత్యభామ స్వకీయ పృత్తాంతము చెప్పుటతో గ్రంథారంభము. ఇందలి కొన్ని దరువులు, ద్విపదలు, పద్యములు నితర భామకలాప సామాన్యములైనవే. ఇందొకచో సిద్ధేంద్రయోగి కవితా రచనయని కలదు. గ్రంథ మసమగ్రము.

48. సురతాణి కల్యాణము:

(ప్రచరణ-కర్రా అచ్చయ్య అండు సన్ను వారిచే చింతామణిము. శా. రాజమండ్రి, 1925). అచ్యుత విజయరంగని కంకితము. శ్రీరంగనాథుని ప్రియురాండ్రలో నొకతెయగు బీబినాంచారి కథయిందు వర్ణితము. రచన దోషభూయిష్ఠమైనది. క్రీ. శ. 1854 ప్రాంత మందుండిన వారణాసి అచ్యుతరామకవి (చూ. ఆంధ్రదేశ య. గా. కవుల ప్రకరణము) సురతాణిపరిణయ ప్రబంధమున నంతకుముందాకథ యక్షగాన రూపమున నున్నదని చెప్పబడినది. ఆ. సు. ప. య. గా. ఇదే యగునేమో!

అనుబంధము

(4)

(అ) కొన్ని భామ కలాపములు

1, మంజువాణీ ము. శా. ప్రచురణ, ఏలూరు. మొదటి కూర్పు, 1906 :- ఇది వివిధ భాగవతుల ఘణితులు గలది. ఇందు మొదటి తొమ్మిది పుటలును వేణీ ప్రబంధము (భామ వేషము తెర లోనికి వచ్చి తెరపై జడవై చుట-తత్ప్రశంస) గ్రంథకర్త నరసింహాదేవర వెంకటశాస్త్రి. ఇతఁడాపస్తంబ సూత్రుడు. శ్రీ వత్సగోత్రుఁడు. బ్రహ్మాయ్య పౌత్రుఁడు. ఉమామహేశ్వర సూరికిని సీతనూంబకును బుత్రుఁడు. ఇతని రచన చక్కనిదే. ఇందు రావిశొండపాక చెన్నా రాయఁడొకచో స్మరింపఁబడె. వేణీప్రబంధమునకుఁ బిదప నొక మూఁ డాకులు సిద్ధేంద్ర యోగి రచించ గలదు. తదుపరి రెండవ పుట వఱకు నకరకంటి నృకేసరి కంకితమైన కందాళ సింగరాచ్యుని "పారిజాత ప్రబంధంబు నందు - శ్రీకృష్ణచిద్విలాసంబను యక్షగానము"-సత్యా మాధవ విలాస మనియుఁ దన్నామాంతరము. ఇది నాటకమనియుఁ బేర్కొనఁబడినది. ఇందు కలువాయి శతకములోని పద్యమొకటి గ్రహింపఁ బడినది - సత్యభామ రాయబారము సందర్భమున. ఇందు సత్యభామ కృష్ణునికి వ్రాసిన జాబులు రెండున్నవి. రెండును ప్రబంధోచిత వచన రచనా విలసితములు. మొదటిదానిలో నకరకంటి లక్ష్మీనరసింహుఁడును, రెండవ దానిలో వెత్సలపురి విశ్వనాథమూర్తి ప్రియ సఖుఁడగు ద్వారకాపురవాసుఁడును స్మరింపఁబడిరి. రెండవ దానిలోఁ జివర "కిర్లకప్పయ్య దాసపోషా" అను ముక్క యొకటి కనఁబడుచున్నది. రెండవ యుత్తర మొక దోపుపుల్ల వలెఁ గన్పడు

చున్నది. రెండుత్తరము లందును "ఫలాని తారీఖు" అను నొక ప్రయోగ విశేషము గలదు. తరువాత, సత్యభామ విరహ వేదన సందర్భమున మృత్యుంజయ విలాసములోని "ఉదయాద్రి కరిమీఁద హరుముంజిచౌడోలు" మొ...పద్యము లుద్ధరింపఁబడినవి. త॥ సత్యా కృష్ణుల సంవాదము సందర్భమున "సరస దరహాస ద్వారకాపుర నివాస మదన గోపాల రాధికాహృదయలోల" యను మకుటముతో నేడు పద్యములు గలవు; తరిగొండాధిప ముద్రతో నొక దండకము దరువు గలదు. త॥ సవతుల కయ్యము ఘట్టము - చక్కని జాతీ యములతో సాగినది. రాధయుఁ బొల్గొనినది. సవతుల సమాధాన ముతో గ్రంథాంతము. గ్రంథమున నారదా గమనము చెప్పఁ బడ లేదు కాని పారిజాత ప్రసక్తి మాత్రము వచ్చినది. వేణీ ప్రబంధ మున రెండు దరువులు, నిఱువది పద్యములు, మూఁడు ముచ్చటలును గలవు. కాని సింగరార్యుని కృతిలో దరువులు జాలఁగలవు. ద్విప దలు, పద్యములు నెక్కువయే. వచనములు కొద్ది. సం. చూర్ణిక యొకటి. సందర్భాను సారముగ సం. శ్లోకములు కొన్ని యుదాహ రింపఁబడినవి. రచన చాల చక్కనిది. కాని చక్కని దంతయు నీ కవిది కాదు. గ్రంథము చివరి భాగము కొంత కలగా పులగమైనది.

2. మం గు వెంకట రంగనాథరావు గారి ప్రచురణ, కాకినాడ, మొదటి కూర్పు, 1913:-

గ్రంథముపై నిది శ్రీమంగు జగన్నాథరావు పంతులు (ప్రచు రణ కర్తకుఁ దండ్రి కాఁబోలు) గారిచే రచింపబడిన దని గలదు. గ్రం థాంత గద్య – "శ్రీమధుభయకవి రచిత - అభినవ పారిజాతనవర సాలంకార శోభిత శ్రీమద్భారద్వాజ స్తగోత్ర తిమ్మయ్యనామసత్పుత్ర వాధూలాస్వయ గోత్ర శ్రీమత్కుందాళ వేంకటాచార్య కటాక్షాంచిత

శిష్యవర్గ మంగు కులోద్భవ శ్రీజగన్నాథ నామధేయ శ్రీమన్మహాకవి సిద్ధేంద్ర యోగికరుణాకటాక్ష వీక్షితంబైన శ్రీసత్యభామా విలాసంబను పారిజాత గ్రంథం" బని యున్నది. ఇంకు సిద్ధేంద్రుని భామకలాప భాగము గొంత, తిమ్మన్నగారి పారిజాతాపహరణము, వసుచరిత్ర, మృత్యుంజయ విలాసము మొ॥ పూర్వకావ్యము లందలి రచన కొంత యథాతథముగను ననుకరణ పూర్వకముగను జేరినది. ఇందలి విరహ భాగమున నిది యాకువీటి పురనివాసి యైన జగన్నాథ పండితుని ప్రేరణమున వీరేశలింగ మను నతఁడు రచించినట్లు గలదు. ఆవెంట నున్న జడవర్ణన వెంకటశాస్త్రి వేణీ ప్రబంధమే. ఈ గ్రంథమున వల్లూరు, ఆకువీడు, కేశవరము, పోటగుప్పి, పిప్పర, కుందపురి, కొడవళ్ళూరు నెలి మర్ల హరి ముద్రలతో దరువులు గలవు. 'సరసదరహాస ద్వారకాపుర నివాస బాలగోపాల రాధికా ప్రణయ లోల' అను మకుటముతో నైదు సీస పద్యములు సత్యా కృష్ణ సంవాద భాగమున నున్నవి. ప్రా. లి. పు. భాం. లోని ఆర్. నం. 429 భామకలాపము నందలి దరువులు, పద్యములును గొన్ని దీనఁ గన్పట్టుచున్నవి. ఇందలి మూర్ఛావస్థ భాగమున దశావతారముల జతులు గలవు. అందు పదు నొకండవదగు నొక విడి జతి భోసల శరభోజి రాజాంకితముగానున్నది. (ఈతఁడు తంజావూరి మహారాష్ట్రప్రభువు). కాఁగా నీగ్రంథ సంపుట మొక కలగూరగంపయై యున్నది. ఇట్లు వివిధ కవుల రచనా విన్యాసములు గల్గియు నిది యొక యానుపూర్వికలిగి, యా రచనా విన్యాసములు పొందు పొసఁగి యొక సమగ్ర సుందరమైన భామకలాపముగా రూపొందినది. గ్రంథము ప్రస్తావ, విరహ, దూతికా సంవాద, స్వప్నావస్థ, అవధి, భామాసంవాద, మన్మథోపాలంభ, చంద్రోపాలంభ వాయూపాలంభ, మూర్ఛావస్థా, సపత్నీ కలహము లను పదునొకండు భాగములుగా వింగడింపఁబడినది. ప్రతిభాగాంత గద్యయందును నాయా

భాగములందలి విషయ సంగ్రహ ముదాహృతము. ఇందుఁ బ్రసిద్ధ రాగ తాళములలో దరువులు, ద్విపదలు, పద్యములు, సంస్కృతశ్లోక చూర్ణికలు, కందువలు ముచ్చటలు ననుపేరఁ బాత్ర ముఖముగాఁ బ్రయుక్తము లైన వచనములను గలవు. దశావతారముల జతులు, రాసక్రీడాష్టకము విశేషములు. ఏకాదశ భావనములు, సప్తతాళ ములు, అష్టాదశరాగములు, చతుర్దశ పదాభినయ పద్ధతులు, దశవిధ తరికలును గలిగి యలంకారశాస్త్రముఁకు సంగీతాభినయ శాస్త్రము లకును నికషప్రాయముగా నున్నదీ గ్రంథరాజము. ఇది సంవాద శైలీప్రచురమైనది. సంవాదము లెక్కువగా రెండుపాత్రల నడుమనే జరుగును. మాధవి పాత్రయు, నాత్మాశ్రయ ఫక్కియుఁ, బ్రబంధన యోగ్యతయుఁ గలవు.

3. ఆం సా. ప., నం. 4474 – భామ కలాపముల సంపుటము.

ఇందు పలునాల్లు ముద్రలు గల భామకలాపము గ్రంథ భాగ ములు సంకలింపఁ బడినవి. విషయానుపూర్వి లోపించి గ్రంథము కలగాపులగముగా నున్నది. ప్రతిచివర లేఖకుని వ్రాత యిట్లున్నది :–

"ఖర సం. అధిక వయిశాఖ శు ౧౦ కాదంబరి సద్రాజువ్రాస్ని ప్రతిని బొల్లాప్రగడ బ్రహ్మన్న భామవేష కలాపం సంపూర్ణంగా వ్రాసెను'. ఇందలి ముద్రలలోఁ బేర్కొనఁబడిన దేవరలు : కొప్పాక పురి విహారుఁడు (ఇది ఉప్పలూరిజంటకవుల కలాపము భాగము), నరు కూరు కేశవస్వామి, (నరుకూరు నారాయణకవిపారిజాతము భాగము), ఆత్రేయ పురపు గోపాలుఁడు (ఆత్రేయ పురపు తమ్మయ్య కృతి—దీనిని బట్టి తమ్మయ గొల్లకలాపమునే గాక భామ కలాపమును గూడ రచించెనని తెలియ నగును). అర్తమూరు గోపాలుఁడు, కట్లమురి

వాసుఁడు, యానాము పురిరాయఁడు, కొడవలూరి గోపాలుఁడు, భద్రగిరివాసుఁడు, కేశవరపు గోపాలుఁడు, ద్వారకా పురవాసుఁడు, సత్యవరపు గోపాలుఁడు, ఆకుపీటి మదన గోపాలుఁడు, అరకట్లరామ చంద్రుడు, మొగలతుర్తి బాలగోపాలుడు. ఇందుఁ బేర్కొనఁబడిన కవులు :- తమ్మయ్య, (అత్తేయపురి), కొప్పర్తివెంకట దాసు, పుల్ల కవి, ఉప్పలూరి జంట కవులు, (వీరరాఘవుఁడు, గంగాధరుఁడు). ఈ గ్రంథమును బట్టి యాంధ్రమునఁ బలుతావుల భామకలాపములు వెలసిన వనియు, భామ కలాపమునకు బ్రబాదర మధికముగా నుండెడి దనియు నూహింప నగును.

4. అం. సా. ప., సం. 4120 'వివిధ వినోదము'లను నొకసంకీర్ణ గ్రంథమునఁ గొన్ని భామ కలాపముల భాగములుగలవు. అవి అయిన వరము భామకలాపము, ధర్మపురి భా. క., దివ్వెలపురి వల్లభరాయాంకిత భా. క. (ఎవరో లక్ష్మీవర దాసుఁడు దీని కర్తయఁట), పాలగిరి చెన్న కేశవాంకిత భామకలాపము, వేదాచల నరసింహాంకితము, తిరుపతి వేంకటేశ్వరాంకితము; ఇవి కాక కాళహస్తి శివపారిజాతము, ఊటుకూరి వారి గొల్లకలాపము, సుబ్బకవి కృతమైన తాడిపత్రి కృష్ణ చరిత్ర (హిందీభాషా ప్రచురమైనది) యను గ్రంథములును గలవు.

---

* 19 శ. ఉ: భా., 20 శ. పూ. భా. విశాఖ మండల భాగవతులందు భామ వేషము వేయుటలో మిక్కిలి ప్రతిష్ఠ గడించినవారు (1) కందాళ చిదంబరం (కళ్ళేపల్లి) (2) మంథా కామప్ప (కళ్లేపల్లి). (3) వంకాయల బలరామభక్త (బొబ్బిలి ప్రాంతము), (4) కాలుగుంటి వెంకటస్వామి (బొబ్బిలిప్రాంతము) (5) వరదా నారాయణ (రామవరం) మొ॥వారు. 1860-1912 ప్రాంతమున గజపతి నగరము దగ్గర లోగీశాగ్రహార వాస్తవ్యులు, చీకటి సంస్థానాస్థానపండితులు ౨ న పప్పు అప్పల నరసింహశాస్త్రిగారును భామకలాప గ్రంథరచనా ప్రదర్శనములు గావించి రని శ్రీ పప్పు వేరయ్య శాస్త్రిగారు చెప్పినారు. (అగ్రంథ మలభ్యము) ఈ ప్రాంత

(ఆ) మఱికొన్ని యక్షగానములు

1. పద్మినీ పరిణయము : ప్రా. లి. పు. భాం. ప్రతి డి. నెం. 1897. కర్త వెంకటపతికవి. వైష్ణవుఁడు. ఆదికేశవనాథస్వామి భక్తుడు. భట్టరాచార్య శిష్యుఁడు. రామాయణనంబి పౌత్రుడు. వెంకటనంబి పుత్రుఁడు. కాలము తెలియదు. కృతి రంగధామున కంకితము. యక్ష గానమని వేర్కొనఁబడినది. ఒరయూరి నాంచారికథ యితివృత్తము. రచన చక్కనిది. తఱుచు జంపె, కుఱుచజంపె, తిప్పట, అట్టాది తాళ ప్రధానములగు రేకులు, జాత్యుపజాతి వృత్తములు, సమ లఘు సర్వత్రః ప్రాసనీసములు, అర్ధచంద్రికలు, ఏలలు, నడలు, ధవళము, ద్విపద, వచనములును గలవు. కొంత ప్రాచీనమైన రచనగాఁ దోఁచును. రాజు గారి మస్తాబు, నగరాలంకరణ మొ॥ విషయములందు నాయకరాజుల నాటి తంజావూరి తీరు కొంత కన్పించును.

2. ప్రహ్లాద నాటకము : వెస్టువార్డు అండుకో ప్రచురణ. మదరాసు, 1953. ఈకృతికర్త తాను –

'శ్రీకి ధామంబయి చెలఁగు నద్ధంకి తా
తాచార్య శిష్యప్రధాను డనఁగ
వన్నెకెక్కిన తిరువలికేణి వంశాబ్ధి
సోముఁ డా నరపయ సూరికిఁ బ్రియ
సుతుఁడు వేంకటరామ సోదర గురుచంద్ర
సుతుఁడు రామానుజ సుకవి వరుఁడ.

మందలి నరసింగపల్లి కలాపములు, భమిడిపాటి అప్పకవి, ఉప్పలూరి వీరరాఘవులు, మృత్యుంజయ నిశ్శంక బహద్దరు, గుడిమెట్ల రామయ మొ॥ వారి కలాపముల ప్రసక్తి మీఁద వచ్చినది. దీనివి బట్టి నాఁడు విశాఖమండలమున భామ కలాపమునకు గల వ్యాప్తి యెట్టిదో తెల్లమగును. ఇట్లాంధ్రదేశమున వివిధమండలములలో ఈ భామకలాప వ్యాప్తికి ముందు నాఁటి కూచిపూడి మేళముల వారు చేసిన పర్యటనయే కారణమనుకొందును.

నని చెప్పుకొనియున్నాఁడు. కవికాలము తెలియదు కాని గ్రంథమందలి ద్వారపాలకుని ఉద్దూ ప్రసంగము మొ॥ విషయములవలన ఆధునికుఁడని యూహింపవచ్చును. గ్రంథము రామానుజ పురధామున కంకితము. దరువులలో నాస్వామి ముద్రలు గలవు. (ఆముద్ర గలిగిన మంగువారి ప్రచురణ ప్రహ్లాదవిజయము వేఱు ఇదివేఱు).* నాటకమని వేర్కొనఁ బడినది. 19 శ. ఉ. భా. య. గా. బాణీనున్నది. ప్రసిద్ధ రాగతాళ ములలో ధరువులు, ద్విపద, పద్యములు, అర్ధపద్యములు, శ్లోకములు, సంధివచనములును, సంభాషణవచనములును గలిగి మంచి నాటకపు వాటము గలిగియున్నది. రచన కొంత చక్కనిదే.

3. చిరుతలరామాయణము : చందా నారాయణశ్రేష్ఠి ప్రచురణ సికిందరాబాదు, 1954. కర్త కల్పగూరు కృష్ణదాసు. ఇదియొక తెలంగాణా య.గా. ఆధునిక మైనదిగా దోఁచును. దరువులు (పాత్ర ప్రవేశ, సంవాద సందర్భములందును గలవు) మిక్కిలిగా, సంధివచనములు పద్యములు నక్కడక్కడగా, వచన సంవాద ప్రాచుర్యము గలిగియున్నది. రచన యొక మోస్తరు.

* * *

(ఇ) వెనుక వేర్కొనఁబడిన కవులలోఁ గొందఱి కాలముగూర్చి యీక్రింది విషయములు గమనింప వేఱెదను.

1. కాకునూరి అప్పకవి : (పుట ద్వి.భా. 29) అప్ప కవీయమునఁ దద్రచనారంభవత్సరము 'శాలివాహన నామ శకమున గజశైల శర సుధా కిరణుల సంఖ్య'గాఁ బేర్కొనఁ బడినది. ఆమట్టున నది క్రీ. శ. 1656 అగును. కాని యాసీసము క్రింది యెత్తు గీతియందే అతనికిఁ గల వచ్చిన దినము 'అంగజాబ్దంబునను దక్షిణాయనమున జలధరర్తువు

మొదలి మాసంబునందు బహుళమున దేవకికిఁ జక్రపాణి పుట్టినట్టి యష్టమి యని పేర్కొనఁ బడినది. ఆ మన్మథ శ్రావణ బ. ౮ (కృష్ణాష్టమి) ఇండియన్ ఎఫిమెరసు ప్రకారము క్రీ. శ. 14-8-1955 అగుచున్నది. గ్రంథరచనారంభ దినము ఆ 'దశమాసురగురు వాసరము' గా బేర్కొనఁ బడినది. అది 16-8-1655 అగును. కాఁగా మూఁడ శకవత్సరము వేర్కొనఁబడిన-చోట 'గజ' శబ్దము కడ నేదో చిన్న గిడత యుండి యుండును.

2. పురిజాల లక్ష్మీనారాయణ : (పుట ద్వి. భా. 68): ఈతని పారిజాతము కృతి ప్రోత్సాహకుఁడగు పాలకొండ రామభద్ర నృపతి కాలము తెలియ వచ్చుట లేదంటిని. కాని అడిదము సూరకవి చాటువులలో నొక పద్యమున (చూ. వేటూరి వారి చాటు పద్య మణిమంజరి ద్వి. భా. పుట. 130) పాలకొండ రామభద్ర నృపతి ప్రసక్తి వచ్చినది. సూరకవి కాలము క్రీ. శ. 1720-1785 ప్రాంతము (శ. క. చ. పుట 336). రామభద్ర నృపతియు నప్పటివాఁడే యగును. కాఁగా ల. నా. కవి కాలము 1799 ప్రాంతమని నేను చేసిన యూహ సమంజసము కావచ్చును.

3. సిద్ధేంద్రయోగి : (పుట ద్వి. భా. 30) ఈయన కాలముగూర్చి యిటీవల భారతిలోఁ గొంత చర్చ జరిగినది. కాని యది నిర్ధారకముగా లేదు. కొంద ఱన్నట్లు 16 శ. ఆరంభమునకే కూచిపూడిభాగవతులు ప్రసిద్ధులు కాని సిద్ధేంద్రయోగి కాఁడు. సిద్ధేంద్రయోగి యూనాఁటి వాఁడనుట కాధార మేమియు లేదు. ఆయన తోడనే కూచిపూడివారి నాటక ప్రదర్శన వ్యాసంగము మొదలైనదని చెప్పుటకు వీలు లేదు. కూచిపూడి కులపతులలో సిద్ధేంద్రుడు సుప్రసిద్ధుడగునే కాని యతఁడే ఆద్యుఁడనుటకు వీలులేదు. వారి గురుపరంపరలో నడుమ

నీతఁడొక తరమునకుఁ జెందినవాఁడు. అయితే ఆ తరమున నతని భామకలాపము సృష్టితో కూచిపూడి భాగవతుల ప్రతిష్ఠ పరాకాష్ఠ నందిన దని చెప్పవచ్చును. పదునాఱవ శతాబ్దినాఁటికి భామకలాపము తెలుఁగుమూగాణముపై వెలసిన జాడ గానరాదు. ప్రబలములైన ఆధారాంతరములు గనుపట్టువఱకును గడచిన తరము పండితులు దలఁచినట్లు సిద్ధేంద్రుఁడు 17 శ. ఉ. భా. న నుండెననుకొనుటయే సమంజసముగాఁ దోఁచును.

వివిధానుబంధములు

అలభ్య యక్షగానములు

(అ) ముద్రితములు

1. ఆంధ్ర వాఙ్మయ సూచికలో నుదాహరింపఁబడినవి :—

గ్రంథ నామము	గ్రంథకర్త	ప్రచురణ సం.
1. ఇంద్రాహల్యా విలాసము	సుబ్రహ్మణ్యకవి	1898
2. ఉషా పరిణయము	కూర్మనాథ కవి	1893
3 ఉషాపరిణయ నాటకము	ఆనంద దాసు	1873
4. కుచేలోపాఖ్యానము	తిరుమల రాఘవాచారి	...
5. కౌసల్యా నాటకము	నింబగిరిదాసు	...
6. గోపాల విలాసము	శ్రీనివాసాచారి	1865
7. గోపికా వస్త్రాపహరణము	ఆంబటిపూడి ఆనందయ్య	1908
8. గౌరీ విలాసము	రామన్నకవి	...
9. తారా శశాంక విజయము	యమ్. వెంకటదాసు	...
10. ,, ,,	ఎమ్. యన్. వెంకటవరదాచారి	1880
11. ధర్మాంగద చరిత్ర	తిమ్మరాజు పాపయ్య	1809
12. నంది నాటకము	కోదండ రామకవి	1869
13. నల చరిత్ర	వీరమల్లయ్య	1891
14. ,,	కన్నయదాసు	1898
15. ,,	శేషాచల దాసు	...
16. బాణాసుర యుద్ధము	ఆకెళ్ళ సత్యనారాయణ	1915
17. భాగవత కలాపము	నండూరి కనకయ్య	1912
18. మీనాక్షీ కల్యాణము	కన్నయ్య దాసు	1916
19. రామజనన నాటకము	నాగినేని వెంకటప్ప	1909
20. శశిరేఖా పరిణయము	గంగాచార్యులు	1889
21. ఏకాంతసేవ	కుందుర్తి ఆదినారాయణశర్మ	1921—25
22. గజానన విజయము	రామబ్రహ్మదాసు	,,

23. కొల్వేపల్లి శశిరేఖా పరిణయము	వల్లభనేని చౌదరి	1921—25
24. చంద్రకాంత నాటకము	చింతా వీరభద్రయ్య	,,
25. రంభా రావణ సంవాదము	వి. బ్రహ్మాచారి	,,
26. వేంకటేశ్వర విలాసము	నవుహరి జగన్నాథశాస్త్రి	,,
27. సీమంతినీ ప్రభావము	మండ చాలకృష్ణమూర్తి	,,

గ్రంథనామము.	గ్రంథకర్త.	ప్రచురణ సం.
28. సుందరాపుర మల్లేశ్వర స్వామి సేవాకలాపము	ఆరవిల్లి శేషప్ప	1921—25
29. ద్రౌపదీ వస్త్రాపహరణము	గోపాలుని హనుమంత రామశాస్త్రి.	1926-27
30. శ్రీకృష్ణ తులాభారము	,, ,,	1927
31. శ్రీరామనామ మాహాత్మ్యము	బుద్దాల నాగయ్యదాసు;	,,
32. హనుమజ్జనన నాటకము.	విశ్వబ్రహ్మ లక్ష్మణార్య	,,

2. ఆంధ్రనాటక కళా పరిషత్తు (మచిలీపట్టణము) కార్యదర్శి పురాణం సూరిశాస్త్రిగారు ప్రకటించిన పట్టిక లోనివి :-

గ్రంథము:—	గ్రంథకర్త – ఊరు.	ప్రచురణ సం.
1. ఉషా కల్యాణము.	నాగినేని వెంకటప్ప (అమ్మనబ్రోలు)	1915
2. కీచక వధ	టి. వి. నరసింహారావు నాయుడు (మదరాసు)	1914
3. కుశలవ నాటకము	కోడూరు సుబ్బారావు	1913
4. గయనాటకము	వల్లభనేని రామకృష్ణయ్య (గాజులపల్లి)	1911
5. కృష్ణలీలా నాటకము	నాగినేని వెంకటప్ప	1914
6. చంద్రమతీ పరిణయము	డి. పాచార్యులు (మదరాసు)	1915
7 చంద్రరేఖ	తిరుమల శేషాచారి (మదరాసు)	1910
8. చంద్రహాస	,, ,,	
9. చంద్రాంగద నాటకము.	నంబాపు వెంకట శేషాచారి (బాపట్ల)	1914

గ్రంథము	గ్రంథకర్త-ఊరు	ప్రచురణ సం.
10. చిత్ర సారంగధర	నాగినేని వెంకటప్ప	1915
11. దేసింగు మహారాజు చరిత్ర	గుండు చంద్రమౌళి	1914
12. ద్రౌపదీ వస్త్రాపహరణము	బి. వెంకట నరసింహము (బాపట్ల)	1904
13. ప్రహ్లాద చరిత్ర	తిరుమల శేషాచారి (మదరాసు)	1910
14 మార్కండేయ జననము	తిరునగరి వెంకటరామానుజాచారి	,,
15. మైరావణ నాటకము	పోతుకూరి సుబ్బయ్య (కావలి)	1915
16. రంభారామా విలాసము	ములుమూడి ఆక్కన్న (నెల్లూరు)	1905
17. రామలీలా నాటకము	నాగినేని వెంకటప్ప	1914
18. రామాయణము	నీలి వీరరాఘవదాసు (ఒంగోలు)	1913
19. రుక్మాంగద	కొడమూరు రామచంద్రరాజు (రామేశ్వరం)	1914
20. రుక్మాంగద	గోలి గురుస్వామి	1904
21. విజయరాఘవ నాటకము	కర్నూలు తాయన్న	1906
22. శాంత సారంగధర	చెమికల చెన్నా రెడ్డి (పార్లపాడు	1915
23. సంగీత హరిశ్చంద్ర	,, ,,	,,
24. శాకుంతల నాటకము	ముదికొండ మల్లికార్జునకవి (బెజవాడ)	1909
25. శ్రీకృష్ణ పారిజాతాపహరణము	కంతేటి రాఘవయ్య (చెన్నపురి)	1903
26. శ్రీకృష్ణ బాలక్రీడా విలాసము	వి. వెంకట నారాయణకవి	1901
27. సత్యవతీ పరిణయ నాటకము	నారాయణ అనంతాచారి	1913
28. సత్యాద్రౌపదీ నాటకము	ఎ. వెంకట శివరావు (గుత్తి)	1914
29. సారంగధర	పూళ్ల అప్పలనరసయ్య (విజయనగరం)	1907
30. సీతాకల్యాణము	యాగళ్ళ జానకీరామయ్య (పాతపెక్కలి)	1911
31. హనుమదభ్యుదయము	దేవినేని సూరయ్య (చల్లపల్లి)	1913
32. హరిశ్చంద్ర	పరశురామ శేషాచార్యులు	1907
33. ,,	తుళ్ళూరి పిచ్చయ్య (గుంటూరు)	1912
34. ,,	నాగినేని వెంకటప్ప	1909

3. ఆంధ్రపత్రిక 12 వ సంవత్సరాది (దుర్మతి–1921) సంచికలో పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు ప్రకటించిన పట్టికలోనివి :–

గ్రంథము	గ్రంథకర్త
1. ఉషా పరిణయము	అనంతకవి
2 కుచేలోపాఖ్యానము	సుబ్బు లింగాచారి
3. ధర్మాంగద చరిత్రము	నరసింహకవి
4. నల చరిత్రము	రా. అప్పాజీకవి
5. నృసింహ చరిత్రము	కోదండ రామకవి
6. పరతత్వ సుధానిధి	సోమసుందర మొదలి
7. బాణాసుర విజయము	వీరనారాయణకవి
8. యతిరాజ విలాసము	సుందరనాయనార్ శేషాచలదాసు
9. రంగనాథ విలాసము	లింగం వెంకటరాయమంత్రి
10. రామ నాటకము	శఠగోపాచార్యులు
11. రుక్మిణీ కల్యాణము	రాజా లక్ష్మోజీ
12. వల్లవీ పల్లవము	సింగరాచార్యులు
13. వెంకటేశ్వర విలాసము	సూర్యకవి
14. శర్మిష్ఠా విలాసము	వెంకటదాసు
15. సీతాకల్యాణము	చిత్రకూటం వెంకటశేషయ్య
16. సుధాస్వాదనము	వెటకట దాసు
17. సుభద్రా పరిణయము	రాఘవాచార్యులు
18. హంసక విలాసము	పరమానందకవి

–♦ ఈ పట్టికలో కర్తల పేర్లు పేర్కొనబడనివి ♦–

1. అంబరీష మహారాజు నాటకము
2 నందుల కాటమరాజు నాటకము
3. నృగమహారాజు నాటకము
4. పట్టాభిరామాయణము
5. ప్రద్యుమ్న నాటకము
6. ప్రద్యుమ్నానంద నాటకము

7. భవానీశ్వర పరిణయము
8. రంగనాథ శశిరేఖాపరిణయము
9. శర్వరీ విజయము
10. శశాంక విలాసము
11. శ్రీరంగమాహాత్మ్యము
12. సత్యవతీ విలాసనాటకము
13. సానంగోపాఖ్యానము
14. సీతాపహరణము
15. సూనుసుద్యోజయము
16. హాలహాల పానము

4. బ్రిటిషు మ్యూజియమ్ లైబ్రరీ తెలుగు పుస్తకములు కేటలాగు (లండను 1912) లోనివి :-

గ్రంథము	గ్రంథకర్త
1. అహల్యా సంక్రందన విలాసము	సిరసగండ్ల రాముఁడు
2. ఊషాపరిణయము	కె. ఎల్. వీరమల్లయ్య
3. కన్యకా చరితము	కె. ఎల్. వీరమల్లయ్య
4. కుశలవ నాటకము	సుబ్రహ్మణ్యేశ్వరము
5. జాలారి కన్నె నాటకము (గంగా వివాహము)	నాగభూషణుఁడు
6. నిజలింగ చిక్కయ్య నాటకము	పి. కె. వరదయాచార్యులు
7. పారిజాతాపహరణము	కే. ఎస్. సూర్యనారాయణ సూరి
8. పార్వతీపరిణయ నాటకము	గోపాల కృష్ణుడు
9. శశిరేఖోత్తర పరిణయము	ఆక్. సీతారామకవి
10. శ్రీకృష్ణ జలక్రీడా నాటకము	గరికిపాటి సూర్యనారాయణశాస్త్రి
11. హరిశ్చంద్ర విలాసము	దేవ పెరుమాళ్ళయ

5. ఇంకను మదరాసు ప్రభుత్వపుఁ బుస్తకముల రిజిస్ట్రారువారి ఆఫీసు కేటలాగు మొ॥ వానిలో నుదాహరింపబడినవి కొన్నిగలవు.

గ్రంథము	గ్రంథకర్త
1. ఇంద్రకీల నాటకము	కే. రంగనాయకులు
*2. ఊషాపరిణయము	(కథలాపురం) గంగాధరకవి
*3 చంద్రకళా విలాసము	గాథి హనుమత్కవి
*4. చంద్రహాస	రాజ వీరయ్య
5. తిరుసతి గంగజాతరకథ	కె. పొట్టయ్య
*6. బాలనాగమ్మ చరిత్ర	ఎట్టం బుచ్చిదాసు

*7. మండ్లోడి స్వయంవరము	వేముగంటి శ్రీనివాసకవి
8. వసుంధరా పరిణయము	లింగము వేంకటరామునుంత్రి
9. వినుకొండ రామాయణము	వి. జగన్నాథాచారి
10. సారంగధర (కట్టుబడి పురము)	?
*11. సీతాస్వయంవరము	వేముగంటి శ్రీనివాసకవి

[పైపట్టికలలోఁ బేర్కొనఁ బడిన వన్నియు యక్షగానములై యుండవు. కొన్ని కేనల వీథినాటకములు, కొన్ని హరికథలు నున్నట్లు తోఁచును. తెలియవచ్చినంత మట్టునకు హరికథల పేర్లు పరిహరింపఁ బడినవి. ముద్రితములైన మన యక్షగానములలో నాథునిక కృతుల పాలే యధికమగుట గమనింపఁ దగినది. ఒక తరము క్రిందట అచ్చు పడినవే యిన్ని గ్రంథము లీనాఁడుపలబ్ధము గాకుండుట శోచనీయము]

* ఈ గుర్తుగలవి తెలంగాణము యక్షగానములు.

(ఆ) అముద్రితములు

గ్రంథము	గ్రంథకర్త	ప్రతి వివరము
1. రామనృపాల చరితము	పెద్దనామాత్యుడు	ఆ. సా ప. 4028
2 రామాయణము	మాచిరాజు లక్ష్మయ మనుమడు	,, 3948
3. రామనాటకము	తు రామానుజాచారి	గౌ. గ్రం. 98
4. ఎఱుకల కుర్కుంజి	మద రాసు విశ్వవిద్యాలయ ప్రతి	389
5. గయ కథ	,,	540
6. గొల్లకలాపము	,,	401
7. భామకలాపము	,,	274
8. వీర రాఘవస్వామి య. గా.	,,	536బి.
9. సానందచరితము	,,	158

(మదరాసు విశ్వవిద్యాలయ ప్రతు లిప్పుడు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున నున్నవి కాని భాండాగార గ్రంథములవలె వాని కింకను నొక క్రమమైన యేర్పాటు లేకపోవుటచే జదువుటకుఁ బడలేదు.

ఒక పట్టికను బట్టి మాత్రమా గ్రంథ సంచయ మందలి తెనుఁగు య. గా. ల పేళ్ళు గనపైనది.)

10. సీతా కల్యాణము - గొట్టిముక్కల కృష్ణమరాజు (గొట్టి ముక్కల శాసనుఁడు. ధనంజయ గోత్రుడు. తల్లి వెంక మాంబ. శేషభూపతి వరదనృపతి అని పితృనామములు రెండు పేరొక్కనఁ బడినవి. అందొకరు కన్నతండ్రియు, నొకరు పెంచుకొన్న తండ్రియునై యుందురు. ఇతనికి వెంకటరాజను నొక యన్నగలడు. దశావతార చరిత్ర అను ద్విపద కావ్య మితని కృత్యంతరము)

11. పారిజాతాపహరణము - గొ. సింగరాజు (పైకృష్ణమ రాజునకు పెద్దమాంబ వలనఁ గలిగిన తనయుఁడు).

12. సావిత్రి య. గా. - గొ. కుమార పెద్దిరాజు (పైకృష్ణమరాజునకు రంగాంబ వలనఁ గలిగిన తనయుఁడు).

13. నాంచారు పరిణయము - నందవరపు శేషాచలమంత్రి (ఇతఁడీ ద్వితీయ భాగమున సరిగా ఏతన్నామక య. గా. కర్తగా 326వ పుటలో నుదాహరింపఁబడిన భాస్కర శేషాచల కవి యగునా?)

14. కూరత్తాళ్వారు చరిత్ర - తిరు మెక్కుళ తిరువెంగళాచార్యుఁడు (ఇది ఆం. సా. ప. ప్రతి నెం. 175 ధన్విపురీశున కంకితమైన పెరుంకూరత్తాళ్వారు చరిత్ర య. గా. ?)

15. సుందరకాండము - కవిపేరు తెలియదు. (సుందర కాండ య.గా ఆర్. 870. కర్త పాతూరి తిరుపతి యని యొకాయన గలఁడు. ఆతఁ డీతఁడగునో కాదో!)

[నెం. 10-15 ఈ యాఱు య. గా. ల తాళపత్ర ప్రతులు దక్షిణ దేశమున రాజపాళయం (తెలుఁగు రాజుల వలస) గాంధీ కళా మందిరమునఁ గలవని నాకు మా తమిళోపాధ్యాయులు శ్రీ ఎన్. కుమారస్వామి రాజా, ఎమ్.ఏ. గారి వలనఁ దెలిసినది. వారికిఁ గృత జ్ఞుఁడను. వారు దయతో నాకుఁజూడ నొసఁగిన విషయమును బట్టి రాజపాళయం య. గా. లు నాఁటి దక్షిణదేశపు య. గా. ల కంటె విలక్షణమై ద్విపద వచనములతోపాటు తాళ ప్రధానములైన రేకులు గలిగి ఆంధ్రదేశపు యక్షగానపు బాణీకి సన్నిహితముగా నున్నట్లు దోఁచును]

16. శ్రీ రుక్మిణి కురవంజి – రామానుజాచార్యుఁడు. (ఇది ప్రా. లి. పు. బాం. డి. నం. 1854 కుండినపుర గోపాలాంకిత మైన కురవంజి యగునో (చూ. ద్వి. భా. పుట 442)

17. సారంగధర య. గా. – కవిపేరు తెలియదు. 'సహజ విక్రమ కీర్తి సర్వజ్ఞమూర్తి, బహుమాన పురుషుఁడు పద్మనాయకుఁడు' అని మాత్ర మిత్తనిఁ గూర్చి గ్రంథమునఁ గలదఁట. అయితే యిది పద్మనాయకుఁడు, సర్వజ్ఞమూర్తి అని యున్నదిగదా యని తొందఱపడి పద్మనాయక వెలమ కులజుఁడు సర్వజ్ఞ బిరుదాంచితుఁడు నైన సింగభూపాలుని కృతి యని నిర్ణయము చేయరాదు. నిదానించ వలసి యున్నది,

[ఈ 16-17 నం. గ్రంథముల ప్రతులు డాక్టరు శ్రీ బి. రామ రాజు, ఎమ్. ఏ., పిహెచ్. డి. గారి కడ నున్నవఁట. ఇట్లింక నెన్ని యక్షగానము లెక్కడెక్కడ నెవ్వరెవ్వరి కడ అసూర్యంపశ్యములై పడియున్నవో!]

గమనిక : ఇవికాక యీ ద్వి. భా. న నిదివఱకే కర్తృ ప్రసక్తి వచ్చిన అలభ్య యక్షగానములు మఱికొన్ని గలవు. వానిపట్టిక అకారాది క్రమముగా వేఱే యీ ద్వి. భా. 4వ అనుబంధమునఁ జేర్పఁబడినది.

యక్షగానాభాసములు

యక్ష గానములు గాక పోయినను నా ఫక్కి నంతంత మాత్ర ముగా నడచిన కొన్ని రచనలు :–

1. కంచిభొట్ల సీతారామ కవి చందన మహారాజు చరిత్ర లేక ఇంద్ర సభా నాటకము (రామానంద ము. శా., మదరాసు, 1901).
2. ఇందూరు కోనయ మాయలమల్లి నాటకము (అ. డై. ప్రెస్, మదరాసు, 1918)
3. బ్రాహ్మణ పల్లె చంద్రహాస నాటకము (ఎ. పి. కవి అంబుకో, అనంత పురము. 1920)
4. ఆరవెల్లి చంద్రయ్య విప్రపురాణము (ఆం. సా. ప. ప్రతి) ఇంకను నిట్టి వనేకము గలవు. కొన్ని పొరపాటున కేటలాగు కర్తలచేతను బ్రకటన కర్తలచేతను యక్షగానములుగాఁ బేర్కొనఁబడినవి. అట్టివి కొన్ని :-
1. యోగ ప్రభావము ఆం. సా. ప. 3819).
2. గుత్తెనదీవి రామాయణము (అం. సా. ప. 2970),
3. జె. సుబ్బరామదాసు చెంచునామయోగి చరిత్రము (అ. డై. ప్రెస్, మదరాసు, 1918).
4. రామకృష్ణ దాసుని మానసబోధ (సరస్వతీ నిలయ ము. శా., నెల్లూరు, 1837),
5. కురుమద్దాలి వేంకటాచలకవి భాగవత సప్తమ స్కంధము (డైమండు జూబిలీ ప్రెస్, నరసపూర్, 1897, దశమ స్కంధము కాకినాడ, ము. శా., 1879),
6. శ్రీ శాయిబాబా చరిత్రము – విద్వాన్ భూళిపాళ వేంకట సుబ్ర హ్మణ్యము, చిలకలూరి పేట. ప్రకాశకులు: సుందరరాం అండ్ సన్సు, తెనాలి 1950 (ఇది హరికథ వంటిది)
7. యతిరాజ విజయము – శ్రీమాన్ గుదిమెళ్ల రామానుజాచార్య స్వామి ముక్తిపల్లి పేపర్లె తా. గుంటూరు జి.) ముద్రణ: శ్రీ వెంకటాచలపతి ప్రింటింగ్ వర్క్సు, రాజమండ్రి. (ఇది అచ్చుముగా నొకబుట్టకథ).

కవినామసూచి

[అ]

[ద్వితీయభాగమునకుఁ బరిమితము. పరిశిష్టానుబంధములండ
ప్రసక్తమైనవారి పేరులు ప్రత్యేకము 'ఆ' పట్టికలోఁ బేర్కొ
బడినవి.]

కవిపేరు	ద్వి. భా. పుట
అచ్యుత రామకవి వారణాసి	127
అణ్ణనాచార్యులు	399
అన్నవ్రత బ్రహ్మశాస్త్రి గుండు	174
అనంత దాసు తిరుపనగరి	141
అనంతయ ప్రబంధము	381
అనంత రామాచార్యులు బాగేపల్లి	166
అప్పకవి కాకునూరి	29
అప్పకవి భమిడిపాటి	216
అప్పయ్య అక్కెళ్ల	217
అప్పల నరసింహులు బెహర	144
అప్పలస్వామి మాడ	243
అప్పలాచార్యులు దరువూరి	125, 127
అబ్దుల్లా మహమ్మదు	392
అబ్బయ్యదాసు గొల్లెసుచ్చు	191
అమ్మనార్యుడు గొన్నబత్తుల	192
అలమేల్మంగ తాయారమ్మ ముండ్రాయి	236
ఉత్తరరంగ కవి	54
ఉదయాచలము కంభంపాటి	379
ఎంబారయ్య నిశ్చింత	200

కవిపేరు	ద్వి. భా. పుట
ఎంబారయ్య సణివారం	7
ఎల్లయ కవి	34
ఏక్కోజీ భోసల	32
ఓబయమంత్రి దినవహి	5
ఓబులరాజు మీసరగండ	23
కంఠీరవ నరసరాజు	28
కనకయ్య ఉప్పలూరి	18
కన్నయదాసు వేలూరు	12
కప్పయ్య కెళ్ల	19
కాళ కవి వినుకొండ	22
కాశీపతి మద్దాల	37
కుప్పన ఆలూరి	326
కూర్మనాథ కవి గోసులపాటి	51
కృష్ణదాసు గడిగె	406
కృష్ణమాచార్యులు శేషభట్టసు	373
కృష్ణమూర్తి పసుమర్తి	209
కృష్ణయ్య వారాల	168
కృష్ణయ్య శ్రీరామకవచం	368
కృష్ణాధ్వరి	252
కేశవరావు రంగరాజు	368

కవిపేరు — ద్వి. భా. పుట		కవిపేరు — ద్వి. భా. పుట	
కేశవాచార్యులు కాట్రంబాక	137	త్యాగరాజు శాకర్ల	339
కొండయ్య బూచుపల్లి	173	దీక్షిత చందు(ము కోనేటి	270
కోటనాసు జ్యోతి	205	నంజప్ప జందాళి	109
గంగాధరుడు	146	నరస కవి చెళ్ళపిళ్ళ	103
గణపతిరెడ్డి పాకనాటి	94	నరసింహ కవి ఎల్లనూరు	231
గిరిరాజు దర్భ	313	నరసింహ కవి, దొడ్డి	74
గురవయ్య కాలంసెట్టి	225	నరసింహ కవి వర్ధుల	36
గురురాజ కవి పడకండ్ల	136	నరసింహ దాసు వానమామల	405
గోపయాచారి మూటకోడూరు	401	నరసింహాచార్యులు ముడుంబ	200
గోపాలదాసు ఆడెపు	404	నాగదాసు సంబడి	196
చిక్కదేవరాయాస్థాన కవి	278	నారాయణ కవి (జాలకల్లు)	57
చినకపోదయ్య గుట్టము	86	నారాయణ కవి చల్లా	350
చూడమ్మ ఏనుగుల	151	నారాయణ కవి నయకూరు	62
చెంగల్వరాయకవి విజయనగరపు	143	నారాయణ దాసు ఆడెపు	405
చెంగల్వ రాయశాస్త్రి మారుపెద్ది	348	నారాయణదాసు అదిభట్ల	207
చెంచు సుబ్బదాసు తిరువీధి	237	నారాయణాచార్యులు చిలకమర్రి	140
చెన్నశౌరి ప్రోలుగంటి	1	నింబాది దాసుడు	130
జగన్నాథకవి నందివాడ	202	నిమ్మనాథుడు రెగళ్ళగ	37
జగన్నాథకవి సన్నిధిరాజు	78	నృసింహ కవి కాకరపర్తి	240
జియ్యరయ్య కేశవపట్టణము	156	నృసింహ రాజు విరిపాటి	50
తమ్మయ అత్తేయపురపు	96	పరమానంద తీర్థయతి	24
తాతయ వడ్డి	224	పాపకవి తిరువగరి	371
తాతాచార్యులు మరుధూరి	238	పాపయ్య ఓగిరాల	187
తిమ్మప్ప దళవాయి	41	పాపరాజు కంకణటి	12
తిమ్మయ్య ఇటికెల	76	పాపశాస్త్రి దీక్షితుల	365
తిరునారాయణాచార్యులు, వేదాల	139	పిచ్చయ్య పురాణం	213
తిరుమల కవి (మధుర)	320	పిన్నబయలా చార్యులు	329
తిరుమల కవి మమ్మడిదేవుల	106	పురుషోత్తమ కవి నాచెళ్ళ	160
తిరువేంగడదాసు కోవెల	131	పురుషోత్తమ దీక్షితుడు	268
తుళజరాజు భోసల	323	పుల్లకవి ద్విభాష్యం	201

కవిపేరు – ద్వి. భా. పుట	
పెదకెంప రాయడు	275
పెద్దన గాయకవాడ	190
పెద్దు అలపాక	85
ఫిరోజి పులహరి	120
బంగారయ్య కొండమది	228
జలభద్ర దాసి	99
బలరామయ్య కాసాల	397
బసివిరెడ్డి నల్లమిల్లి	244
బాల గురవప్ప వంకదారి	162
బాల పాశాంబ	18
బాల సరస్వతి ఎలకూచి	27
భాగయ్య చెర్వురాల	382
భీమసింగ్ కవిరాజు	60
మన్నారు దేవుడు	271
మల్లనారాధ్యుడు శివలెంక	104
మల్లయ అవధూత	400
మల్లేశము మోర	406
మాశ్చీభూతేకవి	332
ముద్దయ కవి	363
మృత్యుంజయకవిఉపాధ్యాయుల	155
మృత్యుంజయు నిళ్ళింక బహద్దర్	188
యాదవ దాసు బొంముగ	161
రంగనాయకమ్మ కొత్తూరు	247
రంగశాయి తేకుమళ్ళ	17
రంగాచార్యులు శేషము	89
రంగాజమ్మ పసుపులేటి	265
రఘునాథ నాయకుడు	251
రత్నమ్మ రూ ఖాన్ పేట	364
రాఘవదాసు కోవెల	133
రాఘవార్యుడు చక్రపురి	2

కవిపేరు – ద్వి. భా. పుట	
రాజలింగ కవి గవండ్లు	377
రాజ వీరప్ప అంబేద	399
రామకవి క్రొవ్విడి	198
రామకవి (తమిళ)	312
రామకృష్ణయ్య త్వరకవి	203
రామదాసు కవి	365
రామదాసు కవి గోపాల	164
రామదాసు గడ్డం	374
రామనఅగస్త్యరాజు	98
రామబ్రహ్మ యోగి	26
రామమూర్తి పరశురామపంతుల	363
రామయ్య జ్యోతి	108
రామయ్య నిముషకవి	49
రామరాజు బల్లె	242
రామరాజు భారతి	82
రామాచార్యులు కందాళ	197
రామానుజ రావు పండరి	364
రామానుజ సూరి రఘునాయకం	189
రామానుజాచార్యులు ధనకుధరం	210
రామానుజా చార్యులు మరింగంటిభట్టరు	123
రుద్రకవి కందుకూరు	9
లక్ష్మణకవి పాలుట్ల	213
లక్ష్మణకవి రాయభట్టు	378
లక్ష్మణదాసు తాడిపర్తి	368
లక్ష్మణరావు తిమ్మరాజు	149
లక్ష్మీనారాయణ పురిజాల	68
లక్ష్మీపతిరాయడు గవురహరాజు	376
లింగన తెక్కళ్ళ పాటి	45
లింగమూర్తి కవి	64

కవిపేరు — ద్వి. భా. పుట	
వాసుదేవ కవి	302
విజయరాఘవుడు	253
విఠల రాయకవి పండరి	372
విశ్వనాథ కవి వెణుతురుబల్లి	28
విశ్వేశ్వరుడు	72
వీపూరి — ఆచారి కడియాల	183
వీరప్ప పట్లూరి	403
వీరబ్రహ్మముగోనుగుంట	229
వీరభద్ర కవి కానూరి	360
వీరయ్య మార్జోల్ల	118
వీరరాఘవకవి చీమకుర్తి	205
వీరరాఘవయ్య మైనముపాటి	170
వీరరాఘవుడు ఊప్పలూరి	146
వెంకటకవి (శ్రీ) పేరంబూదూరి	397
వెంకట కృష్ణా జెట్టి	346
వెంకట జోగి కాటమరాజు	81
వెంకటజోగి గరిమెళ్ళ	219
వెంకటదాసు కానుకొలను	107
వెంకట దాసు జిల్లా	398
వెంకటదాసు తిరునగరి	379
వెంకట నరసయ్య (శ్రీ) పెరంబూదూరి	393
వెంకట నరసయ్య చతుర్వేదుల	201
వెంకట నరసింహాచార్యులు గోవర్ధనం	366
వెంకటపతి సోమయాజి కామవరపు	263
వెంకటప్పయ్యశాస్త్రి కోట	185
వెంకటరమణదాసు మరిగంటి	176
వెంకట రమణమ్మ కళ్లేపల్లి	202
వెంకట రమణయ్య వెలుగోటి	165
వెంకటరాజు వెమ్మరాజు	193

కవిపేరు — ద్వి. భా. పుట	
వెంకటరామ కవి కావూరి	370
వెంకటరామ కవి కీర్తి	221
వెంకటరామదాసు మాదిరా	381
వెంకట రామయ్య టంగుటూరు	235
వెంకట రామయ్య ఎన్.	241
వెంటరామ శాస్త్రి మెరట్టూరు	335
వెంకట రామానుజులునాయుడు కోకా	171
వెంకటరాయకవి మద్దిరాల	184
వెంకటరాయకవి వేదంభట్ల	218
వెంకటరాయకవి శీర్షాడు	116
వెంకటసుబ్బకవి యమ్మనూరి	171
వెంకటసుబ్బరాయకవి శేషిరాజు	177
వెంకట స్వామినాయుడు గైనేడి	195
వెంకటాచలమయ్య మామిళ్ళపల్లి	158
వెంకటాది కాంజ	21
వెంకటేశ్వరకవి గరిమెళ్ళ	220
వెంకన నుదురుపాటి	331.
వెంకయ్య ధేనువకొండ	194
వేంకటకవి వేల్పూరి	101
వేంకట నరసింహాచార్యులు మరింగంటి	364
వేంకట నృసింహాచార్యులు, మరంగంటి	368
వేంకట రాజు పోడూరి	121
వేంకట రామ పరిధాని వెలిచేరు	40
వేంకటాంబ అన్నదానం	319
వేంకటాచార్య నెడూదూరు	351
వేంకటాద్రప్పారావు బహద్దర్	242

కవిపేరు — ద్వి. భా.	పుట
వెంగమాంబ తరిగొండ	110
శఠగోప నూరి బుక్కపట్టణము	157
శహాజీ భోసల	287
శివాజీ భోసల	344
శేషగిరి దాసు వరిగంటి	150
శేషగిరిరాజు గాజులవెండ్లూరు	239
శేషాచల కవి (ధర్మపురి)	359
శేషాచలకవి భాస్కర	326
శేషాచల దాసు నల్లపాటి	141
శేషాచలపతి నివ్	304
శేషా చలపతి యాము జాల	363
శేషాచార్యులు కొదమగుండ్ల	154
శేషాచార్యులు దూపాటి	147
శేషాచార్యులు పరాశరం	222
శోభనాద్రి దేవవరపు	29
శ్రీకృష్ణమాచార్యుడు అకలంక	55
శ్రీనారాయణ తీర్థులు	285
శ్రీనివాస కవి	87
శ్రీరంగ కవి భార్గతుల	152
శ్రీరామ కవి రాపాక	360
శ్రీరామరాజు ఉపేంద్ర	234
శ్రీరాములు దాసు	182
సం నక్కలపాటి	43
సన్యాసి చెల్వూరు	362

కవిపేరు — ద్వి. భా.	పుట
సాంబమ్మ బుక్కము	80
సాంబమ్మ బొమ్మలాట	46
సింగయ గోపాలుని	66
సిద్ధేంద్ర యోగి	30
సీతారామకవి కొండూరి	142
సీతారామకవి కొల్లము	153
సీతారామరాజు బల్లి	220
సుబ్బకవి బోడిచెర్ల	134
సుబ్బకవి మోక్షగుండము	169
సుబ్బదాసు నగళ్ళపాటి	185
సుబ్బన్న బాలకవి	309
సుబ్బరాజు వీణె	239
సుబ్బరాయకవి కురుచేటి	179
సుబ్బరాయకవి మండూరి	223
సుబ్బరాయకవి వారణాశి	163
సుబ్బరాయడు సిరిపెద్దగడ	100
సూరయ్య చల్ల	274
సూర్యరామకవి చదలువాడ	181
స్వామిరాయ కవి పడకండ్ల	180
హనుమంత రాయశర్మ గోపాలుని	204
హనుమద్దాసు పనుస	402
హరిదాసు అక్కెనపల్లిగడ	66
హరియప్ప నూల్వీటి	40

[ఆ]

(పరిశిష్టాను బంధములందు వేర్కొనఁబడినవారు)

కవిపేరు	ద్వి. భా. పుట
అక్క—నామాత్యుడు	415
అక్క—యకవి	415
అప్పయ నాగాన్వయ	426
అప్పల నరసింహశాస్త్రి పప్పు	463
అమరలింగామాత్యుడు కూరపాటి	418
ఎల్లదాసు గుజ్జరి	411
కన్నయ లాలా	432
కృష్ణకవి (కనుసానిపల్లి)	408
కృష్ణదాసు కల్పగూరు	465
కృష్ణమార్యుడు చిగురుపేవు	422
కృష్ణయ్య మేరికపూడి	430
కోటమరాజు కూరపాటి	247
కోటయ వాలె	434
కోదండ రామయ్య అమనచర్ల	416
గంగాధరకవి కథలాపురం	412
గంగాధరకవి కోనూరి	419
గుండోబా దాసు	409
గురుసిద్ధ లింగము	420
చిదంబరము దుర్గరాజు	425
చెన్నయ	422
చెన్నయార్యుడు రాయపురి	432
తిరుపతి పాతూరి	427
తిరువెంగళామాత్యుడు శ్రీ పేరుంబూదూరి	428
దొరవారు	252
నరసింహకవి వేలూరి	407
నరసింహదాసుడు	410
నరసింహులు ఈగబత్తిని	412
నారాయణకవి తేపులపురి	425
పట్టాభిరామయ్య	426
పరబ్రహ్మకవి	429
పరాంకుశదాసు	411
పాపరాజు ఏనుగులూరి	417
పురుషోత్తమకవి కొల్తూరు	407
పురుషోత్తముడు అనుముకొండ	416
పుల్లకవి	462
పెద్దయామాత్యుడు వెలువలి	438
ప్రభులింగాచారి కన్నెగంటి	247
బోడిమల్ల భూపాలుడు పాలయెంకరి	427
భవానీ శంకరాచార్యులు కొండ	247
భార్గవకవి జోగరాజు	423
భీమనార్యుడు నాగన్నగారి	408
మల్లప్ప కీర్తి	418
మూళగిరి కవి	430
మృత్యుంజయుడు వేకుమళ్ళ	424
రంగప్ప ప్రసంగి	428
రంగయ్య పరవస్తు	408
రాఘవరెడ్డి కోటవేటు	419
రాజబంగరురెడ్డి	410
రాజమల్లయాచారి కొండ	247
రాజయోగి రామరాజు	410
రాజలింగకవి	409

కవిపేరు — ద్వి. భా. పుట	
రామకవి (భట్టు)	420
రామకృష్ణారెడ్డి	430
రామదాసు గుడిపాటి	419
రామదాసు చౌదరి	423
రామయ గుడిమెట్ల	420
రామలింగదాసు	431
రామలింగదాసు	431
రామలింగార్యుడు కొత్తూరు	418
రామానుజమ్మ	431
రామానుజసూరి తిరువలిక్కేణి	464
రామాపండితులు	252
లక్ష్మయ్య బత్తుల	247
లక్ష్మీకాంతకవి తంగె	247
లక్ష్మీవరదాసుడు	462
లచ్చిరాజు చింతలపల్లి	421
లింగకవి భృగుబం	429
లింగన	433
వీరకవి ఆయ్యగారి	416
వీరభద్రికవి	434
*వీరభద్రకవి	434
వీరభద్రియ్య కశేవరపు	410
వీరాస్వామి కత్తి	417
వీరేశలింగము	459
వుల్లదాసు	435
వెంకట కృష్ణయ్య పోలుగంటి	428
వెంకటదాసు	436
*వెంకటదాసు	436
*వెంకట దాసు	437

కవిపేరు — ద్వి. భా. పు
వెంకటదాసు కొప్పర్తి
వెంకటపతి కవి
వెంకటరామా మాత్యుడు జిల్లెళ్ళమూడి
వెంకటశా స్త్రినరసింహదేవర
వెంకటాద్రి
వేంకటపతికవి
వేంకటసూరి
వేంకశేషము విశ్వజ్ఞ
శేషాంబ
శేషాచల దాసుడు
శ్రీనివాసకవి దేవర
శ్రీనివాసకవి వేమగంటి
శ్రీరామపుత్రి
సంగన శీలు
సత్తయ్య నార
సింగన నందవరము
సింగరార్యుడు కందాళ
సిద్ధనగౌడు
సీతయ్య దుగ్గరాజు
సీతారామదాసు తూము
సుబ్బకవి (తాడిపత్రి)
సుబ్బకవి బొడ్డుచర్ల
సుబ్బయ వాసిలి
సుబ్రహ్మణ్యాచారి మల్లెం
సూర్యనారాయణశా స్త్రి సుత
సోమన లోకేరావు
స్వామిదాసు గాజుల

గ్రంథసూచి

[అ

లభ్యములైన యక్షగానముల పేర్లు

ప్రక్కనున్నది ద్వి. భా. పుటాంకము

అంగజ విజయము	416
అంబరీష	207,409
అంబా వివాహము	440
అక్క-మహాదేవి చరిత్ర	18
అజామిళో పాఖ్యానము	366
అనసూయ	163,166,393,411
అనిరుద్ధ	425,425
అన్నపూర్ణా పరిణయము	344
అలమేలు మంగావిలాసము	441
అశ్వమేధాటీల చరిత్ర	382
అర్జున విజయము	213
అల్లీ అర్జున చరిత్ర	382
అల్లీరాణి చరిత్ర	406
అవనిజా చరిత్ర	141
అష్టదిక్పాలక విలాసము	280
అహల్యా సంక్రందన నాటకము	160
ఆండాళ్ చరిత్ర	227
ఉషాపరిణయము	50,171,233,237
	336,422,430,441
ఎఱుక	26
ఎఱుకలకథ	143,420,441
ఎఱుకల కలాపము	221
ఎఱుకల కురవంజి	78,419
ఏకాంతసేవ	158,184
ఐరావతి చరిత్ర	125
కంస మర్దనము	398
కణ్వ చరిత్రము	442
కనకతార	
కన్యకా పురాణము	76
కన్యకా విజయము	189
కపటవేశ్యానాటకము	213
కపిలదేవహూతి సంవాదము	379
కపోతవాక్యము	99
కరియబంటుని కథ	74
కలవాణీ విలాసము	280
కళాపూర్ణోదయ నాటకము	197
కాంతామతి	382
కాంభోజరాజు చరిత్రము	382
కాళిందీ విలాసము	419
కాళీయమర్దనము	253,374,407,437

కిరాత విలాసము 287
కిరాతార్జునీయము 46,382
కిష్కింధాకాండనాటకము 393
కుచేల 166,213,381
కుమారస్వామి వివాహము 409
కురవంజి 71,410,442
కుశలవ 39,141,245,382,(412)
కృష్ణకథ 443
కృష్ణగారడి నాటకము 382
కృష్ణచరిత్ర 462
కృష్ణజననము 443
కృష్ణనాటకము 116
కృష్ణలీలా విలాసము 287
కృష్ణవిజయము 231
కృష్ణవిలాసము 55,415
కృష్ణవేషము 443
కృష్ణసంబంధి కథ 444
కొరిమెల్ల కురవంజి 442
కొఱవంజి కథ 280,433
గంగాగౌరీ విలాసము 275
గంగాపార్వతీ సంవాదము 287
గజగౌరీవ్రతము 372
గజేంద్ర మోక్షము 208
గజేంద్రాశ్వారు చరిత్ర 171
గయోపాఖ్యానము 171,181,412
423
గరుడాచలము 5,8,161
గీత రఘునందనము 106
గురునంబి చరిత్ర 37
గొడగూచి చరిత్ర 329
గొల్లకథ 64,143
గొల్లకలాపము 96,217,366,420,437
గొల్లభామ వేషము 43,83,444
గొల్లవేషపు కథ 444.445
గోకర్ణేశ్వర విలాసము 45
గోపాల విలాసము 94
గౌరీశంకర విలాస 103,179,424
చంద్రగుప్త నాటకము 394
చంద్రతారావిలాసము 347
చంద్రశేఖర విజయము 426
చంద్రశేఖర విలాసము 445
చంద్రసేన మహారాజు 205
చంద్రహాస 166,409
చికదేవరాయ విలాసము 278
చిత్రకూట మాహాత్మ్యము 320
చిత్రాంగద 416
చిత్రాంగి 213,225
చిరియాళ మహారాజు నాటకము 205
చిరుతొండ నాటకము 398,412
చిరుతొండ భక్త కథానిధానము 434
చెంచు నాటకము 114
చెన్నకృష్ణ విలాసము 410
జగన్మోహన శ్రీకృష్ణవిలాసము 150
జలక్రీడ 49.82,218.292,446
జాంబవతీ విలాసము 423
జానకీ పరిణయము 427
జానకీ శపథము 208
జ్ఞాన కురవంజి 109

డాంగేయోపాఖ్యానము 394
తంజాపురాన్న దానమహానాటకము 228
తారకాసుర వధ 386
తారాచంద్రి విలాసము 430
తారాశశాంకము 157, 365
తిరుమంగయాళ్వారు 131, 222
త్యాగవినోద చిత్రప్రబంధము 299
దండధర విలాసము 176
దేవయాని చరిత్ర 161
దేవాసుర నాటకము 198
ద్రౌపదీ కల్యాణము 172, 191, 291
ద్రౌపదీవస్త్రాపహరణము 197
ధర్మపురీ మాహాత్మ్యము 72
ధర్మాంగద నాటకము 213, 419. 436
ధాన్యమాలినీ చరిత్రము 397
ధ్రువ ఉపాఖ్యానము చరిత్రము 144, 208
నల 100, 156, 190, 199, 376, 386, 411, 425
నళినీ దేవి ప్రభావము 397
నాగార్జున చరిత 386
నాట్యవిద్యావిలాసము 282
నారదకొరవంజి కట్టణ 446
నౌకా చరిత్ర 339
నిజలింగ చిక్కయచరిత్ర 39
నీలాచల విలాసము 428
నీలావతీ విజయము 446
పంచకన్యాపరిణయము 310
పంచరత్నప్రబంధము 297
పంచాక్షరీ ప్రభావము 196
పంచాయుధ కథ 282
పతివ్రతా మాహాత్మ్యము 137
పద్మావతీ పరిణయము 235
పద్మినీపరిణయము 464
పద్మినీవిలాసము 422
పాండవాజ్ఞాత వాసము 448
పారిజాతములు 62, 68, 82, 87, 108 110, 152, 285, 332, 350, 426, 448, 448, 448
పార్థసారథి విజయము 326
పార్వతీ 209, 302, 331, 418
పాలన చోళమహారాజు చరిత్ర 401
పుండరీక చరిత్ర 387
పుణ్యకవ్రతము 418
పుణ్యాంగద చరిత్ర 377
పుత్రకామేష్టియాగము 397
పూరూరవశ్చక్రవర్తి విలాసము 155
పూతనాహరణము 253
పెద బొబ్బిలి చరిత్ర 387
పెరుంకూరత్తాళ్వారు చరిత్ర 449
పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర 411 (183 402)
ప్రణయ కలహ కలాపము 133
ప్రభావతీ ప్రద్యుమ్నము 66
ప్రభావతీ విలాసము. 374
ప్రసన్న వేంకటేశ్వర విలాసము 41
ప్రహ్లాద 136, 139, 161, 200, 208, 245, 261, 336, 368, 397, 449, 464

ప్రహ్లాద భక్తివిజయము 342
బభ్రువాహన చరిత్ర 387, 408
బలిచక్రవర్తి 405
బసవ కల్యాణము 362
బసవ మహిమామృత విలాసము 360
బాణాసుర నాటకము 185
బాలకృష్ణ 113, 415
బాలకేళీ విహారము 29
బాలగోపాల విలాసము 170
బాలనాగమ్మ 387. 402, 409
బాలింత సేషకథ 82, 449
బిల్వణీయము 192, 210
బ్రహ్మముగారి నాటకము 402
భక్తవత్సల విలాస నాటకము 296
భక్తాంఘ్రిరేణు చరిత్ర 54
భద్రకాళీ కల్యాణము 438
భద్రసేన విలాసము 387
భద్రాయూపాఖ్యానము 408
భల్లాణ 80, 85, 130, 162
భవానీశంకర విలాసము 203
భాగవతము 388, 431. 449
భామకలాపము 146, 216, 420, 450, 450, 450
భారత నాటకము 418, 450
భావనారాయణ విలాసము 89
భీమసేన విజయవిలాసము 415, 365, 435
భీష్మ చరిత్ర 208
మండోదరీ పరిణయము 399
మదన విజయము 412
మదనసేన 40
మన్నారుదాస విలాస నాటకము 26
మన్మథసంహారము 40
మల్లన చరిత్ర 39
మల్లికా కల్యాణము 43
మహాభారత విలాసము 21
మాంధాత చరిత్ర 37
మాధవ చరిత్ర 38
మాయాప్రకృతి పురుషలీల 40
మాయాసుభద్ర విలాసము 38
మార్కండేయ 208, 226, 336, 38
39
మిత్రవిందా పరిణయము 438
ముక్తికాంతా పరిణయము 24, 45
ముక్తికాంతా విలాసము 81, 11
ముగ్గసంగయ్య కథ 11
మురనరకాసురవధ 39
మూడున్నర వజ్రము 16
మృత్యుంజయ విలాసము 51
మైరావణ 173, 214, 245. 407
యూనధారి నాటకము 412
యథార్థ రామాయణము 208
యక్ష ప్రశ్నలు 214
యామినీ పూర్ణచంద్రోదయము 185
యేసునాథ కథామృతము 195
రంగనాథుని పంగుణ్యుత్తరోత్సవ
య. గా. 431
రంభా నలకూబర విలాసము 373
రంభా రావణ సంవాదము 430

రఘునాథాభ్యుదయము 256
రతి కల్యాణము 293
రతి మన్మథ విలాసము 89
రాజకన్యాపరిణయము 316
రాజమోహన కొరవంజి 315
రాజయోగసారి నాటకము 434
రాజరంజన విద్యావిలాసము 323
రాజారాణీ విలాసము 60
రాధవేషకథ 451, 451
రాధా మాధవ నాటకము/విలాసము 220, 452
రామదాసు 161, 177, 243
రామనాటకము 187, 232, 351, 452
రామ పట్టాభిషేకము 293
రామలీల 102
రామానుజ విజయము 137
రామాయణము 57 117,135,245,319 359, 427, 463
రాములవారి యెఱుక 452
రుక్మాంగద 336, 397 417 428 453
రుక్మిణీ వేషకథ 453
రుక్మిణీ కల్యాణము/పరిణయము 149, 151, 208, 234, 423
రుక్మిణీ సత్యభామా సంవాదము 294
రూపవతీ చరిత్ర 421
రైతువిజయము 403
లక్ష్మణా కల్యాణ/పరిణయము 180, 407 429, 453
లక్ష్మణప్రాణ రక్షణము 429
లక్ష్మణమూర్ఛ 123
లక్ష్మీనారాయణ విలాసము 127
లక్ష్మీవిలాసము 282
లవకుశ (చిరుతల) 412
లీలావతీ కల్యాణము 318
లీలావతీ శాహరాజీయము 309
వరరుచి విజయము 165
వల్లీకల్యాణము 291
వసంతోత్సవవిలాసము 282
వసురాజ విలాసనాటకము 154
వాదజయకొరవంజి 313
వాదజయము 316
వామన చరిత్ర 155
వాసంతికా పరిణయము 21
వికటవాది చరిత్ర 176
విక్రమార్క చరిత్ర 388
విఘ్నేశ్వర కల్యాణము 289, 325
విజయరాఘవ కళ్యాణము 270
విజయరాఘవ చంద్రికా విహారము 263
విజయవిలాసము 381, 416
విప్రనారాయణ చరిత్ర 2, 260, 374
విభక్తి కాంతా విలాసము 283
వివేక విజయము 274
విరాటపర్వము 171,194, 435
విష్ణుపల్లకీసేవా ప్రబంధము 297
విష్ణుమాయావిలాసము 12
వీరచోడేశ్వరచరిత్ర 86
వీరబ్రహ్మముగారి నాటకము 183
వీరభద్ర విజయము 104, 203

వీరవిజయ విలాసము 191
వృత్రాసుర మహారాజు నాటకము 228
వేణీప్రబంధము 457
వేణుగోపాల నాటకము 219
వేదాంత జీవచంద్రమహారాజు నాటకము 410
శంకరపల్లకి సేవాప్రబంధము 298
శంబరాసురవధ 406
శకుంతలా నాటకము 36, 139
శచీపురందరము 290
శతకంఠ రామాయణము 375, 454
శశిరేఖ 166, 191, 214, 224, 228, 395
శాంతా కల్యాణము 291
శాకుంతల నాటకము 147
శారదకురవంజి కట్టణ 428
శాహమహారాజ కల్యాణము 311
శాహరాజ విలాసము 306
శాహేంద్ర చరిత్ర 314
శివకామ సుందరీపరిణయము 323
శివకుమార నాటకము 412
శివకురవంజి 364
శివకేశవ పారిజాతము 89
శివనాటకము 116
శివపారిజాతము 64, 346, 462
శివభాగవతము 435
శివరాత్రి మాహాత్మ్యము 455
శివరామ నాటకము 229
శివవిలాసము 112
శుక చరిత్రము 440
శ్రీకృష్ణ చిద్విలాసము 457
శ్రీకృష్ణ తులాభారము 386, 395
శ్రీకృష్ణనాటక ప్రబంధ రాసక్రీడా విలాసము 107
శ్రీకృష్ణపారిజాతము 386
శ్రీకృష్ణరాయభారము 386
శ్రీకృష్ణలీలలు 152, 242
శ్రీకృష్ణశైశవము 245
శ్రీగిరి కురవంజి 420
శ్రీనివాస విలాసము 431
శ్రీమద్భగవద్గీతా సారము 424
శ్రీమన్నారాయణ మూర్తివారి శుభ దశావతార లఘునాటకరూప యక్ష గానము 188
శ్రీయాళ నాటకము 429
శ్రీరామనాటకము 123
శ్రీరామలింగ ప్రతిష్ఠ 398
శ్రీరామవిజయము 372
శ్రీ వెంకటేశ్వర పద్మావతీ పరిణయము 432
సతీ తులసి 389
సతీదానశూరము 295
సతీపతిదాన విలాసము 293
సతీసావిత్రి 395
సత్యనారాయణకథా సుధాలహరి 370
సత్యనారాయణ వ్రతము 400
సత్యభామా కలాపము 216
సత్యభామా కళ్యాణము: పరిణయము 174 223, 389,

సత్యభామా మనోల్లాస నాటకము 238
సత్యభామావిలాసము 459
సత్యహరిశ్చంద్ర 389, 412
సత్రాజిన్నాటకము 174
సముద్రమథనము 96, 220, 438, 455
సరస్వతీ కల్యాణము 307
సర్వాంగ సుందరీ విలాసము 317
సవతి వాదము 455
సాంబశివవిలాసము 455
సాత్రాజితీయము 120, 456
సారంగధర 100, 168, 240, 389, 439
సావిత్రి 142, 166, 208, 232, 407
సీతాకల్యాణము పరిణయము 98, 169 293, 336
సీతాస్వయంవరము : 164, 389
సీమంతినీ చరిత్ర 435, 439
సుంకరి కొండడి వేషము కథ 432
సుందర కాండ 193, 397, 426, 427
సుందర సైంధవగార్దభ పరాభవ నాటకము 191
సుందరేశ్వర విలాసము 348
సుకుమారీ పరిణయము 121
సుగుణవతీ నాటకము 395
సుగ్రీవ విజయము 9, 389, 405
సుభద్రావివాహము 166, 437
సురతాణి నుల్తానీ కల్యాణము 456, 236
సూక్ష్మరామాయణము 232
సైంధవపరాభవము 232, 390
సౌందర్య వీరనాటకము 410
స్త్రీసాహసము 389
స్వరోచ్యోపాఖ్యానము 412
హనుమద్రామ సంగ్రామము 392, 402
హనుమద్విజయము 411, 7
హరిశ్చంద్ర జననము 404
హరిశ్చంద్ర చరిత్ర నాటకము 190, 197 208, 336, 371, 377, 417
హేమాబ్జనాయికా స్వయంవరము 271

— ---

[ఆ]

(వివిధానుబంధములు-గలో పేర్కొనబడినవి కాక యీ గ్రంథ ద్వి. భా. న. ఇతరత్ర పేర్కొనబడిన అలభ్య యక్షగానముల పేర్లు)

*

అంబికావాక్షము	29
అధ్యాత్మరామాయణము	360
అనసూయోపాఖ్యానము	352
అనిరుద్ధ విలాసము	368
అసత్సంగరాజు నాటకము	336
ఇళోపాఖ్యానము	202
ఉలూచీ పరిణయము	40
ఉషాకన్యా పరిణయము	247
ఉషాపరిణయము	166, 247, 254
కంసవధ	336
కల్యాణ కౌముదీకందర్ప నాటకము	252
కాకతిరుద్రాంబకథ	242
కాళీయమర్దనము	202
కృష్ణజననము	352
కృష్ణదానచరిత్ర	352
కృష్ణవిలాసము	254
కుశలవ కథ	355
కేదారేశ్వరవ్రతము	399
కొరవంజి (ముద్దుకవి)	355
కౌసల్యా పరిణయము	372
గంగా విశ్వేశ్వరపరిణయము	355
గజేంద్రమోక్షము	399
గణేశ కల్యాణము	355
గణేశలీలార్ణవము	355
గణేశవిలాసార్ణవము	355
గయోపాఖ్యానము	202, 247
గరుడాచల నాటకము	200
గాంగేయ చరిత్ర	364
చంద్రకాంత	204
చంద్రహాస	202
చిత్రకేతూపాఖ్యానము	202
చెంచునాటకము	365
జగన్మోహినీ విలాసము	247
జగల్లీలా నాటకము	336
జయప్రద	247
జలక్రీడ (లింగోజీ)	355
జానకీ కల్యాణము	251, 254
జానకీ పరిణయము	17
జానకీ సుఖోల్లాస కొరవంజి	352
తారాచంద్రము	247
దేవకీ సుతానయనము	153
ద్రౌపదీ వస్త్రాపహరణము	201
ధ్రువ చరిత్ర	352
నకేశ విలాసము	355
నలనాటకము	247
నాంచారు పరిణయము	326
నారద గర్వభంగము	355
నృగ చరిత్ర	204

సాంచాలీ స్వయంవరము 247
పారిజాతాపహరణము 352
పార్వతీకల్యాణము 352
పుణ్యక వ్రతేము 254
ప్రతాప రామ కొరవంజి 352
ప్రబోధచంద్రోదయము 352
ప్రభావతీ ప్రద్యుమ్నము 352
ప్రవరాఖ్య నాటకము 247
ప్రహ్లాద చరిత్ర 166
బాణాసుర యుద్ధము 4
బ్రహ్మంగారి చరిత్రము 399
భక్తసానంద చరిత్ర 399
భాగవత దశమస్కంధ పూ. భా. 140
భాగవతము (ఇందిరాల) 364
భానుమతీ పరిణయము 363
భామకలాపము 30
భీష్మవిజయము 399
మదనశేఖర విలాసము 399
మాయావతీ పరిణయము 352
మార్కండేయ 399
మిత్రవిందా పరిణయము 352
మీనాక్షీ పరిణయము 355
మోహినీ మహేశ్వరము 352
మోహినీ విలాసము 254
యయాతి చరిత్ర 352
రత్నకేతూదయము 355
రాజగోపాల విలాసము 254
రాధాకృష్ణ సంవాదము 201
రామాయణము 363
రామాయణము (మంథెన) 363
రామాశ్వమేధము 166
రుక్మాంగద 166
రుక్మిణీకల్యాణము 254, 336
రుక్మిణీ సత్యభామా సంవాదము 355
లక్ష్మణాదేవీ కల్యాణము 433
లక్ష్మీ కల్యాణము 453
వరలక్ష్మీపూజా విధానము 201
వామన చరిత్ర 202
విద్యుత్ప్రభావిలాసము 45
వీరబ్రహ్మయోగి నాటకము 247
శమంతకోపాఖ్యానము 352
శాకుంతలము 353
శివరాత్రికథ 336, 352
శుకరంభా సంవాదము 432
శ్రీకృష్ణగోపీ జలక్రీడా భాగవతము 201
శ్రీకృష్ణుని రాయభారము 202
శ్రీసుభద్రాపరిణయము 202
శ్రీరామ విజయము 28
శ్రీరుక్మిణీ కృష్ణ వివాహము 251
సత్యనారాయణ వ్రతేము 241, 399
సత్యభామా కొరవంజి 356
సత్యవతీ చరిత్ర 202
సత్యహరిశ్చంద్ర 204
సత్సంగ రాజు నాటకము 336
సముద్ర మథనము 254
సానందో పాఖ్యానము 202, 204
సావిత్రి నాటకము 247
సీతాకల్యాణము 202
సీతారామ విజయము 339
సీతారామాంజనేయము 363
సీమంతినీ పరిణయము 201
సుభద్రా కల్యాణము 352
సౌభరి చరితము 1
హరిశ్చందోపాఖ్యానము 204
హైమవతీ పరిణయము 202

(గమనిక : ఇందలిపేర్లు కొన్ని 'అ'పట్టికలోని వాని వంటివే కాని కర్తృత్వములు వేఱు వేఱు).

సంకేతములు

అ. డై. ప్రెస్ – అమెరికన్ మండు ప్రెస్ (వెసువారు & కో, చాకలిపేట, మదరాసు)

అధ్యా – అధ్యాయము

ఆం. క. చ. – ఆంధ్రకవులచరిత్ర (కందుకూరి వీరేశలింగముగారిది)

ఆం. క. త. – ఆంధ్రకవి తరంగిణి (చాగంటి శేషయ్యగారిది)

ఆం. నా. క. ప. – ఆంధ్ర నాటకకళాపరిషత్తు

ఆం. ప. మం. – ఆంధ్రేతిహాస పరిశోధక మండలి (రాజమండ్రి)

ఆం. ప. సం సం. – ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక

ఆం. ర. – ఆంధ్రరచయితలు (మధునాపంతుల వారిది)

ఆం. వా. సూ. – ఆంధ్రవాఙ్మయసూచిక (కాశీనాథుని వారిది)

ఆ. వి. క. ప – ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు

ఆం. వి. వి. – ఆంధ్రవిశ్వ విద్యాలయము

ఆం. సా. ప. – ఆంధ్రసాహిత్య పరిషత్తు

ఆ. క. జీ. – ఆధునిక కవిజీవితములు (మం. భుజంగరావుగారిది)

ఆర్. నం. – ప్రా. లి. పు. భాం. ట్రుయెనియల్ కేటలాగులోని నంబరు

ఆశ్వా. – ఆశ్వాసము

ఉ. భా. – ఉత్తరభాగము

కే. నం. – కేటలాగు నంబరు

క్రీ. శ. – క్రీస్తుశకము

గో. క. సం. – గోలకొండ కవుల సంచిక (సురవరం ప్రతాపరెడ్డిగారిది)

గౌ. గ్రం. – గౌతమీ గ్రంథాలయము

గ్రం. – గ్రంథము, గ్రంథాలయము

చూ. – చూడుఁడు.

డి. నం. ప్రా. లి. పు. భాం. డిస్క్రిప్టివ్ కేటలాగు లోని నంబరు

తం. స. మ. తంజావూరు సరస్వతీ మహలు

త. – తరువాత

ది. స. గ్రం. – దివ్యజ్ఞాన సమాజగ్రంథాలయము, అడయారు

ద్వి. భా. – ద్వితీయ భాగము

నం. – నంబరు నెం. – నెంబరు

ప. – పద్యము పు–పుట

పూ. భా. – పూర్వభాగము

ప్రా. లి. పు. భాం. — ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము. మదరాసు.

ము. శా. – ముద్రాక్షరశాల

మొ. — మొదలగు

య. గా. — యక్షగానము

శ. — శతాబ్ది

శ. క. చ. – శతకవుల చరిత్ర (వంగూరి వారిది)

శా. శ – శాలివాహన శకము

శ్లో. – శ్లోకము

సం. – (సందర్భమును బట్టి) సంపుటము లేక సంవత్సరము

సూ. రా. ని. — సూర్యరాయాంధ్ర నిఘంటువు

A.I.O.C.– All India Oriental Conference.

A.O.R.– Annals of Oriental Research

J.O.I.– Journal of the Oriental Institute.

ఉపజీవ్య గ్రంథములు - వ్యాసములు

1. ప్రా. లీ. పు. భాం., తం. స. మ., ఆం. వి. క. ప. ఆం. సా. ప., ఆం. ప. మం., ది. స. గ్ర., గౌ. గ్రం., (ఈ సంకేత ములకుఁ గడచిన పుట జూచునది), తిరుపతి వేంకటేశ్వరప్రాచ్య పరిశోధనాలయము, మదరాసు రిజిస్ట్రారు ఆఫ్ బుక్స్‌వారి ఆఫీసు మొదలగు వివిధ గ్రంథాలయము లందలి ముద్రితాముద్రిత యక్షగానములు.

2. కొందఱు కొందఱు యక్షగాన కవుల కాలనిర్ణయ విషయమున ఆంధ్రకవులచరిత్ర, ఆంధ్రకవి తరంగిణి (ఇప్పటికిఁ బ్రచురణమైన 11 వ సంపుటము వఱకు మాత్రము), శతక కవుల చరిత్ర, గోలకొండ కవుల సంచిక, ఆధునిక కవి జీవితములు, ఆంధ్ర రచయితలు అను గ్రంథములు కొంత కొంత యుపకరించినవి.

3. భరతనాట్యశాస్త్రము, బృహద్దేశి, సంగీత రత్నాకరము, సంగీతదర్పణము, దశరూపకము, భావప్రకాశము, సాహిత్యదర్పణము, సంకీర్తన లక్షణము, ఛందోదర్పణము, లక్షణసార సంగ్రహము, అప్పకవీయము, లక్షణదీపిక, లక్షణ శిరోమణి, రంగరాట్ఛందము మొ॥ సంస్కృతాంధ్ర నాట్యసంగీతచ్ఛందోలంకార లక్షణశాస్త్ర గ్రంథములు.

4. వాచస్పత్యము, మోనియర్ విలియమ్సు, భరతకోశము, శబ్దరత్నాకరము, సూ. రా. నిఘంటువు, బ్రౌణ్యము, కిట్టెలు, మదరాసు విశ్వవిద్యాలయ తమిళ భాషా నిఘంటువు మొ॥ సంస్కృతాంధ్ర కన్నడ తమిళ నిఘంటువులు.

5. కవిరాజమార్గము, ఛందోంబుధి, కావ్యావలోకనము, మల్లినాథపురాణము, చంద్ర ప్రభాపురాణము, భరతేశ వైభవము మొ. కన్నడ లక్షణగ్రంథములు; కావ్యములు, ఇలక్కణ విళక్కనమ్, పజ్నీస పాట్టియల్ మొ॥ తమిళ లక్షణ గ్రంథములు. ప్రా. ల. పు. దాం., నందలి కొన్ని తమిళ కన్నడ యక్షగానములు. కొరవంజులు.

6. పండితారాధ్య చరిత్ర, క్రీడాభిరామము, భీమఖండము మొ॥ యక్షగాన సంబంధి విషయ ప్రసక్తి వచ్చిన ప్రాచీనాంధ్ర కావ్యములు.

7. శ్రీహసణగి రామచంద్రభట్టరు కన్నడ 'యక్షనాటకగళు'

8. డా. డి. యన్. కర్కిగారి 'కన్నడఛందోవికాస'

9. ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు, భారతి మొ॥ పత్రికలు మొ॥

* * *

1. Indian Ephimeris – By Sri Swamikannu Pillai.
2. Castes and Tribes – By E. Thurston.
3. The Yakshas – By Dr. A. Coomaraswami.
4. The Music of the Nrtya natakas of South-India – By Smt. K. Gomati, (M. Lit. Thesis of the Madras University).
5. The Theatre of the People – By Sri R. K. Yajnik.
6. World Drama – By Prof. Allardyce Nicoll.
7. History of the Reddi Kingdoms – By Sri M. S. Sarma (Chap. VII. Music and Dance).
8. Telugu literature outside the Telugu country – By Sri K. Rama Krishnayya.
9. History of the classical Sanskrit literature – By Dr. M. Krishnamacharya (Authority for the dates of the Sanskrit authors and works mentioned in this thesis).

10. The Silappadikaram (Tamil Classic) – English Translation by Dr. V. R. S. Dikshitar.

11. Yakshagana – Pp by Dr. V. Raghavan, (Triven Vol. VII No. 2).

12. The Bhagavata Plays in Mysore – By Sri L. Narasimhacharya, A.I.O.C. Mysore Vol. VIII, 1935.

13. Yakshagana in Karnataka – By Sri M. Govinda Rao, A. O. R. of Madras University, Vol. X, Part II, 1952–53.

14. A list of the Villages in the Madras Presidency.

15. Tirupati Devasthanam Inscriptions.

16. South Indian Inscriptions.

17. Topographical list of Inscriptions of the Madras Presidency – By Sri V. Rangachari.

18. Journal of the Music Academy, Madras.

19. District Gazetteers and Manuals of different districts in Andhra, Tamilnad and Karnataka.

20. The Puppet Book. Edtd. by L. V. Wall.

గమనిక : నా కుపయుక్తములైన గ్రంథములు, వ్యాసములును మఱికొన్ని గలవు. అవి యన్నియు గ్రంథ మధ్యమున ఆ యా సందర్భములందు కుండలింపులలోను, అధోజ్ఞాపికలలోను బేర్కొనఁబడినవి. ఈగ్రంథవ్యాసకర్త లందఱికి నా నమోవాకములు. య. గా. గుఱించి మఱికొందఱు ప్రచురించిన వ్యాసములను జాలవఱకుఁ జూచితిని. అన్నిటిని వినియోగించుకొనుట కవకాశము చాలమి విచారించితిని. ఆవ్యాసకర్తలకుఁ గూడ నా నమోవాకములు.

స్వీయ వ్యాసములు

(యస్వీయములు – య. గా. విషయకములు)

వ్యాసము పేరు	ప్రచురణ వివరము
1. మన్నారుదాస విలాస నాటకము –	కృష్ణాపత్రిక, 5-12-53
2. గీతకథు నందనము –	ఆం. సా. ప. వార్షిక సంచిక, 1954
3. పార్వతీ కల్యాణము –	(ఉద్దండకవి) – కృ. ప., 3-7-54
4. రాజరంజన విద్యా విలాసము –	పరిశోధన.
5. యక్షగానములలో సాంప్రదాయిక పాత్రలు. (రేడియోప్రసంగము, విజయవాడ (11-10-54)	భారతి. డిసెంబరు, 1954
6. పార్థసారథి విజయము –	సంస్కృతి. జనవరి, 1955.
7. య. గా. దేశిత్వము. వైశిష్ట్యము –	కిన్నెర, సంక్రాంతిసంచిక, 1955
8. య. గా. కవులు – ఒక విమర్శ –	భారతి. ఏప్రిలు, 1955
9. ఏకాంత సేవ. –	కృ .ప. 30-4-955
10. భక్తవత్సల విలాసము –	కృ. ప. 21-5-1955
11. బొమ్మలాట హాస్య నాటకము. –	త్రిలింగ 23-5-55
12. జలక్రీడా విలాసము –	కృ. ప. 4-6-55
13. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము య. గా. విషయ పరామర్శ	భారతి, జూన్ 1955
14. వీరభద్ర విజయము (శివలెంక)	ఆం. ప. సారస్వతానుబంధము, 19-6-55

వ్యాసము పేరు	ప్రచురణ వివరము

15. పారిజాతాపహరణము(తీర్థులు) ఆ.ప. సారస్వతానుబంధము-7-55
16. యక్షగాన కవయిత్రులు – భారతి, జూలై, 55
17. శేషము రంగాచార్య య. గా. లు – సంస్కృతి. జూలై ఆగష్టు, 55
18. బొమ్మలాట – యక్షగానము – భారతి, ఆగష్టు. 1955
19. పారిజాతాపహరణము (వెంగమ) – ఆంధ్రమహిళ. ఆగష్టు, 55.
20. శివ విలాసము (వెంగమ) – గృహలక్ష్మి. ,, ,, ,,
21. విష్ణుమాయా విలాసము (పాపరాజు) ఆం. ప. సా. అ. 7-8-55.
22. చిత్రకూట మాహాత్మ్యము. – కృ. ప. 20-8-55
23. విప్రనారాయణ చరిత్ర (చక్రపురి) – ఆం. ప. సా. అ. 21-8-55.
24. మెలట్టూరు భాగవత మేళ నాటకములు – భారతి. సెప్టెంబరు, 55.
25. యక్షగానము – హరికథ. అనంతరామాచార్య కృతులు ఆం. సా. ప. 44 - 2
26. త్యాగరాజు య. గా. కృతులు ఆం. ప. సా. ఆ. 11-9-55.
27. తంజావురాన్నదాన నాటకము – ,, ,, 18-9-55.
28. సతీదాన శూరము – ,, ,, 25-9-55.
29. హేమాబ్జనాయికా స్వయంవరము – ,, ,, 11-12-55.

వ్యాసము పేరు	ప్రచురణ వివరణము
30. విజయరాఘవ చంద్రికావిహారము —	ఆం. ప. సా. అ 18-12-55.
31. విజయరాఘవ కళ్యాణము —	,, ,, 25-12-55.
32. పారిజాతము (పు. ల. నా. కవి)	,, ,, 8-1-56.
33. పార్వతీ పరిణయము (వాసుదేవకవి)	,, ,, 15-4-56.
34. గిరిరాజ కవి య. గా. లు —	,, ,, 13-5-56.
35. శహాజీ ప్రబంధములు -	భారతి, జులై, 1956
36. తంజావూరు (య. గా.) పదవాఙ్మయము.	సంస్కృతి. జూలై, ఆగ, 56.
37. పున్నారుదాసవిలాసము (ప్రబంధము - నాటకము)	ఆంధ్రమహిళ - సెప్టెం. 56
38. ఆంధ్రసారస్వత శాఖలలో య. గా. ప్రత్యేకత -	కృ. ప. 19-10-57
39. యక్షగానములలోని లోకరీతి - (రేడియో ప్రసంగము - విజయవాడ కేంద్ర ప్రసారితము 6-2-1956)	తెలుగు విద్యార్థి, మే, 59.
40. నివర్తి శేషాచలపతి (అముద్రిత య. గా. రచనలు)	ఆం. సా. ప. పత్రిక 46-3.
41. విజయరాఘవుని యక్షగానములు —	సారంగి 1-1-60.
42. తెలుగు యక్షగానము — (ఉత్పత్తి - పరిణామము)	తెలుగు భాషాసమితివారి విజ్ఞాన సర్వస్వము, సం. 3.
43. దాక్షిణాత్యాంధ్ర సాహిత్యము	,, ,,

వ్యాసము పేరు	ప్రచురణ వివరము

44. సప్తతంతువు - ప్రచురణ: ఎమ్. ఎస్. ఆర్. మూర్తిఅండ్‌కో., విశాఖపట్టణము, 1959.

(త్యాగరాజు య. గా. కృతులు, మెలట్టూరు భాగవత మేళనాటకములు, నాటకకళ - ప్రపంచమున వివిధ ప్రదేశములలో తదుత్పత్తి వికాసములు మొ॥ నా వ్యాస సప్తకము సంపుటీ కృతమైన గ్రంథమిది).

45. **The Kalaapam — Triveni**

Silver Jabilee Spl. November, 1955.

46. A Note on the Yaksha gana Mss. in the Andhra Historical Research Society, Rajahmundry } Society's Journal, Vol. XXI, 1955.

47 The Tyagavinoda Chitra Prabandha, the magnum opus of Sahaji, the Maratha Ruler of Tanjore. } Poona Orientalist Vol. XX Nos. 1 to 4 1955.